1994
ప్రతులు 2000

ప్రతులకు
T.K. గోపాలాచార్య స్వామివారు
నడిగడ్డపాలెం – 522 318
గుంటూరు జిల్లా

వెల : రు. 60–00

ముద్రణ : శ్రీ సారథి ఆఫ్‌సెట్ ప్రింటర్స్
D.T.P : శ్రీ రామానుజవాణి, విజయవాడ–2

శ్రీ లక్ష్మీ హయవదన పరబ్రహ్మణే నమః

నివేదనము

సర్వోపనిషదో గావః దోగ్ధా గోపాలనన్దనః ।
పార్థో వత్స స్సుధీ ర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్ ।

ముముక్షువునకు తెలియదగిన అర్థములు తత్వ- హిత -పురుషార్థములనెడు మూడు. తత్వమనగా ఆత్మ- పరమాత్మస్వరూపము, హితమనగా-ఆత్మ పరమాత్మను చేరు ఉపాయము, పురుషార్థమనగా – అట్లుచేరి యనుభవించు ఆనందము. వేదాంతగ్రంథములన్నియు నీమూడు విషయములనే ముఖ్యముగా తెలుపును. అట్టి గ్రంథములలో మూర్ధన్య మీ గీతాశాస్త్రము. కావున ముముక్షువులకిది ముఖ్యానుసంధేయము. కాని అర్థమెఱుంగని యధ్యయనము వ్యర్థము- అనుష్ఠానములోలేని యర్థజ్ఞానము వ్యర్థము. కావున భగవద్గీతను చదివి, వాస్తవమైన యర్థము నెఱింగి-యెఱింగిన అర్థమును అనుష్ఠించువారే ముముక్షువులు.

ఈ గీతాశాస్త్రమున కనేక వ్యాఖ్యానములుదయించినవి. అందు కొన్ని కర్మకు ప్రాధాన్యమును, మరికొన్ని జ్ఞానమునకు ప్రాధాన్యమును-ఇంకను కొన్ని భక్తికి ప్రాధాన్యమును భావించి తదనుగుణముగా దీనినన్వయించి వ్యాఖ్యానించిరి.

నిజమారయ-భక్తియే దీనియందు ముఖ్యముగా తెలుపబడుచున్నట్లు యథాశ్రుత శ్లోకార్థములవల్లనే చదువువారలకు సులభముగ తెలియును. వాస్తవమునకా భక్తి, ముక్తికి సాధనము-ఉపనిషత్తులు ప్రాకృతశరీరమును విడిచి యప్రాకృత శరీరమును బడసినగాని దుఃఖము కలియని సుఖము కలుగదని తెలుపుచున్నవి. మోక్షమనగా దుఃఖగంధము లేని యానందమేయని "ముక్తిర్మోక్షో మహానందః" యని **యమరకోశకారుడు** నిష్పక్షపాతముగ సెలవిచ్చెను. మహానందమనగా దుఃఖము కలియని యానందమే. అట్లు శరీరసంబంధమును నితరాం తొలగించుకొనుటకు సాధన మా పరమపురుషుని సాక్షాత్కారమే యనియు ఆ ఉపనిషత్తులే తెలుపుచున్నవి. 'తస్మిన్ దృష్టే పరావరే భిద్యతే హృదయగ్రన్థిః' అట్టి సాక్షాత్కారమెట్లు కలుగుననగా-నా శ్రుతియే "యమేవైష వృణుతే తేన లభ్యస్తస్యైష **ఆత్మా వివృణుతే** తనూం స్వా" మ్మని తెలుపుచున్నది. అట్లు భగవంతునిచే వరింపబడుట కాతనికి ప్రియతముడు కావలెను. అట్లగుట కాతని నంతగా తాను ప్రేమించవలెను. 'ప్రియో హి జ్ఞానినోఽత్యర్థ మహం స చ మమ ప్రియః' అని భక్తి ప్రకరణమున భగవాను

దానతిచ్చెను. "ప్రీతి పూర్వమను ధ్యానం భక్తి రిత్యభిధీయతే" అట్లు నిరతిశయ ప్రేమతో భగవంతుని ధ్యానించుటయే భక్తి యనబడును. "భక్త్యా త్వనన్యయా శక్యః" అని భగవానుడానతిచ్చెను గదా.

కాబట్టి భక్తికి ప్రాధాన్యము నొసంగు సంప్రదాయముతో నీగ్రంథమున ప్రతిపదార్థతాత్పర్యములు కూర్పబడినవి. ప్రతిశ్లోకమునకు ప్రామాణిక యవతారిక అనగా నాశ్లోక మే విషయమును తెలుపునో తెలుపు శీర్షికయొసంగబడినది. అధ్యాయారంభమున ఆయా యధ్యాయములలో తెలుపబడు విషయ శీర్షిక యొసంగబడినది. ప్రతియధ్యాయమునకు చివర ఆ యధ్యాయాంశములు హృదయంగతములగుటకై ప్రశ్నోత్తరము లొసంగ బడినవి. ఇవి సుప్రసిద్ధ వ్యాఖ్యానాంశములతో సమకూర్పబడినవి. ప్రశ్నోత్తరములలో నాయా యధ్యాయము నందున్న శ్లోకార్థము లొక్కటియును విడువకుండునట్లు కూర్పబడినవి.

గీతను చక్కగ సులభముగ సత్సంప్రదాయానుసారముగ నర్థము నెఱుంగగోరువారు ఒక్కొక్క అధ్యాయమునందలి శ్లోకార్థములను తాత్పర్యార్థముతో మూడుసారులు చదివి చివరనున్న ప్రశ్నోత్తరములను ముమ్మారు మనస్సునను లగింపజేసి చదివినచో గీతాశాస్త్రమంతయు కరతలామలకముగునని మా యనుభవ విశ్వాసములు. చదువరులా పద్ధతి నవలంబించి యీ సత్యమును ఋజువు చేసుకొందురు గాక.

ఏకం శాస్త్రం దేవకీపుత్రగీతం ఏకోదేవో దేవకీపుత్ర ఏవ ।
ఏకోమన్త్ర స్తస్య నామాని యాని కర్మాప్యేకం తస్య దేవస్య సేవా ।

శ్రీమద్భగవద్గీతా పారాయణారంభమున

అనుసంధించవలసిన శ్లోకములు

శ్రీశైలేశదయాపాత్రం ధీభక్త్యాదిగుణార్ణవమ్ ।
యతీంద్రప్రవణం వందే రమ్యజామాతరం మునిమ్ ॥

లక్ష్మీనాథసమారంభాం నాథయామునమధ్యమామ్ ।
అస్మదాచార్యపర్యంతాం వందే గురుపరంపరామ్ ॥

యో నిత్య మచ్యుతపదాంబుజయుగ్మరుక్మ
వ్యామోహత స్తదితరాణి తృణాయ మేనే ।
అస్మద్గురో ర్భగవతోఽస్య దయైకసింధోః
రామానుజస్య చరణౌ శరణం ప్రపద్యే ॥

మాతా పితా యువతయ స్తనయా విభూతిః
సర్వం యదేవ నియమేన మదన్వయానామ్ ।
ఆద్యస్య నః కులపతే ర్వకుళాభిరామం
శ్రీమత్తదంఘ్రియుగళం ప్రణమామి మూర్ధ్నా ॥

భూతం సరశ్చ మహదాహ్వయ భట్టనాథ
శ్రీభక్తిసార కులశేఖర యోగివాహాన్ ।
భక్తాంఘ్రిరేణు పరకాల యతీంద్రమిశ్రాన్
శ్రీమత్పరాంకుశమునిం ప్రణతోఽస్మి నిత్యమ్ ॥

1. శ్లో. వ్యాసం వసిష్ఠ నప్తారం శక్తేః పౌత్ర మకల్మషమ్ ।
పరాశరాత్మజం వందే శుకతాతం తపోనిధిమ్ ॥

తా॥ వసిష్ఠ మహర్షి మునిమనుమడును, శక్తిమనుమడును, శ్రీపరాశర మహర్షిపుత్రుడును తపోనిధియు, పాపదూరుడును, శ్రీ శుకమహర్షికి తండ్రియునగు శ్రీ వ్యాసమహర్షిని సేవించుచున్నాను.

2. శ్లో. సమ్యఙ్న్యాయ కలాపేన మహతా భారతేన చ ।
ఉపబృంహిత వేదాయ నమో వ్యాసాయ విష్ణవే॥

తా॥ బ్రహ్మసూత్ర సముదాయముచేతను, శ్రీమహాభారతముచేతను, వేదాన్తార్థములను లెస్సగ విశదీకరించిన శ్రీ మహావిష్ణ్వవతారభూతులైన శ్రీ వ్యాసమహర్షికి వందనము.

3.శ్లో. సారథ్య మర్జున స్యాజౌ కుర్వన్ గీతామృతం దదౌ ।
లోకత్రయోపకారాయ తస్మై కృష్ణాత్మనే నమః ।

తా॥ భారత యుద్ధరంగమున అర్జునునకు సారథ్య మొనరించుచు మూడు లోకములయందుండు చేతనజాతము నుద్ధరించుటకై గీతామృతమును ప్రసాదించిన ఆ శ్రీకృష్ణభగవానునకు నమోవాకములు.

4.శ్లో. ప్రపన్న పారిజాతాయ వేత్రతోత్రైక పాణయే ।
జ్ఞాన ముద్రాయ కృష్ణాయ గీతామృత దుహే నమః ॥

తా॥ శరణాగతుల పాలిటి కల్పవృక్షమై, ఒక చేత గుఱ్ఱముల త్రోలెడు కొరడా కర్రను, వేరొక చేత జ్ఞానముద్రను ధరించి గీతామృతమును పితికినట్టి కృష్ణ పరమాత్మకు నమస్కారము.

5.శ్లో. కరకమల నిదర్శితాత్మముద్రః । పరికలితోన్నత బర్హి బర్హ చూడః ।
ఇతరకర గృహీత వేత్ర తోత్రః । మమ హృది సన్నిధి మాతనోతు శౌరిః॥

తా॥ ఒక కరసరోజముచే జ్ఞానముద్రను జూపుచు, వేరొక పాణికమలమున కొరడాకర్రను ధరించి, ఉన్నతమగు నెమలి పింఛముచే నలంకరింపబడిన కేశపాశమును కలిగియున్న శ్రీకృష్ణపరమాత్మ నా హృదయకమలమున సన్నిహితుడై విరాజిల్లుగాక !

6. శ్లో. అగ్రే కృత్వా కమపి చరణం జాను నైకేన తిష్ఠన్
పశ్చా త్పార్థం ప్రణయసజుషా చక్షుషా వీక్షమాణః ।
సవ్యే తోత్రం కరసరసిజే దక్షిణే జ్ఞానముద్రాం
ఆబిభ్రాణో రథ మధివసన్ పాతు న స్సూతవేషః ॥

తా॥ ఒక పాదమును ముందునకు జాచి వేరొకకాలు మోకరించి కూర్చొని వెనుకనున్న యర్జునుని స్నేహమొలుకు చూపుతో జూచుచు ఎడమచేత కొరడాను, కుడిచేత జ్ఞానముద్రను ధరించి రథమున వేంచేసి యున్న సూతవేషధారియగు శ్రీకృష్ణపరమాత్మ మమ్ము బ్రోచుగాక.

శ్లో. కృష్ణం కమల పత్రాక్షం । పుణ్య శ్రవణ కీర్తనమ్ ।
వాసుదేవం జగద్యోనిం । నౌమి నారాయణం హరిమ్ ।

తా॥ పుండరీకాక్షుడును, తన గుణములను కీర్తించినవారికిని, తన కథలను వినువారికిని పుణ్యప్రదమైనవాడును, జగత్తునకు త్రివిధకారణమైనవాడును, ఆశ్రితుల పాపహారియునగు వసుదేవసూనుడైన నారాయణుని నమస్కరింతును.

8. శ్లో. కృష్ణాయ యాదవేన్ద్రాయ । జ్ఞానముద్రాయ యోగినే ।
నాథాయ రుక్మిణీశాయ । నమో వేదాన్తవేదినే ॥

తా॥ యదుకుల తిలకుడును, జ్ఞానముద్రాధారియు,యోగియు,సకల జగచ్ఛ్రేషియు, రుక్మిణీవల్లభుడును, నిఖిలాగమాంత సంవేద్యుడు నునగు శ్రీ కృష్ణపరమాత్మకు వందనము.

గీతాపారాయణావసానమందనుసంధించవలసిన శ్లోకములు.

1. శ్లో. గీతాశాస్త్ర మిదం పుణ్యం । యః పఠే త్ప్రయతః పుమాన్ ।
విష్ణోః పద మవాప్నోతి । భయ శోకాది వర్జితః ॥

తా॥ పవిత్రమగు నీ గీతాశాస్త్రము నే మానవుడు సదాచార సంపన్నుడై నిత్యమనుసంధించునో వాడు భయము, దుఃఖము మొదలగునవి లేక భగవత్సాయుజ్యమును బడయగలుగుచున్నాడు.

2. శ్లో. గీతాధ్యయనశీలస్య । ప్రాణాయామపరస్య చ ।
నైవ సన్తి హి పాపాని । పూర్వజన్మ కృతాని చ ॥

తా॥ విడువక నలవాటుగ పాటించు గీతాధ్యయనము కలవానికిని ప్రాణాయామ నిరతునకును పూర్వజన్మార్జితమైన పాపరాశి యంతయు పటాపంచలై పోవును.

3. శ్లో. మల నిర్మోచనం పుంసాం । జలస్నానం దినేదినే ।
సకృద్గీతామ్భసి స్నానం । సంసార మల మోచనమ్ ॥

తా॥ మానవులు నిత్యమాచరించు జలస్నానము బాహ్యమాలిన్యమును మాత్రము పోగొట్టజాలును, కాని ఒక్కసారి గావించిన గీతా ప్రవాహావగాహనము సంసారమలమునే యపహరించును.

4. శ్లో. గీతా సుగీతా కర్తవ్యా । కిమ న్యైశ్శాస్త్ర సఙ్గ్రహైః ।
యా స్వయం పద్మనాభస్య । ముఖపద్మా ద్వినిస్సృతా ॥

తా॥ సాక్షాత్తుగ పద్మనాభుని ముఖపద్మమునుండి ఆవిర్భవించిన గీతాశాస్త్రమును లెస్సగ గానమును గావించుచు నితర శాస్త్రముల నెఱుంగుట, పిష్టపేషణమే.

5\. శ్లో. భారతామృత సర్వస్వం । విష్ణోర్వక్త్రా ద్వినిస్సృతమ్.।
గీతాగఙ్గోదకం పీత్వా । పునర్జన్మ న విద్యతే ॥

తా॥ పాలకడలికి అమృతమువలె భారతమునకు సర్వస్వ మనదగినదై సాక్షాత్తుగ శ్రీకృష్ణపరమాత్మ ముఖారవిందమునుండి వినిర్గళితమైన గంగ వంటి పవిత్రమైన గీతాశాస్త్రార్థములను సాదరముగ నాలించి యాచరించువానికి తిరిగి జన్మ లేనేలేదు.

6\. శ్లో. సర్వోపనిషదో గావః । దోగ్ధా గోపాలనన్దనః ।
పార్థో వత్స స్సుధీర్భోక్తా । దుగ్ధం గీతామృతం మహత్ ॥

తా॥ శ్రీకృష్ణపరమాత్మ లోకోత్తరమైన పాలవలె స్వచ్ఛమును భోగ్యమును సత్వగుణాభివర్ధకమును నై అమృతమువలె జరామరణములు లేకుండ జేయునట్టి గీతాశాస్త్రమును, సకలోపనిషత్తులను గోవులుగా గల్పించి అర్జునుని దూడనుగా చేసుకుని తాను స్వయముగ పితికి లోకమునందలి ముముక్షువుల యనుభవమున కందజేసెను.

7\. శ్లో. ఏకం శాస్త్రం దేవకీపుత్ర గీతం । ఏకో దేవో దేవకీపుత్ర ఏవ ।
ఏకోమన్త్ర స్తస్య నామాని యాని । కర్మాప్యేకం తస్య దేవస్య సేవా ॥

తా॥ శ్రీకృష్ణుడు పాడిన గీత యొక్కటియే శాస్త్రము, శ్రీకృష్ణుడొక్కడే దేవుడు, శ్రీకృష్ణుని శుభనామములే ముఖ్యమంత్రము, శ్రీకృష్ణుని సేవయే కర్తవ్యమగు కర్మవిశేషము.

గీతార్థ సంగ్రహము

శ్రీ యామునముని ప్రణీతము – ఆంధ్ర టీకానువాద సహితము.
గీతా ప్రతిపాద్యమగు సారతమార్థ విశేషము.

శ్లో. స్వధర్మజ్ఞాన వైరాగ్య । సాధ్య భక్త్యేక గోచరః ।
నారాయణః పరం బ్రహ్మ । గీతాశాస్త్రే సమీరితః ।

అర్థము : స్వధర్మ = తన వర్ణమునకును ఆశ్రమమునకును నియతములై, శాస్త్రోక్తములైన ధర్మములచేతను, స్వజ్ఞాన = ప్రకృతికంటె వేరై భగవంతునకు మాత్రము పరతంత్రమైయుండు శుద్ధాత్మ స్వరూప ధ్యాన విశేషముచేతను, వైరాగ్య = పరమాత్మ కంటె వేరైన సమస్త వస్తువులయందలి విరక్తి చేతను, సాధ్య = సాధించదగిన, భక్త్యేకగోచరః = భక్తి మాత్రముచే సాక్షాత్కరించు, పరంబ్రహ్మ = పరంబ్రహ్మయగు, నారాయణః = శ్రీమన్నారాయణుడు, గీతా శాస్త్రే = భగవద్గీత యందు, సమీరితః = చెప్పబడెను.

తా॥ వర్ణాశ్రమ నియతములై శాస్త్రోక్తములైన తన ధర్మములచేతను, ప్రకృతి కంటె వేరై భగవంతునకు పరతంత్రమై యుండు శుద్ధాత్మ స్వరూప ధ్యాన వివేకము చేతను, పరమాత్మ కంటె వేఱైన సమస్త వస్తువులయందలి విరక్తి చేతను, సాధింపదగిన భక్తికి మాత్రము సాక్షాత్కరించు పరబ్రహ్మ యగు శ్రీమన్నారాయణుడే యీ గీతాశాస్త్రమున ముఖ్యముగా చెప్పబడెను.

ప్రథమ షట్కార్థ సంగ్రహము

శ్లో. జ్ఞాన కర్మాత్మికే నిష్ఠే యోగ లక్ష్యే సుసంస్కృతే ।
ఆత్మానుభూతి సిద్ధ్యర్థే పూర్వ షట్కేన చోదితే ॥

అర్థము : యోగలక్ష్యే =ఆత్మావలోకనమే ఫలముగాగలవై, సుసంస్కృతే = చక్కగసంస్కరింప బడినవైన, జ్ఞాన కర్మాత్మికే = జ్ఞానయోగ కర్మయోగము లనెడు, నిష్ఠే = నిష్ఠలు, ఆత్మానుభూతి సిద్ధ్యర్థే = ఆత్మ సాక్షాత్కార మనెడు సిద్ధిని బడయుటకై, పూర్వ షట్కేన = మొదటి షట్కముచే, చోదితే = విధింపబడినవి.

తా॥ శుద్ధాత్మ విషయమైన ధ్యానమునకు జ్ఞానయోగ మని పేరు. దీనిచే గలుగునట్టి ఆత్మ సాక్షాత్కారమునకు యోగమని పేరు.దీనిచే నాత్మానుభవము సిద్ధించును.

కర్మయోగము రెండు విధములు.

(1) కర్మయోగము-దాని వలన జ్ఞానయోగము, దానిచే యోగమనబడు ఆత్మ సాక్షాత్కారము.
(2) కర్మయోగము-దానిచే జ్ఞానయోగము లేకనే ఆత్మ సాక్షాత్కారము.

కర్మ-జ్ఞాన యోగములు రెండున్ను సుసంస్కృతములు కావలెను. అనగా-అవి పరమాత్మాధీనముగాను, తత్కైంకర్యము గాను, ఫలాపేక్ష లేకుండగను అనుష్ఠింపబడవలెను.

ఇట్లు యోగమనెడు ఆత్మావలోకనము ఫలముగా గలవియు, పరమాత్మాధీనాది బుద్ధి విశేషములచే సంస్కరింపబడిన జ్ఞాన కర్మ యోగములు, ఆత్మ సాక్షాత్కారరూపమగు సిద్ధి విశేషము లభించుట కొఱకై మొదటి షట్కమున జెప్పబడినవి.

మధ్యమ షట్కార్థ సంగ్రహము

శ్లో. మధ్యమే భగవత్తత్త్వ యాథాత్మ్యావాప్తి సిద్ధయే ।
జ్ఞాన కర్మాభి నిర్వర్త్యో భక్తి యోగః ప్రకీర్తితః ॥

అర్థము : మధ్యమే = మధ్యమ షట్కమందు, భగవ త్తత్త్వ యాథాత్మ్య వాప్తి సిద్ధయే - భగవత్తత్త్వ = భగవంతు డనెడు పర తత్త్వము యొక్క, యాథాత్మ్య = నిజస్థితిని, అవాప్తి = పొందుట యనెడు, సిద్ధయే = సిద్ధి కొఱకు, జ్ఞాన కర్మాభి నిర్వర్త్యః := జ్ఞానయోగ కర్మ యోగములచే బడయదగిన, భక్తియోగః = భక్తియోగము, ప్రకీర్తితః = చెప్పబడినది.

తా॥ నిరతి శయానంద మయమైన భగవత్స్వరూపానుభవము సిద్ధించుట కొఱకై జ్ఞానయోగ కర్మ యోగములచే బడయ దగిన భక్తి యోగము మధ్యమ షట్కమున జెప్పబడినది.

తృతీయ షట్కార్థ సంగ్రహము

శ్లో. ప్రధాన పురుషవ్యక్త సర్వేశ్వర వివిక్తనమ్ ।
కర్మధీ ర్భక్తి రిత్యాది పూర్వ శేషోఽ న్తిమోదితః ।

అర్థము :- ప్రధాన =కారాణా వస్థలో నున్న ప్రకృతి, పురుష=బద్ధ జీవులు, శుద్ధ జీవులు, వ్యక్త= కార్యా వస్థలో నున్న ప్రకృతి, సర్వేశ్వర = భగవంతుడు అను నీ తత్త్వముల యొక్క, వివి క్తనం=వేఱు వేఱుగా అనుసంధించుటయు, కర్మ= కర్మయోగము, ధీః = జ్ఞానయోగము, భక్తిః = భక్తి యోగము, ఇత్యాది=ఇవి మొదలగు, పూర్వ శేషః= పూర్వ షట్కములలో చెప్పగా మిగిలినవి, అన్తి మోదితః = చివర షట్కమున జెప్పబడెను.

తా॥ కారణా వస్థలో నున్న మూల ప్రకృతి, బద్ధాత్మలు, ముక్తాత్మలు, కార్యావస్థలో నున్న మహత్తత్త్వాదులు, వాటి కార్యములగు దేవతిర్యఙ్మనుష్యాదులు, సర్వేశ్వరుడు అను నీ తత్త్వములు వేఱు వేఱుగా ననుసంధింపబడినవి. మఱియు కర్మజ్ఞానభక్తియోగములను గూర్చి పూర్వషట్కములలో చెప్పబడని విషయములును ఈ మూడవ షట్కమున వివరింపబడినవి.

ప్రథమాధ్యాయార్థ సంగ్రహము

శ్లో. అస్థాన స్నేహకారుణ్య ధర్మాధర్మధియాకులమ్ ।
పార్థం ప్రపన్న ముద్దిశ్య శాస్త్రావతరణం కృతమ్ ॥

అర్థము : అస్థాన స్నేహ కారుణ్య ధర్మా ధర్మధియా-అస్థాన=తగని చోట, స్నేహ= బంధుప్రీతి, కారుణ్య = జాలి, ధర్మాధర్మధియా = తన ధర్మమైన యుద్ధమును అధర్మముగా తోపించు బుద్ధిచే, ఆకులం = కలతజెంది, ప్రపన్నం=శరణాగతుడైన, పార్థం ఉద్దిశ్య=అర్జునుని గూర్చి, శాస్త్రావతరణం=గీతాశాస్త్రారంభము, కృతం=చేయబడినది.

తా॥ తగని చోట బంధుప్రీతి, జాలి, తన ధర్మమగు యుద్ధమున నధర్మ మని తోపించు బుద్ధి మొదలగు వాటిచే కలత జెంది కింకర్తవ్యతా విమూఢుడై శరణా గతిని గావించిన యర్జునుని నిమిత్తముగా గొని శ్రీకృష్ణ పరమాత్మచే గీతాశాస్త్ర మవతరింప జేయబడెను.

శ్రీమద్భగవద్గీతా - ప్రథమాధ్యాయము

విషయ సూచిక

అస్మద్గురుభ్యో నమః

శ్రీమద్భగవద్గీతా ప్రథమోఽధ్యాయః

అర్జున విషాదయోగః

(శ్లో. 1-47)

ధృతరాష్ట్ర ఉవాచ – ధృతరాష్ట్రుడు పలికెను.

అవ. ధృతరాష్ట్రుడు సంజయుని యుద్ధ వార్తలను ప్రశ్నించుచున్నాడు.

1. శ్లో. ధర్మక్షేత్రే కురుక్షేత్రే । సమవేతా యుయుత్సవః ।
మామకాః పాణ్డవాశ్చైవ । కిమకుర్వత సఞ్జయ ॥

అర్థము : సఞ్జయ = ఓ సంజయుడా! ధర్మక్షేత్రే = ధర్మమునకు స్థానమైన, కురుక్షేత్రే = కురుక్షేత్రము నందు; యుయుత్సవః = యుద్ధమును చేయగోరినవారై, సమవేతాః= సమావేశమైన, మామకాః = నా సంబధులున్ను, పాణ్డవాః చ ఏవ = పాండవులున్ను, కిం = ఏమి, అకుర్వత = చేసిరి?

తా ॥ ఓ సంజయుడా ! కురుక్షేత్రము ధర్మమునకు నిలయమైనది. అట్టి స్థానమున యుద్ధము చేయుటకై నా కుమారులును, పాండవులున్ను కూడా సమావేశమైరే, వారు ఏమి చేసిరి ?

సఞ్జయ ఉవాచ – సంజయుడు పల్కెను.

అవ. సంజయుడు యుద్ధ ప్రారంభమునకు ముందు దుర్యోధనుని చిత్తవృత్తిని వర్ణించుచున్నాడు.

2. శ్లో. దృష్ట్వా తు పాణ్డవానీకం । వ్యూఢం దుర్యోధన స్తదా ।
ఆచార్య ముపసంగమ్య । రాజా వచన మబ్రవీత్. ॥

అర్థము : తదా = అప్పుడు; రాజా = రాజైన; దుర్యోధనః = దుర్యోధనుడు; వ్యూఢం = వ్యూహముగా పన్నబడి యున్న ; పాణ్డవానీకం = పాండవుల సేనను; దృష్ట్వాతు= చూచిన వెను వెంటనే; ఆచార్యం = ద్రోణాచార్యులను; ఉపసంగమ్య = సమీపించి; వచనం = వాక్యమును; అబ్రవీత్ = పలికెను.

తా ॥ అపుడు రాజైన దుర్యోధనుడు వ్యూహముగా పన్నబడి యున్న పాండవుల యొక్క సేనను జూచి వెంటనే తన గురువైన ద్రోణాచార్యుల వద్దకు వెళ్ళి ఈ ప్రకారము పలికెను.

సుయోధన ఉవాచ—దుర్యోధనుడు పల్కెను.

3. శ్లో. పశ్యైతాం పాణ్డుపుత్రాణాం । ఆచార్య! మహతీం చమూమ్ ।
వ్యూఢాం ద్రుపదపుత్రేణ । తవ శిష్యేణ ధీమతా ॥

అర్థము : హే ఆచార్య = ఓ ద్రోణాచార్య, ధీమతా = బుద్ధిమంతుడును, తవ = నీ యొక్క, శిష్యేణ = శిష్యుడును అయిన, ద్రుపద పుత్రేణ = ద్రుష్టద్యుమ్నునిచే, వ్యూఢాం= వ్యూహముగ నేర్పరచబడియున్న, పాండు పుత్రాణాం =పాండవుల యొక్క, ఏతాం = ఈ, మహతీం = గొప్పదైన, చమూం = సేనను, పశ్య = చూడుమా.

తా ॥ ఓ ద్రోణాచార్య! పాంచాల రాజకుమారుడైన ధృష్టద్యుమ్నుడు బుద్ధిమంతుడును, నీకు శిష్యుడును అయి యున్నాడు. అతని నాయకత్వమున వ్యూహముగ రచింపబడి యున్న గొప్పదైన ఈ పాండవ సేనను చూడుము.

అవ. దుర్యోధనుడు పాండవసేనయందలి వీరులను పేర్కొనుచున్నాడు

4. శ్లో. అత్ర శూరా మహేష్వాసాః । భీమార్జున సమా యుధి ।
యుయుధానో విరాటశ్చ । ద్రుపదశ్చ మహారథః ॥

అర్థము : అత్ర = ఈ పాండవ సేన యందు; శూరాః = శౌర్య వంతులును; మహేష్వాసాః= గొప్ప విలుకాండ్రును; యుధి = యుద్ధము నందు; భీమార్జున సమాః = భీమునితోను అర్జునునితోను సమానులున్ను అగు; యుయుధానః = సాత్యకియు; విరాటఃచ = విరాట రాజును; మహారథః = మహారథుడైన ; ద్రుపదః చ = ద్రుపద రాజున్ను; (సన్తి = ఉన్నారు.)

తా ॥ ఈ పాండవుల సేన యందు శూరులును, గొప్ప విలుకాండ్రును, యుద్ధమున భీమార్జునులతో సమానులున్ను అయిన సాత్యకియు, విరాటరాజున్ను, మహారథుడైన ద్రుపద రాజున్ను గలరు.

(ఆయుధ విద్య యందు నిపుణుడై పది వేల విలుకాండ్రతో తానొక్కడే యుద్ధము చేయు సమర్థుడు మహారథుడనబడును.)

5. శ్లో. ధృష్టకేతు శ్చేకితానః । కాశీరాజశ్చ వీర్యవాన్।
పురుజిత్ కుంతిభోజశ్చ । శైబ్యశ్చ నరపుఙ్గవః ॥

అర్థము : ధృష్టకేతుః = ధృష్టకేతువున్ను; చేకితానః = చేకితానుడున్ను ; వీర్యవాన్ = పరాక్రమ వంతుడైన; కాశీరాజః చ = కాశీ రాజున్ను; పురుజిత్ = పురుజిత్తున్ను, కుంతిభోజః చ = కుంతి భోజుడున్ను ; నరపుఙ్గవః = పురుషశ్రేష్ఠుడైన ; శైబ్యః చ = శైబ్యుడున్ను, (సన్తి = కలరు)

తా ॥ ఈ పాండవుల సేన యందు ధృష్టకేతువున్ను, చేకితానుడున్ను, పరాక్రమవంతుడైన కాశీ రాజున్ను , పురుజిత్తున్ను, కుంతి భోజుడున్ను, పురుష శ్రేష్ఠుడైన శైబ్యుడున్ను గలరు.

6. శ్లో. యుధామన్యు శ్చ విక్రాన్తః । ఉత్తమౌజా శ్చ వీర్యవాన్ ।
సౌభద్రో ద్రౌపదేయా శ్చ । సర్వ ఏవ మహారథాః ॥

అర్థముః విక్రాన్తః = పరాక్రమవంతుడైన; యుధామన్యుఃచ = యుధామన్యువున్ను ; వీర్యవాన్ = శూరుడైన; ఉత్తమౌజాః చ = ఉత్తమౌజస్సున్ను; సౌభద్రః = సుభద్ర పుత్రుడగు అభిమన్యుడున్ను, ద్రౌపదేయాః చ = ద్రౌపదీ కుమారులైన ఉపపాండవులున్ను (సన్తి = కలరు), సర్వే = అందరూ; మహారథాః ఏవ = మహారథులే (భవన్తి = అగుచున్నారు.)

తా ॥ ఈ పాండవసేన యందు పరాక్రమవంతుడైన యుధామన్యువున్ను, శూరుడైన ఉత్తమౌజస్సున్ను, సుభద్ర కుమారుడైన అభిమన్యువున్ను, ద్రౌపది కుమారులైన ప్రతివింధ్య, శ్రుతసోమ, శ్రుతకీర్తి, శతానీక, శ్రుతసేనులును కలరు. వీరందరూ కూడా మహారథులై యున్నారు.

అవ. దుర్యోధనుడు తన సేన యందలి వీరులను పేర్కొనుచున్నాడు.

7. శ్లో. అస్మాకం తు విశిష్టా యే । తాన్నిబోధ ద్విజోత్తమ ! ।
నాయకా మమ సైన్యస్య । సంజ్ఞార్థం తాన్ బ్రవీమి తే ॥

అర్థము : హే ద్విజోత్తమ = ఓ బ్రాహ్మణ శ్రేష్ఠుడా; అస్మాకం తు =మనలో నైతే ; యే = ఎవరు; విశిష్టాః = ముఖ్యులో ; మమ = నా యొక్క ; సైన్యస్య = సేనకు; యే= ఎవరు; నాయకాః = నాయకులో; తాన్ = వారలను; తే = నీకు; సంజ్ఞార్థం = చక్కగా తెలియుట కొఱకు; బ్రవీమి = చెప్పుచున్నాను; నిబోధ = వినుము.

తా ॥ ఓ బ్రాహ్మణ శ్రేష్ఠుడవైన ద్రోణాచార్య ! మనలో ఎవరు ముఖ్యులో మన సైన్యమునకు ఎవరు నాయకులో వారిని నీకు చక్కగా తెలియుటకై చెప్పుచున్నాను; వినుము.

8. శ్లో. **భవాన్ భీష్మశ్చ కర్ణశ్చ । కృపశ్చ సమితిఞ్జయః ।**
అశ్వత్థామా వికర్ణశ్చ । సౌమదత్తి స్తథైవ చ ॥

అర్థము : భవాన్ = నీవు, భీష్మఃచ = భీష్ముడున్ను, కర్ణఃచ = కర్ణుడున్ను, సమితిఞ్జయః = యుద్ధమునజయశీలుడైన, కృపఃచ = కృపాచార్యుడున్ను, అశ్వత్థామా = అశ్వత్థామయు, వికర్ణఃచ = వికర్ణుడును, తథైవ = ఆవిధముగానే; సౌమదత్తిః = సోమదత్తుని కుమారుడగు భూరిశ్రవుడున్ను, (సన్తి = ఉన్నారు.)

తా ॥ నీవు, భీష్మాచార్యులు, కర్ణుడు, యుద్ధమున జయశీలుడైన కృపాచార్యుడు, అశ్వత్థామ, వికర్ణుడు, సోమదత్తుని కుమారుడైన భూరిశ్రవుడున్ను కలరు.

9. శ్లో. అన్యే చ బహవ శ్శూరాః । మదర్థే త్యక్తజీవితాః ।
నానాశస్త్ర ప్రహరణాః । సర్వే యుద్ధ విశారదాః ॥

అర్థము : మదర్థే = నా నిమిత్తమై, త్యక్త జీవితాః = ప్రాణము లర్పింపసిద్ధపడిన వారున్ను, నానాశస్త్ర ప్రహరణాః =అనేక విధములైన శస్త్రములను, ఆయుధములను కలిగినట్టి వారున్ను, సర్వే = అందరున్ను, యుద్ధ విశారదాః = యుద్ధ నైపుణ్యము గలవారునగు, అన్యే = ఇతరులైన, బహవః = అనేకమంది, శూరాఃచ = శూరులున్ను, (సంతి=కలరు).

తా ॥ ఇంకను నా కొఱకై ప్రాణముల నర్పింప సిద్ధపడిన వారున్ను అనేకములైన శస్త్రములు,ఆయుధములు కలిగినట్టి వారునై అందరును యుద్ధము నందు నేర్పుగల వారలేయగు నితరులును అనేకమంది శూరులు కలరు.

10. శ్లో. **అపర్యాప్తం తదస్మాకం । బలం భీష్మాభిరక్షితమ్ ।**
పర్యాప్తం త్విద మేతేషాం । బలం భీమాభిరక్షితమ్ ॥

అర్థము : తత్ =ఆ కారణము వలన,భీష్మాభిరక్షితమ్ = భీష్మునిచే అంతటను రక్షింపబడుచున్న, అస్మాకం = మనయొక్క, బలం = సేన, అపర్యాప్తం = చాలినంతలేదు, భీమాభిరక్షితమ్ = భీమునిచే రక్షింపబడుచున్న, ఏతేషాం = ఈ పాండవుల యొక్క,ఇదం = ఈ, బలం = సేన, పర్యాప్తం = చాలినంత యున్నది.

తా ॥ పాండవుల సేనలో శూరులు అధికముగ నున్నారు. మన సేనలో శూరులు తక్కువ యున్నారు. కనుక భీష్మునిచే రక్షింప బడుచున్నదైనను మన సేన పాండవులను జయింప జాలినంత లేదు. భీమునిచే రక్షింపబడుచున్న ఈ పాండవుల సేన మనలను జయింపగలిగి యున్నది.

11. శ్లో. అయనేషు చ సర్వేషు । యథాభాగ మవస్థితాః ।
భీష్మ మేవాభిరక్షన్తు । భవన్త స్సర్వ ఏవహి ॥

అర్థము : భవన్తః = మీరు, సర్వేఏవ = అందరున్ను,సర్వేషు = సమస్తము లైన, అయనేషు చ = (వ్యూహ) మార్గముల యందున్ను, యథాభాగం = ఎవరి వరుస వారు తప్పక, అవస్థితాః = ఉంటున్నవారై, భీష్మం ఏవ = భీష్మునే, అభిరక్షన్తు = అంతటను రక్షించుచుందురు గాక.

తా ॥ మీరందరున్ను,అన్ని వ్యూహప్రవేశ మార్గముల యందును మీ మీ వరుసలు తప్పక నిలిచి యుండి భీష్ముని అన్ని వైపుల నుండి రక్షించుచుండుడు.

12. శ్లో. తస్య సఞ్జనయన్ హర్షం । కురువృద్ధః పితామహః ।
సింహనాదం వినద్యోచ్చైః । శఙ్ఖం దధ్మౌ ప్రతాపవాన్ ॥

అర్థము : ప్రతాపవాన్ = పరాక్రమవంతుడును, కురువృద్ధః = కౌరవులలో పెద్దయు నగు, పితామహః = తాత యగు భీష్ముడు, తస్య = ఆ దుర్యోధనునికి, హర్షం = సంతోషమును, సఞ్జనయన్ = బాగుగా పుట్టించు చున్నవాడై, ఉచ్చైః = గట్టిగా, సింహనాదం = సింహధ్వని వంటి ధ్వనిని, వినద్య = ధ్వనింపజేసి, శఙ్ఖం = శంఖమును, దధ్మౌ = పూరించెను.

తా ॥ దుర్యోధనుని ఈ విషాద సంభాషణను విని, పరాక్రమ వంతుడును, కౌరవులలో వృద్ధుడును అయిన తాత యగు భీష్ముడు అతనికి సంతోషము కలుగుటకై గట్టిగా సింహమువలె గర్జించి శంఖమును పూరించెను.

13. శ్లో. తత శ్శఙ్ఖాశ్చ భేర్యశ్చ । పణవానకగోముఖాః ।
సహసైవా భ్యహన్యన్త । స శబ్ద స్తుములో ఽభవత్ ।

అర్థము : తతః = అటుపిమ్మట, శఙ్ఖాఃచ = శంఖములున్ను,భేర్యఃచ = దుందుభులున్ను, పణవ - ఆనక-గోముఖాః = తప్పెటలు, తమ్మటలు,బూరలున్ను, సహసాఏవ =

ఒక్కమారుగనే, అభ్యహన్యన్త = కొట్టబడినవి, సః = ఆ, శబ్దః = శబ్దము, తుములః= సంకులమైనది, అభవత్ = ఆయెను.

తా ॥ అటు పిమ్మట శంఖములున్ను, దుందుభులున్ను, తప్పెటలు, తమ్మటలు, బూరలున్ను ఒక్కమారుగ వాయించ బడినవి. వీటి వలన జనించిన శబ్ద మొక్క పెట్టున దిక్కులు పిక్కటిల్ల జేసెను.

14. శ్లో. తత శ్శ్వేతై ర్హయై ర్యుక్తే । మహతి స్యన్దనే స్థితౌ ।
మాధవః పాండవశ్చైవ । దివ్యౌ శజ్ఖౌ ప్రదధ్మతుః ॥

అర్థము :- తతః = అటుతరువాత, శ్వేతైః = తెల్లనైన, హయైః = గుఱ్ఱములతో, యుక్తే = కూడుకున్నట్టి,మహతి = గొప్పదైన, స్యందనే = రథమునందు, స్థితౌ = ఉన్నట్టి, మాధవః = శ్రీకృష్ణుడున్ను, పాండవః చ ఏవ = అర్జునుడున్ను, దివ్యౌ = దివ్యములైన , శజ్ఖౌ = శంఖములను, ప్రదధ్మతు ః = గట్టిగా పూరించిరి.

తా ॥ అటు తరువాత తెల్లని గుర్రముల బూన్చిన గొప్ప రథమునందు గూర్చున్న శ్రీ కృష్ణుడున్ను, అర్జునుడున్ను దివ్యములైన శంఖములను లెస్సగా పూరించిరి.

5. శ్లో. పాఞ్చజన్యం హృషీకేశో । దేవదత్తం ధనఞ్జయః ।
పౌణ్డ్రం దధ్మౌ మహాశఙ్ఖం । భీమకర్మా వృకోదరః ॥

అర్థము : హృషీకేశః = శ్రీకృష్ణుడు, పాఞ్చజన్యం = పాంచజన్యమను శంఖమును, దధ్మౌ = పూరించెను, ధనంజయః = అర్జునుడు, దేవదత్తం = దేవదత్తమను శంఖమును, (దధ్మౌ = ఊదెను.) భీమకర్మా=భయంకర కృత్యములుగల, వృకోదరః= భీముడు, పౌండ్రం = పౌండ్రమనెడు, మహాశంఖం = గొప్ప శంఖమును, (దధ్మౌ=పూరించెను).

తా ॥ శ్రీకృష్ణుడు పాంచజన్యమను పేరు గల శంఖమును, అర్జునుడు దేవదత్త మను పేరు గల శంఖమును, భయంకర కృత్యములు గల భీముడు పౌండ్రమను పేరు గల పెద్ద శంఖమును పూరించిరి.

6. శ్లో. అనన్త విజయం రాజా । కున్తీపుత్రో యుధిష్ఠిరః ।
నకుల స్సహదేవశ్చ । సుఘోష మణిపుష్పకౌ ॥

ర్థము : రాజా = రాజైన, కున్తీ పుత్రః = కుంతీదేవి పుత్రుడైన, యుధిష్ఠిరః = ధర్మరాజు, అనన్త విజయం = అనంత విజయమను పేరు గల శంఖమును, (దధ్మౌ = ఊదెను)

నకులః = నకులుడు, సహదేవఃచ = సహదేవుడున్ను, సుఘోష మణిపుష్పకౌ = సుఘోషము మణిపుష్పకములను పేరుగల శంఖములను,(దధ్మతుః = పూరించిరి).

తా ॥ రాజును, కుంతీ దేవి పుత్రుడును అయిన ధర్మరాజు అనంత విజయమను శంఖమును, నకులుడు సుఘోషమను శంఖమును, సహదేవుడు మణిపుష్పకమను శంఖమును పూరించిరి.

17. శ్లో. కాశ్యశ్చ పరమేష్వాసః । శిఖణ్డీచ మహారథః ।
ధృష్టద్యుమ్నో విరాటశ్చ । సాత్యకి శ్చాపరాజిత ః ॥

అర్థము : పరమేష్వాసః = గొప్ప విలుకాడైన, కాశ్యః చ = కాశీరాజున్ను, మహారథః = మహారథుడైన, శిఖణ్డీచ = శిఖండియున్ను, ధృష్టద్యుమ్నః = ధృష్టద్యుమ్నుడున్ను, విరాటఃచ = విరాటుడున్ను, అపరాజితః = పరాజయమును జెందని, సాత్యకిఃచ = సాత్యకియు, (శఙ్ఖాన్ = శంఖములను, దధ్ముః = పూరించిరి).

తా ॥ గొప్ప విలుకాడైన కాశీరాజున్ను, మహారథుడైన శిఖండియున్ను, ధృష్టద్యుమ్నుడున్ను, విరాటుడున్ను, పరాజయమును చెందని సాత్యకియున్ను శంఖములను పూరించిరి.

18. శ్లో. ద్రుపదో ద్రౌపదేయాశ్చ । సర్వశః పృథివీపతే ! ।
సౌభద్రశ్చ మహాబాహుః । శఙ్ఖాన్ దధ్ముః పృథక్పృథక్ ॥

అర్థము : హే పృథివీపతే=ఓ రాజా !ద్రుపదః=ద్రుపదుడున్ను, ద్రౌపదేయాఃచ = ద్రౌపదీ పుత్రులున్ను, మహాబాహుః = గొప్ప బాహువులు గల, సౌభద్రఃచ = అభిమన్యుడున్ను, సర్వశః = సేన యందంతటను,పృథక్ పృథక్ = ప్రత్యేక ప్రత్యేకము,శఙ్ఖాన్ = శంఖములను, దధ్ముః = పూరించిరి.

తా ॥ ఓ ధృతరాష్ట్ర మహా రాజా ! ద్రుపదుడును, ద్రౌపది కుమారులైన ఉపపాండవులును, గొప్ప భుజములుగల సుభద్రా కుమారుడైన. అభిమన్యుడును సేన యందంతటను ప్రత్యేక ప్రత్యేకముగా శంఖముల పూరించిరి.

19. శ్లో. సఘోషో ధార్త రాష్ట్రాణాం । హృదయాని వ్యదారయత్ ।
నభశ్చ పృథివీం చైవ । తుములోఽవ్యను నాదయన్ ॥

అర్థము : సః = ఆ, ఘోషః = శబ్దము,తుములః = సంకులమైనదై, నభఃచ = ఆకాశమునున్ను, పృథివీంచ ఏవ = భూమిని కూడను, అనునాదయన్ అపి = ప్రతిధ్వనింప

25. శ్లో. భీష్మ ద్రోణ ప్రముఖతః । సర్వేషాం చ మహీక్షితామ్ ।
ఉవాచ పార్థ! పశ్యైతాన్ । సమవేతాన్ కురూనితి ॥

అర్థము : భీష్మ ద్రోణ ప్రముఖతః = భీష్ముడు ద్రోణుడు మున్నగు, సర్వేషాం = సమస్తమైన, మహీక్షితాంచ = రాజులయొక్క, (పురతః = ఎదుట) హేపార్థ = ఓ అర్జునా, సమవేతాన్ = చేరియున్న, ఏతాన్ = ఈ, కురూన్ = కౌరవులను, పశ్య = చూడుమూ, ఇతి = అని, ఉవాచ = పలికెను.

తా ॥ భీష్ముడు ద్రోణుడు మున్నగు సమస్త రాజులును చూచుచుండగనే ఓ అర్జునా !'సమావేశమైయున్న ఈ కౌరవులను చూడుమా' అని శ్రీకృష్ణుడు పలికెను.

అవ. అర్జునుడు ఉభయ సేనలయందలి ఆప్తవర్గమును చూచుట.

26. శ్లో. తత్రాపశ్యత్ స్థితాన్ పార్థః । పితౄనథ పితామహాన్ ।
ఆచార్యాన్ మాతులాన్ భ్రాతౄన్ । పుత్రాన్ పౌత్రాన్ సఖీం స్తథా ।

ఆర్థము : అథ = అటుపిమ్మట, పార్థః = అర్జునుడు, తత్ర = అచ్చట, స్థితాన్ = ఉన్నట్టి, పితౄన్ = భూరిశ్రవాది తండ్రి వరుస వారిని, పితామహాన్ = భీష్మాది తాతవరుసవారిని, ఆచార్యాన్ = ద్రోణాది ఆచార్య వర్గమువారిని, మాతులాన్ = శల్యాది మేనమామ వరుసవారిని, భ్రాతౄన్ = దుర్యోధనాది అన్నవరుస వారిని, పుత్రాన్ = లక్ష్మణాది పుత్ర వరుసవారిని, పౌత్రాన్ = మనుమల వర్గమువారిని, తథా = అట్లే, సఖీన్ = కృతవర్మాది స్నేహితులను, అపశ్యత్ = చూచెను.

తా ॥ అటుపిమ్మట అర్జునుడు ఆ రణరంగమున భూరిశ్రవాది తండ్రి వరుస వారిని, భీష్మాది తాతవరుసవారిని, ద్రోణాది ఆచార్య వర్గమువారిని, శల్యాది మామ వరుసవారిని, దుర్యోధనాది అన్నదమ్ముల వరుస వారిని, లక్ష్మణాది కొడుకు వరుసవారిని, లక్ష్మణ పుత్రాది మనుమల వరుసవారిని, కృతవర్మాది స్నేహితులను జూచెను.

అవ. అర్జునునకు యుద్ధవైముఖ్యమునకు కారణమైన దయ ఆవహించుట.

27. శ్లో. శ్వశురాన్ సుహృద శ్చైవ । సేనయో రుభయో రపి ।
తాన్సమీక్ష్య స కౌన్తేయః । సర్వాన్ బన్ధూ నవస్థితాన్ ॥

అర్థము : సః = ఆ, కౌన్తేయః = అర్జునుడు, ఉభయోః = రెండైన, సేనయోః అపి = సేనలయందును, అవస్థితాన్ = ఉన్నట్టి, శ్వశురాన్ = మామలను, సుహృదఃచ

ఏవ= హితైషులను, తాన్ = అట్టి, సర్వాన్ = సమస్తమైన, బంధూన్ = బంధువులను, సమీక్ష్య = చక్కగా జూచి.

తా ॥ ఆ అర్జునుడు రెండుసేనల మధ్యయందున్నట్టి పిల్లనిచ్చిన మామల వరుస వారిని, స్నేహితులను, అట్టివారి వరుసగల సమస్త బంధువులను జూచి.

28. శ్లో. కృపయా పరయా௨௨విష్టో । విషీదన్నిద మబ్రవీత్ ।
దృష్ట్వేమం స్వజనం కృష్ణ! । యుయుత్సుం సముపస్థితమ్ ॥

అర్థము : పరయా = అధికమైన, కృపయా = దయచే, ఆవిష్టః = ఆవరింపబడినవాడై, విషీదన్ = దుఃఖించుచు, ఇదం = ఈ క్రింది వాక్యమును, అబ్రవీత్ = పలికెను, కృష్ణ= ఓ కృష్ణుడా! యుయుత్సుం = యుద్ధము చేయగోరి, సముపస్థితం = ఎదుటకు వచ్చియున్నట్టి, ఇమం = ఈ, స్వజనం = బంధు జనమును, దృష్ట్వా = చూచి.

తా ॥ అర్జునుడు మిక్కిలి దయచే వివశుడై దుఃఖించుచు ఈ క్రింది వాక్యమును పలికెను. "శ్రీకృష్ణుడా ! యుద్ధము చేయగోరి ఎదుటకు వచ్చి నిలబడియున్న ఈ బంధువులను జూచి

అవ. దయాపారవశ్యమున అర్జునున కపశకునములే గాన్పించుట :

29. శ్లో. సీదన్తి మమ గాత్రాణి । ముఖం చ పరిశుష్యతి ।
వేపథు శ్చ శరీరే మే । రోమహర్ష శ్చ జాయతే ॥

అర్థము : మమ = నా యొక్క, గాత్రాణి = అవయవములు, సీదంతి = శిథిలమగుచున్నవి, ముఖంచ = నోరున్ను, పరిశుష్యతి = ఎండిపోవుచున్నది, మే = నాయొక్క, శరీరే= శరీరమునందు, వేపధుఃచ = వణుకున్ను, రోమహర్షఃచ = పులకరింతయును, జాయతే = పుట్టుచున్నది.

తా ॥ నా యొక్క అవయవములు కృశించు చున్నవి, నోరు ఎండిపోవుచున్నది. నా శరీరమున వణుకు జనించుచున్నది, పులకరింత వొడముచున్నది.

30. శ్లో. గాణ్డీవం స్రంసతే హస్తాత్ । త్వక్చైవ పరిదహ్యతే ।
న చ శక్నో మ్యవస్థాతుం । భ్రమతీవ చ మే మనః ॥

అర్థము : గాండీవం = గాండీవమను ధనుస్సు, హస్తాత్ = చేతినుండి, స్రంసతే = జారుచున్నది, త్వక్ చ ఏవ = చర్మముకూడా, పరిదహ్యతే = అంతటను దహింపజేయబడుచున్నది,

36. శ్లో. నిహత్య ధార్తరాష్ట్రాన్నః । కా ప్రీతి స్స్యా జ్జనార్దన ! ।
పాప మేవా శ్రయే దస్మాన్ । హత్వైతా నాతతాయినః ॥

అర్థము :- జనార్దన = ఓ కృష్ణా ! ధార్తరాష్ట్రాన్ = దుర్యోధనాదులను, నిహత్య = చంపి, నః= మనకు, కా = ఏమి, ప్రీతిః = సంతోషము, స్యాత్ = కలుగును, ఆతతాయినః = ఆతతాయిలయినను, ఏతాన్ = ఈ దుర్యోధనాదులను, హత్వా = చంపిన, అస్మాన్ = మనలను, పాపం ఏవ = పాపమే, ఆశ్రయేత్ = ఆశ్రయించును.

తా ॥ ఓ కృష్ణా ! దుర్యోధనాదులను చంపినందువల్ల మనకు ఏమి సంతోషము కలుగగలదు ? వీరు ఇంటికి నిప్పుపెట్టుట మొదలగు ఆతతాయి కృత్యము లచే మహాపాతకులే అయినను వీరిని చంపిన మనకు పాపమే కలుగును.

(ఆతతాయి :- ఇండ్లు మొదలగువాటికి నిప్పుపెట్టువాడు, విషము పెట్టువాడు, శస్త్రముచేత గలవాడు, ధనము నపహరించువాడు, భూమిని, భార్యను హరించువాడు ఈ ఆరుగురును ఆతతాయు లనబడుదురు).

37. శ్లో. తస్మాన్నార్హా వయం హన్తుం । ధార్తరాష్ట్రా న్స్వబాంధవాన్ ।
స్వజనం హి కథం హత్వా । సుఖిన స్స్యామ మాధవ ! ।

అర్థము : తస్మాత్ = ఆ కారణమువలన, వయం = మనము, సబాంధవాన్ = బంధువులతో కూడిన, ధార్తరాష్ట్రాన్ = దుర్యోధనాదులను, హన్తుం = చంపుటకు, న అర్హాః = తగము, మాధవ = ఓ కృష్ణా! స్వజనం = బంధువులను, హత్వా = చంపి, కథంహి = ఏవిధముగా, సుఖినః = సౌఖ్యవంతులము, స్యామ = అగుదుము ?

తా ॥ కనుక, మనము దుర్యోధనాదులను బంధువులతోసహా చంపుటతగదు. ఓ కృష్ణా! బంధువులను జంపి మనము సౌఖ్యవంతుల మెటుల కాగలము?

38.శ్లో. యద్యప్యే తే న పశ్యన్తి । లోభోపహతచేతసః ।
కులక్షయకృతం దోషం । మిత్రద్రోహే చ పాతకమ్ ॥

అర్థము : లోభోపహత చేతసః = పేరాశచే చెడగొట్టబడిన చిత్తముగల, ఏతే = ఈ దుర్యోధనాదులు, కులక్షయ కృతం = వంశనాశనమువలన గలుగు, దోషం = దోషమును, మిత్రద్రోహే = మిత్రులకు ద్రోహము చేయుట యందలి, పాతకం చ = పాపమునున్ను, న పశ్యన్తి యది అపి = చూడనివారలైనప్పటికిని.

తా ॥ పేరాశచే చెడిపోయిన చిత్తములగల ఈ దుర్యోధనాదులు వంశనాశనము వలన కలుగు దోషమును, మిత్రులకు ద్రోహము చేయుట యందలి పాపమును తెలుసుకొనజాలని వారైనను

39. శ్లో. కథం న జ్ఞేయ మస్మాభిః । పాపా దస్మా న్నివర్తితుమ్
కుల క్షయ కృతం దోషం । ప్రపశ్యద్భి ర్జనార్దన ! ।

అర్థము : జనార్దన = ఓ కృష్ణా ! కుల క్షయ కృతం = వంశనాశనము వలన కలుగు, దోషం= దోషమును, ప్రపశ్యద్భిః = చక్కగా తెలుసుకొనుచున్న, అస్మాభిః = మనచే, అస్మాత్ = ఈ, పాపాత్ = పాపమునుండి, నివర్తితుం = మరలుటకు, కథం = ఎట్లు, న జ్ఞేయం = తెలియదగదు.

తా ॥ ఓ కృష్ణా! వంశనాశనమువలన కలుగు దోషము మనకు బాగుగా తెలియును. అట్టి మనము ఈ పాపమునుండి తొలంగుట కేల ఆలోచింపరాదు ?

40. శ్లో. కులక్షయే ప్రణశ్యన్తి । కులధర్మా స్సనాతనాః ।
ధర్మే నష్టే కులం కృత్స్నం । అధర్మో ఽ భిభవ త్యుత ॥

అర్థము : కులక్షయే = వంశనాశనము కలుగగనే, సనాతనాః = శాశ్వతములైన, కులధర్మాః= కులధర్మములు, ప్రణశ్యన్తి = పూర్తిగానశించును. ధర్మే = ధర్మము, నష్టే (సతి)= నశించగానే, అధర్మః = అధర్మము, కులం = కులమును, కృత్స్నం = అంతను, అభిభవతి ఉత = ఆక్రమించి తీరును.

తా ॥ వంశనాశనము కలిగినచో వంశపరంపరగావచ్చు శాశ్వతధర్మములు పూర్తిగా నశించును. ధర్మము నశించగా అధర్మము కులమునంతను ఆక్రమించి తీరును.

41. శ్లో. అధర్మాభి భవా త్కృష్ణ ! ప్రదుష్యన్తి కులస్త్రియః ।
స్త్రీషు దుష్టాసు వార్ష్ణేయ ! జాయతే వర్ణసఙ్కరః ।

అర్థము : కృష్ణా = ఓ కృష్ణుడా ! అధర్మాభిభవాత్ = అధర్మము ఆక్రమించుటవలన, కులస్త్రియః = కులకాంతలు, ప్రదుష్యన్తి = పూర్తిగా చెడిపోవుదురు, వార్ష్ణేయ= ఓ కృష్ణుడా ! స్త్రీషు = స్త్రీలు, దుష్టాసు (సతీషు) = చెడినవారలుకాగా, వర్ణసఙ్కరః= వర్ణములకు సాంకర్యము, జాయతే = కలుగుచున్నది.

తా ॥ ఓ కృష్ణా! అధర్మము వ్యాపించినచో కులకాంతలు పూర్తిగా చెడుదురు. స్త్రీలు చెడినచో వర్ణసాంకర్యము కలుగును.

42. శ్లో. సఙ్కరో నరకాయైవ । కులఘ్నానాం కులస్య చ ।
పతన్తి పితరో హ్యేషాం । లుప్త పిణ్డోదకక్రియాః ॥

అర్థము : సఙ్కరః = వర్ణ సాంకర్యము, కులఘ్నానాం = కులమును పాడుచేసిన వారలకును, కులస్య చ = కులమునకును కూడ, నరకాయ ఏవ = నరకము కొరకే, (భవతి= అగుచున్నది), ఏషాం = వీరలయొక్క, పితరః = పితృదేవతలు, లుప్త పిణ్డోదక క్రియాః = లోపించిన పిండములు, తర్పణములు గలవారలై, పతన్తి = పడిపోవుచున్నారు.

తా ॥ వర్ణ సాంకర్యము కులఘాతకులకున్ను, కులమునకున్ను కూడ నరకమును కలిగించును, ఇట్టి వీరి పితృదేవతలు తమకు తద్దినములు పెట్టువారును, తర్పణము లిచ్చువారును లేక నరకమున పడుదురు.

43. శ్లో. దోషై రేతైః కులఘ్నానాం । వర్ణ సంకర కారకైః ।
ఉత్సాద్యన్తే జాతి ధర్మాః । కులధర్మా శ్చ శాశ్వతాః ॥

అర్థము : ఏతైః = ఈ, కులఘ్నానాం = కులఘాతకులయొక్క, వర్ణసఙ్కరకారకైః = వర్ణములయొక్క సాంకర్యమును కలిగించు నట్టి, ఏతైః = ఈ, దోషైః = దోషములచే, శాశ్వతాః = అనాదియైన, జాతిధర్మాః = వర్ణాచారములున్ను, కులధర్మాఃచ = కులాచారములున్ను, ఉత్సాద్యన్తే = నశింపచేయబడుచున్నవి.

తా ॥ కులఘాతకులు వర్ణసాంకర్యమును కలిగింతురు. వారి ఈ దోషములచే పరంపరగ వచ్చు స్థిరమైన జాతి ధర్మములున్ను, కులధర్మములున్ను నశింపచేయబడును.

44. శ్లో. ఉత్పన్నకుల ధర్మాణాం । మనుష్యాణాం జనార్దన !।
నరకే నియతం వాసో । భవతీత్యనుశుశ్రుమ ॥

అర్థము : జనార్దన = ఓ కృష్ణా ! ఉత్సన్నకులధర్మాణాం = నశించిన కులధర్మములుగల, మనుష్యాణాం = మనుష్యులకు, నరకే = నరకమునందు, నియతం = ఎల్లపుడును, వాసః = నివాసము, భవతి ఇతి = కలుగుచున్నదని, అనుశుశ్రుమ = వింటిమి.

తా ॥ కృష్ణా! కులధర్మములు చెడిన మానవులకు ఎల్లపుడును నరక వాసము కలుగుచున్నదని వినియున్నాము.

45. శ్లో. అహో! బత! మహత్పాపం । కర్తుం వ్యవసితా వయమ్ ।
యద్రాజ్య సుఖలోభేన । హన్తుం స్వజన ముద్యతాః ॥

అర్థము : అహో! = ఆహా ! బత = అయ్యో, యత్ = ఏ కారణమువలన, వయం = మనము, రాజ్యసుఖలోభేన = రాజ్య సుఖముల యందలి పేరాశచే, స్వజనం = బంధుజనమును, హన్తుం = చంపుటకు, ఉద్యతాః = యత్నించితిమో, (తత్ = ఆకారణము వలన), మహత్ = గొప్పదైన, పాపం = పాపమును, కర్తుం = చేయుటకు, వ్యవసితాః = సిద్ధపడితిమి.

తా ॥ అయ్యయ్యో ! మనము గొప్పపాపమునకు ఒడిగట్టికొంటిమి. రాజ్య సుఖములందలి పేరాశతో మన బంధుజనమును జంప యత్నించితిమి కదా!

46. శ్లో. యది మా మప్రతీకారం । అశస్త్రం శస్త్రపాణయః ।
ధార్తరాష్ట్రా రణే హన్యుః । తన్మే క్షేమతరం భవేత్ ॥

అర్థము :- శస్త్రపాణయః = ఆయుధము చేతిలోగల, ధార్తరాష్ట్రాః = దుర్యోధనాదులు, అశస్త్రం = శస్త్రములు లేనట్టియు, అప్రతీకారం = ప్రతిక్రియ చేయనట్టియు, మాం = నన్ను, రణే = యుద్ధమునందు, హన్యుఃయది = చంపుదురేని, తత్ = ఆ మరణము, మే = నాకు, క్షేమతరం = మరింత క్షేమము, భవేత్ = అగును.

తా ॥ శస్త్రాస్త్రములను విడిచి దెబ్బకుదెబ్బ కొట్టని నన్ను శస్త్రధారులగు దుర్యోధనాదులు యుద్ధమునందు వధించిరేని అది నాకు మరింత క్షేమకరము."

సఞ్జయ ఉవాచ = సంజయుడు పలికెను.

47. శ్లో. ఏవముక్త్వాఽర్జున స్సఙ్ఖ్యే । రథోపస్థ ఉపావిశత్ ।
విసృజ్య సశరం చాపం । శోకసంవిగ్నమానసః ॥

ఇతి శ్రీ భగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీ కృష్ణార్జున సంవాదే అర్జున విషాదయోగో నామ ప్రథమో ఽ ధ్యాయః ॥

అర్థము : సఙ్ఖ్యే = యుద్ధమునందు, అర్జునః = అర్జునుడు, ఏవం = ఇట్లు, ఉక్త్వా = పలికి, శోకసంవిగ్నమానసః = దుఃఖముచే మిక్కిలి చలించిన మనస్సు కలవాడగుచు, సశరం = బాణముతోకూడిన, చాపం = ధనుస్సును, విసృజ్య = విడిచి, రథోపస్థే= రథముపై, ఉపావిశత్ = కూర్చుండెను.

తా ॥ అర్జునుడీ విధమున పలికి, శోకముచే మనస్సు మిక్కిలి కలత నొందగా గాండీవమును క్రిందపడవైచి రథముపై చతికిలబడెను.

ఇది ఉపనిషదర్థ ప్రతిపాదకంబును, బ్రహ్మవిద్యయు, యోగశాస్త్రంబును, శ్రీకృష్ణార్జున సంవాద రూపంబును నగు శ్రీ భగద్గీతయందు అర్జున విషాదయోగంబను ప్రథమాధ్యాయము :

ధృతరాష్ట్రుని శ్లోకము	1	దుర్యోధనుని శ్లోకములు	9
సంజయునిశ్లోకములు	16	అర్జునుని శ్లోకములు	21
ఈ యధ్యాయమునందలి శ్లోకములు			47

శ్రీమద్భగవద్గీతా ప్రశ్నోత్తరావళి
ప్రథమ అధ్యాయము

1.ప్ర. మొదటి అధ్యాయమునకు పేరేమి? దాని కాపేరెందులకుంచబడెను?

ఉ. మొదటి అధ్యాయమునకు 'అర్జున విషాదయోగము' అని పేరు.

ఏ యధ్యాయమున ఏ విషయము ముఖ్యముగ చెప్పబడునో ఆ యధ్యాయమున కాపేరుంచబడును. ఈ యధ్యాయమున అర్జునుడు యుద్ధమున తనచే చంపబడవలసిన ఆప్తబంధువులను జూచి జాలిచే చేయాడక యుద్ధవిముఖుడై దుఃఖించుట ముఖ్యముగా వర్ణింపబడుటచే దీనికి "విషాదయోగ" మని పేరుంచబడినది. అన్నిటివలెనే విషాదము కూడ తత్త్వజ్ఞాన సంపాదన కొక యోగమే అనగా ఉపాయమే. విషాదమనగా స్వప్రయత్నమును విరమించుట. దానికొరకే పరమాత్మ నిరీక్షించుచుండును. అట్టివారి సకలవిధ భారములను తానే వహించును. కావున విషాదమొక ముఖ్యయోగమని యిందుమూలమున తెలుపబడినది.

2. ప్ర. మొదటి అధ్యాయమందలి ముఖ్య విషయములేవి ?

ఉ. (1) దుర్యోధనుడు ఉభయసేనల బలాబలములను పరిశీలించి తన జయమునుగూర్చి సందేహించి తన విషాదమును ద్రోణాచార్యులతో విన్నవించుకొనుట.

(2) దుర్యోధనుడు ద్రోణాచార్యునికి ఉభయసేనలయందలి ప్రధాన వీరుల పేరులు చెప్పి జ్ఞాపకము చేయుట మొదలగునవి.

3. ప్ర. శ్రీకృష్ణుడు అధ్యాత్మ శాస్త్రమగు గీతను అర్జుననకే ఉపదేశించుటలో ప్రధాన కారణమేమి ?

ఉ. అర్జునుడు నరాంశ, ఇంద్రాంశలతో నవతరించిన మహాపురుషుడు. "పాండవానాం ధనంజయః" అనినట్లు భగవదంశ సంభూతుడు, శ్రీకృష్ణునకు మేనత్త కుమారుడగుటయేగాక బావమరిది. పరమభక్తుడు, జితేంద్రియాగ్రేసరుడు, శ్రీకృష్ణుని బాల్యమిత్రుడు. కావున పరమాత్మ తాను గీతోపదేశము ద్వారా చేయదలంచిన ధర్మస్థాపనను ఈ యర్జునుని మిషగాగొనియే చేయదలంచెను. కాని "అడిగినగాని తెలుపరాని" రహస్య శాస్త్రమగుటచే సమయమునకై

వేచియుండెను. వైరాగ్యభాగ్య ముదయించినగాని వేదాన్త జిజ్ఞాస కలుగనేరదు. శోకవిషాదములే వైరాగ్యబీజములు. అవి ఇష్టవస్తు వినాశము వలననే కలుగును. అది ఉభయసేనలయందలి బంధు మిత్రాదులను చూచుటచే అర్జునునకు మాత్రమే కలిగెను. కావుననే అర్జునుడు శ్రీకృష్ణునికి శిష్యుడై యాతని పాదములపై బడి ‘నాకిప్పుడేమి చేయవలెనో తోచుటలేదు. నా ధైర్యము మంటగలసినది. నాకు నా ధర్మమును నిర్ణయించుకొను శక్తి లేకున్నది. కావున నీవు నన్ను శిష్యునిగా పరిగ్రహించి నాకే మార్గము శ్రేయఃప్రదమో దానిని దయతో నుపదేశింపుమ’ని ప్రార్థించెను. (2 అ. 7 శ్లో.)

“అహోబత మహత్పాపం...”
“న కాంక్షే విజయం...”
“అపిత్రైలోక్య రాజ్యస్య...”
“సంకరో నరకాయైవ”
“కింనో రాజ్యేన... కింభోగైర్జీవితేనవా”
“యద్యప్యేతే...”
“యదిమామ ప్రతీకారం...”
“శ్రేయో - భోక్తుం...”

మరియు వేదాంత జిజ్ఞాసువునకు నిత్యానిత్య వస్తు వివేకము, ఐహిక ఆముష్మిక ఫలవైరాగ్యము, ఆత్మానాత్మ వివేకము, శమము, దమము, లోభము లేకుండుట, ఓరిమి, ఉపరతి (సన్యాసేచ్ఛ) మొదలగు గుణము లుండవలెనని కొందరి మతము. “అనిత్యమగు రాజ్య సుఖము కొరకు ఆప్తబంధు, గురు, వృద్ధుల జంపి నిత్యమైన శ్రేయస్సును చెడుగొట్టుకొన సిద్ధపడుచున్నా” మనుటచే నిత్యానిత్యవస్తు వివేకమున్ను, నాకు గెలుపును దాని వలన లభించు రాజ్యమును, దానిచే జిక్కు భోగములును వలదనుటచే ఇహలోక విరక్తియు, ‘ముల్లోక రాజ్యాధిపతినైనను యుద్ధము చేయ నొల్ల’ ననుటచే పరలోక విరక్తియు, ‘సంకర కారకులు శాశ్వత నరకవాసులు, వారేగాక వారి పితరులును అధఃపతితు లగుదురు’ అనుటచే ఆత్మానాత్మ వివేకమున్ను, ‘నాకీ రాజ్యమేల, భోగమేల’ యనుటచే శమదమములును, రాజ్యలోభముచే కౌరవులు గానకున్న మనమేల యుద్ధానర్థముల పరిహరించుకొనరా’ దనుటచే నిర్లోభతయు, ‘నేను శస్త్రమును విడిచి దెబ్బకు దెబ్బ కొట్టకున్నను కౌరవులు నన్ను హింసింతురేని అది నాకు మేలే’ యనుటచే ఓర్పున్ను ‘యుద్ధము చేయుటకంటె బిచ్చమెత్తి బ్రతుకుట మేలు’ అనుటచే సన్యాసము మొదలగు గుణములన్నియు సంపూర్ణముగా నుండుటచే శ్రీకృష్ణుడీ గీతాశాస్త్రమును అర్జునునకే ఉపదేశించెననియును కొందరందురు.

4. ప్ర. ఉభయ సేనలును యుద్ధసన్నద్ధమై రణరంగమున చేరినవని యెఱింగియు ధృతరాష్ట్రుడు వారెట్లు చేసిరని ప్రశ్నించక ఏమి చేసిరని ప్రశ్నించుటలోని గూఢాశయమేమి? దాని నెఱింగి సంజయుడెట్లు సమాధాన మిచ్చెను?

ఉ. ఒకానొక క్షేత్ర మాహాత్మ్యముచే సద్బుద్ధులుగాని దుర్బుద్ధులుగాని పొడముచుండుట లోకసిద్ధము. అందును పుణ్యక్షేత్రములయందు సహజమగు పుణ్యపురుషుల కాసద్బుద్ధులు ఉపబృంహితములై విజృంభించుట సహజము. అట్టి పవిత్ర స్థాన మీ పుణ్యభూమియగు కురుక్షేత్రము. అట్టి పుణ్యపురుషులు ధర్మజాదులు. కావున నచ్చట నడుగిడగనే వారి సహజ సద్బుద్ధు లుద్బుద్ధములై "గురుజన బంధువధాది రూపమైన యీ ఘోర యుద్ధము మాకేల ? మాకీ రాజ్యము వలదు గీజ్యము వలదు మీరే ఏలుకొను"డని పాండవులేగిన తన పుత్రులకు తలపూవు వాడకయే అఖండ భూమండలాధిపత్యము చేజిక్కునని యాతనికి యడియాశ యుండెడిది. కావుననే తన ప్రశ్నయందు ధర్మక్షేత్రమని కురుక్షేత్రమునకొక విశేషణమును గూడ చేర్చెను. నావారలును పాండవులును అనుటయు, ఎట్లు చేసిరనక ఏమి చేసిరనుటయు నందులకు తార్కాణములు. ఈ రహస్యమును శ్రీభాష్యకారులు 'బాహ్యనేత్రములచేతను ఆంతర నేత్రముచేతను బొత్తుగా గ్రుడ్డివాడగు ధృతరాష్ట్రుడు దుర్యోధనుని గెలుపునాశించి సంజయునిట్లు ప్రశ్నించె'నని తమ గీతాభాష్యావతారిక యందు స్పష్టపరచిరి.

ఈ కుచోద్యము నెఱింగి సంజయుడు "యోగేశ్వరుడగు శ్రీకృష్ణుడును ధనుర్ధరుడగు అర్జునుడును ఉండుచోటనే లక్ష్మియు, విజయలక్ష్మియు, ఐశ్వర్యమును, నీతియు, నిశ్చలమై యుండునని నా యాశయ"మని స్ఫుటముగా చెప్పనెంచి దానిని బలపరచు విషయములనన్నిటిని మునుముందు విస్తరించి చెప్పెనని తెలియుచున్నది.

5. ప్ర. భగవద్గీతను మొదట ఎవరు, ఎవరికి, ఎప్పుడు ఎందులకుపదేశించిరి?

ఉ. శ్రీకృష్ణుడు అర్జునునకు యుద్ధారంభ దివసమున ఉపదేశించెను.

యుద్ధమునకు సిద్ధమై వచ్చిన అర్జునుడు ఉభయసేనల యందలి ఆచార్యులు, బంధువులు, మిత్రులు మొదలగు వారిని జూచి అప్పటికీ తగని స్నేహము, జాలి, అధర్మభ్రాంతి మొదలగు దోషములచే శరీరాత్మవివేకము లేకయు, ఫలమును కోరక చేయునట్టి క్షత్రియ ధర్మమగు యుద్ధము పాపముల బోగొట్టి మోక్షసాధనమగునని యెఱుంగకయు, దుఃఖించి యుద్ధవిముఖుడై తన యవస్థను విన్నవించుచు తనకు శ్రేయో మార్గము

నుపదేశింపుమని శ్రీకృష్ణుని చరణార విందములను శిష్యభావముతో నాశ్రయింపగా శ్రీకృష్ణ పరమాత్మ ఆతని మూలముగ లోకము నుజ్జీవింపజేయగోరి తత్ప్వోపదేశముచేగాని యాతనికా యజ్ఞానము తొలంగదని తలంచి ఆత్మతత్త్వజ్ఞానముతో నాచరింపదగిన నిష్కామ కర్మ యోగము, దానిచే సాధింపదగు జ్ఞానయోగము, ఆ రెండింటిని అంగములుగా పరిగ్రహించి సిద్ధించునట్టియు సాక్షాత్తుగా మోక్ష సాధనమైనట్టి భక్తి యోగమును యీ గీతోపదేశ మూలమున లోకమున అవతరింపజేసెను.

(2 అధ్యా. - 9 శ్లో. భాష్యం)

6. ప్ర. **గీతను ఉపనిషత్తని పిలుచుటకు కారణమేమి?**

ఉ. ఉపనిషత్తులలో నుండు అర్థముల నన్నిటిని గీత సుబోధకముగా బోధించుటయే గాక కొన్ని స్థలములలో ఉపనిషద్వాక్యములనే శ్లోకములుగా కూర్చుటచేతను ఇది ఉపనిషత్తని పిలువబడుచున్నది.

అందువలననే గీతామాహాత్మ్యమునందు ఉపనిషత్తులన్నియు గోవు గాను, అర్జునుడు దూడగాను, శ్రీకృష్ణుడు పాలను పితుకువాడుగను, గీతయే అమృతరసభరితమగు పాలుగాను, గీతోపాసకులగు పండిత ప్రకాండులు ఆ పాలనుపయోగించు భోక్తలుగను, రూపింపబడినది. కావుననే 'గీతా'యని ఉపనిషత్ శబ్దమువలె స్త్రీలింగమందే వ్యవహరింపబడుటయు సమంజసమగుచున్నది.

7. ప్ర. **శ్రీకృష్ణ దర్జునునకు భగవద్గీతను శ్లోక రూపముగ నుపదేశించెనా? లేక భగవంతు డుపదేశించిన అర్థములను వ్యాసమహర్షి భారతమున శ్లోకరూపమున గూర్చెనా?**

ఉ. కొందరు గీతయందు చెప్పబడిన అర్థములనన్నిటిని యుద్ధారంభ సమయమున శ్రీకృష్ణు డర్జునునకు మాటలుగనే బోధించెనేకాని శ్లోక రూపముగ బోధించలేదు. కాని శ్రీ వ్యాసమహర్షి లోకుల సౌకర్యము కొరకు శ్లోకరూపముగ రచించి మహాభారతమందలి భీష్మపర్వము నందు దీనిని చేర్చెను అని చెప్పుదురు. ఇది బహువాది సమ్మతము.

మరికొందరు శ్లోకరూపముగనే శ్రీకృష్ణు డర్జునునకు ఆ యర్థములనెల్ల నుపదేశించెను. వాటినే యెత్తి శ్రీ వ్యాసుడు భారతమున సమకూర్చెను. అఘటితఘటనా సమర్థుడగు శ్రీకృష్ణున కిదియొక ఘనకార్యము కాదు. ఇట్లు గావించిననే గదా లోకోపకారమును గావించనెంచిన శ్రీకృష్ణుని ఆశయము సఫలమగును. అందును, శ్రీకృష్ణుని వాక్యములు తప్ప తక్కిన

శ్లోకములు మాత్రము శ్రీ వ్యాసునిచేతనే కూర్చబడినవి. కావుననే శ్రీ వ్యాసమహర్షి ఫలశ్రుతియందు 'గీతా సుగీతా కర్తవ్యా కిమన్యైః శాస్త్ర సంగ్రహైః। యా స్వయం పద్మనాభస్య ముఖపద్మాద్వినిస్సృతా' అని చెప్పియుండెను. కావుననే గీతాశైలి భారత భాగవతశైలితో భేదించియుండును. అందులకే శ్రీకృష్ణుడు గీతాచార్యుడనబడునేగాని గీతార్థాచార్యుడనబడుట లేదు. అందరిచే నాదరింపబడు శ్లోకరూపమైన సంహితయే గీతయని పిలువబడుటయు నిందులకు నిదానము. గానము చేయబడునదియే గీత. గానము చేయబడునవి శ్లోకములేకాని అర్థములు కావు గదా. భారత భాగవతాదులయందు వాక్య గ్రంథమునుకూడ గాంచుచున్నాము గాన శ్రీకృష్ణుడు వాక్యరూపముగ నుపదేశించినచో శ్రీ వ్యాసుడు దాని నట్లే ఏల తన గ్రంథమునందు కూర్చకుండును? కావున శ్లోకరూపముగనే శ్రీకృష్ణుడీ గీత నర్జునునకు ఉపదేశించెనందురు.

8. ప్ర. ఇది యెందులకు యోగశాస్త్ర మనబడుచున్నది?

ఉ. యోగమనగా ఉపాయము. శాస్త్రమనగా దానిని బోధించునది. అనగా కర్మజ్ఞానాది మోక్షోపాయములను బోధించునదగుటచే నీ గీతాశాస్త్రమునకు యోగశాస్త్రమని పేరుంచబడినది. ప్రతి అధ్యాయ ప్రధానార్థమున్ను ఒక యోగముగా చెప్పబడినది. అందులకు కారణమా విషయము సాక్షాత్తుగనో పరంపరగనో ప్రధాన మోక్షోపాయముతో సంబంధించి యుండుటయే. ఈ కారణములచే నిది యోగశాస్త్ర మనబడుచున్నది.

9. ప్ర. ఉభయసేనలయందలి ప్రథమ సేనా నాయకుల పేర్లును ప్రధాన వీరుల పేర్లును ఏవి?

ఉ. పాండవ సేనకు సేనా నాయకుడు ధృష్టద్యుమ్నుడు. కౌరవసేనకు భీష్మాచార్యులు (1 అధ్యా. 3 శ్లో. 11, 12 శ్లో.)

పాండవసేనకు పాండవులైదుగురును, భీమార్జునులతో సమాను లగు సాత్యకి, విరాటుడు, ద్రుపదుడు, ధృష్టకేతువు, చేకితానుడు, కాశీరాజు, పురుజిత్తు, కుంతిని పెంచిన కుంతిభోజుడు, శైబ్యుడు, యుధామన్యువు, ఉత్తమౌజుడు, అర్జునుని కుమారుడగు అభిమన్యుడు, పరాక్రమవంతులైన ధర్మరాజాదులైదుగురి వలన ద్రౌపదికి జన్మించిన ప్రతివింధ్యుడు,

శ్రుతసోముడు, శ్రుతకీర్తి, శతానీకుడు, శ్రుతసేనుడు అనబడు ఐదుగురు ఉపపాండవులను మొదలగువారు ప్రధాన వీరులు. (1 అధ్యా 4, 5, 6, శ్లో.) కౌరవ సేనకు ద్రోణుడు, భీష్ముడు, కర్ణుడు, ద్రోణుని బావమరిదియగు కృపుడు, ద్రోణుని కుమారుడగు అశ్వత్థామ, దుర్యోధనుని తమ్ముడగు వికర్ణుడు, సోమదత్తుని సుతుడగు భూరిశ్రవుడు, దుర్యోధనుని బావమరిదియగు సైంధవుడను నామాంతరము గల జయద్రథుడు మొదలగువారు ప్రధానవీరులు. (1 అధ్యా 7, 8, 9 శ్లో)

10.ప్ర. **భీష్మాచార్యు లేల సింహనాదమును జేసి శంఖమును పూరించెను :**

ఉ. దుర్యోధనుడు పాండవసేనను, సేనానాయకుని, భీమార్జునులను, ఇతరులనేక ప్రధాన వీరులను చూచి వారిని గెలుచుటకు తన సేన చాలదని భయపడి తన ప్రధాన యోధులనందరను తమ తమ స్థానములు తప్పక నిలిచి భీష్ముని కాపాడమని ద్రోణాచార్యులతో పలికి దుఃఖించెను. అందుచే భీష్ముడాతనికి ధైర్యమును, ఆనందమును కలిగించుటకుగాను సింహనాదమును గావించి శంఖమును పూరించెను. (1 అధ్యా-10, 11, 12 శ్లో.)

11.ప్ర. **ఉభయ సేనా పరిమాణమేమి? దుర్యోధనుడేల తన సేన అపర్యాప్తమనియు పాండవసేన పర్యాప్తమనియు చెప్పెను.**

ఉ. కౌరవ సేన 11 అక్షౌహిణీలును, పాండవసేన 7 అక్షౌహిణీలును కలదు.

పాండవసేన ద్రోణాచార్యుని శిష్యుడగు బుద్ధిమంతుడైన ధృష్టద్యుమ్నునిచే మిక్కిలి నేర్పుతో వ్యూహముగా పన్నబడి యుండుటచే అపరిమితముగా కాన్పించెను. పాండవసేనయందు భీమార్జునులతో సమాన బలాఢ్యులగు యిరువది మంది ప్రధాన వీరులు కలరు. కౌరవులలో నొక్కనిని మిగులకుండ నాశనము చేతునని భయంకర ప్రతిన గావించిన భీమునిచే పాండవసేన సంరక్షింపబడుచున్నది.

తన సేన యన్ననో స్వచ్ఛంద మరణము గల (తన యిష్టము వచ్చినప్పుడే చనిపోవుటకు శక్తి గల) భీష్మునిచే కాపాడబడుచున్నను ఆతనిని చంపు ఉపాయము పాండవులకు తెలిసియుండవచ్చును, మరియు భీష్ముడు, పాండవులను చంపనని శపథము చేసియే సేనాధిపతి అయ్యెను. కౌరవపక్షమున ఏడుగురు మాత్రమే ప్రధాన వీరులుగా దుర్యోధనునకు

గోచరించిరి. మిగిలిన వారందరును లెక్కకు గాన్పించినను చచ్చుటకు సిద్ధమైనవారేగాని పాండవులను గెలుచుటకు నేర్పు కలవారు కారు. ద్రోణాచార్యుడైనను పాండవ పక్షపాతియే. ఈ కారణముల నన్నిటిని గాంచి దుఃఖితుడై దుర్యోధనుడు తన సేన పాండవులను గెలుచుటకు చాలదనియు, పాండవసేన తమను గెల్చుటకు చాలుననియు ద్రోణాచార్యులతో విన్నవించుకొనెను.

(1 అధ్యా. 8 శ్లో. మొదలు 10 శ్లో. వ)

12.ప్ర. శ్రీకృష్ణుడు భారత యుద్ధములో నెట్టి పాత్రను పరిగ్రహించెను?

ఉ. శ్రీకృష్ణుడు పాండవులలో ప్రధాన వీరుడైనట్టి అర్జునునకు సారథి యయ్యెను. (1 అధ్యా. 14, 21 శ్లో.)

మరియు అర్జునుడు ఉభయ సేనలయందలి ఆచార్య బంధు మిత్రాదులను చూచి అప్పటికి తగని స్నేహము, జాలి మొదలగు వానిచే తన స్వభావమును గోల్పోయి క్షత్రియులకు పరమనిశ్శ్రేయససాధనమైన ధర్మయుద్ధమును అధర్మమని తలంచి యుద్ధ విముఖుడై ఏడ్చుచు తన కర్తవ్యము నెఱుంగగోరి శ్రీకృష్ణుని పాదములపై బడి ప్రార్థించగా నీతనికి ఆత్మయొక్క వాస్తవ స్వరూపమును, ఫలసంగకర్తృత్వములను విడిచి చేసిన ధర్మయుద్ధము మోక్షసాధనమనియు బోధించినగాని ఈతని యజ్ఞానము తొలంగదని నిశ్చయించి ఆ ఉపదేశమున కాతని సుముఖుని గావించుటకై యాతని దుఃఖము ఆర్యులచే నాదరింపదగినది కాదనియు, పరలోక విరోధియనియు, అపకీర్తిపాలు గావించునదియనియు, ఆక్షేపించి అందుల కనుకూలమగు గీతోపదేశమును 'నత్వేవాహం' అను శ్లోకముతో ప్రారంభించి 'సర్వధర్మాన్' అను శ్లోకము వరకు గావించి ఆచార్య పాత్రను కూడ వహించెను.

(2 అ. 9, 10 శ్లో. భాష్యం)

13.ప్ర. పాండవులైదుగురి యొక్కయు, శ్రీకృష్ణునియొక్కయు శంఖముల పేరులెవ్వి?

ఉ. ధర్మరాజు యొక్క శంఖము అనంత విజయము. (అపార విజయము నొసంగునది)

భీముని శంఖము - పౌండ్రము (వినిన వారి చెవులను చించు ధ్వని కలది.)

అర్జునుని శంఖము-దేవదత్తము. (నివాత కవచుల చంపుటకై దేవతలచే నీయబడినది).

నకులుని శంఖము - సుఘోషము. (ఇంపుగా ధ్వనించునది)

సహదేవుని శంఖము - మణిపుష్పకము (మాణిక్యముల గుత్తిచే నలంకరింపబడినది).

శ్రీకృష్ణుని శంఖము - పాంచజన్యము. సముద్రమున చంపబడి తిమిరూపుడైన
పంచజనుడను రాక్షసుని యెముకచే నిర్మింపబడినది.

(1 అ. 14-15-16 శ్లో.)

14.ప్ర. యుద్ధమునకు సన్నద్ధుడై వచ్చిన అర్జునుడు హఠాత్తుగా యుద్ధవిముఖుడగుటకు కారణము లెవ్వి?

ఉ. అర్జునుడు శ్రీకృష్ణునితో ఉభయసేనల మధ్య యందు తన రథమును నిలుపుమని చెప్పి, అతడట్లు గావింపగా తన ఆచార్య బంధుమిత్రాదుల జూచి స్నేహము జాలి మొదలగు గుణములకు గురియయ్యెను. వారినందరను చంపుట ఘోరనరకమును పొందించు ప్రబలమైన పాపముగా భావించెను. ధర్మము నశించి వర్ణసాంకర్య మేర్పడునని భీతిల్లెను.

అవయవములు శిథిలము కాజొచ్చెను. నోరు ఆర్చుకొని పోయెను. శరీరమంతయు వణకదొడంగెను. దేహమంతయు గగుర్పొడిచెను. గాండీవము చేతి నుండి జారిపోయెను. నఖశిఖ పర్యంతము తాపముదయించెను. మనస్సు భ్రమించెను. నిలువజాలకపోయెను. ఇట్లెన్నియో అపశకునములు గోచరించెను. ఈ కారణములచే నర్జునుడు హఠాత్తుగా యుద్ధ విముఖుడయ్యెను.

(1 అధ్యా. 21 మొ 30 శ్లో. వరకు)

15. ప్ర. సంజయుడు భగవద్గీతను ధృతరాష్ట్రునకెట్లు చెప్పగల్గెను?

ఉ. వ్యాసమహర్షి కన్ను లిచ్చినను ధృతరాష్ట్రుడు యుద్ధమును చూడజాలననెను. అందువలన వ్యాసమహర్షి అతనికి యుద్ధవార్తల నెల్ల జెప్పుటకై సంజయునకు చూడకున్నను వినకున్నను అన్నిటిని చూచునట్టియు వినునట్టియు శక్తి గల దివ్యచక్షుస్సును దివ్యశ్రోతస్సును ప్రసాదించి యుద్ధ వార్తలనెల్ల నాతనికి పూసగ్రుచ్చినట్లు చెప్పుట కాజ్ఞాపించెను. కావున ధృతరాష్ట్రుడు సంజయునే ప్రశ్నించుటయు ఆతడే చెప్పగల్గుటయు తటస్థించెను.

16. ప్ర. అర్జునుడు శంకించిన యుద్ధానర్థముల క్రమమెద్ది?

ఉ. యుద్ధమున ధర్మముల బోధించియు అనుష్ఠించియు కాపాడు పెద్దలందరును నశింతురు. దానిచే ననాదియగు కులధర్మములు నశించును. ఆ స్థానమును అధర్మ మాక్రమించును. అందు మూలమున కులస్త్రీలు చెడుదురు. దానిచే వర్ణ సాంకర్యమేర్పడును. ఈ సాంకర్యము దాని కర్తలకేగాక ఆ వంశస్థు లందరకును నరకమునకు కారణమగును. అట్టి పాపాత్ములొసంగెడు శ్రాద్ధములయందలి పిండములుగాని తిలతర్పణములుగాని వారి పితరులకు ముట్టక వారు అధఃపతితులగుదురు. ఈ వర్ణ సంకర కారకులకు శాశ్వతమగు నరకవాసమును శాస్త్రము విధించుచున్నది. అని యిట్టి యనర్థముల నర్జునుడు శంకించెను. (1 అధ్యా. 40 శ్లో. మొదలు 45 వరకు)

17. ప్ర. మొదటి అధ్యాయమునకు ప్రధాన శాస్త్రముతో గల సంబంధమేమి.

ఉ. 3వ ప్రశ్నోత్తరమునే దీనికిని ఉత్తరముగా కొంచెము మార్పుతో అనుసంధించవలెను.

18. ప్ర. ప్రథమాధ్యాయము నందలి ముఖ్య విషయము లేవి?

ఉ. 1. దుర్యోధనుని అధైర్యమెఱింగి భీష్మాచార్యులాతనికి ధైర్యమును చెప్పి ప్రోత్సహించుట.
2. పాండవ సేనయందలి ప్రధాన వీరుల శంఖానినాదములు
3. అర్జునుడు ఉభయ సేనల వీరులను పరిశీలించుట
4. అర్జునుని విషాదము, నిర్వేదము
5. అర్జునుడు యుద్ధానర్థములను క్రమముగ పేర్కొనుట
6. అర్జునుని యుద్ధ విరామ నిశ్చయము

19. ప్ర. శాస్త్ర సారమగు అర్థమంతయు సంగ్రహముగా ప్రథమాధ్యాయము నందలి ఏ శ్లోకమున నెట్లు తెలుపబడెను?

ఉ. ముముక్షువగు చేతనుడగు జీవునికి తన కర్తవ్యమును బోధించునది ఈ గీతాశాస్త్రము. ఇదే విషయము ప్రణవముచే బోధింపబడు చున్నది. కావున గీతా శాస్త్రమును ప్రణవమును సమానార్థకములని విశ్వసించవలెను. ప్రణవమున మకారవాచ్యుడగు జీవుడు అకారవాచ్యుడగు సర్వేశ్వరునకే ప్రీతిరూపముగా తన విధ్యుక్తకార్యములను కైంకర్య రూపముగా నాచరింపవలెనని

చెప్పబడుచున్నది. గీతయందును ప్రతి మానవుడును తన విధ్యుక్త ధర్మములను తనకొక ఫలమును కోరక భగవదర్పణ బుద్ధితో నాచరింపవలెనని బోధింపబడుచున్నది.

ఈ యర్థము "తతశ్శ్వేతైర్హయైర్యుక్తే ... " అను 14వ శ్లోకముచే సంగ్రహముగా ప్రకటింపబడుచున్నది.

తెల్లని గుర్రములనగా పురుషులచే వ్రాయబడిన గ్రంథములకుండెడు భ్రమ-ప్రమాదము-మోసము-అశక్తి యనెడు దోషములులేని నాలుగు వేదములు. వాటితోకూడిన గొప్ప రథమనగా అందలి యర్థముల నెల్ల సులభముగను నిర్దుష్టముగను చెప్పెడు పురుషులు రచించిన ప్రబంధములకంటె పురుషోత్తముడు రచించినదగుటచే నుత్కృష్టతమమగు గీతాశాస్త్రము. (గమనార్థ ధాతువులన్నియు జ్ఞానార్థకములగునని న్యాయము). దానియందు శిష్యాచార్య రూపముగనుండిన కృష్ణార్జునులు ఆకారము చేతను లక్షణచేతను ప్రణవమే అర్థముగా గల శంఖమును పూరించిరి. అనగా ప్రణవార్థములను లోకాంతర కాలాంతర పురుషులు గూడ నిరంతరము తనివితీర యనుభవించ దగినంత దృఢముగ నిరూపించిరి అని ఈ శ్లోకముచే ధ్వనించు శాస్త్ర సారార్థ సంగ్రహము.

ద్వితీయాధ్యాయార్థ సంగ్రహము

శ్లో. నిత్యాత్మాఽసఙ్గకర్మేహా । గోచరా సాఙ్ఖ్యయోగధీః ॥
ద్వితీయే స్థిత ధీలక్షా । ప్రోక్తా తన్మోహశాన్తయే ।

తా॥ ఆత్మ నిత్యమనెడు జ్ఞానమునకు సాంఖ్యబుద్ధియని పేరు. కర్మ యోగాధికారికి మునుముందీ జ్ఞానముండవలెను. పిమ్మట ఫలసంగరహితమగు కర్మానుష్ఠాన ముండవలెను. ఇట్టి కర్మానుష్ఠానమును గురించిన బుద్ధికి యోగబుద్ధియని పేరు. దీనిచే "స్థిత ప్రజ్ఞ" యనెడు జ్ఞానయోగము సిద్ధించును. అర్జునుని మోహశాంతికై యీ యధ్యాయమున నీ యోగబుద్ధి చెప్పబడెను.

శ్రీమద్భగవద్గీతా - ద్వితీయాధ్యాయము

విషయ సూచిక

అస్మద్గురుభ్యో నమః

శ్రీ భగవద్గీతా - ద్వితీయోఽధ్యాయః

సాఙ్ఖ్య యోగః

సఞ్జయ ఉవాచ

సంజయుడు తెలుపుచున్నాడు.

1\. శ్లో. తం తథా కృపయావిష్టం । అశ్రుపూర్ణాకులేక్షణమ్ ।
విషీదన్త మిదం వాక్యం । ఉవాచ మధుసూదనః ॥

అర్థము : తథా = ఆ విధముగా, కృపయా = కనికరముచే, ఆవిష్టం = ఆవేశింపబడినవాడున్ను, అశ్రుపూర్ణాకులేక్షణమ్ = కన్నీటితో నిండి వ్యాకులములైన నేత్రములు కలవాడునునై, విషీదన్తం = దుఃఖించుచున్న, తం = ఆ అర్జునుని గూర్చి, మధుసూదనః = శ్రీకృష్ణుడు, ఇదం=ఈ(చెప్పబోవునట్టి), వాక్యం=వాక్యమును, ఉవాచ = పలికెను.

తా ॥ ఈ విధముగా కనికరముచే నావేశింపబడినవాడై మిక్కిలి కన్నీరు గార్చుచు దుఃఖించుచున్న అర్జునుని గూర్చి శ్రీకృష్ణ డిటుల పలికెను.

అవ. శ్రీకృష్ణ డర్జునుని ఓదార్చుచున్నాడు.

శ్రీ భగవానువాచ

2\. శ్లో. కుత స్త్వా కశ్మల మిదం । విషమే సముపస్థితమ్ ।
అనార్యజుష్ట మస్వర్గ్యం । అకీర్తికర మర్జున! ॥

అర్థము : అర్జున = ఓ అర్జునా! అనార్యజుష్టం = ఆత్మనెరుగని వారిచే నవలంబింపబడునట్టియు, అస్వర్గ్యం = పరలోకమునకు విరోధియు, అకీర్తికరం= అపకీర్తిని కలిగించునదియునగు, ఇదం = ఈ, కశ్మలం=దుఃఖము, విషమే=సంకట సమయమున, కుతః = ఎట్లుగా, త్వా=నిన్ను, సముపస్థితమ్=ఆవేశించినది.

తా ॥ ఓ అర్జునా । శరీరాత్మ వివేకము లేనివారిచే నవలంబింపబడునట్టియు, పరలోక ప్రాప్తికి విరోధకరమైనట్టియు, అపకీర్తిని కలిగించునట్టియు ఈ దుఃఖము ఏ విధముగా నీకు దాపరించినదోయి?

3. శ్లో. క్లైబ్యం మాస్మగమః పార్థ । నైతత్త్వయ్యుపపద్యతే ।
క్షుద్రం హృదయ దౌర్బల్యం । త్యక్త్వోత్తిష్ఠ పరంతప! ॥

అర్థము : పార్థ = ఓ అర్జునా! క్లైబ్యం = దైన్యమును, మాస్మ గమః = పొందకుము, ఏతత్ = ఈదైన్యము, త్వయి = నీయందు, న ఉపపద్యతే = తగదు, పరంతప!= శత్రు తాపకుడవైన ఓ అర్జునా! క్షుద్రం = నీచమైన, హృదయ దౌర్బల్యం = మానసిక దుర్బలత్వమును, త్యక్త్వా = విడిచి, ఉత్తిష్ఠ = లెమ్ము.

తా ॥ ఓ అర్జునా ! దైన్యమును చెందకుము. ఈ దైన్యము నీకు తగదు. నీవు శత్రువుల దపింపజేయువాడవు. ఈ మానసిక దుర్బలత్వమును విడిచి కర్తవ్యాచరణకై లెమ్ము.

అవ. అర్జునుడు తిరిగి తన నిర్వేదము నుగ్గడించుచున్నాడు

అర్జున ఉవాచ

4. శ్లో. కథం భీష్మ మహం సఙ్ఖ్యే । ద్రోణం చ మధుసూదన! ।
ఇషుభిః ప్రతియోత్స్యామి । పూజార్హావరిసూదన! ॥

అర్థము : అరిసూదన = ఓ శత్రుసంహారకా !, మధుసూదన = ఓ కృష్ణా!, పూజార్హౌ= పూజించదగిన, భీష్మం = భీష్ముని, ద్రోణం చ = ద్రోణుని, అహం = నేను, సఙ్ఖ్యే= యుద్ధమున, ఇషుభిః = బాణములచే, కథం = ఎట్లుగా, ప్రతియోత్స్యామి = ఎదుర్కొని యుద్ధము చేయ గలను?

తా ॥ ఆశ్రితుల శత్రువులను సంహరించు ఓ శ్రీకృష్ణా ! పూజించవలసిన భీష్మ ద్రోణాదులతో నేను యుద్ధమున బాణములతో నెటుల ఎదురు యుద్ధము చేయుదును?

5. శ్లో. గురూనహత్వా హి మహానుభావాన్। శ్రేయో భోక్తుం భైక్ష మపీహ లోకే ।
హత్వార్థ కామాంస్తు గురూనిహైవ। భుఞ్జీయ భోగాన్ రుధిర ప్రదిగ్ధాన్॥

అర్థము : మహానుభావాన్ = గొప్పవారైన, గురూన్ = పెద్దలను, అహత్వా= చంపకుండగ, ఇహ = ఈ, లోకే = లోకమున, భైక్షం అపి = బిచ్చమెత్తిన దానినైనను, భోక్తుం= అనుభవించుట, శ్రేయఃహి = శ్రేయస్కరమైనదిగదా !, అర్థ కామాన్ = భోగార్థములను గోరు, గురూన్ = పెద్దలను, హత్వాతు = సంహరించియైతే, ఇహ ఏవ = ఇచ్చటనే, రుధిర ప్రదిగ్ధాన్ = వారి రక్తముచే పూయబడియుండు, భోగాన్ = భోగములను, కథం = ఎట్లుగా, భుఞ్జీయ = అనుభవింతును.

తా ॥ గొప్పవారలైన పెద్దలను చంపకుండగ ఈ లోకములో బిచ్చమెత్తుకొని జీవించుట మంచిది. భోగార్థములను కోరు గురువులను చంపి ఇచ్చట వారి రక్తసిక్తములగు భోగముల నే నెట్లనుభవింతును?

6. శ్లో. న చైత ద్విద్మః కతర న్నో గరీయో
యద్వా జయేమ యది వా నో జయేయుః ।
యానేవ హత్వా న జిజీవిషామః
తేఽవస్థితాః ప్రముఖే ధార్తరాష్ట్రాః ॥

అర్థము : నః = మనకు, కతరత్ = ఏది, గరీయః = శ్రేష్ఠమైనదో, ఏతత్ = దీనిని, న విద్మః= తెలుసుకొనలేకున్నాము, జయేమ యద్వా = మనమే జయింతుమో ? వా = లేక, నః = మనలను, జయేయుః యదివా = వారే జయింతురో ? యాన్ = ఎవరిని, హత్వా = చంపి, న జిజీవిషామః = జీవించ కోరమో, తే = అట్టి, ధార్తరాష్ట్రాః ఏవ= దుర్యోధనాదులే, ప్రముఖే = ఎదుట, అవస్థితాః = వచ్చి నిలచియున్నారు.

తా ॥ మనకు యుద్ధముచేయుట మంచిదియో, మానుట మంచిదియో తెలుసు కొనజాలకున్నాము. మనమే వారిని జయింతుమో, వారే మనల జయింతురో ఎరుంగజాలము. ☆ ఎవరిని చంపినచో మనము జీవించ నిచ్ఛగించమో అట్టి దుర్యోధనాదులు ఎదుటవచ్చి నిలిచియున్నారు.

7. శ్లో. కార్పణ్యదోషోపహతస్వభావః
పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢచేతాః ।
యచ్ఛ్రేయ స్స్యా న్నిశ్చితం బ్రూహి తన్మే
శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్ ॥

☆ దుర్యోధనాదులచే నతి ఘోరములైన లక్క యిల్లు కాల్చుట మొదలగు ఆతతాయి కృత్యములచేతను, నిండు సభలో తమ ఎదుట తమ భార్య నవమానించుట మొదలైన అమానుష కృత్యముల చేతను మాటిమాటికి వంచింపబడియున్న వాడై " ఎవరిని చంపనిచో మనము జీవించ నిచ్ఛగించమో" యనుటకు బదులు యిట్లనుట యర్జునుని విశాలహృదయత్వమును, పరమ కారుణికత్వమును, దీర్ఘ బంధుత్వమును, పరమ ధార్మికత్వమును చాటుచున్నది. ఇట్టి యోగ్యత కలవాడు గనుకనే సర్వగుహ్యతమమగు చరమశ్లోకోపదేశమునకు పాత్రుడయ్యెను.

☆ కార్పణ్యం – (1) విడువవలసిన దానిని విడువకుండుట (2) దయను పుట్టించు దీన వృత్తి (3) ఆత్మ వివేకము లేనివాడు అని యర్థములు.

ఈ శ్లోకమున శరణాగతుని యనుష్ఠానము శిక్షింపబడుచున్నది. ఆకించిన్య అనన్య గతిత్వముల దెలుపుచు, పరమవిశ్వాసముతో ఆత్మోజ్జీవన సాధనమునకై పాదములపై నొరగుటయే కర్తవ్యమని 'న గరువిష్ఠోఽస్మి .....' యనెడు ఆళ్వందారుల శ్రీసూక్తి తెలుపుచున్నది గదా !

అర్థము : కార్పణ్య దోషోపహత స్వభావః, కార్పణ్య = మనోదైన్యము అనెడు, దోష = దోషముచేత, ఉపహత = పోగొట్టబడిన, స్వభావః =ధైర్యము గలవాడనై, ధర్మ సమ్మూఢ చేతాః = ధర్మమునందు సందిగ్ధమైన మనస్సు గలవాడనై, త్వాం = నిన్ను, పృచ్ఛామి = అడుగుచున్నాను, యత్ = ఏది, శ్రేయః = శ్రేయస్కరమైనదిగ, నిశ్చితం = నిర్ణయింపబడినది, స్యాత్ = అగునో, తత్ = అట్టిదానిని, మే = నాకు, బ్రూహి = తెలుపుమా, అహం = నేను, తే = నీకు, శిష్యః = శిష్యుడను, త్వాం = నిన్ను, ప్రపన్నం = శరణుజొచ్చిన, మాం = నన్ను, శాధి = శాసించుమా.

తా ॥ మనోదైన్యము అనెడు దోషముచేత ధైర్యములేని వాడనై, ధర్మ నిర్ణయ విషయమున సందిగ్ధచేతస్కుడనై నిన్ను అడుగుచున్నాను. ఏది మంచిగ నిర్ణయింపబడినదో దానిని నాకు తెలుపుము. నేను నీకు శిష్యుడను. నిన్ను శరణుజొచ్చిన నన్ను ఆజ్ఞాపించుము.

8. శ్లో. **నహి ప్రపశ్యామి మమాపనుద్యాత్**
యచ్ఛోక ముచ్ఛోషణ మిన్ద్రియాణామ్ ।
అవాప్య భూమా వసపత్న మృద్ధం
రాజ్యం సురాణా మపి చాఽధిపత్యమ్ ॥

అర్థము : భూమౌ = భూమియందు, అసపత్నం = శత్రురహితమైన, ఋద్ధం = సమృద్ధమైన, రాజ్యం = రాజ్యమును, సురాణాం = దేవతల యొక్క, ఆధిపత్యంచ = అధికారమునున్ను, అవాప్య అపి = పొందినప్పటికిన్ని, ఇంద్రియాణాం = ఇంద్రియములకు, ఉచ్ఛోషణం = అధిక సంతాపకరమైన, మమ = నాయొక్క, శోకం = దుఃఖమును, యత్ = ఏది, అపనుద్యాత్ = పోగొట్టునో, తత్ = దానిని, న ప్రపశ్యామి = చూడజాలకున్నాను.

తా ॥ నిష్కంటకమై సమృద్ధమైన భూమియందలి రాజ్యమును, దేవతాధిపత్యమును పొందినప్పటికిన్నీ ఇంద్రియముల శోషింపజేయుచున్న నా దుఃఖమును ఏది నశింపజేయగలదో అట్టి దానిని తెలుసుకొనజాలకున్నాను.

అవ. అర్జునుడు శ్రీకృష్ణునకు తిరిగి తన నిశ్చయమును వినిపించుచున్నాడు.

సఞ్జయ ఉవాచ.

9. శ్లో. **ఏవ ముక్త్వా హృషీకేశం । గుడాకేశః పరన్తపః ।**
న యోత్స్య ఇతి గోవిన్ద । ముక్త్వా తూష్ణీం బభూవ హ ॥

అర్థము : పరంతపః = శత్రువులను తపింపజేయు, గుడాకేశః = అర్జునుడు, హృషీకేశం = శ్రీకృష్ణుని గూర్చి, ఏవం = ఈ విధముగ, ఉక్త్వా = పలికి, న యోత్స్యే =

యుద్ధమును చేయను, ఇతి = అని, గోవిందం = శ్రీకృష్ణుని గూర్చి, ఉక్త్వా = చెప్పి, తూష్ణీం బభూవ = ఊరకుండెను. హ = ఆశ్చర్యము.

తా ॥ శత్రు సంహారకుడైన అర్జునుడు శ్రీకృష్ణునిగూర్చి యిటుల పలికి నేను యుద్ధమును చేయను అని శ్రీకృష్ణునికి చెప్పి ఊరకుండెను. ఆహా ! ఎంత బంధుప్రేమ ! ఎంత భూతదయ !

10. శ్లో. తమువాచ హృషీకేశః। ప్రహసన్నివ భారత! ।
సేనయో రుభయో ర్మధ్యే । విషీదన్త మిదం వచః ॥

అర్థము : భారత = ఓ ధృతరాష్ట్రా ! హృషీకేశః = శ్రీకృష్ణుడు, ఉభయోః = రెండైన, సేనయోః = సేనలయొక్క, మధ్యే = మధ్యమందు, విషీదన్తం = దుఃఖించుచున్న, తం = ఆ యర్జునుని గూర్చి, ప్రహసన్ ఇవ = పరిహాస వాక్యములను పలుకుచున్న వానివలె, ఇదం = ఈ (చెప్పబోవు) , వచః = వాక్యమును, ఉవాచ = పలికెను.

తా ॥ ఓ ధృతరాష్ట్ర! శ్రీకృష్ణుడు రెండు సేనల మధ్యయందు దుఃఖించుచున్న ఆ యర్జునునిగూర్చి పరిహాస వాక్యములను పలుకుచున్న వానివలె చెప్పబోవు గీతాశాస్త్ర రూపమగు వాక్యము పలికెను.

శ్రీ భగవాన్ ఉవాచ :

11. శ్లో. అశోచ్యా నన్వశోచస్త్వం । ప్రజ్ఞావాదాం శ్చ భాషసే ।
గతాసూ నగతాసూం శ్చ । నానుశోచన్తి పణ్డితాః ॥

అర్థము : త్వం = నీవు, అశోచ్యాన్ = దుఖింపతగనివారిని గూర్చి, అన్వ శోచః = దుఃఖించితివి, ప్రజ్ఞావాదాన్ చ = జ్ఞానాధికులు పలుకు మాటలను, భాషసే = పలుకుచున్నావు, పణ్డితాః = జ్ఞానవంతులు, గతాసూన్ = శరీరములను గూర్చిగాని, అగతాసూన్ చ = ఆత్మలను గూర్చిగాని, న అనుశోచన్తి = దుఃఖించరు.

తా ॥ నీవు దుఃఖించ తగని వారినిగూర్చి దుఃఖించుచున్నావు. జ్ఞానాధికులు పలుకు మాటలను పలుకుచున్నావు. ఆత్మ-అనాత్మ వివేకముగల జ్ఞానాధికులు అనిత్యములైన శరీరములను గురించిగాని, నిత్యములైన ఆత్మలను గురించిగాని దుఃఖించరు.

గీతాశాస్త్ర మీశ్లోకము నుండి ప్రారంభమగుచున్నది

శ్రీకృష్ణ డర్జునునకు కర్మయోగమునకు ప్రధానాంగమగు జీవాత్మతత్త్వము నుపదేశించుచున్నాడుః

12. శ్లో. న త్వే వాహం జాతు నాసం । న త్వం నేమే జనాధిపాః ।
నచైవ న భవిష్యామః । సర్వే వయ మతఃపరమ్ ॥

అర్థము : అహం = నేను, జాతు = ఒకప్పుడును, న ఆసం = లేకుంటిని, (ఇతి) తు = అనునదైతే, న ఏవ = లేనేలేదు, త్వం = నీవు, న (ఆసీః) = లేకుంటివి, ఇతి = అనునది, న = లేదు, ఇమే = ఈ, జనాధిపాః = రాజులు, న ఆసన్ = లేకుండిరి, ఇతి = అనునది, న = లేదు, వయం = మనము, సర్వే = అందరముః అతఃపరం = ఇకముందు, న భవిష్యామః = ఉండబోము, ఇతి చ = అనునదియు, న= లేదు.

తా ॥ నేను ఇదివరలో ఒకప్పుడును లేను అనునది లేదు. నీవు లేవు అనునది లేదు. ఈ రాజులు లేరు అనునది లేదు. మనమందరము ఇకముందు ఉండము అనునదియు లేదు. అనగా సర్వేశ్వరుడు నిత్యమగునట్లు సమస్త జీవులును నిత్యమే యని భావము.

విశే : దీన వృత్తితో శరణాగతుడగు నర్జునునకు దయామయుడగు సర్వేశ్వరుడు తత్త్వము నుపదేశించుటలో నీవు-నేను అనుటచే ఆత్మలకు పరమాత్మతోను, నీవును యీ రాజులున్ను అనుటచే తమలో తమకున్ను సత్యమగు భేదము కలదని యీ శ్లోకముచే స్ఫుటముగా సూచింపబడినది.

అవ. శ్రీకృష్ణుడు ఆత్మకు పుట్టుట, గిట్టుట మొదలగు అవస్థలను దృష్టాంతముతో సమర్థించుచున్నాడు

13. శ్లో. దేహినో ఽస్మిన్ యథా దేహే । కౌమారం యౌవనం జరా ।
తథా దేహాన్తరప్రాప్తిః । ధీర స్తత్ర న ముహ్యతి ।

అర్థము : అస్మిన్ = ఈ , దేహే = దేహమున, దేహినః = ఆత్మకు, యథా = ఏ విధముగా కౌమారం = బాల్యము, యౌవనం = యౌవనము, జరా = ముసలితనము, భవన్తిః కలుగుచున్నవో, తథా = ఆ విధముగనే, దేహాన్తరప్రాప్తిః = మరియొక దేహమున పొందుటయు, భవతి = కలుగుచున్నది, తత్ర = ఇట్టి విషయమున, ధీరః : బుద్ధిమంతుడు, నముహ్యతి = మోహమును చెందడు.

తా ॥ శరీరమునందున్న ఆత్మకు బాల్యావస్థ, యౌవనావస్థ, వృద్ధావస్థ కలుగుచున్నట్లే మరియొక శరీరమును పొందుటయు తటస్థించుచున్నది. ఇట్టి విషయమున జ్ఞాని భ్రమను చెందడు.

అవ. శ్రీకృష్ణుడు అర్జునునకు ద్వంద్వములను సహించుమని విధించుచున్నాడు.

14. శ్లో. మాత్రాస్పర్శాస్తు కౌన్తేయ! । శీతోష్ణసుఖదుఃఖదాః ।
ఆగమాపాయినోఽనిత్యాః తాం స్తితిక్షస్వ భారత! ।

అర్థము : కౌన్తేయ = ఓ అర్జునా ! మాత్రాస్పర్శాః = శబ్దాది విషయములతో శ్రోత్రాది ఇంద్రియములకు గల సంబంధములు, శీతోష్ణ సుఖ దుఃఖ దాః = చలి, వేడి, సుఖము, దుఃఖము అనువానిని కలుగజేయునవి, ఆగమాపాయినః = వచ్చుచు పోవుచు నుండునవి, అనిత్యాః = శాశ్వతములైనవి కావు , భారత = ఓ అర్జునా! తాన్ = అట్టి వాటిని, తితిక్షస్వ = ఓర్చుకొనుము.

తా॥ ఓ అర్జునా ! పంచతన్మాత్రల వలన పుట్టిన శబ్దాది విషయములతో శ్రోత్రాది ఇంద్రియములకు గల సంబంధములు, శీతోష్ణములను, సుఖదుఃఖములను కలిగించునవి, అనిత్యము లైనవి గాన ఓ అర్జునా! అట్టి వాటిని ఓర్చుకొనుము.

అవ. అట్లు సహించుటవలన కలుగు ఫలమును వివరించుచున్నాడు.

15. శ్లో. యం హి న వ్యథయ న్త్యేతే । పురుషం పురుషర్షభ!
సమదుఃఖ సుఖం ధీరం । సో ఽమృతత్వాయ కల్పతే ।

అర్థము : పురుషర్షభ = పురుష శ్రేష్ఠుడ వైన ఓ అర్జునా! ఏతే = ఈ శీతోష్ణ సుఖదుఃఖాదులు, సమ-దుఃఖ-సుఖం = సుఖదుఃఖములయందు సమబుద్ధి గల, ధీరం = ధైర్యవంతుడైన, యం = ఏ, పురుషం = పురుషుని, న వ్యథయన్తి = బాధించవో, సః హి = అట్టి వాడే, అమృతత్వాయ= మోక్షము కొరకు, కల్పతే = తగినవాడగుచున్నాడు.

తా॥ పురుష శ్రేష్ఠుడ వైన ఓ అర్జునా! ఈ శీతోష్ణ సుఖ దుఃఖాదులు, వీటి యందు సమ బుద్ధి గల ఏ పురుషుని బాధించ జాలవో, అట్టి పురుషుడు మోక్షమునకు యోగ్యుడగుచున్నాడు.

అవ. దేహాత్మల సహజ స్వభావము నుపదేశించుచున్నాడు.

16. శ్లో. నా సతో విద్యతే భావో । నా ఽభావో విద్యతే సతః ।
ఉభయో రపి దృష్టోఽ న్త । స్త్వనయో స్తత్త్వదర్శిభిః ॥

అర్థము : అసతః = నశించునట్టి శరీరమునకు, భావః = శాశ్వతముగ ఉండుట, న విద్యతే :

లేదు, సతః = శాశ్వతముగనుండు జీవాత్మకు, అభావః= నాశము, న విద్యతే = లేదు, అనయోః= ఈ, ఉభయోః అపి = శరీర ఆత్మల రెండింటి యొక్కయున్ను, అన్తః= నిర్ణయము, తత్త్వ దర్శిభిః = తత్త్వవేత్తలచే, దృష్టః = చూడబడినది.

తా ॥ నశించు స్వభావము గల శరీరమునకు శాశ్వతమైన ఉనికి లేదు. శాశ్వతమైన జీవాత్మకు నాశము లేదు. ఈ రెండింటి యొక్కయు నిర్ణయమును తత్త్వవేత్తలు తెలుసు కొనుచున్నారు.

అవ. ఆత్మ నిత్యమనుటకు ముఖ్యకారణముల నుపదేశించుచున్నాడు.

17. శ్లో. అవినాశి తు తద్విద్ధి । యేన సర్వ మిదం తతమ్ ।
వినాశ మవ్యయ స్యాస్య । న కశ్చి త్కర్తు మర్హతి ।

అర్థముః యేన = ఏ ఆత్మ తత్త్వముచే, ఇదం = ఈ, సర్వం = సమస్త ప్రపంచము, తతం= వ్యాపించబడి యున్నదో, తత్ తు = అట్టి ఆత్మతత్త్వమునైతే, అవినాశి = నాశము లేని దానినిగా, విద్ధి = తెలుసు కొనుము, అవ్యయస్య = వినాశములేని, అస్య = ఈ ఆత్మ తత్త్వమునకు, వినాశం = వినాశమును, కర్తుం = చేయుటకు, కశ్చిత్= ఏదియు, న అర్హతి = తగినది కాదు.

తా ॥ ఏ ఆత్మ తత్వముచే ఈ సమస్త ప్రపంచము వ్యాపించబడి యున్నదో అట్టి ఆత్మతత్వము నాశనము లేనిదని తెలుసుకొనుము. వినాశ రహితమైన ఈ ఆత్మ తత్వమును ఏదియు నశింప జేయజాలదు.

అవ. దేహమునకు నశించుటయే స్వభావమని చెప్పుచున్నాడు.

18. శ్లో. అన్తవన్త ఇమే దేహాః । నిత్య స్యోక్తాః శ్శరీరిణః ।
అనాశినోఽ ప్రమేయస్య । తస్మా ద్యుధ్యస్వ భారత! ।

అర్థముః నిత్యస్య= నాశమున కనర్హమైనది కనుకనే, అనాశినః = నశించనట్టియు, అప్రమేయస్య= భోక్తగా తెలియబడు నట్టియు, శరీరిణః = ఆత్మ యొక్క, ఇమే = ఈ, దేహాః = దేహములు, అన్తవన్తః= నశించునట్టివిగా, ఉక్తాః = చెప్పబడినవి, తస్మాత్ = అందు వలన, భారత! = ఓ అర్జునా, యుధ్యస్వ = యుద్ధమును చేయుము.

తా ॥ ఓ అర్జునా ! ఆత్మ నాశనమునకు తగినది కాదు కావున నశించనిది. ఇది భోగ్యమగు శరీరమువలెగాక భోక్తగా తెలియబడునది. ఇట్టి ఆత్మను కలిగి యున్న ఈ దేహములు నశించునవని ప్రత్యక్షముగా తెలియుచునేయున్నది గాన (సంశయమును వదలి) యుద్ధమును చేయుము.

అవ. ఆత్మ నశించునని తలంచుట యవివేక మనుచున్నాడు.

19. శ్లో. య ఏనం వేత్తి హన్తారం । యశ్చైనం మన్యతే హతమ్ ।
ఉభౌ తౌ న విజానీతో । నాయం హన్తి న హన్యతే ॥

అర్థము : యః = ఎవడు, ఏనం = ఈ ఆత్మను గూర్చి, (కమపి = శస్త్రాది ఏ సాధనమునైనను) హన్తారం = చంపుదానినిగా, వేత్తి = తెలుసుకొనుచున్నాడో, యః చ = ఎవడైతే, ఏనం = ఈ ఆత్మను, హతం = చంపబడినదానినిగా, మన్యతే = తలచుచున్నాడో, తౌ = అట్టి, ఉభౌ = ఇద్దరును, న విజానీతః = చక్కగా తెలిసినవారు కారు, అయం= ఈ ఆత్మ, న హన్తి = చంపుటకు నిమిత్తము కాదు, న హన్యతే = చంపబడదు.

తా ॥ ఆత్మ నిత్యమైనదిగాన అట్టిదానిని నశింపజేయుటకు శస్త్రాదులు సాధనములని తలంచువాడును, ఏదో యొక సాధనముచే ఆత్మ నశించునదని తలచువాడును, ఈ ఇద్దరును ఆత్మయొక్క నిజస్వరూపము నెఱుంగనివారలే.

అవ. ఉపనిషచ్ఛాయగా ఆత్మకు దేహధర్మములను నిరసించుచున్నాడు.

20. శ్లో. న జాయతే మ్రియతే వా కదాచిత్
నా యం భూత్వా భవితా వా న భూయః ।
అజో నిత్య శ్శాశ్వతోఽయం పురాణో
న హన్యతే హన్యమానే శరీరే ॥

అర్థము : అయం = ఈ ఆత్మ, న జాయతే = పుట్టువాడునుకాడు, న మ్రియతే వా = చచ్చువాడునుకాడు, కదాచిత్ = ఒకప్పుడు, భూత్వా= పుట్టి, భూయః = తిరిగి, న భవితా వా న = లేకపోవువాడునుకాడు, అయం = ఈ ఆత్మ, అజః = పుట్టుకలేనివాడు, నిత్యః = త్రికాలములయందును ఉండువాడు, శాశ్వతః = స్థిరముగ నుండువాడు, పురాణః= ఎప్పుడును క్రొత్తగా అనుభవింపబడువాడు, శరీరే = (ఇతనుండు) దేహము, హన్యమానే (సత్యపి) = చంపబడుచున్నను, న హన్యతే = చంపబడడు.

తా ॥ ఈ ఆత్మపుట్టదు; చావదు; ఒకప్పుడు పుట్టి మరియొకప్పుడు లేకుండనుపోదు. ఈ ఆత్మ జన్మరహితమైనది; నాశ రహితమైనది; పరిణామ శూన్యమైనది. ఎప్పటికిని క్రొత్తగనే అనుభవనీయము. తానున్న శరీరము చంపబడినను తాను చంపబడదు.

అవ. ఆత్మను చంపుదునని తలంచువా డజ్ఞ డనుచున్నాడు.

21. శ్లో. వేదా వినాశినం నిత్యం । య ఏన మజ మవ్యయమ్ ।
కథం స పురుషః పార్థ! । కం ఘాతయతి హన్తి కమ్ ॥

అర్థము : పార్థ = ఓ అర్జునా! యః = ఎవడు, ఏనం = ఈ ఆత్మను, అవినాశినం = నాశనములేని వానినిగను, అజం = పుట్టుకలేని వానినిగను, అవ్యయం = స్థిరమైన వానినిగను, నిత్యం = త్రికాలముల యందుండువానినిగను, వేద = తెలుసుకొనుచున్నాడో, సః = ఆ, పురుషః = పురుషుడు, కథం = ఎట్లుగా, కం = ఏ ఆత్మను, ఘాతయతి= చంపించును ? కం = ఏ ఆత్మను, హన్తి = చంపును?

తా ॥ ఓ అర్జునా! ఎవడు ఈ ఆత్మను నాశరహి తునిగను, పుట్టుకలేనివానినిగను, స్థిరరూపునిగను, నిత్యునిగను తెలుసుకొనుచున్నాడో, అట్టి పురుషుడు ఏ ఆత్మను ఎటుల ఎవరిచే చంపించును? ఏ ఆత్మను తాను చంపగలుగును?

అవ. ఆనందించదగినదానిని గూర్చి దుఃఖించుట తగదనుచున్నాడు.

22. శ్లో. వాసాంసి జీర్ణాని యథా విహాయ । నవాని గృహ్ణాతి నరోఽపరాణి ।
తథా శరీరాణి విహాయ జీర్ణా, న్యన్యాని సంయాతి నవాని దేహీ ॥

అర్థము : నరః = నరుడు, యథా = ఏ విధముగా, జీర్ణాని = శిథిలములైన, వాసాంసి = వస్త్రములను, విహాయ = విడిచి, నవాని = క్రొత్తవియగు, అపరాణి = ఇతర వస్త్రములను, గృహ్ణాతి = స్వీకరించుచున్నాడో, తథా = అదేవిధముగ, దేహీ = జీవుడు, జీర్ణాని = శిథిలములైన, శరీరాణి = దేహములను, విహాయ = విడిచి, నవాని= క్రొత్తవియగు, అన్యాని = ఇతర దేహములను, సంయాతి = చక్కగ పొందుచున్నాడు.

తా ॥ మానవుడు శిథిలములైన వస్త్రాములను వదలి వేరగు క్రొత్తవస్త్రములను ధరించుచున్నటులనే ఈ జీవుడును శిథిలములగు ఈ శరీరములను విడిచి నూతనమైన ఇతర దేహములను పొందును.

అవ. ఆత్మ అన్నిటికంటె సూక్ష్మమై అంతటను వ్యాపించియుండుటచే నాశకములగు శస్త్రాదులు దీనిని నశింపచేయజాలవనుచున్నాడు.

23. శ్లో. నైనం ఛిన్దన్తి శస్త్రాణి । నైనం దహతి పావకః ।
న చైనం క్లేదయన్త్యాపో । న శోషయతి మారుతః ॥

అర్థము : ఏనం = ఈ జీవుని, శస్త్రాణి = ఆయుధములు, న ఛిన్దన్తి = నరుకలేవు, పావకః

అగ్ని, ఏనం = ఈ జీవుని, న దహతి = కాల్చజాలదు, ఏనం = ఈ జీవుని, ఆపః= ఉదకములు, న క్లేదయన్తి = తడుప జాలవు, మారుతః = వాయువు, న శోషయతి= ఆర్చివేయజాలదు.

తా ॥ ఈ జీవుని ఆయుధములు ఖండించ జాలవు ; అగ్ని కాల్చ జాలదు ; ఉదకములు తడుపజాలవు ; వాయువు ఆర్చి వేయజాలదు.

అవ. ఆత్మ నశించదగిన యోగ్యతలేనిదగుటచే నిది దేనిచేతను నశింపజేయబడ దనుచున్నాడు :

24. శ్లో. అచ్ఛేద్యోఽయ మదాహ్యోఽయ । మక్లేద్యోఽశోష్య ఏవచ ।
నిత్య స్సర్వగత స్థాణు । రచలోఽయం సనాతనః ॥

అర్థము : అయం = ఈ యాత్మ, అచ్ఛేద్యః = ఖండింపతగనిది, అయం = ఈ యాత్మ, అదాహ్యః = కాల్పతగనిదియు, అక్లేద్యః = తడప తగనిదియు, అశోష్య ఏవచ = ఆర్చివేయ తగనిదియు, (భవతి = అగుచున్నది.) అయం = ఈ ఆత్మ, నిత్యః= నిత్యమైనది, సర్వగతః = అంతటను వ్యాపించియున్నదై, స్థాణుః = స్థిరమైనది, అచలః = చలింపనిది, సనాతనః = పురాతనమైనది.

తా ॥ ఈ యాత్మ ఖండించుటకుగాని, కాల్చుటకుగాని, తడుపుటకుగాని, ఆర్చివేయు టకుగాని తగినదికాదు. ఏలనన ఇది నిత్యమై, అంతటను వ్యాపించియున్నదై, స్థిరమై, చలించనిదై, అనాదియై యున్నది.

అవ. ఇట్లు ఆత్మ నిత్యమగుటచే శోకము తగదను ఉపదేశమును విరమించుచున్నాడు.

25. శ్లో. అవ్యక్తోఽయ మచిన్త్యోఽయ । మవికార్యోఽయ ముచ్యతే ।
తస్మాదేవం విదిత్వైనం । నానుశోచితు మర్హసి ॥

అర్థము : అయం = ఈ ఆత్మ, అవ్యక్తః = అగోచరుడు, అయం = ఈ ఆత్మ, అచిన్త్యః = ఊహాతీతుడు, అయం = ఈ ఆత్మ, అవికార్యః = వికారముల చెందనివాడు (అని) ఉచ్యతే=చెప్పబడుచున్నాడు, తస్మాత్ = అందువలన, ఏనం=ఈ ఆత్మను, ఏవం= యిట్టివానినిగా, విదిత్వా=తెలుసుకొని, అనుశోచితుం=దుఃఖించుటకు న అర్హసి=తగవు.

తా ॥ ఈ ఆత్మ జ్ఞానేంద్రియములకు గోచరించడు ; మనస్సున కందడు; కర్మేంద్రియములచే వికారముల బొందింపబడడు అని చెప్పబడు చున్నాడు. గాన,ఇట్టివానినిగా తెలుసుకొని వీనిని గూర్చి నీవు దుఃఖించుట తగదు.

అవ. శరీరమునే యాత్మగా నంగీకరించినను ఈ దుఃఖము తగదనుచున్నాడు ;

26. శ్లో. అథ చైనం నిత్యజాతం । నిత్యం వా మన్యసే మృతమ్ ।
తథాపి త్వం మహాబాహో! నైవం శోచితు మర్హసి ॥

అర్థము : నిత్యజాతం = ఎప్పుడును పుట్టుచుండునట్టియు, నిత్యం = ఎప్పుడును, మృతం వా = నశించుచున్నట్టి దేహమును, ఏనం = ఈ ఆత్మనుగా, అథ మన్యసే = తలంతువేని, తథాపి = అట్లయినను, మహాబాహో = గొప్ప భుజములుగల ఓ అర్జునా!, త్వం = నీవు, ఏవం = ఈ విధముగా, శోచితుం = దుఃఖించుటకు, న అర్హసి = తగవు.

తా ॥ బాహుబలముగల ఓ అర్జునా ! ఎల్లప్పుడు పుట్టుచుండునట్టియు, ఎల్లప్పుడు నశించునట్టియు దేహమునే ఆత్మగా తలంతువా ? అటులైనను ఈ విధముగా నీవు దుఃఖించతగదు.

అవ. దానినే సమర్థించుచున్నాడు :

27. శ్లో. జాతస్య హి ధ్రువో మృత్యుః । ధ్రువం జన్మ మృతస్య చ ।
తస్మా దపరిహార్యే ఽ ర్థే । న త్వం శోచితు మర్హసి ॥

అర్థము : జాతస్య = పుట్టువానికి, మృత్యుః = నాశనము, ధ్రువః హి = నిశ్చయముకదా, మృతస్య = నశించువానికి, జన్మ చ = పుట్టుకయు, ధ్రువం = నిశ్చయము, తస్మాత్ = అందువలన, అపరిహార్యే = నివారింపబడజాలని, అర్థే = వికారము విషయమై, త్వం = నీవు, శోచితుం = దుఃఖించుటకు, న అర్హసి = తగవు.

తా ॥ పుట్టినవానికి చావు తప్పదు, చచ్చినవానికి పుట్టుక తప్పదు, గాన నివారించుటకు అవకాశము లేనిదాని విషయమై నీవు దుఃఖించుట తగదు.

28. శ్లో. అవ్యక్తాదీని భూతాని । వ్యక్తమధ్యాని భారత! ।
అవ్యక్తనిధనా న్యేవ । తత్ర కా పరిదేవనా ॥

అర్థము : భారత = ఓ అర్జునా ! , భూతాని = మనుష్యాది శరీరములు, అవ్యక్తా దీని = తెలియరాని ప్రారంభావస్థ కలవియు, వ్యక్త మధ్యాని = తెలియబడు మధ్యావస్థ కలవియు, అవ్యక్తనిధనాని = తెలియబడని నాశము గలవియును (భవంతి = అగుచున్నవి), తత్ర = అట్టివాని విషయమున, పరిదేవనా = దుఃఖము, కా = ఏమి?

తా ॥ ఓ అర్జునా ! ఈ శరీరముల ప్రారంభావస్థ తెలియబడదు. మధ్య మావస్థ మాత్రము తెలియబడును. నాశావస్థయు తెలియబడదు. ఇట్టివాని విషయమున దుఃఖమెందులకు?

అవ. ఆత్మ నెఱుంగు అధికారి దుర్లభమనుచున్నాడు ;

29. శ్లో. ఆశ్చర్యవ త్పశ్యతి కశ్చి దేనం । ఆశ్చర్యవ ద్వదతి తథైవ చాన్యః ।
ఆశ్చర్యవ చ్చైన మన్య శ్శృణోతి।శ్రుత్వా ప్యేనం వేద న చైవ కశ్చిత్॥

అర్థము : ఆశ్చర్యవత్ = అద్భుత వస్తువువలెనుండు, ఏనం = ఈ ఆత్మను, కశ్చిత్ = ఎవడో ఒకడు, పశ్యతి = చూచుచున్నాడు, తథా ఏవచ = ఆ విధముగానే, అన్యః = మరియొకడు, ఆశ్చర్యవత్ = ఆశ్చర్యమును కలిగించు వస్తువును గూర్చివలె, వదతి = చెప్పుచున్నాడు, అన్యః చ = మరియొకడున్ను, ఆశ్చర్యవత్ = ఆశ్చర్యమును కలిగించు వస్తువునువలె, ఏనం = ఈ ఆత్మను గూర్చి, శృణోతి = విను చున్నాడు, కశ్చిత్ చ = ఎవడుకూడ, ఏనం = ఈ ఆత్మనుగూర్చి, శ్రుత్వాపి= వినినను, న వేద ఏవ = ఎఱుగనే ఎఱుగడు.

తా ॥ ఈ ఆత్మ ఆశ్చర్యభూతమైనది. దీనిని ఎవడో ఒకడు చూడ కలుగు చున్నాడు. అటులనే మరియొకడు దీనిని గూర్చి చెప్పగలుగుచున్నాడు. అటులనే మరియొకడు దీనిని గూర్చి వినుచున్నాడు. గాని ఎవడును దీనినిగూర్చి వినినను పూర్తిగ నెఱుంగనే యెఱుంగడు.

అవ. ఇట్లు అర్జునుని దుఃఖము "అనార్యజుష్టం" అనెడు ఆక్షేపణను ఉపసంహరించు చున్నాడు ;

30. శ్లో. దేహీ నిత్య మవధ్యో ఽ యం । దేహే సర్వస్య భారత!।
తస్మా త్సర్వాణి భూతాని । న త్వం శోచితు మర్హసి ।

అర్థము : భారత = ఓ అర్జునా ! , సర్వస్య = ప్రతివానియొక్కయు, దేహే = దేహమందున్న, అయం = ఈ, దేహీ = ఆత్మ, నిత్యం = ఎప్పటికిన్ని, అవధ్యః = చంప బడనివాడు, తస్మాత్ = అందువలన, (త్వం = నీవు) సర్వాణి = సమస్తమైన, భూతాని = జీవులను గూర్చియు, శోచితుం = దుఃఖించుటకు, న అర్హసి = తగవు.

తా ॥ ఓ అర్జునా ! దేహము వధింపబడుచున్నను అందున్న ఈ ఆత్మ ఎన్నటికిని చంప బడజాలదు. గాన ఏ ఆత్మనుగూర్చియైనను నీవు దుఃఖించుట తగదు.

అవ. అర్జునుని దుఃఖము పరలోకవిరోధియను ఆక్షేపమును సమర్థించుచున్నాడు.

31. శ్లో. స్వధర్మ మపి చావేక్ష్య । న వికమ్పితు మర్హసి ।
ధర్మ్యాద్ధి యుద్ధాచ్ఛ్రేయోఽన్యత్ । క్షత్రియస్య న విద్యతే ।

అర్థము : (త్వం = నీవు), స్వధర్మం = స్వకీయ ధర్మమును, అవేక్ష్య అపి చ = పర్యాలోచించినను కూడ, వికంపితుం = చలించుటకు, న అర్హసి = తగవు,

క్షత్రియస్య = క్షత్రియునకు, ధర్మ్యాత్ = న్యాయముగ లభించిన, యుద్ధాత్ = యుద్ధముకంటె, అన్యత్ = ఇతరమైన, శ్రేయః = మంచి కార్యము, న విద్యతే హి = లేదు కదా.

తా ॥ మరియు నీవు నీ స్వకీయ కర్తవ్యమును పర్యాలోచించినను యుద్ధమునుండి చలించుట తగదు. క్షత్రియునకు న్యాయముగ తటస్థించిన యుద్ధము కంటె వేరగు శ్రేయస్సు లేదు కదా?

32. శ్లో. యదృచ్ఛయా చోపపన్నం । స్వర్గద్వార మపావృతమ్ ।
సుఖినః క్షత్రియాః పార్థ! లభన్తే యుద్ధ మీదృశమ్ ॥

అర్థము : పార్థ = ఓ అర్జునా!, యదృచ్ఛయా = అదృష్టవశమున, ఉపపన్నం = లభించినట్టియు, అపావృతం = ఆటంకము తొలగించబడిన, స్వర్గ ద్వారం = స్వర్గప్రాప్తికి ద్వారమగునట్టి, ఈదృశం = ఇట్టి, యుద్ధం = యుద్ధమును, సుఖినః = సౌఖ్యవంతులైన, క్షత్రియాః = క్షత్రియులు, లభన్తే = పొందుచున్నారు.

తా॥ ఓ అర్జునా! ఈ యుద్ధము నీకు అదృష్టవశమున లభించినది. స్వర్గ ప్రాప్తికి నిరాటంకమగు కారణమైనట్టి ఇట్టి యుద్ధమును పుణ్యశాలులైన క్షత్రియులు మాత్రమే పొందగలుగుచున్నారు.

అవ. అర్జునుని దుఃఖము అపకీర్తికరమను ఆక్షేపమును సమర్థించు చున్నాడు.

33. శ్లో. అథ చేత్త్వం ధర్మ్య మిమం । సంగ్రామం న కరిష్యసి ।
తత స్స్వధర్మం కీర్తిం చ । హిత్వా పాప మవాప్స్యసి ॥

అర్థము : అథ = మరియు, త్వం = నీవు, ధర్మ్యం = ధర్మయుక్తమైన, ఇమం = ఈ, సంగ్రామం= యుద్ధమును, న కరిష్యసిచేత్ = చేయవైతివేని, తతః = ఆ కారణము వలన, స్వధర్మం = స్వకీయ క్షత్రియ ధర్మమును, కీర్తించ = కీర్తినిన్ని, హిత్వా = పోగొట్టుకొని, పాపం = పాపమును, అవాప్స్యసి = పొందెదవు.

తా ॥ మరియు నీవు తనంతటతానే తటస్థించిన ఈ ధర్మయుద్ధమును చేయకపోతివేని అందువలన నీ క్షత్రియ ధర్మమును, కీర్తిని పోగొట్టుకొందువు; పైగా పాపమును పొందెదవు.

34. శ్లో. అకీర్తిం చాపి భూతాని । కథయిష్యన్తి తేఽవ్యయామ్ ।
సమ్భావితస్య చాకీర్తిః । మరణా దతిరిచ్యతే ॥

అర్థము : అపి చ = ఇంతేగాక, భూతాని = ప్రాణులు, తే = నీయొక్క, అవ్యయాం = నాశ

రహితమైన, అకీర్తిం = అపకీర్తిని, కథయిష్యన్తి = చెప్పుచుండగలరు, సంభావితస్య= గౌరవింపబడినవానికి, అకీర్తిః = అపకీర్తి, మరణాత్ చ = మరణము కంటెను, అతిరిచ్యతే = అధికమైనదగుచున్నది.

తా ॥ ఇంతేగాక ప్రాణికోటి శాశ్వతమైన నీ అపకీర్తిని చెప్పుచుండగలదు. గౌరవమును సంపాదించినవానికి అపకీర్తి మరణముకంటెను గూడ అధిక బాధాకరమైన దగుచున్నది.

35. శ్లో. **భయా ద్రణా దుపరతం । మంస్యన్తే త్వాం మహారథాః ।**
యేషాం చ త్వం బహుమతో । భూత్వా యాస్యసి లాఘవమ్ ॥

అర్థము : మహారథాః = దుర్యోధనాది మహారథులు, త్వాం= నిన్ను, భయాత్ = భయము వలన, రణాత్ = యుద్ధమునుండి, ఉపరతం = విరమించినవానినిగా, మంస్యన్తే = తలంతురు, యేషాం = ఎవరికి, త్వం = నీవు, బహుమతః = మిక్కిలి కొనియాడ బడినవాడవు, భూత్వా = (వెనుక) అయియుండి, లాఘవం = (ఇకముందు), అనాదరమును, యాస్యసి = పొందగలవు.

తా ॥ దుర్యోధనాది మహారథులు వెనుక నిన్ను గొప్పగా తలంచియున్నారు. వారే యికముందు నిన్ను చులకనగ జూతురు. మరియు నిన్ను భయమువలన యుద్ధము నుండి విరమించిన వానినిగా తలంతురు.

36. శ్లో. **అవాచ్యవాదాం శ్చ బహూన్ । వదిష్యన్తి తవా హితాః ।**
నిన్దన్త స్తవ సామర్థ్యం । తతో దుఃఖతరం ను కిమ్ ।

అర్థము : తవ = నీ యొక్క, అహితాః = శత్రువులు, తవ = నీ యొక్క, సామర్థ్యం = శక్తిని, నిన్దన్తః = నిందించుచున్నవారై, బహూన్ = అనేకములైన, అవాచ్యవాదాన్ = ఆడరాని మాటలను, వదిష్యన్తి = పలికెదరు, తతః = అంతకంటెను, దుఃఖతరం = అధిక దుఃఖమును కలిగించునది, కిం ను = ఏమి కలదు ?

తా ॥ నీ శత్రువులు నీ శక్తిని నిందించుచు అనరాని మాటల నందురు. అంతకంటెను దుఃఖమును కలిగించు విషయ మేమి కలదు ?

అవ. యుద్ధమున చంపుటయు, చచ్చుటయు, శ్రేయస్సాధనములే యనుచున్నాడు.

37. శ్లో. **హతో వా ప్రాప్స్యసే స్వర్గం । జిత్వా వా భోక్ష్యసే మహీమ్ ।**
తస్మా దుత్తిష్ఠ కౌన్తేయ! । యుద్ధాయ కృతనిశ్చయః ।

అర్థము : హతః వా = చంపబడితివా, స్వర్గం = పరమ నిశ్శ్రేయసస్థానమును, ప్రాప్స్యసే=

పొందగలవు, జిత్వా వా = (శత్రువులను) జయించియో, మహీం = భూమిని, భోక్ష్యసే = అనుభవింతువు, తస్మాత్ = అందువలన, కౌన్తేయ = వీరపుత్రా, అర్జునా, యుద్ధాయ = యుద్ధము కొరకు, కృత నిశ్చయః = నిశ్చయించు కొనినవాడవై, ఉత్తిష్ఠ = లెమ్ము.

తా ॥ ఓ అర్జునా ! శత్రువులచే నీవు చంపబడితివా మోక్షమును పొంద గలవు. శత్రువులను నీవే జయించితివా, రాజ్యమును అనుభవించ గలవు. కావున, యుద్ధమును జేయ నిశ్చయించుకొనినవాడవై లెమ్ము.

అవ. ముముక్షువు తన వర్ణాశ్రమ ధర్మముల నాచరించవలసిన రీతి నుపదేశించుచున్నాడు.

38. శ్లో. సుఖ దుఃఖే సమే కృత్వా । లాభాలాభౌ జయాజయౌ ।
తతో యుద్ధాయ యుజ్యస్వ । నైవం పాప మవాప్స్యసి ॥

అర్థము : సుఖ దుఃఖే = సుఖమును దుఃఖమును, సమే = సమమైన వానినిగా, కృత్వా = చేసి, లాభాలాభౌ = లాభ నష్టములను, జయాజయౌ = గెలుపును ఓడుటను, (సమౌ కృత్వా = సమమైన వానినిగా చేసి) , తతః = అందువలన, యుద్ధాయ = యుద్ధము కొరకు, యుజ్యస్వ = సిద్ధపడుము, ఏవం = ఇట్లాచరింతువేని, పాపం= సంసారమును, న అవాప్స్యసి = పొందకుందువు.

తా ॥ సుఖ – దుఃఖములను, లాభ – నష్టములను, జయ – అపజయములను సమాన మైనవిగా ఎంచి కర్తవ్యబుద్ధితో యుద్ధము నారంభింపుము. ఇట్లు చేసినచో పాప రూపమగు సంసారమును పొందవు.

అవ. ఆత్మతత్వోపదేశమును ముగించి దానిని పురస్కరించుకొని సాధింపదగు కర్మ యోగము నుపదేశించుచున్నాడు.

39. శ్లో. ఏషా తేఽభిహితా సాఙ్ఖ్యే । బుద్ధి, ర్యోగే త్విమాం శృణు ।
బుద్ధ్యా యుక్తో యయా పార్థ! కర్మబన్ధం ప్రహాస్యసి ॥

అర్థము : పార్థ = అర్జునా !, యయా = ఎట్టి, బుద్ధ్యా = జ్ఞానముతో, యుక్తః = కూడిన వాడవై, కర్మబంధం = సంసార బంధమును, ప్రహాస్యసి = విడిచెదవో, సా = అట్టి సాంఖ్యే = ఆత్మతత్వము విషయమైన, ఏషా = ఈ చెప్పబడిన, బుద్ధిః = జ్ఞానము: తే = నీకు, అభిహితా = చెప్పబడినది, యోగేతు = అట్టి బుద్ధియోగమున గూర్చిన, ఇమాం = ఈ చెప్పబోవునట్టి బుద్ధిని, శృణు = వినుము.

తా ॥ ఓ అర్జునా! కర్మయోగానుష్ఠానమునకు ముందు ఆత్మతత్వ జ్ఞానముండ వలెను. కావున దానికవసరమైన జ్ఞానము "నత్వేవాహం(౨ అ ౧౨శ్లో) మొదలు " న త్వం శోచితుమర్హసి " (౨అ. ౩౦ శ్లో) వరకు నీకు చెప్పబడినది. ఆత్మ జ్ఞానముతో కూడుకున్నదై కర్మబంధమును పూర్తిగా విడిపించు జ్ఞానమునికమీద చెప్పబోవుచున్నాను. దీనిని వినుము.

అవ. కర్మయోగ ప్రభావము నెఱింగించుచున్నాడు.

40. శ్లో. నే హాభిక్రమనాశోఽస్తి । ప్రత్యవాయో న విద్యతే ।
స్వల్ప మప్యస్య ధర్మస్య । త్రాయతే మహతో భయాత్ ।

అర్థము : ఇహ = ఈ కర్మయోగమునందు, అభిక్రమనాశః = ప్రారంభింప బడిన కర్మ (పూర్తి కాకున్నను) ఫలమీయకుండుట (అనగా నిష్ఫలత్వము), నాస్తి = లేదు, ప్రత్యవాయః = పాపము, నవిద్యతే = లేదు, అస్య = ఈ, ధర్మస్య = కర్మ యోగము యొక్క, స్వల్పమపి = కొద్దిభాగమైనను, మహతః = గొప్పది యగు, భయాత్ = సంసారభయమునుండి, త్రాయతే = కాపాడుచున్నది.

తా ॥ ఈ కర్మయోగము నారంభించి కడవరకు నాచరించలేకపోయినను నిష్ఫలము కాదు. మధ్య చెడినందువలన పాపము సంభవించదు. దీనిని కొలదిగ నాచరించినను ఆ మాత్రమే మహత్తరమైన సంసార భయమునుండి రక్షించును.

అవ. కర్మయోగికి ముఖ్యతమమైన 'వ్యవసాయాత్మిక బుద్ధిని' విధించుచున్నాడు.

41. శ్లో. వ్యవసాయాత్మికా బుద్ధిః । ఏకేహ కురునన్దన !।
బహుశాఖా హ్యనన్తాశ్చ । బుద్ధయోఽవ్యవసాయినామ్ ।

అర్థము : కురునందన = ఓ అర్జునా !, ఇహ = ఈ కర్మయోగమున, వ్యవసాయాత్మికా = నిశ్చయరూపమైన, బుద్ధిః = జ్ఞానము, ఏకా = ఒక్కటియే, (భవతి = అగు చున్నది), అవ్యవసాయినాం = అట్టి నిశ్చయ జ్ఞానములేని వారలయొక్క, బుద్ధయః = జ్ఞానములు, అనన్తాః = పెక్కులున్ను, బహుశాఖాఃచ = అనేకవిధము లైనవియు, (భవంతి = అగుచున్నవి) .

తా ॥ ఓ అర్జునా ! ఈ కర్మానుష్ఠానమున ఆత్మస్వరూప యాథాత్మ్య నిశ్చయ పూర్వక మైన ముముక్షుత్వబుద్ధి ఒకే విధముగ నుండును. ఆత్మస్వరూప నిశ్చయము లేనివారియొక్క బుద్ధులు వారువారు కోరు ఫలముల ననుసరించి అనేకములై యుండును.

అవ. కామ్యకర్మాధికారులను నిందించుచున్నాడు.

42. శ్లో. యా మిమాం పుష్పితాం వాచం। ప్రవద న్త్యవిపశ్చితః।
వేదవాదరతాః పార్థ!। నాన్య దస్తీతి వాదినః॥

అర్థము : పార్థ = అర్జునా !, వేదవాదరతాః = వేదవాక్యములయందు అనురక్తిగలవారును, అన్యత్ = వేరొక ఫలము, నాస్తిఇతి = లేదని, వాదినః = పలుకువారున్ను, (అగు), అవిపశ్చితః = అజ్ఞానులు, యాం = యే, ఇమాం = ఈ, పుష్పితాం = పైకి యింపుగా తోచెడు, వాచం = వాక్యమును, ప్రవదంతి = పలుకుచున్నారో.

తా॥ ఓ అర్జునా ! స్వర్గాది కామ్యములను గురించి తెలుపు వేదవాక్యముల యందనురక్తి కలిగి, స్వర్గాది ఫలములకంటె వేరేదియు లేదనునట్టి యే అజ్ఞానులు స్థిరమగు ఫలమీయకున్నను వినుటకు మాత్రమింపుగానుండెడు వేదమునందలి మాటలను పలుకుచున్నారో.

43. శ్లో. కామాత్మాన స్స్వర్గపరా। జన్మకర్మఫలప్రదామ్।
క్రియావిశేషబహులాం। భోగైశ్వర్యగతిం ప్రతి॥

అర్థము : కామాత్మానః = ఫలములయందు లగ్నచిత్తులును, స్వర్గపరాః = స్వర్గమునందే ఆసక్తిగలవారును అగు, (ఆ కర్మఠులు), జన్మకర్మ ఫలప్రదాం = జన్మను, కర్మను ఫలముగా నిచ్చునట్టియు, క్రియా విశేష బహులాం = అనేక క్రియా విశేషములతో కూడుకున్నట్టియు, భోగైశ్వర్యగతిం ప్రతి = సుఖానుభవమును, ఐశ్వర్యమును పొందుటను గూర్చినట్టియు.
("వాచం ప్రవదన్తి" అని చేర్చుకొని అన్వయించవలెను)

తా॥ కామ్యవిషయములందాసక్తి గలవారును, స్వర్గఫలానురక్తులును అగు నా కర్మఠులు పునర్జన్మను, సజాతీయమగు కర్మలనే ఫలముగా నిచ్చునట్టియు; అనేక క్రియా విశేషములతో కూడుకున్నట్టియు, స్వర్గాది సుఖభోగములకును, ఐశ్వర్యమునకు సాధనములను తెలుపునట్టియు ఈ వేదవాక్యములను పలుకుచుందురు.

44. శ్లో. భోగైశ్వర్యప్రసక్తానాం। తయాఽపహృతచేతసామ్।
వ్యవసాయాత్మికా బుద్ధిః। సమాధౌ న విధీయతే॥

అర్థము : భోగైశ్వర్యప్రసక్తానాం = సుఖానుభవ ఐశ్వర్యములయందు ఆసక్తులై, తయాః= అట్టి మాటచే, అపహృత చేతసాం = పోగొట్టబడిన జ్ఞానముగలవారికి, సమాధౌ=

మనస్సునందు, వ్యవసాయాత్మికా = ఆత్మ నిశ్చయ రూపమైన, బుద్ధిః = జ్ఞానము, న విధీయతే = పుట్టదు.

తా ॥ సుఖానుభవములయందును, దానికి సాధనమగు ఐశ్వర్యము నందును మిక్కిలి ఆసక్తిగలిగి అట్టి కామ్యఫలములను బోధించు వేదవాక్యములచే నాత్మజ్ఞానశూన్యులైన వారియొక్క మనస్సున ఆత్మస్వరూప నిశ్చయాత్మక బుద్ధి కలుగనేరదు.

అవ. 'వేదమున కామ్యకర్మలేల విధింపబడె'నను ప్రశ్నకు సమాధానమును చెప్పుచున్నాడు.

45. శ్లో. త్రైగుణ్యవిషయా వేదాః । నిస్త్రైగుణ్యో భవార్జున!
నిర్ద్వన్ద్వో నిత్యసత్త్వస్థో । నిర్యోగ క్షేమ ఆత్మవాన్ ।

అర్థము : అర్జున = అర్జునుడా ! వేదాః = వేదములు, త్రైగుణ్యవిషయాః = హెచ్చుగా నుండుసత్త్వాది గుణములుగల పురుషులకు సంబంధించినవి. (భవంతి = అగుచున్నవి), (త్వం = నీవు), నిస్త్రైగుణ్యః = ఒకదానిని మించినదొక గుణముగా లేనివాడవును, నిర్ద్వంద్వః = శీతోష్ణాది సాంసారిక స్వభావములు లేనివాడవును, నిత్యసత్త్వస్థః = సదా శుద్ధసత్త్వమునే ఆశ్రయించిన వాడవును, నిర్యోగక్షేమః = ఆత్మేతరములను పొందుటను, కాపాడుటను లేనివాడవున్ను, ఆత్మవాన్ = ఆత్మనే వెతుకుటలో తత్పరుడవున్ను, భవ = అగుము.

తా ॥ వేదములు సత్త్వ-రజ-స్తమోగుణములు హెచ్చుగాగల వారందరికిన్ని వారి వారికి వలయువాని నన్నింటిని తెలుపునట్టివి. ఓ అర్జునా! నీవు కలసి మెలసియున్న ఈ మూడు గుణముల యాధిక్యమును లేనివాడవున్ను, పుణ్యాపాపములవలన కలుగు సకల సాంసారిక ద్వంద్వ రహితుడవున్ను, ఎల్లప్పుడు శుద్ధసత్త్వగుణాశ్రయుడవున్ను, ఆత్మకంటె వేరగువానిని సంపాదించకయు, వాటిని సంరక్షింపకయు నుండువాడవున్ను, ఆత్మస్వరూపమునే వెతుకువాడవున్ను అగుమా !

అవ. వేదవిధులను విడువ తగునా ? అనుటకు సమాధానమును చెప్పుచున్నాడు.

46. శ్లో. యావా నర్థ ఉదపానే । సర్వత స్సంప్లుతోదకే ।
తావాన్ సర్వేషు వేదేషు । బ్రాహ్మణస్య విజానతః ॥

అర్థము : సర్వతః = అంతటను, సంప్లుతోదకే = నిండిన నీరుగల, ఉదపానే = చెరువునందు,

(పిపాసోః = దాహము గలవానికి), యావాన్, అర్థః = ఎంత ప్రయోజనమో, విజానతః = ఆత్మజ్ఞానముగల, బ్రాహ్మణస్య = వైదికునకు, సర్వేషు = సమస్తమైన, వేదేషు = వేదములయందు, తావాన్ (అర్థః) = అంతయే ప్రయోజనము, (అస్తి= కలదు).

తా ॥ స్నానపానాది ప్రయోజనముల కుపయోగించునదై అంతటను పూర్తిగ జలముతో నిండియున్న తటాకమున దాహముగొన్న వానిచే తనకు త్రాగుటకు వలయునంత జలము మాత్రమే గ్రహింప బడునటుల, బ్రహ్మజ్ఞాన నిష్ఠుడైన ముముక్షువుచేతనున్ను సమస్త వేదములయందును తన కుపయోగించు భాగము మాత్రమే గ్రహించ తగినదై యున్నది.

అవ. ముముక్షువునకు నిత్యనైమిత్తికాది కర్మలయందు ఉపాదేయమగు అంశను విశద పరచుచున్నాడు.

47. శ్లో. కర్మణ్యేవాధికారస్తే । మా ఫలేషు కదాచన ।
మా కర్మఫల హేతుర్భూః । మాతే సఙ్గోఽస్త్వ కర్మణి ॥

అర్థము : తే = నీకు, కర్మణి ఏవ = కర్మస్వరూపమునందు మాత్రమే, అధికారః = హక్కు, (అస్తి = కలదు), కదాచన = ఒకప్పుడును, ఫలేషు = స్వర్గాది ఫలములయందు, మా (భూత్) = హక్కు వలదు, కర్మఫలహేతుః = కర్మలకును వాటి ఫలముల కును కారణమైనవాడవు, మాభూః = కావలదు, తే = నీకు, అకర్మణి = కర్మలు చేయకుండుటయందు, సఙ్గః = ఆసక్తి, మాసుస్తు = వలదు.

తా ॥ అర్జునా ! నీవు ముముక్షువుగాన నిత్యనైమిత్తికాది సకల శాస్త్రోక్త కర్మలను చేయుచు మాత్రముండుము. కాని వాటి ఫలమునందెప్పుడును దృష్టి నిడకుము. ఆ కర్మలు చేయుచున్నను ప్రకృతియో, పరమాత్మయో చేయించుచున్నట్లు తలంచుముగాని నిన్ను కర్తనుగా కల్పించుకొనకుము. ఈ పీడ నా కేల యని కర్మలనే మాని కూర్చొనకుము.

ఇచ్చట క్షత్రియుడగు అర్జునుడు ఉపదేశపాత్రుడు. కాని 'బ్రాహ్మణస్య' అనుటచే చెప్పుచున్నది బ్రాహ్మణునకు. ఇది యెట్లు సంగతమను శంక కలుగకుండుటకై శ్రీ భాష్యకారులు ఇచ్చటి బ్రాహ్మణ శబ్దమునకు బ్రహ్మ - అణ తీతి బ్రాహ్మణః. అణ - శబ్దే, అనగా (బ్రహ్మ) వేదమును అధ్యయనము చేయువాడని యర్థమును వ్రాసిరి. వేదాధికారము మొదటి మూడు వర్ణములకు కలదు గాన అర్జునుడు కూడ యిట్టి బ్రాహ్మణుడగుట కాక్షేపము లేదు.

అవ. దీనినే మరింత స్పష్టముగా చెప్పుచున్నాడు.

48. శ్లో. యోగస్థః కురు కర్మాణి । సఙ్గం త్యక్త్వా ధనఞ్జయ! ।
సిద్ధ్యసిద్ధ్యోః సమోభూత్వా । సమత్వం యోగ ఉచ్యతే ॥

అర్థము : ధనఞ్జయ = ఓ అర్జునా !, సఙ్గం = ఫలాసక్తిని, త్యక్త్వా = విడిచి, సిద్ధ్యసిద్ధ్యోః= ఫలము లభించుట లభించకుండుట యను విషయమునందు, సమః = సమానుడవు, భూత్వా = అయి, యోగస్థః = కర్మయోగమునందున్నవాడవై , కర్మాణి = సకల కర్మలను, కురు = చేయుము, సమత్వం = (ఇట్టి) సామ్యస్థితియే, యోగః (ఇతి)= యోగము (అని), ఉచ్యతే = చెప్పబడుచున్నది.

తా ॥ రాజ్య బంధుమిత్రాదుల యందు ఆశను విడచి లాభనష్టములలో సమచిత్తుడవై కర్మయోగము నాచరింపుము. ఇట్లు లాభనష్టములలో మనస్సెంతమాత్రము వికలతజెందకుండుటయే యోగమనబడును.

అవ. కర్మయోగమునందలి జ్ఞానాంశను కొనియాడుచున్నాడు.

49. శ్లో. దూరేణ హ్యవరం కర్మ । బుద్ధియోగా ద్ధనఞ్జయ !।
బుద్ధౌ శరణ మన్విచ్ఛ । కృపణాః ఫలహేతవః ॥

అర్థము : ధనఞ్జయ = అర్జునా !, బుద్ధియోగాత్ = సమత్వబుద్ధితో చేయబడిన కర్మల కంటె, కర్మ = కేవల కామ్యకర్మ, దూరేణ అవరం = మిక్కిలి కనిష్టమైనది, బుద్ధౌ= సమత్వబుద్ధియందు, శరణం = నివాసమును, అన్విచ్ఛ = కోరుము, ఫలహేతవః= ఫలమును కోరి కర్మలు చేయువారు, కృపణాః = సంసారులు, (భవంతి = అగుచున్నారు).

తా ॥ ఓ అర్జునా ! సమత్వబుద్ధితో కూడిన కర్మకంటె కామ్యకర్మ మిక్కిలియు తక్కువది. గాన నీవు సమత్వబుద్ధిని ఆశ్రయింపుము. ఫలాపేక్షతో కర్మలజేయు వారు సంసారసంబంధము కలిగి దీనులై యుందురు.

50. శ్లో. బుద్ధియుక్తో జహాతీహ । ఉభే సుకృతదుష్కృతే ।
తస్మాద్యోగాయ యుజ్యస్వ । యోగః కర్మసు కౌశలమ్ ॥

అర్థము : బుద్ధియుక్తః = సమత్వబుద్ధితో కర్మలచేయువాడు, ఉభే = రెండైన, సుకృత దుష్కృతే = పుణ్యపాపములను, ఇహ జహాతి = సాధనానుష్ఠాన దశయందే విడిచి పెట్టుచున్నాడు, తస్మాత్ = అందువలన, యోగాయ = సమత్వబుద్ధి యోగము కొఱకు, యుజ్యస్వ = సంసిద్ధుడవగుము, కర్మసు = కర్మలు చేయుచుండగా,

యోగః = సమత్వ బుద్ధియోగము, కౌశలం = నేర్పుగా సంపాదించతగినది. (భవతి= అగుచున్నది).

తా ॥ ఆత్మయాథాత్మ్య జ్ఞానముతో కర్మలను జేయువాడు ఈ జన్మముననే పుణ్య పాపముల రెండింటిని విడుచుచున్నాడు. గాన నీవు అట్టి సమత్వ బుద్ధియోగమునకై ప్రయత్నింపుము. అట్టి సమత్వ బుద్ధియోగమే కర్మాచరణయందలి నేర్పు అనబడును.

51. శ్లో. కర్మజం బుద్ధియుక్తా హి । ఫలం త్యక్త్వా మనీషిణః ।
జన్మబన్ధవినిర్ముక్తాః । పదం గచ్ఛన్త్యనామయమ్ ॥

అర్థము : బుద్ధియుక్తాః = సమత్వబుద్ధితో కూడినవారై, మనీషిణః = జ్ఞానులు, కర్మజం = కర్మవలన పుట్టెడు, ఫలం = సాంసారిక ఫలమును, త్యక్త్వా = విడిచిపెట్టి, జన్మ బంధవినిర్ముక్తాః = జన్మ యనెడు బంధము నుండి విడువబడినవారై, అనామయం= నాశములేని, పదం = స్థానవిశేషమును, గచ్ఛన్తి హి = పొందుచున్నారని ప్రసిద్ధమేగదా.

తా ॥ ఇట్టి బుద్ధియోగముగల ఆత్మజ్ఞానులు కర్మజన్యమైన ఫలమును విడిచి, జన్మయను బంధమునుండి పూర్తిగ విడువబడినవారలై నిరుపద్రవమైన మోక్షపదవిని పొందగలరని శ్రుతులు స్పష్టముగా ఘోషించుచున్నవి.

అవ. ఈ బుద్ధియే మోహమును నిర్మూలించునని చెప్పుచున్నాడు.

52. శ్లో. యదా తే మోహకలిలం । బుద్ధి ర్వ్యతితరిష్యతి ।
తదా గన్తాసి నిర్వేదం । శ్రోతవ్యస్య శ్రుతస్య చ ॥

అర్థము : యదా = ఎప్పుడైతే, తే = నీయొక్క, బుద్ధిః = జ్ఞానము, మోహకలిలం = క్షుద్ర ఫలాశకు కారణమగు (కాలుష్యమును), వ్యతితరిష్యతి = దాటగలదో, తదా = అప్పుడు, శ్రుతస్య (కృతే) = వినిన, అర్థము (కొఱకు), శ్రోతవ్యస్య (కృతే) = వినవలసిన అర్థము కొఱకును, నిర్వేదం = నిన్ను నీవే నిందించుకొనుటను గన్తాసి= పొందగలవు.

తా ॥ ఇట్టి నీయొక్క బుద్ధి క్షుద్రఫలములకు కారణమగు కాలుష్య దోషమును పూర్తిగ పోగొట్టుకొనగలిగిన వెంటనే ఇదివరలో నీవు వినియున్న త్యాజ్యములై ఫలముల గూర్చియు, ఇక ముందు నీవు వినబోవు ఉపాదేయముల విషయములను గూర్చియు 'ఈ విషయముల నింతవరకును వినకనే పోతి ... నీవే నిరసించుకొందువు.

అవ. కర్మయోగము స్థితప్రజ్ఞావస్థను కలుగజేసి దానిమూలమున ఆత్మావలోకనమును కలుగజేయుననుచున్నాడు.

53. శ్లో. శ్రుతివిప్రతిపన్నా తే । యదా స్థాస్యతి నిశ్చలా ।
సమాధా వచలా బుద్ధిః । తదా యోగ మవాప్స్యసి ॥

అర్థము : శ్రుతివిప్రతిపన్నా ; శ్రుతి = వినుటచే, విప్రతిపన్నా = మిక్కిలి తెలిసికొనబడినదై, అచలా = ఒకేవిధమగు, తే = నీ యొక్క, బుద్ధిః = జ్ఞానము, యదా = ఎప్పుడు, సమాధౌ = మనస్సునందు, నిశ్చలా = చలించనిదై, స్థాస్యతి = ఉండగలదో, తదా= అప్పుడు, యోగం = ఆత్మావలోకనమును, అవాప్స్యసి = పొందగలవు.

తా ॥ ఆప్తులవలన చక్కగా విని గ్రహించబడినదైన ఏకరూపమగు బుద్ధి, నిర్మలమగు నీ మనస్సున నిశ్చలమై ఉండునవుడు నీవు ఆత్మావలోకనమును పొందగలవు.

అవ. స్థితప్రజ్ఞుని అవస్థాభేదములను గూర్చి అర్జునుడు అడుగుచున్నాడు.

అర్జున ఉవాచ– అర్జునుడు పలికెను.

54. శ్లో. స్థితప్రజ్ఞస్య కా భాషా? । సమాధిస్థస్య కేశవ ! ।
స్థితధీః కిం ప్రభాషేత? । కి మాసీత ? వ్రజేత కిమ్ ? ॥

అర్థము : కేశవ = శ్రీకృష్ణా! సమాధిస్థస్య = స్వాధీనముననుండు మనస్సు గల, స్థిత ప్రజ్ఞస్య= స్థితప్రజ్ఞునకు, భాషా = పేరైన శబ్దము, కా = ఏది ? స్థితధీః = స్థిత ప్రజ్ఞుడు, కిం = దేనినిగూర్చి, ప్రభాషేత = మాటలాడును ? కిం ఆసీత = దేనిని ధ్యానించును?, కిం = దేనిని గూర్చి, వ్రజేత = ప్రవర్తించును ?.

తా ॥ ఓ కృష్ణా ! మనోనిగ్రహయుక్తుడైన స్థితప్రజ్ఞుని (జ్ఞాననిష్ఠుని) స్వరూప మెట్టిది? ఆతడు దేనిని గూర్చి సంభాషించుచుండును? ఎటుల కూర్చొని దేనిని ధ్యానించుచుండును? ఎట్టి నడవడిక కలిగి యుండును?

అవ. శ్రీకృష్ణుడు స్థితప్రజ్ఞుని యొక్క నాల్గవది యగు "వశీకారావస్థ"ను గూర్చి చెప్పుచున్నాడు.

శ్రీ భగవాన్ ఉవాచ

55. శ్లో. ప్రజహాతి యదా కామాన్ । సర్వాన్ పార్థ! మనోగతాన్ ।
ఆత్మన్యే వాత్మనా తుష్టః । స్థితప్రజ్ఞ స్తదోచ్యతే ॥

అర్థము : పార్థ = అర్జునా !, యదా = ఎప్పుడైతే, ఆత్మనా = ఆత్మయందు లగ్నమగు మనస్సుచే, ఆత్మనిఏవ = ఆత్మయందే, తుష్టః = తృప్తిచెందినవాడై, మనోగతాన్=

మనస్సునందున్న, సర్వాన్ = సకలమైన, కామాన్ = కోరికలను, ప్రజహాతి = మొలకెత్తనట్లుగా విడచుచున్నాడో, తదా = అప్పుడు, స్థితప్రజ్ఞః = స్థిత ప్రజ్ఞుడుగా, ఉచ్యతే = చెప్పబడుచున్నాడు.

తా ॥ ఓ అర్జునా ! ఆత్మయందే ఆనందించుచుండు మనస్సుగలవాడై ఆ తృప్తిచే ఆత్మాతిరిక్తములైన మనోవాంఛల నన్నింటిని ఎపుడు సవాసనగా వదలగలుగుచున్నాడో, అపుడు అట్టివాడు స్థితప్రజ్ఞుడనబడుచున్నాడు.

అవ. "ఏకేంద్రియ" మనెడు స్థితప్రజ్ఞుని మూడవ యవస్థను గూర్చి చెప్పుచున్నాడు.

56. శ్లో. దుఃఖే ష్వనుద్విగ్నమనాః । సుఖేషు విగతస్పృహః ।
వీతరాగభయక్రోధః । స్థితధీ ర్మని రుచ్యతే ॥

అర్థము : దుఃఖేషు = దుఃఖహేతువులు తటస్థించగా, అనుద్విగ్నమనాః = దుఃఖము చెందని మనస్సుగలవాడును, సుఖేషు = ఇష్టులు సమీపించినను, విగత స్పృహః = ఆసక్తి లేనివాడును, వీతరాగ భయక్రోధః = పోయిన అనురాగము, భయము, కోపము కలవాడును అగు, మునిః = ఆత్మను మననము చేయువాడు, స్థితధీః = స్థిత ప్రజ్ఞుడుగా, ఉచ్యతే = చెప్పబడుచున్నాడు.

తా ॥ దుఃఖించదగు విషయములు తటస్థించినను దుఃఖించ నట్టివాడును, సుఖించతగిన విషయములు తటస్థించినను వానియందు స్పృహను చెందనట్టివాడును, అనురాగముగాని, భయముగాని, కోపముగాని లేనివాడును, ఆత్మమననశీలుడును అగు వాడు స్థితప్రజ్ఞుడనబడును.

అవ. ఈ శ్లోకమున "వ్యతిరేకము" అనబడు స్థితప్రజ్ఞుని రెండవ అవస్థ చెప్పబడుచున్నది.

57. శ్లో. య స్సర్వత్రానభిస్నేహః । తత్తత్ప్రాప్య శుభాశుభమ్ ।
నాభినన్దతి న ద్వేష్టి । తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥

అర్థము : యః = ఎవడు, సర్వత్ర = సకల ప్రియవస్తువుల విషయమై, అనభిస్నేహః = ఉదాసీనుడై, తత్ తత్ = ఆయా, శుభాశుభమ్ = ఇష్ట వస్తువుల లాభమునుగాని అలాభమునుగాని, ప్రాప్య = పొంది, న అభినన్దతి = ప్రశంసించడో, న ద్వేష్టి = ద్వేషింపడో, తస్య = వానియొక్క, ప్రజ్ఞా = బుద్ధి, ప్రతిష్ఠితా = మిక్కిలి స్థిరమైనది, (భవతి = అగుచున్నది).

తా ॥ ఎవడు ఆత్మాతిరిక్తములైన వేనియందును ప్రీతిలేనివాడై ప్రియ సంయోగరూప శుభమును పొంది సంతోషించుటగాని, ప్రియ వియోగరూప అశుభమును చెంది

ద్వేషించుటగాని లేనివాడై యుండునో, వాని జ్ఞానము స్థిరమైయుండును; వాడు స్థితప్రజ్ఞుడనబడును.

అవ. ఈ శ్లోకమునందు "యతమాన" మనబడు స్థితప్రజ్ఞుని మొదటి యవస్థ చెప్ప బడుచున్నది.

58. శ్లో. యదా సంహరతే చాయం । కూర్మోఽఙ్గానీవ సర్వశః ।
ఇన్ద్రియాణీన్ద్రియార్థేభ్యః । తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥

అర్థము : అయం = ఈ కర్మయోగి, యదా చ = ఎప్పుడైతే, కూర్మః = తాబేలు, సర్వశః= అంతటి నుండియు, అఙ్గాని ఇవ = తన అవయవములనువలెనే, (సర్వశః) ఇంద్రియార్థేభ్యః = (సమస్త) విషయముల నుండియు, ఇన్ద్రియాణి = (తన) ఇంద్రియములను, సంహరతే = మరలించుచున్నాడో, తదా = అప్పుడు, తస్య = ఆ కర్మయోగికి, ప్రజ్ఞా = బుద్ధి, ప్రతిష్ఠితా = స్థిరమైనది. (భవతి = అగుచున్నది).

తా ॥ తాబేలు దాని యవయవములనువలె, ఈ యోగియు చక్షురాదీంద్రియములను రూపాది విషయముల నుండి పూర్తిగా ఎపుడు మరలించుకొనగలడో, అప్పుడు వాని జ్ఞానము స్థిరమైయుండును. వాడు స్థితప్రజ్ఞుడనబడును.

అవ. ఈ జ్ఞాననిష్ఠ లభించువారు అరుదనియు దానికిది ఉపాయమనియు చెప్పుచున్నాడు.

59. శ్లో. విషయా వినివర్తన్తే । నిరాహారస్య దేహినః ।
రసవర్జం, రసోఽప్యస్య । పరం దృష్ట్వా నివర్తతే ॥

అర్థము : నిరాహారస్య = ఇంద్రియములను విషయములనుండి మరలించిన, దేహినః = జీవునకు, విషయాః = శబ్దాది విషయములు, రసవర్జం = రాగముతప్ప, వినివర్తంతే= మరలిపోవుచున్నవి. అస్య = ఈ కర్మయోగికి, రసః అపి = విషయాసక్తి యున్ను, పరం = అంతకంటె సుఖతరమగు ఆత్మను, దృష్ట్వా = చూచి, నివర్తతే = మరలిపోవుచున్నది.

తా ॥ విషయానుభవము లేని జీవునకు శబ్దాది విషయములు అనురాగము మినహాగా పూర్తిగా నివర్తించును. వీనియొక్క ఈ విషయాను రాగము కూడ ఉత్కృష్టమైన ఆత్మసాక్షాత్కారమైన పిమ్మట నివర్తించగలదు.

అవ. విషయరాగమున్నచో ఇంద్రియములు తొలగవనుచున్నాడు.

60. శ్లో. యతతో హ్యపి కౌన్తేయ!। పురుషస్య విపశ్చితః ।
ఇన్ద్రియాణి ప్రమాథీని । హరన్తి ప్రసభం మనః ॥

అర్థము : కౌన్తేయ = అర్జునా !, విపశ్చితః అపి = పండితుడైనను, యతతః = ప్రయత్నించునట్టి, పురుషస్య = పురుషునియొక్క, మనః = మనస్సును, ప్రమాథీని = కలతపెట్టునట్టి, ఇన్ద్రియాణి = ఇంద్రియములు, ప్రసభం = బలవంతముగా, హరన్తిహి = ఆకర్షించుచున్నవిగదా.

తా ॥ ఓ అర్జునా ! పురుషుడు వివేకవంతుడై ప్రయత్నము జేయుచున్నను ప్రమాదము కలిగించు స్వభావము గల ఇంద్రియములు వాని మనస్సును బలాత్కారముగ ఆకర్షించుచున్నవికదా !

అవ. ఇంద్రియముల జయించుటకు సుకరోపాయమును చెప్పుచున్నాడు.

61. శ్లో. తాని సర్వాణి సంయమ్య । యుక్త ఆసీత మత్పరః ।
వశే హి యస్యేన్ద్రియాణి। తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥

అర్థము : తాని = అటువంటి, సర్వాణి = అన్ని ఇంద్రియములను, సంయమ్య = అరికట్టి, మత్పరః = నాయందు మనస్సునుంచి, యుక్తః = స్వస్థచిత్తుడవై, ఆసీత = ఉండవలెను, యస్య = ఎవనియొక్క, ఇన్ద్రియాణి = ఇంద్రియములు, వశే (సంతి) = స్వాధీనమునందున్నవో, తస్య = వానియొక్క, ప్రజ్ఞా = బుద్ధి, ప్రతిష్ఠితా= స్థిర పడినది. (భవతి = అగుచున్నది).

తా ॥ బలవంతములైన ఇట్టి ఇంద్రియముల నన్నింటిని విషయముల నంటకుండునట్లు మాత్రము అణచిపెట్టి మనస్సును శుభావలంబనమగు నాయందుంచి స్వస్థచిత్తుడవై యుండవలయును. అప్పుడు ఇంద్రియములు స్వాధీనము నందుండును. అట్టి జితేంద్రియుని జ్ఞానము స్థిరమైనదై యుండగలదు.

అవ. భగవంతు నవలంబనముగా గొనక స్వప్రయత్నముచే నింద్రియముల జయించనెంచు వానికి అనర్థములను చెప్పుచున్నాడు.

62. శ్లో. ధ్యాయతో విషయా న్పుంసః । సఙ్గ స్తేషూ పజాయతే ।
సఙ్గా త్సఞ్జాయతే కామః । కామాత్ క్రోధోఽభిజాయతే ।

అర్థము : విషయాన్ = శబ్దాదులను, ధ్యాయతః = తలంచునట్టి, పుంసః = పురుషునకు,

తేషు = ఆ విషయములయందు, సఙ్గః = ఆసక్తి, ఉపజాయతే = మిక్కిలి హెచ్చుగా పుట్టుచున్నది. సఙ్గాత్ = ఆసక్తివలన, కామః = విషయములననుభవించక బ్రతుకలేని యావేశము, సంజాయతే = పుట్టుచున్నది, కామాత్ = ఆ కామము వలన, క్రోధః = కోపము, అభిజాయతే = అందరి యందును పుట్టు చున్నది.

తా ॥ విషయములను మనస్సుచే ధ్యానించుచుండు పురుషునికి ఆ విషయముల యందు అనురాగము అధికముగా కలుగుచున్నది. ఆ యనురాగమే కామముగా మారుచున్నది. ఆ కామమే అడ్డబడినచో అందరి యందును క్రోధముగా పరిణమించుచున్నది.

63. శ్లో. క్రోధా ద్భవతి సమ్మోహః । సమ్మోహాత్ స్మృతి విభ్రమః ।
స్మృతిభ్రంశాత్ బుద్ధినాశో । బుద్ధినాశాత్ ప్రణశ్యతి ॥

అర్థము : క్రోధాత్ = (ఆ) కోపమువలన, సమ్మోహః = అవివేకము, భవతి = కలుగుచున్నది, సమ్మోహాత్ = (అట్టి) అవివేకమువలన, స్మృతివిభ్రమః = (తన ప్రయత్నము నందు) మరపు, (భవతి = కలుగుచున్నది), స్మృతి భ్రంశాత్ = (ఆ) మతిమరపు వలన, బుద్ధినాశః = ఆ యాత్మజ్ఞానమునకు గావించిన ప్రయత్న నాశము, (భవతి= కలుగుచున్నది), బుద్ధినాశాత్ = అట్టి బుద్ధి నాశమువలన, ప్రణశ్యతి = నశించు చున్నాడు.

తా ॥ క్రోధము వలన అవివేకము కలుగును ; అవివేకము వలన తన ప్రయత్నమున మఱపు జనించును. ఆ మఱపువలన ఆత్మజ్ఞానార్థము చేసిన ప్రయత్నము చెడును. ఆత్మజ్ఞాన ప్రయత్ననాశనముచే సంసారమున మునిగి పూర్తిగ నశించును.

అవ. తాను చెప్పిన రీతిగా ఇంద్రియములను జయించుటవలన కలుగు ఫలమును చెప్పుచున్నాడు.

64. శ్లో. రాగద్వేషవియుక్తైస్తు । విషయా నిన్ద్రియై శ్చరన్ ।
ఆత్మవ శ్యై ర్విధేయాత్మా । ప్రసాద మధిగచ్ఛతి ॥

అర్థము : రాగద్వేషవియుక్తైః = రాగద్వేషములు లేనట్టియు, ఆత్మవశ్యైః = తనకు స్వాధీనము లైనట్టియు, ఇన్ద్రియైః = ఇంద్రియములచేత, విషయాన్ = శబ్దాదులను, చరన్ = లక్ష్య పెట్టక సంచరించెడు, విధేయాత్మా = స్వాధీనచిత్తుడు, ప్రసాదం = మనస్సుయొక్క నిర్మలత్వమును, అధిగచ్ఛతి = పొందుచున్నాడు.

తా ॥ రాగద్వేషములు విడిచినట్టియు, తనకు స్వాధీనములైనట్టి ఇంద్రియములచే శబ్దాదివిషయములు తిరస్కరించి వర్తించుచున్న స్వాధీనమైన మనస్సు కలవాడు మనోనిర్మలత్వమును పొందుచున్నాడు.

65. శ్లో. ప్రసాదే సర్వదుఃఖానాం । హాని ర స్యోపజాయతే ।
ప్రసన్నచేతసో హ్యాశు । బుద్ధిః పర్యవతిష్ఠతి ॥

అర్థము : ప్రసాదే (సతి) = నిర్మలత్వము కలుగగనే, అస్య = ఇట్టి పురుషుని యొక్క, సర్వదుఃఖానాం = అన్ని దుఃఖముల యొక్కయు, హానిః = నాశము, ఉపజాయతే= పుట్టుచున్నది, ప్రసన్నచేతసః = నిర్మలచిత్తునకు, ఆశు = శీఘ్రముగా, బుద్ధిః = శుద్ధాత్మజ్ఞానము, పర్యవతిష్ఠతి హి = స్థిరముగా నిలుచుచున్నదిగదా.

తా ॥ మనస్సు నిర్మలముకాగా వీనియొక్క సమస్త దుఃఖములు నశించును. నిర్మలాంతఃకరణునికి ఆత్మజ్ఞానము శీఘ్రముగా స్థిరపడుచున్నదికదా.

అవ. చెప్పిన రీతిగా ఇంద్రియములు జయించని వానికి ప్రధాన ప్రయోజనము లభింప నేరదనుచున్నాడు.

66. శ్లో. నాస్తి బుద్ధి రయు క్తస్య । న చా యుక్తస్య భావనా ।
నచా భావయత శ్శాన్తిః । అశాన్తస్య కుత స్సుఖమ్? ।

అర్థము : అయుక్తస్య = భగవంతునియందు మనస్సు నుంచనివానికి, బుద్ధిః = శుద్ధాత్మ జ్ఞానము, నాస్తి = లేదు, అయుక్తస్య = అట్టివానికి, భావనా చ = ఆత్మమననమున్ను, నాస్తి = లేదు, అభావయతః = ఆత్మను ధ్యానించనివానికి, శాన్తిః = విషయవాంఛ లేకుండుటయు, నాస్తి = లేదు, అశాన్తస్య = విషయ వాంఛ పోని వానికి, సుఖం = సుఖము, కుతః = ఎక్కడిది ?

తా ॥ నాయందు మనస్సు నుంచనివానికి ఆత్మజ్ఞానము కలుగదు. అట్టి వానికి ఆత్మ మననమున్ను కలుగదు. ఆత్మమననము లేనివానికి విషయము లందలి స్పృహ నివర్తించదు. విషయాభిలాషవదలని వానికి నిరతిశయ సుఖప్రాప్తి ఎటుల కలుగును ?

అవ. ఇంకను అట్టివానికి కలుగు అనర్థమునే చెప్పుచున్నాడు.

67. శ్లో. ఇన్ద్రియాణాం హి చరతాం । య న్మనోఽను విధీయతే ।
తదస్య హరతి ప్రజ్ఞాం । వాయు ర్నావ మి వామ్భసి ॥

అర్థము : ఇన్ద్రియాణాం = ఇంద్రియములు, చరతాం = విషయములందు ప్రవర్తించుచుండగా,

యత్, మనః = ఏ, మనస్సు, అనువిధీయతే = వాటిని వెంబడింప చేయబడుచున్నదో, తత్ = ఆ మనస్సు, అస్య = వీనియొక్క, ప్రజ్ఞాం = ఆత్మను గూర్చిన జ్ఞానమును, అమ్భసి = నీటియందు, నావం = ఓడను, వాయుః ఇవ = గాలివలె, హరతి హి = లాగుకొనిపోవుచున్నదిగదా.

తా ॥ స్వేచ్ఛగ చరించు ఇంద్రియముల ననుసరించి నడుపబడుచున్న మనస్సు, ఈ పురుషుని ఆత్మజ్ఞానమును నీటియందలి నావను ప్రతికూల వాయువు గమ్య స్థానము నుండి వేరుదెసకు గొనిపోవునటుల విషయముల దెసకు మరలించును.

అవ. ఇంద్రియ నిగ్రహ ఉపదేశమును విరమించుచున్నాడు.

68. శ్లో. తస్మా ద్యస్య మహాబాహో! । నిగృహీతాని సర్వశః ।
ఇన్ద్రియా ణీన్ద్రియార్థేభ్యః । తస్యప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥

అర్థము : మహాబాహో = అర్జునా !, తస్మాత్ = అందువలన, యస్య = ఎవని యొక్క, ఇన్ద్రియాణి = ఇంద్రియములు, ఇన్ద్రియార్థేభ్యః = విషయములనుండి, సర్వశః = అన్నివిధములచేతను, నిగృహీతాని = అరికట్టబడినవో, తస్య = వానియొక్క, ప్రజ్ఞా = బుద్ధి, ప్రతిష్ఠితా = స్థిరమైనది, (భవతి = అగుచున్నది).

తా ॥ ఓ అర్జునా ! మనస్సు నాయందు లగింపజేయుట వలన ఎవని ఇంద్రియములు విషయములనుండి పూర్తిగా మరలించి స్వాధీనపరచుకొనబడినవగునో వాని ఆత్మజ్ఞానము స్థిరమైనది. (వాడే స్థితప్రజ్ఞుడు)

అవ. స్థితప్రజ్ఞునకు కలుగు ఫలమును చెప్పుచున్నాడు.

69. శ్లో. యానిశా సర్వభూతానాం । తస్యాం జాగర్తి సంయమీ ।
యస్యాం జాగ్రతి భూతాని । సా నిశా పశ్యతో మునేః ॥

అర్థము : సర్వభూతానాం = అన్ని ప్రాణులకును, యా = ఏ ఆత్మబుద్ధి, నిశా = రాత్రివలె ప్రకాశించనిదో, తస్యాం = ఆ యాత్మబుద్ధియందు, సంయమీ = నిర్మలచిత్తుడగు యోగి, జాగర్తి = జాగరూకుడై యుండును, యస్యాం = ఏశబ్దాది బుద్ధియందు, భూతాని = ప్రాణులు, జాగ్రతి = జాగరూకులై యుందురో, సా = ఆ బుద్ధి, పశ్యతః= ఆత్మను చూచునట్టి, మునేః = మననశీలునకు, నిశా = రాత్రివలె ప్రకాశించనిది, (భవతి = అగుచున్నది)

తా ॥ సమస్త ప్రాణులకు ఆత్మ విషయకబుద్ధి రాత్రివలె అప్రకాశమై యుండును. గాని జితేంద్రియుడగు యోగి ఆ బుద్ధియందు జాగరూకుడై యుండును. ప్రాణి కోటి శబ్దాది విషయములందు జాగరూకత కలిగియుండును. ఆత్మదర్శనము చేయు మననశీలునకు ఆ విషయానుభవము రాత్రివలె అప్రకాశమైయుండును.

70. శ్లో. ఆపూర్యమాణ మచలప్రతిష్ఠం । సముద్ర మాపః ప్రవిశన్తి యద్వత్ ।
తద్వ త్కామా యం ప్రవిశన్తి సర్వే । స శాన్తి మాప్నోతి న కామకామీ ।

అర్థము ః ఆపూర్యమాణం = అంతటను నీటితో నిండియున్నట్టియు, అచల ప్రతిష్ఠం = గట్టును మీరనట్టియు, సముద్రం = సముద్రమును, ఆపః = నది నీరు, యద్వత్ = ఏ విధముగా, ప్రవిశన్తి = ప్రవేశించుచున్నదో, తద్వత్ = ఆ విధముగా, సర్వే = సమస్తమైన, కామాః = కోరికలు, యం = ఎవనిని, ప్రవిశన్తి = ప్రవేశించుచున్నవో, సః = వాడు, శాన్తిం = శాంతిని, ఆప్నోతి = పొందుచున్నాడు, కామకామీ = విషయాసక్తుడు, న ఆప్నోతి = శాంతిని పొందడు.

తా ॥ స్వయముగ పూర్ణమై, చలించనిదై యుండు సముద్రమును నదీజలములు ప్రవేశించునటులనే, ఆత్మావలోకనముచే తృప్తుడైన వానికి సమస్త కోరికలు నెరవేరు చున్నవి. అట్టివాడే శాంతిని పొందును. కోరికలు కోరువాడెన్నడును శాంతిని పొందజాలడు.

71. శ్లో. విహాయ కామాన్ య స్సర్వాన్ । పుమాం శ్చరతి నిస్పృహః ।
నిర్మమో నిరహఙ్కారః । స శాన్తి మధిగచ్ఛతి ॥

అర్థము ః యః = ఏ, పుమాన్ = పురుషుడు, సర్వాన్ = సమస్తమైన, కామాన్ = కోరికలను, విహాయ = విడిచిపెట్టి, నిస్పృహః = ఆశ లేనివాడును, నిర్మమః = మమకారము లేనివాడును, నిరహఙ్కారః = దేహాత్మాభిమానము లేనివాడును (అయి), చరతి = సంచరించుచున్నాడో, సః = వాడు, శాన్తిం = శాంతిని, అధిగచ్ఛతి = పొందుచున్నాడు.

అహఙ్కారమనగా–అహం శబ్దమునకు అర్థముకాని శరీరమును అహం శబ్దార్థముగా భావించుట. దీనికే దేహాత్మాభిమానమని పేరు. మమకారమనగా–వాస్తవముగా తనకెట్టి సంబంధముగాని లేనట్టి ఔపాధిక బంధువులయందు "నావారు" అనెడి బుద్ధిని కలిగియుండుట. ఇవి రెండును మోక్షమార్గమునకు గొప్ప ప్రతి బంధకములు.

తా ॥ ఏ పురుషుడు సమస్త కోరికలను విడిచి, విషయాభిలాష లేనివాడై, అహంకార మమకారములు లేనివాడై యుండునో వాడు సమస్త దుఃఖనివృత్తిని పొంద కలుగును.

అవ. కర్మనిష్ఠను ప్రశంసించి, అధ్యాయార్థమును ముగించుచున్నాడు.

72. శ్లో. ఏషా బ్రాహ్మీ స్థితిః పార్థ! । నైనాం ప్రాప్య విముహ్యతి ।
స్థిత్వాఽస్యా మన్తకాలేఽపి । బ్రహ్మనిర్వాణ మృచ్ఛతి ॥

ఇతి శ్రీభగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే సాఙ్ఖ్యయోగోనామ ద్వితీయోఽధ్యాయః ॥

అర్థము : పార్థ = అర్జునా !, ఏషా = ఈ, స్థితిః = కర్మయోగమందు ఉనికి, బ్రాహ్మీ = బ్రహ్మను పొందించునది, (భవతి = అగుచున్నది), ఏనాం = దీనిని, ప్రాప్య = పొంది, న విముహ్యతి = తిరిగి సంసారమును పొందడు, అన్తకాలే అపి = చివర వయస్సునందు అయినను, అస్యాం = ఈ స్థితియందు, స్థిత్వా = ఉండి, బ్రహ్మ నిర్వాణం = బ్రహ్మానందమును, ఋచ్ఛతి = పొందుచున్నాడు.

తా ॥ ఓ అర్జునా ! ఆత్మజ్ఞానపూర్వక కర్మానుష్ఠాననిష్ఠ బ్రహ్మప్రాప్తికి సాధనమైనది. జీవుడు కర్మయోగమువలన ఈ స్థితిని పొంది తిరిగి సంసారమున పడడు. అంతిమకాలమున ఈ స్థితిలోనికి రాగలిగినను సుఖైక స్వరూపమైన ఆత్మ ప్రాప్తిని చెందగలడు.

ఇది ఉపనిషత్ స్వరూపమును, బ్రహ్మవిద్యయు, యోగశాస్త్రమును, శ్రీకృష్ణార్జున సంవాదరూపమును అగు శ్రీభగవద్గీత యందలి సాంఖ్యయోగ మనబడు ద్వితీయాధ్యాయము.

సంజయుని శ్లోకములు	3	శ్రీకృష్ణుని శ్లోకములు	63
అర్జునుని శ్లోకములు	6	ద్వితీయాధ్యాయ శ్లోకములు	72

శ్రీమద్భగవద్గీతా ప్రశ్నోత్తరావళి
రెండవ అధ్యాయము

1.ప్ర. ఈ యధ్యాయమునకు పేరేమి ? అదియెందులకుంచబడినది?

ఉ. ఈ యధ్యాయమునకు సాంఖ్యయోగమని పేరు. ఏ అధ్యాయమున నే విషయము ప్రధానముగా చెప్పబడునో ఆ యధ్యాయమునకు ఆ పేరుంచబడును.

సంఖ్యయనగా జ్ఞానము. ఆ జ్ఞానముచే నిశ్చయింపబడు ఆత్మతత్వమునకు సాంఖ్యమనిపేరు. అది యీ యధ్యాయమున 'నత్వేవాహం' అనెడు పన్నెండవ శ్లోకమున ప్రారంభింపబడి 'అవ్యక్తోఽయ మచింత్యోఽయ' మ్మనెడు యిరువది యైదవ శ్లోకము వరకు పదునాల్గు శ్లోకములచే ప్రధానముగా చెప్పబడుటచే నీ యధ్యాయమునకు సాంఖ్యయోగమని పేరుంచబడినది.

2. ప్ర. రెండవ అధ్యాయమున ప్రధానముగా చెప్పబడు విషయము లేవి?

ఉ. (1) శ్రీకృష్ణుడర్జునుని ఊరడించుటకు స్థూలముగా నాతని విషాదము నాక్షేపించుట.

(2) అర్జునుడు తన విషాదమును సమర్థించుచు కర్తవ్యము నెఱుంగ గోరి శ్రీకృష్ణుని శరణుజొచ్చుట.

(3) శ్రీకృష్ణుడు అర్జునుని దుఃఖమున కారోపించిన 'అనార్యజుష్టం' 'అస్వర్గ్యం' 'అకీర్తికరం' అనెడు దోషములను సహేతుకముగా సమర్థించుట.

దానిమూలముననే అర్జునునకు శరీరాత్మ వివేకమును కలిగించి అట్టి జ్ఞానముతో యుద్ధాది వర్ణాశ్రమ ధర్మముల నాచరించుట యజ్ఞతుల్య మగుటచే పాపహేతువుగాక మోక్షసాధన మగునని బోధించుట.

(4) కర్మయోగమును ప్రశంసించుట.

(5) కామ్య కర్మలను నిందించుట.

(6) ముముక్షువునకు వలయు వేదభాగమును నిర్ణయించుట.

(7) కర్మయోగము నందలి జ్ఞానభాగమును కొనియాడుట.

(8) స్థితప్రజ్ఞుని అవస్థావిశేషములను వర్ణించుట.

(9) ఇంద్రియముల నియమించు ఉపాయమును చెప్పుట.

(10)విషయములనే అనుసంధించుటచే కలుగు అనర్థ పరంపరను చెప్పుట

(11) సితప్రజ్ఞునికిగల విశేషమును వివరించుట.

3.ప్ర. ఈ యధ్యాయమునకు ప్రధాన శాస్త్రార్థముతో గల సంబంధమేమి?

ఉ. గీతాశాస్త్రమునకు ప్రధానపురుషార్థము మోక్షము. అనగా జీవుడు సంసార బంధమును సవాసనగా వీడి భగవత్స్వరూపముతో సమానమైన శుద్ధాత్మ స్వరూపమును బడసి పరమ పదమున నిత్యముక్తులతో గూడి నిరంతరము పరమపురుషుని సేవించుచు ఆనందసాగరాంతర్నిమగ్నుడై యుండుట. ఇది భక్తియోగము మాత్రముచే లభించదగిన ప్రధాన ఫలము. భక్తియోగమనగా – ఇతర తలంపులతో విఘ్నితముగాక ప్రీతితో భగవత్సాక్షాత్కారమును లభింపజేయు ధ్యానవిశేషము. ఇట్టి భక్తి లభించుటకు తన వాస్తవ స్వరూపమును లభింపవలెను. అది స్థితప్రజ్ఞునకే లభించును. స్థితప్రజ్ఞుడే జ్ఞానయోగి. స్థితప్రజ్ఞుడు కావలయునన్న తనకు శాస్త్రమున విధింపబడిన వర్ణాశ్రమ ధర్మములను ఫలమును గోరక భగవత్కైంకర్య బుద్ధితో నాచరింపవలెను. ఇదియే కర్మయోగమనబడును. ఈ కర్మయోగమునకు మునుముందు కావలసినది ఆత్మస్వరూప జ్ఞానము. అది యీ అధ్యాయమున ప్రధానముగా ప్రతిపాదింపబడుటచే ఈ అధ్యాయమునకు ప్రధానశాస్త్రార్థముతో పరంపరా సంబంధము కలదు.

4.ప్ర. అర్జునుని విషాదమునకు శ్రీకృష్ణుడారోపించిన ప్రధాన దోషము లెవ్వి ? ఎందుచేత ?

ఉ. శ్రీకృష్ణుడర్జునుని దుఃఖమును 'అనార్యజుష్టము, అస్వర్గ్యము, అకీర్తికరము' అని నిందించెను.

అనార్యజుష్టము.

అనగా పండితులచే నాదరింపతగనిది, ఏలయనగా :

భీష్మాదులనగా కాన్పించెడు శరీరము, ఆత్మ యనెడు రెండు భాగములతో కూడినవారు. అందు శరీరము పుట్టుచుండుట, నశించుచుండుట, మనము ప్రత్యక్షముగ చూచుచునే యున్నాము. కావున నది యెప్పటికైనను నశించియే తీరును. అట్లు తప్పనిసరియగు విషయమును గూర్చి పండితుడు సహించునేకాని దుఃఖించడు. (2 అ. 27 శ్లో.)

ఇక ఆత్మయనునది మిక్కిలి సూక్ష్మమై లోకమునందలి యన్ని వస్తువులయందును వ్యాపించియున్నదగుటచే అస్త్రములు శస్త్రములు

పంచభూతములు మొదలగునవి ఏవియు దాని కేవిధమగు వికారములను కలిగింపనేరవు. ఒక దేహము నందుండు ఆత్మకు బాల్యము యౌవనము వార్ధక్యము మొదలగు మార్పులు శరీరమునుబట్టియే వచ్చునట్లుగా మరియొక దేహసంబంధమును వచ్చుచుండును. కావున దానిని గూర్చి పండితులు దుఃఖింపరు.
(2 అ. 17, 23, 13 శ్లో.)

అస్వర్గ్యము.

అనగా-పరలోకమునకు విరోధియగునది-ఎట్లనగా :

ఫలమునుకోరి యుద్ధమును చేసినవారు మృతిచెందినను వీరస్వర్గము నలంకరింతురు. ఫలము కోరక భగవత్కైంకర్యబుద్ధితో చేసినవారు క్రమముగా మోక్షసుఖము ననుభవింతురు. ఇట్లుచేయక మొదటనే విరమించి కూర్చున్నవానికి ఈ రెండు ఫలములును లభింపనేరవు.
(2 అ. 37, 38 శ్లో)

అకీర్తికరము

ఇంతవరకు ప్రతియోధుని దృష్టియందును అర్జునుడు జయింపశక్యముకాని మహావీరుడని గొప్ప గౌరవముండెను. ఇప్పుడర్జునుడు యుద్ధమును చేయక యుద్ధరంగమునుండి మరలిపోయినచో భయపడియే మరలిపోయెనని ప్రతివారును భావించి అర్జునుని పరిహసింతురు. గౌరవింపబడినవానికి అపకీర్తి మరణమును మించిన అపకారి. కావున నిది అపకీర్తికరము.
(2 అ 34, 35, 36 శ్లో)

5. ప్ర. గీతాశాస్త్రము ఏ శ్లోకమునుండి ప్రారంభమగుచున్నది ? ఎందువలన?

ఉ. గీతాశాస్త్రము రెండవ అధ్యాయము నందలి 12 వ శ్లోకమగు 'నత్వేవాహం' అనెడి శ్లోకమునుండి ప్రారంభమగుచున్నది.

అర్జునుడు పూర్ణమగు శరీరాత్మ వివేకములేక తాను చంపువాడననియు భీష్మాదులు చంపబడువారనియు భ్రమించెను. మరియు ఫలమును కోరక చేయు యుద్ధము క్షత్రియునకు మోక్షమొసంగు పవిత్రమైన కర్మయోగమని తెలియక పాపమని భ్రమించెను. అందులకై ముందుగా ఆత్మస్వరూపమును గూర్చి ఉపదేశింపవలసి యున్నది. అదియే కర్మయోగమునకు ప్రధానాంగము. అది ఈ శ్లోకముననే ప్రారంభమగు చున్నది. దీనికి ముందు గ్రంథమంతయు ఈ ఉపదేశమునకు పూర్వ పీఠికగా పరిగణింపబడుచున్నది.

(2 అ. 10 శ్లో. భాష్యం)

6\. ప్ర. శ్రీకృష్ణుడు 'అర్జునా! నీవు దుఃఖించరాని వారిని గూర్చి దుఃఖించుచున్నావు. ప్రజ్ఞావాదములను పలుకుచున్నావు' అని ఆక్షేపించెను గదా! అర్జునుడు పలికిన ప్రజ్ఞావాదము లెవ్వి ?

ఉ. ప్రజ్ఞావాదమనగా శరీరముకంటె ఆత్మవేరని తెలుసుకొని పండితునివలె మాట్లాడుట. మొదటి అధ్యాయమున అర్జునుడు యుద్ధము చేయుట వలన ప్రధాన దోషములను చెప్పుచు యుద్ధమువలన క్రమముగ వర్ణ సాంకర్య మేర్పడుననియు, అట్టి సాంకర్యమనెడు దోషము దాని కర్తకును, అట్టి కులస్థులకును శాశ్వతమగు నరకము నొసంగుననియు అట్టి కులస్థులచే నొసంగబడు పిండములు గాని తర్పణములుగాని పితరులకు చెందక వారు అధోగతి పాలగుదురనియు పలికెను. దీనిచే నాతనికి దేహము కంటె వేరగు ఆత్మ ఉన్నదను జ్ఞానమున్నట్లు తెలియుచున్నది. ఇవియే అర్జునుడు పలికిన ప్రజ్ఞావాదములు.

7\. ప్ర. మాత్రా స్పర్శలనగా నేమి ? వాటిని సహించుటవలన లాభమేమి ?

ఉ. తన్మాత్రవలన పుట్టిన శబ్ద స్పర్శరూప రసగంధములును, వాటికి ఆధారములగు పంచభూతములును తన్మాత్రలనబడును. జ్ఞానేంద్రియములగు కన్ను ముక్కు చెవి నాలుక చర్మములకు ఈ శబ్దాది విషయములతో కలుగు సంబంధములే మాత్రాస్పర్శ లనబడును. వీటివలన చలి-వేడి, సుఖము-దుఃఖము మొదలగు ద్వంద్వములు కలుగుచుండును. శరీరమున్నంతవరకు ఆయా వర్ణాశ్రమములకు సంబంధించిన ధర్మములను ఆచరించుచునే ఉండవలెను. అట్లాచరించునప్పుడు ఈ మాత్రాస్పర్శవలన కలుగు సుఖదుఃఖములకు భయపడి ఆ ధర్మములను విడువక చేయుచునే ఉండవలెను. అవి వచ్చుచు పోవుచు నుండునవి. అనిత్యములు. కర్మముతో పాటు అవియును నశించునవియే.

ఇట్లు ఎరింగి సహించి ఆచరించువాడు మోక్షమును పొందుట కర్హుడై క్రమముగ దానిని పొందును. (2 అ. 14 శ్లో. భాష్యం)

8\. ప్ర. **యుద్ధమువలన అర్జునునకు కలుగు పాపభీతిని శ్రీకృష్ణుడెట్లు పరిహరించెను? లేక కర్మలు బంధించకుండునట్లు ఆచరించుటలో ప్రధాన సూత్రమేది ?**

ఉ. ఆత్మ, దేహమునకు సంబంధించిన పుట్టుట పెరుగుట తరుగుట నశించుట మొదలగు స్వభావములు లేక నిత్యమై ఉండుననియు కావున

తనకు శాస్త్రము విధించిన కర్మలను సుఖము – దుఃఖము, లాభము –
నష్టము, జయము – అపజయము మొదలగువాటిని సమముగ భావించుచు
ఆచరించినచో ఆ కర్మలవలన కలుగు పాపము కర్త కంటదనియు ఉపదేశించి
అర్జునునకు కలిగిన పాపభీతిని శ్రీకృష్ణుడు పరిహరించెను. (వాటిని సమముగ
భావించుట యనగా వాటివలన తన మనమున పొంగుగాని క్రుంగుగాని లేక
విడువకుండ నాచరించుచునే యుండుట) (2 అ. 38 శ్లో. భాష్యం)

9. ప్ర. ఆత్మ నిత్యమనుటకు శ్రీకృష్ణుడు కనబరచిన కారణము లేవి ? లేక 'పండితులు
శ్రీకృష్ణుడర్జున కుపదేశించిన సాంఖ్య బుద్ధియేది ? లేక
ఆత్మలను గూర్చి గాని శరీరములను గూర్చి గాని దుఃఖించరనుటకు
శ్రీకృష్ణుడు కనపరచిన యుక్తులేవి?

ఉ. ఆత్మ పరమాత్మవలె మూడు కాలములయందును స్థిరముగనుండునదియే
కావున దానికి శరీరములో నుండునప్పుడు ఆ శరీరమునకు సంబంధించిన
కౌమార యౌవన వార్ధక్యావస్థలు వచ్చుచున్నట్లే వేరొక శరీరమును
పరిగ్రహించుటయు నిశ్చయము. ఆ బాల్యాద్యవస్థలు దేహమును బట్టియే
ఆత్మకు సంభవించును. ఆత్మ నశించునని తలంచక దుఃఖింపకుండునట్లే,
ఆ దేహము పోయి మరియొక దేహము వచ్చినప్పుడును ఆ యాత్మ
నశింపకయే ఉన్నదని తలంచి దుఃఖింపరాదు. ఇట్లు ఆత్మ ఏ వికారమును
చెందకుండుటకు కారణము అది యన్నింటికంటెను సూక్ష్మమై సమస్త
వస్తువుల యందును వ్యాపించి యుండుటయే. ఒక వస్తువుచే నొకవస్తువు
నశింపచేయబడవలెనన్న గొడ్డలి మొద్దును చీల్చునట్లు ఆ నశింపజేయబడు
వస్తువునందు ప్రవేశించియే దానిని నశింపజేయవలెను. అట్లే ఆత్మను
నశింపచేయవలెనన్న దానిలో ప్రవేశించునంతటి సూక్ష్మవస్తువొకటి
యుండవలెను. అస్త్రములుగాని, శస్త్రములుగాని, పంచభూతములుగాని
ఆత్మచే వ్యాపింపబడునవి అగుటచే దానికంటె స్థూలమై యుండునుగాని
సూక్ష్మములు కానేరవు. కావున వాటిచే ఆత్మ నశింపదు. మనము చినిగిన
బట్టలను విడిచి క్రొత్త బట్టలను కట్టుకొనునట్లు ఆత్మయును ఇకమీద
కర్మల ననుభవించుట కుపయోగించని ప్రస్తుత శరీరమును విడిచి వాటి
ననుభవించుటకు తగిన వేరొక క్రొత్త శరీరమును ధరించుచుండును. ఇట్లు
శరీరమును విడుచునప్పుడు మృతిచెందెననియు, క్రొత్త శరీరమును
పరిగ్రహించినప్పుడు పుట్టెననియు లోకులు వాడుచుందురు. కాని నిజముగా

ఆత్మకు పుట్టుటయు, గిట్టుటయును లేదు.

(2 అ. 12, 13, 17, 22, 23, 24 శ్లో. భాష్యం)

ఇక శరీరమునే ఆత్మగా భావించినను అది పుట్టుటయు, నశించుటయును, ఎన్ని ప్రయత్నములు చేసినను విఫలమగుటయును, ప్రత్యక్ష సిద్ధమే గాన దాని కొరకు విచారించుట అవివేకము. వస్తువునకు పుట్టుట చనిపోవుట అవస్థా విశేషములేకాని వేరుకావు. వాటివలన ఆ ద్రవ్యము యొక్క స్వరూపము చెడదు. మన్ను మొదట ముద్దయై పిమ్మట కుండయై తుదకు పగిలి పెంకై పొడియును అగుచున్నది. ఇట్లే పరిణమించుటయే స్వభావముగా గల ద్రవ్యమున కీ పరిణామ పరంపర నాప నేరి తరము? కావున శరీరము కూడ నట్టి పరిణామ స్వభావముగల ప్రకృతియొక్క వికారమేగాన దానికి ఆ మార్పులు తప్పవు. కావున దాని కొరకు విచారింపరాదు.

(2 అ. 27 శ్లో. భాష్యం)

10. ప్ర. కర్మయోగమనగా నేమి ? దాని మాహాత్మ్యమెట్లు వర్ణింపబడినది ?

ఉ. జీవాత్మ స్వరూపమును పూర్ణముగ నెఱింగి ఫలమును కోరక తనను కర్తగా తలంచక వర్ణాశ్రమముల ననుసరించి వేదములలో విధింపబడిన నిత్యనైమిత్తికాది కర్మలను ఫలము సిద్ధించినను సిద్ధించకున్నను చలించని మనస్సుతో పరమేశ్వరారాధన బుద్ధితో నాచరించుటకు కర్మయోగమని పేరు. (2 అ. 47 శ్లో.)

ఇతరకామ్య కర్మలవలెగాక ఇట్టి కర్మయోగమును ఆరంభించి ముగించకపోయినను ఫలము లభింపకపోదు. ఆరంభించినది క్షుద్రఫలాశలచే చెడినను పాపము సంభవించదు. ఇది కొద్దిగ నాచరింపబడినను మహత్తరమగు సంసారపు బారి నుండి కాపాడును. ఇదియే కర్మయోగము యొక్క మాహాత్మ్యము. (2 అ. 40 శ్లో.)

11. ప్ర. వ్యవసాయాత్మికా బుద్ధి యనగా నేమి ?

ఉ. వ్యవసాయమనగా నిశ్చయము. కావున ఆత్మను గూర్చినిశ్చయముగా తెలుసుకొనిన పిమ్మట తానాచరించు నిత్యనైమిత్తికాది కర్మలన్నియు మోక్షమొక్కటియే ఫలముగా కలవని నిశ్చయించుకొనుట. ఇదియే వ్యవసాయాత్మిక బుద్ధియనబడును.

ఈ బుద్ధి మోక్షమనెడు ఒకే ఫలమును గూర్చిన దగుటచే నొక్కటియేయని పరమాత్మ ఉపదేశించెను. అనగా మోక్షమును కోరువాడు నిత్య కర్మలను, నైమిత్తిక కర్మలను, వాటియొక్క ప్రధానఫలములను, అవాన్తర ఫలములను విడిచి మోక్షమొక్కటియే ఫలముగా భావించి అనుష్ఠించును. మఱియు తమతమ వర్ణాశ్రమములకు తగునట్టి కామ్యకర్మలనుగూడ వాటి ఫలములను విడిచి నిత్యనైమిత్తికములవలె నవియు మోక్షసాధనములేయనెడి బుద్ధితో శక్తికొలది యాచరించును. కావున నిట్టి బుద్ధికి వ్యవసాయాత్మిక బుద్ధియని పేరు. ఈ బుద్ధితో నాచరింపబడు కర్మ లన్నియు బంధహేతువులుగాక మోక్ష హేతువులగును అని శ్రీకృష్ణుడు ఉపదేశించెను.

12 ప్ర. కామ్యకర్మలను చేయువారిని శ్రీకృష్ణుడెట్లు నిందించెను ?

ఉ. వేదముయొక్క పూర్వభాగమునందు పశుపుత్రాది ఇహలోక ఫలముల నిచ్చునట్టియు, స్వర్గాది పరలోక ఫలముల నిచ్చు నట్టియు కర్మలు చెప్పబడియున్నవి. ఇవి వినుటకు మాత్రము ఇంపుగా నుండునుగాని యివి యొసంగెడు ఫలము లనిత్యములు. ఇవి తిరిగి పుట్టుటకు కారణములై మరల నట్టికర్మలనే యాచరించుటయందు ప్రేరేపించుచుండును. ఐశ్వర్యము అనేకములగు క్రియాకలాపములతో నిండియుండును. ఐశ్వర్యము భోగములనెడు అల్పపురుషార్థ సాధనములగుట తప్ప వేరొక ఫలము లేనివి. వీటినే నమ్మియుండు కర్మఠులు ఇంతకు మించిన దారిలేదని చెప్పుచుందురు. ఆ మాటలు విని మోసపోయి భోగైశ్వర్యముల కొఱకు వాటినే యాచరించువారికి నెన్నటికిని మోక్షసాధనమైన కర్మలయందు స్థిరమగు బుద్ధి(వ్యవసాయాత్మికబుద్ధి) కలుగనేరదని శ్రీకృష్ణపరమాత్మ కామ్యకర్మలను నిందించెను. (2 అ. 42, 43, 44 శ్లో.)

13. ప్ర. కామ్యకర్మలును వేదోక్తములే కదా ! వాటిని విడుచుట తగునా ? అనెడు ఆక్షేపమునకు శ్రీకృష్ణుడు గావించిన పరిహారమేమి ?

ఉ. వేదము కేవలము మోక్షమును కోరునట్టి సాత్వికుల కొరకు మాత్రమే తెలసినదికాదు. అందు రాజసులకు కావలసిన కామములకు సాధనములును, తామసులకు కావలసిన పరపీడాకరములగు అభిచారాది సాధనములును

చెప్పబడియున్నవి. లేనిచో వారు వేదమునందు శ్రద్ధలేనివారై చెడిపోవుదురు. తల్లి తనబిడ్డలు ప్రయోజకులైనను అప్రయోజకులైనను, సురూపులైనను, కురూపులైనను వారి వారి రుచికి తగినట్లుగా వండిపెట్టునుగదా ! లేనిచో వారు ఆకలితో మాడి నశించుటయో, తినరానివి తిని చెడుటయో తటస్థించును. ఇట్టి వేయి తల్లులను మించినదీ వేదమాత. దాహముగొన్న వాడు నీటితో నిండిన చెరువునుండి తనకు కావలసిన నీటిని మాత్రము త్రాగి తృప్తిచెందునట్లే మోక్షమును కోరువాడు ఆత్మస్వరూపమును సాక్షాత్కరింపగోరి సాంసారికస్వభావములను విడిచి సత్వగుణమును మాత్రము పెంపొందించుకొని ఆ వేదమునుండి తనకు మోక్షమునకు మాత్రమే ఉపయోగించెడు విషయములను గ్రహించి తృప్తిచెంది యుండవలెను. (2 అ. 45, 46 శ్లో.)

14. ప్ర. కర్మయోగి యెఱుంగవలసిన ప్రధాన సూత్రములేవి ?

ఉ. సాత్వికుడగు మోక్షమును కోరువానికి భగవదారాధనగా చేయబడు కర్మలు మోక్షహేతువులుగాన నిత్యనైమిత్తికాది కర్మలను చేయుట యందు మాత్రమే అధికారము కలదు. వాటి ఫలములు సంసారమునందు బంధించునవి గాన ఆ ఫలముల యందాతనికి జోక్యములేదు. 'ఈ కర్మలను నేను చేసితిని, ఈ ఫలము నా వలన కలిగిన'దని యాతడు భావింపరాదు. ఆ కర్మఫలములకు హేతువు సత్వాదిగుణములని కాని భగవంతుడని కాని భావింపవలెను. 'నేను కర్మలనే చేయను' అని యాతడు విరమింపరాదు. (2 అ. 47 శ్లో.)

15. ప్ర. శ్రీకృష్ణుడు యోగశబ్దమున కర్థమెట్లు నిర్వచించెను ?

ఉ. 'రాజ్యమునందుకాని బంధువులయందుగాని ఆశను విడిచి యుద్ధాది కర్మలను చేయుము. వాటివలన కలుగు జయాపజయాదుల విషయమై ఆనందముతో పొంగుటగాని దుఃఖముతో క్రుంగుటగాని చెందకుము. ఇట్లు వేదోక్తధర్మములాచరించునప్పుడు కలుగు లాభనష్టములకు మనస్సులో వికారములు చెందకుండుటయే యోగమనబడును' అని శ్రీకృష్ణుడు యోగశబ్దమున కర్థమును వర్ణించెను. (2 అ. 48 శ్లో. భాష్యం)

16. ప్ర. యోగబుద్ధిని శ్రీకృష్ణుడెట్లు ప్రశంసించెను ?

ఉ. కర్మయోగమున జ్ఞానభాగమనియు కర్మభాగమనియు రెండు భాగములుండును. ఆ జ్ఞానభాగమునకే 'యోగము' అని పేరు. ఇది కర్మభాగము కంటె మిక్కిలి ఉత్తమమైనది. ఫలమునుకోరి కేవల కర్మభాగమునే యవలంబించువారు సంసారమునందే యుందురు. ఈ యోగబుద్ధితో

కర్మల నాచరించువారు మోక్షవిరోధులగు పుణ్యపాపములను వీడి క్రమముగా మోక్షమును పొందుదురు. ఇట్లెందరో బుద్ధిమంతులీ యోగబుద్ధిని యవలంబించి జ్ఞాననిష్ఠులై ఆత్మ సాక్షాత్కారమును బడసి సంసారబంధమునుండి విడువడిరి. (2 అ. 48, 49, 50, 51 శ్లో.)

17. ప్ర. స్థితప్రజ్ఞుని అవస్థాభేదములేవి ? వాటికిగల తారతమ్యమేమి ?

ఉ. స్థితప్రజ్ఞుని యవస్థలు యతమానావస్థా, వ్యతిరేకావస్థా, ఏకేన్ద్రియావస్థా, వశీకారావస్థా అని నాలుగు విధములుగా నుండును.

ఇంద్రియములు విషయములపైకి ప్రవర్తించుచుండగా వాటిని తాబేలు తన యవయవములను ముడుచుకొని లోనికీడ్చుకొనునట్లు అరికట్టి మనస్సును ఆత్మ యందు నిశ్చలముగా నిలుపుటకు ప్రయత్నించుట 'యతమానావస్థ' యనబడును.

సుఖదుఃఖములు తమంతటతాము వచ్చి పడినప్పుడు వాటిని ప్రశంసించుటగాని ద్వేషించుటగాని లేకయుండుట 'వ్యతిరేకావస్థ' యనబడును.

అప్రియములు తటస్థించినప్పుడు దుఃఖించక, సుఖములు కావలెనని యపేక్షించక ప్రియమైన చేతనాచేతనములు ఎదుట నుండినను వాని యందు పూర్వముండిన అనురాగము లేక, రాగ భయ క్రోధములను వీడి ఆత్మనే ధ్యానించు చుండుట 'ఏకేంద్రియావస్థ' యనబడును.

ఆత్మను ధ్యానించుచు దానివలన కలుగు సంతుష్టిచే మనస్సు నందలి కోరికల నన్నటిని తిరిగి మొలకలెత్తకుండునట్లు సవాసనగా పూర్తిగా విడిచిపెట్టుట 'వశీకారావస్థ' యనబడును. (2 అ 55, 56, 57, 59 శ్లో.)

కామములను కామములుగా చూడకుండుట వశీకారావస్థ.

అట్లు చూచినను వాటి యందు సంగములేకుండుట ఏకేంద్రియావస్థ.

కొద్దిపాటి సంగముతో విషయముల ననుభవించుచున్నను వానిని మిక్కిలి ప్రేమింపకుండుట వ్యతిరేకావస్థ.

మిక్కిలి ప్రేమించుచున్నను దానిని అరికట్టుటకు ప్రయత్నించుట యతమానావస్థ.

ఇదియే యీ యవస్థలకు గల సూక్ష్మమైన తారతమ్యము,

(తాత్పర్యచంద్రికా)

18. ప్ర. ఈ స్థిత ప్రజ్ఞావస్థ యెల్లరకును కలుగకుండుటకు కారణమేమి ? దానిని సంపాదించుటకు ప్రధాన సాధనమేమి ?

ఉ. ఎంత జ్ఞానము కలవాడైనను తన ప్రయత్నముచే నింద్రియములను నిగ్రహించుట కెంత ప్రయత్నించినను కామక్రోధాదులచే బలిష్ఠమైన

యింద్రియములు వాని మనస్సును బలవంతముగా విషయముల వైపు మరలించును. ఇట్లు విషయముల పైకి ప్రవర్తించుచున్న ఇంద్రియములను మనస్సుకూడా వెంబడించినచో పురుషున కిదివరకున్న ఆత్మ జ్ఞానముకూడ నశించును. కావున ఎల్లరకును యీ స్థితప్రజ్ఞావస్థ కలుగనేరదు.

(2 అ. 60 శ్లో. భాష్యం)

ఇట్టి యింద్రియములను విషయములపైకి పోకుండ బలవంతముగా నరికట్టి మనస్సుతో భగవంతుని ధ్యానించుచున్న యెడల వీని పాపములన్నియు నశించి మనస్సు నిర్మలమై ఇంద్రియములను స్వాధీనపరచుకొనును. అప్పుడు వీనికి స్థిత ప్రజ్ఞావస్థ లభించి ఆత్మదర్శనము కలుగును.

(2 అ. 61 శ్లో.)

19. ప్ర. విషయములను తలంచుచుండుటవలన కలుగు అనర్థపరంపర యెట్టిది ?

ఉ. విషయములను ధ్యానించుచున్నవానికి వాటియందు రాగముదయించును. దానిచే వాడు వాటిని అనుభవింపక బ్రతుకలేని ఉద్రేకమును చెందును. ఇదియే కామమనబడును. అట్టి ఉద్రేకముతో గావించు ఉద్యమమునకు నెవరివల్లనైనను ఆటంకము కలిగినచో మంచిచెడ్డలను తెలుసుకొనజాలని కోప ముదయించును. దానిచే కృత్యాకృత్యము లెఱుంగక చేయరాని పనులను చేయును. దానిచే పూర్వస్మృతి నశించును. దానిచే తాను సంపాదించిన ఆత్మజ్ఞానము నశించి సంసారసాగరమున మునిగిపోవును.

(2 అ. 62, 63 శ్లో.)

20. ప్ర. సామాన్యులకంటె స్థితప్రజ్ఞునికి గల వైలక్షణ్యమేమి ?

ఉ. మనకు రాత్రివలె గోచరించని ఆత్మజ్ఞానమునందు స్థితప్రజ్ఞుడు నిరంతరము జాగరూకుడై ఆత్మను సాక్షాత్కరించుచుండును, మనము నిరంతము సాక్షాత్కరించునట్టి సాంసారిక విషయములు ఆతనికి రాత్రివలె గోచరింపక యుండును. (2 అ. 69 శ్లో.)

21. ప్ర. ఎట్టివానికి శాంతి లభించును ?

ఉ. నిరంతరము నీటితో నిండియున్న సముద్రము తనయందెన్ని నదుల నీరు వచ్చి పడినను తాను రూపమున గాని పరిమాణమునందు గాని యే విధమైన మార్పును చెందక తన హద్దును మీరక ఒకేవిధముగ నిలచి యున్నట్లు స్థితప్రజ్ఞుడును తాను కోరకయే వచ్చునట్టి సాంసారిక సుఖదుఃఖములవలన తన నియమములనుండి యేమాత్రమును చలింపకయే ఆత్మను సాక్షాత్కరించుచు శబ్దాది సాంసారిక విషయములను అన్నింటిని విడిచి వాటి యందు కోరిక గాని మమకారము గాని దేహాత్మాభిమానము గాని లేక సంచరించుచున్నచో నాతడు శాంతిని పొందగలడు. (2 అ. 70 శ్లో.)

తృతీయాధ్యాయ అర్థసంగ్రహము

అసక్త్యా లోకరక్షాయై । గుణేష్వా రోప్య కర్తృతామ్ ।
సర్వేశ్వరే వా న్యస్యోక్తా । తృతీయే కర్మకార్యతా ॥

౧. లోకరక్షాయై = లోకులను చెడకుండ కాపాడుటకొఱకు, అసక్త్యా = ఫలమునందలి ఆశ లేకుండుటచే, కర్తృతాం = కర్తృత్వమును, గుణేషు = సత్వాది గుణముల యందు, ఆరోప్య = ఉంచి గాని, సర్వేశ్వరే = భగవంతునియందు, న్యస్యవా = ఉంచిగాని, కర్మకార్యతా = నిత్యనైమిత్తికాది కర్మలను చేయుట, తృతీయే = మూడవ అధ్యాయమునందు, ఉక్తా = చెప్పబడినది.

౨॥ శిష్టుడగువాడు కర్మయోగమును విడిచి జ్ఞానయోగమును అవలంబించినచో అందులకధికారములేని సామాన్య ఆస్తిక ప్రజలు అతనిని జూచి తామును జ్ఞానయోగము నవలంబించి కొనసాగించ నేరక చెడిపోవుదురు. గాన ఆ శిష్టుడును, అట్టి లోకమును కాపాడు నిమిత్తమై ఫలము నందలి ఆశను వీడి కర్తృత్వమును సత్వాది గుణముల యందుగాని, సర్వేశ్వరుని యందుగాని ఉంచి కర్మలు చేయుచుండవలెనని యీ మూడవ అధ్యాయమున చెప్పబడినది.

గుణముల యందు కర్తృత్వమును ఉంచుటయనగా- ఆత్మకు పుణ్యాపాపములను చేయుట స్వభావసిద్ధముకాదు. అది గిన్నె సంపర్కముచే నీటికి వేడి కలిగినట్లు ప్రకృతి పరిణామమైన శరీరసంబంధముచే తనకు కలిగినది యని తలంచుట.

సర్వేశ్వరుని యందు కర్తృత్వముంచుట యనగా- యజమాని సేవకునిచేవలె సర్వేశ్వరుడు సర్వస్వామిగాన తనకు శేషమగు ఆత్మను కర్తగా గైకొని, తనవియేయగు హవిస్సు మొదలగు ఉపకరణములచే తన యారాధనకై తానే తన కర్మలను చేయించుచున్నాడు అని తలంచుట.

శ్రీమద్భగవద్గీతా - తృతీయాధ్యాయము

విషయ సూచిక

అస్మద్గురుభ్యో నమః

శ్రీమద్భగవద్గీతా - తృతీయోఽధ్యాయః

కర్మయోగః

అవ. ద్వితీయాధ్యాయోపదేశమువలన అర్జునునకు కలిగిన సందేహము

అర్జున ఉవాచ : అర్జునుడు పలికెను

1.శ్లో. జ్యాయసీ చే త్కర్మణస్తే । మతా బుద్ధి ర్జనార్దన!।
తత్కింకర్మణి ఘోరే మాం । నియోజయసి కేశవ! ॥

అర్థము : (హే) జనార్దన = ఓ శ్రీకృష్ణా! బుద్ధిః = జ్ఞానము, కర్మణః = కర్మకంటె, జ్యాయసీ (ఇతి) = శ్రేష్ఠమైనదని, తే = నీకు, మతాచేత్ = అభిమతమైనచో, (హే) కేశవ = ఓ కృష్ణా!, తత్ = అప్పుడు, మాం = నన్ను, ఘోరే = భయంకరమగు, కర్మణి= కర్మయందు, కిం నియోజయసి = ఏల ప్రవర్తింపజేయుచున్నావు ?

తా ॥ కృష్ణా! కర్మయోగముకంటె జ్ఞానయోగమే మంచిదని నీకు తోచినచో నన్నేల ఆత్మసాక్షాత్కారమునకు విరోధియగు కర్మయోగమునే యవలంబింపుమని నిర్బంధించుచున్నావు ?

2. శ్లో. వ్యామిశ్రేణైవ వాక్యేన । బుద్ధిం మోహయసీవ మే ।
తదేకం వద నిశ్చిత్య । యేన శ్రేయోఽహ మాప్నుయామ్ ॥

అర్థము : వ్యామిశ్రేణైవ = పరస్పర విరుద్ధమగునట్టి, వాక్యేన = మాటచేత, మే = నా యొక్క, బుద్ధిం = బుద్ధిని, మోహయసీవ = కలత పెట్టుచున్నట్లున్నావు, యేన = ఏ వాక్యముచేత, అహం = నేను, నిశ్చిత్య = (కర్తవ్యమును) నిశ్చయించుకొని, శ్రేయః= మేలును, ఆప్నుయాం = పొందుదునో, తత్ = అటువంటి, ఏకం = ఒక మాటను, వద = చెప్పుము.

తా ॥ కర్మ, జ్ఞాన మిశ్రమగుటచే విరుద్ధముగా గాన్పించునట్టి మాటను జెప్పి నన్ను మరింత భ్రమ పెట్టుచున్నట్లు తోచుచున్నది. అట్లుగాక 'నేను చేయవలసినది ఇది ' అని తేల్చుకొని దాని నాచరించి నేను మేలును పొందునట్టి ఒకే మాటను చెప్పుము.

శ్రీ భగవానువాచ : శ్రీకృష్ణుడు పలికెను.

అవ. శ్రీకృష్ణుడు అర్జునుని ప్రశ్నకు అధికారిభేదముచే సమాధాన మొసంగుట.

3. శ్లో. లోకేఽస్మిన్ ద్వివిధా నిష్ఠా । పురా ప్రోక్తా మయాఽనఘ ।
జ్ఞానయోగేన సాఙ్ఖ్యానాం । కర్మయోగేన యోగినామ్ ॥

అర్థము : (హే) అనఘ = పాపములులేని ఓ అర్జునా !, అస్మిన్ = ఈ, లోకే = ప్రపంచమున, సాఙ్ఖ్యానాం = జ్ఞానయోగమునకు తగిన వారలకు, జ్ఞానయోగేన = జ్ఞానయోగము చేతను, యోగినాం = కర్మయోగము నకు తగినవారలకు, కర్మయోగేన= కర్మయోగముచేతను, (ఇతి) = (అని), నిష్ఠా = అనుష్ఠానక్రమము, ద్వివిధా = రెండురీతులుగ, పురా = వెనుక, మయా = నాచేత, ప్రోక్తా = చక్కగా చెప్పబడినది.

తా॥ ఓ అర్జునా ! లోకమున రకరకముల మనుష్యులుండుటచే జ్ఞాన యోగము ననుష్ఠించు యోగ్యతకలవారు దాని ననుష్ఠించవలెననియు, కర్మయోగమునకు తగినవారు కర్మయోగము ననుష్ఠించవలెననియు నేను వెనుక స్పష్టముగనే చెప్పితిని.

అవ. సంసారికి మోక్షాపేక్ష కలిగినతోడనే జ్ఞాననిష్ఠ దుస్సాధ్యము అనుచున్నాడు.

4. శ్లో. న కర్మణా మనారమ్భా । న్నైష్కర్మ్యం పురుషోఽశ్నుతే ।
న చ సన్న్యసనా దేవ । సిద్ధిం సమధిగచ్ఛతి ॥

అర్థము : కర్మణాం = (వేదోక్తములగు) కర్మలయొక్క, అనారమ్భాత్ = చేయుటకు మొదలుపెట్టకుండుటవలన, పురుషః = మనుష్యుడు, నైష్కర్మ్యం = జ్ఞాననిష్ఠను, న అశ్నుతే = పొందడు, సన్న్యసనాత్ ఏవ = (ఆకర్మలను ఆరంభించి) విడుచుటవలననే, సిద్ధిం = జ్ఞాన నిష్ఠను, న సమధిగచ్ఛతి = పొందడు.

తా॥ వేదోక్తములగు కర్మలను ప్రారంభించనియెడల మనుష్యుడు జ్ఞాన నిష్ఠను పొందనేరడు. అట్లొకవేళ ప్రారంభించినను వాటిని పూర్తి చేయక విడిచిపెట్టుటచేతను జ్ఞాననిష్ఠను పొందనేరడు.

అవ. దానికి కారణమును చెప్పుచున్నాడు.

5. శ్లో. న హి కశ్చిత్ క్షణ మపి । జాతు తిష్ఠ త్యకర్మకృత్ ।
కార్యతే హ్యవశః కర్మ । సర్వః ప్రకృతిజైర్గుణైః ॥

అర్థము : కశ్చిత్ = ఎవడున్ను, జాతు = ఎప్పుడైనను, క్షణమపి = క్షణకాల మైననుకూడ, అకర్మకృత్ = కర్మలు చేయనివాడై, న హి తిష్ఠతి = ఉండలేదు, సర్వః =

ప్రతివాడును, ప్రకృతిజైః = ప్రకృతివలన పుట్టిన, గుణైః = సత్వరజస్తమోగుణములచే, అవశః = అస్వతంత్రుడై, కర్మ (ప్రతి) = కర్మను (గూర్చి), కార్యతే = ప్రేరేపింపబడుచున్నాడు.

తా ॥ ఈ లోకమున జీవించియున్న వాడెవ్వడును ఎప్పుడైనను ఒక క్షణ కాలమైనను ఏదో యొక కర్మచేయక యుండజాలడు. అట్లుందమను కొన్నను (ప్రకృతి పరిణామమగు శరీరముయొక్క) సత్వ రజస్తమో గుణములు వీనిని తమ వశము జేసుకొని బలవంతముగా తమ తమ పనులు చేయించియే తీరును.

అవ. కర్మయోగికాకయే జ్ఞానయోగము నవలంబించువానిని నిందించు చున్నాడు.

6. శ్లో. కర్మేన్ద్రియాణి సంయమ్య । య ఆస్తే మనసా స్మరన్ ।
ఇన్ద్రియార్థాన్ విమూఢాత్మా । మిథ్యాచార స్స ఉచ్యతే ।

అర్థము : యః = ఎవడు, కర్మేన్ద్రియాణి = వాక్పాద పాణిపాయూపస్థ లనబడు కర్మేంద్రియములను, సంయమ్య = అరికట్టి, ఇన్ద్రియార్థాన్ = రూప రస గంధ స్పర్శ శబ్దములను, మనసా = మనస్సుతో, స్మరన్ = తలచుచు, ఆస్తే = ఉండునో, విమూఢాత్మా = ఆత్మయందు ప్రవర్తించని మనస్సుగల, సః = వాడు, మిథ్యాచారః (ఇతి) = కపట ప్రవర్తనగలవాడు (అని), ఉచ్యతే = చెప్పబడుచున్నాడు.

తా ॥ ఆత్మజ్ఞానమును సంపాదించవలెనని కర్మేంద్రియములను బలవంతముగా బిగపట్టుకొని కూర్చొని యుండియు విషయలంపటుడగుటచే మనస్సును ఆత్మయందు నిలుపలేక మనస్సుతో మాత్రము శబ్దాది విషయములను తలంచుచునే యుండువాడు మోసగాడన బడును.

అవ. కర్మయోగిని పొగడుచున్నాడు.

7. శ్లో. యస్త్విన్ద్రియాణి మనసా । నియమ్యా రభతేఽర్జున ।
కర్మేన్ద్రియైః కర్మయోగం । అసక్త స్సవిశిష్యతే ।

అర్థము : అర్జున = ఓ అర్జునుడా !, యఃతు = ఎవడైతే, మనసా = మనస్సుచేత, ఇన్ద్రియాణి = జ్ఞానేంద్రియములను, నియమ్య = అరికట్టి, అసక్తః = ఫలమును కోరనివాడై కర్మేన్ద్రియైః = వాగాది కర్మేన్ద్రియములచే, కర్మయోగం = కర్మయోగమును ఆరభతే = చేయుచున్నాడో, సః = వాడు, విశిష్యతే = శ్రేష్ఠుడగుచున్నాడు.

తా ॥ మనస్సు నాత్మయందుంచి దానిచే (చక్షురాది) జ్ఞానేంద్రియము లను స్వాధీనము గావించుకొని కర్మేంద్రియములచే, ఫలమున పేక్షింపక, కర్మయోగము నాచరించువాడు జ్ఞానయోగికంటె ఉత్తముడు.

అవ. అర్జునుని ప్రశ్నకు సరియగు జవాబునిచ్చుచు సౌకర్యాది కారణములచే కర్మయోగమే శ్రేష్ఠమనుచున్నాడు.

8. శ్లో. నియతం కురు కర్మ త్వం । కర్మ జ్యాయో హ్యకర్మణః ।
శరీరయాత్రాపి చ తే । న ప్రసిద్ధ్యే దకర్మణః ॥

అర్థము : త్వం = నీవు, నియతం = తప్పనిసరియగు, కర్మ = శాస్త్రీయమైన కర్మను, కురు= చేయుము, అకర్మణః = జ్ఞానయోగముకంటె, కర్మ = కర్మయోగము, జ్యాయః హి = శ్రేష్ఠమైనదికదా !, అకర్మణః = బొత్తుగ కర్మనే చేయని, తే = నీకు, శరీరయాత్రా పిచ = జీవయాత్రకూడ, న ప్రసిద్ధ్యేత్ = సాగదు.

తా ॥ శరీరముతో నున్నవానికి కర్మచేయుట తప్పనిసరి. అట్లు చేయనిచో బ్రతుకుతెరువే కాన్పింపదు. అందువలన జ్ఞాననిష్ఠ కంటె కర్మనిష్ఠయే మంచిది.

అవ. చేయదగిన కర్మ లెట్టివియో చేయరాని వెట్టివియో నిరూపించుచున్నాడు.

9. శ్లో. యజ్ఞార్థాత్ కర్మణోఽన్యత్ర । లోకోఽయం కర్మ బన్ధనః ।
తదర్థం కర్మ కౌన్తేయ! ముక్తసజ్గ స్సమాచర ॥

అర్థము : (హే) కౌన్తేయ = ఓ అర్జున !, యజ్ఞార్థాత్ = వైదిక కర్మలకొరకైన, కర్మణః = వ్యాపారముకంటె, అన్యత్ర = వేరైన కర్మయందే, అయం = ఈ, లోకః = జనము, కర్మబన్ధనః = కర్మ బంధకముగా కలది, (భవతి = అగుచున్నది.) తదర్థం = ఆ వైదిక కర్మకొరకే, కర్మ = ద్రవ్యసంపాదనాది కర్మను, ముక్తసజ్గః = కోరికను విడిచిన వాడవై, సమాచర = చేయుము.

తా ॥ వేదము విధించిన కర్మలను సాగించుటకు ద్రవ్యార్జనాదుల గావించి నను అవి వీనిని సంసారమున బంధింపవు. కావున, అర్జునా ! నీవు వేదోక్త కర్మలకొరకే అట్టి ద్రవ్యార్జనాదుల గావింపుము.

అవ. యజ్ఞశేషముచే శరీరమును పోషించుకొనవలెను. లేనిచో మహా పాపము అనుచున్నాడు.

10. శ్లో. సహ యజ్ఞైః ప్రజా స్సృష్ట్వా । పురో వాచ ప్రజాపతిః ।
అనేన ప్రసవిష్యధ్వం । ఏష వోఽస్త్విష్ట కామధుక్ ॥

అర్థము : పురా = సృష్టికాలమున, ప్రజాపతిః = నారాయణుడు, యజ్ఞైఃసహ = యజ్ఞములతోపాటు, ప్రజాః = ప్రజలను, సృష్ట్వా = పుట్టించి, అనేన = ఈ యజ్ఞముతో, ప్రసవిష్యధ్వం = వృద్ధిపొందుడు, ఏషః = ఈ యజ్ఞము, వః = మీకు, ఇష్టకామధుక్ = కావలసిన కోర్కెల నిచ్చునది, అస్తు = అగుగాక, (ఇతి) = (అని), ఉవాచ = పలికెను.

తా ॥ శ్రీమన్నారాయణుడు ప్రజలను సృష్టించునపుడే వారితో పాటుగా యజ్ఞములనుకూడసృష్టించి 'ఇవి మీకు మోక్షమును, దానికి కావలసినవాటి నన్నిటిని యిచ్చును గాన వీటి నాచరించి వృద్ధిపొందుడు' అని యానతిచ్చెను?

అవ. దానినే ఉపపాదించుచున్నాడు.

11. శ్లో. దేవాన్ భావయతా నేన । తే దేవా భావయన్తు వః ।
పరస్పరం భావయన్తః । శ్రేయః పర మవాప్స్యథ ॥

అర్థము : (హేప్రజాః = ఓ ప్రజలారా !), అనేన = ఈ యజ్ఞముచేత, దేవాన్ = దేవతలను, భావయత = ఆరాధింపుడు, తే, దేవాః = ఆ, దేవతలు, వః = మిమ్ములను, భావయన్తు = పోషింతురుగాక ! పరస్పరం = ఒకరినొకరు, భావయన్తః = ఆదరించుకొనుచున్న వారగుచు, పరం = గొప్పదైన, శ్రేయః = వృద్ధిని (మోక్షమును) అవాప్స్యథ = పొందగలరు.

తా ॥ ఈ యజ్ఞముల నాచరించి మీరు దేవతల నారాధించిన, వారు మీకు అవసరమగు వాటి నొసంగి మిమ్ము పోషింతురు. ఇట్లొకరి నొకరు ఆదరించుకొనుచున్నచో మీకు తుదకు మోక్షముకూడ లభించును.

అవ. యజ్ఞములను విడిచిన దోషమును చూపుచున్నాడు.

12. శ్లో. ఇష్టాన్ భోగాన్ హి వో దేవాః । దాస్యన్తే యజ్ఞభావితాః ।
తైర్దత్తా నప్రదాయైభ్యో । యో భుఙ్క్తే స్తేన ఏవ సః ॥

అర్థము : యజ్ఞభావితాః = యజ్ఞములచే నారాధింపబడిన, దేవాః = దేవతలు, వః = మీకు, ఇష్టాన్ = కావలసిన, భోగాన్ = సుఖములను, దాస్య న్తేహి = ఇత్తురుగదా !, తైః=

వారిచే, దత్తాన్ = ఇవ్వబడినవాటిని, ఏభ్యః = ఈ దేవతలకొరకు, అప్రదాయ = ఈయక, యః = ఎవడు, భుఙ్క్తే = అనుభవించుచున్నాడో, సః = వాడు, స్తేనఃఏవ= దొంగయే, భవతి = అగుచున్నాడు.

తా ॥ మీరు యజ్ఞములచే దేవతల నారాధించినచో వారు మీకు సమస్త సుఖములనే గాక తిరిగి తమ నారాధించుటకు వలయువాటిని కూడ నొసంగుదురు. అట్టివాటిని తిరిగి యజ్ఞముల నాచరించి వారి కర్పింపక తానే యనుభవించినచో నట్టివాడు దొంగయగును.

అవ. యజ్ఞముల నాచరించిన ఫలమును జూపుచున్నాడు.

13. శ్లో. యజ్ఞశిష్టా శినస్సన్తో । ముచ్యన్తే సర్వకిల్బిషైః ।
భుఞ్జతే తే త్వఘం పాపాః । యే పచ న్త్యాత్మకారణాత్ ॥

అర్థము : యజ్ఞశిష్టాశినః = యజ్ఞమును చేయగా మిగిలినవాటిని తినునట్టి, సన్తః = సజ్జనులు, సర్వకిల్బిషైః = సకల పాపములచే, ముచ్యన్తే = విడువబడుచున్నారు, యేతు = ఎవరైతే, ఆత్మ కారణాత్ = తమకొరకు మాత్రమే, పచన్తి = వండుకొనుచున్నారో, పాపాః = పాపాత్ములగు, తే = వారు, అఘం = పాపమును, భుఞ్జతే = అనుభవించుచున్నారు.

తా ॥ న్యాయార్జిత పదార్థములను భగవంతున కర్పించి తినువారి పాపము లన్నియు పటాపంచలై పోవును. కాని, అట్లుచేయక తమ పొట్టను నింపుకొనువారు మహాపాపులు. వారు తినునది పాపమేగాని అన్నము కాదు.

అవ. సమస్తమును యజ్ఞమూలమేగాన దాని నాదరించవలెననియు లేనిచో దోషమనియు చెప్పుచున్నాడు.

14. శ్లో. అన్నాత్ భవన్తి భూతాని । పర్జన్యా దన్న సమ్భవః ।
యజ్ఞాత్ భవతి పర్జన్యో । యజ్ఞః కర్మసముద్భవః ॥

అర్థము : అన్నాత్ = అన్నమువలన, భూతాని = సజీవశరీరములు, భవన్తి = కలుగుచున్నవి, పర్జన్యాత్ = వర్షమువలన, అన్నసమ్భవః = అన్నముయొక్క పుట్టుక, (భవతి = కలుగుచున్నది) పర్జన్యః = వర్షము, యజ్ఞాత్ = యజ్ఞమువలన, (భవతి = కలుగుచున్నది), యజ్ఞః = యజ్ఞము, కర్మసముద్భవః = కర్మవలన పుట్టుక కలది, (భవతి = అగుచున్నది).

తా ॥ జీవునితో కూడియున్న శరీరములు అన్నము వలనను, ఆ యన్నము వర్షము వలనను, ఆ వర్షము యజ్ఞము వలనను, ఆ యజ్ఞము ద్రవ్యార్జనాది కర్మల వలనను సిద్ధించును.

15. శ్లో. కర్మ బ్రహ్మోద్భవం విద్ధి । బ్రహ్మాక్షరసముద్భవమ్ ।
తస్మాత్సర్వగతం బ్రహ్మ । నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్ ॥

అర్థము : కర్మ = (అట్టి) కర్మ, బ్రహ్మోద్భవం = శరీరమువలన పుట్టునది గాను, బ్రహ్మ = శరీరము, అక్షరసముద్భవం = జీవునిచే కలుగు నదిగాను, విద్ధి = తెలుసుకొనుము. తస్మాత్ = అందువలన, సర్వ గతం = కర్మాధికారులందరకునుగల, బ్రహ్మ = శరీరము, నిత్యం = ఎల్లప్పుడును, యజ్ఞే = యజ్ఞమునందు, ప్రతిష్ఠితమ్ = ఆధార పడియున్నది, (భవతి = అగుచున్నది.)

తా ॥ అట్టి కర్మ సజీవశరీరమువల్ల పుట్టును. అనగా అట్టి కర్మలు చేయు శక్తి అన్నపానాదులచే తృప్తిచెందిన జీవునివలన పుట్టును. కావున కర్మాధికారుల శరీరములు యజ్ఞమూలములు.

16. శ్లో. ఏవం ప్రవర్తితం చక్రం । నా నువర్తయ తీహ యః ।
అఘాయు రిన్ద్రియారామో । మోఘం పార్థ! స జీవతి ॥

అర్థము : హే పార్థ = ఓ అర్జునా !, ఏవం = ఈ విధముగా, ప్రవర్తితం = నడుపబడిన, చక్రం= చక్రమును, యః = ఎవడు, ఇహ = ఈ లోకమున, న అనువర్తయతి = అనుసరించి నడవడో, సః = వాడు, అఘాయుః = పాపములకే నగు ఆయువు కలవాడును, ఇన్ద్రియా రామః = ఇన్ద్రియములే సుఖించు తోటలుగా కలవాడును (అయి), మోఘం = వ్యర్థముగా, జీవతి = బ్రతుకుచున్నాడు.

తా ॥ ఈ విధముగ పరమాత్మచే నిర్దిష్టమైన కర్మచక్రమును అనుసరించి నడువనివాడు పాపజీవియు, ఇంద్రియ భోగలాలసుడును, వ్యర్థమైన బ్రతుకుకలవాడును అగుచున్నాడు.

అవ.సహజమగు ఆత్మదర్శనము కలుగు ఫలదశలో కర్మల నాచరింప నవసరము లేదనుచున్నాడు.

17. శ్లో. యస్త్వా త్మరతి రేవ స్యాత్ । ఆత్మతృప్తశ్చ మానవః ।
ఆత్మన్యేవ చ సన్తుష్ట । స్తస్య కార్యం న విద్యతే ॥

అర్థము : యః = యే, మానవఃతు = మనుష్యుడైతే, ఆత్మరతిఃఏవ = ఆత్మయందే

ఆసక్తిగలవాడును, ఆత్మతృప్తఃచ = ఆత్మచేతనే తృప్తిచెందినవాడును, ఆత్మని ఏవ= ఆత్మయందే, సంతుష్టఃచ = సంతోషించువాడును, స్యాత్ = అగునో, తస్య= వానికి, కార్యం = చేయతగినది, నవిద్యతే = లేదు.

తా ॥ ఎవనికి పూర్వకర్మ విశేషమువలన ఆత్మధ్యానమే ధారకము, పోషకము, భోగ్యము అగునో వాడు తిరిగి ఆత్మదర్శనము కొరకేమియు చేయ నవసరము లేదు.

18. శ్లో. **నైవ తస్య కృతేనార్థో । నా కృతేనే హ కశ్చన**
న చాస్య సర్వభూతేషు । కశ్చి దర్థవ్యపాశ్రయః ॥

అర్థము : తస్య = అట్టివానికి, ఇహ = ఈ లోకమున, కృతేన = కర్మలు చేయుటచేత, అర్థః= ప్రయోజనము, నైవ = లేనేలేదు, అకృతేన = కర్మలు చేయకుండుటచేత, కశ్చన= ఏ అనర్థమున్ను, న = లేదు, అస్య = వీనికి, సర్వభూతేషు = సకలభూతముల యందును, అర్థవ్యపాశ్రయః = ప్రయోజనముకొరకు ఆశ్రయించ దగినది, కశ్చిత్ = ఒక్కటియు, న = లేదు.

తా ॥ ఇట్లు సహజముగనే ఆత్మను చూడగల వీనికి, అందు నిమిత్తమై కర్మల నాచరించుట వలన వేరొండు లాభము గాని, ఆచరించకుండుటవలన నష్టముగాని యుండదు. కావున వానికి అకాశాది భూతములతోను, తత్కార్యములగు భౌతికములతోను పనిలేదు.

అవ. అట్టి దశకు యోగ్యత లేనివాడు ఆత్మదర్శనమునకై కర్మయోగము నాచరించవలెననుచున్నాడు.

19. శ్లో. **తస్మా దసక్తస్సతతం । కార్యం కర్మ సమాచర ।**
అసక్తో హ్యాచరన్ కర్మ । పర మాప్నోతి పూరుషః ॥

అర్థము : తస్మాత్ = అందువలన, అసక్తః = ఫలాశలేనివాడవగుచు, కార్యం (ఇతి) = చేయవలసినది (అని), సతతం = ఆత్మసాక్షాత్కారము లభించువరకు, కర్మ = కర్మను, సమాచర = చక్కగా చేయు చుండుము, అసక్తః = సంగము లేనివాడై, కర్మ = కర్మను, ఆచరన్ = చేయునట్టి, పూరుషః = నరుడు, పరం = శుద్ధాత్మను, అప్నోతిహి = పొందునుగదా.

తా ॥ కనుక ఆత్మదర్శన మగువరకు తప్పనిసరి యని ఫలాదులను విడిచి కర్మలను జేయుము, తప్పక దానివల్లనే ఆత్మప్రాప్తి కలిగితీరును.

అవ. జ్ఞానయోగాధికారులైనను లోకము కొరకు కర్మలనే చేయవలెననుచున్నాడు.

20. శ్లో. కర్మణైవ హి సంసిద్ధి। మాస్థితా జనకాదయః
లోకసఙ్గ్రహ మేవా పి। సంపశ్యన్ కర్తు మర్హసి ।

అర్థము : జనకాదయః = జనకుడు మొదలగువారు, కర్మణా ఏవహి = కర్మల నాచరించుట చేతనేకదా, సంసిద్ధిమ్ = శుద్ధాత్మ స్వరూపసిద్ధిని, ఆస్థితాః = పొందిరి, లోకసంగ్రహం= లోకరక్షణమును, సంపశ్యన్ అపి = చూచియైనను, కర్తుంఏవ = కర్మలను చేయుటకే, అర్హసి = తగుచున్నావు.

తా॥ జనకుడు మొదలగు మహాత్ములు జ్ఞానయోగాధికారులైనను కర్మల నాచరించుట వలననే శుద్ధాత్మ స్వరూపమును పొందగలిగిరి. లోకము అనర్థముల పాలు గాకుండుటకైనను ఉత్తముడగు జ్ఞానయోగాధికారి కూడ కర్మయోగమునే చేయవలెను.

అవ. ఎందుల కట్లు చేయవలెనో చెప్పుచున్నాడు.

21.శ్లో. యద్య దాచరతి శ్రేష్ఠః। తత్త దేవేతరో జనః।
స యత్ప్రమాణం కురుతే । లోక స్త దనువర్తతే ॥

అర్థము : శ్రేష్ఠః = ఉత్తముడు, యత్ యత్ = ఏయేకర్మను, ఆచరతి = చేయుచున్నాడో, తత్ తత్ ఏవ = ఆయాకర్మనే, ఇతరః = సామాన్యుడగు, జనః = మనుష్యుడు, (ఆచరతి = చేయుచున్నాడు), సః = ఆ ఉత్తముడు, యత్ ప్రమాణం = ఏ అంగములతో కూడినదిగా, కురుతే = చేయుచున్నాడో, లోకః = పామరజనుడున్ను, తత్ = ఆ యంగములతోనే ఆ కర్మను, అనువర్తతే = అనుసరించి చేయుచున్నాడు.

తా॥ గొప్పవాడుగా ఎన్నబడినవాడు ఏ కర్మను ఎట్టి యంగములతో నాచరించునో దానిని జూచి లోకమున పామరుడు కూడా ఆ కర్మనే ఆ యంగములతోనే ఆచరించును.

అవ. ఏ విధమగు ప్రయోజనమును గూడ లేని భగవంతుడైనను కర్మ యోగము నాచరించవలెను.

22.శ్లో. నమే పార్థాస్తి కర్తవ్యం। త్రిషు లోకేషు కిఞ్చన।
నానవాప్త మవాప్తవ్యం। వర్త ఏవ చ కర్మణి ।

అర్థము : పార్థ = ఓ అర్జునా, త్రిషు = మూడగు, లోకేషు = లోకములలోను, మే = నాకు, కర్తవ్యం = చేయవలసిన పని, కిఞ్చన = ఒక్కటియు, నాస్తి = లేదు, అనవాప్తం=

పొందబడనిదియు, అవాప్తవ్యం = పొందవలసినదియు, న = లేదు, (తథాపి
అయినప్పటికిని), కర్మణి = కర్మయందు, వర్తే ఏవ = ప్రవర్తించుచునేయున్నా

తా॥ మూడు లోకముల యందును స్వేచ్ఛా రూపముతో సంచరించు నా
ఇది వరకు లేక ఇప్పుడు కర్మల నాచరించి పొందవలసినదేదియు లేద
ఐనను లోకమును కాపాడుటకే కర్మలను చేయుచున్నాను.

అవ. భగవంతుడేల కర్మల నాచరించవలెనో చెప్పుచున్నాడు.

23.శ్లో. **యది హ్యహం న వర్తేయం। జాతు కర్మణ్య తన్ద్రితః।**
మమ వర్త్మా నువర్తన్తే। మనుష్యాః పార్థ! సర్వశః॥

అర్థము : పార్థ = ఓ అర్జునా, అహం = నేను, జాతు = ఒకవేళ, అతన్ద్రితః = బద్ధకములేనివాడనై
కర్మణి = కర్మయందు, న వర్తేయం యది = ప్రవర్తించక పోతినేని, మనుష్యాః =
మనుష్యులు, సర్వశః = అన్ని విధముల, మమ = నా యొక్క, వర్త్మ = దారినే
అనువర్తన్తే హి = అనుసరింతురు గదా!

తా॥ అర్జునా! నేను బద్ధకించక కర్మలను చేయనేని, లోకులును పూర్తిగా
నావలెనే కర్మల నాచరించకుండగ నుందురు.

24.శ్లో. **ఉత్సీదేయు రిమే లోకాః। న కుర్యాం కర్మ చే దహమ్।**
సఙ్కరస్య చ కర్తా స్యా। ముపహన్యా మిమాః ప్రజాః॥

అర్థము : అహం = నేను, కర్మ = కర్మను, న కుర్యాంచేత్ = చేయనేని, ఇమే, లోకాః = ఈ
జనులు, ఉత్సీదేయుః = చెడుదురు, సఙ్కరస్య = సాంకర్యమునకు, కర్తా =
కారకుడను, స్యాం = అగుదును, ఇమాఃప్రజాః = ఈ లోకులను, ఉపహన్యాం =
పాడుచేసినవాడనగుదును.

తా॥ నేను నా కులోచిత కర్మల నాచరించనిచో దానిని జూచి లోకులును
తమ కర్మలను విడిచి చెడుదురు. దానిచే కులములు సంకరమై ప్రజలు
నశింతురు. ఈ వినాశమునకు మూలము నేనగుదును.

అవ. జ్ఞానయోగాధికారి కర్మలను చేయు విధానమును చెప్పుచున్నాడు.

25.శ్లో. **సక్తాః కర్మణ్య విద్వాంసో। యథా కుర్వన్తి భారత!।**
కుర్యా ద్విద్వాం స్తథాఽ సక్త। శ్చికీర్షు ర్లోక సఙ్గ్రహమ్॥

అర్థము : హే భారత = ఓ అర్జునా!, అవిద్వాంసః = పామరులు, కర్మణి =
కర్మయోగమునందు, సక్తాః = ఆసక్తికలవారై, యథా = ఎట్లు, కుర్వన్తి =

చేయుదురో, తథా = అటులనే, విద్వాన్ = ఆత్మజ్ఞుడు, అసక్తః = ఫలాదులయందు సంబంధము లేనివాడై, లోకసంగ్రహం = లోకరక్షణను, చికీర్షుః = చేయగోరినవాడై, కుర్యాత్ = కర్మలను చేయవలెను.

తా॥ ఆత్మజ్ఞానము కలిగి జ్ఞానయోగమున కర్హుడైన శిష్టుడు కూడ, ఆత్మజ్ఞానము లేకుండుటచే కర్మయోగమునకు మాత్రమే తగినవారు ఆ కర్మలనే చేయునట్లు, తాను కూడా ఫలాదుల నపేక్షింపక లోకరక్షణ కొరకు కర్మలనే చేయవలెను.

26.శ్లో. న బుద్ధిభేదం జనయేత్ । అజ్ఞానాం కర్మసజ్గినామ్ ।
జోషయే త్సర్వకర్మాణి । విద్వాన్ యుక్త స్సమాచరన్ ।

అర్థము : విద్వాన్ = ఆత్మజ్ఞాని, అజ్ఞానాం = ఆత్మజ్ఞానములేని, కర్మసజ్గినాం = కర్మయోగులగువారికి, బుద్ధిభేదం = బుద్ధికి మార్పును, న, జనయేత్ = పుట్టించరాదు, యుక్తః = జ్ఞానముతో కూడిన వాడై, సమాచరన్ = కర్మల నాచరించుచు, సర్వకర్మాణి = అన్ని కర్మలను గూర్చియు, జోషయేత్ = ప్రేమను పుట్టించవలెను.

తా॥ ఆత్మను లెస్సగ నెఱుంగనివారు దానిని సాక్షాత్కరించుకొనుటకు కర్మయోగమునే యవలంబింతురు. ఆత్మజ్ఞానియగువాడు వారి బుద్ధి మారకుండునట్లు తానుకూడ కర్మయోగమే ఆత్మసాక్షాత్కారము కలుగచేయునను బుద్ధితో కూడి వారికి దానియందు ప్రేమను పుట్టించవలెను.

అవ. ఇట్లు కర్మయోగము నాచరించు పండితునకును పామరునకును భేదమును తెలుపుచున్నాడు. అందు పామరుడు.

27.శ్లో. ప్రకృతేః క్రియమాణాని । గుణైః కర్మాణి సర్వశః ।
అహఙ్కారవిమూఢాత్మా । కర్తాఽహ మితి మన్యతే ।

అర్థము : అహఙ్కారవిమూఢాత్మా = దేహాత్మాభిమానముచే ఆత్మస్వరూపము నెఱుగనివాడు, ప్రకృతేః = ప్రకృతి యొక్క, గుణైః = సత్త్వరజస్తమో గుణములచే, సర్వశః = అనేక విధములుగా, క్రియమాణాని = చేయబడుచున్న, కర్మాణి = కర్మలను గూర్చి, అహం = నేను, కర్తా = చేయువాడను, ఇతి = అని, మన్యతే = తలంచుచున్నాడు.

తా॥ ప్రకృతి యొక్క సత్త్వ రజస్తమో గుణములు, తమ స్వభావమును బట్టి అనేక విధములుగ ఆయా కర్మల చేయించుచుండ, దేహాత్మాభిమానముచే

ఆత్మ నెఱుంగనివాడు తానే కర్తనని తలంచును.

28.శ్లో. తత్త్వవిత్తు మహాబాహో ! । గుణకర్మ విభాగయోః ।
గుణా గుణేషు వర్తన్తే । ఇతి మత్వా న సజ్జతే ॥

అర్థము : హే మహాబాహో = ఓ అర్జునా!, గుణ కర్మ విభాగయోః = సత్త్వాది గుణముల యొక్కయు, అవి చేయు కర్మల యొక్కయు విభాగ విషయమై, తత్త్వవిత్ తు= నిజ స్వరూపము నెఱింగినవాడు, గుణాః = సత్త్వాది గుణములు, గుణేషు = తమ కార్యముల యందు, వర్తన్తే = ప్రవర్తించుచున్నవి, ఇతి = అని, మత్వా = తలంచి, న సజ్జతే = లగ్నమైయుండడు.

తా॥ సత్త్వాది గుణముల యొక్కయు, అవి చేయు పనుల యొక్కయు తారతమ్యముల నెఱింగినవాడు, ఆ గుణములు తమ పనులను చేయుచున్నవని తలచి ఆ కర్మలయందు తాను కర్తనని తలంపడు.

అవ. జ్ఞానికి కర్మయోగానుష్ఠానావశ్యకతను చెప్పుచున్నాడు.

29.శ్లో. ప్రకృతేర్గుణ సమ్మూఢాః । సజ్జన్తే గుణకర్మసు ।
తాన కృత్స్నవిదో మన్దాన్ । కృత్స్నవిన్న విచాలయేత్॥

అర్థము : ప్రకృతేః = ప్రకృతి యొక్క, గుణసమ్మూఢాః = సత్త్వాది గుణములచే మోహమును చెందినవారు, గుణకర్మసు = సత్త్వాదుల క్రియలయందు, సజ్జన్తే = ఆసక్తులగుచున్నారు, అకృత్స్న విదః = పూర్తి జ్ఞానములేని, తాన్ = అటువంటి, మన్దాన్ = మూర్ఖులను, కృత్స్నవిత్ = పూర్ణజ్ఞానము కలవాడు,న, విచాలయేత్= చలింపజేయరాదు.

తా॥ పూర్తిజ్ఞానములేనివారు ప్రకృతి గుణములచే ఆత్మస్వరూపమును వాస్తవముగ నెఱుంగక కర్మలనే ఆదరముతో నాచరించుచున్నారు. పూర్ణ జ్ఞానము కలవాడు అట్టివారి బుద్ధిని చలింపజేయరాదు.

అవ. తానాచరించు కర్మలకు పరమాత్మనే కర్తగా భావించు రీతిని చెప్పుచున్నాడు.

30.శ్లో. మయి సర్వాణి కర్మాణి । సన్న్యస్యాధ్యాత్మ చేతసా ।
నిరాశీర్నిర్మమో భూత్వా । యుద్ధ్యస్వ విగతజ్వరః ॥

అర్థము : సర్వాణి = సమస్తమైన, కర్మాణి = కర్మలను, మయి = నాయందు, అధ్యాత్మచేతసా= ఆత్మయందు లగ్నమైన మనస్సుతో, సన్న్యస్య = సమర్పించి, నిరాశీః = ఫలము నందాశలేనివాడవును, నిర్మమః = మమకారములేనివాడవున్ను, భూత్వా = అయి,

విగతజ్వరః = మానసిక సంతాపము లేనివాడవై, యుధ్యస్వ = యుద్ధము చేయుము.

తా॥ ఆత్మయొక్క వాస్తవజ్ఞానము కలవాడవై నీవు చేయు కర్మల నన్నిటిని మనసార అంతరాత్మనగు నాయందు సమర్పించి ఫలమునందాశను, 'ఈ కర్మనాది' 'యనెడు మమకారమును విడిచి' నే నేమగుదునో యను బెంగలేక యుద్ధాది శాస్త్రోక్త కర్మల నాచరింపుము.

అవ. ఇదియే ఉపనిషత్తున కభిమతమైన సారతమమగు అర్థమనుచున్నాడు.

31.శ్లో. యే మే మత మిదం నిత్యమ్ । అనుతిష్ఠన్తి మానవాః ।
శ్రద్ధావన్తోఽనసూయన్తో । ముచ్యన్తే తేఽపి కర్మభిః ।

అర్థము : యే, మానవాః = ఏ మనుష్యులు, మే = నా యొక్క, ఇదం, మతం = ఈ యభిప్రాయమును, నిత్యం = ఎల్లప్పుడును, అనుతిష్ఠన్తి = ఆచరించుచున్నారో, శ్రద్ధావన్తః = శ్రద్ధను కలిగియున్నారో, అనసూయన్తః = అసూయ లేకయుందురో, తేఽపి = వారు కూడ, కర్మభిః = కర్మలచే, ముచ్యన్తే = విడిచిపెట్టబడుచున్నారు.

తా॥ ఆస్తికులై ఈ నా మతమును ఆచరించినను, లేదా శ్రద్ధతో విశ్వసించిన ఎ, అదియును లేదా అసూయతో తప్పులెన్నకున్నను, వారందరును కర్మలచే బంధింపబడరు.

అవ. దీనిని నమ్మనివారిని నిందించుచున్నాడు.

32.శ్లో. యే త్వేత దభ్య సూయన్తో । నానుతిష్ఠన్తి మే మతమ్ ।
సర్వజ్ఞాన విమూఢాంస్తాన్ । విద్ధి నష్టా నచేతసః॥

అర్థము : యేతు = ఎవరైతే, మే = నాయొక్క, ఏతత్ మతం = ఈ అభిప్రాయమును, అభ్యసూయన్తః = ద్వేషించువారై, నానుతిష్ఠన్తి = ఆచరించరో, తాన్ = వారిని, సర్వజ్ఞాన విమూఢాన్ = అన్ని జ్ఞానములయందును మిక్కిలి మూఢులనుగాను, నష్టాన్ = చెడినవారినిగాను, అచేతసః = మనస్సులేని వారినిగాను, విద్ధి = తెలిసికొనుము.

తా॥ సమస్త ఆత్మలును నాచేత నడుపబడుచున్న వనెడు నా సిద్ధాంతమును ఆదరించకయు, దానియందు శ్రద్ధలేకయు, అసూయపడుచుండు వారికి ఎన్నడును వాస్తవ జ్ఞానము కలుగక మూఢులై చెడుదురు.

అవ. ప్రాచీన వాసనాబలముచే జ్ఞానయోగము కష్టసాధ్యమగుట వలన స ప్రమాదమనుచున్నాడు.

33.శ్లో. సదృశం చేష్టతే స్వస్యాః । ప్రకృతే ర్జ్ఞానవానపి ।
ప్రకృతిం యాన్తి భూతాని । నిగ్రహః కిం కరిష్యతి॥

అర్థము : జ్ఞానవాన్ అపి = ఆత్మజ్ఞానము కలవాడైనను, స్వస్యాః = తన యొక్క, ప్రకృతేః= ప్రాచీనవాసనకు, సదృశం = తగునట్లుగా, చేష్టతే = చేయుచున్నాడు, భూతాని = ప్రాణులు, ప్రకృతిం = అనాది వాసనను, యాన్తి = అనుసరించుచున్నవి, నిగ్రహః= శాస్త్ర నియమనము, కిం, కరిష్యతి = ఏమి చేయగలదు?

తా॥ శాస్త్రముల నెఱింగినవాడైనను, తన ప్రాచీన కర్మ వాసనను బట్టియే విషయములను బట్టి ప్రాకులాడుచుండును. ఇది ప్రకృతి సంబంధముగల ప్రాణుల స్వభావము, శాస్త్ర జ్ఞాన మీ ప్రవాహము నడ్డజాలదు.

అవ. ప్రాచీనవాసన వీనినెట్లు విషయ ప్రవణునిగా చేయుచున్నదో చెప్పుచున్నాడు.

34.శ్లో. ఇన్ద్రియ స్యేన్ద్రియ స్యార్థే । రాగద్వేషౌ వ్యవస్థితౌ ।
తయో ర్నవశ మాగచ్ఛేత్ । తౌ హ్యస్య పరిపన్థినౌ ।

అర్థము : ఇన్ద్రియస్య = జ్ఞానేన్ద్రియము యొక్క, అర్థే = విషయమగు శబ్దాదులయందును, ఇన్ద్రియస్య = కర్మేన్ద్రియము యొక్క, అర్థే = విషయమగు వాగాదుల యందును, రాగద్వేషౌ = అపేక్షయును, అసహ్యమును, వ్యవస్థితౌ = ఏర్పడియున్నవి, తయోః= ఆ రాగద్వేషములకు, వశం = లొంగుటను, న ఆగచ్ఛేత్ = పొందరాదు, తౌ = ఆ రెండును, అస్య = వీనికి, పరిపన్థినౌ = శత్రువులు.

తా॥ జ్ఞానేన్ద్రియములకు శబ్దాదులయందును, కర్మేన్ద్రియములకు వాగాదుల యందును పూర్వవాసనను బట్టి ఆదరవో, అసహ్యవో నిర్ణీతమైయుండును. అవి జ్ఞానమునకు ముఖ్య విరోధులు. జ్ఞాని వాటికి లొంగరాదు.

అవ. జ్ఞానయోగముకంటె కర్మయోగమే శ్రేష్ఠమనుచున్నాడు.

35.శ్లో. శ్రేయాన్ స్వధర్మో విగుణః । పరధర్మా త్స్వనుష్ఠితాత్ ।
స్వధర్మే నిధనం శ్రేయః । పరధర్మో భయావహః ।

అర్థము : స్వనుష్ఠితాత్ = సాంగముగననుష్ఠింపబడిన, పరధర్మాత్ = జ్ఞానయోగముకంటె,

స్వధర్మః = తనకు తగినకర్మయోగము, విగుణః (అపి) = అంగవైకల్యము కలదైనను, శ్రేయాన్ = ఉత్తమమైనది, స్వధర్మే = తన ధర్మమగు కర్మయోగము నందు, నిధనమపి = చనిపోవుటయు, శ్రేయః = మంచిది, పరధర్మః = అన్యధర్మమైన జ్ఞానయోగము, భయావహః = భయంకరమైనది.

తా॥ మంచిదైనను కొంత చేసి విడిచిపెట్టిన జ్ఞానయోగము ఫలము నెన్నటికిని యీయజాలదు. దానికంటె ఇంద్రియముల కలవాటుగల కర్మయోగము కొంత అంగవైకల్యము కలిగినను ఎప్పటికైనను ఫలము నొసగును. కావున, కర్మయోగమే నిరపాయము. జ్ఞానయోగము సాపాయము.

అవ. ప్రాచీనవాసన జ్ఞానినెట్లు విరుద్ధమగు విషయానుభవమునందు ప్రవర్తింపజేయుచున్నదని అర్జును డడుగుచున్నాడు.

అర్జున ఉవాచ : = అర్జునుడు పలికెను.

6.శ్లో. అథ కేన ప్రయుక్తోఽయం । పాపం చరతి పూరుషః ।
అనిచ్ఛన్నపి వార్ష్ణేయ! బలా దివ నియోజితః ॥

ర్థము : హే వార్ష్ణేయ = ఓ శ్రీకృష్ణా! అథ = మరి, అయం = ఈ, పురుషః = మనుష్యుడు, అనిచ్ఛన్ అపి = ఇష్టము లేకున్నను, కేన = దేనిచే, ప్రయుక్తః = ప్రేరేపింపబడి, బలాత్ = బలవంతముగా, నియోజిత ఇవ = కూర్చబడినవానివలె, పాపం = పాపమును, చరతి = ఆచరించుచున్నాడు?

తా॥ కృష్ణా! మనుష్యుడు విషయములను అనుభవించవలెనని కోరకున్నను దేనిచే ప్రేరేపించబడి బలాత్కారముగ కూర్చబడినట్లు కూడని విషయములను అనుభవించుటయను పాపమును చేయుచున్నాడు?

అవ. పూర్వవాసన కామమును పుట్టించి ప్రవర్తింప చేయుచున్న దనుచున్నాడు.

శ్రీభగవానువాచ : శ్రీకృష్ణుడు పలికెను.

7.శ్లో. కామ ఏషః క్రోధ ఏషః । రజోగుణ సముద్భవః ।
మహాశనో మహాపాప్మా । విద్ధ్యేన మిహ వైరిణమ్ ॥

ర్థము : ఏషః = ఈ కారణమైనది, రజోగుణ సముద్భవః = రజోగుణముల వలన పుట్టిన, కామః = కామమే, మహాశనః = ఆకలి తీరని శత్రువైన, ఏషః = ఈ కామము, క్రోధః = కోపముగా మారినదై, మహాపాప్మా = మహా పాపములకు మూలము, (భవతి =

అగుచున్నది) ఏనం = ఈకామమును, ఇహ = ఈ జ్ఞానయోగమున, వైరిణం శత్రువునుగా, విద్ధి = తెలుసుకొనుము.

తా॥ రజోగుణము వలన కామము పుట్టును. దీనికి ఎంత అనుభవించినన తృప్తి లేదు. ఇదియే అడ్డగింపబడి కోపముగా మారి ఘోర పాపముః చేయించును. ఇది జ్ఞానికి ముఖ్య శత్రువు.

అవ.శత్రువగు కామమెట్లు అపకారమును చేయుచున్నదో చెప్పుచున్నాడు.

38.శ్లో. ధూమేనావ్రియతే వహ్నిః । యథాఽదర్శో మలేన చ ।
యథోల్బే నావృతో గర్భః । తథా తేనేద మావృతమ్ ।

అర్థము : యథా = ఎట్లు, వహ్నిః = నిప్పు, ధూమేన = పొగచే, ఆవ్రియతే = ఆవరింపబడుచున్నదో, ఆదర్శః = అద్దము, మలేన = మురికిచే, (ఆవ్రియతేచః కప్పబడుచున్నదో) యథా = ఎట్లు, గర్భః = గర్భమందున్న శిశువు, ఉల్బేన = మావిచేత, ఆవృతః = కప్పబడియున్నదో, తథా = ఆ విధముగనే, తేన = ఆ కామముచేత, ఇదం = ఈచేతన సముదాయము, ఆవృతమ్ = కప్పబడియున్నది.

తా॥ పొగచే నిప్పున్ను, మురికిచే సద్దమున్ను, మావిచే గర్భస్థ పిండమున్ను కప్పబడి యున్నట్లు ఈ కామముచే నీ చేతన సముదాయమంతయు కప్పబడియున్నది.

అవ. జ్ఞాని యొక్క కామము జ్ఞానము నెట్లావరించునో చెప్పుచున్నాడు.

39.శ్లో. ఆవృతం జ్ఞాన మేతేన । జ్ఞానినో నిత్యవైరిణా ।
కామరూపేణ కౌన్తేయ! । దుష్పూరేణానలేన చ ।

అర్థము : హేకౌన్తేయ = ఓ అర్జునా!, నిత్యవైరిణా = అనాది శత్రువైన, కామరూపేణ = కామమనబడు, దుష్పూరేణ = పొందనలవికాని విషయములుగల, అనలేన = తృప్తిలేనిదగు, ఏతేన = ఈ శత్రువు చేత, జ్ఞానినః = జ్ఞానియొక్క, జ్ఞానం = ఆత్మజ్ఞానము, ఆవృతం = కప్పబడియున్నది.

తా॥ ఆత్మజ్ఞానము ఈ రీతిని ఆశగల దుర్లభ విషయముల నపేక్షించు కామమనబడు అనాది శత్రువుచే ఆవరింపబడియుండును.

అవ. కామమునకు జ్ఞానము నావరించుటకు ఉపకరణములను చెప్పుచున్నాడు.

40.శ్లో. ఇన్ద్రియాణి మనోబుద్ధిః । అస్యాధిష్ఠాన ముచ్యతే ।
ఏతై ర్విమోహయ త్యేషః । జ్ఞాన మావృత్య దేహినమ్ ॥

అర్థము : అస్య = ఈ కామమునకు, ఇన్ద్రియాణి = జ్ఞానేన్ద్రియములు, మనః = మనస్సు, బుద్ధిః = బుద్ధియున్ను, అధిష్ఠానం ఇతి = ఆత్మనాక్రమించుటకు సాధనములని, ఉచ్యతే = చెప్పబడుచున్నవి, ఏషః = ఈ కామము, ఏతైః = ఈ ఇన్ద్రియాదులతో, జ్ఞానం = జ్ఞానమును, ఆవృత్య = కప్పి, దేహినం = జీవుని, విమోహయతి = పెక్కురీతుల మోహపెట్టుచున్నది.

తా॥ కామము జ్ఞానేంద్రియములను, మనస్సును, బుద్ధిని పట్టి జీవుని జ్ఞానమును కప్పి యాతనిని స్వాధీనపరచుకొని ఆత్మజ్ఞానమును కలుగనీయక విషయలోలుని గావించుచున్నది.

అవ. ఇంద్రియ నియమమును ప్రథమకామ విజయోపాయమను చున్నాడు.

41.శ్లో. తస్మాత్త్వ మిన్ద్రియాణ్యాదౌ । నియమ్య భరతర్షభ! ।
పాప్మానం ప్రజహి హ్యేనం । జ్ఞాన విజ్ఞాన నాశనమ్ ॥

అర్థము : హే భరతర్షభ = ఓ భరత వంశోత్తమా! తస్మాత్ = అందువలన, త్వం = నీవు, ఆదౌ = ముందు, ఇన్ద్రియాణి = ఇంద్రియములను, నియమ్య = నియమించి, జ్ఞాన విజ్ఞాన నాశనం = ఆత్మ స్వరూపమును గూర్చిన జ్ఞానమును, దాని వివేకమును గూర్చిన విజ్ఞానమును నశింపజేయు, పాప్మానం = పాపరూపమైన, ఏనం = ఈ కామమును, ప్రజహి = పూర్తిగా విడిచిపెట్టుము.

తా॥ కాబట్టి, నీవు ఆత్మస్వరూపమును దాని వివేకమును తెలియనీయక ఆటంకపరచునట్టి యీ పాపిష్ఠి కామమును ముందుగ నింద్రియముల నియమించి పూర్తిగ విడిచిపెట్టుము.

అవ. జ్ఞాన విరోధులలో ప్రధానమైనది కామమని చెప్పుచున్నాడు.

42.శ్లో. ఇన్ద్రియాణి పరాణ్యాహుః । ఇన్ద్రియేభ్యః పరం మనః ।
మనసస్తు పరా బుద్ధిః । యో బుద్ధేః పరతస్తు సః ॥

అర్థము : ఇన్ద్రియాణి = ఇంద్రియములు, పరాణి = (జ్ఞానమును చెరుపుటలో) ప్రధానములని, ఆహుః = చెప్పుదురు, ఇన్ద్రియేభ్యః = ఇంద్రియములకంటె, మనః = మనస్సు,

పరం = ముఖ్యము, మనసః = మనస్సు కంటె, బుద్ధిః = బుద్ధి, పరా = ముఖ్యము, బుద్ధేఃతు = బుద్ధికంటెనైతే, సః = ఆకామము, పరతః =ముఖ్యమైనది.

తా॥ జ్ఞానమును చెరచుటకు ఇంద్రియములు ప్రధానములు. వాటికంటె గొప్పది మనస్సు, దానిని మించినది విపరీత బుద్ధి, వీటినన్నిటిని మించినది ఆ కామము.

అవ. కామ దౌర్జన్యమును విస్తరముగనుపదేశించి మునుముందు దానిని జయింపుమని చెప్పి తన ఉపదేశమును ముగించుచున్నాడు.

43.శ్లో. **ఏవం బుద్ధేః పరం బుద్ధ్వా । సం స్తభ్యాఽత్మాన మాత్మనా ।**
జహి శత్రుం మహాబాహో! । కామరూపం దురాసదమ్ ॥

ఇతి శ్రీ భగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే
శ్రీకృష్ణార్జున సంవాదే కర్మయోగోనామ తృతీయోఽధ్యాయః॥

అర్థము : మహాబాహో! = అర్జునా, ఏవం = ఈ ప్రకారముగా, (కామం = కామమును) బుద్ధేః పరం = బుద్ధికంటెను గొప్ప (శత్రువైన) దానినిగా, బుద్ధ్వా = తెలుసుకుని, ఆత్మానం = మనస్సును, ఆత్మనా = బుద్ధిచేత, సంస్తభ్య = కర్మయోగమునందే నెలకొల్పి, కామరూపం = కామమనెడు, దురాసదం = జయింపశక్యముకాని, శత్రుం = శత్రువును, జహి =నశింపజేయుము.

తా॥ ఇట్లు జ్ఞానయోగమును చెరచుటలో కామమును బుద్ధికంటెను గొప్పదని యెఱింగి మనస్సును బుద్ధితో కర్మయోగమునందే నెలకొల్పి యీకామమనెడు ప్రబలమగు శత్రువును నశింపజేయుము.

ఇది ఉపనిషత్సు రూపమును. బ్రహ్మవిద్యయు యోగశాస్త్రము
శ్రీకృష్ణార్జున సంవాద రూపమును అయిన శ్రీ భగవద్గీతయందలి
కర్మయోగమనబడు

తృతీయాధ్యాయము

అర్జునుని శ్లోకములు 3. భగవంతుని శ్లోకములు 40.

మొత్తము తృతీయాధ్యాయ శ్లోకములు 43.

శ్రీమద్భగవద్గీతా ప్రశ్నోత్తరావళి
మూడవ అధ్యాయము

1.ప్ర. ఈ అధ్యాయమునకు పేరేమి? ఇది ఎందుల కుంచబడినది?

ఉ. ఈ అధ్యాయమునకు కర్మయోగమని పేరు. ఈ అధ్యాయమునకు మొదట అర్జునుడు శ్రీకృష్ణుని కర్మయోగ జ్ఞానయోగములలో తాను దేనిని ఆచరింపవలెనో చెప్పుమని కోరెను. అందులకు శ్రీకృష్ణుడు మోక్షమును కోరు సంసారి, తాను తరించుటకును, జ్ఞానయోగియగు అధికారి తాను తరించి లోకమును తరింప జేయుటకును, జనకాదులవలె కర్మయోగమునే ఆచరించవలెననియు, గొప్పవాడుగా పరిగణింపబడువాడు తనకవసరము లేకున్నను లోకులకొఱకు కర్మయోగమునే ఆచరించవలెననియును సహేతుకముగ నీ అధ్యాయమున నుపదేశించెను. కావున ఈ అధ్యాయమునకు కర్మయోగము అను పేరుంచబడినది.

2. ప్ర. ఈ అధ్యాయమున చెప్పబడు ప్రధాన విషయములెవ్వి?

ఉ. 1) 'ముముక్షువగు సంసారికి కర్మయోగ జ్ఞానయోగములలో ఏది సుకరమను అర్జునుని ప్రశ్నకు శ్రీకృష్ణుడు అట్టివారికి జ్ఞానయోగము దుష్కరమనియు, కర్మయోగము సుకరమనియు, సహేతుకముగ నుపదేశించుట (3 అ. 1. 2. 3. శ్లో)

2) కర్మయోగము నాచరించినగాని, పాపములు నశించి మోక్షమునకు తగిన మనశ్శుద్ధి లభింపకపోవుట చేతను, కర్మలాచరించనిచో శరీర యాత్ర దుర్భరమగుట చేతను మనుష్య సృష్టితోపాటు వాని కాచరణయోగ్యమగు కర్మలను సృష్టించి వాటిని విడువక యాచరింపుమని భగవదాజ్ఞయగుట చేతను, సజీవ శరీరము లన్నము వలనను, అన్నము వర్షము వలనను, వర్షము యజ్ఞము వలనను, యజ్ఞము కర్మవలనను, కర్మ సజీవ శరీరమువలనను, సజీవ శరీరము తిరిగి యన్నము వలనను, ఇట్లు చక్రమువలె ప్రవర్తించు ఈ కర్మయోగమును అనువర్తించనివాని జన్మ నిరర్థకమని భగవంతుడు శాసించుటచేతను ముముక్షువగు సంసారికి కర్మయోగము నాచరించుట ఆవశ్యకమని ఉపదేశించుట. (3 అ–8, 10, 11, 14, 15, 16 శ్లో)

3) జనకునివలె జ్ఞానయోగమున కర్హులైనను, కర్మయోగమంత కంటె సుకర మగుటచేతను నిష్ప్రమాదమగుట చేతను పరిగ్రాహ్యమగుటయేగాక తనను జూచి లోకులు కర్తవ్య విముఖులగుటచే చెడుటవలన కలిగిన పాపము తనను జ్ఞానయోగ భ్రష్టుని చేయును గాన తన కొఱకును కర్మయోగమును ఆచరింపవలెననియు, పరమాత్మవలె తనకే యపేక్షయు లేకున్నను ప్రత్యవాయభీతి లేకున్నను లోకసంగ్రహమనెడు పరార్థ ప్రవృత్తికైనను పురుషోత్తముడైన వానికి కర్మయోగమనివార్యమని ఉపదేశించుట.

(3అ - 20, 21, 22, 25 శ్లో)

4) కర్మయోగము నాచరించుచున్నను ఆ కర్తృత్వమును గుణములయందను సంధించి ఆచరించవలెనని చెప్పుట, అనగా - ఆత్మకు ఈ సాంసారిక కర్మలయందు ప్రవృత్తి స్వరూప సిద్ధమైనదిగాక గిన్నె యొక్క సంపర్కముచే నీరు వేడియెక్కినట్లు ప్రకృతియొక్క పరిణామమగు శరీరముయొక్క సంపర్కముచే ఆత్మకు ఆగంతుకముగా తటస్థించినదని అనుసంధించుట

(3 అ. 28 శ్లో)

5) లేక ఈ కర్తృత్వమును పరమాత్మయందనుసంధించి ఆచరించవలెనని చెప్పుట. అనగా - పరమ పురుషుడు ఈ జీవుని తనకు పరికరముగా పరిగ్రహించి తన సేవకొరకే యాతనికి ప్రసాదించిన అవయవములతో రాజు సేవకునివలె తన సేవను చేయించుకొనుచున్నాడని యనుసంధించుచు ఆ కర్మలయందు మమకారమును ఫలములయందాశయును లేక పరమ పురుషుడే ఈ విధముగ తనచే ఆరాధింపబడి బంధవిముక్తుని గావించునను అధ్యవసాయముతో కర్మయోగము నాచరించవలెనని బోధించుట

(3అ. 30శ్లో)

6) ఈ సిద్ధాంతము నాచరించువారిని ప్రశంసించి, యానాదరించువారిని నిందించుట. (3అ. 31, 32 శ్లో)

7) జ్ఞానయోగము కష్టసాధ్యమగుటచే సప్రమాదమని బోధించుట.

(3అ. 33, 34 శ్లో)

8) విషయానుభవములను వీడి జ్ఞానయోగము నవలంబించిన వాడేల విషయానుభవలోలుడై, భ్రష్టుడగుచున్నాడని అర్జునుడు ప్రశ్నించుట.

(3అ. 36శ్లో)

9) రజోగుణ ప్రకోపము వలన ఉదయించి, ఇంద్రియ మనోబుద్ధుల ద్వారా జ్ఞానము నావరించి, దానిని రూపుమాపి చివరకు క్రోధముగా పరిణమించి, చేయరాని పనులను చేయించు కామమే దీనికి మూలముగాన దానిని పూనికతో ఛేదింపుమని శ్రీకృష్ణపరమాత్మ అర్జునుని హెచ్చరించుట.

(3అ, 37, శ్లో మొ. చివరకు)

3.ప్ర. ఈ అధ్యాయమునకు ప్రధాన శాస్త్రముతో గల సంబంధమేమి?

ఉ. గీతా శాస్త్రమునకు ప్రధాన పురుషార్థమైన మోక్షమునకు సాధనమగు భక్తికి అంగమైన జీవాత్మయొక్క సాక్షాత్కారమునకు సాధనమగు కర్మయోగమే ముముక్షువునకు ముఖ్యముగా ననుష్ఠింపతగినది గాన దాని నాచరించు విధానమును, దానినాటంకపరచు ప్రతిబంధకమును, దానిని తొలగించు ఉపాయమును ఈ అధ్యాయమునందు చెప్పబడుచున్నవి. కాన ప్రధాన శాస్త్రార్థములతో దీనికీ విధముగ పరంపరా సంబంధముగలదు.

4. ప్ర. ఈ అధ్యాయమున అర్జునునకు కలిగిన సందేహమేమి? దానికి కారణమేమి? దానిని శ్రీకృష్ణుడెట్లు పరిహరించెను?

ఉ. ఆత్మను చూచుటకు సాధనము జ్ఞానయోగము. అట్టి జ్ఞానయోగము ఇంద్రియ వ్యాపారములనన్నింటిని వాలించి సంపాదింపవలసియున్నది. ఇక యుద్ధమన్ననో సమస్త ఇంద్రియ వ్యాపారములతో సాధింపతగినది, ఇట్లొకదాని కొకటి మిక్కిలి విరుద్ధముగా నుండగా ఆత్మజ్ఞానమునపేక్షించు నాకు దానికనుకూలమగు జ్ఞానమును పదేశింపక కర్మయోగమునేల ఉపదేశించు చున్నావని అర్జునుడు శ్రీకృష్ణుని ప్రశ్నించెను. (3అ. 1,2 శ్లో)

రెండవ అధ్యాయమున శ్రీకృష్ణుడు అర్జునునకు కర్మయోగమునుపదేశించి యుద్ధమును చేయుమని ప్రోత్సహించెను. తిరిగి దానిచే స్థిత ప్రజ్ఞావస్థయు, దానిచే నాత్మావలోకనమును కలుగునని చెప్పెను. అందుచే నర్జునునకు సందేహము కలిగెను.

అందులకు శ్రీకృష్ణుడు "లోకమున మనుష్యులందరును ఒకే విధమగు నధికారమును కలిగియుండరు, సంసారులై మోక్షమునందాశ జనించినవారు వెంటనే జ్ఞానయోగమునకు తగరు. అట్టివారు కర్మయోగము నాచరించి మనస్సును శుద్ధిపరచుకొని అటు పిమ్మట జ్ఞానయోగులగుదురు. ఏ ప్రయత్నమును లేకయే ఆత్మ ప్రవణులగువారు జ్ఞానయోగమున కర్హులు కావచ్చును. కావున వారి వారి యోగ్యతననుసరించి పరిగ్రహించుటకు వీలుగ రెండుయోగములను నే నుపదేశించియుంటిని. నీవు మాత్రము కర్మయోగమునకే అర్హుడవు కాన జయాపజయములు దైవాధీనములుగా భావించి కర్మయోగరూపమగు యుద్ధమునే చేయుము, అని బోధించి అర్జునుని సందేహమును పరిహరించెను. (3అ. 4 శ్లో. మొ.)

5. ప్ర. కర్మయోగము నాచరింపకయే జ్ఞానమునకు తగినవాడెట్టివాడు?

ఉ. కర్మయోగమును కాని జ్ఞానయోగమును కాని యాచరింపకయే సహజముగా ఆత్మాభిముఖుడై అన్నపానాదులచేగాక ఆత్మదర్శనముచేతనే తృప్తి చెందువాడై ఉద్యాన చందన నృత్త గీత వాయిద్యములచేగాక ఆత్మ దర్శనముచేతనే సంతుష్టుడై ఆత్మయే ధారక పోషక భోగ్యములుగా కలవాడు కర్మయోగమునాచరింపకయే జ్ఞానమున కర్హుడగుచున్నాడు. (3అ. 17శ్లో)

6. ప్ర. కర్మచక్రమనగానేమి?

ఉ. సజీవ శరీరములు అన్నమువలన పుట్టుచున్నవి. అన్నము వర్షమువలన పుట్టుచున్నది. వర్షము యజ్ఞము వలన పుట్టుచున్నది. యజ్ఞము కర్త చేయు కర్మవలన పుట్టుచున్నది. ఆ కర్మ సజీవ శరీరము వలన పుట్టుచున్నది. ఆ సజీవ శరీరము తిరిగి అన్నమువలన పుట్టుచున్నది. ఇట్లే కార్యకారణపరంపర చక్రమువలె పరిభ్రమించుచుండుటచే దీనికి కర్మ చక్రమను పేరుంచబడినది. (3అ. 14, 15. శ్లో)

7. ప్ర. మోక్షేచ్ఛగల ప్రతి మానవుడును మొట్టమొదట కర్మయోగమునే అవలంబింప వలెననుటకు శ్రీ కృష్ణుడు చెప్పిన కారణములెవ్వి?

ఉ. ఫలమునుకోరక భగవదారాధన రూపముగ కర్మలను చేయనిచో భగవంతుని యనుగ్రహము లభింపదు. దానిచే పాపము నశింపదు, దానివలన మనస్సునందలి రజోగుణ తమోగుణమయమగు మాలిన్యము నిలిచియుండును. దానిచే రాగద్వేషములు ఉద్రేకించియుండును, అందుమూలమున ఇంద్రియములు కలత చెందుచుండును. దానిచే ఆత్మనిష్ఠ కలుగనేరదు. అట్టివాడు జ్ఞాననిష్ఠ నవలంబించినను అనర్థమునకే యగునుగాని సార్థకము కాదు. కర్మలను చేయించుటయే స్వభావముగాగలవి సత్త్వరజ స్తమో గుణములు, వానితో కూడియున్నది శరీరము. ఆ శరీర సంబంధము వలన ప్రతివాడును తాను చేయతలంచకయున్నను ప్రతిక్షణమును తన పూర్వజన్మ కర్మ ననుసరించి ఏదో యొక కర్మ చేయించబడుచునే యుండును. కావున కర్మ యోగము నవలంబించి పాపమును నశింపజేసికొని సత్త్వాదిగుణములను స్వాధీనపరచుకొని నిర్మలచిత్తుడైన పిమ్మట జ్ఞానయోగి కావలెను. అట్లుచేయక కర్మేంద్రియము లను కట్టిపెట్టి మనస్సుతో విషయములను ధ్యానించువాడు మిథ్యాచారియై

నశించును. జ్ఞానయోగియైనను అది పూర్తి యగువరకు శరీరమును నిలబెట్టుకొనవలెను గాన కర్మలు తప్పవు. ఆ కర్మలనే భగవదారాధన రూపమగు యజ్ఞరూపముగా నాచరించి మిగిలిన దానితో జీవించుట పాపనాశకరమగును. మనలను సృష్టించునప్పుడే భగవంతుడీ యజ్ఞములను మనకొఱకై సృష్టించెను. కావున ఇవి మనకు తప్పవు. జ్ఞానవృద్ధులగు జనకాదులును, ఏమియు నపేక్షింపని శ్రీకృష్ణుడును కర్మల నాచరించిరి, గావున మనకును వాటిని ఆచరించుట అనివార్యము. కొద్ది జ్ఞానముకల ఆస్తికులు పెద్దలయాచారమునుబట్టి నడచుకొందురు. గాన వారికొఱకైనను జ్ఞాని కర్మలనాచరించుట యవసరము.

(3అ. 5, 6, 8, 10, 13, 16, 20, 22, 24శ్లో)

8. ప్ర. యజ్ఞములను ఎవరు ఎప్పుడు ఎందులకు సృజించిరి?

ఉ. భగవంతుడు సృష్టికాలమునందు సమస్త పురుషార్థములకును అనర్హులగు ప్రజలను జూచి కరుణతో తనను ఆరాధించి తరించుటకై యజ్ఞములను సృష్టించెను. వానితో మనమా దేవతల నారాధించినయెడల వారు మనకు కావలసిన భోగములను ప్రసాదింతురు. మనము వానితో వారి నారాధించి మిగిలినవాటితో జీవనము గడపవలెను. ఇట్లాచరించిన యెడల సత్వగుణము పెరిగి రజోగుణ తమోగుణము లడుగంటుటచే మనపాపములు నశించి మోక్షము కలుగును. (3అ, 10, 11,12, 13శ్లో)

9. ప్ర. శ్రీకృష్ణుడు కర్మయోగమునాచరించెనా? ఏల?

ఉ. శ్రీకృష్ణుడు కర్మయోగము నాచరించి తాను పొందదగినదేదియు లేకున్నను తాను తన విధ్యుక్త కర్మల నాచరించనిచో లోకమున శిష్టుడుగా భావింపబడుచుండుటచే పామరులగు ఆస్తికులు తనను జూచి తాము తమ కర్మలను విడిచి నశింతురు. సాంకర్యము ప్రబలును, దానిచే తాను ముఖ్యముగా చేయదలించి వచ్చిన సాధుజన రక్షణము, ధర్మ సంస్థాపనము జరుగకపోవుటయేగాక అందులకు విపరీతముగా చెడును. అందుచే శ్రీకృష్ణుడు కర్మయోగము నాచరించెను. (3అ, 22, 23, 24శ్లో)

10. ప్ర. కర్మల నాచరించుటలో పండితునకును పామరునకుగల భేదమేమి?

ఉ. పురుషుడు ప్రకృతియొక్క సత్వాదిగుణములచే ప్రేరితుడై వాటికి తగునట్లుగా కర్మలను చేయుచుండును. దేహాత్మాభిమానముకల పురుషుడు ఆ కర్మలకు తానే కర్తనని భావించుచుండును. సత్వాది గుణముల యొక్కయు అవి చేయించు పనుల యొక్కయు, తత్వము నెఱుంగు పండితులు

గుణములే తమ తమ కార్యములయందు ప్రవర్తించుచున్నవి. గాని తామేమియు చేయుటలేదని తలంచి ఆ కర్మలలో తాము సక్తులుగాక యుందురు. ఇదియే పండిత పామరులకుగల భేదము (3అ. 27, 28శ్లో)

11.ప్ర. కర్మలు బంధింపకుండు నట్లాచరించుటలో ప్రధాన సూత్రమేమి?

ఉ. 'సాంసారిక కర్మలయందు కర్తృత్వము ఆత్మకు గుణసంపర్కముచే వచ్చినదిగాని అది దానికి సహజమైనది కాదు?' అని తలంచి గాని, లేక 'భగవంతునిచే తన కింకరుడనగు నాకు, తన యారాధనకొఱకై యివ్వబడిన నా యింద్రియములతో తన యారాధన రూపమగు కర్మలను చేయించుకొనుచున్నాడు' అని తలంచి కర్మల యందు మమకారమును విడిచి ప్రాచీన కర్మలనుండి నేనెట్లు తరింతునాయని పరితపించక కర్మలచే నారాధింపబడు పరమపురుషుడే నన్ను బంధమునుండి విడిపింపగలడు అను విశ్వాసముతో సుఖముగా కర్మలనాచరింపవలెను. (3అ. 30శ్లో భాష్యం)

12.ప్ర. పాపమును నాచరించు తలంపులేకున్నను బలాత్కారముగా నాచరింపజేయునది యెవ్వరని అర్జునుడడిగిన ప్రశ్నకు శ్రీకృష్ణుడొసంగిన సమాధానమేమి?

ఉ. 'రజోగుణమువలన నెంత యనుభవించినను తృప్తి చెందని కామముదయించును. ఆ కామమే వీనిని విషయములవైపు ఆకర్షించును. దాని కాటంకము కలిగినచో నాకామమే చేయరాని పాపమును చేయించునట్టి క్రోధముగా మారును. దానిచే పురుషుడన్ని పాపములను చేయును'. అని శ్రీకృష్ణుడు అర్జునుని ప్రశ్నకు సమాధాన మొసగెను. (3అ. 37శ్లో)

13.ప్ర. మానవుడు దీనిచే నెట్లు ప్రేరేపింపబడుచున్నాడు? దానిని జయించు నుపాయమేమి?

ఉ. మానవుడు రజోగుణమువలన పుట్టిన కామముచే ప్రేరేపింపబడి పాపములను చేయుచున్నాడు.

పొగ నిప్పును గప్పినట్లును, అద్దము మాలిన్యముతో కూడినట్లును, గర్భస్థ శిశువును మావి గప్పినట్లును ఈ కామము జ్ఞానము నావరించుచున్నది. ఇది ఇంద్రియములను మనస్సును బుద్ధిని అధిష్ఠించినదై జీవుని మోహపెట్టుచున్నది. కావున భారతా! నీవు ముందుగ నింద్రియముల నరికట్టి జ్ఞాన విజ్ఞానములను నశింపజేయు నీ కామమును బుద్ధిబలముచే మనస్సును కర్మ యోగముననే నిలిపి జయింపుము.

(3అ. 38, 39, 40 శ్లో)

చతుర్థాధ్యాయార్థ సంగ్రహము

శ్లో॥ ప్రసఙ్గా త్స్వ స్వభావోక్తిః । కర్మణోఽకర్మతాస్య చ ।
భేదాః జ్ఞానస్య మాహాత్మ్యం । చతుర్థాధ్యాయ ఉచ్యతే ॥

ర్థము॥ ప్రసఙ్గాత్ = ప్రసంగవశమున, స్వస్వభావోక్తిః = భగవదవతార యసాధారణ స్వరూపమును చెప్పుట, అస్య చ కర్మణః = ఈ కర్మకు, అకర్మతా = జ్ఞానాకారమగుటయు, (కర్మణః = కర్మయొక్క) భేదాః = భేదములున్ను, జ్ఞానస్య = జ్ఞానముయొక్క, మాహాత్మ్యం = మాహాత్మ్యమున్ను, చతుర్థాధ్యాయే= నాల్గవ అధ్యాయమున, ఉచ్యతే = చెప్పబడుచున్నది.

తా॥ మాటల ప్రసంగములో అవతరించిన భగవంతుని యసాధారణ స్వభావమును చెప్పుటయు, కర్మజ్ఞానాకారమగుటయు, కర్మయోగము యొక్క భేదములున్ను, ఈ కర్మ యోగాన్తర్గతమైన జ్ఞానముయొక్క ప్రభావమున్ను యీ నాల్గవ అధ్యాయమున చెప్పబడుచున్నది.

శ్రీమద్భగవద్గీతా - చతుర్థాధ్యాయము

విషయసూచిక

అస్మద్గురుభ్యో నమః

శ్రీమద్భగవద్గీతా - చతుర్థోఽధ్యాయః

జ్ఞానయోగః

అవ. కర్మయోగ మాచరించవలసినదే యనుటను బలపరచుటకు అది సనాతనమైనదనుచున్నాడు.

శ్రీ భగవాన్ ఉవాచ : శ్రీ కృష్ణుడు పలికెను

1.శ్లో. ఇమం వివస్వతే యోగం। ప్రోక్తవా నహ మవ్యయమ్।
వివస్వాన్ మనవే ప్రాహ। మను రిక్ష్వాకవేఽ బ్రవీత్॥

అర్థము : అవ్యయం = శాశ్వతమైన, ఇమం = ఈ, యోగం = కర్మయోగమును, అహం = నేను, వివస్వతే = సూర్యునకు, ప్రోక్తవాన్ = చెప్పితిని, వివస్వాన్ = సూర్యుడు, మనవే = వైవస్వతమనువునకు, ప్రాహ = చెప్పెను, మనుః = మనువు, ఇక్ష్వాకవే= ఇక్ష్వాకునకు, అబ్రవీత్ = చెప్పెను.

తా॥ ఈ కర్మయోగము శాశ్వతమైనది. పూర్వము నేను దీనిని సూర్యునకు చెప్పితిని. అతడు మనువునకును, మనువు ఇక్ష్వాకునకును ఉపదేశించిరి.

2.శ్లో. ఏవం పరమ్పరా ప్రాప్త। మిమం రాజర్షయో విదుః।
స కాలేనే హ మహతా। యోగో నష్టః పరన్తప ! ॥

అర్థము : పరన్తప =(శత్రువుల తపింపజేయు) ఓ అర్జునా ! ఏవం = ఇట్లు, పరమ్పరాప్రాప్తం= సంప్రదాయక్రమముగా వచ్చిన, ఇమం = ఈ కర్మయోగమును, రాజర్షయః = రాజర్షులు, విదుః = తెలుసుకొనిరి, సః యోగః = ఆ యోగము, మహతా, కాలేన = చాల, కాలమగుటచేత, ఇహ = ఈ లోకమున, నష్టః = నశించినట్లు అయినది.

తా॥ అర్జునా! ఇట్లు ఒకరి నుండి ఒకరికి ఉపదేశ పరంపరగా వచ్చిన యీ కర్మయోగమును రాజర్షు లెఱింగిరి. ఇప్పటికి చాల కాలమగుటచే ఆ కర్మయోగ మీ లోకమున యించుమించుగ నశించినట్లే అయిపోయినది.

3. శ్లో. స ఏవా యం మయా తేఽద్య యోగః ప్రోక్తః పురాతనః ।
భక్తోఽసి మే సఖా చేతి । రహస్యం హ్యేత దుత్తమమ్ ॥

అర్థము : పురాతనః = ప్రాచీనమైన, స ఏవ = ఆ కర్మయోగమే, అయం, యోగః = ఈ కర్మయోగము, (త్వం = నీవు), మే = నాకు, భక్తః = భక్తుడవు, సఖా చ = స్నేహితుడవును, (ఇతి = అని), అద్య = ఇప్పుడు, మయా = నాచేత, తే = నీకు, ప్రోక్తః = చెప్పబడినది, ఏతత్ = ఇది, ఉత్తమం = శ్రేష్ఠమైన, రహస్యం హి = రహస్యము కదా!

తా॥ ఇప్పుడు నీకుపదేశించునది ఆ సనాతన కర్మయోగమే, ఇది ఉత్తమ రహస్యమైనను నీవు నాకు భక్తుడవును, స్నేహితుడవునుగాన ఇప్పుడు నీకు నేను ఉపదేశించుచున్నాను.

అవ. భగవంతుని యవతార రహస్యమును స్పష్టముగా ఆయనవల్ల వినగోరి అర్జునుడడుగుచున్నాడు.

అర్జున ఉవాచ : అర్జునుడు పలికెను.

4.శ్లో. అపరం భవతో జన్మ । పరం జన్మ వివస్వతః ।
కథ మేత ద్విజానీయాం । త్వ మాదౌ ప్రోక్తవా నితి ॥

అర్థము : భవతః = నీయొక్క, జన్మ = పుట్టుక, అపరం = తక్కువ కాలము క్రిందటిది, వివస్వతః = సూర్యునియొక్క, జన్మ = పుట్టుక, పరం = ఎక్కువ కాలము క్రిందటిది, త్వం = నీవు, ఆదౌ = మొదట, ప్రోక్తవాన్ ఇతి = చెప్పితివనెడు, ఏతత్ = ఈ మాటను, కథం = ఎట్లు, విజానీయాం = నిజమని నమ్ముదును?

తా॥ కృష్ణా! నీవీ మధ్య పుట్టితివి. సూర్యుని పుట్టుక యిరువది యెనిమిది చతుర్యుగముల క్రిందటిది. అట్టితరి నీవు సూర్యునకీ యోగము నుపదేశించుట నిజమని నేనెట్లు నమ్మగలను?

☆ ఈ ప్రశ్నలో 6 ప్రశ్నలిమిడియున్నవి : (1) నీ యవతారము ఇంద్రజాలము వంటిదా, లేక మా జన్మవలె సత్యమా? (2) సత్యమైనచో మావలె నీ స్వభావములను విడిచి అవతరింతువా? (3) నీ శరీరము మా శరీరమువలె ప్రాకృతమా అప్రాకృతమా? (4) మావలె నీవును పుణ్యపాపములను కల్పించుకుని యవతరింతువా? లేక సంకల్పముచేతనే యవతరింతువా (5) మావలె ఆ కల్పిత పుణ్యపాపములు పండవలెనా? లేక ధర్మము నశించి అధర్మము పెరిగినతరి యవతరింతువా? (6) మావలె సుఖదుఃఖానుభవము కొఱకవతరింతువా? లేక సాధు పరిత్రాణాదుల కొఱకా? అని -

అవ. శ్రీకృష్ణుడు అర్జునుని ఆశయము నెఱింగి ముందు తనయవతారము సత్యమైనదేయనుచున్నాడు.

శ్రీ భగవాన్ ఉవాచ : శ్రీకృష్ణుడు చెప్పెను.

5.శ్లో॥ బహూని మే వ్యతీతాని । జన్మాని తవ చార్జున ! ।
తాన్య హం వేద సర్వాణి । న త్వం వేత్థ పరన్తప ! ।

అర్థము : పరన్తప = శత్రుసంహారకుడవగు, అర్జున = ఓ అర్జునా!, మే = నాకును, తవచ = నీకును, బహూని = పెక్కులు, జన్మాని = జన్మలు, వ్యతీతాని = గడచినవి, అహం= నేను, తాని, సర్వాణి = వాటిని అన్నింటిని, వేద = ఎఱుగుదును, త్వం = నీవు, న వేత్థ = ఎఱుగవు.

తా॥ అర్జునా! నీవలెనే నాకును పెక్కు జన్మలు గడచినవి. కాని, నాకవి యన్నియు తెలియును : నీవెఱుగవు.

అవ. శ్రీకృష్ణుడు తన స్వభావమును విడువకయే తానవతరించు రీతిని, అవతారమునగూడ తన దివ్య శరీరధారణమును, తన సంకల్పముచేత మాత్రమే తానవతరించుటను చెప్పుచున్నాడు.

6.శ్లో. అజోఽపి సన్న వ్యయాత్మా । భూతానా మీశ్వరోఽపిసన్ ।
ప్రకృతిం స్వా మధిష్ఠాయ । సమ్భవా మ్యాత్మమాయయా॥

అర్థము : అజోఽపిసన్ = పుట్టుకలేనివాడనగుచున్నను, అవ్యయాత్మా (ఽపిసన్) = నశించని స్వభావము కలవాడనగుచున్నను, భూతానాం ఈశ్వరో ఽపిసన్ = ప్రాణులకు నియామకుడనగు చున్నను, స్వాం = నాస్వంతమగు, ప్రకృతిం = దివ్య శరీరమును, అధిష్ఠాయ = అవలంబించి, ఆత్మ మాయయా = నా సంకల్పము చేత, సమ్భవామి = పుట్టుచున్నాను.

తా॥ నేను కర్మవలన కలుగునట్టి పుట్టుటయు గిట్టుటయు లేనివాడను. సర్వ భూతములను శిక్షించువాడను. అయినను నా సంకల్పముచే నా పరమేశ్వర స్వభావమును విడువకయే యప్రాకృత దివ్య శరీరముతో పుట్టుచున్నాను.

అవ. శ్రీకృష్ణుడు తానవతరించు సమయమును చెప్పుచున్నాడు.

7.శ్లో. యదా యదా హి ధర్మస్య । గ్లాని ర్భవతి భారత ! ।
అభ్యుత్థాన మధర్మస్య । తదాత్మానం సృజా మ్యహమ్ ॥

అర్థము : భారత = అర్జునా! ధర్మస్య = వేదోక్తధర్మమునకు, యదాయదాహి = ఎప్పుడెప్పుడైతే,

గ్లానిః = నష్టము, భవతి = కలుగుచున్నదో, అధర్మస్య = అధర్మమునకు, అభ్యుత్థానం = అభివృద్ధి, భవతి = కలుగుచున్నదో, తదా = అప్పుడు, అహం = నేను, ఆత్మానం = నన్ను, సృజామి = సృజింతును.

తా॥ నా జన్మకు కాలనియమము లేదు. వేదోక్తమైన వర్ణాశ్రమ ధర్మములు నశించి అధర్మము ప్రబలినప్పుడెల్లను నేను నా సంకల్పముచే నవతరించుచుందును.

అవ. శ్రీకృష్ణుడు తన యవతార ప్రయోజనమును చెప్పుచున్నాడు.

8. శ్లో. పరిత్రాణాయ సాధూనాం । వినాశాయ చ దుష్కృతామ్ ।
ధర్మసంస్థాపనార్థాయ । సమ్భవామి యుగే యుగే ॥

అర్థము : సాధూనాం = సజ్జనుల యొక్క, పరిత్రాణాయ = రక్షణ కొఱకును, దుష్కృతాం= దుష్టులయొక్క, వినాశాయ చ = నాశము కొఱకున్ను, ధర్మసంస్థాపనార్థాయ = ధర్మమును చక్కగ స్థాపించుట కొఱకును, యుగేయుగే = ప్రతి యుగమందును, సమ్భవామి = పుట్టుచున్నాను.

తా॥ సజ్జనులను రక్షించుటకును, దుష్టులను శిక్షించుటకును, వైదిక వర్ణాశ్రమ ధర్మములను లెస్సగ నెలకొల్పుటకును ప్రతి యుగమందును అవతరించుచుందును.

అవ.ఇట్టి యవతార రహస్యము నెఱుంగుటకు ఫలమును చెప్పుచున్నాడు.

9.శ్లో. జన్మ కర్మ చ మే దివ్య । మేవం యో వేత్తి తత్త్వతః ।
త్యక్త్వా దేహం పునర్జన్మ । నైతి మా మేతి సోఽర్జున ! ॥

అర్థము : అర్జున = అర్జునుడా! దివ్యం = అప్రాకృతమైన, మే = నాయొక్క, జన్మ = అవతారమును, కర్మ చ = అవతారకృత్యమును, యః = ఎవడు, ఏవం = ఈ చెప్పినటుల, తత్త్వః = వాస్తవముగ, వేత్తి = ఎఱుంగుచున్నాడో, సః = వాడు, దేహం = ప్రస్తుత దేహమును,త్యక్త్వా = విడిచిపెట్టి, పునఃజన్మ = తిరిగిపుట్టుకను, న ఏతి = పొందడు, మాం = నన్ను, ఏతి = పొందుచున్నాడు.

తా॥ అర్జునా! ఇప్పుడు నీకు నేను చెప్పినట్లు నా యప్రాకృతమైన అవతార రహస్యమును, నా అవతారకృత్యముల రహస్యమును చక్కగ నెఱుంగువాడు ఈ శరీరమును విడిచి తిరిగి [illegible]

అవ. ఈ యవతార రహస్య జ్ఞానమునకు శిష్టాచారమును కూడ చూపుచున్నాడు.

10.శ్లో. **వీతరాగాభయక్రోధాః । మన్మయా మా ముపాశ్రితాః ।**
బహవో జ్ఞానతపసా । పూతా మద్భావ మాగతాః ॥

అర్థము : వీతరాగభయక్రోధాః = పోగొట్టబడిన అనురాగము భయము కోపముకలవారును, మన్మయాః = నాయందే మనస్సు నుంచిన వారును, మాం = నన్ను, ఉపాశ్రితాః= ఆశ్రయించినవారును అగు, బహవః = అనేకులు, జ్ఞానతపసా = నా యవతార తత్వజ్ఞానమనెడు తపస్సుచేత, పూతాః = పవిత్రులై, మద్భావం = నా స్వభావమును, ఆగతాః = పొందిరి.

తా॥ నా యవతార రహస్యమును వాస్తవముగ నెఱుంగుట ఒక తపస్సువంటిది. తపస్సుచేతనువలె దీనిచే ననేకులు పవిత్రులై యితర విషయ ములయందు ప్రీతిని విడిచి, భయములేక, క్రోధమును పోద్రోలి, నన్నాశ్రయించి, నాయందు చిత్తము లగ్నముచేసి, నా సాయుజ్యమును పొందిరి.

అవ. శ్రీకృష్ణుడు తన సౌలభ్యమునకు చివర హద్దగు అర్చావతార వైభవమును ఉపదేశించుచున్నాడు.

11.శ్లో. **యే యథా మాం ప్రపద్యన్తే । తాం స్తథైవ భజామ్యహమ్ ।**
మమ వర్త్మానువర్తన్తే । మనుష్యాః పార్థ! సర్వశః॥

అర్థము : పార్థ = అర్జునా! యే = ఎవరు, యథా = ఏ విధముగా (భావించి) మాం = నన్ను, ప్రపద్యన్తే = ఆశ్రయింతురో, అహం = నేను, తాన్ = వారిని గూర్చి, తథైవ = ఆవిధముగనే, భజామి = (నన్ను)చూపుచున్నాను, మనుష్యాః = మనుష్యులు, మమ = నాయొక్క, వర్త్మ = స్వభావమును, సర్వశః = అన్ని విధములుగా, అనువర్తన్తే = అనుభవించుచు వర్తించుచున్నారు.

తా॥ నా భక్తులు నన్ను తమ కిష్టమగు ఏ రూపముతో భావించి యాశ్రయింతురో వారికారూపముతోనే నా దర్శనమొసంగుదును. ఇట్టి వారు నా సౌశీల్యాది స్వభావమునంతను తమ ఇంద్రియములతో తాము కోరినట్లు అనుభవింతురు.

అవ. కర్మయోగాధికారులు అరుదుగ నుండుటకు కారణమును చెప్పుచున్నాడు.

12.శ్లో. కాఙ్క్షన్తః కర్మణాం సిద్ధిం । యజన్త ఇహ దేవతాః ।
క్షిప్రం హి మానుషే లోకే । సిద్ధి ర్భవతి కర్మజా॥

అర్థము : ఇహ = ఈ లోకమునందు, కర్మణాం = (తాము చేసిన) కర్మలకు, సిద్ధిం = ఫలమును, కాఙ్క్షన్తః = కోరుచున్నవారై, దేవతాః = ఇంద్రాదులను, యజన్తే = ఆరాధించుచున్నారు, మానుషే, లోకే = మనుష్య లోకమునందు, కర్మజా = కర్మలవలన పుట్టునట్టి, సిద్ధిః = ఫలము, క్షిప్రం = శీఘ్రముగా, భవతి హి = అగుచున్నది కదా!

తా॥ ఈ లోకమున కామ్యకర్మలకు ఫలము వెంటనే లభించును. కావున తరుచు మనుష్యులందరును ఆ క్షుద్రఐహిక ఫలాశతో ఇంద్రాది దేవతలనే పూజింతురు.

అవ. కర్మయోగము నారంభించుటకు ఆటంకములగు పాపములు పోవునట్టి ఉపాయము నుపదేశించుచున్నాడు.

13.శ్లో. చాతుర్వర్ణ్యం మయా సృష్టం । గుణ కర్మ విభాగశః ।
తస్య కర్తార మపి మాం । విద్ధ్యకర్తార మవ్యయమ్॥

అర్థము : మయా = నాచేత, చాతుర్వర్ణ్యం = నాలుగు వర్ణములును, గుణకర్మ విభాగశః = సత్త్వాదిగుణముల యొక్క, శమాదికర్మల యొక్కయు విభాగము ననుసరించి, సృష్టం = సృజించబడెను, మాం = నన్ను, తస్య = ఆ సృష్టికి, కర్తారమపి = కర్తనైనను, అకర్తారం = కర్తను కాననియు, అవ్యయం = నశించననియు, విద్ధి తెలిసికొనుము.

తా॥ నేనే బ్రాహ్మణాది నాలుగు వర్ణములు మొదలుగాగల జగత్తు నంతను సత్త్వాది గుణములను, వానికి తగిన శమదమాదికర్మలను వారి వారికి తగునట్లు విభాగించి సృజించితిని. కాని నన్ను దానికి కర్తనని తలంచరాదు.

అవ. తానే చేసియు కర్త కాకుండుట ఎటులనో తెలుపుచున్నాడు.

14. శ్లో. న మాం కర్మాణి లిమ్పన్తి । న మే కర్మఫలే స్పృహా ।
ఇతి మాం యోఽభిజానాతి । కర్మభి ర్న స బద్ధ్యతే ॥

అర్థము : కర్మాణి = ఈసృష్ట్యాది కర్మలు,మాం = నన్ను, న లిమ్పన్తి = అంటవు, మే = నాకు,

కర్మఫలే = ఆ సృష్ట్యాదికర్మఫలమునందు, స్పృహా = కోరిక, న = లేదు, ఇతి = ఈలాగునని, మాం = నన్ను, యః = ఎవడు, అభిజానాతి = ఎఱుంగుచున్నాడో, సః = వాడు, కర్మభిః = కర్మలచే, న బధ్యతే = బంధింపబడడు.

తా॥ నాకు యీ సృష్ట్యాది కర్మఫలమున కోరిక లేదు. గాన నన్నా కర్మలు సంసారమున బంధింపజాలవు. ఇట్లెఱింగినవాడు కూడా కర్మలచే నెన్నడును బద్ధుడుకాడు.

అవ. ఇందులకు శిష్టాచారమును ప్రమాణముగా జూపుచున్నాడు.

15. శ్లో. ఏవం జ్ఞాత్వా కృతం కర్మ । పూర్వై రపి ముముక్షుభిః ।
కురు కర్మైవ తస్మాత్త్వం । పూర్వైః పూర్వతరం కృతమ్ ।

అర్థము : ఏవం = ఈ విధముగా, మాం = నన్ను, జ్ఞాత్వా = తెలిసికొని, పూర్వైః = ప్రాచీనులగు, ముముక్షుభిరపి = మోక్షకాంక్షులచేతనున్ను, కర్మ = కర్మ యోగము, కృతం = చేయబడినది, తస్మాత్ = కాబట్టి, త్వం = నీవు, పూర్వైః = పూర్వులచే, కృతం = చేయబడిన, పూర్వతరం = మిక్కిలి పురాతనమైన, కర్మైవ= కర్మయోగమునే, కురు = చేయుము.

తా॥ పూర్వము మోక్షమునుకోరువారందరునుపై విధానము నెఱింగి కర్మయోగము నాచరించిరి. గాన నీవు కూడా సనాతనమగు దీని నాచరింపుము.

అవ. మోక్షసాధనమగు కర్మ నెఱుంగుట కష్టసాధ్యమనుచున్నాడు.

16.శ్లో. కిం కర్మ కి మకర్మేతి । కవయోఽప్యత్ర మోహితాః ।
తత్తే కర్మ ప్రవక్ష్యామి । యజ్జ్ఞాత్వా మోక్ష్యసేఽశుభాత్ ।

అర్థము : కర్మ = (ముముక్షువు చేయవలసిన) కర్మ, కిం = ఎట్టిది? అకర్మ = ఆత్మతత్వ జ్ఞానము,కిం = ఎట్టిది? ఇత్యత్ర = అను నీ విషయమై, కవయః అపి = జ్ఞానులుకూడ, మోహితాః = భ్రమించిరి, యత్ = దేనిని, జ్ఞాత్వా =తెలుసుకొని, అశుభాత్ = సంసారము నుండి, మోక్ష్యసే = విడువబడుదువో, తత్ = అట్టి, కర్మ= కర్మను, తే = నీకు, ప్రవక్ష్యామి = చెప్పెదను.

తా॥ ముముక్షు వెట్టి కర్మ ననుష్ఠించవలెను? ఆ కర్మమునందలి ఆత్మ తత్వజ్ఞానాంశమెట్టిది? అనెడు విషయములను గూర్చి పండితులు కూడా భ్రమించుచున్నారు. వానిని చక్కగ బోధింతును. వాటి నెఱింగి నీవు మోక్షమును పొందగలవు.

17.శ్లో. కర్మణో హ్యపి బోద్ధవ్యం । బోద్ధవ్యం చ వికర్మణః ।
అకర్మణ శ్చ బోద్ధవ్యం । గహనా కర్మణో గతిః ॥

అర్థము : హి = ఏకారణము వలన, కర్మణః = కర్మకు సంబంధించి, బోద్ధవ్యం = తెలియవలసినదియు, వికర్మణః = వివిధ కర్మలకు సంబంధించి, బోద్ధవ్యం= తెలియవలసినదియు, అకర్మణః చ = జ్ఞానమునకు సంబంధించి, బోద్ధవ్యం= తెలియవలసినదియు (అస్తి = కలదు) కర్మణః = కర్మ యొక్క, గతిః = విధము, గహనా = తెలియ శక్యము కానిది.

తా॥ మోక్షసాధనమైన కర్మలను గూర్చియు, నిత్యనైమిత్తిక కామ్య కర్మలను గూర్చియు, జ్ఞానమును గూర్చియు విస్తారముగ తెలియవలసిన యంశములు పెక్కులు గలవు. కాబట్టి కర్మగతి తెలియశక్యమైనది కాదు.

అవ. కర్మను గూర్చియు, అకర్మను గూర్చియు తెలిసికొనదగిన దానిని చెప్పుచున్నాడు.

18.శ్లో. కర్మణ్యకర్మ యః పశ్యే । దకర్మణి చ కర్మ యః ।
స బుద్ధిమాన్మనుష్యేషు । స యుక్తః కృత్స్న కర్మకృత్ ॥

అర్థము : యః = ఎవడు, కర్మణి = కర్మయందు, అకర్మ = ఆత్మ జ్ఞానమును, పశ్యేత్ = చూచునో, యః = ఎవడు, అకర్మణి = జ్ఞానమునందు, కర్మచ = కర్మనున్ను, పశ్యేత్ = చూచునో, సః = వాడు, మనుష్యేషు = మనుష్యులలో, బుద్ధిమాన్ = బుద్ధిమంతుడు, సః = వాడు, యుక్తః = మోక్షార్హుడు, కృత్స్న కర్మకృత్ = సమస్త కర్మలను చేసినవాడు.

తా॥ కర్మల నాచరించుచుండగనే దానియందు ఆత్మజ్ఞానమును, ఆత్మ జ్ఞానము వర్తించుచుండగనే దానియందు కర్మను చూచువాడు మనుష్యులలో సకల శాస్త్రార్థముల నెఱింగినవాడు. వాడే మోక్షార్హుడు. వాడే సకల కర్మల నాచరించినవాడు అగును.

అవ. ప్రత్యక్షముగా చేయబడు కర్మ, జ్ఞానరూప మెట్లగునో చెప్పుచున్నాడు.

19.శ్లో. యస్య సర్వే సమారమ్భాః । కామ సఙ్కల్పవర్జితాః ।
జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం । త మాహుః పణ్డితం బుధాః ।

అర్థము : యస్య =ఎవనియొక్క, సర్వే = సమస్తమైన, సమారమ్భాః = కర్మలు,

కామసఙ్కల్పవర్జితాః = ఫలసంగ, దేహాత్మాది భ్రాంతులు లేనివగుచున్నవో, తం= అట్టి, పణ్డితం = పండితుని, జ్ఞానాగ్ని దగ్ధకర్మాణం = ఆత్మయదార్థ జ్ఞానమనెడు అగ్నిచే దహింపబడిన ప్రాచీన కర్మలు కలవానినిగా, బుధాః = జ్ఞానులు, ఆహుః = చెప్పెదరు.

తా॥ ఫలమందాశయు, దేహమే ఆత్మయను భ్రాంతియు, లేక కర్మలను చేయువానిని అట్టి కర్మయోగాంతర్గతమగు ఆత్మజ్ఞానముచే తన ప్రాచీన కర్మలను బంధహేతువులు కాకుండ చేసుకొనిన జ్ఞాని యని తెలిసినవారు చెప్పుదురు.

20.శ్లో. త్యక్త్వా కర్మఫలా సఙ్గం । నిత్యతృప్తో నిరాశ్రయః ।
కర్మణ్యభిప్రవృత్తోఽపి । నైవకిఞ్చి త్కరోతి సః ॥

అర్థము : కర్మఫలాసఙ్గం = కర్మ ఫలమునందాసక్తిని, త్యక్త్వా = విడిచి పెట్టి, నిత్యతృప్తః = నిత్యమగు ఆత్మయందు తృప్తిచెందినవాడును, నిరాశ్రయః = (ప్రకృతియందు) ఆశ్రయ బుద్ధిలేనివాడును, కర్మణి = కర్మయందు, అభిప్రవృత్తోఽపి = అభిముఖముగా ప్రవర్తించినవాడైనను, సః = వాడు, కిఞ్చిత్ = ఒక్క కర్మనైనను, న, కరోత్యేవ = చేయనివాడే.

తా॥ ఫలాశను వీడి, ఆత్మయందే తృప్తుడై, ప్రకృతి తన కాశ్రయమని తలంచక కర్మలను చేయువాడు, వానియందాభిముఖ్యముతో ప్రవర్తించినవాడైనను ఒక్క కర్మనైనను చేయనివాడే యగును.

21.శ్లో. నిరాశీ ర్యత చిత్తాత్మా । త్యక్త సర్వపరిగ్రహః ।
శారీరం కేవలం కర్మ । కుర్వ న్నాప్నోతి కిల్బిషమ్ ॥

అర్థము : నిరాశీః = ఫలాశలేనివాడును, యతచిత్తాత్మా = చిత్తమును, మనస్సును నిగ్రహించినవాడును, త్యక్త సర్వపరిగ్రహః = అన్నిటియందును మమతను విడిచినవాడై, శారీరం = శరీరపోషణకు మాత్రమవసరమగు, కర్మ కేవలం = కర్మను మాత్రము, కుర్వన్ = చేయుచున్నవాడు, కిల్బిషం = పాపమును, నాఽప్నోతి = పొందడు.

తా॥ ఫలము నపేక్షింపక, మనస్సుతో నితర విషయముల చింతించక, ఆత్మేతరములయందు మమకారమును వీడి, శరీరపోషణకు మాత్రముపయోగించు కర్మను చేయువానికి సంసారబంధముండదు.

22.శ్లో. యదృచ్ఛాలాభ సన్తుష్టో । ద్వంద్వాతీతో విమత్సరః ।
సమ స్సిద్ధావసిద్ధౌ చ । కృత్వాఽపి న నిబధ్యతే ॥

అర్థము : యదృచ్ఛాలాభ సన్తుష్టః = తనంతనే లభించినదానితో తృప్తిని చెందినవాడును, ద్వన్ద్వాతీతః = శీతోష్ణాది ద్వంద్వములకు లొంగనివాడును, విమత్సరః మాత్సర్యము లేనివాడును, సిద్ధౌ = ఫలము లభించుటయందును,అసిద్ధౌచ లభించకుండుటయందును, సమః = సమచిత్తుడును అగువాడు, కృత్వాఅపి=కర్మలు చేసినను, న నిబధ్యతే = సంసారమున బంధింపబడడు.

తా॥ శరీరపోషణకు అప్రయత్నముగా దొరికిన వానితో తృప్తి నొందుచు శీతోష్ణాదులను సహించుచు - పరులయందు మాత్సర్యమును వీడి తన పనులకు ఫలము లభించినను లభించకున్నను చిత్తమును చలింపనీయక కేవల కర్మల నాచరించు పురుషుడు సంసారబద్ధుడు కాడు

అవ. కర్మయోగ ప్రభావముచే విరోధి కర్మలన్నియు నశించుననుచున్నాడు.

23.శ్లో. గతసఙ్గస్య ముక్తస్య । జ్ఞానావస్థిత చేతసః ।
యజ్ఞా యాచరతః కర్మ । సమగ్రం ప్రవిలీయతే ॥

అర్థము : జ్ఞానావస్థితచేతసః = ఆత్మజ్ఞానమునందు లగ్నమైన మనస్సు కలవాడును. గతసఙ్గస్య= ఇతర వస్తువుల యందు ఆసక్తి లేనివాడును, ముక్తస్య = భార్యా మొదలగు పరివారముచే విడువబడినవాడును, యజ్ఞాయ = యజ్ఞము కొరకు, ఆచరతః = వర్తించువానియొక్క, కర్మ = ప్రాచీనకర్మ, సమగ్రం = పూర్తిగ, ప్రవిలీయతే = నశించుచున్నది.

తా॥ ఆత్మజ్ఞానియగుటచే తదితరవస్తువులయందు ఆసక్తిని విడిచి, భార్యా పుత్రాది పరివారమునందు తగులుకొనక,యజ్ఞాదికముల నాచరించువాని ప్రాచీన కర్మమంతయు పూర్తిగ నశించును.

అవ : ఇంతవరకు శుద్ధాత్మస్వరూపానుసంధానముచే కర్మలకు జ్ఞానాకారత్వమును చెప్పి, ఇప్పుడు కర్మలను పరమాత్మ స్వరూపములుగా భావించుటచే జ్ఞానాకారత్వమును చెప్పుచున్నాడు.

24.శ్లో. బ్రహ్మార్పణం బ్రహ్మహవిః । బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతమ్ ।
బ్రహ్మైవ తేన గన్తవ్యం । బ్రహ్మ కర్మ సమాధినా ॥

అర్థము : బ్రహ్మార్పణం = బ్రహ్మమేయైన హోమసాధనములు కలదియు. బ్రహ్మహవిః =

బ్రహ్మమేయైన హవిస్సు, బ్రహ్మాగ్నౌ = బ్రహ్మమేయైన అగ్నియందు, బ్రహ్మణా= బ్రహ్మమేయైన కర్తచే, హుతం = హోమము చేయబడుచున్నది. (ఇతి = అని), బ్రహ్మకర్మ సమాధినా = కర్మలన్నియు బ్రహ్మమయమని తలంచునట్టి, తేన = వానిచేత, బ్రహ్మైవ = బ్రహ్మమగు తన ఆత్మ స్వరూపమే, గన్తవ్యం = పొందతగినది.

తా॥ బ్రహ్మకార్యమగుటచే బ్రహ్మమగు హోమసాధనములచే, స్వతః బ్రహ్మమగు హవిస్సు, బ్రహ్మమగు అగ్నిలో, బ్రహ్మస్వరూపుడగు యజమానిచే హోమము చేయబడుచున్నదని, యిట్లు కర్మలనన్నిటిని బ్రహ్మమయమని తలంచువాడు బ్రహ్మాత్మకమగు శుద్ధాత్మస్వరూపమును పొందును. అనగా ముముక్షువు చేయు కర్మలన్నియు పరబ్రహ్మాత్మకములే యని తలంచబడును. గాన నవి జ్ఞానాకారములే యగుటచే వేరుగ జ్ఞాననిష్ఠలేకయే ఆత్మసాక్షాత్కారమును కలిగించునని భావము.

అవ. ఈ శ్లోకము మొదలు 29వ శ్లోకమువరకు కర్మయోగభేదములనుచెప్పుచున్నాడు.

25.శ్లో. దైవ మేవా పరే యజ్ఞం । యోగినః పర్యుపాసతే ।
బ్రహ్మాగ్నా వపరే యజ్ఞం । యజ్ఞే నై వోపజుహ్వతి ।

అర్థము : అపరే = మరికొందఱు, యోగినః = కర్మ యోగులు, దైవం = దేవతార్చన రూపమైన, యజ్ఞమేవ = యజ్ఞమునే, పర్యుపాసతే = సేవించుచున్నారు, అపరే = మరికొందఱు, బ్రహ్మాగ్నౌ = బ్రహ్మరూపమగు అగ్ని యందు, యజ్ఞేనైవ = యజ్ఞసాధనములచేతనే, యజ్ఞం = హవిస్సును, ఉపజుహ్వతి = హోమమును చేయుచున్నారు.

తా॥ కొందరు కర్మయోగులు దేవతార్చనమునే యజ్ఞముగా నిష్ఠతో నాచరింతురు. మరికొందరు "బ్రహార్పణమ్మ"ను శ్లోకమున చెప్పినట్లు అగ్నిని బ్రహ్మగా భావించి సాధారణ యజ్ఞముల నాచరించుచున్నారు.

అవ. ఇందు జ్ఞానేంద్రియములను నియమించుటను యజ్ఞముగా జెప్పుచున్నాడు.

26. శ్లో. శ్రోత్రాదీ నింద్రియా ణ్యన్యే । సంయమాగ్నిషు జుహ్వతి ।
శబ్దాదీన్విషయా నన్యే । ఇంద్రియాగ్నిషు జుహ్వతి ।

అర్థము : అన్యే = మరికొందరు, శ్రోత్రాదీని = చెవి మొదలగు, ఇంద్రియాణి = జ్ఞానేంద్రియములను, సంయమాగ్నిషు = నిగ్రహమనెడు అగ్నుల యందు,

జుహ్వతి = హోమమును చేయుచున్నారు, అన్యే = ఇతరులు, శబ్దాదీన్ = శబ్దము మొదలైన, విషయాన్ = విషయములను, ఇన్ద్రియాగ్నిషు = ఇంద్రియము లనెడు అగ్నులయందు, జుహ్వతి = హోమము చేయుచున్నారు.

తా॥ కొందరు కర్మయోగులు శ్రోత్రాది ఇంద్రియములను స్వాధీనపరచు కొనుట యందే ప్రయత్నము చేయుదురు. అనగా వానిని విషయముల వైపే ప్రవర్తింపనీయరు. మరికొందరు ఇంద్రియములకు శబ్దాదులయందు ఆసక్తిని నివారించుటకు ప్రయత్నించుచున్నారు. అనగా విషయములు సమీపించినను అవి ఏమియు పనిచేయజాలనట్లు గావింతురు.

అవ. ఈ శ్లోకమున కర్మేంద్రియనియమనములను యజ్ఞముగా చెప్పుచున్నాడు.

27.శ్లో. **సర్వాణీన్ద్రియకర్మాణి । ప్రాణకర్మాణి చా పరే ।**
ఆత్మసంయమయోగాగ్నౌ । జుహ్వతి జ్ఞానదీపితే ।

అర్థము : అపరే = కొందరు, సర్వాణి = సమస్తములైన, ఇన్ద్రియకర్మాణి = ఇంద్రియ వ్యాపారములను, ప్రాణకర్మాణి = ప్రాణవ్యాపారములను, జ్ఞానదీపితే = జ్ఞానముచే ప్రకాశింప చేయబడుచున్న, ఆత్మసంయమయోగాగ్నౌ = మనోనిగ్రహమనెడు అగ్ని యందు, జుహ్వతి = హోమము చేయుచున్నారు.

తా॥ కొందరు కర్మయోగులు చూచుట మొదలగు ఇంద్రియ కార్యముల యందును, ఉచ్ఛ్వాస నిశ్వాసములనెడు ప్రాణకార్యముల యందును మనస్సునకుగల ఆసక్తిని అరికట్టుటకు ప్రయత్నించుచున్నారు.

అవ. వేరు వేరు కర్మయోగనిష్ఠలిందు చెప్పబడుచున్నారు.

28.శ్లో. **ద్రవ్యయజ్ఞా స్తపోయజ్ఞాః । యోగయజ్ఞా స్తథాఽపరే ।**
స్వాధ్యాయజ్ఞానయజ్ఞా శ్చ । యతయ స్సంశ్రితవ్రతాః ॥

అర్థము : సంశ్రిత వ్రతాః = దృఢసంకల్పముగల, అపరే = మరికొందరు, యతయః = కర్మయోగులు, ద్రవ్యయజ్ఞాః = న్యాయముగ ధనము నార్జించి సద్వినియోగ పరచుటయే యజ్ఞముగా కలవారును, తపోయజ్ఞాః = ఉపవాసాది తపస్సులే యజ్ఞముగా కలవారును, తథా = అట్లే, అపరే = కొందరు, యోగయజ్ఞాః = తీర్థయాత్రాదులే యజ్ఞముగా కలవారును, (ఇతరే = ఇంకను కొందరు), స్వాధ్యాయజ్ఞాన యజ్ఞాశ్చ = వేదమును దాని యర్థమును అభ్యసించుటనే యజ్ఞముగా కలవారును, భవంతి = అగుచున్నారు.

తా॥ ద్రవ్యయజ్ఞులగు కొందరు కర్మయోగులు, న్యాయముగ ద్రవ్యము నార్జించి దేవతార్చనము, దానము, యాగము మొదలగు పనులకుపయోగింతురు. కొందరు ఉపవాసాదులయందు నిష్ఠకలిగి యుందురు. కొందరు పుణ్యనదీస్నాన, పుణ్యక్షేత్రదర్శనముల యందే ఆసక్తిని కలిగియుందురు. కొందరు వేదమును, దాని యర్థజ్ఞానమును అభ్యసించుటయందు ఆసక్తిని కలిగి యుందురు.

అవ. కొందరు పూరక రేచక కుంభక రూపమగు ప్రాణాయామమును యజ్ఞముగా చేయుచున్నారనుచున్నాడు.

29.శ్లో. అపానే జుహ్వతి ప్రాణం । ప్రాణేఽపానం తథాఽపరే ।
ప్రాణాపానగతీ రుద్ధ్వా । ప్రాణాయామపరాయణాః ॥

30.శ్లో. అపరే నియతాహారాః । ప్రాణాన్ ప్రాణేషు జుహ్వతి ।

అర్థము : అపరే = కొందరు, ప్రాణాయామ పరాయణాః = ప్రాణాయామము నందాసక్తులై, నియతాహారాః = పరిమితమైన ఆహారము కలవారై, ప్రాణం = ప్రాణవాయువును, అపానే = అపానవాయువునందు, జుహ్వతి = హోమము చేయుచున్నారు, తథా= అట్లే, అపరే = మరికొందరు, అపానం = అపానవాయువును, ప్రాణే = ప్రాణ ఆయువునందు,అపరే =మరికొందరు ప్రాణాపానగతీ = ప్రాణ అపాన వాయువులయొక్క ప్రసారమును, రుద్ధ్వా = బంధించి, ప్రాణాన్ = ప్రాణవృత్తులను, ప్రాణేషు = ప్రాణములయందు, జుహ్వతి = హోమము చేయుచున్నారు.

తా॥ కొందరు కర్మయోగులు ఆహారనియమముతో, పైకి ప్రసరించు ప్రాణవాయువును క్రిందికిపోనిచ్చి 'పూరక' నిష్ఠను, కొందరు క్రిందికిపోవు అపానవాయువును పైకిపోనిచ్చి 'రేచక' నిష్ఠను, మరికొందరు ప్రాణవాయువుయొక్క ఉచ్ఛ్వాసమును అపానవాయువు యొక్క నిశ్వాసమును నిలిపి కుంభకనిష్ఠను నలిపి ప్రాణాయామ పరాయణులగుదురు.

అవ. ఈ కర్మయోగులందరకును ఫలమొక్కటియే యనుచున్నాడు.

30.శ్లో. సర్వే ప్యేతే యజ్ఞవిదో । యజ్ఞక్షపితకల్మషాః ॥

31.శ్లో. యజ్ఞశిష్టామృతభుజో । యాన్తి బ్రహ్మ సనాతనమ్ ।

అర్థము : ఏతే, సర్వేఽపి = వీరందరున్ను, యజ్ఞవిదః = యజ్ఞముల నెఱింగిన వారును, యజ్ఞక్షపితకల్మషాః = యజ్ఞములచే నశింప జేయబడిన పాపము కలవారును

యజ్ఞశిష్టామృతభుజః = యజ్ఞమునందు మిగిలిన అమృతమనెడు అన్నమును భుజించువారై, సనాతనం = శాశ్వతమైన, బ్రహ్మ = ఆత్మస్వరూపమును, యాన్తి= పొందుచున్నారు.

తా॥ ఇట్లు కర్మయోగులు యజ్ఞములలో తాము కోరినవాని నాచరించి పాపములను పారద్రోలి యజ్ఞశిష్టాన్నముచే శరీరమును నిలుపుకొనుచు శాశ్వతమైన ఆత్మస్వరూపమును పొందుదురు.

అవ. పై యజ్ఞములను పరిగ్రహించి నిత్యనైమిత్తికములను విడువరాదనుచున్నారు.

31.శ్లో. **నాయం లోకోఽస్త్య యజ్ఞస్య । కుతోఽన్యః కురుసత్తమ! ।**

అర్థము : కురుసత్తమ = అర్జునా!, అయజ్ఞస్య = కర్మయజ్ఞములను జేయనివానికి, ఆయం, లోకః = ఈ లోకము, నాస్తి = లేదు, అన్యః = మోక్షము, కుతః = ఎట్లు, (భవతి= కలుగుచున్నది)

తా॥ నిత్యనైమిత్తి కాది కర్మల నాచరించని వానికి ధర్మార్థకామములే సిద్ధించవుగదా! ఇక మోక్షమెట్లు సిద్ధించును?

అవ. ఈ చెప్పబడిన కర్మయోగభేధముల నన్నిటిని నిత్యనైమిత్తిక కర్మలద్వారా ఆచరించవలసిన విధిని తిరిగి చెప్పి యీ యర్థమును వివరించుచున్నాడు.

32.శ్లో. **ఏవం బహువిధా యజ్ఞాః । వితతాః బ్రహ్మణో ముఖే ।**
కర్మజాన్విద్ధి తాన్ సర్వా । నేవం జ్ఞాత్వా విమోక్ష్యసే ।

అర్థము : ఏవం = ఈ ప్రకారము, బహువిధాః = అనేకవిధములైన, యజ్ఞాః = యజ్ఞములు, బ్రహ్మణః = శుద్ధాత్మ స్వరూపముయొక్క, ముఖే = ఉపాయమగుట విషయమై, వితతాః = విస్తరించియున్నవి, తాన్ సర్వాన్ = వానినన్నిటిని, కర్మజాన్ = కర్మలవలన పుట్టినవాటినిగా, విద్ధి = తెలుసుకొనుము, ఏవం = ఇట్లు, జ్ఞాత్వా = తెలుసుకొని, విమోక్ష్యసే = (సంసారమునుండి) విడనబడుదువు'

తా॥ ఇట్లు కర్మయోగము పెక్కురీతులుగా శుద్ధఆత్మప్రాప్తికి సాధనమై యున్నది. ఇవి యన్నియు, నిత్యనైమిత్తిక కర్మలవలననే నిర్వహింపబడునవి. ఇట్లెఱింగి వీని నాచరించినచో సంసారబంధము విచ్ఛిన్నమగును.

అవ. కర్మయోగమునందలి కర్మభాగముకంటె దానిలో నున్న జ్ఞానభాగమే ప్రధానమనుచున్నాడు.

33.శ్లో. శ్రేయాన్ ద్రవ్యమయాద్యజ్ఞాత్ । జ్ఞానయజ్ఞః పరన్తప! ।
సర్వం కర్మాఖిలం పార్థ ! జ్ఞానే పరిసమాప్యతే ।

అర్థము : పరన్తప = శత్రువులను తపింపజేయు, పార్థ = అర్జునా! ద్రవ్యమయాత్ = ద్రవ్యమయమైన, యజ్ఞాత్ = యజ్ఞముకంటె, జ్ఞానయజ్ఞః = జ్ఞానమయ యజ్ఞము, శ్రేయాన్ = శ్రేష్ఠమైనది, సర్వం కర్మ = సమస్త విధమైన కర్మయు, అఖిలం = దాని సాధనములన్నియును, జ్ఞానే = జ్ఞానమునందు, పరిసమాప్యతే = పర్యవసించుచున్నవి.

తా॥ కర్మయోగము ద్రవ్యమయాంశమనియు, జ్ఞానమయాంశమనియు రెండంశలు కలిగి యుండును. అందు సమస్త కర్మయు దాని సాధనములును జ్ఞానాంశమందే పర్యవసించును గాన అదియే ద్రవ్యమయాంశముకంటె ప్రధానమైనది.

అవ. ఈ జ్ఞానమును అడుగడుగునకు జ్ఞానులవలన విని తెలుసుకొనవలయునని చెప్పుచున్నాడు.

34.శ్లో. త ద్విద్ధి ప్రణిపాతేన । పరిప్రశ్నేన సేవయా ।
ఉపదేక్ష్యన్తి తే జ్ఞానం । జ్ఞానిన స్తత్త్వదర్శినః ॥

అర్థము : తత్ = ఆ యాత్మజ్ఞానమును, ప్రణిపాతేన = సాష్టాంగ నమస్కారము చేతను, పరిప్రశ్నేన = అడుగుటచేతను, సేవయా = శుశ్రూషచేతను, విద్ధి = తెలిసికొనుము, తత్త్వదర్శినః = ఆత్మసాక్షాత్కారముగల, జ్ఞానినః = జ్ఞానులు, తే = నీకు, జ్ఞానం= జ్ఞానమును, ఉపదేక్ష్యన్తి = ఉపదేశింతురు.

తా॥ అర్జునా! నే జెప్పిన ఆత్మజ్ఞానమును, ఆత్మస్వరూపమును సాక్షాత్కరించిన జ్ఞానులు నీకు చక్కగ నుపదేశింతురు. కావున నీవు వారికి సాష్టాంగ నమస్కారమునాచరించి, శుశ్రూషనుచేసి అడిగి తెలుసుకొనుము.

అవ. ఆత్మసాక్షాత్కార జ్ఞానమునకు గుర్తులు చెప్పుచున్నాడు.

35. శ్లో. యత్ జ్ఞాత్వా న పున ర్మోహ । మేవం యాస్యసి పాణ్డవ !।
యేన భూతా న్యశేషేణ । ద్రక్ష్య స్యాత్మ న్యథో మయి ।

అర్థము : పాణ్డవ = అర్జునా!, యత్ = దేనిని, జ్ఞాత్వా = తెలిసికొని, పునః = తిరిగి, ఏవం=

ఈ విధముగ, మోహం = అజ్ఞానమును, న యాస్యసి = పొందవో, యేన = దేనిచేత, భూతాని = జీవులను, అశేషేణ = పూర్తిగా, ఆత్మని = నీయందును, అథో = పిమ్మట, మయి = నా యందును, ద్రక్ష్యసి = చూడగలవు.

తా॥ ప్రకృతిబంధమును వీడిన పరిశుద్ధాత్మలన్నియు జ్ఞానాకారమనెడు ఒకేవిధమగు ఆకారముతో నుండియు, పరమాత్మతో సమానములుగ నుండును. కావుననే ఆత్మస్వరూపమును సాక్షాత్కరించిన జ్ఞానికి దేహాత్మ భ్రాంతియు మమకారమును ఉండవు. గాన తనను చూడగనే తక్కిన ఆత్మలన్నియు తనవలెనే యుండుటను గాంచును. పరమాత్మను చూడగనే తక్కిన ఆత్మలన్నియు ఆతనివలెనే యుండుటను గాంచును.

అవ. కర్మయోగమునందలి జ్ఞానభాగము సకలపాపములను పోద్రోలునని దాని మహిమను చెప్పుచున్నాడు.

36.శ్లో. అపి చే దసి పాపేభ్య । స్సర్వేభ్యః పాపకృత్తమః ।
సర్వం జ్ఞానప్లవే నైవ । వృజినం సన్తరిష్యసి ॥

అర్థము : సర్వేభ్యః = సమస్తమైన, పాపేభ్యః = పాపాత్ములకంటె, పాపకృత్తమః =మిక్కిలి పాపాత్ముడవు, అపిచేదసి = అయినప్పటికిన్ని, సర్వం = సకలమైన, వృజినం = పాపమును, జ్ఞానప్లవేనైవ = జ్ఞానమనెడు తెప్పచేతనే, సంతరిష్యసి = దాటగలవు.

తా॥ నీవెంత పాపాత్ముడవైనను ఈ జ్ఞానమున్నచో తెప్పచే సముద్రమును దాటినట్లు సమస్త పాపములను ఈ జ్ఞానమనెడు తెప్పచేతనే దాటగలవు.

అవ. ఈ జన్మయందు మాత్రము ఉదయించిన యీ కొద్దిపాటి జ్ఞానమొక్కటి మాత్రము అనాది కాలమునుండి వచ్చుచున్న అనంత పాపరాశినెట్లు పోగొట్టునో దృష్టాంతముతో జూపుచున్నాడు.

37.శ్లో. యథై ధాంసి సమిద్ధోఽగ్ని । ర్భస్మసాత్కురుతేఽర్జున ! ।
జ్ఞానాగ్ని స్సర్వకర్మాణి । భస్మసాత్కురుతే తథా ।

అర్థము : అర్జున = అర్జునా!. సమిద్ధః = బాగుగామండుచున్న, అగ్నిః = నిప్పు, యథా = ఎట్లు, ఏధాంసి = కట్టెలను, భస్మసాత్ కురుతే = బూడిదచేసి వేయునో, తథా = అట్లే, జ్ఞానాగ్నిః = జ్ఞానమనెడు నిప్పు, సర్వకర్మాణి = కర్మలన్నిటిని, భస్మసాత్కురుతే = భస్మమగునట్లు చేయును.

తా॥ ఓ అర్జునా! లెస్సగా ప్రకాశించుచున్న అగ్నిదేవుడు కట్టెలను ఏ ప్రకారముగా భస్మము చేయుచున్నాడో, ఆప్రకారముగా జ్ఞానమనెడి అగ్ని సమస్త కర్మలను భస్మము జేయుచున్నది.

అవ. అట్టి శక్తి జ్ఞానమున కుండుటకు హేతువు దాని పవిత్రతయే యనుచున్నాడు.

38.శ్లో. నహి జ్ఞానేన సదృశం । పవిత్ర మిహ విద్యతే ।
తత్స్వయం యోగసంసిద్ధః । కాలేనాఽత్మని విన్దతి ।

అర్థము : జ్ఞానేన = ఆత్మజ్ఞానముతో, సదృశం = సమానమైనదియు, పవిత్రం = పవిత్రమైనదియు, ఇహ = ఈ లోకమున, న విద్యతే హి = లేదుగదా, తత్ = ఆ జ్ఞానమును, యోగసంసిద్ధః = కర్మయోగసిద్ధిని పొందినవాడై, కాలేన = కాలక్రమమున, ఆత్మని= తనయాత్మయందు, స్వయం = ఉపదేశము లేకుండగనే, విన్దతి = పొందుచున్నాడు.

తా॥ ఆత్మజ్ఞానముతో తుల్యమైన మరియొక పవిత్రవస్తువు లేదు. అది సకల పాపములను పాగొట్టును. కావున జ్ఞానాకారమగు కర్మయోగమును విడువక యాచరించువాడు క్రమముగ ఉపదేశము లేకనే జ్ఞానయోగి కాగలడు.

అవ. ఆ జ్ఞానమహిమనే మరింత స్పష్టముగా చెప్పుచున్నాడు.

39.శ్లో. శ్రద్ధావాన్ లభతే యోగం । తత్పర స్సంయతేన్ద్రియః ।
జ్ఞానం లబ్ధ్వా పరాంశాన్తి । మచిరే ణాధిగచ్ఛతి ।

అర్థము : శ్రద్ధావాన్ = జ్ఞానాభివృద్ధియందు త్వరగలవాడును, తత్పరః = దాని యందే ఆసక్తి కలవాడును, సంయతేన్ద్రియః = ఇంద్రియనిగ్రహము కలవాడును, జ్ఞానం = ఆత్మజ్ఞానమును, లభతే = పొందుచున్నాడు, జ్ఞానం =ఆత్మజ్ఞానమును, లబ్ధ్వా పొంది, అచిరేణ = వెంటనే, పరాం = మిక్కిలి గొప్పదైన, శాన్తిం =ఆనందమును, అధిగచ్ఛతి = పొందుచున్నాడు.

తా॥ ఆత్మజ్ఞానమును వృద్ధిచేసుకొనుటయందు త్వరకలవాడై, దానియందే మనస్సును నిలిపి, తన ఇంద్రియములను ఇతర విషయములకు చేరనీయనివాడు త్వరలోనే జ్ఞానపరిపాకమును, దాని ఫలమగు పరమానందస్థానమును పొందగలడు.

అవ. ఇట్టి జ్ఞానము నార్జించు త్వరలేని వానికి కలుగు అనర్థమును జెప్పుచున్నాడు.

40.శ్లో. అజ్ఞశ్చాశ్రద్దధానశ్చ । సంశయాత్మా వినశ్యతి ।
నా యం లోకోఽస్తి న పరో । న సుఖం సంశయాత్మనః ।

అర్థము : అజ్ఞః = జ్ఞానహీనుడును, అశ్రద్దధానశ్చ = త్వరలేనివాడును, సంశయాత్మాచ = సంశయముగల మనస్సుకలవాడును, వినశ్యతి = నశించుచున్నాడు, సంశయాత్మనః= సంశయించు మనస్సుగల వానికి, అయం, లోకః = ఈ లోకము, నాస్తి = లేదు, పరః = పరలోకము, న = లేదు, సుఖం = సుఖమును, న = లేదు.

తా॥ ఉపదేశమువలన జ్ఞానము లభించనివాడును, ఉపదేశింపబడినను దాని వృద్ధియందు త్వరలేనివాడును, దానియందు సంశయము కలవాడును నశింతురు. అట్టి సంశయము కలవానికి చతుర్విధ పురుషార్థములును సిద్ధింపవు. ఇక సుఖమెక్కడిది ?

అవ. ఈ యధ్యాయము యొక్క ప్రథానార్థమును ఉపసంహరించుచున్నాడు.

41.శ్లో. యోగ సన్న్యస్త కర్మాణం । జ్ఞాన సఞ్ఛిన్న సంశయమ్ ।
ఆత్మవన్తం న కర్మాణి । నిబధ్నన్తి ధనఞ్జయ ! ।

అర్థము : ధనఞ్జయ = అర్జునా!, యోగసన్న్యస్తకర్మాణం = బుద్ధియోగముచే జ్ఞానాకారమును పొందినకర్మలు కలవాడును, జ్ఞాన సఞ్ఛిన్న సంశయమ్ = ఆత్మజ్ఞానముచే పోగొట్టబడిన సంశయములు కలవాడును, ఆత్మవన్తం = ధృఢమైన మనస్సుకలవాడును, అగు వానిని, కర్మాణి = ప్రాచీన కర్మలు, న నిబధ్నన్తి = బంధించవు.

తా॥ ఓ ధనంజయా! యోగముచేత జ్ఞానాకారమును పొందిన సర్వకర్మములు గలిగినట్టియు, ఆత్మజ్ఞానముచేత ఛేదింపబడిన సందేహముగలిగినట్టియు ధృఢమనస్కుడయిన పురుషుని ప్రాచీన కర్మలు బంధించజాలవు.

అవ. ఇట్లు విస్తారముగా నుపదేశించిన అర్థమును అర్జునుని తప్పక ఆచరింపుమని విధించుచున్నాడు.

42.శ్లో. తస్మా దజ్ఞాన సమ్భూతం । హృత్స్థం జ్ఞానాసినాఽత్మనః ।
ఛిత్త్వైనం సంశయం యోగ । మాతి ష్ఠోత్తిష్ఠ భారత ।

ఇతి శ్రీభగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే
శ్రీకృష్ణార్జున సంవాదే జ్ఞానయోగో నామ చతుర్థోధ్యాయః

అర్థము : భారత = అర్జునా! తస్మాత్ = అందువలన, అజ్ఞానసమ్భూతం = అజ్ఞానమువలన పుట్టిన, హృత్‌స్థం = హృదయమందున్న, ఆత్మనః = ఆత్మకు సంబంధించిన, ఏనం = ఈ, సంశయం = సంశయమును, జ్ఞానాసినా = ఆత్మజ్ఞాన మనెడు కత్తితో, ఛిత్త్వా= ఖండించి, యోగం=కర్మయోగమును, ఆతిష్ఠ=ఆచరింపుము, ఉత్తిష్ఠ=లెమ్ము.

తా॥ అర్జునా! అందువలన అజ్ఞానమువలన బుట్టిన ఆత్మవిషయమైన సందేహమును ఆత్మజ్ఞానమనెడు కత్తితో ఖండించి నేనుపదేశించిన కర్మయోగము నాచరించుము. లెమ్ము.

ఇది ఉపనిషదర్థ ప్రతిపాదకమును బ్రహ్మవిద్యయు, యోగశాస్త్రమును,
శ్రీకృష్ణార్జున సంవాద రూపమును అయిన
శ్రీభగవద్గీత యందలి జ్ఞానయోగమనెడి
నాలుగవ అధ్యాయము

అర్జునుని శ్లోకములు	1	భగవంతుని శ్లోకములు	41
ఈ అధ్యాయమునందలి శ్లోకముల సంఖ్య	42	గీత ప్రారంభమునుండి ఇప్పటికైన శ్లోక సంఖ్య	206

శ్రీమద్భగవద్గీతా ప్రశ్నోత్తరావళి
నాల్గవ అధ్యాయము

1 ప్ర. **ఈ యధ్యాయమునకు పేరేమి ? అది ఎందుల కుంచబడినది ?**

ఉ. ఈ యధ్యాయమునకు జ్ఞానయోగమని పేరు.

ఈ భగవద్గీతయంతము మూడు షట్కములుగా విభజింపబడినది. షట్కమనగా ఆరు అధ్యాయములు. అందు మొదటి షట్కమంతము కర్మయోగమును గూర్చినదేయైనను ఆ కర్మయోగము కర్మాంశము, జ్ఞానాంశము అని రెండు ప్రధాన భాగములతో కూడి యుండును. గాన అందు కర్మభాగముకంటె జ్ఞానభాగము ప్రధానమగుటచే ఆ విషయమును గూర్చి విపులముగా నిందు చర్చింపబడుచున్నది. అది యెట్లనిన; వేదోక్త కర్మలకేదో యొక ఫలము శాస్త్రమున చెప్పబడియుండుటచే కర్మయోగికి ఫలసంగము తప్పనిసరియగుచున్నది. కాని ఆత్మ ప్రకృతికంటె వేరైనది, నిత్యమైనది, ఆనందరూపమైనది. దానికి సాంసారిక కర్మల యందు ప్రవృత్తి పూర్వకర్మచే దాపరించిన శరీర సంబంధముచే తటస్థించినది గాని సహజమైనదికాదు. అయినను నది యవర్జనీయమగుటచే, తానాచరించు వేదోక్తములగు తన వర్ణాశ్రమధర్మములు భగవదారాధనకొరకే యగుచున్నవి గాని తనకొక ఫలము కొఱకాచరింపబడునవి కావు. భగవదారాధన రూపములగుటచే తన కవి యాచరింపక తప్పదను జ్ఞానముతో నాచరించిన, నవి బంధహేతువులుగాక పాపముల పారద్రోలి నిరతిశయ పురుషార్థమునకు క్రమముగ సాధనములగును. ఇదియే కర్మలకు జ్ఞానాకారము. ఈ విషయ మీ యధ్యాయమున ప్రధానముగా చెప్పబడుచున్నది. కావున దీనికి "జ్ఞాన యోగ" మని పేరుంచబడినది.

2 ప్ర. **ఈ యధ్యాయమందు చెప్పబడిన విషయములెవ్వి ?**

ఉ. 1. ముముక్షువగువానికి ఆచరింపదగినదిగా నుపదేశింపబడిన కర్మయోగము నందు నమ్మకము కలుగుటకు దాని పరంపరను క్రమముగా బోధించుట. (4 అ. 1,2,3 శ్లో.)

2. ఈసందర్భమున యీ కర్మయోగము నుపదేశించెడు ఆచార్యపరంపరకు తాను కూటస్థుడనని శ్రీభగవానుడానతిచ్చుటచే దానితత్వ మెఱుగగోరి అర్జును డడిగిన ప్రశ్నకు సమాధానముగా భగవంతుడు తన యవతార రహస్యమునంతను చెప్పుట. (4 అ. 4. శ్లో మొ. 11 శ్లో. వరకు)

3. ఈః కర్మయోగమున జ్ఞానాంశమే ప్రధానమగుటచే నిది జ్ఞానయోగము వంటిదే యని చెప్పుటకు ముందు అట్లెఱింగి కర్మల నాచరించు అధికారియే దుర్లభమనియు దానికి కారణము పాపమేయనియు అది తొలంగు ఉపాయము తానుచేయు సృష్టి రహస్యము నెఱుంగటయే యనియు, ఇట్లెందరో యెఱింగి కర్మయోగులైరనియు చెప్పుట(4 అ. 12, 13, 14, 15 శ్లో.)

4. కర్మయోగ మంత దుర్గ్రహ మగుటకు కారణము దానియందెఱుంగదగిన కర్మ–అకర్మ–వికర్మల స్వరూపము దురవగాహమగుటయేయని చెప్పుట.
(4 అ. 16,17,18 శ్లో.)

5. కర్మయోగమెట్లు జ్ఞానాకారమగునో యెఱింగించుట
(4 అ. 19 శ్లో. మొ. 24 శ్లో, వరకు)

6. కర్మయోగముయొక్క అవాంతర భేదములను వివరించుట.
(4 అ. 25 శ్లో. మొ. 32 శ్లో, వరకు)

7. ఇట్లు కర్మయోగము జ్ఞానముతో నాచరింపదగినదని చెప్పి యందు కర్మ భాగము కంటె జ్ఞానభాగమే ప్రధానమని తెలుపుట
(4 అ. 33 శ్లో. మొ. చివర వరకు)

8. ఈః జ్ఞాన మెల్లరును సంపాదించవలెననెడు ఆశ జనించుటకై దీని వైభవమును ఫల ముఖముగా నెఱింగించుట.(4 అ. 35మొ. 38 శ్లో. వరకు)

9. ఈః జ్ఞానము లభించుటకు ప్రధాన సాధనములను తెలుపుట
(4 అ. 39,40,42 శ్లో,)

ప్ర. **ఈః యధ్యాయమునకు మూడవ అధ్యాయముతోను ప్రధాన శాస్త్రార్థములోనుగల సంబంధమేమి ?**

ఉ. మూడవ అధ్యాయమున మోక్షమును గోరు ప్రతివారికిని మునుముందుగా ఆచరింపదగినది కర్మయోగమే యని యనేక హేతువులచే నుపదేశించెను. ఇందు ఆ కర్మయోగమునందు శ్రద్ధాభక్తులు వృద్ధిపొందుటకై దాని ప్రామాణ్యము చెప్పబడుచున్నది. ఇది సనాతనమైనదనియు పెక్కురు పెద్దలు దీని నెఱింగి ఇతరుల కెఱింగించి తామాచరించి యాచరింపజేసి రనుటచే దీనియందు ఆదరము కలుగునుగదా! మరియు ఆ కర్మయోగమును గూర్చి తెలియవలసిన ముఖ్యాంశములు అనగా అందలి జ్ఞానాంశము దాని యవాంతర భేదములు మొదలగు విషయములిందు జెప్పబడుచుండుటచే దీనికి మూడవ యధ్యాయముతో సాక్షాత్తుగా సంబంధమున్నది.
మోక్షసాధనమగు భక్తియే యీ శాస్త్రమునకు ముఖ్యతాత్పర్యము. దానికి అంగమగు కర్మయోగము యొక్క విమర్శయే యిందు చేయబడినది. గాన ప్రధాన శాస్త్రార్థముతో గూడ పరంపరగా సంబంధించుచున్నది.

4 ప్ర. ఇందు భగవదవతార విమర్శకు కారణమేమి ?

ఉ. కర్మయోగము ప్రమాణసిద్ధమైనదని చెప్పుటకు అది సనాతనమైనదనియు, జ్ఞానాధికులే ప్రవర్తకులనియు, సర్వజ్ఞుడే దానికి మొదటి గురువనియు చెప్పవలసివచ్చినది. ఆ గురువు తానే యనుటచే తనతో సమానమగు వయస్సుగల ఈ కృష్ణుడు కొన్నివేల సంవత్సరములు వయస్సులో పెద్దవాడగు సూర్యునకెట్లుపదేశించెనా, యని యర్జునునకు సంశయము కలిగెను. అది తీర్చుటకు భగవదవతార రహస్యమును జెప్పవలసి వచ్చెను. అదియునుగాక ముఖ్యముగా పాపములు తొలంగినగాని కర్మయోగాధికారియై క్రమముగ భక్తుడై మోక్షమును లభించుటకు సమర్థుడు కానేరడు. కావున పాపమును పోగొట్టుట కీయవతార రహస్యమొక ముఖ్య సాధనము.
మరియు ఏదో యొక నెపమున లోకులెఱుంగని ఆధ్యాత్మిక రహస్యములను వారు తరించుటకై అర్జునుని నిమిత్తమాత్రముగా జేసుకొని ఉపదేశింపవలెనని శ్రీకృష్ణభగవానుని అభిప్రాయము అందీ యవతార రహస్యమొక ముఖ్య విషయము.
తన మహిమను సమగ్రముగ నెఱింగిన గాని తనమాట యందు శ్రద్ధా భక్తులు జనింపవు. అందులకిది యొక సాధనము.

5 ప్ర. కర్మయోగము యొక్క ఆచార్య పరంపర ఏది ?

ఉ. ఈ కర్మయోగమును యిరువది యెనిమిది చతుర్యుగములకు పూర్వము మొదట భగవంతుడు సూర్యున కుపదేశించెను, అటుపిమ్మట సూర్యుడు మనువునకును, మనువు ఇక్ష్వాకునకును ఉపదేశించిరి. ఇట్లు క్రమక్రమముగా సూర్యవంశీయులును, విశాలమై గంభీరమైన హృదయములు కలవారును, భూతభవిష్యత్తుల నెఱుంగు సమర్థులును, ఆచార్య ప్రతిపత్తి కలిగి చెప్పినదానిని శ్రద్ధగా విని లెస్సగా నెఱింగి భక్తితో నాచరించు అశ్వపతి, జనకుడు, అంబరీషుడు మొదలగువారు యీ కర్మయోగ ఆచార్యపరంపరలో చేరినవారు. (4 అ. 1, 2, 3 శ్లో.)

6 ప్ర. మహాత్ములు పూర్వజన్మ వృత్తాంతము నెఱుంగ గలరనియు శ్రీకృష్ణుడట్టి మహాత్ముడని యెఱింగియు నర్జునుడు శ్రీకృష్ణుని 'నాతో సమాన వయస్కుడవగు నీవు పూర్వమే సూర్యున కుపదేశించుట అసంభావనీయము' అని ప్రశ్నించుటలో గల భావమును విశదపరచుము.

ఉ. అర్జునుడు పెక్కు ఋషుల వలనను, దేవర్షియగు నారదుని వలనను, అసితుడు, దేవలుడు, వ్యాసుడు, భీష్ముడు మొదలగు పెద్దలవలనను ప్రత్యక్షముగా శ్రీకృష్ణునివలనను అతడు పరబ్రహ్మయని యెఱింగియే

యున్నానని తానే చెప్పెను. అందుచే నీ(ప్రశ్నను చాలా భావగర్భితముగా నడిగెనని భావింపవలెను. ఆ భావమేమనగా :

1. కృష్ణా! నీవు నిఖిల హేయప్రత్యనీక కల్యాణైకతానుడవును, సృష్టి స్థితి లయ కారకుడవును గదా! నీ జన్మ ఇంద్రజాలమువలె యసత్యమా ? లేక మా జన్మలవలె సత్యమా ?

2. సత్యమేయైనచో మేము మా యొక్క సహజములైన అపహతపాప్మత్వాది గుణములను పోగొట్టుకొని పుట్టినట్లు నీవును నీ సహజమైన "అజత్వము (పుట్టకుండుట), అవ్యయత్వము (నశింపకుండుట), సర్వేశ్వరత్వము (నీ కంటె యితరములగు వాని నన్నిటిని శాసించుట), మొదలగు సకల పారమేశ్వరస్వభావములను విడిచి పుట్టుదువా లేక వాటితోనే యవతరింతువా?

3. నీ యవతార శరీరము మా శరీరమువలె పంచభూతములు, అహంకారము, మహత్తత్త్వము, మూలప్రకృతులతో నిర్మింపబడుచున్నదా ? లేక పంచోపనిషన్మయమై అప్రాకృతమై కేవల సత్త్వమయమైనదా ?

4. నీకు మావలె పుణ్యము పాపములు లేకున్నను వాటిని వరశాపాది నెపముగా కల్పించుకొని యవతరింతువా ? లేక రాజకుమారుడు చెరసాల కేగినట్లునీ సంకల్పముచేతనే యవతరింతువా ?

5. అట్లు కల్పించుకొని యవతరించుచో మావలెనవి పక్వమై ఫలోన్ముఖము లగునప్పుడవతరింతువా ? లేక ధర్మమడుగంటి అధర్మము విజృంభించునపుడు అవతరింతువా ?

6. మా జన్మకు దేవతల వలె కేవల సుఖమో, నారకీయ యాతనా శరీరమువలె కేవల దుఃఖమో, మనుష్యాది శరీరములవలె సుఖదుఃఖమిశ్రమో ఫలమగునట్లు నీయవతారమునకును నివియే ఫలములా ? లేక సజ్జన సంరక్షణము దుర్జన శిక్షణము ధర్మస్థాపనమే ఫలమా ? అని ఈ రహస్యములను ఎరుంగుటకై అర్జునుడట్లు శ్రీకృష్ణుని ప్రశ్నించెను. **(4 అ. 8 శ్లో. భాష్యం)**

7 ప్ర. అర్జునుడు శ్రీకృష్ణుని యవతార రహస్యము నెరుంగగోరి భావగర్భితముగా నడిగిన ప్రశ్నలకు శ్రీకృష్ణుడొసంగిన సమాధానములెవ్వి ? లేక ముముక్షువు లెఱుంగదగిన భగవదవతార రహస్యమెద్ది ? లేక పునర్జన్మ నరికట్టునట్టి భగవంతుని జన్మకర్మల తత్త్వమెద్ది ?

ఉ. ఈ ప్రశ్నల కన్నిటికిని శ్రీకృష్ణపరమాత్మ నాల్గవ అధ్యాయము నందలి 5వ శ్లోకము నుండి 8వ శ్లోకము వరకు గల నాలుగు శ్లోకములచే సమాధానము నొసంగెను. అందు 5వ శ్లోకము కేవలము మొదటి ప్రశ్నకే సమాధానము. అందు అర్జునుని జన్మలవలె తన జన్మలును పెక్కులును సత్యములును, అర్జునివలెగాక తానెఱింగినవియును అని చెప్పెను.

ఆరవ శ్లోకము; తరువాతవియగు అవతారరీతి, దేహతత్వము, జన్మహేతువులను గూర్చిన మూడు ప్రశ్నలకు సమాధానము. అందు మొదటి రెండు పాదములచే తాను తనకు సహజమగు అజత్వ, అవ్యయత్వ, సర్వేశ్వరత్వాది స్వభావములను విడువక వాటితోనే యవతరింతుననియు, మూడవ పాదముచే, తనయవతార శరీరము రజోగుణ, తమోగుణ సంపర్కములేని శుద్ధసత్వ మయమైన దనియును, నాల్గవపాదముచే, తాను జీవులవలె కర్మలచేగాక తన సత్యసంకల్పము చేతనే యవతరింతుననియు సమాధానమొసంగెను.

ఏడవ శ్లోకమున తాను పుణ్యాపాపములను కల్పించుకొని వాని పరిపాకావస్థలో జన్మించక ధర్మము నశించి యధర్మము ప్రబలమగునపుడే యవతరింతునని చెప్పెను.

ఎనిమిదవ శ్లోకమున సుఖదుఃఖముల ననుభవించుటకు గాక సజ్జనులకు తన యాటలను, పాటలను, మాటలను, చేష్టలను ప్రసాదించి వారి యభివృద్ధి కాటంకమును కలిగించు దుర్జనులను శిక్షించుటకును, ఆ మూలముగా ధర్మమును కాపాడుటకును యవతరింతుననియు సమాధానమొసంగెను. (భాష్యం)

8 ప్ర. భగవంతుడు తన భక్తుల పట్ల జూపు సౌలభ్యాతిశయమును తెలుపు శ్లోకమేది?

ఉ. యే యథా మాం ప్రపద్యన్తే తాం స్త థైవ భజామ్యహం
మమ వర్త్మాఽనువర్తన్తే మనుష్యాః పార్థ ! సర్వశః ॥ (4 అ. 11 శ్లో.)
అనునదియే ఆ శ్లోకము

వెనుకటి భగవదవతార రహస్య శ్లోకములలో సాధుపరిత్రాణము మొదలగు కృత్యముల నిర్వహించుటకై భగవంతుడు దేవ మనుష్య తిర్యక్ స్థావరాదులతో సమానమగు రూపములను ధరించి స్వేచ్ఛతో నవతరించునని చెప్పుటచే ఉపాసనకు కావలసిన భగవత్సౌలభ్యము చెప్పబడినది. ఆ సౌలభ్యము యొక్క హద్దు ఈ శ్లోకమున చెప్పబడుచున్నది.

భగవంతుని సౌలభ్యమునకు చివరహద్దు, అర్చక పరాధీనుడై సర్వమును సహించుచు ఆలయ, గృహ, కుటీర ములు యందు వేంచేసి యుండు అర్చావతారమే. అది ఈ శ్లోకమున సంగ్రహింపబడుచున్నది.(తా. చం.)

నేను కేవలము దేవరూపముతోను మనుష్యరూపముతోను ఈ లోకమున అవతరించి నన్నాశ్రయించ గోరువారిని మాత్రమే సంరక్షించువాడను అను నియమము లేదు. నన్ను పొందవలెనను కోరిక కలవారెవరైనను వారు తమ అపేక్షకు తగునట్లు నన్ను పతినిగనో, పుత్రునిగనో, సారథిగనో,

వరాహనరసింహాది రూపునిగనో కోరి నన్నాశ్రయించుదురో వారికా విధముగానే దర్శన మిచ్చుచున్నాను. అర్జునా! వేయేల! నా విగ్రహము, చేష్టలు, సౌశీల్యము మొదలగు స్వభావములు యోగులకైనను వాక్కునకుగాని మనస్సునకుగాని గోచరింపకున్నను నన్ను అనువర్తించు భక్తులందరు మాత్రము సామాన్యమగు తమ యింద్రియములచేతనే తాము కోరినట్లు అలంకరించియో, ఊరేంగించియో, ఉత్సవములు గావించియో, సేవించియో, షడ్రసోపేతములగు భోగముల నర్పించియో అనుభవించుచుందురు.

(తా. చం.)

9 ప్ర. **లోకులందరును కర్మయోగులు కాకుండుటకు ప్రతిబంధక మెట్టిది ? అట్టి దానిని తొలగించుటకు ఏ యుపాయమును భగవానుడుపదేశించెను?**

ఉ. లోకము నందలి పురుషులందరును సామాన్యముగా త్వరలో లభించు పుత్రులు, పశువులు, తిండి, స్వర్గము మొదలగు ఫలముల నాశించి ఇంద్రాది దేవతలను మాత్రము ఆరాధింతురు గాని సంసారమునందు విరక్తి జనించి ముముక్షువులై అట్టి యింద్రాదుల కంతర్యామిగా నుండి సకల యజ్ఞములకును భోక్తనగు నన్ను ఫలమును గోరక ఆరాధించువారు గాన్పింపరు. అందులకు కారణము అనాదికాలమునుండి తరుగక పెరుగుచున్న వారి పాపరాశియే. ఈ పాపమునుండి తరించవలెనన్న నా సృష్టి రహస్యము నెఱుంగవలెను. నేనీ ప్రపంచము నందలి బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రజాతులను గుణవిభాగము ననుసరించియు కర్మవిభాగము ననుసరించియు సృష్టించుచున్నాను. ఆ విభాగ మెట్లనగా :

సత్వగుణ ప్రధానుడు బ్రాహ్మణుడు. ఆతడాచరించదగిన కర్మలు శమదమాదులు. (18 అ. 42 శ్లో.)

సత్వము అప్రధానముగాను రజోగుణము ప్రధానముగాను కలవాడు క్షత్రియుడు. ఈతడాచరింపదగిన కర్మలు శౌర్యము, తేజస్సు, ధృతి మొదలగునవి. (18 అ. 43 శ్లో.)

రజోగుణము ప్రధానముగను. తమోగుణము అప్రధానముగాను కలవాడు వైశ్యుడు. ఈతడాచరించవలసిన కర్మలు వ్యవసాయము, గోరక్షణ, వ్యాపారము మొదలగునవి. (18. అ. 44 శ్లో.)

తమోగుణము ప్రధానముగను, రజోగుణము అప్రధానముగను కలవాడు శూద్రుడు. ఈతడు చేయవలసిన కర్మ పరిచర్య. (18. అ. 44 శ్లో)

ఇట్లు నేనే సృష్టించినను నిజమారయ నేనందులకు కర్తనుకాను. అనగా ఆ విషసృష్ట్యాది కర్మలు నన్ను బంధింపనేరవు. అందులకు కారణమేమనగా–

ఆ సృష్టివైచిత్ర్యమునకు కారణము సృష్టింపబడు చేతనులయొక్క పుణ్యాపాపకర్మ విశేషములే. నేనందుకు నిమిత్త మాత్రమే. ఆ సృష్టింపబడు చేతనులు సృష్టి వలన లభించు కరణ కళేబరములతో సృష్టింపబడిన భోగములను తమ కర్మానుకూలముగా ననుభవింతురు. ఆ సృష్ట్యాదులలో ఆ కర్మఫలములలోగాని వారికే యభిలాషయుండునుగాని నాకేమియు లేదు. ఇట్లు సామాన్యముగా సృష్ట్యాదులకు నేను కర్తనై నను సృష్టివైలక్షణ్యమునకు కారణమైనవాడను కాననియు, ఆ సృష్ట్యాది కర్మఫలములతో జోక్యము లేనివాడననియు నన్నెఱుంగువాడు కర్మయోగము నాచరించుట కాటంకములగు ప్రాచీన కర్మలనుండి విముక్తుడై కర్మయోగమును నిర్విఘ్నముగా నాచరించి ఫలమును బడయగల్గును. (భాష్యం)

10 ప్ర. **కర్మ – అకర్మ – వికర్మల స్వరూపములను భగవంతుడెట్లు వివరించెను ? వాటిని గూర్చి తెలుసుకొనవలసిన ముఖ్యాంశములెవ్వి ?**

ఉ. కర్మయనగా – మోక్షసాధనమగు కర్మయోగము.

అకర్మయనగా – ఆ కర్మయోగములో నంతర్భూతమై ప్రధానాంశమై యుండు ఆత్మజ్ఞానము.

వికర్మయనగా – నిత్యములనియు, నైమిత్తికములనియు, కామ్యములనియు, వాటికి సాధనమగు ద్రవ్యార్జన యనియు పెక్కురీతులుగా నుండు కర్మ.

ఇందు – వికర్మను గూర్చి తెలియవలసినదేమనగా –

ఆ కర్మలన్నిటికిని ఫలముచే గలుగు భేదములను విడిచి అవియన్నియు మోక్షమొక్కటియే ఫలముగా కలవియగుటచే మోక్షసాధనములే యగునని ఒకే యనుసంధానమును కలిగి యుండవలెను. (భాష్యం)

ఇక కర్మ – అకర్మలను గూర్చి తెలియవలసినదేమనగా

కర్మయగు ఆత్మయొక్క వాస్తవ స్వరూపమును అనుసంధించుచు కర్మలు చేయుచుండవలెను. అట్లు చేయునపుడా కర్మయోగమునందలి జ్ఞానాంశము వేరనియు, కర్మాంశము వేరనియు భావింపక ఈ రెండును ఒకే యోగమునందలి రెండు ముఖ్యమైన భాగములు. ఇందేది లేకున్నను కర్మయోగమే లేకుండును. కావున కర్మను చేయుచున్నను దానిని జ్ఞానాకారముగను, ఆ జ్ఞానము కర్మయోగములో నొక ప్రధానాంగమే గావున దానిని కర్మాకారముగను భావింపవలెను. ఇట్లు తెలుసుకున్నవాడు బుద్ధిమంతుడు. సకల శాస్త్రార్థముల నెఱుంగువాడు. వాడే మనుష్యులలో మోక్షార్హుడు. వాడే సకల శాస్త్రీయ కర్మల నాచరించిన వాడు.(భాష్యం)

11ప్ర. ఇంద్రియ వ్యాపారములతో కూడిన కర్మకు జ్ఞానాకారమెట్లు ఘటించును?

ఉ. కర్మలు జ్ఞానాకారమగుట యనగా – అవి బంధుహేతువలు గాక జ్ఞాననిష్ఠ యొసంగు ఫలమును యీయదగిన వగుట, అందులకు వాటి నీ క్రింది విధముగా చేయవలెను.

ఫల సంగము, దేహాత్మ భ్రాంతియు లేక కర్మలను చేయువాడు జ్ఞానమనెడు అగ్నికలవాడగుట వలన అట్టి ఫలాపేక్షలేనివాని కర్మయును జ్ఞానాగ్ని కలదియగును కావున నట్టి కర్మ, నిప్పుచే కాల్చబడిన విత్తనము మొలకెత్తనట్లు ఫలము నొసంగదు. కాన జ్ఞానాకారమునే పొందుననుట నిర్వివాదము. (4 అ. 19 శ్లో.)

కర్మఫలమునందలి ఆశను విడిచి, ఆత్మయందే తృప్తుడై ప్రకృతి తనకాధారమనెడు భ్రాంతిని విడిచి కర్మలను చేయువాడు కర్మలను చేయుచున్నను ఆ మిషతో జ్ఞానమునే అభ్యసించుచున్నాడని తెలియవలెను. (4 అ.20 శ్లో.)

ఫలమును కోరక, మనస్సులోనైనను ఇతర విషయములను చింతించక, ఆత్మయే తనకు ముఖ్యమైన ప్రయోజనముగా గలవాడై భోగ్యములగు శబ్దాది విషయములయందుగాని, భోగసాధనమగు ఇంద్రియముల యందుగాని మమకారము లేనివాడై బ్రతుకుటకు మాత్రమవసరమగు కర్మలు చేయుచున్నను మధ్య జ్ఞానయోగ సహాయ మక్కరలేకయే కేవల మిట్టి కర్మ యోగము చేతనే ఆత్మస్వరూపమును దర్శించగలడు. (4 అ. 21 శ్లో.)

శరీరము నిలబెట్టుకొనుటకు మాత్రము తమంతటనే లభించిన వుస్తువులెంత కొంచెమైనను వానితో తృప్తి చెందుచు, శీతోష్ణాదులను సహించుచు, తన కష్టములకు తన కర్మయే కారణమని యెఱింగి ఇతరుల యందు మాత్సర్యముంచక వర్ణాశ్రమ ధర్మమును ఫలమందు దృష్టినిడక సమచిత్తుడై చేయువాడు జ్ఞాననిష్ఠలేక కర్మలనే ఆచరించినను సంసారబద్ధుడు కాడు. (4 అ. 22 శ్లో.)

ఆత్మజ్ఞానమునందే స్థిరముగ లగ్నమైన మనస్సుకలవానికి ఇతర వస్తువుల యందు ఆసక్తి యుండనేరదు. కావుననే దేనినిగాని యిది నాది యని ప్రేమించడు. అట్టి వాడు చేయునట్టి యజ్ఞాది కర్మలు జ్ఞానరూపములై బంధహేతువగు ప్రాచీన కర్మనంతను నశింపజేయును. (4 అ.23 శ్లో.)

ముముక్షువు, కర్మలన్నియు పరబ్రహ్మాత్మకములనెడు అనుసంధానముతో నాచరించును, కావున అవి యన్నియు జ్ఞానాకారములేయగును, అట్టి

కర్మలు మధ్య జ్ఞాననిష్ఠలేకయే ఆత్మసాక్షాత్కారమును లభింపజేయును (ఈ శ్లోకమున చేతనాచేతనములన్నియు బ్రహ్మకార్యములే గాన బ్రహ్మలేయని ఉపచారముగా చెప్పబడెను) (4 అ. 24 శ్లో.)

ఇటుపైన చెప్పబడినట్లు అధ్యవసాయాదులతో కర్మల నాచరించినచో నవి జ్ఞానాకారములగును.

12 ప్ర. కర్మయోగము యొక్క ఆవాన్తర భేదములెవ్వి ?

ఉ. 1. దేవతార్చనము ఒక యజ్ఞమని భావించి దానియందే నిష్ఠకలిగి యుండుట. (4అ. 25 శ్లో)

2. బ్రహ్మరూపమైన అగ్నియందు స్రుక్కుస్రువములచే హవిస్సును హోమము చేయుట. అనగా "బ్రహ్మార్పణం" అను శ్లోకమునందు చెప్పబడినట్లు అనుసంధించుచు యాగములయందును హోమముల యందును నిష్ఠకలిగి యుండుట. (14. అ. 25 శ్లో)

3. శ్రోత్రాది జ్ఞానేంద్రియములను విషయములతో చేరకుండునట్లు ప్రయత్నించుట, (4అ. 26 శ్లో)

4. శబ్దాది విషయములు శ్రోత్రాది యింద్రియములతో చేరినను వానికేవిధమగు వికారమును గాని కలుగజేయజాలని రీతిగ చేసివేయుట, (4అ. 26 శ్లో).

(పై రెండు యజ్ఞములలోను బొత్తుగ విషయములను దరిజేరకుండ జేయుట అసంభవము కావున కూడనివాటిని బొత్తుగా దగ్గర చేరనీయకుండుట, కూడుకున్న వాటినైనను హెచ్చుగ నాదరింపకుండుట అని గ్రహించవలెను).

5. మనస్సునకు, జ్ఞానేన్ద్రియ వ్యాపారములగు చూచుట. స్పృశించు మొదలగు పనులయందును, కర్మేంద్రియ వ్యాపారములగు మాట్లాడుట, నడచుట,తీసికొనుట మొదలగు పనులయందును, ప్రాణ వ్యాపారములగు ఉచ్ఛ్వాస నిశ్వాసలయందును గల ఆసక్తిని నివర్తింపజేయుటకు ప్రయత్నించుట. (4అ. 27శ్లో).

ఇందు మనస్సును జయించుటయే ఒక కర్మయోగముగా చెప్పబడినది.

6. ద్రవ్యయజ్ఞములు : న్యాయముగా ధనము నార్జించి, దేవతార్చనలు గావించుట, సత్పాత్ర నెఱింగి దానముజేయుట, యాగములాచరించుట, హోమములను చేయుట, మొదలుగునవి.

7. తపోయజ్ఞములు : తపస్సనగా శాస్త్రమునననుసరించి భోగములను తగ్గించుకొనుట, అనగా కృచ్ఛచాంద్రాయణ. హరివాసరోప వాసాదులచే, శరీరమును శుష్కింప జేసుకొనుట.

8. యోగయజ్ఞములు : ఇచ్చట యోగమనగా సంయోగము. (అనగా ప్రాప్తి పొందుట) శ్రీరంగాది పుణ్యక్షేత్రములకును, కావేరీ మొదలగు పుణ్యతీర్థమునకు వెళ్ళుట యందును అచ్చట నివసించుట యందును నిష్ఠకలిగియుండుట. (వెళ్ళవలెనని ఆశపడుట కూడా యిట్టిదే. ఇచ్చట పుణ్యక్షేత్రములనగా దివ్యదేశములు పవిత్ర ఆశ్రమములు, పావన ప్రదేశములు మొదలగునవి).

9. స్వాధ్యాయ యజ్ఞములు: నియమ పూర్వకముగ వేదాభ్యాసమునందు నిష్ఠగలిగియుండుట.

10. జ్ఞానయజ్ఞములు : అట్లు అభ్యసించిన వేదమునకు అర్థము నెఱుంగుట కభ్యసించుటలో నిష్ఠకలిగి యుండుట. (ఇంతవరకు 4అ 28 శ్లో).

11. ఆహారనియమముతో ప్రాణాయామమునందు నిష్ఠకలిగి యుండుట, ఈ ప్రాణాయామము పూరకము, రేచకము, కుంభకము అని మూడు విధములగుటచే వాని నభ్యసించువారును మూడువిధములుగా నుందురు. పూరకము - పైకిపోయెడు ప్రాణవాయువును క్రిందకు పోనిచ్చి అపానవాయువునందు చేర్చుట.

రేచకము - క్రిందికిపోయెడు అపానవాయువును పైకి తెచ్చి ప్రాణ వాయువునందు చేర్చుట.

కుంభకము: ప్రాణవాయువుయొక్క ఊర్ధ్వగతియగు ఉచ్ఛ్వాసమును. అపానవాయువుయొక్క అధోగతియగు నిశ్శ్వాసమును నిలిపి యుంచుట.

(4అ. 29, 30 శ్లో)

నిత్యనైమిత్తిక కర్మల నాచరించుచు పైన చెప్పబడిన కర్మయోగ భేదములలో ఏ యొక్క దానియందు నిష్ఠకలిగి యున్నను అదేవిధమగు ఫలము (ఆత్మసాక్షాత్కారము) లభించును.

13 ప్ర. **కర్మయోగమునందలి కర్మాంశకంటె జ్ఞానాంశకు గల ప్రాముఖ్యమును, దాని మహిమను భగవంతుడెట్లు విశదీకరించెను?**

ఉ. కర్మ జ్ఞానములనెడు రెండంశలతో కూడియున్న యీ కర్మయోగము నందు ద్రవ్యార్జనాదిరూపమైన కర్మాంశకంటె, జ్ఞానాంశమే ప్రధానము. ఏలయన కర్మలన్నియు సకల సాధనములతోను జ్ఞానరూపముగనే పరిణమించుచున్నవి. అనగా ఈ సాధనములన్నిటితోను సంపాదింపబడదగిన జ్ఞానము, కర్మయోగము లోని ఒకయంశగనే యభ్యసింపబడుచు క్రమముగా ఆత్మసాక్షాత్కారమును కలిగించు దశకు వచ్చును. (4 అ. 33శ్లో.)

దీనిని ఒక్కసారి వినుటచే తృప్తిని చెందక ఆత్మస్వరూపమును సాక్షాత్కరించిన జ్ఞానుల నాశ్రయించి వారికి సాష్టాంగ వందనమాచరించి, ఏమియునెఱుంగనివానివలె వారి అవకాశము నెఱింగి ప్రశ్నించుచు, చిరకాలమువారిని అనువర్తించి మరల మరల విశదముగా నెరుంగవలెను. (4అ. 34శ్లో.)

ఈజ్ఞానము సాక్షాత్కారదశకు వచ్చినచో అహంకార మమకారములు నశించును. (అహంకారమనగా దేహములనే ఆత్మలని భావించు అజ్ఞానము. మమకారమనగా భగవంతునకు పరికరములగు ఆ దేహేంద్రియాదులను తనవిగా భావించుట)

అంతట ప్రకృతి సంబంధములేని పరిశుద్ధాత్మలన్నియు తమలో తాము సమానముగాను సర్వేశ్వరునితో సమానముగాను ఉండునని కనుగొనును, (4అ. 35 శ్లో.)

మహాపాతకియైనను ఓడతో సముద్రమును దాటునట్లు యీ జ్ఞానముచే ఆ పాపమునంతను దాటగల్గును. (4వ. 36శ్లో.)

స్వల్పమగు యీ జ్ఞానమొక్కటి మాత్రము, అనుభవించినగాని తరుగనట్టియు అనాదికాలము నుండి అనువర్తించు నట్టియు పాపరాసినెట్లు పోగొట్టునని సంశయింప పనిలేదు. చిన్న నిప్పు నెరుసు పర్వతపరిమాణము గల యెండు కట్టెలను ధగ్ధము జేయుటలేదా! (ఇచ్చట కర్మలను భస్మము చేయుట యనగా ఇతర సంసారిక ఫలమునకు సాధనమైన పుణ్యమును పాపమును గూడ తమ ఫలముల ననుభవింప చేయజాలని వాటినిగా చేసివేయుటయే, (4అ. 37శ్లో.)

దీనికింత శక్తికలదాయని సందేహింప పనిలేదు. ప్రపంచమున దీనికి మించిన పవిత్రమైన వస్తువు వేరొక్కటిలేదు. కావున ఉపదేశించిన విధముగా జ్ఞానాకారమగు కర్మయోగమును అనుష్ఠించినవారికి క్రమముగ నీ జ్ఞానము తనంతట తానే కలుగును (4వ. 38 శ్లో.)

దీనికి శ్రద్ధాభక్తులు ప్రధానాంగములు, అజ్ఞానము, అశ్రద్ధ, అనుమానము ప్రతి బంధకములు, కావున దీనిని లభింపవలెనను త్వరతో కూడిన వాడై పెద్దల ఉపదేశముచే జ్ఞానమును బడసి దానిచే అజ్ఞానమును అనుమానమును పోగొట్టుకొని చెప్పిన విధముగా కర్మయోగము నాచరింపవలెను.

(4అ. 39, 40, 41, 42 శ్లో.)

పఞ్చమాధ్యాయార్థసఙ్గ్రహము

శ్లో. కర్మయోగస్య సౌకర్యం । శైఘ్ర్యం కాశ్చన తద్విధాః ।
బ్రహ్మజ్ఞానప్రకారశ్చ । పఞ్చమాధ్యాయ ఉచ్యతే ।

ర్థము :- కర్మయోగస్య = కర్మయోగము యొక్క, సౌకర్యం = సుఖముగా చేయ తగుటయు, శైఘ్ర్యం = శీఘ్రముగా ఆత్మప్రాప్తిని కలిగించుటయు, కాశ్చన = కొన్ని, తద్విధాః = దాని విధములున్ను, బ్రహ్మజ్ఞాన ప్రకారఃచ = ఏ ప్రకారము నడుచుకొనినచో కర్మయోగికి శుద్ధాత్మను గూర్చిన సమదర్శన రూపమగు జ్ఞాన పరిపాకము కలుగునో అదియు, పఞ్చమాధ్యాయే = ఐదవ అధ్యాయమునందు, ఉచ్యతే = చెప్పబడుచున్నది.

తా॥ కర్మయోగము ఆత్మప్రాప్తిని కలుగుజేయుటలో జ్ఞానయోగము కంటె సుకరము, శీఘ్రము అనియు, కొన్ని దాని విధములును, కర్మయోగి ఏ ప్రకారముగా నడచుకొన్నచో శుద్ధాత్మను గూర్చిన సమదర్శన రూపమగు జ్ఞానవిపాకము కలుగునో అదియు నీయైదవ యధ్యాయమున చెప్పబడుచున్నది.

శ్రీమద్భగవద్గీతా - పంచమాధ్యాయము

విషయ సూచిక

శ్రీ హయగ్రీవాయ నమః

శ్రీ భగవద్గీతా - పంచమో ఽధ్యాయః
కర్మసన్న్యాసయోగః

అర్జున ఉవాచ = అర్జునుడు చెప్పెను.

1. శ్లో. సన్న్యాసం కర్మణాం కృష్ణ !। పున ర్యోగం చ శంససి ।
యచ్ఛ్రేయ ఏతయో రేకం । తన్మే బ్రూహి సునిశ్చితమ్॥

తా ॥ కృష్ణా ! కర్మయోగముచే జ్ఞానము నార్జించి దానిచే నాత్మదర్శనమును గావింపుమనియు, కర్మయోగము నాచరింపుమనియును చెప్పుచున్నావు. ఈ రెండిటిలో నేది సుఖముగ నాచరించుటకును, త్వరగ ఫలము నిచ్చుటకును శ్రేష్ఠమైనదని నిశ్చయింపబడెనో దానిని నాకు చెప్పుము.

శ్రీ భగవానువాచ ——— శ్రీ కృష్ణుడు పలికెను.

2. సన్న్యాసః కర్మయోగశ్చ । నిశ్శ్రేయసకరా వుభౌ ।
తయోస్తు కర్మసన్న్యాసాత్ । కర్మయోగో విశిష్యతే ॥

తా॥ జ్ఞానయోగ కర్మయోగములు రెండును వేరొక సహాయమును కోరకయే మోక్షమునకు సాధనము లగుచున్నవి. అయినను వాటిలో జ్ఞానయోగముకంటె కర్మయోగము శ్రేష్ఠమైనది.

3.శ్లో. జ్ఞేయ స్స నిత్య సన్న్యాసీ । యో న ద్వేష్టి న కాఙ్క్షతి ।
నిర్ద్వన్ద్వో హి మహాబాహో ! । సుఖం బన్ధాత్ప్రముచ్యతే ॥

తా॥ అర్జునా ! ఆత్మతప్ప మిగిలిన దేనియందును రాగముగాని ద్వేషముగాని లేక శీతోష్ణాది ద్వంద్వములను సహించుచుండు కర్మయోగి నిత్యము జ్ఞాననిష్ఠుడే, వాడు సుఖముగా ముక్తుడగును.

4.శ్లో. సాఙ్ఖ్యయోగౌ పృథగ్బాలాః । ప్రవదన్తి న పణ్డితాః ।
ఏక మప్యాస్థిత స్సమ్యక్ । ఉభయో ర్విన్దతే ఫలమ్ ॥

తా॥ కర్మయోగమువలన జ్ఞానయోగమును దానివలన ఆత్మావలోకనమున్ను కలుగునని చెప్పువారు ఏమియు నెఱుంగనివారు, రెండింటిలో దేనిని బాగుగా ఆచరించినను ఆత్మావలోకనమను ఒకే ఫలము లభించగలరు.

అవ. కర్మయోగ జ్ఞానయోగములు ఒకే ఫలము నిచ్చునవియనియెఱుంగువారిని ప్రశంసించుచున్నాడు.

5.శ్లో. **యత్సాఙ్ఖ్యైః ప్రాప్యతే స్థానం । త ద్యోగై రపి గమ్యతే ।**
ఏకంసాఙ్ఖ్యం చ యోగం చ యః పశ్యతి స పశ్యతి ॥

అర్థము: సాఙ్ఖ్యైః= జ్ఞాననిష్ఠులచే, యత్ స్థానం= ఏ ఫలము, ప్రాప్యతే= పొందబడుచున్నదో, తత్ = ఆ ఫలము, యోగైఃఅపి = కర్మయోగులచేతనుకూడ, గమ్యతే = పొందబడుచున్నది, యః = ఎవడు, సాఙ్ఖ్యం చ = జ్ఞానయోగమును, యోగం చ= కర్మయోగమును, ఏకం= ఒకేఫలము నిచ్చునవిగా, పశ్యతి = తెలుసుకొనుచున్నాడో, సః = వాడు, పశ్యతి = బాగుగ తెలిసినవాడగుచున్నాడు.

తా ॥ జ్ఞానయోగకర్మయోగములు రెండింటికిని ఆత్మావలోకనమనెడు ఫలమొక్కటియే, కావున, యే యొక్కటియైనను ఆత్మావలోకనము కలుగజేయును. ఇట్లెరింగినవాడే పండితుడు.

అవ. ఐనను కర్మయోగము సుకరముగను, శీఘ్రముగను ఫలము నొసంగును గాన జ్ఞానయోగముకంటె ఉత్తమమనుచున్నాడు.

6. శ్లో. **సన్న్యాసస్తు మహాబాహో !। దుఃఖ మాప్తు మయోగతః ।**
యోగయుక్తో ముని ర్బ్రహ్మ । న చిరేణా ధిగచ్ఛతి ॥

అర్థము : మహాబాహో = అర్జునా ! సన్న్యాసః తు = జ్ఞానయోగమైతే, అయోగతః = కర్మయోగము లేకయే, ఆప్తుం= పొందుటకు, దుఃఖం = అశక్యము, యోగయుక్తః= కర్మయోగనిష్ఠుడగు, మునిః= ఆత్మమననశీలుడు, నచిరేణ= స్వల్పకాలములోనే, బ్రహ్మ = ఆత్మను, అధి గచ్ఛతి = పొందును.

తా॥ అర్జునా ! కర్మయోగి కాకయే జ్ఞానయోగి యగుట అశక్యము, కర్మయోగి స్వయముగనే ఆత్మ మననశీలుడై స్వల్పకాలములోనే శుద్ధాత్మస్వరూపమును పొందును.

7. శ్లో. **యోగయుక్తో విశుద్ధాత్మా । విజితాత్మా జితేన్ద్రియః ।**
సర్వభూతాత్మ భూతాత్మా । కుర్వన్నపి న లిప్యతే ।

అర్థము : యోగయుక్తః = కర్మయోగముతోకూడినవాడును, విశుద్ధాత్మా = నిర్మలమైన మనస్సుకలవాడును, విజితాత్మా = స్వాధీనమైన మనస్సుకలవాడును, జితేన్ద్రియః= ఇంద్రియనిగ్రహముకలవాడును, సర్వభూతాత్మభూతాత్మా = అన్ని

భూతములయందున్న ఆత్మ వంటి ఆత్మకలవాడును, కుర్వన్ అపి = కర్మలుచేయుచున్నను, న లిప్యతే = ఆత్మాభిమానముచే అంటబడడు.

తా॥ కర్మయోగము నాచరించిన, మనస్సు నిర్మలమగును. అట్లు మనస్సు నిర్మలముకాగానే అది స్వాధీనమగును, దానిమూలమున ఇంద్రియములు చెప్పినట్లు వినును. అట్టివానికి ఆత్మలన్నియు ఒకే ఆకారము కలవని తెలియును. గాన అతడు కర్మలాచరించుచున్నను, అతనికి ఆత్మాభిమానము ఉండదు.

అవ. ఈ కర్మ యోగమునకు ముఖ్యముగ కావలసిన చేతనుని అకర్తృత్వాను సంధానమును గూర్చి శ్రీకృష్ణుడు చెప్పుచున్నాడు.

8.శ్లో. నైవ కిఞ్చి త్కరో మీతి । యుక్తో మన్యేత తత్త్వవిత్ ।
పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్ర । న్నశ్న న్గచ్ఛన్ స్వపన్ శ్వసన్॥

9.శ్లో. ప్రలపన్ విసృజన్ గృహ్ణన్ । ఉన్మిష న్నిమిష న్నపి ।
ఇన్ద్రియాణీ న్ద్రియార్థేషు । వర్తన్తఇతి ధారయన్ ।

అర్థము : తత్త్వవిత్= ఆత్మజ్ఞానముగల., యుక్తః = కర్మయోగి, పశ్యన్= చూచుచున్నను, శృణ్వన్ = వినుచున్నను, స్పృశన్ = ముట్టుకొను చున్నను, జిఘ్రన్ = వాసనచూచుచున్నను, అశ్నన్ = తినుచున్నను, గచ్ఛన్ = నడచుచున్నను, స్వపన్ = నిద్రించుచున్నను, శ్వసన్ = ఊపిరివిడుచుచున్నను, ప్రలపన్ = మాటలాడుచున్నను, విసృజన్= విడుచుచున్నను, గృహ్ణన్= తీసుకొనుచున్నను, ఉన్మిషన్= కన్నులు తెఱచుచున్నను, నిమిషన్= కన్నులు మూయుచున్నను, ఇన్ద్రియాణి = ఇంద్రియములు, ఇన్ద్రియార్థేషు = విషయములయందు, వర్తన్తే ఇతి= ప్రవరించుచున్నవని, ధారయన్= అనుసంధించుచున్న వాడగుచు, కిఞ్చిత్= ఒక్కదానినైనను, న కరోమి ఏవ ఇతి = చేయుటయేలేదు అని, మన్యేత= తలంచ వలెను.

తా॥ ఆత్మతత్వమును లెస్సగ నెఱింగినకర్మయోగి జ్ఞానేంద్రియములచేతను, కర్మేంద్రియములచేతను, ప్రాణాదులచేతను, ఏపని చేసినను, అవి తమ తమ విషయములయందు ప్రవర్తించుచున్నవి గాని తానేమియు చేయుట లేదని తలంచవలయును.

అవ. తనను కర్తను కానని యనుసంధించి కామ్యకర్మ లాచరించినను అవి బంధింపక యుండునా ? తాను కర్తయై యుండగా అది తనకు శరీరమనెడు ఉపాధివలన వచ్చిన దనుకొనుటచే నేమి ప్రయోజనము ? అట్లనుసంధించినను ప్రకృతి సంబంధము వీనికి దేహాత్మ భ్రమను కలిగించదా ? అనెడు శంకలు కలుగునని శంకించి సమాధాన మొసంగుచున్నాడు.

10.శ్లో. బ్రహ్మణ్యాధాయ కర్మాణి । సఙ్గం త్యక్త్వా కరోతి యః ।
లిప్యతే న స పాపేన । పద్మపత్ర మి వామ్భసా॥

అర్థము: యః = ఎవడు, కర్మాణి = ఇంద్రియవ్యాపారములను, బ్రహ్మణి = ప్రకృతియందు, ఆధాయ=ఉంచి, సఙ్గం=ఫలసంగమును, త్యక్త్వా=విడిచి, కరోతి=కర్మలను చేయుచున్నాడో, సః = వాడు, అమ్భసా = నీటిచేత, పద్మపత్రం ఇవ = తామరాకువలె, న లిప్యతే = అంటబడడు.

తా॥ వెనుక చెప్పబడిన కర్మల కర్తృత్వమును ఇంద్రియములుగా మారిన ప్రకృతి యందుంచి, ఫలాశను వీడి, తనను కర్తకానివానినిగా తలంచి, కర్మలాచరించినను తామరాకుపై చల్లిన నీరు దానినంట నట్లు దేహమే ఆత్మయనిపించు పాపమాతనిని యంటదు.

అవ. తానుపదేశించిన యర్థమును శిష్టాచారముచే సమర్థించుచున్నాడు.

11.శ్లో. కాయేన మనసా బుద్ధ్యా । కేవలై రిన్ద్రియై రపి ।
యోగినః కర్మకుర్వన్తి । సఙ్గం త్యక్త్వా ఽఽత్మశుద్ధయే ॥

అర్థము : యోగినః = కర్మయోగులు, ఆత్మశుద్ధయే = ఆత్మకు కర్మబంధమును మాన్పుట కొఱకు, సఙ్గం = ఫలసంగమును, త్యక్త్వా = విడిచి, కాయేన = శరీరముచేతను, మనసా = మనస్సు చేతను, బుద్ధ్యా = బుద్ధిచేతను, కేవలైః = కేవలమైన, ఇన్ద్రియైః అపి = జ్ఞానేంద్రియములచేతను, కర్మ = కర్మను, కుర్వన్తి = చేయుచున్నారు.

తా॥ యోగులు ఆత్మకు ప్రాచీనకర్మబంధము నశించి పరిశుద్ధమగుటకు స్వర్గాధిఫలాశను విడిచి శరీరము మనస్సు బుద్ధులతోను, జ్ఞానేంద్రియముల తోను కర్మల నాచరింతురు.

అవ. ఒకే కర్మబంధహేతువు మోక్షహేతువుకూడ నెట్లగునను సందేహమును ఫలమును కోరుట, కోరకుండటయే యందులకు కారణమని చెప్పి పరిహరించుచున్నాడు.

12.శ్లో. **యుక్తః కర్మఫలం త్యక్త్వా । శాన్తి మాప్నోతి నైష్ఠికీమ్ ।**
అయుక్తః కామకారేణ । ఫలే సక్తో నిబధ్యతే ।

అర్థము : యుక్తః = సమాహితచిత్తుడు, కర్మఫలం = కర్మఫలమును, త్యక్త్వా = విడిచి, నైష్ఠికీం = స్థిరమైన, శాన్తిం = ఆత్మానుభవశాంతిని, ఆప్నోతి = పొందుచున్నాడు, అయుక్తః = సమాహితచిత్తుడుకాని వాడు, కామకారేణ = కామప్రేరణచేత, ఫలే = కర్మఫలమునందు, సక్తః = ఆసక్తుడై, నిబధ్యతే = మిక్కిలి బద్ధుడగుచున్నాడు.

తా ॥ ఆత్మదర్శన ప్రవణుడు కర్మఫలములను విడిచి ఆత్మశుద్ధికొఱకు కర్మలనాచరించి ఆత్మానుభవశాంతిని పొందుచున్నాడు, సాంసారిక ఫలాశ కలవాడు ఫలాపేక్షతో కర్మను చేయుచు నిత్యసంసారియగు చున్నాడు.

అవ. ఇంతవరకు 'శరీరమును ఆశ్రయించియుండు ఇంద్రియములు ప్రాణములే తనచే సాంసారిక కర్మలను చేయించుచున్నవని తలంచుమని ఉపదేశించి, యిప్పుడు శరీరమునందే ఆ కర్తృత్వమును అనుసంధించుమని ఉపదేశించుచున్నాడు.

13.శ్లో. **సర్వ కర్మాణి మనసా । సన్న్యస్యా స్తే సుఖం వశీ ।**
నవద్వారే పురే దేహీ । నైవ కుర్వ న్న కారయన్ ।

అర్థము : దేహీ = ఆత్మ, మనసా = మనస్సుచేత, సర్వకర్మాణి = కర్మలనన్నిటిని, నవద్వారే = తొమ్మిదిద్వారములుగల, పురే = పట్టణమునందు, సన్న్యస్య = వదలి, వశీ = స్వతంత్రుడై, న కుర్వన్ = తాను చేయక, న కారయన్ ఏవ = దేహముచే చేయించకున్నవాడై, సుఖం = సుఖముగా, ఆస్తే = ఉండును.

తా ॥ జీవుడు, తనకు కర్తృత్వము ప్రాచీన కర్మనిమిత్తమగు దేహసంబంధమువల్ల వచ్చినదని తెలసి, దానిని దేహమునకే విడిచి, తన పరిశుద్ధస్వరూపముచే దేహమునకు పరతంత్రుడుగాక దేహము నందుండియు చేయగల ప్రయత్నము చేయక, దేహముచే దేనిని చేయించక సుఖముగా నుండును.

అవ. ఆత్మయొక్క స్వాభావిక స్వరూపమును చెప్పుచున్నాడు.

14.శ్లో. న కర్తృత్వం న కర్మాణి । లోకస్య సృజతి ప్రభుః ।
న కర్మఫల సంయోగం । స్వభావస్తు ప్రవర్తతే ॥

అర్థము : ప్రభుః = ఆత్మ, లోకస్య = ఈ లోకమునకు, కర్తృత్వం = కర్తృత్వమునుగాని, కర్మాణి = కర్మలనుగాని, కర్మఫలసంయోగం = కర్మలవలన కలిగెడు ఫలానుభవమునుగాని, నస్సృజతి = కలుగజేయడు, స్వభావఃతు = ప్రకృతివాసనయే ప్రవర్తతే = ప్రవర్తించుచున్నది.

తా ॥ పరిశుద్ధ స్వరూపముగల జీవాత్మ, దేవాది రూపముతో నుండెడు యీ లోకమునకు ఆయారూపములకు తగిన కర్తృత్వమునుగాని, వారికిగల ఆ కర్మలనుగాని, వాటివలన కలిగెడు దేవాదిఫలములనుగాని కలుగ జేయడు. దీనినంతను ప్రకృతివాసనయే కలిగించును. ఇవి ఆత్మవిగా తోచుట దేహాత్మభిమానముచే బుట్టు యీ వాసనలచేతనే.

15.శ్లో. నా దత్తే కస్యచిత్పాపం । న చైవ సుకృతం విభుః ।
అజ్ఞానే నావృతం జ్ఞానం । తేన ముహ్యన్తి జన్తవః ॥

అర్థము : విభుః = ఆత్మ, కస్యచిత్ = ఎవనియొక్క గాని, పాపం = పాపమును, న, ఆదత్తే= పోగొట్టడు, సుకృతం, చ = పుణ్యమునున్ను, న, ఆదత్తే, ఏవ = పోగొట్టడు, అజ్ఞానేన = పూర్వకర్మ చేత, జ్ఞానం = జ్ఞానము, ఆవృతం = కప్పబడినది, తేన = దానిచేత, జన్తవః = ప్రాణులు, ముహ్యన్తి = మోహించుచున్నారు.

తా ॥ ఆత్మ, కర్మానుగుణముగా అనేక శరీరములలో ప్రవేశించ దగినది. కావున, దానికొక స్వంత దేహమేదియును నుండదు. కావుననే మిత్రులును శత్రువులును స్థిరులుకారు. అందుచే మిత్రుల దుఃఖమును, శత్రువుల సుఖమును పోగొట్టుట అతనికి దేహముతో చేరినవేగాని స్వరూప సిద్ధములు కావు. పూర్వకర్మలు వీని జ్ఞానమును సంకోచింప జేయును. దానిచే దేహత్మాభిమానమును, కర్మవాసనయును కలుగును.

అవ. ఇంతవరకు మూడవ అధ్యాయమునందు చెప్పబడిన తాను కర్తను కానని తలంచునట్టి రీతులనన్నిటిని చెప్పి నాల్గవ అధ్యాయమున జెప్పబడిన జ్ఞానవిశేషమును విమర్శించుచున్నాడు.

16.శ్లో. జ్ఞానేన తు తదజ్ఞానం । యేషాం నాశిత మాత్మనః ।
తేషా మాదిత్యవత్ జ్ఞానం । ప్రకాశయతి తత్పరమ్ ॥

అర్థము : యేషాం = ఎవరికి, ఆత్మనః = ఆత్మయొక్క, జ్ఞానేన = జ్ఞానముచేత, తత్ = ఆ, అజ్ఞానం = అజ్ఞానము, నాశితం = నశింపజేయబడునో, తేషాం = వారియొక్క, పరం = గొప్పదైన, తత్ = ఆ, జ్ఞానం = జ్ఞానము, ఆదిత్యవత్ = సూర్యునివలె, ప్రకాశయతి = అంతను ప్రకాశింపజేయును.

తా ॥ ఉపదేశము వలన ఆత్మస్వరూప విషయమైన జ్ఞానము కలుగును. దానిచే కర్మసంచయరూపమగు అజ్ఞానము నశించును. అట్టి వారికి స్వాభావికమైన జ్ఞానము సూర్యునివలె సమస్తమును చక్కగా ప్రకాశింపజేయును.

అవ. ఆత్మానుభవమనెడు మేడనెక్కుటకు సోపానమనదగిన జ్ఞానము యొక్క ఆరోహణక్రమమును చెప్పుచున్నాడు.

17.శ్లో. తద్బుద్ధయ స్త దాత్మాన । స్తన్నిష్ఠా స్తత్పరాయణాః ।
గచ్ఛ న్త్య పునరావృత్తిం । జ్ఞాన నిర్ధూత కల్మషాః ॥

అర్థము : తద్బుద్ధయః = ఆత్మదర్శనము నందే బుద్ధికలవారును, తదాత్మానః = ఆత్మవిషయమైన మనస్సు కలవారును, తన్నిష్ఠాః = ఆత్మాభ్యాసమున నిరతులగు వారును, తత్పరాయణాః = ఆత్మయే పరమ ప్రయోజనమనుకొనువారును. జ్ఞాన నిర్ధూతకల్మషాః = జ్ఞానాభ్యాసముచే పోగొట్టబడిన పాపము కలవారై, అపునరావృత్తిం = పునరావృత్తి లేని శుద్ధాత్మ స్వరూపమును, గచ్ఛన్తి = పొందుచున్నారు.

తా ॥ ఆత్మనే చూడవలెను, ఆత్మజ్ఞానమునే అభ్యసించవలెను. ఆత్మయే పరమప్రయోజనము అని ఆత్మయందే మనస్సు కలవారు సమస్త పాపములను పోగొట్టుకుని స్వస్వరూపముతోనున్న ఆత్మను పొందుదురు.

అవ. ఆత్మ సాక్షాత్కారమనగా నెట్టిదో తెలుపుచున్నాడు.

18.శ్లో. విద్యా వినయ సమ్పన్నే । బ్రాహ్మణే గవి హస్తిని ।
శుని చైవ శ్వపాకే చ । పణ్డితా స్సమదర్శినః ॥

అర్థము : పణ్డితాః = ఆత్మజ్ఞానము కలవారు, విద్యావినయ సంపన్నే=విద్య; దానిచే కలుగు వినయము కలవానియందును, బ్రాహ్మణే = బ్రాహ్మణునియందును, గవి = ఆవునందును, హస్తిని = ఏనుగునందును, శునిచ = కుక్కయందును, శ్వపాకేచైవ= చండాలునియందును, సమదర్శినః = ఒకేరీతిగా చూచువారు. భవన్తి = అగుచున్నారు.

తా ॥ ఆత్మయాథాత్మ్య జ్ఞానముగల పండితులు విద్యావినయములు కలవాడేమి, ఇవిలేని కేవల బ్రాహ్మణుడేమి, గోవేమి, ఏనుగేమి, చండాలుడేమి, చివరకు కుక్కఏమి అన్నిటిలోనుగల ఆత్మలు ఒకే జ్ఞానాకారముతో సమానముగా నుండుననియు, పైకి గోచరించు తారతమ్యములు ప్రకృతివేకాని ఆత్మవి కావనియు తెలుసుకొందురు.

అవ. ఆత్మలన్నియు సమానమని యెఱుంగుటను ప్రశంసించుచున్నాడు.

19.శ్లో. **ఇహైవ తై ర్జిత స్సర్గో । యేషాం సామ్యే స్థితం మనః ।**
నిర్దోషం హి సమం బ్రహ్మ । తస్మాత్ బ్రహ్మణి తే స్థితాః ॥

అర్థము : యేషాం = ఎవరియొక్క, మనః = మనస్సు, సామ్యే = ఆత్మసమత్వమందు, స్థితం = ఉండునో, తైః = వారిచే, ఇహైవ = ఈ సాధనానుష్ఠాన దశయందే, సర్గః = సంసారము, జితః = జయింపబడినదగుచున్నది, నిర్దోషం = ప్రకృతిసంబంధ దోషములేని, సమం హి = సమానాకారముగల ఆత్మయేగదా!, బ్రహ్మ = బ్రహ్మ, తస్మాత్ = అందువలన, తే = వారు, బ్రహ్మణి = శుద్ధాత్మ స్వరూపము నందు, స్థితాః = ఉన్నవారే.

తా ॥ ఇట్లు ప్రకృతి సంబంధమనెడు దోషములేని ఆత్మలన్నియు జ్ఞానాకారములే యగుటచే సమానమైనవి. ఇట్టి ఆత్మయే బ్రహ్మము. ఇట్లు విశ్వసించువారు యిచ్చట నున్నను సంసారమును జయించినట్లే. ఇట్లు ఆత్మసామ్యమును అనుసంధించువారు ముక్తులేయగుదురు.

అవ. ఇట్టి జ్ఞానవిపాకమును బడయవలెననిన యెట్లు ప్రవర్తించవలెనో తెలుపుచున్నాడు.

20.శ్లో. **న ప్రహృష్యేత్ ప్రియం ప్రాప్య । నో ద్విజేత్ ప్రాప్య చా ప్రియమ్ ।**
స్థిరబుద్ధి రసమ్మూఢో । బ్రహ్మవిత్ బ్రహ్మణి స్థితః ॥

అర్థము : బ్రహ్మవిత్ = ఆత్మస్వరూపము నెఱింగినవాడు, బ్రహ్మణి = శుద్ధాత్మ స్వరూపమునందు, స్థితః = ఉన్నవాడై, అసమ్మూఢః = దేహాత్మాభిమానము లేనివాడై, స్థిరబుద్ధిః = ఆత్మానుభవమునందు నెలకొన్నవాడై, ప్రియం = ఇష్టమైనదానిని, ప్రాప్య = పొంది, న, ప్రహృష్యేత్ = పొంగిపోరాదు, అప్రియంచ = అనిష్టమైనదానిని, ప్రాప్యాపి = పొందియును, న, ఉద్విజేత్ = క్రుంగిపోరాదు

తా ॥ ఉపదేశమువలన ఆత్మ స్వరూపము నెఱింగి, దానికొఱకై యత్నించుచు, దేహాత్మభ్రాంతిని వీడి, స్థిరముగ ఆత్మదర్శనమే మిక్కిలి ప్రియమగుటచే దాని ననుభవించుచు, ఇతర ప్రియా ప్రియములకు పొంగుగాని క్రుంగుగాని పొందరాదు.

21.శ్లో. బాహ్య స్పర్శేష్వ సక్తాత్మా । విన్దత్యా త్మని య స్సుఖమ్ ।
స బ్రహ్మయోగ యుక్తాత్మా । సుఖ మక్షయ మశ్నుతే ॥

అర్థము : యః = ఎవడు, బాహ్యస్పర్శేషు = ఆత్మవ్యతిరిక్త విషయానుభవముల యందు, అసక్తాత్మా = లగ్నముకాని మనస్సుకలవాడై, ఆత్మని = అంతరాత్మయందే, సుఖం = సుఖమును, విన్దతి = పొందుచున్నాడో, సః = వాడు బ్రహ్మయోగయుక్తాత్మా = ఆత్మాభ్యాసముతో కూడిన మనస్సుకలవాడై, అక్షయం = నశించని, సుఖం = సుఖమును, అశ్నుతే = పొందుచున్నాడు.

తా ॥ ఆత్మకంటే ఇతరానుభవములయందాసక్తిలేనివాడై, తన అంతరాత్మ యందే సుఖించువాడు, ఆత్మాభ్యాసముతో కూడిన మనస్సుగలవాడై శాశ్వత బ్రహ్మానుభవ సుఖమును పొందును.

22.శ్లో. యే హి సంస్పర్శజాః భోగాః । దుఃఖయోనయ ఏవ తే ।
ఆద్యన్తవన్తః కౌన్తేయ !। న తేషు రమతే బుధః ॥

అర్థము : హే కౌన్తేయ ! = ఓ అర్జునా !, యే = ఏవి, సంస్పర్శజాః = ఇంద్రియస్పర్శలచే పుట్టునట్టి, భోగాః = సుఖములో, తే = అవి, దుఃఖయోనయః, ఏవ, హి = దుఃఖహేతువులేకదా!, ఆద్యన్తవన్తః = ఆది అంతములు కలవి, (భవన్తి = అగుచున్నవి.) బుధః = పండితుడు, తేషు = ఆ సుఖముల యందు, న రమతే = సంతోషింపడు.

తా ॥ విషయములతో ఇంద్రియములకు గల సంబంధముచే పుట్టు సుఖములు దుఃఖహేతువులే. అవి క్షణికములు. ఈ విషయ మెఱింగినవాడు వాటిని ఆశింపడు.

23.శ్లో. శక్నోతీ హైవ య స్సోఢుం । ప్రాక్ శరీర విమోక్షణాత్ ।
కామక్రోధో ద్భవం వేగం । స యుక్త స్స సుఖీ నరః ॥

అర్థము : యః = ఎవడు, శరీరవిమోక్షణాత్, ప్రాక్ = శరీరమును విడుచుటకు ముందు, ఇహైవ = ఇట్టి సాధనానుష్ఠానదశ యందే, కామక్రోధోద్భవం = కామక్రోధములవలన

కలుగునట్టి, వేగం=వేగమును, సోఢుం=సహించుటకు, శక్నోతి=సమర్థుడగునో, సః నరః = ఆపురుషుడు, యుక్తః = తగినవాడు, సః = వాడు, సుఖీ = సుఖముకలవాడు. (భవతి = అగుచున్నాడు.)

తా ॥ శరీరమును విడుచుటకు ముందే సాధనానుష్ఠాన దశలోనే ఆత్మానుభవ ప్రీతిచే కామక్రోధాదుల వలన మనోవాక్కాయములకు పుట్టునట్టి ఉద్రేకమును అణచగలవాడు ఆత్మానుభవమున కర్హుడగును. వానికి శరీరమును విడువగనే ఆత్మానుభవ సుఖము కలుగును.

24.శ్లో. యోఽన్త స్సుఖోఽన్త రారామ । స్తథాఽన్తర్జ్యోతి రేవ యః ।
స యోగీ బ్రహ్మనిర్వాణం । బ్రహ్మభూతోఽధిగచ్ఛతి ॥

అర్థము : యః = ఎవడు, అన్తస్సుఖః = ఆత్మానుభవమే సుఖముగా కలవాడో, అన్తరారామః= ఆత్మయే ఉద్యానవనముగా కలవాడో, తథా = అట్లే, యః=ఎవడు, అన్త ర్జ్యోతిః ఏవ = ఆత్మయే జ్ఞానముగాకలవాడో, సః.యోగీ=అట్టియోగి, బ్రహ్మభూతః = బ్రహ్మ స్వరూపుడై, బ్రహ్మనిర్వాణం=ఆత్మానుభవసుఖమును, అధిగచ్ఛతి = పొందుచున్నాడు.

తా ॥ బాహ్యవిషయముల నన్నిటిని విడిచి ఆత్మానుభవ సుఖమును మరిగి అదియే సుఖవర్ధకమనియు, అదియే తనకు జ్ఞానమనియు వర్తించువాడు జ్ఞానసంకోచములేని శుద్ధాత్మ స్వరూపుడగును. అట్టివాడు ఆత్మానుభవ సుఖమును పొందును.

25.శ్లో. లభన్తే బ్రహ్మనిర్వాణ । మృషయః క్షీణకల్మషాః ।
ఛిన్నద్వైధా యతాత్మాన । స్సర్వభూత హితే రతాః ॥

అర్థము : ఛిన్నద్వైధాః = శీతోష్ణాది ద్వంద్వములచే విడువబడినవారును, యతాత్మానః = నిగ్రహింపబడిన మనస్సు కలవారును, సర్వభూతహితే = సకల ప్రాణులమేలునందు, రతాః = ఆసక్తికల వారును అగు, ఋషయః = ఆత్మావలోకనపరులు, క్షీణకల్మషాః= నశించిన పాపముకలవారై, బ్రహ్మనిర్వాణం = ఆత్మానుభవ సుఖమును, లభన్తే=పొందుచున్నారు.

తా ॥ శీతోష్ణాది ద్వంద్వములను విడిచి, ఆత్మయందే మనస్సు నిలిపి ప్రాణులకన్నిటికిని మేలుచేయుటయందాసక్తి గల ఆత్మావలోకనపరులు పాపముల బోగొట్టుకొని ఆత్మానుభవ సుఖము ననుభవింతురు.

26.శ్లో. కామక్రోధవియుక్తానాం । యతీనాం యతచేతసామ్ ।
అభితో బ్రహ్మనిర్వాణం । వర్తతే విజితాత్మనామ్ ॥

అర్థముః- కామక్రోధ వియుక్తానాం = కామక్రోధములచే విడువబడినవారును, యతచేతసాం = ఆత్మయందే నియమింపబడిన మనస్సుకలవారును, విజితాత్మనాం = జయింపపడిన మనస్సుకలవారునుఅగు, యతీనాం = ప్రయత్నపరులకు, బ్రహ్మనిర్వాణం = ఆత్మానుభవసుఖము, అభితః = అంతటను, వర్తతే = ఉన్నది.

తా ॥ కామక్రోధములను విడిచి, మనస్సును జయించి, ఆత్మయందే మనస్సును నియమించి, ఆత్మల సమత్వమును గాంచ యత్నించు వారికి ఆత్మానుభవము సులభముగ అంతటను సిద్ధించును.

అవ. ఇట్టి కర్మయోగమునకు ఫలము ఆత్మావలోకనమేయని చెప్పి ముగించుచున్నాడు.

27.శ్లో. స్పర్శాన్ కృత్వాబహి ర్బాహ్యాన్ । చక్షుశ్చైవాన్తరే భ్రువోః ।
ప్రాణాపానౌ సమౌ కృత్వా । నాసాభ్యన్తర చారిణౌ ।

అర్థము : బాహ్యాన్ = బయటవియగు, స్పర్శాన్ = శబ్దాది విషయ సంబంధములను, బహిఃకృత్వా = విడిచి, చక్షుః = చూపును, భ్రువోః = కనుబొమ్మలయొక్క, అన్తరే ఏవ = మధ్యయందే, (కృత్వా=ఉంచి) నాసాభ్యన్తరచారిణౌ = ముక్కులోపల సంచరించునట్టి, ప్రాణాపానౌ = ఉచ్ఛ్వాసనిశ్వాసములను, సమౌకృత్వా = సమగతిగలవానినిగాజేసి.

తా ॥ బాహ్యేంద్రియ వ్యాపారమును విడిచి, ముక్కుచివర దృష్టిని నిలిపి ఉచ్ఛ్వాస నిశ్వాసములను సమముగ ప్రవర్తింపజేసి, (దీనిని ముందు శ్లోకముతో అన్వయించుకోవలెను.)

28.శ్లో. యతేన్ద్రియ మనోబుద్ధిః । ముని ర్మోక్ష పరాయణః ।
విగతేచ్ఛా భయక్రోధో । య స్సదా ముక్త ఏవ సః ।

అర్థము : యః = ఎవడు, యతేన్ద్రియ మనోబుద్ధిః = నిగ్రహింపబడిన ఇంద్రియములు మనస్సు బుద్ధికలవాడును, విగతేచ్ఛాభయక్రోధః = పోగొట్టబడిన కోరిక, భయము, కోపము కలవాడును, మోక్షపరాయణః = మోక్షమొక్కటియే ప్రయోజనముగా కలవాడును, మునిః = **ఆత్మావలోకనపరుడును** (అగునో) సః = వాడు, సదా = ఎల్లప్పుడును, ముక్తః ఏవ = ముక్తుడే (భవతి = అగుచున్నాడు)

తా ॥ ఇంద్రియములను, మనస్సును, బుద్ధిని ఇతర విషయముల యందు ప్రవర్తించ నీయక, కోరికను, భయమును, కోపమును వీడి, మోక్షము నొక్కదానినే కోరి, ఆత్మను సాక్షాత్కరించుచు నుండువాడు ముక్త ప్రాయుడే యగుచున్నాడు.

అవ. నిత్యనైమిత్తికకర్మలను అంగముగా కలిగియున్న యీ కర్మయోగమును అచరించుటకు సుకరోపాయమును ఉపదేశించుచున్నాడు.

29.శ్లో. భోక్తారం యజ్ఞ తపసాం । సర్వలోక మహేశ్వరమ్ ।
సుహృదం సర్వ భూతానాం । జ్ఞాత్వా మాం శాన్తి మృచ్ఛతి ॥

అర్థము : సః= అట్టివాడు, మాం= నన్ను, యజ్ఞతపసాం = యజ్ఞములకును తపస్సులకును, భోక్తారం = అనుభవించువానినిగాను, సర్వలోకమహేశ్వరం =సకలలోకేశ్వరులకును ఈశ్వరునిగాను, సర్వభూతానాం= సమస్తప్రాణులకును, సుహృదం = హితునిగాను, జ్ఞాత్వా = తెలిసికొని, శాన్తిం = సుఖమును, ఋచ్ఛతి = పొందుచున్నాడు.

తా ॥ నన్ను యజ్ఞతపస్సులకు భోక్తనుగాను, లోకేశ్వరులందరకును ఈశ్వరుని గాను, సకలప్రాణులకు హితునిగాను తెలిసికొన్నవాడు కర్మయోగము నా యారాధనయే యని తెలుసుకొని దాని నాచరించుచు సౌఖ్యమును పొందకలుగుచున్నాడు.

ఇతి శ్రీభగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే
శ్రీకృష్ణార్జున సంవాదే కర్మసన్న్యాసయోగో నామ పంచమోఽధ్యాయః

ఇది ఉపనిషదర్థ ప్రతిపాదకమును, బ్రహ్మవిద్యయు, యోగశాస్త్రమును
శ్రీకృష్ణార్జున సంవాద రూపమును అయిన శ్రీభగవద్గీత యందలి
కర్మసన్యాసయోగమనెడి
పంచమాధ్యాయము.

అర్జునుని శ్లోకము	1	ఈ అధ్యాయమందలి శ్లోకసంఖ్య	29
భగవంతునిశ్లోకములు	28	ఇప్పటికైనమొత్తముశ్లోకములసంఖ్య	232

శ్రీ మద్భగవద్గీతా ప్రశ్నోత్తరావళి
ఐదవ అధ్యాయము

1.ప్ర. **ఈ అధ్యాయమునకు పేరేమి? దీని కాపేరెందుకుల కుంచబడినది?**

ఉ. ఈ అధ్యాయమునకు కర్మసన్యాస యోగమని పేరు.

'ఈశా వాస్య మిదం సర్వం' అను మంత్రముతో ప్రారంభించు ఉపనిషత్తునకు 'ఈశావాస్యోపనిషత్త'ను పేరుంచబడినట్లు ఇందు మొదటి శ్లోకము 'సన్యాసం కర్మణాం కృష్ణ' యని కర్మసన్యాసముతో ప్రారంభించుచున్నది. గాన దీనికాపేరుంచబడినది అని తోచుచున్నది. గాని ప్రతి అధ్యాయమునకును అందలి ప్రధాన విషయమే దాని పేరుగా నుంచబడుటచే నిదియంత ప్రామాణికముగా గాన్పించదు.

ఇక ముఖ్యకారణ మేమనగా –

కర్మసన్యాసమనగా కర్మలను పూర్తిగా విడుచుట అనెడు అర్థము గీతాసిద్ధాంత మెన్నటికిని కాదని సుస్పష్టము. ఇక సన్యాసమనగా కర్మల నాచరించుచు ఫలసంగకర్తృత్వములను విడుచుటయే. ఈ విషయమంతటను చెప్పబడుచునే యున్నది గాని ప్రత్యేకము ప్రశ్న ప్రతివచన రూపముగా 18వ అధ్యాయమున విమర్శింపబడెను. అచ్చట శ్రీకృష్ణపరమాత్మ ఇతరుల అభిప్రాయములను వినిపించి 'నిశ్చయం శ్రుణు మే తత్ర త్యాగే భరతసత్తమ' అని తన యభిప్రాయమును ఇట్లే స్పష్టపరిచెను. (ఇచ్చట త్యాగ, సన్న్యాస శబ్దములు పర్యాయములు.)

ఈ యధ్యాయమున ఆ కర్తృత్వము నెవ్వరియందు సన్యసించవలె ననెడు విమర్శ ప్రధానముగా చేయబడినది.

ఆత్మకు సహజముగా సాంసారిక కర్మలలో కర్తృత్వము లేదని 14, 15 శ్లోకములలో చెప్పి ఇక నాకర్తృత్వమును ఇంద్రియ ప్రాణములయందును, వాటి కాశ్రయమగు శరీరమందును ఉంచమని 8వ శ్లోకము మొదలు 13వ శ్లోకము వరకు చెప్పియుండుటచే యీ యధ్యాయమునకు కర్మసన్న్యాస యోగమని పేరుంచబడినది.

2.ప్ర. **ఈ యధ్యాయమున చెప్పబడిన విషయములేవి?**

ఉ.1) ఈ యధ్యాయమున మొదట అర్జునుడు శ్రీకృష్ణుని కర్మయోగ, జ్ఞానయోగము లలో నేది ఆత్మసాక్షాత్కారమును సుకరముగను శీఘ్రముగను బడయజేయునని నిశ్చయింపబడినదో దానిని నాకు జెప్పుమని యడుగుట. 5అ. 1శ్లో.

2) రెండును ఆత్మసాక్షాత్కారమునకు ఇతర సాపేక్షలేని సాధనములే గాని సుకరముగను శీఘ్రముగను ఫలము నొసంగున దగుటచే జ్ఞానయోగముకంటె కర్మయోగమే ఉత్తమమైనదని సయుక్తికముగా భగవంతుడు సమాధాన మొసంగుట. (5అ.2 మొ, 7శ్లో. వరకు)

3) ఇట్లు ఉత్తమమగు నీకర్మ యోగమునకు ముఖ్యముగ కావలసిన చేతసుని 'అకర్తృత్వాను సంధానము' (తాను చేయుచున్నను తనను కర్తగా తలంచకుండుట)ను గూర్చి చెప్పుట. (5అ.8, 9శ్లో.)

4) ఇట్లు తనను కర్తను కానని యనుసంధించి కామ్యకర్మ లాచరించినను అవి బంధింపకయుండునా? తాను నిజమునకు కర్తయైయుండగా అది తనకు శరీరసంబంధమనెడు ఉపాధివలన వచ్చినదనుకొనుటచే నేమి యుపయోగము? అట్లనుసంధించినను ప్రకృతిసంబంధము వీనినొకనాడు దేహాత్మభ్రమతో ముంచకయుండునా? అనెడు శంకలు కలుగునని అశంకించుకొని పరమాత్మ వాటికి సమాధాన మొసంగుట. (5 అ. 10శ్లో.)

5) తానుపదేశించిన యర్థమును శిష్టాచారముచే సమర్థించుట (5 అ. 11శ్లో)

6) ఒకే కర్మ బంధహేతువు మోక్షహేతువు గూడ నెట్లగునను సందేహమును ఫలమును కోరుట, కోరకుండుటయే యందులకు కారణమని పరిహరించుట. (5అ.12శ్లో.)

7) ఇంతవరకు శరీరమును ఆశ్రయించియుండు ఇంద్రియములు, ప్రాణములే తనచే సాంసారిక కర్మలను చేయించుచున్నవని తలంచుమని యుపదేశించి యిప్పుడు శరీరమునందే ఆ కర్తృత్వమును అనుసంధించుమని ఉపదేశించుట. (5అ. 13శ్లో.)

8) ఆత్మ యొక్క స్వాభావికమగు స్వరూపమును జెప్పుట. (5అ.14,15శ్లో)

9) ఇంతవరకు మూడవ అధ్యాయమునందు చెప్పబడిన 'తాను కర్తనుకాన'ని తలంచునట్టి రీతులనన్నిటిని చెప్పి నాలుగవ యధ్యాయమున చెప్పబడిన జ్ఞానవిశేషమును విమర్శించుట. (5అ. 16శ్లో.)

10)ఆత్మానుభవమనెడు మేడనెక్కుటకు సోపానమనదగిన జ్ఞానము యొక్క ఆరోహణక్రమమును చెప్పుట. (5అ.17శ్లో.)

11) ఆత్మసాక్షాత్కారమన నెట్టిదో దెల్పుట. (5అ. 18శ్లో.)

12) ఆత్మలన్నియు సమానమని యెఱుంగుటను ప్రశంసించుట. (5అ. 19శ్లో.)

13)ఇట్టి జ్ఞానవిపాకమును బడయవలెనన్న యెట్లు ప్రవర్తింపవలెనో తెలుపుట. (5అ. 20మొ 26శ్లో. వరకు)

14) ఇట్టి కర్మయోగమునకు ఫలము ఆత్మావలోకనమే యని చెప్పి ఉపసంహరించుట. (5అ. 27,28,29శ్లో.)

15)నిత్యనైమిత్తిక కర్మలను అంగముగా కలిగియున్న యీకర్మయోగమును ఆచరించుటకు సుకరోపాయమును ఉపదేశించుట. (5అ. 29శ్లో.)

3. ప్ర. ఈ అధ్యాయమునకు వెనుకటి యధ్యాయముతోను ప్రధాన శాస్త్రముతోను గల సంబంధమేమి?

ఉ. ప్రథమాధ్యాయమున దేహాత్మనిశ్చయములేకయు ఫలమును గోరకయుచేయునట్టి వర్ణాశ్రమోచిత ధర్మములు మోక్షసాధనములని యెఱుంగకయు అర్జునునకు కలిగిన దుఃఖమును పోగొట్టుటకై రెండవ అధ్యాయములో ఆత్మతత్త్వము నుపదేశించి, కర్మయోగము నుపదేశించెను. ముముక్షువగు నెట్టియధికారికైనను యిదియే ఆచరణయోగ్యమైనదని మూడవ అధ్యాయమున సమర్థించెను. ఈ కర్మయోగము జ్ఞానాకారమైన దనియు ఇదియే ప్రధానాంశమనియు ఆ కర్మయోగము పెక్కురీతులుగా నున్నదనియు నాల్గవ అధ్యాయమున ఉపదేశించెను. ఆకర్మయోగము జ్ఞానాయోగాపేక్షలేకయే దానికంటె సుకరముగా నాచరింపబడి దానికంటె శీఘ్రముగా ఆత్మావలోకమును సాధించ గలుగునని చెప్పుచు దానికి కావలసిన 'తాను కర్తను గాన'ని అనుసంధించు రీతిని దానికివలయు జ్ఞానమును ఈ యధ్యాయమున ఉపదేశించుచున్నాడు. కావున ఈ వెనుకటి యధ్యాయార్థమే మరియొకరీతిగా నిందు వివరింపబడినది.

ఈ శాస్త్రమునకు ప్రధానార్థమగు మోక్షప్రాప్తికి కర్మయోగము ముముక్షువునకు ప్రథమ సోపానమగుటచే మోక్షమునుగోరు ప్రతివారును దానినాశ్రయించి తరించుటకుగాను దాని అతిశయమును, ఆచరించు విధానమును, కలుగు ఫల విశేషములను, వర్ణించుట అవసరమగుటచే అది యీయధ్యాయమున చేయబడినదిగాన ప్రధానశాస్త్రార్థముతో దీని కిట్టి ముఖ్యసంబంధముకలదు.

ప్ర. ఈ యధ్యాయారంభమున అర్జునుడు గావించిన ప్రశ్న యొక్క ఆశయమేమి? దానికి భగవంతుడుడెట్టి సమాధానము నొసంగెను?

ఉ. శ్రీకృష్ణా! ద్వితీయాధ్యాయమున ముముక్షువైన వానికి మొదట కర్మయోగమే చేయదగినదనియు, దానిచే పాపములెల్ల నశించి మనస్సు పరిశుద్ధమగుననియు, దానిచే జ్ఞానయోగముదయించుననియు, దానిచే ఆత్మసాక్షాత్కారము లభించుననియు ఉపదేశించితివి. అది విని మొదట కర్మయోగ మాచరించవలెననియు పిమ్మట జ్ఞానయోగినై ఆత్మ సాక్షాత్కారమును బడయుదుననియు నిశ్చయించుకొంటిని. కాని తిరిగి నీవు మూడు నాలుగు అధ్యాయములలో జ్ఞానయోగాధికారికి గూడ కర్మయోగమే శ్రేష్ఠమైనదనియు, అది జ్ఞానయోగమును అపేక్షింపక తానే స్వయముగ ఆత్మసాక్షాత్కారమును కలుగజేయుననియు ఉపదేశించితివి. ఈ రెండును ఆత్మసాక్షాత్కారమునకు ఒకటి అంగమును ఒకటి అంగియును అందువా? లేక రెండును స్వతంత్రముగా వేరువేరు సాధనములందువా? అట్లు వేరైనచో నీ రెండింటిలో నేది సులభముగా నాచరింపదగినది గాను, శీఘ్రముగా ఆత్మసాక్షాత్కారము నొసంగునది గాను, నిశ్చయింపబడినదో దానిని నాకు చెప్పుము. అని ప్రశ్నించెను. (5అ. 1.శ్లో)

అందులకు శ్రీకృష్ణుడిట్లు సమాధాన మొసంగెను. అర్జునా! కర్మయోగము రెండువిధములు. ఒకటి రెండవ అధ్యాయమున చెప్పినట్లు జ్ఞానయోగమునకు అంగమై దానిని కలుగజేసి దానిమూలమున ఆత్మసాక్షాత్కారమును లభింపజేయును. రెండవది అంగియై జ్ఞానయోగాపేక్షలేకయే తానే స్వయముగా ఆత్మసాక్షాత్కారమును కలుగజేయును. కావున ఆత్మను పొందుటకివి రెండును స్వతంత్ర మార్గములే. కాని ముముక్షువగు సంసారి, ఈ కర్మయోగము నాచరింపక జ్ఞానయోగమునకధికారి కానేరడు. కర్మయోగి స్వయముగ నాత్మ మనన శీలుడై సుఖముగ కర్మయోగమును సాధించి స్వల్పకాలములోనే ఆత్మస్వరూపమును లభించును. ఇక జ్ఞానయోగి అది యింద్రియముల కభ్యాసము లేనిదగుటచే బహుకష్టముతో దానిని సాధించవలసియుండును. అందుచే దానికి చాలకాలము పట్టును, ప్రమాదముకూడ తటస్థించు నవకాశముకలదు. అందుచే ఫలముకూడా మిక్కిలి ఆలస్యము. కావున నీవు కర్మయోగమునే యవలంబించి పాపమును పరిహరించు కొని నిర్మల మనస్సుగలవాడవై స్వాధీనమైన యింద్రియములు కలవాడవై ఆత్మను ధ్యానించు దానిని సాక్షాత్కరింపుము. దానిచే భక్తియోగమున కర్హుడవై నా సాయుజ్యమనెడు మోక్షమును సుకరముగను శీఘ్రముగను బడయగల్గుదువు. (5అ.2మొ.7శ్లో. వరకు)

5.ప్ర. శ్రీకృష్ణుడు కర్మయోగమునకు ప్రధానాంగమైన 'కర్తృత్వమును సన్యసించు విధమును" యీ యధ్యాయమున నెట్లు విశదీకరించెను ?

ఉ. కర్మయోగి కన్ను, ముక్కు, చెవి మొదలగు జ్ఞానేంద్రియములతో చూచుట, వాసనచూచుట, వినుట మొదలగు పనులుచేయుచున్నను, కర్మేంద్రియములగు వాక్కు, కాలు, చేయి మొదలగువాటితో మాటలాడుట, నడచుట, తీసికొనుట, మొదలగుపనులు చేయుచున్నను, ప్రాణాదివాయువుచే ఉచ్ఛ్వాస నిశ్వాసములు, కనులుమూయుట తెరచుట మొదలగు పనులు చేయుచున్నను, అవి వాటి పనులు చేసికొనుచున్నవి గాని నేనేమియు చేయువాడను కానని తలంప వలయును, అనగా 'జ్ఞానమే స్వభావముగా గల నాకు యీపనులన్నియు చేయుట, పూర్వకర్మచే తటస్థించిన యీ యింద్రియ ప్రాణములతోడి సంబంధముచే వచ్చినదియే గాని స్వభావసిద్ధము కాద"ని తలంపవలయును. (పై వ్యాపారములలో కొన్ని తన ప్రయత్నము లేకయే జరుగుచుండుట అనుభవసిద్ధముగాన దానినిబట్టి తాను చేయు పనులన్నియు నట్లే తన సంబంధములేకయే జరుగుచున్నట్లు భావింపవలెను.)
(5అ. 8,9శ్లో.)

ఇట్లు ఆ కర్తృత్వమును (ఆ పనులను చేయుబాధ్యతను) ప్రకృతి యొక్క వికారములగు యింద్రియములయందే యుంచి కర్మలాచరించువాడు శరీరముతో కూడియున్నను ఆతనికి దేహాత్మ భ్రాంతి రూపమగుపాపమంటదు, నీటియందే పుట్టి నీటియందే పెరిగి నిరంతరము నీటిలోనే నివసించు తామరాకు ఆ నీటిచే తడుపబడునా? (5అ. 10శ్లో.)

ఇందులకు పెద్దల ఆచారముకూడా ప్రమాణముగా కలదు. యోగులు ఆత్మకుగల పూర్వకర్మలన్నియు నశించి అది పరిశుద్ధమగుట కొఱకు కర్తృత్వాభిమానమును వీడి అనగా ఇంద్రియాదులు వాటిపనులు చేయుచున్నవే గాని తానేమియు చేయుటలేదని భావించుచు మనోవాక్కాయములచే కర్మలనెట్లాచరింతురో చూడుము. (5అ. 11 శ్లో.)

ఒకేకర్మ, ఫలముకోరక ఆచరింపబడినచో ఆత్మానుభవరూపమైన స్థిరమగు సుఖమును ప్రసాదించును. అదే కర్మ, ఫలమునుకోరి ఆచరింపబడినచో నిత్యసంసారిని గావించును. కావున ఫలమును కోరక ఇంద్రియములే తమతమ పనులను చేసుకొనుచున్నవని భావించుచు కర్మలనాచరింపుము.
(5అ. 12శ్లో.)

ఈ యింద్రియములెక్కడివి? శరీరములోనివే కావా? కావున శరీరమే చేయుచున్న దనుకొనుము. అనగా -

ఆత్మకీ సాంసారిక కర్మలాచరించుట యీ శరీర సంబంధముచే వచ్చినదిగాని సహజము కాదనెడు వివేకముతో కూడిన మనస్సుతో యీ కర్మలన్నింటిని శరీరముపై బెట్టి స్వతంత్రుడవై ఏ ప్రయత్నమును చేయక, దేహముచే చేయించక సుఖముగా నుండుము. అనగా శరీరమును ఒక పట్టణమువలెను, ఇంద్రియములను ఆ పట్టణవాసుల వలెను, అందుండు పరమాత్మను ఆ పట్టణమునకు ప్రభువగు చక్రవర్తివలెను, నిన్నా చక్రవర్తి కింకరునిగను భావించి పనులను చేయుదువేని సుఖింతువు. (5అ. 13శ్లో.)

అర్జునా! ఇంతవరకు ఆత్మకు శరీర ఇంద్రియాది ఉపాధులచే వచ్చిన కర్తృత్వమును ఉపాధులకు ఒప్పగించితిమి. ఇక ఆత్మను గూర్చి తలంచవలసిన సహజస్వరూపమును చెప్పెదను వినుము.

ఆత్మకు పూర్వకర్మవలన శరీరము వచ్చుచున్నది. ఆ శరీరము లేక యీ యాత్మ యెన్నడును ఉండదు. అందుచేత పామరులు నిప్పులో నెఱ్రగకాలియున్న ఉక్కుగుండును నిప్పనియే భ్రమించునట్లు శరీరమునే ఆత్మయని భ్రమింతురు. అందుచే శరీరము చేసెడు పనులు(కర్తృత్వాదులు), ఆత్మవిగానే తోచుచుండును. ఇది వాసనాబలము (వాసన యనగా ఇంతకుపూర్వము చేసినట్టిగాని అనుభవించినట్టిగాని విషయముల గూర్చి యిప్పుడు మనకు తెలియకుండగనే జ్ఞాపకము వచ్చును. అటువచ్చిన తోడనే మనకు తెలియకుండగనే వాటియందు ప్రేమ, కోరిక, వాటికి సంబంధించిన వాడుకయు తలస్థించును. ఇదియంతయు వాసన అనబడును.) అంతియేగాని ఈ యాత్మకు ఆ మనుష్యాది దేహములతో జేయు కర్మలయందుగాని వాటి కర్తృత్వమునందుగాని వాటి వలనకలిగెడు ఫలమునందుగాని సంబంధములేదు. (5అ. 14శ్లో.)

ఈయాత్మ ఒక్కచోట స్థిరముగా నుండువాడుకాడు. తనకర్మలకు తగినట్లు అన్ని దేహములకు మారుచుండును. అందుచే ఒక్క దేహమునకు సంబంధించిన శత్రువులుగాని మిత్రులుగాని అతనికుండరు. ఉన్నను అవి పై వాసనచే కల్పింపబడినవేగాని సహజములుకావు. ఆ వాసన ఎందులకు వచ్చినదందువా? పూర్వకర్మలు తమఫలములను కట్టికుడిపినగాని విడుమనవి

కావు. ఆత్మ, నిజజ్ఞానముతో ప్రకాశించుచున్నచో వీనిచే నా ఫలముల ననుభవింపజేయుటెట్లు? అందుచే కర్మలు వాసనను పుట్టించి దానిచే వీని జ్ఞానమును కప్పివేయును. దానిచే ఆత్మకు దేహాత్మాభిమానము, దానికి తగిన కర్మలు, దానికి తగిన శత్రుమిత్రాదులు, దానికి సుఖ దుఃఖానుభవములు అన్నియును వచ్చిపడును. (5అ. 15.శ్లో.)

6.ప్ర. కర్మయోగమునందలి ఆత్మజ్ఞానమునకు ఎట్టిఫల మీయధ్యాయమున చెప్పబడెను?

ఉ. పెద్దల సేవచేసి వారియుపదేశమువలన ఆత్మస్వరూపమునెఱింగి ప్రతి దినమందును దానినభ్యసించినచో నది యతిశయించి మిక్కిలి పవిత్రమగును. దానిచే అనాదికాలము నుండి అనువర్తించుచున్న కర్మవాసన నశించును. అంతట మేఘావరణ తొలంగిన సూర్యుడెట్లు నిర్మలముగా ప్రకాశించునో అట్లే ఆత్మయు ప్రకాశించును. (5అ.16 శ్లో)

దానిచే ఆత్మను సాక్షాత్కరించి తీరవలెనను పట్టుదల కలుగును. దానికొరకై ప్రయత్నించును. పిమ్మట ఇతర విషయములయందు విరక్తియు ఆత్మాభ్యాసరతియు జనించును. అవి ముదిరి ప్రపంచములో నిక పొందదగిన దేదియు లేదనెడు అధ్యవసాయము జనించును, పిమ్మట ఆత్మను సాక్షాత్కరించును. దానిచే సమస్తపాపములును నశించి పునర్జన్మ లేకుండును. (5అ. 17శ్లో.)

అట్టి జ్ఞానముకలవారు ఆత్మ, విద్యావినయ సంపన్నులైన బ్రాహ్మణ శరీరములో నున్ననేమి, కేవల బ్రాహ్మణ శరీరములోనున్ననేమి, ఆవునందున్న నేమి ఏనుగు నందున్ననేమి, కుక్కయందున్ననేమి, దానిని చంపితినువాని యందున్ననేమి? ఆకారములో తారతమ్యములేక ఒకే జ్ఞాన స్వరూపముతో వెలుంగుచుండుననియు, పైకి కాన్పించు ఆకారభేదములు దేహములకేగాని ఆత్మకు సంబంధించినవికావనియు నెరుంగుదురు. (5అ, 18 శ్లో)

అట్టి భావము కలవారు ముక్తులన్నమాటయే. అనగా అట్టివారి కెప్పుడో శరీరమును విడచినపిమ్మట ముక్తి కలుగుటయేగాక యిప్పుడే ముక్తితో సమానమైన దుఃఖనివృత్తి కల్గును. ఎందువల్లననగా - బ్రహ్మయనగా శరీర సంబంధమనెడు దోషము పోయి తన సహజమగు జ్ఞానాకారముతో వెలుగుచున్న ఆత్మయే. అట్టి ఆత్మయందున్న వారనగనే బ్రహ్మయందున్న వారన్న

మాటయే. అట్లు బ్రహ్మయందుండుటయే (అనగా శుద్ధాత్మ స్వరూపమును సాక్షాత్కరించుటయే) సంసారమును జయించుట. అదియే ముక్తిగాన వారు ముక్తులే యనుటకేమి యాక్షేపముకలదు? (5అ, 19శ్లో) ఇది యంతయు కర్మయోగమునందలి ఆత్మజ్ఞానమునకు ఫలమే.

7.ప్ర. సమదర్శన రూపమైన జ్ఞాన పరిపాకము కలుగుటకు కర్మయోగి ఎట్లు ప్రవర్తించవలెను?

ఉ. సమదర్శనమునకు ఒడలెరుంగని యానందముగాని, శిథిలముచేయు దుఃఖము గాని యుండరాదు. ఇట్టి యానందమునకును దుఃఖమునకును కారణములు ప్రియమును అప్రియమునగు వస్తువులే. ఆ వస్తువులైనను అందరకు నొక్కవిధముగా నుండవు. అవి పూర్వకర్మ వాసనలవలన వేరు వేరుగా నుండును. పెద్దల ఉపదేశముచే ఆత్మ స్వరూపము నెరింగి దానికొరకై ప్రయత్నించు సమదర్శి, దేహాత్మభ్రాంతిపోయి ఆత్మ దర్శనమే తనకు మిక్కిలి ప్రియమైనదని నిశ్చయించునుగాన పైనచెప్పిన ప్రియా ప్రియములు తటస్థించినను పొంగక క్రుంగక నిశ్చలముగా నుండవలెను. (5అ.20శ్లో)

ఇట్టివానికి బాహ్యవిషయములయందు సంగముండరాదు. కావున వాటినాశింపక పెద్దల ఉపదేశముచే తానెరింగిన ఆత్మస్వరూపమును స్మరించి ఆనందించుచుండు వానికి ప్రాకృతమైన శబ్దాది విషయములే భోగములనెడు భావమడుగంటి ఆత్మాభ్యాస నిరతి యతిశయించి క్రమముగ ఆత్మానుభవ రూపమైన శాశ్వతసుఖము లభించును. కావున సమదర్శనమునాశించు కర్మయోగి బాహ్యవిషయ సంగమమును విడిచియుండవలెను. (5అ. 21శ్లో)

అది విడుమట యంతసులభమైనపనియా? యని సందేహింపకుము. దానికొక ఉపాయము గలదు. చెప్పెద వినుము. విషయములకు ఆర్జన దోషములు, రక్షణదోషములు, వినాశదోషములు, భోగదోషములు, హింసాదోషములు అని ఐదువిధములగు దోషములున్నవి. వాటిని విమర్శించిన కొలది వాటియందు వైరాగ్యము జనించును. కావున యిట్టి తత్వము నెరింగినవాడు వాటియందు రమించక విరమించును.

ఆర్జనదోషములనగా : ధనార్జనకై సముద్రముపై పయనించుట, రాజులకొలచుట మొదలగునవి. ఇవి నిజమారయ శరీరవినాశమునకే తోడ్పడును.

రక్షణదోషములనగా : అట్లొకవేళ ఉపాయముతో నిరపాయముగా ధనమార్జించి నను వేయిప్రాకారములను కట్టికాపాడినను రాజులు బలాత్కారముగ హరించుటయో, అగ్నిచే దహింపబడుటయో, ఎలుకలు, చెదపురుగులు మొదలగు వాటిచే నశింపజేయ బడుటయో తటస్థించి దుఃఖహేతువులగు టయే గాని సుఖహేతువులు కానేరవు.

వినాశదోషములు : స్వర్గసుఖము ననుభవించువానికే "పుణ్యము క్షీణించు చున్నది. తిరిగి క్రిందపడుదు"నను భయముచే అచ్చట యనుభవించుచున్న భోగములుకూడ నీరగునని చెప్పియుండనిక భూలోకసుఖములు దుఃఖరూపము లని వేరుగజెప్పవలెనా?

భోగదోషములు : ఇవియనుభవించిన కొలదియు ఇంకను అనుభవించవలె ననియు, వీటి కంటె నింకను విలక్షణములైన వాటి ననుభవించవలెననియు ఆశ పెరుగుచుండును. పెరిగి పెరిగి చివరకు విరుగుట తథ్యము. దాని వలన దుఃఖమనివార్యము. కావలసిన విషయము చేజిక్కనిచో తాత్కాలిక కామశాంతికి కూడని విషయముల యందు ప్రవర్తించుటయు, దానిచే శాశ్వతనరకప్రాప్తియు తథ్యమే.

హింసాదోషములు : ఇట్లార్జించవలెనన్న ఎందరినో దుఃఖింపజేయుట తప్పనిసరి యగును. దానిచే నిక ఇహలోక పరలోక దుఃఖపరంపరకు మేరయేలేదు. ఈ దోషములన్నియు శాస్త్రముచే నెరుంగ నవసరములేక ప్రత్యక్ష సిద్ధములే గదా! (5అ.22శ్లో.)

కామక్రోధములయొక్క వేగము నరికట్టవలెను.

వేగమనగా- మనోవాక్కాయములయొక్క విషయానుభవమును గూర్చిన తీవ్రతమమైనప్రవృత్తి.

అందుకామజవేగములు - కూడనివాటిని తలంచుట, నీచులస్తోత్ర పాఠములు, పరస్త్రీ సంపర్కము యిట్టి పెక్కు కారణములచే పుట్టును.

క్రోధజవేగములు : పరులనుహింసించవలెనని యాలోచించుట, ఇతరుల చిత్తములు పుండుపడునట్లు ప్రలపించుట, పరులను దండించుట మొదలగునవి.

ఆత్మానుభవము నాశించు వాడీ వేగములకు తావీయక సాధనానుష్ఠాన దశనుండియు వీటిని అరికట్టుటకు తీవ్ర ప్రయత్నము గావించుచుండవలెను. ఇట్టివానికి శరీరమును విడచినతోడనే ఆత్మానుభవ రూపమగు సుఖము కలిగితీరును. (5అ.23శ్లో)

సమస్త బాహ్యవిషయానుభవములను విడిచి ఆత్మానుభవమే సుఖముగాగలిగి, భోగస్థానమగు ఉద్యానవనము, తననీడ చిగుళ్ళు, ఆకులు, పూవులు, పండ్లు మొదలగు తనగుణములచే తనయందు ప్రవేశించినవారిని సుఖపెట్టునట్లు, ఆత్మయు తనయొక్క జ్ఞానానందాది గుణములచేతను, తననుగూర్చిన చర్చలతోడను, తనను గూర్చిన గ్రంథరచనాదులతోడను, క్రీడలచేతను వలెసుఖపెట్టునదిగా కలిగి, ఆత్మనుతప్ప యింకదేనినిగాని యెఱుంగనివానివలె ప్రవర్తించువాడు ఆత్మానుభవసుఖమును పొందగల్గుచున్నాడు.

ఈ శ్లోకమున ఆత్మస్వరూపమునే భోగ్యభోగోపకరణ భోగస్థానములుగా భావించి యుండవలెనని చెప్పబడుచున్నది. (5అ.24శ్లో.)

శీతోష్ణాది ద్వంద్వములను విడిచి, ఆత్మనే ధ్యానించుచు తనకువలెనే యందరకును మేలును కలిగించవలెనను కోరిక గలిగియుండవలెను. ఇట్టి యాత్మావలోకనపరులు ఆత్మనుపొందుటకు ఆటంకముగానున్న పాపముల నన్నిటిని పోగొట్టుకున్నవారై ఆత్మానుభవమును పొందుదురు.

ఈ శ్లోకమున సమదర్శిత్వమునకు మిక్కిలి యవసరమైన సర్వభూతహిత పరత్వము చెప్పబడినది. (5అ.25శ్లో)

20వ శ్లో. మొదలు యీ 25వ శ్లోకమువరకు సమదర్శిత్వమును సాధించుటకు కావలసిన ఆరు ప్రధాన గుణములు చెప్పబడుటచే, అనుష్ఠాన ప్రకారము చెప్పబడినది.

8.ప్ర. ఆత్మను సాక్షాత్కరించుకొనుటకు చేయవలసిన యోగాభ్యాసమెట్లు సంగ్రహముగా చెప్పబడినది?

ఉ. బాహ్యేంద్రియ వ్యాపారములనన్నిటిని కట్టిబెట్టి యోగమునకు తగిన ఆసనమున సరిగా కూర్చుండి ముక్కుకొనయందు దృష్టిని నిలిపి, ఉచ్ఛ్వాస నిశ్వాసముల నొకేరీతిగ సంచరింపజేయుచు, ఇంద్రియములను మనస్సును బుద్ధిని ఆత్మదర్శన ప్రయత్నమందే ప్రవర్తింపజేసి, వాటిని యితర సాంసారిక విషయములపై కిపోవుట కవకాశము లేకుండజేసి దేనియందును కోరికగాని, దేనివలనను భయముగాని యెవరియందును కోపముగాని లేక మోక్ష మొక్కటియే ఫలముగా భావించి ఆత్మను దర్శించుటయే స్వభావముగా కలిగియుండవలెను. అట్టివాడెప్పుడోగాదు యిప్పుడే ముక్తుడగును. (5అ.27, 28శ్లో.)

9.ప్ర. కర్మయోగము నాచరించుటకు యీ అధ్యాయమున పరమాత్మ ఉపదేశించిన సారతమమైన సాధనమేది?

ఉ. ఉదారుడైన రాజును గాని, తనకు మిక్కిలి హితుడైనవానిని గాని ఆరాధించుట అందరికిని యిష్టమే గదా! కావున నన్ను యజ్ఞ తపస్సులకు భోక్తననియు, బ్రహ్మరుద్రేంద్రా దులకు ప్రభువుననియు, సకలప్రాణులకు హితుడననియు నెరుంగుము. దానిచే నన్నారాధించుట నీకు ప్రియముగా నుండునుగాని కష్టముగా తోచదు. అప్పుడు నీవు కర్మయోగమును సుఖముగ నాచరించగల్గుదువు. కర్మయోగమనగా నాయారాధనమే గదా! అని ఉపదేశించెను. (5అ. 29శ్లో.)

షష్ఠాధ్యాయార్థ సంగ్రహము

శ్లో. యోగాభ్యాసవిధి ర్యోగీ
చతుర్థా యోగ సాధనమ్ ।
యోగసిద్ధి స్స్వ యోగస్య
పారమ్యం షష్ఠ ఉచ్యతే ॥

అర్థము : యోగాభ్యాసవిధిః=యోగము నలవరచుకొనురీతియు, యోగీ, చతుర్థా = యోగి నాలుగు విధములగుటయు, యోగసాధనం = అభ్యాసము, వైరాగ్యములనెడు యోగసాధనములున్ను, యోగసిద్ధిః = విఘ్నితమైనను యోగము సిద్ధించురీతియు, స్వయోగస్య=తనను గూర్చిన భక్తియోగముయొక్క పారమ్యం = అన్నిటికి మిన్నయగుటయు, షష్ఠే= ఆరవ అధ్యాయమున, ఉచ్యతే = చెప్పబడుచున్నది.

తా॥ ఆత్మను దర్శించుట యోగమనబడును. దాని నలవరచు కొనురీతియు, యోగుల పరిపాకదశలను బట్టి నాలుగు విధములుగ నుండుటయు, అభ్యాసము వైరాగ్యము లనెడు యోగసాధనములున్ను, ఈ యోగముమధ్య విచ్ఛిన్నమైనను బెడసికొట్టకుండుట, పుణ్యలోకముల ననుభవింప జేయుట, మిగిలిన యోగమును సాధించుటకు వీలైన గొప్పకులమున పుట్టించుట యున్ను, భగవంతునిగూర్చిన భక్తియోగము భగవంతునివలెనే అన్నిటికంటె మిక్కిలి గొప్పదగుటయు, ఈ యారవ యధ్యాయమున చెప్పబడెను.

శ్రీ హయగ్రీవాయ నమః

శ్రీమద్భగవద్గీతా - షష్ఠోऽధ్యాయః
ఆత్మసంయమయోగః

అవ. కర్మయోగి యొక్కడే కర్మయోగియు, జ్ఞానయోగియును కాగలడు. జ్ఞానయోగి, జ్ఞానయోగియేగాని కర్మయోగి కానేరడు అని శ్రీకృష్ణుడు చెప్పుచున్నాడు.

శ్రీ భగవానువాచ = భగవంతుడు పలికెను.

1. శ్లో. అనాశ్రితః కర్మఫలం । కార్యం కర్మ కరోతి యః ।
స సన్న్యాసీ చ యోగీ చ । న నిరగ్ని ర్న చాక్రియః ॥

అర్థము : కర్మఫలమ్ = కర్మలయొక్క ఫలమును, అనాశ్రితః = కోరనివాడై, కార్యం (ఇతి)= కర్మయే చేయదగినది(అని), యః=ఎవడు, కర్మ = కర్మను, కరోతి = చేయుచున్నాడో, సః=వాడే, సన్న్యాసీచ=జ్ఞానయోగి, యోగీచ =కర్మయోగియును అగును, నిరగ్నిః= యజ్ఞాదులను విడిచినవాడు, న=కాడు,అక్రియశ్చ=కేవలజ్ఞాననిష్ఠుడును,న= కాడు.

తా ॥ పరమాత్మ ఆరాధనరూపమగు కర్మయే ప్రయోజనమని యెంచి ఫలమును కోరక కర్మలను చేయువాడే, కర్మయోగియును, జ్ఞానయోగియును అగుచున్నాడు; అంతియకాని యజ్ఞాదులను చేయనివాడుగాని కేవల జ్ఞాననిష్ఠుడుగాని అట్లు ఉభయయోగ నిష్ఠుడు కాజాలడు.

అవ. అందులకు కారణము ఆ కర్మయోగములో జ్ఞానాంశ ప్రధానముగా నుండుటయేయని చెప్పుచున్నాడు.

2. శ్లో. యం సన్న్యాసమితి ప్రాహు । ర్యోగం తం విద్ధి పాణ్డవ ! ।
న హ్యసన్న్యస్త సఙ్కల్పో । యోగీ భవతి కశ్చన ॥

అర్థము : హేపాణ్డవ = ఓ అర్జునా !, యం = దేనిని, సన్న్యాసం ఇతి = జ్ఞాన యోగమని, ప్రాహుః= చెప్పుదురో, తం = దానిని, యోగం (ఇతి) = కర్మయోగమని. విద్ధి = తెలుసుకొనుము, అసన్న్యస్త సఙ్కల్పః = దేహమే ఆత్మయని భ్రమించువాడు, కశ్చన = ఒకడున్ను, యోగీ = కర్మయోగి, న భవతి హి = కాడు గదా ?

తా ॥ ఆత్మ యొక్క వాస్తవ జ్ఞానమే జ్ఞానయోగము. దానినే కర్మయోగమనియు గ్రహింపుము. ఏలయన కర్మయోగియైన వాడెవ్వడును ఆత్మ యాథాత్మ్య జ్ఞానముచే దేహాత్మభ్రాంతిని పోగొట్టుకొనకుండగ నుండడుగదా!

అవ. కర్మయోగమే యే ప్రమాదములేకుండగ ఆత్మసాక్షాత్కారమును సాధించునని చెప్పుచున్నాడు.

3. శ్లో. ఆరురుక్షోర్మునే ర్యోగం । కర్మ కారణ ముచ్యతే ।
యోగారూఢస్య తస్యైవ । శమః కారణ ముచ్యతే ॥

అర్థము : యోగం = ఆత్మావలోకనమును. ఆరురుక్షోః = పొందగోరునట్టి, మునేః = మునికి, కర్మ = కర్మయోగము, కారణం = సాధనముగా, ఉచ్యతే = చెప్పబడుచున్నది, యోగారూఢస్య = స్థిరమగుఆత్మావలోకనముగల, తస్య, ఏవ = వానికే, శమః = కర్మత్యాగము, కారణం = సాధనముగా, ఉచ్యతే = చెప్పబడుచున్నది.

తా ॥ ముముక్షువై ఆత్మను సాక్షాత్కరించగోరువానికి కర్మయోగము సాధనము. స్థిరమగు ఆత్మావలోకనము కలుగువరకు కర్మలు చేసి తీరవలసినదే.

అవ. యోగారూఢుడెప్పుడగునో లేక ఎట్లగునో చెప్పుచున్నాడు.

4. శ్లో. యదా హి చేన్ద్రియార్థేషు । న కర్మస్వనుషజ్జతే ।
సర్వసఙ్కల్ప సన్యాసీ । యోగారూఢ స్తదోచ్యతే ।

అర్థము : యదా = ఎప్పుడు, ఇంద్రియార్థేషు = శబ్దాదివిషయముల యందును, కర్మసు చ= కర్మలయందును, న అనుషజ్జతే = ఆసక్తి కలిగియుండడో, తదా, హి = అప్పుడే, సర్వసంకల్ప సన్యాసీ = సకల సంకల్పములను విడచినవాడై, యోగారూఢః=స్థిరమగు ఆత్మదర్శనము కలవాడని, ఉచ్యతే = చెప్పబడుచున్నాడు.

తా ॥ ఆత్మనుమాత్రమే అనుభవించు స్వభావము కలవానికి ప్రాకృత విషయముల యందును, వాటికి సంబందించిన కర్మలయందును ఆసక్తి యుండదు. వానికే సంకల్పములును ఉండవు. వాడు స్థిరమైన ఆత్మ దర్శనము కలవాడగును. కావున వాడు యోగారూఢుడని చెప్పబడును. ఆస్థితి కలుగువరకు కర్మలు చేయవలెను.

అవ. ఆత్మోజ్జీవనమున మనస్సునకుగల సంబంధమును చెప్పుచున్నాడు.

5. శ్లో. ఉద్ధరేదాత్మనాఽఽత్మానం । నాత్మాన మవసాదయేత్ ।
ఆత్మైవ హ్యాత్మనోబన్ధు । రాత్మైవ రిపు రాత్మనః ।

అర్థముః- ఆత్మనా = మనస్సుచేత, ఆత్మానం = ఆత్మను, ఉద్ధరేత్ = ఉద్ధరించవలెను.

ఆత్మానం = ఆత్మను, న అవసాదయేత్ = అధోగతిపాలు చేయరాదు, ఆత్మనః= ఆత్మకు, ఆత్మైవ = మనస్సే, బంధుః = చుట్టము, (భవతి = అగుచున్నది) ఆత్మనః = ఆత్మకు, ఆత్మైవ =మనస్సే, రిపుః = శత్రువు, (భవతి = అగుచున్నది.)

తా ॥ మనస్సును విషయమ్ముల మీదకు పోనీయక ఆత్మను ఉద్ధరించవలెను కాని విషయప్రావణ్యముచే ఆత్మను అధోగతిపాలుచేయరాదు. ఆత్మకు (తనకు) వశమైన మనస్సే చుట్టము. అట్లుకానిది శత్రువు.

6. శ్లో. **బన్ధురాత్మాఽఽత్మన స్తస్య । యేనాఽత్మైవాఽత్మనా జితః ।**
అనాత్మనస్తు శత్రుత్వే । వర్తేతా త్మైవ శత్రువత్ ।

అర్థము : ఆత్మనైవ = తనచేతనే, యేన = ఏపురుషునిచే, ఆత్మా = మనస్సు, జితః = జయించబడునో, ఆత్మనః = తనయొక్క, ఆత్మా = మనస్సు, తస్య = వానికి, బన్ధుః = బంధువు, (భవతి = అగుచున్నది.) అనాత్మనస్తు = మనస్సును జయించనివానికి, ఆత్మైవ = మనస్సే, శత్రువత్ = శత్రువువలె, శత్రుత్వే = అపకారమునందు, వర్తేత = ప్రవర్తించును.

తా ॥ మనస్సును జయించవలెనన్న దానిని విషయములవైపు పోనీయరాదు. అట్లు జయించబడినచో ఆ మనస్సువానికి బంధువువలె హితమొనగూర్చును. లేనిచో విరోధివలె పగచూపుచు సంసారమున ముంచును.

అవ. యోగప్రక్రియను చెప్పదలంచి దానిని ప్రారంభించుటకు కావలసిన ఇంద్రియ నిగ్రహమును ద్వంద్వసహనమును చెప్పుచున్నాడు.

7. శ్లో. **జితాత్మనః ప్రశాన్తస్య । పరమాత్మా సమాహితః ।**
శీతోష్ణ సుఖదుఃఖేషు । తథా మానావమానయోః ॥

అర్థము : శీతోష్ణసుఖదుఃఖేషు = చలి, వేడి, సుఖము, దుఃఖము మున్నగు ద్వంద్వములయందును, తథా = అట్లే, మానావమానయోః = గౌరవాగౌరవములయందును, జితాత్మనః = వికారమును చెందని మనస్సుకలవాడును, ప్రశాన్తస్య = బాహ్యేన్ద్రియ నిగ్రహము కలవాడు అగువానికి, ఆత్మా = పరిశుద్ధమగు జీవాత్మ, పరం=మిక్కిలి, సమాహితః= విశదముగా అనుసంధింప బడును.

తా ॥ శీతోష్ణ సుఖదుఃఖాది ద్వంద్వములకు వికారమును చెందక బాహ్యేంద్రియముల నరికట్టినవానికి మనస్సునందు ప్రత్యగాత్మ నిజరూపముతో స్పష్టముగా అనుసంధింప బడును.

అవ. ఆ రెండింటికిని వలయు సాధనములను చెప్పుచున్నాడు.

8. శ్లో. జ్ఞానవిజ్ఞాన తృప్తాత్మా । కూటస్థో విజితేన్ద్రియః ।
యుక్త ఇత్యుచ్యతే యోగీ । సమలోష్టాశ్మకాఞ్చనః ॥

అర్థము : (యః = ఏ), యోగీ = కర్మయోగి, జ్ఞాన-విజ్ఞాన-తృప్తాత్మా = ఆత్మస్వరూపము, దానికి గల ప్రకృతి వైలక్ష్యముల జ్ఞానములచే తృప్తిని చెందిన మనస్సు కలవాడును, కూటస్థః = నిర్వికారమగు శుద్ధాత్మను అనుసంధించువాడును, విజితేన్ద్రియః = ఇంద్రియములను జయించినవాడును, సమలోష్టాశ్మకాఞ్చనః = మట్టి, రాయి, బంగారములను సమయముగ నెంచువాడును అగునో, (సః = వాడు), యుక్తః ఇతి= ఆత్మదర్శనమునకు తగినవాడని, ఉచ్యతే = చెప్పబడుచున్నాడు.

తా ॥ శరీరముకంటె వేరుగా ఆత్మకలదనుకొనుట జ్ఞానము. ఆ యాత్మకు నిత్యత్వ, ఆనందత్వాదులుండుటచే ప్రకృతికంటె వేరనుకొనుట విజ్ఞానము. ఈ రెండింటిచేతను తృప్తిని చెంది, పరిశుద్ధాత్మాను సంధానముచే ఇంద్రియములను జయించి, దానిచే బంగారమును మట్టివలెను, రాయివలెను, నిర్లక్ష్యముగ చూడగలవాడు ఆత్మదర్శనమునకు తగినవాడు.

9. శ్లో. సుహృన్మిత్రా ర్యు దాసీన । మధ్యస్థ ద్వేష్య బన్ధుషు ।
సాధు ష్వపి చ పాపేషు । సమ బుద్ధి ర్విశిష్యతే ॥

అర్థము : సుహృత్ = భిన్నవయస్కులై హితమును కోరువారి యందును మిత్ర = సమవయస్కులై మేలును కోరువారియందును, అరి = నైమిత్తిక శత్రువులయందును, ఉదాసీన = తటస్థులయందును, మధ్యస్థ = సహజముగనే కీడుమేళ్లను కోరనివారి యందును, ద్వేష్య = సహజ శత్రువులయందును, బన్ధుషు = చుట్టములయందును, సాధుషు అపి = సజ్జనుల యందును, పాపేషు చ = పాపాత్ముల యందును, సమబుద్ధిః = సమానమైన బుద్ధికలవాడు, విశిష్యతే = గొప్పవాడు అగుచున్నాడు.

తా ॥ భిన్నవయస్సుకలిగి హితమును కోరు సుహృత్తులందును. సమ వయస్కులై హితమునుకోరు మిత్రులయందును, ఏదైన కారణముచే చెరుపునుగోరు శత్రువులయందును, కారణము లేకుండుటచే ఇష్టానిష్టముల గావింపని ఉదాసీనులయందును, సహజముగనే హితాహితముల జేయని మధ్యస్థుల యందును, పుట్టుకతోనే అనర్థముల జేయగోరు ద్వేష్యులయందును, పుట్టుకతోనే హితపరులగు బంధువులయందును, పుణ్యాత్ముల యందును,

పాపాత్ములయందును సమానబుద్ధికలవాడు యోగాభ్యాసమునకు మిక్కిలి తగినవాడు.

10. శ్లో. యోగీ యుఞ్జీత సతత । మాత్మానం రహసి స్థితః ।
ఏకాకీ యతచిత్తాత్మా । నిరాశీ రపరిగ్రహః ॥

అర్థము:- యోగీ = కర్మయోగి, సతతం = ఎల్లప్పుడును, ఏకాకీ = ఒంటరి వాడును యత చిత్తాత్మా = మనస్సుయొక్క చింతను అరికట్టిన వాడును, నిరాశీః = ఆశలేనివాడును, అపరిగ్రహః = మమతలేని వాడును (అగుచు), రహసి = జనులు లేనిచోట, స్థితః = ఉన్నవాడై ఆత్మానం = మనస్సును, యుఞ్జీత = యోగమునందుంచవలెను.

తా ॥ కర్మయోగి ప్రతిదినమును యోగాభ్యాసకాలమున జనులు లేని చోట ఒంటరిగా కూర్చుండి చింతలులేని మనస్సుతో ఆత్మదర్శ న నిష్ఠ కలవాడు కావలెను. ఆ నిష్ఠచే వానికి ఇతర వస్తువుల యందు అపేక్షగాని, మమతగాని యుండదు.

అవ. యోగాభ్యాసమునకు కావలసిన బాహ్యోపకరణములను,
మనస్సుయొక్క ఏకాగ్రతను చెప్పుచున్నాడు.

11. శ్లో. శుచౌ దేశే ప్రతిష్ఠాప్య । స్థిర మాసన మాత్మనః ।
నా త్యుచ్ఛ్రితం నాతినీచం । చేలాజిన కుశోత్తరమ్ ॥

అర్థము:- శుచౌ = పరిశుద్ధమైన, దేశే = ప్రదేశమందు, స్థిరం = ధృఢమైనట్టి యు, న, అతి ఉచ్ఛ్రితం=మిక్కిలి ఎత్తులేనిదియు, న, అతి నీచం =మిక్కిలి క్రిందకు కానట్టియు, చేలాజినకుశోత్తరం = బట్ట, చర్మము, దర్భలు ఒకదానిపై నొకటి కలదియునగు, ఆసనం = పీఠమును, ఆత్మనః = తనకు, ప్రతిష్ఠాప్య = స్థిరముగా వేసుకొని.

తా ॥ పవిత్రమైన స్థలమున కఱ్ఱతో చేయబడిన సమపరిమాణముగల పీటపై ముందు బట్ట ఆపైన కృష్ణాజినము దానిపైన దర్భలు పరచుకొని స్థిరముగా వేసుకొని - (దీనికి ముందుశ్లోకముతో సంబంధము).

12. శ్లో. తత్రైకాగ్రం మనః కృత్వా । యతచిత్తే న్ద్రియక్రియః ।
ఉపవి శ్యాఽసనే యుఞ్జ్యా । ద్యోగ మాత్మ విశుద్ధయే ॥

అర్థము:- తత్ర = ఆ, ఆసనే = పీఠమునందు, ఉపవిశ్య = కూర్చుండి, మనః = మనస్సును, ఏకాగ్రం = నిశ్చలముగా, కృత్వా = చేసి, యత చిత్త ఇన్ద్రియక్రియః = మనోవ్యాపారములను, ఇంద్రియ వ్యాపారములను స్వాధీనపరచుకొని, ఆత్మవిశుద్ధయే = ఆత్మకు గల బంధనివృత్తికొఱకు, యోగం = ఆత్మదర్శనమును, యుఞ్జ్యాత్ = చేయవలెను.

తా ॥ ఆపీటపై కూర్చుండి ఆత్మదర్శనమునందే మనస్సును నిలిపి, మనస్సును ఇంద్రియములను స్వేచ్ఛగా సంచరింపనీయక, సంసారబంధము పోవుటకొరకు ఆత్మదర్శనము చేయవలెను.

అవ. శరీరమును గూర్చియు, మనస్సును గూర్చియు పాటింప వలసిన నియమములను చెప్పుచున్నారు.

13. శ్లో. సమం కాయశిరోగ్రీవం । ధారయ న్నచలం స్థిరమ్ ।
సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం । దిశ శ్చా నవలోకయన్ ।

అర్థము : కాయ శిరోగ్రీవం = దేహమును, తలను, మెడను, సమం = తిన్నగాను, అచలం = కదలకుండునట్లును, స్థిరం = స్థిరముగాను, ధారయన్ = నిలుపుచు, దిశః = దిక్కులను, అనవలోకయన్ = చూడకుండగ, స్వం = తనదియగు, నాసికాగ్రం= కనుబొమల మధ్యభాగమును, సంప్రేక్ష్య = చూచి.

తా ॥ శరీరము, తల, మెడ, వంకరలేకుండగ తిన్నగానుంచి యిటునటు కదల్పక ఆనుకొని స్థిరముగా నుంచి దిక్కులను చూడకుండగ తన కనుబొమల మధ్యయందు దృష్టిని నిలిపి (దీనికి ముందు శ్లోకముతో సంబంధము కలదు).

4. శ్లో. ప్రశాన్తాత్మా విగతభీ । ర్బ్రహ్మచారివ్రతే స్థితః ।
మన స్సంయమ్య మచ్చిత్తో । యుక్త ఆసీత మత్పరః ।

అర్థము : ప్రశాన్తాత్మా = శాంతించిన మనస్సు కలవాడును, విగతభీః = భయములేనివాడును, బ్రహ్మచారివ్రతే = బ్రహ్మచర్యవ్రతమునందు, స్థితః = ఉన్నవాడును అగుచు, మనః= మనస్సును, సంయమ్య = అణచి, మచ్చిత్తః = నాయందు మనస్సుకలవాడును, యుక్తః = సావధానుడును, మత్పరః = నన్నే చింతించు వాడును అయి, ఆసీత = కూర్చుండవలెను.

తా ॥ శాంతించిన మనస్సుకలవాడై, భయములేనివాడై, బ్రహ్మచర్యము కలవాడై, మనస్సును నిగ్రహించి నాయందు చిత్తమును చేర్చి సావధానముగ నన్నే చింతించుచు కూర్చుండవలెను.

15. శ్లో. యుఞ్జ న్నేవం సదాఽఽత్మానం । యోగీ నియత మానసః ।
శాన్తిం నిర్వాణ పరమాం । మత్సంస్థా మధిగచ్ఛతి ।

అర్థము : యోగీ = యోగాభ్యాసపరుడు, ఏవం = ఇట్లు, సదా = ఎల్లప్పుడును, ఆత్మానం =

మనస్సును, (మయి=నాయందు), యుఞ్జన్ = చేర్చుచు, నియతమానసః = నిశ్చలమైనమనస్సు కలవాడై, నిర్వాణపరమాం = మోక్షము యొక్క ఉత్కృష్టావస్థయును, మత్సంస్థాం = నాయందుండు నట్టిదియునగు, శాన్తిం = శాంతిని, అధిగచ్ఛతి = పొందుచున్నాడు.

తా ॥ యోగాభ్యాసపరుడు మనస్సునకు సుఖమైన ఆలంబనమగు నా యందు మనస్సును నిశ్చలముగ నిలిపి నన్నే ధ్యానించుచుండుట వలన ఆకలి దప్పి మొదలగు ఊర్ములు ఆరును, లేనివాడై మిక్కిలి ఉత్తమమైన మోక్షావస్థను నాయందున్నట్టి చిత్తశాంతిని పొందుచున్నాడు.

16. శ్లో. నాత్యశ్నతస్తు యోగోఽస్తి । నచైకాన్త మనశ్నతః ।
న చాతి స్వప్నశీలస్య । జాగ్రతో నైవ చార్జున ! ।

అర్థము : హేఅర్జున = ఓ అర్జునుడా! అత్యశ్నతః = హెచ్చుగా తినువానికి, యోగః = యోగము, నాస్తి = లేదు, ఏకాంతం = బొత్తిగా, అనశ్నతః చ=తిననివానికిన్ని, న = లేదు, అతిస్వప్నశీలస్య = మిక్కిలి నిద్రించు స్వభావము కలవానికిని, న = లేదు, జాగ్రతః చ = మిక్కిలి మేలుకొనియుండు వానికిని, న = లేదు.

తా ॥ అపరిమితముగా తినువానికిని, అసలే తిననివానికిని, మిక్కిలి నిద్రించువానికిని, ఎప్పుడును మేల్కొనియుండువానికిని యీ యోగము సిద్ధించజాలదు.

17. శ్లో. యుక్తాహార విహారస్య । యుక్తచేష్టస్య కర్మసు ।
యుక్తస్వప్నావబోధస్య । యోగో భవతి దుఃఖహా ॥

అర్థము : యుక్తాహారవిహారస్య = మితమగు తిండి, సంచారముగలవానికిని, కర్మసు = కర్మలయందు, యుక్తచేష్టస్య = మితమైన వ్యాపారము కలవానికిని, యుక్తస్వప్నావబోధస్య = మితమైన, నిద్రమెలకువలు కలవానికిని, దుఃఖహా = సంసారబంధమును పోగొట్టునట్టి, యోగః = యోగము, భవతి = కలుగుచున్నది.

తా ॥ మితాహార విహారములును, కర్మలయందలి మితప్రవృత్తియు, మిత నిద్ర మెలకువలుకలవానికి సకలబంధ విమోచకమగు యోగము సిద్ధించును.

18. శ్లో. యదా వినియతం చిత్తం । ఆత్మన్యే వావతిష్ఠతే ।
నిస్స్పృహస్సర్వకామేభ్యో । యుక్త ఇత్యుచ్యతే తదా ।

అర్థము : యదా = ఎప్పుడుః చిత్తం = మనస్సు, ఆత్మన్యేవ = ఆత్మయందే, వినియతం =

నియమింపబడినదై, అవతిష్ఠతే = నిలుచుచున్నదో, తదా = అప్పుడు, సర్వకామేభ్యః = అన్నికోరికల నుండియు, నిస్పృహః = ఆశలేనివాడై, యుక్త ఇతి = యోగమునకు తగినవాడని, ఉచ్యతే = చెప్పబడుచున్నాడు.

తా ॥ ఆత్మను నిరతిశయ ప్రయోజనమని తలంచుటచే, చిత్తమాయాత్మయందు మిక్కిలి నియమింపబడి నిశ్చలమై ఉండి నపుడు సమస్త కోరికలయందును నిస్పృహుడై యోగార్హుడగును.

19. శ్లో. యథా దీపో నివాతస్థో । నేఙ్గతే సోపమా స్మృతా ।
యోగినో యతచిత్తస్య । యుఞ్జతో యోగ మాత్మనః ॥

అర్థము : నివాతస్థః = గాలిలేనిచోటనున్న, దీపః = దీపము, యథా = ఏ ప్రకారముగా, నఇఙ్గతే = చలింపదో, యతచిత్తస్య = నియమించ బడిన మనస్సు కలిగినట్టియు, యోగం = ఆత్మసాక్షాత్కార మును, యుఞ్జతః = చేయుచున్నట్టి, యోగినః = యోగి యొక్క, ఆత్మనః = ఆత్మస్వరూపమునకు, సా = ఆదీపము యొక్క నిశ్చలత్వము, ఉపమా = పోలికగా, స్మృతా = తలంప బడినది.

తా ॥ గాలిలేని చోటనుండి దీపము కదలక కాంతితో కూడియుండునట్లు ఆత్మసాక్షాత్కారమును జేయుచున్న యోగికిని, మనస్సున కితర వ్యాపారములు లేకుండుటచే ఆత్మయు నిశ్చలమగు జ్ఞానప్రభతో వెలుంగుచుండును.

అవ. యోగమునందు అందరకును ఆదరము కలుగుట కొఱకు ఇదియే నిరతిశయ పురుషార్థమని విస్తరించి చెప్పుచున్నాడు.

20. శ్లో. యత్రోపరమతే చిత్తం । నిరుద్ధం యోగసేవయా ।
యత్రచైవాఽత్మనాఽత్మానం । పశ్యన్నాత్మని తుష్యతి ॥

అర్థము : యోగసేవయా = యోగానుష్ఠానముచే, నిరుద్ధం = అరికట్టబడిన, చిత్తం = మనస్సు, యత్ర = ఏయోగమందు, ఉపరమతే = సుఖించుచున్నదో, యత్రచ = ఏ యోగమందైతే, ఆత్మనా = మనస్సుచేత, ఆత్మానం = ఆత్మను, పశ్యన్ = చూచుచు, ఆత్మన్యేవ = ఆత్మయందే, తుష్యతి = సంతోషించుచున్నాడో.

తా ॥ యోగమును చక్కగనాచరించుటచే విషయవిరక్తి చెందిన మనస్సు దేనియందు రమించునో, దేనియందు మనస్సుచే ఆత్మనుచూచి ఇతరములగోరక దానియందే సంతోషించు చుండునో (ముందుశ్లోకముతో అన్వయము)

21. శ్లో. సుఖ మాత్యన్తికం యత్తత్ । బుద్ధిగ్రాహ్య మతీన్ద్రియమ్ ।
వేత్తి యత్ర నచైవా యం । స్థిత శ్చలతి తత్త్వతః ॥

అర్థము : యత్ = ఏది, అతీన్ద్రియం = ఇన్ద్రియములకు గాన్పించనిదియు, బుద్ధిగ్రాహ్యం = బుద్ధిచేతనే గ్రహించదగినదియు, ఆత్య న్తికం = మిక్కిలి అధికమైనదియునగు, సుఖం = సుఖమో, తత్ = ఆ సుఖమును, యత్ర = ఏ యోగమునందు, వేత్తి = తెలుసుకొనుచున్నాడో, యత్ర = ఏయోగమునందు, స్థితః=ఉన్నవాడై, అయం= ఈయోగి, తత్త్వతః = అట్టిస్థితినుండి, న చలతి ఏవ = బొత్తిగా చలించడో.

తా ॥ ఏస్థితియందు ఇంద్రియములకు గాన్పించక, ఆత్మవిషయమైన బుద్ధిచేతను మాత్రమే గ్రహింపదగిన నిరతిశయసుఖమును అనుభవించుచు ఆ యనుభవాతిశయముచే ఆస్థితిని విడువకయుండునో (ముందుశ్లోకముతో అన్వయము)

22. శ్లో. యం లబ్ధ్వా చా పరం లాభం । మన్యతే నాధికం తతః ।
యస్మిన్ స్థితో న దుఃఖేన । గురుణాఽపి విచాల్యతే ।

అర్థము : యం = ఏ యోగమును, లబ్ధ్వా = పొంది, తతః = దానికంటె, అపరం = వేరైన, లాభం = లాభమును, అధికం=గొప్ప దానినిగా, నమన్యతే = తలంపడో,యస్మిన్= ఏ యోగము నందు, స్థితః = ఉన్నవాడై, గురుణా = గొప్పదైన, దుఃఖేనాపి = దుఃఖముచేతనైనను, న విచాల్యతే = చలింప జేయబడడో.

తా ॥ ఏ యోగమును పొంది ఇతరలాభముల నంతకంటె హెచ్చుగా పాటించక యుండునో, ఏ స్థితియందుండి భరింపరాని దుఃఖము లచేనైనను చలింపచేయబడడో (దీనికిని ముందు శ్లోకముతో సంబంధము)

23. శ్లో. తం విద్యాద్దుఃఖసంయోగ । వియోగం యోగసంజ్ఞితమ్ ।
స నిశ్చయేన యో క్తవ్యో । యోగోఽనిర్విణ్ణచేతసా ।

అర్థము : దుఃఖసంయోగవియోగం = దుఃఖసంబంధమునకు విరుద్ధమైన, తం = ఆ స్థితిని, యోగసంజ్ఞితం = యోగమనిపేరు కలదానినిగా, విద్యాత్ = తెలుసుకొనవలెను, సఃయోగః=ఆ యోగము, నిశ్చయేన=ఇట్టిదియను నిశ్చయముచేత, అనిర్విణ్ణచేతసా= విసుగుజెందకసంతోషముగల మనస్సు కలవానిచే, యోక్తవ్యః = ఆచరించతగినది.

తా ॥ ఈ విధమైన దుఃఖస్పర్శనైనను సహించని యా స్థితికి యోగమని పేరు, ఇది నిరతిశయపురుషార్థమని ప్రారంభముననే నిశ్చయించి ఇంకను ఫలము కలుగలేదే యని విసుగుచెందక సంతుష్టాంతరంగుడై దీనిని అభ్యసించవలెను.

అవ. వెనుక చెప్పబడిన మమకారము లేకుండుట మొదలగు యోగ సాధనములనే తిరిగి సుఖముగ నెఱుంగుటకై క్రోడీకరించి చెప్పుచున్నాడు.

4. శ్లో. సఙ్కల్పప్రభవా న్కామాన్ । త్యక్త్వా సర్వా నశేషతః ।
మనసైవేన్ద్రియగ్రామం । వినియమ్య సమన్తతః ॥

అర్థము : సఙ్కల్పప్రభవాన్ = సంకల్పమువలన కలుగు, కామాన్ = కోరికలను, సర్వాన్= అన్నింటిని, అశేషతః = పూర్తిగా, మనసైవ = మనస్సు చేతనే, త్యక్త్వా = విడిచి, ఇన్ద్రియగ్రామం = ఇంద్రియములన్నింటిని, సమన్తతః = అన్నివిషయముల నుండియు, వినిమయ్య = నిగ్రహించి.

తా ॥ సంకల్పమువలన లభించిన పశుపుత్రమిత్రకళత్రాదు లందరును తనకు సంబంధించనివారుగా భావించి విడిచి ఇంద్రియములను తమతమ విషయములనుండి నిగ్రహించి,(దీనికి ముందు శ్లోకముతో సంబంధము).

25. శ్లో. శనై శ్శనై రుపరమేత్ । బుద్ధ్యా ధృతిగృహీతయా ।
ఆత్మసంస్థం మనః కృత్వా । న కిఞ్చిదపి చిన్తయేత్ ॥

అర్థము : ధృతిగృహీతయా=వివేకముతోకూడిన, బుద్ధ్యా = బుద్ధిచేత, శనైశ్శనైః = మెల్లమెల్లగా, ఉపరమేత్=విరమింపవలెను, మనః-మనస్సును, ఆత్మసంస్థం = ఆత్మ యందున్న దానినిగా, కృత్వా=చేసి, కిఞ్చిదపి=దేనినిగాని, నచిన్తయేత్ = తలంచకూడదు.

తా ॥ వివేకముతో మెల్లమెల్లగా మనస్సును ఆత్మకంటె వేరైన వాటి నుండి మరల్చి ఆత్మయందే నిలిపి ఇతరమైనవానిని వేనిని తలంచరాదు.

26. శ్లో. యతో యతో నిస్సరతి । మన శ్చఞ్చల మస్థిరమ్ ।
తతస్తతో నియమ్యైత । దాత్మన్యేవ వశం నయేత్ ॥

అర్థము : చఞ్చలం = చంచలించునదిగాన, అస్థిరం = నిలకడగానుండని, మనః = మనస్సు, యతః యతః = ఏయేవిషయములవైపుగా, నిస్సరతి = బయలు దేరుచున్నదో, తతస్తతః = ఆయావిషయములనుండి, ఏతత్ = ఈ మనస్సును, నియమ్య = మరల్చి, ఆత్మన్యేవ = ఆత్మయందే, వశం నయేత్ = వశమును పొందించవలెను.

తా ॥ మనస్సు సహజముగా చంచలించు స్వభావముగలది గాన ఆత్మ యందు స్థిరముగా నిలువక ఏయే విషయములవైపు ప్రవహించునో ఆయా విషయములనుండి దానిని మరలించి ఆత్మయే నిరతిశయ ప్రియమైనదని భావించి దానియందే నిలుచునట్లు చేయవలెను.

తా ॥ ఈ యోగి యోగదశలో నావలెనే సంకోశములేని జ్ఞానమే ఆకారముగా కలిగియుండును. కావున నాతో సామ్యమును పొందును. కావుననే తనను దర్శించుకొన్నను నన్ను దర్శించుచున్నట్లే, అదియే నన్ను సేవించుట. అట్టివాడు యోగమును విడిచి లౌకిక వ్యాపారములు చేయుచు తనను, సర్వ భూతములను చూచుచున్నను వాటియందు నా సామ్యమునే చూచుచున్నాడు.

32. శ్లో. ఆత్మౌపమ్యేన సర్వత్ర । సమం పశ్యతి యోఽర్జున ।
సుఖం వా యదివా దుఃఖం । స యోగీ పరమో మతః ॥

అర్థము : అర్జున = అర్జునా ! యః = ఎవడు, సర్వత్ర = అంతటను, ఆత్మౌ పమ్యేన = తనసామ్యముచే, సర్వత్ర=అంతటనుగల, సుఖంవా = సుఖమునుగాని, యదివాదుఃఖం= దుఃఖమునుగాని, సమం = సమానముగా, పశ్యతి = చూచుచున్నాడో, సఃయోగీ= ఆయోగి, పరమః = మిక్కిలి గొప్పవాడుగా, మతః = తలంపబడును.

తా ॥ ఈయోగికి తనయొక్కయు, ఇతరుల యొక్కయు ఆత్మలన్నియు జ్ఞానాకారముతో సమానములగును గాన ఇతరుల పుత్రజన్మాదులు తనకు సంబంధించనట్లే, తన పుత్రజన్మాదులును తనకు సంబంధించవని చూచును. ఇతడే ఉత్కృష్టయోగ పరిపాకదశను పొందినవాడు.

అవ. యోగసాధనములలో ప్రధానమగు మనోనిగ్రహము దుశ్శకమగుటచే దాని కుపాయమును జెప్పుమని అర్జునుడడుగుచున్నాడు.

అర్జున ఉవాచ = అర్జునుడు పలికెను.

33. శ్లో. యోఽయంయోగ స్త్వయాప్రోక్త । స్సామ్యేన మధుసూదన ! ।
ఏతస్యా హం న పశ్యామి । చఞ్చలత్వాత్ స్థితిం స్థిరామ్ ॥

అర్థము : మధుసూదన = శ్రీకృష్ణా ! సామ్యేన =సామ్యముచేత, యః . అయం, యోగః = ఏయీయాయోగము, త్వయా = నీచేత, ప్రోక్తః = చెప్పబడినదో, ఏతస్య = ఈ యోగముయొక్క, స్థిరాం, స్థితిం = నిలకడగా నుండుటను, చఞ్చలత్వాత్ = మనస్సుయొక్క చాంచల్యము వలన, నపశ్యామి = చూడజాలకున్నాను.

తా ॥ ఆత్మలన్నియు జ్ఞానాకారము లగుటచే పరస్పరమును, ఈశ్వరునితోను సమానములుగ దర్శించవలెననెడి యోగమును నీవు చెప్పితివి. మనస్సు

మిక్కిలి చంచలమైన దగుటవలన ఆ యోగము స్థిరముగా నిలుచునట్లు గాన్పించదు.

34. శ్లో. చఞ్చలం హి మనః కృష్ణ । ప్రమాథి బలవ ద్దృఢమ్ ।
తస్యాహం నిగ్రహం మన్యే । వాయోరివ సుదుష్కరమ్ ॥

అర్థము : కృష్ణ=శ్రీకృష్ణా ! మనః = మనస్సు,చఞ్చలం = చలించు స్వభావము కలదియు, బలవతే = బలవంతమైనదియు, ప్రమాథి = క్షోభ పెట్టునదియు, దృఢంహి = దృఢమైనది గదా! తస్య = అట్టి మనస్సు యొక్క, నిగ్రహం = అరికట్టుటను, వాయోః (నిగ్రహం) ఇవ=గాలిని అరికట్టుటవలె, సుదుష్కరం = మిక్కిలి అసాధ్యమని, మన్యే = తలంచుచున్నాను.

తా॥ కృష్ణా! అలవాటుపడిన వాటియందైనను నిలకడలేక చలించునదై ఒకచోట నిలుపుటకు శక్యముకానంత బలిష్ఠమై బలాత్కారముగా వ్యాకుల పరచుచు ఇతరత్ర దృఢముగా చరించు నీ మనస్సును ఎదురు గాలిని విసనికఱ్ఱతో నడ్డుటవలె దుష్కరమని తలంచు చున్నాను.

అవ. అర్జునుని ప్రశ్నకు కృష్ణపరమాత్మ సమాధానమొసంగుచున్నాడు.

శ్రీభగవానువాచ – శ్రీకృష్ణుడు పలికెను.

35. శ్లో. అసంశయం మహాబాహో! । మనో దుర్నిగ్రహం చలమ్ ।
అభ్యాసేన తు కౌన్తేయ! । వైరాగ్యేణ చ గృహ్యతే ॥

అర్థము : మహాబాహో = గొప్ప భుజములుగల, కౌన్తేయ = అర్జునుడా ! మనః = మనస్సు, చలం = చలించు స్వభావముకలదియు, దుర్నిగ్రహం = నిగ్రహింప శక్యముకానిది యును, అసంశయం = సందేహములేదు, అభ్యాసేన = అలవాటుచేతను, వైరాగ్యేణ చ = విరక్తిచేతను, గృహ్యతే = వశము గావింపబడుచున్నది.

తా॥ అర్జునా! మనస్సుచలించు స్వభావముకలది గాన నిగ్రహింపశక్యము కానిదే. సంశయములేదు. కాని, ఆత్మ సుఖాకారమైనదని అలవరచు కొనుటచే కలుగు ఆభిముఖ్యముచేతను, తదితరములు దుఃఖాకారములని తెలియుటచే కలుగు విరక్తిచేతను మనస్సు వశమగును.

36. శ్లో. అసంయతాత్మనా యోగో । దుష్ప్రాప ఇతి మే మతిః ।
వశ్యాత్మనా తు యతతా । శక్యోఽవాప్తు ముపాయతః ॥

అర్థము : అసంయతాత్మనా = జయింపబడని మనస్సుగలవానిచే, యోగః = సమదర్శన

యోగము, దుష్ప్రాపః = పొందశక్యము కానిది, ఇతి = అని, మే = నాయొక్క, మతిః= నిశ్చయము, ఉపాయతస్తు=కర్మయోగమనెడు ఉపాయముచేనైతే, వశ్యాత్మనా=జయింపబడిన మనస్సుగలవాడై, యతతా=ప్రయత్నించు వానిచేత, అవాప్తుం=పొందుటకు, శక్యం= సాధ్యమైనది.

తా॥ మనస్సును జయించలేనిచో నీయోగము పొందుట శక్యముకాని దని నా అభిప్రాయము, నీకుపదేశించిన కర్మయోగముచే మనస్సును జయించి యోగము నభ్యసించినవానికి మాత్రమీ సమదర్శనయోగము సాధ్యమగును.

అవ. యోగము యొక్క మాహాత్మ్యమును ఎరుంగగోరి అర్జునుడడుగుచున్నాడు.

అర్జున ఉవాచ–అర్జునుడు పలికెను.

37. శ్లో. అయతి శ్శ్రద్ధయోపేతో । యోగా చ్చలిత మానసః ।
అప్రాప్య యోగసంసిద్ధిం । కాం గతిం కృష్ణ ! గచ్ఛతి ॥

అర్థము : కృష్ణ = శ్రీకృష్ణా! శ్రద్ధయా = శ్రద్ధతో, ఉపేతః= కూడుకొన్నవాడై, అయతిః = యత్నములేనివాడు,యోగసంసిద్ధిం = యోగసిద్ధిని, అప్రాప్య = పొందక, యోగాత్ = యోగమునుండి, చలితమానసః = చలించిన మనస్సు కలవాడు, కాం=ఏ, గతిం = గతిని, గచ్ఛతి = పొందుచున్నాడు.

తా॥ కృష్ణా! శ్రద్ధతో యోగమునందు ప్రవర్తించియు, దానిని బలపరచు ప్రయత్నము చేయకపోవుటచే యోగసిద్ధిని బడయజాలక దానినుండి చిత్తము చలించినవాడు కామ భోగమోక్షనరకములలో నేగతినిపొందును?

38. శ్లో. కచ్చిన్నోభయ విభ్రష్ట । శ్ఛిన్నాభ్రమివ నశ్యతి ।
అప్రతిష్ఠో మహాబాహో! । విమూఢో బ్రహ్మణః పథి ॥

అర్థము : మహాబాహో=కృష్ణా! అప్రతిష్ఠః=ప్రతిష్ఠలేనివాడును,బ్రహ్మణః=బ్రహ్మయొక్క, పథి= మార్గమునందు, విమూఢః=మిక్కిలిమోహము నొందినవాడును, ఉభయవిభ్రష్టః= రెండింటికిని చెడినవాడై, ఛిన్నాభ్రం ఇవ = తెగినమేఘమువలె, న నశ్యతి కచ్చిత్ = నశింపడుగదా.

తా॥ ఫలమునుగోరి యథావిధిగా అనుష్ఠింపబడిన కర్మ, ఫల మొసంగును గాని నీవు చెప్పినట్లాచరించినచో సాంసారిక ఫలప్రదము కాదుగదా? కాబట్టి సాంసారిక ఫలభ్రష్టుడగును. ఆత్మప్రాప్తి నొసంగునందమా,

విమోహము వలన యోగము నుండి భ్రష్టుడగుటచే నదియును సిద్ధింపదు. ఒక పెద్ద మేఘమును విడిచి మరియొక మేఘములో చేరజాలక మధ్యనే గాలిచే నశించిన మేఘఖండమువలె వీడును నశించునా?

39. శ్లో. ఏతం మే సంశయం కృష్ణ ! । చ్ఛేత్తు మర్హస్యశేషతః ।
త్వదన్య స్సంశయస్యా స్య । చ్ఛేత్తా న హ్యుపపద్యతే ॥

అర్థము : కృష్ణ=శ్రీకృష్ణా! మే=నాయొక్క, ఏతం=ఈ, సంశయం=సందేహమును, అశేషతః=పూర్తిగా, ఛేత్తుం=పోగొట్టుటకు, అర్హసి=తగుచున్నావు, అస్య=ఈ, సంశయస్య = సందేహమునకు, ఛేత్తా=పోగొట్టువాడు, త్వదన్యః=నీకంటె నితరుడు, న ఉపపద్యతే=తగడుగదా.

తా॥ కృష్ణా! ఈ సందేహమును పూర్తిగా పోగొట్టుటకు నీవు తప్ప మరియొక డెవ్వడును అర్హుడుకాడు గావున నా సందేహమును తొలగింపుము.

అవ. అర్జునుని ప్రశ్నకు శ్రీకృష్ణపరమాత్మ విస్తరించి సమాధాన మొసంగుచున్నాడు.

శ్రీ భగవాన్ ఉవాచ- శ్రీకృష్ణుడు పలికెను.

40. శ్లో. పార్థ నై వేహ నాఽముత్ర । వినాశ స్తస్య విద్యతే ।
నహి కల్యాణకృత్కశ్చి । ద్దుర్గతిం తాత! గచ్ఛతి ।

అర్థము : పార్థ=అర్జునా! తస్య=వానికి, ఇహ=స్వర్గాదిభోగమందు, వినాశః=నాశము, నవిద్యతే ఏవ= ఉండనే యుండదు, అముత్రచ = బ్రహ్మానుభవమందును, న = నాశము కలుగనేరదు, తాత=నాయనా! కల్యాణకృత్= శుభమైన యోగమును చేయువాడు, కశ్చిత్=ఎవ్వడును, దుర్గతిం=చెడ్డగతిని, న గచ్ఛతి హి=పొందడుగదా!

తా॥ అర్జునా! అట్టివానికి స్వర్గాది భోగానుభవముగాని, ఆత్మానుభవముగాని లభింపక పోవుట యుండదు. ప్రత్యవాయము కలుగదు. ఇట్టి శుభమైన యోగము నారంభించినవాడు ఎన్నడును ఏవిధముగను చెడడు.

41. శ్లో. ప్రాప్యపుణ్యకృతాం లోకా । నుషిత్వా శాశ్వతీ స్సమాః ।
శుచీనాం శ్రీమతాం గేహే । యోగభ్రష్టోఽ భిజాయతే ॥

అర్థము : యోగభ్రష్టః = యోగభ్రష్టుడు, పుణ్యకృతాం=పుణ్యమును చేసినవారి యొక్క లోకాన్=లోకములను, ప్రాప్య= పొంది, శాశ్వతీః =అనేకములైన, సమాః =సంవత్సరములు, ఉషిత్వా=ఉండి, శుచీనాం పరిశుద్ధులగు, శ్రీమతాం=శ్రీమంతుల యొక్క, గేహే=గృహమందు, అభిజాయతే = పుట్టుచున్నాడు.

తా॥ యోగమును ప్రారంభించి భ్రష్టుడైనవాడు పుణ్యాత్ములు పొందెడు లోకమును పొంది యోగమునకు విరుద్ధముగా తా నభిలషించిన భోగములను యోగమహిమచే పెక్కువత్సరములు అనుభవించి తిరిగి తనకు యోగారంభమున కనుకూలించు శుచిగల శ్రీమంతుల యిండ్లలో పుట్టును.

42. శ్లో. అథవా యోగినా మేవ । కులే భవతి ధీమతామ్ ।
ఏతద్ధి దుర్లభతరం । లోకే జన్మ యదీదృశమ్ ॥

అర్థము : అథవా=లేక, ధీమతాం=జ్ఞానులగు, యోగినాం=యోగులయొక్క, కులేఏవ =గృహము నందే, భవతి=పుట్టుచున్నాడు, లోకే=లోకమునందు, ఈ దృశం= ఇటువంటి, జన్మ=పుట్టుక,యత్=ఏదికలదో (అది) దుర్లభతరంహి=మిక్కిలి దుర్లభము గదా!

తా॥ లేదా తా నాచరించిన యోగమహిమచే స్వయముగ యోగము నాచరించు నట్టియు, పరులకు యోగము నుపదేశింప జాలినట్టియు బుద్ధిమంతుల యింట బుట్టుచున్నాడు. ఇట్టిజన్మ ఇతర సామాన్య ప్రజలకు మిక్కిలి దుర్లభము గదా!

43. శ్లో. తత్ర తం బుద్ధిసంయోగం । లభతే పౌర్వదైహికమ్ ।
యతతే చ తతో భూయ । స్సంసిద్ధౌ కురునన్దన ! ।

అర్థము : కురునన్దన=అర్జునా! తత్ర=ఆ జన్మమునందు, పౌర్వదైహికం= పూర్వదేహము నందు కలిగిన, తం=ఆ, బుద్ధిసంయోగం= యోగబుద్ధితోడి కూడికను, లభతే=పొందుచున్నాడు, తతః=ఆ బుద్ధి సంయోగము వలన, సంసిద్ధౌ= మంచిసిద్ధినిమిత్తము, భూయః=తిరిగి, యతతే=ప్రయత్నించుచున్నాడు.

తా॥ అర్జునా! ఈ యోగభ్రష్టుడు ఆ జన్మమునందు తిరిగియోగమును గూర్చిన బుద్ధితో కూడుకొని మరల నిర్విఘ్నముగా యోగము సిద్ధించవలెనని ప్రయత్నించును.

44. శ్లో. పూర్వాభ్యాసేన **తేనైవ** । హ్రియతే హ్యవశోఽపి సః।
జిజ్ఞాసురపి యోగస్య । శబ్దబ్రహ్మాతివర్తతే ।

అర్థము : సః = ఆ యోగభ్రష్టుడు, అవశోఽపి=స్వాధీనములేని వాడైనను, తేన=ఆ యోగమునకు సంబంధించిన, పూర్వాభ్యాసేన=పూర్వజన్మాభ్యాసము చేతను,

ప్రియతే హి=ఆకర్షింపబడుచున్నాడు గదా! యోగస్య= యోగముయొక్క, జిజ్ఞాసుర పి=తెలియగోరువాడును, శబ్దబ్రహ్మ= దేవమనుష్యాది శబ్దములచే చెప్పబడు ప్రకృతిని, అతివర్తతే= అతిక్రమించు చున్నాడు.

తా॥ ఈ యోగభ్రష్టుడు క్రిందటి జన్మలో యోగము నభ్యసించు చుండెను, గాన ఆ యలవాటుచేతనే తాను తలంచకపోయినను మరల ఆయోగము వైపే ఆకర్షింపబడుచున్నాడు. యోగము నాచరింపకపోయినను దానిని తెలియగోరువాడుకూడ క్రమముగ ప్రకృతి బంధమునుండి ముక్తుడగును.

45. శ్లో. ప్రయత్నా ద్యతమానస్తు । యోగీ సంశుద్ధకిల్బిషః ।
అనేక జన్మ సంసిద్ధ । స్తతో యాతి పరాంగతిమ్ ।

అర్థము : తతః = అందువలన, సంశుద్ధకిల్బిషః=పూర్తిగాపాపములు పోయినవాడు, అనేక జన్మసంసిద్ధః=పెక్కు జన్మలకు యోగమునకు తగినవాడై, ప్రయత్నాత్=హెచ్చు పట్టుదలవలన, యతమానః=యోగమున ప్రయత్నించు, యోగీ తు= యోగియన్ననో, పరాంగతిం=గొప్పదైన యోగమును, యాతి=పొందుచున్నాడు.

తా॥ యోగముయొక్క మాహాత్మ్యమింత గొప్పది. కావుననే యోగ జిజ్ఞాసువు కూడ అనేక జన్మలకు పాపములను నశింపజేసుకొని యోగమునకు తగ్గవాడై మిక్కిలి పట్టుదలతో దాని ననుష్ఠించి దానినుండి చలించినను మరల నా యోగమును దాని ఫలమగు ఆత్మప్రాప్తిని తప్పక పొందును.

అవ. ఇట్లు యోగమును యోగిని పొగడి అర్జునుని యోగివికమ్మని ప్రోత్సహించి జీవాత్మయోగమును ముగించుచున్నాడు.

46. శ్లో. తపస్విభ్యోఽధికో యోగీ । జ్ఞానిభ్యోఽపి మతోఽధికః ।
కర్మిభ్యశ్చాధికో యోగీ ! తస్మాద్యోగీ భవార్జున ! ।

అర్థము : అర్జున=అర్జునా! యోగీ=యోగాభ్యాసము చేయువాడు, తపస్విభ్యః= తపశ్శాలుల కంటెను, అధికః=గొప్పవాడు, జ్ఞానిభ్యః అపి=జ్ఞానులకంటెను అధికః=గొప్పవాడుగా, మతః= తలంపబడినవాడు, యోగీ=యోగాభ్యాసి, కర్మిభ్యశ్చ=కేవలకామ్య కర్మలు చేయువారికంటెను. అధికః=గొప్పవాడు, (భవతి= అగుచున్నాడు) తస్మాత్=అందువలన, (త్వం=నీవు)యోగీ= యోగాభ్యాసపరుడవు, భవ-అగుము.

తా॥ చాంద్రాయణాది తపస్సులచేతను, ఆత్మజ్ఞానముకంటె ఇతర జ్ఞానముల చేతను, కేవల కామ్యకర్మలచేతను సాధింపబడు దానికంటెను అధికమగు

పురుషార్థమును ఈ యోగము సాధించుము. గాన తపస్వులు, జ్ఞానులు, కర్మఠులకంటె నీ యోగాభ్యాసి అధికుడు. కావున, అర్జునా! యోగివగుము

అవ. శ్రీకృష్ణపరమాత్మ ఇకముందు ఉపదేశించదలచిన ప్రధాన మోక్షసాధనమగు భక్తి యోగమును ప్రసంగించుచున్నాడు.

47. శ్లో. యోగినా మపి సర్వేషాం। మద్గతే నాన్తరాత్మనా।
శ్రద్ధావాన్ భజతే యో మాం। స మే యుక్తతమో మతః ॥

అర్థము : మద్గతేన=నన్నుపొందియున్న, అన్తరాత్మనా=మనస్సుతో, శ్రద్ధావాన్= శ్రద్ధకలవాడై, యః=ఎవడు, మాం=నన్ను, భజతే=సేవించుచున్నాడో, సః=వాడు, మే=నాకు, యోగినాం= యోగులకంటెను, సర్వేషామపి=తపస్విమొదలగు అందరి కంటెను, యుక్తతమః=మిక్కిలి శ్రేష్ఠుడని, మతః=తలచబడినవాడు.

తా॥ యోగపరిపాకావస్థనుబట్టి నాలుగు విధములుగా చెప్పబడిన యోగుల కంటెను, తపస్వి మొదలగు మూడువిధములగు వారి కంటెను నా యందు మనస్సు నిలిపి నన్ను పొందవలెనని త్వరపడుచు నన్ను ఉపాసించునట్టి భక్తుడు శ్రేష్ఠుడని నా యభిప్రాయము.

ఇతి శ్రీ భగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే
శ్రీకృష్ణార్జున సంవాదే ఆత్మసంయమయోగోనామ షష్ఠోఽధ్యాయః

ఇది ఉపనిషదర్థ ప్రతిపాదకమును, బ్రహ్మవిద్యయు, యోగశాస్త్రమును
శ్రీకృష్ణార్జున సంవాదరూపమును అయిన శ్రీభగవద్గీత యందలి
ఆత్మసంయమయోగమనెడు
ఆరవ అధ్యాయము

అర్జునుని శ్లోకములు	5	ఈ అధ్యాయమందలి శ్లోక సంఖ్య	47
భగవంతుని శ్లోకములు	42	ఇప్పటి మొత్తము శ్లోకముల సంఖ్య	280

శ్రీమద్భగవద్గీతా ప్రశ్నోత్తరావళి
ఆరవ అధ్యాయము

1. ప్ర. **ఈ యధ్యాయమునకు పేరేమి ? ఆ పేరెందులకుంచబడినది ?**

ఉ. ఈ యధ్యాయమునకు 'ఆత్మసంయమయోగము' అని పేరు. ఆత్మయనగా మనస్సు, సంయమ మనగా దానిని లెస్సగా నిగ్రహించుట. లెస్సగా యనగా ఆత్మకంటె వేరగు విషయముల నెంతమాత్రము తలంచక నిరంతర మాత్మనే ధ్యానించుచు ఆత్మరతి, ఆత్మతృప్తి, ఆత్మ సంతుష్టి కలదానినిగా జేయుట.ఇట్టి నిగ్రహమునకు సాధనములు, అనుష్ఠాన పద్ధతి, దానివలన లభించు ఫలము, దానికి అధికారము మొ॥ విషయము లీయధ్యాయమునందు విపులముగా విమర్శింపబడినవి. కావున నీయధ్యాయమునకు ఆ పేరుంచబడెను.

2. ప్ర. **ఈయధ్యాయమున జెప్పబడిన విషయములెవ్వి ?**

ఉ. ఇంతవరకు కర్మయోగమును సాంగోపాంగముగా నుపదేశించి యీ యధ్యాయమున ఆ కర్మయోగమునకు ఫలమగు యోగమనబడు ఆత్మసాక్షాత్కారమును గూర్చి సమస్త పరికరములతో తెలుపుచున్నాడు.
1) మొదటి తొమ్మిది శ్లోకములచే కర్మయోగము ఒకదాని యపేక్ష లేకయే ఆత్మసాక్షాత్కారమునకు స్వతంత్ర సాధనమని దృఢపరచుటకు వెనుకటి యధ్యాయమున చెప్పబడిన విషయములనే తిరిగి చెప్పుచున్నాడు. కర్మయోగి యొక్కడే కర్మయోగి జ్ఞానయోగి రెండును కాగలడు. జ్ఞానయోగి జ్ఞానయోగియేగాని కర్మయోగి కానేరడు అని చెప్పుట. (6అ.1 శ్లో)

అందుకు కారణ మా కర్మయోగములో జ్ఞానాంశ ప్రధానముగా నుండుటయేయని చెప్పుట. (6అ.2శ్లో.)

కర్మయోగమే యే ప్రమాదము లేకుండ ఆత్మసాక్షాత్కారమును సాధించునని చెప్పుట. (6అ. 3శ్లో.)

యోగారూఢు డెప్పుడగునో జెప్పుట. లేక యోగారూఢుఢగుటకు ఉపాయమును చెప్పుట. (4. శ్లో.)

ఆత్మోజ్జీవనమునందు మనస్సునకు గల సంబంధమును చెప్పుట. (5, 6 శ్లో.)

యోగప్రక్రియను చెప్పదలంచి దానిని ప్రారంభించుటకు కావలసిన ఇంద్రియ నిగ్రహమును ద్వంద్వసహనమును జెప్పుట. (7 శ్లో.)

ఆ రెండింటికిని వలయు సాధనములను జెప్పుట. (8 శ్లో.)

2) ఈయధ్యాయమునకు ప్రధానార్థమగు యోగాభ్యాసవిధిని దానికి కావలసిన సాధనములతో జెప్పుట. (10శ్లో.మొ.28శ్లో.వ.)

బాహ్యోపకరణములను మనస్సుయొక్క ఏకాగ్రతను జెప్పుట. (11.12 శ్లో.)

శరీరమును గూర్చియు మనస్సును గూర్చియు పాటించవలసిన నియమములను జెప్పుట. (13 శ్లో.మొ 17శ్లో.వ.)

3) యోగమునందు అందరకును ఆదరము కలుగుటకొరకు ఇదియే నిరతిశయపురుషార్థమని విస్తరించి చెప్పుట. (20,21,22,23,28 శ్లో.)

4) వెనుక చెప్పబడిన మమకారము లేకుండుట మొదలగు యోగసాధనములనే తిరిగి సుఖముగ నెరుంగుటకై క్రోడీకరించి చెప్పుట. (24 మొ. 27 శ్లో.వ.)

5) యోగాభ్యాసవిధిని సవిస్తరముగా జెప్పి ఇకముందు నాలుగు శ్లోకములచే ఆత్మలన్నియు తమలోతాము పరమాత్మతోను సమానముగా నుండునని చూచుటయే యీ యోగము యొక్క పరిపాకావస్థగాన ఆ యవస్థయొక్క క్రమపరిపాకమును నాల్గు తరగతులుగా విభజించి చెప్పుట. దానిని బట్టియే యోగులును నాలుగు తెరంగులని చెప్పుట. (29,30,31,32 శ్లో.)

6) యోగసాధనములలో ప్రధానమగు మనోనిగ్రహము దుశ్శకమగుటచే దాని కుపాయమును చెప్పుమని అర్జునుడడుగుట దానికి శ్రీకృష్ణపరమాత్మ సమాధానమొసంగుట (33 శ్లో.మొ.36శ్లో.వరకు)

7) ఈ యోగము యొక్క మాహాత్మ్యము నెఱుంగగోరి అర్జునుడు ప్రశ్నించుట (37మొ.39 శ్లో.వరకు)

8) దానికి శ్రీకృష్ణపరమాత్మవిస్తరించి సమాధాన మొసంగుట. (40శ్లో.మొ.45శ్లో వ.)

9) ఇట్లు యోగమును యోగిని పొగడి అర్జునుని యోగివి కమ్మని ప్రోత్సహించి జీవాత్మయోగమును ముగించుట. (46శ్లో.)

10) రెండవ షట్కములో ఉపదేశింప దలచిన ప్రధానమోక్షసాధనమగు భక్తియోగమును ప్రసంగించుట. (47శ్లో.)

3.ప్ర. ఈ అధ్యాయమునకు క్రిందటి అధ్యాయముతోను, ప్రధాన శాస్త్రార్థముతోను గల సంబంధమేమి ?

ఉ. ఐదవఅధ్యాయమున సాంగోపాంగముగా కర్మయోగము నుపదేశించెను. ఇప్పుడా కర్మయోగమునకు ఫలమగు సమాధియనబడు యోగము (ఆత్మ దర్శనము)ను గూర్చి చెప్పవలసియున్నది. ఇది ఐదవ అధ్యాయమునందే

27,28 శ్లోకములలో నుపక్రమింపబడినది. అదియే యిప్పుడు బాహ్యాభ్యంతర సాధనములతోను, అనుష్ఠించ వలసిన క్రమముతోను, దానివలన కలుగు ఫలవైభవముతోను చెప్పబడుచున్నది. కావున యీ యధ్యాయము ఐదవ యధ్యాయముతో సాక్షాత్తుగా సంబంధించి యున్నది.

ప్రధానశాస్త్రార్థమగు ముక్తికి సాక్షాత్సాధనమైన భక్తికి జీవాత్మ సందర్శన మంగము. ఆ సందర్శనము ధ్యానముచే సిద్ధించును. ఆ ధ్యానము స్థల, ఆసన, ఆహార విహార, అహంకారమమకారత్యాగాది బాహ్యాభ్యంతరపరికరములలో సాధింపవలసినది. అవి యన్నియు నీయధ్యాయమున సవిస్తరముగా జెప్పబడినవి గాన యీ యధ్యాయమునకు ప్రధాన శాస్త్రార్థముతో పరంపరాసంబంధము కలదు.

4.ప్ర. జ్ఞానయోగ కర్మయోగములకు గల పరస్పర సంబంధ మీ యధ్యాయమున నెట్లు చూపబడెను ?

ఉ. పరమపురుషసమారాధనబుద్ధితో కర్మయోగము ననుష్ఠించుచున్నవాడు కర్మయోగనిష్ఠుడును, జ్ఞానయోగనిష్ఠుడును కాగలడు. కాని కేవల జ్ఞానయోగనిష్ఠుడు, కర్మయోగనిష్ఠుడు కానేరడు. (1.శ్లో.)

జ్ఞానయోగమందు కర్మయుండదుగాని కర్మయోగమునందు జ్ఞానము కూడగలదు. ఎందుకనగా- ఆత్మయొక్క వాస్తవస్థితి నెఱింగి దేహాత్మభ్రమను పోగొట్టుకొనినవాడే కదా కర్మయోగి యగునది. (2.శ్లో)

ఆత్మసాక్షాత్కారమును బడయగోరువాడు దానిని లభించువరకు కర్మలను నిష్కామముగా చేయుచునే యుండవలెను. అది ఫలించినచో నాతనికి కర్మలనవసరము. (3 శ్లో.)

5.ప్ర. ఎట్టివానిని యోగారూఢు డందురు ?

ఉ. సకల సంకల్పములను పరిత్యజించి ఆత్మకంటె వేరైన ప్రాకృత భోగములయందును, వాటికి సంబంధించిన కర్మలయందును ఆసక్తిలేనివాడు యోగారూఢుడని చెప్పబడును. (4 శ్లో.) (ఈతనికి కర్మలాచరింప నవసరములేదు)

6.ప్ర. ఆత్మోజ్జీవనమునందు మనస్సునకు గల సంబంధమేమి ?

ఉ. ఆత్మను అధోగతిని పొందించరాదు. దాని నుద్ధరించవలెను. అందులకు సాధనము మనస్సే. అది వశమైయున్నచో ఆత్మకు మిత్రము. కానిచో శత్రువు. (5.శ్లో.)

అది వశముగుటకు దానిని విషయములను తలంచనీయరాదు. దానిని యథేచ్ఛగా విడిచి యూరకున్నచో, అది మోక్షమునకు విరుద్ధమైన మార్గములలో ప్రవర్తించి శత్రువునకు మించిన అపకారమును చేయును. (6.శ్లో.)

7.ప్ర. యోగము నారంభించుటకు తగిన స్థితిని శ్రీకృష్ణుడెట్లు వర్ణించెను ?

ఉ. చలి-వేడి, సుఖము-దుఃఖము, గౌరవము-అగౌరవము మొదలగు జంటలకు ద్వంద్వములనిపేరు.

ఇవి దేహమున్నంతవరకు వచ్చుచు పోవుచుండును. కాని వీటిచే మనస్సునకు యేవిధమగు వికారములును కలుగకూడదు. దానితోపాటు కన్ను ముక్కు మొదలగు బాహ్యేన్ద్రియముల వ్యాపారములను కూడ విడువవలెను. ఇట్లున్నచో యోగము నారంభింపవచ్చును. (7.శ్లో.)

దేహముకంటె వేరైన ఆత్మయొకటి కలదను బుద్ధికి జ్ఞానమని పేరు. ఈ యాత్మనిత్యమైనది. ఆనందస్వరూపమైనది . కావున నిది ప్రకృతికంటె విలక్షణమైనది అనెడు బుద్ధికి విజ్ఞానమనిపేరు. జ్ఞానము కామ్యకర్మలు చేయువారికిని, విజ్ఞానముమోక్షమును కోరువారికిని, మిక్కిలి ఆవశ్యకము.

ఇట్టి జ్ఞాన విజ్ఞానములచే తృప్తిచెంది యుండవలెను. దానివలన ఇంద్రియములను జయించవలెను. కూటమువలె ఆత్మ, యే శరీరమందున్నను, ఒకేవిధమగు జ్ఞానాకారముతో వెలుంగుచుండునని యెఱుంగవలెను. రాతిని బెడ్డను చూచినట్లు బంగారమును జూడవలెను. (8.శ్లో.) (కూటము అనగా కంసాలి-కమ్మరియు, వెండి బంగారము రాగి ఇనుము మొదలగు వస్తువులు చేయుటకు వాడుకొను యినుపదిమ్మ. దీనియందెన్నియో వస్తువులు చేయబడుచుండునుగాని యిది మాత్రమే వికారమును జెందక ఒకేరీతిగనుండును. అట్లే ఆత్మయు కర్మాను గుణముగా దేహాది శరీరములను నిర్మించుకొనుచున్నను అవి పెరుగుచు తరుగుచు విరుగుచు నుండునే కాని ఆత్మమాత్రము తన జ్ఞానస్వరూపమునకు మార్పు లేకయే అన్నిట ననువర్తించు చుండును. కావుననే కూటస్థుడనగా ఇట్లు ఆత్మ స్వరూపమును అనుసంధించువాడు.)

'సుహృత్' అనగా-వయస్సులో తారతమ్యముకలిగి తన హితమును కోరువాడు. 'మిత్రుడు' సమానవయస్సుకలిగియుండి హితమును కోరువాడు. 'అరి' ఏదోయొక కారణముచే మన యనర్థమును కోరువాడు. ఉదాసీనుడు మనకుకీడునుగాని మేలునుగాని కోరుట కే ప్రసక్తి లేనివాడు. మధ్యస్థుడు జన్మచేతనే మనకు మేలునుగాని కీడునుగానికోరనివాడు. ద్వేష్యుడు పుట్టుక

తోడనే మన యనిష్టముల నారయువాడు. బంధువు-పుట్టుకతో మన-మేలును కోరునట్టివాడు.

సత్పురుషులు, పాపాత్ములు-తాను ఆత్మయొక్కటియే కావలసినవాడగుటచే వీరివలన తనకు వచ్చునది పోవునది లేదుగాన వీరితో మిత్రత్వముగాని శత్రుత్వముగాని లేనందున అందరిని సమానముగా తలంచవలెను. (9. శ్లో.)

ఇట్టి యోగ్యత కలవాడే యోగము నారంభించుటకు తగినవాడు.

8.ప్ర. యోగాభ్యాసమునకు కావలసిన అంతర బాహ్యోపకరణము లేవి ?

ఉ. ఇంతవరకు చెప్పబడిన నిష్ఠకలవాడు ప్రతిదినము యోగాభ్యాసమునకు తగిన సమయమున విడువకుండ నిశ్శబ్దముగానుండు ప్రదేశమునందు ఒంటరిగా నుండి ఇతర చింతలు వీడి ఏ వస్తువును కోరక అన్నిటియందును మమకారములేక ఆత్మదర్శనమునందే నిష్ఠకలవాడై యుండవలెను. (10.శ్లో.)

తాను యోగమునకు నిర్ణయించుకొనిన ప్రదేశము ఆచారహీనుల సంపర్కము లేక యుండవలెను. తాను కూర్చొను పీట మిక్కిలి యెత్తుగాని పల్లముగాని లేనట్లు కర్రతో వేయబడి యుండవలెను. అది గట్టిగా నుండును గాన దానిపై మెత్తగ నుండుటకై బట్టను, అది ముడుతలు పడకుండుటకును శుద్ధికొఱకును కృష్ణాజినమున్ను ఇంకను శుద్ధికిని సత్వగుణాభివృద్ధికిని దర్భాసనమునున్ను వేసుకొనవలెను, లేదా ముందుగనే పవిత్రత సత్వగుణములకొఱకు దర్భలనుపరచి గ్రుచ్చుకొనకుండుటకై చర్మమును, ఇంకను మెత్తగా నుండుటకై బట్టను పరచి కొంచెము చేరబడి కూర్చొనవలెను. (11,12 శ్లో.)

ఆ కూర్చొనుటయు వెన్ను మెడ తల వంపులేక తిన్నగా కదలకుండా నుంచి దిక్కులకు చూడక తన ముక్కుకొనయందే దృష్టినినిల్పి శాంతమనస్కుడై భయము లేక బ్రహ్మచర్యనిష్ఠతో చిత్తము నీశ్వరాయత్తముగావించి సావధానముగా ధ్యానించవలెను. హెచ్చుగ తినిన నిద్రయు బద్ధకమును వచ్చును. అసలే తినకున్న నీరసముతో నేపనియు చేయబుద్ధిలేకుండును. నిద్రబోతునకు మొదలే సున్న. అసలే నిద్రించనిచో నిద్రమత్తుతో నేదియు సాగదు. కొంచెమైనను సంచారముగాని, యోగమునకు ప్రతికూలముకానిదియగు వినోదముకాని లేకున్నచో కునికిపాటు వచ్చును. కావున మితాహారము. మితవిహారము. మితనిద్ర, పరిశ్రమ కలిగియుండవలెను.

(13 శ్లో.మొ.17 శ్లో.వరకు)

చిత్తము నాత్మయందే చలించక యుంచిన ఇతర చింతలుండవు. అప్పుడు గాలిలేనిచోట దీప మెట్లు చలించక ప్రభతో వెలుంగుచుండునో అట్లే యాతని యాత్మయు నిశ్చలమైన (అనగా-తనయందున్న జ్ఞానము వివిధముగా ప్రసరించకుండుట.) ప్రభవంటి జ్ఞానముతో ప్రకాశించును. (18,19 శ్లో.)

9. ప్ర. పరమాత్మ ఈ యోగము నెట్లు నిరతిశయ పురుషార్థమని ప్రశంసించెను ?

ఉ. ఈ యోగము అభ్యాసకుని మనస్సును ఇతర విషయముల నుండి మరలించి ఇంతకు మించిన సుఖ మింకొకటిలేదని దీనియందే రమింపజేయును.

ఇది మనస్సును నిర్మలము గావించి ఆత్మను చూపించి దానియందే సంతోషింపజేయును.

ఇది యింద్రియములకు గోచరించక కేవలము ఆత్మబుద్ధికిమాత్రమే గోచరించు గొప్ప సుఖము ననుభవింపజేయును.

ఇది తనయందు నిష్ఠకలవానిని ఆ స్థితినుండి విరమించనీయదు. ఇది విరమించియున్న కాలమున తనను తిరిగి యెప్పుడు ప్రారంభించిననూ, యింతకుమించిన లాభమొకటి యున్నదా! యనిపించుచుండును.

ఇది గుణవంతుడగు పుత్రుడు మరణించుట యంతటి గొప్ప దుఃఖము తటస్థించినను చలించనీయదు.

ఇట్లు దుఃఖసంబంధము నెంతమాత్రమును దరిజేర నీయనిదీ యోగము. కావున ఇట్లెటింగి ఉత్సాహపూరితమగు హృదయముతో దీనినభ్యసింప వలయును. (20,21,22,23. శ్లో.)

ఇట్లభ్యసించినచో పాపములన్నియు నశించి నిరతిశయమగు బ్రహ్మానుభవసుఖము అనాయాసముగా నెల్లవేళల అరచేతిలోని యరటి పండగును. (28 శ్లో.)

10. ప్ర. ఆత్మయోగము నభ్యసించు పద్ధతి యెట్టిది ?

ఉ. కామములు - సంకల్పజములు, స్పర్శజములు అని రెండు విధములు, సంకల్పజము లనగా- 'నావి' అనుకొనుటచే కలుగు పశుపుత్రకళత్రాదులు. వీటిని సంపూర్ణముగా విడువవచ్చును. స్పర్శజము లనగా - ఇంద్రియములకు విషయసంపర్కముచే కలుగు శీతోష్ణాదులు. వీటిని విడుచుట యసంభవము. అయినను అవి కలుగునప్పుడు వాటివలన కలుగు సంతోషమును దుఃఖమును

మాని ఇంద్రియములను విషయములకు దూరము గావించి వివేకబుద్ధితో మనస్సును గూడ మెల్లమెల్లగా ఆత్మేతరముల నుండి మరల్చి ఆత్మయందుంచవలెను. (24, 25 శ్లో.)

మనస్సు చంచలించు స్వభావముగలది. అందుచే నది ఆత్మయందు నిశ్చలముగ నుండక విషయాసక్తితో బయలు వెడలుచుండును. అందుచే మన మా వస్తువుల యందలి దోషములనే జూచియు, ఆత్మయందలి నిరతిశయసుఖమును భావించియు మనస్సును ఆత్మకు వశపరచి స్థిరపరచవలెను. (25 శ్లో.)

ఇట్లుంచినచో పాపములన్నియు దగ్ధమై వాటికి ఉటస్థానమగు రజోగుణము నశించి ఆత్మస్వరూపానుభవ రూపమైన గొప్పసుఖము లభించును. (27 శ్లో.)

ఇట్లు యోగాభ్యాస ప్రభావముచే కలిగిన సుఖము, ఆత్మానుభవరూపమై సాక్షాత్కారమైన పిమ్మట ఇంతకు మించినది లేదనిపించి, అనాయాసముగా సిద్ధించి ఇక నెన్నటికిని విచ్ఛిన్నము గాకుండయుండును. (28 శ్లో.)

ప్ర. **యోగముయొక్క క్రమపరిపాకావస్థ లెట్లు వర్ణింపబడెను? వాటికి గల పరస్పర తారతమ్యమేమి ?**

ఉ. ఆత్మలన్నియును జ్ఞానమొక్కటియే ఆకారముగా గలవి. దేవుడు, మనుష్యుడు, పశువు, పక్షి, చెట్టు, పుట్ట యనెడు భేదములు కర్మచే కలిగిన శరీరమునకు సంబంధించినవి. కావున తన ఆత్మకును ఇతరభూతముల యందుండు ఆత్మలకును సహజముగా సామ్యము కలదు. దానిని యోగి తన అభ్యాసముచే నీరహస్యమును ప్రత్యక్షముగా జూడగల్గును. ఈతడు యోగమునందు తన యాత్మనొక్కటినే గాంచినను స్థాలీపులాక న్యాయముగా అన్నిటిని చూడకున్నను జూచినట్లే యగును. (29 శ్లో.)

(స్థాలీపులాకన్యాయమనగా-స్థాలియనగా గిన్నె. పులాకమనగా మెతుకు. అన్నమును వండునపుడు అందుండు ఒక మెతుకు నెత్తిజూచి అది ఉడికినచో ఆ గిన్నె యందున్న మెతుకులన్నియు ఉడికినట్లు నిశ్చయించుట.)

ఇట్లు కర్మవశమున కలుగు ప్రకృతి పరిణామభేదము ఆత్మలకు లేదనియు కావున నవి జ్ఞానద్రవ్యములగుటచే ఒకే రూపము కలవనియు చెప్పి వానికి దేవాదిభేదములు వచ్చుటకు కారణము పుణ్య - పాపములు గావున అవి పోయినచో ఆత్మలన్నియు పరమాత్మతో పూర్తిగ పోలియుండునని గ్రహించుట రెండవయవస్థగా చెప్పుచున్నాడు.

యోగి తన ఆత్మస్వరూపమును చూచుచుండును. నాకును దానికిని స్వరూపములో భేదమెంతమాత్రమును లేదు. కావున ఆతడికి నన్ను చూడకుండుటెట్లు ? నేను నన్నెప్పుడును చూచుకొనుచునే యుందును. నా స్వరూపము యోగిస్వరూపముతో సమానమే. కావున నేనిక ఆ యోగి నెట్లు చూడకయుందును ? అనగా పరమాత్మ యిట్టి యోగిని ఊరక చూచుట మాత్రమేగాక తనతో సమానునిగా చూచునని భావము. (30.శ్లో.)

కర్మకు వశుడుకాని దశలో జీవుడు ఈశ్వరునితో సమానమైనవాడని చూచుట రెండవదశగా చెప్పి, యిప్పుడు కర్మయనబడు అవిద్యావరణము నివర్తించగానే జీవుని జ్ఞానమునకు సంకోచముండదు గాన పరమాత్మతో సామ్యదర్శనమును, ఆ సంస్కారబలముచే యోగమును విడిచి సాంసారిక ప్రవృత్తులలోనున్నను ఆ యనుసంధానము అనువర్తించుచునే యుండుననియు మూడవదశగా జెప్పుచున్నాడు.

పరమాత్మయొక్క జ్ఞానమెప్పుడును సంకోచము లేక యుండును. జీవుని జ్ఞానము కర్మవలన సంకోచించియుండును. జీవాత్మ పరమాత్మ లకిట్టి ప్రసిద్ధ తారతమ్యముగలదు. కాని ఆ కర్మలు నశించి తన జ్ఞానము వికసించిననాడు తారతమ్యమేది ? ఇట్టిస్వరూపమును దృఢముగా దర్శించుటచే గలుగు సంస్కారబలముచే యోగి యోగమును విడిచి లేచి లౌకిక విషయములో ప్రవర్తించు తన్నును, సర్వభూతములను చూచుచున్నను పరమాత్మనే చూచుచున్న వాడగును. (31. శ్లో.)

పరులసుఖదుఃఖములెట్లు తమకు సంబంధించవో అట్లే తన సుఖ దుఃఖములను తనకు సంబంధించనివిగా చూచు యోగి, యోగము యొక్క సర్వోత్తమమైన పరిపాకదశను పొందిన మహాత్ముడే. ఇట్లనుసంధించుటకు కారణము ఆత్మలన్నియు సంకోచించని జ్ఞానాకారము కలవగుటచే సమానము లగుటయే. యోగ పరిపాకావస్థలకు పరస్పర తారతమ్యము :-

1) ఆత్మలన్నియు జ్ఞానాకారములైనవియు ఆనందరూపములైన వియు అగుచున్నవి. పైన గనపడు దేవమనుష్యాది వైషమ్యము ప్రకృతి వలన కలుగును. ప్రకృతి సంబంధము పోయిననాడు ఆత్మలన్నియు తమలోతాము సమానములైనవియే. ఇట్లు గాంచుట మొదటి యవస్థ.

2) పుణ్యాపాపములెల్ల నశించి నిజరూపముతో వెలుగుచున్న ఆత్మ వస్తువు లన్నియు పరమాత్మతో సమానములైనవి యని చూచుట రెండవ

3) యోగి, యోగమును విడిచి లౌకిక విషయములయందు ప్రవర్తించు చున్నను యోగానుసంధానబలము చేత సమస్త భూతములను పరమాత్మతో సమానములైనవి యని గాంచుట మూడవ యవస్థ.

4) పరుల సుఖదుఃఖములెట్లు తనకు సంబంధించవో అట్లే తన సుఖదుఃఖములను తనకు సంబంధించనివిగా నెంచుట ఈ యోగము యొక్క సర్వోత్తమమైన పరిపాకావస్థ.

12) ప్ర. అర్జునుడు మనస్సును గూర్చి ఎట్లు ప్రశ్నించెను ? దానికి శ్రీ కృష్ణుడెట్లు సమాధానమొసంగెను ?

ఉ. అర్జునుడు శ్రీకృష్ణుని కృష్ణా! ఇదివరకంతయు ఆత్మలన్నియు వేరువేరు రూపములు కలవనియు, ఈశ్వరస్వరూపముతో వీటికి సంబంధము లేదనియు తలంచుచుంటిని. ఇప్పుడందులకు విపరీతముగా సమదర్శనమును నీవు ఉపదేశించుచున్నావు. నీ ఉపదేశము అర్థమైనది గాని చిత్తశుద్ధిలేక నా మనస్సు దాని యందు స్థిరముగా నిలుచుటలేదు. కృష్ణా! అలవాటుపడిన విషయములలోనే నిలకడగా యుండని యీమనస్సు యింక నిట్టి విషయములయందా నిలుచునది? నిలువదు సరికదా బలవంతముగా చికాకుపరచి మరియొకచోటునకు మరలిపోవును. దీనిని వశపరచుకొనుట ప్రతికూలమైన పెద్దగాలిని విసనకఱ్ఱతో అడ్డుటవంటి వెఱ్ఱిపని యని కూడా తోచుచున్నది. కావున నీ వేదైనను దీనిని కట్టిబెట్టు ఉపాయమును తెలుపుము అని ప్రశ్నించెను.

శ్రీకృష్ణుడు అర్జునుని ప్రశ్నను ఆమోదించి అర్జునా! దానిని జయించని వాడెంత బలవంతముచేతనైనను నేను జెప్పిన యోగమును బడయజాలడు. కూడనివస్తువులయందలి దోషములనే మాటిమాటికి అనుసంధించుచు అవి అనర్థములని చూపి మనస్సునకు, వాటియందు అసహ్యమును పుట్టించును. ఆత్మయొక్క నిత్యత్వ, జ్ఞానత్వ, ఆనందత్వాది గుణములను నిరంతరము అనుసంధించుట నలవాటు పరచుకొని అది అత్యంతము అనుకూలమైనదని చూపి దానియందాసక్తిని వృద్ధిపరచును. పిమ్మట నేను నీకు సమగ్రముగా నుపదేశించిన నా యారాధన రూపమగు కర్మయోగమును ఆచరింపుము.దానిచే నీవు ఇప్పుడు చెప్పిన యోగము యొక్క ఉత్కృష్ట యవస్థయగు సమదర్శనమును పొందగలుగుదువు. అని ఉపదేశించెను.

(35, 36 శ్లో.)

13. ప్ర. యోగమాహాత్మ్యము నెఱుంగగోరి అర్జునుడెట్లు ప్రశ్నించెను ? దానికి శ్రీ కృష్ణపరమాత్మ యొసంగిన సమాధానమేమి ?

ఉ. కృష్ణా! ఒకడు ఆత్మసాక్షాత్కారమును బడయవలెనను పేరాశతో పూర్తిగ మనశ్శుద్ధిలేకయే యోగములో ప్రవేశించును. ఫలాపేక్షలేక యథావిధిగా కర్మయోగమును ఆచరించును. కాని మనశ్శుద్ధిలేక కొంతకాలమునకు ఫలాపేక్ష జనించి యోగభ్రష్టుడగును. వాడు ఫలమునందు కోరిక లేకుండ కర్మలనాచరించుటచే నవి స్వర్గాదిఫలముల నొసంగజాలవు. మధ్యలో విడుచుటచే ఆత్మప్రాప్తియు వానికిలేదు. ఇట్టివాడు కామభోగ, మోక్ష నరకములలో నేగతిని పొందును ? అని యడిగెను. (37-39 శ్లో.)

అందులకు శ్రీకృష్ణుడు అర్జునా! శుభరూపమగు నీ యోగమును శ్రద్ధతో ప్రారంభించినవాడు తాను కోరిన స్వర్గాధిఫలములనుగాని, ఆత్మానుభవమునుగాని పొందకపోడు. వానికేవిధమగు ప్రత్యవాయము (అనర్థము)నులేదు. ఇకవానికి దుర్గతియెట్లు ? అట్టివాడెట్టి భోగములను ఆశించి యోగభ్రష్టుడయ్యెనో అట్టి భోగములకంటె మిక్కిలి గొప్ప భోగములను తనివి తీరునంత కాలము ఆయా లోకములలో నుండి యోగమహిమచే అనుభవించును. వానియందు అసహ్యము పుట్టగనే తిరిగి భూలోకమునకు వచ్చి యోగారంభదశలో భ్రష్టుడైనవాడు తనకు మరల యోగము నభ్యసించుటకు అనుకూలమైన శుచిగల శ్రీమంతుల యిండ్లలో పుట్టును.

యోగము పరిపక్వమగు సమయములో దాని నుండి చలించినవాడు యోగము నాచరించుచున్నవారింట బుట్టును. వారే వీనికి యోగము నుపదేశింతురు. ఇది వీనికి ఆచరించిన యోగమహత్తుచే గలుగును గాని యితరులకు దుర్లభము. ఇట్లు పుట్టి పూర్వజన్మమునందు తానారంభించి విడిచిన యోగమునందు తనకు తెలియకనే ఆకర్షింపబడును. పూర్వజన్మమునందు చేసినవి సామాన్యులచే మరువబడును గాని పుణ్యాత్ముల కట్టి మరుపు కలుగదు. నిదురపోయి లేచినవాడు నిదురించుటకు ముందుచేయుచున్న పనినే మేలుకొన్న పిదప మరువక చేయును గదా! అట్లే యీ యోగియును. (దీనికే సుప్తప్రబుద్ధ న్యాయమని పేరు.) ఇట్లు పూర్వజన్మ స్మృతిచే పుణ్యాత్ములు పూర్వానుభవమును చేయుచుందురనుటకు ఆది భరత, విదుర, భీష్మాదులే మనకు నిదర్శనము.

(40 మొదలు 43 శ్లో. వ.)

ఈ యోగమున కింకొక గొప్పతనము కలదు. యోగము నాచరించవనే యవసరములేదు. తెలుసుకొనవలెనను కోరిక కలిగి చలించి పోయినవాడైనను

జన్మాంతరమున తిరిగి ఆ కోరికను బడసి కర్మయోగము నాచరించి యోగము ననుష్ఠించి క్రమముగా ప్రకృతి బంధమునుండి విముక్తుడగు చున్నాడు. (44, 45శ్లో.)

ఇట్టి యోగమహిమ చాంద్రాయణాది తపస్సునకుగాని, ఆత్మజ్ఞానములేని ఇతర జ్ఞానములకుగాని. అశ్వమేధాది కర్మలకుగాని లేకుండుటచే వాటినాచరించు వారందరికంటె యీ యోగియే అధికుడు గాన అట్టియోగివి కమ్మని శ్రీకృష్ణుడర్జునుని ప్రోత్సహించెను. (46 శ్లో.)

14.ప్ర. చివర కెట్టియోగి శ్రేష్ఠుడని శ్రీకృష్ణుడు నిర్ణయించెను? ఆ నిర్ణయమునకు అవసరమేమి?

ఉ. భగవంతునియందలి ప్రేమాతిశయముచే భగవంతునే ధ్యానించుచు ఆతనిని పొందుటకు తహతహలాడుచు భగవంతుని భజించువాడు వెనుక చెప్పబడిన నాలుగు విధముల యోగులకంటెను , తపశ్శాలులు మొదలగు వారికంటెను శ్రేష్ఠుడని తన యభిప్రాయముగా శ్రీకృష్ణపరమాత్మ నిర్ణయించెను. అనగా వారందరకును తమలో హెచ్చుతగ్గులున్నను భక్తియోగితో పోల్చినపుడు మాత్రము వారందరును ఈతనికంటె తక్కువయే.

ఈ భక్తునిగూర్చి వివరములు మధ్యషట్కములో విస్తారముగా చెప్పబడును. దాని నిచ్చట పరమాత్మ సూచించెను. అట్లు సూచించనిచో ఇంతవరకు విస్తారముగా ఫలపర్యవసానముగా చెప్పివిడిచిన జీవాత్మ యోగమునకు మించినది లేదని శ్రోత చరితార్థుడై యింతటితో విరమించుననుభయముతో యిది ముగించిన వెంటనే పరమాత్మ దానిని సూచించెను.

సప్తమాధ్యాయార్థ సంగ్రహము

శ్లో. స్వయాథాత్మ్యం ప్రకృత్యాఽస్య । తిరోధి శ్శరణాగతిః ।
భక్తభేదః ప్రబుద్ధస్య । శ్రైష్ఠ్యం సప్తమ ఉచ్యతే ।

అర్థము : స్వయాథాత్మ్యం = పరమపురుషుని వాస్తవస్వరూప నిర్ణయమున్ను, ప్రకృత్యా= ప్రకృతిచే, అస్య = ఈ భగవంతుని స్వరూపము యొక్క, తిరోధిః = మరుగుపరచబడుటయు, శరణాగతిః = దానిని తొలగించుటకు సాధనమగు శరణాగతియు, భక్తభేదః = భక్తులలో తారతమ్యమున్ను, ప్రబుద్ధస్య = జ్ఞానియొక్క, శ్రైష్ఠ్యం = ఉత్తమత్వమున్ను, సప్తమే = ఏడవ అధ్యాయమునందు, ఉచ్యతే = చెప్పబడుచున్నది.

తా ॥ ఈ ఏడవ అధ్యాయమున ఉపాసింపబడు భగవంతుని యథార్థస్వరూపము, అది ప్రకృతిచే మనకు మరుగుపరచబడి యుండుట, దానిని తొలగించు సాధనమగు శరణాగతి, భగవద్భక్తులలో గల తారతమ్యము, అందు జ్ఞాని యొక్క గొప్పతనమున్ను చెప్పబడుచున్నవి.

శ్రీమద్భగవద్గీతా సప్తమాధ్యాయము

విషయసూచిక

అట్టిప్రపత్తి అనేక జన్మలలో నార్జింపబడిన మహత్తర పుణ్యావిశేషములచే లభించును
(ప్రపత్తి యనగా భగవంతుడే తనను రక్షించునను మహా విశ్వాసముతో తన రక్షణ నొకింతయు తాను చేసుకొనకయుండుట)

10. ఉపాసకులలో గల పరస్పర వైలక్షణ్యము. ఆవైలక్షణ్యము వారభిలషించు ఫలభేదమునుబట్టి వచ్చుచున్నది. 16

ఫలభేద మెట్టిదనగా - కొందరైశ్వర్యమును, కొందరు ఆత్మయాథాత్మ్యమును, మరికొందరు భగవత్ప్రాప్తిని కోరుదురు. అట్లు కోరుటకు కారణము వారివారి పుణ్యవిశేషమే.

11. ఇందు భగవత్ప్రాప్తి నభిలషించువాడు ఉత్తముడు. 17–18

ఏలయన--వాడనిన భగవంతునకు మిక్కిలి ఇష్టము. అందులకు కారణము -- వాడు నిత్యయుక్తుడును ఏకభక్తియు నగుటయే. నిత్యయుక్తుడు - నేనే వానికి ఫలమగుటచే నాతో వానికి సంబంధము ఎడతెగనిది. ఇతరులకు నాతో సంబంధము, వారికి కావలసిన ఫలము చేజిక్కువరకే.

ఏకభక్తి=నాయందే భక్తి. ఇతరులకైతే భక్తి, తాము కోరువస్తువుల యందును, వాటిని యిచ్చువాడనుగాన కొంత నాయందును. 19–27

12. ఇట్టివాడు చిక్కుట మిక్కిలి యరుదు.

13. ఐశ్వర్యార్థులకును, శుద్ధాత్మస్వరూపకాములకును, భగవత్కాములకును తెలియదగిన, ఆచరింపదగిన విశేషముల వివరణ. 28–30

శ్రీ హయగ్రీవాయనమః

శ్రీ మద్భగవద్గీతా - సప్తమోఽధ్యాయః

జ్ఞాన విజ్ఞానయోగః

అవ. ఉపాసింపబడువాని స్వరూపమును లెస్సగ నెఱింగినగాని ఉపాసించుట దుర్ఘటముగాన, వెనుకటి యధ్యాయము చివరశ్లోకమున 'భజతే యో మాం' అని 'మాం' అని, చెప్పబడిన తన వాస్తవ స్వరూపమును శ్రీకృష్ణు డర్జున కెఱిగించుచున్నాడు.

1. శ్లో. **మయ్యా సక్త మనాః పార్థ । యోగం యుఞ్జన్ మదా శ్రయః ।**
అసంశయం సమగ్రం మాం । యథా జ్ఞాస్యసి తచ్ఛృణు ।

అర్థము : పార్థ = అర్జునా! మయి = నాయందు, ఆసక్తమనాః = లగ్నమైన మనస్సుకల వాడవున్ను. మదాశ్రయః = నన్నే ఆధారముగా కల వాడవున్ను, యోగం = నన్ను గూర్చిన భక్తి యోగమును, యుఞ్జన్= ఆచరించుటకు ప్రవర్తించిన వాడవును (అయి) మాం = నన్ను, అసంశయం = నిశ్చయముగాను, సమగ్రం = సంపూర్ణముగాను, యథా=ఏవిధముగా, జ్ఞాస్యసి=తెలిసుకొనగలవో, తత్ = దానిని, శృణు = వినుము.

తా ॥ అర్జునా! నీమనస్సును నాయందు దృఢముగా నిలిపి నన్నునుభవించుటయే ధారకముగా గలిగి నన్ను గూర్చిన భక్తియోగమును ఆచరించుటకు ప్రవర్తింపుము. నన్ను నిశ్చయముగను సంపూర్ణముగను తెలియగల జ్ఞానమును నేను నీ కుపదేశించుచున్నాను, శ్రద్ధగా వినుము.

అవ. ఇంకను సావధానముగా వినుటకై ఆ చెప్పబోవు విషయమును ఫలముతోకూడ తిరిగి కొలదిగ వివరించుచున్నాడు.

2. శ్లో॥ **జ్ఞానం తేఽహం సవిజ్ఞానం । ఇదం వక్ష్యామ్య శేషతః ।**
యద్జ్ఞాత్వా నేహ భూయోఽన్యత్ । జ్ఞాతవ్య మవశిష్యతే ।

అర్థము : యత్ = ఏజ్ఞానమును, జ్ఞాత్వా = తెలిసికొనినపిమ్మట, భూయః = తిరిగి, ఇహ = ఈనావిషయమై, జ్ఞాతవ్యం = తెలియవలసినది, అన్యత్= మరియొకటి, న అవశిష్యతే = మిగిలియుండదో, సవిజ్ఞానం = నా వై లక్షణ్యజ్ఞానముతోకూడిన, ఇదం = ఈచెప్పబోవు, జ్ఞానం = నా స్వరూపజ్ఞానమును, అశేషతః = పూర్ణముగ, అహం = నేను, తే = నీకు, వక్ష్యామి = చెప్పగలను.

తా ॥ నేను నా యసాధారణ ధర్మములచే చేతనాచేతనములకంటె వేరైన వాడనని యు, నా స్వరూపమిట్టిదనియు నీకు తెలియజెప్పెదను, దీని నెఱుంగుదువేని ఇక నీకు నావిషయమై తెలుసుకొనవలసిన దేమియు నుండదు.

అవ. ఈ చెప్పబోవు జ్ఞాన మందరకును లభించునది కాదనుచున్నాడు.

3 శ్లో. మనుష్యాణాం సహస్రేషు । కశ్చి ద్యతతి సిద్ధయే, ।
యతతా మపి సిద్ధానాం । కశ్చి న్మాం వేత్తి తత్త్వతః ॥

అర్థము : మనుష్యాణాం = మనుష్యులయొక్క, సహస్రేషు = వేలమందిలో, కశ్చిత్ = ఒకానొకడు. సిద్ధయే = సిద్ధికొఱకు, యతతి = ప్రయత్నించుచున్నాడు. యతతాం = ప్రయత్నించువారలలో, కశ్చిత్ = ఒకానొకడు, మాం = నన్ను, వేత్తి= తెలుసుకొనుచున్నాడు, సిద్ధానాం అపి = సిద్ధికలవారలలోను, కశ్చిత్ = ఒకానొకడు, తత్త్వతః = వాస్తవముగ, వేత్తి = తెలుసుకొనుచున్నాడు.

తా ॥ వేలకొలది మనుష్యులలో నెవ్వడో యొకడు మాత్రమే ఆత్మజ్ఞానము సిద్ధించువరకు ప్రయత్నించును. అట్లు ప్రయత్నించు వేయిమందిలో నొక్కడే భగవంతుని తెలుసుకొనును. అట్లు తెలుసుకొనినవారలలో నెవ్వడో యొక్కడు మాత్రమే భగవంతుని వాస్తవముగ నెఱుంగగలడు.

అవ. ఈ శ్లోకము మొదలు 12వ శ్లోకము వరకు తన వాస్తవ స్వరూపము నెఱింగించుచు మొదట నీ శ్లోకముచే కార్యరూపముగను కారణరూపముగను నున్న ప్రకృతికి శేషి యగుటచే దానికంటె తాను వేరని తెలుపుచున్నాడు.

4.శ్లో. భూమి రాపోఽనలో వాయుః । ఖం మనో బుద్ధి రేవ చ ।
అహఙ్కార ఇతీ యం మే । భిన్నా ప్రకృతి రష్టధా ॥

అర్థము : భూమిః = భూమి, ఆపః = నీరు, అనలః = నిప్పు, వాయుః = గాలి, ఖం = ఆకాశము, మనః = మనస్సు, బుద్ధిః= మహత్తత్త్వము, అహఙ్కారః = అహంకారతత్త్వ ము, ఇతి= అవి, అష్టధా = ఎనిమిది విధములైన , ప్రకృతిః = మూలప్రకృతి, మే ఏవ = నా యధీన మైనదియే

తా॥ పంచభూతముల రూపముగాను, మనస్సు మొదలగు ఇంద్రియముల రూపముగాను మహత్తత్త్వ రూపముగాను, అహంకారరూపముగాను మొత్తము ఎనిమిది విధములుగ విభజింపబడియున్న ప్రకృతి నా యధీనమైనదియే.

అవ. జీవాత్మ ప్రకృతికిని తానే శేషియగుటచే తాను దానికంటెను వేరని తెలుపుచున్నాడు.

5.శ్లో. అపరేయ, మితస్త్వన్యాం। ప్రకృతిం విద్ధి మే పరామ్।
జీవభూతాం మహాబాహో! । యయేదం ధార్యతే జగత్ ॥

అర్థము : మహాబాహో = అర్జునా! ఇయం = ఈచెప్పబడిన యచేతన ప్రకృతి, అపరా = తక్కువది, ఇతఃతు = దీనికంటె, అన్యాం = వేరైన, జీవభూతాం = జీవస్వరూపమైన, ప్రకృతిం = చేతన ప్రకృతిని, మే=నాయొక్క, పరాం = ప్రధానమైనదానినిగా, విద్ధి= తెలుసు కొనుము, యయా = ఏచేతనప్రకృతిచే, ఇదం, జగత్ = ఈచేతనజగత్తు, ధార్యతే = ధరింపబడుచున్నదో.

తా॥ వెనుకటి శ్లోకమున చెప్పబడిన ప్రకృతి తక్కువైనది. దీనికంటెను ప్రధానమైన జీవరూపముగా నుండు నా ప్రకృతి మరియొకటి కలదు. దానిచే మొదటి యచేతన ప్రకృతియగు జగత్తంతయు ధరింపబడుచున్నది.

అవ. ఇట్లు రెండు శ్లోకములచే సమష్టిదశను జెప్పి ఈ శ్లోకముచే వ్యష్టి దశను జెప్పుచున్నాడు.

6.శ్లో. ఏతద్యోనీని భూతాని । సర్వాణీ త్యుపధారయ।
అహం కృత్స్నస్య జగతః। ప్రభవః ప్రలయ స్తథా ॥

అర్థము : సర్వాణి = సమస్తమైన, భూతాని = బ్రహ్మాది స్తంభపర్యన్తమైన పదార్థములన్నియు, ఏతద్యోనీని = చేతనాచేతన ప్రకృతులు రెండింటివలనను పుట్టినవి, అని, ఉపధారయ = నిశ్చయముగా నెఱుంగుము, (కావున) అహం = నేను, కృత్స్నస్య సమస్తమైన జగతః = ప్రపంచమునకున్ను, ప్రభవః = కారణమైనవాడను, తథా = అట్లే, ప్రలయః = సంహారకర్తను (భవామి = అగుచున్నాను.)

తా॥ బ్రహ్మ మొదలు గడ్డిపరక వరకు గల సకల పదార్థములున్ను నా యధీనమైన సమష్టి చేతనాచేతన ప్రకృతుల వలననే పుట్టుచున్నవి. గాన, నవియన్నియు నాయధీనమైనవియే. కావుననే నేను సమస్త ప్రపంచమునకు పుట్టుటకును, గిట్టుటకును కారణమైన యజమానినని నిశ్చయముగా నెఱుంగుము.

అవ. కావుననే తనను మించినది లేదనుచున్నాడు.

7.శ్లో. మత్తః పరతరం నాన్యత్ । కిఞ్చి దస్తి ధనఞ్జయ ! ।

అర్థము : ధనఞ్జయ=అర్జునా! మత్తః=నాకంటె, అన్యత్=మరియొకటి, కిఞ్చిత్ అపి= ఒక్కటియు, పరతరం=గొప్పది, నాస్తి=లేదు.

తా॥ అన్నిటిని పుట్టించు రెండు ప్రకృతులకును కారణమైనవాడను గనుకను, అచేతన వస్తువుల కన్నిటికిని శేషియగు జీవునకును శేషిని గనుకను నా కంటె గొప్పదియగు పదార్థమేదియునులేదు.

అవ. సకల పదార్థములకును తానే యాధారమని చెప్పుచున్నాడు

7.శ్లో. మయి సర్వ మిదం ప్రోతం ! సూత్రే మణిగణా ఇవ॥

అర్థము : సూత్రే = దారమునందు, మణిగణా ఇవ = మాణిక్య సముదాయము వలెనే, మయి= నాయందు, ఇదం =ఈచేతనాచేతన సముదాయమంతయు, ప్రోతం = ఆధారపడియున్నది.

తా॥ హారమునందలి మాణిక్యములన్నియు లోనున్న దారముపై ఆధారపడి యుండునట్లే చేతనా చేతనరూపమైన ప్రపంచమంతయు అంతర్యామిగా నుండు నాపై యాధారపడియుండును.

8.శ్లో. రసోఽహ మప్సు కౌన్తేయ! । ప్రభాఽస్మి శశి సూర్యయోః, ।
ప్రణవ స్సర్వవేదేషు । శబ్దః ఖే పౌరుషం నృషు ।

అర్థము : కౌన్తేయ = అర్జునా, అహం = నేను, అప్సు = నీళ్ళయందలి, రసః = రుచిని, (అస్మి= అగుచున్నాను) శశిసూర్యయోః = చంద్రసూర్యుల యందున్న, ప్రభా= కాంతిని, (అస్మి = అగుచున్నాను) సర్వవేదేషు = వేదములన్నిటియందును, (ప్రధానమైన), ప్రణవః = 'ఓమ్'కారము, (అస్మి = అగుచున్నాను) ఖే = ఆకాశమునందు, (ప్రధానమైన), శబ్దః = ధ్వని, (అస్మి = అగుచున్నాను) నృషు= జీవులయందు, (ప్రధానమైన) పౌరుషం = పనిచేయుశక్తి, (అస్మి = అగుచున్నాను)

తా॥ పరమాత్మలోన లేని పదార్థమేలేదు. గాన నీరు పరమాత్మకు శరీరము వంటిది. రుచి యా నీటిని విడిచియుండదు. కావున రుచియు పరమాత్మకు శరీరము వంటిదే. శరీరమును చెప్పెడు శబ్దములన్నియు సహజముగ నంతర్యామియైన శరీరినే ముఖ్యముగా జెప్పును. కావున నిచ్చట యంతటను ఆయా రసాది శబ్దములచే వాస్తవముగ పరమాత్మయే చెప్పబడును గాన నేనే యా రసాదులని పరమాత్మ చెప్పుచున్నాడు.

(ఇచ్చట ఆయా పదార్థములయందలి ప్రధాన గుణములు తెలుపబడుచున్నవి).

మరియు ఏవస్తువు దేనివలన పుట్టించబడునో ఆ వస్తువు దానికి, శరీరమై ఆత్మకువలె పరతంత్రమై దాని నాశ్రయించుకొనియే యుండును. ఈ శ్లోకములో జెప్పబడు విలక్షణ భావములన్నియు పరమాత్మ వలననే పుట్టింపబడినవిగాన పరమాత్మకు పరతంత్రమైయుండును. కావుననే, వాటికి వాచకములగు శబ్దములచే పరమాత్మ తెలుపబడును. ప్రకారవాచక శబ్దములు ప్రకారిని బోధించుట సహజమేకదా! (ప్రకారము= శరీరము. ప్రకారి = ఆత్మ)

9.శ్లో. పుణ్యో గన్ధః పృథివ్యాం చ । తేజ శ్చాస్మి విభావసౌ ।
జీవనం సర్వభూతేషు । తపశ్చాస్మి తపస్విషు ।

అర్థము : పృథివ్యాం = భూమియందలి, పుణ్యః గన్ధః చ = పరిమళమున్ను (అహంఅస్మి = నేనేయగుచున్నాను) విభావసౌ, నిప్పునందలి, తేజశ్చ= కాల్చు శక్తియున్ను, (అహంఅస్మి = నేనేయగుచున్నాను) సర్వభూతేషు = బ్రహ్మాది సకలజీవులయందలి, జీవనం = జీవనాధారము, (అహం అస్మి = నేనే యగుచున్నాను). తపస్విషు = తపస్సంపన్నులయందలి, తపః చ = తపస్సున్ను, (అహం అస్మి = నేనే యగుచున్నాను.)

తాత్పర్యము సుగమము.

10.శ్లో. బీజం మాం సర్వభూతానాం । విద్ధి పార్థ! సనాతనమ్ ।
బుద్ధి ర్బుద్ధిమతా మస్మి । తేజ స్తేజస్వినా మహమ్ ।

అర్థము : పార్థ = అర్జునా! మాం = నన్ను, సర్వభూతానాం = అన్ని స్థావర జంగములకును, సనాతనం = నిత్యమైన, బీజం = ఉపాదాన వస్తువుగా, విద్ధి = తెలుసుకొనుము, అహం= నేను, బుద్ధిమతాం = బుద్ధిమంతుల యొక్క, బుద్ధిః = జ్ఞానమున్ను, తేజస్వినాం = ప్రతాపవంతుల యొక్క, తేజః = పరులనెదిరించు శక్తియున్ను, అస్మి = అగుచున్నాను.

తా॥ అర్జునా! సకల స్థావర జంగమ భూతములకును నేనే ఉపాదాన ద్రవ్యమగువాడను, బుద్ధిమంతులయొక్క వివేకశక్తియు నేనే, ప్రతాపశీలురయొక్క మనోధైర్యమును నేనే యగుచున్నాను.

11.శ్లో. బలం బలవతాం చాహం । కామరాగ వివర్జితమ్ ।
ధర్మావిరుద్ధో భూతేషు । కామోఽస్మి భరతర్షభ! ।

అర్థము : భరతర్షభ = అర్జునా! అహం = నేను, బలవతాం = బలముకలవారి యొక్క, కామరాగవివర్జితం = కామ రాగములు లేని, బలం = ధారణ శక్తియు, భూతేషు = ప్రాణులయందు, ధర్మావిరుద్ధః = ధర్మశాస్త్రమునకు విరుద్ధముకాని, కామః చ = కామమున్ను, అస్మి = అగుచున్నాను.

తా॥ బలవంతులయందుండు కామరాగములులేని బలమున్ను, ప్రాణులకు ధర్మవిరుద్ధముకాని తన భార్యయందలి ప్రేమ మొదలగు కామమున్ను నేనేయగుచున్నాను.

(విలక్షణమైన పై వస్తువులన్నియు నావల్లనే పుట్టి నాయందే నాశరీరమువలె విడువకయుండుటవలన (అనగా ఆయా గుణముల కాధారమైన వస్తువులను నేను విడువక అంతర్యామిగా నుండుటచే ఆయా గుణములున్ను నన్ను విడువక యుండును.) వాని పేరులన్నియు నాకే చెల్లునని భావము.)

అవ. తన వాస్తవస్వరూపోపదేశమును ముగించుచున్నాడు.

12.శ్లో. యే చైవ సాత్త్వికా భావాః । రాజసా స్తామసాశ్చ యే ।
మత్త ఏవేతి తా న్విద్ధి । నత్వహం తేషు తే మయి ।

అర్థము : సాత్త్వికాః = సత్త్వగుణము ప్రధానముగా కలిగినట్టియు, రాజసాః = రజోగుణము ప్రధానముగా కలిగినట్టియు-తామసాః చ = తమోగుణము ప్రధానముగా కలిగినట్టియు, యేయే భావాః = ఏయే పదార్థములు కలవో, తాన్ = వాటిని,మత్తః, ఏవఇతి = నానుండియే (పుట్టినవి) యని, విద్ధి = తెలుసుకొనుము, అహం = నేను, తేషు = వాటియధీన మందు, న = లేను, తే = ఆపదార్థములన్నియు, మయి = నాయందాధారపడి (సన్తి=కలవు)

తా॥ లోకమున సత్త్వ రజస్తమోగుణములలో నొక్కొక్కటి ప్రధానముగా గల దేహములు, ఇంద్రియములు, భోగ్యవస్తువులు, వాటికి కారణమగు పదార్థములు మొదలగునవి యన్నియు నావలననే పుట్టుచున్నవని యెఱుంగుము. అట్లు పుట్టినను అవి నా యధీనమై నిలుచుచున్నవిగాని నేను వాటి యధీనమునందెన్నడు నుండను.

అవ. ప్రకృతిచే భగవత్స్వరూపము మరుగుపరచబడియుండునని తెలుపుచున్నాడు.

13.శ్లో. త్రిభి ర్గుణమయై ర్భావై । రేభి స్సర్వ మిదం జగత్ ।
మోహితం నాభిజానాతి । మా మేభ్యః పర మవ్యయమ్ ।

అర్థము : త్రిభిః = మూడైన, గుణమయైః = సత్వరజస్తమోగుణములు ప్రధానముగా గల, ఏభిః = ఈ, భావైః = దేహాది పదార్థములచే, మోహితం = భ్రమింపజేయబడిన, ఇదం = ఈ, సర్వం = సమస్తమైన, జగత్ = దేవమనుష్యాది ప్రాణిజాతము, మాం= నన్ను, ఏభ్యః = ఈ పదార్థములన్నిటి కంటె, పరం = మిక్కిలి గొప్పవానినిగాను, అవ్యయం = ఏ వికారములు లేనివానినిగాను, న అభిజానాతి = ఎఱుంగజాలకున్నది.

తా॥ పూర్వకర్మానుగుణముగ సంభవించిన దేహేంద్రియాది భోగ్య భోగోపకరణ పదార్థజాతములచే భ్రమింపజేయబడిన ఈ దేవ తిర్యఙ్మనుష్యాది ప్రాణిసమూహమంతయు నన్ను కల్యాణ గుణములచేతను, అప్రాకృత భోగ్యపదార్థ సముదాయములచేతను మిక్కిలి గొప్పవాడననియు సదా నిర్వికారుడననియు నెఱుంగజాలదు.

అవ. ఇట్టి సహజమగు మహాతిశయముగల నీవుండగా, భోక్తలగు మానవుల కందరకును, నిహీనమగు అస్థిర ప్రాకృత పదార్థములయందు ఆదరము మెండుగ నుండుట కేమి హేతువనెడు ప్రశ్న కుత్తర మొసంగుచున్నాడు.

14. శ్లో. దైవీ హ్యేషా గుణమయీ । మమ మాయా దురత్యయా ।

అర్థముః మమ = నా యధీనమైన, గుణమయీ = సత్వ రజస్తమోగుణమయమైన, మాయా= ప్రకృతి, దైవీ = నాచే లీలార్థమై ఏర్పరచ బడినది గాన, దురత్యయా = అందరకును తప్పించుకొన శక్యము కానిదై యున్నది.

తా॥ సత్వరజస్తమోగుణ ప్రచురమైన యీ ప్రకృతిని భగవానుడు లీలా ప్రియుడు గాన తన యాట నాడుటకై ఏర్పరచియున్నాడు. కావున, నిది యాతని యధీనమైయ్యే యుండును. అందువలననే ఏ లోకములో నున్న ఏ ప్రాణిగాని దీనిబారినుండి తప్పించుకొనజాలదు. ఇట్టి ప్రకృతిచే భ్రమింపచేయబడి లోకము అట్టి మహిమశాలియగు భగవంతుని యెఱుంగ జాలకున్నది.

అవ. ఇట్టి మాయబారినుండి తప్పించుకొను నుపాయమును జెప్పుచున్నాడు.

14.శ్లో. మామేవ యే ప్రపద్యన్తే । మాయా మేతాం తరన్తి తే ।

అర్థము : యే = ఎవరు, మాం ఏవ = నన్నే, ప్రపద్యన్తే = ఉపాయముగా నమ్మియున్నారో, తే = వారు, ఏతాం = ఈ, మాయాం = ప్రకృతిని, తరన్తి = దాటుచున్నారు.

తా॥ భగవంతునే ఉపాయముగా నమ్మియుండు పుణ్యాత్ములు యీ మాయ నవలీలగా దాటగలరు. అట్టివారే భగవంతునుపాసింతురు.

అవ. ఇట్లు సులభముగ భగవదనుగ్రహమునకు సాధనమగు భగవదుపాసనను ప్రసాదించు ప్రవృత్తి నెల్లరును చేయకుండుటకు కారణమును చెప్పుచున్నాడు.

15.శ్లో. న మాం దుష్కృతినో మూఢాః । ప్రపద్యన్తే నరాధమాః ।
మాయయాఽపహృతజ్ఞానాః । ఆసురం భావ మాశ్రితాః ॥

అర్థము : మూఢాః = విపరీత జ్ఞానము కలవారున్ను, నరాధమాః = భగవంతుని యందాసక్తిలేని వారున్ను, మాయయా = కూటయుక్తిచే, అపహృత జ్ఞానాః = ఉన్నజ్ఞానమును పోగొట్టుకొనువారును, ఆసురం = తామసమైన, భావం = స్వభావమును, ఆశ్రితాః= పొందిన వారును (అగు) దుష్కృతినః = పాపాత్ములు, మాం = నన్ను, నప్రపద్యన్తే= ఉపాయముగా నమ్మియుండరు.

తా॥ ఆత్మాత్మీయములు నిజముగ భగవదధీనమైనను తమ యధీనమని విపరీతముగ తలంచువారును, ఏదోయొక విధముగ భగవంతు నెఱింగినను ఆతనియందాసక్తిలేనివారును, లభించిన భగవద్ జ్ఞానమును కుయుక్తులచే చెరచుకొనువారును, భగవంతుని బాగుగనెఱింగియు నాతనిని ద్వేషించువారును నాలుగు విధములగు పాపాత్ములు. వీరు భగవంతుడే తమకు పురుషార్థము నొసంగు సాధనమని నమ్మజాలరు. (ఇట్లు నమ్మి యుండుటయే ప్రపత్తియనబడును. దీనికే శరణాగతి యనియు పేరు. అది వీరికిలేదు.)

అవ. ఇక భగవంతుని శరణుజొచ్చి భజించువారెవరో తెలుపుచున్నాడు.

16.శ్లో. చతుర్విధా భజన్తే మాం । జనా స్సుకృతినోఽర్జున ।
ఆర్తో జిజ్ఞాసు రర్థార్థీ । జ్ఞానీ చ భరతర్షభ!॥

అర్థము : భరతర్షభ = భరతవంశమున నుత్తముడవగు, అర్జున = ఓయర్జునా! ఆర్తః = పోయిన ఐశ్వర్యమును పొందగోరువాడును, జిజ్ఞాసుః = శుద్ధాత్మ స్వరూపమును పొందగోరు వాడును, అర్థార్థీ = నూతనైశ్వర్యమును ఆశపడువాడును, జ్ఞానీచ = భగవంతుని

పొందగోరువాడును, (అను) చతుర్విధాః = నాలుగురకములైన, సుకృతినః = పుణ్యాత్ములగు, జనాః = జనులు, మాం = నన్ను, భజన్తే = ఉపాసించుచున్నారు.

తా॥ పోయిన ఐశ్వర్యమును పొందగోరువారును, నూతనైశ్వర్యము నాశించువారును, శుద్ధాత్మానుభవ రూపమైన కైవల్యము పొంద గోరువారును, భగవంతునే ముఖ్యముగా బడయగోరువారును అను నీ నాలుగు విధములైన పుణ్యాత్ములు భగవంతుని ఉపాసింతురు. (వీరిలో మొదటి ఇద్దరును పర్యవసానమున ధనమునే కోరువారు గాన ఒకటిగా చేర్చి భక్తులు ముత్తెరగులని శ్రీ భాష్యకారులు సాయించిరి.)

అవ. ఈ నలుగురిలోను జ్ఞాని యొక్క అతిశయమును చెప్పుచున్నాడు.

17. శ్లో. తేషాం జ్ఞానీ నిత్యయుక్తః । ఏకభక్తిర్విశిష్యతే।
ప్రియో హి జ్ఞానినోఽత్యర్థ । మహం, సచ మమ ప్రియః ।

అర్థము : తేషాం = ఆ నలుగురుభక్తులలో, నిత్యయుక్తః=(నాతో) నిత్య సంబంధము కలిగినట్టియు, ఏకభక్తిః =నాయందు మాత్రమే భక్తి కలవాడును అగు, జ్ఞానీ = ఉపాసకుడు, విశిష్యతే = శ్రేష్ఠుడగుచున్నాడు, అహం = నేను, జ్ఞానినః = ఉపాసకునకు, అత్యర్థం = నేనే చెప్పజాలనంత, ప్రియఃహి = ఇష్టుడను గదా! సఃచ= ఆ ఉపాసకుడును, మమ = నాకు, ప్రియః =(అంత) ఇష్టుడు, (భవతి అగుచున్నాడు.)

తా॥ ఈ నలుగురు భక్తులలో ఉపాసకు(జ్ఞానికి)నకు నేనే ఫలము గాన నాతో సంబంధమాతనికి నిత్యము. భక్తియు నాయొక్కనియందే యుండును. కావున నీతడుత్తముడు. నేను సర్వజ్ఞుడను సర్వశక్తి కలవాడనైనను ఆతనికి నాయందు గల ప్రేమను చెప్పజాలను. నేను కూడా నాతని నంతగనే ప్రేమింతును.

అవ. ఇంకను జ్ఞానియొక్క అతిశయమునే చెప్పుచున్నాడు.

18.శ్లో. ఉదారా స్సర్వ ఏవైతే । జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్।
ఆస్థిత స్స హి యుక్తాత్మా । మామే వానుత్తమాం గతిమ్ ॥

అర్థము : ఏతే-సర్వే = వీరందరును, మే = నాకు, ఉదారాః ఏవ = దాతలే, జ్ఞానీతు = జ్ఞానియన్ననో, ఆత్మైవ =(నా) యాత్మయే (యని) మే = నా యొక్క, మతం= నిశ్చయము; హి = ఏమనగా, సః = వాడు, యుక్తాత్మా = నా సంబంధము నాశించు మనస్సు కలవాడై, మాంఏవ = నన్నే, అనుత్తమాం = సర్వోత్తమమైన, గతిం = పొందదగిన స్థానముగా, ఆస్థితః = నిశ్చయించినవాడు, (భవతి = అగుచున్నాడు.)

తా॥ ఈ నలుగురును నన్నే ఉపాసించి నావలననే ఫలమును పొందువారు గాన నాకు దాతలే యగుచున్నారు. కాని జ్ఞానిమాత్రము ఆత్మ, శరీరమున కాధారమైనట్లు నాకాధారమైయున్నాడు. వాడు నన్నే సర్వోత్కృష్టమైన పొందదగిన స్థానమని నమ్మియున్నాడు. కావున, వానిని విడిచి నేను నిలువజాలను, అందుచే వాడు నాకు ఆత్మయే.

(ఆశ్రితులు కోరినదెల్లను యిచ్చుట భగవంతుని సర్వస్వము. అది వీరివలన ప్రకాశించుచున్నది గాన వీరు భగవంతునకు సర్వస్వము నిచ్చుచున్నారు, కావున ఉదారులే.)

అవ. ఇట్టి జ్ఞాని యగుట కనేక జన్మలలో నార్జించిన పుణ్యమే కారణమనుచున్నాడు.

19. శ్లో. బహూనాం జన్మనా మన్తే । జ్ఞానవా న్మాం ప్రపద్యతే ।
వాసుదేవ స్సర్వ మితి । స మహాత్మా సుదుర్లభః ॥

అర్థము : బహూనాం = అనేకములైన, జన్మనాం = పుణ్యజన్మలయొక్క, అన్తే = చివరకు, జ్ఞానవాన్= బుద్ధిమంతుడు, భూత్వా = అయి, వాసుదేవః ఏవ = వాసుదేవుడే, సర్వం = సమస్తమున్ను, ఇతి = అని, మాం = నన్ను, ప్రపద్యతే = ఉపాసించుచున్నాడు, సః = అట్టి మహాత్మా = పుణ్యాత్ముడు, సుదుర్లభః=మిక్కిలి దుర్లభుడు, (భవతి = అగుచున్నాడు.)

తా॥ అనేక పుణ్యజన్మల నెత్తగానెత్తగా చివరకెప్పుడో జ్ఞానము కలవాడై నేనే తనకు ఫలమును, ఉపాయమును, సర్వస్వమును అని తలంచి నన్నాశ్రయించును. అట్టి మహాత్ముడు లోకమున మిక్కిలి దుర్లభుడు,.

అవ. జ్ఞాని యంత దుర్లభుడగుటకు కారణమును జెప్పుచున్నాడు.

20.శ్లో. కామై స్తైస్తైర్హృతజ్ఞానాః । ప్రపద్యన్తేఽన్య దేవతాః ।
తంతం నియమ మాస్థాయ । ప్రకృత్యా నియతా స్స్వయా ॥

అర్థము : స్వయా = తమదైన, ప్రకృత్యా = పాపవాసనతో, నియతాః = నిత్యసంబంధము కలవారును, తైః తైః=ఆయా, కామైః=కోరికలచేత, హృతజ్ఞానాః = అపహరింపబడిన జ్ఞానము కలవారును అయి, తం తం=ఆయా, నియమం=నియమమును, అస్థాయ= అవలంబించి, అన్యదేవతాః = ఇతర దేవతలను, ప్రపద్యన్తే = ఆశ్రయించుచున్నారు.

తా॥ లోకులందరును పాపవాసనతో తప్పక కూడియుందురు. వారావాసనకు తగినట్లే సత్వాది గుణమయములైన కామ్యవస్తువులను కోరుచుందురు.

దానిచే వారికి నా సంబంధమగు జ్ఞానము పోవును. అందుచే వారు ఇంద్రాది యితర దేవతలనే ఆయా ఆరాధనా నియమములతో నాశ్రయించి యారాధింతురు.

అవ. ఇకముందు రెండు శ్లోకములచే ఆ దేవతాంతరారాధనయు వ్యర్థముగాకుండ ఫలపర్యవసాయి యగునట్లు తానే దయతో చేతునని చెప్పుచున్నాడు.

21.శ్లో. **యోయో యాంయాం తనుం భక్తః । శ్రద్ధయాఽర్చితు మిచ్ఛతి ।**
తస్య తస్యాఽచలాం శ్రద్ధాం । తా మేవ విదధా మ్యహమ్॥

అర్థము : యః-యః = ఎవడెవడు, యాంయాం = ఏయే, తనుం = శరీరమును, భక్తః = భక్తికలవాడగుచు, శ్రద్ధయా = శ్రద్ధతో, అర్చితుం = పూజించుటకు, ఇచ్ఛతి = కోరుచున్నాడో, తస్య తస్య = ఆయా పురుషునకు, తాం = ఆ, శ్రద్ధాంఏవ = శ్రద్ధనే, అచలాం = ఆటంక ములు లేని దానినిగా, విదధామి = చేయుచున్నాను.

తా॥ బ్రహ్మాది దేవతలందరును నాకు శరీరమువంటివారే, ఏ భక్తుడు నా దేహమును ఏ రూపమున శ్రద్ధతో పూజింపగోరునో వానికి అట్టి నా దేహమునందే ఆ శ్రద్ధతో ఏ విధమైన విఘ్నములచేతను చెడకుండునట్లు చేయుదును.

22.శ్లో. **స తయా శ్రద్ధయా యుక్తః । తస్యా రాధన మీహతే ।**
లభతే చ తతః కామాన్ । మయైవ విహితాన్ హి తాన్ ।

అర్థము : సః = ఆ భక్తుడు, తయా = ఆ, (నిశ్చలమైన) శ్రద్ధయా = శ్రద్ధతో, యుక్తః = కూడినవాడై, తస్య = ఆ దేవతయొక్క, ఆరాధనం = పూజను, ఈహతే = కోరుచున్నాడు, తతః = ఆ యారాధనవలన, తాన్ కామాన్ హి = ఆ పదార్థములనే, మయా ఏవ = నాచేతనే, విహి తాన్ = ఇవ్వబడినవాటిని, లభతే = పొందుచున్నాడు.

తా॥ ఆ భక్తుడు నేననుగ్రహించిన ఆ నిశ్చలశ్రద్ధతో ఆ యింద్రాదుల నారాధించగోరును. ఆ యింద్రాదులు నాకు శరీరమువంటివారే గాన నిజమున కా యారాధన నాదియే. కావున, నేనా యారాధనవలన సంతుష్టుడనై వాడు కోరిన వస్తువులను ఆ దేవతల యధికారమునకు తగినట్లుగా ఆయా దేవతలచే నిప్పించుచుందును.

అవ. అయినచో భగవదుపాసకులకును దేవతోపాసకులకును తారతమ్య మేమి? ఉభయులకును ఫలమొసంగువాడు నిజమున కా భగవంతుడే కదా!

23.శ్లో. అన్తవత్తు ఫలం తేషాం । త ద్భవ త్యల్పమేధసామ్ ।
దేవాన్దేవయజో యాన్తి । మద్భక్తా యాన్తి మా మపి ॥

అర్థము : అల్ప మేధసాం = స్వల్పబుద్ధిగల, తేషాం = అట్టి భక్తులకు, తత్ ఫలంతు = ఆ లభించు ఫలమన్ననో, అన్తవత్ = నాశముకలది, భవతి = అగుచున్నది, దేవయజః= దేవతలను పూజించువారు, దేవాన్ = ఆ దేవతలను, యాన్తి = పొందుచున్నారు, మద్భక్తాఃఅపి = నా భక్తులున్ను, మాం = నన్నే, యాన్తి = పొందుచున్నారు.

తా॥ అట్టి యల్ప దేవతలను అల్పఫలములకై పూజించు అల్పులకు అల్పమును నశ్వరమునునగు ఫలమే లభించును. ఏలయనగా - వారారాధించు దేవతలను భవించు భోగములు పరిమితములే. అందువలన వారొసంగు భోగములును పరిమితములే యగుచున్నవి. ఇక నా భక్తులన్ననో నాభోగములతో సమానమైన భోగములనే యనుభవింతురు. నా భోగములు నిత్యములును అపారములు గాన వారును అట్లేయనుభవింతురు.

అవ. ఉత్తమపురుషార్థముల నొసంగు భగవంతుడు కాన్పించకున్న గదా! అల్పఫలముల నొసంగు ఇతరదేవతల నాశ్రయింతురు, అందరును తననాశ్రయించవలెనని గదా భగవంతుడవతరించి యందరకును గోచరించుచున్నాడు. అట్టితరి ఆతనిని విడిచి దేవతాంతరముల నేల యుపాసించుచున్నారో చెప్పుచున్నాడు.

4.శ్లో అవ్యక్తం వ్యక్తి మాపన్నం । మన్యన్తే మా మబుద్ధయః ।
పరం భావ మజానన్తో । మమాఽవ్యయ మనుత్తమమ్ ॥

ర్థము : అబుద్ధయః = జ్ఞానహీనులు, మమ = నా యొక్క, అవ్యయం = నిత్యమైనదియు, అనుత్తమం = సర్వోత్కృష్టమైనదియునగు, పరంభావం = గొప్పస్వభావమును, అజానన్తః = ఎఱుంగనివారై, మాం = నన్ను, అవ్యక్తం = (ఇంతకుపూర్వము) తెలియబడనివాడనై, వ్యక్తిం = (ఇప్పుడు) తెలియ బడుటను, ఆపన్నం = పొందినవానినిగా, మన్యన్తే = తలంచుచున్నారు.

తా॥ నిత్యమై నిరతిశయమగు నా యుత్కృష్ట స్వభావమును ఎఱుంగని మూఢులు నన్ను తమవలెనే పూర్వము తెలియబడనివాడనై యుండి ఇప్పుడు కర్మవశమున పుట్టి తెలియబడుచున్నవానినిగా తలంతురు.

అవ. ఇట్లు వారు తన స్వభావము నెఱుంగకుండుటకు కారణమును జెప్పుచున్నాడు.

25.శ్లో. నాఽహం ప్రకాశ స్సర్వస్య । యోగమాయా సమావృతః ।
మూఢోఽయం నాఽభిజానాతి । లోకో మా మజ మవ్యయమ్ ॥

అర్థము : యోగమాయా సమావృతః = శరీరసంబంధమనెడు మాయచే నావరింబడిన, అహం = నేను, సర్వస్య = అందఱకును, ప్రకాశః = గోచరించువాడను, న = కాను, మూఢః=మోహమును జెందిన, అయం లోకః=ఈ జనము, మాం = నన్ను, అజం= పుట్టని వాడను, అవ్యయం=నశించనివాడను (అని), న అభిజానాతి = ఎఱుంగదు.

తా॥ మనుష్యశరీరముతో నవతరించినవాడ నగుటచే నా యుత్కృష్ట స్వభావమెల్లరకు గోచరించదు. అందుచే లోకులు మూఢులై నన్ను పుట్టుట గిట్టుట మొదలగు వికారములు లేనివానినిగ నెఱుంగ జాలకున్నారు.

అవ. ఈ లోకముననున్న మానవులే కాదు, ముల్లోకములయందలి భూతములు కూడ నన్నెఱుంగజాలవని చెప్పుచున్నాడు.

26.శ్లో. వేదాఽహం సమతీతాని । వర్తమానాని చార్జున! ।
భవిష్యాణి చ భూతాని । మాం తు వేద న కశ్చన ॥

అర్థము : అర్జున = అర్జునుడా, అహం = నేను, సమతీతాని = పుట్టినట్టియు, వర్తమానాని = పుట్టుచున్నట్టియు, భవిష్యాణి= పుట్టబోవునట్టియు, భూతాని = ప్రాణులను, వేద= ఎఱుంగుదును, మాంతు = నన్నైతే, కశ్చన = ఒకప్రాణియు, నవేద = ఎఱుంగజాలదు.

తా॥ అర్జునా! భూత భవిష్యద్వర్తమాన కాలములలో నుండు సకల ప్రాణులను నే నెఱుంగుదును. కాని, నా తత్వమెఱింగి నన్నే ఆశ్రయించు ప్రాణి యొక్కటియు లేదు.

అవ. ఇట్లు ఏ ప్రాణియు భగవత్తత్వము నెఱుంగజాలకుండుటకు కారణమును జెప్పుచున్నాడు.

27.శ్లో. ఇచ్ఛాద్వేష సముత్థేన । ద్వన్ద్వమోహేన భారత! ।
సర్వభూతాని సమ్మోహం । సర్గే యాన్తి పరన్తప! ॥

అర్థము : పరన్తప = శత్రువుల తపింపజేయు, భారత = అర్జునా! సర్వభూతాని = ప్రాణులన్నియు, సర్గే = పుట్టునప్పుడే, ఇచ్ఛాద్వేషసముత్థేన = అభిలాష

ద్వేషములవలన కలిగిన, ద్వన్ద్వమోహేన = శీతోష్ణాది ద్వంద్వములనెడు మోహసామగ్రిచేత, సమ్మోహం = భ్రాంతిని, యాన్తి = పొందుచున్నవి.

తా॥ అర్జునా! పూర్వజన్మమున ఏ జీవుని అభిలాష విద్వేషములు ఏ ద్వంద్వములయందు నెలకొని యుండెనో ఆ జీవుడు పుట్టునపుడు తిరిగి ఆ ద్వంద్వములయందలి ఇచ్ఛాద్వేషములతోనే పుట్టును. దానిచే వీనికి అభోగములయందు భోగ్యములనెడు బుద్ధియు, అద్వేష్యముల యందు ద్వేషింప తగినవనెడు బుద్ధియు (ఇదియే సంమోహము) పుట్టుచుండును. అందుచే భగవంతుని సంశ్లేషమే సుఖమనియు ఆతని నెడబాయుటయే దుఃఖమనియు తలంపజాలడు.

అవ. ఇట్టి సమ్మోహము ప్రతి ప్రాణికిని నియతమే గదా! అట్టితరి ఇక భగవదుపాసన చేయువాడెవడు, అట్లగుచో 'చతుర్విధా భజన్తే మాం' అను శ్లోకమున కర్థమేమి?

28.శ్లో. **యేషాం త్వన్తగతం పాపం । జనానాం పుణ్యకర్మణామ్ ।**
తే ద్వన్ద్వమోహ నిర్ముక్తా । భజన్తే మాం దృఢవ్రతాః ।

అర్థము : పుణ్యకర్మణాం = పుణ్యకర్మల నాచరించునట్టి, యేషాం జనానాం = ఏ జనులయొక్క, పాపంతు = పాపమైతే, అన్తగతం = నశించినదో, తే = వారు, ద్వన్ద్వమోహనిర్ముక్తాః = ద్వంద్వరూపమైన, అజ్ఞానము నుండి విడువబడినవారై, దృఢవ్రతాః = చలించని సంకల్పము కలవారై, మాం = నన్ను, భజన్తే = ఉపాసించుచున్నారు.

తా॥ ఎవరికి అనాదియగు పాపరాశి యంతయు పుణ్యకర్మానుష్ఠానముచే క్షీణించునో వారు నన్ను శరణుజొచ్చి గుణమయములగు ద్వంద్వముల వలన కలుగునట్టి మోహమును వీడి ఐశ్వర్యకైవల్య భగవల్లాభముల కొఱకు గట్టి పట్టుదలతో నన్నుపాసింతురు.

అవ. అర్థార్థి, జిజ్ఞాసు, జ్ఞాని యనెడు ముగ్గురు భక్తులకును తెలుసుకొనవలసినట్టియు, పరిగ్రహించదగినట్టియు విషయములను చెప్పుచున్నాడు.

29.శ్లో. **జరామరణమోక్షాయ । మా మాశ్రిత్య యతన్తి యే ।**
తే బ్రహ్మ తద్విదుః కృత్స్నం । అధ్యాత్మం కర్మచాఖిలమ్ ।

అర్థము : జరామరణ మోక్షాయ = ముసలితనము చావులేకుండుట కొఱకై, మాం = నన్ను, ఆశ్రిత్య = ఆశ్రయించి, యే = ఎవరు, యతన్తి = ప్రయత్నించుచున్నారో, తే = వారు, తత్ బ్రహ్మ = ఆ బ్రహ్మను, కృత్స్నం = సంపూర్ణమైన, అధ్యాత్మం = అధ్యాత్మమును, అఖిలం = సమస్తమైన, కర్మ చ = కర్మనున్ను, విదుః = ఎరుంగుదురు.

తా॥ ఎవరు నన్నాశ్రయించి శుద్ధాత్మ స్వరూపము లభించుటకై ప్రయత్నింతురో వారా బ్రహ్మమును, పూర్ణమైన అధ్యాత్మమును, సకల కర్మలను ఎఱుంగవలెను.

30. శ్లో. సాధిభూతాధిదైవం మాం। సాధియజ్ఞం చ యే విదుః।
ప్రయాణకాలేఽపి చ మాం। తే విదు ర్యుక్తచేతసః॥

ఇతి శ్రీ భగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే
శ్రీకృష్ణార్జున సంవాదే జ్ఞానవిజ్ఞాన యోగోనామ
సప్తమోఽధ్యాయః.

అర్థము : యే = ఎవరు, మాం = నన్ను, సాధిభూతాధిదైవం = అధిభూతము తోను, అధిదైవముతోను కూడిన వానినిగాను, సాధి యజ్ఞం = అధియజ్ఞముతో కూడిన వానినిగాను, విదుః = ఎఱుంగుచున్నారో, తే చ = వారున్ను, ప్రయాణకాలేఽపి= మరణకాల మందుకూడ, యుక్తచేత సః = స్వాధీనమందున్న మనస్సు కలవారై, మాం = నన్ను, విదుః = ఎఱుంగుదురు.

తా॥ నన్ను అధిభూతముతో కూడినవానినిగాను, అధిదైవముతో కూడిన వానినిగాను, అధియజ్ఞముతోకూడిన వానినిగాను తెలుసుకొనిన వారును, చనిపోవు సమయమందు కూడ నాయందే నియమింపబడిన మనస్సు కలవారును, వారు కోరెడు ఫలములకు తగినట్లు నన్నెఱుంగవలెను.

ఇది ఉపనిషదర్థ ప్రతిపాదకమును, బ్రహ్మవిద్యయు యోగశాస్త్రమును
శ్రీకృష్ణార్జున సంవాదరూపమును అయిన శ్రీ భగవద్గీత యందలి
జ్ఞాన విజ్ఞాన యోగమనెడు ఏడవ అధ్యాయము.

శ్రీమద్భగవద్గీతా ప్రశ్నోత్తరావళి
ఏడవ అధ్యాయము

1.ప్ర. ఈయధ్యాయమునకు పేరేమి ? అది యెందులకుంచబడెను ?

ఉ. ఈయధ్యాయమునకు జ్ఞానవిజ్ఞానయోగమని పేరు.

ఈ యధ్యాయ ప్రారంభమున రెండవ శ్లోకములో భగవానుడు తానిందు చెప్పదలచిన విషయమును ప్రతిజ్ఞ చేసియుండెను. అందు 'జ్ఞానం తేఽహం స విజ్ఞానం ఇదం వక్ష్యామ్యశేషతః.' అని భగవదుక్తి గాన్పించుచున్నది. అనగా 'నేను నీకిప్పుడు ముఖ్యముగా విజ్ఞానముతో గూడిన జ్ఞానమును గూర్చి ఉపదేశించెదను.' అని ఇచ్చట జ్ఞానమనగా భగవంతుడున్నాడను జ్ఞానము. విజ్ఞానమనగా అనగా వివిక్త విషయ జ్ఞానము. అనగా భగవంతుడు చేతనా చేతనములన్నింటి కంటెను వేరైనవాడను జ్ఞానము. అది ఎట్లన – భగవంతుడు ప్రకృతికి, జీవునకు గల దుర్గుణము లొకటియు దరిజేర శక్యముగాని స్వభావము కలవాడును, లెక్కించుటకు శక్యముగాని శుభగుణములు కలవాడును అగుటచే స్వరూపమే మారి వికరించునట్టి ప్రకృతి కంటెను, కర్మచే స్వభావములు మారి వికారములు చెందు జీవుల కంటెను విలక్షణమైయుండును. ఇట్లెఱుంగుటయే విజ్ఞానము. ఆ విషయమే ఈ యధ్యాయమున సమగ్రముగా నుపదేశింపబడుటచే దీని కాపేరుంచబడినది.

2.ప్ర. ఈయధ్యాయమున జెప్పబడు ప్రధానవిషయములెవ్వి?

ఉ. ఈ యధ్యాయమున –

1. పరబ్రహ్మయగు వాసుదేవుడే ఉపాసింపదగినవాడనుట. (1 శ్లో)
2. ఆతడు సమస్త చేతనములకును అచేతనములకును శేషియగుచున్నాడనుట. (4, 5 శ్లో.)

(ఏ వస్తువు యెవనికి అన్నివిధముల తనకొఱకై నియమింపబడదగియుండునో, తనచే ధరింపబడదగియుండునో, తనకు మాత్రమే అతిశయావహమైయుండునో అది వానికి శేషమనియు, అట్టివాడు శేషియనియు జెప్పబడును. అందులకే శరీరమును (శేషము) అందురు. జీవుని (శేషి) అని అందురు. ఇదే నిదర్శనము.)

సమస్త, చేతనములును, అచేతనములును పై విధముగ పరమాత్మచే తన కొఱకే నియమింప బడదగియు, తన చేతనే ధరింపబడతగియు, తనకే అతిశయావహమయ్యు గాన్పించుచున్నవి. గాన భగవంతుడు సర్వశేషియనియు సమస్తచేతనా చేతనములును ఆతనికి శేషమనియు చెప్పబడును.

3. నారాయణుడే సకలజగత్తునకు కారణము. (6శ్లో.)

4. నారాయణుడే సకలజగత్తునకు ఆధారము. (7శ్లో.)

5. నారాయణుడే సమస్తశబ్దములచేతను చెప్పబడుచున్నాడు. (8మొ 11 శ్లో.)

6. నారాయణుడే సకల చేతనాచేతనములన నియమించువాడు. (నియమించుట యనగా ప్రవర్తింపజేయుట) (12 శ్లో.)

7. నారాయణుడు సకల కళ్యాణగుణాకరుడగుటచే నాతని మించినవాడు లేడు. (13 శ్లో.)

8. ఇట్టివాడని యెఱుంగజాలకపోవుటకు కారణము, అనాదికాలము నుండియు విడువక వచ్చుచున్న పాపరాసులచే తటస్థించు సత్వరజస్తమో గుణమయములైన దేహములుగాను, ఇంద్రియములుగాను, భోగ్యవస్తువులుగాను గాన్పించు పదార్థములచే గప్పబడియుండుటయే. (13,14,15 శ్లో)

9. అట్టియావరణ తొలగించుటకు సాధనము భగవత్ప్రపత్తియే. (14 శ్లో.) అట్టి ప్రపత్తి అనేక జన్మలలో నార్జింపబడిన మహత్తరపుణ్య విశేషముచే లభించును.

(ప్రపత్తి యనగా భగవంతుడే తనను రక్షించునను మహా విశ్వాసముతో తన రక్షణనొకింతయు తాను చేసుకొనకయుండుట.)

10. ఉపాసకులలో గల పరస్పర వైలక్షణ్యము. (16 శ్లో.)
ఆ వైలక్షణ్యము వారభిలషించు ఫలభేదమును బట్టి వచ్చుచున్నది. ఫలభేదమెట్టిదనగా కొందరైశ్వర్యమును, కొందరు ఆత్మ యాథాత్మ్యమును మరికొందరు భగవత్ప్రాప్తిని కోరుదురు. అట్లు కోరుటకు కారణము వారి వారి పుణ్యావిశేషమే.

11. ఇందు భగవత్ప్రాప్తి నభిలషించువాడు ఉత్తముడు. (17,18 శ్లో.)
ఏలయనగా – వాడన భగవంతునకు మిక్కిలి ఇష్టము. అందులకు కారణము – వాడు నిత్యయుక్తుడును, ఏకభక్తియు నగుటయే.

నిత్యయుక్తుడు=నేనే వానికి ఫలమగుటచే నాతో వానికి సంబంధము ఎడ తెగనిది. ఇతరులకు నాతో సంబంధము వారికి కావలసిన ఫలము చేజిక్కువరకే. ఏకభక్తి = నా యందే భక్తి, ఇతరులకు భక్తి తాము కోరు వస్తువుల యందును. వాటిని యిచ్చువాడనుగాన కొంత నాయందును.

12.ఇట్టివాడు చిక్కుట మిక్కిలి యరుదు. (19 మొదలు 27 శ్లో. వరకు)

13. ఐశ్వర్యార్థులకును, శుద్ధాత్మస్వరూపకాములకును, భగవత్కాముకుల కును తెలియదగినట్టియు, ఆచరింపదగినట్టియు విశేషములను వివరించుట. (28 మొ 30 శ్లో.వ)

3.ప్ర. ఈ షట్కమునకు పూర్వ షట్కములోను ప్రధాన శాస్త్రార్థములోను గల సంబంధమేమి ? ఈ అధ్యాయమునకు ఆరవ అధ్యాయములోను ప్రధాన శాస్త్రార్థములోనుగల సంబంధమేమి ?

ఉ. షట్కమనగా ఆరు అధ్యాయములు. ఇట్లు గీతయంతయు మూడు షట్కములుగా విభజింపబడినది. ఈ విభాగము అర్థభేదమును బట్టియే గావింపబడినది. మొదటి షట్కమున (అనగా మొదటి ఆరు అధ్యాయములందును) జీవుని వాస్తవస్వరూపముతో గాంచుటకు సాధనమగు కర్మయోగమున్ను, దానికి ముఖ్యముగా ముందుగా నెఱుంగదగిన ఆత్మయొక్క వాస్తవ స్వరూపమున్ను తెలుపబడినవి.

రెండవ షట్కము(అనగా ఏడవ అధ్యాయమునుండి 12వ అధ్యాయము చివర) న పరమాత్మయొక్క స్వరూపమున్ను భక్తియనబడు భగవదుపాసనయున్ను చెప్పబడుచున్నవి.

ఈ రెండు విషయములకు నేమి సంబంధమనగా–భగవదుపాసనయగు భక్తికి జీవాత్మసాక్షాత్కారము అంగము. అట్టి సాక్షాత్కారమునకు సాధనము కర్మయోగము. దానికి అంగము ఆత్మజ్ఞానము. కావున ఆత్మనెఱుంగనిచో కర్మయోగము సిద్ధింపదు. కర్మయోగములేనిచో ఆత్మ సాక్షాత్కారము సున్న. ఆత్మ సాక్షాత్కారము లేనిచో భక్తిమృగ్యము. ఇట్లు రెండు షట్కములకున్ను అంగాంగీభావ సంబంధము కలదు.

ఇక ప్రధాన శాస్త్రార్థము ముక్తి, దానికి సన్నిహిత ముఖ్యసాధనము భక్తి, అది యీ షట్కమున సాధనములతో సమగ్రముగా చెప్పబడు చున్నది. గాన నీ షట్కమునకు ప్రధాన శాస్త్రార్థసంబంధము సాక్షాత్తుగనే కలదు. ఇక నీ యధ్యాయమునకు ఆరవ అధ్యాయముతోగల సంబంధమేమనగా –

ఆరవ యధ్యాయాన్తిమ శ్లోకమున కర్మయోగముయొక్క అతిశయమును వర్ణించుచు -

తపస్విభ్యోఽధికో యోగీ । జ్ఞానిభ్యోఽపి మతో ఽధికః ।
కర్మిభ్య శ్చాధికో యోగీ । తస్మా ద్యోగీ భవా ర్జున! ॥

అను శ్లోకమున భక్తిలేని తపోనిష్ఠులకంటెను, ఆత్మజ్ఞానములేని బుద్ధిమంతుల కంటెను, కామ్యకర్మలనాచరించు కర్మఠులకంటెను ఆత్మజ్ఞానముకల నిష్కామ కర్మయోగి ఉత్తముడు గాన నీవు కర్మయోగి వగుమని శ్రీకృష్ణుడర్జునుని ప్రోత్సహించెను.

ఇంత మాత్రముచే తృప్తిచెంది అర్జును డూరకున్నచో నాతనికి దాని వలన ఆత్మ సాక్షాత్కార రూపమైన అవాంతరఫలమే లభించునుగాని ప్రధాన పురుషార్థమైన మోక్షము లభింపదేయని యాలోచించి అట్టి ఆత్మ సాక్షాత్కారమును అంగముగా జేసుకొని ఫలిం చునట్టి మోక్షసన్నిహిత సాధనమగు భక్తియం దభిరుచి జనించుటకై తిరిగి -----

యోగినా మపి సర్వేషాం । మద్గతేనాన్తరాత్మనా ।
శ్రద్ధావాన్ భజతే యో మాం । స మే యుక్తతమో మతః ॥

'ఇట్టియోగులందరికంటెను నన్ను పొందవలెనను త్వర గలవాడై నాయందు మనస్సునుంచి నన్ను పాసించువాడు (భక్తుడు) శ్రేష్ఠుడని నేను తలంచుచున్నాను' అని సూచించి యా యధ్యాయమును ముగించెను.

అట్లు సూచింపబడిన ఉపాస్య భూతుడగు పరమపురుషుని వాస్తవ స్వరూపము, ప్రకృతిచే నది మరుగుపడి యుండుట, దానిని తొలగించుటకు జేయదగిన ప్రపత్తి మొదలగునవి యీ యధ్యాయమున జెప్పబడుటచే వెనుకటి యధ్యాయముతో దీనికిగల సంబంధము జూపబడినది.

ఇప్పుడీ యధ్యాయమునకు ప్రధానశాస్త్రముతోగల సంబంధమేమనగా-

ప్రధాన శాస్త్రార్థము ముక్తి, దానికి దగ్గర సాధనము భక్తి, అట్టి భక్తి ముక్తికెట్లు తోడ్పడును? అట్టి భక్తులెన్ని తెరగులున్నారు ? వారిలో శ్రేష్ఠుడెవ్వడు? అట్టివా డేల దుర్లభుడు? ఇట్టి భక్తులకు దెలియతగినది, అనుష్ఠించదగినదేది? అను విషయములే యీ యధ్యాయమున తెలుపబడుచుండుటచే నీ యధ్యాయమునకు ప్రధాన గీతాశాస్త్రార్థముతోగల సంబంధము సువ్యక్తము.

4.ప్ర. శ్రీకృష్ణ దర్జునున కుపదేశింతునని ప్రతిజ్ఞ గావించిన జ్ఞానము విజ్ఞానము లెవ్వి?

ఉ. జ్ఞానమనగా భగవంతుని స్వరూపమును గూర్చిన జ్ఞానము.

విజ్ఞాన మనగా- విశిష్టవిషయమైన జ్ఞానము. అనగా-భగవంతుడు, చేతనములు అచేతనములు అన్నిటికంటెను వేరైన వాడను జ్ఞానము.

చేతనాచేతనములకంటె వేరు ఎట్లగుచున్నాడు? అనగా ప్రకృతి ఎల్లప్పుడును మారుచుండు స్వభావము గలది. పుట్టుట పెరుగుట విరుగుట మొదలగు వికారములను చెందుచునే యుండును. జీవుడు నిత్యమగుటచే నాతని స్వరూపము మెట్లు మారక పోయినను ఆతని అపహతపాప్మత్వాది స్వభావము మాత్రము కర్మవశమున మారుచునే యుండును. ప్రకృతికి సత్వరజస్తమోగుణ సంబంధము నిత్యము. జీవునకు పుణ్య పాప సంపర్కము, తత్ఫలానుభవమునకు శరీర పరిగ్రహము, దాని వలన ఆకలి దప్పిక దుఃఖము మొదలగునవి అనివార్యములు. పరమపురుషున కిందొక్కటియు లేదు. పైగా నాతడు సకల సద్గుణరాశి. అందుచే నాతడీ ప్రకృతి పురుషులకంటె వేరైనవాడు. ఇట్లెరుంగుట విజ్ఞానము.

5.ప్ర. ఈ విజ్ఞానమెట్లు విమర్శింపబడెను?

ఉ. అప్రధానమగుటచే అపరాప్రకృతి యనబడు అచిత్తు-భూమి, నీరు, నిప్పు, గాలి, ఆకసము, ఇంద్రియములు, మహత్తత్వము, అహంకారము అని ఎనిమిది విధములు. ఈ ఎనిమిది విధములగు జడప్రకృతియు పరమ పురుషాధీనమై యుండును.

ఇంతకంటె వేరైన జీవప్రకృతి యొకటి గలదు. అది ప్రధాన మగుటచే దానికి పరాప్రకృతి యని పేరు. అది వెనుకటి యపరాప్రకృతిని తనకు భోగ్యముగా పరిగ్రహించి తన కర్మానుసారముగా దానిని యనుభవించును. దానిని ధరించి నిలుపునదియు నిదియే. ఇందువలననే యిది ప్రధానమైనది. ఇదియును పరమ పురుషాధీనమై యుండును.

ఈ రెండు ప్రకృతుల మూలముననే బ్రహ్మ మొదలు గడ్డిపరక వరకుగల వివిధ భూతజాతములన్నియు పుట్టుచున్నవి. భగవదధీనమగు ప్రకృతులవలన బుట్టిన వగుటచే నవి భగవదధీనమైనవియే గదా!

కావుననే భగవంతుడు సకలజగత్తుయొక్కయు పుట్టుటకు, గిట్టుటకు, పాలింపబడుటకు కారణభూతుడగుచున్నాడు. ఇట్లగుటకు సర్వోత్కృష్టమైన జ్ఞానశక్తి బలాది గుణములుండవలెను. అట్టి గుణము లింక నేరికి గలవు?

కావున నీతనిని మించిన తత్త్వము వేరొండులేదు. హారమందలి ఒకే దారము, పైకి కాన్పింపక లోపలనుండి పెక్కు మణులను ధరించియుండు నటుల ఒకే భగవంతుడు పైకి కాన్పింపక అంతర్యామిగా నుండి సకల చేతనా చేతనములను ధరించి యుండును. ఇట్లు సకల జగత్తున కాధారభూతుడై యుండుట చేతనే సమస్త శబ్దములచే నాతడే చెప్పబడుచున్నాడు. ఆధారభూతుడన్నంత మాత్రమున శరీరముచే నాత్మ ధరింపబడునటుల వాటిచే భగవంతుడెంత మాత్రమును ధరింపబడదు. ఆతనిచే మాత్రమవి ధరింపబడును. అని యిట్లీ విజ్ఞానము విమర్శింపబడినది.

6.ప్ర. ఇట్టి మహావైభవోపేతుడగు శ్రియఃపతి నెల్లవారును ప్రేమించి సేవింపరేల ?

ఉ. సర్వేశ్వరుడిట్లు సకల జగత్తునకును కారణభూతుడును, నియంతయు, సకల కల్యాణగుణాకరుడు నైనను పూర్వజన్మకర్మలచే లభించిన దేహము, ఇంద్రియములు, వాటిచే యనుభవింపబడు విషయములు మొదలగు వాటిచే మోహింపజేయబడిన బ్రహ్మాది పిపీలికాపర్యంత మగు జగత్తా తనిని యెఱుంగజాలక యున్నది. ఇట్టి ప్రతిబంధకమగు పదార్థములకు మూలకారణమైన సత్త్వ రజ స్తమోగుణమయ మగు ప్రకృతి, క్రీడాపరుడగు శ్రియఃపతిచేతనే నిర్మింపబడినది. గాన దీని నెవ్వడును తప్పించు కొనజాలడు. ఇది ప్రతివానిని ఆవరించి భగవత్స్వరూపమును తెలియనీయక కప్పివేయుటయేగాక తన వికారములయందే ఆదరమును పెంపొందించును. కావున శ్రియఃపతి నెల్లివారును ప్రేమించి సేవింపనొల్లరు.

7.ప్ర. ఇట్లు ప్రకృతిబంధమెల్లరకును దుస్తరమగుచో నిక వేదాంతమేల ?

ఉ. ఈ ప్రకృతిబారినుండి తప్పించుకొను ఉపాయము లేకపోలేదు. సర్వేశ్వరుడు సత్యసంకల్పుడు. బంధమును కల్పించినట్లే మోక్షమును ప్రసాదించగలడు. పరమకారుణికుడు. పరుల దుఃఖమును జూచి సహింపజాలడు. పెద్ద పిన్నయని మన యోగ్యతల నారయక ఎల్లరకును రక్షకుడై యుండును. కావున నిట్టివాని నెవ్వరు శరణు జొచ్చుచున్నారో అట్టివారీ మాయాబారినుండి తప్పించుకొని భగవంతునే యుపాసించి మోక్షసుఖమును బడయగల్గుచున్నారు.

8. ప్ర. అట్టి భగవదుపాసనకు కారణమైన భగవత్ప్రపత్తిని ఎల్లరును చేయకుండుటకు కారణమేమి ? అట్టివారి నెన్ని విధములుగా విభజించ వచ్చును ? కారణమేమి?

ఉ. అందరును భగవత్ప్రపత్తిని చేయకుండుటకు కారణము వారి పాపమే. అట్టివారిని వారాచరించిన పాప తారతమ్యమునుబట్టి మూఢులు, నరాధములు,

మాయయాపహృతజ్ఞానులు, అసురభావాశ్రితులు అని నాలుగు తరగతులుగా విభజింప వచ్చును.

అందుమూఢులనగా విపరీత జ్ఞానము కలవారు. అనగా వెనుక చెప్పబడినట్లు చేతనా చేతనములు భగవంతుని యధీనమైనవని యెఱింగియు తాము స్వతంత్రుల మనియు, ప్రాకృతిక పదార్థము లన్నియు తమ భోగము కొఱకే సృష్టింపబడినవనియు తలంచువారు.

నరాధములనగా - వేదశిరస్సులగు ఉపనిషత్తుల యర్థముల నెఱుంగ కున్నను లోకప్రసిద్ధినిబట్టియు, ఇతిహాస పురాణాది పరిచయమును బట్టియు, తనను భగవదధీనుడనని గుర్తెరింగియు భగవంతుని కభిముఖులై సేవింప నొల్లనివారు.

మాయయాపహృతజ్ఞాను లనగా భగవంతుని గూర్చియు భగవదైశ్వర్య మును గూర్చియు పూర్తిగ నెఱింగియు దానికి విరుద్ధమగు కుయుక్తులతో నాలోచించి ఆ జ్ఞానమును చెరచుకొనువారు.

అసుర భావాశ్రితులు అనగా భగవంతుని గూర్చియు భగవదైశ్వర్యమును గూర్చియు నిశ్చలమైన వాస్తవజ్ఞానమున్నను పామునకు పాలు విషమును వృద్ధిపరచునట్లు వారిజ్ఞానము భగవద్విద్వేషమునే పెంచును. అట్టివారీ వర్గమునకు చెందినవారు.

9.ప్ర. భగవంతుని శరణుజొచ్చి ప్రతిబంధకమును తొలగించుకొని యాతని నుపాసించువా రెన్ని విధములు ?

ఉ. తాము జన్మాంతరము నందాచరించిన పుణ్యముయొక్క తారతమ్యమును బట్టి భగవంతుని శరణుజొచ్చి యాతని నుపాసించువారు ఆర్తులు, అర్థార్థులు, జిజ్ఞాసులు, జ్ఞానులు అని నాలుగు విధములుగ నున్నారు. వీరి నలుగురకును విశ్వాసాదులు సమానములేయైనను పుణ్యభేదముచే తటస్థించు ఫలభేదమును బట్టి భేదము నిర్ణయింపబడినది.

వీరిలో 'ఆర్తు'డనగా - తనకున్న ఐశ్వర్యమంతయు పోవుటచే తిరిగి దానిని భగవదనుగ్రహముచే సంపాదింపగోరువాడు.

'అర్థార్థి' యనగా తన కైశ్వర్య మసలే లేకుండుటచే దానిని భగవదనుగ్రహముచే బడయజూచువాడు,

(వీరిరువురును చివరకు ఐశ్వర్యమునే గోరువారగుటచే శ్రీభాష్యకారు లిరువుర నొక కోటిగనే గణించిరి.)

'జిజ్ఞాసు' వనగా- ప్రకృతి సంబంధమును పూర్తిగ త్రెంచుకొని జీవాత్మ స్వరూపమును బడయగోరువాడు.

'జ్ఞాని'యనగా-తాను భగవచ్ఛేషత్తై కరతుడ నని (భగవంతున కతిశయ మొనగూర్చుటయే తన ముఖ్యస్వరూపమని) యెఱింగిన వాడగుటచే జిజ్ఞాసువువలె ప్రకృతి సంబంధమునుండి విడివడిన ఆత్మస్వరూపమును పొందిన చాలునని తృప్తిని చెందక భగవంతుడే తనకు పరమ ప్రాప్యుడుగాన ఆతనిని వెంటనే పొందవలెనని త్వర పడుచుండువాడు.

10. ప్ర. వీరిలో నెవరిని శ్రేష్ఠులుగా భగవంతుడు పరిగణించెను ? ఎందుచేత?

ఉ. ఈ నలుగురు ఉదారులే. (ఉదారుడనగా- చాలిన దానికంటె హెచ్చుగ నిచ్చువాడు గదా! తననుండి యాచించి లభించువారు ఉదారు లెట్లగుదురు? అనగా-భగవంతుని ఔదార్యమేమనగా- అడిగిన ఫలములనన్నిటిని యిచ్చుటయే. అది యాతని సర్వస్వము. అది యడుగు వాడున్ననే ప్రకాశించును. గాన యీ యడుగు వారందరును తన సర్వస్వమును (అడిగినదెల్ల నిచ్చుటను) ప్రకాశింప జేయుచున్నారు. గాన ఆయన దృష్టిలోనుదారులే) కాని వీరిలో జ్ఞాని యధికుడు. పై వారు భగవంతున కాధిక్యమును సంపాదించువారలే గాని జ్ఞాని యాతని స్వరూపమునే నిలబెట్టువాడగును. ఎందువల్ల ననగా- ఆ భక్తుడు భగవంతుడు లేక ఒక్క క్షణమైనను జీవింపజాలడు. అట్లే భగవంతుడును ఆతడులేక నిలువజాలడు. ఆ భక్తుడు నిత్య యుక్తుడు. ఏకభక్తుడు (ఈ నిత్యయుక్త, ఏకభక్తి శబ్దములిదివరలో ప్రారంభమున వివరింపబడెను) కావున భక్తునకు భగవంతుని యందుండు ప్రేమను సర్వజ్ఞుడును సర్వశక్తియుగల సర్వేశ్వరుడే చెప్పజాలడు. అట్లే భగవంతున కట్టి భక్తునియందుండు ప్రేమయు చెప్పనలవికానిదియే.

ఇట్టి భక్తుడగుటకు కొన్నివేల జన్మలలో నార్జించిన పుణ్యరాశి యుండ వలెను. అదియున్నచో 'నేను వాసుదేవుని యధీనములో నున్నాను. నా స్వరూపము స్థితి ప్రవృత్తియు నాతని యధీనములే. ఆతడే నాకు పొందదగిన వాడు. ఆతడే నాకు పొందించ తగినవాడును." అను విశ్వాసములో నాతనిని ఉపాసించును.

11. ప్ర. లోకమున నిట్టి జ్ఞానులు దుర్లభమగుటకు కారణమేమి?

ఉ. ఇందులకు ముఖ్యకారణము నశ్వరఫలములయందాసక్తియు, వాని కొరకై యితరదేవతలయందాదరమును. శాశ్వతానందరూపమగు మోక్షమును విడిచి యిట్టి నశ్వరఫలములను కోర నేల? యనినచో అందులకు కారణము

తమతమ పూర్వజన్మానుభవసిద్ధమైన సంస్కారమే. ఆ సంస్కారము నియతము. అనగా, దాని బారినుండి తప్పించుకొననేరికిని శక్యముకాదు. ఆ ఫలములను భగవాను డీయజాలడా? యనినచో ఏల నీయజాలడు? ఆ దేవతల కాశక్తి ఈత డొసంగినదేగదా! కాని ఆ జ్ఞానము వీరికేది? వారికి జనించిన ఆ కోరికలు వారి కాజ్ఞానమును తుడిచి పెట్టును. అందుచే వారు ఆయా దేవతల యనుగ్రహమును బడయుటకు వారినే ఆశ్రయించి యర్చింతురు. ఐనను పరమకారుణికుడగు భగవంతుడుపేక్షించి యూరకొనడు. అట్లూరకున్నచో వారు తమ యభీష్టసిద్ధికై తగని ఉపాయముల నాచరించి యనర్థముల పాలగుదురు. అది యా కరుణామయుడు సహింపనేరడు. సహింపక 'అయ్యో! వీరారాధించు దేవతలు నా శరీరభూతులే గదా! వీరెఱుంగక వారి నారాధించినను నిజమున కది నన్నారాధించినట్లే యగుచున్నది గాన వీరి నుపేక్షింపరాదని' తలంచి వారికా శ్రద్ధ విఘ్నములచే చెడకుండ ఫలము లభించువరకు దినదినాభివృద్ధిని జెందునట్లనుగ్రహించును. వారా శ్రద్ధాభక్తులతో నా యింద్రాదు లను వీడక కొలుచుచుందురు. అంతట నా సర్వేశ్వరుడు డాయింద్రాది దేవతలకు వారు కోరిన ఫలముల నిచ్చు శక్తినిచ్చి వారిచే నా భక్తుల కాఫలములనిప్పించు చుం డును. తనతో కలహించి యిల్లు విడిచిపోయిన తనబిడ్డ ఆకలితో నలమటించుచుండ చూడజాలక తండ్రి వానికి తెలియకుండగనే సత్రపు గుమస్తాకు డబ్బిచ్చి యన్నమును పెట్టించునుగదా! అయిన నేమాయె - అట్టివారి కాదేవత లిచ్చు ఫలములు నిజమునకు భగవంతుడే యిచ్చినట్లైనను వీరి కా జ్ఞానము లేకుండటచే ఆయా దేవతల యోగ్యతకు తగియేయుండును. అందుచే నవి యల్పములును. నశ్వరములును అయి యుండును. ఎందులకనగా- తత్క్రతున్యాయముచే ఇంద్రాదుల నారాధించువారు ఇంద్రాది సాయుజ్య మునే పొందుదురు. (తత్క్రతున్యాయమనగా-ఉపాసించువాడా దేవతలు నివసించు లోకములలో నా దేవతలనుభవించు ఫలములనే యనుభవించుట. సాయుజ్యమనగా-సమాన భోగత్వమేగదా!) ఇంద్రుడుండెడు లోకము (స్వర్గము)న్ను, ఆతడ నుభవించు భోగములున్ను, ఆతడు చేసిన పుణ్య (శతా శ్వమేధ) ఫలమే గాన పుణ్యముతోబాటు అవియు తరిగిపోవును. భగవంతునకు పుణ్య పాపములు లేకుండుటచే నాతనిలోకము ఆ భోగములు పుణ్యఫలములు కావు. అందు 'చే నవి నశింపవు. కావున నిత్యములు. ఈ నిజము నెఱింగిన భక్తులు ఆ యల్పపరిమిత ఫలములను వాటినిచ్చు దేవతలను విడిచి, భగవదనుగ్రహమును బడయుకర్మల నాచ

రించి, నాతని నుపాసించి యాతని లోకమును నాతని సాయుజ్యమును బడయుచున్నారు.

ఇట్లు భగవంతుని యెఱుంగకుండుట క్రిందటి జన్మలలో నితర దేవతలనారాధించివారిచ్చు ఫలములననుభవించిన వాసనచేగదా! భగవంతుడు తన కారుణ్యాది గుణములచే ప్రేరేపింపబడి అందరును చూచి యాశ్రయించి సేవించునట్లు మనుష్యాది రూపములతో భూలోకమున నవతరించియున్నాడే! ఇక నాతని యెఱుంగకుండుట యెట్లు? అన్నచో నిజమేకాని యాతడట్టి పరాత్పరుడై యింత సులభముగా నవతరించినట్లు వారెఱింగినగదా! వారది యెఱుంగనేరక ఆతనిని ఇంతకు పూర్వ మెప్పుడో ఎఱుంగబడక యిప్పుడు కర్మవశమున జన్మించిన సామాన్యమానవునిగా తలంచి యాతని నారాధింపనొల్లరు. అందుచే పూర్వవాసనాబలము చే నింద్రాదులనే యుపాసింతురు.

ఆతని నట్లు తలంచుట కేమికారణము ?- తనినందరును సులభముగ నాశ్రయించి తరింతురు గదా యని భగవంతుడు మనుష్యుడుగా పుట్టినంతమాత్రముచే మూఢులాతని ననాదరించుచున్నారు. మనుష్యుడుగా పుట్టినంతమాత్రమున తన పరత్వమును మఱుగు పరచినాడా? అతిమానుషచేష్టలు గావించి తన పరత్వమును జూపించుచునే యున్నాడు. 'కుట్టనిచో- కుమ్మరిపురుగ'ను లోకమున కేమి చెప్పుదుము? వీరేకాదీయెఱుంగకుండుట. ఇంతకు పూర్వులు యిప్పుడున్నవారు యిక ముందుండువారు యెవ్వరును ఆతని నిట్లే యెఱుంగరు.

ఇట్లెవ్వరును యెఱుంగక పోవుట చిత్రమే. అయినను దానికి ప్రబల కారణము లేకపోలేదు. జన్మాంతర వాసనయే దానికి కారణము. పూర్వజన్మమున నే వస్తువులను ప్రేమించుటకును యే వస్తువులను ద్వేషించుటకును అలవడునో తిరిగి పుట్టినతోడనే ఆ యలవాటుచే నా వస్తువులనే ప్రేమించుటకును ద్వేషించుటకును ప్రారంభించును. ఇది వాసనాస్వభావము. దానిచే అనుభవయోగ్యములు కానివాటిని అనుభవించవలెననియు, ద్వేషింపతగనివాటిని ద్వేషించవలెననియు బుద్ధి జనించును. కావుననే జ్ఞానివలె భగవంతుని దరిజేరుట సుఖమనియు, విడిచియుండుట దుఃఖమనియు నెఱుంగక విషయముల ననుభవించుటయే సుఖమనియు, విడిచియుండుటయే దుఃఖమనియు భావించును. అందులకే జ్ఞాని మిక్కిలి దుర్లభుడని భగవాను డానతిచ్చెను.

అట్లగుచో నిక భగవంతుని ఉపాసించువాడెవడు? ఎవ్వడును లేనిచో భగవదుపాసకులు నాలుగు విధములని చెప్పుట కర్థమేమి? యన్నచో-


ఎవరికి అనేక జన్మలచే వార్జించిన పుణ్యరాశిచే భగవంతునికి విముఖునిగా జేయు పాపరాశి నశించునో వారు తమ సుకృత తారతమ్యమును బట్టి భగవంతుని శరణుజొచ్చి మోహమును పోగొట్టుకొని జరామరణ రాహిత్యమునకును (కైవల్యము) అపారమగు ఐశ్వర్యము కొరకును, భగవత్సాయుజ్యప్రాప్తికిని నిశ్చలహృదయముతో భగవంతుని ఉపాసింతురు.

2.ప్ర. కైవల్యార్థులు, ఐశ్వర్యార్థులు, జ్ఞానులు వీరు ముగ్గురును ఎరుంగ వలసినట్టియు, పరిగ్రహించవలసినట్టియు విశేషములెవ్వి?

ఉ. ఇచ్చట యెఱుంగవలసినవి తద్బ్రహ్మ, అధ్యాత్మము, కర్మ, అధిభూతము, అధిదైవము, అధియజ్ఞము, చనిపోవునపుడు తలంచబడు భగవత్స్వరూప విశేషము అని ఏడు విషయములు గలవు.

అందు ముగ్గురును మొత్తముగా నెఱుంగవలసినవి- అధియజ్ఞము, చనిపోవునపు డెరుంగవలసిన భగవత్స్వరూపవిశేషమున్ను, కైవల్యార్థులు మాత్ర మెరుంగవలసినవి-తద్బ్రహ్మము, సమస్తమగు నధ్యాత్మము, అఖిల కర్మయున్ను, ఐశ్వర్యార్థులెఱుంగవలసినవి- అధిభూతము, అధిదైవము.

(ఈ ఏడు విషయములును ఎనిమిదవ అధ్యాయారంభమున ప్రశ్నోత్తర రూపముగా వివరింపబడును.)



అష్టమాధ్యాయార్థ సంగ్రహము

శ్లో. ఐశ్వర్యాక్షర యాథాత్మ్య। భగవచ్చరణార్థినామ్।
వేద్యోపాదేయభావానా। మష్టమే భేద ఉచ్యతే।

అర్థము : ఐశ్వర్య = ఐశ్వర్యమును, అక్షరయాథాత్మ్య = శుద్ధాత్మస్వరూపమును, భగవచ్చరణ= భగవచ్చరణమును, అర్థినాం = కోరువారలకు, వేద్య = తెలియదగిన వాటి యొక్కయు, ఉపాదేయ = చేయదగిన వాటి యొక్కయు, భేదః = భేదము, అష్టమే = ఎనిమిదవ యధ్యాయమున, ఉచ్యతే = చెప్పబడుచున్నది.

తా॥ భగవద్భక్తులు బ్రహ్మరుద్రేంద్రాది భోగములకు మించిన భోగములు కోరువారనియు, కైవల్యమనబడు ప్రకృతి గంధములేని **పరిశుద్ధ** ఆత్మస్వరూపమును బడయగోరువారనియు, భగవత్సాయుజ్యమనబడు పరమ పురుషార్థమైన మోక్షము నపేక్షించువారనియు మూడు విధములుగ నుందురు. అట్టివారికి వారివారి అధికారానుగుణముగ భగవదైశ్వర్యము, **శుద్ధాత్మస్వరూపము**, పరమపురుష స్వరూపము, అర్చిరాది మార్గముల నెఱుంగుటయు, వాటిని మరణసమయమువరకు దృఢముగ ధ్యానించుటయు ఆవశ్యకము. ఈ విషయములన్నియు నీ యెనిమిదవ అధ్యాయమున వేరువేరుగా జెప్పబడుచున్నవి.

శ్రీ భగవద్గీత – అష్టమాధ్యాయము

విషయసూచిక

శ్రీ హయగ్రీవాయ నమః

శ్రీమద్భగవద్గీతా అష్టమోఽధ్యాయః
అక్షర పరబ్రహ్మ యోగః

అవ. మూడు విధములగు అధికారులకును తెలియదగినవిగాను చేయదగినవిగాను ఏడవ అధ్యాయాంతమున ప్రసక్తమైన విషయములను ఏడింటిని వివరముగా తెలియగోరి అర్జునుడు ప్రశ్నించుచున్నాడు.

అర్జున ఉవాచ = అర్జునుడు పలికెను.

1. శ్లో. **కిం తద్బ్రహ్మ కి మధ్యాత్మం । కిం కర్మ పురుషోత్తమ !**
అధిభూతం చ కిం ప్రోక్త । మధిదైవం కి ముచ్యతే ।

అర్థము : పురుషోత్తమ = శ్రీ కృష్ణా! తద్బ్రహ్మ = తద్బ్రహ్మమనగా, కిం = ఏమి? అధ్యాత్మం= అధ్యాత్మమనగా, కిం = ఏమి? కర్మ = కర్మయనగా, కిం = ఏమి? అధిభూతం చ=అధిభూత మనియును, కిం = ఏది, ప్రోక్తం = చెప్పబడినది? అధిదైవం = అధిదైవమని, కిం = ఏది, ఉచ్యతే = చెప్పబడుచున్నది ?

తా॥ ఓ కృష్ణా! కైవల్యార్థులకు తెలియవలసిన తద్బ్రహ్మ, అధ్యాత్మము, కర్మయనగా నేమియో, ఐశ్వర్యార్థులకు తెలియవలసిన అధిభూతము, అధిదైవము అనగా నేమియో తెలుపుము.

2. శ్లో. **అధియజ్ఞః కథం కోఽత్ర । దేహేఽస్మిన్ మధుసూదన ! ।**
ప్రయాణకాలే చ కథం । జ్ఞేయో సి నియతాత్మభిః ॥

అర్థము : మధుసూదన = కృష్ణా ! అత్ర = ఈ, అస్మిన్‌దేహే = కాన్పించు శరీరమున, అధియజ్ఞః = అధియజ్ఞమని చెప్పబడువాడు, కః=ఎవడు? కథం=ఎట్లు? ప్రయాణకాలేచ = శరీరమును విడిచిపోవు సమయమున, నియతాత్మభిః = స్వాధీనమనస్కులగు నీ మువ్వురిచేతను, కథం = ఎట్లు, జ్ఞేయః = తెలియ దగినవాడవు, అసి = అగుచున్నావు?

తా॥ శ్రీకృష్ణా! ఈః కాన్పించు శరీరమున అధియజ్ఞమని పిలువబడువాడెవడు? వాడట్లు పిలువబడుట కేమి కారణము ? ఆత్మ శరీరమును విడచిపోవు తరుణమున స్వాధీనమనస్కులగు నీ మువ్వురిచేతను నీ వెట్లు ధ్యానింపబడవలయును?

అవ. ఈ ప్రశ్నల కన్నిటికిని శ్రీ భగవానుడు క్రమముగ నుత్తరమునొసంగుచున్నాడు, అందీ శ్లోకమున తద్బ్రహ్మ, అధ్యాత్మము, కర్మల స్వరూపము నెఱింగించుచున్నాడు.

శ్రీ భగవానువాచ = శ్రీకృష్ణుడు పలికెను.

3. శ్లో. **అక్షరం బ్రహ్మ పరమం । స్వభావోఽధ్యాత్మ ముచ్యతే ।**
భూతభావోద్భవకరో । విసర్గః కర్మసంజ్ఞితః ॥

అర్థము : పరమం = గొప్పదగు, అక్షరం = నాశరహితమగు జీవ సముదాయము, బ్రహ్మ = తద్బ్రహ్మగా (ఉచ్యతే = చెప్పబడుచున్నది.) స్వభావః=ప్రకృతి, అధ్యాత్మం = అధ్యాత్మమని, ఉచ్యతే = చెప్పబడుచున్నది. భూతభావోద్భవకరః = మనుష్యత్వాది సిద్ధికి కారణమైన, విసర్గః = రేతస్సును విడుచుట, కర్మసంజ్ఞితః = కర్మయనబడును.

తా॥ ప్రకృతికంటెను, బద్ధులకంటెను విలక్షణమగు శుద్ధాత్మసముదాయము తద్బ్రహ్మమనియు, ఆత్మను నిరంతరమంటియుండు భూత సూక్ష్మములును, వాటివలనబుట్టు వాసనాదులును అధ్యాత్మమనియు, మనుష్యుడుగా బుట్టుటకు కారణమైన సంభోగము కర్మయనియు చెప్పబడును. ఈ మూడింటిలో మొదటిది ముముక్షువులకు పొందబడుటకును మిగిలిన రెండును విడువబడుటకును నెఱుంగదగినవి.

అవ. అధిభూత, అధిదైవ, అధియజ్ఞముల స్వరూపము నెఱింగించుచున్నాడు.

4. శ్లో. **అధిభూతం క్షరోభావః । పురుష శ్చాధిదైవతమ్ ।**
అధియజ్ఞోఽహ మేవాత్ర । దేహే దేహభృతాం వర ! ॥

అర్థము : దేహభృతాం = దేహధారులలో, వర = శ్రేష్ఠుడవైన ఓ యర్జునా! క్షరో భావః = నశించుస్వరూపముగల భూతసూక్ష్మముల నాశ్రయించి యుండు శబ్దాదులు, అధిభూతం = అధిభూత మనబడును. పురుషః = సమస్తదేవతలకు పై నుండు సర్వేశ్వరుడు, అధి దైవతం = అధిదైవత మనబడును, అత్ర దేహే = ఈ కాన్పించు ఇంద్రాది శరీరములందున్న, అహమేవ =నేనే, అధియజ్ఞః = అధియజ్ఞ మనబడువాడను.

తా॥ బ్రహ్మేంద్రాదు లనుభవించు విషయములకంటె విలక్షణమైన తమ కాధారమగు భూతసూక్ష్మములతో కూడియుండు 'అధిభూత' మనబడు శబ్దాది భోగములును, ఆ బ్రహ్మేంద్రాదు లందరికంటెను పై వాడగుటచే 'అధిదైవ'మని చెప్పబడు సర్వేశ్వరుడును ఐశ్వర్యార్థున కెఱుంగ దగినవి. ఇంద్రాదులలో నంతర్యామిగానుండి సమస్తయజ్ఞములచే నిజముగ నారాధింపబడుటచే 'నధియజ్ఞ'మనబడు శ్రియఃపతి ముగ్గురిచే నెఱుంగ దగినవాడు.

అవ. ముగ్గురు అధికారులును ఎరుంగవలసిన మరణకాలమునందలిధ్యానమును గూర్చిన ప్రశ్న కుత్తర మొసంగుచున్నాడు.

5. శ్లో. అన్తకాలే చ మా మేవ । స్మర న్ముక్త్వా కళేబరమ్ ।
యః ప్రయాతి స మద్భావం । యాతి నాస్త్యత్ర సంశయః ॥

అర్థము : అన్తకాలేచ = మరణసమయమందు, మాం ఏవ = నన్నే, స్మరన్ = ధ్యానించుచున్న వాడై, కళేబరం = శరీరమును, ముక్త్వా = విడచిపెట్టి, యః = ఎవడు, ప్రయాతి= పోవుచున్నాడో, సః = వాడు, మద్భావం = నా స్వభావమును, యాతి = పొందుచున్నాడు, అత్ర = ఈ విషయమై, సంశయః = సందేహము, న అస్తి = లేదు.

తా॥ మరణ సమయమున భగవంతుని మాత్రమే తలంచుచు చనిపోవు వాడు నిస్సంశయముగ తాను తలంచు భగవత్స్వరూపమునే పొంది తీరును.

అవ. మరణకాల ధ్యానమేదైనను గానిమ్ము అది స్మరింపబడు విషయమునకు సజాతీయమైనఆకారము నొసంగియేతీరు స్వభావముకలదై యుండునని జెప్పుచున్నాడు.

6. శ్లో. యం యం వాఽపి స్మర న్భావం । త్యజత్యన్తే కళేబరమ్ ।
తం తమే వైతి కౌన్తేయ ! సదాతద్భావభావిత : ॥

అర్థము : కౌన్తేయ=అర్జునా!, అన్తే=మరణసమయమున, యం యం భావంవా అపి = ఏయే స్వరూపమునైనను సరియే, స్మరన్=తలంచుచు, కళేబరం = శరీరమును, త్యజతి= విడుచుచున్నాడో, సదా=ఎల్లప్పుడును, తద్భావభావితః=అ భావన యొక్క సంస్కార పటిమకలవాడై, తం తం ఏవ=ఆయాస్వరూపమునే, ఏతి= పొందుచున్నాడు.

తా॥ ఏ స్వరూపమును తలంచుచు చనిపోవుచున్నాడో, నిరంతర మా స్వరూప ధ్యాన సంస్కారపటిమచే తిరిగి జన్మాంతరమునందా స్వరూపము తోనే పుట్టుచున్నాడు.

అవ. ఫలము అంతిమతలంపును బట్టియు, అంతిమతలంపు సంస్కార పటిమనుబట్టియు, సంస్కారపటిమ భావనాతిశయమును బట్టియు, భావనాతిశయము చేయబడు కర్మను బట్టియు నుండునుగాన వర్ణాశ్రమ ధర్మము నాచరింపుమనియుపదేశించుచున్నాడు.

7. శ్లో. తస్మా త్సర్వేషు కాలేషు । మా మనుస్మర యుద్ధ్య చ
మయ్యర్పితమనో బుద్ధిః । మామేవైష్య స్య సంశయః ॥

అర్థము : తస్మాత్ = కాబట్టి, సర్వేషు కాలేషు = అన్నివేళలయందును, మాం = నన్ను,

అనుస్మర = ధ్యానింపుము, యుధ్య చ = యుద్ధమునున్ను చేయుము, మయి = నాయందు, అర్పితమనోబుద్ధిః = మనస్సును బుద్ధిని యుంచినవాడవై, మాం ఏవ= నన్నే, ఏష్యసి = పొందగలవు. అసంశయః = సందేహములేదు.

తా॥ కావున, చనిపోవువరకును సర్వదా నన్నే ధ్యానించుచు దానికి ముఖ్యకారణమైన వర్ణాశ్రమములకు చెందిన నిత్యనైమిత్తిక కర్మలను చేయుచుండుము. ఇట్లు ప్రాయముగ నాయందు నీ మనోబుద్ధుల నుంచి మరణ సమయమున నన్నే తలంచుచు నీవు కోరినరీతిగ నన్ను పొందుటలో సందేహమేలేదు.

మనస్సు నుంచుట యనగా ధ్యానించుట.

బుద్ధినుంచుట యనగా ఫలమునిచ్చునని నమ్మియుండుట.

అవ. ఇట్లు సాధారణముగా తానభిలషించు ఫల ప్రాప్తి మరణసమయ ధ్యానముపై నాధారపడియుండును. గాన ముగ్గురును చేయవలసిన ఉపాసనరీతులలోగల తారతమ్యమును తెలుపగోరి మునుముందు ఐశ్వర్యార్థుల ఉపాసన విధానమును, దానిని బట్టియుండు మరణసమయపు ధ్యానపద్ధతిని తెలుపుచున్నాడు.

. శ్లో. **అభ్యాసయోగయుక్తేన । చేతసా నాన్యగామినా ।**
పరమం పురుషం దివ్యం । యాతి పార్థా! నుచి న్తయన్ ।

ర్థము : పార్థ = అర్జునా! అభ్యాసయోగయుక్తేన = అభ్యాసయోగములతో కూడుకొని యున్నదగుటచే, నాన్యగామినా=చలించినట్టి, చేతసా= మనస్సుచేత, దివ్యం= అప్రాకృతుడను, పరమం=చేతనాచేతన విలక్షణుడనునై, పురుషం = పురుషుడనగు నన్ను, చిన్తయన్=ధ్యానించుచున్నవాడై, (మాం ఏవ=నన్నే) యాతి= పొందుచున్నాడు.

తా॥ అభ్యాసమనగా- ధ్యేయమగు వస్తువునందు సర్వదా మనస్సునుంచుట, యోగమనగా ప్రతినిత్యము ధ్యానసమయమున ప్రీతితో ప్రత్యక్షసమానాకారముగ చేయబడు ప్రధానోపాసనము. ఈ రెండిటివలనను మనస్సు ఏకాగ్రమగును. అట్టి మనస్సుతోనంతిమసమయమున పరమాత్మను ధ్యానించి నచో ఐశ్వర్యమున భగవంతుని పోలిన యాకారముతో తిరిగి జన్మించును.

9. శ్లో. **కవిం పురాణ మనుశాసితార । మణోరణీయాంస మనుస్మరే ద్యః ।**
సర్వస్య ధాతార మచిన్త్యరూప । మాదిత్యవర్ణం తమసః పరస్తాత్ ॥

అర్థము : కవిం = సర్వజ్ఞుడును, పురాణం = పురాతనుడును, అనుశాసితారం =అన్నిటికి నాజ్ఞాపకుడును, అణోః=అణువగు జీవునికంటె, అణీయాంసం = మిక్కిలి

సూక్ష్మమైనవాడును, సర్వస్య = సకల జగత్తునకును, ధాతారం = సృష్టికర్తయును, అచిన్త్యరూపం = చింతింపశక్యము కాని స్వరూపము కలవాడును, తమసః= ప్రకృతి కంటె, పరస్తాత్ = బహిర్భూతమైన, ఆదిత్యవర్ణం =సూర్యునివంటి రంగుకలవాడును.

తా॥ సర్వజ్ఞుడును, పురాతనుడును, ప్రపంచమునకు శిక్షకుడును, జీవుని కంటెను సూక్ష్మమైనవాడును, సృష్టికర్తయు, చింతింప శక్యము కాని విలక్షణ స్వరూపుడును, అప్రాకృతమై సూర్యునివలె ప్రకాశించు దివ్య మంగళ శరీరము కలవాడును అగు పురుషుని (దీనికి ముందుశ్లోకముతో సంబంధముకలదు.)

10.శ్లో. ప్రయాణకాలే మనసాఽచలేన
భక్త్యా యుక్తో యోగబలేన చైవ ।
భ్రువో ర్మధ్యే ప్రాణ మావేశ్య సమ్యక్
స తం పరం పురుష ముపైతి దివ్యమ్ ।

అర్థము : దివ్యం = దివ్యుడైన, పరంపురుషం = పరమపురుషుని, యః = ఎవడు, భక్త్యా = భక్తితోను, యోగబలేన చ ఏవ = యోగబలముతో నున్న, యుక్తః (సన్)=కూడు కొనినవాడగుచు, అచలేన = నిశ్చలమైన, మనసా = మనస్సుతో, ప్రయాణకాలే = మరణసమయమున, భ్రువోః = కనుబొమలయొక్క, మధ్యే=మధ్యయందు, ప్రాణం=ప్రాణవాయువును, సమ్యక్ = బాగుగా, ఆవేశ్య = స్థాపించి, అనుస్మరేత్ = స్మరించునో, సః = వాడు, తం = ఆ పరమపురుషుని, ఉపైతి = పొందుచున్నాడు.

తా॥ అట్టిదివ్యమైన పరమపురుషుని నిత్యాభ్యాసముగల భక్తియోగ బలముచే చలించని మనస్సుకలవాడై చనిపోవు సమయమందు కనుబొమల మధ్య ప్రాణవాయువును చక్కగా నిలిపి సదా స్మరించువాడు తప్పక ఆ దివ్యపురుషునితో సమానముగు ఐశ్వర్యము కలవాడగును.

అవ. కైవల్యమును కోరువారు స్మరించవలసిన పద్ధతిని చెప్పుచున్నాడు.

11.శ్లో. యదక్షరం వేదవిదో వదన్తి । విశన్తి యద్యతయో వీత రాగాః ।
యదిచ్ఛన్తో బ్రహ్మచర్యం చరన్తి । త త్తే పదం సఙ్గ్రహేణ ప్రవక్ష్యే ॥

అర్థము : వేదవిదః = వేదార్థము నెఱింగినవారు, యత్ = దేనిని, అక్షరం = వికారములు లేనిదానినిగా, వదన్తి=చెప్పుచున్నారో, యత్ = ఏ అక్షరమును, వీతరాగాః = కోరికలు లేనివారగు, యతయః = జితేంద్రియులు, విశన్తి = ప్రవేశించుచున్నారో,

యత్ =ఏ యక్షరమును, ఇచ్ఛన్తః=పొందగోరుచున్నవారై, బ్రహ్మచర్యం = బ్రహ్మచర్య వ్రతమును, చరన్తి, = అచరించుచున్నారో, తత్ = ఆ, పదం = పొందబడు వస్తువును గూర్చి, తే = నీకు, సఙ్గ్రహేణ = సంక్షేపముగా, ప్రవక్ష్యే = చెప్పగలను.

తా॥ వేదార్థము నెఱింగిన పెద్ద లే యక్షరమును స్థూల్యాది వికారములు లేనిదానినిగా చెప్పుదురో, విరక్తులగు యతులు ఏయక్షరమును పొందగోరి బ్రహ్మచర్యము నాచరింతురో, నిఖిల వేదాంత ప్రసిద్ధమైన అట్టి నా స్వరూపమగు అక్షరమును ఉపాసనకు తగినట్లు నీకు సంగ్రహముగ జెప్పెదను.

12.శ్లో. సర్వద్వారాణి సంయమ్య । మనో హృది నిరుధ్య చ ।
మూర్ధ్న్యాధాయాత్మనః ప్రాణ । మాస్థితో యోగధారణామ్ ॥

అర్థము : సర్వద్వారాణి = సకలజ్ఞానేంద్రియములను, సంయమ్య = అరికట్టి, మనః = మనస్సును, హృది = హృదయమునందు, నిరుధ్యచ = నిలిపియుంచి, యోగధారణాం= యోగమనబడు ధారణను, ఆస్థితః = పొందినవాడై, ఆత్మనః = తనయొక్క, ప్రాణం = ప్రాణవాయువును మూర్ధ్ని = శిరస్సునందు, ఆధాయ = ఉంచి.

తా॥ జ్ఞానేంద్రియములను వాటి పనులనుండి మరలించి , హృదయకమల మందున్న పురుషోత్తమునియందు మనస్సును నిలిపి, అచ్చట స్థిరమైన స్థితికలవాడై తన ప్రాణవాయును తలయందుండు సుషుమ్నయందు ప్రవేశపెట్టి, (దీనికి ముందుశ్లోకముతో సంబంధము కలదు.)

13.శ్లో. ఓ మిత్యేకాక్షరం బ్రహ్మ । వ్యాహరన్ మా మనుస్మరన్ ।
యః ప్రయాతి త్యజన్ దేహం । స యాతి పరమాం గతిమ్ ॥

అర్థము : బ్రహ్మ = పరమాత్మను బోధించునట్టి, ఓమ్ ఇతి = ఓమ్ అనెడు, ఏకాక్షరం = ఒకే అక్షరమును, వ్యాహరన్ = ఉచ్చరించుచు, మాం = నన్ను, అనుస్మరన్ = ధ్యానించుచున్నవాడై , దేహం = శరీరమును, త్యజన్ = విడుచుచున్నవాడై , యః= ఎవడు, ప్రయాతి = వెడలిపోవునో, సః = వాడు, పరమాంగతిం = గొప్పదైనగతిని, యాతి = పొందుచున్నాడు.

తా॥ నన్ను బోధించునట్టి ఓం అనెడు ఒకే అక్షరము నుచ్చరించుచు ఓంకార వాచ్యుడనగు నన్ను ధ్యానించుచు శరీరమును విడిచి అర్చిరాది మార్గమున పోవువాడు నాతో సమానమగు ఆకారముగల తన శుద్ధాత్మ స్వరూపమును పొందును.

అవ. ఇట్లు ఐశ్వర్యార్థికిని, కైవల్యార్థికిని తాము పొందగోరు ఫలములకు తగునట్లు భగవంతు నుపాసింపవలసిన రీతిని పేర్కొని, ఇప్పుడు భక్తుని భగవదుపాసనా పద్ధతిని, అతడు భగవంతుని పొందురీతిని చెప్పుచున్నాడు.

14.శ్లో. అనన్యచేతా స్సతతం । యో మాం స్మరతి నిత్యశః ।
తస్యా హం సులభః పార్థ! । నిత్యయుక్తస్య యోగినః ।

అర్థము : పార్థ = అర్జునా! యః = ఎవడు, నిత్యశః = ప్రతినిత్యమున్ను, సతతం = సర్వకాలమందున్ను, అనన్యచేతాః = ఇతర విషయములపై ప్రవర్తించని మనస్సుకలవాడై, మాం = నన్ను, స్మరతి = చింతించుచున్నాడో, నిత్యయుక్తస్య= నాతోడి నిత్యసంబంధముకల, తస్య = అట్టి, యోగినః = జ్ఞానికి, అహం = నేను, సులభః = సుఖముగా పొందదగినవాడను, (భవామి = అగుచున్నాను.)

తా॥ అర్జునా! భక్తియోగారంభమునుండియు సర్వకాలమును ఇతర విషయములను తలంచక నన్నే స్మరించుచు నాతోడి నిత్యసంబంధమును కోరునట్టి భక్తియోగికి నేనే పొందదగినవాడను, అతడు నన్ను సుఖముగ పొందగలడు.

అవ. ఇక మీదట మిగిలిన యధ్యాయముచే భక్తునకును, కైవల్యార్థికిని గమ్యస్థానమునుండి తిరిగి రాకుండుటయు, ఐశ్వర్యార్థికి తిరిగి రావలసి యుండుటయును చెప్పుచున్నాడు.

15.శ్లో. మా ముపేత్య పునర్జన్మ । దుఃఖాలయ మశాశ్వతమ్ ।
నా ప్నువంతి మహాత్మాన । స్సంసిద్ధిం పరమాం గతాః ।

అర్థము : మహాత్మానః = గొప్పమనస్సుకలవారును, పరమాం = గొప్పదైన, సంసిద్ధిం = సిద్ధిని, గతాః = పొందినవారును అయి, మాం = నన్ను, ఉపేత్య = పొంది, పునః= తిరిగి, దుఃఖాలయం = దుఃఖములకు స్థాన మైనట్టియు, అశాశ్వతం = అస్థిరమైనదియునగు, జన్మ = జన్మమును, న అప్నువంతి = పొందరు.

తా॥ గొప్ప మనస్సుకలవారు నా నిజస్వరూపము నెఱింగి నాయందే తమ మనస్సును లగ్నముచేసి నన్నే ఆశ్రయించి ఉపాసించి సంసిద్ధి రూపుడనైన నన్ను పొందుచున్నారు. పిదప, వారు దుఃఖ పరంపరలకు స్థావరమగు నస్థిర జన్మలను పొందరు.

అవ. ఐశ్వర్యగతిని పొందినవారు తిరిగి వచ్చుటకును, భగవంతుని పొందినవారు తిరిగి రాకుండుటకును కారణము నికమీదట చెప్పుచున్నాడు.

16.శ్లో. ఆబ్రహ్మభువనాల్లోకాః । పున రావర్తినోఽ ర్జున ! ।
మా ముపేత్య తు కౌన్తేయ । పునర్జన్మ న విద్యతే ॥

అర్థము : అర్జున = అర్జునుడా! ఆ బ్రహ్మభువనాత్ = బ్రహ్మలోకమువరకు నుండెడి, లోకాః= లోకములన్నియు, పునరావర్తినః = తిరిగి వచ్చెడివి, (భవన్తి = అగుచున్నవి) కౌన్తేయ = అర్జునా! మాం = నన్ను, ఉపేత్య = పొందినచో, పునర్జన్మ = తిరిగి పుట్టుక, న విద్యతే = కలుగనేరదు.

తా॥ అర్జునా! బ్రహ్మలోకము మొదలైన లోకములెల్ల నశించునవి, కావున ఆలోకములను పొందినవారికి తిరిగివచ్చి సంసారమున జన్మించుట తప్పదు. నేను నిర్వికారుడ నగుటచే నన్ను పొందిన వారికి నాశప్రసక్తిలేదు. కనుక వారికి తిరిగి పుట్టుట యుండనేరదు.

అవ. బ్రహ్మలోకము వరకు గల లోకములును, ఆ లోకస్థులును భగవంతునిచే నేర్పరచబడిన కాలనియమము ననుసరించి పుట్టుచును గిట్టుచును ఉందురని చెప్పుచున్నాడు.

17.శ్లో. సహస్రయుగ పర్యన్త । మహర్య ద్బ్రహ్మణో విదుః ।
రాత్రిం యుగసహస్రాన్తాం । తేఽహోరాత్ర విదో జనాః ।

అర్థము : అహోరాత్ర విదః = రాత్రి-పగలు అనెడు కాలనిర్ణయము నెఱుంగు, తే జనాః = ఆ జనులు, బ్రహ్మణః = చతుర్ముఖునకు, యత్ = ఏది, అహః = పగలో, (తత్ = దానిని) సహస్రయుగపర్యన్తం = వేయి చతుర్యుగములు పరిమితి కలదానినిగాను, రాత్రిం = రాత్రిని, యుగసహస్రాన్తాం = వేయి చతుర్యుగములు పరిమితి కలదానినిగాను, విదుః = తెలుసుకొనుచున్నారు.

తా॥ నా సంకల్పముచే గావింపబడిన అహోరాత్రుల నిర్ణయము నెఱింగిన వారు చతుర్ముఖ బ్రహ్మకు పగలు వేయి చతుర్యుగముల పరిమితి కలదిగాను, రాత్రియును వేయి చతుర్యుగముల పరిమితి కలదిగాను ఎఱుంగుదురు.

18.శ్లో. అవ్యక్తా ద్వ్యక్తయ స్సర్వాః । ప్రభవ న్త్యహరాగమే ।
రాత్ర్యాగమే ప్రలీయన్తే । తత్రై వావ్యక్త సంజ్ఞకే ।

అర్థము : అహరాగమే = బ్రహ్మకు పగలైనపుడు, అవ్యక్తాత్ = బ్రహ్మశరీరమైన ప్రకృతినుండి,

సర్వాః = సమస్తమైన, వ్యక్తయః = వస్తువులన్నియు, ప్రభవన్తి = పుట్టుచున్నవి. రాత్ర్యాగమే = బ్రహ్మకు రాత్రిరాగానే, అవ్యక్త సంజ్ఞకే = అవ్యక్తావస్థయనబడు, తత్రైవ = ఆ బ్రహ్మదేహమునందే. ప్రలీయన్తే = లీనమగుచున్నవి.

తా॥ బ్రహ్మకు పగలు వచ్చినపుడు మూడులోకములయందలి సమస్త వస్తువులును చతుర్ముఖ బ్రహ్మ శరీరమునుండి పుట్టుచున్నవి. అట్లే ఆ బ్రహ్మకు రాత్రి రాగానే ఆ దేహమునందే లీనమగుచున్నవి.

19.శ్లో. భూతగ్రామ స్స ఏవాఽయం । భూత్వాభూత్వా ప్రలీయతే ।
రాత్ర్యాఽగమేఽ వశః పార్థ! । ప్రభవ త్యహ రాగమే ।

అర్థము : పార్థ = అర్జునా!, సః = అట్టి, అయం = ఈ, భూతగ్రామః ఏవ = భూత సమూహమే, భూత్వాభూత్వా = పుట్టిపుట్టి, రాత్ర్యాగమే = రాత్రి రాగానే, ప్రలీయతే = లయమును పొందుచున్నది. అహరాగమే = పగలు రాగానే, ప్రభవతి = పుట్టుచున్నది.

తా॥ అట్టి యీ భూతజాతమంతయు కర్మకు వశమై తదనుసారముగా చతుర్ముఖ బ్రహ్మకు పగలు రాగానే పుట్టుచు, రాత్రి రాగానే అణగిపోవుచున్నది.

అవ. పిమ్మట కైవల్యమును బడసిన వారికిని తిరిగి పుట్టుట లేదని చెప్పుచున్నాడు.

20.శ్లో. పర స్తస్మాత్తు భావోఽన్యో । వ్యక్తో ఽవ్యక్తా త్సనాతనః ।
య స్స సర్వేషు భూతేషు । నశ్యత్సు న వినశ్యతి ॥

అర్థము : తస్మాత్ = అటువంటి, అవ్యక్తాత్ = ప్రకృతికంటె, పరః = గొప్పదియు, అన్యః= వేరైనదియు, సనాతనః = నిత్యమైనదియునగు, యః = ఏ, భావః = పదార్థము, సర్వేషు = సమస్తమైన, భూతేషు = ఆకాశాదిభూతములు, నశ్యత్సు = నశించుచున్నను, న వినశ్యతి = నశించదో, (సః = అది.)

తా॥ అచేతనమగు నీ ప్రకృతి కంటె గొప్ప పురుషార్థమైనవాడును, జ్ఞానాకారుడు గాన దానికంటె విజాతీయుడును, ఏ ప్రమాణమునకును గోచరించని వాడును, నిత్యమైనవాడును, ఆకాశాది భూతములు నశించినను వాటి యందుండియు నశించనివాడునునగు పరిశుద్ధమైన ఆత్మ-(దీనికి ముందుశ్లోకముతో సంబంధము కలదు.)

21.శ్లో. అవ్యక్తోఽక్షర ఇత్యుక్తః । త మాహుః పరమాంగతిమ్ ।
యం ప్రాప్య న నివర్తన్తే । తద్ధామ పరమం మమ॥

అర్థము : అవ్యక్తః = ఏ ప్రమాణములకును తెలియదగని, అక్షరః ఇతి = పరిశుద్ధమైన ఆత్మ

స్వరూపము అని, ఉక్తః = చెప్పబడినదో, తం = వానిని, పరమాం = ముఖ్యమైన, గతిం = గతినిగా, ఆహుః = చెప్పుచున్నారు, యం = ఏ పరిశుద్ధాత్మ స్వరూపమును, ప్రాప్య = పొంది, న నివర్తన్తే = మరల పుట్టరో, తత్ = అది, మమ = నా యొక్క, పరమం = గొప్పదగు, ధామ = నియమన స్థానము, (భవతి = అగుచున్నది.)

తా॥ ఏ ప్రమాణములకును తెలియబడక, ప్రకృతి సంబంధమునకు తగని పరిశుద్ధ స్వరూపుడక్షరుడు. వేదవేత్త లీ స్వరూపమును పరమగతి యని చెప్పుదురు, ఇట్టి యాత్మస్వరూపమును పొందినవారు మరల పుట్టరు, ఇది నాకు ముఖ్యమైన నియమన స్థానము.

అవ. భక్తుడు పొందునట్టి ఫల మింత కెన్నియో మడుంగు లుత్తమమైన దనుచున్నాడు.

22.శ్లో. పురుష స్స పరః పార్థ! । భక్త్యా లభ్య స్త్వనన్యయా ।
యస్యా న్తస్థాని భూతాని । యేన సర్వ మిదం తతమ్॥

అర్థము : పార్థ = అర్జునా ! భూతాని = సమస్త ప్రాణులును. యస్య = ఎవని యొక్క, అన్తస్థాని = లోపలనున్నవో, యేన = ఎవనిచేత, ఇదం సర్వం = ఈ ప్రపంచ మంతయు, తతం=వ్యాపింపబడియున్నదో, సః =అట్టి, పరః పురుషః = పరమపురుషుడు, అనన్యయా=ఇతర విషయములేని, భక్త్యా = భక్తి చేత, లభ్యః = పొందదగినవాడు.

తా॥ అర్జునా! ఎవనిలోపల సమస్త భూతములును అంతర్గతములై యున్నవో, ఏపరమపురుషునిచే సమస్త ప్రపంచము వ్యాప్తమైయున్నదో అట్టి పరమాత్మ అనన్యమగు భక్తిచే మాత్రమే పొందదగినవాడు.

అవ. ఆత్మ యొక్క నిజరూపము నెఱింగిన కేవలునకును, పరమపురుష నిష్ఠుడగు భక్తునకును లభించునట్టి యర్చిరాది మార్గమును గూర్చి చెప్పుచున్నాడు.

23.శ్లో. యత్ర కాలే త్వనావృత్తిం । ఆవృత్తిం చైవ యోగినః ।
ప్రయాతా యాన్తి తం కాలం । వక్ష్యామి భరతర్షభ! ॥

అర్థము : భరతర్షభ = అర్జునా ! యత్రకాలే = ఏ కాలమునందు, ప్రయాతాః = శరీరమును విడిచిపోయిన, యోగినః = జ్ఞానులు, అనావృత్తిం = పునర్జన్మరాహిత్యమును, ఆవృత్తిం చ ఏవ = పునర్జన్మమును, యాన్తి పొందుచున్నారో, తం = ఆ, కాలం= కాలమును, వక్ష్యామి = చెప్పగలను.

తా॥ అర్జునా ! దేహమును విడిచి ఏ కాలాభిమాని దేవతలుండు మార్గమున పోయిన యోగులు తిరిగి పుట్టరో, ఏకాలాభిమాని దేవతలున్న మార్గమున పోయినవారు తిరిగి పుట్టుదురో ఆ మార్గములను గూర్చి చెప్పెదను.

అవ. అర్చిరాది మార్గమునుగూర్చి చెప్పుచున్నాడు.

24.శ్లో. అగ్నిర్జ్యోతి రహ శ్శుక్లః । షణ్మాసా ఉత్తరాయణమ్ ।
తత్ర ప్రయాతా గచ్ఛన్తి । బ్రహ్మ బ్రహ్మవిదో జనాః ॥

అర్థము : అగ్నిర్జ్యోతిః = అగ్నిరూపమైన తేజస్సున్ను, అహః = పగలున్ను, శుక్లః = శుక్లపక్షమున్ను, షణ్మాసాః = ఆరుమాసములుగల, ఉత్తరాయణం = ఉత్తరాయణమున్ను అను వీని కభిమానులగు దేవతలు (యత్ర=ఎచ్చట, సన్తి = కలరో) తత్ర= ఆ దారిని, ప్రయాతాః = ప్రయాణము చేసిన, బ్రహ్మవిదః = బ్రహ్మోపాసకులగు, జనాః = జనులు, బ్రహ్మ = బ్రహ్మమును, గచ్ఛన్తి = పొందుచున్నారు.

తా॥ అగ్ని రూపమైన తేజోఽభిమాని దేవతయు, పగటియభిమాని దేవతయు, శుక్లపక్షాభిమాని దేవతయు, ఆరుమాసముల పరిమితిగల ఉత్తరాయణాభిమాని దేవతయు మొదలగు వారుండునట్టి మార్గవిశేషమున పోయిన బ్రహ్మోపాసకులు బ్రహ్మనే (పరమాత్మనే) పొందుదురు.

అవ. ధూమాది మార్గమును గూర్చి చెప్పుచున్నాడు.

25.శ్లో. ధూమో రాత్రి స్తథా కృష్ణ । ష్షణ్మాసా దక్షిణాయనమ్ ।
తత్ర చాన్ద్రమసం జ్యోతి । ర్యోగీ ప్రాప్య నివర్తతే ॥

అర్థము : ధూమః = ధూమాభిమానిదేవతయు, రాత్రిః = రాత్రియభిమాని దేవతయు, తథా= అట్లే, కృష్ణః = కృష్ణపక్షాభిమానిదేవతయు, షణ్మాసాః = ఆరునెలలు పరిమితి గల, దక్షిణాయనం=దక్షిణాయనమునకు అభిమాని దేవతయు, (యత్ర సన్తి=ఏ మార్గమున కలరో) తత్ర =ఆ=మార్గమందు. చాంద్రమసం= చంద్ర సంబంధియగు, జ్యోతిః= తేజస్సును. ప్రాప్య = పొంది. యోగీ = పుణ్యకర్మల నాచరించువాడు నివర్తతే = తిరిగి పుట్టుచున్నాడు.

తా॥ ధూమాభిమాని దేవతయు, రాత్రి అభిమాని దేవతయు, కృష్ణపక్షాభిమాని దేవతయు, ఆరుమాసములు పరిమితిగల దక్షిణాయనాభిమాని దేవతయు, ఏ మార్గమందుందురో అట్టి చంద్రమండల మార్గమున పుణ్యాత్ముడు పోయి తిరిగివచ్చి భూమియందు పుట్టును.

అవ. ఈ రెండు మార్గములను గూర్చియు వేదప్రమాణ ప్రసిద్ధిని చూపుచున్నాడు.

26.శ్లో. శుక్ల కృష్ణే గతీ హ్యేతే । జగత శ్శాశ్వతే మతే ।
ఏకయా యాత్యనావృత్తి । మన్యయాఽఽవర్తతే పునః ॥

అర్థము : శుక్ల కృష్ణే = శుక్లపక్ష కృష్ణపక్ష సంబంధముగల, ఏతేగతీ = ఈ రెండుదారులును,

జగతః = లోకమునకు, శాశ్వతే = స్థిరమైనవిగా, మతే హి = శాస్త్ర సమ్మతములుగదా! ఏకయా = ఒకదారిచేతను, అనావృత్తిం = తిరిగిపుట్టకుండుటను, యాతి = పొందు చున్నాడు, అన్యయా వేరొకదారిచేత, పునః = మరల, ఆవర్తతే = తిరిగిపుట్టుచున్నాడు.

తా॥ శుక్లపక్షముతో కూడినది యర్చిరాదిమార్గము. కృష్ణపక్షముతోకూడినది ధూమాది మార్గము. అర్చిరాదిమార్గమున పోయినవాడు తిరిగి భూలోకమున పుట్టడు. ధూమాదిమార్గమున పోయినవాడు మరలవచ్చి భూమిపై జన్మించుచున్నాడు. ఈ మార్గములు రెండును జ్ఞానులకును- పుణ్యకర్ములకును శాశ్వతమైనవని శ్రుతులు ఉద్ఘోషించుచున్నవి.

అవ. ఈ మార్గములను నిరంతరము తలంచుచుండుటయు భగవదుపాసనవలె భగవత్ప్రాప్తికి సాధనమగుచున్నదిగాన నట్లు తలచుచుండుమని యుపదేశించు చున్నాడు.

27.శ్లో. నైతే సృతీ పార్థ ! జానన్ । యోగీ ముహ్యతి కశ్చన
తస్మా త్సర్వేషు కాలేషు । యోగ యుక్తో భవార్జున! ।

అర్థము : పార్థ = అర్జునా ! ఏతేసృతీ = ఈ రెండుదారులను, జానన్ = ఎఱుంగుచున్న, కశ్చనయోగీ = ఏయోగియున్ను, న ముహ్యతి = మోహమును చెందదు, తస్మాత్ = కాబట్టి. అర్జునా = అర్జునుడా ! సర్వేషుకాలేషు = అన్నివేళలయందును, యోగయుక్తః = యోగముతో కూడినవాడవు , భవ = అగుము.

తా॥ అర్జునా! ఈ రెండు దారులలోనర్చిరాది మార్గము పరిగ్రాహ్యము. ధూమాదిమార్గము పరిత్యాజ్యము, ఇట్లు తలంచు యోగి మరణ సమ యమున భ్రమను చెందడు. తనకు హితమగు నర్చిరాదిమార్గమును బట్టియే పోవును. కావున అర్జునా! నీవు సర్వకాలములయందును అర్చిరాదిమార్గమునే తలంచుచుండుట అనెడు యోగముతో కూడియుండుము.

అవ. ఇట్లు ఏడు ఎనిమిది యధ్యాయములో చెప్పబడిన శాస్త్రార్థములన్నింటిని యెఱుంగుటవలన కలుగు ఫలమును చెప్పుచున్నాడు.

28.శ్లో. వేదేషు యజ్ఞేషుతపస్సు చైవ ।దానేషు య త్పుణ్యఫలం ప్రదిష్టమ్।
అత్యేతి తత్సర్వ మిదంవిదిత్వా ।యోగీ పరంస్థాన ముపైతి చాద్యమ్।

ఇతి శ్రీ భగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే
శ్రీ కృష్ణార్జునసంవాదే అక్షరపరబ్రహ్మయోగో నామ అష్టమోఽధ్యాయః.

అర్థము : ఇదం = ఈ రెండధ్యాయములలో చెప్పబడిన భగవంతుని మహిమను, విదిత్వా= తెలుసుకొని, వేదేషు = వేదములయందును, యజ్ఞేషు = యజ్ఞములయందును తపస్సు = తపస్సులయందును, దానేషు చ ఏవ = దానములయందును, యత్= ఏ, పుణ్యఫలం = పుణ్యఫలము, ప్రదిష్టం = చెప్పబడినదో, తత్సర్వం = దానినంతను, అత్యేతి = అతిక్రమించుచున్నాడు, యోగీ చ = జ్ఞానియు, పరం = గొప్పదియగు ఆద్యం = అనాదియైన, స్థానం = పదవిని, ఉపైతి = పొందుచున్నాడు.

తా॥ ఇట్లీ రెండధ్యాయములలో చెప్పబడిన భగవంతుని మాహాత్మ్యమును తెలిసికొనుటవలన - వేదములను అభ్యసించుటచేతను, యజ్ఞతపోదానాది పుణ్యకర్మల నాచరించుటచేతను ఏ ఫలము కలుగునని చెప్పబడినదో –ఆ ఫలము నంతను గడ్డిపరకవలె తలంచును. ఇంతియగాక జ్ఞానికి పొందదగిన అన్నిటికిని మిన్నయగు అనాది స్థానమునున్ను పొందుచున్నాడు.

ఇది ఉపనిషదర్థ ప్రతిపాదకమును, బ్రహ్మ విద్యయు, యోగశాస్త్రమును,
శ్రీకృష్ణార్జున సంవాదరూపమును అయిన శ్రీ భగవద్గీతయందలి
అక్షరపరబ్రహ్మ యోగమనెడు ఎనిమిదవ అధ్యాయము.

ఈ యధ్యాయమునందలి శ్లోకములసంఖ్య 28 ఇందర్జుని శ్లోకములు 2
ఇప్పటికి మొత్తమైన శ్లోకములు 338 శ్రీకృష్ణుని శ్లోకములు26

శ్రీమద్భగవద్గీతా ప్రశ్నోత్తరావళి
ఎనిమిదవ అధ్యాయము

1. ప్ర. ఈ యధ్యాయమునకు పేరేమి?

ఉ. ఈ యధ్యాయమునకు "అక్షరపరబ్రహ్మయోగ" మని పేరు.

ఈ యధ్యాయ ప్రారంభములో అర్జునుడు శ్రీ కృష్ణు నడిగిన ఏడు ప్రశ్నలలో మొదటి ప్రశ్న 'తద్బ్రహ్మ' యనగా నేమి? యనునది. శ్రీకృష్ణపరమాత్మ మొదటి సమాధానము చెప్పునపుడు 'అక్షరం బ్రహ్మపరమం' 'పరమం అక్షరం తద్బ్రహ్మ' అనగా అక్షర మనగా నశించునది. అందు 'పరం' అనగా గొప్పది. అదియేది? జీవసమష్టి కావున తద్బ్రహ్మయనగా జీవసమష్టి యని తేలినది. ఇట్లీ నిగూఢార్థవివరణతో నీ యధ్యాయము ప్రారంభింపబడుటచే ఈ యధ్యాయమునకు 'అక్షరపరబ్రహ్మయోగ' మని పేరుంచబడెను.

2. ప్ర. ఈ యధ్యాయమున చెప్పబడిన ప్రధాన విషయములెవ్వి?

ఉ. (అ) అర్జునుడు తద్బ్రహ్మ అధ్యాత్మము కర్మ అధిభూతము అధిదైవము, అధియజ్ఞము మరణకాల ధ్యేయభగవత్స్వరూపము అనెడు ఏడు విషయములను గూర్చి ప్రశ్నించుట. (1, 2శ్లో.)

(ఆ) మొదటి మూడు విషయములకు శ్రీ భగవానుని ఉత్తరము. (3శ్లో)

(ఇ) అధిభూత అధిదైవ అధియజ్ఞముల స్వరూపములను వివరించుట.(4శ్లో.)

(ఈ) చివరి ప్రశ్న కుత్తర మొసంగుట. (5,6 శ్లో.)

(ఉ) ఫలము మరణకాలచింతన ననుసరించియుండును. మరణకాల చింతనము నిరంతర భావనాధీనమై యుండును. ఆ భావన దాని కనుకూలమగు కర్మయోగమువలన కలుగును. కావున నీకు తగిన కర్మను నీవు చేయుము – అని ఉపదేశించుట. (7 శ్లో.)

(ఊ) తాను పొందగోరు ఫల లాభ మంతిమస్మృతి ననుసరించి యుండును. కావున ఐశ్వర్య కైవల్య భగవల్లాభార్థులు ముగ్గురకును తామభిలషించు ఫలమును బట్టి ఉపాసనరీతిలోని తారతమ్యమును చెప్పనారంభించి మునుముందు ఐశ్వర్యార్థుల ఉపాసనారీతిని, తదనుగుణముగా నుండవలసిన అన్తిమస్మృతిని సెలవిచ్చుట. (8 శ్లో.)

(అన్తిమస్మృతి యనగా – చనిపోవునప్పటి తలంపు)

(ఋ) ఐశ్వర్యమును కోరువారు భగవంతుని ధ్యానింపవలసిన రీతిని చెప్పుట. (9, 10 శ్లో.)

(ౠ) కైవల్యము కోరువారు భగవంతుని ధ్యానింపవలసిన రీతిని చెప్పుట. (11, 12, 13శ్లో.)

(ఌ) భగవత్సాయుజ్యమునపేక్షించు భక్తుడు భగవంతుని ధ్యానింపవలసిన రీతిని చెప్పుట. (14 శ్లో.)

(ౡ) ఇట్లు ధ్యానించు భక్తుడుకాని కేవలుడుగాని తిరిగి యెన్నడును సంసారమున పుట్టరనియు, ఐశ్వర్యార్థులు తప్పక తిరిగి పుట్టుదురనియు చెప్పుట. (15 శ్లో.)

(ఎ) వారు తిరిగి పుట్టకుండుటకు వీరు తిరిగి పుట్టుటకు కారణమును చెప్పుట. (16 శ్లో.)

(ఏ) బ్రహ్మలోకాదులును అందుండువారును అనిత్యమగుటకు కారణమును చెప్పుట. (17, 18, 19 శ్లో.)

(ఐ) కైవల్యమును పొందినవారు కూడ తిరిగి సంసారమున పుట్టరని సహేతుకముగా సమర్థించుట. (20, 21 శ్లో.)

(ఒ) కేవలుడు లభించు ఫలముకంటె భక్తుడు లభించుఫలము మిక్కిలి విలక్షణమైనదని చెప్పుట. (22 శ్లో.)

(ఓ) అర్చిరాది ధూమాది మార్గముల తారతమ్యమును ఫలమునుబట్టి నిర్ణయించుట. (23-26 శ్లో.)

(ఔ) అర్చిరాదిమార్గము నుపదేశించుట. (24 శ్లో.)

(అం) ధూమాదిమార్గము నుపదేశించుట. (25 శ్లో.)

(అః) అర్చిరాదిమార్గమును నిరంతరము చింతించుచుండుమని విధించుట. (27 శ్లో.)

(క) ఏడు ఎనిమిది అధ్యాయములలోని అర్థవిశేషముల నెఱుంగుటకు ఫలమును జెప్పుట. (28 శ్లో.)

3.ప్ర. ఈ యధ్యాయమునకు వెనుకటి అధ్యాయముతోను ప్రధాన శాస్త్రార్థముతోను గల సంబంధమేమి?

ఉ. ఏడవ అధ్యాయమున భగవద్భక్తులను ముత్తెరంగుల విభజించి వారికి **వారు కోరెడు ఫలానుగుణముగ తెలియదగినట్టియు,** ధ్యానింప తగినట్టియు ఏడు విషయములు సూచింపబడినవి.

ఈ యధ్యాయమున ఆ ఏడింటి స్వరూపములును ప్రత్యేకముగా వివరింపబడినవి. కావున రెండు అధ్యాయములును ఏకార్థకములే.

ప్రధాన శాస్త్రార్థము మోక్షము. దానిని కోరక ఇతర ఫలముల నాశించి భగవంతుని ధ్యానించినను వ్యర్థమే. ఆ ఫలములు నశ్వరములును అల్పానంద జనకములును. కావున వాటిని విడచి మోక్షమునే యపేక్షించవలె ననెడు బుద్ధిని పుట్టించుట కీయధ్యాయ విషయములు మిక్కిలి తోడ్పడుటచే నిది ప్రధాన శాస్త్రార్థమున కెంతయు సహకరించుచున్నది.

4. ప్ర. తద్బ్రహ్మ యనగానేమి?

ఉ. 'పరమం అక్షరం తద్బ్రహ్మ'యని భగవంతుడుత్తర మొసంగెను. అక్షర మనగా నశించనిది, అది ప్రకరణమునుబట్టి జీవసమష్టి యని చెప్పవలసి యున్నది. ఏలయన- భగవద్భక్తులు ముగ్గురును ఎఱుంగవలసిన విషయములను సంగ్రహముగ చెప్పుట కారంభించిన ఏడవ అధ్యాయం 29వ శ్లోకములో కైవల్యము కోరువారు ప్రత్యేక మెఱుంగవలసినవాటిలో 'తద్బ్రహ్మ'! మొదటిదిగా చెప్పబడెను. వారికి శుద్ధమగు ఆత్మ స్వరూపమే పురుషార్థము గాన నిచ్చట యట్టి స్వరూపమే ఆ శబ్దమున కర్థముగా చెప్పబడవలెను. కావుననే అక్షరమునకు 'పరమం' అనియు విశేషణము చేర్చబడినది. దానిచే ప్రకృతిని వీడిన శుద్ధస్వరూపమని అర్థము లభించుచున్నది.

5. ప్ర. అధ్యాత్మమనగానేమి?

ఉ. 'స్వభావః అధ్యాత్మం' అని భగవానుని ఉత్తరము. స్వభావమనగా- విడువకపట్టి యుండునది. అదియేది? దేనిని? అనగా-అధ్యాత్మ శబ్దార్థమే ఆ శంకలను తీర్చుచున్నది. ఆ యర్థమేమనగా - ఆత్మని అధివసనాత్ **సంబధ్యమానం** అధ్యాత్మం- ఆత్మయందే నిరంతరము విడువక సంబంధించియుండునవి. అవి యేవి? పంచభూతముల సూక్ష్మాంశలున్ను వాటి సంపర్కముచే నాత్మయందుద్భవించు అజ్ఞానకర్మ వాసనాదులున్ను, ఇవియే అధ్యాత్మశబ్దమున కర్థమగు 'స్వభావము', ఇవియు భక్తునకు తెలియదగినవేనా? ఔను. కేవలునకు తద్బ్రహ్మ యెట్లు ప్రాప్య (ఫల) మగుటచే నెఱుంగదగినదో అట్లే యీ భూత సూక్ష్మములును త్యాజ్యము (విడువదగినవి)గా నెఱుంగదగినవియే యని ఛాందోగ్యోపనిషత్తులో పంచాగ్నివిద్యోపదేశమున జెప్పబడెను.

6. ప్ర. కర్మ యనగా నేమి?

ఉ. దీనికి భగవానుడు 'భూతభావోద్భవకరో విసర్గః కర్మసంజ్ఞితః' అని ఉత్తర మొసంగెను.

ఇచ్చట 'విసర్గ' యనగా విడుచుట. దేనిని? ఈ విసర్గకు 'భూతభావోద్భవకరః' అని విశేషణము కలదు. భూతభావ మనగా- మనుష్యాది ధర్మములతో గూడిన శరీర సంబంధము. 'ఉద్భవకర' అనగా ఆత్మ కట్టి శరీరసంబంధమును గూర్చునట్టిది అని యర్థము. అనగా- మనుష్యాది ధర్మములతో గూడిన శరీర సంబంధమును ఆత్మకు కలిగించునట్టి విసర్గము అని తేలినది. అట్టి విసర్గము అనగా విడుచుట. దేనిని? రేతస్సును. కావున స్త్రీ యోనియందు పురుషుడు రేతస్సును విడుచుటయే కర్మ యనబడును.

ఇట్టి నిహీనతమమైన కర్మను కేవలు లేల యెఱుంగవలెను?

ఛాందోగ్యమునందలి పంచాగ్ని విద్య యందే ఇది యెఱుంగతగినదిగా తెలుపబడినది. ఏలనన-

కేవలుడు - అనగా శరీర సంబంధమునం దసహ్యము జనించి ఇక యెన్నడును ఆత్మ కది రాకుండవలెనని పరమాత్మను ప్రార్థించువాడు. "జరామరణ మోక్షాయ మా మాశ్రిత్య యతన్తి యే" యని 7వ అ. 29 శ్లో. ఇట్టిస్థితి గలుగవలెనన్న శరీరమునందసహ్యమును పుట్టించవలెను. అందులకై స్థూల శరీరముగా పరిణమించిన ప్రకృతి దుర్నయమును బాగుగ తలకెక్కించవలెను. అందుచే నది అన్నియవస్థలలోను ఆత్మను విడువక వెంబడించుచునే యుండుననియు, దాని బారినుండి తప్పించుకొనుట కేరికిని శక్యముకాదనియు, అది గర్భవాసము జననము వార్ధక్యము మరణము నరకవాసము మొదలగు పెక్కుచిక్కుల బెట్టుననియు బాగుగ బోధించవలెను. ఇట్టి పీడాకరమగు నీహాడు శరీర సంపర్కమీ యాత్మకు రేతోవిసర్గరూపమైన నీ కర్మ మూలమునే దాపరించుచున్నది గాన దాని యందసహ్యమును బుట్టించుట కిది యెఱుంగదగియున్నదని ఆ పంచాగ్ని విద్యయందే తెలుపబడినది.

7. ప్ర. అధిభూత మనగా నేమి?

ఉ. 'అధిభూతం క్షరో భావః' అని భగవానుని సమాధానము. 'క్షరో భావః' అనునది ఒకేపదము = క్షరణస్వభావమని యర్థము. అనగా- నశించ స్వభావముకలవి. అవియేవి? భోగ్యములగు శబ్దాదులున్ను, వానికాధారములగు పంచభూతములున్ను. ఇవి యెవరి కెఱుంగదగినవి? ఐశ్వర్యార్థులకు ఏల? ఐశ్వర్యమునకు ఫలము వాటి యనుభవమే కావున, వారి కొఱక

పరమైశ్వర్య సంపన్నుడగు ఇంద్రుని యాశ్రయించరాదా? ధనాధిపతి యగు కుబేరుని యాశ్రయించరాదా; కాదు, ఇంద్రప్రజాపతులనుభవించు భోగములకంటె భక్తి యోగముచే ప్రసన్నుడగు పరమాత్మ యొక్క సంకల్ప విశేషముచే లభించు భోగములు నిత్యములును అపారములును అగుటచే నట్టివాని నాశించి భగవాను నాశ్రయింతురు. కావున నట్టి పరమవిలక్షణ మగు శబ్దాదులును వాటి కాశ్రయములగు పంచభూతములున్ను ప్రాప్యములుగా నైశ్వర్యార్థు లనుసంధించవలెను.

8. ప్ర. అధి దైవ మనగానేమి?

ఉ. 'పురుష శ్చాధి దైవతం' అని భగవదుత్తరము.

అధిదైవత మనగా - దేవతలకు పైగా నుండువారు. ఏ దేవతలకు? ఇంద్ర ప్రజాపతి మొదలగు సమస్త దేవతలకును. ఈ పైగా నుండుట యనగా వారి లోకములకంటె పై లోకములో నుండువాడనియు, వారికంటె గొప్పభోగముల ననుభవించు వాడనియు నర్థము. దీనిచే నెట్టి యర్థము లభించినది? ఇదియును కేవల మైశ్వర్యార్థు లెరుంగదగిన నదిగాన బ్రహ్మాది దేవత లనుభవించు భోగ్యపదార్థములకు మించినవాటిని యనుభవించు యోగ్యతగల పురుషత్వము కావలెనని వారనుసంధించవలెనని భావము.

9. ప్ర. అధి యజ్ఞమనగా నేమి?

ఉ. దీనికి 'అధియజ్ఞోఽహ మే వాత్ర దేహే' అని శ్రీకృష్ణుని ఉత్తరము.

అర్జునుడు అధియజ్ఞమును గూర్చి ప్రశ్నించునప్పుడే 'అధియజ్ఞః కథం? కోఽత్ర దేహేఽస్మిన్?' అని ప్రశ్నించెను.

'అత్ర అస్మిన్ దేహే అధియజ్ఞః కః?' కథం? అని రెండు ప్రశ్నలు.

అందు అధియజ్ఞః కః ? అను ప్రశ్నకు 'అధియజ్ఞోఽహ మే వాత్రదేహే= అత్ర దేహే అధియజ్ఞః అహమేవ' యని సమాధానము. దీనికి భావమేమి ? అధియజ్ఞ మనగా - యజ్ఞముతో సంబంధించియుండువాడు. ఎవడు? అహ మేవ = నేనే. నీకు యజ్ఞముతో నేమి సంబంధము? ఆ యజ్ఞముచే నారాధింపబడువాడను నేనే కదా!

అప్పుడర్జునుని రెండవ ప్రశ్న 'కథం' అని బయలుదేరుచున్నది. దాని భావమేమి? యజ్ఞములచే నింద్రాదు లారాధింపబడుచుండ నేనే యందువేమి? ఇది యెట్లు? అని యాతని ప్రశ్న. దానికుత్తరము - 'అత్రదేహే అహ మేవ' అని. దాని భావమేమి?

ఇంద్రాదులు ప్రత్యక్షముగా నారాధింపబడుచుండ నేనే నిజముగ నారాధింపబడుచున్నానందువే - అది యెట్లనిగదా ప్రశ్న. అదియే సావధానముగా వినుము. సమాధాన మొసంగు సర్వేశ్వరుడు 'అత్రదేహే' అనుచున్నాడు. గాన తన దేహమనియే దానికర్థము. ఆ దేహమేది? దేవేంద్రుడే. అది యెట్లు? ఇదివరకే 'యాం యాం తనుం భక్త శ్శ్రద్ధయార్చితు మిచ్ఛతి' అ 21 శ్లో. అని యింద్రాదులు తన యొక్క శరీర విశేషములు అని చెప్పియే యుండెనుగదా! వానివాని కర్మనుబట్టిగదా వాని వాని దేహమేర్పడుచున్నది. పరమాత్మ కీ దేహమెట్లు వచ్చినది? ఇచ్చట దేహమనగా ఏడవ అధ్యాయమున 2 వ ప్రశ్నకు సమాధానమున 2వ అంశలోని శేషలక్షణమే ఈ శరీర లక్షణముగా తెలుసుకొనవలెను. దానినిబట్టి ఇంద్రాదులు భగవంతునికి దేహభూతులే అట్టి ఇంద్రాది దేహమున నేను ఆత్మగా నుందును.

పుష్పమాలిక తన కోటుపై సమర్పింపబడినను నిజమునకు తనకే సమర్పింపబడినట్లు ఎట్లానందించుచున్నాడో అట్లే తన శరీరభూతులగు నింద్రాదు లారాధింపబడినను నిజమున కారాధింపబడువాడు లోపలనుండు తనే యగుచున్నాడు.

ఇయ్యది ముగ్గురు అధికారులును తాము మహాయజ్ఞాది నిత్య నైమిత్తికముల నాచరించుతరి యనుసంధించవలసిన ముఖ్య విషయము.

10. ప్ర. 'ఈ ముగ్గురిచేతను మరణసమయమున నెట్లు తెలియదగి యున్నావు' అనెడు చివరి ప్రశ్నకు సమాధానమేమి ?

ఉ. ఎవ్వడైనను మరణసమయమున ఏ వస్తువునైనను యే యాకారముతో ధ్యానించుచు శరీరమును విడిచిపెట్టునో వాడు ఆ యాకారముతోనే మరణానన్తరమున తిరిగి జన్మించును. దీనికి విరుద్ధమగు దేహాన్త రమును పొందుటకు తగిన పుణ్యరాశి వీని కున్నను అది దీని నడ్డజాలదు. ఆదిభరతు డెంత పుణ్యమూర్తియైనను ఆతనికి మరణ సమయమున తలంచబడిన లేడిజన్మ తప్పనేలేదు. కావున పై ముగ్గురు భక్తులును మరణ సమయమున తాము పొందగోరు ఆకారములతో నన్ను ధ్యానించవలెను. దానిచే వారు ఆ యాకారములతోనే మరణానంతరమున తప్పకజన్మింతురు.

అట్లగుచో జీవించినంతకాలము దుర్మార్గమున సంచరించి మరణ సమయమున సదాకారమును స్మరించి తా నాచరించిన పాపరాశి బారి నుండి తప్పించుకొనవచ్చునే. అట్లగుచో ధర్మోపదేశము నిరర్థకమే గదా ! అన్నచో-నిజమే. ఫలము మాత్రము మరణకాల ధ్యానమును బట్టియే యుండుట నిస్సంశయము. కాని మరణకాలమున యే ఇంద్రియమును

వీని యధీనములో నుండదు. అందుచే వీడు చేయదలచిన పనులను గాని అనుసంధింపదలచిన విషయము ననుసంధించుట గాని చేయజాలడు. కాని చిరకాలము నుండియు యే విషయములయం దీతని యింద్రియము అలవడియున్నవో ఆ వాసనయే మనస్సునకు నీళ్ళకాగునకు మసివలె నివారింప నలవిగాకుండ పట్టియుండును, అందుచే వీడా విషయములనే, కోరకున్నను తలంచితీరును. అందుచే నా యాకారముతోనే బుట్టును. కావున యే మంచియాకారముతో తాను తిరిగి జన్మించ దలంచుచున్నాడో ఆయాకారమునే సదా భావించుచుండవలెను. అట్లుభావించుటయు సులభము కాదు. 'చంచలం హి మనః కృష్ణ', (గీత 6 అ 34శ్లో.) అని యర్జుని ప్రశ్నయు 'అసంశయం మహాబాహో! మనో దుర్నిగ్రహం చలం' (అనెడు) భగవదనుమోదమును స్మరింపుడు.

ఇంకదారియేమి? యనినచో ఆదారి యచ్చటనే, పరమాత్మ 'అభ్యాసేన తు కౌన్తేయ! వైరాగ్యేణ చ గృహ్యతే' అనగా మనస్సున కలవాటుపడిన దుర్విషయముల యందలి దోషములనే నిరంతరము భావించుచు వాటి యందసహ్యమును పుట్టించుకొనుము. పొందవలసిన సద్విషయమునందలి గుణములనే మాటిమాటికి తలంచుచుండుట యలవరచుకొనుము అని చెప్పెను. ఇదియైనను మనస్సు నిర్మలముగా నుండిననే, అట్లుండవలెనన్న మనస్సున పేరియున్న రజోగుణ తమోగుణ ప్రకోపముల నడంచు కొనవలెను. అదియును సత్వగుణము వృద్ధియైననే సిద్ధించును, అందులకు కర్మయోగమే శరణ్యము. ఇంద్రియముల నిగ్రహించక వ్యవసాయాత్మక బుద్ధి పుట్టదే! అది పుట్టినగాని కర్మయోగాచరణ మసంభవమే యను సందేహము జనించకమానదు. అందులకు సమాధానము రెండవ అధ్యాయము నందే "తాని సర్వాణి సంయమ్యయుక్త ఆసీత మత్పరః" యని పరమాత్మ సెలవిచ్చియే యుండెను. కావున నిచ్చటను "తస్మాత్ సర్వేషు కాలేషు మా మనుస్మర యుద్ధ్య చ" (8అ. 7శ్లో.) అని యుపదేశించెను. ముందు నుండియు నలవాటుగా తలంచబడుచున్న విషయమే మరణ కాలమున స్మరణకు వచ్చును గాన నీవు మరణించువరకును సాత్వికవేళ యందెల్లను నన్ను స్మరింపుము. అట్లు స్మరించుట నా తరమా? అనకుము. శ్రుతి స్మృతులలో చెప్పబడిన వర్ణాశ్రమములకు చెందిన నిత్యనైమిత్తిక కర్మలను మాత్రమే చేయుచుందువేని యది నీతరమే యగును. ఇందు సంశయ మొకింతయులేదు. అని చివరి ప్రశ్నకు సమాధాన మొసంగుచు ప్రకృత విషయముతో లగింపజేసి ముగించెను.

11. ప్ర. ఐశ్వర్యార్థు లెట్లుపాసన చేయవలయును? వారికి అన్తిమస్మృతి ఏ రీతి నుండును?

ఉ : ఈ భక్తుడు పరమపురుషునితో సమానమగు ఐశ్వర్యమును తన కపేక్షించు చున్నాడు. కావున తనకు సమస్తైశ్వర్యమును ప్రసాదించుట కుపయోగించు పరమపురుషుని ఆకారమును స్మరించుచు దేహత్యాగము చేయవలెను. మొదటినుండియు అలవాటుపడినదే చివరసమయమందును స్మరింపబడును. గాని వేరొండు స్మరణకు రాదు. అందుచే మొదటినుండియు ధ్యానిం చవలసిన ఆకార మీ క్రిందివిధముగా నుండవలెను.

ధ్యేయస్వరూపము :- సర్వజ్ఞత్వము, అనాదిత్వము, సకల చేతనా చేతనములలో ప్రవేశించుటనంతటి సూక్ష్మాతిసూక్ష్మమై ప్రవేశించి ప్రపంచ మంతను శాసించుట, సర్వమును సృజించు సామర్థ్యము, సకలేతర విలక్షణత్వము. అప్రాకృతమైన దివ్యరూపము - ఇట్టిధర్మములతో కూడియున్న వానినిగా ధ్యానించవలెను.

స్థానము :- భ్రూమధ్యప్రదేశమున ప్రాణమును నిలిపియుంచి అచ్చ టనే పై విధముగ పరమపురుషుడున్నట్లు ధ్యానించవలెను.

ఆ ధ్యానించునప్పుడైనను నిరంతరాభ్యాసముచే నాటుకొనిన భక్తి యోగబలముచే సంస్కారము బలపడును. గాన చలించనిమనస్సుతో ధ్యానించవలెను.

సమయము :- నిత్యము అలవాటుపడినను ప్రాణము శరీరమును విడిచిపెట్టుసమయమున ముఖ్యముగా నీ ధ్యాన ముండితీరవలెను.

ఫలము :- తాను కోరిన భగవత్సమానైశ్వర్యము వీనికి జన్మాంతరమున తప్పక సిద్ధించును.

12. ప్ర. కైవల్యమును కోరువారెట్లు ధ్యానింపవలెను ?

ఉ. ధ్యేయము :- ఈ తడభిలషించునది తిరిగి సంసారమునకు రానట్టియు, పరమపురుషునితో సమానాకారము కలిగినట్టియు, ప్రకృతినుండి పూర్తిగ విడివడిన శుద్ధ ఆత్మస్వరూపము. కావున అట్టి భగవదాకారమునకు వాచకమైన ప్రణవమును, తదర్థమగు పరమపురుషుని తలంచుచు అనుసంధించవలెను.

విధానము :- శ్రోత్రాది జ్ఞానేంద్రియములను వాటివాటి పనులనుండి పూర్తిగా నరికట్టివేయవలయును. మనస్సును హృదయపుండరీకమున వేంచేసియున్న పరమపురుషుని యందు నాటవలెను. యోగధారణమనగా మనస్సున కా స్థితి చెడకుండుటయే. నోటితో ప్రణవము నుచ్చరించవలెను. ప్రాణమును శిరమున నెలకొల్పవలెను. ఇది ముముక్షువునకు ఉత్క్రమణమునకు అత్యంతము అనుకూలము.

ఇట్లు శరీరమును విడిచినవో వాడుకోరిన పరమగతి (అనగా - పరమ పురుషునితో సమానమగు ఆకారము)గ ప్రకృతి గంధము లేకపోవుటయే గాక తిరిగి యెన్నటికినిరాని శుద్ధ ఆత్మస్వరూపము సిద్ధించితీరును.

ఇచ్చట అక్షరస్వరూపమగు జీవాత్మప్రాప్తికి అక్షరరూపమగు పరమాత్మోపాసనము విధింపబడినది.

13. ప్ర. కేవలుని ఫలమును పరమాత్మ ఎట్లు ప్రశంసించెను?

ఉ : దానికి ఫలము శుద్ధాత్మ స్వరూప ప్రాప్తియే.

అది అక్షరమని వేదవేత్తలు సెలవిత్తురు. అక్షరమనగా స్థూలత్వ అణుత్వ హ్రస్వత్వాది ధర్మములు కల వస్తువుల కంటె విలక్షణమైనది.

సంసారమన్న అసహ్యము జనించి దాని బారినుండి ఎప్పుడు తప్పించు కొందుమా యని యెదురు చూచు యతు లీ స్థితిలో ప్రవేశించుటకై అష్టవిధ మైథునములను వర్జించి ఊర్ధ్వరేతస్కులై బ్రహ్మచర్యమును చరింతురు.

బ్రహ్మచర్యమనగా - బ్రహ్మను పొందుటకై గావించు సమస్త చర్యలును అని యర్థము.

14. ప్ర. భక్తుడగు జ్ఞాని భగవంతునెట్లుధ్యానించవలెను? అత డెట్టి ఫలమును పొందును?

ఉ : నన్ను పొందవలెనను కోరిక జనించి అందు నిమిత్తము ప్రయత్నమును ప్రారంభించినది మొదలు సర్వకాలములయందును నన్ను స్మరించుటయే ఫలముగా తలంచి స్మరించుచుండును. అది ఎట్లు!

ఎవనికి ఏ వస్తువు మిక్కిలి యభీష్టమో వాడు నిరంతర మా వస్తువునే ధ్యానించుచుండును. భక్తునకు నాకంటె యిష్టతరమైనది ప్రపంచమున లేదు. కావున నన్ను తలంచక వాడుండలేడు. అందుచే వానికట్టి ధ్యానము సిద్ధించును.

ఇట్లు నిత్యమగు నాతోడి సంబంధము నపేక్షించిన నాభక్తునకు నేనే శ్రమలేకయే వానిచే పొందబడుదును. అందులకై వాడేమియు కొండలెత్త నవసరములేదు. వానివలె నేనును వాని యెడబాటును సహించజాలక వాడు చేయు ఉపాసనకు ప్రతిబంధకములైన రజస్సు తమస్సుల ప్రకోపము నణచి వేసి, రాగ ద్వేష మోహాదుల పుట్టనీయక, పాపములనన్నిటిని పారద్రోలి, ఆ ధ్యానమును నేను ప్రత్యక్షముగా కాన్పించుసంత దృఢతమము గావించి, దానియందు ఎన్నడును విడువలేనంత ప్రీతిని పుట్టింతును. ఇంత

మాత్రమే కాదు. వానికి పరమపదమున పర్యఙ్కాసనస్థితి పర్యంతమును మధ్య కావలసిన వానినన్నిటిని ప్రసాదింతును. ఇది నా బాధ్యత కాదా?

15. ప్ర. ఈ ముగ్గురి ఫలములలో గల తారతమ్యమేమి ?

ఉ. ఐశ్వర్యార్థులు తిరిగి పుట్టుచు గిట్టుచుందురు. కైవల్యార్థులు తిరిగి పుట్టరు గాని నిరతిశయ పురుషార్థప్రాప్తి వారికిలేదు. భక్తులు తిరిగి రాక నిరతిశయ పురుషార్థమును బడసి నిరతిశయానందాబ్ధి నోలలాడు చుందురు.

16. ప్ర. ఈ ఫలములలో నిట్లు తారతమ్యము లుండుటకు కారణమేమి?

ఉ. వారు పొందు ఫలము లట్టివి. భగవంతుడు సర్వజ్ఞుడును, సత్యసంకల్పుడును, సృష్టి స్థితి లయములు ఆటగా కలవాడును, పరమకారుణికుడును, సదా ఏకరూపుడును గాన ఆయనకు నాశప్రసంగమేలేదు. కావున ఆయనను పొందినవారికిని ఫలము నిత్యమే. ఇక బ్రహ్మలోకమువరకు సమస్తలోకములును అందుండు సమస్త పదార్థములును నశ్వరములే గాన అందు దేనిని పొందినను నాశము నియతమే.

17. ప్ర. బ్రహ్మాది లోకములు అనిత్యములగుటకు కారణమేమి ?

ఉ. భగవంతుడు వాటికి పుట్టుటకును, గిట్టుటకును ఒక కాలనియతి నేర్పరచెను.

అది యెట్లనగా సకల కాలవ్యవస్థను పరమాత్మయే గావించెను. అందు అందరికంటె హెచ్చు ఆయుర్దాయము కలవాడు బ్రహ్మ, ఆతని జీవితమునుబట్టి విచారించిన అదియే నశ్వరముకాగా ఇక మిగిలిన సంసార మనిత్యమని చెప్పనవసరములేదు.

కొన్నివేల చతుర్యుగములు బ్రహ్మకు ఒక పగలు. అట్టి కొన్ని వేల చతుర్యుగములు బ్రహ్మకొకరాత్రి, ఇట్టి కాలపరిణామముతో బ్రహ్మ నూరేండ్లుమాత్రమే జీవించును.

ఇట్టి ఒక బ్రహ్మపగలు రాగానే ఆతని శరీరమునుండి భోగ్యభోగోపకరణ భోగస్థాన భోక్తలతో నిండియున్న సమస్త ప్రపంచమున్ను పుట్టుచున్నది. రాత్రి రాగానే ఆతని శరీరమున తిరిగి లీనమగుచున్నది. ఇట్లే బ్రహ్మయొక్క ప్రతిపగలు సృష్టియు, ప్రతి రాత్రి లయమును జరుగుచుండును.

ఇట్లు బ్రహ్మకు నూరేండ్లు నిండుసరికి పృథివీతత్త్వము తనకు కారణమగు జల తత్త్వమున, జలతత్త్వము తనకు కారణమగు అగ్ని తత్త్వమున ఈ రీతిగా నశించి "పరే దేవే ఏకీభవతి" యనునట్లు సర్వ కారణకారణుడగు పరమాత్మలో మొదటి తత్త్వ మేకీభవించును. ఇట్లు పృథివ్యాది తత్త్వములే నశింపగా వాటినుండి పుట్టిన బ్రహ్మాది లోకములు గాని వాని నేలు బ్రహ్మాదుల శరీరముగాని ఎట్లుండును ?

ఇట్లు భగవంతునికంటె ఇతరమగు సమస్తమున్ను భగవంతుడేర్పరచిన కాలపరిమితినిబట్టి ఆయననుండి పుట్టి ఆయనయందే లయమగు చున్నది. గాన ఐశ్వర్యార్థుల కనిత్యఫలమును, భగవంతుని పొందినవారికి నిత్యఫలమును స్వతస్సిద్ధమే.

8. ప్ర. కైవల్యార్థులకు మాత్రము నిత్యఫల మేల లభించుచున్నది?

ఉ. కేవలుడు లభించునట్టి ప్రకృతిసంబంధములేని పరిశుద్ధ ఆత్మ స్వరూపము నిత్యము.

ఇది అచేతనప్రకృతికంటె పురుషార్థమగుటలో గొప్పది. ఇది జ్ఞానా కారమైనది. అది జడమైనది. కాన దానికంటె నిది విలక్షణమైనది. బాహ్య పదార్థములను చూచెడు ప్రమాణములకు గానిపించనిది. పుట్టుక, చావులు లేవుగాన నిత్యమైనది. తానున్న తావులగు పంచభూతములును, భౌతికములును నశించినను ఆత్మ నశించనిది. ఈ ధర్మములచేతనే యిది అవ్యక్తము అక్షరము అని పిలువబడును, ఇయ్యది పరమగతియని చెప్పబడును. అందులకు కారణమిది ప్రకృతిగంధములేని స్వరూపముతో నుండుటయే. ఇది పరమంధామ = అనగా భగవంతునిచే నియమింపబడు పదార్థములన్ని టికంటెగొప్పది.

అచేతనమగుటచే ప్రకృతి నీచమైన నియమనస్థానము, దానితో చేరి యుండు జీవుడు జ్ఞానాకారుడుగాన అంతకంటె గొప్పనియమనస్థానము, స్వస్వరూపముతో వెలుంగుచుండు శుద్ధాత్మ అన్నిటికంటెను గొప్ప నియమన స్థానము. కావున దానిని పొందిన వారికి అది నిత్యమైనదిగాన వారి కా స్థితియు నిత్యమే.

19.ప్ర. శుక్ల–కృష్ణ మార్గముల తారతమ్యమేమి ? వాటి స్వరూపమెట్టిది? వాటి నెఱుంగుటవలన ఫలమేమి?

ఉ : అర్చిరాదులున్ను ధూమాదులున్ను మార్గచిహ్నములు, ఆయా మార్గములో పయనించు పుణ్యాత్ములకు మార్గదర్శకులగు తత్తదభిమానులగు అతివాహిక పురుషగణములుండు స్థానములు. ఈ మార్గములు ఒకదానికొకటి ప్రతికోటిగా నుండును, వీటికిగల తారతమ్యములు.

శుక్ల మార్గము	కృష్ణమార్గము
(1)(ఆతివాహికగణము)	(ఆతివాహికగణము)
వెలుగు	పొగ
పగలు	రాత్రి
శుక్లపక్షము	కృష్ణపక్షము
ఉత్తరాయణము	దక్షిణాయనము

2) శుక్లమార్గమున వెళ్లినవారు పరమాత్మను చేరి తిరిగి రాకయుందురు. వారిపుణ్యము క్షీణించదు. కృష్ణమార్గమున నేగినవారు చంద్రసాయుజ్యమును పొంది పుణ్యముక్షీణించగనే తిరిగి భూలోకమునకు వచ్చి పుట్టుదురు.

3) శుక్లమార్గమున పరమాత్మోపాసకులేగుదురు. కృష్ణమార్గమున పుణ్య కర్ములేగుదురు.

4) శుక్లమార్గము పరిగ్రాహ్యము,
కృష్ణమార్గము పరిత్యాజ్యము,

ఈ రెండు మార్గముల తారతమ్యము నెఱింగి నిరంతరము వీటిని తలంచుచుండు వాడు మరణసమయ మాసన్న మగుతరి ప్రమాదము నెన్నడును చెందడు. శుక్లమార్గముననే తిన్నగా పరమపదమును పొందగల్గును.

దీని నెఱింగినంతమాత్రముననే జ్ఞానియై నాలుగువేదములు అభ్యసించుటవలన కలుగు ఫలమును, యజ్ఞ తపో దానాదులవలన కలుగు ఫలమును తృణీకరించునట్టి జ్ఞానులు పొందునట్టి అనాదియగు ఉత్కృష్టస్థానమును పొందును.

నవమాధ్యాయార్థ సంగ్రహము

శ్లో. స్వమాహాత్మ్యం మనుష్యత్వే । పరత్వం చ, మహాత్మనామ్ ।
విశేషో, నవమే, యోగో । భక్తిరూపః ప్రకీర్తితః ।

అర్థము : స్వమాహాత్మ్యం = తనమాహాత్మ్యము, మనుష్యత్వే = మనుష్యభావము నందును, పరత్వం = పరత్వము, మహాత్మనాం = భక్తులయొక్క, విశేషః = అతిశయము, భక్తిరూపః యోగః = భక్తియోగము, (అనునవి) నవమే = తొమ్మిదవ అధ్యాయమున, ప్రకీర్తితః = చెప్పబడెను.

తా॥ తొమ్మిదవ అధ్యాయమున భగవంతుని మహిమయు, మనుష్యుడుగా నవతరించినను తనసర్వాతిశయము చెడకుండుటయు, భక్తుల యొక్క గొప్పతన మున్ను, భక్తి యోగము యొక్క స్వరూపమున్ను చెప్పబడినవి.

శ్రీమద్భగవద్గీత – నవమాధ్యాయము

విషయసూచిక

శ్రీ హయగ్రీవాయ నమః

శ్రీ భగవద్గీతా - నవమోఽధ్యాయః

రాజవిద్యా రాజగుహ్యయోగః

అవ. భగవానుడు తానీ యధ్యాయమున చెప్పదలంచిన విషయమును ఫలముతో ప్రతిజ్ఞ చేయుచున్నాడు.

1. శ్లో. ఇదం తు తే గుహ్యతమం। ప్రవక్ష్యా మ్యనసూయవే।
జ్ఞానం విజ్ఞాన సహితం। యజ్జ్ఞాత్వా మోక్ష్యసేఽశుభాత్ ।

అర్థము : గుహ్యతమం = మిక్కిలి రహస్యమైన, విజ్ఞానసహితం = విశేష జ్ఞానముతో కూడిన, ఇదం జ్ఞానం = ఈ ఉపాసనయనబడు జ్ఞానమును, అనసూయవే = అసూయలేని, తే = నీకొఱకు, వక్ష్యామి = చెప్పగలను, యత్ = ఏ జ్ఞానమును, జ్ఞాత్వా = తెలుసుకొని, అశుభాత్ = సమస్తపాపసముదాయమునుండి, మోక్ష్యసే = విడువబడుదువు.

తా॥ మిక్కిలి రహస్యమైన భక్తియోగమును ఉపాసనా విశేష జ్ఞానముతో సహా- నా మాహాత్మ్యమును విని యసూయజెందని నీకు చెప్పెదను. దాని నెఱింగి యనుష్ఠించినచో నన్నుపొందుటకు ప్రతిబంధకములగు పాపములన్నియు పోవును.

జ్ఞానమనగా - భక్తియనబడు ఉపాసనారూపమైన జ్ఞానము.
విజ్ఞానమనగా - ఉపాస్యుని అతిశయము, ఉపాసన పద్ధతి,
ఉపాసనలోని విశేషములను గూర్చిన జ్ఞానము.

అవ. తానుపదేశింపబోవునట్టి భక్తియోగమును ప్రశంసించుచున్నాడు.

2. శ్లో. రాజవిద్యా రాజగుహ్యం। పవిత్ర మిద ముత్తమమ్।
ప్రత్యక్షావగమం ధర్మ్యం। సుసుఖం కర్తు మవ్యయమ్ ।

అర్థము : ఇదం = ఇది, రాజవిద్యా = విద్యలకు రాజైనది, రాజగుహ్యం = రహస్యములకు రాజైనది, ఉత్తమం = శ్రేష్ఠమైనది, పవిత్రం = శుద్ధికరమైనది, ప్రత్యక్షావగమం = ప్రత్యక్షమైన విషయము కలది, ధర్మ్యం = ధర్మమును తప్పనిది, కర్తుం = చేయుటకు, సుసుఖం = మిక్కిలి సుఖమైనది, అవ్యయం = నశించనిది.

తా ॥ ఈ భక్తి విద్యలకు రాజు, రహస్యములకు రాజు, అన్నిటికంటెను మిన్న. నన్ను పొందుట కాటంకపరచు పాపముల నన్నిటిని పోగొట్టునది. నన్ను ప్రత్యక్షముగ జూపునది. ధర్మమును తప్పనిది. మిక్కిలి ప్రియముగ పరిగ్రహించదగినది. ఫలమును పొందించియు తాను నశించనిది.

అవ. ఇట్టి మహత్తరమగు నీ యుపాసన నెఱుంగకున్నను, ఆచరించకున్నను మోక్షమునకు దూరులగుదురని నిందించుచున్నాడు

3. శ్లో. **అశ్రద్ధధానాః పురుషాః । ధర్మస్యాస్య పరన్తప ।**
అప్రాప్య మాం నివర్తన్తే । మృత్యుసంసారవర్త్మని ॥

అర్థము ః పరన్తప ! = అర్జునా ! అస్య = ఈ, ధర్మస్య = ఉపాసనకు, అశ్రద్ధధానాః = నమ్మకముతోడి తొందరలేనివారగు, పురుషాః = పురుషులు, మాం = నన్ను, అప్రాప్య = పొందక, మృత్యుసంసారవర్త్మని = మృత్యురూపమగు సంసార సరణిలో, నివర్తన్తే = నిత్యముగా నుండిపోవుచున్నారు.

తా ॥ అర్జునా! ఈ ధర్మము ననుష్ఠించుటకు యోగ్యతయున్నను దీనియందు విశ్వాసముతో దీని నాచరించవలెననెడు తొందరలేకయుండు పురుషులు నన్ను చేరనేచేరరు. వారీ సంసారమునందే నిరంతరము నిలిచిపోవుదురు.

అవ. భక్తిరూప ఉపాసనచే పొందదగిన భగవంతునియొక్క అత్యద్భుత మహిమను వర్ణించుచున్నాడు.

4. శ్లో. **మయా తత మిదం సర్వం । జగ దవ్యక్తమూర్తినా ।**
మత్స్థాని సర్వభూతాని । న చాహం తేష్వవస్థితః ॥

అర్థము ః అవ్యక్తమూర్తినా = ఇంద్రియములకు గోచరించనిస్వరూపముగల, మయా = నాచేత, ఇదం = ఈ, సర్వం = సమస్తమైన, జగత్ = ప్రపంచము, తతం = వ్యాపించ బడియున్నది, సర్వభూతాని = సమస్త ప్రాణులున్ను, మత్స్థాని = నాయందున్నవి, అహం చ = నేనైతే, తేషు = వాటియందు, న అవస్థితః = ఆధారపడి యున్నవాడనుకాను.

తా ॥ నేను నా స్వరూపము నందరకును గోచరింపజేయకయే నంతర్యామిగా జగత్తునం దంతటను వ్యాపించియుందును. కావున, నాయందీ సమస్త భూతములున్ను ఆధారపడియున్నవి. కాని, నేను మాత్రము దేనియందును ఆధారపడి యుండలేదు.

5. శ్లో. న చ మత్థ్సాని భూతాని । పశ్య మే యోగమైశ్వరమ్ ।
భూతభృ న్నచ భూతస్థః । మమాత్మా భూతభావనః ॥

అర్థము : భూతాని = భూతములు, మత్థ్సాని = నాయందున్నవి, నచ = కావు, మే = నా యొక్క, ఐశ్వరం = ఈశ్వరసంబంధమైన, యోగం = సంకల్పమును, పశ్య = చూడుము, భూతభృత్ = సకలభూతములను భరించువాడను, భూతస్థః భూతములయం దాధారపడియుండువాడను, నచ = కాను, మమ = నాయొక్క, ఆత్మా = మనోమయమగు సంకల్పము, భూతభావనః = భూతములను పుట్టించునది.

తా ॥ నేను సమస్త భూతములను నా సంకల్పముచే మాత్రమే ధరించియుందును, ఇట్లు నేను భూతములను భరించుచున్నను వాటిచే నా కుపకారమేమియు లేదు. నా సంకల్పమే వాటిని పుట్టించి ధరించి నియమించుచున్నది.

అవ. సకల జగత్తు యొక్క స్థితి - ప్రవృత్తులు భగవంతుని సంకల్పాధీనములేయని దృష్టాంతముతో తెలుపుచున్నాడు.

6. శ్లో. యథాకాశస్థితో నిత్యం । వాయు స్సర్వత్రగో మహాన్ ।
తథా సర్వాణి భూతాని । మత్థ్సానీ త్యుపధారయ ॥

అర్థము : నిత్యం = ఎల్లప్పుడును, ఆకాశస్థితః = ఆకాశమునందుండునట్టియు, సర్వత్రగః = అంతటను సంచరించుచుండునట్టిదియునగు, మహాన్ = గొప్పదైన, వాయుః = గాలి, యథా=ఏవిధముగానో, తథా=ఆ విధముగా, సర్వాః =సమస్తములైన, భూతాని = భూతములు, మత్థ్సాని ఇతి = నాయందున్నవని, ఉపధారయ = నమ్ముము.

తా ॥ గొప్పదైన గాలి పట్టులేని ఆకసమునందు నెలకొని యంతటను తిరుగుచున్నది. దానికి నేనేగదా యాధారము. అట్లే ప్రాణులన్నియు నా యందుండి నాచేతనే ధరింపబడియున్నవని నిశ్చయించుకొనుము.

అవ. అట్లే జగత్తుయొక్క ఉత్పత్తి ప్రళయములున్ను భగవంతుని సంకల్పాధీనములేయని చెప్పుచున్నాడు.

7. శ్లో. సర్వభూతాని కౌన్తేయ !। ప్రకృతిం యాన్తి మామికామ్ ।
కల్పక్షయే, పునస్తాని । కల్పాదౌ విసృజామ్యహమ్ ॥

అర్థము : కౌన్తేయ = అర్జునా, సర్వభూతాని = సమస్త పదార్థములున్ను, కల్పక్షయే = కల్పాంతమున, మామికాం = నా సంబంధమైన, ప్రకృతిం = ప్రకృతిని, యాన్తి = పొందుచున్నవి, కల్పాదౌ = కల్పారంభమున, పునః = తిరిగి, తాని = ఆ భూతములనే, అహం = నేను, విసృజామి = సృజించుచున్నాను.

తా ॥ అర్జునా ! కల్పాంతమున భూతములన్నియు నా సంకల్పముచే నా శరీరమగు ప్రకృతిని పొందుచుండును. వాటినే కల్పారంభమున తిరిగి నా సంకల్పముచే సృజింతును.

8. శ్లో. ప్రకృతిం స్వా మవష్టభ్య । విసృజామి పునః పునః ।
భూతగ్రామ మిమం కృత్స్న । మవశం ప్రకృతే ర్వశాత్ ॥

అర్థము : స్వాం = నా సంబంధమైన, ప్రకృతిం = ప్రకృతిని, అవష్టభ్య = ఎనిమిది విధములుగా పరిణమింపజేసి, ప్రకృతేః = ప్రకృతియొక్క, వశాత్ = అధీనతవలన, అవశం = స్వాతంత్ర్యములేని, కృత్స్నం = సమస్తమైన, ఇమం = ఈ, భూతగ్రామం= ప్రాణిసమూహమును, పునః పునః = మాటిమాటికి, విసృజామి = అనేక రీతుల పుట్టించుచున్నాను.

తా॥ నా ప్రకృతి విచిత్రముగా పరిణమించునది. దానిని నేను ఎనిమిది విధములుగా పరిణమింపజేయుదును. ఇట్టి నా ప్రకృతికి యధీనమై పరవశమైన ప్రాణులనన్నిటిని ఆయా కాలములయందు అనేక రీతులుగా పుట్టించుచుండును.

అవ. సృష్టిలోని హెచ్చుతగ్గులవలన భగవంతునకు నిర్దయత్వము గాని పక్షపాతముగాని లేవని చెప్పుచున్నాడు.

9.శ్లో. నచ మాం తాని కర్మాణి । నిబధ్నన్తి ధనఞ్జయ !।
ఉదాసీనవ దాసీన । మసక్తం తేషు కర్మసు ॥

అర్థము : ధనఞ్జయ! = అర్జునా! తాని = ఆ విషమసృష్టి మొదలగు, కర్మాణి = కర్మలు, తేషు= ఆ, కర్మసు = కర్మలయందు, అసక్తః = సంబంధములేనివాడనై, ఉదాసీనవత్ = తటస్థునివలె, ఆసీనం = ఉన్నట్టి, మాం = నన్ను, న నిబధ్నన్తి = బంధింపవు.

తా॥ అర్జునా! హెచ్చుతగ్గులుగా నుండు ఆ సృష్టి మొదలగు కర్మలు నాకు దోషముల నాపాదించవు. ఏలనన ఆ హెచ్చు తగ్గులకు కారణము వారి వారి పుణ్యపాపములే గాన నే నందు సంబంధములేక ఉదాసీనుడనై యుందును.

10. శ్లో. మయాఽధ్యక్షేణ ప్రకృతి । స్సూయతే సచరాచరమ్ ।
హేతునాఽనేన కౌన్తేయ । జగద్ది పరివర్తతే ॥

అర్థము : కౌన్తేయ = అర్జునా ! అధ్యక్షేణ = అధికారినగు, మయా = నాచేత, ప్రకృతిః =

ప్రకృతి, సచరాచరం = జంగమస్థావరములతో గూడిన జగత్తును, సూయతే = కనుచున్నది. అనేన = ఈ, హేతునా = కారణముచేత, జగత్ = ప్రపంచము, పరివర్తతేహి = ప్రవర్తించుచున్నదిగదా !

తా ॥ అర్జునా ! నేను ప్రకృతికి అధికారిని. నేను నా సంకల్పముతో జీవులను కర్మానుగుణముగా చూచుచుందును. దానిననుసరించి ప్రకృతి సమస్త చరాచరాత్మకమగు జగత్తును కనుచున్నది. నేనట్లు చూచుచుండుట చేతనే జగత్తు ప్రవర్తించుచున్నది.

అవ. మహాత్ముల వైభవమును చెప్పుటకు ముందు మూఢుల స్వభావమును తెలుపుచున్నాడు.

11.శ్లో. **అవజానన్తి మాం మూఢాః । మానుషీం తను మాశ్రితమ్ ।**
పరంభావ మజానన్తః । మమ భూత మహేశ్వరమ్ ॥

అర్థము : మమ = నాయొక్క, పరంభావం = పరత్వస్వభావమును, అజానన్తః = ఎఱుంగనివారై, మూఢాః = అవివేకులు, భూతమహేశ్వరం = సకలభూతముల యొక్క ఈశ్వరులకు ఈశ్వరుడనై, మానుషీం = మనుష్యసంబంధమైన, తనుం = శరీరమును, ఆశ్రితం= ఆశ్రయించిన, మాం = నన్ను, అవజానన్తి = అనాదరము చేయుచున్నారు.

తా ॥ కొందరు అవివేకులు నా పరత్వము నెఱుంగరు. వారు నన్ను తక్కిన మనుష్యులతో సాటివానినిగా జూచుచు సకలభూతములకును అధిపతులైన బ్రహ్మ రుద్రేంద్రాదులకు కూడ నేను అధిపతిననియు కేవలము కరుణచే మానవ శరీరమును ధరించితిననియు వారెఱుంగరు.

అవ. ఇట్లెఱుంగకుండుటకు కారణమును దానికి ఫలమును చెప్పుచున్నాడు.

12. శ్లో. **మోఘాశా మోఘకర్మాణో । మోఘజ్ఞానా విచేతసః ।**
రాక్షసీ మాసురీం చైవ । ప్రకృతిం మోహినీం శ్రితాః ॥

అర్థము : రాక్షసీం = తామసస్వభావము కలదియు, ఆసురీం = రాజసస్వభావము కలదియు, మోహినీం = మోహింపజేయునదియు నగు, ప్రకృతిం ఏవ = ప్రకృతినే, శ్రితాః = ఆశ్రయించినవారగుటచే, విచేతసః = యథార్థజ్ఞానము లేనివారును, మోఘాశాః = నిష్ఫలమైన కోరికలు కలవారును, మోఘకర్మాణః = నిరర్థకమైన పనులు కలవారును, మోఘజ్ఞానాః = నిష్ఫల జ్ఞానము కలవారును, (భవన్తి = అగుచున్నారు)

తా ॥ ప్రకృతి తామస స్వభావము రాజస స్వభావము మోహింపజేయు స్వభావమును కలదిగానుండును. అది నా మహిమను మరుగుపరచును. దానికి వశమైనవారికి నన్ను గూర్చిన నిజమైన జ్ఞానముండదు. కావున వారి జ్ఞానము, వారి కోరికలు, వారి కర్మలు అన్నియు నిరర్థకములే యగుచున్నవి.

అవ. భగవదవతారమును సఫలపరచు మహాత్ములయొక్క వ్యాపారమును తెలుపు నెపమున భక్తిస్వరూపము నెత్తింగించుట.

13. శ్లో. మహాత్మానస్తు మాం పార్థ ! దైవీం ప్రకృతి మాశ్రితాః ।
భజన్త్య నన్యమనసో । జ్ఞాత్వా భూతాది మవ్యయమ్ ॥

అర్థము : పార్థ = అర్జునా ! (యేతు = ఎవరైతే) దైవీం = సాత్త్వికమగు, ప్రకృతిం = ప్రకృతిని, ఆశ్రితాః = ఆశ్రయించినవారైన, మహాత్మానః = మహాత్ములో, (తే = వారు) భూతాదిం = భూతములకు ఆదియైనవాడను, అవ్యయం = నాశనములేనివాడను అగు, మాం = నన్ను, జ్ఞాత్వా = తెలిసికొని, అనన్యమనసః = ఇతరచింతలు లేని మనస్సు కలవారై, భజన్తి = ఉపాసించుచున్నారు.

తా ॥ అర్జునా ! సాత్త్విక ప్రకృతిగల మహాత్ములు నన్ను భూతములకన్నిటికిని ఆదికారణమైన వానినిగాను నాశరహితునిగాను తెలుసుకొని, ఇతర చింతల నన్నిటిని విడిచి భజించుటయే ప్రయోజనముగా నన్ను భజింతురు.

14. శ్లో. సతతం కీర్తయన్తో మాం । యతన్తశ్చ దృఢవ్రతాః ।
నమస్యన్తశ్చ మాం భక్త్యా । నిత్యయుక్తా ఉపాసతే ॥

అర్థము : మాం = నన్ను, సతతం = ఎల్లప్పుడును, భక్త్యా = భక్తితో, కీర్తయన్తః = పాడుచున్నవారును, దృఢవ్రతాః = స్థిరమైన సంకల్పముకలవారును, యతన్తశ్చ= నా పనులయందు ప్రయత్నించువారును, నమస్యన్తః చ = సాష్టాంగ నమస్కారము చేయువారును, నిత్యయుక్తాః = నాతో నిత్య సంబంధమును కోరువారును అయి, మాం = నన్ను, ఉపాసతే = ఉపాసించుచున్నారు.

తా ॥ వారు నాయందలి ప్రీతిపారవశ్యమున నన్ను గూర్చి ప్రేమతో పాడుచు, నాకు సంబంధించిన పనులకై దృఢసంకల్పముతో యత్నించుచు నాకు నమస్కరించుచు నాతో నెల్లప్పుడును కూడియుండవలెనని కోరుచు నాత్మయున్నంత వరకు నాదాస్యమునే యభిలషించి నన్నుపాసింతురు.

15. శ్లో. జ్ఞానయజ్ఞేన చా ప్యన్యే । యజన్తో మా ముపాసతే ।
ఏకత్వేన పృథ క్త్వేన । బహుధా విశ్వతోముఖమ్ ।

అర్థము : అన్యే అపి = కొందరుమహాత్ములు, జ్ఞానయజ్ఞేన = జ్ఞానమనెడు యజ్ఞముచేత, యజన్తః = పూజించుచున్నవారై, బహుధా = అనేకవిధములుగా, పృథక్త్వేన = వేఱువేఱుగా, విశ్వతోముఖం = అన్నిటిని విశేషణములుగా కలిగియున్న, మాం= నన్ను, ఏకత్వేన = ఒక్కడనేయను భావముతో, ఉపాసతే = ఉపాసింతురు.

తా ॥ మరికొందరు మహాత్ములు జగత్తుయొక్క ఆకారములనుబట్టి నానా విధములుగ నున్న నన్ను ఒక్కనిగనే యెఱింగి ఉపాసింతురు. దీనికే జ్ఞానయజ్ఞమని పేరు.

అవ. భగవంతుడే విశ్వశరీరుడని తెలుపుట.

16. శ్లో. అహం క్రతు రహంయజ్ఞః । స్వధా హ మహ మౌషధమ్ ।
మన్త్రోఽహ మహమేవాజ్య । మహ మగ్ని రహం హుతమ్ ॥

అర్థము : అహం ఏవ = నేనే, క్రతుః = జ్యోతిష్టోమాదిక్రతువును, అహం ఏవ = నేనే, యజ్ఞః= పంచమహాయజ్ఞమును, అహం ఏవ = నేనే, స్వధా = పితరులకిడెడు స్వధను, అహం ఏవ = నేనే, ఔషధం = హవిస్సును, అహం ఏవ = నేనే, మంత్రః = మంత్రము, అహం ఏవ = నేనే, ఆజ్యం = నేయి, అహం ఏవ = నేనే, అగ్నిః = అగ్నిహోత్రము, అహంఏవ = నేనే, హుతం = హోమమును.

తా ॥ జ్యోతిష్టోమాది క్రతువులు, పంచమహాయజ్ఞములు, పితురుల కిష్టమైన స్వధ = (ఓషధి వికారమైన హవిస్సు) మంత్రము నేయి మొదలగు హవిస్సు ఆహవనీయాది అగ్ని హోమము ఇవియన్నియు నేనేయగుచున్నాను.

17.శ్లో. పితాఽహ మస్య జగతో । మాతా ధాతా పితామహః ।
వేద్యం పవిత్ర మోఙ్కారః । ఋక్సామయజు రేవ చ ।

అర్థము : అస్య = ఈ, జగతః = ప్రపంచమునకు, పితా = తండ్రియు, మాతా = తల్లియు, పితామహః = తాతయు, ధాతా = వంశ మూలపురుషుడు, వేద్యం = తెలియదగిన, పవిత్రం = పావనమైన, ఓంకారః = ప్రణవము, ఋక్, సామ, యజుః చ = ఋక్ సామ యజుర్వేదములును, అహం ఏవ = నేనే (అస్మి = అగుచున్నాను).

తా॥ జగత్తునందలి చరాచరములకు, తండ్రిగాను తల్లిగాను తాతముత్తాతలు మొదలగు వంశముల మూలపురుషులు వేదము తెలియదగిన పావన

వస్తువులు, వేదబీజమగు ఓంకారము ఋక్ సామ యజుర్వేదములు ఇవి యన్నియు నేనే యగుచున్నాను.

18.శ్లో. గతి ర్భర్తా ప్రభు స్సాక్షీ । నివాస శ్శరణం సుహృత్ ।
ప్రభవః ప్రళయస్థానం । నిధానం బీజ మవ్యయమ్ ॥

అర్థము : గతిః = పొందవలసిన స్థానము. భర్తా = భరించువాడు, ప్రభుః = శాసించువాడు, సాక్షీ = చూచువాడు, నివాసః = నివసించుస్థానము, శరణం = రక్షకుడు, సుహృత్ = హితైషియు, ప్రభవః ప్రళయస్థానం = పుట్టుచోటును లయించుచోటును, నిధానం = పుట్టుచు గిట్టుచునుండు పదార్థమున్ను, అవ్యయం = నాశరహితమైన, బీజం = కారణమున్ను. (అహం ఏవ = నేనే)

తా॥ పొందవలసినచోటున్ను, ధరించువాడను, నియమించువాడను, సాక్షియై చూచువాడను, ఇల్లు మొదలగు నివాసస్థానమున్ను, రక్షకమున్ను, మేలుకోరువాడను, పుట్టుచోటున్ను, లయించుచోటున్ను, పుట్టుచు గిట్టుచునుండు పదార్థమున్ను, నశించని కారణమున్ను నేనే.

19.శ్లో. తపామ్యహ మహం వర్షం । నిగృహ్ణా మ్యుత్సృజామిచ ।
అమృతంచైవ మృత్యుశ్చ । సదసచ్చా హ మర్జున ॥

అర్థము : అర్జున = అర్జునా! అహం = నేను, తపామి = తపింపజేయుచున్నాను, అహం = నేను, వర్షం = వర్షమును, నిగృహ్ణామి = నిలుపుచున్నాను. ఉత్సృజామిచ = విడుచుచున్నాను. అమృతం = లోకముజీవించుకారణమున్ను, సత్ = ఇప్పుడున్నదియు, అసత్ = ఇప్పుడులేనిదియు, అహం ఏవ= నేనే.

తా॥ నేనే జగత్తును తపింపజేయుచున్నాను, నేనే వర్షము నరికట్టుచున్నాను, నేనే వర్షమునొసంగుచున్నాను. లోకమునకు బ్రతుకు తెరువును మరణ నిమిత్తమును నేనే. వర్తమాన భూత భవిష్యత్తులలో నుండెడు వస్తువులన్నియు నేనే.

అవ. కర్మఠులయొక్క వ్యాపారమును వారికి లభించు ఫలమును తెలుపుచున్నాడు.

20.శ్లో. త్రైవిద్యా మాం సోమపాః పూతపాపా। యజ్ఞై రిష్ట్వా స్వర్గతిం ప్రార్థయన్తే ।
తే పుణ్య మాసాద్య సురేన్ద్రలోక । మశ్నన్తి దివ్యాన్ దివి దేవభోగాన్ ॥

అర్థము : త్రైవిద్యాః = మూడువేదములయందు మాత్రమే నిష్ఠకలవారై, సోమపాః = సోమపానము చేసినవారై, పూతపాపాః = పవిత్రముచేయబడిన పాపములు

కలవారై, యజ్ఞైః = యాగములచేత, మాం = నన్ను, ఇష్ట్వా = యజించి, స్వర్గతిం= స్వర్గప్రాప్తిని, ప్రార్థయన్తే = ప్రార్థించుచున్నారు, తే = వారు, పుణ్యాం = పుణ్యఫలమైన, సురేన్ద్రలోకం = స్వర్గమును, ఆసాద్య = పొంది, దివి = స్వర్గమునందు, దివ్యాన్ = స్వర్గమునకు చెందిన, దేవభోగాన్ = దేవతలభోగమును, అశ్నన్తి = అనుభవించుచున్నారు.

తా॥ మూడువేదములలోని కర్మకాండయందుమాత్రమే నిష్ఠకలవారు ఇంద్రాది రూపముగా నున్న నా శరీరములను పూజించి సోమపానముచేసి పాపములను పోగొట్టుకొని స్వర్గసుఖములను వాంఛింతురు. వారా పుణ్యఫలమగు స్వర్గమును పొంది అచ్చట తత్సంబంధమైన దేవభోగముల ననుభవింతురు.

21.శ్లో. తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం । క్షీణేపుణ్యే మర్త్యలోకం విశన్తి ।
ఏవం త్రయీధర్మ మనుప్రపన్నాః । గతాగతం కామకామా లభన్తే ॥

అర్థము : తే = వారు, విశాలం = విశాలమైన, తం = ఆ, స్వర్గలోకం = స్వర్గలోకమును భుక్త్వా= అనుభవించి, పుణ్యే = పుణ్యము, క్షీణే = తరిగిపోగా, మర్త్యలోకం = భూలోకమును, విశన్తి = ప్రవేశించుచున్నారు. ఏవం = ఇట్లు, త్రయీధర్మం = మూడు వేదముల యందలి కర్మకలాపమును, అనుప్రపన్నాః = ఆశ్రయించినవారగు, కామకామాః= ఫలములనే కోరువారు, గతాగతం = రాకపోకలను, లభన్తే = పొందుచున్నారు.

తా॥ అట్టి కర్మఠులు విశాలమైన స్వర్గలోకమును అనుభవించి అందులకు మూలభూతమైన పుణ్యము క్షీణింపగా తిరిగి మనుష్యలోకమును ప్రవేశించు చున్నారు. ఇట్లు కేవలము త్రయీ ధర్మమును ఆశ్రయించిన వారు అస్థిరములగు స్వర్గాదులనే మాటిమాటికి అనుభవించుచు చచ్చుచు పుట్టుచు నుందురు.

అవ. మహాత్ములగు భక్తుల విశేషమును వివరించుచున్నాడు.

22.శ్లో. **అనన్యా శ్చిన్తయన్తో మాం । యే జనాః పర్యుపాసతే ।**
తేషాం నిత్యాభియుక్తానాం । యోగక్షేమం వహామ్యహమ్ ॥

అర్థము : యే జనాః = ఏ జనులు, అనన్యాః = ఇతర ప్రయోజనములు లేనివారై, మాం = నన్ను, చిన్తయన్తః = ధ్యానించుచున్నవారై, పర్యుపాసతే = పూర్ణముగా ఉపాసన చేయుచున్నారో, తేషాం = అట్టి, నిత్యయుక్తానాం = నాతో నిత్య సంబంధమును కోరెడివారియొక్క, యోగక్షేమం = యోగమును క్షేమమును, అహం = నేను, వహామి = నిర్వహించుచున్నాను.

తా॥ ఏ ప్రయోజనమును కోరక నన్నే ధ్యానించుచు పూర్తిగా ఉపాసించుచు నాతో నిత్యసంబంధమును కోరునట్టి నాభక్తులయొక్క యోగక్షేమము లను నేనే వహింతును.
(నన్ను పొందుట 'యోగము'; తిరిగి భూమిలో జన్మించకుండుట 'క్షేమము').

అవ. దేవతలందరును భగవంతునకు శరీరభూతులేగాన వారి యారాధన పర్యవసానమునకు తన యారాధనయేయని భగవంతుడెఱుంగునుగదా! అట్టితరి వారికిని మోక్ష మేల యొసంగడను ప్రశ్నకుత్తర మొసంగుచున్నాడు.

23.శ్లో. యే త్వన్యదేవతాభక్తాః । యజన్తే శ్రద్ధయాఽన్వితాః ।
తేఽపి మామే వ కౌన్తేయ । యజన్త్య విధిపూర్వకమ్ ॥

అర్థము : కౌన్తేయ = అర్జునా! యేతు = ఎవరైతే, అన్యదేవతాభక్తాః = ఇతరదేవతల యందు భక్తికలవారై, శ్రద్ధయా = శ్రద్ధతో, అన్వితాః = కూడినవారై, యజన్తే = పూజించుచున్నారో, తే అపి = వారున్ను, అవిధిపూర్వకం = వేదాంతవిధులను ముందుంచుకొనక, మాం ఏవ = నన్నే, యజన్తి = పూజించుచున్నారు.

తా॥ అర్జునా! కేవల ఇంద్రాది దేవతలయందు మాత్రమే భక్తి కలవారై శ్రద్ధతో వారినే పూజించువారుకూడ నిజమునకు అంతర్యామినగు నన్ను పూజించువారలే యగుచున్నారు. కాని ఈ విధానము వేదాంతవిధులకు విరుద్ధమైనది.

అవ. కర్మఠులు తాముచేయు కర్మలన్నియు నిజమునకు ఇంద్రాదుల కంతర్యామిగా నుండు భగవంతుని యారాధనలే యనియు, ఆరాధింపబడువాడు భగవానుడే యనియు నెఱుంగరు. కావున వారల్పఫలభాక్కులును, పునరావృత్తి కలవారును అగుచున్నారని తెలుపుచున్నారు.

24.శ్లో. అహం హి సర్వయజ్ఞానాం । భోక్తా చ ప్రభు రేవ చ
న తు మా మభిజానన్తి । తత్త్వేనా తశ్చ్యవన్తి తే ॥

అర్థము : సర్వయజ్ఞానాం= యజ్ఞములకన్నింటికిని, భోక్తాచ = అనుభవించువాడనున్ను, ప్రభుః ఏవచ = ఫలమునొసంగు యజమానియున్ను, అహంహి = నేనేకదా! (ఇట్లు) మాం = నన్ను, తత్త్వేన = నిజముగా, న అభిజానన్తి = ఎఱుంగరు, అతః= కాబట్టి, తే = వారు, చ్యవన్తి = జారిపోవుచున్నారు.

తా॥ నిజమారయ సకల యజ్ఞములచే నారాధింపబడు వాడనున్ను వాటికి ఫలము లొసంగువాడనున్ను నేనే. ఇట్లే నిజమును కర్మఠులెరుంగరు గాన వారు పురుషార్థపరిభ్రష్టులగుచున్నారు.

అవ. ఆచరించు కర్మ ఒక్కటేయైనను సంకల్పభేదముచే కొందరత్యల్పఫలములనే బడసి యవి తరుగగనే తిరిగి సంసారమున కూలుచున్నారు. మరికొందరు నిరతిశయానంద స్వరూపుడగు భగవంతుని బడసి తిరిగి పుట్టుట యెఱుంగక సుఖించుచున్నారు. ఇది యెంత చిత్రమో ! యనుచున్నాడు.

25.శ్లో. యాన్తి దేవవ్రతా దేవాన్ । పితౄన్ యాన్తి పితృవ్రతాః ।
భూతాని యాన్తి భూతేజ్యాః । యాన్తి మద్యాజినోఽపిమామ్ ॥

అర్థము : దేవవ్రతాః = ఇంద్రాదుల నర్చించు సంకల్పము కలవారు, దేవాన్ = ఇంద్రాది దేవతలనే, యాన్తి = పొందుచున్నారు, పితృవ్రతాః = పితురుల నారాధింతుమని సంకల్పించువారు, పితౄన్ = పితరులనే, యాన్తి = పొందుచున్నారు, భూతేజ్యాః= యక్షరక్షస్సుల నారాధించువారు, భూతాని = యక్షరక్షస్సులనే, యాన్తి = పొందుచున్నారు, మద్యాజినః అపి = వారందరకు నంతరాత్మభూతుడగు నన్నర్చించువారున్ను, మాం = నన్నే, యాన్తి = పొందుచున్నారు.

తా॥ ఇంద్రాది దేవతల నారాధించు సంకల్పముతో వారి నారాధించువారు ఇంద్రాది సాయుజ్యమునే బడసి వారితోపాటు వారి లోకముల యందుపరిమిత భోగముల ననుభవించి వారు నశించునపుడు వారితోపాటు వీరును నశించుచున్నారు. కాని భగవంతు నారాధించువారు ఆతని సాయుజ్యమును బడసి ఆతనితో సమాన భోగముల ననుభవించుచు వాటికిగాని యాతనికిగాని నాశము లేనందున తాముకూడ నాశములేకయే తిరిగి సంసారమున బుట్టక శాశ్వతముగ నట్లే యనుభవించు చుందురు.

అవ. ఉభయులకును ఆయాస మొక్కటేయైనను ఫలభేద మిట్లు చెప్పబడెను. ఇక నీ శ్లోకమున ఆరాధనలో గల తారతమ్యమును జెప్పుచున్నాడు.

26.శ్లో. పత్రం పుష్పం ఫలం తోయం । యో మే భక్త్యా ప్రయచ్ఛతి ।
త దహం భక్త్యుపహృత । మశ్నామి ప్రయతాత్మనః ।

అర్థముః యః = ఏ భక్తుడు, మే = నాకు, పత్రం = ఆకునుగాని, పుష్పం = పువ్వునుగాని, ఫలం = పండునుగాని, తోయం = నీటినిగాని, భక్త్యా = భక్తితో, ప్రయచ్ఛతి = యిచ్చుచున్నాడో, ప్రయతాత్మనః = దాని నిచ్చుటయే ప్రయోజనముగా తలంచుట యనెడు మనః పారిశుద్ధ్యము గల ఆ భక్తుని యొక్క, భక్త్యుపహృతం= భక్తితో సమర్పింపబడిన, తత్ = ఆ పదార్థమును, అశ్నామి = అనుభవించుచున్నాను.

తా॥ నా భక్తుడు నాకు భక్తితో ఇతర ఫలములను గోరక నాకిచ్చుటయే ఫలమని తలంచి ఆకునో, పువ్వునో, పండునో, నీటినో యిచ్చినచో

నట్టిభక్తితో సమర్పించిన ఆ పదార్థమును కరువుతీరిన వస్తువు లభించినట్లు ఒడలెరుగని యానందముతో నారగింతును.

అవ. ఇట్లు భక్తుల వైభవము లోకాతీతమైనది గాన నీవు భక్తుడవై లౌకిక వైదిక నిత్యనైమిత్తిక కర్మల నీ విధముగా నాచరింపుమని యుపదేశించుచున్నాడు.

27.శ్లో. **యత్కరోషి యదశ్నాసి । యజ్జుహోషి దదాసి యత్ ।**
యత్తపస్యసి కౌన్తేయ । తత్కురుష్వ మదర్పణమ్ ।

అర్థము : కౌన్తేయ = అర్జునా ! యత్ = దేహధారణకు యే లౌకిక వ్యాపారమును, కరోషి= చేయుచున్నావో, యత్ = దేనిని, అశ్నాసి = తినుచున్నావో, యత్ జుహోషి= యే హోమమును చేయుచున్నావో, యత్ దదాసి = యే దానమును చేయుచున్నావో, తత్ = దానినంతను, మదర్పణం = నాకర్పితమగునట్లుగా, కురుష్వ = చేయుము.

తా॥ అర్జునా! నీవు దేహధారణకై చేయు లౌకిక వ్యాపారములను, శాస్త్రోక్తములగుటచే చేయునట్టి యజ్ఞదానతపః ప్రభృతి వైదిక కర్మలను నీకు శేషినగు నాయందర్పణబుద్ధితో ప్రేమతో నాచరింపుము.

అవ. ఇట్లాచరించుటచే కలుగు ఫలము నుపదేశించుచున్నాడు.

28.శ్లో. **శుభాశుభఫలైరేవం । మోక్ష్యసే కర్మబన్ధనైః ।**
సన్న్యాసయోగయుక్తాత్మా । విముక్తో మాముపైష్యసి ।

అర్థము : ఏవం = ఇట్లు, సన్న్యాసయోగయుక్తాత్మా = నీవుచేయు లౌకిక వైదిక కర్మమంతయు నా యారాధన యని భావించు మనస్సు కలవాడవై, శుభాశుభ ఫలైః = సుఖదుఃఖముల నొసంగునట్టి, కర్మబన్ధనైః = బన్ధహేతువులగు కర్మలన్నిటిచేతను, మోక్ష్యసే = విడువబడుదువు, విముక్తః = ఇట్లు విడువబడినవాడవై, మాం = నన్ను, ఉపైష్యసి = పొందుదువు.

తా॥ నిన్ను నాకు**కింకరునిగాను,**నీవుచేయు కర్మలన్నియు నాయారాధనగాను తలంచుచు లౌకిక వైదిక కర్మలను చేయుము. ఇట్లు చేసినచో సుఖదుఃఖముల నొసంగనివి యగుటచే నన్ను పొందుట కాటంకపడునట్టి సమస్త ప్రాచీన కర్మలనుండియు విడువబడి నన్నే పొందుదువు.

అవ. 'పత్రం పుష్పం' అనెడు శ్లోకముచే సౌలభ్యమును చెప్పి 'యత్కరోషి' యను శ్లోకముచే దానిని బలపరచి, యీ శ్లోకముచే సౌశీల్యమును చెప్పుచున్నాడు.

9.శ్లో. **సమోఽహం సర్వభూతేషు । న మే ద్వేష్యోఽస్తి న ప్రియః ।**
యే భజన్తి తు మాం భక్త్యా । మయి తే తేషు చాప్యహమ్ ॥

అర్థము : అహం = నేను, సర్వ భూతేషు = అన్ని ప్రాణులపట్లను, సమః = సమానుడను, మే = నాకు, ద్వేష్యః = ద్వేషించదగినవాడు, నాస్తి = లేడు, ప్రియః = ఇష్టుడును, న = లేడు, యేతు = ఎవరైతే, మాం = నన్ను, భక్త్యా = భక్తితో, భజన్తి = ఉపాసించుచున్నారో, తే = వారు, మయి = నాయందున్ను, తేషుచ = వారియందు, అహమపి = నేనున్ను, (వర్తామహే = ఉంటున్నాము).

తా॥ జాతి ఆకారము స్వభావము జ్ఞానము మొదలగువాటిచే గొప్పవారైనను తక్కువవారైనను నన్నాశ్రయించుటలో సమానులే. గొప్పవారని గౌరవించను. తక్కువవారని తిరస్కరించను. కాని నన్ను భజించక నిలువలేని నాభక్తులు మాత్రమే నాపట్ల నాతో సాటివారు వర్తించు నట్లే వర్తింతురు. నేనువారిపట్ల నాకంటె గొప్పవారిపట్ల వర్తించినట్లు వర్తింతును.

అవ. జాత్యాదులచేతనేకాదు. ఆచారముచే నికృష్టులైనను నే నాదరించుచున్నానను చున్నాడు.

30.శ్లో. **అపి చే త్సుదురాచారో । భజతే మా మనన్యభాక్ ।**
సాధు రేవ స మన్తవ్యః । సమ్యగ్వ్యవసితో హి సః ।

అర్థము : సుదురాచారః అపి = మిక్కిలి దురాచారములు కలవాడైనను, మాం = నన్ను, అనన్యభాక్ = నన్నొక్కనిమాత్రమే కేవలము భజించుటయే ఫలముగా కలవాడై, భజతేచేత్ = భజించినచో, సః = అట్టివాడు. సాధుఃఏవ = సజ్జనుడనియే, మన్తవ్యః= ఆదరించదగినవాడు, హి = ఎందువల్లననగా, సః = వాడు, సమ్యక్ = లెస్సగా, వ్యవసితః = నిశ్చయించుకొనినవాడు.

తా॥ చేయవలసినవి మానుటయేగాక చేయరానివికూడా చేయువాడు సుదురాచారి. అట్టివాడైనను ఫలాశలన్నిటిని విడిచి నన్ను భజించనిదే నిలువలేక భజించుటయే ఫలముగా భజించుచో వానిని వైష్ణవాగ్రేసరుడనియే ఆదరింపవలెను. ఎందుకనగా వాడు నన్నే తనకు స్వామినిగాను, గురువునుగాను స్నేహితునిగాను, అన్నివిధముల బంధువునిగాను నమ్మియుండును.

అవ. దురాచారము భక్తిధార నరికట్టునుగదా! ఇట్టివాడెట్లు భక్తుడగును? అను ప్రశ్నకుత్తర మొసంగుచున్నాడు.

31.శ్లో. క్షిప్రం భవతి ధర్మాత్మా । శశ్వచ్ఛాన్తిం నిగచ్ఛతి ।
కౌన్తేయ! ప్రతిజానీహి । న మే భక్తః ప్రణశ్యతి ॥

అర్థము : క్షిప్రం = వెంటనే, ధర్మాత్మా = భజనతత్పరుడు, భవతి = అగుచున్నాడు, శశ్వత్ శాన్తిం = పునరావృత్తినిరానీయని దురాచారనివృత్తిని, నిగచ్ఛతి = పొందుచున్నాడు, కౌన్తేయ = అర్జునా ! మే = నా యొక్క, భక్తః = భక్తుడు, నప్రణశ్యతి = నాశమునొందడు (ఇతి=అని), ప్రతిజానీహి = ప్రతిజ్ఞచేయుము.

తా॥ అట్టి దురాచారుడై నను నాయందలి భక్తి మహిమచే వెంటనే భజనతత్పరుడగుచున్నాడు. ఇక నన్ను పొందనీయక ఆటంకపరచు దురాచారమడుగంటిపోవును. ఇట్లు నా భక్తి నారంభించు నరుడెన్నటికిని చెడడని నీవు నిర్భయముగ ప్రతిజ్ఞ చేయుము.

అవ. ఆగంతుక పాపశీలులగు భక్తుల స్థితిని చెప్పి నీచులగు సహజ పాపశీలులే తరించుచుండగ, జాత్యాదులచే నధికులును పుష్కల భక్తియుతులును నగు మానవులు తరించుట కేమి యాటంకమనుచున్నాడు.

32.శ్లో. మాం హి పార్థ! వ్యపాశ్రిత్య । యేఽపి స్యుః పాపయోనయః ।
స్త్రియో వైశ్యా స్తథా శూద్రా । స్తేఽపి యాన్తి పరాంగతిమ్ ॥

అర్థము : పార్థ = అర్జునా ! యే = ఎవరు, పాపయోనయః అపి = పాపజన్ములను, స్యుః = అగుదురో, (తే = ఆ,) స్త్రియః = స్త్రీలు, వైశ్యాః = వైశ్యులు, తథా = అట్లే, శూద్రాః అపి = శూద్రులున్ను, మాం = నన్ను, వ్యపాశ్రిత్య = ఆశ్రయించి, పరాంగతిం = ఉత్తమమగు మోక్షపదవిని, యాన్తిహి = పొందుచున్నారుగదా.

తా॥ కర్మకు యోగ్యతలేని స్త్రీలు, యాగమున కర్తతలేని వైశ్యులు, వేదాధ్యయనమున కనర్హులగు శూద్రులు సహజమగు నీచజన్మకలవారైనను నాభక్తులగుదురేని ఉత్తమమైన మోక్షసౌధము నధిరోహింతురనగా.

33.శ్లో. కిం పున ర్బ్రాహ్మణాః పుణ్యాః । భక్తా రాజర్షయ స్తథా ।
అనిత్య మసుఖం లోక । మిమం ప్రాప్య భజస్వ మామ్ ॥

అర్థము : పుణ్యాః = పుణ్యజన్ములను, భక్తాః = భక్తులును నగు. బ్రాహ్మణాః = బ్రాహ్మణులును, రాజర్షయః = ఋషులవంటి క్షత్రియులును, తథా = అట్లు ఉత్తమ గతిని

పొందుదురని, కిం పునః = చెప్పవలయునా? అనిత్యం అస్థిరమును, అసుఖం = సుఖశూన్యమును అగు, ఇమం = ఈ, లోకం = లోకమును, ప్రాప్య = పొంది, (నీవు). మాం = నన్ను, భజస్వ = భజించుము.

తా॥ పుణ్యజన్మము కలిగి నాయందు భక్తిగల బ్రాహ్మణులును, ఋషులవంటి రాజులును ముక్తిని బడయగలరని వేరుగ జెప్పవలెనా ? కావున నీవును రాజర్షితుల్యుడవై అస్థిరమైన తాపత్రయ తప్తమగు నీ లోకమున వర్తించుచున్నావుగాన నన్ను భజింపుము.

అవ. భక్తి స్వరూపమును నిష్కర్షించుచున్నాడు.

34.శ్లో. మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।
మామేవైష్యసి యుక్త్వైవ । మాత్మానం మత్పరాయణః ॥

ఇతి శ్రీభగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే
శ్రీ కృష్ణార్జున సంవాదే రాజవిద్యా రాజగుహ్య యోగోనామ నవమోధ్యాయః

అర్థము : మన్మనాః = నా యందుంచబడిన మనస్సు కలవాడవు. భవ = అగుము, మద్భక్తః= నాయందత్యంత ప్రీతి కలవాడవు, (భవ = అగుము) మద్యాజీ = నన్ను పూజించువాడవు, (భవ= అగుము) మాం = నన్ను, నమస్కురు = నమస్కరించుము. మత్పరాయణః = నన్నే ముఖ్యమైన స్థానముగా గలవాడవై, ఏవం = ఇట్లు, ఆత్మానం=మనస్సును, (ప్రాప్య = పొంది) మాం ఏవ=నన్నే, ఏష్యసి = పొందగలవు.

తా ॥ నన్ను ధ్యానింపుము. ఆ ధ్యానమును అత్యంత ప్రేమతో చేయుము. దానికి అంగముగా నా పూజలు సల్పుము. నాకు నమస్కరింపుము. నన్నే ఆశ్రయముగా కలవాడవై నన్నునుభవించుటకు సమర్థమగు మనస్సును పొంది నన్ను పొందగలవు.

ఇది ఉపనిషదర్థ ప్రతిపాదకమును, బ్రహ్మవిద్యయు, యోగశాస్త్రమును
శ్రీకృష్ణార్జున సంవాదరూపమును అయిన శ్రీ భగవద్గీతయందలి
రాజవిద్యా రాజగుహ్యయోగమనెడు తొమ్మిదవ అధ్యాయము.

ఈ అధ్యాయమునందలి శ్లోకముల సంఖ్య 34

ఇప్పటికి మొత్తము అయిన శ్లోకముల సంఖ్య 371

శ్రీమద్భగవద్గీతా ప్రశ్నోత్తరావళి

నవమాధ్యాయము

1. ప్ర. ఈ యధ్యాయమునకు పేరేమి ? ఆ పేరెందులకుంచబడింది ?

ఉ. ఈ యధ్యాయమునకు "రాజవిద్యా రాజగుహ్య యోగ" మని పేరు.

ఈ మధ్యషట్కమున భక్తియోగము ప్రధానముగా వర్ణింపబడినది. ఇతర ఉపాయముల కంటె యీ భక్తియోగమునకు గల అతిశయము తెలుపబడవలసి యున్నది. అది యీ యధ్యాయమందలి రెండవ శ్లోకముచే చేయబడెను. ఆ శ్లోకమున యీ భక్తిని ప్రశంసించుచు 'రాజవిద్యా రాజగుహ్యం' అనగా 'విద్యలకు రాజు, రహస్యములకు రాజు' అని చెప్పబడెను. రాజనగా శ్రేష్ఠమైనది యని యర్థము. విద్యలనగా పరమాత్మను పొందు ఉపాయములు. గుహ్యములనగా అధికారి యోగ్యత నెఱింగి ఉపదేశించవలసిన రహస్యములు. అట్టి ఉపాయములన్నిటిలోను అట్టి రహస్యములన్నిటిలోను ఈ భక్తియోగ ముత్తమమైనదిగాన దీనిని 'రాజవిద్యా రాజగుహ్య' మని పరమాత్మ ప్రశంసించెను. అదియే యీ యధ్యాయమునకు శుభనామమై వెలసినది.

2. ప్ర. ఈ యధ్యాయమున చెప్పబడిన ప్రధాన విషయములెవ్వి ?

ఉ. 1. ఉపాసించదగిన పరమాత్మ యొక్క మాహాత్మ్యమును వర్ణించుట. (4 నుండి 10 శ్లో)

2. మనుష్యావతారమందును ఆతని పరత్వమును కల్యాణగుణములతో వర్ణించుట. (11, 12 శ్లో)

3. మహాత్ములగు భక్తులయొక్క అతిశయాది వర్ణనము. (13, 14, 22, 25 శ్లో)

4. భక్తి యోగము యొక్క స్వరూపమును సపరికరముగా వర్ణించుట.

ఇందు భక్తియోగము యొక్క స్వరూపమును నిష్కర్షించుట అనగా - సంశయ విపర్యయములు లేనట్లు సమస్తపరికరములతో చెప్పుట ప్రధానము తక్కినవన్నియు దానికి సంబంధించినవే.

(1)తా నీ యధ్యాయమున చెప్పదలచిన భక్తిస్వరూపాది ముఖ్యవిషయములను ఫలముతో సంగ్రహముగా ప్రతిజ్ఞచేయుట. (1 శ్లో)

(2) అట్లు ప్రతిజ్ఞ చేసిన ప్రధానాంశమగు భక్తియోగమును శ్రద్ధతో వినుటకును, రహస్యముగ భద్రపరచుటకును దానిని ప్రశంసించుట. (2 శ్లో)

(3) ఆ విషయమునే వ్యతిరేకముగా (అనగా అనాదరించుటచే వచ్చెడి అనర్థములతో బలపరచుట). (3 శ్లో)

(4) అట్టి భక్తిచే పొందదగిన తన మాహాత్మ్యమును జెప్పి తద్వారా భక్తి యొక్క మాహాత్మ్యమునే యనుమడించుట. (4, 5 శ్లో)

(5) సకల ప్రపంచము యొక్క స్థితి ప్రవృత్తులు భగవంతుని సంకల్పాధీనము లేయని దృష్టాంతములో తెల్పుట. (6 శ్లో)

(6) అట్లే ప్రపంచముయొక్క ఉత్పత్తి ప్రళయములున్ను భగవత్సంకల్పాధీన ములే యని చెప్పుట. (7, 8 శ్లో)

(7) సృష్టిలోని తారతమ్యముల వలన భగవంతునకు నిర్దయత్వముగాని పక్షపాతముగాని లేవనుట. (9, 10 శ్లో)

(8) మహాత్ముల విశేషమును తెలుపుటకై మూఢుల స్వభావమును దెలుపుట. (11, 12 శ్లో)

(9) తన యవతారమును సఫలపరచు మహాత్ముల యొక్క వ్యాపారమును తెలుపు నెపమున భక్తి స్వరూపము నెఱింగించుట. (13, 14, 15 శ్లో)

(10) భగవంతుడే విశ్వశరీరుడని తెలుపుట (16 నుండి 19 శ్లో)

(11) మహాత్ముల వైభవమతిశయించుటకై కర్మఠుల యొక్క వ్యాపారమును వారికి లభించు ఫలమును వర్ణించుట. (20, 21, 23, 24, 25 శ్లో)

(12) మహాత్ముల విశేషమును వివరించుట. (22, 26, 27, 28 శ్లో)

(13) భగవంతుని [illegible]మగు స్వభావమును తెలుపుట. (29 నుండి 33 శ్లో)

(14) భక్తి స్వ[illegible]మును నిష్కర్షించుట. (34 శ్లో)

3. ప్ర. ఈ అధ్యాయమునకు వెనుకటి అధ్యాయములోను ప్రధాన శాస్త్రార్థములోను గల సంబంధమేమి ?

ఉ. భక్తి యోగపరమగు మధ్యమషట్కములో మొదటిదియగు నేడవ యధ్యాయమున భగవదుపాసకుల తారతమ్యము చెప్పబడినది. ఎనిమిదవ యధ్యాయమున ఆ మూడు విధములగు ఉపాసకులకును తెలుసుకొనదగి నట్టియు, పరిగ్రహించదగినట్టియు విషయములు తెలుపబడినవి. ఇప్పుడీ యధ్యాయమున నట్టి ఉపాసకులచే నుపాసింపబడు పరమ పురుషుని మాహాత్మ్యమున్ను జ్ఞానుల ఆధిక్యమున్ను వివరింపబడి వారవలంబించు

సాక్షాన్మోక్షసాధనమగు భక్తిస్వరూపము వివరింపబడుచున్నది. గాన నీ యధ్యాయము ఎనిమిదవ అధ్యాయముతోను ప్రధాన శాస్త్రార్థముతోను సాక్షాత్సంబంధము కలిగియున్నది.

4. ప్ర. గుహ్యతమమని యీ యధ్యాయారంభ శ్లోకమున ప్రశంసింపబడిన జ్ఞాన విజ్ఞానములన నేమి ?

ఉ. జ్ఞాన మనగా భక్తి యనబడు ఉపాసన రూపమైన జ్ఞానము.

విజ్ఞానమనగా – ఉపాస్యుడగు పరమపురుషుని అతిశయమును భక్తియనబడు ఉపాసనయందలి విశేషములను, ఉపాసన చేయవలసినరీతులను ఎఱుంగుటయును.

5. ప్ర. పరమాత్మ యీ భక్తియనబడు ఉపాసన నెట్లు ప్రశంసించెను ?

ఉ. ఈ భక్తి అన్నియుపాయములకును మిన్న.

కర్మజ్ఞానయోగములు గుహ్యము, గుహ్యతరములేగాని యీ భక్తియోగము గుహ్యతమము. కావుననే దీని ననధికారులకు జెప్పరాదని 'అసూయకాయ మాం, మాదాః' అని శ్రుతియందును 'ఇదం తేనాతపస్కాయ' మొదలు 'న చ మాం యోఽ భ్యసూయతి' యని ఈ గీతయందును తెలుపబడినది. కర్మాదులచే భక్తియుదయించుట కాటంకములగు పాపములే నశించునుగాని, భక్తిచే భగవంతుని పొందుటకు ఆటంకములగు సమస్తపాపములు నశించును. ఇది రాజవిద్య. ఇచ్చట రాజశబ్దమునకు శ్రేష్ఠమని యర్థము. అనగా – విశాలమైనట్టియు లోతైనట్టియు మనస్సుగల మహానుభావు లెఱుంగదగిన శ్రేష్ఠమగు సాధనము. ఇది రాజగుహ్యము. అనగా – రహస్యముగా నుంచవలసినవాటిలో నిది శ్రేష్ఠమైనది. విశాలమైనట్టియు లోతైనట్టియు హృదయము కలవారే దాచదగిన రహస్యములను లెస్సగ దాచగలుగుదురు. గాన నీ భక్తి వారిసొత్తు. ఇంకను నిది (ఉత్తమం పవిత్రం) నన్ను పొందుట కాటంకములగు సమస్త పాపములను హరించును. ఇది (ప్రత్యక్షావగమము) ధ్యానించబడు సర్వేశ్వరుని తక్షణమునందే సాక్షాత్కరింపజేయును. ఇది తనంతటతానే మిక్కిలి ప్రియమగుటచే మోక్షానందరూపమైనది. మోక్షమునకును అచ్చట భగవత్ప్రాప్తికిని సాధనము గూడ నిదియె. కావుననే దీని నాచరించుట మిక్కిలి సుకరమును, సానందమును, ఇతరోపాయముల వలె ఫలము సిద్ధించగనే నశించునది కాదు. ఇట్టి ఉపాసకునకు భగవంతుడు తన సాయుజ్యమునొసంగియు తానేమియు చేయనట్లే సిగ్గుపడును. ఇట్టి

వైభవోపేతమైన దీనిని అవలంబించి ఆచరించదగిన యోగ్యత కలిగి యుండియు దీని నాచరించవలెనని మహావిశ్వాసపూర్వకమైన తొందరలేని మానవులు జననమరణ ప్రవాహరూపమగు నీ సంసారమునుండి ఎన్నటికిని తరింపజాలరు.

6. ప్ర. **శ్రీకృష్ణపరమాత్మ భక్తి రూప ఉపాసనకు విషయమగు తన మాహాత్మ్యము నెట్లు వర్ణించెను ?**

ఉ. నే నొరులెవ్వరు నెఱుంగకుండ నా స్వరూపమును మరుగుపరచి సకలచేతనాచేతనముల కంతర్యామిగానుండి జగత్తునంతను ధరించి నియమించి దానిని నా యిచ్ఛవచ్చినట్లుపయోగించుకొనుచున్నాను. నేనట్లుండుటచేతనే జగత్తు నిలువగలిగియున్నది. ఇట్లు జగత్తు యొక్క స్థితికి నే నుపకరించుచున్నానుగాని నా స్థితి కవి ఎంతమాత్రమును ఉపకారములు గావు. నే నీ జగత్తును నా శిరముననిడుకొని మోయుచునుకొందువా? కాదు. నేను నా సంకల్పలేశముచే దానిని నిలుపుచున్నాను. ఇతరుల కెవ్వరికిని లేని నా యసాధారణమైన ఆశ్చర్యమహిమను గాంచితివా ? ఇట్లు వాటివలన నేవిధమగు ఉపకారము నపేక్షింపక వాటి నిట్లు భరించు నేర్పు ఏరికిగలదు ? మరియొక విషయమును చూడుము. ఇట్టి నా సంకల్పముచేతనే సకలచరాచరములను పుట్టించి ప్రోచి నియమించి లయింపజేతును. చూచితివా నా మహిమ ? ఇది యసంభవ మనుకొనకుము. దీనికొక యుదాహరణమును చూపెదను జూడుము.

నీ వీగాన్పించు నాకసమున నలుగడల వీచుచున్న వాయువును గాంచుచున్నావు గదా! దాని కేదైన నాధారము నీకు గాన్పించుచున్నాదా ? ఆధారము లేక యుండగలదా? కావున దానికి నేనే యాధారమని యెఱుంగుము. ఇట్లే సకలచరాచరములును వాటిచే నెఱుంగబడని నాయందాధారపడియున్నవనియు నేను వాటినట్లు ధరించియున్నాననియు తెలుసుకొనుము. ఇట్లీస్థితి ప్రవృత్తులు మాత్రమే నా సంకల్పాధీనములను కొనకుము. వాటి యుత్పత్తి లయములును నా సంకల్పాధీనములే. ఎట్లనగా స్థావరజంగమరూపమగు సకలజగత్తున్ను కల్పక్షయమందు నా సంకల్పముచే తమస్సనబడు నా శరీరమగు ప్రకృతిని జొచ్చుచున్నది. కల్పక్షయమనగా - అంతిమబ్రహ్మయొక్క దివసావసానము. కల్పాదియనగా- ఆ బ్రహ్మయొక్క రాత్రియవసానము. అట్టి కల్పాదియం **దాభూతములు** తిరిగి నా సంకల్పముచే వెలువడుచున్నవి. ఇట్లు నా యధీనమగు సతత

విచిత్ర పరిణామి యగు ప్రకృతిని 'భూమి రాపోఽనలో వాయు' వను నట్లెనిమిది విధముల విభజించి ఆయాసమయముల యందు దేవతలుగను మనుష్యులుగను పశువులుగను పక్షులుగను వృక్షములుగను మార్చి విడుచుచుందును. ఇట్టి సృష్టి తారతమ్యమున కా జీవుల పూర్వజన్మపుణ్యపాపములే కారణములుగాని నేను బాధ్యుడనుకాను. నేను తటస్థముగనే యుందును. అందుచే నాకు నిర్దయత్వముగాని పక్షపాతముగాని యెంతమాత్రములేవు. ఇట్లు సృష్టికి కర్మలే కారణమగుచో మరి నీ వెందులకందువేమో! ప్రకృతియు కర్మయు జడముగదా! ఏ జీవునెట్టి శరీరమున ప్రవేశపెట్టవలసినదియు నవి యేమి యెఱుంగును ? నేను సర్వజ్ఞుడనుగాన వారివారి పూర్వకర్మల నారసి వాటి ననుభవించుటకు తగిన శరీరములుగా నీ ప్రకృతి మారవలెనని సంకల్పించుటచేతనే ప్రకృతి పరిణమింపగలుగుచున్నది. అందువల్లనే జగత్తు ప్రవర్తించుచున్నది.

7. ప్ర. భగవద్విషయమున అభక్తుల యొక్కయు భక్తుల యొక్కయు ప్రవృత్తు లెట్లుండును ?

ఉ. భగవద్భక్తి లేనివారు మూఢులు, ఆ మూఢత్వమునకు కారణము వారొనరించిన పాపములే. అందుచే వారు సర్వజ్ఞుడును సత్యసంకల్పుడును నిఖిలజగదేక కారణుడును అగు సర్వేశ్వరుడు పరమకృపాళుడుగాన తననందరు నాశ్రయించవలెనని మనుష్య శరీరమును ధరించివచ్చెనని యెఱుంగజాలరు. వారాతనిని సామాన్య మానవునిగ భావింతురు. ఆకారము పరిమాణము ఒక్కటైనను బంగారుకుండకును మట్టికుండకును తారతమ్యములేదా ? సకలభూతమహేశ్వరుడై తన యపారకారుణ్య సౌశీల్య వాత్సల్యములతో మనుష్యుడై భూమియందవతరించుట నిజమున కాతని పరత్వమునే చాటును గాని నైచ్యమును కాదు. ఈ మూర్ఖులది గ్రహించనేరక అతనిని తిరస్కరింతురు. క్రోధలోభాదిమయమగు రాజసతామస స్వభావములకా ఆ పరత్వము గోచరించునది ? అట్టివారి కోరికలన్నియు నిష్ఫలములగును. వారి ప్రయత్నములన్నియు బూడిదనుపోసిన పన్నీరగును. అస్వతంత్రులైన తమను స్వతంత్రుల మనుకొందురు. ఇతరులది తమదనుకొందురు. అజడము నిత్యమునగు నాత్మను జడము అనిత్యమనుకొందురు. అస్థిరమైన ఐశ్వర్యమును స్థిరమనుకొందురు. ఇట్లే వారి తెలివియంతయు అన్నిటియందును తెల్లవారుచుండును. వాస్తవజ్ఞానము లేనిచో విపరీతజ్ఞానమున్నను ఏమిప్రయోజనము ? దానిచే ఆశలన్నియు నడుగుంటుట, చేసిన పనులన్నియు బూడిదపన్నీరగుటయేగదా, పర్యవసానము.

మరి మహాత్ముల ప్రవృత్తులిట్లుండునా ? అసలు మహాత్ములనగా - తామార్జించిన పుణ్యరాశిచే భగవంతుని శరణుజొచ్చి పాపబంధముల నన్నిటిని పారద్రోలి సాత్త్విక ప్రకృతితో నలరారుచుండువారు. వారు పరమపురుషుని వాక్కునకుగాని మనస్సునకుగాని అందని నామ కర్మ స్వరూపుడై యుండియు పరమకృపతో సాధుపరిత్రాణమునకై మనుష్యుడుగా నవతరించెనని యెఱింగి, వారి కాతనియందుండు ప్రేమాతిశయముచే ఆతనిని భజించినగాని తమ మనస్సు, ఆత్మ, బహిరింద్రియములు నిలువజాలక వేరు ఫలముల నాశించక ఆ భజించుటయే ఫలమని తలంచి ఉపాసింతురు.

అంతమాత్రముతో సరిపుత్తురా ? ఆతనియందలి చెప్ప లేనంత ప్రేమతో అతనిని కీర్తింపక పూజింపక నమస్కరింపక రెప్పపాటుకాలమైనను నిలువజాలక అతని కళ్యాణ గుణములను స్మరింపజేయు నాతని శుభనామముల దలంచుకొని ఆపాదమస్తకము పులకరించి ఆనంద పారవశ్యమున డగ్గుత్తికతో 'నారాయణా! కృష్ణా! వాసుదేవా!' యని నిరంతరము కీర్తించుచు, నా **యర్చనాదుల** యందును అందులకుపయోగించు మందిరముల నిర్మించుట, పుష్పతోటలు నాటించుట మొదలగు కర్మల నెన్నియాపదలు తటస్థించినను విడువక నాచరించుచు భక్తిభారముచే **అష్టాంగములు** వంగి భూమినంటునటుల దుమ్ము ధూళి రాయి రప్ప నీరు బురద యని చూడక క్రిందపడి నమస్కరించుచు యావదాత్మ భావిగ భగవద్దాస్యము నాశించుచు నుపాసింతురు.

మరికొందరు మహాత్ములు యీ కీర్తనాదులతోపాటు భగవంతుడగు వాసుదేవుడే నామముగాని రూపముగాని గోచరించని చేతనాచేతనములతో గూడియుండవలెనని సంకల్పించి సత్యసంకల్పుడుగాన తానొక్కడయ్యు వివిధ విచిత్రములగు దేవ మానవ పశు పక్షి వృక్షాదులతో గూడియున్నాడని తలంచుచు నుపాసింతురు.

8. ప్ర. ఒక్కని పెక్కుశరీరునిగా నుపాసించుట ఎట్లు ?

ఉ. **జ్యోతిష్టో**మాది క్రతువులు, బ్రహ్మయజ్ఞాది పంచమహాయజ్ఞములు, పితరులకు పుష్టినొసంగు స్వధా ఓషధుల వికారమగు హవిస్సు, ఆహవనీయాది త్రేతాగ్నులు, హోమము ఇవన్నియు భగవంతుడే.

ఈ స్థావరజంగమరూపమగు జగత్తునకు అచ్చటచ్చట తండ్రిగను, తల్లిగను, ధాతగను, తాతగను ఉండువాడీ భగవంతుడే. (ఇచ్చట ధాత యనగా - తల్లిదండ్రుల కంటె వేరుగా పుట్టుటకు తోడైన చేతనుడని యర్థము). భగవంతుడు లౌకికపుత్రాదుల కంతర్యామిగా నుండును. గాన యిట్లు చెప్పబడెను. వేదముచే నెఱుంగదగిన పావన వస్తువున్ను, వేదోత్పత్తికి

ముఖ్యకారణమగు ప్రణవమున్ను, ఋక్సామయజుర్వేదములున్ను భగవానుడే. అచ్చటచ్చట నుండు ప్రాప్యస్థానములున్ను, ధరించువాడును, శాసించువాడును, ప్రత్యక్షముగా చూచువాడును, నివాసస్థానమును,ఇష్టముల నొసంగు వాడును, అనిష్టముల పోగొట్టువాడును, హితైషియు, ఉత్పత్తిప్రళయనిలయుడును, పుట్టించదగినది నశింపజేయదగినది అచ్చటచ్చటనుండు నశించని భూమ్యాదికారణమున్ను ఆ భగవంతుడే. సూర్యాగ్న్యాదిరూపములతో జగత్తునంతను తపించువాడును, గ్రీష్మాది ఋతువులయందు వర్షము నరికట్టువాడును, వర్షఋతువున తిరిగి వర్షమునిచ్చువాడును, పుట్టుటకు గిట్టుటకు కారణమైన అమృతమున్ను, విషమున్ను, వేయేల - ఇప్పుడున్న పదార్థజాతమంతయును, గడచినదియు, రాబోవునదియు, అంతయు నా భగవంతుడే. అనగా - చేతనాచేతనము లే యవస్థలోనున్నను భగవంతుని శరీరభూతములేగాన వాటి కాతడే అంత్యామిగానున్నాడు. ఇట్లెఱింగి యుపాసించుటయే (ఏకత్వేన పృథక్త్వేన) ఒక్కని పెక్కుశరీరములతో ఉపాసించు విధానము.

9. ప్ర. భగవద్విషయమున కర్మఠుల యొక్క ప్రవృత్తి ఎట్లు వర్ణింపబడినది ?

ఉ. కర్మఠులు త్రివిద్యనిష్ఠులు అనగా - మూడువేదములయొక్క కామ్య కర్మలను బోధించు భాగములయందు మాత్రమే శ్రద్ధకలిగియుందురుగాని, త్రయ్యంతములనబడు ఆవేదముల శిరస్సుల వంటి ప్రధానమగు ఉపనిషదర్థముల నాదరించరు. వారా వేదభాగములయందుండు కేవలం ఇంద్రాది అర్వాచీన దేవతలయనుగ్రహసంపాదనకు మాత్రముపయోగించు జ్యోతిష్టోమాది కర్మలనే యాచరించి ఆ యాగశేషమైన సోమపానాది ప్రసాదముల స్వీకరించి, ఆయాభోగములనుభవించుట కాటంకములగు పాపముల పోగొట్టుకొని ఆయాదేవతల యనుగ్రహపాత్రులై తమపుణ్యమునకు తగినట్లు ఆ దేవతలొసంగు భోగములను వారిలోకములలో ఆ పుణ్యమున్నంతకాల మనుభవించు చుందురు. నిమారయనీ యజ్ఞములచే నారాధింపబడువాడును ఆ దేవతల ద్వారా ఆ ఫలముల నిప్పించువాడును నారాయణుడే. అయిన నేమి ? వీరా రహస్యము నెఱుంగజాలరు. కావున వారా దేవతలను మాత్రముద్దేశించి ప్రార్థించి ఆ యల్పఫలమును మాత్రమే కోరుకొందురు. అందులకు తగినట్లు ఆ దేవతల సాయుజ్యమును బడసి యా దేవలోకములకేగి యచ్చట దివ్యములైన ఆ దేవతలనుభవించు భోగములను తామొనరించిన ఆ పుణ్యమున్నంతవరకు నచ్చట యనుభవించు చుందురు. ఆ దేవతలును వారి లోకములును వారొసంగు ఫలములును

నిజమారయ పరిమితములేకదా ! కావున ఆ పుణ్యమంతయు ఖర్చుకాగానే తిరిగి తమ కర్మశేషము ననుభవించుటకై భూలోకమున జన్మింతురు. ఇట్లు వీరు ఉపనిషదర్థముల నెఱింగి తన్నిష్ఠులగువరకిట్లే అల్పాస్థిరభోగలాలసులై మాటిమాటికిని యాతాయాతము లనుభవించుచుందురు. ఈ యనుభవమైనను సుఖరూపమా ? కాదు. దుఃఖరూపమే. ఎట్లన - ఆ లోకములోని యధికారులు వీరిని పశువులవలె జూతురు. వీరికా భోగములనుభవించుచున్నను అంతకుపై భోగముల ననుసంధించిన అయ్యో! ఆ భోగములకై కృషిసల్పమైతిమే, యని దుఃఖప్రాయములేయగుదురు. తామనుభవించు భోగములు తరిగిపోవుచున్నవని తలంచిన అంతకు మించిన దుఃఖము. చివరకవి తరిగిపోయిన నిక నా దుఃఖమునకు మేరయే లేదు. ఇక నాపైన యాతాము గూనవలె తిరిగి భూలోకమున కేతెంచి మాతృగర్భమున ప్రవేశించి పుట్టి ఆధివ్యాధులతో పెరిగి పెద్దయై గూన నీరునింపుకొని పైకిపోవునట్లు తిరిగి పుణ్యమార్జించి పైకిపోయి ఆగూనఆ నీటిని వెలిపినట్లు తన పుణ్యము నా లోకములో వెలిపి తిరిగి ఆగూన నూతిలోదిగినట్లు తాము సంసారములో దిగుటలోనున్న దుఃఖమున కంతేమి ? ఇక నా జన్మపరంపరలలో పాపములాచరించి నరకమునకేగిన ఆ దుఃఖము చెప్పుటకే శక్యముకాదు.

దేవతలందరు భగవంతునకు శరీరమువంటివారేగదా. కావున వారింద్రాదులను గూర్చి గావించిన యారాధన వారెఱుంగకున్నమానె. తనదేయని తానెఱుంగునుకదా ! ఎఱింగి వారికిని తన భక్తులకువలెనే మోక్షమునేల ప్రసాదించరాదు ? అనినచో - త్రయీ నిష్ఠలగు నీ కర్మఠులు శ్రద్ధాభక్తులతో నింద్రాదుల నారాధించుచున్నను ప్రపంచమంతయు భగవంతునికి శరీరమే గాన ఆ ఇంద్రాదిశబ్దములు ఆ యింద్రాది పూజలును నిజమునకు భగవంతునికే చెందును. సంశయములేదు. ఇట్టి జ్ఞానము వేదాంతముచే నెఱుంగవలెను. వారా వేదాంతముల నెఱుంగనే యెఱుంగరు. వేదాంతములు పరమపురుషునికి శరీరభూతులై యున్న యింద్రాద్యారాధనలు విధించినను వారి కాత్మగానుండు పరమాత్మయే సాక్షాదారాధ్యుడని విధించును. అందుచే వీరు త్రయీనిష్ఠులేగాని త్రయ్యంతనిష్ఠులుకారు. గాన తా మొనరించుకర్మలు ఇంద్రాదులను శరీరముగా కలిగియున్న పరమపురుషారాధనములనియు ఆరాధ్యుడును ఫలప్రదుడును నిజమునకా పరమాత్మయే యనియు నెఱుంగరు. అందుచే వారు పరిమితఫలాధికారులై పడుచుందురు.

ఆహా! ఏమీ యాశ్చర్యము! ఒకే కర్మ నాచరించు యిద్దరిలో సంకల్పమాత్ర భేదముచే నొకరు అత్యల్పఫలభాక్కులై భ్రష్టులగుచున్నారు. కొందరు పరమపురుషార్థమగు పరమపురుష సాయుజ్యమును బడసి శాశ్వతానందము నందుచున్నారు. మనుష్యులందరొక్కతీరుగ నుందురా ? కొందరు 'మే మింద్రునారాధింతుము' అని సంకల్పించి యింద్రు నారాధింతురు. కొందరు 'మేము పితరుల నారాధింతు' మని సంకల్పించి పితరుల నారాధింతురు. కొందరు 'మేము యక్షరక్షఃపిశాచముల నారాధింతు'మని సంకల్పించి భూతముల నారాధింతురు. ఎవరెట్టి సంకల్పముతో నారాధింతురో వారు వారి సాయుజ్యమునే పొంది ఆయాలోకములలో నాయాఫలముల ననుభవింతురు. ఏ బుద్ధిమంతు లాకర్మలతోనే 'మేము ఆ దేవతలను ఆ పితరులను ఆ భూతములను తనకు శరీరముగాగలిగి అంతర్యామిగా వేంచేసియున్న భగవంతుడగు వాసుదేవుని ఆరాధింతుము' అని సంకల్పించి వాసుదేవు నారాధింతురో వారు ఆద్యంతములు లేనట్టియు సర్వజ్ఞుడును సత్యసంకల్పుడును అసంఖ్యేయ కల్యాణగుణగణ **మహోదధియు** ఆనందపరమావధియునగు శ్రియఃపతి సాయుజ్యమును బడసి ఆతడు, ఆతనిలోకము, ఆతని భోగములు నిత్యములగుటచే తిరిగిరాక యావదాత్మభావిగా నా భోగము లనుభవించుచుందురు.

10.ప్ర. భగవద్భక్తి విహీనులు, కర్మఠులకంటె భగవద్భక్తులగు మహాత్ములకు గల విశేష మెట్లు వివరింపబడెను ?

ఉ. **మహాత్ములవలంబించు** ఉపాసనాత్మక ఉపాయము ఇష్టవస్తుధ్యానరూప మైనదిగాన సుఖరూపమైనది. ఇక దానివలన కలుగు ఫలమన్ననో నిత్యము నిర్దోషము నిరతిశయమునగు ఆనందస్వరూపము. ఇక వారివిశేషమేమని చెప్పుదుము ? వారు సకలకల్యాణగుణములు సర్వవిభూతులుగల సర్వేశ్వరు నేల యుపాసింతురు ? దానికి వారికొక ఫలాశ లేదు. వారట్లు ధ్యానించనిచో బ్రతుకజాలక ఆ ధ్యానించుటయే తమ బ్రతుకుతెరువని భావించి భగవంతునితో తమకు నిత్యసంబంధ ముండవలెనని అట్లు ధ్యానింతురు. వారిజన్మయే గదా సార్థకమైనది ! అట్టివారి కా వాసుదేవుడే యోగక్షేమములను ప్రసాదించును. యోగమనగా - తనను పొందించుట. క్షేమ మనగా - తిరిగి సంసారమునకు రాకుండ కాపాడుట (పొందనిదానిని పొందించుట యోగము పొందినదానిని కాపాడుట క్షేమము అని యోగక్షేమ శబ్దనిర్వచనము).

ఇతర దేవతారాధనము కంటె పరమపురుషారాధనము సుఖతమము. కానితేనక్కఱలేకయే దరిద్రులకైనను ఆయాకాలానుగుణముగా నంతటను లభించుటకు వీలైన యే యాకునుగాని యేపుష్పమునుగాని యే పండునుగాని అవియు దొరకనిచో నిన్నినీళ్ళనుగాని ఏఫలము నాశించక మిక్కిలి ప్రేమతో సమర్పించినగాని నిలువజాలని ఆర్తితో సమర్పించుటయే ఫలముగా సమర్పించిన నిష్కల్మషహృదయుడగు నా భక్తుని యొక్క ఆ భక్తితో సమర్పించిన ఆ స్వల్పపదార్థములను గూడ తాను సర్వేశ్వరుడయ్యును, సకల భువన సృష్టిస్థితి సంహారములు క్రీడగా కలవాడయ్యును, తీరిన సమస్తకోర్కెలు కలవాడయ్యును, అడ్డులేని సంకల్పము కలవాడయ్యును, లెక్కింపశక్యముకాని లోకమందెవ్వరికిని లేని కల్యాణగుణరాశికలవాడయ్యును, సహజమగు సర్వోత్కృష్టానందానుభవము కలవాడయ్యును కోరుటకైనను శక్యముకానంత అపురూప పదార్థమును ఆరగించినట్లు ఆరగించును. ఇతరఫలము లాశించువారు సమర్పించిన విశేషవస్తువులు భగవంతుడు తన పాదములపైననే నిడుకొనునుగాని, ఇట్టి పరమైకాంత భక్తులు భక్తితో సమర్పించిన అత్యల్పపదార్థములను అత్యాదరముతో శిరస్సున ధరించునని మోక్షధర్మమున చెప్పబడెను.

ఇట్లు జ్ఞానులగు మహాత్ములయొక్క వైభవము నోటితో చెప్పుటకు గాని మనస్సుతో తలంచుటగాని శక్యమైనదికాదు. కావున జ్ఞానులై పైనచెప్పిన భక్తిభారముతో వంగిన అష్టాంగములుకలిగి, వారివలె భగవంతుని కీర్తించుట అర్చించుట నమస్కరించుట మొదలగు సేవలతో ప్రొద్దుపుచ్చుచు దేహయాత్రకై యే లౌకిక వ్యాపార మొనరించినను, శరీరము నిలబడుట కేమితిన్నను, హోమదానతపస్సు మొదలగు యే నిత్యనైమిత్తిక వైదికకర్మచేసినను ఆ కర్మలకు కర్తయు భోక్తయు ఆరాధ్యుడును భగవంతుడేయని యనుసంధించవలెను.

అయినచో శాస్త్రమునుబట్టి కర్తయు భోక్తయు జీవుడుగదా ! ఆరాధ్యులింద్రాదులుగదా! అట్టితరి తాను కర్తను భోక్తనుకాననియు, అట్టివాడు భగవంతుడేయనియు ఆరాధ్యులింద్రాదులు కారు భగవంతుడేయనియు తలంచినచో నిది భ్రాంతిగదా! అది కూడునా ? యని సందేహించ నవసరము లేదు. ఎందువల్లననగా -

ఆరాధింపబడు దేవతలును ఆరాధించుజీవుడును భగవదధీనులగుటచేతను, వారి స్వరూపస్థితి ప్రవృత్తులును భగవదధీనములేయగుటచేతను, పరమశ్రేష్ఠి (ప్రభువు)యు అన్నిటి నందరిచే చేయించు పరమకర్తయు ఆతడేగాన

కర్తృత్వమును ఆరాధ్యత్వమును ఆతనియందే సమర్పించవలెను. ఆరాధకుడును తత్ఫలభోక్తయునగు తనను, ఆరాధ్యుడును తత్ఫలప్రదాతయునగు దేవతాంతరములను ఆరాధనరూపమైన క్రియాకలాపమును ఆ సర్వేశ్వరునియందే సమర్పించవలెను. అయినచో సాక్షాత్కర్తయగు తనవిషయమందును, సాక్షాదారాధ్యులగు నింద్రాదులయందును నెట్టిభావన యుంచవలెననిన తాను భగవంతునికి శేషభూతుడగుటచే ఆయనచే ప్రేరేపింపబడియే ఆయన ప్రీతి కొఱకే చేయు స్వభావముకలవాడననియుఅట్టివారే ఆరాధ్యులగు ఇంద్రాదులును అనియు నిరతిశయప్రీతితో ననుసంధించవలెను. ఇట్లు ఫలకర్మ కర్తృత్వాదులను పరమాత్మాధీనమనియు, ఆత్మను పరమాత్మకు శేషభూతమైనదనియు, ఆయనచే నియమింపబడి ప్రవర్తించుటయే ప్రధానరసముగా గలదనియు, తాను చేయు కర్మలన్నియు పరమాత్మ సమారాధనములనియు తలంచుచు లౌకిక వైదిక కర్మల నాచరించుచున్నచో అనుకూల ప్రతికూల ఫలముల నొసంగుటచే పరమాత్మనుండి దూరముచేయు సమస్తప్రాచీన కర్మబంధముల నుండియు విడువబడి పరమాత్మ పొందగల్గును.

11.ప్ర. భగవంతుని లోకాతీతమగు స్వభావ మీ యధ్యాయమునందెట్లు వర్ణింపబడెను?

ఉ. 'పత్రం పుష్పం' అను శ్లోకమునందు భక్తులు సమర్పించు పదార్థములు దుర్లభమైనవా? సులభమైనవా? విలువైనవా? అల్పమైనవా? యని చూడక ప్రేమతో స్వీకరించునని చెప్పబడుటచే నాతని సౌలభ్యము చెప్పబడినది. దానినే 'యత్కరోషి' యను శ్లోకముచే ఆ చేయబడునవి కృష్ణార్పణబుద్ధితో చేసినను భగవదారాధనయగునని దృఢపరచబడినది. భక్తియోగిని ప్రశంసించు "సమోఽహం సర్వభూతేషు" అను శ్లోకమున జాత్యాకారతారతమ్యమును లెక్కసేయక భక్తులతో కలసిమెలసి మెలంగు సౌశీల్యము చెప్పబడుచున్నది. దేవతలుగను మనుష్యులుగను పశుపక్ష్యాదులుగను ఉన్నట్టి ప్రాణులు జాతినిబట్టియు ఆకారమునుబట్టియు స్వభావమునుబట్టియు జ్ఞానమునుబట్టియు నీచోచ్చతారతమ్యములతో నున్నను భగవంతునాశ్రయించుటలో తరతమభావము లేదు. వీరు జాత్యాదులతో నికృష్టులని దరిజేరనీయక ద్వేషించి విడుచుటగానివి, ఉత్కృష్టులని శిరసావహించుటగాని చేయక, భజింపక నిలువజాలనంత మిక్కిలి ప్రేమతో భజించుటయే ఫలముగా భజించువారిని భగవంతుడు తనకంటె గొప్పవారి నాదరించునట్లాదరించును.

అందుచే నా భక్తులాతని పరమేశ్వరత్వాదులను తలంచి భయపడక సుఖముగా సేవింతురు. ఆ భక్తులును భగవంతుడును ఒకరి విషయమున, నొకరు కన్నతండ్రిపై భారముంచిన బిడ్డ విధమున వర్తింతురు. తమతమ జాతులకు తగిన ధర్మములతో భజించినప్పుడు నీచజాతియను యనాదార మెందులకుండును?

ఇట్లు భగవంతుడు జాత్యాదుల తారతమ్యమును సరకుగొనకుండుటయే గాదు. నడవడికలోని తారతమ్యమునైనను పరిగణించడు. తానాచరించవలసినది విడుచుట, విడువవలసినదాని నాచరించుట దురాచారమనబడును. అట్టివారైనను భజించుటయే ఫలముగా భజించినచో వారిని భగవంతుడు వైష్ణవాగ్రేసరులుగనే తలంచి యాదరించును. ఎందువల్లననగా - వారు నిఖిలజగదేక కారణుడు, చరాచరనియామకుడు, పరబ్రహ్మయునగు నారాయణుని తమకు స్వామినిగాను గురువుగాను తమ హితైషినిగాను తమకు మిక్కిలి భోగ్యమైనవానినిగాను నమ్మియుందురు. అట్టి అధ్యవసాయ మెల్లరకు లభించునా? ఆ యధ్యవసాయమునకు తగినట్లెల్లవేళల భగవంతుని భజించుచునేయుందురు. ఇంకవారేల సజ్జనులు కారు? వారేల గౌరవనీయులుకారు? అట్టి యధ్యవసాయము, అట్టిభజనయే యున్ననాడు వారి నడవడికలోనే స్వల్పవైకల్యమున్నను నది లెక్కసేయదగినది కాదు. దానిని బట్టి వారి ననాదరించరాదు సరిగద మిక్కిలి గౌరవించవలెను.

అయినచో కఠోపనిషత్తునందు చెడునడకగలవారు భగవంతుని భజింపనేరరని చెప్పబడెనుగదా! యని సంశయింప పనిలేదు. వారు ఫలాపేక్షలేక మిక్కిలి ప్రేమతో నన్ను భజించుచున్నారుగాన వారి పాపములన్నియు పటాపంచలై రజస్తమస్సు లడుగంటి సత్వము తలయెత్తి వెంటనే నిరాటంకముగా భగవంతుని భజించుటకు ప్రవణమైన మనస్సు కలవారగుదురు. ఇట్టి భజనకే ధర్మమని అధ్యాయప్రారంభమున భగవంతుడు పేరిడెను. ఇట్టివారు ఆ భజనమూలమున ఉత్తరోత్తర ఉపాసనాభివృద్ధి నాటంకపరచు దురాచారమును తిరిగి రాకుండునట్లు నశింపజేసుకొందురు. కావున భగవదుపాసన కారంభించినవారు అందులకు ప్రతిబంధకములైన దురాచారములతో మొదట కూడియున్నను చెడక ఆ భగవద్భక్తి మహిమచే విరోధులనన్నిటిని సమూలముగ పోద్రోలి వెంటనే పూర్ణభక్తులగుదురు. ఇందులకు ఉపరిచరువు, ప్రహ్లాదుడు, క్షత్రబంధువు మొదలగు వారిచరిత్రము లుదాహరణములు. వీరికి మొదట ధర్మవిరుద్ధప్రవృత్తి పొడచూపినను వెంటనే భగవద్భజనమహిమచే దిద్దుకొనగలిగిరి.

స్త్రీ శూద్రులుకూడ భగవద్భజనప్రావణ్య మున్నంతమాత్రమున ఫలసిద్ధిని బడయగలుగుదురు. ఇక పుణ్యజన్ములగు బ్రాహ్మణక్షత్రియజాతీయులమాట చెప్పనేల? కావున రాజర్షివగు నో యర్జునా! అస్థిరమును తాపత్రయాభితప్తమగుటచే దుఃఖభూయిష్ఠమునునగు యీ లోకమున జన్మించి యున్నావు గాన నన్ను భజించుటకంటె నీకు గత్యంతరము లేదని భగవానుడుపదేశించెను. దీనిచే భగవంతుని లోకాతీతమైన స్వభావము సువ్యక్తమగుచున్నది.

12.ప్ర. ఈ యధ్యాయమున భక్తిస్వరూప మెట్లు నిష్కర్షింపబడినది ?

ఉ. ఈ యధ్యాయమునందలి యీ క్రింది 34వ శ్లోకము భక్తిస్వరూపమును తెన్నుగ నిష్కర్షించుచున్నది.

మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు,
మామేవైష్యసి యుక్త్వైవ మాత్మానం మత్పరాయణః. గీ. 9 అ. 34 శ్లో.

మన్మనా భవ = మయి తైలధారవ దవిచ్ఛేదేన నివిష్టమనాః భవ = నాయందు మధ్య విడుపులేనట్లుంచబడిన మనస్సుకలవాడవగుము. నిశ్చల మనస్సుతో నన్నే ధ్యానింపుమని భావము.

తన నెట్టివానినిగా ధ్యానించవలెను ?

సర్వేశ్వరుడనియు, దుర్గుణదూరుడును, సద్గుణరాశియుననియు, వారివారి కర్మల నెఱింగి జగత్తుల సృష్టి కుపయోగపడు సర్వజ్ఞత్వమున్ను తలంచినంతమాత్రముననే కార్యము సిద్ధించు సంకల్పమున్ను కలవాడనియు, ఉత్తమపురుష లక్షణములగు విశాల నేత్రములు ఆజానుబాహువులు మొదలైన అవయవములు కలవాడనియు, హృదయాకర్షకమగు శరీర కాంతి ఆభరణకాంతి వస్త్రాలంకారాదులతో మెరయువాడనియు, భక్తులాశ్రయించుటకు తగిన **కారుణ్యవాత్సల్యాదిగుణములున్ను**, ఆశ్రితుల **కార్యనిర్వహణమునకు**తగిన శక్తి సామర్థ్యాదులున్ను కలవాడనియు, భక్తులలో విద్యాభిజనధనాది తారతమ్యమును పరిగణించక సర్వస్వామియనియు ధ్యానించవలెను.

ఆ ధ్యానించుటయైనను 'మద్భక్తః' అనుటచే ప్రేమతో ధ్యానించుటయే భక్తిగాన చెప్ప నలవిగానంత ప్రేమతో ధ్యానించవలెను.

అంతమాత్రముతో విడువక అట్టివాని ననుభవించుటచే కలిగిన ప్రీతితో పూజించవలెను.

పూజించుట యనగా - సకల విధ కైంకర్యములను చేయుట, ఆ కైంకర్యములు ఔపచారికములు, సాంస్పర్శికములు, **ఆభ్యవహారికములు**, సాందృష్టికములు అను నాల్గువిధములుగా నుండును.

భావారికములనగా - నీరాజనాదులు.

సాంస్పర్శికములనగా - తోమాలలు శ్రీ చందనము మొదలగునవి.

అభ్యవహారికములనగా - పక్వాన్నములు, పండ్లు, పాలు మొదలగునవి

సాన్నిధ్యకములనగా - ధూప దీపారాధనాదులు.

వీటినన్నిటిని సమర్పించుటయే యజన మనబడును.

అంతటితో తృప్తి చెంది విరమించక, మాం నమస్కురు = నాకు నమస్కరించుము.

నమస్కరించుట యనగా - భక్తి అతిశయముచే వంగిన శిరస్సు పాదములు చేతులు మనస్సు బుద్ధి అభిమానములు అనబడు అష్టాంగములు కలవాడై దుమ్ము ధూళి రాయి రప్ప నీరు బురదయని చూడక కర్రవలె నేలపై బడుట. (గొప్ప వానిని చూడగనే బుద్ధిమంతుడగు వాడతియణకువతో వారిపట్ల ప్రవర్తించుటయే నమస్కారమని అహిర్బుధ్న్యసంహితలో కలదు).

మరియు 'మత్పరాయణః' యనుటచే ఇట్లుచేయుటకొక ఫలము నాశించక నన్ను తలంచనిచో బ్రతుకలేని యార్తితో నన్నాశ్రయింపుము.

ఇట్లు హద్దును మీరిన ప్రీతితో నన్ను అనుభవించుటకు తగిన మనఃపరిపాకము కలవాడవై నన్ను పొందగలవు.

ఇట్టి నిరతిశయ ప్రీతితో గూడిన మనస్సుతో నన్ను ధ్యానించి నన్ననుభవించి నన్నర్చించి నాకు నమస్కరించి నన్నాశ్రయించినచో నన్నే పొందుదువు.

ఏతావతా యీ యధ్యాయముచే భక్తి స్వరూప మెట్లు నిష్కర్షింపబడిన దనగా-

నీవు **దుఃఖభూయిష్ఠమగు** సంసారసాగరమున పడియుండుటచేతను, పరత్వ సౌలభ్యాదులతో కూడియున్న నేను సకల దుఃఖసాగరము నుండి యుద్ధరించు నేర్పుగల నావికుడనగుట**చేతను,**ఉపాయ మత్యంత సుకరత్వాది గుణములు కలదగుటచేతను నాకొరకన్ని కర్మలను చేయుటయందు తత్పరుడవుగాన నీవు చేయునట్టి శరీరపోషణాద లౌకికకర్మలను నిత్యనైమిత్తికాది వైదికకర్మలను నేనే చేయించుచున్నానని భావించి నా ప్రీతికొఱకు చేయుచు నిరంతరము ప్రీతితో నా గుణములను కీర్తించుట నన్నారాధించుట నాకు నమస్కరించుట మొదలగు కైంకర్యముల నాచరించుము. జగత్తంతయు నాచే నియమింపబడుచు నాకు శేషభూతమై యున్నదని అనుసంధించుము. ఇట్లు ప్రతినిత్య మీ యుపాసనను నిర్వహింతువేని నన్నే పొందగలుగుదువు.

దశమాధ్యాయార్థ సంగ్రహము

శ్లో. స్వకల్యాణ గుణానన్త్య । కృత్స్నస్వాధీనతామతి : ।
భక్త్యుత్పత్తి వివృద్ధ్యర్థా । విస్తీర్ణా దశమోదితా ।

అర్థము : భక్త్యుత్పత్తి వివృద్ధ్యర్థా = భక్తి జనించి వృద్ధిబొందుటకైన, స్వకల్యాణ గుణానన్త్య కృత్స్న స్వాధీనతా మతిః। స్వకల్యాణ గుణానన్త్య = భగవంతుని కల్యాణగుణములు అనంతములుగాను, కృత్స్నస్వాధీనతా మతిః = సమస్త జగత్తుయొక్క స్వరూపస్థితిప్రవృత్తులు భగవంతున కధీనమైనవిగాను ఉన్న వనెడు బుద్ధి, విస్తీర్ణా = సవిస్తరముగ, దశమోదితా = పదియవ యధ్యాయమున చెప్పబడినది.

శ్రీమద్భగవద్గీత – దశమాధ్యాయము

విషయసూచిక

శ్రీ హయగ్రీవాయ నమః

శ్రీమద్భగవద్గీతా - దశమోఽధ్యాయః

విభూతి విస్తరయోగః

శ్రీ భగవానువాచ = భగవంతుడు పలికెను.

అవ. భగవంతుడు తాను చెప్పదలంచిన విషయమును ప్రతిజ్ఞ చేయుచున్నాడు.

1. శ్లో. భూయ ఏవ మహాబాహో! । శృణు మే పరమం వచః ।
యత్తేఽహం ప్రీయమాణాయ । వక్ష్యామి హితకామ్యయా ॥

అర్థము : (హే) మహాబాహో = ఓ అర్జునా ! అహం = నేను, ప్రీయమాణాయ = సంతసించుచున్న, తే = నీకొఱకు, హితకామ్యయా = హితమొనరించుకోర్కెతో, భూయఃఏవ = తిరిగి, పరమం = గొప్పదైన, యత్ = ఏ, వచః = వాక్యమును, వక్ష్యామి=చెప్పగలనో, మే = నా యొక్క, (తత్ = ఆ మాటను) శృణు = వినుము.

తా ॥ నా మాహాత్మ్యమును విని సంతోషపడుచున్నావు గనుక నీకు హితమును చేయగోరి వెనుక జెప్పిన నా మాహాత్మ్యమును గూర్చి మరల విస్తారముగా నొకమాట జెప్పెదను. దానిని సావధానముగా వినుము.

అవ. తాను జెప్పెడు విషయమునందు ఆదరము కలుగుటకై యీ జ్ఞానము దుర్లభమని చెప్పుచున్నాడు.

2. శ్లో. న మే విదు స్సురగణాః । ప్రభవం న మహర్షయః ।
అహ మాదిర్హి దేవానాం । మహర్షీణాం చ సర్వశః ॥

అర్థము : సురగణాః = దేవతాసమూహములు, మే = నా యొక్క, ప్రభవం= ప్రభావమును, న విదుః = ఎఱుంగరు, మహర్షయః = మహర్షులు, న (విదుః) = ఎఱుంగరు, అహం= నేను, దేవానాం = దేవతలకును, మహర్షీణాం = మహర్షులకును, సర్వశః = అన్నివిధములను, ఆదిః హి = మూలమైనవాడనుగదా !

తా ॥ దేవతా సమూహములును, మహర్షులును కూడ నా ప్రభావము నెఱుంగరు. ఏలననగా - నేను దేవతలకును, మహర్షులకును అన్నివిధములచేతను మూలభూతుడను.

అవ. ఈ జ్ఞానము, భక్తి పుట్టుటకు ప్రతిబంధకములగు పాపములను పోగొట్టుటకు ఉపాయమని చెప్పుచున్నాడు.

3. శ్లో. యో మా మజ మనాదిం చ । వేత్తి లోకమహేశ్వరం ।
అసమ్మూఢ స్స మర్త్యేషు । సర్వపాపైః ప్రముచ్యతే ॥

అర్థము : మర్త్యేషు = మనుష్యులలో, అసమ్మూఢః = భ్రమచెందని, యః = ఎవడు, అజం= పుట్టనట్టియు, అనాదిం చ = ఆదిలేనట్టియు, మాం = నన్ను, లోక - మహేశ్వరం= లోకములకు ప్రభువులకు ప్రభువునిగా, వేత్తి = ఎఱుంగుచున్నాడో, సః = వాడు, సర్వపాపైః = సకలపాపములచేతను, ప్రముచ్యతే = విడువబడుచున్నాడు.

తా ॥ నేను పుట్టుక లేనివాడను, ఆదిలేనివాడను మరియు లోకనాథులకు నాథుడను. ఇట్టి నన్ను ఎవడు తెలుసుకొనునో వాడు మానవులలో ఏ మాత్రము భ్రమలేని వాడగు చున్నాడు. అట్టివాడు సమస్త పాపముల నుండియు పూర్తిగా విడివడుచున్నాడు.

అవ. భగవదైశ్వర్యమును భగవంతుని కల్యాణగుణ విస్తారమును అనుసంధించుటచే భక్తి వృద్ధిపొందు రీతిని చెప్పుచున్నాడు.

4. శ్లో. బుద్ధి ర్జ్ఞాన మసమ్మోహః । క్షమా సత్యం దమ శ్శమః ।
సుఖం దుఃఖం భవోఽభావో । భయం చాభయ మేవ చ ।

అర్థము : బుద్ధిః = మనస్సు యొక్క నిరూపణశక్తి, జ్ఞానం = చేతనాచేతనవస్తు నిర్ణయము, అసమ్మోహః = భ్రాంతిలేమి, క్షమా = ఓరిమి, సత్యం = ఉన్నది యున్నట్లు హితముగ బలుకుట, దమః బాహ్యేంద్రియ జయము, శమః = మనోనిగ్రహము, సుఖం = సుఖము, దుఃఖం = దుఃఖము, భవః = మానసోల్లాసము, అభావః = మనస్సంకోచము, భయంచ = భయమున్ను, అభయం = భయము లేకుండుటయు.

తా ॥ మనస్సు యొక్క నిరూపణ శక్తి వలన చేతనాచేతన వస్తునిర్ణయమున్ను దానివలన విజాతీయుల యందు సజాతీయభ్రమ నివృత్తియు కలుగును. ఇవియు - ఓర్పు, భూతహితముగ యదార్థమును మాట్లాడుట, బాహ్యేంద్రియ అంతరింద్రియముల నిగ్రహము, సుఖము, దుఃఖము, ఉల్లాసము, దైన్యము, భయము లేకుండుటయున్ను.

5. శ్లో. అహింసా సమతా తుష్టి। స్తపో దానం యశోఽయశః ।
భవన్తి భావా భూతానాం। మత్త ఏవ పృథగ్విధాః ॥

అర్థము : అహింసా = పరుల కే విధముగను దుఃఖము కలిగించకుండుట, సమతా = అందరియెడల సమబుద్ధి కలగియుండుట, తుష్టిః = సంతోషించు స్వభావము కలిగియుండుట, తపః = శరీరక్లేశము, దానం = భోగ్యవస్తువులను పరుల కొసంగుట, యశః = గుణవంతుడను పేరు, అయశః = గుణహీనుడను ప్రసిద్ధి (అనెడు), భూతానాం = ప్రాణులయొక్క, పృథగ్విధాః = వేఱువేఱు విధములైన, భావాః = పై వ్యాపారములన్నియు, మత్త ఏవ = నావలననే, భవన్తి = కలుగుచున్నవి.

తా ॥ పరుల కేవిధముగను దుఃఖమును కలిగించకుండుట, అందరి యెడల సమబుద్ధి కలిగియుండుట, అన్నిటిపట్లను సంతోష స్వభావము కలిగియుండుట, శాస్త్రమునుబట్టి భోగములను తగ్గించుట వలన కాయక్లేశమును పొందుట, తనకిష్టమైన వానిని ఇతరుల కిచ్చుట, గుణవంతుడని పేరుపొందుట, గుణహీనుడను ప్రసిద్ధి అనెడు వీటికి తగిన మనోవ్యాపారములు నా సంకల్పము వల్లనే ప్రాణులకు కలుగుచుండును.

అవ. సకల ప్రాణులయొక్క సృష్టిస్థితి ప్రవృత్తులకు కారణభూతులగు సమస్త మహర్షి ప్రభృతులున్ను భగవత్సంకల్పమువలననే ప్రవర్తింతురని చెప్పుచున్నాడు.

6. శ్లో. మహర్షయ స్సప్త పూర్వే। చత్వారో మనవ స్తథా ।
మద్భావా మానసా జాతాః। యేషాం లోక ఇమాః ప్రజాః ॥

అర్థము : యేషాం = ఎవరియొక్క, లోకే = పుత్రపౌత్రాది సంతానమైన లోకమునందు, ఇమాః ప్రజాః = ఈ సకలప్రజలున్ను, జాతాః = పుట్టిరో, పూర్వే = వెనుకటి మన్వంతరమందు, మానసాః = బ్రహ్మమనస్సున పుట్టినవారైన, సప్త = ఏడుగురు, మహర్షయః = భృగువు మొదలగు మహర్షులున్ను, తథా = అట్లే, చత్వారః = నలుగురైన, మనవః = సావర్ణి మొదలగు మనువులున్ను, మద్భావాః = నా సంకల్పమునే యనువర్తించువారు.

తా ॥ గత మన్వంతరమున నిత్యసృష్టి నిమిత్తమై భృగువు మొదలగు సప్త ఋషులును, నిత్యస్థితి ప్రవర్తనకై సావర్ణకాది నలుగురు మనువులును, బ్రహ్మసంకల్పమువలన పుట్టింపబడిరి. లోకమందలి ప్రజలందరు వీరి పుత్ర పౌత్రాదుల నుండి పుట్టిరి. ఇట్టి ఋషులును, మనువులును నా సంకల్పానుసారముగ ప్రవర్తింతురు.

అవ. భగవదైశ్వర్యమును, భగవంతుని కల్యాణగుణ విస్తారమును తలంచుచుండుటచే భక్తి వృద్ధిపొందురీతిని జెప్పుచున్నాడు.

7. శ్లో. ఏతాం విభూతిం యోగం చ । మమ యో వేత్తి తత్త్వతః ।
సోఽ వికమ్పేన యోగేన । యుజ్యతే నాఽత్ర సంశయః ।

అర్థము : యః = ఎవడు, మమ = నా యొక్క, ఏతాం = ఈ, విభూతిం = ఐశ్వర్యమును, యోగం చ = కల్యాణగుణయోగమును. తత్త్వతః = యథార్థముగా, వేత్తి = ఎఱుంగుచున్నాడో, సః = వాడు, అవికమ్పేన = నిశ్చలమైన, యోగేన = భక్తియోగముతో, యుజ్యతే = కూడియున్నాడు. అత్ర = ఈ విషయమై, సంశయః = సందేహము, న = లేదు.

తా ॥ సకల చేతనాచేతనముల ఉత్పత్తిస్థితి ప్రవృత్తులు నా సంకల్పాధీనమై యుండును, ఇదియే నా ఐశ్వర్యము. నేను సమస్త కల్యాణగుణములతో గూడుకొనియున్నాను. ఇదియే నా యోగము. ఈ రెండింటిని యథార్థముగా నెఱుంగువాడు నిశ్చల భక్తియోగి, ఇందుకు సందేహము లేదు.

అవ. విభూతి విజ్ఞానమునకు ఫలమగు భక్తి వృద్ధిని జూపుచున్నాడు.

8. శ్లో. అహం సర్వస్య ప్రభవో । మత్త స్సర్వం ప్రవర్తతే ।
ఇతి మత్వా భజన్తే మాం । బుధా భావ సమన్వితాః ।

అర్థము : అహం = నేను, సర్వస్య = సమస్త ప్రపంచము యొక్క, ప్రభవః = పుట్టుకకు కారణమైనవాడను, మత్తః = నా నుండి, సర్వం=సమస్తమును, ప్రవర్తతే = ప్రవర్తించుచున్నది, ఇతి = అని, మత్వా = తలంచి, బుధాః = జ్ఞానులు, భావసమన్వితాః = మనోభావముతో కూడినవారై, మాం = నన్ను, భజన్తే = భజించుచున్నారు.

తా ॥ నేను సమస్త ప్రపంచముయొక్క పుట్టుకకును, ప్రవర్తించుటకును కారణమైనవాడను. ఇట్టి నా యొక్క నిరంకుశైశ్వర్యమును, కల్యాణగుణ యోగమును తలంచి జ్ఞానులు నా యందు స్పృహకలవారై నన్ను భజింతురు.

అవ. ఆ భజించు రీతిని చెప్పుచున్నాడు.

9. శ్లో. మచ్చిత్తాః మద్గతప్రాణాః । బోధయన్తః పరస్పరం ।
కథయన్తశ్చ మాం నిత్యం । తుష్యన్తి చ రమన్తి చ ॥

అర్థము : మచ్చిత్తాః = నా యందు లగ్నమైన మనస్సు కలవారును, మద్గత ప్రాణాః = నాకై యాధారపడియున్న ప్రాణముకలవారును, నిత్యం = ఎల్లప్పుడును, మాం

చెప్పుచున్నావో, ఏతత్ సర్వం = దీనినంతను, ఋతం = సత్యముగా, మన్యే = తలంచుచున్నాను. భగవన్ = శ్రీకృష్ణా, తే = నీయొక్క, వ్యక్తిం = తెలిపెడురీతిని, దేవాః = దేవతలును, దానవాః = రాక్షసులును, న విదుః = ఎఱుంగరు.

తా ॥ శ్రీకృష్ణా! నాకు నీ ఐశ్వర్యమును, యోగమును గూర్చి చెప్పుచున్నావు. దీనినెల్ల నిజమని విశ్వసించుచున్నాను. ఈ నీ మహిమను దేవతలు గాని, దానవులు గాని యెఱుంగరు.

అవ. భగవంతుని వైభవమును భగవంతుడే చెప్పగలడనుచున్నాడు.

15. శ్లో. స్వయ మేవా త్మనా త్మానం । వేత్థ త్వం పురుషోత్తమ!
భూతభావన! భూతేశ! దేవదేవ! జగత్పతే!॥

అర్థము : పురుషోత్తమ = పురుషశ్రేష్ఠుడా, భూతభావన = సకలభూతములను సృజించువాడా! భూతేశ = సమస్తభూతములను నడిపించువాడా! దేవదేవ = దేవతలకును పరదైవమా! జగత్పతే = జగత్తులకు స్వామీ! త్వం = నీవు, ఆత్మనా = నీచేత, ఆత్మానం = నిన్ను, స్వయం ఏవ = నీయంతనే, వేత్థ = తెలుసుకొనుచున్నావు.

తా॥ పురుషోత్తమా! సమస్తభూతములను సృష్టించువాడా! సమస్తభూతములకు నియామకుడా! దేవతలకును పరదైవమా! జగత్తులకుస్వామీ! నీ స్వరూపమును నీ జ్ఞానముచేత నీయంతట నీవే యెఱుంగుదువు.

అవ. తానెఱుంగగోరు విషయములను తెలుపుచున్నాడు.

16. శ్లో. వక్తుమర్హస్యశేషేణ । దివ్యా హ్యాత్మవిభూతయః ।
యాభి ర్విభూతిభి ర్లోకా । నిమాం స్త్వం వ్యాప్య తిష్ఠసి ॥

అర్థము : దివ్యాః = దివ్యములైన, ఆత్మవిభూతయః = నీకుమాత్రమే యుండెడు నియమన విశేషములను, అశేషణ = సాంతముగా, వక్తుం = చెప్పుటకు, అర్హసి = తగుదువు, యాభిః విభూతిభిః = ఏవిభూతులతో, త్వం = నీవు, ఇమాన్ = ఈ, లోకాన్ = లోకములను, వ్యాప్య = వ్యాపించి, తిష్ఠసి = ఉన్నావో

తా ॥ అనేకములైన నీ నియమన విశేషములతో కూడియుండి నీవీ లోకములను వ్యాపించియున్నావు. ఇట్టి విభూతులు నీకు మాత్రమే కలవు. అవి దివ్యములైనవి. వాటినన్నిటిని సమగ్రముగా చెప్పుటకు నీవే తగుదువు.

17. శ్లో. కథం విద్యా మహం యోగీ । త్వాం సదా పరిచిన్తయన్ ।
కేషు కేషు చ భావేషు । చిన్త్యోఽసి భగవ న్మయా ।

అర్థము : అహం = నేను, యోగీ = భక్తియోగినై, త్వాం = నిన్ను, సదా = ఎల్లప్పుడును,

పరిచిన్తయన్ = చింతించుచున్నవాడనై, కథం = ఎట్లు, విద్యాం = తెలుసుకొందును? భగవన్ = కృష్ణా! కేషుకేషు చ = ఏయే, భావేషు = భావములయందు, మయా= నా చేత, చిన్త్యః = చింతించదగినవాడవు, అసి = అగుచున్నావు.

తా ॥ నేను భక్తియోగనిష్ఠుడనై భక్తితో నిన్ను నిరంతరము చింతించుచు నెట్లు తెలుసుకొందును? కృష్ణా! నీవు చెప్పిన బుద్ధి, జ్ఞానాది భావములయందేగాక నిన్నింకను ఏ ఏ భావముల యందు నియామకునిగా తెలియదగును?

18. శ్లో. విస్తరేణాత్మనో యోగం । విభూతిం చ జనార్దన! ।
భూయః కథయ తృప్తిర్హి । శృణ్వతో నాస్తి మేఽమృతమ్ ॥

అర్థము : జనార్దన = శ్రీ కృష్ణా! ఆత్మనః = నీయొక్క, యోగం = యోగమును, విభూతిం చ = విభూతినిన్ని, భూయః = తిరిగి, విస్తరేణ = సవిస్తరముగా, కథయ = చెప్పుము, అమృతం = అమృతమువంటి నీ మాహాత్మ్యమును, శృణ్వతః = వినుచున్న, మే= నాకు, తృప్తిః = సంతుష్టి, నాస్తిహి = లేదుకదా !

తా ॥ కృష్ణా! నీ జగత్సృష్టిమొదలగు యోగమును, నీ నియమనమును తిరిగి సవిస్తరముగ జెప్పుము, నీ మాహాత్మ్యము నాకు అమృతము వలె నున్నది, దానిని ఎంతవిన్నను నాకు తృప్తి కలుగుటలేదు. ఆ సంగతి నీకే తెలియుచున్నది కదా!

అవ. ఇట్లర్జునుని ప్రార్థన కపరిమితానంద భరితుడై భగవంతు డాతని యోగ్యతను జూపుచు తన విభూతిని గూర్చి, విస్తరించి చెప్పుటకును వినుటకును దుశ్శకముగాన సంగ్రహముగా జెప్పెద ననుచున్నాడు.

శ్రీ భగవానువాచ = శ్రీ కృష్ణుడు పలికెను

19. శ్లో. హన్త! తే కథయిష్యామి । విభూతీ రాత్మన శ్శుభాః ।
ప్రాధాన్యతః కురుశ్రేష్ఠ! నాస్త్యన్తో విస్తరస్య మే ।

అర్థము : హన్త = అహో! కురుశ్రేష్ఠ = అర్జునా! ఆత్మనః = నాయొక్క , శుభాః = కల్యాణములైన, విభూతీః = విభూతులను, ప్రాధాన్యతః = ముఖ్యములైన వానిని, తే = నీ కొఱకు, కథయిష్యామి = చెప్పగలను, మే = నా యొక్క, విస్తరస్య = విభూతి విస్తారమునకు, అన్తః = అంతము, న = లేదు.

తా ॥ ఓ అర్జునా! నా నియమనమునకు లోబడియుండు కల్యాణములైన పదార్థములలో ముఖ్యమైనవాటిని మాత్రమే నీకు చెప్పగలను. అవి

యనంతములగుటచే విస్తరించి చెప్పుటకును వినుటకును శక్యము కాదు.

అవ. విభూతి-యోగము అనెడు రెండింటిలో విభూతి యనగా అన్నిటికిని యాత్మయై లోపల నెలకొని యుండి సర్వభూతములను ప్రవర్తింపజేయుట, యోగమనగా అన్నిటిని సృజించుట, పాలించుట, సంహరించుటయు నని స్పష్టముగా జెప్పుచున్నాడు.

20. శ్లో. అహ మాత్మా గుడాకేశ ! సర్వభూతాశయ స్థితః ।
అహ మాదిశ్చ మధ్యం చ । భూతానా మన్త ఏవ చ ॥

అర్థము : గుడాకేశ = అర్జునా! అహం = నేను, సర్వభూతాశయస్థితః = సమస్త భూతముల హృదయమందుండు, ఆత్మా = ఆత్మను, భూతానాం = ప్రాణులకు, ఆదిః చ = సృష్టికర్తను, మధ్యం చ = రక్షకుడను, అన్తః చ = నశింపజేయు వాడనున్ను, అహం ఏవ = నేనే

తా ॥ అర్జునా! సకల ప్రాణుల హృదయముల యందును నే నాత్మగా నున్నాను. కావుననే నేను వాటి యన్నిటియొక్క పుట్టుక, పోషణ, వినాశములకును కారణమగుచున్నాను.

అవ. భగవంతుడన్ని పదార్థములయందును ఆత్మగా నెలకొని యుండుటచే నన్ని శబ్దములు నాతనికి వాచకములగుచున్నవని చెప్పుచున్నాడు. (అన్నియు నేనే యని చెప్పుటకును యిదియే కారణము)

21. శ్లో. ఆదిత్యానా మహం విష్ణుః । జ్యోతిషాం రవి రంశుమాన్ ।
మరీచి ర్మరుతా మస్మి । నక్షత్రాణా మహం శశీ ॥

అర్థము : అహం = నేను, ఆదిత్యానాం = అదితిపుత్రులలో, విష్ణుః = విష్ణు వున్ను, జ్యోతిషాం= వెలుగునిచ్చువాటిలో, అంశుమాన్ = కిరణములుగల, రవిః = ఆదిత్యగణమున్ను, మరుతాం = మరుత్తులనెడు దేవతలలో, మరీచిః = మరీచియను వాయువున్ను, అస్మి = అగుచున్నాను, అహం = నేను, నక్షత్రాణాం = నక్షత్రములకు, శశీ = చంద్రుడను, (అస్మి = అగుచున్నాను.)

తా ॥ నేను అదితిపుత్రులలో విష్ణువున్ను, లోకమునకు వెలుగునిచ్చు వాటిలో కిరణములుగల ఆదిత్యగణమున్ను, మరుత్తులనెడు దేవతలలో మరీచి యనెడు వాయువున్ను,నక్షత్రములకుపతియగు చంద్రుడనున్ను అగుచున్నాను.

22. శ్లో. వేదానాం సామవేదోఽస్మి । దేవానా మస్మి వాసవః ।
ఇన్ద్రియాణాం మనశ్చాస్మి । భూతానా మస్మి చేతనా ॥

అర్థము : వేదానాం = నాలుగువేదములలో, సామవేదః = సామవేదము, అస్మి = అగుచున్నాను, దేవానాం=దేవతలలో, వాసవః =దేవేంద్రుడును, అస్మి=అగుచున్నాను, ఇన్ద్రియాణాం= ఇంద్రియములలో, మనః చ = మనస్సును, అస్మి = అగుచున్నాను. భూతానాం= చైతన్యముగల భూతములకు గల, చేతనా = చైతన్యమున్ను, అస్మి= అగుచున్నాను.

తా ॥ నాలుగు వేదములలో సహస్రశాఖలుగల శ్రేష్ఠమైన సామవేద మున్ను, దేవతలకు ప్రభువగు దేవేంద్రుడున్ను, పదనొకండు ఇంద్రియములలో ప్రధానమైన మనస్సున్ను, చేతనాయుతములగు భూతములకు గల తెలివియు నేనే యగుచున్నాను.

23. శ్లో. రుద్రాణాం శఙ్కరశ్చాస్మి । విత్తేశో యక్షరక్షసామ్ ।
వసూనాం పావక శ్చాస్మి । మేరు శ్శిఖరిణా మహమ్ ॥

అర్థము : రుద్రాణాం = ఏకాదశరుద్రులలో, శఙ్కరః చ = శంకరుడను, అస్మి = అగుచున్నాను, యక్షరక్షసాం = యక్షులకును రాక్షసులకును, విత్తేశః = ప్రభువగు కుబేరుడను, వసూనాం = అష్టవసువులలో, పావకః చ = అగ్నియును, శిఖరిణాం = శిఖరముగల పర్వతములలో, మేరుః = మేరుపర్వతమును, అహం = నేను, అస్మి = అగుచున్నాను.

తా ॥ ఏకాదశరుద్రులలో శంకరుడనున్ను, యక్షరాక్షసులకు ప్రభువగు కుబేరుడను, అష్టవసువులలో అగ్నియను వసువును, శిఖరములు గల పర్వతములలో మేరు పర్వతమునున్ను నేనే యగుచున్నాను.

24. శ్లో. పురోధసాం చ ముఖ్యం మాం । విద్ధి పార్థ ! బృహస్పతిమ్ ।
సేనానీనా మహం స్కన్ద । స్సరసా మస్మి సాగరః ॥

అర్థము : పార్థ = అర్జునా ! మాం = నన్ను, పురోధసాం = పురోహితులలో, ముఖ్యం = ముఖ్యమైన, బృహస్పతిం = బృహస్పతిగా, విద్ధి = తెలుసుకొనుము, అహం = నేను, సేనానీనాం = సేనాధిపతులలో, స్కన్దః = కుమారస్వామియున్ను, సరసాం = సరస్సులలో, సాగరః చ = సముద్రుడను, అస్మి = అగుచున్నాను.

తా ॥ అర్జునా! పురోహితులలో ప్రధానమైన బృహస్పతిని నేను, సేనాధిపతులలో కుమారస్వామిని నేను, సరస్సులలో సముద్రుడను నేనే అగుచున్నాను.

25. శ్లో. మహర్షీణాం భృగు రహం । గిరా మస్మ్యేక మక్షరమ్ ।
యజ్ఞానాం జపయజ్ఞోఽస్మి ! స్థావరాణాం హిమాలయః ॥

అర్థము : మహర్షీణాం = మహర్షులలో, భృగుః = భృగుమహామునిని, అహం = నేను, గిరాం= శబ్దములలో, ఏకం = ఒక, అక్షరం = ప్రణవము, అహం = నేను, అస్మి = అగుచున్నాను, యజ్ఞానాం = యజ్ఞములలో, జపయజ్ఞః = జపయజ్ఞము, అస్మి= అగుచున్నాను, స్థావరాణాం = పర్వతములలో, హిమాలయః = హిమవత్పర్వతము, అస్మి = అగుచున్నాను.

తా ॥ మరీచి మొదలగు మహర్షులలో భృగుమహర్షిని నేను, అర్థవంత మైన శబ్దములలో ప్రణవము నేను, యజ్ఞములలో గొప్పదియైన జపయజ్ఞము నేను, పర్వతములలో హిమవత్పర్వతమును నేనే యగుచున్నాను.

6. శ్లో. అశ్వత్థ స్సర్వవృక్షాణాం । దేవర్షీణాం చ నారదః ।
గంధర్వాణాం చిత్రరథః । సిద్ధానాం కపిలో మునిః ।

ర్థము : సర్వవృక్షాణాం = సకలవృక్షములలో, అశ్వత్థః = రావిచెట్టును, దేవర్షీణాం = దేవర్షులలో, నారదః చ = నారదుడను, గంధర్వాణాం = గంధర్వులలో, చిత్రరథః= చిత్రరథుడను, సిద్ధానాం = సిద్ధులలో, కపిలః మునిః = కపిలమహర్షియును, (అహం= నేను, అస్మి = అగుచున్నాను)

తా ॥ సకల వృక్షములలోను పూజ్యమగు రావిచెట్టును నేను, దేవర్షులలో నారదుడను నేను, గంధర్వులలో చిత్రరథుడను, సిద్ధులలో కపిల మహర్షినిన్ని నేనే యగుచున్నాను.

7. శ్లో. ఉచ్చైశ్శ్రవస మశ్వానాం । విద్ధి మా మమృతోద్భవమ్ ।
ఐరావతం గజేంద్రాణాం । నరాణాం చ నరాధిపమ్ ।

ర్థము : అశ్వానాం = గుఱ్ఱములలో, అమృతోద్భవం = పాలసముద్రమునందు పుట్టిన, ఉచ్చైశ్శ్రవసం = ఉచ్చైశ్శ్రవసముగను, గజేంద్రాణాం = దిగ్గజములలో, ఐరావతం= ఐరావతముగను, నరాణాం = మనుష్యులలో, నరాధిపం = రాజునుగను, మాం = నన్ను, విద్ధి = తెలుసుకొనుము.

తా ॥ గుఱ్ఱములలో సముద్ర మథన సమయమున బుట్టిన ఉచ్చైశ్శ్రవసమనెడు గుఱ్ఱమును నేను, దిగ్గజములలో ఐరావతమును నేను, మనుష్యులలో రాజునున్ను నేనే యగుచున్నాను.

28. శ్లో. ఆయుధానా మహం వజ్రం। ధేనూనా మస్మి కామధుక్।
ప్రజనశ్చాస్మి కన్దర్పః। సర్పాణా మస్మి వాసుకిః॥

అర్థము : అహం = నేను, ఆయుధానాం = ఆయుధములలో, వజ్రం = వజ్రాయుధమును, ధేనూనాం = ఆవులలో, కామధుక్ = కామ ధేనువును, అస్మి = అగుచున్నాను, ప్రజనః = సంతానకారణ మగు, కందర్పః = మన్మథుడను, అస్మి = అగుచున్నాను, సర్పాణాం =ఒకతల పాములలో, వాసుకిః చ = వాసుకియు, అస్మి = యగుచున్నాను.

తా ॥ ఆయుధములలో వజ్రాయుధమున్ను, ఆవులలో కామధేను వున్ను, సంతానకారణమైన మన్మథుడను, ఒక తలగల పాముల లో వాసుకియు నేనే యగుచున్నాను.

29. శ్లో. అనన్తశ్చాస్మి నాగానాం। వరుణో యాదసా మహమ్।
పితౄణా మర్యమా చాస్మి। యమ స్సంయమతా మహమ్॥

అర్థము : అహం = నేను, నాగానాం = అనేకతలలుగల పాములలో, అనన్తః = అనంతుడను, యాదసాం = నీటియందువసించు ప్రాణులలో, వరుణః=వరుణుడనున్ను, అస్మి= అగుచున్నాను, అహం = నేను, పితౄణాం = పితృదేవతలలో, అర్యమా = అర్యముడను, సంయమతాం = దండించువారలలో, యమః=యముడను, అస్మి= అగుచున్నాను.

తా ॥ అనేక తలలు గల పాములలో ఆదిశేషుడను నేను . జలచరముల కు ప్రభువగు వరుణుడను నేను, పితృదేవతలలో అర్యముడను నేను, దండించువారలలో యముడనున్ను నేనే యగుచున్నాను.

30. శ్లో. ప్రహ్లాద శ్చాస్మి దైత్యానాం। కాలః కలయతా మహమ్।
మృగాణాం చ మృగేంద్రోఽహం। వైనతేయశ్చ పక్షిణామ్॥

అర్థము : అహం = నేను, దైత్యానాం = దైత్యులలో, ప్రహ్లాదః = ప్రహ్లాదుడను, కలయతాం= గణించువారలలో, కాలః = మృత్యువును, అస్మి = అగుచున్నాను, అహం = నేను, మృగాణాం = మృగములలో, మృగేన్ద్రః = సింహమును, పక్షిణాం = పక్షులలో, వైనతేయః చ = గరుత్మంతుడనున్ను, (అస్మి = అగుచున్నాను.)

తా ॥ దైత్యులలో ప్రహ్లాదుడను, అనర్థమును కలిగింపగోరి సమయము ను లెక్కించువారలలో మృత్యువును, మృగములలో సింహమును, పక్షులలో గరుత్మంతుడను నేనే యగుచున్నాను.

31. శ్లో. పవనః పవతా మస్మి । రామ శ్శస్త్రభృతా మహమ్ ।
ఝషాణాం మకర శ్చాస్మి । స్రోతసా మస్మి జాహ్నవీ ॥

అర్థము : పవతాం = గమనస్వభావము గలవారలలో, పవనః = వాయువును, అస్మి = అగుచున్నాను, శస్త్రభృతాం = ఆయుధధారులలో, రామః = శ్రీరాముడను, అహం=నేను, ఝషాణాం=మత్స్యములలో, మకరః =మొసలిని, అస్మి = అగుచున్నాను, స్రోతసాం = ప్రవాహములలో, జాహ్నవీ = గంగను, అస్మి = అగుచున్నాను.

తా ॥ ఎడతెగని గమన స్వభావము గలవారిలో వాయువును, అమోఘ శస్త్రముల ధరించువారలలో రాముడను, మత్స్యములలో మొసలిని, ప్రవహించు నదులలో గంగను నేనే యగుచున్నాను.

32. శ్లో. సర్గాణా మాది రన్తశ్చ । మధ్యం చైవా హ మర్జున! ।
అధ్యాత్మవిద్యా విద్యానాం । వాదః ప్రవదతా మహమ్ ॥

అర్థము : అర్జున = అర్జునుడా! సర్గాణాం = సృజింపబడువాటికి, ఆదిః = పుట్టుటకు కారణమును, మధ్యం = రక్షకుడను, అన్తః చ = నాశకుడను, అహం ఏవ = నేనే, విద్యానాం = విద్యలలో, అధ్యాత్మవిద్యా = బ్రహ్మవిద్యయు, ప్రవదతాం = వాదించువారలలో, వాదః = వాదమును, అహం = నేను.

తా ॥ సృజింపబడు ప్రాణులకు సృష్టికర్తను, సంహరింపబడువారికి సంహారకర్తను, పాలింపబడువారికి పాలకుడను, విద్యలలో వేదాంత విద్యను, వాదించువారలలో తత్వనిర్ణయముకొఱకు ప్రవర్తించు వాదమును నేనే యగుచున్నాను.

33. శ్లో. అక్షరాణా మకారో ఽ స్మి । ద్వన్ద్వ స్సామాసికస్య చ ।
అహ మేవాఽక్షయః కాలః । ధాతాఽహం విశ్వతోముఖః ॥

అర్థము : అక్షరాణాం = అక్షరములలో, అకారః = అకారమును, సామాసికస్య చ = సమాస సమూహములలో, ద్వన్ద్వః చ = ద్వంద్వ సమాసమున్ను, అస్మి = అగుచున్నాను, అక్షయః = నాశనము లేని, కాలః = కాలము, అహం ఏవ = నేనే, విశ్వతోముఖః = చతుర్ముఖములు గల, ధాతా = బ్రహ్మయు, అహం = నేను.

తా ॥ అక్షరములలో అకారమును, సమాస సమూహములో ద్వంద్వ సమాసమును, నాశరహితమగు కాలమును, అన్నిదిక్కులకు ముఖములు గల బ్రహ్మను నేనే యగుచున్నాను.

34. శ్లో. మృత్యు స్సర్వహర శ్చాహ । ముద్భవశ్చ భవిష్యతామ్ ।
కీర్తిశ్శ్రీర్వాక్చ నారీణాం । స్మృతి ర్మేధా ధృతిః క్షమా ।

అర్థము : సర్వహరః = సకలప్రాణులను హరించునట్టి, మృత్యుః చ = మృత్యువును, భవిష్యతాం= పుట్టబోవువారియొక్క, ఉద్భవః చ = పుట్టుకయు, అహం = నేను, అస్మి = అగుచున్నాను, నారీణాం = స్త్రీలలో, శ్రీః = లక్ష్మియు, కీర్తిః = కీర్తియు, వాక్ చ= సరస్వతియున్ను, స్మృతిః = జ్ఞాపకశక్తియు, మేధా = బుద్ధియు, ధృతిః = ధైర్యమును, క్షమా = ఓరిమియు, (అహం = నేను, అస్మి = అగుచున్నాను.)

తా ॥ సకల ప్రాణుల ప్రాణమును హరించునట్టి మృత్యువును, పుట్టువారి పుట్టుక యనెడు కర్మయు, స్త్రీలలో లక్ష్మి,కీర్తి, వాక్కు, జ్ఞాపకశక్తి, బుద్ధి, ధైర్యము, ఓర్పు అను ఇవి యన్నియు నేనే యగుచున్నాను.

35. శ్లో. బృహత్సామ తథా సామ్నాం । గాయత్రీ ఛన్దసా మహమ్ ।
మాసానాం మార్గశీర్షోఽహం । ఋతూనాం కుసుమాకరః ॥

అర్థము : సామ్నాం = సామగానములలో, బృహత్సామ = బృహత్సామయు, తథా = అట్లే, ఛన్దసాం=ఛందస్సులలో, గాయత్రీ = గాయత్రియును, అహం = నేను, మాసానాం= నెలలలో, మార్గశీర్షః = మార్గ శిరమాసమున్ను, ఋతూనాం = ఋతువులలో, కుసుమాకరః = వసంత ఋతువును, అహం = నేను, (అస్మి = అగుచున్నాను.)

తా ॥ సామములలో బృహత్సామమున్ను, ఛందస్సులలో గాయత్రి యు, మాసములలో మార్గశిర మాసమును, ఋతువులలో వసంతఋతువును నేనే అగుచున్నాను.

36. శ్లో. ద్యూతం ఛలయతా మస్మి । తేజస్తేజస్వినా మహమ్ ।
జయోఽస్మి వ్యవసాయోఽస్మి । సత్త్వం సత్త్వవతా మహమ్ ।

అర్థము : అహం = నేను, ఛలయతాం = వంచనచేయువారిలో, ద్యూతం = జూదమును, తేజస్వినాం = తేజోవంతులయొక్క, తేజః = తేజస్సును, అస్మి = అగుచున్నాను, జయః = జయము, అస్మి = అగుచున్నాను, సత్త్వవతాం = సాత్త్వికులయొక్క, వ్యవసాయః = ప్రయత్నము, సత్త్వం = సత్త్వగుణమును, అహం = నేను, (అస్మి= అగుచున్నాను.)

తా ॥ వంచనకు ఆస్పదమైనవాటిలో జూదమును, తేజోవంతుల యొక్క తేజస్సును, జయముకలవారియొక్క విజయమును, కార్యసిద్ధికై

ప్రయత్నించు వారియొక్క ప్రయత్నమును, సాత్వికుల యందలి సత్త్వగుణమును నేనే యగుచున్నాను.

37. శ్లో. వృష్ణీనాం వాసుదేవోఽస్మి । పాణ్డవానాం ధనఞ్జయః ।
మునీనా మప్యహం వ్యాసః । కవీనా ముశనా కవిః ॥

అర్థము : వృష్ణీనాం = యాదవులలో, వాసుదేవః = వసుదేవపుత్రుడను, అస్మి = అగుచున్నాను, పాణ్డవానాం = పాండవులలో, ధనఞ్జయః = అర్జునుడనున్ను, మునీనాం = మననశీలురలో, వ్యాసః = వ్యాసుడను, కవీనాం = విద్వాంసులలో, ఉశనాకవిః = శుక్రుడనెడు విద్వాంసుడను, అహం = నేనే (అస్మి = అగుచున్నాను.)

తా ॥ వృష్ణివంశమునకు చెందిన యాదవులలో వాసుదేవుడను, పాండవులలో అర్జునుడను, మునులలో వ్యాసుడను, విద్వాంసులలో శుక్రాచార్యుడను నేనే అగుచున్నాను.

38. శ్లో. దణ్డో దమయతా మస్మి । నీతి రస్మి జిగీషతామ్ ।
మౌనం చైవా స్మి గుహ్యానాం । జ్ఞానం జ్ఞానవతా మహమ్ ॥

అర్థము : దమయతాం = శిక్షించువారియొక్క, దణ్డః = శిక్ష అస్మి = అగుచున్నాను, జిగీషతాం = జయింపగోరువారియొక్క, నీతిః = సామదానాది రాజనీతియు, అస్మి= అగుచున్నాను, గుహ్యానాం = రహస్యములలో, మౌనం = మౌనము, అస్మి= అగుచున్నాను, జ్ఞానవతాం = జ్ఞానముకలవారియొక్క, జ్ఞానం = జ్ఞానము, అహం= నేను, (అస్మి = అగుచున్నాను.)

తా ॥ శిక్షించువారియొక్క శిక్షయు, జయింపగోరువారి జయోపాయ మగు సామాది రాజనీతియు, రహస్యములను గాచెడు ఉపాయములలో మౌనమును, జ్ఞానవంతులలో జ్ఞానమును నేనే యగుచున్నాను.

అవ. ఈ ప్రకరణము ఉపసంహరించుటకై విభూతి సంక్షేపము నుపదేశించుచున్నాడు.

39. శ్లో. యచ్చా పి సర్వభూతానాం । బీజం తదహ మర్జున ।
న తదస్తి వినా యత్స్యాత్ । మయా భూతం చరాచరమ్ ॥

అర్థము : అర్జున = అర్జునుడా! యత్ = ఏది, సర్వభూతానాం = సకల భూతములకు, బీజం= కారణమో, తత్ అపిచ = అదియున్ను, అహం = నేను, యత్ = ఏది, మయావినా = నన్నువిడచి, స్యాత్ = ఉండునో, తత్ = అట్టి, చరాచరం = చేతనఅచేతనరూపమైన, భూతం = భూతసమూహము, నాస్తి = లేదు.

తా ॥ అర్జునా! సకలభూతములకు కారణమైనవాడను నేనే యగు చున్నాను. జంగమ స్థావర రూపమైన సమస్త వస్తు సమూహమునకు ఆత్మభూతమైన నన్ను విడిచి యుండునది ఒక్కటియు లేదు.

అవ. విస్తరముగా చెప్పుటకు శక్యముగాదని వెనుక చెప్పినట్లే తిరిగి చెప్పుచున్నాడు.

40. శ్లో. నాన్తోఽస్తి మమ దివ్యానాం । విభూతీనాం పరన్తప ।
ఏషతూద్దేశతః ప్రోక్తః । విభూతే ర్విస్తరో మయా ॥

అర్థము : పరన్తప = అర్జునా! దివ్యానాం = కల్యాణములైన, మమ = నాయొక్క, విభూతీనాం= విభూతులకు, అన్తః = అంతము, న అస్తి = లేదు, విభూతేః = విభూతియొక్క, ఏషః = ఈ, విస్తరః తు = విరివియన్ననో, ఉద్దేశతః = సంక్షేపముగా, మయా = నాచేత, ప్రోక్తః = చెప్పబడినది.

తా ॥ అర్జునా! కల్యాణమయములగు నా విభూతులకు పరిమితిలేదు. ఇంతవరకు నా విభూతివిస్తారమును కొన్ని ఉపాధులచే సంగ్రహముగ నీకు చెప్పితిని.

అవ. చెప్పబడనివియు, ముఖ్యముగా చెప్పదగినవియు నగు ప్రధాన విభూతులను తెలుపుచు విరమించుచున్నాడు.

41. శ్లో. యద్య ద్విభూతిమ త్సత్వం । శ్రీమ దూర్జిత మేవ వా ।
త త్తదే వావగచ్ఛ త్వం । మమ తేజోఽంశసమ్భవమ్ ॥

అర్థము : విభూతిమత్ = నాకు నియమించదగియున్నదియు, శ్రీమత్ = కాంతియుక్త మైనదియు, ఊర్జితం ఏవ వా = శుభకార్యములయందు ఉద్యుక్తమైనదియు నగు, సత్త్వం = భూతసమూహము, యత్ యత్ అస్తి = ఏదేదికలదో, తత్ తత్ =ఆయా ప్రాణిసమూహము, మమ = నాయొక్క, తేజోఽంశ సంభవం ఏవ = నియమనశక్తి యొక్క స్వల్పభాగమువలన పుట్టినదిగా, త్వం = నీవు, అవగచ్ఛ = తెలిసికొనుము.

తా ॥ నాకు లోబడిన సంపత్తిగలదై, కాంతియుక్తమై, కల్యాణ కార్యముల యందుద్యుక్తమైన ప్రతివస్తువున్ను నా నియమనశక్తిలోని కొంత భాగము వలన పుట్టినదియే యని ఎఱుంగుము.

అవి. ప్రధానములును అప్రధానములు నగు సకల విభూతులను సంగ్రహముగ చెప్పుచున్నాడు.

42. శ్లో. అథవా బహు నైతేన కిం। జ్ఞానేన తవాఽర్జున।
విష్టభ్యా హ మిదం కృత్స్న। మేకాంశేన స్థితో జగత్॥

ఇతి శ్రీ భగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే
శ్రీకృష్ణార్జున సంవాదే విభూతివిస్తరయోగో నామ దశమోఽధ్యాయః

అర్థము : అర్జున = అర్జునుడా! అథవా = లేక, బహునా = విస్తారమైన, ఏతేన = ఈ, జ్ఞానేన= జ్ఞానముచేత, తవ = నీకు, కిం = ఏమి ప్రయోజనము, అహం = నేను, కృత్స్నం= సమస్తమైన, ఇదం = ఈ, జగత్ = ప్రపంచమును, ఏకాంశేన = స్వల్పభాగముచేత. విష్టభ్య = నిలిపి, స్థితః = ఉన్నాను.

తా॥ ఓ అర్జునా! నీకు నేను ఈ జ్ఞానమును విస్తారముగా చెప్పు చుండుట వలన ప్రయోజనము లేదు. నీకు తెలియునటుల సంగ్రహముగా తెలిపెదను వినుము. ఈ సమస్త జగత్తును నా మహిమలోని అతి స్వల్పభాగముచే నిలబెట్టియున్నాను.

ఇది ఉపనిషదర్థ ప్రతిపాదకమును, బ్రహ్మవిద్యయు, యోగశాస్త్ర మును,
శ్రీకృష్ణార్జున సంవాదరూపమును అయిన శ్రీ భగవద్గీత యందలి
విభూతివిస్తరయోగమనెడు పదియవ అధ్యాయము.

ఈ అధ్యాయమందలి శ్లోకసంఖ్య 42

ఇప్పటికి మొత్తము అయిన శ్లోకముల సంఖ్య 413

శ్రీమద్భగవద్గీతా ప్రశ్నోత్తరావళి
దశమాధ్యాయము

1. ప్ర. ఈ యధ్యాయమునకు పేరేమి ? ఆ పేరేందులకుంచబడినది?

ఉ. ఈ యధ్యాయమునకు 'విభూతివిస్తరయోగమని పేరు.

విభూతి యనగా - ఐశ్వర్యము. అనగా- సర్వమును భగవంతునికి లోనైన ఉత్పత్తి స్థితి ప్రవృతులు కలిగియుండుట యనెడి భగవంతుని సర్వనియమనశక్తి. భగవంతునిచే నియమింపబడు పదార్థములయందు కూడ విభూతి శబ్దము ప్రయోగింపబడును. ఈ విభూతిజ్ఞానము పరిపక్వముగు కాలది భక్తి వృద్ధిపొందుచున్నది. కాబట్టి 9వ యధ్యాయమున నిష్కర్షించిన భక్తి వృద్ధి పొందుటకు ఈ యధ్యాయమున భగవంతుని నియమన విశేషములను (విభూతులను) గూర్చి విస్తరించి చెప్పుమని అర్జును డడుగగా శ్రీకృష్ణపరమాత్మ చెప్పెను. కావున యీ యధ్యాయమునకు విభూతివిస్తరయోగమని పేరుంచబడినది.

2. ప్ర. ఈ యధ్యాయమున చెప్పబడిన ముఖ్యవిషయములేవి ?

ఉ. స్వకల్యాణగుణానన్త్య కృత్స్నస్వాధీనతా మతిః
భక్త్యుత్పత్తివివృద్ధ్యర్థా విస్తీర్ణా దశ మోదితా ॥ గీతార్థసంగ్రహము.

భగవంతుని కల్యాణగుణములు, భగవంతుని సకల చేతనాచేతనముల కంతర్యామిత్వము, చేతనాచేతనములన్నియు (శరీరము వలె) భగవంతునకు అధీనమైన స్వరూపస్థితులు కలవని చెప్పుట.

0 ---వివరములు---0

1. భగవంతుడు తాను చెప్పదలచుకొనిన విషయమును ప్రతిజ్ఞ చేయుట 1శ్లో

2. దానియందాదరము కలుగుటకై యీ జ్ఞానము దుర్లభమని చెప్పుట 2శ్లో

3. ఈ జ్ఞానము భక్తిపుట్టుటకు ప్రతిబంధకములగు పాపములను పోగొట్టుటకు ఉపాయమని చెప్పుట. 3శ్లో

4. భగవదైశ్వర్యమును, భగవంతుని కల్యాణగుణ విస్తారమును అనుసంధించుటచే భక్తి వృద్ధిపొందు రీతిని చెప్పుట. 4-5-7-8-9-10-11 శ్లో

5. సకల ప్రాణులయొక్క సృష్టి స్థితి ప్రవృత్తులకు కారణ భూతులగు సప్తమహర్షి ప్రభృతులున్ను భగవత్సంకల్పమువల్లనే ప్రవర్తింతురని చెప్పుట. 6శ్లో

6. అర్జునుడు వినువారలకు నిరతిశయానంద జనకమగు భగవత్కల్యాణ గుణయోగమును, భగవదైశ్వర్యాతిశయమును విస్తారముగా వినగోరుట 12నుండి 18శ్లో

7. భగవంతుడు దానిని సంగ్రహించి చెప్పుట కంగీకరించుట. 19శ్లో

8. అన్ని శబ్దములచే తానే చెప్పబడుటకు కారణమును చెప్పుట. 20శ్లో

9. భగవంతుడు తన విభూతులను సంగ్రహించి చెప్పుట. 21నుండి 40శ్లో

10. చెప్పని యర్థములనుగూడ సంగ్రహించుకొనుట నుపదేశించుట. 41-42శ్లో

3. ప్ర. **తా నీ యధ్యాయమున చెప్పదలచిన విషయములను భగవంతు డెట్లు ప్రతిజ్ఞచేసెను ? ఆ జ్ఞానము నెట్లు కొనియాడెను ?**

ఉ. అర్జునా! నా మాహాత్మ్యమును విని యానందింతువు గాన నీకు హితమును చేయగోరి నాయందు భక్తి యుదయించి వృద్ధి పొందుటకు తిరిగి నా మాహాత్మ్యమును గూర్చిన శ్రేష్ఠమగు నుపదేశమును గావింతును. శ్రద్ధగ వినుము. 9వ అధ్యాయము లో సకల దోషనిదానమగు అసూయ లేకుండుటచే గహనమగు నర్థము నుపదేశించితిని. ఇపుడు చెప్పినదానిని వినుటలో మిక్కిలి ఉత్సాహమును చూపుచున్నావు గాన అతి గహనమగు అర్థము నుపదేశింతును అని ప్రతిజ్ఞచేసెను. ఆయర్థ మేమనగా- భగవంతుని విభూతి యోగము. విభూతి యనగా - నియమనమున్ను, నియంతవ్యమున్ను అని యర్థము. నియమన మనగా - ప్రవర్తింపజేయుట. నియంతవ్యమనగా- అట్లు ప్రవర్తింపజేయబడు పదార్థములు. దీనినే 'మత్తస్సర్వం ప్రవర్తతే' అని సెలవిచ్చెను. యోగమనగా - సృష్టించుట పాలించుట సంహరించుటయు,

అందులకు తగిన సర్వజ్ఞత్వాది గుణములు కలిగియుండుటయును. దీనినే 'అహం సర్వస్య ప్రభవః' అని చెప్పెను.

అతిగహనము గావుననే దేవగణముగాని, కనులకు కానరానిదానిని గూడ తమ యోగమహిమచే గాంచగల మహర్షులుగాని నాయొక్క, నామకర్మ స్వరూప స్వభావాదులను ఎఱుంగజాలరు. ఏలనన వారట్లు దేవతలు ఋషులు నగుటకు కారణమైన పుణ్యము నాచరించుటకు తగినట్లు వారికి నేనిచ్చినజ్ఞాన మత్యల్పము. అందుచే ఆ మాత్రము జ్ఞానముతో నా స్వరూపాదులను వాస్తవముగ నెఱుంగజాలరు.

4. ప్ర. ఈ విభూతిజ్ఞానముచే భక్తి యెట్లు వృద్ధిపొందును ?

ఉ : ఎల్లవారును భక్తులు కాకుండుటకు కారణము వారి పాపరాశియే అది నశించవలెననిన–

లోకమున నొక రాజున్ను ఇతర మానవులవంటివాడే. ఏదో జన్మాంతర పుణ్య విశేషముచే ప్రజలకు ప్రభువాయెను. అట్లే ఒకడు (ఇంద్రుడు) తన పుణ్యముచే దేవాధిపతియగును. అట్లే మరియొకడు అండాధిపతి (బ్రహ్మ) యగును. అణిమాద్యైశ్వర్య మును పొందినవాడు (రుద్రుడు) కూడా మొదట మనవంటివాడే గదా! వాసుదేవుడట్లుగాదు. కార్యావస్థలో గాని కారణావస్థలో గాని ఉన్నట్టి చేతన ప్రకృతి కంటెను, బద్ధావస్థలోగాని ముక్తావస్థలో గాని ఉన్నట్టి చేతనులకంటెను మిక్కిలి విలక్షణమైనవాడు. అందులకు కారణము అతడు దుర్గుణమొక్కటియులేని సకల సద్గుణరాశి యగుటయు, సమస్త చేతనాచేతనములను నియమించుటయే స్వభావముగా కలవాడగుటయునే అని యెఱుంగ వలెను. ఇట్లెఱింగినవాడు భక్తికి విరుద్ధమగు సకల పాప రాశినుండియు విముక్తుడగును. ఇకనేమి? భక్తిరేఖలు నిరాటంకముగా నుదయించి సాగుచుండును.

అట్టివారికి నా సంకల్పముచే నీ చెప్పబడు ప్రవృత్తికిని నివృత్తికిని కారణమగు మనోవృత్తులు విజృంభించును. అవి యేవనగా – మనస్సునకు యుక్తాయుక్త నిరూపణ సామర్థ్యము, చేతనాచేతన వస్తువుల స్వరూప స్వభావ తారతమ్యముల చక్కగ నెఱుంగుట, ఒక వస్తువును మరియొక వస్తువుగా తలంచునట్టి భ్రాంతి లేకుండుట, మనస్సును వికరింపజేయు వస్తువు లెదుట నున్నను చలించకుండుట, చూచినదానిని చూచినట్లుగాను

హితమగునట్లుగాను మాటలాడుట. బాహ్యేంద్రియములను మనస్సును అనర్థవస్తువులచే నాకర్షింపబడకుండ కాపాడుకొనుట, ఆత్మకనుకూలమగు అనుభవము ప్రతికూలమగు అనుభవము అట్టి ప్రతికూలానుభవమునకు కారణమైన మనోదైన్యము లేకుండుట (ఎప్పుడో రాబోవు దుఃఖమునకు కారణమైన వస్తువును జూచి యిప్పుడే దుఃఖించకుండుట,) పరుల కేవిధము గను దుఃఖమును కలిగింపకుండుట. శత్రుమిత్రాదులపట్ల సమ దృష్టి. ఎవరిని చూచినను సంతోషించు స్వభావము కలిగి యుండుట. శాస్త్రములో చెప్పినట్లు ఏకాదశీ ఉపవాసాదులచే భోగములను తగ్గించుకొని శరీరమును శోషింపజేయుట. తన కిష్టమైనవాటిని పరులకు నిస్సంకోచముగా సమర్పించుట. గుణవంతుడని కొని యాడబడుట, గుణహీనుడని నిందింపబడుట మొదలగునవి.

ఇట్లు సమస్త పదార్థములయొక్కయు ఉత్పత్తి స్థితి ప్రవృత్తులు నా యధీనములై యుండుట యనెడి నా విభూతిని, నేను దుర్గుణ ములు దరిజేరని సకల సద్గుణరాశిననెడు యోగమును ఎవరు నిజముగ నెఱుంగుచున్నారో వారు నిశ్చలమగు భక్తియోగముతో వెలుంగుచుందురు.

అట్టివారు నన్ను విచిత్రమగు ఈ ప్రపంచమునకు కారణభూతుడ ననియు అంతయు నావలననే సాగుచున్నదనెడు నా స్వాభావిక మైన నిరంకుశైశ్వర్యమును సకల మంగళ గుణాకరత్వమును తలంచి పరిశుద్ధ మనోవృత్తులుకలవారై నాయందభిరుచితో నన్నే భజింతురు.

ఆ భజించుటలోను వారి మనస్సుల నాయందే నెలకొలిపి నన్ను విడచి బ్రతుకలేక వారనుభవపూర్వకముగ నెఱింగిన నా గుణముల నొకరికొకరు బోధించుకొనుచును, నా యతిమానుష హృదయాకర్షకచేష్టలను చెప్పుకొనుచును ఆనందించుచుందురు. చెప్పెడువారు చెప్పుటయే ప్రయోజనముగా చెప్పుచు ఆనందింతురు. వినువారు వాటిని వినుటచే కలిగిన యపార ప్రేమతో నానందింతురు.

అట్టిభక్తి కెట్టిఫలము ప్రసాదింతునో చూచితివా ? అట్లు నాతో నెల్లవేళల నానందింపగోరి నన్ను భజించు నా భక్తులకు నేను నన్ను సుకరముగ జేరుటకు తగిన పరిపక్వజ్ఞానాతిశయమును మిక్కిలి ప్రేమతో ప్రసాదింతును. ఆ జ్ఞానముతో వారు నన్ను పొందుదురు.

అట్టి జ్ఞానమును నీవు ప్రసాదించినను ప్రతిబంధకములైన పాపములు లేకున్న గదా! అది యుపయోగింమనది యన్నచో - నేను వారి యందలి యనుగ్రహముచే వారి భావనావీథిలో విహరించుచు నా కల్యాణ గుణరాశిని ప్రకాశింపజేయుచు ప్రకాశమానమగు దీపముచే చీకటివలె నన్ను గూర్చిన జ్ఞానముచే, జ్ఞానమును పుట్టనీయక యడ్డుచున్నట్టియు ప్రాచీనకర్మ లనెడు అజ్ఞానమువలన పుట్టునట్టియు చిరకాలమునుండియు అభ్యస్తమై అనువర్తించునట్టి విషయభోగలాలస యనెడు చీకటిని నశింపజేయుదును. నిరతిశయభోగ్యమగు భగవత్ జ్ఞానము క్షుద్రభోగ్యములయందుండు ఆదరము నణచివేయుట ప్రసిద్ధమేగదా! ఈ విధముగ భక్తి వృద్ధిపొందును.

5. ప్ర. భగవత్కల్యాణగుణ యోగమును, భగవదైశ్వర్యాతిశయమును వినగోరి అర్జును డెట్లు ప్రశ్నించెను ?

ఉ. కృష్ణా! శ్రుతులు నిన్ను పరబ్రహ్మ వనియు, పరంజ్యోతి వనియు, తలంచినవారి పాపములన్నియు పరిహరించు పరమ పావనుడవనియు చెప్పుచున్నవి.

సర్వోత్కృష్టమగు తత్వమును, నికృష్టతత్వమును వాస్తవముగా నెఱింగిన వారగుటచే ఆప్తులగు ఋషులున్ను, దేవర్షియగు నారదుడున్ను, అసితుడున్ను, దేవలుడున్ను, వ్యాసుడున్ను నిన్నే నిత్యమైన వాడవనియు, సకల చేతనా చేతనాంతర్యామివనియు, ఆదిదేవుడవనియు, పుట్టుక లేనివాడవనియు, సర్వవ్యాపకుడ వనియు చెప్పుచున్నారు.

'భూమి రాపోఽనలో వాయుః' అని నీవే యింతకుముందు చెప్పితివిగదా!

ఇట్లు నీవు నాకు చెప్పిన నీ స్వాభావికమగు ఐశ్వర్యమును అనంత కల్యాణగుణసంపత్తిని వాస్తవముగానున్నదియున్నట్లే చెప్పితివనియే భావించుచున్నానుగాని స్తోత్రమాత్రమని తలంచుట లేదు. కావున ఓదేవా! పరిమిత జ్ఞానముగల దేవతలున్ను దానవులున్ను నిన్ను తెలుపురీతిని యెఱుంగరు.

పురుషోత్తమా! సకల భూతములను పుట్టించువాడవును, నియమించువాడవును, సౌందర్యసౌశీల్యాది కళ్యాణగుణములచే దేవతలకు దేవతయైనవాడవును అగు నీవే నిన్నెఱుంగుదువు. ఓ జగత్ప్రభూ! నీకు మాత్రమే చెల్లదగిన నీ విభూతులు దివ్యము లైనవిగాన, యేయే నియమన

విశేషములతో కూడియుండి నియంతవై యీ లోకములను వ్యాపించి యున్నావో వాటిని చెప్పదగినవాడవుకూడా నీవే. భక్తి యోగనిష్ఠుడనగు నేను భక్తిలో నిన్ను ధ్యానింపదలచితిని గాన కళ్యాణగుణములతో గూడిన నిన్నెట్లెరుంగవలయునో తెలుపుము. వెనుక చెప్పిన బుద్ధి, జ్ఞానాదుల కంటె నితరమగు నేయే భావములయందు నిన్ను నియన్తగా చింతింపవలెనో చెప్పుము.

ఇదివరకు 'అహం సర్వస్య ప్రభవః' ఇత్యాదులతో నీ స్రష్టృత్వా ది గుణయోగమును నీ నియమనమును సంగ్రహముగా చెప్పితివి. వాటిని మరల విస్తరించిచెప్పుము. నీవు చెప్పుచున్న నీ మాహాత్మ్యము నాకు అమృతపానము చేయుచున్నట్లుండి ఎంతవిన్నను తృప్తి కలుగుటలేదు. ఆ సంగతి నీకే తెలియును కావున చెప్పుమని ప్రశ్నించెను.

6. ప్ర. **'అన్నివస్తువులు నేనే' యని వాటితో తనకు అభేదముగా చెప్పుటలో గల తారతమ్యమేమి ?**

ఉ. సకల భూతములున్ను భగవంతునికి శరీరమువంటివి. వాటి హృదయములయందు భగవంతుడు అంతరాత్మగానున్నాడు. ఆత్మ యనగా- శరీరమునకు ఆధారము, నియామకము, శేషియు నగువాడు. ఇట్టివాడే ఆ భూతములకు ఉత్పత్తి, స్థితి, లయ కారకుడు. ఇట్లాత్మగా నుండుటచేతనే 'ఆ వస్తువులు నేనే' యని తనతో నభేదముగా చెప్పుట తగుచున్నది. భగవంతుడాత్మగా నున్ననేకదా శరీరమును చెప్పెడు పేరులన్నియు ఆత్మ యగు నతనియందు పర్యవసించును.

ఒక వస్తువును ఎల్లప్పుడును విడువక పట్టియుండు విశేషణములకు అపృథక్సిద్ధ విశేషణములని పేరు. అట్టివిశేషణములను చెప్పెడు శబ్దములు ఆ విశేషణములద్వారా ఆ విశేష్యమును చెప్పును. ఆత్మకు శరీరము విడువని విశేషణము (అపృథక్సిద్ధ విశేషణము) కావున ఆ శరీరమును చెప్పెడు దేవ మనుష్యాది సామాన్య శబ్దములు, రాముడు రంగడు మొదలగు విశేష శబ్దములు, ఆ శరీరములను ఆ యాత్మలను కూడ చెప్పును. ఇందు ఆ శరీరములనే చెప్పుట గౌణము. ఆత్మలను చెప్పుట ముఖ్యము. అట్లే చేతనా చేతనములన్నియు పరమాత్మ కట్టి విడువని విశేషణములు, అనగా శరీరములు. భగవంతుడు వాటికి అంతరాత్మ, కావున ప్రపంచములో ఏ శబ్దమును ప్రయోగించినను అది ఆ విశేషణమగు వస్తువును అప్రధానముగాను,

విశేష్యమగు అంతరాత్మయైన శ్రియః పతిని ప్రధానముగాను చెప్పును. కావుననే యీ యధ్యాయమున భగవంతుడు ఆయా వస్తువులన్నియు నేనేనని చెప్పుచున్నాడు.

7. ప్ర. భగవంతు డర్జునున కుపదేశించిన విభూతులేవి? వాటినే ప్రధానముగా పేర్కొనుటలో గల విశేషమేమి?

ఉ. అదితిపుత్రులు పన్నెండుగురిలో పన్నెండవవాడు విష్ణువు. 'విష్ఌవ్యాప్తౌ, విశ-ప్రవేశనే' యనుధాతువులవలన ఈ విష్ణు శబ్దము పుట్టినది. అంతటను వ్యాపించి నిండియుండు వాడు. అన్నిటిలోను ప్రవేశించియుండు వాడని యర్థము. విష్ణువను అదితి పుత్రుడు అట్టివాడు కావున ఆ పన్నెండుగురిలో నాతడే గొప్పవాడుగా పరిగణింపబడుచున్నాడు. వెలుగునిచ్చు పదార్థములలో సూర్యునికి మించిన వస్తువులేదు. అట్టివారు పన్నెండుగురు కలరు. ఆ పన్నెండుగురును రవిశబ్దముచేతనే చెప్పబడుదురు. కావున ఆ రవిసముదాయ మిచ్చట భగవంతుని విభూతిగా చెప్పబడినది. నక్షత్రములకు పతి చంద్రుడు గావున నక్షత్రములలో చంద్రుడు తానని చెప్పెను. నాలుగు వేదములలో ప్రధానమగుటచేతను, వేయి శాఖలు కలిగియుండుటచేతను ఉపాసనలో గుణములకే ప్రాధాన్యము నిచ్చు దహర విద్యను తెలుపుచున్న ఛాందోగ్యోపనిషత్తు శిరస్సుగా కలదగుటచేతను సామవేదమును గానలోలుడగు సర్వేశ్వరుడు ప్రధానముగా జెప్పెను. "తస్మాద్వా ఇంద్రోఽతితరా మివ అన్యాన్ దేవాన్ సహ్యేన న్నేదిష్ఠం పస్పర్శ సహ్యేన త్ప్రథమం విదాం చకార బ్రహ్మేతి (కేన)" అనునట్లు దేవతలలో నుత్కృష్టుడగుటచే ఇంద్రుడు ప్రధానముగా చెప్పబడెను. ఆప్తబంధువువలె నాత్మ నుద్ధరించుటకును, ప్రాణశత్రువువలె ఆత్మ నధోగతిపాలు చేయుటకును ప్రధాన సాధనము మనస్సగుటచే ఇంద్రియములలో మనస్సు విభూతిగా చెప్పబడెను. భగవద్భక్తులలో శంకరుడు ప్రధానమైన వాడగుటచేతను తన భక్తులకు సుఖప్రదుడను సార్థకనామము కలవాడగుటచేతను రుద్రులలో నాతడు ప్రధానముగా చెప్పబడెను. కుబేరుడు అనేక ధనాగారములకు ప్రభువున్ను శంకరుని ప్రియమిత్రుడున్ను, యక్ష రాక్షసులకు ప్రభువున్ను అగుటచే నాతడు ప్రధానముగా చెప్పబడెను. మేరువునకు ప్రశస్తమైన రత్నమయమగునట్టియు బంగారు వికారమైనట్టియు గొప్ప శిఖరములుండుటచే శిఖరములు గల కొండలలో గొప్పదిగా చెప్పబడెను. బృహస్పతి యనగా

బృహతాం పతిః = గొప్పవారని పూజింపబడు దేవతలకు హితాహితములను బోధించి పాలించు గురువు. అట్టివాడై దేవతలకు పురోహితుడును వాక్పతియు కావుననే బృహస్పతికి పురోహితులలో ప్రాశస్త్యము చెప్పబడినది. ఉన్న ముప్పదిమూడు కోట్ల దేవతలలో నెవ్వరును సంహరించలేని తారకాసురుని సంహరించుటకు దేవతలచే ప్రబల ప్రయత్నము గావింపబడి పార్వతియందు పరమేశ్వరునిచే పుట్టింపబడి దేవ సేనకు నాయకత్వమును వహించి వానిని జయించెను గాన సేనాధిపతులలో కుమారస్వామి గొప్పవాడుగా చెప్పబడెను. ప్రవహించక స్థిరముగా నుండు జలాశయములలో వైశాల్య గాంభీర్యములలో సముద్రమును మించినదిలేదు. కావున అది వాటిలో ప్రధానముగా చెప్పబడెను. దేవతలలో గొప్పవారెవరని ఋషులలో సంశయ ముదయించి తత్పరీక్షార్థమై భృగుమహర్షిని పంపగా నాతడందరిదేవతలను పరీక్షించి చివరకు శ్రీ మహావిష్ణువే గొప్పవాడని నిర్ణయించుటచేతను, సాక్షాల్లక్ష్మికి తండ్రియగు అతిశయముచేతను మహర్షులలో 'భృగువు' గొప్పవాడుగా పేర్కొనబడెను. అర్థవత్తరమగు శబ్దములలో హరిశబ్దముతో చేర్చి యుచ్చరింపబడుట చేతను, సర్వోత్కృష్టుడగు శ్రీమన్నారాయణుని సాక్షాత్తుగా చెప్పునదగుట చేతను, భగవంతుడు గీతలో 'ఓమిత్యే కాక్షరం బ్రహ్మ వ్యాహరన్ మా మనుస్మరన్' అని తానే ఆ ప్రణవముచే చెప్పబడుదునని చెప్పుటచే నా ప్రణవమే గొప్పదిగా పరిగణింపబడెను. శాస్త్రోక్తములగు యజ్ఞములన్నింటికంటె జపయజ్ఞము పదిరెట్లు ఉత్తమమని చెప్పబడినది. తరచుగా యజ్ఞములు హింసామయములుగా నుండును. దీనియందట్టి దోషములేదు. ఆ యజ్ఞములు దుఃఖమిశ్రమైన అల్పమగు ఫలములే యివ్వగలవు. జపయజ్ఞ మిచ్చు ఫలము అపారము. సుఖప్రదము. యజ్ఞములకు అధికారి నియమము గలదు. జపయజ్ఞమునకా నిర్బంధము లేదు. యజ్ఞములు క్రియాకలాప బహుళములగుటచే మనశ్చాంచల్యమునకు కారణములగును. జపయజ్ఞమున కట్టి యాపద లేకుండుటయేగాక అర్థానుసంధాన తదధిష్ఠానదేవతాధ్యానాదులచే మనస్సు నిలకడగా నుండు గొప్ప అవకాశముగలదు. అందుచే నిది యజ్ఞములలో శ్రేష్ఠముగా పేర్కొనబడెను. అష్టాక్షరీమంత్ర ప్రదాతయగు శ్రీమన్నారాయణుడు స్థిరవాసమును కల్పించుకొనుట చేతను, శ్రీకృష్ణుడు ఉద్ధవునకు కలిదోష బారినుండి తప్పించుకొని నిత్య భగవత్సాన్నిధ్యమున కవకాశ మొసంగు స్థానముగాన అచ్చట నివసించుమని ఆజ్ఞనిచ్చుటచేతను, బ్రహ్మాది దేవతలకందరకును, ఋషులందరకు తపోభూమి యగుటచేతను,

పెక్కు యజ్ఞములకు స్థావరమగుటచేతను సామాన్య పర్వతములలో 'హిమవత్పర్వతము' గొప్పదిగా లెక్కింపబడినది. దేవవృక్షమగు పారిజాతాది వృక్షముల కంటెను పూజనీయమై చిగురు బెరడు ఎండుకొమ్మ ఆకులు మొదలగు భాగములన్నియు పవిత్ర కార్యముల కుపయోగింపబడుటచేతను చెట్లలో రావిచెట్టు ఉత్కృష్టమైనదిగా గణింపబడెను. నారదుడు నారాయణ పరత్వమును చాటుచు నిరంతరము లోక మంగళమునకై భగవద్గుణముల గానము చేయుచు నిరాఘాటముగా నన్ని లోకములలో తిరుగు భక్తుడగుటచే దేవర్షులలో నుత్తముడుగా జెప్పబడెను. ఇతని యతిశయము మహా భారతమున పెక్కు స్థలములలో పెక్కురీతులుగా ప్రశంసింపబడెను. కపిలుడు ఆదివిద్వాంసుడనియు, సిద్ధుడనియు, వాసుదేవుని సనాతనమగు అవతారమనియు ఇతిహాస పురాణాదులలో చెప్పబడుటయేగాక 'ఋషిం ప్రసూతం కపిలం మహాన్తం' అని వేదములలో కూడ కొనియాడబడుటచే సిద్ధులలో కపిలుడుత్తముడుగా చెప్పబడెను. సముద్ర మథనావసరమున దిగ్గజమగు ఐరావతమున్ను, ఉచ్చైశ్శ్రవమున్ను అమృత లక్ష్ములకు తోడబుట్టి శ్రియఃపతిచే ప్రశంసాపురస్సరముగ దేవేంద్రునికి ప్రధాన వాహనములుగా ప్రసాదింపబడినవి. గాన నాయా జాతులలో నవి గొప్పవిగా నెంచబడినవి. ఇతర ఆయుధములన్నియు ప్రాణిసంహారమునకే ఉపయోగపడినవి గాని వజ్రము – రెక్కలతో నెగిరి గ్రామముల నుగ్గుచేయు పర్వతముల రెక్కలు ఛేదించుటకై ఉపయోగింపబడినది గావునను, మహా తపశ్శాలియైన దధీచి ఎముకలచే వృత్రాసుర సంహారార్థము నిర్మింపబడినదగుట వేతను సాధారణాయుధములలో నిది గొప్పదిగా పరిగణింపబడినది. (వజ్రమును మించినది లేదుగదా). ఆవులు పాలనే యిచ్చునుగాని కోరిన కోరికలనన్నిటిని ఈయజాలవుగదా. కావున కామధేను వట్టిసామర్థ్యము కలదగుటచే ఆవులలో నుత్తమమైనదిగా చెప్పబడెను. ప్రాణుల పుట్టుకకు కారణము మన్మథుడు. అది యాతని యసాధారణ అతిశయము. దాని నాతనికి ప్రసాదించినది భగవంతుడే గావున అతనిని తన విభూతిగా పరమాత్మ చెప్పుచున్నాడు. తన కుమారుడే గదా! సర్పములనగా నొకతలగల పాములు. అందు వాసుకి, తనను దేవ దానవులు మంథరమునకు చుట్టి తమ బలమునంతను ఉపయోగించి మథించినను తట్టుకొనగల సామర్థ్యమును కలది కావునను, అమృతలక్ష్మి ప్రభృతి మహత్తరపదార్థములు పుట్టుటకు సాధనమగుట వలనను సర్పములలో వాసుకి గొప్పదిగా చెప్పబడెను. నాగములనగా పెక్కుతలలు గల పాములు.

వాటిలో తన సర్వావయవములను సర్వకాలములయందును సర్వేశ్వరుని సర్వవిధకైంకర్యములయందును వినియోగించుటచే నాదిశేషుడు శ్రేష్ఠముగా లెక్కింపబడెను. జలజంతువులన్నిటికి వరుణుడు ప్రభువగుటచే నాతడు వాటిలో నుత్తముడుగా జెప్పబడెను. అర్యముడు పితరులకు రాజు. కావున వారిలో నాతడు శ్రేష్ఠుడు. అపరాధానుగుణముగా శిక్షించు రాజాదు లందరికంటెను ఎన్నడును ఎవరిపట్లనైనను న్యాయమును తప్పక శిక్షించు నేర్పు గలవాడు యమధర్మరాజుగాన నాతడు గొప్పవాడని పేర్కొనబడెను. ఒక్కొక్కసద్గుణమున కొక్కొక్క మహాపురుషుడు ఉపమానముగా పేర్కొనబడును. సత్పురుషుల అన్ని సద్గుణములకును రాక్షసకులమున బుట్టినను ఒక్క ప్రహ్లాదుడే ఉపమానముగా చెప్పదగియుండుటచేతను, దుర్భర హింసలకైనను తన ప్రాణత్యాగమునకైనను సంసిద్ధుడై, లోకభయంకరుడగు హిరణ్యునకు తన ఆస్తికసిద్ధాంతముల నుపన్యసించి, నాస్తికత్వమును ఖండించి నృసింహావిర్భావమునకు నిదానమైనవాడుగాన దితిపుత్రులలో ప్రహ్లాదుడు గొప్పవాడుగా పరిగణింపబడెను. మరణముకంటె మానవున కనర్థమేమున్నది ? అట్టి యనర్థములను కలుగజేయు ప్రాణికోటులన్నింటిలోను మృత్యువును మించినది లేదు. కావున నదియే విభూతిగా నిచ్చట చెప్పబడినది. వేగాతిశయము కలవాడగుటచేతను, వేదమయుడగుటచేతను, భగవంతుని సాధుపరిత్రాణ దుష్టశిక్షణాది వ్యాపారములకు వాహనముగా నిత్యసన్నద్ధమై యుండుటచేతను, గరుడుడు పక్షులలో నుత్తముడుగా నెన్నబడెను. నిరంతర సంచారులలో వాయువును మించినది లేదు. నక్షత్ర గ్రహాదులును వాయువుచే ప్రేరేపింపబడియే ప్రవర్తించును. కావున వాయువును తన విభూతిగా చెప్పెను. శస్త్రధారులందరికంటెను గొప్పవాడైన పరశురాముని జయించినట్టియు రావణహంత యగునట్టియు శ్రీరామచంద్రునిమించినవారు లేరు. గావున రాముడుత్తముడుగా చెప్పబడెను.

ప్రవహించు నదులలో శ్రీమహావిష్ణు పాదములనుండి పుట్టుటచేతను, జ్ఞానాధికుడగు నీశ్వరునిచే శిరస్సున ధరింపబడిన దగుటచేతను, మూడులోకములను పవిత్రము గావించుచు ప్రవహించుటచేతను గంగానది గొప్పదిగా చెప్పబడినది. జ్ఞానప్రదములగు చదువులన్నిటిలోను పర, జీవ, ఉపాయ, ఫల, విరోధుల వాస్తవరూపము నెఱింగించునట్టి వేదాంతవిద్య ఎరుంగదగిన అర్థములను తెలుపుటచేతను, మోక్షమనబడు పురుషార్థమును

ప్రసాదించుటచేతను ఉత్తమమైనదిగా చెప్పబడినది. జల్పము, వితండము, వాదము అను వాటిలో మొదటి రెండును అల్పఫలము కలవి. వాదముమాత్రము తత్త్వనిర్ణయమునకై చేయబడు ప్రసంగముగుటచే సర్వోత్కృష్టమైన మోక్షమున కుపయోగించునది గాన ప్రధానమైనది. అక్షరములన్నిటికి అకారము కారణము. దానినుండియే ప్రణవము పుట్టుచున్నది. ఆ ప్రణవమునుండియే వేదములు వ్యక్తములగుచున్నవి. ఆ వేదశబ్దముల వలననే దేవాది చతుర్విధ భూతములు పుట్టుచున్నవి. ఇట్లు వాచకము లన్నిటికిని, వాచ్యములన్నిటికిని కారణమగుటచేతను, 'అవ రక్షణే' యను ధాతువువలన పుట్టి నిరుపాధికరక్షకుడగు సర్వేశ్వరుని చెప్పునదగుటచేతను, సర్వశబ్దములకు తాను కారణమై సర్వార్థములకు కారణమగు నారాయణుని చెప్పునదగుటచేతను అకారము అక్షరములలో నుత్తమముగా పరిగణింపబడినది. కొన్ని సమాసములలో ఉత్తరపదములకును, కొన్నిటిలో పూర్వపదములకును, కొన్నిటిలో బహిర్భూత పదములకును మాత్రమే ప్రాధాన్యము చెప్పబడి ద్వంద్వసమాసములో మాత్రము ఆ సమాసములోని అన్ని పదములకు ప్రధానార్థము స్వీకరింపబడుటచేత ద్వంద్వసమాసము సమాసములలో నుత్తమముగా చెప్పబడెను.

నాలుగు వేదములను నాలుగు ముఖములచే నిరంతరము నుచ్చరించు చుండుటచే చతుర్ముఖునకు పంచముఖ షణ్ముఖాది బహుముఖులకంటె అతిశయము చెప్పబడినది. స్త్రీలలో సర్వ సమాశ్రయణీయురాలును, పరమపురుషుని పట్టమహిషియు, పురుషకారమునకు తగిన గుణగణములు కలదియు నగుటచే లక్ష్మియు, కీర్తి కొఱకై సర్వస్వమును సమర్పించుట లోక రివాజుగాన కీర్తియు, భగవంతుని కల్యాణగుణముల నను సంధించి ముక్తిని పొందుటకు ప్రధానకారణమగుటచే వాక్కును, ఉత్తమగుణములగుట చేతను, భగవదసాధారణశక్తి విశేషమగుట చేతను స్మృతి మేధా ధృతి క్షమాదులును ఉత్తమమైనవిగా పరిగణింపబడినవి. ఛందోబద్ధమగు మంత్రములలో "సంధ్యాహీనోఽశుచి ర్నిత్యం అనర్హస్సర్వకర్మను" అని వేదాధ్యయన యోగ్యతయు, దానిమూలమున భగవదారాధనాది సమస్త ఆత్మోజ్జీవన హేతుభూతములగు కర్మలకు అధికారము నాపాదించునది గాయత్రీమంత్రమే గాన నది శ్రేష్ఠముగా జెప్పబడినది. మార్గశిర మాసము మొదలు మాఘమాసమువరకు గర్భోదకకాలముగా పరిగణింపబడుటచే మార్గశిరమాసము వర్ష గర్భాధానకాలముగా పరిగణింపబడుచున్నది.

మార్గశిరమాసము మాసాధిదేవతలగు కేశవాదులలో మొదటివాడగు కేశవుడు అధిదేవతగా కలదగుటచేతను, వ్రతములన్నిటికిని ప్రారంభకాల మగుటచేతను, దేవతలకు రాత్రియగుటచే అనధ్యయనముగా పరిగణింపబడిన దక్షిణాయనకాలమునకు అవసానమును, దేవతలకు పగలుగా పరిగణింపబడుటచే అధ్యయనకాలముగా పరిగణింపబడు ఉత్తరాయణ పుణ్యకాలమునకు ప్రారంభమును అగుటచే నీ మానము బ్రహ్మముహూర్తమనబడు ఉషఃకాలముగా పరిగణింపబడుటచేతను గొప్పదిగా పరిగణింపబడెను. 'కుసుమాకరః' వసంతఋతువు. ఇది సర్వ ప్రాణులకును సుఖహేతు వగుటచేతను, భగవదారాధన కుపయోగించు సకల పుష్ప ఫలాదుల నొసగుటచేతను, ఉత్తమమైనదిగా పరిగణింపబడెను. ద్యూతము పర ద్రవ్యముల పరిగ్రహించు సాధనము. ఇది పెక్కురీతులుగా నుండును. అందు ప్రాణహీనములగు పాచికలతో నాడు యీ జూదము ధర్మమునకు కట్టుబడి ఎదిరిని ఒప్పించి అనాయాసముగా రక్త పాతాది రూపమైన హింసలు లేకయే సమస్తధనముల నార్జించు సాధనమగుటచే శ్రేష్ఠముగా నెన్నబడెను.

వృష్ణియనబడు యాదవవంశములో ననేకులు పుట్టినను చతుర్భుజములతో నవతరించుట మొదలు, పూతనా సంహారాది యతిమానుష గుణములును, దివ్యమంగళ విగ్రహమును, అతిమానుష పరాక్రమమును ప్రదర్శించినవాడు తానే గావున తననే యొక విభూతినిగా చెప్పెను. అర్జునుడీ సంగతి నెఱింగియున్నను దృష్టాంతముగా దీనిని దెల్పెను. పాండవులలో జితేంద్రియత్వమునకు, పరాక్రమమునకు, గీతవంటి అద్భుత రహస్య గ్రంథమును వినుటకు ధనుర్ధారులలో అర్జునుడు ప్రసిద్ధమైనవాడుగాన ఆతనిని తన విభూతినిగా వర్ణించెను. మననముచేసి వస్తువుయొక్క వాస్తవస్వరూపము నెఱుంగు వారలలో వ్యాసమహర్షి, సకల శాస్త్రములను తన బుద్ధిచే మథించి నారాయణు డొక్కడే ధ్యానించతగినవాడని నిశ్చయించుటచేతను, సకల రహస్యములను లెస్సగ నెఱింగినవాడగుటచే వసిష్ఠుని మించినవాడని ప్రశంసింపబడుటచేతను, భగవంతుని విభవావతారములలో తా నొక యవతార మగుట చేతను, వేదవిభాగమును గావించియు బ్రహ్మసూత్రములను రచించియు పురాణములను ప్రకటించియు లోకమునకు జ్ఞానప్రదీపమును ప్రసాదించినవాడగుటచేతను, ఇవిగాక 'సహోవాచ వ్యాసః పారాశర్యః' అని వేదములచే కూడ ప్రశంసింపబడిన వాడగుటచే వ్యాసుడు పరమాత్మయొక్క విభూతిగా చెప్పబడెను.

అతీంద్రియార్థముల దర్శించు యోగులలో నీతినిపుణుడగుటచే శుక్రుడు ఉత్తముడుగా చెప్పబడెను. రహస్యములు అషట్కర్ణములు అనగా మూడవవాడు వినరానివి. అట్టివాటిని బయలు పరచక యుంచుటకు మౌనమునకు మించిన ఉపాయము లేదు. అందుచే దానిని గుహ్యములలో శ్రేష్ఠముగా చెప్పెను. జ్ఞానులలో చరమపురుషార్థమున కుపకరించు జ్ఞానవిశేషము శ్రేష్ఠము. కావున దానిని విభూతినిగా పేర్కొనెను.

అన్ని యవస్థలలో నున్నట్టి అన్ని భూతములకును కనిపించిననూ కనుపించకున్నను ఆయా యవస్థలకు బీజమును నేనే. నేనంతరాత్మగా లేనట్టి వస్తువు యీ చరాచరములలో నేదియు లేదు. అన్ని వస్తువులున్ను అన్ని యవస్థలలోను నన్నాత్మగా కలిగియే యుండితీరును. కావుననే అన్నియు నే ననుట సమంజసమగుచున్నది.

ఇట్లు భగవద్విభూతు లెంతకాల మెందరు చెప్పినను తరుగునవికావు. కావున పరమాత్మ వాటిని కొన్ని ఉపాధులలో సంగ్రహముగాచెప్పెను. ఉపాధు లనగా – ఒకజాతి కొక శ్రేష్ఠమైనదానిని జూపి చెప్పుట.

నా విభూతిగా జెప్పబడినట్టియు, మిక్కుటమగు కాంతి కలిగినట్టియు (ధన ధాన్యసమృద్ధి కలిగినట్టియు), మంగళకార్యములలో నుద్యుక్తమైనట్టి ప్రతివస్తువున్ను పర్వతముల · నూపగల గాలికి, గడ్డిపరకను కదల్చుట కెంతవేగము కావలెనో అంతమాత్రపు నియమనశక్తి లేశముతో పుట్టుచున్నదని తెలుసుకొనుము.

ఇట్లు విస్తారముగా చెప్పుటచే నేమిలాభము? సంగ్రహముగా చెప్పెదను. కార్యావస్థలో స్థూలముగాగాని, కారణావస్థలో సూక్ష్మముగా గాని యుండు చిదచిదాత్మక జగత్తంతయు స్వరూప స్థితి ప్రవృత్తులయందు నా సంకల్పము నతిక్రమింప కుండునట్లు నా నియమనశక్తిలోని పెక్కు వేల భాగములలో నొక్క భాగముతో నిలిపియున్నాను అని చెప్పెను.

ఏకాదశాధ్యాయార్థ సంగ్రహము

శ్లో. ఏకాదశే స్వయాథాత్మ్య । సాక్షాత్కారావలోకనమ్ ।
దత్త, ముక్తం విధిప్రాప్త్యో । ర్భక్త్యేకోపాయతా తథా ।

అర్థము: స్వయాథాత్మ్య సాక్షాత్కారావలోకనం, స్వ = తన స్వరూపము యొక్క, యాథాత్మ్య = నిజస్థితిని, సాక్షాత్కార = దర్శించుటకుగాను, అవలోకనం = దివ్యచక్షుస్సు, దత్తం = ఇవ్వబడెను, తథా = ఆ ప్రకారముగానే విధిప్రాప్త్యోః = తనను తెలుసుకొనుటకును, పొందుటకును, భక్త్యే కోపాయతా = భక్తి యొక్కటే ఉపాయమగుటయును, ఏకాదశే = ఏకాదశాధ్యాయమున, ఉక్తం= చెప్పబడినది.

తా॥ పదునొకండవ యధ్యాయమున నర్జునునకు భగవంతునిచే తనను నిజరూపుతో జూచుటకు సాధనమగు దివ్యనేత్ర మొసంగబడెననియు, తనను లెస్సగ నెఱుంగుటకును, పొందుటకును, ముఖ్యసాధనము భక్తియే యని ఉపదేశింప బడెననియు చెప్పబడెను.

శ్రీమద్భగవద్గీతా - ఏకాదశాధ్యాయము

విషయ సూచిక

శ్లోక సంఖ్య

శ్రీ హయగ్రీవాయనమః

శ్రీమద్భగవద్గీతా - ఏకాదశోఽధ్యాయః

విశ్వరూప సన్దర్శన యోగః

అవ. అర్జును డింతవరకు భగవంతుని వలన వినినదాని యందు విశ్వాసముంచి యట్టి భగవంతుని కన్నులార చూడగోరి యడుగు చున్నాడు. ఈ శ్లోకము మొదలు
మూడు శ్లోకముల వరకు తనకు గల కృతజ్ఞతను, ఆస్తిక్యమును,
భక్తి కలిగి యుండుటను తెలుపుచున్నాడు.

అర్జున ఉవాచ = అర్జునుడు పలికెను.

1. శ్లో. మదనుగ్రహాయ పరమం। గుహ్యమధ్యాత్మసంజ్ఞితమ్ ।
యత్త్వయోక్తం వచస్తేన । మోహోఽయం విగతో మమ ॥

అర్థము : మదనుగ్రహాయ = నన్ను అనుగ్రహించుట కొఱకు, పరమం = మిక్కిలి, గుహ్యం= రహస్యమైనదియు, ఆధ్యాత్మసంజ్ఞితం = ఆత్మనుగూర్చి చెప్పదగిన, యత్ వచః= ఏ మాట, త్వయా = నీచేత, ఉక్తం = చెప్పబడెనో, తేన = ఆమాటచే, మమ = నా యొక్క, అయం = ఈ, మోహః = అజ్ఞానము, విగతః = తొలగిపోయినది.

తా ॥ దేహాత్మాభిమాన మోహితుడనగు నన్ననుగ్రహించుటకొఱకు నీవు ఆత్మ స్వరూపమును గూర్చి చెప్పదగిన పరమరహస్యము నంతను చెప్పితివి. దానిచే నా యజ్ఞానమంతయు నంతరించినది.

(ఇది మొదటి షట్కార్థ సంగ్రహము)

అవ. ఏడవ యధ్యాయము మొదలు పదియవ యధ్యాయము వరకు గావించిన ఉపదేశమును సంగ్రహించి చెప్పుచున్నాడు.

2. శ్లో. భవాప్యయౌ హి భూతానాం। శ్రుతౌ విస్తరశో మయా।
త్వత్తః కమల పత్రాక్ష! । మాహాత్మ్యమపి చావ్యయమ్ ।

అర్థము : కమల పత్రాక్ష! = తామరల వంటి విప్పారిన నేత్రములు కల శ్రీకృష్ణా! భూతానాం = సకలప్రాణులకును, త్వత్తః = నీ వలన కలుగునట్టి, భవాప్యయౌ= పుట్టుకచావులు, మయా = నా చేత, విస్తరశః = సవిస్తరముగా, శ్రుతౌహి =

వినబడినవిగదా! అవ్యయం = నాశములేని, మాహాత్మ్యం అపి = నీ మహిమకూడ, (శ్రుతం = వినబడెను)

తా ॥ నీవు సమస్తభూతముల చావుపుట్టుకలకు కారణమగుటను విస్తరించి చెప్పితివి. మరియు నేను నీ వలన నీ యొక్క అపరిమితమైన మాహాత్మ్యమును కూడ సమగ్రముగ వింటిని. (ఇది ఏడు ఎనిమిది తొమ్మిది పది యధ్యాయముల అర్థసంగ్రహము)

అవ. వినిన యర్థమునందు తనకు కలిగిన విశ్వాసమును సహేతుకముగ సూచించుచున్నాడు.

3.శ్లో. ఏవ మేత ద్యథాఽఽత్థత్వ మాత్మానం పరమేశ్వర !।
ద్రష్టు మిచ్ఛామి తే రూప మైశ్వరం పురుషోత్తమ! ॥

అర్థము : పరమేశ్వర! = శ్రీకృష్ణా! త్వం = నీవు, ఆత్మానం = నిన్ను గూర్చి, యథా = ఏ ప్రకారముగా, ఆత్థ = చెప్పితివో, ఏతత్ = ఇది, ఏవం ఇతి = ఇట్లేయని (అవధృతం= నిశ్చయింపబడెను) పురుషోత్తమ! = కృష్ణా ! తే = నీ యొక్క, ఐశ్వర్యం = ఈశ్వరాసాధారణమైన, రూపం = స్వరూపమును, ద్రష్టుం = చూచుటకు, ఇచ్ఛామి = కోరుచున్నాను.

తా ॥ కృష్ణా ! నిన్ను గూర్చి నీవు చెప్పినదంతయు నిజమని నమ్మితిని. ఈశ్వరుడవగుటచే నీకు మాత్రమే సంబంధించిన నీ విశ్వరూపమును సాక్షాత్కరించ గోరుచున్నాను.
(పరమేశ్వర, పురుషోత్తమ సంబోధనలు విశ్వాసమునకు కారణమగు ఆస్తికతమత్వమును సూచించుచున్నవి.)

అవ. అర్జునుడు శ్రీకృష్ణుని విశ్వరూపమును జూపుమని సవినయముగ ప్రార్థించుచున్నాడు.

4. శ్లో. మన్యసే యది తచ్ఛక్యం ! । మయా ద్రష్టుమితి ప్రభో ।
యోగేశ్వర! తతో మే త్వం । దర్శయాత్మాన మవ్యయమ్ ।

అర్థము : ప్రభో = స్వామీ ! తత్ = ఆ రూపము. మయా = నాచేత, ద్రష్టుం = చూచుటకు, శక్యం(ఇతి) = సాధ్య(మని), మన్యసే యది = తలంతువేని, తతః = అటుపిమ్మట, యోగీశ్వర ! = శ్రీకృష్ణా ! త్వం = నీవు, ఆత్మానం = నిన్ను, మే = నాకు, అవ్యయం = పూర్తిగా, దర్శయ = చూపుము.

తా ॥ ప్రభో ! శ్రీకృష్ణా ! ఆ రూపమును చూచుటకు నేను తగుదునని నీవు తలంతువేని నీవు నాకు దానిని సమగ్రముగా జూపుము.

అవ. ఇట్లతి కుతూహలముతో ఆనందపరవశుడై డగ్గుత్తికతో ప్రార్థించిన పార్థుని గూర్చి భగవంతు డామోదముతో నిట్లు పలికెను.

భగవానువాచ = భగవంతుడు చెప్పుచున్నాడు.

5. శ్లో. **పశ్య మే పార్థ ! రూపాణి । శతశోఽథ సహస్రశః ।**
నానావిధాని దివ్యాని । నానా – వర్ణా – కృతీనిచ ।

అర్థము : పార్థ ! = అర్జునా ! శతశః = నూరులకొలదియు, అథ = మరియు, సహస్రశః = వేలకొలదియు, నానావిధాని = అనేక విధములైన, దివ్యాని = అప్రాకృతములగు, నానావర్ణాకృతీని చ = అనేకరంగులును ఆకారములును గల, మే = నా యొక్క, రూపాణి = రూపములును, పశ్య = చూడుము.

తా ॥ అర్జునా ! నూరులకొలదియు, వేలకొలదియు అనేక విధములును అప్రాకృతములును అనేక రంగులును, అనేక ఆకారములును గల నా రూపములను చూడుము.

అవ. శ్రీకృష్ణుడు తాను జూపబోవు ప్రధానరూపములను పేర్కొనుచున్నాడు.

6. శ్లో. **పశ్యాదిత్యాన్ వసూ న్రుద్రా, నశ్వినౌ మరుత స్తథా ।**
బహూ న్యదృష్ట పూర్వాణి । పశ్యా శ్చర్యాణి భారత ! ।

అర్థము : భారత ! = అర్జునా ! ఆదిత్యాన్ = సూర్యులను, వసూన్ = వసువులను, రుద్రాన్ = రుద్రులను, అశ్వినౌ = అశ్వినీదేవతల నిరువురును, మరుతః = మరుత్తులను, పశ్య= చూడుము, తథా = అట్లే, అదృష్టపూర్వాణి = ఇదివరకెన్నడును చూడని, బహూని = అనేకములగు, ఆశ్చర్యాణి = అద్భుతములను, పశ్య = చూడుము.

తా ॥ అర్జునా ! ద్వాదశాదిత్యులను, అష్టవసువులను, పదునొకండుగురు రుద్రులను, ఇద్దరశ్వినీకుమారులను, నలుబదితొమ్మిది మరుద్గణములను, ఇట్లే యిదివరకెన్నడును కనివినియెఱుంగని ఆశ్చర్యములను చూడుము.

7. శ్లో. **ఇహైకస్థం జగత్కృత్స్నం । పశ్యాద్య సచరాచరమ్ ।**
మమ దేహే గుడాకేశ ! । య చ్చాన్యద్ద్రష్టు మిచ్ఛసి ।

అర్థము : గుడాకేశ ! = అర్జునా ! సచరాచరం = జంగమస్థావరములతో గూడిన, కృత్స్నం=

సమస్తమైన, జగత్ = ప్రపంచమునున్ను, అన్యత్ = ఇతరమగు, యత్ చ = ఇంకను దేనిని, ద్రష్టుం = చూచుటకు, ఇచ్ఛసి = కోరుచున్నావో (తత్ = దానిని) మమ = నా యొక్క, ఇహదేహే = ఈశరీరమునందే, ఏకస్థం = ఒకచోటనున్న దానినిగా, అద్య = ఇప్పుడు, పశ్య = చూడుము.

తా ॥ ఓ అర్జునా ! నా యొక్క దేహమునం దొకేభాగమున చరాచరాత్మకమైన సకల ప్రపంచముండుట నిప్పుడు చూడుము. ఇంకను నీవు దేనిని చూడగోరెదవో దానిని గూడ నిచ్చటనే చూడుము.

అవ. శ్రీకృష్ణుడర్జునునకు తాను జూపు విశ్వరూపమును జూచుటకు తగిన దివ్యనేత్రము నొసంగుదునని చెప్పుచున్నాడు.

8. శ్లో. న తు మాం శక్యసే ద్రష్టు, । మనేనైవ స్వచక్షుషా ।
దివ్యం దదామి తే చక్షుః । పశ్యమే యోగమైశ్వరమ్ ॥

అర్థము : అనేన = ఈ, స్వచక్షుషా ఏవతు = నీ ప్రాకృతమగుకంటితోనే, మాం = నన్ను, ద్రష్టుం = చూచుటకు, న శక్యసే = శక్తుడవుకావు, తే = నీకు, దివ్యం = అప్రాకృతమైన, చక్షుః = దృష్టిని, దదామి = ఇచ్చుచున్నాను, మే = నాయొక్క, ఐశ్వరం = ఈశ్వర అసాధారణమైన, యోగం = యోగమును, పశ్య = చూడుము.

తా ॥ ఈ నీ చర్మచక్షుస్సుతో నన్ను చూడజాలవు. కావున నీకు నన్ను జూచుటకు తగిన అప్రాకృతమైన దృష్టి నొసంగెదను. దానిచే నా కసాధారణమైన అనంత జ్ఞానాది యోగమును, విభూతియోగమును చూడుము.

అవ. చెప్పినటులనే తన విశ్వరూపమును జూపెనని సంజయుడు చెప్పుచున్నాడు.

సంజయ ఉవాచ :

9. శ్లో. ఏవ ముక్త్వా తతో రాజన్ ! । మహాయోగేశ్వరో హరిః ।
దర్శయామాస పార్థాయ । పరమం రూప మైశ్వరమ్ ॥

అర్థము : రాజన్ = ధృతరాష్ట్రా ! మహాయోగేశ్వరః = గొప్పయోగులకు ప్రభువగు, హరిః= శ్రీకృష్ణుడు, ఏవం = ఇట్లు, ఉక్త్వా = పలికి, తతః = అటుపైన, ఐశ్వరం = ఈశ్వరసంబంధమగు, పరమం = మిక్కిలి గొప్పదియగు, రూపం = రూపమును, పార్థాయ = అర్జునుని కొఱకు, దర్శయామాస = చూపించెను.

తా ॥ ధృతరాష్ట్రా ! మహదాశ్చర్యకరములగు, యోగములకు ప్రభువగు శ్రీ కృష్ణుడు ఇట్లు చెప్పి తన కసాధారణముగు, వివిధ విచిత్రమును నగు విశ్వమునకు నియామకమైన రూపమును అర్జునునకు జూపెను.

అవ. సంజయుడు తాను దర్శించిన విశ్వరూపమును ధృతరాష్ట్రునునకు వర్ణించి చెప్పుచున్నాడు.

10. శ్లో. అనేక వక్త్రనయన । మనేకాద్భుత దర్శనమ్ ।
అనేక దివ్యాభరణం । దివ్యానేకోద్యతాయుధమ్ ॥

అర్థము : అనేక వక్త్రకనయనం = అనేక ముఖములు నేత్రములు కలదియు, అనేకాద్భుత దర్శనం = అనేకములగు అద్భుతములైన దర్శనములు కలదియు, అనేక దివ్యాభరణం = అనేక దివ్యభూషణములు కలదియు, దివ్యానేకోద్యతాయుధం = అప్రాకృతములగు అనేకములైన ఎత్తబడిన ఆయుధములు కలదియునగు.

తా ॥ అనేక ముఖములును అనేక నేత్రములును కలదియు, నిరతిశయమై ఆశ్చర్యముగా జూడబడునదియు అనేక దివ్యాభరణములను ధరించి నదియు అప్రాకృతములైన అనేక ఆయుధములను ఎత్తిపట్టికొని యున్నదియునగు (రూపమును జూపెను.)

11. శ్లో. దివ్యమాల్యామ్బరధరం । దివ్యగన్ధానులేపనమ్ ।
సర్వాశ్చర్యమయం దేవ । మనన్తం విశ్వతోముఖమ్ ॥

అర్థము : దివ్యమాల్యామ్బరధరం = అప్రాకృతమైన పుష్పమాలికలను వస్త్రములను ధరించినట్టియు, దివ్యగన్ధానులేపనం = అప్రాకృతమైన సుగంధ మైపూత కలిగినట్టియు, సర్వాశ్చర్యమయం = ఆశ్చర్యకరములైన సకలతత్త్వములకు నాశ్రయమైనట్టియు, దేవం = ప్రకాశించుచున్నట్టియు, అనన్తం = దేశకాల పరిచ్ఛేదము లేనట్టియు, విశ్వతోముఖం = అన్ని ప్రక్కల ముఖములు కలిగినట్టియు.

తా ॥ అప్రాకృతమైన పుష్పమాలికలను బట్టలను ధరించినట్టియు, అప్రాకృతమైన సుగంధమై పూత కలిగియున్నట్టియు, ఆశ్చర్యకరములైన సమస్త తత్త్వములకు ఆశ్రయమైనట్టియు, ప్రకాశించునట్టియు, దేశ కాలపరిచ్ఛేదములు లేనట్టియు, అన్ని ప్రక్కల ముఖములు కలిగినట్టి (రూపమును జూపెను.)

అవ. విశ్వరూపముయొక్క అపరిచ్ఛిన్నమైన కాంతిని వర్ణించుచున్నాడు.

12. శ్లో. దివి సూర్యసహస్రస్య । భవే ద్యుగపదుత్థితా ।
యది భా స్సదృశీ సా స్యా । ద్భాస స్తస్య మహాత్మనః ।

అర్థము ః దివి = ఆకాశమునందు, సూర్యసహస్రస్య = వేయిమంది సూర్యులయొక్క, భాః= కాంతి, యుగపత్ = ఒక్కసారిగా, ఉత్థితా = బయలుదేరిన, భవేత్ యది = అయినచో, సా = అట్టికాంతి, తస్య = ఆ, మహాత్మనః = మహాత్మునియొక్క, భాసః= కాంతికి, సదృశీ = సాటియైనది, స్యాత్ = అగును.

తా ॥ ఆకాశమునందు వేయిమంది సూర్యులొక్కసారిగా నుదయించినపుడు పుట్టునట్టి కాంతి యున్నచో ఆ విశ్వరూపుని కాంతికి సాటికావచ్చును. (అభూతోపమా)

13. శ్లో. తత్రైకస్థం జగత్కృత్స్నం । ప్రవిభక్త మనేకధా ।
అపశ్య ద్దేవదేవస్య । శరీరే పాణవస్తదా ॥

అర్థము ః పాణ్డవః = అర్జునుడు, తదా = అప్పుడు, అనేకధా = పెక్కురీతులుగా, ప్రవిభక్తం= విభజింపబడిన, కృత్స్నం = సమస్తమైన, జగత్ = ప్రపంచమును, దేవదేవస్య = శ్రీకృష్ణుని యొక్క, తత్ర = ఆ, శరీరే = విశ్వరూపమునందు, ఏకస్థం = ఒకచోటున నున్నదానినిగా, అపశ్యత్ = చూచెను.

తా ॥ అప్పుడర్జును డా విశ్వదేహమున భోక్తృభోగ్యభోగోపకరణములుగా విభజింపబడిన జగత్తునంతను ఒక్కచోట నున్న దానినిగా సాక్షాత్కరించెను.

అవ. అట్టి రూపమును జూచినతోడనే యర్జునునకు కలిగిన మార్పును సంజయుడు ధృతరాష్ట్రునితో వర్ణించి చెప్పుచున్నాడు.

14. శ్లో. తత స్స విస్మయావిష్టో । హృష్టరోమా ధనఞ్జయః ।
ప్రణమ్య శిరసా దేవం । కృతాఞ్జలి రభాషత ।

అర్థము ః తతః = అటుపిమ్మట, విస్మయావిష్టః = ఆశ్చర్యముతో కూడియున్నట్టియు, హృష్టరోమా = రోమాంచము (గగుర్పాటు) కలిగినట్టియు, సః = ఆ యర్జునుడు, దేవం = శ్రీకృష్ణుని, శిరసా = తలతో, ప్రణమ్య = నమస్కరించి, కృతాఞ్జలిః = చేతులు జోడించుకొన్నవాడై, అభాషత = పలికెను.

తా ॥ అటుపిమ్మట అర్జునుడు మిక్కిలి ఆశ్చర్యముతో నొడలు గగురుపొడువ శ్రీకృష్ణుని సాష్టాంగముగ నమస్కరించి చేతులు జోడించి డగ్గుత్తికతో నాతనితో నిట్లు పలికెను.

అవ. అర్జునుడు విశ్వరూపమున తానుగాంచుచున్న విశేషములను వివరించుచున్నాడు.

అర్జున ఉవాచః

15. శ్లో. పశ్యామి దేవాంస్తవ దేవ దేహే । సర్వాం స్తథా భూత విశేషసఙ్ఘాన్ ।
బ్రహ్మాణ మీశం కమలాసనస్థంఋషీంశ్చ సర్వానురగాంశ్చ దివ్యాన్ ॥

అర్థము : దేవ ! = శ్రీకృష్ణా ! తవ = నీ యొక్క, దేహే = శరీరమునందు, సర్వాన్ = సమస్తమైన, దేవాన్ = దేవతలను, తథా = అట్లే, భూతవిశేషసఙ్ఘాన్ = అనేకరీతులగు ప్రాణిసమూహములను, బ్రహ్మాణం = చతుర్ముఖుని, కమలాసనస్థం = బ్రహ్మకు వశంవదుడైన, ఈశం = రుద్రుని, సర్వాన్ = సమస్తమైన, ఋషీన్ చ = ఋషులను దివ్యాన్ = ప్రకాశించుచున్న, ఉరగాన్ = పాములను, పశ్యామి = చూచుచున్నాను.

తా ॥ శ్రీకృష్ణా! నీ శరీరమునందు సకలదేవతలను, సమస్తప్రాణి సమూహములను, చతుర్ముఖబ్రహ్మను, బ్రహ్మఆజ్ఞానువర్తియగు రుద్రుని, సకల ఋషిపుంగవులను, ప్రకాశించు వాసుకి మొదలగు సర్పరాజములను చూచుచున్నాను.

16. శ్లో. అనేక బాహూదర వక్త్రనేత్రం । పశ్యామి త్వాం సర్వతోఽనన్త రూపమ్ ।
నాన్తం న మధ్యం న పునస్తవాదిం । పశ్యామి విశ్వేశ్వర ! విశ్వరూప !॥

..ర్థము : విశ్వేశ్వర ! = ప్రపంచమునకు ప్రభువగు, విశ్వరూప ! = విశ్వరూపధరా ! త్వాం= నిన్ను, అనేక బాహూదరవక్త్ర నేత్రం = అనేక భుజములు కడుపులు ముఖములు కన్నులు కలవానినిగాను, అనన్తరూపం = అంతములేని ఆకారములు కలవానినిగాను, సర్వతః = అంతటను, పశ్యామి = చూచుచున్నాను, పునః = తిరిగి, తవ = నీ యొక్క, ఆదిం = మొదలును, న పశ్యామి = చూడజాలక యున్నాను, మధ్యం చ = మధ్యభాగమునున్ను న (పశ్యామి) = చూడజాలకయున్నాను, అన్తం = తుదనున్ను, న (పశ్యామి) = చూడజాలకయున్నాను.

తా ॥ ప్రపంచమునకు నాథుడవగు ఓ విశ్వరూపధరా ! నిన్ననేక భుజములు కడుపులు, ముఖములు కన్నులు కలిగి ఇంతింతనరాని యాకారములు

కలవానినిగా నంతటను చూచుచున్నాను. పైగా నీ యాదిమధ్యాంతములు నాకు గోచరించుట లేదు.

అవ. ఎన్నడు నెఱుంగని రూపమును జూపినను ఆతని యసాధారణ చిహ్నములను గాంచి గుర్తించగలుగు చున్నాననుచున్నాడు.

17. శ్లో. **కిరీటినం గదినం చక్రిణం చ। తేజోరాశిం సర్వతో దీప్తిమన్తమ్ ।**
పశ్యామి త్వాం దుర్నిరీక్ష్యం సమన్తా। ద్దీప్తాన లార్కద్యుతి మప్రమేయమ్ ।

అర్థము : తేజోరాశిం = కాంతిపుంజమైనట్టియు, సర్వతోదీప్తిమన్తం = అంతటను కాంతితో కూడినట్టియు, సమన్తాత్ = అంతటను, దీప్తానలార్కద్యుతిం = మండుచున్న నిప్పు, సూర్యులవంటి కాంతి గలిగినట్టియు, దుర్నిరీక్ష్యం = చూడ శక్యముగానట్టియు, అప్రమేయం = ఇంతయని చెప్పతగనట్టి, త్వాం = నిన్ను, కిరీటినం = కిరీటముకలవానినిగాను, గదినం = గద కలవానినిగాను, చక్రిణం చ = చక్రము కలవానినిగాను, పశ్యామి = చూచుచున్నాను.

తా ॥ కాంతిపుంజమై యంతటను నిండిన కాంతి వలన చూడశక్యముగాక మండుచున్న నిప్పు, సూర్యుల కాంతివంటి కాంతిగలిగి యింతయని హద్దుగా చెప్పదగని నిన్ను కిరీటాది భూషణములను చక్రగదాద్యా యుధములను ధరించియున్నట్లు దర్శించుచున్నాను.

అవ. దివ్యనేత్రముతో గాంచిన భగవత్స్వభావముచే తనకు గలిగిన ఔపనిషద భగవదనుభవమును వర్ణించుచున్నాడు.

18. శ్లో. **త్వమక్షరం పరమం వేదితవ్యం । త్వమస్య విశ్వస్య పరం నిదానమ్ ।**
త్వమవ్యయ శ్శాశ్వత ధర్మగోప్తా । సనాతనస్త్వం పురుషో మతో మే॥

అర్థము : వేదితవ్యం = తెలియదగిన, పరమం = గొప్పదియగు, అక్షరం = అక్షరము, త్వం= నీవు, అస్య = ఈ, విశ్వస్య = ప్రపంచమునకు, పరం = గొప్ప, నిదానం = ఆధారము, త్వం = నీవు, అవ్యయః = వికారములేనివాడవు, త్వం = నీవు, శాశ్వత ధర్మ గోప్తా = నిత్యమైన ధర్మమును కాపాడువాడవును, సనాతనః = అనాదియైన పురుషః= పురుషుడవును, త్వం ఏవ ఇతి = నీవేయని, మే = నాకు, మతః = తెలిసినది.

తా ॥ ముండకాది ఉపనిషత్తులలో తెలియదగినదిగా నిర్దేశింపబడిన పరమైన అక్షరము నీవే. ఈ జగత్తునకు సర్వోత్కృష్టమైన ఆధారము నీవే,

స్వరూపాదులయం దెల్లప్పుడు నొక్క రూపముతో నుండు వాడవు నీవే. నిత్యమైన ధర్మములను కాపాడువాడవు నీవే. పురాణపురుషుడవు నీవే, యని నాకిప్పుడు తెలిసినది.

19. శ్లో. అనాదిమధ్యాన్త మనన్త వీర్య । మనన్తబాహుం శశిసూర్యనేత్రమ్ ।
పశ్యామి త్వాందీప్త హుతాశవక్త్రం । స్వతేజసా విశ్వమిదం తపన్తమ్ ॥

అర్థము : అనాదిమధ్యాన్త = ఆదిమధ్యఅంతములేనివాడవున్ను, అనన్త వీర్యం = అపరిమిత పరాక్రమము కలవాడవున్ను, అనన్తబాహుం = అనేక బాహువులు కలవాడవున్ను, దీప్తహుతాశవక్త్రం = మండుచున్న నిప్పువంటి ముఖమును కలవాడవున్ను, స్వతేజసా = నీ కాంతితో, ఇదం = ఈ, విశ్వం = జగత్తును, తపన్తం = తపింపచేయుచున్న వాడవునునగు, త్వాం = నిన్ను, పశ్యామి = చూచుచున్నాను.

తా ॥ ఆదిమధ్యాంతములు లేనట్టియు, అపరిమిత పరాక్రమము కలిగియు న్నట్టియు, లెక్కలేనన్ని చేతులు కలిగియున్నట్టియు, చంద్రునివలె చల్లగను సూర్యునివలె తీవ్రముగనుండు కండ్లు కలిగియున్నట్టియు; కాలాగ్నివలె మండుచున్న ముఖము కలిగినట్టి నీ తేజస్సుచేత ఈ ప్రపంచమును తపింపజేయుచున్న నిన్ను జూచుచున్నాను.

అవ. ఇట్లత్యుగ్రరూపధారివగు నిన్ను జూచి నేనే కాదు దేవాదులున్ను భయభీతులగు చున్నా రనుచున్నాడు.

20. శ్లో. ద్యావా పృథివ్యో రిదమన్తరం హి ।
వ్యాప్తం త్వయైకేన దిశశ్చ సర్వాః ।
దృష్ట్వాఽద్భుతం రూపముగ్రం తవేదం ।
లోకత్రయం ప్రవ్యథితం మహాత్మన్!॥

అర్థము : ద్యావాపృథివ్యోః = ఆకాశ భూముల యొక్క, ఇదం = ఈ, అన్తరం= మధ్యప్రదేశము, ఏకేన = ఒక్కడవైన, త్వయా = నీ చేత, వ్యాప్తం హి = వ్యాపింపబడియున్నదిగదా, సర్వాః = సమస్తమైన, దిశః చ = దిక్కులున్ను, (వ్యాప్తాః = వ్యాపింపబడియున్నవి) మహాత్మన్ = కృష్ణా ! ఉగ్రం = భయంకరమైన, అద్భుతం = ఆశ్చర్యకరమైన, తవ= నీయొక్క, ఇదం = ఈ, రూపం = విశ్వరూపమును, దృష్ట్వా = చూచి, లోకత్రయం = మూడు విధములగు జనులున్ను, ప్రవ్యథితం = మిక్కిలి భయమునుజెందిరి.

తా ॥ భూమి ఆకాశముల మధ్యభాగ మంతయును అన్ని దిక్కులును నీవే వ్యాపించియున్నావు. మహాత్మా ! బ్రహ్మాది దేవతావర్గములో అనుకూలురు- ప్రతికూలురు మధ్యస్థులు అనెడు మూడు విధముల వారును అత్యద్భుతమై అతి భయంకరమైయుండు నీ రూపమును జూచి భయపడుచున్నారు. (అర్జునునకు తన ఐశ్వర్యమును జూపుటకై భగవానుడు వీరందరికిని దివ్యదృష్టి నొసంగెను.)

21. శ్లో. అమీ హి త్వా సురసఙ్ఘా విశన్తి । కేచిద్భీతాః ప్రాఞ్జలయో గృణన్తి ।
స్వస్తీత్యుక్త్వా మహర్షి సిద్ధసఙ్ఘాః । స్తువన్తి త్వాం స్తుతిభిః పుష్కలాభిః ।

అర్థము : అమీ = ఈ, సురసఙ్ఘాః = దేవతాసమూహములు, త్వాం = నిన్ను, విశన్తి = ప్రవేశించుచున్నవి, కేచిత్ = కొందరు, భీతాః = భయపడినవారై, ప్రాఞ్జలయః = చేతులుజోడించిన వారగుచు, గృణన్తి = స్తోత్రము చేయుచున్నారు, మహర్షి సిద్ధసఙ్ఘాః = మహర్షులయొక్కయు సిద్ధులయొక్కయు సమూహములు, స్వస్తి = మంగళము, (అస్తు = అగుగాక) ఇతి = అని, ఉక్త్వా = పలికి, పుష్కలాభిః = సంపూర్ణములైన, స్తుతిభిః = స్తోత్రములచేత, త్వాం = నిన్ను, స్తువన్తి = స్తుతించుచున్నారు.

తా ॥ ఈ గొప్ప దేవతాసమూహము నీ సమీపమునకు వచ్చుచున్నది. కొందరు భయపడి చేతులుజోడించి స్తోత్రము చేయుచున్నారు. భృగువు మొదలగు మహర్షులు, సనకాది సిద్ధులును నీకు మంగళాశాసనమును గావించి నీకు తగిన సంపూర్ణస్తోత్రములచే నిన్ను స్తుతించుచున్నారు.

22. శ్లో. రుద్రాదిత్యా వసవో యే చ సాధ్యాః । విశ్వేఽశ్వినౌ మరుతశ్చోష్మపాశ్చ ।
గన్ధర్వ–యక్షా – సుర – సిద్ధ–సఙ్ఘాః ।వీక్షన్తే త్వాంవిస్మితాశ్చైవసర్వే ॥

అర్థము : రుద్రాదిత్యాః = ఏకాదశరుద్రులును, ద్వాదశాదిత్యులును, వసవః = ఎనమండ్రు వసువులును, యే సాధ్యాః = ఎవరు సాధ్యులో వారును, విశ్వే = విశ్వే దేవతలును, అశ్వినౌ = అశ్వినీ దేవతలిద్దరును, మరుతః చ = ఏడుగురు మరుత్తులును, ఊష్మపాః చ = పితృదేవతలున్ను, గన్ధర్వ యక్షాసుర సిద్ధసఙ్ఘాః = గంధర్వులు, యక్షులు, సిద్ధులు అనువారి సమూహములున్ను, సర్వేచ = వీరందరును, విస్మితాః ఏవ = ఆశ్చర్యపడిన వారగుచునే, త్వాం = నిన్ను, వీక్షన్తే = చూచుచున్నారు.

తా ॥ ఏకాదశ రుద్రులును, ద్వాదశాదిత్యులును, అష్టవసువులును, సకల సాధ్యులును, విశ్వేదేవతలును, ఇద్దరశ్వినీదేవతలును సప్తమరుత్తులును, పితృదేవతలును, గంధర్వ యక్షరాక్షస సిద్ధసమూహములున్ను అందరును ఆశ్చర్యమును పొంది నిన్ను చూచుచున్నారు.

23. శ్లో. రూపం మహత్తే బహువక్త్ర నేత్రం। మహాబాహో ! బహుబాహూరుపాదమ్।
బహూదరం బహుదంష్ట్రాకరాళం। దృష్ట్వా లోకాః ప్రవ్యథితా స్తథాఽహమ్।

అర్థము : మహాబాహో = శ్రీకృష్ణా ! బహువక్త్రనేత్రం = అనేక ముఖములు కండ్లు కలిగినట్టియు, బహుబాహూరుపాదం = అనేక భుజములు తొడలు పాదములు కలిగినట్టియు, బహూదరం = అనేకములగు కడుపులు కలిగినట్టియు, బహుదంష్ట్రా కరాళం = అనేకమైన కోరలచే భయంకరమైనట్టియు, తే = నీ యొక్క, మహత్ = గొప్పదైన, రూపం = రూపమును, దృష్ట్వా = చూచి, లోకాః = జనులు, ప్రవ్యథితాః= మిక్కిలి భయపడిరి, అహం = నేను, తథా = అట్లే (ప్రవ్యథితః = భయపడితిని)

తా ॥ శ్రీకృష్ణా! అనేకముఖములను, లెక్కలేని కన్నులును పరిమితిలేని భుజములును, పెక్కుతొడలును, బహుపాదములును, అనేకములగు కడుపులును, పెక్కుకోరలచేత అతిభయంకరమగు నీయిట్టిగొప్ప ఆకారమును జూచి జనులందరును అతిభయముతో వణుకుచున్నారు, అట్లే నేనును భయపడుచున్నాను.

24. శ్లో. నభస్స్పృశం దీప్త మనేకవర్ణం। వ్యాత్తాననం దీప్త విశాలనేత్రమ్।
దృష్ట్వా హి త్వాం ప్రవ్యథితాన్తరాత్మా।ధృతిం న విన్దామి శమం చ విష్ణో!।

అర్థము : విష్ణో = శ్రీకృష్ణా! నభస్స్పృశం = ఆకాశమునంటియున్నట్టియు, దీప్తం = ప్రకాశించుచున్నట్టియు, అనేకవర్ణం = అనేకరంగులు కలిగియున్నట్టియు, వ్యాత్తాననం = తెరువబడిన నోరులుగలిగినట్టియు, దీప్త విశాలనేత్రం = ప్రకాశించుచున్న విశాలమైన నేత్రములు కలిగియున్నట్టియు, త్వాం = నిన్ను, దృష్ట్వా = చూచి, ప్రవ్యథితాన్తరాత్మా = మిక్కిలి భయపడినమనస్సుకలవాడనై, ధృతిం = దేహధారణను, శమం చ = ఇంద్రియముల కుపశాంతిని, నవిన్దామి హి = పొందజాలకున్నానుగదా!

తా॥ కృష్ణా! ఆకసము నొరయుచు ప్రకాశించుచు పెక్కురంగులు కలిగి తెరువబడిన నోరులు కలిగి ప్రకాశించు విశాలమైన కండ్లు కలిగియున్న నిన్ను జూచి మిక్కిలి భయపడినవాడనై దేహమును ధరింప జాలకయున్నాను. నా సకలేంద్రియములకును శాంతి లేక యున్నది.

అవ. ఇతరావయవములకంటె ముఖము అత్యంత భయంకరములై యున్నవనియు తన భయమును బోగొట్టి యనుగ్రహించుమనియు వేడుచున్నాడు.

25. శ్లో. దంష్ట్రాకరాళాని చ తే ముఖాని । దృష్ట్వైవ కాలానలసన్నిభాని ।
దిశో న జానే న లభే చ శర్మ । ప్రసీద దేవేశ ! జగన్నివాస ।

అర్థము : దేవేశ = శ్రీకృష్ణా ! దంష్ట్రాకరాళాని = కోరలచే భయంకరమైనట్టియు, కాలానలసన్నిభాని = ప్రళయకాలాగ్నితో సమానమైన, తే = నీయొక్క, ముఖాని= ముఖములను, దృష్ట్వా ఏవ = చూచినంతనే, దిశః = దిక్కులను, న జానే = తెలియకున్నాను, శర్మ చ = సుఖమునున్ను న లభే = పొందక యున్నాను, జగన్నివాస = శ్రీకృష్ణా! ప్రసీద = అనుగ్రహింపుము.

తా॥ కృష్ణా! కోరలచే భయంకరములై ప్రళయకాలాగ్నివలెనున్న నీ ముఖములను జూచినంతనే దిక్కులగానక సుఖమును బడయజాలక యున్నాను. జగన్నివాస! దేవదేవ ! నేను స్వస్థచిత్తుడనగునట్లు అనుగ్రహింపుము.

అవ. ఇట్లు శ్రీకృష్ణు డర్జునునకు ప్రపంచమంతయు తన యధీనమైయుండి సంచరించుచున్నదని జూపుచు ఉభయపక్షముల యందును రాజవేషములతో నున్న ఆసురాంశ సంభూతుల నందరను సంహరించి తాను స్వయముగ జేయదలంచిన భూభారమును తొలగించు భావివ్యాపారమును తన విశ్వరూపమున జూపెను. దానినంతను అర్జునుడు తనకు ప్రసాదించిన దివ్యదృష్టిచే ప్రత్యక్షముగా జూచి యిట్లు చెప్పుచున్నాడు.

26. శ్లో. అమీ చ త్వాం ధృతరాష్ట్రస్య పుత్రాః । సర్వే సహైవావనిపాల సఙ్ఘైః ।
భీష్మో ద్రోణ స్సూతపుత్ర స్తథాఽసౌ సహాస్మదీయై రపి యోధముఖ్యైః॥

అర్థము : అమీ = ఈ, సర్వే = సమస్తమైన, ధృతరాష్ట్రస్య = ధృతరాష్ట్రుని, పుత్రాః = దుర్యోధనాది బిడ్డలును, భీష్మః = భీష్ముడును, ద్రోణః = ద్రోణుడును, అసౌ = ఈ, సూతపుత్రః = కర్ణుడును, సర్వైః = సమస్తములగు, అవనిపాల సఙ్ఘైః సహ = రాజుల సమూహములతో కూడ, తథా = అట్లే, అస్మదీయైః = మావారైన, యోధముఖ్యైః అపిసహ = కొందరు వీరాగ్రేసరులతో సహా

తా ॥ ఈ కాన్పించుచున్న ధృతరాష్ట్రుని పుత్రులున్ను, భీష్మ ద్రోణ కర్ణ మొదలగువారందరున్ను, పరపక్షమందలి రాజులున్ను, వీరితోసహా మన సేనయందలి వీరాగ్రేసరులున్ను కూడ (దీనికి ముందు శ్లోకముతో సంబంధము.)

27. శ్లో. వక్త్రాణి తే త్వరమాణా విశన్తి । దంష్ట్రాకరాళాని భయానకాని ।
కేచి ద్విలగ్నా దశనాన్తరేషు । సందృశ్యన్తే చూర్ణితై రుత్తమాఙ్గైః ॥

అర్థము : దంష్ట్రాకరాళాని = కోరలచే వికృతరూపములు గలవియు, భయానకాని = భయంకరములైనవియునగు, తే = నీయొక్క, వక్త్రాణి = ముఖములను, త్వరమాణాః = త్వరపడుచున్నవారై, విశన్తి = ప్రవేశించుచున్నారు, కేచిత్ = కొందరు, దశనాన్తరేషు = పండ్లసందులయందు, విలగ్నాః = చిక్కినవారై, చూర్ణితైః = గుండచేయబడిన, **ఉత్తమాఙ్గైః** = తలలతో, సందృశ్యన్తే = కనబడుచున్నారు.

తా ॥ కోరలచే వికృతములును, భయంకరములునునగు నీ నోళ్ళయందు తమ వినాశము కొఱకు త్వరపడుచు ప్రవేశించుచున్నారు. మరి కొందరు నీ పండ్లసందుల జిక్కుకొనినవారై గుండజేయబడిన తలలతో కనబడుచున్నారు.

అవ. ఆ యోధులందరును తమ ప్రయత్నము లేకనే ఒకే విశ్వరూపుని యందు లయమగుటకును, అతడు సర్వసంహారానుకూలమైన సామాన్యాకారముతో నుండుటకును రెండు దృష్టాంతములను జూపుచున్నాడు.

28. శ్లో. యథా నదీనాం బహవోఽమ్బువేగా । స్సముద్రమేవాభి ముఖా ద్రవన్తి ।
తథా తవామీ నరలోకవీరాః । విశన్తి వక్త్రాణ్యభివిజ్వలన్తి ॥

అర్థము : యథా = ఎట్లు, నదీనాం = నదులయొక్క, బహవః = అనేకములైన, అమ్బువేగాః = జలప్రవాహములు, సముద్రం ఏవ = సముద్రమును గూర్చియే, అభిముఖాః = ఎదురైనవై, ద్రవన్తి = ప్రవహించుచున్నవో, తథా = అట్లే, అమీ = ఈ, నరలోకవీరాః = మనుష్యలోకమునందలి శూరులు, తవ = నీ యొక్క, అభివిజ్వలన్తి = అంతటను మండుచున్న, వక్త్రాణి = ముఖములను, విశన్తి = ప్రవేశించుచున్నారు.

తా ॥ నదులయొక్క బహువిధములగు జలప్రవాహములు సముద్రమునకు ఎదురుగా ప్రవహించునట్లు, ఈ శూరులగు రాజులందరును మండుచున్న నీ ముఖములను ప్రవేశించుచున్నారు.

29. శ్లో. యథా ప్రదీప్తం జ్వలనం పతఙ్గాః । విశన్తి నాశాయ సమృద్ధవేగాః ।
తథైవ నాశాయ విశన్తిలోకా । స్తవాపి వక్త్రాణి సమృద్ధవేగాః ॥

అర్థము : యథా = ఎట్లు, పతఙ్గాః = మిడుతలు, సమృద్ధవేగాః = మిక్కిలి వేగముకలవై, ప్రదీప్తం = మండుచున్న, జ్వలనం = అగ్నిహోత్రమును, నాశాయ = నాశముకొఱకు, విశన్తి = ప్రవేశించుచున్నవో, తథైవ = అట్లే, లోకాఃఅపి = మనుష్యులున్ను, నాశాయ = నాశము కొరకు, సమృద్ధవేగాః = అతివేగము కలవారై, తవ = నీయొక్క, వక్త్రాణి = ముఖములను, విశన్తి = ప్రవేశించు చున్నారు.

తా ॥ మిడుతలు మిక్కిలి వేగముకలవై మండుచున్న అగ్నిహోత్రమును తమ నాశముకొఱకే ప్రవేశించుచున్నట్లు వీరులగు ఈ రాజులందరును అతివేగముతో తమ నాశముకొఱకు మండుచున్న నీ నోళ్ళయందు ప్రవేశించుచున్నారు.

30. శ్లో. లేలిహ్యసే గ్రసమాన స్సమన్తా । ల్లోకాన్ సమగ్రాన్ వదనై ర్జ్వలద్భిః ।
తేజోభి రాపూర్య జగత్సమగ్రం । భాస స్తవోగ్రాః ప్రతపన్తి విష్ణో ! ॥

అర్థము : విష్ణో ! = కృష్ణా! జ్వలద్భిః = మండుచున్న, వదనైః = ముఖములచేత, సమగ్రాన్ = సమస్తములైన, లోకాన్ = జనసమూహములను, గ్రసమానః = మ్రింగుచున్నవాడవై, సమన్తాత్ = అంతటను, లేలిహ్యసే = నాకు చున్నావు, తవ = నీయొక్క, ఉగ్రాః = భయంకరములైన, భాసః = కిరణములు, తేజోభిః = తమ కాంతులచే, సమగ్రం = సమస్తమైన, జగత్ = ప్రపంచమును, ఆపూర్య = నింపి, ప్రతపన్తి = మిక్కిలి తపింపచేయుచున్నవి.

తా ॥ కృష్ణా ! యుద్ధమునకు వచ్చిన రాజులనందరను మండుచున్న నీనోళ్లచే మ్రింగుచున్నవాడవై వారి రక్తముచే పూయబడిన నీ పెదవులను నాకుకొనుచున్నావు. అతి భయంకరమగు నీ కిరణములు తమ కాంతిచే లోకము నందంతటను వ్యాపించి తపింపజేయుచున్నవి.

అవ. ఇట్టి భయంకరాకారమును చూడజాలక భయపడి అర్జునుడు 'నీ సకలైశ్వర్యమును జూప సమకట్టిన నీవీ యుగ్రరూపము నేల జూపితివి ? దయతో నీ సౌమ్యరూపమును జూపి యనుగ్రహించు' మని వేడుచున్నాడు.

31. శ్లో. ఆఖ్యాహి మే కో భవా నుగ్రరూపో । నమోఽస్తు తే దేవవర ! ప్రసీద ।
విజ్ఞాతు మిచ్ఛామి భవన్త మాద్యం । నహి ప్రజానామి తవ ప్రవృత్తిమ్ ॥

అర్థము : దేవవర = శ్రీకృష్ణా ! ఉగ్రరూపః = భయంకరాకారము గల, భవాన్ = నీవు, కః =

ఎవడవు? ఆద్యం = ఆదిపురుషుడవగు, భవన్తం = నిన్ను, విజ్ఞాతుం = తెలిసికొనుటకు, ఇచ్ఛామి = కోరుచున్నాను, తవ = నీయొక్క, ప్రవృత్తిం = ఉద్యమమును, నహి ప్రజానామి = ఎరుగనుకదా ! మే = నాకు, ఆఖ్యాహి = చెప్పుము, తే = నీకు, నమః = నమస్కారము, అస్తు = అగుగాక ! ప్రసీద = అనుగ్రహింపుము.

తా॥ శ్రీకృష్ణా ! ఆదిపురుషుడవగు నీవు ఈ భయంకరాకారమును నీ భక్తుడనగు నాకేల జూపితివి ? నీ విట్టిరూపమును జూపుటలో నీయభిప్రాయమేమో తెలియ గోరుచున్నాను. అదినాకు తెలిపి యనుగ్రహింపుము. నీకిదే నమస్కరించుచున్నాను.

అవ. అందులకు శ్రీకృష్ణుడు అర్జునుని ప్రయత్నము లేకున్నను యీ రాజలోకము నంతను నంతమొందించుటకే తానుద్భవించితినని తెలుపుటకే యాతనికీ రూపమును జూపెను గాన వెనుకంజ వేయవలదని యాతనిని ప్రోత్సహించు చున్నాడు.

శ్రీ భగవాన్ ఉవాచ = శ్రీకృష్ణుడు పలికెను.

32. శ్లో. కాలోఽస్మి లోకక్షయకృత్ ప్రవృద్ధః। లోకాన్ సమాహర్తు మిహ ప్రవృత్తః
ఋతేఽపి త్వా న భవిష్యన్తి సర్వే।యేఽవస్థితాః ప్రత్యనీకేషు యోధాః॥

అర్థము : కాలః = లెక్కించువాడనై, లోకక్షయకృత్ = రాజలోకమును నాశనము చేయువాడనై, ప్రవృద్ధః = మిక్కిలి పెరిగినవాడనై, లోకాన్ = రాజలోకములను, సమాహర్తుం = ఎదుటనే చంపుటకు, ఇహ = ఇచ్చట, ప్రవృత్తః = ప్రవర్తించిన వాడను, అస్మి = అగుచున్నాను, ప్రత్యనీకేషు = శత్రుసైన్యములయందు, యే యోధాః = ఏవీరులు, అవస్థితాః = ఉన్నారో, తే సర్వే = వారందరును, త్వా ఋతే అపి = నీవు లేకపోయినను, న భవిష్యన్తి = ఉండబోరు.

తా॥ నేను రాజలోకముయొక్క ఆయుఃపరిమాణమును లెక్కించుచు వీరి నందరను నాశనము చేయుటకే యట్టి ఘోర రూపముతో పెరిగి వీరి నెదుర్కొని చంప బూనియున్నాను. శత్రుసైన్యము నందుగల యోధులందరును నీ ప్రయత్నము లేకపోయినను నా సంకల్పముచే తప్పక నశింతురు.

అవ. 'నేను చంపకున్నను దుర్యోధనాదులు నశించుచో నన్నేల ప్రేరేపింతు' వను నర్జునుని భావమును గ్రహించి 'నా ప్రియ భక్తుడవగు నీకు జయ యశో రాజ్యముల ప్రసాదింప గోరి ప్రోత్సహించుచున్నా' నని శ్రీకృష్ణుడు సమాధాన మొసంగుచున్నాడు.

33. శ్లో. తస్మాత్త్వ ముత్తిష్ఠ యశో లభస్వ ।
జిత్వా శత్రూన్ భుఙ్క్ష్వ రాజ్యం సమృద్ధమ్ ।
మయై వైతే నిహతాః పూర్వమేవ ।
నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్ ॥

అర్థము : తస్మాత్ = ఆ కారణమువలన, త్వం = నీవు, ఉత్తిష్ఠ = లెమ్ము, శత్రూన్ = శత్రువులను, జిత్వా = జయించి, యశః = కీర్తిని, లభస్వ = పొందుము, సమృద్ధం= పూర్ణమైన, రాజ్యం = రాజ్యమును, భుఙ్క్ష్వ = అనుభవింపుము, ఏతే = వీరు, మయా ఏవ = నాచేతనే, పూర్వం ఏవ = మునుపే, నిహతాః = చంపబడిరి, సవ్యసాచిన్ != అర్జునా ! త్వం = నీవు, నిమిత్తమాత్రం = సాధనముమాత్రమే, భవ = అగుము.

తా ॥ కాబట్టి నీవు శత్రువులతో యుద్ధమునుజేయ నన్నద్ధుడవుకమ్ము కీర్తిని పొందుము. శత్రువులనుజంపి పరిపూర్ణమైన రాజ్యము ననుభవింపుము. ఈ రాజులందరును చంపదగినవారని నేనిదివరకే సంకల్పించితిని. కావున అర్జునా ! నీవీ పనిలో శస్త్రాదులవలె సాధనముమాత్రమగుము.

అవ. ధర్మభీరువగు నర్జునుడు 'భీష్మద్రోణాదుల నేనెట్లు చంపగల'నని యడిగిన ప్రశ్నకీ శ్లోకమున సమాధాన మొసంగుచున్నాడు.

34. శ్లో. ద్రోణం చ భీష్మం చ జయద్రథం చ ।
కర్ణం తథాఽన్యానపి యోధవీరాన్ ।
మయా హతాం స్త్వం జహి మా వ్యథిష్ఠాః ।
యుధ్యస్వ జేతాసి రణే సపత్నాన్ ॥

అర్థము : మయా = నాచేత, హతాన్ = చంపబడుటకై ఏర్పరచబడిన, ద్రోణం = ద్రోణాచార్యుని, భీష్మంచ = భీష్మాచార్యుని, జయద్రథంచ = సైంధవుని, కర్ణం = కర్ణుని, తథా = అట్లే, అన్యాన్ = ఇతరులగు, యోధవీరాన్ అపి = యుద్ధవీరులనున్ను, త్వం = నీవు, జహి = చంపుము, మా వ్యథిష్ఠాః= భయపడకుము, యుధ్యస్వ = యుద్ధము చేయుము, రణే = యుద్ధమునందు, సపత్నాన్ = శత్రువులను, జేతాసి= జయించగలవు.

తా॥ తప్పుచేయుటచే నేను చంపుటకే నిర్ణయించిన ద్రోణుని భీష్ముని సైంధవుని కర్ణుని యింకను నితర యుద్ధవీరులను నీవు చంపుము, భయపడకుము. యుద్ధమును చేయుము. తప్పక రణరంగమున నీకు జయము కలిగియే తీరును.

అవ. ఈ మాటలు వినుటచే నర్జునునకు కలిగిన భయభక్తులను సంజయుడు వర్ణించుచున్నాడు.

35. శ్లో. ఏత చ్ఛ్రుత్వా వచనం కేశవస్య । కృతాఞ్జలి ర్వేపమానః కిరీటీ ।
నమస్కృత్వా భూయ ఏవాహ కృష్ణం । సగద్గదం భీతభీతః ప్రణమ్య ॥

అర్థము : కిరీటీ = అర్జునుడు, కేశవస్య = శ్రీకృష్ణునియొక్క, ఏతత్ = ఈ, వచనం = మాటను, శ్రుత్వా = విని, నమఃకృత్వా = నమస్కరించి, భీతభీతః = మిక్కిలి భయపడుచున్నవాడై, భూయః ఏవ = తిరిగిన్నీ, ప్రణమ్య = నమస్కరించి, కృతాఞ్జలిః = చేతులు జోడించినవాడై, వేపమానః = వణుకుచు, స గద్గదం = గద్గదస్వరముతో, కృష్ణం = శ్రీకృష్ణునిగూర్చి, ఆహ = పలికెను.

తా ॥ ఇట్లు శ్రీకృష్ణుని మాటను విని యర్జునుడాతనికి నమస్కరించి మిక్కిలి భయపడుచు చేతులు జోడించి తిరిగి నమస్కరించి వణుకుచు గద్గద కంఠముతో శ్రీకృష్ణునితో నిట్లనియెను.

అర్జున ఉవాచ = అర్జునుడు పలికెను.

36. శ్లో. స్థానే హృషీకేశ ! తవ ప్రకీర్త్యా । జగ త్ప్రహృష్య త్యనురజ్యతే చ ।
రక్షాంసి భీతాని దిశో ద్రవన్తి । సర్వే నమస్యన్తి చ సిద్ధసఙ్ఘాః ॥

అర్థము : హృషీకేశ ! = శ్రీకృష్ణా ! జగత్ = దేవగన్ధర్వాదిలోకము, తవ = నీయొక్క, ప్రకీర్త్యా = కీర్తిచేత, ప్రహృష్యతి = మిక్కిలి సంతోషించుచున్నది, అనురజ్యతే చ= ఆనందమునుగూడ పొందుచున్నది, రక్షాంసి = రాక్షసులు, భీతాని = భయపడినవారై, దిశః = దిక్కులనుగూర్చి, ద్రవన్తి = పరుగిడుచున్నారు, సర్వే = సమస్తమైన, సిద్ధ సఙ్ఘాః చ = సిద్ధసమూహములున్ను, నమస్యన్తి = నమస్కరించుచున్నవి, స్థానే = (అది) యుక్తమే.

తా ॥ కృష్ణా ! దేవగంధర్వాది సమస్త దేవజాతియు నీకీర్తికి మిక్కిలి ఆనందమును అనురాగమును పొందుచున్నది. నిన్ను జూచి రాక్షసులు భయపడి పలు

దిక్కులకు పారిపోవుచున్నారు. సిద్ధులు మొదలగు భక్తబృందమంతయు నీకు నమస్కరించుచున్నారు. ఇట్లు గావించుట యంతయు యుక్తమే. (ఈ శ్లోకము శ్రీవిష్ణు పంజరాదులలో ముఖ్యమంత్రముగా వినియోగింపబడును. మధుసూదన సరస్వతి దీనిని రక్షోఘ్నమంత్రమని పేర్కొనిరి.)

అవ. అది యెట్లు యుక్తమో తెలుపుచున్నాడు.

37. శ్లో. కస్మాచ్చ తే న నమేరన్ మహాత్మన్ !
గరీయసే బ్రహ్మణో ఽ ప్యాదికర్త్రే ।
అనన్త ! దేవేశ ! జగన్నివాస !
త్వ మక్షరం సదస త్తత్పరం యత్ ॥

అర్థము : మహాత్మన్ ! = ఓ మహాత్ముడా ! బ్రహ్మణః అపి = చతుర్ముఖ బ్రహ్మకున్ను, ఆదికర్త్రే = ప్రధానకారణమైనట్టియు, గరీయసే = గొప్పవాడవునునగు, తే = నీకొఱకు, కస్మాత్ = ఏకారణమువలన, న నమేరన్ ? = నమస్కరించరు ? అనన్త= అపరిచ్ఛిన్నుడా!, దేవేశ = దేవతలకు ప్రభువా ! జగన్నివాస = జగత్తునందం తటను స్థిరముగ నుండువాడా ! శ్రీకృష్ణా !, అక్షరం = నాశరహితమైన ఆత్మతత్వము, త్వం = నీవే, సత్ అసత్ = కార్య కారణరూప మగు ప్రకృతితత్వమున్ను, తత్పరం = ఆరెండింటి కంటెను వేరైన ముక్తాత్మ తత్త్వమున్ను (త్వం ఏవ = నీవే).

తా ॥ ఓ మహాత్మా! నీవు మిక్కిలి గొప్పవాడవు. చతుర్ముఖునకును ఆది కారణ మైనవాడవు. ఇట్టి నీకా బ్రహ్మాదులేల నమస్కరింపరు? నీవపరిచ్ఛిన్నుడవు. బ్రహ్మాది దేవతలకందరకును ప్రభువువు. సకల జగత్తునందును వ్యాపించి విడువక యుండువాడవు. జీవాత్మతత్త్వము, ప్రకృతి తత్త్వము, ముక్తాత్మ తత్త్వమున్ను నీవే యగుచున్నావు.

38. శ్లో. త్వమాదిదేవః పురుషః పురాణః । త్వమస్య విశ్వస్య పరం నిధానమ్ ।
వేత్తాఽసి వేద్యం చ పరం చ ధామ । త్వయా తతం విశ్వ మనన్తరూప॥

అర్థము : ఆదిదేవః = సృష్టికర్తవును, పురాణః = పురాతనుడవగు, పురుషః = పురుషుడవు ను, త్వం = నీవే, అస్య = ఈ, విశ్వస్య = ప్రపంచమునకు, పరం = శ్రేష్ఠమైన, నిధానం= ఆధారమున్ను, త్వం = నీవే, వేత్తా = తెలుసుకొనువాడవున్ను, వేద్యం చ = తెలియబడునదియు, పరం = ఉత్తమమైన, ధామ చ = ప్రాప్యస్థానమున్ను, త్వం

అసి = నీవే యగుచున్నావు. అనన్తరూప ! = అంతములేని స్వరూపము కలవాడా! విశ్వం = ప్రపంచమంతయు, త్వయా = నీచేత, తతం = వ్యాపింప బడియున్నది.

తా ॥ కృష్ణా ! సృష్టికర్తయగు నాది దేవుడవును, పురాణపురుషుడవును, నీకు శరీరమగు నీప్రపంచమునకంతకును ఆత్మరూపమున పరమాధార భూతుడవును, నీవే అయి యున్నావు. జగత్తునందు తెలుసుకొనువారును, తెలియ బడునవియును, అన్నియు నీవే. ఇందుచే పరమ ప్రాప్యస్థానమును నీవే. అంతములేని స్వరూపము కలవాడా ? చిదచిదాత్మకమగు నీ ప్రపంచము నంతను నీవే యాత్మభూతుడవై వ్యాపించి యున్నావు.

అవ. ఇట్లన్నిటికి నంతర్యామిగా నున్నవాడవు గావుననే వాయ్వాది శబ్దములచే నీవే చెప్పబడుచున్నావనుచున్నాడు.

39. శ్లో. వాయు ర్యమోఽగ్ని ర్వరుణ శ్శశాఙ్కః। ప్రజాపతి స్త్వం ప్రపితామహశ్చ।

అర్థము : వాయుః = వాయువును, యమః = యముడును, అగ్నిః = అగ్నియు, వరుణః=వరుణుడు, శశాఙ్కః = చంద్రుడు, ప్రజాపతిః = బ్రహ్మయు, ప్రపితామహః చ= ముత్తాతయు, త్వం = నీవే.

తా ॥ వాయువు, యముడు, అగ్ని, వరుణుడు, చంద్రుడు, బ్రహ్మ, ప్రపితామహుడు, ఈ శబ్దములన్నియు నీకే వర్తించుచున్నవి.

(శరీరవాచకములగు శబ్దములన్నియు శరీరియందు పర్యవసించునని శాస్త్రము. అన్నిటిని శరీరముగా గలిగియున్న శరీరి సర్వేశ్వరుడే గావున శబ్దము అన్నియు నాతనినే బోధించును.)

అవ. విశ్వరూపమును జూచుటచే తెలుపబడిన భగవంతుని పరత్వ సౌలభ్యముల రెండింటిని యనుభవించుటవలన తనకు కలిగిన భయ హర్షములచేనవశుడై యర్జునుడు నమస్కరించుచున్నాడు.

39. శ్లో. నమో నమస్తేఽస్తు సహస్రకృత్వః। పునశ్చ భూయోఽపి నమో నమస్తే।

40. శ్లో. నమః పురస్తా దథ పృష్ఠత స్తే। నమోఽస్తు తే సర్వత ఏవ సర్వ ! ।

అర్థము : తే = నీకొఱకు, సహస్రకృత్వః = వేయిమారులు, నమః నమః అస్తు = నమస్కారములగుకాక, పునః చ = తిరిగియు, నమః = నమస్కారము, (అస్తు =

అగుగాక) భూయః అపి = తిరిగియు, తే = నీ కొఱకు, నమోనమః = నమస్కారము, అథ = మరియు, తే = నీ కొఱకు, పురస్తాత్ = ఎదుటను, నమః= నమస్కారము, పృష్ఠత = వెనుకను, నమః = నమస్కారము (అస్తు = అగుగాక), సర్వ ! = అన్నిటికి నంతర్యామిగా నుండువాడా! తే = నీకు, సర్వత ఏవ = అన్ని దిక్కులయందును, నమః అస్తు = నమస్కారముగుగాక.

తా ॥ అన్నింటికి నంతర్యామిగా నుండువాడా ! శ్రీకృష్ణా! నీకనేకవేల వందనములు. మాటి మాటికి యనేక వందనములు. నీకు ముందును వెనుకను అన్ని దిక్కుల యందును వందనము చేయుచున్నాను.

(ఈ శ్లోకము భక్తులందరును భగవంతుని దర్శించునపుడను సంధించదగినది)

అవ. భగవంతుని దెలుపు సర్వ శబ్దమునకు నిర్వచనమును దెలుపుచున్నాడు.

40. శ్లో. అన న్తవీర్యా మితవిక్రమ స్త్వం । సర్వం సమాప్నోషి తతోఽసి సర్వః ।

అర్థము ః అనన్తవీర్య = అపరిమిత వీర్యము కలవాడా, అమితవిక్రమః = మిక్కిలి పరాక్రమముగల, త్వం = నీవు, సర్వం = సమస్తమును, సమాప్నోషి = పొందుచున్నావు. తతః = కనుక, సర్వం = సమస్తమును నీవే అయిన వాడవు, అసి = అగుచున్నావు.

తా ॥ మిక్కిలి వీర్యమును పరాక్రమమునుగల నీవన్నిటికిని ఆత్మభూతుడవై యన్నిటిని శరీరములుగా పొందియున్నావు గాన వాటినన్నిటిని తెలుపు శబ్దములచే నీవే చెప్పబడుచున్నావు.

అవ. తెలియకజేసిన తప్పులను మన్నింప వేడుచున్నాడు.

41. శ్లో. సఖేతి మత్వా ప్రసభం యదుక్తం । హే కృష్ణ ! హే యాదవ ! హే సఖేతి।
అజానతా మహిమానం తవేమం । మయా ప్రమాదా త్ప్రణయేన వాపి॥

అర్థము ః తవ = నీయొక్క, ఇమం = ఈ, మహిమానం = మాహాత్మ్యమును, అజానతా = ఎఱుంగని, మయా = నాచేత, ప్రమాదాత్ = పొరబాటు వలనగాని, ప్రణయేన వాపి= చనువుచేతనుగాని, సఖా ఇతి = స్నేహితుడవని, మత్వా = తలంచి, హే కృష్ణ= ఓ కృష్ణా!, హే యాదవ ! = ఓ యాదవా !, హే సఖే! = ఓ మిత్రమా !, ఇతి = అని, ప్రసభం = అవినయముగా, యత్ = ఏది, ఉక్తం = పలుకబడెనో.

తా ॥ శ్రీకృష్ణా ! నీయొక్క యీ మహిమ నెఱుంగక పొరబాటునలనను, చనువుచేతను స్నేహితుడవే యని తలంచి, "ఓకృష్ణా ! ఓ యాదవా!

ఓ చెలి కాడా!"యని వినయములేక పలికితిని. దానినిన్ని (దీనికి ముందుశ్లోకముతో సంబంధము)

(ఈ శ్లోకమున 'హేసఖేతి' అనుచోట సంధి ఆర్షము)

42. శ్లో. యచ్చాపహాసార్థ మసత్కృతోఽసి ।
విహారశయ్యాసన భోజనేషు ।
ఏకోఽథవా ప్యచ్యుత తత్సమక్షం ।
తత్ క్షామయే త్వా మహ మప్రమేయమ్ ।

అర్థము : అచ్యుత = శ్రీకృష్ణా ! విహారశయ్యాసనభోజనేషు = విహరించునపుడు, శయనించునపుడు, కూర్చుండునపుడు, భుజించునపుడు, ఏకః = ఏకాంతమునగాని, అథవా = లేక, తత్సమక్షం = కనులఎదుటగాని, అపహాసార్థం = పరిహాసముకొరకు గాని, అసత్కృతః, అసి ఇతియత్ = అగౌరవపరచబడితివి అనుట ఏదికలదో, తత్ = ఆ యపరాధమును, అప్రమేయం = ప్రమాణములచే తెలియ శక్యముగాని, త్వాం = నిన్ను, అహం = నేను, క్షామయే = క్షమింపజేసికొందును.

తా ॥ కృష్ణా! మన మిరువురము కలసి విహరించునపుడును, పరుండునపుడును, కూర్చుండునపుడును, భుజించునపుడును, ఒంటరిగా నున్నపుడుగాని, పదిమంది ముందుగాని పరిహాసముకొఱకు ప్రమాణములచే తెలియని నిన్ను గౌరవముగ ఆదరించక అవమానించితిని. వాని నన్నిటిని క్షమింప నేను ప్రార్థించు చున్నాను.

అవ. భగవంతుడే తన తప్పును మన్నించవలెనుగాని తనకు వేరొక దిక్కులేదనుటకు కారణముల దెలుపుచున్నాడు.

43. శ్లో. పితాసి లోకస్య చరాచరస్య ।
త్వమస్య పూజ్యశ్చ గురు ర్గరీయాన్ ।
నత్వత్సమోఽస్త్యభ్యధికం కుతోఽన్యో ।
లోక త్రయేఽప్య ప్రతిమప్రభావ॥

అర్థము : అప్రతిమప్రభావ! = సాటిలేని ప్రభావముగల ఓ స్వామీ! త్వం = నీవు, చరాచరస్య= చరస్థిరరూపమైన, అస్య = ఈ, లోకస్య = ప్రాణిసమూహమునకు, పితా = తండ్రియు, గురుః = గురువును, గరీయాన్ = శ్రేష్ఠమైన, పూజ్యః = పూజ్యుడవును, అసి = అగుచున్నావు, లోకత్రయే అపి = మూడులోకములయందును, త్వత్సమః=

నీతో సమానుడు, అన్యః = మరియొకడు, నాస్తి = లేడు, అభ్యధికః = గొప్పవాడు, కుతః = ఎట్లుండును.

తా ॥ సాటిలేని ప్రభావముగల ఓ స్వామీ ! జంగమ స్థావర రూపమగు జగత్తున కంతకును నీవు తండ్రివి, గురుడవు, కావున నీవు ఉత్తమ పూజ్యుడవు. మఱియు ముల్లోకములయందును కారుణ్యాదిగుణములలో నీకు సమానుడే లేనప్పు డధికుడెట్లుండును.

అవ. నీతో నాకిట్టి సంబంధమున్నదిగాన నీవే నన్ను క్షమించి రక్షింపవలెనని ప్రార్థించుచున్నాడు.

44. శ్లో. తస్మా త్ప్రణమ్య ప్రణిధాయ కాయం ।
ప్రసాదయే త్వా మహ మీశ మీడ్యమ్ ।
పితేవ పుత్రస్య సఖేవ సఖ్యుః ।
ప్రియః ప్రియాయార్హసి దేవ సోఢుమ్ ॥

అర్థము ః తస్మాత్ = అందువలన, అహం = నేను, కాయం = శరీరమును, ప్రణిధాయ = బాగుగా వంచి, ప్రణమ్య = నమస్కరించి, ఈశం = నియామకుడును, ఈడ్యం = స్తుతించదగిన, త్వాం = నిన్ను, ప్రసాదయే = అనుగ్రహింపజేసుకొనుచున్నాను, హే దేవ = శ్రీకృష్ణా! పుత్రస్య = పుత్రునకు, పితా ఇవ = తండ్రివలెను, సఖ్యుః= చెలికానికి, సఖా ఇవ = చెలికానివలెను, ప్రియః = ఇష్టుడవైననీవు, ప్రియాయ = ఇష్టుడనగు నాకొఱకు, (సర్వం = సమస్తాపరాధములను) సోఢుం = సహించుటకు, అర్హసి = తగుదువు.

తా ॥ శ్రీకృష్ణా! నీవీ ప్రపంచమునకు తండ్రివిని గురుడవునుగాన నీకు నేను సాష్టాంగముగ నమస్కరించి జగదీశ్వరుడవును స్తోత్రార్హుడవును నగు నిన్ను ప్రసన్నుడవగుటకై వేడుకొనుచున్నాను. తప్పుచేసిన పుత్రుడు గాని మిత్రుడు గాని నమస్కరించి దీనముగా యాచించిన తండ్రిగాని సఖుడుగాని యెట్లు ప్రసన్నులై క్షమింతురో అట్లే నాకు ప్రియుడవును పరమ దయామయుడవగు నీవును నీకు ప్రియుడనగు నాయొక్క సమస్తాపరాధములను క్షమించ ప్రసన్నుడవగుము.

(43, 44 శ్లోకములు భక్తులు భగవంతుని సన్నిధిలో విన్నవించదగినవి.)

అవ. సుప్రసన్న రూపమును జూపుమని వేడుచున్నాడు.

45. శ్లో. అదృష్టపూర్వం హృషితోఽస్మి దృష్ట్వా। భయేన చ ప్రవ్యథితం మనో మే।
తదేవ మే దర్శయ దేవ రూపం । ప్రసీద దేవేశ ! జగన్నివాస !!

అర్థము : దేవ = శ్రీకృష్ణా! అదృష్టపూర్వం = ఇంతకుముందు చూడబడని విశ్వరూపమును, దృష్ట్వా = చూచి, హృషితః = సంతోషించినవాడను, అస్మి = అగుచున్నాను, మే = నాయొక్క, మనః = మనస్సు, భయేన = భయముచేత, ప్రవ్యథితంచ = మిక్కిలిచలించబడినది, తత్ రూపం ఏవ = ఆ సౌమ్యరూపమునే, మే = నాకు, దర్శయ = చూపుము, దేవేశ = దేవతలకు అధిపతియైనవాడా ! ప్రసీద = అనుగ్రహింపుము.

తా ॥ కృష్ణా! ఇదివర కెన్నడును చూడబడని నీ యద్భుత విశ్వరూపమును సేవించి సంతసించుటయేగాక నామనస్సు భయముచే కలతయు చెందినది. కావున సౌమ్యమగు నీపూర్వరూపమునే నాకు జూపుము. బ్రహ్మాది దేవతలకు గూడ ప్రభువా! సకల లోకాధారభూతా! నాయందనుగ్రహించుము.

అవ. పూర్వసిద్ధమైన సహజమగు చతుర్భుజరూపముతో దర్శన మిప్పించ వేడుచున్నాడు.

46. శ్లో. కిరీటినం గదినం చక్రహస్త । మిచ్ఛామి త్వాం ద్రష్టు మహం తథైవ ।
తేనైవ రూపేణ చతుర్భుజేన । సహస్రబాహో! భవ విశ్వమూర్తే !!

అర్థము : సహస్రబాహో = వేయిభుజములుగల, విశ్వమూర్తే = విశ్వరూపధారీ! తథా ఏవ= వెనుకటివలెనే, త్వాం = నిన్ను, కిరీటినం = కిరీటము కలవానినిగాను, గదినం = గద కలవానినిగాను, చక్రహస్తం = చక్రము చేతియందు కలవానినిగాను, ద్రష్టుం = చూచుటకు, అహం = నేను, ఇచ్ఛామి = కోరుచున్నాను, చతుర్భుజేన = నాలుగు భుజములుగల, తేన ఏవ రూపేణ = ఆ వెనువటి రూపముతోనే, భవ = ఉండుము.

తా ॥ ఓ కృష్ణా! ఇప్పుడు వేయి భుజములతో విశ్వశరీరుడవై కనబడుచున్నావు. నేను కిరీట గదా చక్రములతో గూడిన మునుపటి నీ రూపమునే చూడగోరెదను. కనుక నాలుగు భుజములతోకూడిన వెనుకటి సౌమ్య రూపమునే ధరింపుము.

(శ్రీకృష్ణునకు చతుర్భుజరూపమే సహజమైనది. తండ్రివేడుటచే కంసుని జంపువరకు ఆ రెండు బాహువులను మరుగుపరచెను. పిమ్మట భక్తులకా చతుర్భుజ రూపముతోనే దర్శనమిచ్చుచుండెను.)

అవ. అనన్యభక్తిలేని ఏ యుపాయముచేతను తనను నిజరూపముతో దర్శింపజాలరు. అట్లు దర్శించుటకాతని యనుగ్రహ మొక్కటియే సాధనమనుచున్నాడు.

శ్రీ భగవానువాచ = శ్రీకృష్ణుడు పలికెను.

47. శ్లో. మయా ప్రసన్నేన తవార్జునేదం। రూపం పరం దర్శిత మాత్మయోగాత్
తేజోమయం విశ్వ మనన్త మాద్యం। యన్మే త్వదన్యేన నదృష్టపూర్వమ్ ।

అర్థము: అర్జున = అర్జునుడా ! మే = నాయొక్క, తేజోమయం = తేజోరాశియైనదియు, విశ్వం = అంతటను వ్యాపించినదియు, అనన్తం = అంతములేనిదియు, ఆద్యం = అన్నిటికిని మొదటిదియు, పరం = గొప్పదియు, త్వదన్యేన = నీకంటె నితరునిచే, న దృష్టపూర్వం = పూర్వమెన్నడును చూడబడనిదియునగు, యత్ రూపం = ఏ రూపముకలదో (అట్టి) ఇదం = ఈ విశ్వరరూపము, ప్రసన్నేన = అనుగ్రహముకల, మయా = నాచేత, తవ = నీకు, ఆత్మయోగాత్ = నా సంకల్పమువలన, దర్శితం = చూపించబడినది.

తా॥ అర్జునా! తేజోనిధియును, అంతటను వ్యాపించినదియును, ఆదిమధ్యాంతరహితమును, మిక్కిలి గొప్పదియు, నన్నిటికిని ఆది యైనదియు, నీవు తప్ప ఇతరు లెవ్వరును ఇదివరలో చూడనట్టిదియు నగు నా రూపము నీయందనుగ్రహ బుద్ధిచే నా సంకల్పము వలన నీకు చూపబడినది.

అవ. ఇతరమైనవేవియు భగవంతుని సాక్షాత్కరించుకొనుటకు సాధనములు కావనుచున్నాడు.

48. శ్లో. న వేదయజ్ఞాధ్యయనై ర్న దానై। ర్న చ క్రియాభి ర్న తపోభి రుగ్రైః।
ఏవం రూప శ్శక్య అహం నృలోకే। ద్రష్టుం త్వదన్యేన కురుప్రవీర!।

అర్థము: కురుప్రవీర = కురుశ్రేష్ఠా! అర్జునా! ఏవంరూపః = ఇట్టిరూపముగల, అహం = నేను, నృలోకే = మనుష్యలోకమునందు, త్వదన్యేన = నీకంటె ఇతరుని చేత, వేదయజ్ఞాధ్యయనైః = వేదము యజ్ఞము అధ్యయనముల సహాయముచేత, ద్రష్టుం = చూచుటకు, నశక్యః = శక్యమైనవాడనుకాను, క్రియాభిః చ = వైదికక్రియల చేతను, న = శక్యమైనవాడనుకాను, ఉగ్రైః = తీక్షణములైన, తపోభిః = తపస్సుల చేతను, న = శక్యమైనవాడనుకాను.

తా ॥ ఓ అర్జునా! నీకంటె ఇతరులెవ్వరుకూడ ఈ లోకమున కేవల వేదాధ్యయనము చేతనేగాని, యజ్ఞాదులచేతనేగాని, అధ్యయనము చేతనేగాని, అగ్నిహోత్రము చేతనేగాని, దానములచేతనేగాని, ఉగ్రములైన తపస్సులచేతనేగాని, నా నిజ రూపమును చూడజాలరు.

అవ. శ్రీకృష్ణుడర్జునుని నోదార్చి తన సౌమ్యరూపమును జూపెద ననుచున్నాడు.

49\. శ్లో. మా తే వ్యథా మా చ విమూఢభావో
దృష్ట్వా రూపం ఘోర మీదృ ఙ్మ మేదమ్ ।
వ్యపేతభీః ప్రీతమనాః పునస్త్వం
తదేవ మే రూప మిదం ప్రపశ్య ॥

అర్థము : ఈదృక్ = ఇటువంటి, ఘోరం = భయంకరమైన, మమ = నాయొక్క, ఇదం రూపం = ఈ, విశ్వరూపమును, దృష్ట్వా = చూచి, తే = నీకు, వ్యథా = భయము, మా = వలదు, విమూఢభావః చ = తెలివి లేకుండుటయు, మా = వలదు, త్వం= నీవు, వ్యపేతభీః = పోగొట్టబడిన భయముకలవాడవై, ప్రీతమనాః = సంతోషించిన మనస్సు కలవాడవగుచు, మే = నా యొక్క, తత్ = ఆ పరిచితమైన, ఇదం రూపం, ఏవ = ఈ సౌమ్య రూపమునే, పునః =తిరిగి, ప్రపశ్య =చూడుము.

తా ॥ ఇట్టి భయంకరమైన నా విశ్వరూపమును జూచి నీవు భయపడకుము, తెలివి తప్పకుము. నేను నీకు వెనుక పరిచితమైన సౌమ్యరూపమునే చూపెదను. నీవు భయము వీడి సంతుష్టచిత్తుడవై ఆ రూపమునే మరల చూడుము.

అవ. అర్జునుడు వేడినట్లే శ్రీకృష్ణుడు తన సౌమ్యరూపమును జూపి ఓదార్చెనని సంజయుడు ధృతరాష్ట్రునితో జెప్పుచున్నాడు.

సఞ్జయ ఉవాచ = సంజయుడు పలికెను.

50\. శ్లో. ఇత్యర్జునం వాసుదేవ స్తథోక్త్వా ।
స్వకం రూపం దర్శయామాస భూయః ।
ఆశ్వాసయామాస చ భీత మేనం
భూత్వా పున స్సౌమ్యవపు ర్మహాత్మా ।

అర్థము : వాసుదేవః = శ్రీకృష్ణుడు, అర్జునం = అర్జునుని గూర్చి, ఇతి = ఇట్లు, ఉక్త్వా = పలికి,

తథా = అట్లే, స్వకం = తనదైన, రూపం = పూర్వ రూపమును, భూయః = తిరిగి, దర్శయామాస = చూపించెను, మహాత్మా = శ్రీకృష్ణుడు, పునః చ = తిరిగియు, సౌమ్యవపుః = శాంతరూపము కలవాడు, భూత్వా = అయి, భీతం = భయమును చెందిన, ఏనం = ఈ యర్జునుని, ఆశ్వాసయామాస = ఓదార్చెను.

తా ॥ శ్రీకృష్ణు డర్జునునితో నిట్లు పలికి యాతడు కోరినట్లే తిరిగి తన వెనుకటి సౌమ్య రూపమును జూపెను. తన విశ్వరూపమును జూచి భయపడిన అర్జునునకు పరిచితమైన తన సౌమ్యరూపమును జూపి ఓదార్చెను.

అవ. పరిచితరూపమును దర్శించి అర్జునుడు శాంతించితిననుచున్నాడు.

శ్లో. దృష్ట్వే దం మానుషం రూపం । తవ సౌమ్యం జనార్దన! ।
ఇదానీ మస్మి సంవృత్త । స్సచేతాః ప్రకృతిం గతః ॥

అర్థము ః జనార్దన = కృష్ణా ! తవ = నీయొక్క, సౌమ్యం = ప్రసన్నమైన, మానుషం = మనుష్యసంబంధమైన, ఇదం = ఈ, రూపం = ఆకారమును, దృష్ట్వా = చూచి, ఇదానీం = ఇప్పుడు, సచేతాః = తేటనొందిన మనస్సు కలవాడను, సంవృత్తః = అయితిని, ప్రకృతిం = స్వభావమును, గతః = పొందినవాడను, అస్మి = అగుచున్నాను.

తా ॥ ఓ కృష్ణా ! మనుష్యాకారముతో గూడి మిక్కిలి సౌమ్యమైయుండెడి నీరూపమును జూచి ఇప్పటికి మనస్సు తేటచెంది పూర్వపు స్వస్థతను పొందితిని.

అవ. భగవాను డీ విశ్వరూపముయొక్క అపూర్వతను జెప్పుచున్నాడు.

52. శ్లో. సుదుర్దర్శ మిదం రూపం । దృష్టవా నసి యన్మమ ।
దేవా అప్యస్య రూపస్య । నిత్యం దర్శన కాఙ్క్షిణః ॥

అర్థము ః మమ = నాయొక్క, యత్ = ఏ రూపమును, దృష్టవాన్ అసి = చూచితివో, ఇదం రూపం = ఈ విశ్వరూపము, సుదుర్దర్శం = చూచుటకు మిక్కిలి కష్టమైనది. దేవాఃఅపి = దేవతలుకూడా, నిత్యం = ఎల్లప్పుడును, అస్యరూపస్య = ఈ విశ్వరూపముయొక్క, దర్శన కాఙ్క్షిణః = దర్శనమును కోరువారు. (భవన్తి = అగుచున్నారు.)

తా ॥ ఓ అర్జునా ! నీ విప్పుడు జూచిన నా విశ్వరూప మెవ్వరికిని చూడనలవి కానిది. దేవతలు దీనిని చూడవలెనని నిత్యమును గోరుచునే యుందురు.

అవ. ఎందువలననగా

53. శ్లో. నాహం వేదై ర్న తపసా । న దానేన న చేజ్యయా ।
శక్య ఏవం విధో ద్రష్టుం । దృష్టవా నసి మాం యథా ॥

అర్థము : మాం = నన్ను, యథా = ఏప్రకారము, దృష్టవాన్ = చూచినవాడవు, అసి = అగుచున్నావో, ఏవం విధః = ఇట్టిస్వరూపము కలవాడనుగా, అహం = నేను, వేదైః = వేదాధ్యయనాదులచేతను, ద్రష్టుం = చూచుటకు, న శక్యః = సాధ్యుడనుకాను, తపసా = తపస్సుచేత, న = కాను, దానేన = దానముచేత, న= కాను, ఇజ్యయా చ = యాగము చేతను, న = సాధ్యుడనుకాను.

తా ॥ నా నిజస్వరూపమును నీవిప్పుడు చూచినట్లు చూచుటకు భక్తిలేని కేవల వేదాధ్యయనము గాని, యాగ దాన హోమ తపస్సులు గాని సాధనములు కానేరవు.

అవ. ఇక ముఖ్యకారణమును దెలుపుచున్నాడు.

54. శ్లో. భక్త్యా త్వనన్యయా శక్య । అహ మేవం విధోఽర్జున ।
జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన । ప్రవేష్టుం చ పరన్తప ! ॥

అర్థము : అర్జున = అర్జునుడా ! ఏవంవిధః = ఇట్టివాడనగు, అహం = నేను, అనన్యయా = ఇతరఫలముల నపేక్షించని, భక్త్యా తు = భక్తిచేతనై తే, తత్త్వేన = యథార్థముగా, జ్ఞాతుం = తెలిసికొనుటకును, ద్రష్టుం చ = ప్రత్యక్షముగా జూచుటకును, ప్రవేష్టుం చ = పూర్ణముగా పొందుటకును, పరన్తప = శత్రువులను తపింపజేయువాడా ! శక్యః = శక్యుడను.

తా ॥ నిత్యశత్రువులగు ఇంద్రియములజయించినవాడా! ఇతర ఫలాశలేని భక్తిచే నన్ను నిజరూపముతో తెలియుటకును, నిజరూపముతో జూచుటకును, నిజరూపముతో పూర్ణముగా అనుభవించుటకును, శక్యమగుదును.

అవ. భక్తి అంగముగా గలిగియున్న వేదాధ్యయన యాగ దాన హోమాదుల ఉపయోగమును జూపుచు పరిపూర్ణానుభవమునకు కారణమైన భక్తియొక్క అవస్థా విశేషమును దెలుపుచున్నాడు.

55. శ్లో. మత్కర్మకృ న్మత్పరమో। మద్భక్త స్సఙ్గవర్జితః।
నిర్వైర స్సర్వభూతేషు। య స్స మా మేతి పాణ్డవ ! ॥

ఇతి శ్రీ భగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే విశ్వరూపసందర్శనయోగో నామ ఏకాదశోఽ ధ్యాయః

అర్థము : పాణ్డవ = అర్జునా ! మత్కర్మకృత్ = తనధర్మములను నాయారాధన బుద్ధితో చేయువాడును, మత్పరమః = నేనేప్రధానోద్దేశముగా గలవాడును, మద్భక్తః = పరమప్రీతితో నన్నేధ్యానించువాడును, సఙ్గవర్జితః = నాకంటె వేరైన వస్తువులతో తనకు సంబంధము లేనివాడును, సర్వభూతేషు = సకలప్రాణులయందును, నిర్వైరః = విరోధములేని వాడును, యః = ఎవడో, సః = వాడు, మాం = నన్ను, ప్రాప్నోతి = పొందుచున్నాడు.

తా ॥ తన వర్ణాశ్రమ ధర్మములను ఫలాశను విడిచి నా యారాధన యను బుద్ధితో నాచరించువాడును, నా సాయుజ్యమును బడయుటయే ప్రధానోద్దేశముగా గలవాడును, పరమప్రీతితో నన్ను ధ్యానించనిచో బ్రతుకలేనియావేశముతో ధ్యానించువాడును, నాకంటె వేరైన సకల ఐహికాముష్మిక పదార్థములయందును తనకు సంబంధము లేకుండ జేసికొనినవాడును, సకలజీవరాశియెడల విరోధము లేక ప్రేమభావమును నెరపువాడును నగు నా ప్రియభక్తుడు నన్నే పొందుచున్నాడు.

ఇది ఉపనిషదర్థ ప్రతిపాదకమును, బ్రహ్మవిద్యయు, యోగ శాస్త్రమును శ్రీకృష్ణార్జున సంవాదరూపమును అయిన శ్రీ భగవద్గీత యందలి విశ్వరూప సందర్శనయోగ మనెడు

పదునొకండవ అధ్యాయము

సంజయుని శ్లోకములు	8	మొత్తం శ్లోకములు	55
అర్జునుని శ్లోకములు	33	ఇంతవరకైన మొత్తం శ్లోకములు	468
శ్రీకృష్ణుని శ్లోకములు	14		

భగవద్గీత ప్రశ్నోత్తరావళి
ఏకాదశాధ్యాయము

1. ప్ర. **ఈ యధ్యాయమునకుపేరేమి ? ఆ పేరెందులకుంచబడినది ?**

ఉ. ఈ యధ్యాయమునకు 'విశ్వరూపసందర్శనయోగ'మని పేరు.

అర్జునుడు శ్రీకృష్ణపరమాత్మవలన ఆతని విభూతిని యోగమును విస్తారముగా వినెను. దానిచే మహావిశ్వాస ముదయించి భక్తిరేఖలు విజృంభించదొడంగెను. అట్టి రూపముతో నాతని సాక్షాత్కరింప గోరెను. అందులకై సవినయముగా ప్రార్థించెను. అందుచే పర మాత్మహృదయము కరిగి ఆతనికి దివ్య చక్షుస్సును ప్రసాదించి తన యద్భుతమగు విశ్వరూపమును జూపెను. అర్జునుడది చూచి ఆశ్చర్యముతో ప్రశంసించి తృప్తిని చెం దెను. ఈ విషయమంతయు యీ యధ్యాయమున వర్ణింపబడుటచే దీనికా పేరుంచబడెను.

2. ప్ర. **ఈ యధ్యాయములో చెప్పబడిన ముఖ్యవిషయములేమి ?**

ఉ.

శ్లో. ఏకాదశే స్వమాహాత్మ్యసాక్షాత్కారావలోకనం
దత్త, ముక్తం విది ప్రాప్త్యోర్భక్త్యై కోపాయతా తథా ||

1. తన మాహాత్మ్యమును సాక్షాత్కరించుటకు సాధనమగు దివ్య చక్షుస్సు నొసంగుట.
2. ఆతనిని తెలుసుకొనుటకు, పొందుటకు, చూచుటకు భక్తి యొక్కటేకారణ మని చెప్పుట - ముఖ్యవిషయములు.

--- వివరములు ---

1. అర్జునుడు సవినయముగా విశ్వరూపమును జూపుమని శ్రీకృష్ణుని ప్రార్థించుట. (1 నుంచి 4 శ్లో.)
2. శ్రీకృష్ణుడందుల కంగీకరించి ఆ రూపమును చూచుటకు తగిన శక్తి గల దివ్య చక్షుస్సు నొసంగుట. (5 నుంచి 8 శ్లో.)
3. సంజయుడు తాను గాంచినరీతిని విశ్వరూపమును వర్ణించి ధృత రాష్ట్రునకు జెప్పుట. (9 నుంచి 13 శ్లో.)
4. అర్జునుడు గాంచిన విశ్వరూపమును అతని మాటలుగా వర్ణించుట. (14నుంచి31 శ్లో.)

5. నీవెవరివో తెలుపుమని అర్జునుడడిగిన ప్రశ్నకు శ్రీకృష్ణుడుత్తరము నిచ్చుట (32 నుంచి 34 శ్లో.)
6. అది విని అర్జునుడు శ్రీకృష్ణుని స్తోత్రముచేసి తన యపచార ములను క్షమించుమనియు, వెనుకటి రూపమును చూపుమనియు వేడుకొనుట. (35 నుంచి 46 శ్లో.)
7. శ్రీకృష్ణుడందుల కంగీకరించి ఆ రూపదర్శన దౌర్లభ్యమును చెప్పి తన సౌమ్యరూపమును జూపి ఓదార్చుట. (47 నుంచి 49, 52 నుంచి 54 శ్లో.)
8. భగవత్ప్రాప్తికి కారణమైన భక్తియొక్క అవస్థానవిశేషమును జెప్పుట. (55 శ్లో.)

3. ప్ర. **ఈ యధ్యాయమునకు వెనుకటి అధ్యాయముతోను ప్రధానశాస్త్రార్థ ముతోనుగల సంబంధ మేమి ?**

ఉ. వెనుకటి అధ్యాయమునందు భక్తి ఉదయించుటకును వృద్ధి పొందుటకును భగవదసాధారణమైన కల్యాణగుణములతోపాటు భగవంతుడన్నిటికి అంతరాత్మయనియు, అందుచే చేతనాచేతనము లన్నియు ఆతనికి శరీరభూతములగుటచే వాటియొక్క స్వరూపస్థితి ప్రవృత్తులు ఆయన యధీన మైనవనియు చెప్పబడెను. అది విని యర్జును నకు అతని యందు పరిపూర్ణ విశ్వాసముకలిగి అట్టి భగవంతుని సాక్షాత్కరించ గోరెను. ఆతని కోరిక ననుసరించి శ్రీకృష్ణపరమాత్మ తన విశ్వరూపమును చూపించెను. ఆ విషయ మీ యధ్యాయమున ఉపన్యసించబడెను. గాన దీనికి వెనుకటి యధ్యాయముతో నిట్టి సాక్షాత్సంబంధము కలదు.

శాస్త్రసారార్థము ముక్తియే గాన దానికి ముఖ్యసాధనము భక్తి, ఆ భక్తి కలుగుటకును వృద్ధిపొందుటకును భజనీయ వస్తుగౌరవము పరోక్షముగనైనను ఎఱుంగవలెను. ప్రత్యక్ష ముగనే చూచిన చెప్పనేల? అందుచే నీ యధ్యాయమునకు ప్రధానశాస్త్రార్థముతో గూడ సాక్షా త్సంబంధము కలదు.

. ప్ర. **అర్జునుడు శ్రీకృష్ణుని విశ్వరూపమును జూపుమని ఎట్లు ప్రార్థించెను ?**

ఉ. "కృష్ణా! దేహాత్మాభిమాన మోహముతో విలపించుచున్న నాకు నీయనుగ్రహముచే ఆత్మను గూర్చి చెప్పదగిన పరమరహస్యమును 'నత్వే వాహం' (2 అ 12 శ్లో.) అను శ్లోకముతో ప్రారంభించి 'తస్మా ద్యోగీ భవార్జున' (6 అ. 46 శ్లో.) అను శ్లోకము వరకు ఉపదేశించిన ఉపదేశముతో నాకుగల ఆత్మను గూర్చిన మోహమంతయు గతించినది.

పిమ్మట ఏడవ అధ్యాయము మొదలు పదియవ అధ్యాయమువరకు సమస్త పదార్థముల యొక్క ఉత్పత్తి ప్రళయములు నీవలననే కలుగుచున్నవని సవిస్తరముగా చెప్పితివి. దానిచే నీయొక్క నిత్యమైనట్టియు, సకల చేతనాచేతనములకు శేషివగు నట్టియు. కల్యాణగుణగణముచే పరతరుడవగు నట్టియు, సర్వాధారుడవగునట్టియు, సకల ప్రవృత్తులకును కారణభూతుడవైనట్టియు మొదలగు మాహాత్మ్యము నెఱింగి అది నిజమేయని విశ్వసించితిని. విశ్వసించి అన్నిటిని భాసింపజేయునట్టియు, పాలించునట్టియు, సృష్టించునట్టియు, సంహరించునట్టియు, భరించునట్టియు, కల్యాణ గుణముల కాటపట్టగునట్టియు, సర్వోత్కృష్టమగునట్టియు, ఇతర విలక్షణమగునట్టియు రూపమును చూడగోరుచున్నాను. అట్టి రూపమును చూచుటకు నేను తగుదునని తలంచితివేని నీ సంకల్పముచే నట్టి రూపమును నాకు సమగ్రముగ జూపుము" అని ప్రార్థించెను.

5. ప్ర. శ్రీకృష్ణు డర్జునునకు తన రూపమును జూపుట కెట్లంగీకరించెను?

ఉ. "అర్జునా! అనేకవిధములగు భూషణములు ఆయుధములు, లాంఛనములు, భుజములు మొదలగు విశేషములతో గూడినట్టియు, ఆయా యుగములకు తగినట్టి తెలుపు యెరుపు పసుపు నలుపు రంగులతో కూడి యున్నట్టియు, దేవతలు, మను ష్యులు పశువులు, పక్షులు మొదలగు ఆకృతులతో కూడియున్నట్టి నా రూపములను నూరుల కొలదియు వేలకొలదియు నీవు చూడుము.

నా ఒకే రూపమున పన్నిద్దరు సూర్యులను, ఎనమండ్రు వసువులను, పదునొకండుగురు రుద్రులను, ఇద్దరశ్వినీదేవతలను, నలువదితొమ్మిది వాయువులను చూడుము. నీ వీ జగత్తున ప్రత్యక్షముగా జూచిన వస్తువులను, శాస్త్రమువలన తెలుసుకొనిన సమస్త వస్తువులను, ఆ శాస్త్రముల యందు గూడ తెలియబడని వస్తువులను చూడగలవు.

నా కనేకదేహము లున్నవి కాని నేను నీ కిప్పుడు నా విశ్వదేహము నొక్కటినే జూపుచున్నాను. ఆ ఒక్కదేహమునందే అందును ఒక భాగము నందే చరాచరాత్మక మగు సకల ప్రపంచ ముండుటను చూడుము. నీవు మొదట ప్రశ్నించిన కురుపాండవుల జయాపజయ నిర్ణయమును కూడ ఇప్పుడే నా దేహమున చూడగలవు. కాని నీచర్మ చక్షువు పరిమిత దేశములో నుండు పరిమిత వస్తువులను మాత్రమే చూడగల్గును. అంతియే గాని సకల

విలక్షణమును అపరిమితమునగు నా విశ్వరూపమును చూడజాలవు. కావున నీకు నే నందులకు తగిన దివ్యచక్షుస్సు నిత్తును. దాన నీవు నా యనంత జ్ఞానాది కల్యాణ గుణయోగమును, అపారవిభూతియోగమును చూడగలుగుదువు"అని చెప్పి తన విశ్వరూపమును నర్జునునకు జూపెను.

6. ప్ర. సంజయుడు తాను గాంచిన విశ్వరూపమును ధృతరాష్ట్రున కెట్లు వర్ణించి చెప్పెను ?

ఉ. ఒక్కొక్కజాతి కనేకములు చొప్పున పెక్కుజాతుల పెక్కు ముఖములును, ఆ ముఖములకు తగిన అన్ని కండ్లును కలదియై విశ్వరూపము ఆశ్చర్యమును గొలుపుచున్నది. ఆ దేహము జగత్తున కంతయు నాశ్రయము. కావున ఈ చోటనున్నది, యీ చోట లేదన శక్యముకాదు. మూడు కాలముల యందున్న సమస్త పదార్థములకును ఆధారము. కావున యీ కాలమందున్నది యీ కాలమందు లేదు అనుటకు శక్యము కాదు. ఇక దీనిని బట్టి యీ వస్తువునందున్నది యీ వస్తువునందు లేదనుటకు శక్యము కాదు. గాన దేశకాలవస్తుపరిచ్ఛేదములు లేనిదని తెలియుచున్నది. దానికి ముఖములన్ని ప్రక్కలనున్నవి. దివ్య వస్త్రములతోను, అట్టి గంధమాల్య ఆభరణాదులతోను అలంకరింప బడియున్నది. దివ్యమగు ఆయుధములను ధరించియున్నది. ఆకసమున నొక్కసారిగా వేయిమంది సూర్యులుదయించినను ఆ కాంతి యాతని విశ్వదేహకాంతికి సరియనరాదు. ఆతడఖండ తేజస్స్వరూపుడు గదా! సంజయుడైనను తనకు వ్యాసమహర్షి ప్రసాదించిన దివ్యచక్షుస్సున్నది గనుకనే ఆ విశ్వరూపుని సేవించగల్గెను.

అట్టి దేవదేవుని విశ్వశరీరమున బ్రహ్మాది పిపీలికాది పర్యంతమును గల భోక్తృ వర్గములనియు, చతుర్దశభువనములనెడు భోగస్థానము లనియు, భోగోపకరణములనియు అనేక విధములుగా నున్న సమస్త జగత్తును ఒక్కచోట నున్న దానినిగా భగవంతుడు తనకు ప్రసాదించిన దివ్యచక్షుస్సుతో చూడగల్గెను.

ఇట్లు మహాశ్చర్యమగు సమస్త ప్రపంచమును తన దేహమున నొక మూల నిలువబెట్టి నడిపించుచున్న మిక్కిలి ఆశ్చర్యమగు కల్యాణ గుణములతో గూడియున్న దేవుని చూచిన అర్జునుని ఒడలంతయు గగుర్పొడిచి దండమువలె సాష్టాంగముగా నేలబడి శిరస్సుతో ప్రణమిల్లెను.

7. ప్ర. తాను గాంచిన విశ్వరూపమును అర్జునుడెట్లు వర్ణించెను ?

ఉ. శ్రీకృష్ణా! సమస్త దేవతలను, సకల ప్రాణిసమూహములను, చతుర్ముఖ బ్రహ్మను, బ్రహ్మచిత్తవృత్తి ననుసరించి వర్తించు రుద్రుని, సమస్త ఋషులను, తక్షకుడు వాసుకి మొదలగు సర్పములను నీ దేహమునందు చూచుచున్నాను. నిన్ను అనేకబాహువులు ఉదరములు ముఖములు నేత్రములు కలిగి అపరిమితా కారము కలవానినిగా జూచుచున్నాను. నీ వనంతుడవుగాన నీ రూపమున కాదిమధ్యాంతములు గాన్పించుటలేదు. తేజోరాశివై యంతటను ప్రజ్వలించు చున్న నిన్ను వెలుంగుచున్న సూర్యాగ్నులకు మించి చూచుట కశక్యమైన తేజస్సు కలిగి సర్వేశ్వరత్వమును తెలుపు కిరీట గద చక్రాదులతో చూచు చున్నాను. ఇంతకు పూర్వము నా సహజమగు చర్మ చక్షుస్సులకు యదుకుల తిలకుడవై భాసించిన నీవిప్పుడు దివ్యచక్షుస్సునకు అక్షరాది స్వరూపుడవై గాన్పించుచున్నావు. నీవు సమస్తప్రపంచమునకు పరమాధారుడవై స్వరూప గుణవిభూతులలో నే మార్పును చెందక, నీ యవతారములచే వైదిక ధర్మములను గాపాడుచు నుండునట్టి పురాణ పురుషుడవని నేనిప్పు డెఱింగితిని.

మరియు నిన్ను ఆదిమధ్యాంతరహితునిగాను, నిరతిశయ జ్ఞాన బలైశ్వర్య వీర్యశక్తి తేజస్సులకు నిధినిగాను, అనంతములగు బాహు ఉదర పాద ముఖాదులు గల వానినిగాను, ఒక్కొక్క నేత్రమే అనుకూలురగు దేవతల పట్ల చంద్రుని వలె ప్రసాదమును ప్రతికూలురగు రాక్షసాదులపట్ల సూర్యునివలె ప్రతాపమున్ను చూపునట్టి అనేక నేత్రములు కలవానినిగాను, మండుచున్న ప్రళయకాలాగ్నివలె సంహారమునకు తగిన ముఖము కలవానినిగాను నీ తేజస్సుతో లోకమును దహించుచున్నవానినిగాను చూచుచున్నాను.

మీదు లోకములకు క్రింది లోకములకు మధ్య నున్న ప్రదేశమంతటను నీవే వ్యాపించియున్నావు. యుద్ధమును చూడగోరి వచ్చిన బ్రహ్మ మొదలు సమస్త దేవగణ అమరగణ పితృగణ సిద్ధ గంధర్వ యక్ష రాక్షసులందు శత్రువులు మిత్రులు మధ్యస్థులు అగు లోకులెల్లరును అత్యద్భుతమును అతి భయంకరమును అయి యుండు నీ రూపమును జూచి మిక్కిలి భయపడిరి.

(భగవంతుడు అర్జునునకు వలెనే దేవాదులకు గూడ తన విశ్వరూప రూపమును చూడ సమర్థమైన దివ్యచక్షుస్సును ప్రసాదించెను. ఎందులకనగా - అర్జునునివలె వారును దైవీ సంపదకు చెందిన ప్రియభక్తులున్ను చూడవలెనని కాంక్షించుచున్నవారును అగుటచేతను, ఇప్పటికి వారికా దివ్యరూపమును దర్శించుటకు తగిన పుణ్యము పండుటచేతను, మిక్కిలి

మహనీయులగు దేవతలుకూడ తన విశ్వరూపమును జూచి భయపడుటను చూచినచో నర్జునునకు తన నిరంకుశైశ్వర్యము ప్రత్యక్షమగు నను తలంపుచేతను, దాని వలన నాతడు తాను జెప్పిన మాటలయందు విశ్వాసముంచి ప్రస్తుత యుద్ధమును జేయ సన్నద్ధుడగుట కుపయోగించుట చేతను వారికిని దివ్యచక్షుస్సును ప్రసాదించెను.)

ఆ యుద్ధమును చూడవచ్చిన దేవసమూహములు నీ విశ్వస్వరూపమును సందర్శించి సంతోషముతో నీ దరికి చేరుచున్నారు. అందులో కొందరు భయపడి చేతులు జోడించి తమకు తెలిసినంతవరకు స్తోత్రరూపములైన వేదవాక్యముల నుచ్చ రించు చున్నారు. నీవు సర్వోత్కృష్టుడవని యెఱింగిన భృగ్వాది మహర్షులును సనకాది సిద్ధులును భక్తి పారవశ్యమున సేవకులు యజమానుని జూచి చెప్పునట్టి "స్వస్తి" అనెడు మంగళా శాసన శబ్దములను ఉచ్చరించి నీ మహి మకు తగిన స్తుతిపాఠములచే నిన్ను స్తుతించుచున్నారు. రుద్రులు, ఆదిత్యులు, వసువులు, విశ్వేదేవతలు, అశ్వినులు, మరు త్తులు, గంధర్వులు, యక్షులు, రక్షస్సులు, సిద్ధులు మొదలగు ముప్పది మూడు జాతుల దేవతలున్ను, పితృగణములున్ను మిక్కిలి ఆశ్చర్యముతో నిన్ను చూచుచున్నారు.

మహాబాహో! అనేక ముఖములు అనేక నేత్రములు అనేక బాహువులు అనేక తొడలు పాదములు పెక్కుకడుపులు కలిగి యుండి పెక్కుకోరలచే భయంకరమైన నీ యాకారమును జూచి శత్రువులగు రాక్షసులు, మిత్రులగు దేవతలు, ఇతర మధ్యస్థులును అతి భయముతో వణకుచున్నారు. నేనును మిక్కిలి భయపడుచున్నాను.

స్వామీ! పరమపదము నొఱయుచు ప్రకాశమానుడవై అనేకరంగులతోను, తెఱ చిన నోళ్ళతోను, ప్రజ్వలించుచున్న విశాల నేత్రములతోను నుండు నిన్ను జూచుటచే నా మనస్సునకు కలిగిన కలవరము కుదుటబడుటలేదు. నేను నా దేహమును నిలుప జాలక యున్నాను. కోరలతో భయంకరములై సర్వసంహారమునకై ప్రళయకాలాగ్నిని గ్రక్కుచున్న నీ ముఖములను జూచినంతనే నాకు దిక్కులు తెలియుట లేదు. సుఖము మొదలే సున్న. దేవదేవేశ్వరా! ప్రసన్నుడవు కమ్ము. నన్ను స్వస్థపరచుము.

(ఇట్లు శ్రీకృష్ణపరమాత్మ అర్జునునకు సకలలోకముల యొక్క స్థితి ప్రవృత్తులు తన యధీనమని జూపెను. ఇక కౌరవులలోను పాండవులలోను రాజవేషమున బుట్టి భూమికి భారభూతులైయున్న రాజులనెల్లర తానే సంహరింప నిశ్చయించి యుండుటను అర్జునునకు జూపెను. అది

ముందెప్పుడో జరుగబోవు వ్యాపారమైనను భగవదనుగ్రహముచే దివ్యచక్షుస్సును బడసియున్నాడు గాన అర్జునుడు దాని నిప్పుడే చూడగలుగుచున్నాడు.)

ఆహా! కృష్ణా! ధృతరాష్ట్రుని పుత్రులైన దుర్యోధనాదులందరును, భీష్మ ద్రోణకర్ణాదులును, కౌరవపక్షమునకు చెందిన ఇతర రాజలోకమును, మన పక్షమునందున్న వీరులును కోరలచే భయంకరములగు నీ నోళ్ళలో వినాశమునకై అతి త్వరలో ప్రవేశించుచున్నారు. కొందరచ్చట నీ కోరల సందున ఇరుకుకొని నలిగిన తలలతో గాన్పించుచున్నారు.

నదీజల ప్రవాహములు సముద్రమువైపు అతివేగముతో ప్రవహించుచున్నట్లును మిక్కిలి ప్రజ్వలించుచున్న మంటలో మిడుతలు వేగముతో జొచ్చుచున్నట్లును, యీ రాజులందరు తమ రూపుమాపుకొనుటకే త్వరపడుచు తమంతట తామే నలుదిక్కులకు జ్వాలల నిడుచున్న నీ ముఖములయందు ప్రవేశించుచున్నారు. నీవు వారలనెల్లరను మ్రింగుచున్నవాడవై, వారి రక్తసిక్తములగు నీ పెదవులను కోపావేశముతో మాటిమాటికిని నాకుకొనుచున్నావు. అతిభయంకరములగు నీ కిరణములు తమ కాంతిచే లోకమునందంతటను వ్యాపించి దహించుచున్నవి.

హే కృష్ణా! నేను నీ నిరంకుశైశ్వర్యమును జూడగోరి దానిని చూడవలెనని నిన్ను ప్రార్థించియుండ దానిని జూపక శత్రువులకు జూపదగిన యీ ఘోరమైన భయంకరరూపము నేల నాకు జూపితివి? నీకీ రూపమును జూపుటలోగల అభిప్రాయమేమో నే నెఱుంగజాల. దానిని నాకు జెప్పుము. నాకు ప్రసన్నుడవు కమ్ము. నీకు నమస్కరింతును అని అర్జునుడు తాను గాంచిన విశ్వరూపమును వర్ణించెను.

8. ప్ర. ఈ రూపమును జూపుటలో గల నీ యభిప్రాయమేమని అర్జునుడడిగిన ప్రశ్నకు శ్రీకృష్ణు డెట్లుత్తరు విచ్చెను ?

ఉ. అర్జునా ! నేను దుర్యోధనాది రాజసమూహము యొక్క ఆయుః పరిమితిని లెక్కించుచు వారిని నాశముచేయుటకే యిట్టి ఘోరరూపముతో మిక్కిలి పెరిగి వీరి నెదుర్కొని చంప బూని యున్నాను. వీరందరును నీ వేమియు చేయకున్నను నా సంకల్పముచే తప్పక నశించి తీరుదురు. అయినచో నన్నెందుల కీ పనికి ప్రేరేపింతువందువేమో ? నా భక్తుడవగు నీకు జయ యశోరాజ్యాదిలాభములు కలుగజేయు తలంపుతో నిన్ను పురిగొల్పుచున్నాను. కావున యుద్ధమునకు గడంగుము. వారిని జయింపుము. కీర్తినార్జింపుము. ధర్మబద్ధమైన రాజ్యసుఖముల ననుభవింపుము. మీ కపరాధ మొనరించిన యీ కౌరవులందరును హంతవ్యులని నే నేనాడో నిశ్చయించితిని.

అందుచే వీరి సంహారమును నేనే చేయుచున్నానియు నీవు నాచేతి శస్త్రమువలె నిమిత్తమాత్రుడవనియు తలంచుము.

ఈ భీష్మ ద్రోణ జయద్రథ కర్ణాది యోధాగ్రేసరులనందరను అపరాధులగుటచే నేను చంపుటకే నిశ్చయించితిని గాన నీవు 'వీరి నెట్లు చంపుదునా!' యను వెనుకటి భీతిని వదలి చంపుము. నీవు భీష్మ ద్రోణాదుల నెట్లు గెలుతునని సంశయించకుము. నేనే వారిని చచ్చుటకు నిశ్చయించి యుంటిని గదా! నీకా భయమేల ? యుద్ధమును చేయుము. యుద్ధమున జయమునందుదుము. వీరు నీ కిప్పుడు శత్రుపక్షమున చేరి యున్నారు. గాన ప్రత్యక్షముగా వధించుటలో నీకు పాపము లేశమైనను అంటదు. జయమే కలుగును అని చెప్పెను.

9. ప్ర. శ్రీకృష్ణుని విశ్వరూప సందర్శనాభిప్రాయము నెఱింగి అర్జును డెట్లు ప్రార్థించెను?

ఉ. అది విని అర్జునుడు గడగడవడంకుచు చేతులు జోడించి పడిపడి దండము లిడుచు మిక్కిలి భయపడుచు గద్గదస్వరముతో కృష్ణా ! ఈ యుద్ధమును జూడగోరి వచ్చియున్నను సమస్త దేవగణమున్ను నీయనుగ్రహముచే దివ్యచక్షుస్సును బడిసి నిన్ను సందర్శించి నీవు సర్వేశ్వరుడవేయని నిశ్చయించుకొని నీ కీర్తి కపరిమితానందభరితు లగుచున్నారు. రాక్షసులు నీ రూపమును జూచి భయపడి దిక్కులు పట్టుచున్నారు. సిద్ధులు మొదలగు నీ భక్తవర్గము నిన్ను నమస్కరించుచున్నారు. ఇవి తగిన పనులే. నీవు సర్వోత్కృష్టుడవు. బ్రహ్మను పుట్టించినవాడవు. అట్టితరి వారేల నీకు నమస్కరింపరు ? అది యుక్తమే. ఓ జగన్నివాసా ! అక్షరమన బడు జీవతత్వము నీవే! కార్యావస్థలో నుండుటచే సత్తనబడునట్టియు, కారణావస్థలో నుండుటచే అసత్తనబడునట్టియు, ప్రకృతితత్వము నీవే. ఆ ప్రకృతి జీవులకంటె వేరైన ముక్తాత్మతత్వము నీవే. ఇట్లు **సర్వతత్వాత్మకుడవు** గనుకనే నీవు ఆది దేవుడవును పురాణపురుషుడవును అయితివి. నీకు శరీరమై యుండు యీ జగత్తునకెల్ల ఆత్మవై ఆధారభూతుడవు నీవే, ఈ ప్రపంచమునందలి తెలుసుకొనువారు, తెలియబడు పదార్థములు నీవే. ఇట్టివాడ వగుటచే పరమప్రాప్యస్థానమును నీవే. కావుననే నీ వంతటను ఆత్మభూతుడవై వ్యాపించియున్నావు. ఇందువలననే వాయువు, యముడు, అగ్ని, వరుణుడు, చంద్రుడు, బ్రహ్మ వీరందరకును ముత్తాతవు నీవే. తాతవు నీవే (అది యెట్లనగా - అందరిని పుట్టించువారు ప్రజాపతులు కాన వారు తండ్రులు. వారిని పుట్టించినవాడు బ్రహ్మ గాన నాతడు తాత, ఆ బ్రహ్మను

పుట్టించినవాడు భగవంతుడు కావున నాతడు ముత్తాత) నీ విట్టి యద్భుతాకారుడవు గాన నీకన్ని ప్రక్కల వేనూఱు వందనములు. నీవు చేతనాచేతనములన్నిటికిని లోపల ఆత్మవై వ్యాపించి యున్నావు, కావున అవి నీకు శరీరములు, శరీరమునకు వాచకములైన శబ్దములన్నియు శరీరిని జెప్పును. కావున నీవు సర్వశబ్దవాచ్యుడవు.

నీ విట్టి మహామహిమ కలవాడవని యెఱుంగలేక చిరపరిచయ ముండుటచే పొరబాటున చెలికాడవని తలంచి "ఓ కృష్ణా! ఓ యాదవా! ఓ మిత్రమా !" యని వినయము తప్పి ఏమేమి పలికియుందునోగదా! సకల దేవసంసేవ్యుడవగు నీకు పరిహాసముగా నే మేమి యపచారములు చేసితినోగదా! మనము కలసి యొకటిగా తిరుగునప్పుడు, ఏకాంతముగా నున్నప్పుడు, పదిమందిలో నున్నప్పుడు ఏమి ఆడరానిమాటలాడితినో గదా! ఏమిజేయరాని చేతలు చేసితినోగదా! ఓ దీనదయాళూ! నా తప్పులన్నియు క్షమించవలెను.

ఓ దేవేశా! నీ వీ ప్రపంచమునకెల్ల తండ్రివి, గురుడవు కావున పూజ్యతముడవు. నీ కారుణ్యాది గుణములతో నిన్ను పోలిన వాడీ ముల్లోకములం దెచ్చటను లేడు. ఇక నిన్ను మించిన వా డెట్లుండును ? కాబట్టి నీకు సాష్టాంగవందన మాచరించి నన్ను అను గ్రహింప వేడుకొనుచున్నాను. ప్రసన్నుడవుకమ్ము, తెలియక యపచారము లొనరించి తెలిసి పశ్చాత్తప్తుడై ప్రార్థించిన పుత్రుని తండ్రి యుపేక్షించునా ? మిత్రుని మిత్రుడు పేక్షించునా ప్రసన్నుడుకాడా? అట్లే నాకు ప్రియుడవై పరమకారుణికుడవగు నీవును, నీకు ప్రియుడనగు నా యపచారములన్నిటిని సహించి క్షమింపుము.

దేవా! ఎన్నడును జూచి యెఱుంగని నీ యద్భుతమైన భయంకరా కారమును గాంచి భయపడినను తృప్తి చెందితిని. ఈ రూప మత్యంత భయమును గొల్పుచున్నది. గాన దీని నుపసంహరించి సుప్రసన్నమైన నీ పూర్వరూపమునే నాకు జూపుము తండ్రీ! నా పట్ల ప్రసన్నుడవగుము. ఈ వేయిభుజముల విశ్వరూపము నుపసంహరించి కిరీట చక్రాదులతో గూడిన మునుపటి చతుర్భుజములతో కూడిన సౌమ్యరూపమునే జూపుమని ప్రార్థించెను.

౧.ప్ర. శ్రీ కృష్ణుడు విశ్వరూప దౌర్లభ్యము నెట్లు వర్ణించి అర్జునునకు సౌమ్యరూపమును జూపెను ?

ఉ. అర్జునా! నా యొక్క తేజోరాశియగునట్టియు సర్వవ్యాపకమగు నట్టియు ఆదిమధ్యాంతములు లేనట్టియు, సకలచేతనాచేతనములకు నాదికారణమైన

ట్టియు, నీ కంటె నితరులెవ్వరిచేతను ఎప్పుడును చూడబడనట్టియు, నా దివ్య విశ్వరూపము చాల దుర్లభము. దేవత లెంతకాలమునుండియో దీనిని జూడవేడుచున్నారు, నిర్దుష్టమై నిష్కృష్టమైన భక్తి తప్ప ఈ రూపమును జూచుటకు వేరు సాధన మొకటియు లేదు. దానిని నీవు నా ప్రియభక్తుడవగుటచే నీ యందలి యనుగ్రహముచే నా సత్యసంక ల్పమూలమున చూపించితిని. కాని వేదములను నియమములను పాటించుచు భక్తిలేక వర్ణించినను, యజ్ఞములనట్లే భక్తిలేక ఆచరించినను అట్లే భక్తిలేక దానములు గావించినను, కఠిననియమములతో ఉగ్రతపముల నాచరించినను నీవలె భక్తిలేనిచో నేనిట్టి నా రూపమును నీకు చూపినట్లు చూపను. నిజముగ నన్నెరుగుటకును వాస్తవముగ జూచుటకును తత్త్వముగ నన్ను అనుభవించవలెనన్నను భక్తి యొక్కటియే సాధనము. ఇట్టి భయంకరస్వరూపమును చూచి నీవు భయపడకుము. మోహమును చెందకుము. నీవిదివరకు అలవాటుగ జూచుచున్న నా సౌమ్యరూపమునే చూడగలవు. చూడుము అని చెప్పి తన సౌమ్య చతుర్భుజరూపమును జూపెను. (శ్రీకృష్ణునికి చతుర్భుజరూపమే సహజరూపము. తల్లిదండ్రుల ప్రార్థనపై కంసుని చంపువర కా రూపమును జూపక అటుపిమ్మట తన ప్రియభక్తులకా చతుర్భుజ రూపముతోనే దర్శన మిచ్చుచుండెను.)

1.ప్ర. భగవత్ప్రాప్తికి కారణభూతమైన భక్తియోగము యొక్క అవస్థావిశేషములను భగవాను డెట్లుపదేశించెను ?

ఉ : శ్లో. మత్కర్మకృ న్మత్పరమో మద్భక్త స్సంగవర్జితః ।
నిర్వైర స్సర్వభూతేషు య స్స మా మేతి పాణ్డవ! ॥

మత్కర్మకృత్ = వెనుక భగవత్ప్రాప్తికి సాధనములుకావని చెప్పిన వేదాధ్యయనాది సర్వకర్మలను భగవదారాధన బుద్ధితో చేయువాడున్ను ; మత్పరమః = తాను చేయు సమస్తకర్మలను నన్ను పొందుటకే చేయువాడును, మద్భక్తః = నేనన్న అపారప్రేమ కలవాడగుటచే నన్ను గురించి పాడుట, స్తుతించుట, ధ్యానించుట, పూజించుట, నమస్కరించుట మొదలైన సేవలను చేయనిచో బ్రతుకలేనను ఆర్తితో నా యనుగ్రహమునే ఫలముగా భావించి నిరంతరము చేయుచుండువాడును ; సంగవర్జితః = నేనొక్కడనే యీ సంసారమున తన కభీష్టమగు వస్తువగుటచే సదా నాయనుభవములో నుండి,

దాహమును గొన్నవా డమృతపానము నార్తితో చేయుచుండగా అడ్డుపడిన పుల్లనెంత అసహ్యముతో తీసిపారవేయునో అట్లే ఇతర సాంసారిక సంగముల నన్నింటిని వాటియందు మిక్కిలి అసహ్యముతో విడుచువాడును; నిర్వైరస్సర్వభూతేషు = నన్ను తన మనఃఫలకమున నిలుపుకొని సేవించుటయే సుఖముగను, దానికి విఘ్నముకలుగుటయే దుఃఖముగను భావించు స్వభావము గలవాడు గావునను, తనకు తటస్థించిన దుఃఖము తన యపరాధమునకు తగినట్లు భగవంతుడు కల్పించిన శిక్షగా తలంచువాడును, కావుననే సర్వభూతములు పరమాత్మకు పరతంత్రమై ప్రవర్తించుచున్నవని భావించు వాడు గావునను, పరమాత్మ యందే భక్తుడగుటచే తదితర సమస్తవస్తువుల యందును విరక్తుడుగాన సాంసారిక సుఖదుఃఖముల పట్ల నుపేక్షించియే యుండును.

అప్పుడిక ఆ సుఖమును పోగొట్టెననిగాని ఆ దుఃఖమును రాబట్టెననిగాని ఒకరిపై ద్వేషమెట్లుండును ? తన తప్పు నెఱింగినవా డితరుల ద్వేషింపడుగదా! సమస్త భూతములును చేతిలో నున్న కొరడావలె పరతంత్రమైనవని నిశ్చయము కలవాడు పిచ్చివాడుకానిచో దేనిపైనను కోపగించడుగదా ! తనవలె నితరులును విశ్వరూపుడగు సర్వేశ్వరస్వరూపులేయని యనుసంధించిన వాని కిక విరోధమున కవకాశమేది ?

ఇట్టివాడు అవిద్యాదోషములనన్నిటిని సవాసనగా నశింపజేసుకొనినవాడు గావున పరమాత్మైకానుభవముతోనే ప్రొద్దుపుచ్చును.

ద్వాదశాధ్యాయార్థ సంగ్రహము

శ్లో. భక్తే శ్శైఘ్ర్య ముపాయోక్తి । రశక్తస్యాత్మనిష్ఠతా ।
తత్ప్రకారా స్త్వతిప్రీతి । ర్భక్తే ద్వాదశ ఉచ్యతే ॥

అర్థము: భక్తేః = భక్తి యోగము యొక్క, శైఘ్ర్యం = ఫలప్రదాన శీఘ్రతయు, ఉపాయోక్తిః = భక్త్యుపాయత్వమున్ను, అశక్తస్య = దానికి శక్తిలేనివానికి, ఆత్మనిష్ఠతా = శుద్ధాత్మనిష్ఠయు, తత్ప్రకారాః = వానికుండవలసిన గుణముల రీతులున్ను, భక్తేతు = భక్తునియందైతే, అతిప్రీతిః = భగవంతునకుగల మిక్కిలి ప్రేమయు, ద్వాదశే = ద్వాదశాధ్యాయములో, ఉచ్యతే = చెప్పబడుచున్నది.

తా॥ ఆత్మప్రాప్తికి సాధనమైన ఆత్మోపాసనముకంటె భగవదుపాసన మగు భక్తి, ఫలము నొసంగుటలో శీఘ్రమైనదియు, ఆచరించుటకు సుకరమైనదియు నగుటచే శ్రేష్ఠమైనదియునగు, భక్త్యుపాయమున్ను, దానికి శక్తి లేనివానికి ఆత్మనిష్ఠయు, వానికుండవలసిన గుణములున్ను, భక్తునియందు భగవంతునకు గల ప్రీతియు, పండ్రెండవ యధ్యాయమున చెప్పబడుచున్నవి.

శ్రీమద్భగవద్గీతా - ద్వాదశోఽధ్యాయః

విషయ సూచిక

అస్మద్గురుభ్యోనమః

శ్రీమద్భగవద్గీతా - ద్వాదశోఽధ్యాయః

భక్తియోగః

అర్జున ఉవాచః

1\. శ్లో. ఏవం సతతయుక్తా యే । భక్తా స్త్వాం పర్యుపాసతే ।
యే చాప్యక్షర మవ్యక్తం । తేషాం కే యోగవిత్తమాః ॥

అర్థము : ఏవం = ఇట్లు, సతతయుక్తాః = ఎల్లప్పుడును నీతోడి యోగమును కోరుచున్నవారై, యే భక్తాః = ఏ భక్తులు, త్వాం = నిన్ను, పరిఉపాసతే = పూర్తిగా నుపాసింతురో, యేచ = ఎవరైతే, అవ్యక్తం = ఇంద్రియములకు కాన్పించని, అక్షరం = జీవాత్మస్వరూపమును, (ఉపాసతే=ఉపాసింతురో,) తేషాం = ఆ రెండు విధములగు వారిలోను, యోగవిత్తమాః = సాధింపవలసిన దానిని త్వరగా పొందువారు, కే = ఎవరు?

తా ॥ ఏభక్తులు అనంతకల్యాణగుణాకరుడవగు నిన్ను పరిపూర్ణముగా నుపాసించుచున్నారో, మరియు నెవ్వరు ఇంద్రియములకు గోచరించని జీవాత్మ స్వరూపమును ఉపాసించుచున్నారో వారిరువురిలో నెవరు తాము సాధింపగోరు దానిని శీఘ్రముగా పొందుదురు.

(భగవదుపాసకులును, ఆత్మోపాసకులును గూడ భగవంతునే యుపాసింతురు. అందు భగవదుపాసకులు భగవంతునే ప్రాప్యముగా నిశ్చయించుకొని యనంత కల్యాణగుణ విశిష్టునిగా నాతని నుపాసింతురు. వీరికి ప్రాప్య ప్రాపకములు రెండును భగవంతుడే గాన వీరికి భగవంతుని యందు మనస్సు దృఢముగను, సుఖముగను నిలుచును. కాని ఆత్మోపాసకులు శుద్ధ ప్రత్యగాత్మనే ప్రాప్యముగా నిశ్చయించుకొని పరమాత్మ నందులకు సాధనముగా జేసికొని యుపాసింతురు. గాన వీరికి ప్రాప్య ప్రాపకములు వేరగుటచే ప్రాప్యమగు ప్రత్యగాత్మయందే మనస్సు నిలుచును గాని దానికి ప్రాపకమగు భగవంతునియందు అంత ధృఢముగ నిలువదు)

అవ. తననే ప్రాప్యముగను ప్రాపకముగను నిశ్చయించుకొని సమస్త కల్యాణగుణ విశిష్టునిగా నుపాసించువారే శీఘ్రముగను సుకరముగను తమ యభీష్ట సిద్ధిని బడయగలరని చెప్పుచున్నాడు.

శ్రీ భగవానువాచ = భగవంతుడు పలికెను.

2. శ్లో. మయ్యావేశ్య మనో యే మాం । నిత్యయుక్తా ఉపాసతే ।
శ్రద్ధయా పరయోపేతా । స్తేమే యుక్తతమా మతాః ॥

అర్థము : యే = ఎవ్వరు, మయి = నా యందు, మనః = మనస్సును, ఆవేశ్య = ఉంచి నిత్యయుక్తాః = నిత్య సంబంధమును కోరువారై, పరయా = గొప్పదైన, శ్రద్ధయా= శ్రద్ధతో, ఉపేతాః = కూడినవారై, మాం = నన్ను, ఉపాసతే = ఉపాసించుచున్నారో, తే = వారు, యుక్తతమాః = తమసాధ్యమును త్వరగా పొందువారని, మే = నాకు, మతాః = తలంపబడిరి.

తా ॥ ఎవరు నన్నే ప్రాప్యమని విశ్వసించి నాయందే మనస్సునుంచి మిక్కిలి శ్రద్ధతో నాతోడి నిత్య సంబంధమును కోరుచున్నవారై నన్ను ఉపాసించుచున్నారో వారు తమకు సాధ్యమగు నన్ను త్వరగా పొందుదురని యభిప్రాయము.

అవ. ప్రత్యగాత్మనే పొందగోరి సాధనము పరమాత్మయగుటచే దాని కొఱకై యాతని నుపాసించు అక్షర నిష్ఠులకు ప్రాప్య ప్రాపకములు వేరగుటచే ఫలసిద్ధి దుష్కరము దూరమును అని చెప్పుచున్నాడు.

3. శ్లో. యే త్వక్షర మనిర్దేశ్య ॥ మవ్యక్తం పర్యుపాసతే ।
సర్వత్రగ మచిన్త్యం చ । కూటస్థ మచలం ధ్రువమ్ ॥

అర్థము : యేతు = ఎవ్వరైతే, అనిర్దేశ్యం = దేవ మనుష్యాది పేరులతో పిలువరాని దగుటయు, అవ్యక్తం = ఇంద్రియములకు గాన్పించనిదియు, సర్వత్రగం = దేహములయందుండునదియైనను, అచిన్త్యం = ఇట్టిదని చింతింప శక్యము కానిదియు, కూటస్థం = సర్వసాధారణమైనదియు, అచలం = స్వరూపము మారనిదియు, ధ్రువం = నిత్యమైనదియునగు, అక్షరం = ప్రత్యగాత్మస్వరూపమును, పర్యుపాసతే= ధ్యానించుచున్నారో.

తా ॥ దేవాది శబ్దములచే పిలువతగనిదియు, ఇంద్రియములకు గాన్పించనిదియు, దేవాది దేహములయందున్నను ఇట్టిదని చింతింప

శక్యముకానిదియు, దేవాది సమస్త ఆకారములకును సాధారణ మైనదియు, మారని స్వరూపము కలదియు, నిత్యమైనదియు నగు ప్రత్యగాత్మ స్వరూపమును ఎవరైతే ధ్యానించుచున్నారో.
(కూటస్థం- కూటమనగా కంసాలి దిమ్మ. దానియం దెన్ని విలక్షణవస్తువులు నిర్మింపబడినను దాని స్వరూపము మారనట్లు ఆత్మ యెన్ని దేహములు ధరించినను దాని స్వరూపము మాత్రము మారదు.)

4. శ్లో. సన్నియమ్యేన్ద్రియగ్రామం । సర్వత్ర సమబుద్ధయః ।
తే ప్రాప్నువన్తి మా మేవ । సర్వభూతహితే రతాః ॥

అర్థము : ఇన్ద్రియగ్రామం = ఇంద్రియ సమూహమును, సన్నిమయ్య = బాగుగా నిగ్రహించి, సర్వత్ర = సకల ఆత్మలవిషయమై, సమబుద్ధయః = సమానములే యనెడి బుద్ధికలవారై, సర్వభూత హితేరతాః = సమస్త ప్రాణులయొక్క హితమునందాసక్తికలవారై. (పర్యుపాసతే = ధ్యానించుచున్నారో) తే = వారు, మాం = నన్ను, ప్రాప్నువన్తి ఏవ = పొందెడివారే.

తా ॥ అట్టివారు సమస్త ఇంద్రియములను వాటివాటి వ్యాపారములనుండి లెస్సగా నిగ్రహించి ఆత్మలన్నియు జ్ఞానాకారముచే సమానములనెడు బుద్ధికలిగి సమస్త ప్రాణులకు హితమునే సతతము గూర్చువారై నన్నే పొందుదురు.

5. శ్లో. క్లేశోఽధికతరస్తేషాం । అవ్యక్తా సక్తచేతసామ్ ।
అవ్యక్తా హి గతి ర్దుఃఖం । దేహవద్భి రవాప్యతే ॥

అర్థము : అవ్యక్తాసక్తచేతసాం = ఇంద్రియములకు గోచరించని ఆత్మ స్వరూపమునందు ఆసక్తమైన మనస్సుగల, తేషాం = వారలకు, క్లేశః = కష్టము, అధికతరః = మిక్కిలి అధికమైనది, అవ్యక్తా = ఆత్మస్వరూపవిషయమైన, గతిః = మనోవృత్తి, దేహవద్భిః= దేహాత్మభ్రమ కలవారలచే, దుఃఖం = కష్టముగా, అవాప్యతే = పొందబడుచున్నది.

తా ॥ ఇంద్రియములకు గోచరించని ఆత్మస్వరూపమును ధ్యానించువారలకు శ్రమ అధికము. సామాన్యముగా దేహాత్మాభిమానులకు ఆత్మస్వరూప విషయమైన మనోవృత్తి కలుగుట మిక్కిలి ప్రయాస సాధ్యముకదా.

అవ : కావున భగవంతునే ప్రాప్యముగను ప్రాపకముగను తలంచి యుపాసించువారే తమ సాధ్యమును శీఘ్రముగను సుఖముగను పొందుదురని స్పష్టముగ జెప్పుచున్నాడు.

6. శ్లో. **యే తు సర్వాణి కర్మాణి । మయి సన్న్యస్య మత్పరాః ।**
అనన్యేనైవ యోగేన । మాం ధ్యాయన్త ఉపాసతే ॥

అర్థము : యేతు = ఎవరైతే, సర్వాణి కర్మాణి = సమస్తకర్మలను, మయి = నాయందు, సన్న్యస్య = సమర్పించి, మత్పరాః = నేనే ప్రాప్యుడనని తలంచినవారై, అనన్యేన= ఇతరఫలమును కోరని, యోగేన = యోగముచేత, మాం ఏవ = నన్నే, ధ్యాయన్తః= ధ్యానించు చున్నవారై, ఉపాసతే = ఉపాసించుచున్నారో.

తా ॥ ఎవరైతే లౌకిక వైదిక కర్మల నన్నింటిని నాయందు సమర్పించి నన్నే ముఖ్య ప్రాప్యునిగా తలంచినవారై ఇతర ఫలములను కోరని యోగముచే నన్నే ధ్యానించుచు ఉపాసించుచున్నారో.

7. శ్లో. **తేషా మహం సముద్ధర్తా । మృత్యు సంసార సాగరాత్ ।**
భవామి నచిరాత్పార్థ! । మయ్యా వేశిత చేతసామ్ ॥

అర్థము : పార్థ = అర్జునా! మయి = నాయందు, ఆవేశితచేతసాం = ఉంచబడిన మనస్సుగల, తేషాం = వారలకు, అహం = నేను, మృత్యుసంసార సాగరాత్ = మృత్యువువంటి సంసారమనెడు సముద్రమునుండి, నచిరాత్ = శీఘ్రముగానే, సముద్ధర్తా = లేవనెత్తువాడను, భవామి = అగుచున్నాను.

తా ॥ అర్జునా ! నాయందే మనస్సును నిలిపి ధ్యానించుచుండువారలను మృత్యువు వంటిదైన సంసారమనెడు సముద్రమునుండి త్వరలో నేను లేవ నెత్తుదును.

అవ. భగవదుపాసన యిట్లుత్తమ మగుటచే తననే ప్రాప్యముగను ప్రాపకముగను నమ్మి తననే యుపాసింపుమని హెచ్చరించుచున్నాడు.

8. శ్లో. **మయ్యేవ మన ఆధత్స్వ । మయి బుద్ధిం నివేశయ ।**
నివసిష్యసి మయ్యేవ । అత ఊర్ధ్వం న సంశయః ॥

అర్థము : మయి ఏవ = నాయందే, మనః = మనస్సును, అధత్స్వ = లగింపజేయుము, బుద్ధిం = బుద్ధిని, మయి = నాయందే, నివేశయ = ప్రవేశింపజేయుము, అతః

ఊర్ధ్వం ఏవ = అటు పిమ్మటనే, మయి = నాయందు, నివసిష్యసి = వసింతువు, సంశయః = సందేహము, న = లేదు.

తా ॥ నా యందే నీ మనస్సును లంగింపజేయుము, నేనే ముఖ్య ప్రాప్యుడనని నమ్మియుండుము. అటుపైన నాయందే నివసింతువు. ఇందు సందేహములేదు. (మయి మన ఆధత్స్వ అనగా తనను ధ్యానమున కవలంబనముగా జేసుకొనుమనుట. మయి బుద్ధిం నివేశయ యనగా- తననే ముఖ్య ప్రాప్యముగా నిశ్చయించుట).

అవ. చిరకాల పరిచితములగు శబ్దాది విషయముల వాసనయందు లగ్నమైయున్న మనస్సును ఇంతవరకు కని విని యెఱుంగని భగవంతునియందు లయించుటెట్లు? అనెడు ప్రశ్నకు సమాధాన మొసంగుచున్నాడు.

9. శ్లో. **అథ చిత్తం సమాధాతుం । న శక్నోషి మయి స్థిరమ్ ।**
అభ్యాసయోగేన తతో । మా మిచ్ఛాప్తుం ధనఞ్జయ! ॥

అర్థము : ధనఞ్జయ = అర్జునా! అథ = మరి, చిత్తం = మనస్సును, మయి = నా యందు, స్థిరం = స్థిరముగా, సమాధాతుం = లగింప జేయుటకు, నశక్నోషి = సమర్థుడవు కానిచో, తతః = అట్లు చేతకానివాడవైనందున, అభ్యాసయోగేన = సమస్త కళ్యాణగుణాకరుడనగు నా యందు ప్రేమగర్భమైన ధ్యానము చేయుటయనెడి యోగముచే మాం = నన్ను, ఆప్తుం = పొందుటకు, ఇచ్ఛ = కోరుము.

తా ॥ అర్జునా! నాయందు నీ మనస్సును స్థిరముగా లగింప చేయజాలవేని సమస్త కల్యాణగుణాకరుడనైన నన్ను గురించి నిరతిశయ ప్రేమగర్భమైన ధ్యానము నభ్యసించుచు నట్టి యభ్యాసముచే నాయందు చిత్తమును స్థిరముగా లగింపజేసి నన్నే పొందగోరుము.

అవః చిరకాలమునుండి యలవాటుపడినట్టియు, ప్రత్యక్షముగ తెలియ బడునట్టియు, త్వరగా లభించదగినట్టి, భోగ్యవస్తువులయందు లగ్నమగు మనస్సు, వాటిని వదలి ఎంత గుణవంతుడైనను, ఎంతవిశుద్ధుడైనను భగవంతునియందు నిలుచుట దుష్కరము అనెడు ప్రశ్నకుత్తర మొసంగుచున్నాడు.

10. శ్లో. **అభ్యాసేఽ ప్య సమర్థోఽసి । మత్కర్మ పరమో భవ ।**
మదర్థమపి కర్మాణి । కుర్వన్ సిద్ధి మవాప్స్యసి ॥

అర్థము : అభ్యాసేఽ అపి = అభ్యాసమందును, అసమర్థః = అశక్తుడవు, అథ అసి =

అయితివేని, మత్కర్మపరమః = నా కైంకర్యకర్మలయందు ప్రీతికలవాడవు, భవ= అగుము, మదర్థం = నా ప్రీతికొఱకు, కర్మాణి = కర్మలను, కుర్వన్ అపి = చేయుచునుకూడ , సిద్ధిం = సిద్ధిని, అవాప్స్యసి = పొందగలవు.

తా ॥ ఓ అర్జునా ! ప్రీతితో నా స్మరణను అభ్యసించుటకుకూడ సమర్థుడవు కానిచో నా కైంకర్యరూపములైన ఆలయ నిర్మాణ, పూజా ప్రవర్తనాది కర్మలను మిక్కిలి ప్రేమతో నాచరింపుము. దానివలన క్రమముగ నన్ను పొందుట యనెడు సిద్ధిని పొందగలవు.

(ఈ కర్మ లతి పవిత్రములగుటచే నాకొక్కటియు, భగవచ్చింతనమును పెంపొందించును, దానిచే త్వరలోనే భగవద్గుణ స్మరణాభ్యాసమును కలిగించును, దానిచే భగవంతునియందు స్థిర చిత్తవృత్తియు, ఆపై భగవత్ప్రాప్తియు లభించును.)

అవ. సాధారణముగా సంసారమున తమ కొఱకైన కర్మలయందే తమ మనస్సు తగిలియుండునుగాని నీ కొఱకై కర్మల యందు మిక్కిలి ప్రీతితో వర్తించుటయు నరుదే యను ప్రశ్నకుత్తర మొసంగుచున్నాడు.

11. శ్లో. అథై తద ప్యశక్తోఽసి । కర్తుం మద్యోగ మాశ్రితః ।
సర్వకర్మ ఫలత్యాగం । తతః కురు యతాత్మవాన్ ।

అర్థము : మద్యోగం = నన్ను గూర్చిన భక్తి యోగమును, ఆశ్రితః = ఆశ్రయించినవాడవై, ఏతత్ అపి = ఈ కైంకర్యరూపమగు కర్మనుగూడ, కర్తుం = చేయుటకు, అశక్తః= శక్తిలేనివాడవు, అథ అసి = అగుదువేని, తతః = అటుపైన, యతాత్మవాన్ = నియమింపబడిన మనస్సుకలవాడవై, సర్వకర్మఫలత్యాగం = సమస్త కర్మల ఫలములను విడుచుటను, కురు = చేయుము.

తా ॥ భక్తియోగము నవలంబించి దానికి అంకురములవంటి యీ కైంకర్య కర్మలనుగూడ చేయలేనిచో అప్పుడు మనో నిగ్రహము కలవాడవై అక్షరయోగము నవలంబించి దాని కంకురమువలె నుపాయముగా నుండు సమస్త కర్మఫల త్యాగరూపమగు కర్మయోగము నాచరింపుము. (మనోనిగ్రహయుక్తమైన కర్మయోగమువలన అక్షరయోగము, దాని వలన పరభక్తియు, దానివలన భగవత్ప్రాప్తియు లభించును.)

అవ. భక్తియోగము భగవత్ప్రాప్తికి దగ్గర సాధనమైనను దానియందధికారములేని వారికి దుఃఖించనవసరము లేకుండనటుల కొంచెము దూరమగు ఆత్మధ్యానాదులు సౌకర్యాతి శయమును బట్టి శ్రేష్ఠములుగా ప్రశంసింపబడుచున్నవి.

12. శ్లో. శ్రేయో హి జ్ఞాన మభ్యాసాత్ । జ్ఞానా ద్ధ్యానం విశిష్యతే ।
ధ్యానా త్కర్మఫలత్యాగః । త్యాగాచ్ఛాన్తి రనన్తరమ్ ॥

అర్థము : అభ్యాసాత్ = ప్రీతిలేని భగవద్ధ్యానము నలవరచుకొనుటకంటె, జ్ఞానం = ఆత్మాపరోక్షజ్ఞానము, శ్రేయః హి = శ్రేష్ఠముకదా! జ్ఞానాత్ = పరిపక్వముకాని ఆ జ్ఞానముకంటె, ధ్యానం = ఆత్మధ్యానము, విశిష్యతే = గొప్పది, ధ్యానాత్ = అపక్వమగు ధ్యానము కంటె, కర్మఫలత్యాగః = ఫలేచ్ఛలేక కర్మలను జేయుట (విశిష్యతే = గొప్పది) త్యాగాత్ = త్యాగము వలన, అనంతరం = వెంటనే, శాంతిః= మనశ్శాంతి (భవతి = కలుగుచున్నది.)

తా ॥ ప్రీతిలేని భగవత్స్మరణము నలవరచు కొనుటకంటె ఆత్మసాక్షాత్కార రూపమగు జ్ఞానము శ్రేష్ఠము, ఆ జ్ఞానమైనను పరినిష్పన్నము కానిచో దానికంటె ఆత్మధ్యానమే గొప్పది. అపక్వమగు నాధ్యానము కంటె ఫలేచ్ఛను విడిచి కర్మల నాచరించుట గొప్పది. అట్టి త్యాగము వలన వెంటనే మనశ్శాంతి కలుగును.

అవ. నిష్కామ కర్మయోగికి అనుష్ఠించదగిన నడవడికను ఇకముందు ఏడు శ్లోకములచే చెప్పుచున్నాడు.

13. శ్లో. అద్వేష్టా సర్వభూతానాం । మైత్రః కరుణ ఏవ చ ।
నిర్మమో నిరహఙ్కార । స్సమదుఃఖసుఖః క్షమీ ॥

అర్థము : సర్వభూతానాం = సమస్త ప్రాణులకును, అద్వేష్టా = ద్వేషి కానివాడును, మైత్రః= స్నేహముతో నుండువాడును, కరుణః ఏవచ = జాలికలవాడును, నిర్మమః = మమకారము లేనివాడును, నిరహఙ్కారః = దేహమే ఆత్మయని తలంచనివాడును, సమదుఃఖ సుఖః = సుఖము గాని దుఃఖముగాని కలిగినప్పుడు వికారము చెందనివాడును, క్షమీ = ఓరిమి కలవాడును.

తా ॥ సమస్త భూతములయందును ద్వేషము చూపనివాడును, వానిచే ద్వేషింపబడనివాడు, అన్నిటియందును స్నేహభావముతోనే యుండువాడును, దేహాదులయందు మమకారము లేనివాడును,

ఆభిమానిక సుఖదుఃఖముల యెడల పొంగుఁగుంగులు లేనివాడును, సాంస్పర్శిక సుఖదుఃఖముల యెడ వికారములు చెందనివాడును (నాకు ఇష్టుడు).

14. శ్లో. సన్తుష్ట స్సతతం యోగీ ।యతాత్మా దృఢనిశ్చయః ।
మయ్యర్పిత మనోబుద్ధి । ర్యో మద్భక్త స్స మే ప్రియః ॥

అర్థము : సన్తుష్టః = లభించినదానితో తృప్తి నొందువాడును, సతతం = ఎల్లప్పుడును, యోగీ= ఆత్మనే ధ్యానించువాడును, యతాత్మా = నిగ్రహింపబడిన మనస్సు కలవాడును, దృఢనిశ్చయః = శాస్త్రమున గట్టి నమ్మకము కలవాడును, మయి = నాయందు, అర్పిత మనోబుద్ధిః = సమర్పింపబడిన మనోబుద్ధులు కలవాడును అయి, మద్భక్తః = నన్ను భజించువాడు, యః = ఎవడో, సః = వాడు, మే = నాకు, ప్రియః = ఇష్టుడు.

తా ॥ దొరికినదానితో తృప్తి చెందువాడును, శుద్ధాత్మస్వరూపము నెల్లప్పుడును అనుసంధించువాడును, మనోవృత్తులను స్వాధీనపరచుకొనినవాడును, వేదాంత శాస్త్రబోధితములైన విషయముల యందు దృఢ విశ్వాసము కలవాడును, నేనే కర్మలచే నారాధింపబడి ఆత్మసాక్షాత్కారమును ప్రసాదింతునని మనస్సును బుద్ధిని నాయందర్పించువాడును ఇట్లు కర్మయోగముచే నన్ను భజించువాడు నాకు మిక్కిలి ఇష్టుడు.

15. శ్లో. యస్మాన్నో ద్విజతే లోకః । లోకా న్నో ద్విజతే చ యః ।
హర్షామర్షభయోద్వేగై । ర్ముక్తో య స్స చ మే ప్రియః ॥

అర్థము : యస్మాత్ = ఎవనిమూలముగా, లోకః = లోకము, న ఉద్విజతే = విసుగుచెందదో, లోకాత్ చ=లోకము మూలమునను, యః=ఎవడు,న ఉద్విజతే=విసుగును చెందడో, యః = ఎవడు, హర్షామర్షభయోద్వేగైః = సంతోషము, కోపము, భయము, బెంగలచే, ముక్తః=విడువబడినవాడో, సః చ = వాడున్ను, మే = నాకు, ప్రియః = ఇష్టుడు.

తా ॥ లోకమునకు క్షోభకరమైన ఏ మాటను ఉచ్చరించక, ఏపనిని చేయక పోవుటచే ఎవనిని గురించి లోకము క్షోభకరమైన ఏ పనినిగాని చేయదో, ఎవడు లోకమున నెవనికిగాని సంతోషము, కోపము, భయము, మనోవ్యాకులత కలుగజేయడో అట్టివాడు నాకు ప్రియుడు.

16. శ్లో. అనపేక్ష శ్శుచి ర్దక్షః । ఉదాసీనో గతవ్యథః ।
సర్వారమ్భ పరిత్యాగీ । యో మద్భక్త స్స మే ప్రియః ।

అర్థము : అనపేక్షః = దేనియందు కోరికలేనివాడును, శుచిః = శాస్త్రీయమైన ఆహారములచే శుద్ధికలవాడును, దక్షః = శాస్త్రీయ కర్మలయందు సమర్థుడును, ఉదాసీనః = ఇతర పనులయందు ఉపేక్షకలవాడును, గతవ్యథః = ద్వంద్వములచే సుఖదుఃఖములు చెందనివాడును, సర్వారమ్భపరిత్యాగీ = శాస్త్రవిరుద్ధమైన ఏ పనిని గాని ఆరంభించనివాడును అయి, మద్భక్తః = నన్ను భజించువాడు, యః = ఎవడో, సః = వాడు, మే = నాకు, ప్రియః = ఇష్టుడు.

తా॥ ఆత్మేతరములయందాసక్తి లేనివాడై శాస్త్రీయాహారములచే శరీరమును పోషించు కొనువాడును, శాస్త్రీయ కర్మల నాచరించుటలో సమర్థుడును, ఇతర కార్యములయం దుపేక్షకలవాడును, అనివార్యమగు సుఖదుఃఖములకు కలత చెందనివాడును. శాస్త్రవిరుద్ధ కర్మలను విడిచి నన్నే భజించువాడును నాకు ఇష్టుడు.

17. శ్లో. యో న హృష్యతి న ద్వేష్టి । న శోచతి న కాఙ్క్షతి ।
శుభాశుభపరిత్యాగీ । భక్తిమాన్ య స్స మే ప్రియః ॥

అర్థము : యః = ఎవడు, నహృష్యతి = ప్రియవస్తు లాభముచే అత్యానందమందడో, నద్వేష్టి= తదాలభముచే ద్వేషించడో, నశోచతి = దుఃఖింపడో, నకాఙ్క్షతి = కోరడో, యః = ఎవడు, శుభాశుభ పరిత్యాగీ = పుణ్యాపాపముల రెండింటిని విడిచినవాడో, సః = అట్టి, భక్తిమాన్ = భక్తిమంతుడు, మే = నాకు, ప్రియః = ఇష్టుడు.

తా ॥ ప్రియములు తనకు కలిగినను సంతోషింపక, అప్రియములు కలిగిను దుఃఖింపక లభింపని వస్తువులను కోరక బంధహేతువులగు పుణ్యాపాపములను విడిచి నన్ను భజించు కర్మయోగి నాకు ప్రియుడు.

18. శ్లో. సమ శ్శత్రౌ చ మిత్రే చ । తథా మానావమానయోః ।
శీతోష్ణ సుఖదుఃఖేషు । సమ స్సఙ్గవివర్జితః ।

అర్థము : శత్రౌచ = శత్రువునందును, మిత్రేచ = స్నేహితునియందును, సమః = ఏకరీతిగా నుండువాడును, తథా = ఆలాగుననే, మానావమానయోః = గౌరవ అగౌరవములయందును. శీతోష్ణసుఖదుఃఖేషు = చలి, వేడి, సుఖము, దుఃఖములయందును, సమః = సమచిత్తుడును, సఙ్గవివర్జితః = దేనియందును ఆసక్తి లేనివాడును.

తా ॥ శత్రుమిత్రాదులయందు సమచిత్తుడై, గౌరవ అగౌరవములను, శీతోష్ణములను, సుఖదుఃఖములను సమముగాభావించువాడై ఆత్మకంటె ఇతరమగు దేనియందును ఆసక్తిలేనివాడై (నన్ను భజించువాడు నాకు ఇష్టుడు.)

19. శ్లో. తుల్య నిన్దాస్తుతి ర్మౌనీ । సన్తుష్టో యేన కేనచిత్ ।
అనికేత స్థిరమతి । ర్భక్తిమాన్ మే ప్రియో నరః ॥

అర్థము. తుల్యనిన్దాస్తుతిః = నిందించినను స్తుతించినను సమముగా తలంచువాడును, మౌనీ= వాఙ్నియమము కలవాడును, యేన కేనచిత్ = లభించిన ఏ వస్తువు చేతనైనను, సన్తుష్టః = సంతోషించు వాడును, స్థిరమతిః = స్థిరమైన బుద్ధి కలవాడును, అనికేతః = ఇండ్లుమొదలగువానియందు ఆసక్తి లేనివాడును, భక్తిమాన్ = భక్తి కలవాడును అగు, నరః = మనుష్యుడు, మే = నాకు, ప్రియః = ఇష్టుడు.

తా ॥ దూషణ భూషణములను సమముగా తలంచి వాఙ్ నియమముకలవాడై లభించిన దానితో తృప్తిచెందినవాడై ఆత్మయందే స్థిరబుద్ధికలవాడగుటచే గృహాదులయందాసక్తి లేనివాడై నన్ను భజించువాడు నాకు ఇష్టుడు. (ఈ శ్లోకము లన్నిటియందున్న భక్తి శబ్దము నిష్కామ కర్మ యోగమున కంగమైన భక్తిని గూర్చినదని గ్రహించవలెను.)

అవ. ఇట్టి యాత్మనిష్ఠనికంటె భక్తి యోగనిష్ఠుడే శ్రేష్ఠుడని ఉపక్రమాను గుణముగ నుపసంహరించుచున్నాడు.

20. శ్లో. యే తు ధర్మ్యామృత మిదం । యథోక్తం పర్యుపాసతే ।
శ్రద్ధధానా మత్పరమా భక్తాస్తేఽ తీవ మే ప్రియాః ॥

ఇతి శ్రీభగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే
శ్రీ కృష్ణార్జున సంవాదే భక్తియోగో నామ ద్వాదశోధ్యాయః

అర్థము : యేతు = ఎవరైతే, శ్రద్ధధానాః = శ్రద్ధావంతులును, మత్పరమాః = నేనేముఖ్యగతి గాకలవారగుచును, ధర్మ్యామృతం = సాధనము, ఫలమునునగు, ఇదం = ఈ భక్తి యోగమును, యథోక్తం = చెప్పబడిన విధముగా, పర్యుపాసతే = ఉపాసించుచున్నారో, తే = ఆ, భక్తాః = భక్తులు, మే = నాకు, అతీవ = మిక్కిలి, ప్రియాః = ఇష్టులు.

తా ॥ శ్రద్ధావంతులై నేనే పరమార్థమని తలంచి ప్రాప్యమువలె భోగ్యమై సాధనమగు నీభక్తి యోగమును చెప్పబడిన రీతిగా ఉపాసించు నట్టి భక్తులు నాకు మిక్కిలి ప్రియులు, (ఈ శ్లోకము సాక్షాత్తుగా భక్తి యోగ నిష్ఠలను గురించినది.)

ఇది ఉపనిషదర్థ ప్రతిపాదకమును, బ్రహ్మ విద్యయు, యోగశాస్త్రమును, సంవాద రూపమును అయిన శ్రీ భగవద్గీత యందలి భక్తియోగమనెడు

పంద్రెండవ అధ్యాయము.

ఈ యధ్యాయమునందలి అర్జునుని శ్లోకము	1
శ్రీకృష్ణుని శ్లోకములు	19
ఈ యధ్యాయమందలి శ్లోక సంఖ్య	20
ఇప్పటకి మొత్తము అయిన శ్లోకములసంఖ్య	489

భగవద్గీతా ప్రశ్నోత్తరావళి
ద్వాదశాధ్యాయము

1.ప్ర. **ఈ యధ్యాయమునకు పేరేమి? అది ఎందుల కుంచబడినది?**

ఉ. ఈ యధ్యాయమునకు భక్తియోగమని పేరు.

ఇందు భక్తులు నడుచుకొనవలసిన రీతులు ప్రధానముగా చెప్పబడుట చేతను, అధ్యాయ ప్రారంభమునను అంతమునను భగవద్భక్తులను గూర్చి 'తే మే యుక్తతమామతాః' అనియు, 'భక్తాస్తేఽతీవ మే ప్రియాః' అనియు ప్రశంసించుటచేతను దీని కాపేరుంచబడినది.

2. ప్ర. **ఈ యధ్యాయమున చెప్పబడిన ప్రధానవిషయము లేవి?**

ఉ. శ్లో.భక్తేశ్శైఘ్ర్యముపాయోక్తిరశక్త స్యాత్మనిష్ఠతా ।
తత్ప్రకారా స్త్వతిప్రీతి ర్భక్తే ద్వాదశ ఉచ్యతే ॥

1. ఆత్మ ప్రాప్తిసాధన భూతమగు ఆత్మోపాసనకంటె భక్తి రూపమగు భగవదుపాసనశీఘ్రఫలప్రదమున్ను సుఖముగా చేయదగినదియు నగుటచే శ్రేష్ఠమని చెప్పుట.
2. భగవదుపాసనకు వలయు ఉపాయములను జెప్పుట.
3. ఆ ఉపాసన చేయలేనివారికి ఆత్మోపాసననే విధించుట.
4. ఆత్మోపాసనకు కారణమైన కర్మయోగమున కుండవలసిన గుణములను, నడవడికను శిక్షించుట.
5. ఆత్మోపాసననిష్ఠునికంటె భగవదుపాసననిష్ఠుడగు భక్తియోగనిష్ఠుడుత్తముడని చెప్పుట.

వివరములు

1. ఆత్మప్రాప్తికి సాధనమగు ఆత్మోపాసన, భగవత్ప్రాప్తికి సాధనమగు భక్తి యన బడు భగవదుపాసన యనెడు యీ రెండింటిలో తనతన ఫలము నిచ్చుటలో నేది సుకరమును శీఘ్రమును అయినదో చెప్పుమని అర్జునుడు శ్రీకృష్ణు నడుగుట. 1 శ్లో ॥
2. భగవదుపాసకులే శీఘ్రముగను సుఖముగను ఫలమును బడయగలరని శ్రీకృష్ణు డుత్తర మొసంగుట. 2 శ్లో ॥
3. అక్షరోపాసకులును తామభిలషించు ముక్త స్వరూపమును పొందగలరు గాని వారికి శ్రమ అధికమని చెప్పుట. 3, 4, 5 శ్లో॥

4. భగవదుపాసకుల అతిశయమును పేర్కొనుట. 6,7 శ్లో॥
5. భగవదుపాసనకు వలయు ఉపాయ పరంపరను జెప్పుట.
8, 9, 10, 11 శ్లో॥
6. భగవదుపాసకు శక్తిలేనివారికి వారివారి యోగ్యతకు తగినట్లు ఉపాయపరంపరను పేర్కొనుట. 12 శ్లో॥
7. నిష్కామకర్మ యోగనిష్ఠన కుండవలసిన గుణవిశేషములను నడవడికను పేర్కొనుట. 13 నుంచి 19 శ్లో॥
8. ఆత్మనిష్ఠునికంటె భక్తి యోగనిష్ఠుడు శ్రేష్ఠుడని ప్రారంభమున చెప్పిన విషయమును ఉపసంహరించుట 20 శ్లో॥

3. ప్ర. **ఈ యధ్యాయమునకు వెనుకటి యధ్యాముతోను ప్రధాన శాస్త్రార్థముతోను గల సంబంధమేమి?**

ఉ. వెనుకటి అధ్యాయమున (మత్కర్మకృదిత్యాది) చివరి శ్లోకములో భగవత్ప్రాప్తికి కారణమైన భక్త్యవస్థావిశేషము వివరింపబడినది. అవిద్యాదిదోషగంధములెల్ల పోయి లభించెడు భగవదనుభవము దానికి ఫలముగా జెప్పబడినది. ఈ భగవదుపాసనము రెండు విధములగు ఫలములను పొందుటకు చేయబడుచున్నది.

భగవత్సమానాకారమగు శుద్ధాత్మ స్వరూపమును పొందుటకై భగవదుపాసన చేయుట యొకటి. భగవంతుని పొందుటకు భగవదుపాసన చేయుట యొకటి. ఈ రెండు విధములగు ఫలములకై చేయబడు భగవదుపాసనలలో రెండవదియగు భగవదుపాసనమే సుకరముగను శీఘ్రముగను ఫలము నొసంగునని నిర్ణయించబడుచున్నది. ఈ విషయమే 'మత్కర్మకృత్' అనెడు శ్లోకములో చెప్పబడినను యిచ్చట సంశయ విపర్యయములు లేక సమర్థింపబడుచుండుటచే పూర్వాధ్యాయముతో నీ యధ్యాయమునకు సాక్షాత్సంబంధము కలదు.

ఇట్టి ఉపాసనవలన భగవంతుని యనుగ్రహమును బడసి ముక్తిని పొందునని చెప్పుటచే మోక్షమే ప్రధానోద్దేశముగాగల శాస్త్రార్థముతోను సాక్షాత్సంబంధము కలిగియున్నది.

4. ప్ర. **అధ్యాయ ప్రారంభమున అర్జునుడు గావించిన ప్రశ్న యొక్క ప్రధానాశయ మేమి?**

ఉ. పదునొకండవ అధ్యాయ అంతిమ శ్లోకమున 'మత్కర్మకృత్ మత్పరమో .... మామేతి పాండవ' అని శ్రీకృష్ణ పరమాత్మచే

భగవత్ప్రాప్తికి సాధనముగా భగవదుపాసనము చేయవలెనని చెప్పబడెను. అది విని యర్జునునకు భగవంతుని పొందగోరి దాని కాతడే సాధనమని భగవంతును పాసింపవలెనా ? ఆత్మస్వరూపమును పొందగోరి దానికిని ఆతడే సాధనమని భగవంతునుపాసింపవలెనా? మొదటిదానికి పరమాత్మోపాసనమనియు, రెండవదానికి ఆత్మోపాసనమనియు పేరు. పరమాత్మనే ఉపాసనం = పరమాత్మను పొందుటకైన ఉపాసనము- పరమాత్మోపాసనము, ఆత్మనే ఉపాసనం = ఆత్మను పొందుటకైన ఉపాసనము- ఆత్మోపాసనము, పరమాత్మోపాసనవలె ఆత్మోపాసనముగాని, పరమాత్మనామోచ్చారణవలె ఆత్మ నామోచ్చారణగాని, పరమాత్మస్తుతివలె ఆత్మస్తుతిగాని యెచ్చటను చెప్పబడలేదు. కావున రెండును పరమాత్మోపాసనములే. ఫలభేదముచే వాటికి పరమాత్మోపాసనమనియు, ఆత్మోపాసనమనియు పేరు లుంచబడినవి. రెండు ఉపాసనలకును రెండింటియందును ప్రాప్యభూతులగు ఆత్మపరమాత్మల వాస్తవ స్వరూపములు శ్రవణాదులచే నెఱుంగదగినవియే యగుచున్నవి. ప్రాప్యమాహాత్మ్యము నెరింగినగాని దానిని పొందవలెననెడు కోరికగాని, దాని కొఱకై ప్రయత్నము గాని పుట్టదుగదా! ఆత్మ నిజముగ సుఖస్వరూపమైనదిగాన దానిని పొందిన సుఖానుభవము లభించును. అందుచే ఆత్మస్వరూపము ప్రాప్యముగాన ఆత్మోపాసనయే శ్రేష్ఠమని తోచుచున్నది. భగవంతుని పొందినవానికి తన నిజస్వరూపమును పొందిన పిమ్మటనేగదా సుఖాను భవము! బద్ధుడగువానికి సంసారమున ప్రకృతిబంధము నుండి పరమాత్మస్వరూపమును అనుభవించుచున్నను ముక్తునివంటి ఆనందముండునా ? కారాగారమునందున్నవానికి రాజాలంకారము చేసి షడ్రసోపేతభోజన మొసంగినను ఆనందము లేదుగదా! కావున ఆత్మస్వరూప లాభమునకై దానికి సాధనమగు ఆత్మోపాసనము చేయవలెను. భగవంతుని పొందుటకు భగవదుపాసనము చేసినను దానిచే శుద్ధాత్మలాభము కలుగుచునే యున్నది భగవంతుడు తనను పొందగోరి తన నుపాసించిన భక్తునకు స్వస్వరూపానుభవమును కలుగజేయుటకై బద్ధునకది తగదుగాన అందులకు తగునట్లు ప్రకృతిబంధమునుండి విడిపించి శుద్ధాత్మస్వరూపమును కలుగజేయుచున్నాడు. కాబట్టి పరమాత్మోపాసనయు యుక్తమైనదే. గాన రెండు ఉపాసనలు చేయదగినవియే యని తెలియుచున్నది. ఒకడు రెండును

చేయజాలడుగాన నీ రెండింటిలో ఆత్మస్వరూపలాభమునకై యేది శీఘ్రముగను సుకరముగను ఫలము నిచ్చునో దానిని నాకు చెప్పుమని అర్జునుడు ప్రశ్నించెను.

5. ప్ర. అర్జునుని ప్రశ్నకు శ్రీకృష్ణుడొసంగిన సమాధానమేమి?

ఉ. "ఎవరు నన్నే ప్రాప్యముగా విశ్వసించి నాయందపరిమిత ప్రేమగలవారై నా యందు తమ మనస్సు నుంచి మిక్కిలి శ్రద్ధతో నా తోడి నిత్యమైన సంబంధము తమ కుండవలెనని కోరుచు నన్నే ఉపాసించుచున్నారో వారు నన్ను ఆనాయాసముగను శీఘ్రముగను పొందగలరు. నన్ను పొందినచో ఆత్మస్వరూపప్రాప్తి తప్పక కలిగియే తీరవలెనుకదా!

ఇక నెవ్వరు నాశరహితమైనట్టియు, దేవాది శబ్దములచే చెప్పుటకు శక్యము కానట్టియు, కన్ను మొదలగు జ్ఞానేంద్రియములకును గోచరించనట్టియు, దేవాది శరీరములలో నంతటను ఉన్నప్పటికిని వాటికంటె విలక్షణమైనది గాన ఆయా యాకారములతో తలంచుటకు శక్యము కానట్టియు, ఆయా దేవాది విషయాకారములతో నెంతమాత్రమును సంబంధించనట్టియు, పరిణామములు లేనిదిగాన తన జ్ఞానాకారము నెన్నడును వీడి యుండనిదియు కాబట్టి నిత్యమైనదియునగు జీవాత్మతత్వమును పొందగోరి చక్షురాది జ్ఞానేంద్రియములను తమతమ పనులు చేయకుండ నరికట్టి, ఆకారవైషమ్యము శరీరములచే గాని ఆత్మ సర్వదా జ్ఞానాకారమైనదియే యని సమస్తాత్మలయందును సమబుద్ధి కలవారై సర్వభూతముల హితమును కోరువారై అక్షరమనబడు శుద్ధాత్మ స్వరూపమును ప్రాప్యముగా నిశ్చయించి దానిని ప్రసాదించువాడని పరమాత్మ నుపాసించుచున్నారో వారును భగవంతునితో సమానాకారముగల ప్రకృతిగంధరహితమైన శుద్ధాత్మస్వరూపమును పొందియే తీరుదురు. కాని అవ్యక్తమగు ఆత్మకు సంబంధించిన మనోవృత్తులు దేహధారులకు దుర్ఘటములు, వారికి శ్రమ అధికము, వారు ప్రాయశః దేహాత్మభ్రాంతితో నుందురుగదా!

కాని యెవరు దేహధారణకొఱకు తామాచరించు కృషి వాణిజ్య అశనాది లౌకిక కర్మలను, స్నాన సంధ్యావందనాది నిత్యకర్మలతో కూడుకొనియున్న స్వర్గాదిఫలముల కొరకాచరించు యాగదాన హోమ తపః ప్రభృతి సమస్తవైదిక కర్మలను నాయందు ప్రవణమగు మనస్సుతో నాకు సమర్పించి నన్నే ప్రాప్యముగా నిశ్చయించి ఇతర ఫలముల నాశించక నా ధ్యాన అర్చ ప్రణామ స్తుతి కీర్తనాది కర్మలను ప్రీతితో నాచరించుటయే ప్రయోజనముగా నవియే

ఫలములుగా విశ్వసించి యాచరించుచు నన్ను పాసింతురో వారిని నన్ను పొందుట కాలంకపరచుచున్న జనన మరణ ప్రవాహరూపమగు సంసార సముద్రమునుండి వెంటనే ఉద్ధరింతును" అని శ్రీకృష్ణుడర్జునుని ప్రశ్నకు సమాధాన మొసంగెను.

ఓ అర్జునా! పరమపురుషార్థమగుటచేతను, సులభమగుటచేతను, వెంటనే ఫలసిద్ధి నొసంగుటచేతను నాయందు మనస్సును నిశ్చలముగా నిలిపి నాకంటె మించిన ఫలము వేరొకటిలేదని విశ్వసించి ఉపాసింపుము. అట్లుపాసించుచు అన్నివిధముల నేను రక్షకుడను గాన ఆచార్యుని యందు శిష్యునివలెను, తండ్రియందు బిడ్డవలెను నాయందు నీ వుందువుగాన నిర్భయముగా నుండుము.

బహుకాలమునుండియు శబ్దాది విషయవాసనలచే నాక్రమింపబడిన మనస్సుకలవానికి, యెన్నడును కని విని యెఱుంగని నాయందు హఠాత్తుగా చిత్తమును చలింపక నిలుపుట యెట్లని సంశయింపకుము. అట్లు వెంటనే నాయందు మనస్సును లగ్నము చేయజాలవేని చలించిన మనస్సును నాయందే మాటిమాటికి లగించుటకు ప్రయత్నించుచు నన్ను పొందగోరుచుండుము. నేనే స్వాభావికమైన కల్యాణగుణములు కలవాడను, దుర్గుణములు దరిజేర శక్యముగాని స్వరూపము కలవాడను. ఇవి రెండును నాకు ఛత్రచామరములవంటి అసాధారణ చిహ్నలు. ఇట్టి నన్ను నిరతిశయ ప్రేమతో చింతించుట ఆనందావహమేకదా ! దాని నలవరచుకొన్నచో క్రమశః నీమనస్సు నాయందు స్థిరముగ నుండగలదు.

"భోగములు చిరకాలమునుండియు అలవడినవి. కంటికి గాన్పించునవి. త్వరగా లభించునవి. అట్టి వాటి కలవడిన మనస్సు నిప్పుడు గుణవంతుడవైన నను నీ వైపు త్రిప్పుట నాతరమా? ఈ అభ్యాస మసంభవమే. పూర్వవాసన యంతయు కర్మలయందే గదా! అందుచే నీరు పల్లమునకే ప్రసరించును. గాని నీవుచెప్పిన అభ్యాసమునకు సమ్మతించదు" అందువా? అయినచో కర్మలయందే ప్రసరించనిమ్ము మంచిదే. ఆ కర్మలను మాత్రము నామందిరములు కట్టించుట, నాకు పువ్వులతోటలను నిర్మించుట, నామందిరములలో దీపములు పెట్టుట. నామందిరములను తుడిచి నీళ్లు జల్లుట, ఆలుకుట, కడుగుట. పుష్పమాలలను తెచ్చి యిచ్చుట. తులసీదళముల నర్చన కర్పించుట, స్వయముగ పూజించుట, నామ

సంకీర్తన మొనరించుట, ప్రదక్షిణము లాచరించుట, స్తోత్రముచేయుట, నమస్కరించుట మొదలగువాటి నత్యంత ప్రీతితో చేయవలెను. దానిచే నిరంతర మభ్యాసమును దానిచే నాయందు మనస్థైర్యమును సులభముగా పొందగలవు. అప్పుడిక నన్ను పొందుటకాటంకమేముండును?

"అయ్యో! అదిమాత్రము శక్యమా? తన పనుల తాను ప్రీతితో చేసుకొనుటకే యలవడిన యీ లోక మిప్పుడు క్రొత్తగా నీ పనులు ప్రీతితో చేయుట సంభవమా! ఇది బొత్తుగా యసంభవమైన ఉపాయమువలె తోచుచున్న" దందువా?

సరే! అట్లు నాకల్యాణగుణముల నెఱింగి నాయం దతిప్రీతితో భక్తి కలవాడవై భక్తియోగమున కంకుర మనదగు నాకైంకర్యమును కూడ చేయలేనిచో పోనిమ్ము. వెనుక మొదటి షట్కములో చెప్పినట్లు పరభక్తిని పుట్టించు ఆత్మస్వభావమును అనుసంధించుట యనెడు యోగము నవలంబించి దానికి అంగముగా కర్మయోగము నైనను అవలంబించి సర్వకర్మల ఫలమును విడువుము, దానిచే క్రమముగ ఆత్మధ్యానము సిద్ధించి సంసారమునకు కారణమైన ఆత్మదర్శనమున కడ్డుపడుచున్న కర్మనశించి, నా కత్యంత శేషభూతమైయుండు ఆత్మను సాక్షాత్కరింతువు. దాన నాయందు పరాభక్తి తనంతటనే ఉదయించును అని ఉపదేశించెను.

ప్ర. భగవదుపాసనకు శక్తిలేనివారికి శ్రీకృష్ణుడు తమ యోగ్యతకు తగినట్లాచరించదగిన ఉపాయపరంపర నెట్లుపదేశించెను?

ఉ. అయ్యో! ముక్తికి సన్నిహితమగు భక్తికి మన మర్హులము కామే యను చింతను బాపుటకును, చంద్రబింబము నాశించి చేతులెత్తు చంటిబిడ్డవలె చేతకాని సాధనములయందు ప్రవర్తించకుండుటకును, దూరమైనను తమ తమ అధికారమునకు తగినట్టి నిష్ప్రమాదమును, తప్పక ఫలమునిచ్చు నట్టివియు నగు ఉపాయములను సౌకర్యార్థము ప్రశంసించ ప్రారంభించెను. పండిన పండురసము నాశించిన బిడ్డ గట్టి కాయను బలవంతముగా మెత్తపరచి తినిన విరసమే యగునుగదా! అట్లే భగవదభ్యాసమున కధికారము లేనివాడు చేయు భక్తియోగమును అట్లే యుండును. కావున యథావస్థితమగు సరసమైన అభ్యాసమునకు సాధనమే శ్రేయస్కరము. అందుచే అపరిమిత ప్రేమ లేనిచో పైత్యరోగికి పయఃపానమువలె కఠినముగా గాన్పించు భగవదుపాసనకంటె జీవాత్మ యొక్క వాస్తవరూపము నెఱింగి దానిని సాక్షాత్కరించు కొనుటయే సుకరమగుటచే హితమైనది. దానికిని అధికారము లేనిచో నదియును దుష్కరమేగాన అంతకంటె అట్టి ఆత్మసాక్షాత్కారమున కుపాయమగు ఆత్మధ్యానమే సుకరమగుటచే హితకరమైనది. దానికిని అధికారములేనిచో దాని కుపాయమగు నిష్కామకర్మయోగము సుకరముగాన

అది హితకరమైనది. అట్టి కర్మయోగము నాచరించిన వెంటనే రజస్తమస్సులడుగంటి వాటివలన బుట్టు రాగద్వేషములు పోయి శాంతి చేకూరును. మనస్సునకు శాంతి చేకూ రినచో ఆత్మధ్యానము సిద్ధించుట సుకరము. ఆ ధ్యానముచే నాత్మసాక్షాత్కారము సిద్ధిం చును. దానిచే పరాభక్తి సిద్ధించును. కావున భక్తి యోగమున కొకేసారి అధికారి కానివానికి ఆత్మనిష్ఠయే శ్రేయస్కరము. ఆత్మనిష్ఠుడైనను శాంతమనస్కుడు కానిచో అట్టి నిష్ఠ క్రమశః ఫలకారి యగుటకు ఆత్మయథార్థజ్ఞానముతో ఫలాపేక్షలేక యోగము నాచరించుటయే హితకరము.

7. ప్ర. ఫలమును కోరక కర్మల నాచరించు కర్మయోగనిష్ఠునకు పరిగ్రహించ వలసిన గుణములేవి?

ఉ. 1.మనోవాక్కాయములతో నిరంతరము అపకారమునే చేయుచుండు ప్రాణులనైనను (వేనినిగాని) ద్వేషించరాదు.

2. నేను చేసిన అపచారములకు తగిన శిక్ష ననుభవింపజేయుటకే భగవంతుడీ ప్రాణులతో నీ విధముగ విరోధమును కల్పించి దుఃఖింపజేయుచున్నాడని తలంచవలెను.

3. ఇట్లు తనతో ద్వేషించుచు క్షణక్షణ మపకారమును చేయుచున్నను ఆ ప్రాణులయందు హితమతినే కలిగియుండవలెను.

4. ఆ ప్రాణులు దుఃఖించుచున్నచో వానిని జూచి తానును దుఃఖించవలెను.

5. దేహమునందును దేహసంబంధముచే తటస్థించిన పుత్రమిత్ర కళత్ర గృహక్షేత్రాదులయందును మమకార ముండరాదు.

6. శరీరమునే ఆత్మయని తలంచరాదు.

7. తాను తన సంకల్పముచే నేర్పరచుకొనిన సంబంధముగల పుత్రమిత్ర కళత్రాది చేతనముల మూలమునగాని గృహక్షేత్రాది అచేతనముల మూలమునగాని సుఖదుఃఖములు తటస్థించినప్పుడు పొంగరాదు, క్రుంగరాదు.

8. ఇంద్రియములకు విషయములతో గల సంబంధముచే నేర్పడు అనివార్యమైన సుఖ దుఃఖముల మూలమయిన ఏ విధమగు వికారమును చెందరాదు.

9. తన ప్రయత్నము లేకయే లభించిన పదార్థములతోనే సంతుష్టుడై తన జీవితమును గడుపవలెను.

10. నిరంతర మీ యాత్మ దేహ విలక్షణమైనదని భావించు చుండవలెను.

11. మనో వృత్తులను తన యధీనములో నుంచుకొనవలెను.

12. వేదాంతశాస్త్రమునందు చెప్పబడిన అర్థపంచకమునందు (తనస్వరూపము పరమాత్మస్వరూపము ఉపాయస్వరూపము ఫలస్వరూపము విరోధి స్వరూపము) దృఢమైన నిశ్చయమును కలిగియుండవలెను.

13. నేనాచరించుచున్న యీఫలాశలేని కర్మచే నారాధింపబడువాడు వాసుదేవుడే గాన అతడు నాచే నారాధింపబడి నాకాత్మసాక్షాత్కారమును ప్రసాదించును అని నమ్మి యుండవలెను.
14. కర్మనిష్ఠుడు లోకమునకు తనయందాగ్రహముజనించు కర్మలను వేటిని చేయరాదు.లోకులు తన కపకారమును చేయుటలో తత్పరులై యుండునట్లు నడుచుకొనరాదు.
15. అందరును తనను "ఈతడెవరికిని విరోధికాడు" అని తలంచు నట్లు ప్రవర్తించవలెను.
16. ఇట్లెవ్వరికిని ఉపకారిగాని అపకారికాని కాక ఉదాసీనముగా నుండుటచే నెవ్వరి యందును అనుగ్రహముగాని నిగ్రహముగాని భయముగాని ఉద్రేకము గాని లేని వాడై యుండవలెను.
17. ఆత్మకంటె నితరమగు ఏ వస్తువునందును ఆసక్తిలేక యుండవలెను.
18. శాస్త్రమున తినవచ్చునని చెప్పిన వస్తువులనే తిని దేహమును పోషించు కొనవలెను.
19. తనకు చేయతగినవిగా శాస్త్రము విధించునట్టి కర్మలను చేయుటకు సమర్థుడై యుండవలెను.
20. శాస్త్రమున నిషేధింపబడినవాటియందుగాని శాస్త్రమున చెప్పబడని వాటి యందుగాని ఉదాసీనముగా నుండవలెను.
21. శాస్త్రీయమగు కర్మల నాచరించునప్పుడు తప్పనిసరిగా తటస్థించునట్టి చలి వేడి మృదు కఠినాది స్పర్శలకు దుఃఖించరాదు.
22. శాస్త్రీయములైన కర్మలు తప్పయితరకర్మల నన్నిటిని విడిచి పెట్టవలెను.
23. మనుష్యుల కానందావహమగు ప్రియవస్తువులను పొంది ఆనందించరాదు.
24. అప్రియవస్తువులను ద్వేషించరాదు.
25.ఇష్టవస్తువులు లభించనిచో వాని నాశింపరాదు.
26. పాపమువలె పుణ్యముకూడ బంధహేతువేగాన ఆ రెండిండిని సంపాదించు ప్రయత్నము విడిచి పెట్టవలెను.
27. శత్రువుగాని మిత్రుడుగాని దగ్గరించినచో మనస్సులో నేవిధమైన వికారమునున్ను పుట్టనీయరాదు.
28. అట్లే గౌరవనీయులపట్లను వర్తించవలెను.
29. చలి వేడి వలన కలుగు సుఖదుఃఖములపట్ల కూడా సమచిత్తుడై యుండవలెను.
30. దేనియందును నాది యనెడు బుద్ధి విడరాదు.

31. తిట్టినను దూషించినను కలతచెందరాదు.
32. లోకులు సాధారణముగా తిట్టిన తిట్టుదురు. అట్లు చేయక మౌనముగా నుండనలెను.
33. ఆయాచితముగ లభించిన దెట్టిదైనను దానితోనే తృప్తిని చెందవలెను.
34. ఆత్మయందే స్థిరముగ లగ్నమైన మనుస్సు కలవాడుగాన గృహక్షేత్రాదులం దాసక్తిని పూర్తిగ విడిచిపెట్టవలెను.
అని కర్మనిష్ఠునికి ఉపాదేయములగు గుణముల నుపన్యసించెను.

8. ప్ర. భగవానుడు ఆత్మనిష్ఠునికంటె భక్తియోగనిష్ఠుని అతిశయము నెట్లు వర్ణించెను?

ఉ. ఈ విషయ మీ యధ్యాయ చివరి శ్లోకమువలన వ్యక్తమగు చున్నది. అధ్యాయారంభమున అర్జునుడు అక్షరనిష్ఠులు, భక్తియోగ నిష్ఠులలో నెవరు శ్రేష్ఠులని ప్రశ్నించెను. భక్తియోగనిష్ఠులే శ్రేష్ఠులని శ్రీకృష్ణుడుత్తరమొచ్చెను. అట్టి భక్తియోగమునకు యోగ్యతలేనిచో నేమి చేయవలెనని ఆశంకించుకొని అట్టివాడు అక్షరయోగము నవలంబించవలెననియు నదియే క్రమముగా భక్తియోగమును సాధించుననియు చెప్పెను. అందుచే అక్షరయోగనిష్ఠునకు ముఖ్యమగు నుపాదేయగుణములు చెప్పబడెను.

ఇట్లు ప్రసంగక్రమమున విస్తరింపబడిన మొదటి సమాధానమునే యీ శ్లోకములో సంగ్రహముగ చెప్పిముగించున్నాడు.

భక్తియోగము ధర్మసిద్ధమైనదియు అమృతమువలె భోగ్యమైన దియు నగుచున్నది. ధ్యేయమగు పరమాత్మ రసస్వరూపుడగుటచే ఆతనిని గూర్చిన ధ్యానమును అతనివలె పరమభోగ్యమైనదియేగాన అమృతమువంటి దనుటలో నతిశయోక్తిలెదు. దీనిని **"మయ్యావేశమనోయే మాంనిత్యయుక్తా** ఉపాసతే" యను శ్లోకమున చెప్పినట్లు ఉపాసించు భక్తులు నా కత్యంత ప్రియతములని భగవంతుడు సెలవిచ్చెను.

ఇంతకు ముందు చెప్పబడిన గుణములు కలవారును ప్రియులని చెప్పబడినను ఆ ప్రీతి "ఉదారాస్సర్వఏవైతే" యని వారుదారులగుట చేతనే వచ్చినది మాత్రమేగాని యీ భక్తులయందలి ప్రీతి "జ్ఞానీత్వాత్మైవ మే మతం" అని తనకిష్టమైన 'అంతరాత్మ వంటివా' రనుటచే వచ్చిన ప్రీతిగాన 'అతీవ ప్రియాః' అని చెప్పబడెను. ఇట్టి వానిని గూర్చియే శ్రీకృష్ణుడు 'స మహాత్మా సుదుర్లభః' అని సెలవిచ్చెను.

త్రయోదశాధ్యాయార్థ సఙ్గ్రహము

శ్లో. దేహస్వరూప మాత్మాప్తి । హేతు రాత్మవిశోధనమ్ ।
బన్ధహేతు ర్వివేకశ్చ । త్రయోదశ ఉదీర్యతే ।

అర్థము : దేహస్వరూపం = శరీరముయొక్క స్వరూపమున్ను, ఆత్మాప్తిహేతుః = దేహముకంటె వేరైన ఆత్మను పొందుటకు సాధనమున్ను, ఆత్మవిశోధనం = అట్టి ఆత్మయొక్క స్వరూప పరిశీలనమున్ను, బన్ధ హేతుః = అట్టి యాత్మకు శరీరసంబంధమునకు కారణమున్ను, వివేకః చ = దానిని శరీరముకంటె వేరుగా తెలుసుకొనువిధమున్ను, త్రయోదశే = పదమూడవ యధ్యాయమున, ఉదీర్యతే= చెప్పబడుచున్నది.

తా॥ దేహస్వరూపమున్ను, దానికంటె వేరైన ఆత్మను పొందుటకు ఉపాయమున్ను, అట్టి యాత్మయొక్క స్వరూపశోధన మున్ను, అట్టి యాత్మ కీ శరీర సంబంధము కలుగుటకు కారణమున్ను, ఆ యాత్మను ప్రకృతి కంటె వేఱుగా తలంచు విధమున్ను పదమూడవ యధ్యాయమున జెప్పబడెను.

శ్రీమద్భగవద్గీతా - త్రయోదశాధ్యాయము

విషయసూచిక

అస్మద్గురుభ్యోనమః

శ్రీమద్భగవద్గీతా - త్రయోదశోఽధ్యాయః
క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగయోగః

అవ. ఈ యధ్యాయము మొదలు మూడధ్యాయములవరకును మోక్షాపేక్షగల వాడెఱుంగ దగిన చిత్-అచిత్-ఈశ్వర స్వరూపములను క్రమముగ నెఱింగించు చున్నాడు. మొదటనే దేహములను గురించి గాని ఆత్మలను గురించిగాని పండితులు దుఃఖించరని తెలిపిన క్రమమును బట్టియు, సప్తమాధ్యాయారంభమున అపర - పరప్రకృతులు రెండును తనవియే యని యుపదేశించిన క్రమమును బట్టియు నీ యధ్యాయముచే శరీరములుగా పరిణమించిన ప్రకృతి తత్త్వమును గూర్చి యుపదేశించుచున్నాడు. పూర్వోక్త విషయములను విశోధించుటయే గదా యీషట్క ప్రధానాశయము.

1.శ్లో. ఇదం శరీరం కౌన్తేయ । క్షేత్ర మిత్యభిధీయతే ।
ఏత ద్యో వేత్తి తం ప్రాహుః ! క్షేత్రజ్ఞ ఇతి తద్విదః ।

అర్థము : కౌన్తేయ = అర్జునా ! ఇదం = ఈ, శరీరం = దేహము, క్షేత్రం ఇతి = క్షేత్రమని, అభిధీయతే = చెప్పబడుచున్నది, ఏతత్ = ఈ దేహమును, యః = ఎవడు, వేత్తి = ఎఱుంగుచున్నాడో, తం = వానిని, క్షేత్రజ్ఞః ఇతి = క్షేత్రజ్ఞుడని, తద్విదః = ఆత్మ తత్త్వము నెఱింగినవారు, ప్రాహుః = చెప్పుచున్నారు.

తా॥ శరీర తత్త్వము నెఱింగిన ప్రాజ్ఞులు ఆత్మతోకూడ నెఱుంగబడుచున్న నీ దేహమును ఆత్మకు పుణ్యపాప ఫలములగు సుఖదుఃఖముల ననుభవించుటకు ఆధారమైనదని తెలుపుచున్నారు.

ఆత్మ తత్త్వము నెఱుంగు వివేకు లీ యాత్మను తెలుసుకొను వారగుటచే తెలియబడు దేహముకంటె వేరైనవాడని చెప్పుచున్నారు. (బీజముల నాటు టకును అవి వృద్ధిపొంది ఫలముల నొసంగుటకును ఆధారమగు భూమి క్షేత్రమనబడుటచే, కర్మబీజముల నాటుటకును అవి సుఖదుఃఖ రూపమగు ఫలముల నొసంగుటకును ఈ దేహమే యాధారమగుటచే నిదియును క్షేత్రమనబడుచున్నది.)

అవ. పరస్పరము విలక్షణమైన చేతనాచేతనములు రెండును పరమాత్మకంటె వేరైనవని తెలుపుటకై రెండును ఆతనికి శేషభూతములనియు నిట్లెఱుంగుట తన కిష్టమనియు నీ జ్ఞానమును ప్రశంసించుచున్నాడు.

2. శ్లో. **క్షేత్రజ్ఞఞ్చాపి మాం విద్ధి । సర్వక్షేత్రేషు భారత! ।**
క్షేత్ర క్షేత్రజ్ఞయో ర్జ్ఞానం । యత్తజ్జ్ఞానం మతం మమ ॥

అర్థము : హే భారత = ఓ యర్జునా ! సర్వక్షేత్రేషు = సకల దేహముల యందుండెడి, క్షేత్రజ్ఞం అపి = (శరీరమువలె) జీవునికూడ, మాం = నే నాత్మగాకలవానినిగా, విద్ధి= తెలుసుకొనుము, క్షేత్రక్షేత్రజ్ఞయోః = శరీరాత్మలయొక్క, జ్ఞానం = ఎఱుక, యత్ = ఏది కలదో, తత్ = అదియే, జ్ఞానం = తెలియదగిన జ్ఞానమని, మమ= నాయొక్క, మతం = అభిప్రాయము.

తా॥ అర్జునా ! శరీరము లెట్లు నే నాత్మగా కలవియో నిఖిల శరీరముల యందున్న జీవులుగూడ నేనాత్మగా కలవియే యని యెఱుంగుము. ఇట్లే దేహాత్మలు రెండును వేరువేరనియు, ఇవి రెండును పరమాత్మయే యాత్మగా కలవనియు నెఱుంగుటయే ఉత్తమమైన జ్ఞానమని నా యభిప్రాయము.

(శ్రీవిష్ణు సహస్రనామ ఫలశ్రుతిలోని 'వాసుదేవాత్మకాన్యాహుః క్షేత్రం క్షేత్రజ్ఞమేవచ' అను శ్లోక మీ గీతాశ్లోకమునకు సమానార్థకమని గుర్తించవలెను.)

ఇచ్చట శేషమనగా – తనచే యథేష్టముగా నియమింపబడదగినదియు, తనచే ధరింపబడదగినదియు, తన కతిశయము నొనగూర్చునదియునగు పదార్థమని గ్రహింపవలెను.

అవ. శరీరమును గూర్చియు, ఆత్మనుగూర్చియు సంగ్రహముగా దెల్పెదనని శ్రీకృష్ణు డర్జునునకు ప్రతినజేయుచున్నాడు.

3. శ్లో. **తత్క్షేత్రం యచ్చ యాదృక్చ । యద్వికారి యత శ్చ యత్**
స చ యో యత్ప్రభావ శ్చ । తత్సమాసేన మే శృణు ॥

అర్థము : తత్క్షేత్రం = ఆ శరీరము, యత్ చ = ఏ ద్రవ్యముతో చేయబడినదియో, యాదృక్ చ = వేటికి ఆశ్రయమైనదో, యద్వికారి = దాని వికారములెవ్వియో, యతః చ= ఏ ప్రయోజనము కొఱకది పుట్టినదో, యత్ = ఏ స్వరూపమైనదో, స చ =

క్షేత్రజ్ఞుడును, యః = ఏ స్వరూపము కలవాడో, యత్ ప్రభావః చ = ఏ ప్రభావము కలవాడో, తత్ = దానిని, సమాసేన = సంక్షేపముగా, మే = నానుండి, శ్రుణు = వినుము.

తా॥ ఆ శరీర మే ద్రవ్యముతో చేయబడినదియో, వేటికి ఆశ్రయమైనదియో, దాని వికారము లెవ్వియో, అది ఏ ప్రయోజనమునకై సృష్టింపబడినదో, ఏ స్వరూపమైనదో, ఆ జీవుడే స్వరూపము గలవాడో, వాని యాశ్చర్యకరములైన స్వభావ విశేషము లెవ్వియో వాటిని సంగ్రహముగా చెప్పెదను శ్రద్ధగా వినుము.

అవ. తాను చెప్పదలంచు అర్థములు ఇతిహాస పురాణ మీమాంసాదులచే నుపబృంహితములైన శ్రుతి ప్రమాణ సిద్ధములని తెలుపుచున్నాడు.

4.శ్లో. **ఋషిభి ర్బహుధా గీతం । ఛన్దోభి ర్వివిధైః పృథక్ ।**
బ్రహ్మసూత్రపదై శ్చైవ । హేతుమద్భి ర్వినిశ్చితైః ॥

అర్థము : ఋషిభిః = ఋషులచేత, బహుధా = అనేక విధములుగాను, వివిధైః = వేరు వేరు రీతులుగ దెలుపునట్టి, ఛన్దోభిః = వేదములచేతను, హేతుమద్భిః = హేతువులతో కూడినవియు, వినిశ్చితైః = లెస్సగా నిశ్చయింపబడినవైన, బ్రహ్మసూత్రపదైః = బ్రహ్మసూత్రములచేతను, పృథక్ పృథక్ = వేరువేరుగా, గీతం = వర్ణింపబడినది.

తా॥ ఈ శరీరాత్మల తత్త్వము పరాశర వ్యాసాది మహర్షులచేతను, అనేకమైన వేరువేరు రీతులుగా దెలుపునట్టి వేదములచేతను, సహేతుకముగా నిశ్చయింపబడిన శారీరక సూత్రములచేతను వేరు వేరుగా వర్ణింపబడినది.

అవ. శరీరమునకు సంబంధించిన ఐదు విషయములను రెండు శ్లోకములచే సంగ్రహముగ జెప్పుచున్నాడు.

5. శ్లో. **మహాభూతా న్యహఙ్కారో । బుద్ధి రవ్యక్త మేవ చ ।**
ఇన్ద్రియాణి దశైకం చ । పఞ్చ చేన్ద్రియ గోచరాః ॥

అర్థము : మహాభూతాని = పృథివ్యాది పంచభూతములున్ను, అహఙ్కారః = అహంకార తత్త్వమున్ను, బుద్ధిః = మహత్తత్త్వమున్ను, అవ్యక్తం ఏవ చ = మూల ప్రకృతియును, ఇన్ద్రియాణి = ఇంద్రియములు, దశ ఏకం చ = పంచజ్ఞానేంద్రియములు పంచ కర్మేంద్రియములు మనస్సు అనెడు పదనొకండును, ఇన్ద్రియగోచరాః = ఇంద్రియములచే నెఱుంగదగిన విషయములును.

తా॥ భూమి, నీరు, నిప్పు, గాలి, ఆకసమనెడు పంచభూతములున్ను, అహంకార తత్త్వము, మహత్తత్త్వము, మూలప్రకృతియు ననెడు ఎనిమిది ద్రవ్యములచే దేహము నిర్మింపబడినది. చెవి, చర్మము, కన్ను, ముక్కు, నాలుక యనెడు ఐదు జ్ఞానేంద్రియములున్ను, వాక్కు, చేయి, కాలు, మల మూత్ర విసర్జన ద్వారములనెడు ఐదు కర్మేంద్రియములు, మనస్సు అనెడు పదనొకండింద్రియములున్ను, జ్ఞానేంద్రియములచే గ్రహింపబడు శబ్ద స్పర్శ రూప రస గంధములనెడు ఐదు విషయములును; (ముందుశ్లోకముతో దీనికి సంబంధము)

6. శ్లో. ఇచ్ఛాద్వేష స్సుఖం దుఃఖం । సఙ్ఘాత శ్చేతనాధృతిః ।
ఏత త్క్షేత్రం సమాసేన । సవికార ముదాహృతమ్ ॥

అర్థము : ఇచ్ఛా = కోరికయు, ద్వేషః = విరోధమున్ను, సుఖం = ఆనందమున్ను, దుఃఖం= దుఃఖమున్ను, చేతనాధృతిః = జీవులకు సుఖదుఃఖ భోగానుభవమునకు ఆధారమైన, సఙ్ఘాతః = పంచభూతముల కూడికయైన, క్షేత్రం = శరీరమనబడు, ఏతత్ = ఇది, సవికారం = కార్యములతోకూడ, సమాసేన = సంగ్రహముగా, ఉదాహృతం = చెప్పబడినది.

తా॥ జ్ఞానేంద్రియాదులేగాక కోరిక ద్వేషము ఆనందము దుఃఖము అనునవి శరీర వికారములుగా జెప్పబడుచున్నవి. ఈ శరీరము జీవుడు గావించిన పుణ్యాపాపముల ఫలములగు సుఖదుఃఖములననుభవించుటకై యాధారముగా నిర్మింపబడినది. ఇది పంచభూతములయొక్క కూడికయే గాని వేరొక పదార్థముగాదు. ఇదియే క్షేత్రమనబడు శరీరము. ఇది నీకు వికారములతో గూడ సంగ్రహముగా జెప్పబడినది.

అవ. శరీరసంబంధముచే నాత్మయందు పుట్టునట్టి గుణములలో నాత్మ జ్ఞానమునకు సాధనములుగా గైకొనదగిన గుణములు చెప్పబడుచున్నవి.

. శ్లో. అమానిత్వ మదమ్భిత్వ । మహింసా క్షాన్తి రార్జవమ్ ।
ఆచార్యోపాసనం శౌచం । స్థైర్య మాత్మవినిగ్రహః ॥

అర్థము : అమానిత్వం = గర్వములేకుండుట, అదమ్భిత్వం = దంభములేకుండుట, అహింసా = పరులను పీడించకుండుట, క్షాన్తిః = ఓర్పు కలిగియుండుట, ఆర్జవం= మనోవాక్కాయము లేక రూపము గానుండుట, ఆచార్యోపాసనం = ఆచార్యులను

సేవించుట, శౌచం = సదాచారసంపత్తి కలిగియుండుట, స్థైర్యం = వేదాంత విషయములయందు చలింపకుండుట, ఆత్మవినిగ్రహః = మనస్సును నిగ్రహించుట.

తా॥ పెద్దలను తిరస్కరింపరాదు. కీర్తిని కోరి ధర్మములను జేయరాదు. కరణత్రయముచేతను పరులను పీడించరాదు. పరులు తనను పీడించుచున్నను చిత్తవికారమును జెందరాదు. తలంచినటులనే చెప్పుట, చెప్పినటులనే చేయుట యుండవలెను. ఆత్మజ్ఞానమును ప్రసాదించిన ఆచార్యులకు నమస్కారము, సేవ తప్పక చేయుచుండవలెను. శాస్త్రోక్తమైన సదాచారము నలవరచుకొని తన మనోవాక్కాయములను ఆత్మజ్ఞాన, తత్సాధనానుష్ఠానములకు తగినస్థితిలో నుంచుకొనవలయును. తాను వినిన సమంజసముగు వేదాంతార్థములనుండి చలించరాదు. ఆత్మ స్వరూపము నందే మనస్సునుంచి యితరమైనవాటినుండి దానిని మరల్చవలెను.

8. శ్లో. **ఇన్ద్రియార్థేషు వైరాగ్య । మనహఙ్కార ఏవ చ, ।**
జన్మ మృత్యు జరా వ్యాధి । దుఃఖ దోషాను దర్శనమ్ ।

అర్థము : ఇన్ద్రియార్థేషు = శబ్దాదివిషయములయందు, వైరాగ్యం = విరక్తియు, అనహఙ్కారః ఏవ చ = దేహాత్మ భ్రాంతిలేకుండుటయు, జన్మ మృత్యు జరావ్యాధి దుఃఖ దోషానుదర్శనం = పుట్టుట, చచ్చుట, ముసలితనము, రోగము, దుఃఖము అనెడు దోషములు తప్పనిసరిగా వచ్చెడివని తలంచవలెను.

తా॥ ఆత్మకంటె వేరైనవన్నియు దోషయుక్తములే గాన వాటియందసహ్యమును కలిగియుండవలెను. దేహమే ఆత్మయనెడు అభిమానము కాని, దేహమునకు సంబంధించిన పుత్రమిత్ర కళత్ర గృహ క్షేత్రాదులు తనవనెడు బుద్ధిగాని యుండరాదు. పుట్టుట గిట్టుట ముసలితనము రోగము మొదలగువాటివలన పుట్టెడు దుఃఖము దోషముగాన వాటిని తలంచి ఆత్మను వాటి బారినుండి తప్పించుటకై ప్రయత్నించవలెను. శరీరముండగనవి త్రోసిపుచ్చనలవి కానివి గాన శాంతముగా సహించుచు శరీరసంబంధ మిక నెప్పుడును రాకుండునట్లు ప్రయత్నించవలెను.

9. శ్లో. **అసక్తి రనభిష్వఙ్గః । పుత్ర దార గృహాదిషు, ।**
నిత్యం చ సమచిత్తత్వ । మిష్టానిష్టోపపత్తిషు ।

అర్థము : అసక్తిః = ఆత్మేతరములయందు మమకారము లేకుండవలెను. పుత్ర దారగృహాదిషు= కుమారుడు, భార్య, యిల్లు, మొదలగు వాటియందు, అనభిష్వఙ్గః = ఆసక్తి

లేకుండవలెను, ఇష్టానిష్టోపపత్తిషు=ఇష్టములుగాని అనిష్టములుగాని సంభవించినప్పుడు, నిత్యం=ఎల్లప్పుడును, సమచిత్తత్వం చ=మనస్సు నేకరీతిగా నుంచుకొనవలెను.

తా॥ ఆత్మకంటె మరి యే యితర సాంసారిక పదార్థములయందును సంగ ముండరాదు. భార్యాపుత్రాదులను శాస్త్రీయ కర్మలకు వారుపయోగించు నంతవరకు మాత్రమే వాడుకొనవలయును గాని వారియందు మిక్కిలి యనురాగ ముంచరాదు. తన సంకల్పముచే నిష్టములుగ గాని యనిష్టములుగ గాని భావింపబడు పదార్థములు తటస్థించిన యెడల మనస్సును సంతసముగాని క్రుంగుసుగాని చెందనీయక ఏకరీతిగా నుంచవలెను.

10. శ్లో. మయి చానన్య యోగేన । భక్తి రవ్యభిచారిణీ, ।
వివిక్త దేశ సేవిత్వ । మరతి ర్జనసంసది ॥

అర్థము : మయి = నాయందు, అనన్యయోగేన =దేవతాన్తర ఫలాన్తరాది పరిత్యాగ రూపమగుటచే, అవ్యభిచారిణీ=స్థిరమైన, భక్తిః = భక్తియును, వివిక్తదేశసేవిత్వం= జనులులేని ప్రదేశము నందు నివసించుట, జనసంసది = జనులు నివసించు ప్రదేశమునందు, అరతిః = అసహ్యమున్ను,

తా॥ ఇతర దేవతలనందరను విడిచి, ఇతర ఫలములను వేటినిగాని యాశించక కేవల సర్వేశ్వరునియందే స్థిరమైన భక్తికలిగి యుండవలెను. జనులులేని ప్రదేశమునందే నివసించవలెను. జనులు నివసించుచోట నివసించుట కసహ్యపడవలెను.

11. శ్లో. అధ్యాత్మ జ్ఞాననిత్యత్వం । తత్వజ్ఞానార్థ చిన్తనమ్, ।
ఏతజ్జ్ఞాన మితి ప్రోక్త । మజ్ఞానం య దతోఽన్యథా ॥

అర్థము : అధ్యాత్మజ్ఞాన నిత్యత్వం = ఆత్మనుగూర్చిన జ్ఞానమునందు నిష్ఠకలిగియుండుట, తత్వజ్ఞానార్థచిన్తనం = తత్వజ్ఞానమే ప్రయోజనముగాగల చింతనము (నందాసక్తి గలిగియుండుట) ఏతత్ = ఇదియే, జ్ఞానం = ఆత్మజ్ఞాన సాధనమని, ప్రోక్తం = చెప్పబడినది. అతః = దీనికంటె, అన్యథా = వ్యతిరేకముగా, యత్ = ఏదికలదో (తత్ = అది) అజ్ఞానం = ఆత్మజ్ఞాన విరోధి, (భవతి = అగుచున్నది)

తా॥ ఆత్మజ్ఞాన సంపాదనమందు నిష్ఠకలిగియుండవలెను. తత్వజ్ఞానమును బడయుటకై నిరంతరము చింతించుటయందే ఆసక్తికలిగియుండవలెను.

ఈ చెప్పబడిన యనుష్ఠానమంతయు ఆత్మజ్ఞానమును బడయుటకు ముఖ్యసాధనముగా చెప్పబడుచున్నది. ఇంతకు మించినదంతయు నాత్మజ్ఞానమునకు విరోధియే యగుచున్నది.

అవ. తెలిసికొనుటయే లక్షణముగా జెప్పబడిన క్షేత్రజ్ఞుడనబడు జీవుని స్వరూపము విమర్శింపబడుచున్నది.

12. శ్లో. జ్ఞేయం యత్తత్ప్రవక్ష్యామి । యజ్జ్ఞాత్వాఽమృత మశ్నుతే, ।
అనాది మత్పరం బ్రహ్మ । న సత్త న్నాస దుచ్యతే ॥

అర్థము : యత్ = ఏ జీవాత్మస్వరూపము, జ్ఞేయం = అమానిత్వాది గుణసంపత్తిచే పొందదగినదో, తత్ = దానిని, ప్రవక్ష్యామి = చెప్పెదను, యత్ = దేనిని, జ్ఞాత్వా= తెలిసికొని, అమృతం = శుద్ధాత్మ స్వరూపమును, అశ్నుతే = పొందుచున్నాడో, తత్ = అది, అనాది = పుట్టుకలేనిది, మత్పరం = నన్నే ముఖ్యునిగా గలది, బ్రహ్మ= జ్ఞానము ద్వారా సర్వవ్యాప్తి కలది, తత్ = అది, సత్ = సత్తుఅనియు, అసత్ = అసత్తనియు, న ఉచ్యతే = చెప్పబడదు.

తా॥ అమానిత్వాది సాధనములచే పొందదగిన జీవాత్మ స్వరూపమును జెప్పెదను. దాని నెఱింగినచో పుట్టుకచావులులేని శుద్ధాత్మ స్వరూపమును బడయనగును: ఈ శుద్ధాత్మకు పుట్టుకలేదు. అందుచే నాశనమునులేదు. దానికి నేను ప్రభువును, అది యణువైనను దీపము తన కాంతిచే వలెనే తన జ్ఞానముచే నంతటను వ్యాపించి యుండును. ఇది కార్యావస్థలో సత్ అనియు, కారణావస్థలో 'అసత్' అనియు చెప్పబడును. ఈ రెండు అవస్థలును ఆత్మకు కర్మమూలములేగాని సహజములుకావు గాన సత్ అసత్ శబ్దములచే శుద్ధాత్మ చెప్పబడదు.

13. శ్లో. సర్వతః పాణిపాదం త । త్సర్వతోఽక్షి శిరోముఖమ్, ।
సర్వత శ్శ్రుతిమ ల్లోకే । సర్వ మావృత్య తిష్ఠతి ॥

అర్థము : తత్ = ఆ శుద్ధాత్మస్వరూపము, సర్వతః = అంతటను, పాణిపాదం = చేతులును కాళ్ళునుగలది, సర్వతః = అంతటను, అక్షి శిరో, ముఖం = కన్నులు, తలలు, ముఖములు కలది, సర్వతః = అంతటను, శ్రుతిమత్ = చెవులుకలది, లోకే = లోకమందు, సర్వం = సమస్తమును, ఆవృత్య = వ్యాపించి, తిష్ఠతి = ఉన్నది.

తా॥ శుద్ధాత్మ స్వరూపము పరబ్రహ్మతోడి సామ్యముకలది. కావున పరబ్రహ్మకు గల స్వాభావిక శక్తి సామర్థ్యములు దీనికిని కలవు. పరబ్రహ్మవలెనే

ఆయా యింద్రియములు లేకున్నను ఆయా యింద్రియముల కార్యముల నంతటను సహజముగనే చేయగలదు. శుద్ధాత్మస్వరూపము దేశ కాలాదిహద్దులు లేనిదిగాన నిది సర్వత్ర యుండును.

14.శ్లో. సర్వేన్ద్రియ గుణాభాసం । సర్వేన్ద్రియ వివర్జితమ్ ।
అసక్తం సర్వభృచ్చైవ । నిర్గుణం గుణభోక్తృ చ ॥

అ : సర్వేన్ద్రియ గుణాభాసం = స్వయముగనేగాక ఇంద్రియవృత్తులచేతను గూడ విషయములను తెలిసికొనునదియును, సర్వేన్ద్రియ వివర్జితం = స్వయముగనే (ఇంద్రియవృత్తులు లేకయే) సర్వమును నెఱుంగునదియును, అసక్తం = సహజముగ దేవాదిదేహములతోడి సంబంధము లేనిదియును, సర్వభృత్ చ ఏవ= దేవాది సమస్త దేహములను భరించునదియును, నిర్గుణం = సహజముగ సత్త్వాది గుణములు లేనిదియు, గుణభోక్తృ చ = సత్త్వాదిగుణములను అనుభవించునదియును (భవతి = అగుచున్నది.)

తా॥ శుద్ధాత్మస్వరూపము, సహజముగనే గాక సమస్తేంద్రియ వృత్తులచే గూడ విషయములను తెలిసికొన సమర్థమైనది. స్వాభావికముగ నింద్రియవ్యాపారములులేనిది. దానికి దేవాది దేహసంబంధము కర్మవలన కలిగినదేగాని సహజముకాదు. కర్మవలన బద్ధదశయందును, తన సంకల్పము వలన ముక్తదశయందును దేవాది సర్వదేహములను భరించుటకు సమర్థమైనది. అది స్వాభావికముగ సత్త్వాది గుణములు లేనిదైనను ఆ గుణముల ననుభవించుటకు సమర్థమైనది.

15.శ్లో. బహి రన్తశ్చ భూతానా । మచరం చర మేవ చ ।
సూక్ష్మత్వాత్త దవిజ్ఞేయం । దూరస్థం చాన్తి కే చ తత్ ॥

అర్థము : భూతానాం = పంచభూతములయొక్క, బహిః = వెలుపలను, అన్తఃచ = లోపలను (వర్తతే = ఉంటున్నది) అచరం = సహజముగ కదలనిది. చరం ఏవచ = దేహ సంబంధముచే కదలునది, తత్ = ఆ యాత్మతత్త్వము, సూక్ష్మత్వాత్ = మిక్కిలి సూక్ష్మమైనదగుట వలన, అవిజ్ఞేయం = దేహముకంటె వేరైనదని తెలియశక్యముకానిది, తత్ = అది, దూరస్థం = దూరమున నున్నదియు, అన్తికేచ= సమీపమున నున్నదియు (భవతి = అగుచున్నది)

తా॥ శుద్ధాత్మ, పృథివ్యాది భూతములను వదలి శరీరములేక ఆ భూతములకు బయటనుండును. ముక్తదశలో స్వేచ్ఛా వ్యాపారములు విగ్రహించుట

కొఱకు ఆ భూతములలోపల వర్తించును. దానికి కర్మేంద్రియములు లేకుండుటచే చలింపకుండును. శరీరమును ధరించినచో చరించును. ఇది మిక్కిలి సూక్ష్మమైన దగుటచే సర్వజ్ఞత్వాది గుణములచే దేహముకంటె వేరైనను అట్లు తెలియబడదు. అది యందరి దేహమునందే యుండినను అమానిత్వాది గుణములులేనిచో మిక్కిలి దూరమున నున్నదియే యగును. అవి యున్నచో నదియే దగ్గరగా నున్నదియగును.

16. శ్లో. అవిభక్తం చ భూతేషు । విభక్త మివ చ స్థితమ్ ।
భూత భర్తృ చ తజ్జ్ఞేయం । గ్రసిష్ణు ప్రభవిష్ణు చ ॥

అర్థము : భూతేషు = దేవాదిభూతములయందు, అవిభక్తం = వేఱువేఱుగా గ్రహింపబడనిదియు, విభక్తం ఇవ = దేవాద్యాకారములచే విభజింపబడినదానివలె, స్థితం చ= ఉన్నదియు, భూతభర్తృ = దేహరూపములు దాల్చిన పృథివ్యాధి భూతములను భరించునట్టి, తత్ = ఆ యాత్మ, జ్ఞేయం = వాటికంటె వేరైనదిగా తెలియదగినదియు, గ్రసిష్ణు చ = అన్నాదుల ననుభవించునదియు, ప్రభవిష్ణు చ = పుట్టుటకు కారణమైనదియు (భవతి = అగుచున్నది)

తా॥ దేవాది శరీరముల యందున్నను ఏకాకారముతోనే యుండును గాని వేఱువేఱుగా నుండునదికాదు. ఈ రహస్యము నెఱుంగనివారికి వేఱు వేఱుగా నున్నట్లుతోచును. దేహరూపమును దాల్చిన పృథివ్యాది భూతములను భరించునది గానభరింపబడు నా భూతములకంటె వేఱైనదని తెలియదగినది. అన్నాకారముగనున్న పృథివ్యాది భూతముల ననుభవించునదిగాన అనుభవింపబడు నా భూతములకంటె వేఱైనదని తెలియదగినది. ఆ యన్నాదులు రేతోరూపమునుదాల్చి తిరిగి పుట్టుకకు కారణమగునట్లు చేయునదీ యాత్మయే గాన పుట్టునట్టి వాటికంటె వేరైనది. మృతశరీరమునందీ శక్తులు లేవు గాన నివి శరీరమునకు సంబంధించినవి కావనియు ఆత్మకే సంబంధించినవనియు నెఱుంగదగును.

17. శ్లో. జ్యోతిషా మపి తజ్జ్యోతి । స్తమసః పర ముచ్యతే ।
జ్ఞానం జ్ఞేయం జ్ఞానగమ్యం । హృది సర్వస్య విష్ఠితమ్ ॥

అర్థము : తత్ = ఆ యాత్మస్వరూపము, జ్యోతిషాం అపి = వెలుగునిచ్చు సూర్యాదులనుగూడ జ్యోతిః = ప్రకాశింపచేయునది, తమసః = సూక్ష్మప్రకృతికంటె, చరం . =

వేరైనదిగా, ఉచ్యతే = చెప్పబడుచున్నది, జ్ఞానం= జ్ఞానాకారమైనదని, జ్ఞేయం = తెలియదగినది, జ్ఞానగమ్యం = జ్ఞానసాధనములగు అమానిత్వాది గుణములచే పొందదగినది. సర్వస్య = అన్ని ప్రాణులయొక్క, హృది = హృదయమునందు, విష్ఠితమ్ = సన్నిహితమై యుండునదియు (భవతి = అగుచున్నది.)

తా॥ ఆత్మస్వరూపము, వెలుగునిచ్చు సూర్యాదులకున్ను వెలుగునిచ్చును. ఇది సూక్ష్మావస్థయందున్న ప్రకృతికంటె వేరైనది. కేవల జ్ఞానమే ఆకారముగా కలది. అది జ్ఞానసాధనములగు అమానిత్వాది గుణములచే పొందదగినది. మనుష్యాది సమస్త ప్రాణుల యొక్క హృదయమునందు భోక్తృస్వరూపముతో సన్నిహితమై యుండును.

అవ. ఇట్లు క్షేత్రస్వరూపమును, ఉపాయస్వరూపమును, క్షేత్రజ్ఞస్వరూపమును కలరూపముతో నెఱుంగుటకు ఫలమును జెప్పిముగించుచున్నాడు.

18.శ్లో. ఇతి క్షేత్రం తథా జ్ఞానం । జ్ఞేయం చోక్తం సమాసతః ।
మద్భక్త ఏతద్విజ్ఞాయ । మద్భావా యోపపద్యతే ।

అర్థము : ఇతి = ఇట్లు, క్షేత్రం = క్షేత్రతత్త్వమును, తథా = అట్లే, జ్ఞానం = ఆత్మజ్ఞానసాధనమును, జ్ఞేయంచ = క్షేత్రజ్ఞయాథాత్మ్యమున్ను, సమాసతః = సంగ్రహముగా, ఉక్తం = చెప్పబడినది, మద్భక్తః = నా భక్తుడు, ఏతత్ = ఈ చెప్పబడినదంతను, విజ్ఞాయ= తెలిసికొని, మద్భావాయ = నా స్వరూపమును పొందుటకు, ఉపపద్యతే = తగుచున్నాడు.

తా॥ ఈవిధముగ క్షేత్రతత్త్వమున్ను, జ్ఞానసాధనమైన అమానిత్వాది గుణ సంపత్తియున్ను, క్షేత్రజ్ఞ తత్త్వమున్ను సంగ్రహముగా జెప్పబడెను. న భక్తుడగువాడు వీటిని యెఱింగెనేని నా స్వభావమును పొందనర్హుడగును.

అవ. ఇకమీదట మిక్కిలి విలక్షణస్వభావముగల ప్రకృత్యాత్మలసంబంధమునాది యగుటను, అట్టి సంబంధముచే కలుగు కార్యభేదములను, ఆ సంబంధమునకు కారణమును జెప్పుచున్నాడు.

శ్లో. ప్రకృతిం పురుషం చైవ । విద్ధ్యనాదీ ఉభావపి ।
వికారాంశ్చ గుణాంశ్చైవ । విద్ధి ప్రకృతి సమ్భవాన్ ॥

అర్థము : ప్రకృతిం = ప్రకృతిని, పురుషం చ ఏవ = ఆత్మనున్ను, ఉభౌ అపి = కలసియున్న రెండింటిన్ని, అనాదీ = అనాదిగా కలసినవిగా, విద్ధి = తెలుసుకొనుము. వికారాన్

చ = ఇచ్ఛాద్వేషాది వికారములనున్ను, గుణాన్ చ ఏవ = అమానిత్వాది గుణములనున్ను, ప్రకృతి సమ్భవాన్ = ప్రకృతివలన బుట్టినవిగా, విద్ధి = ఎఱుంగుము.

తా॥ ప్రకృతి పురుషులిద్దరున్ను అనాదిగా నొకరితో నొకరుకలిసియున్నారని తెలియుము. బంధహేతువులైన ఇచ్ఛాద్వేషాదులున్ను, మోక్షహేతువులైన అమానిత్వాది గుణములున్ను ప్రకృతి వల్లనే పుట్టుచున్నవి.

అవ. ఇట్లన్యోన్యము కలసియున్న ప్రకృతి పురుషులయొక్క యీ కలయికచే జనించు వ్యాపారభేదముల నుగ్గడించుచున్నాడు.

20. శ్లో. కార్యకారణ కర్తృత్వే । హేతుః ప్రకృతి రుచ్యతే ॥
పురుష స్సుఖదుఃఖానాం । భోక్తృత్వే హేతు రుచ్యతే ।

అర్థము : కార్యకారణ కర్తృత్వే = శరీరము, ఇంద్రియములు తమతమ పనులు చేయుటయందు, ప్రకృతిః = పురుషాధిష్ఠితమైన ప్రకృతి, హేతుః = కారణముగా, ఉచ్యతే - చెప్పబడుచున్నది. పురుషః = ప్రకృతితో కలసియున్న జీవుడు. సుఖదుఃఖానాం= సుఖదుఃఖముల యొక్క, భోక్తృత్వే = భోక్తయగుటయందు, హేతుః = కారణముగా, ఉచ్యతే = చెప్పబడుచున్నాడు.

తా॥ శరీరముగాని, దాని యింద్రియములుగాని చేయునట్టి పనులలో పురుషాధిష్ఠితమైన ప్రకృతియే కారణము. ప్రకృతితో కలిసిన జీవుడే సుఖదుఃఖానుభవమునకు కారణము.

అవ. పురుషుడు (జీవుడు) తనను తాననుభవించుటయే సుఖముగా కలవాడై యుండినను విషయములవలన కలుగు సుఖదుఃఖముల ననుభవించుటకు కారణమెట్లగుచున్నాడో తెలుపుచున్నాడు.

21. శ్లో. పురుషః ప్రకృతిస్థోహి । భుఙ్క్తే ప్రకృతిజాన్ గుణాన్ ।

అర్థము : పురుషః = జీవుడు, ప్రకృతిస్థః = ప్రకృతిపరిణామమైన దేహసంబంధముకలవాడగుచు, ప్రకృతిజాన్ = దాని సంబంధముచే బుట్టిన, గుణాన్ = సత్త్వాది గుణములను, భుఙ్క్తేహి = అనుభవించుచున్నాడుగదా !

తా॥ తనను తాననుభవించుటయే సుఖముగాగల జీవుడు శరీరముతో తనకు సంబంధముండుటవలన పుట్టిన సత్త్వాదిగుణ కార్యములగు సుఖదుఃఖాదుల ననుభవించుచున్నాడు.

అవ. అయినచో నాతనికాశరీరముతో సంబంధమెట్లు కలిగినది ?

21. శ్లో. కారణం గుణ సఙ్గోఽస్య । సదసద్యోని జన్మసు ॥

అర్థము : అస్య = ఈ జీవునకు, సదసద్యోనిజన్మసు = మంచి, చెడు జన్మలెత్తుటకు, కారణం= హేతువు, గుణసఙ్గః = సత్త్వాది గుణములయందలి ఆసక్తియే.

తా॥ జీవుడే శరీరముతో సంబంధించియుండునో ఆ శరీర ప్రయుక్తమైన సత్త్వాది గుణములవలన పుట్టినట్టి సుఖాదులయం దాతని కభిలాష జనించును. దానిచే నా సుఖాది సాధనములగు పుణ్య పాపకర్మల నాచరించి వాటి ఫలముల ననుభవించుటకు తగిన జన్మల నెత్తుచుండును. ఇట్లే తిరిగి యాజన్మలయందును కర్మల నాచరించి తిరిగి పుట్టుచుండును. అమానిత్వాది గుణములు పుట్టువరకిట్లే తిరుగుచుండును.

అవ. ఇట్లు మంచి చెడ్డ జన్మల నెత్తిన పిమ్మట అతనికి కలుగు స్వభావములను జెప్పుచున్నాడు.

22. శ్లో. ఉపద్రష్టా నుమన్తాచ । భర్తా భోక్తా మహేశ్వరః ।
పరమాత్మేతి చాప్యుక్తో । దేహేఽస్మిన్ పురుషః పరః ॥

అర్థము : పరః = గొప్పవాడగు, పురుషః = జీవుడు, అస్మిన్ దేహే = ఈ దేహ విషయమున, ఉపద్రష్టా = చూచువాడును, అనుమన్తా చ = అంగీకరించువాడును, భర్తా = భరించువాడును, భోక్తా చ=సుఖదుఃఖాదుల ననుభవించువాడును. మహేశ్వరః= యజమానియు, పరమాత్మా ఇతి చ = పరమాత్మ యనియును, ఉక్తః = చెప్పబడెను.

తా॥ **జీవుడీ** శరీరములోనుండి కర్మాను గుణముగా సంకల్పించి శరీరమును నడిపించుచున్నాడు. అట్లే దీనిని నిలబెట్టుచున్నాడు. దాని నడవడిక వలన కలిగెడు సుఖదుఃఖముల ననుభవించుచున్నాడు. ఇట్లీ వ్యాపారములకు బాధ్యుడగుటచే నీదేహము, ఇంద్రియములు, మనస్సులకును ప్రభువగుచున్నాడు, ఆత్మయనగా దేహము మనస్సు **కూడ నర్థమగు** చున్నవి గాన వాటికంటె నీతడు గొప్పవాడగుటచే పరమాత్మ యనియు చెప్పబడుచున్నాడు.

అవ. ఇట్టి దేహాత్మలయొక్క వివేకానుసంధానప్రకారమును చెప్పబూని దానియందాదరము కలుగుటకై ఆ యనుసంధానమునకు ఫలమును ముందుగా జెప్పుచున్నాడు.

23.శ్లో. య ఏనం వేత్తి పురుషం । ప్రకృతిం చ గుణైస్సహ ।
సర్వథా వర్తమానోఽపి । న స భూయోఽభి జాయతే ।

అర్థము : యః = ఎవడు, ఏనం = ఇట్టి స్వభావముగల, పురుషం = జీవుని, ప్రకృతిం చ = ప్రకృతిని, గుణైఃసహ = సత్త్వాదిగుణములతో, వేత్తి = వేరువేరుగా నిజస్వరూపములతో నెఱుంగుచున్నాడో, సః = వాడు, సర్వథా = ఏ దేహమున ఏ విధముగా, వర్తమానః అపి = ఉన్నవాడైనను, భూయః = మఱల, న అభిజాయతే = పుట్టడు.

తా॥ ప్రకృతి పురుషుల నిరువురను, ఇంతవరకు చెప్పబడిన స్వభావములతో వేరువేరుగా నెవ్వడెఱుంగుచున్నాడో, సత్త్వాదిగుణముల నికమీద జెప్పబడు స్వభావము కలవాటినిగా నెఱుంగుచున్నాడో, వాడు ఏ జన్మయందే కష్టములతో నెట్లున్నను ఆ దేహమును విడిచిన తోడనే శుద్ధాత్మ స్వరూపమును బడయును.

అవ. ఈ విషయమునే రెండు శ్లోకములచే వివరించుచు, ఆత్మజ్ఞానమున కవస్థాభేదములను చెప్పుచున్నాడు.

24. శ్లో. ధ్యానేనా త్మని పశ్యన్తి । కేచిదాత్మాన మాత్మనా ।
అన్యే సాఙ్ఖ్యేన **యోగేన ।** కర్మయోగేన చాపరే ॥

అర్థము : కేచిత్ = కొందఱు, ఆత్మని = శరీరమందున్న, ఆత్మానం = ఆత్మను, ధ్యానేన = ధ్యానయోగ సహకారముచేత, ఆత్మనా = మనస్సుచేత, పశ్యన్తి = చూచుచున్నారు, అన్యే = ఇతరులు, సాఙ్ఖ్యేన యోగేన = జ్ఞానయోగముచేతను, అపరే = మరి కొందరు, కర్మయోగేన చ = కర్మయోగముచేతను, పశ్యన్తి = తెలుసుకొనుచున్నారు.

తా॥ యోగ పరిపాకముగల కొందరు శరీరమునందున్న ఆత్మను మనస్సున ధ్యానయోగ సహకారముచే గాంచుచున్నారు. అట్టి పరిపాకములేని యితరులు మనస్సును యోగమునకు తగునట్లు చేసుకొని జ్ఞానయోగ ముచే నాత్మను చూతురు. ఆ జ్ఞానయోగమునకున్ను తగనివారున్ను, తగినను సుకరోపాయము నపేక్షించువారున్ను, శిష్టులున్ను నిష్కామ కర్మయోగముచే మనస్సును యోగార్హముగా జేసుకొని ఆత్మను దర్శింతురు.

అవ. కర్మయోగమున నారితేరని ముముక్షువులయొక్క కర్మయోగ ప్రారంభావస్థను దెలుపుచున్నాడు.

25. శ్లో. అన్యే త్వేవ మజానన్తః । శ్రుత్వాఽన్యేభ్య ఉపాసతే ।
తేఽపి చాతితర న్త్యేవ । మృత్యుం శ్రుతిపరాయణాః ॥

అర్థము : అన్యేతు = కొందఱైతే, ఏవం = ఇట్లు, అజానన్తః = కర్మయోగమునైన నెఱుంగనివారై, అన్యేభ్యః = జ్ఞానులవలన, శ్రుత్వా = విని, ఉపాసతే = ఆత్మోపాసనమును జేయుచున్నారు, తే అపి = వారున్ను, శ్రుతిపరాయణాః చ = వినుటయందుమాత్రమే నిష్ఠకలవారున్ను, మృత్యుం = సంసారమును, అతితరన్తి ఏవ = తప్పక దాటుచున్నారు.

తా॥ కర్మయోగమునైనను ఎఱుంగని మరికొందఱు, తత్త్వవేత్తలనుండి తెలుసుకొని కర్మయోగాదులచే నాత్మ నుపాసించుచున్నారు. వారును ఆత్మను సాక్షాత్కరించి సంసారమును దాటుదురు. కేవలము వినుట యందు మాత్రము నిష్ఠకలవారున్ను ఆ శ్రవణము వలననే పాపములను పోగొట్టుకొని క్రమముగా కర్మయోగము నాచరించి సంసారము నతిక్రమించుచున్నారు.

అవ. ఇకముందు శరీరముతో కూడియున్న ఆత్మయొక్క వివేకము ననుసంధించు రీతిని చెప్పబోవుచున్నాడు. అందులకై చరాచరాత్మకమైన జంతువులన్నియు చేతనాచేతనములయొక్క సంబంధముచేతనే పుట్టినవని చెప్పుచున్నాడు.

26. శ్లో. యావ త్సఞ్జాయతే కిఞ్చి, త్సత్త్వం స్థావరజఙ్గమమ్ ।
క్షేత్రక్షేత్రజ్ఞ సంయోగా, త్తద్విద్ధి భరతర్షభ ! ।

అర్థము : భరతర్షభ = అర్జునా ! స్థావరజఙ్గమం = స్థావరజంగమరూపమైన, సత్త్వం = జంతువు, కిఞ్చిత్ = ఏదియైనను, యావత్ = ఎంతైనను, సఞ్జాయతే = పుట్టుచున్నదో (తావత్ = అంతయు) తత్ = అది (ఆ పుట్టుట) క్షేత్రక్షేత్రజ్ఞ సంయోగాత్ = ప్రకృతి పురుషులొకటితో నొకటి కలియుటవల్లనే (ఇతి = అని) విద్ధి = ఎఱుంగుము.

తా॥ అర్జునా ! జంతువులు స్థావరములుగను జంగమములుగను బుట్టుట క్షేత్రక్షేత్రజ్ఞు లొకరితో నొకరు కలియుటచేతనే యగును. అవియే కలసి యట్లు పుట్టుచున్నవని భావము.

అవ. ఆత్మలన్నియు సమానాకారముగలవి, దేహములన్నియు విషమాకారములు గలవి, ఆత్మ నియమించునది, దేహము నియమింపబడునది. ఆత్మనిత్యమైనది. దేహమనిత్యమైనది. ఇట్లు రెండింటికినిగల తారతమ్యమును జెప్పి, ఆ యనుసంధానమే తత్వాధ్యవసాయ మనబడుననియు అదియే పరమపురుషార్ధ సాధన మనియు కొనియాడు చున్నాడు.

27. శ్లో. సమం సర్వేషు భూతేషు । తిష్ఠన్తం పరమేశ్వరమ్ ।
వినశ్యత్స్వవినశ్యన్తం । యః పశ్యతి స పశ్యతి ॥

అర్థము : సర్వేషు = సమస్తమైన, భూతేషు = ప్రాణులయందు, పరమేశ్వరం = దేహేన్ద్రియ మనస్సులకు నియామకుడై, తిష్ఠన్తం = ఉన్నట్టి యాత్మను, సమం = జ్ఞాతృత్వమన బడు ఒకే ఆకారము కలవానినిగాను, వినశ్యత్సు = అవి నశించినను, అవినశ్యన్తం = నశింపనివానినిగాను, యః = ఎవడు, పశ్యతి =చూచుచున్నాడో, సః= వాడు, పశ్యతి= చూచుచున్నాడు.

తా॥ సకల ప్రాణులయందును నియామకుడై యున్న ఆత్మను, సమానాకారముకల దానినిగాను, అవి నశించినను నశించనిదానినిగాను తెలుసుకొనువాడు ఆత్మను నిజరూపముతో నెఱుంగువాడే యగును. (అట్లుగాక పైకి గాన్పించు ఆకార తారతమ్యము ఆత్మదే యనుకొనువాడు నిత్య సంసారియగును)

అవ. ఈ సమదర్శనమునే సమర్థించుచు ఫలద్వారా ప్రశంసించుచున్నాడు.

28. శ్లో. సమం పశ్యన్ హి సర్వత్ర । సమవస్థిత మీశ్వరమ్ ।
న హినస్త్యాత్మనాఽఽత్మానం । తతో యాతి పరా ఙ్గతిమ్ ॥

అర్థము : సర్వత్ర = అంతటను, సమవస్థితం = ఉన్నట్టి, ఈశ్వరం = నియామకుడైన ఆత్మను, సమం = సమానాకారము కలవానినిగా, పశ్యన్ = చూచుచున్నవాడు, ఆత్మనా = మనస్సుచేత, ఆత్మానం = ఆత్మను, న హినస్తి = హింసింపడు, తతః= అట్లెఱుంగుటవలన, పరాం = ఉత్తమమైన, గతిం = ఆత్మస్వరూపమును, యాతి= పొందుచున్నాడు.

తా॥ దేవాది శరీరములలో నియామకుడై యుండియు ఆ దేవాది వికారములు తన కంటకయుండు ఆత్మను అంతటను జ్ఞానాకారముతో నుండునని యెఱుంగువాడు తన మనస్సుచే తన యాత్మను సంసారమునుండి విముక్తునిగా జేయును. వాడు యథావస్థితాత్మ స్వరూపమును బొందు

చున్నాడు. (అట్లు కానిచో తన యాత్మను సంసార సాగరమున త్రోయుచున్నాడని భావము)

అవ. సాక్షాత్తుగా క్రియల కాధారమైనది ప్రకృతియు, అట్లుకానిది ఆత్మయనియు వైధర్మ్యమును తెలుపుచున్నాడు.

29. శ్లో. ప్రకృత్యైవ చ కర్మాణి । క్రియమాణాని సర్వశః ।
యః పశ్యతి తథా ఽఽత్మాన । మకర్తారం స పశ్యతి ॥

అర్థము : కర్మాణి = కర్మలను, సర్వశః = అన్నివిధములుగ, ప్రకృత్యా ఏవ = ప్రకృతిచేతనే, క్రియమాణాని = చేయబడుచుండునావానినిగాను, తథా = అట్లే, ఆత్మానం = ఆత్మను, అకర్తారం = కర్తకాని వానినిగాను, యః = ఎవడు, పశ్యతి = చూచుచున్నాడో, సః = వాడు, పశ్యతి = ఆత్మను వాస్తవముగ నెఱుంగుచున్నాడు.

తా॥ దేహేంద్రియ రూపముగమారిన ప్రకృతిచేతనే సర్వకర్మలును చేయబడుచున్నవనియు, ఆత్మ కర్తకాదనియు, వానికి ప్రకృతితో సంబంధమున్ను దాని నధిష్ఠించుటయు, దానిచే కలుగు సుఖదుఃఖానుభవమున్ను కర్మచే గావింపబడినవనియు నెఱుంగువాడే ఆత్మను నిజరూపముతో నెఱుంగువాడు.

అవ. ఇప్పుడు పరిణమించునది దేహమనియు, పరిణామములేనిది ఆత్మయనియు వైషమ్యమును జెప్పుచున్నాడు.

30. శ్లో. యదా భూత పృథగ్భావ, మేకస్థ మనుపశ్యతి ।
తత ఏవ చ విస్తారం । బ్రహ్మ సమ్పద్యతే తదా ॥

అర్థము : యదా = ఎప్పుడు, భూతపృథగ్భావం = ప్రాణులయొక్క వేరైయుండుటను, ఏకస్థం = ఒకే ప్రకృతి తత్వమునందున్న దానినిగా, అనుపశ్యతి = తెలిసికొనుచున్నాడో, తతః ఏవ = ఆ ప్రకృతివలననే, విస్తారం చ = పుత్ర పౌత్రాది విస్తారమునున్ను, (అను పశ్యతి = తెలిసికొనుచున్నాడో) తదా = అప్పుడు, బ్రహ్మ = శుద్ధాత్మ స్వరూపమును, సమ్పద్యతే = పొందుచున్నాడు.

తా॥ దేవాది భూతములు ప్రకృతి పురుషుల కలయికచే పుట్టినవి. పైకిగాన్పించు వైషమ్యములు ప్రకృతికి సంబంధించినవిగాని ఆత్మకు చెందినవి కావు. పుత్రపౌత్రాది విస్తారమున్ను ఆ ప్రకృతి వలననే కలుగుచున్నది. ఇట్లెఱుంగువాడు శుద్ధాత్మస్వరూపమును బడయుచున్నాడు.

అవ. నిత్యత్వము, అకర్తృత్వము, అపరిణామిత్వము మొదలగు ధర్మములచే నాత్మకు జెప్పబడిన వైలక్ష్యమును సహేతుకముగా సమర్థించుచున్నాడు.

31. శ్లో. అనాదిత్వా న్నిర్గుణత్వా । త్పరమాత్మాఽయ మవ్యయః ।
శరీరస్థోఽపి కౌన్తేయ ! న కరోతి న లిప్యతే ॥

అర్థము : కౌన్తేయ! = అర్జునా ! అయం = ఈ, పరమాత్మా = జీవుడు, శరీరస్థః అపి = శరీరము నందున్నవాడైనను, అనాదిత్వాత్ = ఆరంభములేనివాడు గావున, అవ్యయః= నాశములేనివాడు, నిర్గుణత్వాత్ = సత్త్వాదిగుణములు లేనివాడుగావున, న కరోతి= కర్మలనుజేయువాడుకాడు, నలిప్యతే = దేహస్వభావములచే తగులుపడడు.

తా॥ దేహముకంటె వేరుగా నిజరూపముతో నిరూపింపబడిన ఆత్మ శరీరము నందున్నను ఆది లేదుగాన అంతమునులేదు, సత్త్వాదిగుణము లాతనికి లేవుగాన కర్మల నాతడుజేయడు. కావుననే దేహధర్మము లాతనికి లేవు.

అవ. నిర్గుణుడగుటచే కార్యములను జేయకపోయినను శరీరముతో నిత్యసంబంధ ముండుటచే దాని స్వభావములచే లిప్తుడుకాకుండుటకు దృష్టాంతమును జూపుచున్నాడు.

32. శ్లో. యథా సర్వగతం సౌక్ష్మ్యా । దాకాశం నోపలిప్యతే ।
సర్వత్రావస్థితో దేహే । తథాఽఽత్మా నోపలిప్యతే ॥

అర్థము : యథా=ఎట్లు, ఆకాశం=ఆకాశము, సర్వగతం అపి=అంతటను వ్యాపించినదైనను, సౌక్ష్మ్యాత్=సూక్ష్మమగుటవలన, న ఉపలిప్యతే =ఆయా వస్తుస్వభావములచే నంట బడదో, తథా=అట్లే, ఆత్మా =జీవాత్మ, సర్వత్రదేహే= అన్ని దేహముల యందును, అవస్థితః అపి=ఉన్నవాడైనను,న ఉపలిప్యతే=ఆయా దేహస్వభావములచే నంటబడడు.

తా॥ ఆకాశమన్ని వస్తువులతోగలసియున్నను సూక్ష్మమగుటచేవాటి స్వభావము లచే నంటబడనట్లు ఆత్మయు దేవాది దేహములయందున్నను అతి సూక్ష్మమగుటవలన ఆయా దేహస్వభావములచే నంటబడదు.

అవ. అధ్యాయారంభమున దేహము తెలియబడునదియు, ఆత్మ తెలియునదియు నగుటచేతను, దేహము భూతముల కలయికరూపమైనదగుటచే నానారూపమైనదియు గాననారెండింటికినిగలభేదమునిశ్చితమైనదియేయని దృష్టాంతమునుజూపుచున్నాడు.

33. శ్లో. యథా ప్రకాశయ త్యేకః । కృత్స్నం లోక మిమం రవిః ।
క్షేత్రం క్షేత్రీ తథా కృత్స్నం । ప్రకాశయతి భారత ! ।

అర్థము : హే భారత ! = ఓ అర్జునా ! యథా = ఏ ప్రకారముగా, ఏకః = ఒక్కడైన, రవిః=

సూర్యుడు, కృత్స్నం = సమస్తమైన, ఇమంలోకం = ఈలోకమును, ప్రకాశయతి= ప్రకాశింపజేయుచున్నాడో, తథా = అట్లే, క్షేత్రీ = ఆత్మ, క్షేత్రం = శరీరమును, కృత్స్నం = అంతటను, ప్రకాశయతి = ప్రకాశింపజేయుచున్నాడు.

తా॥ సూర్యుడొక్కడయ్యు తన కాంతిచే ప్రపంచమునంతను వెలుగొందించు నట్లు జీవుడును శరీరమునంతను తన జ్ఞానముచే ప్రకాశింపజేయును. కావున శరీరముకంటె జీవుడు వేరని స్పష్టముగ దెలియుచున్నది.

అవ. ఈ యధ్యాయమునకు ప్రధానార్థమైన హేయ (త్యాజ్యములు) ఉపాదేయ (పరిగ్రాహ్యములు) ములయొక్కయు, వాటి యుపాయముల యొక్కయు విజ్ఞానమునకు ఫలమును జెప్పి ముగించుచున్నాడు.

34.శ్లో. క్షేత్ర క్షేత్రజ్ఞయో రేవ । మన్తరం జ్ఞానచక్షుషా ।
భూతప్రకృతిమోక్షం చ । యే విదు ర్యాన్తితే పరమ్ ।

ఇతి శ్రీభగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే క్షేత్రక్షేత్రజ్ఞ విభాగ యోగోనామ త్రయోదశోఽధ్యాయః

అర్థము : ఏవం = ఇట్లు, జ్ఞానచక్షుషా = జ్ఞానమనెడి నేత్రముచేత, క్షేత్రక్షేత్రజ్ఞయోః = ప్రకృతి పురుషులయొక్క, అన్తరం = భేదమును, భూతప్రకృతి మోక్షం చ = భూతములుగా మారిన ప్రకృతియొక్క మోక్షోపాయమగు అమానిత్వాదికమును, యే = ఎవరు, విదుః = తెలిసికొని యాచరించుచున్నారో, తే = వారు, పరం = శుద్ధాత్మ స్వరూపమును, యాన్తి = పొందుచున్నారు.

తా॥ ఇట్లు క్షేత్ర క్షేత్రజ్ఞులయొక్క భేదమును, జీవునకు శరీర విమోచనోపాయమగు అమానిత్వాదిగుణ సంపత్తిని వివేకమునెడు నేత్రముతో జూచి ఆచరించువారు బంధరహితమైన శుద్ధాత్మను బడయుదురు.

ఇది ఉపనిషదర్థ ప్రతిపాదకమును, బ్రహ్మవిద్యయు, యోగశాస్త్రమును, శ్రీకృష్ణార్జున సంవాదరూపమును అయిన శ్రీ భగవద్గీత యందలి క్షేత్రక్షేత్రజ్ఞ విభాగయోగమునెడు పదమూడవ యధ్యాయము.

ఈ యధ్యాయమందలి శ్లోకసంఖ్య	34
ఇప్పటికైన మొత్తము శ్లోకములు	522

శ్రీమద్భగవద్గీతా ప్రశ్నోత్తరావళి
పదమూడవ అధ్యాయము

1. ప్ర. పదమూడవ అధ్యాయమునకు పేరేమి ? ఆ పేరెందులకుంచబడినది ?

ఉ. ఈ యధ్యాయమునకు "క్షేత్ర-క్షేత్రజ్ఞ విభాగయోగ" మని పేరు. క్షేత్రమనగా శరీరము. బీజ మంకురించి క్రమముగ ఫలించుటకు క్షేత్ర (పంటభూమి) మెట్లునో యట్లనే జీవుడు గావించిన పుణ్య పాపరూపమగు కర్మ బీజముకూడ నంకురించి క్రమముగ ఫలించుట కీ శరీరమే యాధారమగుటచే క్షేత్ర సామ్యమును బట్టి దీనికి క్షేత్రమనియు, దీనిని సాకల్యముగ నెఱుంగువాడు గావున జీవునకు క్షేత్రజ్ఞుడనియు, పేరు లుంచబడినవి.

అట్టి క్షేత్ర మనబడు శరీరముయొక్క వాస్తవ స్వరూపమున్ను, ఆ దేహమును విడిచియుండు అత్మ స్వరూపమున్ను, అట్టి యాత్మ కీ శరీర సంబంధము సంభవించుటకు కారణమున్ను దానిని వీడి శుద్ధాత్మ స్వరూపము లభించుట కుపాయములున్ను యీ యధ్యాయమున ముఖ్యముగా వర్ణింపబడుటచే నీయధ్యాయమునకు క్షేత్ర-క్షేత్రజ్ఞ విభాగ యోగమని పేరుంచబడెను.

2. ప్ర. ఈ యధ్యాయమున చెప్పబడిన ప్రధాన విషయములేవి ?

ఉ : (దేహస్వరూప మాత్మాప్తి హేతురాత్మ విశోధనమ్)
బన్ధహేతు ర్వివేకశ్చ, త్రయోదశ ఉదీర్యతే॥ (యాము-గీ-సం- 17 శ్లో)

1. దేహముయొక్క స్వరూపము.
2. (ఆత్మయొక్క స్వరూపము)
3. దేహముయొక్క వాస్తవ స్వరూపమును శోధించుట.
4. దేహముకంటె వేరైన ఆత్మసరూపమును శోధించుట.
5. దేహముకంటె వేరైన ఆత్మస్వరూపమును బడయుటకు ఉపాయము నుపదేశించుట.
6. అట్టి పరిశుద్ధమగు నీ యాత్మ కీ దేహసంబంధ మెట్లు దాపరించినదియు వివరించుట.

7. అట్లే యాత్మకు దేహ సంబంధ మనివార్యముగ సంభవించినను దానికంటె నిది వేరైనదే యని యనుసంధించు రీతియు-నిందు చెప్పబడిన ప్రధాన విషయములు:

వివరములు :

(ఈ యధ్యాయ ప్రారంభమున అర్జున ఉవాచ-
"ప్రకృతిం పురుషం చైవ, క్షేత్రం క్షేత్రజ్ఞ మేవచ
ఏత ద్వేదితు మిచ్ఛామి, జ్ఞానం జ్ఞేయం చ కేశవ."
అని యర్జునుని ప్రశ్న పరమగు నొక శ్లోకమున్నట్లు కొన్ని యాధునిక అచ్చుపుస్తకములయందు గాన్పించుచున్నది. ఆ శ్లోకమున కే భాష్యకారులున్ను భాష్యమును వ్రాయకపోవుటచేతను, దీనిచే నేడువందలకు నొక శ్లోకమధికమగుటచే 'గీత యేడువందల శ్లోకములే'అనెడు ప్రామాణిక ప్రవాదమునకు భంగమువాటిల్లుటచేతను, ప్రశ్నపరమగు శ్లోకములేకున్నను ఉత్తరాత్ ప్రశ్న ఉన్నేయః' అనగా సమాధానమునుబట్టి ప్రశ్న నూహించుకొనవచ్చునని శాస్త్రముండుటచేతను ఆ శ్లోకమును గీతలో చేర్చలేదు.)

1. భగవానుడు క్షేత్రక్షేత్రజ్ఞశబ్దముల కర్థములను వర్ణించుట 1 శ్లో॥
2. ఈ రెండును పరమాత్మకంటె వేరైనవియేయని తెలియుటకై యాతడారెండింటికిని అంతరాత్మ యని వర్ణించుట. 2 శ్లో॥
3. శరీర వివేకము అనగా :
   అ) శరీరమే ద్రవ్యములతో నిర్మింపబడినది ?
   ఆ) ఇది వేటికి ఆధారమైనది ?
   ఇ) దీనివలన పుట్టునట్టి వికారము లేవి ?
   ఈ) ఏ ప్రయోజనమున కిది పుట్టించబడినది ?
   ఉ) దీని స్వరూపమెట్టిది ?
   ఊ) ఆ జీవుని స్వరూపమెట్టిది ?
   ఋ) ఆశ్చర్యావహమైన ఆతని గొప్ప స్వభావమెట్టిది ? అనెడు విషయముల నేడింటిని సంగ్రహముగా జెప్పెదనని శ్రీకృష్ణపరమాత్మ ప్రతిజ్ఞచేయుట. 3 శ్లో॥
4. తాను చెప్పదలంచిన నీ యర్థములు ఇతిహాస పురాణ మీమాంసాదులచే నుపబృంహితములైన శ్రుతిప్రమాణ సిద్ధములని సెలవిచ్చుచున్నాడు 4 శ్లో॥

5. శరీరమునకు సంబంధించిన ఐదు విషయములను సంగ్రహముగ జెప్పుట 5, 6 శ్లో॥
6. క్షేత్రవికారములగు నిచ్ఛాద్వేషాదులలో పరిశుద్ధాత్మ జ్ఞాన సాధనములుగా ననుష్ఠింపదగిన గుణములను విస్తరించిచెప్పుట7 నుండి 11వ శ్లో॥ వరకు
7. జీవుని స్వరూపమును విశదీకరించుట 12 నుండి 17 శ్లో॥ వరకు
8. పై విషయములను లెస్సగా నెఱుంగుటవలన కలుగు ఫలము జెప్పుట 18 శ్లో
9. ఇట్లు మిక్కిలి విలక్షణ స్వభావములుగల ప్రకృతికిని ఆత్మకును గల సంబంధమనాది యనియు, అవి యట్లు చేరియుండుటకు కారణమిదియనియు జెప్పుట. 19 శ్లో.
10. అట్లు చేరియున్న ప్రకృతి పురుషులయొక్క కార్యములలోగల తారతమ్యమును జెప్పుట. 20 శ్లో॥
11. సహజముగ నెల్లప్పుడును స్వానుభవముతోనే సుఖించవలసిన జీవునకు సాంసారిక సుఖదుఃఖానుభవమునకు కారణము జెప్పుట 21 శ్లో॥
12. జీవునకు ప్రకృతి సంబంధము కలుగుటకు కారణమును జెప్పుట. 21 శ్లో॥
13. అట్టి శరీరములోనే ప్రవేశించిన పిమ్మట నుండెడు జీవునిస్వభావ విశేషములను జెప్పుట 22 శ్లో॥
14. ఆత్మ వివేకానుసంధాన సాధనములను ఫలమునుచెప్పుట. 23, 24, 25శ్లో
15. స్థావర జంగమ రూపమగు ప్రపంచముయొక్క పుట్టిన రీతిని వర్ణించుట. 26 శ్లో
16. శరీరమున ప్రవేశించియున్నను ఆత్మ ప్రకృతికంటె వేరైనదని తలంచు విధానమును ఫలముతో జెప్పుట. 27 నుండి 33 శ్లో ॥ వరకు
17. ఈయధ్యాయార్థము నెఱుంగుటకు ఫలమును జెప్పుట 34 శ్లో

ప్ర . (తృతీయ షట్కమునకు వెనుకటి షట్కములతోను ప్రధాన శాస్త్రార్థములతోను గల సంబంధమేమి ?

ఈ యధ్యాయమునకు క్రిందటి యధ్యాయములోను ప్రధానశాస్త్రములోను గల సంబంధమేమి ?

ఉ : ప్రధాన పురుష వ్యక్త । సర్వేశ్వర వివేచనమ్ ।
కర్మధీః భక్తి రిత్యాదిః । పూర్వశేషోఽన్తిమోదితః ॥

అనెడు యామునాచార్యులవారి గీతార్థ సంగ్రహ కారికను బట్టి వెనుకటి షట్కములలో చెప్పబడిన ప్రకృతి, జీవుడు, భగవంతుడు అనెడు మూడు తత్వములయొక్క స్వరూపములున్ను, కర్మ జ్ఞాన భక్తియోగ స్వరూపము లున్ను, యీ షట్కమున విశోధింపబడుచున్నవి.

(విశోధన యనగా : ఒక విషయమును గూర్చి చెప్పునప్పుడు కొన్ని విషయములు నోటితో చెప్పబడక ఊహించుకొన దగినట్లు సూచింపబడుట, కొన్ని విషయము లసలే చెప్పబడకుండుట, చెప్పబడినను అంతమాత్రము చాలక ఇంకను విశదముగా చెప్పుట అవసరమైయుండుట మొదలగు వాటిచే కలుగు సంశయాదులన్నియు నిశ్శేషముగా తీరునట్లు విస్తరించి చెప్పుట.) ఈ షట్కమున మొదటి రెండు అనగా పదమూడు పదునాల్గు అధ్యాయములచే, రెండవ అధ్యాయమున "గతాసూనగతాసూంశ్చ" అని క్రమముగ దేహాత్మ వివేకముతో ప్రారంభించిన ప్రథమ షట్కముయొక్క ప్రధానాంశమగు దేహాత్మల నిజస్థితి, సంసారస్వరూపము, అదిపోయెడు రీతి, పోగొట్టు సాధనము మొదలగునవి పరిశోధింప బడుచున్నవి.

పదిహేనవ అధ్యాయమున మధ్యమషట్కములో చెప్పబడిన చేతనాచేతన ప్రకృతులకు ప్రభువగునట్టియు, ఆర్త, జిజ్ఞాసు, అర్థార్థి, జ్ఞానులచే సేవింపదగినట్టియు, పరమ పురుషునియొక్క స్వరూప స్వభావాదులు పరిశోధింపబడుచున్నవి. మిగిలిన మూడధ్యాయములచే కర్మయోగాది కర్తవ్యాంశములు పరిశోధింపబడినవి.

కావున నీ తృతీయ షట్కము వెనుకటి రెండు షట్కములతోను సుసంగత మగుచున్నది.

ప్రధాన శాస్త్రార్థమగు ముక్తికిఈ విషయములు పరంపరగా సాధనములగు చున్నవి. ఇవియే ముందుగ ముఖ్యముగ సవిస్తరముగ నెఱుంగదగినవి. ఈ శరీర మెట్టిదో, ఆత్మ యెట్టిదో, అట్టి ఈ యాత్మ కీ శరీర సంబంధ మెట్లు వచ్చినదో అది యెట్లు పోవునో మొదలగు విషయములు ముఖ్యముగా తెలియవలసినవి. అవి యీ షట్కమున విస్తారముగా చెప్పబడుటచే దీనికి ప్రధాన శాస్త్రార్థముతో నీ విధముగ పరంపరా సంబంధము కలదు.

క్రిందటి యధ్యాయమున పరమాత్మోపాసన కర్హత లేనివారికి అక్షరోపాసన విధింపబడినది. ఆ యక్షర శబ్దవాచ్యుడగు పరిశుద్ధాత్మ స్వరూపజ్ఞానము (అనగా ప్రకృతి సంపర్కగంధములేని ఆత్మ స్వరూపజ్ఞానము) లేనిదే ఆ యుపాసన ఘటించదు గాన నట్టి యాత్మ స్వరూప మీ యధ్యాయమున ప్రధానముగా వివరింపబడుచున్నది. ఇది రెండవ అధ్యాయముననే

మొదటినుండియు చెప్పబడినను అచ్చట నీ యాత్మ నిత్యమనెడు విషయమే ప్రధానముగా చెప్పబడెను. గాని ఆత్మయొక్క ఇతరమైన స్వాభావిక విశేషము లచ్చట వివరింపబడలేదు. అవి యిచ్చట సవిమర్శగా వివరింపబడినవి. ఇక నీ విషయము ప్రధాన శాస్త్రార్థమగు ముక్తి కెల్లుపయోగించుననగా తన యాత్మయొక్క నిజస్వరూపము నెఱింగినచో ప్రస్తుతము కర్మచే కలిగిన బంధమును పోగొట్టుకొని ఆ స్వరూపమును పొందుటకై సాధనముల నన్వేషించ నిచ్చ జనించి వాటి నెఱింగి యాచరించి తరించగలుగును.

4. ప్ర. **క్షేత్ర శబ్దమునకును క్షేత్రజ్ఞశబ్దమునకును భగవానుడు చెప్పిన యర్థమేమి?**

ఉ. దేవాకారముగను మనుష్యాకారముగను పశు పక్ష్యాద్యాకారముగను మారుచు బలియుచు చిక్కుచుండునట్టియు, విత్తన మంకురించి ఫలించుటకు క్షేత్రమువలె జీవుడాచరించిన పుణ్యపాపములు ఫలించుట కాధారమగు నట్టి యీ శరీరమే క్షేత్ర మనబడుచున్నది.

ఇట్టి శరీరమును 'ఇది చేయి, ఇది కాలు' అని అవయవ రూపముగను, 'ఇది నా శరీరమ'ని సముదాయ రూపముగను నెఱుంగు జీవుడే క్షేత్రజ్ఞుడన బడుచున్నాడు.

5. ప్ర. **ఋషులచేతను, వేదవాక్యముల చేతను, బ్రహ్మ సూత్రములచేతను యీ శరీర మెట్టిదిగా వర్ణింపబడెనని శ్రీ కృష్ణుడుపదేశించెను?**

ఉ. శరీరమును గుఱించి యైదు విషయములెఱుంగదగి యున్నవి. అవి యేవనగా

1. శరీరమే ద్రవ్యములతో నిర్మింపబడినది?

భూమి, నీరు నిప్పు,గాలి ఆకాశము, అహంకారము, మహత్తత్వము, ప్రకృతి యనబడు యెనిమిది యచేతన తత్వములచే నిర్మింపబడినది.

2. శరీరము వేటి కాధారమైనది?

ఇది కన్ను, ముక్కు, చెవి, చర్మము, నాలుక, యనెడు ఐదు జ్ఞానేంద్రియములకును.

వాక్కు, చేయి, కాలు, మల, మూత్ర విసర్జనాంగములు ననెడు ఐదు కర్మేంద్రియములకును.

మనస్సనెడు అంతరింద్రియమునకును, రూపము, గంధము, శబ్దము, స్పర్శ, రుచి యనెడు ఐదు విషయములకును ఆధారమైయున్నది.

3. దీనిమూలమున నాత్మయందు పుట్టునట్టివికారము లేవి?

కోరిక, ద్వేషము, సుఖము, దుఃఖము అనునవి శరీరసంబంధమువలన ఆత్మయందు పుట్టునవగుటచే శరీరవికారములుగా చెప్పబడుచున్నవి.

4. ఈ శరీర మే ప్రయోజనమునకై పుట్టించబడెను?

దీనికి సమాధానముగ శ్రీకృష్ణపరమాత్మ 'చేతనాధృతిః' యని సెలవిచ్చెను. ఆధృతి యనగా ఆధారము. అనగా సుఖమును దుఃఖమును అనుభవించునట్టియు, ఇహలోకపరలోకసుఖములను గాని మోక్షమునుగాని సాధించునట్టియు జీవుని కాపనులు నిర్వహించుట కాధారముగ నుండుటకై పుట్టించబడినది.

5. ఈ శరీర స్వరూపమెట్టిది?

'సంఘాతః అని శ్రీ భగవానుని యుత్తరము. అనగా పంచ మహాభూతములు మొదలగు శరీర సృష్టికుపయోగింపబడిన యెనిమిది పదార్థముల చేరికయే శరీరము యొక్క స్వరూపము. అని యిట్లు క్షేత్రమనబడు శరీరము వర్ణింపబడెను.

6. ప్ర. పరిశుద్ధమగు నాత్మజ్ఞాన సాధనములుగా ననుష్ఠింపదగిన గుణములేవి?

ఉ. 1. 'అమానిత్వమ్'

తనకున్న చదువునుబట్టియు, కులగౌరవమును బట్టియు, ఐశ్వర్యమును బట్టియు, దురభిమానము జనించును. దానిచే పెద్దల ననాదరించుట మా నిత్వమనబడును. అదిలేకుండుట

2. 'అదంభిత్వమ్'.

"ఈ ధర్మములు వేదములో నా వర్ణమునకును నా యాశ్రయమునకును చేయవలసినవిగా విధింపడినవి గాన నేను చేయుచున్నా"నని చేయవలెనే గాని నన్నులోకులు ధార్మికుడని ప్రశంసింతురను యాశతో ధర్మము లాచరించకుండుట.

3. 'అహింసా'

మనస్సుతోగాని మాటతో గాని చేష్టతోగాని పరులకనర్థమునే యాపాదించు వ్యాపారము హింస యనబడును. అది కూడదు.

4. 'క్షాన్తి'

పరులు తనను బాధించినను దానికి ప్రతిక్రియ చేయవలెననెడు ఉద్రేకము తన మనమున పొడసూపకుండుట.

5. 'ఆర్జవమ్'

తానొకటి తలంచి వేరొకటి చెప్పి మరియొకటి చేయుట కౌటిల్య మనబడును. అట్లుగాక తాను తలంచిన దానినే చెప్పి చెప్పినట్లే చేయుట ఆర్జవ మనబడును.

6. 'ఆచార్యోపాసనమ్'

ఆత్మజ్ఞానము నుపదేశించువారే ఆచార్యులనబడుదురు. వారికి ప్రణిపాత, పరిప్రశ్న సేవలాచరించుటయే ఆచార్యోపాసనము. ప్రణిపాతమనగా: ప్రశ్నించుటకు ముందు సాష్టాంగముగా సాగిలిపడి నమస్కరించుట.

(సాష్టాంగ[illegible]నగా: మనస్సు, బుద్ధి, అభిమానము, రెండుచేతులు, రెండుకాళ్లు, [illegible]ంగి నేలను సోకవలెను. ఆ సోకునప్పుడైనను [illegible] యని చూడక భూమిపై క్రవలెపడుట)

పరిప్రశ్నయనగా: తాను పెక్కురి తెలివిగలవాడైనను దానిని మరుగు పరచి యేమియు నెఱుంగని వానివలె అడుగవలసిన వాటిని మొదటనే సాక్షాత్తుగ నడుగక, దానికి సంబంధించినవాటి నడుగుచు క్రమముగ తన సందేహముల దీర్చుకొనవలెను.

సేవయనగా: ఆచార్యుల యనుగ్రహము కలుగుటకు వారికి భక్తితో పరిచర్యలు చేయుచుండుట.

7. 'శౌచమ్'

తన మనోవాక్కాయములను ఆత్మజ్ఞానమునకును తత్సాధనమునకును తగినట్లుగా శాస్త్రమూలమున సంస్కరించుకొనుట

(మనోవాక్కాయములకుగల దోషములేవి యనగా రాగాదులు మానసిక దోషములు.

అబద్ధములాడుట మొదలగునవి వాచిక దోషములు.

తినరానివి తినుట మొదలగునవి కాయిక దోషములు) శాస్త్రములో చెప్పబడిన పద్ధతులతో నీ దోషములను బాపుకొనుట శౌచమనబడును.

8. 'స్థైర్యమ్'

వేదాన్తశాస్త్రములలో చెప్పబడిన యర్థములను తా నెఱింగి నమ్మిన వాటిని మతాంతరు లెంత విపరీతముగ భోదించినను చలింపక నిస్సంశయముగా నమ్మియుండుట.

9. ఆత్మవినిగ్రహః

ఆత్మ స్వరూపమునకు విరుద్ధములైన విషయములనుండి మనస్సును మరల్చుట.

10. ఇన్ద్రియార్థేషు వైరాగ్యమ్

ఆత్మకంటె వేరైన విషయములలోగల దోషములను తలంచుకొనుచు వాటియందసహ్యమును పుట్టించుకొనుట

(వాటిలోగల దోషములేమనగాః సంపాదించుటలోగల కష్టము, కాపాడుటలోగల కష్టము. నశించిపోయిన కష్టము. తరిగిపోయిన కష్టము. విషయానుభవముచే అనారోగ్యమువలన కలుగు కష్టము.

ఇట్లనేక కష్టములతో కూడుకొని యుండుటచే విషయములు దుఃఖాత్మకములగుచున్నవి.)

11. అనహఙ్కారః

శరీరమునే యాత్మగా తలంచకుండుటయు, తనవికాని వస్తువులను తనవిగా తలంచకుండుటయును.

12. జన్మమృత్యుజరావ్యాధి దుఃఖ దోషానుదర్శనమ్.

పుట్టుక, చావు, ముసలితనము, రోగము మొదలగువాటివలన పుట్టిన దుఃఖములే దోషములు, ఇవి శరీరమున్నంతవరకు తప్పనివియని మాటిమాటికిని తలంచుచుండుట.

12. అసక్తిః

ఆత్మకంటె వేరగు నే విషయముల యందును ఆశలేకుండుట

13. పుత్రదార గృహాదిషు అనభిష్వఙ్గః.

భార్యాబిడ్డలు, యిండ్లు మొదలగు వాటియందు శాస్త్రోక్త కర్మలకుపయోగించు నంతటికంటె నధికమైన ఆసక్తి లేకుండుట.

14. ఇష్టానిష్టో పపత్తిషు నిత్యంచ సమచిత్తత్వమ్.

తన సంకల్పముచే కల్పించుకొనిన ఇష్టవస్తువులుగాని అనిష్టవస్తువులుగాని తటస్థించినప్పుడు ఆనందముగాని కోపావేశముగాని జనించకుండుట.

15. మయి చ అనన్యయోగేన భక్తిః అవ్యభిచారిణీ.

ఇతర దేవతలను ఇతర ఫలములను ఇతర ఉపాయములను విడిచి సర్వేశ్వరుని యందే నిశ్చల భక్తి కలిగి యుండుట.

16. వివిక్త దేశ సేవిత్వమ్.

చిత్తైకాగ్రత కనుకూలమైనట్టియు రాజస తామస జనసంచారము లేనట్టియు ప్రదేశమున నివసించుట

17. అరతిః జనసంసది.

రాజస తామస జన సహవాసమునందసహ్యము కలిగియుండుట.

18. అధ్యాత్మజ్ఞాన నిత్యత్వమ్.

ఆత్మను తెలుసుకొనుట యందును దానిని ధ్యానించుట యందును నిష్ఠకలిగి యుండుట,

19. తత్వజ్ఞానార్థ చింతనమ్.

నిరంతరము తత్వజ్ఞానమునకై సమాలోచన గావించుటలో ఆసక్తి కలిగి యుండుట.

ఈ గుణములచే నాత్మజ్ఞానము లభించును గాన విని జ్ఞానమనబడు చున్నవి, ఇంతకు మించిన గుణములన్నియు నాత్మజ్ఞాన విరోధులగుటచే అజ్ఞాన మనబడు చున్నవి.

7. ప్ర ప్రకృతి సంపర్కములేని పరిశుద్ధమైన ఆత్మస్వరూపమును శ్రీ కృష్ణభగవాను డెట్లుపదేశించెను?

ఈ విషయమీ యధ్యాయమునకు జీవగర్ర.

ఉ : ఈ పరిశుద్ధమగు ఆత్మ

1. అనాది.

పుట్టకలేనిది (కావుననే గిట్టుటయు దీనికిలేదు)

2. మత్పరమ్

భగవంతునికిది శరీరమువలె పరతంత్రమై యాతని కతిశయ మొన గూర్చుటయే స్వరూపముగా కలదగుటచే నాతనిని శేషిగా కలిగియున్నది. (శేష శేషి లక్షణము ఏడవ ఆధ్యాయమున వ్రాయబడెను.)

3. బ్రహ్మ.

మహత్పరిమాణముగల జ్ఞానముకలది. శరీరముకంటె వేరైనది. సహజముగ శరీరముచే సంకోచింపబడనిది, కర్మ నశించగనే ఈ జ్ఞాన సంకోచము తీరి యపరిచ్ఛిన్న జ్ఞానము కలది యగును.

4. న సత్ న అసత్ ఉచ్యతే.

ఈ యాత్మ కార్యావస్థలో (సృష్టిసమయమున) దేవమనుష్యాది నామ రూపములు కలిగియుండునుగాన 'సత్' అని చెప్పబడును. కారణావస్థలో

(ప్రళయసమయమున) నవి లేకుండుటచే 'అసత్' అని చెప్పబడు చున్నది. ఈ యవస్థలైనను కర్మమూలములేగాని సహజములు కావు . కావున నిది నియతముగా సత్తనిగాని యసత్తనిగాని చెప్పబడదు.

5. సర్వతః పాణి పాదం తత్

పరిశుద్ధమైనయాత్మ పరమాత్మతో సమానముగనుండునుగాన పరమాత్మ వలెనే యిదియు కాలుచేతులతోచేయు పనుల నంతటను అవిలేకున్నను జ్ఞానవ్యాప్తి మూలముగనే చేయగలుగుచున్నది.

6. సర్వతోక్షి శిరోముఖమ్ సర్వత శ్రుతిమత్

అట్లేకన్ను, తల, ముఖము, చెవి మొదలగు యింద్రియములు లేకున్నను అంతటను అవి చేయుపనులును చేయగలశక్తి కలిగియున్నది.

7. లోకే సర్వమావృత్య తిష్ఠతి.

దీపమల్పమైనను తన కాంతిచే నంతటను వ్యాపించియున్నట్లు ఆత్మ యణు పరిమాణము కలదైనను ప్రకృతి సంబంధము లేక తన నిజరూపముతో వెలుంగునప్పుడు ప్రపంచమునందున్న సమస్తవస్తువులయందును వ్యాపించి యుండును,

8. సర్వేంద్రియ గుణాభాసమ్, సర్వేంద్రియ వివర్జితమ్.

శరీరముతో నున్నప్పుడు జ్ఞానేంద్రియములగు కన్ను ముక్కు మొదలైన వాటిమూలముగను, అవి లేకున్నను తనంతటను సమస్త శబ్దాది విషయములనున్ను తెలుసుకొన శక్తికలిగియున్నది.

9. అసక్తమ్ : సర్వ భృచ్చైవ

సహజముగ దేవమనుష్యాది శరీరములు లేనిదైనను ఆయా సమస్త శరీరములను ధరించగలదై యున్నది.

10. నిర్గుణం గుణభోక్తృచ

సహజముగసత్వాదిగుణములయొక్క కార్యములగు సుఖ దుఃఖ మోహాది అనుభవములు లేకున్నను దేహమనెడు ఉపాధిమూలమున వాటిని యనుభవించుచుండును.

11. బహిః అన్తశ్చ భూతానామ్.

ఆత్మ బద్ధ దశలో పృథివ్యాది పంచభూతములయొక్క వికారమైన శరీరములో నుండుట సహజమేయైనను ముక్తదశలో కూడ తన సత్య సంకల్పముచే తన కిష్టమైన యప్రాకృత దేహమును కల్పించుకొని వాటి యందు స్వేచ్ఛగా విహరించును. ఆ శరీరములను కల్పించుకొనని తరి బయట నుండుట సహజమేకదా!

12. అచరమ్ చరమేవచ

దేహము లేనప్పుడు పాదాదులతో సంచరించదు. దేహములోనున్నప్పుడు వాటితోనే సంచరించును.

13. సూక్ష్మత్వాత్ తదవిజ్ఞేయమ్.

ఇట్లు సర్వశక్తి కలిగి ఈ శరీరముననే యున్నను, మిక్కిలి సూక్ష్మమైనదిగాన సంసారులు దీనిని దేహముకంటె వేరైనదని యెఱుంగజాలరు.

14. దూరస్థం చ అన్తికే చ తత్.

శుద్ధాత్మస్వరూపమును బడయుటకు సాధనములుగ జెప్పబడిన అమానిత్వాది గుణములు లేక విపరీత గుణములుగల మానవులకు తమ దేహములయందేయున్నను దూరమునందున్నట్లే తెలియబడకయుండును. ఆ గుణములున్నవారి కన్ననో అవి దాపుననేయుండును (గోచరించును)

15. అవిభక్తం చ భూతేషు – విభక్తమివ చ స్థితం

ఆత్మలు దేవ మనుష్యాది యేశరీరమునందున్నను ఒకే యాకారము కలిగియే యుండునుగాని దేవుడని మానవుడని వేరువేరుగానుండవు. కాని పామరులకు మాత్రము వీడు దేవుడు, వీడు మనుష్యుడని వేరువేరుగా గోచరించుచుండును.

16. భూత భర్తృ

దేహములుగా పరిణమించియున్న పృథివ్యాది భూతములను భరించు నదిగాన వాటికంటె వేరైనదని తెలియదగి యుండును

17. గ్రసిష్ణు

తినబడునవి అన్నాదులును, తినునది ఆత్మయును, గాన ఆత్మ ఆ యన్నాదుల కంటె వేరైనదని తెలియదగి యుండును

18. ప్రభ విష్ణు

తినబడిన అన్నాదులను మలమాంసాది రూపముగ పరిణమింపజేయును

19. జ్యోతిషామపి తజ్జ్యోతిః

దీపాదులు కంటికిని, పదార్థమునకును అడ్డుగా నుండు చీకటిని పోగొట్టుటకు మాత్రమే ఉపయోగించును గాని, ఆ దీపాదులను కూడ ప్రకాశింప జేయునది ఈ యాత్మయొక్క జ్ఞానమే.

20. తమసః పరమ్.

ప్రకృతికంటె వేరైనది

21. జ్ఞానం జ్ఞేయం

ఇదిజ్ఞానాకారమైనదని తెలియదగియున్నది

22. జ్ఞానగమ్యమ్.

వెనుక చెప్పబడిన అమానిత్వాది గుణములచే పొందదగియున్నది

23. హృదిసర్వస్య విష్ఠితమ్

సమస్త మనుష్యాదులయొక్క హృదయముల యందును సన్నిహితమై యుండును

ఇదియే పరిశుద్ధమగు ఆత్మస్వరూపము

8. ప్ర. మిక్కిలి విరుద్ధస్వభావములు కలిగియున్న యీ శరీరాత్మలకీ సంబంధ మెప్పుడు? ఎందులకు? ఎట్లు సంభవించినది? ఇట్లుచేరియున్నప్పుడీ రెండింటి వ్యాపారములలో గల తార తమ్యమేమి?

ఉ: జీవుడును యీ ప్రకృతియు అనాదులు. శరీరాకారమును దాల్చిన యీ ప్రకృతితో జీవునకుగల సంబంధమున్ను అనాదియే.

ఈ శరీరము తన వికారములగు ఇచ్ఛా ద్వేషాదులను పుట్టించుచు ననాదిగా నీ జీవుని బంధించుచున్నది. ఈ శరీరమే యొకతరి వీని సుకృత విశేషమున అమానిత్వాది గుణములను బుట్టించి మోక్షకారణముకూడ నగు చున్నది.

ఇట్లాత్మతో చేరియున్న శరీరమున్ను, దానినాశ్రయించుకొనియున్న జ్ఞానకర్మేంద్రియములున్ను ఆత్మకు భోగసాధనములైన తమపనులను నెఱవేర్చుచున్నవి. జీవుడా శరీరాదులను నిలబెట్టుచు వాటి పనులచే పుట్టునట్టి సుఖదుఃఖముల ననుభవించు చుండును.

జీవుడు సహజముగ తన స్వరూపమును మాత్రమే యనుభవించువాడైనను గిన్నెయొక్క సంపర్కముచే అందుండు నీరు వేడియెక్కునట్లు శరీర సంపర్కమువలన దానికిగల సత్వరజస్తమోగుణములచే పుట్టునట్టి సుఖ దుఃఖములను కూడ ననుభవించు చుండును.

ఇట్లీ సుఖాది యనుభవముల యాశచే వాటికి సాధనములగు కర్మల నాచరించుచు వాటికి ఫలములగు సుఖదుఃఖముల ననుభవించుటకు తగిన జన్మల నెత్తుచు తిరిగి యా వాసనచే నట్లే చేయుచు పుట్టుచు గిట్టుచునుండును.

వెనుక వివరింపబడిన అమానిత్వాది గుణము లుదయించువరకీ శరీర పరంపర తప్పక అనువర్తించుచునే యుండును.

ఇట్లీ శరీరములోనున్నప్పుడీ జీవుడు ఉపద్రష్టా, అనుమంతా, భర్తా, భోక్తా, మహేశ్వరః, పరమాత్మా యని పేరులతో పిలువబడును.

ఉపద్రష్టా –

అచేతనములగు దేహములున్ను ఇంద్రియములున్ను లోపలనుండు జీవుని సంకల్పములేనిదే యే పనియు చేయజాలవుగాన నాయా పనుల కనుకూలముగ సంకల్పించువాడు.

అనుమన్తా –

అట్లు దేహాదులాయాపనులయందు ప్రవర్తించునపుడు 'అట్లే ప్రవర్తించుగాక' యని యనుమతించువాడు

భర్తా –

ఆ దేహేంద్రియములను ఆయా పనులు చేయుటకు తగినవిధముగ ధరించి యుండువాడు.

భోక్తా –

ఆపనులవలన లభించునట్టి సుఖమునో, దుఃఖమునో యనుభవించు వాడు.

మహేశ్వరః –

ఇట్లు తన సంకల్పముచే దేహాదులను నియమించుట, ధరించుట, వాటి క్రియాఫలముల ననుభవించుట మొదలగు వ్యాపారములుకలవాడగుటచే నీ జీవు డా దేహేన్ద్రియమనస్సులకు నియామకుడగుచున్నాడు.

'పరమాత్మా' –

జీవుడు దీపము వలె తన జ్ఞానము ద్వారా దేహేంద్రియ మనస్సులందు వ్యాపించియున్నాడని భావము.

ప్ర. ప్రకృతి పురుష వివేకమెట్లు కలుగును? దానివలన లాభమేమి?

ఉ: నిష్కామ కర్మయోగనిపుణులు శరీరమునందున్న ఆత్మను మనస్సహకారమున ధ్యానించి గాంచుచున్నారు. కొందరు మనుస్సును యోగాభ్యాసమునకు తగిన స్థితికి తెచ్చి దానితో నాత్మను జూచుచున్నారు. జ్ఞానయోగమునకు తగిన శక్తిలేనివారున్ను, శక్తియున్నను సుకరమను తలంపుతోను, కొందరు ప్రసిద్ధ పురుషులు జ్ఞానగర్భితమైన కర్మయోగముచే మనస్సునకు గల రజస్తమోమయ మాలిన్యమును తొలగించి సత్వమును పెంపొందించి దానిచే నాత్మను సాక్షాత్కరించుచున్నారు.

ఇట్లాత్మను సాక్షాత్కరించుటకు శక్తిలేని మరికొందరు తత్వవేత్తలగు

జ్ఞానులను ప్రణిపాత పరిప్రశ్న సేవలతో ప్రసన్నుల గావించుకొని వారి వలన నాత్మను గూర్చి చక్కఁగ విని క్రమముగ కర్మయోగాదుల నాచరించి ఆత్మ సాక్షాత్కారమునకై దాని నుపాసించుచున్నారు. అట్టివారు కూడ సంసార సాగరమును తరించగలుగుచున్నారు.

10.ప్ర. శరీరాత్మల తారతమ్యము నే ధర్మములచే నెఱుంగవలెను?

ఉ: భగవానుడు మొదట శరీరాత్మలకుగల తారాతమ్యమేల ఉపన్యసించవలెనని యెఱుంగవలెను.

ఈ రెండును వేరువేరుగా కన్పించకుండుటచే దానిని ఉపదేశము వలననే యెఱుంగవలసియున్నది.

పరస్పర విరుద్ధస్వభావము కలిగియుండియు నీ దేహాత్మలు వేరువేరుగ తెలియబడకుండుటకు కారణమేమనగా-ఆత్మ పుణ్య పాపముల ఫలముల ననుభవించుట కాధార భూతములైన దేహములతో వేరుగ తెలుసుకొన శక్యముకాని సంబంధముతో కలిసి యుండుటయే. కావున నా రెండింటి స్వరూప తారతమ్యమును అనుభవజ్ఞుల ఉపదేశ మూలముననే యెఱుంగవలెను. గాన పరమాత్మ దానిని అర్జునుని మిషగా కల్పించుకొని లోకమున కుపదేశించు చున్నాడు. అది యెట్లనగా:

ఆత్మలకు సమత్వము, శరీరేన్ద్రియాదులను నడిపించు శక్తిసామర్థ్యములు, నిత్యముగా నుండుట మొదలగు ధర్మములున్నవి. దేహములకన్నో విషమత్వము (ఎప్పుడు నొకరీతిగా నుండకుండుట.) నడిపింపబడుట, అనిత్యమైయుండుట మొదలగు విరుద్ధధర్మములు కలవు. వీటిచేతనే యివి రెండును భేదించుచున్నవి.

ఇట్లున్నను ఈ రెండింటికిని గల నిరంతర సంబంధముచే బయటకు గాన్పించు దేహ ధర్మములే గోచరించునుగాని యాత్మధర్మములు గోచరించవు. గాన ఆత్మయు దేహమువలె సతతము మారుననియు వాటితోపాటు నశించుననియు తలంచుదురు

అట్లుగాక ఆత్మదేహమునకు శేషియనియు, నాధారమనియు, తన యిష్టానుసారముగ శరీరమును వినియోగించు కొనునదియనియు, దేహమునకు గల దేవ మనుష్యాది యాకార తారతమ్యము లేనిదనియు, నెల్లప్పుడును దీపమువలె జ్ఞానాకారముతో వెలుగుచుండుననియు నెఱుంగువాడు సంసారమునుండి విముక్తుడగుచున్నాడు. లేనిచో సంసార సాగరమున కూలుచున్నాడు.

ఇంతియగాక జరుగుచున్న వ్యాపారములన్నియు ప్రకృతిచేతనే (అనగా ప్రకృతి వికారమగు దేహేన్ద్రియాదుల చేతనే) చేయబడుచున్నవిగాని యాత్మచేగాదు.

ఆత్మ సదా జ్ఞానాకారమైనదియే గావున ఆత్మకు సహజముగ నీ కర్మలలో ప్రవృత్తిలేదు. ఐనను శరీరముతో సంబంధము, దాని కాధారముగా నుండుట, అంత మాత్రముచే తటస్థించు సుఖదుఃఖానుభవము మొదలగునవి కర్మయనబడు నజ్ఞానముచే వచ్చును.

ఈ గాన్పించు దేవత్వము మనుష్యత్వము, పొడుగు, పొట్టి మొదలగు మార్పులున్ను, పుత్రపౌత్రాది వైవిధ్యమున్ను దేహగతములేగాని ఆత్మకు సంబంధించినవికావు

ఆత్మ యిట్టి శరీరమునందున్నను వాస్తవముగ సత్వాదిగుణ సంబంధము లేనిదిగాన ఆకాశమెల్లంతటను వ్యాపించియున్నను అతి సూక్ష్మమగుటచే వాటివాటి స్వభావములతో సంబంధము లేకయే యుండునో అట్లే ఆత్మయు నంతకంటె సూక్ష్మమైనదిగాన పుణ్య పాపములను చేయుటగాని, పుట్టుట గిట్టుట మొదలగు దేహధర్మములతో సంబంధించుటగాని లేకయే యుండును.

తన తేజస్సుచే వస్తువులను ప్రకాశింపజేయు సూర్యుడు ఆ వస్తువుల కంటె వేరగునట్లు ఆత్మయు శరీరమును ఆపాదమస్తకము తన జ్ఞానముచే ప్రకాశింపజేయుచున్నది. గాన దానికంటె వేరైనదనుట నిస్సంశయము.

ఆత్మ :	దేహము :
సర్వదా సమము	సర్వదా విషమము
నియమించునది	నియమింపబడునది
నిత్యము	అనిత్యము
సాక్షాత్తుగ క్రియల కాధారముకానిది	సాక్షాత్తుగ క్రియల కాధారమైనది
అపరిణామి (మార్పు లేనిది)	పరిణామి (మారుచుండునది)
సముదాయాత్మకముకానిది	సముదాయాత్మకము
నిరవయవము	సావయవము

అని యిట్లు దేహాత్మలకుగల వైషమ్యమును, దేహాది విముక్తి కుపాయమగు అమానిత్వాది గుణ సంపత్తిని యెఱింగి యాచరించు మానవులు ప్రకృతి బంధమునుండి విముక్తులై స్వస్వరూపముతో వెలుగొందుచుండు తమ పరిశుద్ధాత్మ స్వరూపమును లభించుచున్నారు.

చతుర్దశాధ్యాయార్థ సంగ్రహము

శ్లో. గుణబన్ధ విధా స్తేషాం కర్తృత్వం తన్నివర్తనమ్ ।
గతిత్రయ స్వమూలత్వం చతుర్దశ ఉదీర్యతే ॥

అర్థము : గుణబన్ధవిధాః = శుద్ధాత్మకు సత్త్వాదిగుణములు మూడింటి సంబంధమునకు కారణమగు విధానమున్ను, తేషాం = ఆగుణములకు, కర్తృత్వం = కర్తృత్వము కలుగు విధమున్ను, తన్నివర్తనం = ఆ గుణములు నివర్తించు రీతియు, గతిత్రయ స్వమూలత్వం = ఐశ్వర్యము, కైవల్యము, మోక్షమనెడు మూడు గతులకున్ను భగవంతుడే మూలమగుటయు, చతుర్దశే = పదునాల్గవ యధ్యాయమున, ఉచ్యతే = చెప్పబడుచున్నది.

తా॥ ఈ పదునాల్గవ యధ్యాయమున, శుద్ధాత్మకు గుణములు బంధహేతువులగు రీతియు, ఆ గుణములకు కర్తృత్వము కలుగు విధానమున్ను, అవి నివర్తించు మార్గమున్ను, ఐశ్వర్యకైవల్య భగవత్ప్రాప్తులకు మూడింటికిని భగవంతుడే కారణమగుటయు చెప్పబడినవి.

శ్రీమద్భగవద్గీతా – చతుర్దశాధ్యాయము

విషయసూచిక

9. మరణ సమయమున వృద్ధిలో నున్న గుణమునకు తగిన జన్మయే తిరిగి వచ్చును. రజస్తమో గుణములు అనర్థావహ జన్మల నొసంగును. కావున ఆదినుండియు నా గుణముల నడంచుకొనుటకై యవి యొసంగు ఫల భేదమును జెప్పుట. 14, 15, 16

10. సత్త్వాది గుణములు వృద్ధిలో నుండగా చనిపోయిన వాడంత కంటె హెచ్చు సత్త్వాది గుణములతో జన్మించునని చెప్పబడెను గదా! ఇట్లు పెరిగిన ఆసత్త్వాదుల వలన బుట్టునట్టి ఫలము లేవియో జెప్పుట. 17, 18

11. ఇందు సాత్త్వికాహారమునే స్వీకరించుట, ఫలమును కోరక పుణ్యకర్మల నాచరించుట మొదలగువాటివలన క్రమముగ పెరిగిన సత్త్వగుణము కలవారు తక్కిన గుణములను దాటి ఆ సత్త్వ మొక్కదానివలననే ఊర్ధ్వగతిని యనగా భగవద్భావమును పొందెడు రీతిని జెప్పుట. 19

12. భగవద్భావ మెట్టిదో జెప్పుట. 20

13. గుణముల బారి నుండి తప్పించుకొని సంచరించువాని యాచారమెట్లుం డును? అట్లు గుణముల బారి నుండి తప్పించుకొను నుపాయ మేమని యర్జునుడు ప్రశ్నించుట. 21

14. శ్రీకృష్ణుడు గుణాతీతుని లక్షణముల పేర్కొనుట. 22-25

15. ఆ ఉపాయములలో ముఖ్యతమమైన ఉపాయము భక్తియేయని చెప్పి ముగించుట. 26

16. అట్టి భక్తునకు ఐశ్వర్య కైవల్య భగవల్లాభములను ప్రసాదించు వాడు తానేయని చెప్పుట. 27

అస్మద్గురుభ్యోనమః

శ్రీమద్భగవద్గీతా - చతుర్దశోఽధ్యాయః

గుణత్రయ విభాగయోగః

శ్రీ భగవానువాచ = భగవంతుడు పలికెను.

అవ. తానీ యధ్యాయమున చెప్పదలంచిన 'గుణములు ఆత్మను శరీరముతో బంధించు రీతి' నెఱుంగుటకు ఫలమును రెండు శ్లోకములచే చెప్పుచున్నాడు.

1 శ్లో. **పరం భూయః ప్రవక్ష్యామి । జ్ఞానానాం జ్ఞానముత్తమమ్ ।**
యజ్జ్ఞాత్వా మునయ స్సర్వే । పరాం సిద్ధి మితో గతాః ॥

అర్థము : పరం = చెప్పబడినదానికంటె వేరైనదియు, జ్ఞానానాం = జ్ఞానములలో, ఉత్తమం= శ్రేష్ఠమైనదియునగు, జ్ఞానం = సత్త్వాదులను గూర్చిన జ్ఞానమును, భూయః = తిరిగి, ప్రవక్ష్యామి = చెప్పగలను, యత్ = దేనిని, జ్ఞాత్వా = తెలిసి కొని, సర్వే = అందరు, మునయః = జ్ఞానాభ్యాసపరులున్ను, ఇతః = ఈ సంసారముకంటె, పరాం= గొప్పదైన, సిద్ధిం = శుద్ధాత్మ స్వరూప ప్రాప్తిని, గతాః = పొందిరో.

తా॥ పదమూడవ యధ్యాయమున సంగ్రహముగ చెప్పబడిన గుణముల బంధహేతుత్వమే తిరిగి యీ యధ్యాయమున విస్తరముగ జెప్పబడినది. దీని నెఱింగి మననము చేయువా రుత్కృష్టమైన పరిశుద్ధాత్మ స్వరూపమును బడయగలుగుదురు.

అవ. ఆ జ్ఞానమునకే తిరిగి దాని ఫలమును బట్టి విశేషమును జెప్పుచున్నాడు.

2. శ్లో. **ఇదం జ్ఞాన ముపాశ్రిత్య । మమ సాధర్మ్య మాగతాః! ।**
సర్గేఽపి నోపజాయన్తే । ప్రలయే న వ్యథన్తిచ ॥

అర్థము : ఇదం = ఈ చెప్పబడిన, జ్ఞానం = జ్ఞానమును, ఉపాశ్రిత్య = ఆశ్రయించి, మమ= నాయొక్క, సాధర్మ్యం = సామ్యమును, ఆగతాః = పొందినవారు, సర్గే అపి = సృష్టియందును, న ఉపజాయన్తే = పుట్టరు, ప్రలయేచ = ప్రలయమునందును, న వ్యథన్తి = నశించరు.

తా॥ ఈ చెప్పబడు సత్త్వాది గుణ విషయ జ్ఞానమును ఆశ్రయించి నా సామ్యమును బొంది సృష్టికిని లోనుగారు, సంహారమునకును లోనుగారు.

అవ. గుణములు జీవుని శరీరముతో నెట్లు బంధించుచున్నవో చెప్పబూని దానికిని తానే కారణమని తెలుపుటకు ప్రాణులన్నియు ప్రకృతి పురుషుల కలయికచే పుట్టుటయు తనవలననే యని జెప్పుచున్నాడు.

3. శ్లో. మమ యోని ర్మహ ద్బ్రహ్మ। తస్మి న్గర్భం దధామ్యహమ్।
సమ్భవ స్సర్వభూతానాం। తతో భవతి భారత! ॥

అర్థము : భారత = అర్జునా! యోనిః = సర్వ జగత్తులకును కారణమైన, మహద్బ్రహ్మ = అచేతన ప్రకృతి, మమ = నాయధీనమైనది, తస్మిన్ = దానియందు, గర్భం = జీవసముదాయమనెడు బీజమును, అహం = నేను, దధామి = ఉంచుచున్నాను, తతః = ఆ రెండింటియొక్క కూడిక వలన, సర్వభూతానాం = బ్రహ్మాది పిపీలికా పర్యంతమైన సకల భూతములయొక్క, సమ్భవః = పుట్టుక, భవతి = కలుగుచున్నది.

తా॥ సకల జగత్తునకు కారణమైనది మూల ప్రకృతి. అది నా యధీనమైనది. దానియందు జీవులను కర్మానుగుణముగా ప్రవేశపెట్టుచున్నాను. ఇట్లే రెండును కూడుట చేతనే సమస్త భూతములును పుట్టుచున్నవి. (ఈ శ్లోకమున నామరూప విభాగములేక కారణావస్థయందున్న చిత్తుల కచిత్తుతోడి సంబంధము జెప్పబడినది. దీనినే ప్రాకృతిక సృష్టియందురు.)

అవ. ఇట్లాచిదచిత్తులు కలిసి నామరూపముల బడసి కార్యావస్థ నొందునపుడు వానివలన బుట్టు దేవమనుష్యాది రూపమైన నిత్యసృష్టియనబడు చిదచిత్ సంసర్గము కూడ తనవల్లనే చేయబడినదని చెప్పుచున్నాడు.

4. శ్లో. సర్వయోనిషు కౌన్తేయ! మూర్తయ స్సమ్భవన్తి యాః।
తాసాం బ్రహ్మ మహద్యోని, రహం బీజప్రదః పితా॥

అర్థము : కౌన్తేయ = అర్జునా! సర్వయోనిషు = సమస్తమైన జాతులయందును, యాః = ఏ, మూర్తయః=దేహములు, సమ్భవన్తి = పుట్టుచున్నవో, తాసాం = వాటికి, మహద్బ్రహ్మ= మూలప్రకృతి, యోనిః = కారణము, అహం = నేను, బీజప్రదః = బీజమువంటి చేతనవర్గమునుగూర్చునట్టి,పితా= తండ్రిని, (అస్మి = అగుచున్నాను.)

తా॥ అర్జునా! దేవ గంధర్వ యక్ష రాక్షస మనుష్య పశు పక్షి సరీసృపాదులైన సకల జాతులలోను పుట్టునట్టి దేహములకు, పంచభూతముల వరకు పరిణమించిన మూలప్రకృతి కారణమగుచున్నది. ఆయా దేహముల యందు ఆయా చేతన వర్గమును వారివారి కర్మానుగుణముగా గూర్చువాడను నేనే. (ఇచ్చట మూలప్రకృతిని తల్లిగను, చేతనవర్గమును

బీజముగను పోల్చుటచే ప్రకృతితో జీవుని కర్మానుగుణముగా చేర్చువాడు భగవంతుడేగాన నాతడు తండ్రిగా పోల్చబడుట యుక్తమే. పూర్వ శ్లోకమున ప్రాకృత, నైమిత్తిక సృష్టులు భగవత్సంకల్పాధీనములనియు, ఈ శ్లోకమున నిత్యసృష్టియు నాతని సంకల్పాధీనమే యనియు చెప్పబడినది.

అవ. సృష్ట్యాది యందు ప్రాచీనకర్మలవలన అచిత్సంబంధము కలిగి దేవాది జన్మలను బడసినవారు మరల మరల దేవాది భావములతో జన్మించుటకు కారణమును జెప్పుచున్నాడు.

5. శ్లో. సత్త్వం రజస్తమ ఇతి । గుణాః ప్రకృతి సమ్భవాః ।
నిబధ్నన్తి మహాబాహో! దేహే దేహిన మవ్యయమ్॥

అర్థము : హే మహాబాహో! = ఓ యర్జునా!, ప్రకృతి సమ్భవాః = ప్రకృతి వలన బుట్టిన, సత్త్వంరజః తమః ఇతి = సత్త్వము రజస్సు తమస్సు అనెడు, గుణాః = గుణములు, అవ్యయం = జ్ఞాన సంకోచములేని, దేహినం = ఆత్మను, దేహే = దేహమునందు, నిబధ్నన్తి = బంధించుచున్నవి.

తా॥ అర్జునా! సత్త్వరజస్తమోగుణములు ప్రకృతికి సహజగుణములు. అవి వాటి కార్యముల వలననే యెఱుంగదగినవి. అవి సహజముగ **గుణసం** పర్కమున కర్తుడుకాని యీ జీవుని దేహమునందు వర్తించు వానినిగా జేసి బంధించుచున్నవి.

అవ. సత్వరజస్తమోగుణముల నెఱుంగుటకై వాటి స్వభావములను, అవి జీవుని శరీరముతో బంధించు రీతిని దెలుపుచున్నాడు. అందు సత్త్వగుణస్వభావమునున్ను అది బంధించు విధానమునున్ను ముందుగా జెప్పుచున్నాడు.

6. శ్లో. తత్ర సత్త్వంనిర్మలత్వా । త్ప్రకాశక మనామయమ్ ।
సుఖసఙ్గేన బధ్నాతి । జ్ఞాన సఙ్గేన చానఘ! ।

అర్థము : హే అనఘ! = పాపరహితుడా!, తత్ర = ఆ మూడు గుణములలో, నిర్మలత్వాత్ = నిర్మలమగుట వలన, ప్రకాశకం = వస్తుయాథాత్మ్య జ్ఞానమునకు కారణమైనట్టియు, అనామయం = ఆరోగ్యమునకు కారణమైనదియునగు, సత్త్వం = సత్త్వగుణము, సుఖసఙ్గేన = సుఖము నందలి సంగముచేతను, జ్ఞానసఙ్గేన = జ్ఞానమునందలి సంగము చేతను, బధ్నాతి = బంధించుచున్నది.

తా॥ సత్వగుణముయొక్క స్వభావమేమనగా - వస్తు నిజస్థితిని గాని సుఖమును గాని ఆవరించకుండుటయే, కాబట్టి అది నిరంతరము వస్తువుల యొక్క యథార్థజ్ఞానమును, సుఖమును పుట్టించుచుండును. ఇది ఆరోగ్యమునకు కారణమైనది - ఇది ఎట్లు బంధించుననగా - ఇది జీవునకు జ్ఞానమునందును, సుఖమునందును ఆశను బుట్టించును. దానిచే నాతడు వాటికి సాధనములైన లౌకిక వైదిక కర్మల నాచరించుచున్నాడు. పిమ్మట వాటి ఫలముల ననుభవించుటకు తగిన జన్మలనెత్తుచున్నాడు. ఈ గుణమిట్లు బంధించుచున్నది.

అవ. రజోగుణస్వభామునున్ను, అది బంధించు రీతినిన్ని జెప్పుచున్నాడు.

7. శ్లో. రజో రాగాత్మకం విద్ధి । తృష్ణాసఙ్గ సముద్భవమ్ ।
తన్నిబధ్నాతి కౌన్తేయ! కర్మసఙ్గేన దేహినమ్ ।

అర్థము : హే కౌన్తేయ ! = ఓ యర్జునా! రజః = రజోగుణము, రాగాత్మకం = స్త్రీ పురుషుల పరస్పర ప్రీతికికారణముగాను, తృష్ణా సఙ్గ సముద్భవం - తృష్ణా = విషయ స్పృహకును, సఙ్గ = బంధుస్పృహకున్ను, సముద్భవం = కారణమైనదిగాను, విద్ధి= ఎఱుంగుము, తత్ = ఆ రజోగుణము, కర్మసఙ్గేన = కామ్యకర్మల యందలి ఆశతో, దేహినం = ఆత్మను, నిబధ్నాతి = బంధించుచున్నది.

తా॥ రజోగుణము యొక్క స్వభావమేమనగా-ఇది స్త్రీపురుషులకు పరస్పరము ప్రీతిని బుట్టించును. భోగముల ననుభవించవలెననియు, బంధువులతో కలిసి మెలసి యుండవలెననియు కోరికను పుట్టించును, ఇది యెట్లు బంధించుననగా - ఇట్టి కోరికలు జనించగనే జీవుడు వాటి సాధనములకై ప్రవర్తిం చును. వాటిని చేయగనే వాటివలన కలుగు పుణ్యాపాపముల ననుభవించుటకు తగిన జన్మల నెత్తును. ఇట్లు రజోగుణము బంధించుచున్నది.

అవ. తమోగుణ స్వభావమును, అది బంధించు రీతినిన్ని చెప్పుచున్నాడు.

8. శ్లో. తమ స్త్వజ్ఞానజం విద్ధి । మోహనం సర్వదేహినామ్ ।
ప్రమాదాలస్య నిద్రాభి । స్తన్ని బధ్నాతి భారత! ।

అర్థము : తమః తు = తమోగుణమైతే, అజ్ఞానజం = విపరీత జ్ఞానము వలన బుట్టినదియు, సర్వదేహి నాం = సమస్త ప్రాణులకు, మోహనం = విపరీత జ్ఞానమును

పుట్టించునదనియు, విద్ధి = తెలుసుకొనుము, హే భారత! = ఓ యర్జునా! తత్ = ఆ తమోగుణము, ప్రమాదాలస్యనిద్రాభిః = పరాకు, బద్ధకము, నిద్ర మొదలగువాటిచే, నిబధ్నాతి = బంధించుచున్నది.

తా॥ తమోగుణము యొక్క స్వభావ మేమనగా-ఇది పాపములకు నిదానమైన వస్తు విపరీత జ్ఞానము వలన పుట్టును. ఇది పుట్టి తిరిగి విపరీత జ్ఞానమునే పుట్టించును. ఇది బంధించుటెట్లనగా-చేయకూడని పనుల యందు ప్రవర్తింపజేయు పరాకును, చేయవలసిన పనులయందు బద్ధకమును, నిద్రనున్ను పుట్టించును. వీటివలన పాపిష్ఠి జన్మాదులు దాపరించును.

అవ. సత్త్వాది గుణములు బంధహేతువులగుటలో ముఖ్యమైన ద్వారములను జెప్పుచున్నాడు.

9. శ్లో. **సత్త్వం సుఖే సఞ్జయతి । రజః కర్మణి భారత ! ।**
జ్ఞాన మావృత్య తు తమః । ప్రమాదే సఞ్జయ త్యుత ।

అర్థము : భారత! = అర్జునా! సత్త్వం = సత్త్వగుణము, సుఖే = సుఖమునందు, సఞ్జయతి= సంగము కలుగజేయుచున్నది, రజః = రజోగుణము, కర్మణి = కర్మయందు (సఞ్జయతి = సంగమును పుట్టించుచున్నది.) తమః తు = తమోగుణమైతే, జ్ఞానం = వస్తువులనిజమైన జ్ఞానమును, ఆవృత్య = కప్పివేసి, ప్రమాదే = కూడని వాటియందు, సఞ్జయతి ఉత = హెచ్చుగా సంగమును కలుగజేయుచున్నది.

తా॥ సత్త్వగుణము బంధించుటలో సుఖసంగము ప్రధానము. రజస్సునకు కర్మసంగము ముఖ్యద్వారము, తమస్సునకు వస్తువుల నిజరూపమును గోచరించనీయక విపరీత జ్ఞానమును బుట్టించి కూడని వాటిని చేయించుట ముఖ్య ద్వారము.

అవ. ఈ సత్త్వాదులు ప్రకృతికి సహజ గుణములు. ఆ ప్రకృతి యొక్క పరిణామమే శరీరము. కావున నవి శరీరము నెన్నడును విడువక ఒక్క తీరున సమముగానుండును. అట్టితరి పరస్పర విరుద్ధ కార్యముల నెట్లు పుట్టించగలుగు చున్నవి? అనెడు ఆశంక కుత్తర మొసంగుచున్నాడు.

10. శ్లో. **రజస్తమ శ్చాభిభూయ । సత్త్వం భవతి భారత ! ।**
రజస్సత్త్వం తమశ్చైవ । తమ స్సత్త్వం రజ స్తథా ।

అర్థము : హే భారత! = ఓ యర్జునా! సత్త్వం = సత్త్వ గుణము,రజః = రజోగుణమును,

తమః= తమో గుణమును, అభిభూయ = అణచివేసి, భవతి = కలుగుచున్నది. రజః= రజోగుణము, సత్త్వం = సత్త్వ గుణమును, తమఃచ = తమోగుణమును, (అభిభూయ భవతి = అణచి ప్రకాశించుచున్నది), తథా = అట్లే, తమః = తమోగుణము, సత్త్వం రజః = సత్త్వరజోగుణములను (అభిభూయ భవతి = అణచి ప్రకాశించుచున్నది.)

తా॥ ఇవి యెప్పుడును విడవనివేయైనను ప్రాచీన కర్మనలనను ఆహార వైషమ్యాదుల వలనను హెచ్చు తగ్గులుగా నుండును. ఒక్కొక్క వేళ నొక్కొక్క గుణము హెచ్చుగా నుండి తక్కిన గుణముల నణచివేసి వాటి పనులను పుట్టించనీయక తన కార్యములనే బుట్టించుచుండును. కావున విరోధము లేదు.

అవ. ఆ సత్త్వాది గుణముల హెచ్చు తగ్గులు వాటివాటి కార్యములవల్లనే యెఱుంగదగును గాన నా కార్యభేదముల నుగ్గడించుచున్నాడు. అందు ముందుగా సత్త్వగుణ కార్యములను జెప్పుచున్నాడు.

11. శ్లో. సర్వద్వారేషు దేహేఽ స్మిన్ । ప్రకాశ ఉపజాయతే ।
జ్ఞానం యదా తదా విద్యా । ద్వివృద్ధం సత్త్వ మిత్యుత ॥

అర్థము : అస్మిన్ = ఈ, దేహే = దేహమునందు, సర్వద్వారేషు = చక్షురాది సకల జ్ఞానద్వారముల యందును, యదా = ఎప్పుడు, ప్రకాశః = వస్తువులకల రూపును జూపుటలో, జ్ఞానం = వాస్తవజ్ఞానము, ఉపజాయతే = పుట్టుచున్నదో, తదా = అప్పుడు, సత్త్వం = సత్త్వ గుణము, వివృద్ధం ఇతి ఉత = మిక్కిలి వృద్ధి బొందియున్నదని, విద్యాత్ = తెలిసికొనవలయును.

తా॥ ఈ శరీరములో నెప్పుడు సమస్త చక్షురాది జ్ఞానేంద్రియముల వలన వస్తువుల కలరూపమును తెలుపు జ్ఞాన ముదయించుచున్నదో అప్పుడా దేహమున సత్త్వగుణము మిక్కిలి వృద్ధిగానున్నదని తెలుసుకొనవలెను.

అవ. రజోగుణ కార్యములను జెప్పుచున్నాడు.

12. శ్లో. లోభః ప్రవృత్తి రారమ్భః । కర్మణా మశమ స్స్పృహా ।
రజస్యేతాని జాయన్తే । వివృద్ధే భరతర్షభ ! ॥

అర్థము : హే భరతర్షభ! = ఓ యర్జునా! రజసి = రజోగుణము, వివృద్ధేసతి = వృద్ధిని పొందగా, లోభః = లోభమున్ను, ప్రవృత్తిః = వృథా వ్యాపారములును, కర్మణాం =

కామ్యకర్మలను, ఆరమ్భః = ఆచరించుటయు, అశమః = ఇంద్రియముల ఉద్రేకమున్ను, స్పృహా=భోగములయందాసక్తియు, ఏతాని = ఇవి, జాయన్తే = పుట్టుచున్నవి.

తా॥ అర్జునా! అవసరమైనపుడు తన సొత్తును వెచ్చించకుండుట యనెడు లోభము, పనికిమాలిన పనులను చేయుట, ఫలమును గోరి కర్మలను జేయుట, ఇంద్రియములకు విరామములేకుండుట, భోగములయందు కోరికయునను నివి రజోగుణము వృద్ధిగా నున్నపుడు పుట్టుచున్నవి. ఈ కార్యములను బట్టి ఆ శరీరమున రజోగుణము వృద్ధిగా నున్నదని తెలుసుకొనవలెను.

అవ. తమోగుణ కార్యములను జెప్పుచున్నాడు.

13. శ్లో. అప్రకాశోఽ ప్రవృత్తి శ్చ । ప్రమాదో మోహ ఏవ చ ।
తమస్యేతాని జాయన్తే । వివృద్ధే కురునన్దన! ।

అర్థము : హే కురునన్దన = అర్జునా! తమసి = తమోగుణము, వివృద్ధే (సతి) = వృద్ధి పొందియుండగా, అప్రకాశః = జ్ఞానము పుట్టకుండుట, అప్రవృత్తిః చ = ఏ పనియు జేయక బద్ధకముగ నుండుట, ప్రమాదః = కూడనిపనులకురుకుట, మోహః ఏవచ= విపరీత జ్ఞానము అను, ఏతాని = ఇవి, జాయన్తే = పుట్టుచున్నవి.

తా॥ అర్జునా! వస్తువుల కల రూపము నెఱుంగజాలమి, చేయవలసిన పనులలో బద్ధకము, చేయకూడని పనులకు పరుగు, అన్నియును విపరీతముగా గోచరించుట అనునవి తమోగుణము వృద్ధిగానున్నప్పుడు పుట్టుచున్నవి. వీటినిబట్టి ఆ శరీరములో తమోగుణము వృద్ధిగానున్నదని తెలుసుకొనవలెను.

అవ. మరణ సమయమున రజస్తమోగుణములు పెరిగియుండకుండునట్లిప్పుడే జాగ్రత్తపడుటకై అప్పుడు పెరిగియున్న గుణముల ఫలము నుపదేశించుచున్నాడు - మొదట సత్త్వగుణ ఫలము నెఱింగించుచున్నాడు.

14. శ్లో. యదా సత్త్వే ప్రవృద్ధే తు । ప్రలయం యాతి దేహభృత్ ।
తదోత్తమ విదాం లోకా । నమలా న్ప్రతిపద్యతే ॥

అర్థము : యదా = ఎప్పుడు, సత్త్వే = సత్త్వగుణము, ప్రవృద్ధేతు = వృద్ధి పొందినదగుచుండగా, దేహభృత్ = పురుషుడు, ప్రలయం = మరణమును, యాతి = పొందుచున్నాడో, తదా = అప్పుడు, ఉత్తమవిదాం = ఆత్మస్వరూపజ్ఞుల యొక్క, అమలాన్ = అజ్ఞానరహితమైన, లోకాన్ = సమూహములను, ప్రతిపద్యతే = పొందుచున్నాడు.

తా॥ సత్త్వగుణము వృద్ధిబొందియుండగా మరణించెనేని ఆత్మ స్వరూపమును లెస్సగా నెఱింగినవారికులమున జన్మించి ఆత్మయొక్క నిజస్థితి నెఱింగించు పుణ్యకర్మల యందు ప్రవర్తించును.

అవ. మరణకాలమునకు పెరిగియున్న రజస్తమోగుణముల ఫలముల నెఱింగించు చున్నాడు.

15. శ్లో. రజసి ప్రలయం గత్వా । కర్మసఙ్గిషు జాయతే ।
తథా ప్రలీన స్తమసి । మూఢయోనిషు జాయతే॥

అర్థము : రజసి = రజోగుణము (ప్రవృద్ధేసతి = పెరిగియుండగా) ప్రలయం = మరణమును, గత్వా = పొంది, కర్మసఙ్గిషు = ఫలాశతో కర్మలను జేయువారి యొక్క వంశమున, జాయతే = పుట్టుచున్నాడు. తథా = అట్లే, తమసి = తమోగుణము (ప్రవృద్ధేసతి= వృద్ధిపొంది యుండగా) ప్రలీనః = మరణించినవాడు, మూఢయోనిషు = పశువు మొదలగు జన్మలయందు, జాయతే = పుట్టుచున్నాడు.

తా॥ రజోగుణము వృద్ధిగానుండగా మరణించినవాడు ఫలాశతో కర్మలనుజేయు కులమున జన్మించి స్వర్గాదులకై **యజ్ఞాదులను** జేయుచుండును. తమోగుణము పెరిగియుండగా మరణించినచో ఏ పురుషార్థమునకు నుపయోగించని కుక్క పంది మొదలగు నీచ జన్మలెత్తును.

అవ. వెనుక చెప్పిన గుణముల ఫలమునే తిరిగి సంగ్రహముగ జెప్పుచున్నాడు.

16. శ్లో. కర్మణ స్సుకృత స్యాహు । స్సాత్త్వికం నిర్మలం ఫలం ।
రజసస్తు ఫలం దుఃఖ । మజ్ఞానం తమసః ఫలమ్ ।

అర్థము : సుకృతస్య = బాగుగా చేయబడిన, కర్మణః = కర్మకు, ఫలం = ఫలము, సాత్త్వికం= పూర్వముకంటె అధిక సత్త్వముగలదియు, నిర్మలం = దుఃఖములేనిదియనియు, రజసః తు = రజోగుణము యొక్క, ఫలం = ఫలము, దుఃఖం = దుఃఖపరంపర యనియు, తమసః = తమోగుణమునకు, ఫలం = ఫలము, అజ్ఞానం= అజ్ఞానపరంపర యనియు, ఆహుః = చెప్పుచున్నారు.

తా॥ మరణ సమయమున వృద్ధిజెందియున్న సత్త్వగుణమువలన అంతకు మించిన సత్త్వగుణముతో ఆత్మజ్ఞానుల వంశమున జన్మించి ఫలాపేక్షలేక భగవదారాధన బుద్ధితో కర్మలననుష్ఠించుచుండును. దుఃఖము లేశమైన నుండదు. రజోగుణాధిక్యముతో మరణించినచో అంతకు మించిన

రజోగుణముతో కామ్యకర్మలు చేయువారి వంశమునబుట్టి ఫలాశతో కర్మలను జేసి వాటి ఫలము ననుభవించుటకై మరల జన్మింతురు. ఆ జన్మయందు నిట్లే వర్తింతురుగాన వీరికి దుఃఖమధికము.

ఇట్లే తమోగుణముతో మరణించినచో అజ్ఞానపరంపరా ప్రవాహములో నిమగ్నులై యంతకంతకు తమోగుణ మధికమై చివరకు రాయిరప్పగ జన్మింతురు.

అవ. ఇట్లు క్రమాభివృద్ధిని గాంచిన సత్త్వాది గుణములకు ఫలములను జెప్పుచున్నాడు.

17. శ్లో. సత్త్వా త్సఞ్జాయతే జ్ఞానం । రజసో లోభ ఏవచ ।
ప్రమాదమోహౌ తమసో । భవతోఽ జ్ఞాన మేవచ ॥

అర్థము : సత్త్వాత్ =(ఇట్లు పెరిగిన) సత్త్వగుణమువలన, జ్ఞానం = ఆత్మా పరోక్ష జ్ఞానము, సఞ్జాయతే = పుట్టుచున్నది. రజసః=(అట్టి)రజో గుణమువలన, లోభః ఏవచ = ఫలాశయే (సఞ్జాయతే=పుట్టుచున్నది) తమసః=అట్టి తమోగుణమువలన, ప్రమాదమోహౌ=కూడనిపనులయందు ప్రవృత్తి, విపరీత జ్ఞానమున్ను, భవతః = కలుగుచున్నవి. అజ్ఞానం చ ఏవ = జ్ఞానము లేకుండుటయు, (భవతి = కలుగుచున్నది.)

తా॥ ఇట్లు క్రమముగ పెరిగిన సత్త్వగుణమువలన ఆత్మ సాక్షాత్కార రూపమైన జ్ఞానముదయించును. అట్టి రజోగుణమువలన ఫలాశ జనించును. అట్టి తమోగుణము వలన కూడని పనులు చేయబూనుట, దానిచే విపరీత జ్ఞానము, దానిచే మరింత తమస్సు, దానిచే జ్ఞానము నశించుట తటస్థించును.

18. శ్లో. ఊర్ధ్వం గచ్ఛన్తి సత్త్వస్థాః । మధ్యే తిష్ఠన్తి రాజసాః ।
జఘన్యగుణ వృత్తిస్థా । అధో గచ్ఛన్తి తామసాః ॥

అర్థము : సత్త్వస్థాః = వృద్ధిని చెందిన సత్త్వగుణము కలవారు, ఊర్ధ్వం = మోక్షమునకు, గచ్ఛన్తి = పోవుచున్నారు, రాజసాః = రజోగుణ ప్రధానులు, మధ్యే = నడుమ, తిష్ఠన్తి= ఉందురు. తామసాః =తమోగుణ ప్రధానులు, జఘన్యగుణ వృత్తిస్థాః = అంతకంతకు నీచమైన తమోగుణ వ్యాపారములయందున్నవారై, అధః = అంతకంతకు క్రిందికి, గచ్ఛన్తి = పోవుచున్నారు.

తా॥ క్రమక్రమముగ వృద్ధిజెందిన సత్త్వగుణము కలవారు చివరకు మోక్షము నొందుదురు. రాజసులు ఫలానుభవమునకై పైకిపోవుచు ఆ పుణ్యము

క్షీణించగనే క్రిందికి వచ్చుచు, ఇట్లే తిరుగుచుందురు గాన మధ్యయందుందురు. తామసులు నీచమైనతామస వ్యాపారములొనరించుచు క్రమముగ పశుపక్షిక్రిమికీట తరుగుల్మ శిలాకాష్ఠలోష్టాది జన్మలను పొందుచుందురు.

అవ. సాత్త్వికాహారమును సేవించుట వలనను, ఫలాశను విడిచి పుణ్యకర్మలను జేయుటచేతను క్రమముగ సత్త్వగుణమును పెంపొందింపజేసుకొనినవారై తక్కిన గుణముల నతిక్రమించి ఊర్ధ్వగతిని పొందురీతిని జెప్పుచున్నాడు.

19. శ్లో. నాన్యం గుణేభ్యః కర్తారం । యదా ద్రష్టాను పశ్యతి ।
గుణేభ్య శ్చ పరం వేత్తి । మద్భావం సోఽధి గచ్ఛతి॥

అర్థము : ద్రష్టా = ఆత్మ జ్ఞానముకలవాడు, యదా = ఎప్పుడు, గుణేభ్యః సత్త్వాది గుణములకంటె, అన్యం = మరియొకదానిని, కర్తారం = కర్తనుగా, న అను పశ్యతి= చూడడో, గుణేభ్యః చ = గుణముల కంటె, పరం = ఇతరమైన ఆత్మను, (అకర్తారం= కర్తగానివానినిగా) వేత్తి = తెలిసికొనుచున్నాడో, సః = వాడు, (తదా = అప్పుడు) మద్భావం = నాతో సమానమైన భావమును, అధిగచ్ఛతి = పొందుచున్నాడు.

తా॥ పై విధముగ సత్త్వగుణమునందు స్థిరముగ నిలచియుండు ఆత్మజ్ఞాని గుణములనే కర్తలుగాను, వాటికంటె విలక్షణుడగునాత్మను అకర్తనుగాను నెఱుంగునప్పుడు ముందు చెప్పబోవునట్టి భగవద్భావమును పొందును.

అవ. ఆ భగవద్భావ మెట్టిదో జెప్పుచున్నాడు.

20. శ్లో. గుణానేతా నతీత్య త్రీన్ । దేహీ దేహసముద్భవాన్ ।
జన్మమృత్యు జరా దుఃఖై । ర్విముక్తో ఽ మృతమశ్నుతే ।

అర్థము : దేహీ = ఆత్మ, దేహసముద్భవాన్ = దేహమువలన బుట్టిన, ఏతాన్ = ఈ, త్రీన్= మూడైన, గుణాన్ = సత్త్వాది గుణములను, అతీత్య = అతిక్రమించి, జన్మమృత్యుజరా ధుఃఖైః = పుట్టుక చావు ముదిమియనువాటి వలన కలుగు దుఃఖములచేత, విముక్తః = విడువబడిన వాడై, అమృతం = శుద్ధాత్మ స్వరూపమును, అశ్నుతే = అనుభవించుచున్నాడు.

తా॥ ఆత్మ, ప్రకృతివలన బుట్టిన మూడు గుణములను దాటి, పుట్టుక చావు ముదిమి మొదలగువాటిచే గలుగు దుఃఖముల బారిని బడక ఆత్మానుభవ సుఖమును బడయగల్గును. ఇదియే 'మద్భావ'మని యర్థము.

అవ. అర్జునుడు శ్రీకృష్ణుని 'వీడు గుణాతీతుడని తెలుసుకొనుట కాతని యాచార మెట్లుండును? అట్లుగుణముల నతిక్రమించుటకు హేతువేమి?' అని యడుగుచున్నాడు.

అర్జున ఉవాచ = అర్జునుడు పలికెను.

21. శ్లో. కైర్లిఙ్గై స్త్రీన్గుణా నేతా । నతీతో భవతి ప్రభో ।
కి మాచారః కథం చైతాం । స్త్రీ న్గుణా నతివర్తతే ।

అర్థము : హే ప్రభో = ఓ కృష్ణా! ఏతాన్ = ఈ, త్రీన్ గుణాన్ = మూడు గుణములను, అతీతః = అతిక్రమించినవాడు, కైఃలిఙ్గైః = ఎట్టి లక్షణములతో, (ఉపలక్షితః = కూడినవాడుగా) భవతి = అగుచున్నాడు? కిం ఆచారః = ఎట్టియాచారము గలవాడు, (భవతి = అగుచున్నాడు) కథం చ = ఎట్లు, ఏతాన్ త్రీన్ గుణాన్ = ఈ మూడు గుణములను, అతివర్తతే = అతిక్రమించుచున్నాడు.)

తా॥ కృష్ణా! ఈ సత్త్వాది గుణముల నతిక్రమించిన వాడెట్టి లక్షణములతో గూడియుండును? వాని కెట్టి యాచారముండును? వాడు ఏ ఉపాయ ఉపాయముచే నీ గుణత్రయము నతిక్రమించుచున్నాడు.

అవ. ఈ ప్రశ్నలకు శ్రీకృష్ణుడు సమాధాన మొసంగుచున్నాడు.

శ్రీ భగవానువాచ = శ్రీకృష్ణుడు పలికెను.

22. శ్లో. ప్రకాశం చ ప్రవృత్తిం చ । మోహ మేవ చ పాణ్డవ! ।
న ద్వేష్టి సమ్ప్రవృత్తాని । న నివృత్తాని కాఙ్క్షతి ॥

అర్థము : హే పాణ్డవ = ఓ యర్జునా! (యః = ఎవడు) సమ్ప్రవృత్తాని= అనిష్ట వస్తువుల యందు ప్రవర్తించిన, ప్రకాశం చ = సత్త్వగుణ కార్యమగు వ్యాపారమును, మోహంచ ఏవ = తామస గుణకార్యమైన అజ్ఞానమును, నద్వేష్టి = ద్వేషింపడో, నివృత్తాని = ఇష్ట వస్తువులయందు ప్రవర్తించి నివర్తించిన వానిని, నకాఙ్క్షతి = కోరడో (వాడు గుణాతీతుడు)

తా॥ ఆత్మకంటె నితరమగు వస్తువులు ఇష్టములనియు, అనిష్టములనియు రెండు విధములు. అందనిష్టములును వాటికి సాధనములును సంప్రాప్త ములైనపుడు ద్వేషించుటయు,ఇష్టములును, వాటికి సాధనములును సంప్రాప్తమై పోయినచో తిరిగి వాటిని గోరుటయు లోకపరిపాటి. కాని, గుణాతీతుడు అనిష్ట వస్తువులయందు వాటికి సాధనములుగా సత్త్వాది

గుణముల కార్యములైన ప్రకాశాదులు ప్రవర్తించినను ద్వేషించడు. ఇష్ట వస్తువులయందు వాటికి సాధనములుగా ప్రవర్తించి మరలి పోయినను మరల వానిని కోరడు.

అవ. శరీరముతో కూడి యున్నప్పుడు దాని యిష్టానిష్ట సాధనములయందు వికారము లేకుండుటెట్లు అనగా జెప్పుచున్నాడు.

23. శ్లో. ఉదాసీనవ దాసీనో । గుణైర్యో న విచాల్యతే ।
గుణా వర్తన్త ఇత్యేవ । యోఽవతిష్ఠతి నేఙ్గతే ॥

అర్థము : ఉదాసీనవత్ = ఇతర విషయములయందు ఉదాసీనునివలె, ఆసీనః = ఉన్నవాడై యః = ఎవ్వడు, గుణైః = గుణములచేత, న విచాల్యతే = చలింపజేయుబడడో, గుణాః ఏవ = గుణములే, వర్తన్తే ఇతి = తమ తమ కార్యములయందు ప్రవర్తించుచున్నవని, యః = ఎవడు, అవతిష్ఠతి = ఉదాసీనుడై యుండునో, నేఙ్గతే = చలింపడో, (సః =వాడు, గుణాతీతః = గుణాతీతుడు.)

తా॥ ఆత్మానుభవముచే తృప్తుడై తదితర వస్తువులయందు ఉదాసీనుడై యుండువాడును, గుణముల వలన పుట్టినట్టి ద్వేషాకాంక్షల వలన చలింపజేయబడని వాడును, ద్వేషకాంక్షలు జనించినను గుణములు తమతమ కార్యాముల యందు వర్తించుచున్నవని తలంచి ఉదాసీనముగా నుండి వాటి కనుగుణముగనే పనిని చేయనివాడును గుణాతీతుడనబడును.

24. శ్లో. సమదుఃఖ సుఖ స్స్వస్థ । స్సమలోష్టాశ్మకాఞ్చనః ।
తుల్యప్రియాప్రియో ధీర । స్తుల్య నిన్దాత్మ సంస్థితిః ॥

అర్థము : స్వస్థః = ఆత్మయందే స్థిరముగా నుండువాడును, సమదుఃఖ సుఖః = సుఖ దుఃఖముల యందు సమచిత్తుడును,సమలోష్టాశ్మకాఞ్చనః = మట్టిబెడ్డను రాతిని బంగారమును సమానముగా జూచువాడును, తుల్య ప్రియాప్రియః = ఇష్టానిష్టములయందు సముడును, ధీరః = దేహాత్మ భేదము నెఱింగినవాడును, తుల్యనిన్దాత్మ సంస్తుతిః = తననొరులు నిందించినను స్తుతించినను వికారములను చెందనివాడును, (గుణాతీతుడనబడును)

తా॥ తన యాత్మయందలి యాదరముచే నచటనే నెలకొని, తదితర పుత్ర జన్మ మరణాది సుఖ దుఃఖముల పట్ల సమచిత్తుడును, మట్టి, రాయి, బంగారుల నొకే విధముగదలంచువాడును, ప్రియా ప్రియ విషయములను

సమముగ నెంచువాడును, దేహాత్మ వివేకము కలవాడును, స్తుతినిందలు శరీరమునకు చెందినవియేగాని ఆత్మకు సంబంధించవని యెంచి సమచిత్తుడుగ నుండువాడను గుణాతీతుడనబడును.

25. మానావమానయో స్తుల్య । స్తుల్యోమిత్రారి పక్షయోః ।
సర్వారమ్భ పరిత్యాగీ । గుణాతీత స్స ఉచ్యతే ॥

అర్థము : మానావమానయోః = గౌరవాగౌరవములపట్ల, తుల్యః = సమబుద్ధి కలవాడును, మిత్రారిపక్షయోః = మిత్రపక్షమునందును శత్రుపక్షమునందును, తుల్యః = సమబుద్ధిగలవాడును, సర్వారమ్భపరిత్యాగీ = సకల సాంసారిక ప్రవృత్తులను విడిచినవాడును, (యః= ఎవడో) సః = వాడు, గుణాతీతః = సత్త్వాదిగుణములను జయించినవాడుగా, ఉచ్యతే = చెప్పబడుచున్నాడు.

తా॥ స్తుతినిందల వలన బుట్టు మానావమానముల పట్లను, శత్రు మిత్రపక్షముల యందును సమచిత్తుడై యుండువాడును, సమస్త సాంసారిక వ్యాపారములను పరిత్యజించువాడును గుణాతీతుడనబడును.

అవ. గుణాతీతుడగుటకు ప్రధాన కారణమును జెప్పుచున్నాడు.

26. శ్లో. మాం చ యోఽ వ్యభిచారేణ । భక్తియోగేన సేవతే ।
సగుణాన్ సమతీ త్యైతాన్ । బ్రహ్మభూయాయ కల్పతే ।

అర్థము : యః = ఎవడు, మాం = నన్ను, అవ్యభిచారేణ = చలించని, భక్తి యోగేన = భక్తియోగముచేత, సేవతే = సేవించుచున్నాడో, సః = వాడు, ఏతాన్ గుణాన్ = ఈ సత్త్వాది గుణములను, సమతీత్య = అతిక్రమించి, బ్రహ్మభూయాయ = బ్రహ్మతో సమానమైన రూపమును పొందుట కొఱకు, కల్పతే = తగుచున్నాడు.

తా॥ భగవంతుని ఐకాంతిక భక్తి యోగముచే సేవించినచో సత్త్వాది గుణత్రయము నతిక్రమించి అమృతమును అవ్యయమునునగు పరిశుద్ధ ఆత్మ స్వరూపమును పొందును.

అవ. మధ్యమషట్కమున జెప్పబడిన ఐశ్వర్యకైవల్య భగవత్ప్రాప్తులనబడు మూడు విధములైన ఫలముల నొసంగువాడు తానేనని చెప్పిముగించుచున్నాడు.

27. శ్లో. బ్రహ్మణో హి ప్రతిష్ఠాఽహ । మమృతస్యా వ్యయస్య చ ।
శాశ్వతస్య చ ధర్మస్య । సుఖస్యైకాన్తికస్య చ ।

ఇతి శ్రీ భగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మ విద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే గుణత్రయ విభాగ యోగోనామ చతుర్దశోఽధ్యాయః

అర్థము : హి = ఆ కారణము వలన, అమృతస్య = నాశరహితమును, అవ్యయస్య = వికార రహితమునునగు, బ్రహ్మణః చ = శుద్ధాత్మ స్వరూపమునకును, శాశ్వతస్య = నిత్యమైన, ధర్మస్య చ = నిరతిశయైశ్వర్యమునకును, ఐకాన్తికస్య = భక్తునిచే పొంద దగిన, సుఖస్య చ = మోక్ష సుఖమునకును, అహం = నేను, ప్రతిష్ఠా = ఆధారమైన వాడను, (భవామి = అగుచున్నాను.)

తా॥ భక్తి యోగముచే సేవింపబడిన భగవంతుడే కైవల్యమనబడు అమృతమును అవ్యయమును నగు పరిశుద్ధాత్మ స్వరూపమునకును, నిరతిశయ నిత్యైశ్వర్యమునకును, భక్తునకు ప్రాప్యముగా జెప్పబడిన ఐకాంతిక సుఖమునకును నిర్వాహకుడగుచున్నాడు.

'దైవీహ్యేషా గుణమయీ'యను శ్లోకమున జెప్పబడినట్లు గుణాతీతుడగుటకును, కైవల్యైశ్వర్య భగవత్ప్రాప్తులకును భగవత్ప్రపత్తి యొక్కటియే ముఖ్యోపాయమని చెప్పబడినదని భావము.

ఇది ఉపనిషదర్థ ప్రతిపాదకమును, బ్రహ్మవిద్యయు, యోగశాస్త్రమును, శ్రీ కృష్ణార్జున సంవాద రూపమును అయిన శ్రీ భగవద్గీతయందలి గుణత్రయ విభాగ యోగమునెడు పదునాలుగవ యధ్యాయము.

అర్జునుని శ్లోకము	1	మొత్తము శ్లోకములు	27
భగవానుని శ్లోకములు	26	ఇప్పటికి అయిన మొత్తం శ్లోకములు	549

శ్రీమద్భగవద్గీతా ప్రశ్నోత్తరావళి
పదునాలుగవ అధ్యాయము

1.ప్ర. ఈ యధ్యాయమునకు పేరేమి? ఆ పేరెందుల కుంచబడినది?

ఉ. ఈ యధ్యాయమునకు గుణత్రయ విభాగయోగమని పేరు.

తెలియవలసిన తత్వములు చిత్తు(జీవుడు) అచిత్తు(ప్రకృతి) ఈశ్వరుడు అని మూడు కలవు. అందు చిత్తునుగూర్చి ప్రధానముగా పదమూడవ అధ్యాయమున చెప్ప బడినది. ఇక నచిత్తు(ప్రకృతి)ను గూర్చి తెలుపవలసి యున్నది. దానికి సత్వము, రజస్సు, తమస్సుఅనెడు మూడు గుణములు కలవు.

'కారణం గుణసంగోఽస్య సదసద్యోని జన్మసు' (13 అ. 21 శ్లో.) అని చెప్పబడుటచే జీవునకు మంచి చెడు జన్మలకు కారణమీ గుణములే యనిచెప్ప బడుటచేతను, సత్వగుణము మోక్షమునకు ప్రధాన కారణము కావునను ఆ గుణము లెట్లు పుట్టుచున్నవి? వాటి నెఱింగెడు ఉపాయమేమి? అని యెట్లు జీవుని శరీరముతో బంధించుచున్నవి? వాటి పనులలో గల తారతమ్యమేమి? వాటి వలన గలుగు ఉపకా రమేమి? వాటి బారి నుండి తప్పించుకొను ఉపాయమేమి? మొదలైన గుణత్రయ విభాగ మీ యధ్యాయమున సవిస్తరముగ చేయబడుటచే దీనికా పేరుంచబడినది.

2. ప్ర. ఈ యధ్యాయమున చెప్పబడిన ప్రధాన విషయములేవి?

ఉ. గుణబన్ధ విధా తేషాం, కర్తృత్వం తన్ని వర్తనమ్ ।
గుణత్రయ స్వమూలత్వం, చతుర్ధశ ఉదీర్యతే ॥ (గీ.సం. 15 శ్లో)

గుణములు జీవుని శరీరములో బంధించు విధానము, అనగా : సత్వ గుణము సుఖము నందును, జ్ఞానమునందును ఆశను పుట్టించి తత్సాధనముల ననుష్ఠింపజేసి తత్ఫలానుభవమగు సుఖము ననుభవింపజేయుటకై జీవుని సాత్విక శరీరముతో బంధించును.

రజోగుణము కామ్య కర్మలయందు రుచిని బుట్టించి వాటిని చేయించి దానివలన లభించెడు నశ్వర ఫలానుభవమునకై జీవుని రాజస శరీరముతో బంధించును.

తమోగుణము కూడని పనుల చేయుటలోను, చేయవలసిన పనులను మానుటలోను, నిరంతర నిద్రావస్థలోను ఉంచి దానివలన జనించు ఫలానుభవమునకై నీచ జన్మలలో జీవుని బంధించును అని చెప్పుట.

ఆ గుణముల కర్తృత్వము - అనగా :

ఈ గుణములకు నియతాశ్రయమైన శరీరముతో సంబంధమున్నప్పుడే జీవుడీ సాంసారిక కర్మల నాచరించుచున్నాడు. అది లేనప్పుడు లేదు. కావున నీ పనులను చేయించునవి ఆ గుణములే యని తెలుపుట.

ఆ గుణముల బారి నుండి తప్పించుకొనుటకు ముఖ్యోపాయము భగవంతునిపట్ల భక్తి యొక్కటియేయని యుపదేశించుట.

ఇహలోకపరలోకైశ్వర్యము, కైవల్యము, సాయుజ్యము అను నీ మూడు పురుషార్థములకును భగవంతుని శరణాగతియే కారణమని చెప్పుట.

ఇవి యీ యధ్యాయమునందలి ముఖ్యాంశములు.

- : వివరములు : -

1. సత్వ రజస్తమో గుణముల వాస్తవ స్వరూపము నెఱుంగుటను ప్రశంసించుట. 1, 2 శ్లో॥

2. మంచి చెడు జన్మలకు కారణమైన గుణసంపర్కము జీవునకు శరీరము వలన ఘటించుచున్నదనియు ఆ శరీర సంధాన మాతనికి తాను గావించినదియే యనియు చెప్పుట (ఇది ప్రాకృత సృష్టి) 3 శ్లో॥
(ప్రాకృతసృష్టి యనగా నామముగాని రూపముగాని లేక కారణావస్థయందున్న జీవుల కచిత్తుతోడి సంబంధము).

3. నిత్య సృష్టికిని తానే కారణమని చెప్పుట. 4 శ్లో॥
(నిత్యసృష్టి యనగా నామరూపము గల కార్యావస్థలో దేవ మనుష్యాది శరీరములతో చేతనులకు సంబంధము.)

4. ఇట్లు ప్రాచీన కర్మవశమున సృష్టికి ప్రారంభదశలో దేవమనుష్య పశుపక్షి వృక్షాదుల రూపములతో పుట్టినవాడు తిరిగి తిరిగి దేవాదులుగా పుట్టుటకు కారణమును జెప్పుట. 5 శ్లో॥

5. 'ఇది సత్వము ఇది రజస్సు ఇది తమస్సు' అని తెలుసుకొనదగిన ఆ యాగుణముల యసాధారణ స్వభావములను, ఆ గుణములు బంధించు రీతిని చెప్పుట. 6, 7, 8 శ్లో॥

6. సత్వాది గుణములు బంధించుటలో వాటి వాటి ముఖ్య వ్యాపారములను చెప్పుట. 9 శ్లో॥

7. ఈ గుణము లెప్పుడును దేహమును విడిచి యుండవుగదా! అట్టి తరి అవి యెప్పుడును సమముగనే యుండవలయును గాని ఒకదాని కొకటి విరుద్ధములైన పనులనెల్లు పుట్టించుచుండును. అను సంశయమును తీర్చుట. 10 శ్లో॥
8. వాటివాటి పనులలోగల తారతమ్యమును బట్టియే ఆయా గుణముల హెచ్చు తగ్గు లెఱుంగవచ్చునని చెప్పుట. 11, 12, 13 శ్లో॥
9. మరణ సమయమున వృద్ధిలోనున్న గుణమునకు తగిన జన్మయే తిరిగి వచ్చును. రజస్తమోగుణములు అనర్థావహజన్మల నొసంగును. కావున ఆది నుండియు నా గుణముల నణంచుకొనుటకై యవి యొసంగు ఫల భేదములను జెప్పుట. 14,15,16 శ్లో.
10. సత్త్వాది గుణములు వృద్ధిలో నుండగా చనిపోయిన వాడంతకంటె హెచ్చు సత్త్వాది గుణములతో జన్మించునని చెప్పబడెనుగదా ! ఇట్లు పెరిగిన ఆసత్త్వాదుల వలన పుట్టునట్టి ఫలములను చెప్పుట. 17, 18 శ్లో॥
11. ఇందు సాత్వికాహారములనే స్వీకరించుట, ఫలమును కోరక పుణ్య కర్మల నాచరించుట మొదలగు వాటి వలన క్రమముగా పెరిగిన సత్త్వ గుణము కలవారు తక్కిన గుణముల దాటి ఆ సత్త్వ మొక్కదాని వలననే ఊర్ధ్వగతిని అనగా భగవద్భావమును పొందెడు రీతిని చెప్పుట. 19 శ్లో॥
12. ఆ భగవద్భావ మెట్టిదో చెప్పుట. 20 శ్లో॥
13. గుణముల బారి నుండి తప్పించుకొని సంచరించువాని యాచారమెట్లుండును? అట్లా గుణములబారి నుండి తప్పించుకొను ఉపాయమేమని అర్జునుడు ప్రశ్నించుట. 21 శ్లో॥
14. శ్రీకృష్ణుడు గుణాతీతుని లక్షణముల బేర్కొనుట. 22 నుండి 25 శ్లో॥ (దానితో పాటుగనే యందుల కుపాయము కూడా చెప్పినట్లగుచున్నది)
15. ఆ ఉపాయములతో ముఖ్యతమమగు ఉపాయము భక్తియేయని చెప్పి ముగించుట. 26 శ్లో॥
16. అట్టి భక్తునకు ఐశ్వర్యకైవల్య భగవల్లాభములను ప్రసాదించువాడు తానేయని చెప్పుట. 27 శ్లో॥

ప్ర. ఈ యధ్యాయమునకు వెనుకటి యధ్యాయముతోను, ప్రధాన శాస్త్రార్థముతోను గల సంబంధమేమి?

ఉ. క్రిందటి యధ్యాయమున కారణం గుణసఙ్గోఽస్య సదసద్యోని జన్మసు' అని సత్త్వాది గుణములచే క్రిందటి జన్మలో పుట్టింపబడిన సుఖాదుల యందలి సంగమే బంధహేతువని చెప్పబడినది. ఈ యధ్యాయమున ఆ

గుణములే యెట్లు హేతువులగుచున్నదియు, వాటి నుండి తప్పించుకొను ఉపాయములును చెప్పబడుచున్నవి. కావున నీ రెండధ్యాయములకును పరస్పర సంగతి యేర్పడుచున్నది.

ఇక శాస్త్ర ప్రధాన పురుషార్థము మోక్షము. అది భక్తిచే లభించును. ఆ భక్తి సత్త్వ గుణముచే వృద్ధి పొందును. సత్త్వగుణ వృద్ధికి రజస్తమస్సుల నణంచవలెను. అందులకై వాటి స్వరూప స్వభావముల నెఱుంగవలెను. ఆ విషయమే యిందుపదేశింపబడు చున్నది. గాన ప్రధాన శాస్త్రార్థముతో నీ యధ్యాయమునకుపరంపరా సంబంధముకలదు.

4. ప్ర. సత్త్వ రజస్తమోగుణముల వాస్తవ స్వరూపము నెఱుంగుట వలన ఫలమేమి?

ఉ. దీని నెఱుంగువారు పరిశుద్ధమైన ఆత్మ స్వరూపమును బడయగల్గుదురు. (ఇది యిష్టప్రాప్తి) 1. ఆ స్వరూపము పరమపురుషునితో సమముగా నుండును. అట్టి వారిక నెన్నడును సంసారమున జన్మించరు. అట్టివారికిక, మరణమెట్లు?(ఇది యనిష్టనివృత్తి.) 2. సత్త్వగుణము యొుక్క ఫలాతిశయమును, రజస్తమోగుణముల యనర్థపరంపరల నెఱింగి-సత్త్వమును పెంచుకొనుటకు, రజస్తమస్సుల నశింపచేసుకొనుటకు ఉపాయముల నెఱింగినవాడు క్రమశః ఆ ప్రకారముగ నడుచుకొని ఆ ఫలములను బెందక యుండడుగదా! 2.

5. ప్ర. నిత్య ప్రాకృత సృష్టు లనగా నేమి? అవి యెట్లు కలుగుచున్నవి?

ఉ. నామముగాని రూపముగాని లేక కారణావస్థ (ప్రళయము) యందున్న చిత్తుల కచిత్తులతోగల సంబంధము ప్రాకృత సృష్టి యనబడును.

ఆ చేతనా చేతనములు నామరూప విభాగములు కలవై కార్యావస్థ (సృష్టి)ను పొందగా వాటి నుండి పుట్టు దేవ మనుష్య పశు పక్షి వృక్ష లతాది రూపమైన చేతనా చేతన సంబంధమే నిత్యసృష్టి యనబడును.

భగవంతునకు చేతన ప్రకృతి యనియు నచేతన ప్రకృతి యనియు రెండు ప్రకృతులు కలవు. అందు అచేతన ప్రకృతికి 'మహద్బ్రహ్మ' యనియు, చేతన ప్రకృతికి 'గర్భ' మనియు పేరులు గలవు. పరమాత్మ భోగముల కాకరమగు నచేతన ప్రకృతితో భోక్తృ పుంజమగు చేతన ప్రకృతిని, మాతృ కుక్షియందు, తండ్రి తన

బీజమును నాటినట్లు, తన సంకల్పముచే వారి కర్మానుగుణముగ ప్రవేశపెట్టుచున్నాడు. అందుచే నాతడు తండ్రి యగుచున్నాడు. అట్లు చేరిన యా రెండు ప్రకృతులవల్లనే దేవతలు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు, మనుష్యులు, పశువులు, మృగములు, పక్షులు మొదలగునవి పుట్టుచున్నవి. 3, 4.

6. ప్ర. జీవుల జన్మ పరంపరకు కారణమేమి?

ఉ. ప్రకృతికి సహజముగనే సత్వము రజస్సు తమస్సు అని మూడు గుణములు కలవు. అవి ప్రకృతికి నిరుపాధికములగు నసాధారణ ధర్మములు. అవి యింద్రియములకు గోచరించునవి కావు. ఐనను నవి వాటివలన పుట్టునట్టి ప్రకాశము (ఉన్నవియున్నట్లుగా తెలియబడుట) ప్రవృత్తి (కర్మలజేయుట కుద్యమించుట) మోహము (అన్నియును విపరీతముగ గాన్పించుట) మొదలగు కార్యములచే నెఱుంగ తగియున్నవి. ఈ కార్యములైనను ప్రళయావస్థలో గోచరింపవు. కాని ప్రకృతి వికరించి మహత్తత్వము, అహంకారము, ఇంద్రియములు, తన్మాత్రలు, భూతములుగ మారినప్పుడు వాటియందు మాత్రము గాన్పించును. జీవుడు సహజముగ గుణముల సంపర్కము లేనివాడైనను పొయ్యిపైనున్న గిన్నె యొక్క సంపర్కముచే నీటికి వేడి సంక్రమించునట్లు మహదాదులచే చేయబడిన దేవమనుష్యాది శరీర సంబంధము ద్వారా జీవునకు మరల మరల దేహ సంబంధము కలుగుచున్నది. ఇదియే జీవుని జన్మ పరంపరలకు కారణము. 5.

7. ప్ర. సత్వ రజస్తమస్సులనెడు మూడు గుణములలో నిది ఫలాన గుణమని తెలుసుకొనుటయెట్లు?
ఆ గుణము లెట్లు జీవుని శరీరముతో బంధించుచున్నవి?

ఉ. సత్వగుణము నిర్మలమైనదిగాన, ముఖ్యముగా పదార్థముల యొక్క ఉన్న రూపును జూపును. ఆరోగ్యమును కలుగజేయును, సుఖము నొసంగును. ఇది జీవునకు సుఖమునందును, జ్ఞానమునందును, కోరికను పుట్టించును. అందుచే నాత డందులకు సాధనములైన లౌకిక వైదిక కర్మలను చేయుట కుపక్రమించును. దానిచే నాకర్మల ఫలముల ననుభవించుటకు తగిన జన్మల నెత్తును. ఆ జన్మమున ఆ గుణోద్రేకముతోనే పుట్టును గాన నట్లే యా రుచి యును పుట్టుచుండును. ఇట్లాత్మకు జ్ఞానమును సుఖమును కలిగించుచుండుట,

తిరిగి వాటి యందే కోరికను పుట్టించుట సత్త్వమనబడును. 6

రజోగుణము స్త్రీలకును పురుషులకును ఒకరిపై నొకరికి యనురాగమును బుట్టించుచుండును. సాంసారికసమస్త భోగాభిలాషను బుట్టించును. బిడ్డలతోను, మిత్రుల తోను కలిసి మెలసి యుండవలెనని కోరికను బుట్టించును. ఆ కోరికలుదయించగనే యందులకు సంబంధించిన ఉపాయములకై ప్రయత్నించును. అవి యొకప్పుడు పుణ్యములును ఒకప్పుడు పాపములును కావచ్చును. వాటి ఫలముల ననుభవించుటకై యందులకు తగిన జన్మల నెత్తుచుండును. ఇట్లు జన్మలెత్తి తిరిగి యా గుణోద్రేకముతోనే పుట్టును. గాన వెనకటి వలెనే యాచరించుచు పుట్టుచుండును. 7.

ఇక తమోగుణము వస్తువులను విపరీతముగా జూపును. చేయవలసిన శాస్త్రీయ కర్మలయందు బద్ధకమును, కూడని పనులయందు శ్రద్ధను పుట్టించును. మరియు నిట్టి పనులతో కలసియుండు వీనికి విపరీత నిద్రను బుట్టించును. నిద్ర సకాలానుష్ఠానమున కాటంకమును కలిగించును. దుఃస్వప్నములను బుట్టించి దుఃఖపెట్టును. 8.

(నిద్రయనగా ఇంద్రియముల పనులన్నియు కట్టుబడియుండుట. అందు బాహ్యేంద్రియములు కట్టుబడి యుండుటకు స్వప్నమనియు, మనస్సుకూడా పనిచేయనిచో దానికి సుషుప్తియనియు పేరు. ఇది సకాలమున చేతనుని శరీరేంద్రియ యాదుల విశ్రాంతికై కల్పించబడినది. ఇందు స్వ స్వరూపానందానుభవము కలుగును.)

దీనిచే పాపము నాచరించును. దాని వలన తమోగుణము మరింతగా పెరిగి యంతకంటె నీచజన్మనెత్తించి యంతకంటె పాపమాచరింపజేయును. ఇట్లు నీచాతినీచ జన్మలెత్తించి నశింపజేయును. 8.

8. ప్ర. సత్త్వాది గుణకార్యములలో ముఖముగా నెఱుంగ దగిన ముఖ్య కార్యములెవ్వి?

ఉ. సత్వగుణ కార్యములలో సుఖమునందు కాంక్షను పుట్టించుటయు, రజోగుణ కార్యములలో కర్మయందు కాంక్షను బుట్టించుటయు, తమోగుణ కార్యములలో కూడని పనులయందు ప్రేరేపించుటయు ప్రధానములు. 9.

9. ప్ర. ఈ గుణము లెప్పుడును విడువక దేహమును పట్టియుండినచో నొకటి చేయించు పని రెండవదాని పనికి విరుద్ధము కదా! జీవితమెట్లు గడచును?

ఉ. ఈ మూడు గుణములున్ను శరీరము నెన్నడును విడువనివే యైనను పూర్వకర్మముచేగాని వాతపిత్త శ్లేష్మములవలె ఆహార వైషమ్యముచేగాని

యొక దానిని మించి యొకటి పెరుగుచుండును. అట్లు పెరిగిన గుణము తక్కిన రెండు గుణముల నణచివేసి తన కార్యమునే విజృంభింప జేయుచుండును. అప్పుడు తక్కిన గుణకార్యములు కాన్పింపనేరవు. కావున జీవయాత్రో కాటంక మొకింతయు నుండనేరదు. 10.

10. ప్ర. రజస్తమస్సుల నడంచి సత్వమునే వృద్ధిపరచ దలంచువాడా గుణముల నెఱుంగు ఉపాయమేమి?

ఉ. కన్ను, ముక్కు, చెవి మొదలగు జ్ఞానేంద్రియములు వస్తువులను వాటి ధర్మములతో నున్నవాటి నున్నట్లుగా జూపు శక్తిమంతములగునప్పు డా శరీరమున సత్వగుణము వృద్ధిగానున్నదనియు. 11.

మిక్కిలి యవసరమగు సమయమునందైనను తన ద్రివ్యమును ఖర్చు చేయని స్వభావము, నిష్ప్రయోజనముగా తిరుగుట. ఫలము నాశించియే కర్మల నాచరించుట. దానిచే నొక్క క్షణమైనను విశ్రాంతి లేకుండుట, సాంసారిక భోగముల నెంతయనుభవించి నను తృప్తి లేకుండుట మొదలగు కార్యములను బట్టి ఆ దేహమున రజోగుణము హెచ్చుగా నున్నదనియు.12

ఎవరెంత జెప్పినను తానెంత యత్నించినను ఆత్మోజ్జీవన సాధనమగు జ్ఞాన ముదయించకుండుట. చేయవలసిన పనులలో బద్ధకము, కూడని పనులనే చేయుకోరిక, ఒకదానిని మరియొకటిగా తలంచుట మొదలగు కార్యములు గాన్పించునప్పుడా శరీరమున తమోగుణము వృద్ధిగా నున్నదనియు నెఱుంగవలెను. 13.

11.ప్ర. మరణ సమయమునకు వృద్ధిగానున్న గుణములు జన్మాంతరమున నెట్టి ఫలముల నొసంగును ?

ఉ. దేహమున సత్వగుణము వృద్ధిగానుండగా మరణించిన వాడాత్మజ్ఞానపారీణుల వంశమున జన్మించి ఆత్మయొక్క వాస్తవ స్వరూపము నెఱుంగుటకు సాధనములైన పుణ్యకర్మలనే యాచరించి యంతకు మించిన సత్వగుణముతో తిరిగిపుట్టును. 14.

రజోగుణము వృద్ధిగ నుండగ మరణించినచో కర్మఠుల యిండ్లలో బుట్టి స్వర్గాది ఫలములకు సాధనములైన కర్మలనే యాచరించి యంతకు మించిన రజోగుణముతో దిరిగి పుట్టును. 15.

తమోగుణము వృద్ధిగ నుండగ మరణించినవాడు ఏ పురుషార్థములకు నర్హతలేని కుక్క పంది మొదలగు నీచజన్మలలో బుట్టి యింతకు మించినతమోగుణముతో తిరిగి పుట్టును. 16.

కావున ప్రాజ్ఞుడు మొదటి నుండియు రజస్తమోగుణముల నణచి సత్వగుణమునే వృద్ధిచేయు సాధనముల నాచరించుట కలవరచుకొనవలెను.

12.ప్ర. పెరిగిన గుణముల వలన జనించునట్టి ఫలములేవి?

ఉ. స్వాతికాహారమునే తినుట వలనను, ఫలమునుకోరక భగవదారాధనయే యను బుద్ధితో కర్మల నాచరించుటచేతను రజస్తమోగుణములు పూర్తిగా నశించి యుత్కృష్టసత్వనిష్ఠుడైనవాడు గుణములే తమతమ సహజములగు పనులయందు ప్రవర్తించుచున్నవి, ఆత్మ సహజముగ పరిశుద్ధ స్వభావము కలవాడు, ఈ సాంసారిక పనులతోనాతనికి బాధ్యత పూర్వ కర్మవలన కలిగెడు సత్వాది గుణసంపర్క మూలమైనదియే గావున నాతడు కర్తకాడని యెఱుంగును. ఇట్లు క్రమముగ వృద్ధిపొందిన సత్వగుణము వలన వివిక్ కాత్మ స్వరూప సాక్షాత్కారము లభించును. దానినే భక్తియు దానిచే ముక్తియు కరతలామలక మగును.

అట్లే వృద్ధి పొందిన రజోగుణమువలన స్వర్గాది ఫలములనుభవించుచు నా పుణ్యము తరిగిపోవగనే తిరిగి సంసారమున జన్మించుచు మరల కామ్యకర్మలనే యాచరించుచు నిట్లు మోటగూనవలె మధ్యయందే సంచరించుచుండును.

క్రమముగ వృద్ధి పొందిన తమోగుణము వలన పాపకర్మల యందు ప్రవృత్తియు, దానిచే విపరీత జ్ఞానమును, దానిచే నంతకంటె నధికమగు తమస్సును దానివలన పాపకర్మలయందు ప్రవృత్తియు, దానిచే నంతకంటె నధికమగు తమస్సును, దానివల్ల జ్ఞానమేలేని స్థితియు తటస్థించును. అనగా చండాలుడుగను పశువులుగను క్రిమి కీటాదులుగను, చెట్లు చేమలుగను గుట్ట మెట్టలుగను బుట్టుచుండును. 17,18 శ్లో

13.ప్ర. గుణముల బారి నుండి తప్పించుకొనిన సత్పురుషుని గుర్తెఱుంగుటకు వాని యాంతర లక్షణములెవ్వి? బాహ్య లక్షణములేవి? అట్లు తప్పించుకొనుట కుపాయమేమి? అందేది ప్రధానమైనది?

ఉ. లౌకిక వస్తువు లిష్టములనియు ననిష్టములనియు రెండు విధములుగ నుండును. బద్ధ సంసారియగు మానవుడా యనిష్టములుగాని వాటి సాధనములుగాని తటస్థించినప్పుడు వాటిని ద్వేషించుచుండును. ఇష్టవస్తువులు గాని తత్సాధనములుగానితటస్థించినపు డానందముతో ననుభవించుచు నని

మరలిపోయినచో మరల మరల యపేక్షించుచుండును. 22.

గుణాతీతుడు మాత్రము సత్వాదిగుణములు, ఋతులక్షణములగు యెండ మొదలగు వాటివలె సహజముగనే వచ్చుచు పోవుచుండునని తలంచునుగాని వాటి యం దనుకూల బుద్ధిగాని ప్రతికూల బుద్ధిగాని కలిగి యుండడు. 23.

శరీరముతో కూడియుండగా నిట్లిష్టానిష్ట సాధనముల యందు వికారము లేకుండుట సంభవమాయని సందేహించ నవసరము లేదు. కడుపు నిండుగ నన్నము తినిన వాడుష్డసోపేతమగు పదార్థములు లభించినను దానియందు తటస్థ భావమును జూపునట్లే యాత్మానుభవనముతో తృప్తి చెందినవాడును ఇతర సాంసారికానుభవములపట్ల ద్వేషముగాని అపేక్షగాని కలిగియుండడు. పూర్వవాసనచే వాటిపై ద్వేషాకాంక్షా భావములు మనస్సున నుదయించినను అయ్యది సత్వాది గుణముల స్వభావమని యుపేక్షించునేగాని వాటి కనుకూలముగా తా నేపనిని చేయడు.

ఆత్మానుభవముచే తృప్తిచెందు గుణాతీతుడు పుత్ర జన్మ మరణాది సాంసారిక కార్యముల పట్లను, వాటివలన కలుగు సుఖదుఃఖముల పట్లను గూడ వికారమును చెందక నుదాసీనుడై యుండును. అందుచేతనే యాతడు మట్టిబెడ్డను, రాతిని, బంగారమును సమముగనే తలంచును. ప్రకృత్యాత్మలకు గల తారతమ్యమున నిపుణుడై యుండును. 24.

లోకమున దేహమునందలి యందచందముల నెత్తి స్తుతించిన ఆనందమున్ను, వికారముల నెత్తి నిందించిన క్రోధమున్ను కలుగుట సహజము. అందులకు కారణము దేహాత్మ భ్రాంతియే. కాని గుణాతీతుడు దేహాత్మ వివేకము కలవాడగుటచే నా నిందాస్తుతులు తనకు సంబంధించినవి కావని యెఱింగినవాడు కావున వాటిని పరులకు సంబంధించిన నిందాస్తుతులు గానెంచి మనస్సున కేవిధమగు వికారమునుగాని చెందక యుండును. 24.

(ఈ నిందాస్తుతులు వాచికములు)

మనస్సులో గొప్పవాడనిగాని నీచుడనిగాని భావించుటయు, శరీరముతో నమస్కార పూజాదులుగావించుటయు, అవి చేయక యనాదరించుటయు (కాయిక మానసికములు)మానావమానములనబడును. వాటివలన సంసారులు వికారముల చెందు టయు సహజము. అవి దేహాత్మ వివేకవంతుడగు గుణాతీతుని వికరింపచేయజాలవు. 25.

గుణాతీతు డంతటను సమబుద్ధికలవాడై నను పరులీతనిని శత్రువుగానో మిత్రునిగానో భావించ వచ్చును. అట్టి వారి విషయమై కూడా నతడు ఆ భావన దేహమునకే చెందినదని యెఱింగి సమచిత్తుడై యుండును. 25.

(ఇది బాహ్య చిహ్నము)

ఈ పైన చెప్పబడిన అంతర బాహ్య చిహ్నలు గుణాతీతుని గుర్తించుటకును గుణాతీతుడగుటకును సాధనములు.

ఇక వీటిలో ప్రధాన తమమైన సాధన మేదియనగా :

దేహాత్మ భ్రాంతి మానవున కనాదికాలము నుండియు విడువక యను వర్తించుచున్న మహావ్యాధి వంటిది. కావున నీ జన్మమున నొకవేళ ప్రకృత్యాత్మ వివేక ముదయించినను అది వేళ్ళు నాటుకొని పోయియున్న విపరీత వాసనచే బాధింపబడి చెదిరిపోవుచు గాలి లోని దీపమువలె నిరుపయోగమగును. కావున సత్యసంకల్పుడును, పరమ కారుణికుడును, ఆశ్రిత వాత్సల్య జలధియునగు సర్వేశ్వరునియందు దేవతాంతర ఫలాంతర సాధనాంతర గంధరహితమగు భక్తియున్నచో నీ సత్వ రజస్తమోగుణముల నవలీలగ దాటి యమృత ప్రాయమైన వాస్తవమగు నాత్మస్వరూపమును బడయగల్గును. దానిచే నిరతిశయ పురుషార్థమగు మోక్షము తనంతనే సిద్ధించును. 26.

నిరతిశయైశ్వర్యముగాని, అమృతమయ శుద్ధాత్మ స్వరూపప్రాప్తిగాని, సాయుజ్యముక్తిగాని భగవత్ప్రపత్తిచేతనే లభించును గదా! 27.

పఞ్చదశాధ్యాయార్థ సంగ్రహము

శ్లో. అచిన్మిశ్రా ద్విశుద్ధా చ్చ
చేతనా త్పురుషోత్తమః ।
వ్యాపనా ద్భరణా త్స్వామ్యా
దన్యః పఞ్చదశోదితః ॥

అర్థము : అచిన్మిశ్రాత్ చేతనాత్ = అచిత్తుతో కూడియున్న బద్ధ చేతనుని కంటెను, విశుద్ధాత్ చ చేతనాత్ = శుద్ధ చేతనుని కంటెను, పురుషోత్తమః = శ్రీమన్నారాయణుడు, వ్యాపనాత్ = వాటియందు వ్యాపించి యుండుట వలనను, భరణాత్ = వాటిని భరించుట వలనను, స్వామ్యాత్ = వాటికి ప్రభువుగా నుండుట వలనను, అన్యః = వేరైనవాడని, పఞ్చద శోదితః = పది హేనవ యధ్యాయమున చెప్పబడినది.

తా ॥ పురుషోత్తముడగు నారాయణుడు అచిత్తుతో కూడియున్న బద్ధాత్మలను, ముక్తాత్మలను వ్యాపించియుండుట చేతను, వాటిని భరించి యుండుట చేతను, వాటికి శేషియై యుండుట చేతను వాటికంటె వేరైన వాడని పదిహేనవ యధ్యాయమున జెప్పబడినది.

శ్రీమద్భగవద్గీతా – పంచదశాధ్యాయము

విషయసూచిక

అస్మద్గురుభ్యోనమః

శ్రీ భగవద్గీతా - పంచదశోఽధ్యాయః

పురుషోత్తమ ప్రాప్తి యోగః

అవ. భోగముల యందాసక్తి లేకుండట యనెడు శస్త్రముచే నరికివేయదగిన బంధము గల తన అక్షర విభూతిని చెప్పుటకై బంధాకారముతో వ్యాపించియున్న ప్రకృతి పరిణామమునంతను ఛేధింపదగిన అశ్వత్థ వృక్షముతో పోల్చి నైమిత్తిక సృష్టి ప్రక్రియగా చెప్పుచున్నాడు

శ్రీ భగవానువాచ = శ్రీ కృష్ణుడు పలికెను.

1\. శ్లో. **ఊర్ధ్వమూల మధశ్శాఖ । మశ్వత్థం ప్రాహు రవ్యయమ్ ।**
ఛన్దాంసి యస్య పర్ణాని । యస్తం వేద స వేదవిత్ ॥

అర్థము : శ్రుతయః = శ్రుతులు, యం = ఏ, అశ్వత్థం = సంసారమనెడు అశ్వత్థమును, ఊర్ధ్వమూలం = ఊర్ధ్వభాగమున బ్రహ్మయను మొదలు కలదిగాను, అధశ్శాఖం= క్రింది భాగమున మనుష్య క్రిమికీటకాదులను కొమ్మలు కలదిగాను, అవ్యయం= (ప్రవాహతః) నిత్యమైనదిగాను, ప్రాహుః=వివరించి చెప్పుచున్నవో, యస్య= ఏ సంసారమను అశ్వత్థ వృక్షమునకు, ఛన్దాంసి = కామ్య కర్మ ప్రతిపాదక శ్రుతులు, పర్ణాని = ఆకులో, తం = అట్టి సంసార రూప అశ్వత్థ వృక్షమును, యః = ఎవడు, వేద= తెలుసుకొనునో, సః = అట్టివాడు, వేదవిత్ = వేదార్థజ్ఞాని, (భవతి = అగుచున్నాడు.)

తా ॥ సంసారము అశ్వత్థ వృక్షము వంటిది. దీని మొదలు బ్రహ్మ. ఈయన ఊర్ధ్వ లోకమున నుండును. దీనికి కొమ్మలు క్రింది లోకముల యందలి సుర నర తిర్యక్ స్థావరములు. జీవనది యొక్క నీటి ప్రవాహము వలె ఈ వృక్షము నిత్యమైనది. దీనిని అభివృద్ధి పరచు ఆకులు కామ్య కర్మలు. దీనిని ఛేదించు నుపాయము వేదమున కలదు. గాన ఈ వృక్ష జ్ఞానము వేదార్థ జ్ఞానమున కుపయోగించును.

అవ. ఆ విషయములనే యిప్పుడు నిత్యసృష్టి ప్రక్రియగా జెప్పుచున్నాడు.

2. శ్లో. అధశ్చోర్ధ్వం చ ప్రసృతా స్తస్యశాఖా । గుణప్రవృద్ధా విషయ ప్రవాలాః
అధశ్చ మూలా న్యనుసన్తతాని । కర్మానుబన్ధీని మనుష్యలోకే ॥

అర్థము : తస్య = ఆ వృక్షము యొక్క, శాఖాః = కొమ్మలు, అధః చ = క్రిందికిన్ని, ఊర్ధ్వంచ= పైకిన్ని, ప్రసృతాః = వ్యాపించియున్నవి, గుణ ప్రవృద్ధాః = సత్వాది గుణములచే బాగుగా వృద్ధి పొందియున్నవి, విషయ ప్రవాలాః = శబ్దాది విషయములనెడు చిగుళ్ళు గలవై, (భవంతి = ఉన్నవి,) మూలాని = వ్రేళ్ళు, అధః చ = క్రిందనున్న మనుష్య లోకమునను, అనుసంతతాని = విస్తరించినవై, మనుష్యలోకే = మానవలోకమున, కర్మానుబన్ధీని = కర్మలతో సంబంధించినవై, భవన్తి = ఉన్నవి.

తా ॥ ఆ వృక్షము యొక్క శాఖలు క్రిందనుండి మనుష్య లోకమునను, పైన నుండు స్వర్గాది లోకములను వ్యాపించియున్నవి. అవి సత్త్వ రజస్తమో గుణములచే వృద్ధి పొందుచు శబ్దాది విషయములనెడు చిగుళ్ళను కలిగియున్నవి. దాని కర్మ రూపమైన వ్రేళ్ళు క్రిందనున్న మనుష్య లోకమున కర్మతో సంబంధించి యున్నవి.

అవ. అందరును ప్రత్యక్షముగ జూచుచుండగ నీ సంసారము నెఱింగినవాడు ఏ యొక్కడోయని 'యస్తం వేద స వేదవిత్త'ని స్తుతింపనేల? యను శంకను పరిహరించుచున్నాడు.

$2\frac{1}{2}$ శ్లో. నరూప మస్యేహ తథో పలభ్యతే ।
నాన్తో న చాది ర్నచ సమ్ప్రతిష్ఠా ॥

అర్థము : ఇహ = ఈ లోకమున, అస్య = ఈ సంసార వృక్షము యొక్క, రూపం = స్వరూపము, తథా = ఇది వరలో తెలిసిన విధముగా, న ఉపలభ్యతే = తెలుసుకొనబడుట లేదు, అన్తః = దీని నాశనము, న = తెలుసుకొనబడుట లేదు, ఆదిఃచ = దీని మొదలున్ను, న=తెలిసికొనబడుట లేదు, సమ్ప్రతిష్ఠా చ = దీని ఉనికియున్ను, న = తెలిసికొనబడుట లేదు..

తా ॥ ఈ వృక్షమునకు బ్రహ్మ మూలము, మనుష్యాదులు శాఖలు, విషయాదులు చిగుళ్లు, అని ఈ లోకస్థులైన సంసారులెఱుంగరు. దీని స్వరూపముగాని అంతముగాని, ఆదిగాని, దీని స్థితిగాని ఈ లోకస్థులచే తెలుసికొనబడుట లేదు.

(అనగా దీనికి తండ్రి మూలము, కొడుకులు, మనుమలు శాఖలు, దారాదులు చిగుళ్ళు అని యెఱుంగుదురుగాని బ్రహ్మ మూలము, మనుష్యాదులు కొమ్మలు, విషయములు చిగుళ్ళు అని సంసారులెఱుంగరు. ప్రళయమే దీనికి నాశక మనుకొందురు గాని భోగము నందలి యసంగము నాశకమని యెఱుంగరు. గర్భవాసము నాదిగా నెఱుంగుదురు గాని గుణ సంగమాది యని యెఱుంగరు.)

3. శ్లో. **అశ్వత్థమేనం సువిరూఢ మూల । మసంగ శస్త్రేణదృఢేన ఛిత్వా ।**
$3\frac{1}{2}$ శ్లో. **తతః పదం తత్పరిమార్గితవ్యం । యస్మిన్ గతా న నివర్తన్తి భూయః ॥**

అర్థము : సువిరూఢమూలం = చక్కగను వివిధములుగను మొలచిన వ్రేళ్ళు గల, ఏనం = ఈ, అశ్వత్థం = అశ్వత్థ వృక్షమును, దృఢేన = దృఢమైన, అసంగశస్త్రేణ = విషయ వైరాగ్యమను ఆయుధముచే, ఛిత్వా = ఛేదించి, తతః = ఆ వైరాగ్య కారణమున, యస్మిన్ = ఏ స్థానమున, గతాః = ప్రవేశించిన వారు, భూయః = తిరిగి, న నివర్తన్తి= మరలిరారో, తత్ = అట్టి, పదం = ఆత్మయాథాత్మ్య సాక్షాత్కార రూపస్థానము, పరమార్గితవ్యం = వెదుకవలసినదై యున్నది.

తా ॥ స్థిరముగను నాలుగు ప్రక్కలకును వ్యాపించియున్న ఈ సంసార రూప అశ్వత్థ వృక్షమును ఆత్మజ్ఞానముచే దృఢమైనదగు విషయ వైరాగ్యమను ఆయుధముచే ఛేదించి తద్వారా పునరావృత్తి రహితమైన ఆత్మయాథాత్మ్యసాక్షాత్కారమును గూర్చి కనుగొనవలసి యున్నది.

అవ. గుణమయ భోగములతోడి సంగము అనాది కాలము నుండియు దాపరించినది. దానిచే విపరీత జ్ఞాన ముదయించి నాటుకొని యున్నది. ఇయ్యది దృఢమగు నసంగశస్త్రము లభించిన ఛేదింపబడును. అదియే సంసారులకు దుర్లభము. ఇక దీని బారి నుండి తప్పించుకొనుట యెట్లు? అనగా చెప్పుచున్నాడు.

4. శ్లో. **తమేవ చాద్యం పురుషం ప్రపద్యే ।**
య్యతః ప్రవృత్తిః ప్రసృతా పురాణీ ।

అర్థము : తం ఏవ = పూర్వోక్తమైన, ఆద్యం = ఆది కారణుడైన, పురుషం ఏవచ = పరమ పురుషుని మాత్రమే, ప్రపద్యేత్ = శరణుజొచ్చవలెను, యతః = ఏ పరమ పురుషుని నుండి, పురాణీ = పురాతనమైన, ప్రవృత్తిః = గుణమయ భోగ సంగ ప్రవృత్తి, ప్రసృతా = ప్రసరించినదో.

తా ॥ ఏ పరమ పురుషుని వలన పురాతనమైన ఈ గుణమయ భోగ సంగము నందు ప్రవృత్తి కలిగినదో అట్టి ఆదికారణుడైన పరమ పురుషునే శరణు జొచ్చవలసి యున్నది. ఆతని యాజ్ఞ నుల్లంఘించుటచే బంధము కలిగినదిగాన నాతనినే ప్రసన్నునిగా జేసుకొనిన యెడల నాతడా బంధము నుండి విడిపించును.

అవ. వెనుకటి శ్లోకమున 'యతః ప్రవృత్తిః' యను దానినే యీ శ్లోకముచే వివరించుచున్నాడు.

5. శ్లో. నిర్మానమోహా జితసంగదోషా
అధ్యాత్మనిత్యా వినివృత్తకామాః ।
ద్వంద్వై ర్విముక్తా స్సుఖదుఃఖ సంజ్ఞైః
గచ్ఛన్త్య మూఢాః పద మవ్యయం తత్ ॥

అర్థము : నిర్మానమోహాః = దేహాత్మాభిమాన రూపమోహము లేనివారలై, జితసంగదోషాః = జయింపబడిన భోగాసక్తి రూపదోషము కలవారలై, అధ్యాత్మ నిత్యాః = ఆత్మజ్ఞాన నిరతులై, వినివృత్తకామాః = కోరికలు పూర్తిగా నశించిన వారై, సుఖదుఃఖ సంజ్ఞైః= సుఖదుఃఖములను పేరుగల, ద్వంద్వైః = ద్వంద్వములచే, విముక్తాః = పూర్తిగా విడవబడిన వారలై, అమూఢాః = భ్రమాదిరహితులగు జ్ఞానులు, తత్ = ఆ, అవ్యయం = నాశరహితమైన, పదం = ఆత్మయాథాత్మ్య సాక్షాత్కార పదవిని, గచ్ఛన్తి = పొందుచున్నారు.

తా ॥ నన్ను శరణుజొచ్చుటచే క్రమముగ దేహాత్మాభిమానము పోవును. దాని వలన భోగాసక్తి యనబడు దోషము హరించును. ఆత్మ సాక్షాత్కారాసక్తి కలుగును. దానిచే నితర కోరికలు నశించును. దాని వలన సుఖదుఃఖాది ద్వంద్వముల కతీతులై నాశరహితమైన పరిశుద్ధాత్మ సాక్షాత్కార రూపస్థితిని పొందుదురు.

అవ : ఆ పరిశుద్ధాత్మ స్వరూపమెట్టిదో వర్ణించుచున్నాడు. ఫలము యొక్క తత్త్వ మెఱింగిన గదా దానిని పొందుటకై త్వర జనించునది.

6. శ్లో. న తద్భాసయతే సూర్యో । న శశాఙ్కో న పావకః ।
యద్గత్వా న నివర్తన్తే । తద్ధామ పరమం మమ ॥

అర్థము : తత్ = పరిశుద్ధాత్మను, సూర్యః = సూర్యుడు, న భాసయతే = ప్రకాశింపజేయజాలడు, శశాఙ్కః = చంద్రుడు, న భాసయతే = ప్రకాశింపజేయ జాలడు, పావకః =

అగ్నిహోత్రుడు, న భాసయతే = ప్రకాశింపజేయజాలడు, యత్ = ఏ పరిశుద్ధాత్మ స్వరూపమును, గత్వా = పొంది, న నివర్తన్తే = మరలజాలరో, తత్ = అట్టి, పరమం = సర్వోత్కృష్టమైన, ధామ = జ్యోతి, మమ = నా యొక్క అంశయై యున్నది.

తా ॥ ఆ పరిశుద్ధాత్మ స్వరూప జ్యోతిని సూర్యుడుగాని, చంద్రుడుగాని, అగ్నిహోత్రుడుగాని ప్రకాశింపజేయజాలరు. అది పరమోత్కృష్టమైన స్థానము. దానిని పొందినవారు తిరిగి ప్రకృతి సంబంధమును చెందరు. ఆ గొప్ప తేజోరూపమైన ఆత్మ స్వరూపము నా యొక్క అంశయే అయియున్నది.

అవ. ఆత్మలన్నియు భగవంతుని యంశలేయనియు అయిన నందరును పరిశుద్ధాకారములతో వెలుంగకుండుటకు కారణము, అందుకొన్ని యవిద్యా వృతములై యుండుటయేయని చెప్పుచున్నాడు.

6½ శ్లో. మమైవాంశో జీవలోకే । జీవభూత స్సనాతనః ।
7. శ్లో. మనష్షష్ఠా ణీన్ద్రియాణి ప్రకృతిస్థాని కర్షతి ।

అర్థము : సనాతనః = అనాదియగు నీ ఆత్మ, మమ = నా యొక్క, అంశ ఏవసన్ = అంశమే అగుచు, జీవలోకే = సంసారమునందు, జీవభూతః = బద్ధ జీవుడై, ప్రకృతి స్థాని = ప్రకృతిరూపమైన శరీరమందున్న, మనష్షష్ఠాని = మనస్సు ఆరవదిగా గల, ఇంద్రియాణి = ఇంద్రియములను, కర్షతి = ఆకర్షించుచుండును.

తా ॥ ఆత్మ అనాదియైనది. ఇది నా యంశమే, ఇది అజ్ఞానముచే సంసారమున బద్ధమై ప్రకృతి పరిణామమైన ఈ శరీరమందుండి అచ్చటనేయున్న మనస్సుతో సహా మిగిలిన జ్ఞానేంద్రియము లైదింటిని తన స్వాధీనము లోనికి ఆకర్షించి వాటిని కర్మానుగుణముగా నిటునటులాగుచు విషయముల ననుభవించు చున్నది. (అంశ. ప్రకార. విశేషణ. శరీరాది శబ్దములన్నియు సమానార్థకములు.)

అవ. జీవుడు శరీరము నుండి యుత్క్రమించుతరి తనతో గొనిపోవు సామగ్రి నుగ్గడించుచున్నాడు.

8. శ్లో. శరీరం యదవాప్నోతి । యచ్చాప్యుత్క్రామ తీశ్వరః ।
గృహీత్వైతాని సంయాతి । వాయుర్గంధా నివాశయాత్ ॥

అర్థము : ఈశ్వరః = శరీరేంద్రియాధిపతియైన జీవుడు, యత్ = ఏ, శరీరం = శరీరమును, అవాప్నోతి = పొందుచున్నాడో, యత్ చ = ఏ శరీరము నుండి, ఉత్క్రామతి =

బయటికి పోవుచున్నాడో, తతః = అచ్చటచ్చట నుండి, వాయుః = వాయువు, ఆశయాత్ = పుష్పము నుండి, గంధాన్ ఇవ = పరిమళములను వలె, ఏతాని = ఈ ఇంద్రియములను, గృహీత్వా = తీసుకొని, సంయాతి = పోవుచున్నాడు.

తా ॥ జీవుడు శరీరేంద్రియములకు నియంతయై యున్నాడు. అతడు ఏ శరీరమును పొందునో, ఏ శరీరమును విడచిపోవునో, అపుడెల్ల వాయువు పుష్పాదుల నుండి వాటి సూక్ష్మావయవములతో గూడ పరిమళాదులను తీసికొని పోవునటుల ఈ శరీరమునందలి ఇంద్రియములను, భూత సూక్ష్మములతోసహా తనతో తీసికొని పోవును.

అవ. ఆ సామగ్రిని వివరించి పేరులతో చెప్పుచున్నాడు.

9. శ్లో. శ్రోత్రం చక్షు స్స్పర్శనం చ । రసనం ఘ్రాణ మేవచ ।
అధిష్ఠాయ మనశ్చాయం । విషయా నుపసేవతే ।

అర్థము : అయం = ఈ జీవుడు, శ్రోత్రం = శ్రోత్రేంద్రియమును, చక్షుః = నేత్రేంద్రియమును, రసనం = జిహ్వేంద్రియమును, ఘ్రాణం = ఘ్రాణేంద్రియమును, మనః చ = మనస్సును, అధిష్ఠాయ = స్వాధీన పరచుకొని, విషయాన్ = శబ్దాది విషయములను, ఉపసేవతే = చక్కగా అనుభవించుచున్నాడు.

తా ॥ ఈ బద్ధుడైన జీవుడు శ్రోత్రచక్షుస్త్వక్ జిహ్వాఘ్రాణములనెడు ఇంద్రియములను వశపరచుకొని వాటిని తమ తమ విషయముల యందు ప్రవర్తించుటకు తగిన వానినిగా జేసి శబ్దాది విషయములను చక్కగా అనుభవించుచున్నాడు.

అవ : ఇంతవరకు కొందరు కర్మకలాపమనెడు సంకెలలచే బంధింపబడి కళేబర కారాగారమునబడి అట నుండి యుత్క్రమించుట తిరిగి ప్రవేశించుట యనెడు క్లేశములను, అచ్చట యనుభవించు తేనె కలిపిన విషము వంటి విషయానుభవములకు లోనగుటను జూపి ఇప్పుడీ శ్లోకమున దీనికంతకును కారణము పరమ పురుషునకు పరతంత్రమగు నీ యాత్మను స్వతంత్రమని భావించుటయేయని తెలుపుచు, ఆత్మయున్నచో కాన్పించదేలయనెడు నాస్తిక ప్రశ్నకుత్తర మొసంగుచున్నాడు.

10. శ్లో. ఉత్క్రామన్తం స్థితం వాపి । భుంజానం వా గుణాన్వితమ్ ।
విమూఢా నాను పశ్యన్తి । పశ్యన్తి జ్ఞానచక్షుషః ।

అర్థము : విమూఢాః = దేహాత్మాభిమానులైన అజ్ఞానులు, ఉత్క్రామన్తం = శరీరము నుండి

వెడలుపోవునట్టియు, స్థితం వాపి = శరీరమునందుండునట్టియు, భుంజానం వాపి= విషయముల ననుభవించుచున్నట్టియు, గుణాన్వితం = సత్వాది గుణములతో గూడుకొనియున్నట్టియు, (ఆత్మను) న అనుపశ్యన్తి = తెలుసుకొనలేకున్నారు, జ్ఞానచక్షుషః = ఆత్మజ్ఞాన దృష్టి కలవారు, పశ్యన్తి = తెలిసికొనుచున్నారు.

తా ॥ మూఢులు ఈ పాంచ భౌతిక శరీరమునే ఆత్మగ తలంచుదురు. సత్వాది గుణములు కల దేహముతో కలసి యున్న ఈ ఆత్మను, ఈ శరీరమును విడుచునపుడుగాని, ఈ శరీరములో నున్నపుడుగాని, విషయముల ననుభవించునపుడుగాని ఈ శరీరముకంటె విలక్షణమైనదనియు జ్ఞానైకాకారమనియు తెలిసికొనజాలరు. ఆత్మయాథాత్మ్య జ్ఞానము గలవారు మాత్రము తెలిసికొనగలరు.

అవ. వెనుక చెప్పిన యర్థమునే సహేతుకముగ సమర్థించుచున్నాడు.

11. శ్లో. యతన్తో యోగిన శ్చైనం । పశ్యన్త్యాత్మ న్యవస్థితమ్ ।
యతన్తో ప్యకృతాత్మానో । నైనం పశ్య న్త్యచేతసః ॥

అర్థము : యతన్తః = ప్రయత్నశీలురైన, యోగినః = యోగులు, ఆత్మని = శరీరము నందు, అవస్థితం=ఉన్నట్టి, ఏనం=ఈఆత్మను, పశ్యన్తి=చూడకలుగుచున్నారు, అకృతాత్మానః= నిర్మలాంతః కరణము లేని వారై, అచేతసః = చిత్త వృత్తిలేనివారు, యతన్తః అపి= ప్రయత్నించు చున్నవారైనప్పటికి, ఏనం=ఈ ఆత్మను, న పశ్యన్తి = చూడజాలరు.

తా ॥ నన్ను ప్రపత్తి జేసి కర్మయోగాది ప్రయత్నశీలురైన యోగులు ఈ శరీరము నందలి ఆత్మ యొక్క యాథాత్మ్యస్వరూపమును జూడగలరు. అంతఃకరణకు నిర్మలత్వము లేక చిత్తైకాగ్రత లేనివారు ప్రయత్న శీలురైనను ఈ యాత్మను చూడజాలరు.

అవ. ఇంతకుముందు లోకమునకు వెలుంగునొసంగు సూర్యచంద్రాగ్నులు వస్తువుల గాంచుట కాటంకమైన చీకటిని మాత్రమే పోగొట్టుదురుగాని వాటిని కూడ వెలుగొందించునది యాత్మయే యనియు నది బద్ధావస్థలో నున్నను, ముక్తావస్థలో నున్నను భగవంతునకు పరతంత్రమే యనియు చెప్పబడెను. ఇప్పుడు అచిత్తు యొక్క పరిణామమగు సూర్యాదుల కాంతియు భగవంతుని యధీనమైనదియే యని చెప్పుచున్నాడు.

12. శ్లో. య దాదిత్యగతం తేజో । జగద్భాసయతేఽఖిలమ్ ।
యచ్చంద్రమసి యచ్చాగ్నౌ । తత్తేజో విద్ధి మామకమ్ ॥

అర్థము : ఆదిత్యగతం = సూర్యుని యందలి, యత్ = ఏ, తేజః = తేజస్సు, అఖిలం =

సమస్తమైన, జగత్ =జగత్తును, భాసయతే = ప్రకాశింపజేయుచున్నదో, చంద్రమసి= చంద్రునియందు, యత్ =ఏ, తేజః = తేజస్సు, (అస్తి=కలదో,) తత్ =ఆ, తేజః = తేజస్సును, మామకమ్ = నాదిగా, విద్ధి = తెలిసికొనుము.

తా ॥ సమస్త జగత్తును ప్రకాశింపజేయుచున్న సూర్యుని యందలి తేజస్సును, చంద్రుని యందలి తేజస్సును, అగ్ని యందలి తేజస్సును వారు నన్నారాధించగా వారికి నాచే నియ్యబడినదని తెలిసికొనుము.

అవ. సకల భూతములను భరించు భూమి యందలి భరణశక్తియు, చంద్రునియందలి ఔషదుల పోషించు శక్తియు తనదే యనుచున్నాడు.

13. శ్లో. గా మావిశ్య చ భూతాని । ధారయా మ్యహ మోజసా ।
పుష్ణామి చౌషధీ స్సర్వా । స్సోమో భూత్వా రసాత్మకః ॥

అర్థము : అహం = నేను, గాం = భూమిని, ఆవిశ్య = ప్రవేశించి, ఓజసా = నా యసాధారణ శక్తిచే, భూతాని = సమస్త భూతములను, ధారయామి = ధరించుచున్నాను, రసాత్మకః = అమృత రసమయుడైన, సోమః = చంద్రుడను, భూత్వా = అయి, సర్వాః = సమస్తమైన, ఓషధీః = ఓషధులను, పుష్ణామి = పోషించుచున్నాను.

తా ॥ నేను భూమియందు ప్రవేశించి చరాచర రూపములైన సమస్త భూతములను నా యప్రతిహత శక్తిచే ధరించుచున్నాను. అటులనే నేను అమృత రసాత్మకమగు చంద్రుడనై ఓషధుల నన్నింటిని రసముచే వృద్ధిని పొందించుచున్నాను.

అవ. జఠరాగ్ని యందలి పాచనశక్తియు తనదే యనుచున్నాడు.

14. శ్లో. అహం వైశ్వానరో భూత్వా । ప్రాణినాం దేహ మాశ్రితః ।
ప్రాణాపానసమాయుక్తః । పచామ్యన్నం చతుర్విధమ్ ॥

అర్థము : అహం = నేను, వైశ్వానరః = జఠరాగ్నిగా, భూత్వా = అయి, ప్రాణినాం = ప్రాణుల యొక్క, దేహం = దేహమును, ఆశ్రితః = ప్రవేశించినవాడనై, ప్రాణాపాన సమాయుక్తః = ప్రాణవాయువు అపాన వాయువులతో కూడుకొన్న వాడనై, చతుర్విధం = ఖాద్య, చోష్య, లేహ్య, పేయ రూపములగు నాలుగు విధములైన, అన్నం = అన్నమును, పచామి = పక్వము చేయుచున్నాను.

తా ॥ నేను జఠరాగ్నినై సమస్త ప్రాణుల దేహమును ఆశ్రయించి ప్రాణాపాన వ్యాపార భేదములతో కూడినవాడనై నమలబడు, జుర్రబడు, నాకబడు, త్రాగబడు నాలుగు విధములైన యన్నములను పక్వము చేయుచున్నాను.

అవ. సర్వ భూతములును భగవంతునితో సామానాధికరణ్యముచే నభేదముగా చెప్పబడుటకు కారణమును జెప్పుచున్నాడు.

15. శ్లో. సర్వస్య చా హం హృది సన్నివిష్టో। మత్త స్స్మృతి ర్జ్ఞాన మపోహనం చ
వేదై శ్చ సర్వై రహమేవ వేద్యో। వేదాన్తకృ ద్వేదవిదేవ చా హమ్ ॥

అర్థము : అహం = నేను, సర్వస్య = సమస్త భూతముల యొక్క, హృది = హృదయమునందు, సన్నివిష్టః = అంతరాత్మగా ప్రవేశించియున్నాను, మత్తః = నా వలన, స్మృతిః = స్మృతియు, జ్ఞానం = జ్ఞానమును, అపోహనం చ = ఊహయు, (భవన్తి = కలుగుచున్నవి,) సర్వైః = సమస్తములైన, వేదైః చ = వేదముల చేతను, అహం ఏవ = నేనే, వేద్యః = తెలియబడుచున్నాను, వేదాన్తకృత్ = వేదాన్త ఫలమునిచ్చు వాడను, వేదవిత్ చ = వేదతత్త్వార్థమును తెలిసినవాడను, అహం ఏవ = నేనే.

తా ॥ నేను సమస్తభూతములయొక్క సకల ప్రవృత్తులకు మూలమైన జ్ఞానము బుట్టునట్టి ప్రతి హృదయమందును అంతరాత్మగా ప్రవేశించి యున్నాను. నా వలననే అందరకును స్మృతియు, జ్ఞానము, ఊహ కలుగుచున్నవి. సమస్త వేదముల చేతను తెలియబడువాడను, వేద వేదాంతముల యందు తెలుపబడిన ఫలముల నిచ్చువాడను, వేద తత్త్వార్థ వేత్తను నేను మాత్రమే.
(ఊహ యనగా : 'ఈ ప్రమాణ మీ విధమున ప్రవర్తింపదగిన'దని ఆయా ప్రమాణముల యొక్క గమనికను గుర్తించుట. ఇది సకల ప్రమాణములకు నుపకరించును).

అవ. కావున సకల వేద సారభూతమైన యర్థమును నా వలననే వినుమని చెప్పుచున్నాడు.

16. శ్లో. ద్వావిమౌ పురుషౌ లోకే। క్షర శ్చాక్షర ఏవ చ।
క్షర స్సర్వాణి భూతాని। కూటస్థోఽక్షర ఉచ్యతే ॥

అర్థము : లోకే = లోకమునందు, క్షరః చ = క్షరుడనియు, అక్షరఃచ = అక్షరుడనియు, ఇమౌ = ఈ, ద్వౌ = ఇద్దరు, పురుషౌ = పురుషులు, (స్తః = కలరు,) సర్వాణి = సమస్తమైన, భూతాని = బద్ధాత్మలు, క్షరః = క్షరణ స్వభావము కలవి, ఇతి = అని, ఉచ్యన్తే = చెప్పబడుచున్నవి, కూటస్థః = ముక్తాత్మ వర్గము, అక్షరః = అక్షరుడనియు, ఉచ్యతే= చెప్పబడుచున్నది.

తా ॥ ఈ లోకమున క్షరుడు అక్షరుడు అని పేరులు గల రెండు పురుష వర్గములున్నవి. అందు మారునట్టి స్వభావము కలిగి బ్రహ్మాది స్తంభ

పర్యంతమైన జీవ వర్గము క్షరుడనియు, స్వస్వరూపావిర్భావమును చెంది కూటస్థులై యున్న ముక్తాత్మ వర్గము అక్షరుడనియు చెప్పబడు చున్నారు. (కూటవత్ తిష్ఠ తీతి కూటస్థః. కూటమనగా కమ్మరివాని దిమ్మ. దానిపై నెన్నియో పదార్థములు నామరూపముల నొందుచున్నను అది మాత్ర మొకే రీతిగా నుండును. అట్లే ముక్తాత్మయు ననేక దేహములతో నిది వరకు సంబంధించి యుండినను తానా వికారముల కెపుడును లోనుగాక సంకోచము లేని నిర్మల జ్ఞానాకారముతో వెలుగు చుండును. (కావున ముక్తాత్మ కూటస్థ మనబడును.)

అవ. బద్ధావస్థలోను, ముక్తా వస్థలోను నుండు ఆత్మలకంటె పరమాత్మ వేరైన వాడని తెలుపుచున్నాడు.

17. శ్లో. ఉత్తమః పురుష స్త్వన్యః । పరమాత్మే త్యుదాహృతః ।
యో లోకత్రయ మావిశ్య । బిభర్త్యవ్యయ ఈశ్వరః ॥

అర్థము : ఉత్తమః = ఉత్తముడైన, పురుషఃతు = పురుషుడైతే, అన్యః = మరియొకడు, పరమాత్మా ఇతి = పరమాత్మయని, ఉదాహృతః = చెప్పబడుచున్నాడు, యః = ఏ పరమాత్మ, లోకత్రయం = మూడు వర్గములను, ఆవిశ్య = ప్రవేశించి, అవ్యయః= నాశ రహితుడై, ఈశ్వరః = అధిపతియై (అస్తి = ఉన్నాడో.)

తా ॥ బద్ధ ముక్తాత్మల కంటె ఉత్తముడైన పరమాత్మ యనబడువాడు మరి యొకడున్నాడు. ఆయన అచేతన, బద్ధాత్మ, ముక్తాత్మ వర్గములు మూడింటి యందును అంతరాత్మగా ప్రవేశించి నాశరహితుడై వాటి కధిపతియై యున్నాడు.

అవ. ఆ విషయమునే తిరిగి "సమాఖ్య" యనబడు మీమాంసా ప్రమాణముచే స్థిరీకరించుచున్నాడు.

18. శ్లో. యస్మాత్క్షర మతీతోఽహ । మక్షరా దపి చోత్తమః ।
అతోఽస్మిలోకే వేదే చ । ప్రథితః పురుషోత్తమః ॥

అర్థము : యస్మాత్ = ఏ కారణము వలన, అహం = నేను, క్షరం = బద్ధ పురుష వర్గమును, అతీతః = అతిక్రమించినవాడనో, అక్షరాత్ అపిచ = ముక్త పురుష వర్గము కంటెను, ఉత్తమః = ఉత్కృష్టుడనో, అతః = ఆ కారణము వలననే, లోకే = స్మృతుల యందును, వేదేచ = వేదము నందును, పురుషోత్తమః = పురుషోత్తముడు, ఇతి = అని, ప్రథితః = ప్రసిద్ధి కలవాడును, అస్మి = అగుచున్నాను.

తా ॥ నేను క్షరుడనబడు బద్ధ పురుష వర్గము కంటెను, అక్షరుడనబడు ముక్త వర్గము కంటెను గొప్పవాడను. అందుచే స్మృతులయందును, శ్రుతులయందును పురుషోత్తముడనని ప్రసిద్ధి కలవాడనై యున్నాను. (సమాఖ్య యనగా పేరు. 'పురుషోత్తముడ'ని శ్రుతులలోను, స్మృతులలోను పరమాత్మ వాడబడుచున్నాడు. ఆ శబ్దార్థమును పరిశీలించగా నాతడన్ని యవస్థలలో నున్న జీవుని కంటె వేరైన వాడని స్పష్టమగుచున్నది.)

అవ. ఇట్లు ప్రసిద్ధమగు పురుషోత్తమ శబ్దార్థమును వివరించుట, యట్లు నిరంతర మనుసంధించుట కొఱకే యగుచున్నదని తెలుపుచు దీని నెఱుంగుటను ప్రశంసించుచున్నాడు.

19. శ్లో. యో మా మేవ మసమ్మూఢో । జానాతి పురుషోత్తమమ్ ।
స సర్వవి ద్భజతి మాం । సర్వ భావేన భారత! ।

అర్థము. భారత = అర్జునా, యః = ఎవడు, పురుషోత్తమం = పురుషోత్తముడనగు, మాం = నన్ను, అసమ్మూఢః = సమ్మోహము లేనివాడై, ఏవం = ఈ ప్రకారముగా, జానాతి= తెలుసుకొనుచున్నాడో, సః = వాడు, సర్వవిత్ = అన్నిటిని యెఱింగిన వాడగుచు, మాం = నన్ను, సర్వ భావేన = అన్ని రీతుల చేతను, భజతి = భజించుచున్నాడు.

తా ॥ క్షరాక్షర పురుషుల కంటె భగవంతుడు వ్యాపన ఐశ్వర్యాదులచే వేరైన వాడని నిశ్చయించినవాడు భగవత్ప్రాప్తికై నెఱుంగవలసిన యుపాయములనెల్ల నెఱింగిన వాడగును. అన్ని విధములగు భజన ప్రకారములచే భజించువాడును అగుచున్నాడు. నన్నెఱుంగుటచే నాకే ప్రీతి గలుగునో, నన్ను భజించుటచే నాకే ప్రీతి కలుగునో ఆ రెండు విధములగు ప్రీతులును ఈ పురుషోత్తమత్వము నెఱుంగుట చేతనే కలుగుచున్నవి.

అవ. ఇట్లీ పురుషోత్త మత్వ జ్ఞానము మిక్కిలి రహస్యముగా దాచదగినదనియు, పరమార్థమైనదనియు, సర్వోత్తమ పురుషార్థ ప్రదమనియు దెలుపుచు దానిని పూరించుచున్నాడు.

20. శ్లో. ఇతి గుహ్యతమం శాస్త్ర । మిద ముక్తం మయాఽనఘ ।
ఏత ద్బుద్ధ్వా బుద్ధిమాన్ స్యా । త్కృతకృత్యశ్చ భారత ।

ఇతి శ్రీ భగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మ విద్యాయాం యోగశాస్త్రే
శ్రీ కృష్ణార్జున సంవాదే పురుషోత్తమ ప్రాప్తియోగో నామ పంచదశోధ్యాయః

అర్థము : అనఘ = పాప రహితుడవైన, భారత = అర్జునా ! ఇతి = ఈ ప్రకారముగా, గుహ్యతమం = మిక్కిలి రహస్యమైన, ఇదం శాస్త్రం = ఈ పదుహేనవ యధ్యాయార్థము, మయా = నా చేత, ఉక్తం = చెప్పబడెను, ఏ తత్ = దీనిని, బుద్ధ్వా = తెలిసికొని, బుద్ధిమాన్ = నన్ను పొందుటకు వలయు జ్ఞానము కలవాడును, కృతకృత్యః చ = నన్ను పొందుటకై చేయవలసినది చేసిన వాడును, స్యాత్ = అగును.

తా ॥ అర్జునా! మిక్కిలి రహస్యమైన ఈ పురుషోత్తమత్వమును తెలియజేయు నీ శాస్త్రమును నీవు పాపరహితుడవగుటచే నీకు జెప్పితిని. దీని నెఱింగినవాడు బుద్ధిమంతుడును కృతకృత్యుడును నగును.

అని ఉపనిషదర్థ ప్రతిపాదకమును, బ్రహ్మ విద్యయు, యోగశాస్త్రమును, శ్రీ కృష్ణార్జున సంవాద రూపమును అయిన శ్రీ భగవద్గీత యందలి పురుషోత్తమ ప్రాప్తి యోగమనెడు పదిహేనవ యధ్యాయము.

ఈ యధ్యాయమునందలి శ్లోక సంఖ్య	20
ఇప్పటికైన మొత్తము శ్లోకములు	569

శ్రీమద్భగవద్గీతా ప్రశ్నోత్తరావళి
పదిహేనవ అధ్యాయము

1. ప్ర. ఈ యధ్యాయమునకు పేరేమి? ఆ పేరెందుల కుంచబడినది?

ఉ. ఈ యధ్యాయమునకు పురుషోత్తమ ప్రాప్తియోగమని పేరు.

పురుషులు బద్ధులనియు ముక్తులనియు రెండు విధములుగా నుందురు. ఈ ఇరు వర్గములును భగవంతుని విభూతులే. భగవంతుడు తన విభూతులగు నీ యిద్దరి పురుషుల కంటె దుర్గుణమొక్కటైనను లేక సద్గుణరాశి గావున విలక్షణుడగుటచే నాతడు పురుషోత్తముడు. ఇట్టి పురుషోత్తముని పొందుటకు సాధన మీ యధ్యాయమున చెప్పబడుటచే దీనికా పేరుంచబడినది.

2. ప్ర. ఈ యధ్యాయమున చెప్పబడిన విషయములేవి?

ఉ. (అచిన్మిశ్రా ద్విశుద్ధా చ్చ చేతనాత్పురుషోత్తమః వ్యాపనాద్భరణా త్స్వామ్యాదన్యః పఞ్చ దశోదితః

బ్రహ్మాది పిపీలికా పర్యంతము గల జీవరాశులన్నియు బద్ధ జీవులనబడుదురు. ఈ శరీర సంబంధమును పూర్తిగా పోగొట్టుకొని స్వస్వరూపముతో పరమ పదమున పరమ పురుషుని సాయుజ్యముతో నలరారు జీవరాశి ముక్తులనబడుదురు. పరమాత్మయన్ననో యీ రెండు విధములగు జీవుల యందును వ్యాపించి యుండుటచేతను, వాటిని తన సొత్తు వలె యధేష్టముగ వినియోగించుకొనదగిన ప్రభువగుట చేతను వాటి కంటె వేరైనవాడని యీపదిహేనవ యధ్యాయమున లెస్సగా సమర్థించబడినది)

వివరములు

1. 'అసంగము' అనెడు శస్త్రముచే ఛేదింపబడదగిన ప్రకృతి బంధము గల శుద్ధాత్మ స్వరూపమును జెప్పుటకై ఛేదింపబడదగినదియై బంధరూపముతో వ్యాపించియున్న ప్రకృతి యొక్క పరిణామమును అశ్వత్థ వృక్షముగా పోల్చుట. (దానినే నైమిత్తిక సృష్టి ప్రక్రియగా చెప్పుట.) 1 శ్లో ॥
2. నిత్య సృష్టి ప్రక్రియగా చెప్పుట 2 శ్లో॥
3. ఈ సంసారమందరకు ప్రత్యక్షముగ గోచరించుచుండ దీని నెటింగినయే యొక్కానినో ప్రశంసింపనేల అనెడు ప్రశ్నకు సమాధాన మొసంగుట 2 1/2 శ్లో ॥

4. ఇట్లీ సంసారమును అశ్వత్థ వృక్షముగా పోల్చుటకు ప్రయోజనమును చెప్పుట. 3 శ్లో॥

5. సత్వరజస్తమోమయమగు భోగములతోడి సంబంధమున్ను దానికి కారణమగు విపరీత బుద్ధియు అనాది కాలము నుండి వేళ్ళు పాతుకొని యున్నవి గదా! అవి ఇప్పుడు పోవుటెట్లు? అనెడు ప్రశ్నకుత్తర మొసంగుట. 31/2 ,4,5 శ్లో॥

6. భగవంతుని శరణుజొచ్చిన భక్తులకు లభించు శ్రేయః పరంపరను వర్ణించుట. 6 శ్లో ॥

7. ఆత్మలన్నియు పరమాత్మ విభూతులే యైనచో నన్నియు ఆయన యొక్క యంశలే యగును గదా! అయినచో నిత్య సూరులవలె నాత్మ లన్నియు పరిశుద్ధాకారములతో నేల వెలుంగుట లేదు? యను ప్రశ్నకు సమాధానముగా బద్ధ, ముక్త నిర్ణయమును గావించుట. 61/2 శ్లో॥

8. జీవుడు శరీరమునుండియుత్క్రమించుతరి తనతో గొనిపోవు సామగ్రి నుగ్గడించుట. 7, 8, 9

9. ఆత్మయే లేదను నాస్తికుల కుత్తర మొసంగుట. 10, 11 శ్లో॥

10. అనేక రీతులుగా పురుషోత్తముని వైభవమును జెప్పుట. అందు
అ) చేతనాచేతన రూపమగు సకల తేజో ద్రవ్యముల యందును గల ప్రకాశంపజేసెడు శక్తి సర్వేశ్వరునిదేయని చెప్పుట. 12 శ్లో॥
ఆ) భూమి యందున్న సకల భూతములను ధరించు శక్తి యాతనిదే యనుట. 13 శ్లో ॥
ఇ) చంద్రుని యందున్న సకల సస్యపోషణ శక్తియు నాతనిదే యనుట.13
ఈ) మనము తినెడు నాలుగు విధములగు ఆహార పదార్థములను జీర్ణము చేయునట్టి జఠరాగ్ని యందున్న శక్తి, యా పురుషోత్తమునిదేయని చెప్పుట. 14 శ్లో ॥
ఉ) సమస్త భూతజాతమున్ను తానే యనునట్లు తానన్నిటియందును నంతరాత్మగా వేంచేసి యుండునని చెప్పుట. 15 శ్లో ॥

11. సర్వేశ్వరుడు పురుషోత్తము డెట్లగుచున్నాడో తెలుపుట. 16, 17, 18 శ్లో ॥

12. ఈ పురుషోత్తమత్వ రహస్యము నెఱుంగుట వలన కలిగెడు ఫలమును చెప్పుట. 19,20 శ్లో ॥

3. ప్ర. ఈ యధ్యాయమునకు వెనుకటి యధ్యాయముతోను ప్రధాన శాస్త్రార్థముతోను గల సంబంధమేమి?

ఉ. చిత్తు, అచిత్తు, ఈశ్వరుడు అనబడు మూడు తత్వములను వేదాంతులంగీకరించుచున్నారు. మోక్షమును కోరువాడీ మూడు తత్వముల వాస్తవ స్వరూపమును తప్పక నెఱుంగవలెనని శాస్త్రములచే విధింపబడుచున్నది. కావున పదమూడు పదునాలుగధ్యాయములలో క్రమముగ చిత్తు, అచిత్తుల యొక్క స్వరూపమును సమగ్రముగ వర్ణించి యీ యధ్యాయమున నీశ్వర తత్వమును సమగ్రముగ వర్ణించుచున్నాడు.

మరియు పదునాల్గవ యధ్యాయాంతమున గుణాతీతుడగుటకు ముఖ్యోపాయమును చెప్పుచు 'మాం చ యోఽవ్యభిచారేణ భక్తి యోగేన సేవతే' యని గుణాతీతుడగుటకును తద్వారా ముక్తుడగుటకును దేవాతాంతర ఫలాంతర సంపర్క గంధములేని భక్తితో సేవింపదగినవాడు భగవంతుడేయని చెప్పెను. ఈ యధ్యాయమున నట్టి పరము పురుషుని వైభవాతిశయము వర్ణింపబడు చుండుటచే దీనికి పదునాల్గవ యధ్యాయముతో సాక్షాత్తుగా సంబంధము కలదు.

గీతా శాస్త్రమునకు ప్రధాన ఫలము ముక్తి యనియు దానికి సన్నిహిత సాధనము భక్తి యనియు తెలుపబడినది. అట్టి భక్తి యనగా ప్రీతితో నిరంతరము భగవంతుని ధ్యానించుటయే. భగవంతుని యందట్టి ప్రీతి కలుగవలెనన్న యాతని మహిమ నెఱుంగవలెను. అది యీ యధ్యాయమున విస్తారముగ చెప్పబడినది గావున దీనికి ప్రధాన శాస్త్రార్థముతో సంబంధము కలదు.

4. ప్ర. సంసారమెట్లు అశ్వత్థ వృక్షముగా పోల్చబడినది? అందులకేమి ప్రయోజనము?

ఉ. సంసారమొక వృక్షముగ పోల్చబడినది. వృక్షమనగా ఛేదింపదగినది. సంసారము కూడ నట్టిదేగాన దానిని వృక్షముగ పోల్చుట సమంజసమే. ఆ వృక్షమైనను 'అశ్వత్థమని చెప్పనేల? యనినచో శ్వః = రేపు, తిష్ఠతి = ఉంటున్నది గాన 'శ్వత్థః' అనబడుచున్నది. అట్లుండనిదిగాన 'అశ్వత్థః' అనగా, అస్థిరమైనదని యీ శబ్దమున కర్థము. సంసారమట్టిదియే గాన నా పోలికయు సమంజసమే యగుచున్నది.

ఇట్లు సంసారమును 'అశ్వత్థవృక్షముగా' చెప్పుటకు ముఖ్య ప్రయోజనములు:
1. సులభముగా తెలియుట

2. కఠోపనిషత్తు సంసారమునట్లు పోల్చినది. ఈ గీతయు నుపనిషత్సారమే గాన నిచ్చటను ఆ మార్గమునే యవలంబించుటను సూచించుట.
3. సంసారము నశ్వరమని తెలుసుకొనినచో దాని యందు వెంటనే వైరాగ్యము జనించుట.
4. వేళ్ళు పైకిని కొమ్మలు క్రిందకును గల చెట్టనగా గాలికి దారి కడ్డముగా పడిన చెట్టని యర్థము. అది బండితో పయనించు వారి దారికెట్లు ప్రతిబంధకమో యట్లే సంసార వృక్షము కూడా శరీర శకటముతో విష్ణుపురమును చేరగోరు బాటసారుల కాటంకమే గావున నా చెట్టును ఖండించి దారి చేసుకొని పోవునట్లే సంసార వృక్షమును కూడ ఛేధించుకొనియే మన ప్రయాణమును సాగించవలెనని తెలియుట.

ఈ వృక్షమునకు మొదలు చతుర్ముఖ బ్రహ్మయే గావున ఆయన సప్తలోకములకును పైనున్న బ్రహ్మలోకములో నుండుటచే మొదలు పైన గలదనియు, చిలువలు పలువలు తొడగి వ్యాపించి యుండు కొమ్మల వలె సకల నర పశు క్రిమి కీట పతంగ స్థావరాది శరీర ధారులైన జీవులు భూమి నాశ్రయించి యుండుటచే క్రిందకు కొమ్మలు కలవనియు, నశ్వరమైనదైనను అసంగమునకు కారణమైన జ్ఞాన ముదయించు వరకు నశించదు గావున నవ్యయ మనియు, ఆకులు - గాలి వెలుగు మొదలగు పోషక పదార్థములను గ్రహించి చెట్టును పోషించునట్లు కామ్య కర్మలను బోధించు వేదభాగమున్ను ఆ కర్మల ద్వారా యీ సంసార వృక్షమును పోషించును గాన నవి యాకులనియు, ఇట్టి ఛేదింపదగిన చెట్టు నెఱింగిన వానికి ఛేదించుటకు సాధనము నన్వేషించు నభిలాష జనించును. దానికై కృషి సల్పి దానిని బోధించు వేదమును బాగుగ నెఱుంగును. గావున నీ చెట్టు నెఱింగినవాడు వేద వేత్తయనియు (1) కొమ్మలుగా చెప్పబడిన మనుష్యాదు లీ లోకములో నాచరించిన కర్మల వలన తిరిగి మనుష్యాకారులుగ నిచ్చటనే బుట్టుట గాని, పుణ్యకర్మల విశేషముల మూలమున నూర్ధ్వలోకమున గంధర్వ యక్ష దేవాది రూపముగ బుట్టుటగాని సంభవించును. గాన దీని కొమ్మలు క్రిందికిని మీదికిని వ్యాపించుననియు, నీరు మొదలగు పోషక పదార్థములు కొమ్మలను విరివిగా పెంచునట్లు సత్వాది గుణములున్ను వెనుక పదునాల్గవ యధ్యాయమున జెప్పినట్లు మానవుల ఉత్తరోత్తర జన్మలకు కారణములగుచుండుటచే గుణ ప్రవృద్ధములనియు.

కొమ్మలయందాకర్షకముగ చిగుళ్ళున్నట్లే శబ్దాది భోగములు మనుష్యులకు భోగ్యములుగా పుట్టి యాకర్షించునుగాన విషయములే ప్రవాళములనియు.

భూమియే కర్మభూమి గాన నిచ్చట మనుష్యావస్థలో నున్నప్పుడు గావించిన కర్మలచే భూలోకమున మనుష్య పశ్వాదులుగాను, ఊర్ధ్వలోకమున దేవాదులుగాను పుట్టుదురనియు. (2)

ఇట్టి రూపము గలదని గాని, గుణములచే బుట్టునట్టి భోగములయందాశయే లేకున్నచో నశించునని గాని, గుణములతో సంగమే దీనికి యాది కారణమనిగాని, దేహాత్మ భ్రాంతియే దీనికి య వలంబనమనిగాని, సామాన్య సంసారులెఱుంగరు. (3)

ఇట్లీ సంసార మొక యశ్వత్థ వృక్షముగా బోల్చబడినది.

5. ప్ర. సంసార వృక్ష రహస్యము నెఱింగిన మానవుని కర్తవ్యమేమి? ఆతనికి తన కర్తవ్యమున కుపకరించు సాధనమేమి?

ఉ. అనాది కాలము నుండియు మనోవాక్కాయములతో తెలిసియు నాచరించిన పెక్కు విధములగు విధి నిషేధ కర్మలచే బాగుగ వేళ్లు నాటుకొని పెరిగియున్న యీ సంసార వృక్షమును సమీచీన జ్ఞానమువలన చలించక యుండెడు భోగ వైరాగ్యమనెడు శస్త్రముచే ఛేదించి తిరిగి సంసారమున జన్మించనవసరము లేనట్టి శుద్ధాత్మ స్వరూపము నన్వేషించవలెను. (3)

భోగములతోడి సంబంధమున్ను దానికి కారణమైన విపరీత బుద్ధియు ననాది కాలము నుండియు పాతుకొని యున్నవి గదా అవి యిప్పుడొకసారిగా నెట్లు నివర్తించునని సంశయించ పనిలేదు. అది పోవుటకై యెవ్వని యాజ్ఞను మీరుటచే నీకీ బంధమేర్పడినదో యాతడే అనుగ్రహించినచో నిన్నీబంధము నుండి యేల విడిపించక యుండును? ఆతడు నీ పట్ల ప్రసన్నుడు కావలెనని నీ రక్షణ భారమును నీపై వైచుకొనక దానిని యాతనికే ఒప్పగింపుము. ఇదియే ప్రపత్తి. దీని చేతనే ప్రాచీనాచార్యులెందరో తరించిరి. ఇదియే దీనికి సాధనము.

6. ప్రః ఇట్లు శరణుజొచ్చుటచే భక్తులకు లభించు శ్రేయః పరంపరను వర్ణింపుము?

ఉః ఇట్లు శరణుజొచ్చిన చేతనులకు దేహాత్మభ్రాంతి నశించును. దానిచే సత్త్వాదిగుణ జనితమైన భోగముల యందలి యాశ లడుగంటును. అంతట వారాత్మజ్ఞాన నిరతులగుదురు. దానిచే నితరాశ లదృశ్యములగును. అనుకూల ప్రతికూల స్వభావములనెడు ద్వంద్వములుండనేరవు. అంతట వారు జ్ఞాన జ్యోతియగు శుద్ధాత్మ స్వరూపమును సుఖముగ బడయగల్గుదురు. (5) ఈ శుద్ధాత్మ చేతనమగుటచే కాంతి గల సకల పదార్థములను తానే స్వయము

ప్రకాశింపజేయునేగాని సూర్యుడుగాని చంద్రుడుగాని అగ్ని గాని యాయాత్మ జ్యోతిని ప్రకాశింపజేయజాలవు. కాని యవి పదార్థముల గోచరించుట కాటంకమగు చీకటిని పోగొట్టుటకు మాత్రమే యుపయోగించును. వస్తువులనుగ్రహించునది నిజమున కాత్మయే. (6) దీనిని పొందిన వారు తిరిగి యీ లోకమున బుట్టరు. ఇట్టి దివ్యాత్మజ్యోతి భగవదధీనము. (7) కావున భగవంతుని యందే తమ రక్షణ భారము నుంచిన శరణార్థులకు భగవదనుగ్రహముచే నీ శ్రేయః పరంపర స్వాధీనమై సిద్ధికి నిదానమగుచున్నది.

7.ప్ర : జీవుడొక శరీరమును విడిచి మరియొక శరీరమును పరిగ్రహించు రీతినెట్లు వర్ణించెను?

ఉ : సంసారి జీవులలో కొందరు వెనుక చెప్పిన రీతిగా భగవంతుని శరణుజొచ్చిన వారై ప్రాచీనానాది కర్మబారి నుండి విముక్తులై యర్చిరాది మార్గమున పరమ పదమున కేగి భగవత్సాయుజ్యమును బడసి స్వస్వరూపముతో శాశ్వతముగ వెలుంగుచుందురు.

కాని కొందరు కర్మబద్ధులై దేవమనుష్యాది రూపములను చెందిన శరీరములతో కర్మఫలము ననుభవించుచు తమకు కర్మఫలానుభవమున కనాదికాలము నుండి తోడు నీడయై యనుసరించు మనస్సుతో సహా ఐదు జ్ఞానేంద్రియముల నొక శరీరము నుండి, యనుభవించుటకు తగిన కర్మకు తగినట్లు మరియొక శరీరమున కీడ్చుకొని పోవుచుందురు. (7) అట్లుగొని పోవునపుడు కేవలేంద్రియములను గాక వాటి కాధారభూతములగు పృథివ్యాది భూత సూక్ష్మములను గూడ కొనిపోవుదురు. గాలి పువ్వుల నుండి గంధమును గొనిపోవుటయు నిట్లే గదా! (8) అట్లు అద్దె యిండ్లను మారెడు పట్టణ ప్రజలవలె పాత శరీరము నుండి గొని పోయిన యా సామగ్రితో నూతన శరీరమున నివసించుచు దానితో తిరిగి తామచ్చట ప్రభువులై భోగముల ననుభవింప మొదలిడుదురు. ఇట్లే మోక్షమును బడయు వరకు తిరుగుచుందురు. (9).

8.ప్ర : ఆత్మ లేదను నాస్తికులకు భగవానుడెట్లుత్తర మొసంగెను?

ఉ. మనుష్యాకారముతో నున్న దేహమును జూచి యిదియే యాత్మయని తలంచెడు మూఢులీ యాత్మ మనుష్య శరీరముతో కూడియుండి విషయముల ననుభవించునప్పుడు గాని ఆ శరీరమును విడచి లేచి పోవునపుడుగాని దానిని దేహముకంటె వేరైనదని యెఱుంగజాలరు. కాని దేహాత్మ వివేకము గల

ప్రాజ్ఞులీ యాత్మ నేయవస్థలో నున్నను దేహము కంటె వేఱైనదని ప్రత్యక్షీకరింతురు. (10) వారు కర్మనో, జ్ఞానమునో భక్తినో యవలంబించి యవి నిర్విఘ్నముగా సాగుటకు నా శరణాగతి నూతగగొని వాటిచే మనస్సున కుండు మలములనదగు రజోగుణ తమోగుణములచే పుట్టునట్టి కామక్రోధ లోభాదుల బారద్రోలి నిర్మలాంతఃకరణులై తమయోగమనెడు నేత్రముతో శరీరములో నున్నను దానికంటె వేఱై గాన్పించు నాత్మను చూడగలుగుదురు. (11) నిపుణులు, చూడవలసిన సాధనముతో చూచినను కాన్పించనప్పుడు గదా ఆ పదార్థము లేదని చెప్పవలెను ! నీటిలో కరిగిపోయిన, పంచదార నారయగల ఇంద్రియములు కన్ను, చేయి మొదలగునవియా? జిహ్వేంద్రియమునకే గదా యాశక్తి యున్నది. అట్లే 'విశుద్ధమనోగ్రాహ్యః' యను ప్రమాణమునుబట్టి పైన చెప్పినట్టి మనస్సే దానిని చూడగలుగును అని చెప్పెను.

9. ప్ర. తనయందు భక్తి కుదురుటకు తన వైభవము నెట్లు వర్ణించెను?

ఉ. పగటి యందు వెలుగునిచ్చి లోకములను కాపాడు సూర్యుడును, రాత్రుల యందు వెలుగునిచ్చి లోకములను ఓషధులను కాపాడు చంద్రుడున్ను, సర్వదా కాంతిని వేడినిచ్చి ఉపకరించు అగ్నియు జీవకోటికి చెందిన దేవతావిశేషములే. వారికా వెలిగెడు శక్తి సహజమైనది కాదు. అవి సహజమై స్వాధీనమైయుండుట నాకొక్కనికే. కాని యొండొక ప్రభువునాశ్రయించి యాతని యనుగ్రహమును బడసి తనకొక యుద్యోగము నార్జించి దానికి వలయు పరికరములన్నియు గూడ నాతనిచే బడయునట్లే యా చంద్ర సూర్యాది పదవుల కర్తమైన తపస్సును గావించిన పుణ్య జీవులును నాయనుగ్రహముచే నేను సంకల్పించి యొసంగిన నా తేజములోని శతాంశమునో సహస్రాంశమునో బడసి వెలుంగుచు లోకులచే నాదరింపబడుచున్నారు. (12)

నేనే భూమిలో ప్రవేశించి దానికి ధారణ శక్తినిచ్చి సమస్త చరాచరములను నాయసాధారణశక్తి విశేషముచే ధరించుచున్నాను. (13)

అమృత రసముల నీనుచు ఓషధులను పెంపొందించుచున్న చంద్రునిలో ప్రవేశించి తానే చేయుచున్నాడను నట్లా కార్యములను నేనే నిర్వహించుచున్నాను. (13)

ఆహారము - ఖాద్యము, చోష్యము, లేహ్యము, పేయము అని నాలుగు విధములు. (ఖాద్యములనగా నమిలి తినవలసినవి, చోష్యములనగా జుర్రునట్టి పులుసు పరమాన్నము మొదలైనవి. లేహ్యములనగా నాకి తినదగిన పచ్చడి మొదలగునవి. పేయములనగా త్రాగదగినట్టి పాలు, చారు, మజ్జిగ మొదలగునవి) ఈ నాలుగు విధములైన ఆహారమున్ను ప్రాణాపాన వాయువులచే రగులుకొలుపబడిన జఠరాగ్నిచే పచనమగుచున్నది. కాని యాజఠరాగ్నికాశక్తి నిచ్చిన వాడను నేనేయని తన వైభవమును వర్ణించెను. (14)

నేనే చంద్రసూర్య వైశ్వానరులకే గాక సమస్తభూత జాతముల యొక్క సమస్త ప్రవృత్తులకును మూలభూతమైన జ్ఞానము పుట్టునట్టి స్థానమగు హృదయమున వేంచేసియుండి ఆయా భూతముల సమస్త ప్రవృత్తి నివృత్తులను నా సంకల్పముచే నిర్వహించుచు విడువక యుందును, నావలననే పూర్వమనుభవింపబడిన పదార్థముల యొక్క జ్ఞాపక ముదయించును. ప్రత్యక్షాను మితిశాబ్దములనబడు జనించు పదార్థ నిర్ణయము నావలననే జనించును. యూహ జనించును.

(ఊహ యనగా: కన్ను - రూపమును, రూపముకల వస్తువును, ఆ రెండింటికి గల సంబంధమును, ఆ వస్తువునందుండు సంఖ్య మొదలగు వాటిని తెలుపగల ప్రమాణము, ఈ ప్రమాణ మెట్లు ప్రవర్తించదగినదనియు ఇట్లే సమస్త ప్రమాణముల యొక్క యర్హతను తెలుపుజ్ఞానము.)

సూర్య చంద్రాగ్ని వాయు ప్రభృతి దేవతలకును, నేనంతర్యామిగానుందును. గాన వారు నా స్వరూపులే యగుటచే వారిని తెలుపు వైదిక శబ్దములన్నియు, దేవ మనుష్యాది శబ్దములు లోపలనున్న ఆత్మలను చెప్పునట్లు-నన్నే చెప్పును. వేదమున విధింపబడిన కర్మలన్నిటికిని ఫలములు కలవు. ఆ కర్మలాచరించిన వారికాఫలములను నేనే యిచ్చుచుందును. నిఖిల వేదములచే చెప్పబడువాడను నేనేగాన వేదరహస్యములను నేనే యెఱుంగుదును. కావున నేను చెప్పునదియే యథార్థముగాని యింతకు వేరైన యర్థములన్నియు ననర్థములే. (15)

10.ప్ర. సర్వేశ్వరుడు పురుషోత్తము డెట్లగుచున్నాడు?

ఉ. పురుషోత్తముడనగా పురుషులలో నుత్తముడని యర్థము. ఐనచో ప్రథను పురుషులెవ్వరనగా, బ్రహ్మ మొదలు క్షుద్రకీటమువరకు లోకమునసున్న సమస్త ప్రాణులున్ను, ఆ శరీరము లస్థిరము లగుటచే క్షర పురుషులనియు,

ప్రకృతి సంబంధమును నిర్మూలించుకొని నిజరూపముతో వెలుంగు ముక్తాత్మలు క్షర పురుషులనియు చెప్పబడుచున్నారు. (16) పరమాత్మ యీ యిద్దరి పురుషులలోను అచేతన ప్రకృతిలోను నంతరాత్మగా వ్యాపించియిండి వాటిని ధరించున్నాడు. (17) వ్యాపకుడు, వ్యాపింపబడు వాటికంటె వేరేగదా? ఆమూడింటిలో (అచేతనము, బద్ధాత్మ, ముక్తాత్మలు) స్వరూపమే మారునది మొదటిది, స్వభావములు మారువారు బద్ధాత్మలు, కొంతకాల మట్టి మార్పులతో నుండి విముక్తిని చెందువాడు ముక్తుడును గాన ఏవిధమైన మార్పులును లేనట్టియు, ఆ మూడింటిని తాను తలంచినట్లు శాసించగలవాడును నగు పరమాత్మ వాటి కంటె వేరైనవాడేగదా! ఇట్టివాడు గావుననే శ్రుతులయందును, స్మృతులయందును పురుషోత్తముడని చెప్పబడుచున్నాడు. (18)

1.ప్ర. ఇట్టి పురుషోత్తమత్వ రహస్యము నెఱుంగుటవలన ఫలమేమి?

ఉ. నాకు, నన్ను పొందుటకు తెలుసుకొనవలసిన కీర్తన, యతన, నమస్కారాదుల నన్నిటిని తెలిసుకొనిన వానియందును వాటి నన్నిటిని యనుష్ఠించి భజించువానియందును ఉండునట్టి ప్రీతి యంతయు, పైన చెప్పబడిన విధముగా క్షర పురుషుడు, అక్షర పురుషుడువలె స్వభావము లెన్నడును మారనివాడనగుటచేతను, వాటిలో వ్యాపించియుండు వాడనగుటచేతను, వాటిని భరించువాడనగుటచేతను. వాటిని శాసించు వాడనగుటచేతను వాటికంటె నేను వేరైనవాడనని యెఱుంగువాని విషయమై నాకుండును. (19)

ఇది రహస్యము లన్నిటిలోను ఉత్తమ రహస్యము. ఇది సమస్త పాపముల నుండియు విముక్తుడగువానికే చెప్పదగినది. దీని నెఱింగినంత మాత్రముననే నన్ను పొందుట కెఱుంగవలసిన దంతయు నెఱింగినవాడే యగుచున్నాడు. ఇంతటి ఫలము నిచ్చుటకు నన్ను సాక్షాత్కరింప పనిలేదు. శాస్త్రములు చదివిగాని పెద్దలుచెప్పగా వినిగాని యెఱింగిననే చాలును అని ఈ పురుషోత్తమత్వ రహస్యమును, దాని నెఱింగినవాని మహిమను, వానికి లభించు ఫలమును భగవానుడు ప్రశంసించెను. (20)

షోడశాధ్యాయార్థ సంగ్రహము

శ్లో. దేవాసుర విభాగోక్తి పూర్వికా శాస్త్రవశ్యతా ।
తత్త్వానుష్ఠాన విజ్ఞాన స్థేమ్నే షోడశ ఉచ్యతే ।

క్రము : దేవాసురవిభాగోక్తి పూర్వికా = దేవతలనియు, అసురులనియు మానవులను విభజించి చెప్పుటద్వారా, శాస్త్రవశ్యతా = శాస్త్రమునకు విధేయులు కావలసినదేయని, తత్త్వానుష్ఠానవిజ్ఞానస్థేమ్నే, తత్త్వవిజ్ఞాన = ప్రాప్యమగు తత్త్వమును గుఱించిన జ్ఞానమున్ను, అనుష్ఠానవిజ్ఞాన = పొందుటకుపాయమగు కర్మానుష్ఠానజ్ఞానమున్ను, స్థేమ్నే = దృఢముగా నుండుటకై, షోడశే = పదునారవయధ్యాయమున, ఉచ్యతే= చెప్పబడుచున్నది.

తా ॥ మనుష్యులలో శాస్త్రమునకు కట్టుబడియుండువారు దేవతలనియు, కాని వారు అసురులనియు విభజించి, ప్రాప్యమగు తత్త్వమును గుఱించిన జ్ఞానమున్ను, దాని కుపాయమైన కర్మానుష్ఠానమును గురించిన జ్ఞానమున్ను వేదమువలననే కలుగవలసినవిగాన నా జ్ఞానములు దృఢముగా గలుగుటకై యీ శాస్త్రమునకు వశ్యులై యుండవలెనని యీ పదునారవ యధ్యాయమున జెప్పబడుచున్నది.

శ్రీమద్భగవద్గీతా – షోడశాధ్యాయము

విషయసూచిక

అస్మద్గురుభ్యోనమః

శ్రీ భగవద్గీతా - షోడశోఽధ్యాయః

దైవాసురసంపద్విభాగయోగః

అవ. దైవీసంపన్నుల గుణములను జెప్పుచున్నాడు.
(ఈ గుణములనుబట్టి దైవీసంపన్నుల నెఱుంగదగును)

1.శ్లో. అభయం సత్త్వసంశుద్ధి । ర్జ్ఞానయోగ వ్యవస్థితిః ।
దానం దమశ్చ యజ్ఞశ్చ । స్వాధ్యాయ స్తప ఆర్జవమ్ ॥

అర్థము : అభయం = భయరాహిత్యమున్ను, సత్త్వసంశుద్ధిః = అంతఃకరణ పరిశుద్ధియు, జ్ఞానయోగవ్యవస్థితిః = ఆత్మయాథాత్మ్యవివేకనిష్ఠయు, దానం = సత్పాత్రదానమున్ను, దమః చ = మనోనిగ్రహమున్ను, యజ్ఞః చ = ఫలాభిసంధిరహిత భగవదారాధనమున్ను, స్వాధ్యాయః =వేదాధ్యయన నిష్ఠయు, తపః= భగవత్ప్రీతి కర కృచ్ఛ్రచాంద్రాయణాదులన్ను, ఆర్జవం=ఋజుప్రవర్తనయున్ను.

తా॥ భయములేకుండుట, అంతఃకరణశుద్ధి, ఆత్మయాథాత్మ్య వివేకనిష్ఠ సత్పాత్రదానము, మనోనిగ్రహము, ఫలాపేక్షలేని భగవదారాధన రూప యజ్ఞాచరణ, వేదాధ్యయననిష్ఠ, భగవత్ప్రీతికర కృచ్ఛ్రచాంద్రాయణ ఏకాదశ్యుపవాసా ద్యనుష్ఠానము, ఋజుప్రవర్తనయు.

2. శ్లో. అహింసా సత్య మక్రోధ । స్త్యాగ శ్శాన్తి రపైశునమ్ ।
దయా భూతే ష్వలోలుప్త్వం । మార్దవం హ్రీ రచాపలమ్ ॥

అర్థము : అహింసా=పరుల పీడింపకుండుట, సత్యం = భూతహితముగచూచినది చూచినట్లు చెప్పుట, అక్రోధః = పీడించబడినను చిత్తవికారమును చెందకుండుట, త్యాగః = ఆత్మహితమునకు విరుద్ధమైనదానిని త్యజించుట, శాన్తిః = బహిరింద్రియనిగ్రహము, అపైశునం = అనర్థవాక్యములు పలుకకుండుట, భూతేషు = సర్వప్రాణుల విషయమున, దయా = దుఃఖమును సహించజాలకుండుట, అలోలుప్త్వం = విషయములయందు స్పృహలేకుండుట, మార్దవం = మృదుస్వభావము, హ్రీః = అకార్యముల చేయుటలో లజ్జ, అచాపలం = కోర తగినవస్తువు ఎదుటనున్నను చలింపకుండుట.

తా॥ ఇతరులకు బాధ కలిగించకుండుట, చూచిన విషయమును చూచినట్లు భూతహితముగ తెలుపుట, తాను పీడించబడినను చిత్తవికారమును జెందకుండుట, ఆత్మహితమునకు విరుద్ధమైనదానిని విడచుట ,బహిరింద్రియ నిగ్రహము, పరుల కనర్థమును కలిగించు వాక్యముల నితరులతో చెప్పకుండట, భూతదయ, విషయాసక్తి లేకుండుట, సజ్జన సాంగత్యమున కర్హమైయుండుట, కూడని పనుల జేయుటలో సిగ్గుపడుట, విషయము లెదుటనున్నను చలింపకుండుట.

3. శ్లో. తేజః క్షమా ధృతి శ్శౌచ । మద్రోహో నాతిమానితా ।
భవన్తి సమ్పదం దైవీ । మభిజాతస్య భారత ॥

అర్థము : హే భారత! = ఓ అర్జునా! తేజః = పరాభిభవన సామర్థ్యము, క్షమా= సాపరాధులపట్ల చిత్త వికారరాహిత్యము, ధృతిః = ఆపదలయందునను విధ్యుక్త ధర్మనిర్వహణము, శౌచం = బాహ్యాభ్యంతరేంద్రియముల నేకరూపముననుంచుట, అద్రోహః = ఇతరులస్వేచ్ఛ నరికట్టకుండుట, అతిమానితా = గర్వరాహిత్యము, దైవీం = దేవతాసంబంధమైన, సంపదం = సంపత్తును, అభిజాతస్య = అభిముఖముగ జన్మించినవానికి, భవన్తి = కలుగుచున్నవి.

తా॥ ఓ అర్జునా! శత్రువులచే నెదిరింపబడజాలని సామర్థ్యము, తన కపరాధము చేసినవారల విషయమున తన చిత్తములో క్రోధవిషాదములు లేకుండుట, నిశ్చయించుకొనిన పనిని ఎన్ని విఘ్నములు వచ్చినను నిర్వహించుట, శాస్త్రీయకృత్యముల నాచరించుటలో బాహ్యేంద్రియములను అంతరింద్రియములను యోగ్యముగునటుల యుంచుట, ఇతరుల సక్రమ స్వేచ్ఛ నరికట్టకుండుట, గర్వపడకుండుట, ఇవియన్నియు భగవదభిముఖుడైన వానియొక్క సంపత్తనబడును.

అవ. అసురసంపన్నుల గుణములను సంగ్రహముగా జెప్పుచున్నాడు.

4. శ్లో. దమ్భో దర్పోఽభిమానశ్చ । క్రోధః పారుష్య మేవచ ।
అజ్ఞానం చాభిజాతస్య । పార్థ! సమ్పద మాసురీమ్ ।

అర్థము: హే పార్థ ! = ఓ అర్జునా! దమ్భః = ప్రసిద్ధికై దానాదులచేయుట, దర్పః = గర్వమున్ను, అభిమానః చ = దురభిమానము, క్రోధః = కోపము, పారుష్యంచ ఏవ= సజ్జనుల కుద్రేకముకలిగించు స్వభావము, అజ్ఞానం = తెలివిలేమియు (అనునివి), ఆసురీం = అసురసంబంధమైన, సమ్పదం = సంపత్తును, అభిజాతస్య = అభిముఖముగ జేసికొని జన్మించినవానికి, భవన్తి = కలుగుచున్నవి.

తా॥ ఓ అర్జునా! ధార్మికత్వ ప్రసిద్ధికై దానాదుల చేయుట, గర్వము కలిగి యుండుట, అభిజన, విద్యా, ధన దురభిమానము, పరులను బాధించు చిత్తవికారము కలిగియుండుట, సాధుశీలుర కుద్రేకము కలిగించు స్వభావము, పరాపర-తత్త్వములను కృత్యా-కృత్యములను నెఱుంగ కుండుట, అనునివి భగవదాజ్ఞ నుల్లఘించు అసుర సంపత్తుతో జన్మించిన వానికి కలుగును.

వివ. దైవీసంపద విషయమై శ్రద్ధయు, ఆసురసంపద విషయమై జుగుప్సయు పుట్టించుటకై వాటి ఫలములను జెప్పుచు అర్జునుని దైవీసంపన్నుడవని ఓదార్చు చున్నాడు.

5. శ్లో. దైవీసంపద్విమోక్షాయ । నిబన్ధాయాఽఽసురీ మతా ।
మా శుచ స్సమ్పదం దైవీ । మభిజాతోఽసి పాణ్డవ! ॥

అర్థము । దైవీ = దేవతాసంబంధమైన, సంపత్ = సంపత్తు, విమోక్షాయ = బంధనివృత్తికిన్ని, ఆసురీ = అసురసంబంధమైన సంపత్తు, నిబంధాయ = ప్రకృతిబంధమునకున్ను, మతా = నిశ్చయింపబడినది, హేపాణ్డవ = ఓ అర్జునా!, దైవీం = దేవతాసంబంధమైన, సంపదం = సంపత్తును, అభిజాతః = ఉద్దేశించి జన్మించిన వాడవు, అసి = అగుచున్నావు, మాశుచః = దుఃఖించకుమా!

తా॥ దేవతా సంబంధమైన సంపత్తు ప్రకృతి బంధమును పోగొట్టును, ఆసుర సంబంధమైన సంపత్తు ప్రకృతి బంధమును కలిగించును. ఓ అర్జునా! నీవు దైవీసంపత్తుగలవాడవై జన్మించితివి. దుఃఖించకుము.

వివ. అసురసంపత్తు మిక్కిలి యనర్థదాయకమగుటచే సుతరాం దరిజేరనీయరాదని దాని కార్యమును విస్తరించి చెప్ప బూనుచున్నాడు.

6. శ్లో. ద్వౌ భూతసర్గౌ లోకేఽస్మిన్ । దైవ ఆసుర ఏవ చ ।
దైవో విస్తరశః ప్రోక్తః । ఆసురం పార్థ! మే శృణు! ॥

అర్థము । అస్మిన్ = ఈ, లోకే = లోకమున, దైవః = దేవతాసంబంధమైనది, ఆసురఃఏవచ = అసుర సంబంధమైనదియున్ను, భూతసర్గః = ప్రాణుల సృష్టులు, ద్వౌ = రెండు, (స్తః = యున్నవి,) దైవః = దేవతాసంబంధమైన సృష్టి, విస్తరశః = విస్తారముగా, ప్రోక్తః = చెప్పబడినది, హేపార్థ! = ఓ అర్జునా!, ఆసురం = అసురసంబంధమైన సృష్టిని, మే = నావలన, శృణు = వినుము.

తా॥ ఈ కర్మలోకమున భగవదాజ్ఞను పాటించుట దేవసృష్టియనియు, భగవదాజ్ఞ నుల్లంఘించుట ఆసురసృష్టియనియు ప్రాణులకు రెండు రకముల సృష్టులున్నవి. ఇప్పటివరకు నీకు కర్మజ్ఞాన భక్తియోగరూపమగు ఆచారముగల దేవసృష్టిని విస్తారముగా దెలిపితిని. అసుర సృష్టిని గూర్చి చెప్పెద వినుము. అనగా వారి పుట్టుక ఏ యాచారముకొరకో ఆ యాచారమును చెప్పెదను.

7. శ్లో. ప్రవృత్తిం చ నివృత్తిం చ । జనా న విదు రాసురాః ।
న శౌచం నాపి చాచారో । న సత్యం తేషు విద్యతే ॥

అర్థము : అసురాః = అసురస్వభావులైన, జనాః = జనులు, ప్రవృత్తించ = ప్రవృత్తిరూప లౌకికధర్మమునుగాని, నివృత్తించ = నివృత్తిరూపమోక్ష ధర్మమునుగాని, నవిదుః = ఎఱుగరు; తేషు = వారలయందు, శౌచం = బాహ్యాభ్యంతర పరిశుద్ధి, నవిద్యతే = ఉండదు, ఆచారఃచ అపి = ఆచారమున్నుకూడ, నవిద్యతే = ఉండదు, సత్యంచ= సత్యమున్ను, నవిద్యతే = ఉండదు.

తా॥ భగవదాజ్ఞ నుల్లఘించు ఆసురజనులు ఐహిక ఫలసాధనమైన ప్రవృత్తిరూప వైదిక ధర్మమునుగాని, మోక్షఫలసాధనమైన నివృత్తి రూప వేదాంత ధర్మమునుగాని ఎఱుంగరు, వీరలయందు దేహమనశ్శుద్ధులుగాని శౌచ సాధనమైన ఆచారముగాని,తెలిసినదానిని భూతహితముగ తెలుపుటయను సత్యముగాని యుండవు.

అవ. అసురులు కేవలము సత్యమును పలుకకుండుటయే కాదు. అసత్యమున కెంతమాత్రమును జంకరని తెలుపుచున్నాడు.

8. శ్లో. అసత్య మప్రతిష్ఠం తే । జగదాహు రనీశ్వరమ్ ।
అపరస్పర సమ్భూతం । కి మన్య త్కామ హేతుకమ్ ।

అర్థము : తే = ఆయాసురస్వభావులు, జగత్ = జగత్తును, అసత్యం = అబ్రహ్మాత్మకమనియు, అప్రతిష్ఠం = బ్రహ్మమునందుండనిదనియు, అనీశ్వరం = నియామకుడులేనిదనియు, ఆహుః = చెప్పుదురు, అపరస్పర సమ్భూతం = స్త్రీ, పురుషపరస్పర సంగమమువల్ల పుట్టనట్టి, అన్యత్ = మరియొకటి, కిం = ఏదికలదు?, జగత్ = జగత్తు, కామహేతుకం = కామమేకారణముగా కలది (యని), ఆహుః = చెప్పుదురు.

తా॥ ఇట్టి ఆసుర స్వభావులీ జగత్తును బ్రహ్మనాత్మగా కలదనిగాని, బ్రహ్మము నందే స్థితికలదనిగాని, బ్రహ్మచేతనే నియమింపబడునదని గాని

అంగీకరించరు. కేవల స్త్రీ, పురుషుల కామరూప సంభోగజనితమైనదం దురు. అంతకంటె దీనికి మరియొక హేతువేదియు లేదందురు.

9. శ్లో. ఏతాం దృష్టి మవష్టభ్య । నష్టాత్మానోఽల్ప బుద్ధయః ।
ప్రభవన్త్యుగ్ర కర్మాణః । క్షయాయ జగతోఽశుభాః ॥

అర్థము : ఏతాం = ఇట్టి, దృష్టిం = జ్ఞానమును, అవష్టభ్య = అవలంబించి, నష్టాత్మానః = దేహాత్మాభిమానులై, అల్పబుద్ధయః = అజ్ఞానులై, ఉగ్రకర్మాణః = క్రూరవ్యాపారులై, అశుభాః = పాపులై, జగతః = జగత్తుయొక్క, క్షయాయ = నాశముకొఱకు, ప్రభవన్తి = పుట్టుచున్నారు.

తా॥ ఇదివరలో తెలిపినట్టి దుర్బుద్ధులు కలవారై దేహముకంటె అతిరిక్తమైన ఆత్మయున్నదను జ్ఞానము లేనివారలై దేహాత్మ భేదమును తెలియనివారలై పరహింసారూప క్రూరవ్యాపారులై పాపులై ప్రపంచమును నశింప జేయుటకై పుట్టుచున్నారు.

10. శ్లో. కామ మాశ్రిత్య దుష్పూరం । దమ్భమానమదాన్వితాః ।
మోహాద్గృహీత్వాఽ సద్గ్రాహాన్ । ప్రవర్తన్తేఽశుచివ్రతాః ॥

అర్థము : దుష్పూరం = నెరవేరజాలని, కామం = ఆశను, ఆశ్రిత్య = అవలంబించి, దంభమానమదాన్వితాః = దంభము దురభిమానము మదములతో గూడుకొన్నవారలై, మోహాత్ =అజ్ఞానమువలన, అసద్గ్రాహాన్ = అన్యాయార్జితములైనవాటిని, గృహీత్వా= స్వీకరించి, అశుచివ్రతాః = శాస్త్ర విరుద్ధ వ్రతాచరణగలవారలై, ప్రవర్తన్తే = ప్రవర్తించుచున్నారు.

తా॥ వీరు, తాము పొంద శక్యముగాని వస్తువుల నాశించి దంభము దురభిమానము మదము గలవారలై అజ్ఞానముచే అన్యాయార్జితమైన వాటిని స్వీకరించుచు శాస్త్ర నిషిద్ధానుష్ఠానపరులై ప్రవర్తించుచుందురు.

అవ. ఇట్లు ప్రవర్తించు ఆసురసంపన్నుల కంతకంతకు పెచ్చు పెరుగునట్టి మనోవికారాదులను జెప్పుచున్నాడు.

11. శ్లో. చిన్తా మపరిమేయాం చ । ప్రలయాన్తా ముపాశ్రితాః ।
కామోపభోగపరమా । ఏతావదితి నిశ్చితాః ।

అర్థము : అపరిమేయాం = పరిమితిలేనట్టి, ప్రలయాన్తాం = ప్రళయము అంతముగా కలిగినట్టి, చిన్తాం = మనోరథమును, ఉపాశ్రితాః = ఆశ్రయించినవారలై, కామోప

భోగపరమాః = విషయానుభవభోగమే పరమ పురుషార్థముగాగల వారలై, ఏతావత్ = పురుషార్థమింతయే, ఇతి = అని, నిశ్చితాః = నిశ్చయము కలవారు, భవన్తి = అగుచున్నారు.

తా॥ వారు పరిమితిలేనట్టియు ప్రళయమువరకు సాధించబడుచుండునట్టియు మనోరథ పరంపరలను చక్కగా ఆశ్రయించి విషయాను భవజన్య భోగమే పరమపురుషార్థము, ఇంతకంటె వేరు పురుషార్థము లేదని నిర్ణయము గలవారగుచున్నారు.

అవ. ఆసురులు గ్రామ్యసుఖాభిలాషనే పరమపురుషార్థముగా భావించి దానికొఱకై అన్యాయముగ ధనార్జన గావింతురని చెప్పుచున్నాడు.

12. శ్లో. ఆశాపాశ శతైర్బద్ధాః । కామక్రోధ పరాయణాః ।
ఈహన్తే కామభోగార్థ । మన్యాయే నార్థసఞ్చయాన్ ॥

అర్థము : ఆశాపాశశతైః = పాశములవంటి అనేక ఆశలచేత, బద్ధాః = కట్టబడినవారలై, కామక్రోధపరాయణాః = కామక్రోధముల నాశ్రయించినవారలై, కామభోగార్థం = విషయానుభవముకొఱకు, అన్యాయేన = అన్యాయమార్గముచే, అర్థసఞ్చయాన్ = ధనసమూహములను, ఈహన్తే = కోరుచున్నారు.

తా॥ పాశములవంటి యనేక యాశలచే బంధింపబడినవారలై కామక్రోధములకు వశులై విషయముల ననుభవించుటకై న్యాయముకాని విధానముల ద్వారా ధనరాసులను వాంఛించుచుందురు.

13. శ్లో. ఇద మద్య మయా లబ్ధ । మిమం ప్రాప్స్యే మనోరథమ్ ।
ఇద మస్తీ దమపి మే । భవిష్యతి పునర్ధనమ్ ॥

అర్థము : ఇదం = ఈ కనుపించు వస్తు సముదాయము, అద్య = ఇప్పుడు, మయా = నాచేత; లబ్ధం = పొందబడినది, ఇమం = ఈ, మనోరథం = కోరికను, ప్రాప్స్యే = పొందగలను, ఇదం = ఈ ధనము, అస్తి = నాదై యున్నది, ఇదం = ఈ, ధనం అపి = ధనముకూడ, పునః = తిరిగి, మే = నాకు, భవిష్యతి = లభించగలదు.

తా॥ ఈ కాన్పించు పుత్రమిత్ర కళత్ర క్షేత్రాదులన్నియు నా శక్తి సామర్థ్యములచే సంపాదింపబడినవి. నేనింకను యిట్టికోరికల లభించగలను, ఈ ధనమంతయు నా సంపాదన, ఇట్టి ధనమింకను నాకు ముందు లభించ గలదు (అని వీరందురు).

అవ. ఇష్టప్రాప్తి నభిలషించుటయే కాదు. అనర్థనివృత్తినికూడ నభిలషించు చుందురని చెప్పుచున్నాడు.

14. శ్లో. అసౌ మయా హత శ్శత్రు । ర్హనిష్యే చాపరా నపి ।
ఈశ్వరోఽహ మహం భోగీ । సిద్ధోఽహం బలవాన్ సుఖీ ॥

అర్థము : అసౌ = ఈ, శత్రుః = శత్రువు, మయా = నాచేత, హతః = చంపబడెను, అపరాన్ అపి = మిగిలినవారలనుకూడ, హనిష్యే = చంపగలను, అహం = నేను, ఈశ్వరః= నియామకుడను, అహం = నేను, భోగీ = భోగములననుభవించువాడును, అహం= నేను; సిద్ధః = సిద్ధుడను; బలవాన్ = బలవంతుడను; సుఖీ = సౌఖ్యవంతుడను.

తా॥ ఈ శత్రువు నాచే జంపబడెను, మిగిలినవారలనుకూడ నేను చంపగలను. నేను సర్వనియామకుడను, నేనే సకల భోగముల ననుభవించువాడను. సిద్ధుడను, బలవంతుడను, సౌఖ్యవంతుడను.

15. శ్లో. ఆఢ్యోఽభిజనవా నస్మి । కోఽన్యోఽస్తి సదృశో మయా ।
యక్ష్యే దాస్యామి మోదిష్యే । ఇత్యజ్ఞాన విమోహితాః ॥

అర్థము : అహం = నేను, ఆఢ్యః = ధనవంతుడను, అభిజనవాన్ = ఉత్తమ వంశస్థుడను, అస్మి= అగుచున్నాను, మయా = నాతో, సదృశః = సమానుడైన, అన్యః = మరియొకడు, కః = ఎవడు, అహం = నేను, యక్ష్యే = యాగమాచరించగలను, దాస్యామి = దానములిత్తును, మోదిష్యే = ఆనందమనుభవింతును; ఇతి = అని, అజ్ఞానవిమోహితాః = పరమాత్మ జ్ఞానరహితులై, (ఆత్మస్వాతంత్ర్య మోహము కలవారలై) (సన్తి = ఉన్నారు.)

తా॥ వీరు తమ సామర్థ్యముచేతనే ధనవంతులుగాను, ఉత్తమ వంశస్థులగాను అగుదురనియు, తమతో సమానులైనవారు మరి యెవరును లేరనియు, తమంతటతామే యాగమాచరించగలమనియు, దానములీయగల మనియు, ఆనందించగలమనియు ఇట్లు పరమాత్మ జ్ఞానము లేక తాము స్వతంత్రులమను మోహముగలవారలై యున్నారు.

16. శ్లో. అనేక చిత్తవిభ్రాన్తాః । మోహజాలసమావృతాః ।
ప్రసక్తాః కామభోగేషు । పతన్తి నరకేఽశుచౌ ॥

అర్థము : అనేక చిత్తవిభ్రాన్తాః = అనేక విధములైన మనోవిభ్రాన్తిగలవారలై, మోహజాల సమావృతాః = అజ్ఞానమను పాశముచే చక్కగా చుట్టబడినవారలై, కామభోగేషు =

విషయానుభవములయందు, ప్రసక్తాః = అధికాసక్తి కలవారగుచు, అశుచౌ = అపరిశుద్ధమైన, నరకే = నరకమునందు, పతన్తి = పడుచున్నారు.

తా॥ వీరు తాము స్వతంత్రులమని నానావిధ చిత్త విభ్రమములుగల వారలై, మోహపాశబద్ధులై, కామభోగములందు మిక్కిలి ఆసక్తులై నడుమనే మృతిజెంది ఘోర నరకమున బడుచుందురు.

17. శ్లో. ఆత్మ సమ్భావితా స్తబ్ధాః । ధన మాన మదాన్వితాః ।
యజన్తే నామయజ్ఞై స్తే । దమ్భే నా విధిపూర్వకమ్ ॥

అర్థము : తే = అట్టివారు, ఆత్మసమ్భావితాః = తమనుతామే గౌరవించుకొనువారలై, స్తబ్ధాః= తాము పరిపూర్ణుల మనుకొనువారలై, ధన-మాన-మదాన్వితాః = ఐశ్వర్యముచేతను దురభిమానముచేతను మదముతోను గూడుకొన్నవారలై, నామయజ్ఞైః = పేరునకుమాత్రము యజ్ఞములనుపించుకొనువానిచే, దమ్భేన = పై ఖ్యాతికొరకైన అట్టహాసముతో, అవిధిపూర్వకం = శాస్త్ర విధి నతిక్రమించి, యజన్తే = యాగముల నాచరించుచున్నారు.

తా॥ వీరు ఆత్మస్తుతిగలవారై తామే సర్వజ్ఞులమనుకొని పెద్దలనాదరించక ఐశ్వర్య సద్వంశాది దురభిమానములచే మదించినవారలై, పేరునకు మాత్రము యజ్ఞములనబడు వానిచే లోక ప్రఖ్యాతికొరకు శాస్త్రవిధి నతిక్రమించి యట్టహాసముతో యాగముల నాచరింతురు.

అవ. సాత్త్వికుల యజ్ఞ - తదంగములకును, ఆసురుల యజ్ఞాదులకును గల వైషమ్యమును జెప్పుచున్నాడు.

. శ్లో. అహఙ్కారం బలం దర్పం । కామం క్రోధం చ సంశ్రితాః ।
మా మాత్మపరదేహేషు । ప్రద్విషన్తోఽభ్యసూయకాః ॥

అర్థము : తే = అట్టివారు, అహఙ్కారం = అహంకారమును, బలం = బలమును, దర్పం = గర్వమును; కామం = కామమును, క్రోధంచ = కోపమును, సంశ్రితాః = బాగుగా ఆశ్రయించినవారలై, ఆత్మపరదేహేషు = తమ యొక్కయు ఇతరుల యొక్కయు దేహములయందు, అవస్థితం = ఉన్నట్టి, మాం = నన్ను, ప్రద్విషన్తః = మిక్కిలి ద్వేషించువారలై, అభ్యసూయకాః = అసూయపడువారలునై, (సన్తి = ఉన్నారు.).

తా॥ వీరు సమస్తమును నేనే చేయగలనను అహంకారమునకు తమ బలమునకు గర్వమునకు కామమునకు కోపమునకు లోబడినవారలై తమలోను

ఇతరులలోను వ్యాపించియున్నట్టి పరమాత్మను ద్వేషించుచు అసూయా పరులై యుందురు.

అవ. ఇట్లు భగవద్ద్వేషముతో గావించునట్టి యాగాదులకు తగిన ప్రతికూల ఫలములను తానే యిచ్చుచుందునని చెప్పుచున్నాడు.

19. శ్లో. తానహం ద్విషతః క్రూరాన్ । సంసారేషు నరాధమాన్ ।
క్షిపామ్య జస్ర మశుభా । నాసురీష్వేవ యోనిషు ॥

అర్థము : ద్విషతః = నన్ను ద్వేషించువారై, క్రూరాన్ = క్రూరస్వభావులై, అశుభాన్ = అశుభకార్యములజేయునట్టి, తాన్ = అట్టి, నరాధమాన్ = మనుష్యాధములను, సంసారేషు = జన్మజరామరణాదులతో పరివర్తమానముగు సంతానములలో, ఆసురీషు = అసురసంబంధమైన, యోనిషు ఏవ = జన్మలయందే, అహం = నేను, క్షిపామి = త్రోసివేయుదును.

తా॥ నన్ను ద్వేషించునట్టి క్రూరులు- పాపులును నగు నీ నరాధములను జన్మ జరామరణాది పరివర్తనముగల సంతానములలో, అందును వారిని ప్రతికూల జన్మలయందే ఎల్లప్పుడును పడవేయుదును. అనగా వారి కర్మ ననుసరించి అట్టి ప్రవర్తన కనుకూలమైన క్రూర బుద్ధులను వారికి పుట్టింతును.

అవ. అసురుల కంతకంతకు నీచాతినీచత్వప్రాప్తిని జెప్పుచున్నాడు.

20. శ్లో. ఆసురీం యోని మాపన్నాః । మూఢా జన్మని జన్మని ।
మా మప్రాప్యైవ కౌన్తేయ! తతో యాన్త్యధమాం గతిమ్ ॥

అర్థము : హేకౌన్తేయ = ఓ అర్జునా!, ఆసురీం = అసురసంబంధమైన, యోనిం = జన్మమును, అపన్నాః = పొందినవారై, జన్మని జన్మని = ప్రతిజన్మయందును, మూఢాః = నా విషయమున విపరీతజ్ఞానులై, మాం = నన్ను, అప్రాప్య = పొందకుండగనే, తతః = అంతకంటెను, అధమాం = నీచమగు, గతిం = స్థితిని, యాన్తి = పొందుచున్నారు.

తా॥ ఓ అర్జునా! నా యనుకూలతకు విరుద్ధమగు జన్మములను పొంది అందులో నా విషయమై మరింత విపరీతజ్ఞానముతోనుండి ఏ జన్మలోను నన్ను పొందలేకనే ఒకదానికంటె మరియొకటి నీచముగ నుండు అధమాధమ జన్మలను పొందుచున్నారు.

అవ. ఇట్టి యాసుర స్వభావునకు ఆత్మనాశమే ఫలము, ఆ యాత్మనాశమునకు మూలకారణమును జెప్పుచున్నాడు.

21. శ్లో. త్రివిధం నరకస్యేత । ద్ద్వారం నాశన మాత్మనః ।
కామః క్రోధ స్తథా లోభ । స్తస్మా దేతత్త్రయం త్యజ ॥

అర్థము : నరకస్య = నరకమునకు, కామః = కామము, క్రోధం = కోపము, తథా = అట్లే, లోభః= లోభము, (ఇతి) ఏతత్ = అనునిది, త్రివిధం = మూడు విధములగు, ద్వారం = కారణము, (ఏతత్ = ఇది), ఆత్మనః = ఆత్మకు, నాశనం = నాశకము, తస్మాత్ = అందువలన, ఏతత్ = ఈ త్రయం = మూడింటిని, త్యజ = విడువుము.

తా॥ ఆసురస్వభావమే నరకము, దానికి కామము క్రోధము లోభము అను ఈ మూడున్ను హేతువులు, మరియును ఆత్మస్వరూపప్రాప్తిని గలుగనీయనివి. గాన నీ మూడింటిని విడిచిపెట్టుము.

అవ.కామక్రోధాదులను సవాసనగా విడుచుటచే గలుగు ఫలపరంపర నిచ్చట జెప్పుచున్నాడు.

22. శ్లో. ఏతై ర్విముక్తః కౌన్తేయ! తమోద్వారై స్త్రిభి ర్నరః ।
ఆచర త్యాత్మన శ్శ్రేయ । స్తతో యాతి పరాంగతిమ్ ॥

అర్థము : హే కౌన్తేయ! =ఓ అర్జునా!, ఏతైః = ఈ, తమోద్వారైః = అజ్ఞానహేతువులైన, త్రిభిః = కామక్రోధలోభములనబడు మూడింటి చేతను, విముక్తః = విడువబడిన, నరః = మనుష్యుడు, ఆత్మనః = ఆత్మకు, శ్రేయః = మేలును, ఆచరతి = చేయుచున్నాడు; తతః = అందువలన, పరాం = గొప్పదైన, గతిం = ప్రాప్యమైన నన్ను, యాతి = పొందుచున్నాడు.

తా॥ ఓ అర్జునా! కామ క్రోధ లోభములనెడు మూడున్ను అజ్ఞాన హేతువులు. ఈ మూడింటినుండి విడువడిన నరుడే ఆత్మస్వరూపప్రాప్తికి వలయు దానిని చేయగలుగుచున్నాడు. పరమ ప్రాప్యమైన నన్ను పొందగలుగుచున్నాడు.

అవ. శాస్త్రము నాదరించక పోవుటయే నరకమునకు ముఖ్యకారణమని చెప్పుచున్నాడు.

23. శ్లో. యశ్శాస్త్రవిధి ముత్సృజ్య । వర్తతే కామకారతః ।
న న సిద్ధి మవాప్నోతి । న సుఖం న పరాం గతిమ్ ।

అర్థము : యః = ఎవడు, శాస్త్రవిధిం = వేదశాస్త్రమనబడు నా యాజ్ఞను, ఉత్సృజ్య = విడిచి, కామకారతః = ఇష్టమువచ్చినటుల, వర్తతే = వర్తించుచున్నాడో, సః = అట్టివాడు,

సిద్ధిం = స్వర్గాదిఫలసిద్ధిని, నఅవాప్నోతి = పొందడు, సుఖం = సుఖమును, నఅవాప్నోతి = పొందడు, పరాం = ఉత్కృష్టమైన, గతిం = ప్రాప్యమగు నన్ను, న అవాప్నోతి = పొందడు.

తా॥ వేదశాస్త్రములు నా యాజ్ఞారూపమైనవి. వాని నతిక్రమించి తన యిచ్ఛానుసారము ప్రవర్తించువాడు, ఆముష్మికఫలమగు స్వర్గాదులను గాని ఇహలోకమందలి సుఖమునుగాని, పరమప్రాప్యమైన నన్ను గాని పొందజాలడు.

అవ. ఈ యధ్యాయమున తాను జెప్పినదంతయు శాస్త్రాదరమును వృద్ధిపొందించు కొఱకేయని స్పష్టముగా నుపదేశించుచున్నాడు.

24. శ్లో. తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే । కార్యాకార్య వ్యవస్థితౌ ।
జ్ఞాత్వా శాస్త్రవిధానోక్తం । కర్మ కర్తు మిహార్హసి ॥

ఇతి శ్రీ భగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే దైవాసుర సంపద్విభాగ యోగోనామ షోడశోఽధ్యాయః

అర్థము : తస్మాత్ = అందువలన, తే = నీకు, కార్యాకార్య వ్యవస్థితౌ = కృత్యాకృత్య నిర్ణయమున, శాస్త్రం = వేదశాస్త్రము, ప్రమాణం = ప్రమాణము, శాస్త్ర విధానోక్తం= శాస్త్ర విధియందు చెప్పబడిన, కర్మ = కర్మను, జ్ఞాత్వా = తెలిసికొని, ఇహ = ఇచ్చట, కర్తుం = చేయుటకు, అర్హసి = తగుదువు.

తా॥ విధ్యుక్తముగాని కర్మనిష్ఫలముగాన 'ఇదిచేయదగిన కర్మ - ఇది చేయగూడనికర్మ' యని నిర్ణయించుటలో శాస్త్రమే ప్రమాణము. వేదములు తదుపబృంహణములగు ధర్మశాస్త్ర ఇతిహాస పురాణాదుల యందు ఉపాదేయములుగ తెలుపబడిన కర్మలను తెలిసికొని వాటిని చేయుము.

ఇది ఉపనిషదర్థ ప్రతిపాదకమును, బ్రహ్మ విద్యయు, యోగశాస్త్రమును,
శ్రీకృష్ణార్జున సంవాదరూపమును అయిన శ్రీ భగవద్గీతయందలి
దైవాసుర సంపద్విభాగ యోగమనెడు పదునాఱవ యధ్యాయము.

ఈ యధ్యాయమునందలి శ్లోకముల సంఖ్య 24
ఇప్పటికైన మొత్తం శ్లోకముల సంఖ్య 593

శ్రీమద్భగవద్గీతా ప్రశ్నోత్తరావళి
పదహారవ అధ్యాయము

1. ప్ర. ఈ యధ్యాయమునకు పేరేమి? ఆ పేరెందులకుంచబడినది?

ఉ. ఈ యధ్యాయమునకు 'దైవాసుర సంపద్విభాగయోగ' మని పేరు.

ఈ యధ్యాయమున శాస్త్రము మానవుల శ్రేయస్సు కొఱకై పరమాత్మచే ప్రసాదింపబడెను గాన నందలి ధర్మములన్నియు గీటువాసి యైనను తప్పక జాగ్రత్తగా ననుష్ఠింపబడవలెను. ఇట్లాచరించుటచేతనే బ్రహ్మ రుద్రేన్ద్రాది దేవతలు పరమాత్మచే కంటికి రెప్పవలె నిరంతరము కాపాడబడు చున్నారు. ఆ ధర్మముల నుల్లంఘించి వాటి నాచరించువారిని పీడించుటచేతనే రాక్షసులా సర్వేశ్వరుని నిగ్రహమునకు పాత్రులై నిర్మూలింపబడిరి. కావున, మనము కూడ దేవతలవలె శాస్త్రము ననుసరించి పరమపురుషుని యనుగ్రహపాత్రులము కావలెను. రాక్షసులవలె వాటినుల్లఘించి యాతని నిగ్రహమునకు పాత్రులముకారాదని బోధించుటచే నీ యధ్యాయమున కా పేరుంచబడినది.

2. ప్ర. ఈ యధ్యాయమున చెప్పబడిన విషయము లేవి?

ఉ. ఇది మొదలు మూడధ్యాయములున్ను ముముక్షువుయొక్క కర్తవ్యాంశము నుపదేశించుచున్నవి. అందు -

దైవాసుర విభాగోక్తి పూర్వికా శాస్త్రవశ్యతా ।
తత్త్వానుష్ఠాన విజ్ఞాన స్థేమ్నే షోడశ ఉచ్యతే ॥

ముముక్షువులెఱుంగ వలసిన తత్త్వజ్ఞానమున్ను, దానిని లభించుట కుపాయజ్ఞానమున్ను, వేదముచేతను మాత్రమే యెఱుంగవలెనని నిశ్చయించుటకై వేదార్థములనెఱింగి యాచరించువారు దైవీసంపత్తునకు చెందినవారనియు, ఇతరు లాసురసంపత్తునకు చెందిన వారనియు నీ యధ్యాయమున ముఖ్యముగ జెప్పబడినవి.

వివరములు

1. దైవీ సంపత్తున జన్మించినవారలయొక్క స్వాభావికగుణవిశేషములను వివరించుట. 1, 2, 3 శ్లో ॥

2. ఆసుర సంపత్తున జన్మించిన వారలయొక్క స్వాభావిక గుణములను సంగ్రహముగా జెప్పుట. 4 శ్లో ॥
[ఇచ్చట సంపత్తనగా – వారి వారి యభిప్రాయముచే నా గుణములే తమకు సంపదగా భావింతురు. లేక సత్పురుషులను ప్రశంసించుటకున్ను దుర్జనులను నిందించుటకున్ను ఆ గుణములే సంపత్తుగా చెప్పబడినవి. లేక ఉభయత్ర పట్టుచున్నవనెడు యభిప్రాయముతోనట్లు చెప్పబడుచున్నదనియు చెప్పవచ్చు.]
3. దైవీసంపత్తునందు రక్తియు, ఆసురసంపత్తునందు విరక్తియు పుట్టించుటకు వాటి ఫల పర్యవసానమును సంగ్రహముగా జెప్పుట. 5 శ్లో.
4. అది విని తన ప్రకృతిని నిర్ణయించుకొనజాలక కాతరతతో విలపించు నర్జునుని దైవీకోటిలోజేర్చి యోదార్చుట. 5 శ్లో.
5. ఈ సంపదలు రెండును జన్మసిద్ధములు. అందు దైవసృష్టియనగా భగవదాజ్ఞ ననువర్తించుటయే స్వభావముగా సృష్టింపబడినవారు. వారాచరింపవలసిన కర్మజ్ఞాన భక్తి యోగములు విస్తరించి జెప్పబడినవి. ఇక నాసురులుగా సృష్టింపబడినవారాచరించు దురాచారములను విస్తరించి చెప్పెదను వినుమని హెచ్చరించుట 6 శ్లో.
6. ఆసుర ప్రకృతుల దురాచార పరంపరల నుగ్గడించుట.
7 నుండి 18 శ్లో. వరకు
7. ఇట్టివారిని భగవంతుడు శిక్షించు రీతిని జెప్పుట. 19 – 20 శ్లో.
8. ఆసుర స్వభావుల కాత్మనాశనమునకు మూలకారణము నుపదేశించి వాటిని విడువమని హెచ్చరించుట. 21 శ్లో.
9. అట్లు విడుచుటచే లభించు ఫలమును జెప్పుట. 22 శ్లో.
10. శాస్త్రమును అనాదరించుటయే వీరలకు ప్రధానమగు నరకహేతువని జెప్పుట. 23 శ్లో.
11. అధ్యాయ ప్రధాన విషయమగు శాస్త్రానుసరణము నుపదేశించుట. 24 శ్లో.

3. ప్ర. ఈ యధ్యాయమునకు వెనుకటి యధ్యాయముతోను ప్రధాన శాస్త్రార్థముతోను గల సంబంధమేమి?

ఉ. పదిహేనవ అధ్యాయాంతమున 'ఇతి గుహ్యతమంశాస్త్రం' అని శాస్త్ర ప్రసంగము గావింపబడినది. ఆ శ్లోకమునందే "అనఘ" పాపములేని వాడా,

భారత – ఉత్తమ "భరత వంశ సంభూతుడా" యని, అర్జునుడు ఆ శాస్త్రమును చదివి తెలుసుకొని ఆచరించుటకు తగినవాడు, పాపములులేనివాడును, ఉత్తమవంశ సంభూతుడును అని సూచింపబడినది."మా శుచ స్సంపదం దైవీం అభిజాతోఽసి భారత" అనెడు నీ యధ్యాయ 5వ శ్లోకోత్తరభాగముచే 'అర్జునా! నీవు దైవీసంపదతో పుట్టితివిగాన పాపము లేనివాడవున్ను, 'భారత' యనుటచే ఉత్తమవంశ సంభూతడవున్ను గాన నీవు శాస్త్రమున కధికారివే యగుచున్నావని చెప్పెను. అట్టి యధికారి వెనుకటి యధ్యాయములలో చెప్పబడిన తత్త్వత్రయార్థములను బాగుగ నెఱింగి మరువక స్థిరముగ నుంచుకొనుటకై శాస్త్రమునకు వశ్యుడై సంచరించవలెనని చెప్పవలసి యున్నది. ఆ విషయమునే యీ యధ్యాయాంతిమ శ్లోకమున 'తస్మా చ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యాకార్య వ్యవస్థితౌ' అని చెప్పెను. మన మట్టియధికారులమా? కామా? యని విమర్శించుకొనుటకే దైవాసుర విభాగ మీ యధ్యాయమున చేయబడినది.

ఇట్లు తమను తామే పరిశీలించుకొని ఆసురభావములను రూపుమాపుకొని దైవీ భావములను వృద్ధిపరచుకొని శాస్త్రవశ్యులై సంచరించువారిని సర్వేశ్వరుడు దేవతలను కాపాడినట్లు కాపాడి పరమపురుషార్థముగు మోక్షమునకు వలయు భక్తిని వృద్ధిపొందించి తన సాయుజ్యమును ప్రసాదించును. గాన ఈ యధ్యాయము ప్రధానశాస్త్రార్థముతో పరంపరాసంబంధము కలిగి యున్నది.

4. ప్ర. దైవీ సంపత్తునకు చెందినవారి స్వాభావిక గుణవిశేషములేవి?

ఉ.

అభయమ్

ఇష్టమైన వస్తువు పోవుట గాని అనిష్టమైన వస్తువు లభించుట గాని దుఃఖమనబడును. అందులకు కారణభూతమైన వస్తువులను చూచుటచే గలుగు దుఃఖమే భయమన బడును. ఇది తమోగుణముచే పుట్టును. దైవీసంపన్నుడు సాత్వికుడు గాన నాతని కిది యుండరాదు.

సత్వసంశుద్ధిః

ఇచ్చట సత్వమనగా – సత్వగుణమున కాధారమగు మనస్సు. దానికి సంశుద్ధి యనగా ఉన్న దోషములన్నియు పోవుట. ఆ దోషము లేవి యనగా కామము, రాగము, అసూయ, వంచన మొదలగునవి. వీటికి ముఖ్య కారణము రజోగుణ తమోగుణములే. కావున, ఆ రెండు గుణముల స్పర్శయు మనస్సున కుండరాదు.

జ్ఞానయోగవ్యవస్థితిః

ఇచ్చట జ్ఞానయోగమనగా కర్మ జ్ఞాన భక్తి యోగములు మూడింటి చేతను చేయబడునట్టి శుద్ధాత్మస్వరూప వివేచనమని యర్థము. వ్యవస్థితి యనగానట్టి శుద్ధాత్మ స్వరూప వివేచనమును విడువక యుండుట.

దానమ్

తమ తమ వర్ణాశ్రమ ధర్మములకు భంగము లేకుండగ న్యాయముగ నార్జించిన ధనమును తగురీతిని సత్పాత్రల కాదరముతో సమర్పించుట.

దమః

మనస్సును విషయములపైకి పోకుండునట్లు మాటిమాటికి సావధానముగా మరలించుట నలవరచుకొనుట.

యజ్ఞః

నిత్య నైమిత్తిక కర్మలతోబాటు పంచ మహాయజ్ఞములను ఫలమును కోరక భగవంతుని యారాధన యనెడు బుద్ధితో నాచరించుట.

స్వాధ్యాయః

వేదము కర్మకాండయనియు బ్రహ్మకాండయనియు రెండు విధములు. అందు కర్మకాండ కర్మలనన్నిటిని భగవదారాధన బుద్ధితో నాచరించు రీతిని గూర్చియు, బ్రహ్మకాండ ఆ కర్మలచే నారాధింపబడు భగవంతుని, ఆతనికి సంబంధించిన దివ్యమంగళ విగ్రహమును, దాని గుణములను, దివ్యాత్మగుణములను, నిత్యవిభూతి లీలావిభూతి మొదలగువాటిని గూర్చియు తెలియజేయును, కావున మతాంతరులవలె గాక వేదమంతయు మనకావశ్యకమైనదే యనెడు నిశ్చయముతో దానిని సమగ్రముగ చదువుకొనుట.

తపః

భగవంతునకు ప్రియమైన కర్మలను చేయుటకు వలయు యోగ్యత నిచ్చునట్టి కృచ్ఛ్ర చాన్ద్రాయణ ఏకాదశ్యుపవాసాది శాస్త్రీయ కర్మల నాచరించుచు భోగములను తగ్గించుకొని శరీరమును శుష్కింపజేసుకొనుట.

ఆర్జవమ్

తాను తలంచినట్లే పరులకు చెప్పుట, చెప్పినట్లే తానాచరించుట.

అహింసా

మనోవాక్కాయములతో పరులను పీడించకుండుట.

సత్యమ్

చూచిన దానిని చూచినట్లును ప్రాణికి హితమగునట్లును చెప్పుట.

అక్రోధః

క్రోధమనగా పరులకు పీడను కలిగించువరకును శాంతించనట్టి చిత్తమున జనించు ఉద్రేకము. అది లేకుండుట.

త్యాగః

ఆత్మోద్ధరణ కాటంకమును కలిగించునట్టి పదార్థములను సేకరింప కుండుట.

శాన్తిః

జ్ఞానేంద్రియములను విషయానుభవమునకై పరుగెత్తకుండునట్లరి కట్టుట నభ్యసించుట.

అపైశునమ్

పరుల కనిష్టకరములైన మాటల నితరులతో చెప్పకుండుట.

దయాభూతేషు

దుఃఖించుచున్న నే ప్రాణిని జూచినను సహింపజాలకుండుట.

అలోలప్త్వమ్

కూడని వాటిపై యాశలుడుగుట.

మార్దవమ్

సజ్జనులతో కలసి మెలసి యుండుటకు తగి యుండుట.

హ్రీః

కూడని పనులను చేయుటకు సిగ్గుపడుట.

అచాపలమ్

ఆకర్షకమైన విషయములు చెంతనున్నను వికరించ కుండుట.

తేజః

దుర్జనుల కేవిధముగను లొంగక యుండుట.

క్షమా

పరులు తనను పీడించినను వారిపై తానెంత మాత్రము కోపగించకుండుట

ధృతిః

ఎట్టి కష్టములలోనైనను తన కర్తవ్యమును విడువక జాగరూకుడై యుండుట,

శౌచమ్

కర్మేంద్రియములను జ్ఞానేంద్రియములను దేహమును శాస్త్రోక్త పద్ధతులతో తా నాచరించ వలసిన పనులకు తగిన శుద్ధితోనుంచుట.

అద్రోహః

బలాఢ్యులు దుర్బలులను తమ స్వాధీనముగావించుకొని వారిని స్వేచ్ఛగా తిరుగనీయరు. అది ద్రోహము. దానిని విడువవలయును.

నాతి మానితా

తగని గర్వము లేకుండుట.

ఇట్టి గుణములు కలవారు తప్పక దైవీసంపన్నులగుదురు. దైవీసంపన్నులకీ గుణములుండును.

5. ప్ర. అసురసంపదకు చెందినవారి దురాచార పరంపరలేవి ?

ఉ. భగవదాజ్ఞాపాలనమును బుద్ధితో గాక ధార్మికుల మనిపించుకొన వలెనని ధర్మముల నాచరింతురు.

భోగముల ననుభవించుటచే కలిగిన యానంద పారవశ్యమున శాస్త్రమును తృణీకరించి మంచిచెడ్డ లెఱుంగక సంచరింతురు.

తమ చదువు, వంశము, ఐశ్వర్యము, వీర్యము మొదలగు గుణములకు మించిన గర్వము కలిగియుందురు.

పరులకు బాధను కలిగించువరకు నుపశమించని ఒడలెఱుంగని మనో వికారమును కలిగియుందురు.

సజ్జనుల కాగ్రహమును బుట్టించు స్వభావముతో మెలంగుదురు.

దేవతలలోగల ఉచ్చనీచ భావ మెఱుంగజాలరు. తామాచరించ వలసిన ధర్మములేవియో, పరిత్యజించవలసిన అధర్మములేవియో తెలియ జాలరు. (4శ్లో)

వీరు వేదములలో జెప్పబడిన ఇహలోక సుఖసాధనములగు నట్టియు పరమపురుషార్థమగు మోక్షసాధనములగునట్టియు ధర్మముల నెఱుంగరు (7శ్లో)

వేదోక్తములైన కర్మల నాచరించుటకు అంతఃశుద్ధియు బాహ్య శుద్ధియు నుండ వలెను. అందులకై వేదమున కొన్ని ధర్మములు విధింపబడినవి. వీరు వాటిని పాటింపరు.

ఆ ధర్మములనగా - స్నానసంధ్యావందన, పఞ్చమహాయజ్ఞ, పితృ తర్పణాదులే. అవి వీరికి లేవు.

వీరు వంచన ప్రియులగుటచే తెలిసినది తెలిసినట్లు నుడువరు, పర పీడయే వీరికి జీవ యాత్ర గావున హితముగ మాట్లాడజాలరు.

వీరిలో సత్యభాషణశీలురు గగనకుసుమములే.

(సత్యమనగా తెలిసినది తెలిసినట్లు ప్రాణులకు హితముగా మాట్లాడుట.)

జగత్తు పరమపురుషునిచే నిర్మింపబడుటచే పరమాత్మ దానికి ఆత్మవలె నంతట నంతర్యామిగా నున్నాడని వారెఱుంగరు.

భూమిలో నంతరాత్మగా వ్యాపించి యున్న భగవంతునిచే నీ భూమి యంతయు ధరింపబడియుండి సమస్త పదార్థములను భరించుచున్నదని చెప్పక అది యా భూమి సహజ శక్తి యేయని యందురు.

సత్యసంకల్పుడగు సర్వేశ్వరునిచే నీ ప్రపంచమంతయు నడిపించబడుచున్నదని యంగీకరింపక, ధర్మాదులచేతనో, తమను తామే సర్వేశ్వరులమని భ్రమించు హిరణ్యాదుల వంటి దురభిమానులచేతనో ఆయా సమయములయందు రాజులుగా నుండు చేతన సముదాయము చేతనో నడిపించబడుచున్నరందురు.

నారాయణునికంటె నితరమగు నే దేవత నైనను పరమేశ్వరుడను వారు కూడ నీతరగతిలోని వారే. లోకమున నీశ్వరులుగా పరిగణింపబడు ప్రతి వారికిని యా శక్తిని ప్రసాదించినది భగవంతుడేగదా ! ఇది వీరెఱుంగరు.

స్త్రీ పురుషుల పరస్పర సంబంధముచేతనే మనుష్య పశుపక్ష్యాదులతో నిండిన ప్రపంచము పుట్టుచున్నట్లు మనము ప్రత్యక్షముగా జూచుచున్నాము. ఇందులకై వేరుగ నొక ఈశ్వరుడేల? యని వాదించుచు తీవ్రౌషధమువంటి శాస్త్రము ననాదరించి ప్రతి కల్పమునందును జగత్తును నిర్మించు సర్వేశ్వరుని శిల్పనైపుణ్యమును మరుగుపరచుచున్నారు.

ఇట్లు విపరీత బుద్ధితో కూడినవారై దేహముకంటె వేరగు నాత్మనెఱుంగ జాలక దేహమునే యాత్మగా భావింతురు. తాచెడ్డకోతి వనమెల్ల చెరచెనన్నట్లు ప్రపంచమునంతను చెరుపజూతురు.

ఎప్పటికైనను పొందశక్యముకాని వస్తువుల నాశించి వాటిని బడయుటకై అన్యాయముగ ధనాదుల నార్జించి శాస్త్రోక్త సదాచారములను వీడి తద్విరుద్ధాచరణసక్తులై, దంభదురభిమానములతో నిండియుండి విద్యాధన వంశములలో మమ్ములను మించిన వారు లేరను మదముతో తిరుగుచుందురు.

నేను స్వతంత్రుడను, ఇతరులను నేనే శాసించగలవాడను, నేనదృష్టము చే గాక నా నేర్పుతోనే యీ భోగముల ననుభవించగలుగుచున్నాను. నేను పుట్టుకతోనే జ్ఞానాద్యతిశయసంపన్నుడను, బలవంతుడను, సమస్త సుఖ సంపన్నుడను. (14శ్లో)

నేను సహజముగనే ఐశ్వర్యసంపన్నుడను, ఉత్తమవంశ సంభూతుడను, ఈ లోకమున నావలె తన సామర్థ్యముతో సకల సంపత్తుల నార్జించు వాడెవ్వడున్నాడు? నేనే స్వయముగ యజ్ఞములను, దాన ధర్మముల నాచరింపగలను, వాటవలన లభించు పేరుతో నానందించనూగలను. దీనికి ఈశ్వరాను గ్రహమేల ? అని ఇట్లుజ్ఞాన విమోహితులై త్రుళ్ళుచుందురు. (15శ్లో.)

నేనిదిచెప్పితిని, అది చేసితిని, ఇంకను చేయుదును దీనికొక దేవుని తోడేల ? దీనికొక యదృష్టమేల ? అని యిట్లనేకచిత్త విక్షేపములతో నెగిరి పడుచు అజ్ఞాన మనెడు వలలో తగుల్కొని యెంత యనుభవించినను శాంతించని భోగానుభవములలో తగుల్కొని ఆ యనుభవమైనను పూర్తిగాక మునుపే చనిపోయి ఘోరమగు నరకమున గూలుచున్నారు. (16 శ్లో.)

వీరు తమను తామే మెచ్చుకొందురు. తమకేలోటును లేదని తలంచి ఏ సత్కార్యమునకు గడంగరు, ధనవిద్యాభిజనమదములతో (అభిజనమనగా ఉత్తమవంశమునందు పుట్టుక) కూడినవారై సోమయాజి యనుపించు కొనవలెనని మాత్రము దంభముతో శాస్త్రమునటుంచి తనకు తోచినరీతిగా యజ్ఞములకు గడంగుదురు. (17 శ్లో.)

అహంకార బల దర్ప కామ క్రోధములకు వీరు ముఖ్య స్థానము, (ఇతరుల సహాయము నపేక్షింపక నేనే యన్నిటిని చేయగలననుట యహంకారము. ఏమి చేయ దలంచినను నాకు తోడు నా బలమే యనుట బలము. ఇట్టివాడు వేరొండుగలడా యనుట దర్పము. నేను తలంచిన కానిదేమున్నదనుట కామము. నా కడ్డుపడువానిని బ్రతుకనిత్తునా యనుట క్రోధము.)

ఇట్లు తలంచుచు తనయందును నిఖిల భూతములయందును అంతర్యామిగా నుండి వారిచే నాయా పనులను చేయించుచు నుండు భగవంతుని ద్వేషించుచు కుయుక్తులతో నాతని యునికిని యాక్షేపించుచు నుందురు.

6.ప్ర. ఇట్టి ఆసురులను సర్వేశ్వరుడెట్లు శిక్షించును ?

ఉ. ఇట్లు భగవంతుని విద్వేషించు నరాధములను సర్వేశ్వరు డెల్లప్పుడును పుట్టుక చావులతో నిండియున్న సంసారమున నాకప్పుడైనను సర్వేశ్వరున కనుకూలముగా ప్రవర్తించుట కసంభవమగు శునక ... ...

నీచజన్మలలో పుట్టుటకు తగిన పాపముల యందే ప్రేరేపించదగిన దుర్బుద్ధుల బుట్టించును. వారాబుద్ధికి తగిన పాప ముల నాచరించుచు ఆయా నీచ జన్మల నెత్తుచుందురు. ఇట్లే జన్మపరంపరలనందుచు నంతవంతకు మూఢులగుచు భగవంతుడున్నాడనెడు జ్ఞానమేలేక అంతకంతకు నీచాతి నీచ జన్మలకు పాల్పడుదురు. ఇంతకు మించిన శిక్ష యికనేమి కలదు? (19, 20 శ్లో.)

7.ప్ర. ఆత్మవినాశనమునకు మూలకారణములేవి ? వాటిని విడుచుటచే లభించు ఫలమేమి ?

ఉ. వాస్తవమగు తన యాత్మస్వరూపము నెప్పటికిని పొంద లేకుండుటయే ఆత్మ నాశము. దీనికి మూలకారణము కామము, క్రోధము, లోభము అనునవియే. ఇంతకు మించిన నరకమిక నేమి కలదు ? కామమనగా - దుర్విషయముల ననుభవించినగాని బ్రతుకలేనట్టి మనోవికారమే. అట్టి యనుభవమున కాటంకమును కల్పించిన చేతనుల కనర్థ మొనగూర్చిన గాని శాంతించని మనోవికారమే క్రోధము.

లోభమనగా-తానార్జించిన ధనమును తాననుభవించుటకు గాని, అవసరమైన తరి సత్పాత్రల యందు వినియోగించుటకు గాని యిష్టపడకుండుటయే. ఈ ద్వారములలో నడుగిడినతోడనే నశించియే తీరును.

ఆత్మ వినాశమున కింతకు మించిన ప్రధాన ద్వార మింకొకటి కలదు ఏమనగా

సమస్త మానవులకును సర్వావస్థలయందును హితమును బోధించు గ్రంథమునకు శాస్త్రమని పేరు. అట్టి శాస్త్రము వేదమే. ఈ వేదముల యర్థములను విశదముగా బోధించునవి యగుటచే స్మృతీతిహాస పురాణాగమములు కూడా శాస్త్రములనబడు చున్నవి. ఇవి భగవదాదేశములు. వీటి నుల్లంఘించి తన యిష్టము వచ్చిన రీతిగా సంచరించుట ముఖ్యతమమగు నరక ద్వారము.

ఇట్టివాడు ఐహికసుఖమునుగాని, ఆముష్మిక సుఖమునుగాని బడయజాలడు. ఐహికాముష్మిక ఫలముల నొసంగు నధికారి శ్రియఃపతియే గదా! అవి యాతని యనుగ్రహము చేతనే బడయదగినవి. తన యాజ్ఞనుల్లంఘించు చెనటిపట్ల యాతని కనుగ్రహమెట్లుండును ? కనుక నాసురస్వభావము కలవానికిక సుఖముకల్లయే.

ఇట్టి భగవన్నిగ్రహమునకు పాత్రులను గావించునట్టి కామ క్రోధ లోభములను దూరముగా విడిచి భగవదనుగ్రహ పాత్రునిగా చేయునట్టి యాతని యాజ్ఞయగు శాస్త్రమర్యాదల ననుసరించి జాగరూకతతో ప్రవర్తించినచో భగవంతుని, యాతని విభూతులతో చక్కగా నెఱింగినవాడై యాతని యనుగ్రహమునకు పాత్రుడగును. అట్టివానికిక పరమపురుషుని సాయుజ్యము పిత్రార్జిత ధనమే గదా !

8. ప్ర. ఈ యధ్యాయ ప్రధానార్థ మేది ?

ఉ. ఆత్మోజ్జీవనము నభిలషించు వివేకికి కర్తవ్యాకర్తవ్యములను బోధించు సాధనములు వేదములు, వాని యర్థమును విశదీకరించు స్మృతీతిహాస పురాణాగమములున్ను, పెద్దల ఆచారములునునయియున్నవి. వీటిచే పురుషోత్తముడగు శ్రీమన్నారాయణుడే పరతత్త్వమనియు అతడు ప్రసన్నుడై నిరతిశయ పురుషార్థమగు తన సాయుజ్యమును ప్రసాదించుటకు సాధనమాతని కైంకర్యబుద్ధితో గావింపబడిన పై శాస్త్రములచే తెలుపబడిన వర్ణాశ్రమానుగుణమైన కర్మయేయనియు లెస్సగానెఱింగి దానిని గీటువాసియైనను తప్పక చేయుచుండవలయును. ఇట్టివాని కచిర కాలముననే భగవదనుగ్రహముచే పరమ పురుషార్థరూపమగు మోక్షము కరతలామలకము కాగలదు. ఇదియే యీ యధ్యాయ ప్రధానార్థము.

సప్తదశాధ్యాయార్థ సంగ్రహము

శ్లో. అశాస్త్ర మాసురం కృత్స్నం
శాస్త్రీయం గుణతః పృథక్ ।
లక్షణం శాస్త్రసిద్ధస్య
త్రిధా సప్తదశోదితమ్ ॥

అర్థము : అశాస్త్రం = శాస్త్రమునందు చెప్పబడని, కృత్స్నం = సమస్తమున్ను, ఆసురం= ఆసుర ప్రకృతికి సంబంధించినది, (భవతి = అగుచున్నది) శాస్త్రీయం = శాస్త్రమునందు చెప్పబడినకర్మ, గుణతః = సత్త్వాది గుణములనుబట్టి, పృథక్ = వేరువేరుగా (భవతి = అగుచున్నది) శాస్త్రసిద్ధస్య = శాస్త్రముచే సిద్ధమగు కర్మకు, త్రిధా = మూడువిధములగు, లక్షణం = లక్షణము (అస్తి ఇతి = కలదని) సప్తదశోదితం = పదునేడవ యధ్యాయమున చెప్పబడినది.

తా॥ శాస్త్రమునందు చెప్పబడని కర్మలన్నియు ఆసురములగుటచే నిష్ఫలము లనియు, శాస్త్రోక్తమగు కర్మలు సత్త్వాది గుణములను బట్టి మూడు విధములనియు, అవియే "ఓమ్, తత్, సత్" అని మూడు విధములైన లక్షణములుకలవనియు, నీ పదునేడవ యధ్యాయమున జెప్పబడెను.

శ్రీమద్భగవద్గీత – సప్తదశాధ్యాయము

విషయ సూచిక

శ్లోక సంఖ్య.

శ్రీ హయగ్రీవాయ నమః

శ్రీ భగవద్గీతా – సప్తదశోఽధ్యాయః

శ్రద్ధాత్రయ విభాగ యోగః

అవ. శాస్త్రములో జెప్పబడని కర్మ నిష్ఫలమని యెఱుంగక యర్జునుడు శాస్త్రమున విధింపబడని యాగాదులను శ్రద్ధతోజేయువానికి కలుగు ఫలము సాత్త్వికమా? రాజసమా? తామసమా? యని ప్రశ్నించుచున్నాడు

అర్జున ఉవాచ = అర్జునుడు పలికెను.

1. శ్లో. యే శాస్త్రవిధి ముత్సృజ్య । యజన్తే శ్రద్ధయాఽన్వితాః ॥
తేషాం నిష్ఠాతు కా కృష్ణ ! । సత్త్వమాహో ! రజస్తమః ॥

అర్థము : హేకృష్ణ! = ఓ శ్రీకృష్ణా! యే = ఎవరు, శాస్త్రవిధిం = వేదవిధిని, ఉత్సృజ్య = విడచి, శ్రద్ధయా = శ్రద్ధతో, అన్వితాః = కూడు కొనినవారై, యజన్తే= యాగాదులు చేయుచున్నారో, తేషాం = వారియొక్క, నిష్ఠాతు = నిష్ఠఅయితే, కా = ఏది? (కిం) సత్త్వం = సత్త్వమా? అహో = లేక, (కిం) రజః = రజస్సా (కిం) తమః = తమస్సా?

తా॥ ఓ కృష్ణా ! శాస్త్రవిధిని విడిచి కడుంగడు శ్రద్ధతో యజ్ఞాదులను చేయువారి స్థితి సత్త్వమునందా? రజస్సునందా? తమస్సునందా? ఎఱింగింపుము.

అవ. ఇట్టి శ్రద్ధయు, దానితో జేయబడు యాగాదులును నిష్ఫలములని మీద చెప్పదలంచి, మునుముందుగా శాస్త్రీయమైన యాగాదులే గుణములనుబట్టి మూడు విధములై యుండునని చెప్పుటకై మొదట శాస్త్రీయమైన శ్రద్ధ మూడువిధములగుటను జెప్పుచున్నాడు.

శ్రీ భగవాన్ ఉవాచ

2. శ్లో. త్రివిధా భవతి శ్రద్ధా ! దేహినాం సా స్వభావజా ।
స్వాత్త్వికీ రాజసీ చైవ ! తామసీ చేతి తాం శృణు ।

అర్థము : దేహినాం = జీవులయొక్క, శ్రద్ధా = శ్రద్ధ, స్వభావజా = ప్రాచీనవాసనచే పుట్టునట్టి రుచిచేకలిగినది, భవతి = అగుచున్నది, సా= ఆ శ్రద్ధ, సాత్వికీ = సాత్త్వికశ్రద్ధ యనియు, రాజసీ చ ఏవ=రాజసశ్రద్ధయనియు, తామసీ ఇతి చ=తామస

శ్రద్ధయనియు, త్రివిధా=మూడు విధములుగా, (భవతి = అగుచున్నది) తాం = దానిని, శృణు = వినుము.

తా॥ అందరకును శ్రద్ధ మూడు విధములు. అది స్వభావమువలన బుట్టును. స్వభావమనగా ప్రాచీన వాసనవలన బుట్టు రుచి విశేషము. అనగా సత్త్వాది గుణముల వలన వాసనయు, వాసనవలన రుచియు, రుచి వలన శ్రద్ధయు జనించును. శ్రద్ధయనగా అభిమత ఫలసాధనమునందలి విశ్వాసయుతమగు త్వర. ఈ శ్రద్ధయే సాత్త్వికి, రాజసి, తామసియని మూడు విధములు, ఆ శ్రద్ధకేది స్వభావమో దానిని చెప్పెదను వినుము.
వాసన యనగా అబుద్ధిపూర్వకమగు ప్రవృత్తి.
రుచి యనగా బుద్ధిపూర్వకమగు ప్రవృత్తి.

3.శ్లో. సత్త్వానురూపా సర్వస్య । శ్రద్ధా భవతి భారత ! ।
శ్రద్ధామయోఽ యం పురుషో । యో యచ్ఛ్రద్ధ స్స ఏవ సః ॥

అర్థము : భారత!=అర్జునా! సర్వస్య=అందరకును, సత్త్వానురూపా=అంతఃకరణమునకు తగిన, శ్రద్ధా = శ్రద్ధ, భవతి = కలుగుచున్నది, అయం = ఈ, పురుషః పురుషుడు, శ్రద్ధామయః = శ్రద్ధయొక్క పరిణామమైనవాడు, యః=ఎవడు, యత్ శ్రద్ధః = ఎట్టి శ్రద్ధకలవాడో, సః = వాడు, సః ఏవ = ఆ శ్రద్ధయొక్క పరిణామమే. (భవతి= అగుచున్నాడు.)

తా॥ ప్రతి పురుషునకును అంతఃకరణమెట్టి గుణము కలదగునో అట్టి గుణములను గురించిన శ్రద్ధయే జనించును. పుణ్యకర్మలయందు శ్రద్ధకల వాడగునేని పుణ్యకర్మల ఫలముతో గూడియుండును. పాపకర్మల యందు శ్రద్ధకలవాడేని పాపకర్మఫలముతో గూడి యుండును. అనగా శ్రద్ధ యెట్టిదో అట్టి ఫలము కలుగును. ఇట్లు ఫలములకు శ్రద్ధయే ప్రధానము గాన పురుషుడు శ్రద్ధా పరిణామమని చెప్పబడుచున్నాడు.

అవ. సత్త్వాదిగుణములు పెరిగి తమ కనురూపమైన విషయములయందు శ్రద్ధను పుట్టించుచున్నవి. ఆ శ్రద్ధపై యాధారపడియే తమ కభీష్టమైనవారి నారాధించి అందులకు తగిన ఫలవిశేషములను లభించుచుందురని చెప్పుచున్నాడు.

4. శ్లో. యజన్తే సాత్త్వికా దేవాన్ । యక్షరక్షాంసి రాజసాః ।
ప్రేతాన్ భూతగణాం శ్చాన్యే । యజన్తే తామసా జనాః ॥

అర్థము : సాత్త్వికాః = సాత్త్విక శ్రద్ధకలవారు, దేవాన్ = దేవతలను, యజన్తే = పూజించుచున్నారు, రాజసాః = రాజసశ్రద్ధకలవారు, యక్షరక్షాంసి = యక్షులను

రాక్షసులను, (యజన్తే= పూజించు చున్నారు.) తామసాః = తామస శ్రద్ధగలవారగు, అన్యే జనాః = ఇతరజనులు, ప్రేతాన్ = ప్రేతములను, భూతగణాన్ = భూత గణములను, యజన్తే = పూజించుచున్నారు.

తా॥ సత్త్వగుణప్రచురులు సాత్త్విక శ్రద్ధకలవారై దేవతలను బూజింతురు. దానివలన వారికి ఉత్కృష్టమైన సుఖము కలుగును. రజోగుణాధిక్యముచే రాజస శ్రద్ధకలవారై యక్షరక్షోగణముల నారాధించి దుఃఖమిశ్రితమైన అల్పసుఖమును బడయుదురు. తమోగుణాధిక్యముచే తామస శ్రద్ధకలవారై భూత ప్రేతగణముల నారాధించి దుఃఖ ప్రాయమైన అత్యల్ప సుఖమును బడయుదురు.

అవ. ఇట్లు శ్రద్ధతోగావించిన శాస్త్రీయకర్మలకే ఆయా గుణానుగుణముగ ఫలము కలుగునుగాని అశాస్త్రీయమైనకర్మల నెంతశ్రద్ధతోజేసినను భగవన్ని యమమునకు విపరీతములైనవి యగుటచే సుఖలేశ మైనను కలుగనేరదని చెప్పుచున్నాడు.

5. శ్లో. అశాస్త్ర విహితం ఘోరం। తప్యన్తే యే తపో జనాః।
దమ్భాహఙ్కార సంయుక్తాః। కామరాగ బలాన్వితాః।

అర్థము : యే జనాః = ఏ జనులు, దమ్భాహఙ్కారసంయుక్తాః = దంభముతోను అహంకారముతోను గూడినవారును, కామరాగబలాన్వితాః =కామరాగములవలన కలిగిన బలముతో గూడిన వారును అయి, అశాస్త్రవిహితం = శాస్త్రమున జెప్పబడని, ఘోరం = మిక్కిలి శ్రమను కలుగజేయు, తపః = తపస్సును, తప్యన్తే = ఆచరించుచున్నారో.
(దీనికి ముందుశ్లోముతో నన్వయము)

తా॥ ఎవరు దంభాహంకారములతోను, కామరాగములచే జనించునట్టి యసాత్త్విక బలముతోను గూడినవారై మిక్కిలి ఆయాసకరములైన శాస్త్రమున జెప్పబడని తపో యాగాదులనుజేయుచున్నారో (వారుసురస్వభావులని యెఱుంగుము.)

అవ. వారింకను నెట్టివారై యాకర్మల నాచరించుచున్నారో చెప్పుచున్నాడు.

6. శ్లో. కర్శయన్త శ్శరీరస్థం। భూతగ్రామ మచేతసః।
మాంచైవాన్త శ్శరీరస్థం। తాన్విద్ధ్యాసుర నిశ్చయాన్॥

అర్థము : అచేతసః = వివేకహీనులై, శరీరస్థం = (తన) శరీరమునందున్న, భూతగ్రామం = పృథివ్యాధి భూతజాతమునున్ను, అన్తశ్శరీరస్థం = లోపలి శరీరమందున్న, మాంచ

ఏవ = (నాయంశయగు) జీవునిన్ని, కర్శయన్తః = కృశింపజేయుచున్నవారై, (అశాస్త్రవిహితం ఘోరం తప్యన్తే) తాన్ = వారిని, ఆసురనిశ్చయాన్ = ఆసురుల యొక్క నిశ్చయమువంటి నిశ్చయముకలవారినిగా, విద్ధి = తెలిసికొనుము.

తా॥ వారింకను, వివేకహీనులై శరీరమునందున్న పృథివ్యాది భూతజాతమును వ్యర్థోపవాసాదులచే గృశింపజేయుచు, అందున్న జీవాత్మను క్లేశపరచుచు శాస్త్రసమ్మతములుగానట్టి శ్రమకరమగు తపో యాగాదుల గావించువారై నా యాజ్ఞకు విపరీతముగా వర్తించు వారగుటచే వారికి సుఖము లేశమైనను గలుగదు సరిగదా మిక్కిలి యనర్థములకు బాల్పడుదురు.

అవ. ఇంతవరకు గుణములనుబట్టి శ్రద్ధయందుకలుగు ఫలభేదములను జెప్పి ఇప్పుడు శాస్త్రీయములైన యజ్ఞాదులందును గుణభేదములనుబట్టి ఫలభేదము కలుగునని విస్తరించి చెప్పుచున్నాడు. అందుముఖ్యముగా నాహారమును బట్టియే సత్త్వాదులు వృద్ధినొందునుగాన మొదట ఆహారమునందుగల మూడు విధములను జెప్పుచున్నాడు.

7.శ్లో. ఆహార స్త్వపి సర్వస్య । త్రివిధో భవతి ప్రియః ।
యజ్ఞ స్తప స్తథా దానం । తేషాం భేద మిమం శృణు ॥

అర్థము : సర్వస్యతు = సకలప్రాణులకును, ఆహారః అపి = ఆహారము కూడ, త్రివిధః = సత్త్వాదులనుబట్టి మూడువిధములైనదై, ప్రియః= ఇష్టమైనది, భవతి = అగుచున్నది. యజ్ఞః=యజ్ఞము, తపః = తపస్సు, దానంచ = దానమున్ను, తథా= అట్లే (మూడు విధములైనవి, భవన్తి = అగుచున్నవి) తేషాం = ఆయాహారయజ్ఞతపో దానముల యొక్క, ఇమం = ఈ, భేదం = సత్త్వాదిభేదమును, శృణు = వినుము.

తా॥ సకల ప్రాణి సమూహమునకును ఆహారముకూడ సత్త్వాది గుణత్రయ సంబంధమునుబట్టి మూడు విధములుగా నిష్టమగు చుండును. అట్లే తపో దానములున్ను ఆ మూడు గుణములనుబట్టియే మూడు విధము లుగనుండును. ఆ భేదములనిచ్చట విస్తరముగచెప్పుచున్నాను వినుము.

అవ. సాత్త్వికాహారమును జెప్పుచున్నాడు. (ఈ యాహారములనే భుజించుటచే సత్త్వగుణమును వృద్ధిపొందును లేక సాత్త్వికునకిట్టి యాహారమిష్టమగునుగాన దీనినిబట్టి సత్త్వగుణాభివృద్ధి నెఱుంగవచ్చును.)

8.శ్లో. ఆయు స్సత్త్వబలారోగ్య । సుఖప్రీతి వివర్ధనాః ।
రస్యా స్స్నిగ్ధా స్స్థిరాహృద్యా । ఆహారా స్సాత్త్విక ప్రియాః ॥

అర్థము : ఆయు, స్సత్త్వ, బలా, రోగ్య, సుఖ, ప్రీతి, వివర్ధనాః = ఆయుస్సును, జ్ఞానమును,

బలమును, ఆరోగ్యమును, సుఖమును, ప్రీతిని వృద్ధిపొందించునవియు, రస్యాః= మధురరసముకలవియు, స్నిగ్ధాః = చమురుగలవియు, స్థిరాః = స్థిరముగు ధాతుపరిణామమును గలిగించునవియు, హృద్యాః = మనోహరములైనవియునగు, ఆహారాః = ఆహారములు, సాత్త్వికప్రియాః = సత్త్వగుణనిష్ఠులకిష్టమైనవి.

తా॥ సాత్త్వికునకు సాత్త్వికాహారములే యిష్టమగును, ఆ యాహారములు ఆయువును పెంచును, జ్ఞానమును వృద్ధి పొందించును, బలమును బెంచును, ఆరోగ్యమును వృద్ధిజేయును, సుఖమునిచ్చును, ఆనందము నొసంగు కార్యములనుచేయించి ప్రీతినివృద్ధి బొందించును, ఆహారములు జీర్ణమగునప్పుడు సుఖమునొసంగును, తినబడిన ఆహారము రక్తమాంసాది సప్త ధాతువులుగా పరిణమించి అవి చిరకాలముండునట్లు జేయును. చూచినంతనే వాటియందు ప్రీతిని బుట్టించు నదియై యుండును. మధుర రసముతో గూడినదై యుండును. జిడ్డు గలిగియుండును.

అవ. రాజసాహారమును తెలుపుచున్నాడు. (ఈ యాహారమును భుజించినచో రజో గుణము వృద్ధిపొందును, రాజసున కిట్టియాహార మిష్ట మగును గాన దీనినిబట్టిరజోగుణాభివృద్ధి నెఱుంగదగును.)

9. శ్లో. కట్వామ్ల లవణాత్యుష్ణ । తీక్ష్ణ రూక్ష విదాహినః ।
ఆహారా రాజస స్యేష్టాః । దుఃఖశోకామయ ప్రదాః ॥

అర్థము : కట్వమ్లలవణాత్యుష్ణ తీక్ష్ణరూక్షవిదాహినః - కటు = కారముగాను, ఆమ్ల = పుల్లగాను, అతిలవణ = మిక్కిలి యుప్పగాను, (అతి) ఉష్ణ = మిక్కిలి వేడిగాను, (అతి) తీక్ష్ణ= తినినక్షణము నుండియు ప్రతికూలించునవిగాను, రూక్ష = శోషకరముగాను, విదాహినః= మిక్కిలి దాహమును బుట్టించునవిగాను నుండునట్టి, ఆహారాః = ఆహారములు, రాజసస్య = రజోగుణమధికముగా కలవానికి, ఇష్టాః = ఇష్టములై, దుఃఖశోకామయ ప్రదాః - దుఃఖ = కష్టమును, శోక = పశ్చాత్తాపమును, ఆమయ= రోగమును, ప్రదాః = కలుగజేయునవి (భవన్తి = అగుచున్నవి).

తా॥ కారము (లేకచేదు)గాను, పుల్లగాను, మిక్కిలి యుప్పగాను, మిక్కిలి వేడిగాను, తినినక్షణమునుండియు జలుబు వేడి మొదలగు దోషములను బుట్టించి ప్రతికూలించునట్టివిగాను, వాతమును వృద్ధిపొందించి శోషింప జేయునవిగాను, పైత్యమును వృద్ధిపొందించి తాపముతోపాటు

విదాహమును బుట్టించునవిగాను నుండెడి యాహారములు రజోగుణ ప్రధానుల కిష్టములగును. ఇవి రజోగుణవృద్ధిని బొందించి ధాతు వైషమ్యముద్వారా శరీరమునకు దుఃఖమును, పశ్చాత్తాపాదులచే మనోవ్యాకులతను, కాలక్రమమున రోగమును కలుగజేయును.

అవ. తామసాహారమును దెలుపుచున్నాడు. (ఈ యాహారమును భుజించినచో తమోగుణము వృద్ధిపొందును, తామసుల కిట్టియాహార మిష్టమగును గాన దీనినిబట్టి తమోగుణాభివృద్ధి నెఱుంగదగును.)

10. శ్లో. యాతయామం గతరసం । పూతి పర్యుషితం చ యత్ ।
ఉచ్ఛిష్ట మపి చామేధ్యం । భోజనం తామస ప్రియమ్ ॥

అర్థము : యాతయామం = చిరకాలమున్నదియు, గతరసం = సహజరుచిని విడిచినదియు, పూతి = దుర్గంధము కలదియు, పర్యుషితం చ = పాసినదియు, ఉచ్ఛిష్టం అపి= ఇతరులు భుజింపగా మిగిలినదియు, అమేధ్యం = అపవిత్రమైనదియునగు, యత్ భోజనం = ఏ యాహారము, (అస్తి = కలదో, తత్ = అది) తామసప్రియం= తమోగుణ స్వభావముగలవారికి యిష్టమైనది (భవతి = అగుచున్నది).

తా॥ వండినపిమ్మట చాలకాల ముంచబడినదియు, సహజమగు రుచిని విడిచినదియు, దుర్గంధము కలదియు, ప్రాతబడిరుచిమారి పాసినదియు, గురువులు, పెద్ద యన్న, భర్తగాక ఇతరులు భుజించగా మిగిలినదియు, భగవంతునకు భగవద్భక్తులకు నివేదింపతగనిదియు, నివేదింపబడనిది యునగు నాహారము, ఇది తమోగుణమును వృద్ధిపొందించును. తామసుల కిట్టి యాహారమిష్టమగును.

— గమనిక —

హితమును కోరువారు సత్త్వగుణాభివృద్ధికొఱకు రాజస తామసాహారములను విడిచి సాత్త్వికాహారమునే సేవించవలెను.

అవ. గుణభేదముచే కలుగు యజ్ఞభేదములను చెప్పబూని ముందుగా సాత్త్వికయజ్ఞ మెట్టిదియో చెప్పుచున్నాడు.

11. శ్లో. అఫలాకాఙ్క్షిభిర్యజ్ఞో । విధిదృష్టో య ఇజ్యతే ।
యష్టవ్యమేవేతి మనః । స్సమాధాయ స సాత్త్వికః ॥

అర్థము : యష్టవ్యం ఏవ ఇతి = తప్పక చేయవలసినదియే యని, మనః = మనస్సును,

సమాధాయ = నిశ్చలముగా జేసుకొని, విధిదృష్టః = శాస్త్రముచే నియమింపబడిన, యః యజ్ఞః = ఏ యజ్ఞము, అఫలాకాఙ్క్షిభిః = ఫలమును గోఱనివారిచేత. ఇజ్యతే= యజింప బడుచున్నదో, సః = ఆ యజ్ఞము, సాత్త్వికః = సాత్త్వికమైనది (భవతి= అగుచున్నది.)

తా॥ భగవదారాధన రూపముగను, చేయుటయే ప్రయోజనముగను "నాకిది తప్పక చేయవలసినది" యనెడు మనోనిశ్చయముతోను, భగవత్ప్రీతి మాత్రమే ఫలమనియెంచి శాస్త్రోక్తమైన మంత్ర క్రియాద్రవ్యములతో గూడినట్లు చేయబడు యజ్ఞము సాత్త్విక మనబడును.

అవ. రాజసయజ్ఞ మెట్టిదియో జెప్పుచున్నాడు.

12. శ్లో. అభిసన్ధాయ తు ఫలం । దమ్భార్థ మపి చైవ యత్ ।
ఇజ్యతే భరతశ్రేష్ఠ ! తం యజ్ఞం విద్ధి రాజసమ్ ॥

అర్థము : భరతశ్రేష్ఠ=ఓ యర్జునా!, యః=ఏ యజ్ఞము, ఫలం=ఫలమును, అభిసన్ధాయ=కోరి, దమ్భార్థం అపిచ = గొప్ప వాడనిపించుకొనుట కొఱకును. ఇజ్యతే = యజింపబడుచున్నదో, తం=దానిని, రాజసం యజ్ఞం =రాజసమైన యజ్ఞముగా, విద్ధి =ఎఱుంగుము.

తా॥ అర్జునా ! ఫలాపేక్షతో కీర్తికొఱకు ఆడంబరముతో చేయబడు యజ్ఞము రాజస మనబడును.

అవ. తామసయజ్ఞమెట్టిదో జెప్పుచున్నాడు.

13. శ్లో. విధిహీన మసృష్టాన్నం । మన్త్రహీన మదక్షిణమ్ ।
శ్రద్ధావిరహితం యజ్ఞం । తామసం పరిచక్షతే ।

అర్థము : విధిహీనం = బ్రాహ్మణుల యనుజ్ఞలేనిదియు, అసృష్టాన్నం = అశాస్త్రీయమైన పదార్థములు కలదియు, మన్త్రహీనం = మంత్రములు లేనిదియు, అదక్షిణం = దక్షిణలనీయక చేయబడినదియు, శ్రద్ధావిరహితం = శ్రద్ధలేక చేయబడినదియునగు, యజ్ఞం = యజ్ఞమును, తామసం = తామసమునుగా, పరిచక్షతే = చెప్పుచున్నారు.

తా॥ సదాచారపరులగు విద్వాంసులైన బ్రాహ్మణులచే 'యజింపు' మని యనుజ్ఞ నొసంగబడనిదియు, అశాస్త్రీయములైన వస్తువులతో చేయబడినదియు, మంత్రలోపము గలదియు, ఋత్విక్కులకు దక్షిణలనీయక యశ్రద్ధతో జేయబడినదియునగు యజ్ఞము తామస మనబడును.

అవ. తపస్సు సత్త్వాది గుణములనుబట్టి మూడు విధములని చెప్పబూని ముందుగా శరీరవాఙ్మనస్సులవలన బుట్టుటనుబట్టి యా తపస్సు మూడు విధములని చెప్పుచున్నాడు. అందు ముందుగా శారీర తపస్సును గూర్చి చెప్పుచున్నాడు.

14. శ్లో. దేవద్విజ గురుప్రాజ్ఞ । పూజనం శౌచ మార్జవమ్ ।
బ్రహ్మచర్య మహింసా చ । శారీరం తప ఉచ్యతే ॥

అర్థము : దేవద్విజ గురు ప్రాజ్ఞ పూజనం -దేవ = దేవతలను, ద్విజ = బ్రాహ్మణులను గురు= ఆచార్యులను, ప్రాజ్ఞ = జ్ఞానులను, పూజనం = పూజించుటయు, శౌచం= పుణ్య నదీ స్నానాది శుద్ధియును, ఆర్జవం =మనస్సు శరీరముల కేకరూపమైన నడవడికయు, బ్రహ్మచర్యం = బ్రహ్మ చర్యమును, అహింసాచ = ఏ ప్రాణిని హింసించకుండుటయు, శారీరం = శరీరసంబంధమైన, తపః = తపస్సని, ఉచ్యతే= చెప్పబడుచున్నది.

తా॥ దేవతల నర్చించుట, బ్రాహ్మణుల నారాధించుట, గురుశుశ్రూష జేయుట, ప్రాజ్ఞుల సన్మానించుట, పుణ్యనదులలో గ్రుంకుట, మనస్సున తలచినట్లే శరీరముతో నాచరించుట, పరస్త్రీలను భోగ్యతా బుద్ధితో జూచుట, రహస్యముగా వారితో మాట్లాడుట మొదలైనవి చేయకుండుట, ప్రాణలకు హింసను కలుగజేయకుండుట మొదలగునవి యన్నియు శరీరసంబంధమైన తపస్సులుగా జెప్పబడుచున్నవి.

అవ. వాఙ్మయ తపస్సును జెప్పుచున్నాడు

15. శ్లో. అనుద్వేగకరం వాక్యం । సత్యం ప్రియహితం చ యత్ ।
స్వాధ్యాయాభ్యసనం చైవ । వాఙ్మయం తప ఉచ్యతే ॥

అర్థము : అనుద్వేగకరం = పరులకు దుఃఖమును కలుగజేయనట్టియు, సత్యం = యదార్థమైనట్టియు, ప్రియహితంచ = ఇష్టమును హితము నైనదియు, యత్ వాక్యం = ఏ వాక్యముకలదో, (అదియును) స్వాధ్యాయాభ్యసనంచ ఏవ = వేదము నభ్యసించుటయును, వాఙ్మయం = వాగ్రూపమైన, తపః = తపస్సుగా, ఉచ్యతే = చెప్పబడుచున్నది.

తా॥ ఇతరులకు బాధను కలిగించకుండగ యదార్థముగను, ప్రియము గను, హితముగను మాట్లాడుటయు, వేదము నభ్యసించుటయు, (అష్టాక్షరీ

మొదలగు ఉత్తమ మంత్రములను జపించుటయు) వాచిక తపస్సుగా జెప్పబడుచున్నది.
(ఇచ్చట సంస్కృత వేదమును చదువుట కధికారము లేనివారు ద్రావిడ వేదము, స్తోత్రములు మొదలగువాటిని పెద్దలవలన ఉపదేశమును పొంది చదువుకొనవచ్చునని తెలియవలెను.)

అవ. మానస తపస్సు చెప్పబడుచున్నది

16.శ్లో. మనః ప్రసాద స్సౌమ్యత్వం । మౌన మాత్మవినిగ్రహః ।
భావ సంశుద్ధి రిత్యేత త్తపో । మానస ముచ్యతే ॥

అర్థము : మనః ప్రసాదః = మనస్సుయొక్క నిర్మలత్వమును, సౌమ్యత్వం = మనస్సుతో పరసమృద్ధిని కోరుటయు, మౌనం = మనసుతో వాగింద్రియమును బంధించియుండుటయు, ఆత్మవినిగ్రహః = ధ్యేయవస్తువునందు మనస్సును నిలుపుటయు, భావసంశుద్ధిః ఆత్మేతరములను తలంచకుండుటయు, ఇతి ఏతత్ = అనునిది యంతయు, మానసం = మనస్సుతో నిర్వహింపబడు, తపః= తపస్సుగా, ఉచ్యతే = చెప్పబడుచున్నది.

తా॥ మనస్సున క్రోధాదులు లేకుండుట, పరులసమృద్ధి యందాసక్తి, వాగింద్రియమును యథేష్టముగా సంచరింపనీయక నియమించి మితముగా భాషించుట, ధ్యేయవస్తువునందు మనస్సును నిలుపుట, ఆత్మకంటె వేరైన యే వస్తువులనుగాని చింతింపకుండుట యను నివి యన్నియు మానసిక తపస్సనబడును.

అవ. ఇక సాత్త్విక తప స్సెట్టిదియో తెలుపుచున్నాడు

17. శ్లో. శ్రద్ధయా పరయా తప్తం । తపస్త త్త్రివిధం నరైః ।
అఫలాకాఙ్క్షిభిర్యుక్తై । స్సాత్త్వికం పరిచక్షతే ॥

అర్థము : అఫలాకాఙ్క్షిభిః = ఫలాపేక్షలేనట్టియు, యుక్తైః = భగవదారాధన బుద్ధితో కూడినట్టి వారునునగు, నరైః = మనుష్యులచేత, పరయా = గొప్పదియగు, శ్రద్ధయా= విశ్వాసముతో, తప్తం = చేయబడిన, తపః = తపస్సును, సాత్త్వికం = సాత్త్వికమునుగా, పరిచక్షతే = చెప్పుచున్నారు.

తా॥ ఫలాపేక్షలేక పరమపురుషుని యారాధన యనెడు బుద్ధితో మిక్కిలి శ్రద్ధగా నాచరింపబడు కాయిక వాచిక మానసిక తపస్సులు సాత్త్వికములనబడును

అవ. రాజస తపస్సెట్టిదియో తెలుపుచున్నాడు

18. శ్లో. సత్కారమాన పూజార్థం । తపో దమ్భేన చైవ యత్ ।
క్రియతే తదిహ ప్రోక్తం । రాజసం చల మధ్రువమ్ ॥

అర్థము : సత్కారమానపూజార్థం – సత్కార = ఇతరులు మనస్సులో తనను గొప్పవాడుగా తలంచుటకొఱకును, మాన = తనను నోటితో పొగడుట కొఱకును, పూజార్థం= శరీరముతో తనకు నమస్కరించుట కొఱకును, దమ్భేన చ ఏవ = దంభముతోను, యత్ = ఏ, తపః = తపస్సు, క్రియతే = చేయబడుచున్నదో, చలం = చంచలమైనదియు, అధ్రువం = స్థిరముకానిదియునగు, తత్ = ఆ తపస్సు, ఇహ= ఇచ్చట, రాజసం = రాజసమని, ప్రోక్తం = చెప్పబడినది.

తా ॥ మనుస్సులో గొప్పవాడని భావించుట సత్కారము, వాక్కుతో పొగడుట మానము. శరీరముతో నమస్కరించుట పూజ. ఇవి తనకు గలుగవలెనని దంభముతో నాచరింపబడు తపస్సు రాజసమనబడును. అది యస్థిరమగు స్వర్గాది ఫలసాధనమగుటచే నస్థిరమైనదియు, క్షయించునదియునగును.

అవ. తామస తపస్సెట్టిదో తెలపుచున్నాడు.

19. శ్లో. మూఢగ్రాహే ణాత్మనో య । త్పీడయా క్రియతే తపః ।
పరస్యోత్సాదనార్థం వా । తత్తామస ముదాహృతమ్ ॥

అర్థము : మూఢ గ్రాహేణ = అవివేకము చేతనైన పట్టుదలతోడను, ఆత్మనః = తన యొక్క పీడయా = శరీరకష్టముతోను, పరస్య = ఇతరునియొక్క, ఉత్సాదనార్థం వా = నాశము కొఱకును, యత్ = ఏ, తపః = తపస్సు, క్రియతే =చేయబడుచున్నదో, తత్ =ఆ తపస్సు, తామసం= తమోగుణసంబంధమైనదని, ఉదాహృతం= చెప్పబడినది.

తా॥ అవివేకులు మొండిపట్టుదలతో తను శక్తి మొదలగువాటి నాలోచింపక తన శరీరమును వ్యర్థోపవాసాదులచే కృశింపజేసుకొనుచు నితరుల వినాశము కొఱకు ఆచరించు తపస్సు తామస మనబడును.

అవ. సాత్త్వికదాన మెట్టిదియో తెలుపుచున్నాడు.

20. శ్లో. దాతవ్యమితి యద్దానం । దీయతేఽనుపకారిణే ।
దేశే కాలే చ పాత్రే చ । తద్దానం సాత్త్వికం స్మృతమ్ ॥

అర్థము : దేశే = పుణ్యక్షేత్రముందును, కాలే చ = పుణ్య కాలముందును, పాత్రేచ =

సత్పాత్రేయందును, అనుపకారిణే = ప్రత్యుపకారము చేయలేనివానికొఱకు, యత్ దానం = ఏ దానము, దాతవ్యం ఇతి = ఈయవలసినదియేయని, దీయతే= ఇయ్యబడుచున్నదో, తద్దానం = ఆ దానము. సాత్త్వికం = సత్త్వ గుణసంబంధమైనదని, స్మృతం = తలంచబడుచున్నది.

తా॥ దానమునకు తగినవిగా శాస్త్రమున జెప్పబడిన పుణ్యదేశ పుణ్యకాలములలో ప్రత్యుపకార మొకింతయును చేయజాలని సత్పురుషునకు ఫలమును కోరక నీయబడు దానము సాత్త్విక మనబడును.

అవ. రాజస దాన మెట్టిదో చెప్పుచున్నాడు.

21. శ్లో. యత్తు ప్రత్యుపకారార్థం । ఫల ముద్దిశ్య వా పునః ।
దీయతే చ పరిక్లిష్టం । త ద్రాజస ముదాహృతమ్ ।

అర్థము : యత్ తు = ఏదానమైతే, ప్రత్యుపకారార్థం = తిరిగి ఉపకారమును పొందుటకొఱకును, పునః = తిరిగి, ఫలం = ఫలమును, ఉద్దిశ్య = ఆశించియు, పరిక్లిష్టం = మనస్సున బాధపడుచు, దీయతే = ఈయబడుచున్నదో, తత్ = ఆ దానము, రాజసం = రాజసమని, ఉదాహృతం = చెప్పబడినది.

తా॥ ప్రత్యుపకారమును పొందవలెననెడి యభిప్రాయముతోగాని, ప్రతి ఫలమును కోరిగాని, అమంగళకరమగు ద్రవ్యమునుగాని, మనస్సులో నిచ్చుటకు బాధపడుచుగాని చేయబడిన దానము రాజస మనబడును.

అవ.తామస దాన మెట్టిదో తెలుపుచున్నాడు.

22. శ్లో. అదేశకాలే యద్దాన । మపాత్రేభ్య శ్చ దీయతే ।
అసత్కృత మవజ్ఞాతం । తత్తామస ముదాహృతమ్ ॥

అర్థము : అదేశకాలే = కూడనిదేశమునందును, కూడని కాలమునందును, అపాత్రేభ్యః చ = కూడనివారికొఱకు, అసత్కృతం=గౌరవము లేకుండగను, అవజ్ఞాతం= ఉపచారములు లేకుండగను, యత్ దానం = ఏ దానము, దీయతే = ఈయబడుచున్నదో, తత్ దానం = ఆ దానము, తామసం (ఇతి) = తామసమని, ఉదాహృతం =చెప్పబడినది.

తా॥ శాస్త్రోక్తములు కాకపోవుటచే తగని దేశకాలములయందు మూర్ఖతస్కరాది దుష్టులకు పాదప్రక్షాళనాది గౌరవములు లేకయే అవమానముతో నీయబడిన దానము తామస మనబడును.

అవ. ఇట్లు వైదికములైన యజ్ఞ తపోదానములకు సత్త్వాది గుణభేదములచే కలుగు భేదమును చెప్పి, ఇప్పుడవి ప్రణవముతో నన్వయించుటయు, 'తత్, సత్' అను శబ్దములచే నిర్దేశింపబడుటయును చెప్పుచున్నాడు.

23. శ్లో. ఓం తత్స దితి నిర్దేశో । బ్రహ్మణ స్త్రివిధః స్మృతః ।
బ్రాహ్మణాస్తేన వేదాశ్చ । యజ్ఞా శ్చ విహితాః పురా॥

అర్థము : బ్రహ్మణః = వేదమునకు, నిర్దేశః = నిర్దేశించు శబ్దము, ఓమ్ తత్ సత్ ఇతి = ఓమ్ అనియు, తత్ అనియు, సత్ అనియు, త్రివిధః = మూడువిధములు కలదిగా, స్మృతః = నిశ్చయింప బడినది, తేన = ఆ మూడు విధములు గల శబ్దముతో (అన్వితాః = కూడినవారైన) బ్రాహ్మణాః = బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులును, వేదాః చ=వేదములున్ను, యజ్ఞాః చ = యజ్ఞములున్ను, పురా = పూర్వము, విహితాః= నిర్మింపబడినవి.

తా॥ ఓమ్ తత్ సత్ అను నీ మూడు శబ్దములున్ను బ్రహ్మముతో నన్వయించును. బ్రహ్మమనగా వేదము. వేదమనగా కేవల శబ్దరాశియేగాక వైదికమగు యజ్ఞాదికర్మయు చెప్పబడుచున్నది. వేదాధికారులగు బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులును, వేదములును, యజ్ఞములును ఓమ్ తత్ సత్ అనెడు మూడు విధములైన శబ్దములతో నన్వయించునవిగా నాచేత పూర్వము నిర్మింపబడినవి.

అవ. బ్రాహ్మణులు, వేదములు, యజ్ఞములును 'ఓమ్ తత్ సత్' అను శబ్దములతో నన్వయించు ప్రకారమును చెప్పదలంచి మొదట 'ఓమ్' అను శబ్దముయొక్క అన్వయ ప్రకారమును చెప్పుచున్నాడు.

24. శ్లో. తస్మాదోమి త్యుదాహృత్య । యజ్ఞదాన తపః క్రియాః ।
ప్రవర్తనే విధానోక్తా । స్సతతం బ్రహ్మవాదినామ్ ।

అర్థము : తస్మాత్ = అట్లు నిర్మింపబడుటవలన, బ్రహ్మవాదినాం = వేదము నుచ్చరించు బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులయొక్క, విధానోక్తాః = శాస్త్రోక్తములైన, యజ్ఞదాన తపః క్రియాః = యజ్ఞము దానము తపస్సులనెడు సత్కర్మలు, సతతం = ఎల్లప్పుడును, ఓమ్ ఇతి = ఓమ్ అని, ఉదాహృత్య = ఉచ్చరించి, ప్రవర్తనే = ప్రారంభింప బడుచున్నవి.

తా॥ బ్రాహ్మణులును, వేదములును, ఓమ్, తత్, సత్ అనెడు శబ్దములతో నన్వయించునవిగా నాచే నిర్మింపబడుటవలన త్రైవర్ణికులు చేయునట్టి యజ్ఞదాన తపస్సులనెడు క్రియలు మొదట 'ఓమ్' అని చెప్పియే ప్రారంభింపబడుచున్నవి. ఇట్లు ఓమ్ శబ్దముతో నన్వయించు వేదములను వర్ణించి ధరించుటచేతను, అట్లన్వయించిన యజ్ఞాదులను చేయుట చేతను, బ్రాహ్మణులనబడు త్రైవర్ణికులకును ఓమ్ శబ్దముతో నన్వయము వర్ణించబడినది.

అవ. ఇక నామూడును 'తత్' శబ్దముతో నన్వయించురీతి చెప్పబడుచున్నది.

25. శ్లో. తది త్యనభిసన్ధాయ । ఫలం యజ్ఞ తపః క్రియాః ।
దానక్రియా శ్చవివిధాః । క్రియన్తే మోక్షకాఙ్క్షిభిః ॥

అర్థము : మోక్షకాఙ్క్షిభిః = మోక్షమును కోరువారిచేత, తత్ ఇతి = తత్ అని (ఉదాహృత్య= ఉచ్చరించి) ఫలం = ఇతరఫలమును, అనభిసన్ధాయ = కోరక, వివిధాః = అనేక విధములైన, యజ్ఞతపః క్రియాః = యజ్ఞములు తపస్సు లనెడు క్రియలున్ను, దానక్రియాః చ=దానములనెడు కర్మలున్ను, క్రియన్తే = చేయబడుచున్నవి.

తా॥ మోక్షాపేక్షగల త్రైవర్ణికులు, పరమాత్మ వాచకమైన తచ్ఛబ్దము నుచ్చరించి ఇతర ఫలములను గోరక వేదాధ్యయనము యజ్ఞము దానము తపస్సుల నాచరింతురు. అవి బ్రహ్మప్రాప్తికి సాధనములుగాను బ్రహ్మను తెలిపెడు 'తత్' శబ్దముచే దెలుపబడును. ఇదియే వీటికి తచ్ఛబ్దాన్వయము- ఇట్టివాటి ననుష్ఠించుటచే త్రైవర్ణికులకు తచ్ఛబ్దాన్వయము తగుచున్నది.

అవ. ఈ బ్రాహ్మణుల వేద యజ్ఞాదులకు సచ్ఛబ్దాన్వయ విధానమును జెప్పుటకై లోకమున సచ్ఛబ్దము పుట్టిన ప్రకారమును జెప్పుచున్నాడు.

6. శ్లో. సద్భావే సాధుభావే చ । సదిత్యేత త్ప్రయుజ్యతే ।
ప్రశస్తే కర్మణి తథా । సచ్ఛబ్దః పార్థ ! యుజ్యతే ॥

అర్థము : పార్థ! = అర్జునా! సద్భావే = ఉన్నదియనెడు అర్థమునందును, సాధుభావే చ = మంచిదియనెడు నర్థమునందును, సత్ ఇతి = సత్ అనెడి, ఏతత్ = ఈ శబ్దము, ప్రయుజ్యతే = ప్రయోగింపబడుచున్నది, తథా = అట్లే, ప్రశస్తే = మంగళకరమైన,

కర్మణి = సత్కార్యమునందును, సచ్ఛబ్దః=సత్ అనెడి పదము, యుజ్యతే = ప్రయోగించబడుచున్నది.

తా॥ అర్జునా ! ఇది కలదు అనెడు భావమునందును, ఇది మంచిది యనెడు సర్థమునందును 'సత్' అనెడు పదము లోకమునందును వేదమునందును వాడబడుచున్నది. అటులనే శుభకార్యములయందును 'ఇది సత్కార్మ' అని యీ సచ్ఛబ్దము ప్రయోగింపబడుచున్నది.

అవ. బ్రాహ్మణ - వేద - యజ్ఞాదులకు సచ్ఛబ్దాన్వయమును జెప్పుచున్నాడు.

27.శ్లో. యజ్ఞే తపసి దానే చ । స్థితి స్సదితి చోచ్యతే ।
కర్మ చైవ తదర్థీయం । స దిత్యే వాభిధీయతే॥

అర్థము : యజ్ఞేచ = యజ్ఞమునందు, తపసి = తపస్సునందును, దానేచ = దానమునందును, స్థితిః = ఉనికి, సత్ ఇతి = సత్ అని, ఉచ్యతే = చెప్పబడుచున్నది. తదర్థీయం = ఆ వైదికులకొఱకైన, కర్మచ ఏవ = యజ్ఞాదికర్మయున్ను, సత్ ఇతి ఏవ=సత్ అనియే, అభిధీయతే = చెప్పబడుచున్నది.

తా॥ త్రైవర్ణికులకు యజ్ఞదాన తపస్సులయందలి స్థితి కళ్యాణమైనది. అది సత్తని చెప్పబడుచున్నది. వారియొక్క యజ్ఞాదికర్మలున్ను సత్తనియే చెప్పబడును.

(ఇట్లు వేదములును, వైదికకర్మలును, త్రైవర్ణికులును 'ఓమ్ తత్ సత్' శబ్దములచే సంబంధము కలిగియుండుటచే వేదేతరముల కంటెను అవైదికుల కంటెను వేరై ఉత్తమమైనవని యెఱుంగవలెను.)

అవ. శాస్త్రోక్త కర్మలైనను శ్రద్ధలేక ఆచరించుచుచో నసత్తులనియే చెప్పబడుననుచున్నాడు.

28.శ్లో. అశ్రద్ధయా హుతం దత్తం । తప స్తప్తం కృతం చ యత్ ।
అస దిత్యుచ్యతే పార్థ ! । న చ త త్ప్రేత్య నో ఇహ॥

ఇతి శ్రీ భగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే
శ్రీ కృష్ణార్జున సంవాదే శ్రద్ధాత్రయ విభాగయోగోనామ సప్తదశోఽధ్యాయః

అర్థము : హే పార్థ ! = అర్జునా! అశ్రద్ధయా = అశ్రద్ధతో, కృతం = చేయబడిన, హుతం =

హోమమున్ను, దత్తం=దానమున్ను, తప్తల = చేయబడిన, తపః చ = తపస్సున్ను, (అన్యత్) యత్ = (ఇంకను) ఏదికలదో, తత్ = అది, అసత్ ఇతి= అసత్తని, ఉచ్యతే = చెప్పబడుచున్నది, ప్రేత్య = మరణానంతరము, న=ఫలముకొఱకు కానేరదు, ఇహచ = ఈలోకము నందును, నో = నిష్ప్రయోజనము.

తా॥ అర్జునా ! అశ్రద్ధతో జేయబడు హోమమును, దానమును, తపస్సును తక్కిన కర్మలును శాస్త్రీయములైనను అసత్తనబడును, ఏలయనగా ఆ కర్మలు ఇహపరలోకములయందు ఫలప్రదములు కానేరవు.

ఇది ఉపనిషదర్థ ప్రతిపాదకమును, బ్రహ్మ విద్యయు, యోగశాస్త్రమును
శ్రీ కృష్ణార్జున సంవాదరూపమును అయిన శ్రీ భగవద్గీత యందలి
శ్రద్ధాత్రయ విభాగయోగమనబడు
పదునేడవ యధ్యాయము.

ఈ యధ్యాయమున అర్జునుని శ్లోకము	1
శ్రీకృష్ణుని శ్లోకములు	27
ఇప్పటికైన మొత్తము శ్లోకముల సంఖ్య	622

శ్రీమద్భగవద్గీతా ప్రశ్నోత్తరావళి

పదిహేడవ అధ్యాయము

1.ప్ర. ఈ యధ్యాయమునకు పేరేమి ? ఆ పేరెందులకుంచబడినది?

ఉ. ఈ యధ్యాయమునకు 'శ్రద్ధా త్రయ విభాగయోగ' మని పేరు.

ఈ యధ్యాయమున శ్రీ కృష్ణపరమాత్మ అర్జునుని ప్రశ్నకు సమాధానముగా జన్మాంతర సత్వరజస్తమోగుణ ప్రకోపమువలన వాసనయు, దానివలన రుచియు, దానివలన శ్రద్ధయు, కలుగుననియు, ఆ శ్రద్ధ సాత్విక శ్రద్ధ, రాజసశ్రద్ధ, తామసశ్రద్ధయని మూడు విధములుగా నుండుననియు, అట్టి శ్రద్ధలతో కూడియుండు వారిట్లు ప్రవర్తింతురనియు, ఆ ప్రవృత్తికి తగినట్లు వారిట్టి ఫలముల ననుభవింతురనియు సవిస్తరముగా యీ యధ్యామున చెప్పుటచే దీనికీ పేరుంచబడినది.

2. ప్ర. ఈ యధ్యాయమునకు వెనుకటి యధ్యాయముతోను, ప్రధానశాస్త్రార్థముతోను గల సంబంధమేమి?

ఉ. వెనుకటి యధ్యాయమున శాస్త్రము ననువర్తించువారు దైవీ సంపదకు చెందిన వారనియు, శాస్త్రము నుల్లంఘించి సంచరించువారు అసురసంపదకు చెందినవారనియు చెప్పి, వారికి కలుగు ఫలవిశేషములను వర్ణించి, చివరకు శాస్త్రము నుల్లంఘించి స్వేచ్ఛగా సంచరించు వారికి ఐహికాముష్మిక ఫల మొకింతయు సిద్ధించదు గాన నీవు కర్తవ్యాకర్తవ్యములను శాస్త్రముద్వారా నిశ్చయించుకొని ప్రవర్తింపుమని ఉపదేశించెను.

ఈ యధ్యాయమున నిట్లు శాస్త్రము నాధారముగాగాని నడచు కొనువారికే సాత్విక ఫలమైనను రాజసఫలమైనను తామస ఫలమైనను సిద్ధించునేగాని తమకిష్టమువచ్చిన రీతిగా నెంత శ్రద్ధతో నాచరించినను పై మూడు విధములలో నేవిధమైన ఫలముకూడా సిద్ధించదని స్పష్టముగా జెప్పుటచే వెనుకటి యధ్యాయమున జెప్పబడిన శాస్త్రాను వర్తనమే ఇందు బలపరచబడినది గాన దీనికి వెనుకటి యధ్యాయముతో సంబంధముకలదు.

సాత్వికశ్రద్ధయు, సత్వగుణాభివృద్ధియు సమీచీన జ్ఞానమునకు సాధనములుగాన ముక్తికి సాధనమైన భక్తికీ సత్వాభివృద్ధియే ముఖ్యసహకారి

యగుచున్నది. అట్టి సత్త్వాభివృద్ధి సాధనము లీయధ్యాయమున చెప్పబడుటచే దీనికి ప్రధాన శాస్త్రార్థముతో సంబంధముకలదు.

3. ప్ర. ఈ యధ్యాయమున జెప్పబడిన ముఖ్య విషయములేవి?

ఉ. (శ్లో॥ అశాస్త్రమాసురం కృత్స్నం శాస్త్రీయం గుణతః పృథక్ ।
లక్షణం శాస్త్రసిద్ధస్య త్రిధా సప్తదశోదితమ్ ॥ (గీతా. సం)

1. శాస్త్రమున విధింపబడని కర్మలన్నియు ఆసురములనబడును. (అవి నిరర్థకములు)
2. శాస్త్రమున విధింపబడిన కర్మలు మాత్రమే సాత్త్వికములనియు రాజసములనియు తామసములనియు మూడు విధములుగా నుండును. వాటికే తగిన ఫలములు విధింపబడినవి.
3. శాస్త్రమున చెప్పబడిన కర్మలకే 'ఓమ్, తత్, సత్' అను శబ్దములతో సంబంధముకలదు. అట్లా శబ్దములతో సంబంధము కలిగియుండుటయే కర్మలకు ముఖ్యలక్షణము, ఇది ఈ యధ్యాయమున చెప్పబడిన ముఖ్య విషయ సంగ్రహము.)

— : విశేష వివరములు :—

1) శాస్త్రమును విడిచి తనకు తోచినరీతిగా నాచరించిన కర్మకు సాత్త్వికఫలమా? రాజసఫలమా? తామసఫలమా? యని యర్జునుడు శ్రీ కృష్ణుని ప్రశ్నించుట. 1 శ్లో.
2) అట్టికర్మలు నిష్ఫలములని తెలుపుటకై శ్రీ కృష్ణుడు శాస్త్రీయములగు యాగాదులే సాత్త్విక రాజసతామసములని మువ్విధములుగా నుండుననియు, అట్టి కర్మల యందలి శ్రద్ధయే మూడు విధములనియు, అది పూర్వవాసనవలన బుట్టుననియు వారివారి ఆరాధనా విధానములను బట్టి యాశ్రద్ధయెట్టిదో తెలియదగుననియు చెప్పుట. 2,3 శ్లో.
3) ఇట్లు శాస్త్రీయములగు యాగాదులకు సత్త్వాది గుణములనుబట్టి ఫలభేదమును జెప్పి, శాస్త్రమును విడిచి స్వేచ్ఛాకృతములగు తపోయాగాదుల వలన సుఖ మొకింతయులేకుండుటయేగాక అనర్థముల పాలగుదురనిజెప్పుట. 5,6 శ్లో.
4) శాస్త్రీయమైన యాహారము, యజ్ఞము, తపస్సు, దానములలో సత్త్వాది గుణములనుబట్టి మూడు విధములగుటను చెప్పెదనని ప్రతిజ్ఞచేయుట. 7 శ్లో.

5) ఆహారములలోగల సాత్త్విక రాజస తామస భేదములను క్రమముగా వివరించుట. 8, 9, 10 శ్లో.

6) యజ్ఞము సాత్త్విక రాజస తామసభేదములచే మూడు విధములని వివరించుట. 11, 12, 13 శ్లో॥

7) శారీరక, వాచిక, మానసిక తపస్సుల యొక్క స్వరూపమును వివరించుట. 14, 15, 16 శ్లో॥

8) ఇట్లు మువ్విధములైన తపస్సులున్ను సాత్త్విక, రాజస, తామస, భేదములచే మూడు విధములని చెప్పుట. 17, 18, 19 శ్లో॥

9) దానము సాత్త్విక రాజస తామస భేదములచే మూడువిధములని చెప్పుట. 20,21,22 శ్లో॥

10) వేదాధికారులగు త్రైవర్ణికులతోను, వేదములతోను, యజ్ఞములతోను ఓమ్ తత్ సత్ శబ్దములన్వయించు రీతిని చెప్పుట. 23, 24, 25, 26 శ్లో॥

11) శాస్త్రీయకర్మయైనను శ్రద్ధలేనిచో అసత్కర్మయగునని చెప్పుట 28 శ్లో॥

4. ప్ర. **అధ్యాయారంభమున అర్జునుని ప్రశ్నయేమి? ఆ ప్రశ్నయెందులకుదయించెను? దానికి భగవాను డేమి యుత్తర మొసంగెను?**

ఉ : శాస్త్రమును విడిచి శ్రద్ధతో నాచరింపబడు కర్మలకు ఫలము సాత్త్వికమా? రాజసమా? తామసమా? యని అర్జునుడు ప్రశ్నించెను.

క్రిందటి అధ్యాయాంతమున శాస్త్రమునారసి చేయవలసిన వాని నెఱింగి చేయుమనియు, విడువవలసిన వాని నెఱింగి విడువుమనియు భగవానుడు పదేశించెను. దానిని విని యర్జునుడు శాస్త్రమునందు చెప్పబడక పోయినను కడుంగడు శ్రద్ధతో నేపనిచేసినను దానికిని,. శాస్త్రోక్తమగు కర్మకు కలుగు సంతటి ఫలము కలుగక పోయినను వ్యర్థము మాత్రము గాక యొక ఫలము కలిగి తీరవలయునని లోకదృష్టిని బట్టి ఊహించుకొని ఆ ఫలము సాత్త్వికమా? రాజసమా? తామసమా? యని ప్రశ్నించెను.

అందులకు శ్రీ కృష్ణుడు ఏ ఫలమైనను శాస్త్రమున జెప్పబడిన కర్మలకేగాని – శాస్త్రమున జెప్పబడని కర్మలనుగాని, చెప్పబడినను తనకధికారములేని వానినిగాని, అధికారమున్నను దేశకాలపదార్థ క్రియాకలాపముల ననాదరించి

యాచరింపబడు కర్మలకుగాని యెంత శ్రద్ధతో నెంతఖర్చుపెట్టి యెంత శ్రమ పడి యాచరించినను వాటివలన నైహిక ఫలముగాని ఆముష్మిక ఫలముగాని కలుగనేరదు సరిగదా! అట్లాచరించువారు ఆసురులగుదురు, అనగా - రాక్షసులవలె భగవదాజ్ఞ నుల్లంఘించి స్వేచ్ఛాచారులగుదురు. అందుచే వారికి సుఖలేశమైనను కలుగదు. 'పతన్తి నరకేఽశుచౌ' అనినట్లనర్థ పరంపరల పాలగుదురు. ఇట్లాముష్మికము లేకుండుటయే గాక నిరర్థక ఉపవాసాదుల మూలమున శరీరమును శుష్కింపజేయుటచే జ్ఞానము, సుఖము మొదలగు ఆత్మ గుణములుకూడ క్షీణించిపోవును. అదియే జీవశోషణము. అదియే తదన్తర్యామియగు పరమాత్మశోషణము. ఇంతకు మించిన పాపమింకేమికలదు అని శ్రీ కృష్ణభగవానుడు సమాధానమొసంగెను.

5, 6, శ్లో ॥

5.ప్ర. శ్రద్ధ యెన్ని విధములు? ఎట్లు కలుగుచున్నది? ఎట్లు తెలియబడుచున్నది?

ఉ: శ్రద్ధ సాత్త్వికమనియు, రాజసమనియు, తామసమనియు మూడు విధములు.

పూర్వజన్మమునందలి గుణోద్రేకమువలన నంతఃకరణయందు సంస్కారమనబడు వాసన జనించును. ఆ వాసనవలన రుచి జనించును. ఆ రుచి యే పదార్థమునందుండునో ఆ పదార్థమునందు అందులకు తగిన శ్రద్ధ జనించుచుండును. శ్రద్ధ యనగా నీసాధనమువలన తన యభీష్టము సిద్ధించుననెడు విశ్వాసముతో నా సాధనమునందుగల త్వరయే. అంతః కరణ మెట్టి గుణములతో కూడియుండునో అట్టి గుణములను గురించి శ్రద్ధకలుగును. పురుషుడెట్టి శ్రద్ధతో కూడియుండునో యందులకు తగిన ఫలమునే యనుభవించుచుండును. పుణ్యకర్మలయందు శ్రద్ధను కలిగి యున్నచో పుణ్యకర్మ ఫలమగు సుఖమునే యనుభవించును. కావుననే పురుషుడు శ్రద్ధాపరిణామమని చెప్పబడుచున్నాడు.

లేశమైనను దుఃఖసంపర్కములేని మహత్తర సుఖమునొసంగు దేవతారాధన తత్పరుడై యుండునేని సాత్త్వికశ్రద్ధకలిగి యున్నాడనియు, దుఃఖమిశ్రమైన నల్ప సుఖము నొసంగు యక్ష రాక్షస పూజాతత్పరుడగు నేని రాజస శ్రద్ధకలిగి యున్నాడనియు; ఆయత్యల్పసుఖమైనను దుఃఖ భూయిష్ఠమై యుండునట్లు చేయునట్టి భూత ప్రేతములనారాధించునేని తామస శ్రద్ధకలిగి యున్నాడనియు తెలియవలెను. 2, 3, 4 శ్లో

6.ప్ర. సాత్త్వికాహార స్వరూపమెట్టిది?

ఉ: ఆయుర్దాయమునభివృద్ధి పరచునట్టియు, సత్వగుణాభివృద్ధిద్వారా జ్ఞానమును వృద్ధిపరచునట్టియు, ప్రాణమును జఠరాగ్నిని వృద్ధిపరచునట్టియు, ధాతువులను సామ్యస్థితిలో నుంచునట్టియు, జీర్ణదశలో స్వయముగనే సుఖమును వృద్ధిపరచునట్టియు, ఇహలోకోపకారకములును, పరలోక సుఖసాధనములునునగు కర్మలయందు ప్రేరేపించి యానందముల నొసంగునట్టియు పదార్థములు సాత్వికములనబడును.

ఇట్టి పదార్థములేవియను విషయమును ఆయుర్వేదమువలనను, కొన్ని యనుభవములవల్లను తెలియవలెను. ఇట్టి పదార్థములను పేరుపేరుగా జెప్పుట దుర్ఘటమగుటచే కొన్ని గుణములను బట్టి వాటిని సముదాయాత్మకముగా జెప్పుచున్నాడు

అవి యేవియనగా :-

ఎ) మాధుర్యముతో కూడియున్నవి. (తీపి ఇతరరుచులన్నిటికంటె శరీరమును కాపాడుటలో నుత్తమమైనది.)

బి) నేయి, వెన్న, నూనె మొదలగు జిడ్డుతో కూడినవి. (ఇవి రూక్ష వాయువును బుట్టించి శరీరమును శిథిలపరచునట్టి రాజసపదార్థములను వారించి శరీరమును కాపాడును.)

సి) స్థిరపరిణామము కలవి. అనగా - శరీరస్థైర్యమునకు కారణములగు రసము, రక్తము, మాంసము, క్రొవ్వు, ఎముకలు, మజ్జ, రేతస్సు లనబడు ఏడుధాతువులను ఆయాహారమువలన కలుగు బలాదులును చిరకాలము స్థాయిగా నుంచగల ఆహారము.

డి) రమణీయమైనది. అనగా - తినక మునుపే చూడగనే అసహ్యమును బుట్టించు సన్నివేశము, రంగు మొదలకు దుర్గుణములు లేక, చూడగనే ప్రీతినిపుట్టించు పదార్థములు.

ఇంకను ధర్మశాస్త్రమున జెప్పబడి ఆయుర్వేదమునకు కూడ సమన్వయపడు పదార్థములన్నియు సాత్వికపదార్థము లనబడును. వీటిని తినుటచే సత్వగుణము వృద్ధియగును. సత్వగుణాభివృద్ధిగలవానికివి యిష్టములగును. 8 శ్లో.

7. ప్ర. రాజసాహార మెట్టిది?

ఉ: రసరక్తాది సప్తధాతువుల వైషమ్యమును కలిగించి దుఃఖ పెట్టుటయు, కాలాంతరమున వెనుకటి దుఃఖమును తలంచుకొనుటచే పశ్చాత్తాపము కలిగించునట్టియు, కాలక్రమమున అనారోగ్యమును కలిగించు నట్టియు, పరలోకమునందును, మరియొక దేహమును పరిగ్రహించినప్పుడుకూడ విడువక దుఃఖమును కలిగించుచునే యుండునట్టి పదార్థములు రాజసము లనబడును. ఇవియును ఆయుర్వేదమువలనను, అనుభవము వలనను తెలియదగినవియే.

అవి యేవియనగా :-

ఎ) కారముగల పదార్థములు, పుల్లనివస్తువులు, మిక్కిలి ఉప్పునివి (ఉపవాసము లేని రోజులలో సాత్వికాహారములో కూడ కేవల రుచికపసరముగుసంత స్వల్పమాత్ర లవణమునుపయోగించవచ్చును. గాన మిక్కిలి ఉప్పని వస్తువులే రాజసాహారముగా పరిగణింపబడినవి.)

బి) అట్లే వైద్యశాస్త్రమున ఆరోగ్యమునకై కొలదిపాటి వేడిగానున్న ఆహార పదార్థములను వాడుమని విధించుటచే మిక్కిలి వేడి పదార్థములే రాజసాహారముగా లెక్కించబడుచున్నవి.

సి) తిననది మొదలుగా మిక్కిలి ప్రతికూలించునట్టి పదార్థములు తీక్ష్ణములనబడును. అనగా మిక్కిలి వేడి, జలుబు చేయు వస్తువులు (మిరియములు మొదలగు కొన్ని వస్తువులు కొలది వేడిచేసినను ఆయా పదార్థముల రుచికొరకు కొలదిగ సాత్వికాహారములో చేర్చబడును గాన మిక్కిలి వేడిచేయున్నదియే రాజసాహారమగును)

డి) రూక్షాహారములు రాజసములు.

అనగా చమురులేని ఆరినవస్తువులు. ఇవి వాతమును ప్రకోపించి ఆర్చివేయును.

ఇ) విపరీత దాహమును పుట్టించు ఆహారము రాజసము, ఇవి పైత్యమును వృద్ధిపొందించి తాపమును బుట్టించును. వీటిని తినినచో రజోగుణము వృద్ధి జెందును. రాజసున కివి యిష్టమగును.

8.ప్ర. తామసాహార మెట్టిది?

ఉ: ఈ యాహారముకూడ రాజసాహారమునకుండునట్టి దోషములు కలదియే.

ఆ పదార్థము లేవియనగా -

ఎ) వండిన పిమ్మట చిరకాలముంచుటచే చెడినవస్తువులు తామసాహారము.

బి) నిస్సారమగు వస్తువులుకూడ నిట్టివియే.

సి) సహజమగు రుచి మారిన పదార్థములు.

డి) దుర్వాసన కొట్టునట్టి పదార్థములు.

ఇ) కాలము గడుచుటచే రుచి మారినట్టియు, అసహ్యమైన వికారమును చెందునట్టియు, ఇట్టిమార్పులు చెందుకున్నను కాలాతి క్రమణమే దోషముగా భావించబడు నట్టియు, (ఉదా - నేడు కాచిన నీరు రేపటికుపయోగించరాదు.) పదార్థములు తామసాహారము.

ఎఫ్) ఆచార్యులు, తండ్రి, పెద్దన్నగారు, (భార్యకు భర్త) గాక నితరులెవ్వరి యెంగిలియైనను తామసాహారముగనే పరిగణింపబడును.

(ఆచార్యులనగా - మంత్రత్రయము నుపదేశించినవారు మంత్రార్థముల నుపదేశించినవారును.

ఎంగిలియనగా - వండినగిన్నెలో నుండి తీసి యొకరు తినగా నందు మిగిలియున్న పదార్థముగాని, ప్రత్యక్షముగా నెంగిలియైనదిగాని యగుచున్నది)

జి) భగవంతునికి నివేదించుటకు తగనిదియు, తగినను నివేదించబడనిదియు, తామసాహారము. ఇవి యన్నియు తామసాహారములనబడును. అనగా వీటిని తినుటచే తమోగుణము వృద్ధి జెందును. తామసులకిట్టి పదార్థము లిష్టమగును.

9. ప్ర. సాత్త్విక రాజస తామస యజ్ఞముల స్వరూపమెట్టిది?

ఉ: ఒక్క భగవత్ప్రీతిగాక మరియే యితర ఫలముల యందున్న ఆశను వీడి, శాస్త్రమున జెప్పబడిన పదార్థములతో శాస్త్రోక్త మంత్రములను పఠించుచ శాస్త్రోక్త క్రియాకలాపమును భగవదారాధనయే ప్రయోజనమని నిశ్చయించుకొని యాచరించిన యజ్ఞము సాత్త్వికము. ఫలమునుగోరి దంభముతో కీర్తినపేక్షించి చేయునట్టి యజ్ఞము రాజసము.

శాస్త్రమున జెప్పబడినను సదాచార సంపన్నులును, పండితులునగ బ్రాహ్మణోత్తములచే చేయుమని ఆజ్ఞాపింపబడియే కర్మల నాచరించవలెను

అట్లు చేయకున్నను. కూడనివారి నుండి ధనమును తెచ్చి ఆ కర్మల నాచరించినను, కర్మలకు తగిన మంత్రముల ననుసంధించకున్నను, ఋత్విక్కుల కీయవలసిన దక్షిణనీయకున్నను. అశ్రద్ధతో నాచరించినను ఆ యజ్ఞము తామసమనబడును.

10. ప్ర. తపస్సు ఎన్ని విధములు? సాత్త్విక రాజస తపస్సుల స్వరూపమెట్టిది?

ఉః తపస్సు శారీరకమనియు వాచికమనియు, మానసికమనియు, మూడు విధములు.

దేవతల యొక్కయు, బ్రాహ్మణుల యొక్కయు, గురువుల యొక్కయు, జ్ఞానుల యొక్కయు సన్నిధిలోనెట్లు ప్రవర్తించవలెనని శాస్త్రము విధించు చున్నదో అట్లు ప్రవర్తించుట. (అనగా-వారికి ప్రదక్షిణముగా నేగుట. అందులకు వీలు లేకున్నచో వారికి మానసికముగనైనను ప్రదక్షిణముచేయుట. వారు వచ్చినప్పుడు లేచి నిలిచి నమస్కరించి ఆసన మొసగి కూర్చుండ బెట్టుట మొదలగునవి)

పుణ్యతీర్థములలో స్నానమాచరించుట. తాను తలంచినది తలచినట్లు జెప్పి, చెప్పినది చెప్పినట్లాచరించుట, స్త్రీలను భోగ్యతాబుద్ధితో చూడకుండుట. ఏ ప్రాణినిగాని పీడించకుండుట మొదలగునవి కలిగియుండుట శారీరతపస్సనబడును.

పరులగుట్టు బయటపడునట్లుగాని, వారి నపహసించుచుగాని మాట్లాడి వారికి కోపమును దెప్పించుట, పరులకు హితకరమగుచో మాత్రమే చూచినది చూచినట్లు చెప్పుట. పురుషార్థమునకు సాధనమగునట్లుగా పూజింపదగిన వ్యక్తులకు ప్రియమగునట్లు మాట్లాడుట. వేదాధ్యయనమును గావించుట (వేదాధ్యయనమునకు యోగ్యతలేనిచో తదుప బృంహణములగు ఇతిహాస పురాణాదులను చదువుట, వినుటయు లేక సదాచార్యుల నాశ్రయించి లభించిన ఉత్తమ భగవన్మంత్రములను జపించుటయు కూడా స్వాధ్యా యాభ్యాసమనబడును.) ఇవి వాచిక తపస్సనబడును.

పరుల కనిష్టమునే తలంచుట, మనస్సునకు కాలుష్యము-అనునవి యుండరాదు. పరుల శ్రేయస్సునే నిరంతరము కోరుచుండుట. (ఇది మనస్సు యొక్క సౌమ్యత్వము. మనస్సు సౌమ్యముగానున్నచో ఆకారము కూడ సౌమ్యముగనే యుండును. కావున సౌమ్యమగు నాకారమునుబట్టి మన స్సౌమ్యము నూహించవచ్చును)

దృఢమగు సంకల్పముతో తోచినట్లు విరివిగ ప్రసంగించుట నరికట్టుట, అక్రమచింతనల వీడి ధ్యానించదగిన భగవంతునియందే మనస్సును నిలుపుట. ఆత్మకంటె వేరైన విషయముల కొకింతయు మనస్సున తావీయకుండుట. (రహస్యమందైనను పరస్త్రీలనుగూర్చి మనుస్సున తలంపు జనింపనీయరాదు.) ఇది మానసిక తపస్సనబడును. (ఆ యా తపస్సులని పేరిడుట ఆయా కరణ ప్రాధాన్యమును బట్టియే.)

ఇవి తిరిగి ఒక్కొక్కటి సాత్వికమనియు, రాజసమనియు, తామస మనియు మూడు విధములు.

అందు సాత్విక తపస్సు

పైన చెప్పబడిన మూడు విధములైన తపస్సున్ను భగవత్ప్రీతి కొఱకేగాని మరి యేయితర ఫలముల కొరకును నాచరించని సాత్విక పురుషులచే మిక్కిలి శ్రద్ధతో నాచరింపబడెనేని యది సాత్విక తపస్సనబడును.

తన నందరు మనస్సున గొప్పవాడని భావించి యాదరించవలెననియు, నోటితో పొగడవలెననియు, శరీరముతో నమస్కరించవలెననియు, తనకు దానివలన మహత్తరమైన ఫలము లభించవలెననియు, దంభముతో పై మూడు విధములైన తపస్సుల నాచరించెనేని యవి రాజస తపస్సనబడును. ఇట్టి తపస్సు రజోగుణముచే ప్రేరేపింపబడి యాచరింపబడుటచే, రాజసమును, ఆ పుణ్యము క్షీణించగనే భూమిపై పడునుగాన నిరంతరమును పాపభీతినే గలుగజేయుటచే చలమును, ఎప్పటి కప్పుడు క్షీణించుచునే యుండునుగాన అధ్రువమును అగుచున్నది.

అవివేకులు తమ శక్తి సామర్థ్యముల గమనించకయే పరులను నశింపజేయు సంకల్పముతో తాము పరిమితపీడ ననుభవించుచు గావించు తపస్సు తామసమనబడును.

11. ప్ర. సాత్విక రాజస తామస దానములకు గల భేదమేమి?

ఉ. దేశకాలపాత్రల నారసి ఫలములను గోరక, యిచ్చుట తనకు విధియని తలంచి ప్రత్యుపకారము నొకింతయు చేయజాలనట్టి వానికి చేయబడిన దానము స్వాతిక మనబడును.

(దేశకాలములనగా - దానమునకు తగినవిగా శాస్త్రమున నిర్ణయింపబడిన దేశము కాలము అని గ్రహింపవలెను.)

(పాత్రమనగా ఉత్తమజన్మ, ఆధ్యాత్మిక విద్య, సదాచార సంపత్తి యను మూడును కలవాడు.)

తన కెప్పుడో చేసిన ఉపకారమునకుగాని, ముందు తనకొక ఉపకారము చేయుననిగాని యొకనికి దానమొసంగుటయు, దానివలన తన కొక గొప్ప లాభము లభించునని తలంచుచు మంచి భాగమును తన కుంచుకొని నిస్సారభాగమును శ్రద్ధగాని అదరముగాని లేకయే యిచ్చినచో నా దానము రాజసమనబడును.

దేశకాల పాత్రల నారయక పాదప్రక్షాళనాది మర్యాదలను పాటించక నిర్లక్ష్యముగ గర్వముతో నీయబడిన దానము తామసమనబడును.

దానమునకు కూడని దేశములు-కలింగము, కీటకము మొదలైనవి. దానమునకు కూడనికాలము- రాత్రి మొదలగునవి. దానమునకు కూడని పాత్ర-పంక్తి దూషకులు, మూర్ఖులు, దొంగలు, జూదగాండ్రు, వందిమాగధులు మొదలగువారు.

12.ప్ర. వేదాధికారులైన త్రైవర్ణికులతోను, వేదములతోను, యజ్ఞములతోను ఓమ్ -తత్ -సత్ అను శబ్దములన్వయించు విధానమేమి?

ఉ: (ఓమ్-తత్-సత్ అను శబ్దములు పరమపవిత్రమైనవి. ఉపనిషత్తులయందు బ్రహ్మనామములుగా వాడబడినవి. కాని ప్రకృతమున వైదికపరముగనే వాడబడినవి. వైదికమనగా -వేదము, వేదోక్త యజ్ఞాదికము, ఈ రెండింటిని పాటించు వేదాధికారులును. ఈ మూడింటితోను యీ మూడు శబ్దములను అన్వయించుచున్నవి. ఇట్ల న్వయించుటచే కర్మలో నేమైనను లోపములున్నను అవి పరిహరింపబడి యా కర్మ సగుణమగుచున్నది. మరియు కర్మలాచరించు నపుడు మధ్యగా నితరపనులు చేయవలసివచ్చినను, సాంసారిక ప్రసంగములు చేసినను, నిద్రాప్రమాదాదులు తటస్థించినను, ఓమ్ - తత్-సత్ అను నీ మూడింటిని యుచ్చరించినచో నా దోష ములుండవు. ఇంకను కర్మలకు కాలనియమముండినను భక్తితో నర్థాను సంధాన పూర్వకముగా ప్రణవము నుచ్చరించి యాచరించినచో నా నియమ మాటంకపరచజాలదు.)

ఇక ఓమ్ శబ్దము వేదములతోను, వేదోక్తమైన యజ్ఞ దాన తపస్సు మొదలగు కర్మలతోను వాటినాదరించు త్రైవర్ణికులతోను (త్రైవర్ణికులనగా

వేదాధికారముగల (బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు) అన్వయించు విధానము నారయుదము.

వేదాధికారులు వేదము నుచ్చరించు తరి ప్రారంభమునందును ముగింపు నందును (హరిః) "ఓమ్" అని ప్రణవము నుచ్చరించవలెనని నియమముకలదు. అట్లు ప్రారంభమున నుచ్చరించనిచో ప్రధానమగు నర్థజ్ఞానమును కలిగింపజాలదు. ముగింపునందుచ్చరించనిచో నిరర్థకమగు నర్థములను బోధించును. ఈ రెండును అనర్థావహములే కదా!

వేదోక్తక్రియలకు ముందుగా నందరు నీ ప్రణవము నుచ్చరించ వలెనని విధికలదు. ఇట్లుచ్చరించువారు వేదాంతవిదులైనచో నా కర్మలు భగవదారాధన రూపములై యలరారును. వేదాంతము నెఱుంగనివారైనచో మంగళ ప్రదములగును.

ఇట్లు ప్రణవము (ఓమ్కారము)తో నన్వయించిన వేదములను వర్ణించి సంరక్షించుట వలనను, ప్రణవముతో నన్వయించిన యజ్ఞాదుల నాచరించటవలనను వేదాధికారు లగు త్రైవర్ణికులకును ప్రణవాన్వయము చెప్పబడినట్లే యగును. 24. శ్లో॥

ఇక వీటికి 'తత్' శబ్దముతో నన్వయించురీతి చెప్పబడుచున్నది. మోక్షమునపేక్షించు బ్రాహ్మణాది త్రైవర్ణికులు ఫలము నపేక్షింపక వేదాధ్యయనమును గావింతురు. యజ్ఞతపోదానాదిక్రియల నాచరింతురు. ఇట్టివి పరమాత్మ ప్రాప్తికి సాధనములుగదా! కావున నివి పరమాత్మకు వాచకమైన 'తత్' అను శబ్దముతో పిలువబడుచున్నవి. శ్రీ విష్ణుసహస్ర నామమున 'తత్' పదము భగవద్వాచకముగా జెప్పబడినదిగదా! ఇదియే వేదములకును యజ్ఞాదులకును తత్ శబ్దాన్వయము. బ్రాహ్మణాదులు అట్టి వేదములను చదువుకొని అట్టి యజ్ఞముల నాచరింతురు గాన వారికి తత్ శబ్దాన్వయము చెప్పబడినట్లే యగును. 25. శ్లో॥

(ఇక నీ మూడింటికిని 'సత్' శబ్దముతో సంబంధము చెప్పవలసి యున్నది. దీనికి ముందుగా లోకమున సత్ అను శబ్దమెట్లుద్భవించినదో తెలియవలసియున్నది.)

సత్ అను శబ్దము వేదమునందును లౌకిక గ్రంథములయందును "ఉన్నది" 'పుణ్యమైనది', 'ధర్మార్థ కామసాధనమగు సత్కర్మ' యను

నర్థములయందు వాడబడుచున్నది. కావున బ్రాహ్మణాది త్రైవర్ణికుల యజ్ఞతపోదానముల యందలి నిష్ఠ 'సత్' అని చెప్పబడుచున్నది. వారాచరించు యజ్ఞ దానాదులు, వారనుసంధించు వేదములును కూడా 'సత్' అనియే చెప్పబడును.

మోక్షసాధనమగు కర్మకు 'తత్' అను శబ్దప్రయోగమువలనను, ఇహలోక సమృద్ధి సాధనమగు కర్మకు 'సత్' శబ్దప్రయోగమువలనను ఈ రెండింటికిని భేదమెఱుంగవలెను.

ఇట్లు వేదములకు, వైదిక కర్మలకు, బ్రాహ్మణాది త్రైవర్ణికులకు 'ఓమ్-తత్-సత్, అను శబ్దములతో సంబంధించి యుండుటయే లక్షణమని చెప్పబడుటచే వీటికి వేదేతర గ్రంథముల కంటెను, వేదోక్తములు కాని కర్మల కంటెను, వేదాధికారములేని వారికంటెను వైలక్షణ్యము తెలియబడుచున్నది.

13. ప్ర. **ఎట్టివాటిని యసత్కర్మలుగా శ్రీకృష్ణభగవానుడు పరిగణించెను?**

ఉ: అధ్యాయారంభమున శాస్త్ర ప్రమాణములేని కర్మ నెంత శ్రద్ధతో నాచరించినను నిష్ఫలమని చెప్పెను. దీనిచే శాస్త్రోక్త కర్మకుగల గౌరవాతిశయము సూచింపబడెను. ఇప్పుడు శాస్త్రమున చెప్పబడిన కర్మయైనను అశ్రద్ధతో నాచరించినయెడల ఇహలోక సుఖమునకు గాని ముక్తికి గాని సాధనమెంత మాత్రమును కాజాలదని చెప్పెను. ఇదియేయసత్కర్మ.

14.ప్ర. **ఈ యధ్యాయ సారార్థమేమి?**

ఉ. వేదోక్తముకాని కర్మ నెంతశ్రద్ధతో నాచరించినను, వేదోక్తమైన కర్మను అశ్రద్ధగా చేసినను దృష్టఫలము (ఇహలోక ఫలము) గాని అదృష్టఫలము (పరలోకఫలము)గాని లేదు గాన వాటినట్లాచరించరాదు. వేదోక్తకర్మను శ్రద్ధాపూర్వకముగా నాచరించినచో దృష్టఫలములును, అదృష్ట ఫలముకూడ లభించును. గాన నట్టి కర్మనే శ్రద్ధతో నాచరించవలెను - అని యీ యాధ్యాయసారము.

*****

అష్టాదశాధ్యాయార్థ సంగ్రహము

శ్లో. ఈశ్వరే కర్తృతాబుద్ధిః
సత్త్వోపాదేయతాఽన్తిమే
స్వకర్మ పరిణామశ్చ
శాస్త్రసారార్థ ఉచ్యతే ।

అర్థముః ఈశ్వరే = సర్వేశ్వరునియందు, కర్తృతాబుద్ధిః = సమస్తకర్మలకును కర్తయను బుద్ధియు, సత్త్వోపాదేయతా = సత్త్వమే ఉపాదేయమనుటయును, స్వకర్మపరిణామః చ = తానుకావించునట్టి వర్ణాశ్రమోచిత కర్మలయొక్క పరిణామమున్ను, శాస్త్రసారార్థః = గీతాశాస్త్రమునకు సారమైన భక్తియోగమున్ను, అన్తిమే = ఈచివర యధ్యాయమున, ఉచ్యతే = చెప్పబడుచున్నది.

తా॥ సర్వేశ్వరుడే సమస్తకర్మలకును కర్తయని తలంచుటయు, సత్త్వాది గుణముల కార్యములను జెప్పి యందు సత్త్వగుణమే యాదరముతో పెంపొందించుకొనదగినదనియు, భగవదారాధనబుద్ధితో జేయబడు స్వవర్ణాశ్రమోచిత కర్మలు పరమపురుషప్రాప్తికి ఉపాయముగా పరిణమించుననియు, గీతాశాస్త్రమునకు సారభూతమైన యర్థము భక్తియే యనియు నీ పదునెనిమిదవ యధ్యాయమున జెప్పబడినది.

శ్రీమద్భగవద్గీత – అష్టాదశాధ్యాయము

విషయసూచిక

శ్లోక సంఖ్య

అస్మద్గురుభ్యోనమః

శ్రీమద్భగవద్గీతా – అష్టాదశోఽధ్యాయః

మోక్షసన్న్యాసయోగః

అర్జున ఉవాచ = అర్జునుడు పలికెను

1. శ్లో. సన్న్యాసస్య మహాబాహో! తత్త్వ మిచ్ఛామి వేదితుమ్ ।
త్యాగస్య చ హృషీకేశ । పృథక్కేశి నిషూదన! ।

అర్థము : హృషీకేశ = ఇంద్రియములకు నియామకుడవును, కేశినిషూదన = కేశిని సంహరించినవాడవును, మహాబాహో = భుజబలమును కలవాడవును నగునో కృష్ణా!, సన్న్యాసస్య = సన్న్యాసము యొక్కయు, త్యాగస్య చ = త్యాగము యొక్కయు, తత్త్వం = నిజ రూపమును, పృథక్ = వేఱువేఱుగా, వేదితుం = తెలిసికొనుట కొఱకు, ఇచ్ఛామి = కోరుచున్నాను.

తా॥ ఓ కృష్ణా! సన్న్యాస త్యాగ శబ్దములు వేఱువేఱా? ఒకే యర్థము కలవియా? వేఱైనచో వాటి స్వరూపమును వేఱువేఱుగా నెఱుంగ గోరుచున్నాను. ఏకమైనను దాని స్వరూపము నెఱింగింపుము.

అవ. శ్రీకృష్ణపరమాత్మ దీనిని గూర్చి వాదులయొక్క భేదాభిప్రాయములను ముందు వినిపించుచున్నాడు.

శ్రీ భగవానువాచ = శ్రీకృష్ణుడు పలికెను.

2. శ్లో. కామ్యానాం కర్మణాం న్యాసం । సన్న్యాసం కవయో విదుః ।
సర్వకర్మఫలత్యాగం । ప్రాహుస్త్యాగం విచక్షణాః ।

అర్థము : కవయః = (కొందఱు) పండితులు, కామ్యానాం = ఫలాశతో చేయబడు, కర్మణాం = పుత్రకామేష్టి మొదలగు కర్మలయొక్క, న్యాసం = విడుచుట, సన్న్యాసం = సన్న్యాస (మని), విదుః = తెలియుదురు, విచక్షణాః = (కొందఱు) విద్వాంసులు, సర్వకర్మఫల త్యాగం = సమస్త కర్మలయొక్క ఫలమును విడిచి పెట్టుటయే, త్యాగం = త్యాగ శబ్దార్థముగా, ప్రాహుః = చెప్పుచున్నారు.

తా॥ కొందఱు పండితులు పుత్రకామేష్టి మొదలగు కామ్యకర్మలను స్వరూపముతోనే విడుచుట సన్న్యాసమందురు. మఱికొందరు విద్వాంసులు నిత్యనైమిత్తిక కామ్యకర్మల నాచరించుచు వాటి ఫలములను మాత్రము విడుచుట సన్న్యాసమందురు.

(ఈ శ్లోకమందును ముందు శ్లోకములలోను త్యాగ సన్న్యాస శబ్దములను శ్రీకృష్ణుడు పర్యాయములుగా వాడుటచే రెండును ఒకే యర్థము గల రెండు పర్యాయ శబ్దములేయని తెలియుచున్నది)

అవ. ఇంకను దీనిని గూర్చి మరికొందఱు విద్వాంసుల యభిప్రాయముల నెఱింగించుచున్నాడు.

3. శ్లో. త్యాజ్యం దోషవ దిత్యేకే । కర్మ ప్రాహు ర్మనీషిణః ।
యజ్ఞ దాన తపః కర్మ । న త్యాజ్య మితి చాపరే ॥

అర్థము : ఏకే = కొందఱు, మనీషిణః = బుద్ధిమంతులు, దోషవత్ = రాగాది దోషములవలె, కర్మ = సమస్తకర్మయు, త్యాజ్యం ఇతి = విడువదగినదని, ప్రాహుః = చెప్పుదురు. అపరేచ = మరికొందఱు (పండితులు) యజ్ఞ దాన తపః కర్మ = యజ్ఞము దానము తపస్సనెడు కర్మ, న త్యాజ్యం ఇతి = విడువతగనిదని, (ప్రాహుః = చెప్పుదురు)

తా॥ సాంఖ్యులును, వారి ననుసరించువారును, యజ్ఞాది కర్మలన్నియు, రాగాది దోషములను బుట్టించి బంధహేతువులగును గాన ముముక్షువులు వాటిని దరిజేరనీయరాదందురు. మరికొందఱు యజ్ఞదాన తపః కర్మలు విడువ తగనివని చెప్పుదురు.

అవ. ఇక తన నిశ్చయము నెఱింగించుచున్నాడు.

4. శ్లో. నిశ్చయం శృణు మే తత్ర । త్యాగే భరతసత్తమ ! ।
త్యాగో హి పురుషవ్యాఘ్ర ! త్రివిధ స్సంప్రకీర్తితః ॥

అర్థము : భరతసత్తమ = భరతశ్రేష్ఠా! తత్ర = ఆ, త్యాగే = త్యాగవిషయమున, మే = నా యొక్క, నిశ్చయం = నిర్ణయమును, శృణు = వినుము, పురుష వ్యాఘ్ర = పురుషశ్రేష్ఠుడా! త్యాగః = త్యాగము, త్రివిధః = మూడు విధములు కలదిగా, సంప్రకీర్తితః హి = చెప్పబడియున్నది కదా!

తా॥ అర్జునా! ఇంతవరకు వాదుల భిన్నాభిప్రాయములను వినిపించితిని. ఇక నా యభిప్రాయమును వినుము. వేదోక్తమైన నిత్యనైమిత్తిక కామ్యకర్మలన్నియు చేయవలసినవియే. కాని వాటిని చేయునపుడు మాత్రము వాటి ఫలమును, 'నేను చేయుచున్నా' ననెడు కర్తృత్వాభిమానమును, 'ఈ కర్మ నాది' యనెడు మమకారమును పూర్తిగ విడిచివేయవలెను.

5. శ్లో. యజ్ఞ దాన తపః కర్మ । న త్యాజ్యం కార్య మేవ తత్ ।
యజ్ఞో దానం తపశ్చైవ । పావనాని మనీషిణామ్ ।

అర్థము : యజ్ఞ దాన తపః కర్మ = యజ్ఞము దానము తపస్సు అనెడు కర్మ, న త్యాజ్యం = విడువతగినదిగాదు, తత్ = అది, కార్యం ఏవ = చేయదగినదియే, మనీషిణాం = ఉపాసకులకు, యజ్ఞః = యజ్ఞము, దానం = దానము, తపః చ ఏవ = తపస్సున్ను, పావనాని = ప్రాచీనకర్మను నశింపజేయునవి, (భవన్తి = అగుచున్నవి)

తా॥ యజ్ఞము, దానము, తపస్సులనబడు వైదిక కర్మలు ముముక్షువులకు జీవించువరకును చేయదగినవియేగాని విడువరాదు. ఏలయనగా - ఇవి వర్ణాశ్రమాను గుణముగా శాస్త్రమున విధింపబడినవిగాన నవి వారి యుపాసనకు ప్రతిబంధకమైన పూర్వకర్మల నన్నిటిని నశింపజేయును.

అవ. ఈ కర్మలు దోషావహములు కావనెడు విశ్వాసము బలపడుటకై తిరిగి దృఢముగ జెప్పి ముగించుచున్నాడు.

6. శ్లో. ఏతాన్యపి తు కర్మాణి । సఙ్గం త్యక్త్వా ఫలాని చ ।
కర్తవ్యానీ తి మే పార్థ! నిశ్చితం మత ముత్తమమ్ ।

అర్థము : పార్థ = ఓ అర్జునా! ఏతాని = ఈ చెప్పబడిన, కర్మాణి అపి = కర్మలుకూడా, సఙ్గం = మమకారమును, ఫలాని చ = ఫలములను, త్యక్త్వా = విడిచిపెట్టి, కర్తవ్యాని ఇతి = చేయదగినవని, మే = నా యొక్క, నిశ్చితం = నిశ్చయింపబడిన, ఉత్తమం = శ్రేష్ఠమైన, మతం = అభిప్రాయము, (భవతి = అగుచున్నది)

తా॥ ఉపాసకులకు యజ్ఞ దాన తపస్సులు పావనములగుటచే ముముక్షువైనవాడు ఉపాసనతోపాటుగనీ యజ్ఞాది కర్మలనుగూడ నా యారాధనయే యను బుద్ధితో వాటియందలి మమకారమును ఫలమును విడిచి

బ్రతికియున్నంత వరకు ప్రతిదినమునను ఉపాసనసిద్ధికై యాచరించవలెను. ఇది నా నిశ్చితమైన ఉత్తమాభిప్రాయము.

అవ. వెనుక చెప్పబడిన మతాంతరములన్నియు నధమములనియు తన మత ముత్తమమైనదనియు విస్తరించియున్నాడు. అందు ముందుగా తామస త్యాగమును వివరించుచున్నాడు.

7. శ్లో. నియతస్య తు సన్న్యాసః । కర్మణో నోపపద్యతే ।
మోహా త్తస్య పరిత్యాగ । స్తామసః పరికీర్తితః ॥

అర్థము : నియతస్య = నిత్యనైమిత్తిక రూపమైనట్టి, కర్మణః = మహాయజ్ఞాది కర్మకు, సన్న్యాసః = సుతరాం విడుచుట, న ఉపపద్యతే = తగదు, మోహాత్ = అజ్ఞానమువలన, తస్య = ఆ నిత్య కర్మయొక్క, పరిత్యాగః = విడుచుట, తామసః = అజ్ఞానమూలమని, పరికీర్తితః = చెప్పబడెను.

తా॥ నిత్యనైమిత్తిక రూపమైన మహాయజ్ఞాది వైదికకర్మలను విడురాదు. అవి పాపములను పారద్రోలి జ్ఞానమును వృద్ధిపొందించును. వీటిని బంధకములని భ్రమించి పరిత్యజించినచో తామసులనబడుదురు. తమోగుణ మజ్ఞానమునకు మూలమగుటచే నీ త్యాగము తామసమే యగును.

అవ. రాజస త్యాగమును వివరించుచున్నాడు.

8. శ్లో. దుఃఖ మిత్యేవ యత్కర్మ । కాయక్లేశ భయా త్త్యజేత్ ।
స కృత్వా రాజసం త్యాగం । నైవ త్యాగఫలం లభేత్ ।

అర్థము : (యః = ఎవడు) దుఃఖం ఇతి ఏవ = కష్టపడి చేయవలసినదగుటచే దుఃఖాత్మకమైనదియేయని, కాయక్లేశభయాత్ = శరీరమును కష్టబెట్టునదను భయమువలన, యత్ = ఏ, కర్మ = వర్ణాశ్రమ ధర్మమును, త్యజేత్ = విడుచునో, సః = వాడు, రాజసం = రజోమూలమైన, త్యాగం = త్యాగమును, కృత్వా = చేసి, త్యాగ ఫలం= సాత్త్విక త్యాగము యొక్క ఫలమును, న ఏవ లభేత్ = పొందనేరడు.

తా॥ కర్మ మోక్షసాధనమైనను దుఃఖాత్మకమైన ద్రవ్యార్జనాదులచే సాధింపదగినదియు, శరీరమును కష్టపెట్టునదియు నగుటవలన భయముచే వర్ణాశ్రమ ధర్మములను విడిచినచో నా త్యాగము రజోగుణ మూలమగునుగాని వాస్తవ త్యాగము కానేరదు. సాత్త్విక త్యాగమునకు ఫలమైన జ్ఞానోత్పత్తి వానికి కలుగనేరదు.

అవ. సాత్త్వికత్యాగము సత్త్వగుణ కార్యమగు వాస్తవమైన జ్ఞానమూలము గాన నదియే శాస్త్రీయమైన త్యాగమని తెలుపుచున్నాడు.

9. శ్లో. కార్య మిత్యేవ య త్కర్మ । నియతం క్రియతేఽర్జున ।
సఙ్గం త్యక్త్వా ఫలంచైవ స త్యాగ స్సాత్త్వికో మతః ॥

అర్థము : అర్జున = ఓ యర్జునా! నియతం = నిత్యనైమిత్తికరూపమైన, యత్ కర్మ = ఏ కర్మ, కార్యం ఇతి ఏవ = చేయదగినదని, సఙ్గం = మమకారమును, ఫలంచ ఏవ = ఫలమును నున్ను, త్యక్త్వా, = విడిచి, క్రియతే = చేయబడుచున్నదో, సః = ఆ, త్యాగః = త్యాగము, సాత్త్వికః = సత్త్వగుణ ప్రధానమైనదని, మతః = తలంచబడునది (భవతి= అగుచున్నది.)

తా॥ అర్జునా! నిత్యనైమిత్తకములగు మహాయాజ్ఞాది వర్ణాశ్రమ ధర్మములు నిజమునకు భగవతారాధన రూపములే గాన అవశ్య కర్తవ్యములని తలంచి వాటియందు మమకారముగాని ఫలేచ్ఛగాని లేక యాచరించుట సాత్త్వికత్యాగ మన బడుచున్నది.సాత్త్వికమనుగా వాస్తవ శాస్త్రార్థజ్ఞాన మూలమైనదని భావము.

అవ. సత్త్వగుణ మూలమైన శాస్త్రోక్తత్యాగముతో కర్మల నాచరించువానికి ప్రధాన లక్షణమైన నిర్వికారత్వమును జెప్పుచున్నాడు.

10. శ్లో. న ద్వేష్ట్యకుశలం కర్మ । కుశలే నాఽనుషజ్యతే ।
త్యాగీ సత్త్వ సమావిష్టో । మేధావీ ఛిన్న సంశయః ।

అర్థము : సత్త్వసమావిష్టః = సత్త్వగుణముతో కూడుకొనినవాడును, మేధావీ = సత్త్వజ్ఞానము కలవాడును, ఛిన్న సంశయః = పోయిన సంశయములు కలవాడునునగు, త్యాగీ= ఫలసంగకర్తృత్వములను విడిచినవాడు, అకుశలంకర్మ = పాపకర్మను, నద్వేష్టి = ద్వేషింపడు, కుశలే = శుభకర్మయందు, న అనుషజ్యతే = సక్తుడుకాడు.

తా॥ సత్త్వగుణ సంపన్నుడగుట వలన తత్త్వజ్ఞానము కలవాడై సంశయముల నన్నిటిని పాఁద్రోలి ఫల సంగ కర్తృత్వములను విడిచి కర్మల నాచరించువాడు శుభకర్మలయం దాసక్తుడుగాని, ప్రమాదముచే తటస్థించు అశుభ కర్మలయందు ద్వేషయుక్తుడుగాని కాడు.

అవ. ఇంతవరకు చెప్పబడిన మూడు విధములైన (ఫలసంగకర్తృత్వముల) సాత్త్విక త్యాగోపదేశమును విరమించుచున్నాడు.

11. శ్లో. నహి దేహభృతా శక్యం। త్యక్తుం కర్మాణ్యశేషతః।
యస్తు కర్మఫలత్యాగీ। స త్యాగీ త్యభిధీయతే॥

అర్థము : దేహభృతా = మానవునిచేత, కర్మాణి = కర్మలను, అశేషతః = పూర్తిగా, త్యక్తుం = విడుచుటకు, శక్యం నహి = సాధ్యముకాదు గదా! యఃతు = ఎవ్వడైతే, కర్మ ఫలత్యాగీ = కర్మఫలమును విడుచువాడో, సః = వాడు, త్యాగీ ఇతి = త్యాగియని, అభిధీయతే = చెప్పబడుచున్నాడు.

తా॥ శరీరమున్నంతవరకు కర్మలను బొత్తిగా జేయకుండుట శక్యము కాదు. దేహధారణకు సంబంధించిన కర్మలనున్ను విడువ శక్యము కాదు. అట్టి కర్మలను ఫల సంగ కర్తృత్వములను విడిచి చేయువాడు శాస్త్రములయందు త్యాగియని చెప్పబడుచున్నాడు.

అవ. నిత్యనైమిత్తిక కర్మలనుగూడ కామ్యకర్మలకు వలెనే ఫలములతో గూడినవిగా శాస్త్రములు విధించుచున్నవి. కావున ఫలములను గోరక యాచరించినను బీజములవలె ఫలముల నొసంగకమానవు. అట్టి తరి మోక్షార్థికి కర్మలు త్యాజ్యములేగాని ఉపాదేయములు కావుగదా! అనెడు శంకకుత్తర మొసంగుచున్నాడు.

12. శ్లో. అనిష్ట మిష్టం మిశ్రం చ। త్రివిధం కర్మణః ఫలమ్।
భవత్య త్యాగినాం ప్రేత్య। న తు సన్న్యాసినాం క్వచిత్॥

అర్థము : కర్మణః = కర్మకు, అనిష్టం = నరకాదికమును, ఇష్టం = స్వర్గాదికమును, మిశ్రం చ= సుఖదుఃఖములు కలిసియున్న పుత్రపశ్వాదికమును నగు, త్రివిధం = మూడు విధములైన, ఫలం = ఫలము, ప్రేత్య = కర్మల నాచరించిన పిమ్మట, అత్యాగినాం= ఫలసంగ కర్తృత్వములను విడువనివారికి, భవతి = కలుగుచున్నది, సన్న్యాసినాం= వాటిని విడిచినవారికి, క్వచిత్ అపి = ఒకానొకప్పుడున్ను న (భవతి) = కలుగదు.

తా॥ కర్మఫలములు అనిష్టములనియు, ఇష్టములనియు, మిశ్రములనియు మూడు విధములు. దుఃఖజనకములైన నరకాదు లనిష్టములు, సుఖకరములైన స్వర్గాదు లిష్టములు, సుఖ దుఃఖములు కలిసియుండు పుత్రపశ్వాదులు మిశ్రములు. ఫలాశతో కర్మల నాచరించువారికి మూడింటిలో నేదోయొక ఫలము తప్పక కలుగును. ఫలసంగకర్తృత్వ

త్యాగముతో కర్మల నాచరించువారికి మోక్ష విరోధియగు ఫలమెన్నడును కలుగదు.

అవ. మూడు విధములగు త్యాగములలో కర్తృత్వ త్యాగము ముఖ్యమైనది. అది సిద్ధించిన మిగిలినవి తమంతనే సిద్ధించును. అది యన్నింటికిని నంతర్యామిగా నుండు భగవంతుడే కర్తయని యనుసంధించుటచే సిద్ధించునని చెప్పుచున్నాడు.

(భగవంతుడు కర్తయనగా - భగవంతుడు తనకు శరీరమువలె పరతంత్రుడగు జీవునిగాని తనవియే యనదగిన నాతనికరణ కళేబరాదులతో తన లీలకై కర్మలను చేయించుచున్నాడని తలంచవలెను.)

13. శ్లో. పఞ్చైతాని మహాబాహో! కారణాని నిబోధ మే ।
సాఙ్ఖ్యే కృతాన్తే ప్రోక్తాని । సిద్ధయే సర్వకర్మణామ్ ॥

అర్థము : మహాబాహో! = అర్జునా! సర్వకర్మణామ్ = సకల కర్మల యొక్క, సిద్ధయే = పుట్టుకకై, సాఙ్ఖ్యే = తత్త్వవిషయమైన బుద్ధితో ననుసంధింపబడు, కృతాన్తే = సిద్ధాన్తమునందు, ప్రోక్తాని = చెప్పబడిన, ఏతాని = ఈ, పఞ్చ = ఐదైన, కారణాని= కారణములను, మే = నానుండి, నిబోధ = తెలిసికొనుము.

తా॥ నిజమైన తత్వమును నిర్ణయించుట కొఱకేర్పడిన వేదభాగము నెఱింగినవారు చేయు నిర్ణయమునందు సమస్త కర్మలయొక్క ఉత్పత్తికీ యైదు కారణములు చెప్పబడినవి. వాటిని నావలన నెఱుంగుము.

అవ. ఆ కారణముల నైదింటిని చెప్పుచున్నాడు.

14. శ్లో. అధిష్ఠానం తథా కర్తా । కరణం చ పృథగ్విధమ్ ।
వివిధా చ పృథక్చేష్టా । దైవం చైవాత్ర పఞ్చమమ్ ॥

అర్థము : అధిష్ఠానం = శరీరము, తథా = అట్లే, కర్తా = జీవాత్మ, పృథగ్విధమ్ = వేఱువేఱు వ్యాపారములుగల, కరణంచ = మనస్సు కర్మేంద్రియములైదును, పృథక్ = వేఱువేఱుగా, వివిధా = నానావిధమైన, చేష్టా = ప్రాణాదిపంచవాయువుల వ్యాపారమున్ను, పఞ్చమమ్ = ఐదవదియగు, దైవంచ ఏవ = పరమాత్మయు, (ఏతే = ఈ, పఞ్చ = ఐదును, అత్ర = ఈ కర్మలు పుట్టుటలో, హేతవః = కారణములు, భవన్తి = అగుచున్నవి)

(అని ముందు శ్లోకముతో సంబంధము)

తా॥ శరీరము, జీవాత్మ, ఐదు కర్మేంద్రియములు, మనస్సున్ను, ప్రాణాపానాది ఐదు వాయువుల యొక్క వేఱువేఱు వ్యాపారములున్ను, అంతర్యామియగు పరమాత్మయు (అనెడు నివి కర్మ పుట్టుటకు) ముఖ్య కారణములు.

అవ. ఇవి యెట్టి కర్మలకు కారణభూతములో చెప్పుచున్నాడు.

15. శ్లో. శరీరవాఙ్మనోభి ర్య । త్కర్మ ప్రారభతే నరః ।
న్యాయం వా విపరీతం వా । పఞ్చైతే తస్య హేతవః ॥

అర్థము : నరః = మనుష్యుడు, శరీర వాఙ్మనోభిః = శరీరము వాక్కు మనస్సుల చేత, న్యాయం వా = శాస్త్రీయమైనను, విపరీతం వా = శాస్త్రీయము కానిదైనను, యత్ కర్మ = ఏకర్మను, ప్రారభతే = ఆరంభించుచున్నాడో, తస్య = ఆకర్మకు, ఏతే = ఈ, పఞ్చ = ఐదున్ను, హేతవః = కారణములు, భవన్తి = అగుచున్నవి.

తా॥ శరీరము వాక్కు మనస్సులతో శాస్త్రములో చెప్పబడినట్టిగాని, చెప్పబడనట్టిగాని, కూడదని చెప్పబడినట్టిగాని ఏ కర్మల నే మానవుడు చేసినను ఈ చెప్పబడిన ఐదును వాటికి కారణములగుచున్నవి.

అవ. ఆత్మ నిజమునకు కర్తయైయుండగా అకర్తృత్వానుసంధానమెట్లు ఘటించుననగా - అకర్తృత్వానుసంధానమనగా - వెనుక చెప్పబడినట్లు ఐదుకారణములచే నిర్వహింపబడు కర్మకు తానొక్కడే కర్తయని తలంచకుండుటయేయని చెప్పుచున్నాడు.

16. శ్లో. తత్రైవం సతి కర్తార । మాత్మానం కేవలం తు యః ।
పశ్య త్యకృత బుద్ధిత్వా । న్న పశ్యతి సదుర్మతిః ।

అర్థము : తత్ర = ఆవిధముగ కర్మప్రారంభకారణముల విషయమై, ఏవం సతి = జీవుని కర్తృత్వము, పరమాత్మ యొక్క అనుమతి మూలకమైయుండగా, కేవలం ఆత్మానం తు = ఒక ఆత్మను (తనను) మాత్రమే, కర్తారం = కర్తనుగా, యః = ఎవ్వడు, పశ్యతి = తలంచుచున్నాడో, సః = అట్టి, దుర్మతిః = అవివేకి, అకృతబుద్ధిత్వాత్ = వస్తుతత్వమును వాస్తవముగ నెఱుంగని బుద్ధికలవాడగుట వలన, న పశ్యతి = కర్తను నిజముగ నెఱుంగజాలడు.

తా॥ ఈ విధముగ ఆయా కర్మలయొక్క ప్రారంభమునకు హేతువుల విషయమై జీవునియొక్క కర్తృత్వము, పరమాత్మానుమతి

మూలకమైయుండగా తనను మాత్రమే కర్తయని తలంచువాడు వస్తుతత్వజ్ఞానము లేనివాడేగాన కర్తను నిజరూపమున నెఱుంగజాలడు.

అవ. తనను కర్తనుకానని తలంచుటకు ప్రయోజనమును జెప్పుచున్నాడు. ఇట్టివాడే సుమతి.

17. శ్లో. యస్య నాహంకృతో భావో । బుద్ధి ర్యస్య న లిప్యతే ।
హత్వాపి స ఇమాల్లోకా । న్న హన్తి న నిబధ్యతే ॥

అర్థము : యస్య = ఎవనియొక్క, భావః = కర్తృత్వమును గూర్చిన మనో వ్యాపారము, అహంకృతః = నేను చేయుచున్నానెడు జ్ఞానముతో కూడినది. న = కాదో, యస్య = ఎవనియొక్క, బుద్ధిః = కర్మను గూర్చిన బుద్ధి, న లిప్యతే = ఫలసంగము కలది కాదో, సః = వాడు, ఇమాన్ = ఈ, లోకాన్ = లోకులనందఱను, హత్వా అపి = చంపియును, నహన్తి = చంపిన వాడుకాడు, న నిబధ్యతే = బంధింపబడడు.

తా॥ పరమాత్మయే కర్తయని తలంచి కర్మలను చేయుచుండుటచే నెవనికి 'నేను చేయుచున్నా' ననెడు యభిమానముండదో "నేను కర్తను కాకుండుటచే దీని ఫలము నన్నంట" దనెడు బుద్ధి యెవనికి జనించునో వా డీ కౌరవసేననే కాదు లోకుల నందరను సంహరించినను దానివలన కలుగు పాపము ననుభవించడు.

అవ. ఇట్టి యనుసంధానము సత్త్వ గుణాభివృద్ధివలననే కలుగునుగాన సత్వగుణమును పెంపొందించు కొనవలెనని తెలుపుటకై కర్మలయందు సత్త్వాది గుణములచే కలుగు భేదములను సవిస్తరముగా చెప్పదలంచుచు ముందుగ కర్మల విధించు రీతిని జెప్పుచున్నాడు.

8. శ్లో. జ్ఞానం జ్ఞేయం పరిజ్ఞాతా । త్రివిధా కర్మచోదనా ।
కరణం కర్మ కర్తేతి । త్రివిధః కర్మ సఙ్గ్రహః ॥

ర్థము : జ్ఞానం = కర్మస్వరూపము యొక్క యెఱుకయు, జ్ఞేయం = చేయదగిన కర్మయు, పరిజ్ఞాతా = ఆ కర్మను తెలుసుకొనువాడును, (అని) కర్మ చోదనా = కర్మవిధి, త్రివిధా = మూడు విధములైనది, కరణం = సాధనమగు ద్రవ్యాదికము, కర్మ = యాగాదికము, కర్తా = చేయువాడు, ఇతి = అని, త్రివిధః = మూడు విధములుగా, కర్మసఙ్గ్రహః = కర్మయొక్క సంగ్రహము (భవతి = అగుచున్నది)

తా॥ చేయదగిన కర్మజ్ఞానము, చేయదగిన కర్మ, దాని నెఱింగినవాడని కర్మవిధి మూడింటితో గూడియున్నది. వాటియందు తెలియదగిన కర్మయు, తిరిగి యాగాది కర్మ, ద్రవ్యాదులనెడు సాధనములు, చేయునట్టి కర్తయని మూడు విధములుగా సంగ్రహింపబడుచున్నది.

అవ. వెనుక చెప్పబడిన జ్ఞానజ్ఞేయ పరిజ్ఞాతలనెడు పదార్థములే యీ శ్లోకములో తిరిగి చెప్పబడుచున్నవి.

19. శ్లో. జ్ఞానం కర్మ చ కర్తా చ । త్రిధైవ గుణభేదతః ।
ప్రోచ్యతే గుణసఙ్ఖ్యానే । యథావచ్ఛృణు తాన్యపి ॥

అర్థము : జ్ఞానం = చేయదగిన కర్మజ్ఞానము, కర్మచ = చేయదగిన కర్మ, కర్తా చ = చేయువాడును, గుణభేదతః = సత్త్వాది గుణభేదములనుబట్టి, త్రిధా ఏవ = మూడు విధములుగానే, గుణ సఙ్ఖ్యానే = సత్త్వాది గుణకార్యములను లెక్కపెట్టు ప్రకరణములో, ప్రోచ్యతే = చెప్పబడుచున్నది, తాని అపి = వాటిని కూడా, యథావత్ = వాస్తవముగ, శృణు = వినుము.

తా॥ చేయదగిన కర్మజ్ఞానము, చేయవలసిన కర్మ, దానిని చేయుకర్తయున్ను ఒక్కొక్కటి సత్త్వాది గుణభేదములచే మూడు మూడు విధములని చెప్పబడుచున్నవి. ఇట్లు సత్త్వాది గుణములను గణించు ప్రకరణములో చెప్పబడిన యీ గుణములచే భేదించు జ్ఞానాదుల నున్ను తెలియదగిన రీతిగా తెలుసుకొనుము.

అవ. సాత్త్విక జ్ఞానస్వరూపము నెఱిగించుచున్నాడు. (ఇవి చెప్పుట కర్తృత్వము గుణాధీనమని తెలుపుటకే)

20. శ్లో. సర్వభూతేషు యే నైకం । భావ మవ్యయ మీక్షతే ।
అవిభక్తం విభక్తేషు । తజ్జ్ఞానం విద్ధి సాత్త్వికమ్ ।

అర్థము : విభక్తేషు = బ్రాహ్మణ క్షత్రియాదులుగా విభజింపబడిన, సర్వభూతేషు = కర్మలు చేయుటకు తగిన సకల ప్రాణులయందును, ఏకం = ఏకాకారముగల, భావం = ఆత్మను, అవిభక్తం = విభాగములు లేనిదానినిగాను, అవ్యయం = నిర్వికారమైన దానినిగాను, యేన = ఏ జ్ఞానముచే, ఈక్షతే = తెలిసికొనుచున్నాడో, తత్ = ఆ, జ్ఞానం = జ్ఞానమును, సాత్త్వికం = సత్త్వగుణాభివృద్ధిచే కలిగినదానినిగా, విద్ధి = ఎఱుంగుము.

తా॥ కర్మాధికారులు బ్రాహ్మణ క్షత్రియాది వర్ణస్థులుగాను, బ్రహ్మచర్యాది ఆశ్రమస్థులుగాను విభజింపబడియున్నారు. ఇట్టివికారములు శరీరములకు సంబంధించినవియేగాని ఆత్మలన్నియు ఒకే జ్ఞానాకారముగా నుండుటచే వాటికి విభాగము లేదనియు, ఆ శరీరములు వికరించినను ఆత్మమాత్రము నిర్వికారమై ఫలముతో సంబంధమునకు తగనిదై యుండుననియు, తెలుపు జ్ఞానము కర్మానుష్ఠాన వేళ యందున్నచో నా జ్ఞానము సాత్త్వికమనబడును.

అవ. రాజస జ్ఞాన స్వరూపము నెఱింగించుచున్నాడు.

21. శ్లో. పృథక్త్వేన తు యజ్జ్ఞానం । నానా భావాన్ పృథగ్విధాన్ ।
వేత్తి సర్వేషు భూతేషు । తజ్జ్ఞానం విద్ధి రాజసమ్ ॥

అర్థము : భూతేషు = సమస్త ప్రాణులయందును, భావాన్ = ఆత్మలను, పృథక్త్వేన = బ్రాహ్మణాది ఆకారములు వేఱగుటచేత, నానా = అనేక స్వరూపములు కలవిగాను, పృథగ్విధాన్ = పైకిగాన్పించు రంగు పరిమాణము మొదలైన గుణములను బట్టి వేరైనవిగాను, యత్ జ్ఞానం = ఏ జ్ఞానము, వేత్తి = ఎఱుంగుచున్నదో, తత్ జ్ఞానం = ఆ జ్ఞానము, రాజసం = రజోగుణాభివృద్ధిచే కలిగినదని, విద్ధి = ఎఱుంగుము.

తా॥ సకలభూతములయందునుగల బ్రాహ్మణాద్యాకారములును, గుణములును వేఱువేఱుగా నుండుటచే వాటియందున్న ఆత్మలు కూడా అట్లే వేఱు వేఱు ఆకారములను గుణములను కలవనెడు జ్ఞానము కర్మానుష్ఠాన సమయమున నున్నచో నా జ్ఞానము రాజసమనబడును.

(ఈ శ్లోకమున పృథక్త్వ శబ్దము బ్రాహ్మణాదిజాతిని బట్టియు, నానాశబ్దము వస్తుస్వరూపమును బట్టియు, పృథగ్విధ శబ్దము గుణములను బట్టియు ప్రయోగింపబడినవి.)

అవ. తామస జ్ఞానస్వరూపము నెఱింగించుచున్నాడు.

22. శ్లో. యత్తుకృత్స్నవ దేకస్మి । న్కార్యే సక్త మహేతుకమ్ ।
అతత్త్వార్థవ దల్పం చ । తత్తామస ముదాహృతమ్ ॥

అర్థము : యత్ = ఏ, జ్ఞానం తు = జ్ఞానమైతే, ఏకస్మిన్ కార్యే = చేయదగిన యొక పనియందే, కృత్స్నవత్ = సకల ఫలసాధనమగు కర్మ యందువలెనే, సక్తం =

ఆసక్తిగలదియు, అహేతుకం = ఆ యాసక్తికి తగిన కారణము లేనిదియు, అతత్త్వార్థవత్ = ఆత్మలు స్వరూప భావములలో వేరైనవని తలంచునదియు, అల్పంచ = అల్పమైనదియునై యుండునో, తత్ = ఆ జ్ఞానము, తామసం = తామస జ్ఞానమని, ఉదాహృతం = చెప్పబడినది.

తా॥ అల్పఫల మొసంగు భూతప్రేత గణారాధన యొక్కటియే సకల ఫల సాధన మను భ్రాంతితో నాసక్తిని పుట్టించునదియు, నిజమునకా కర్మ కట్టి శక్తి లేనం దున దానియందట్టి సంగముండుటకు తగిన కారణము లేనిదియు, ఆత్మలు వేఱు వేఱనుకొనుట మొదలగు మిథ్యార్థములు కలదియు, అల్పఫలము కలదియు, నీచ దేవతారాధనకు పురికొల్పుటచే నీచమైనదియునగు జ్ఞానము తామస మనబడును.

అవ. అనుష్ఠింపదగిన కర్మ, సత్త్వాది గుణములచే మూడు విధములగునని చెప్పుచున్నాడు.

23. శ్లో. నియతం సఙ్గరహిత। మరాగద్వేషతః కృతమ్ ।
అఫల ప్రేప్సునా కర్మ । యత్త త్సాత్త్విక ముచ్యతే ।

అర్థము : అఫల ప్రేప్సునా = ఫలాశలేనివానిచే, నియతం = తనవర్ణాశ్రమమునకు తగినట్టియు, సఙ్గరహితం = కర్తృత్వాది సంగములేనట్టియు, అరాగద్వేషతః = కీర్తియందాశయు అపకీర్తియందు ద్వేషము (దంభము) లేక, కృతం = చేయబడిన, యత్ కర్మ = ఏకర్మ (అస్తి = కలదో), తత్ = అది, సాత్త్వికం = సత్త్వగుణ ప్రధాన మైనదిగా, ఉచ్యతే = చెప్పబడుచున్నది.

తా॥ ఫలమునందాశను వీడి తన వర్ణాశ్రమమునకు తగిన కర్మ కీర్తియందాశను అపకీర్తియందు ద్వేషమును లేక తాను కర్తనుకానని తలంచుచు చేయబడు నెడల నది సాత్త్విక కర్మగా జెప్పబడుచున్నది.

అవ. రాజసకర్మ స్వరూపము నెఱింగించుచున్నాడు.

24. శ్లో. యత్తు కామేప్సునా కర్మ । సాహఙ్కారేణ వా పునః ।
క్రియతే బహులా౽౽యాసం । తద్రాజస ముదాహృతమ్॥

అర్థము : యత్ కర్మ తు పునః = ఏకర్మ అయితే, కామేప్సునా = ఫలాశ కలిగినట్టియు, సాహఙ్కారేణ వా = కర్తృత్వాభిమానముతో కూడినట్టి వానిచేత, బహులాయాసం = మిక్కిలి శ్రమకలుగునట్లుగా, క్రియతే = చేయబడుచున్నదో, తత్ = ఆకర్మ, రాజసం = రాజసకర్మగా, ఉదాహృతం = చెప్పబడినది.

తా॥ ఫలాశతో నేను కర్తను, యీ కర్మనాది, దీని ఫలమును నేననుభవింతునను సంకల్పముతో తగని శ్రమల నోర్చి చేయబడు కర్మ రాజసమన బడుచున్నది.

అవ. తామస కర్మ స్వరూపము నెఱింగించుచున్నాడు.

25. శ్లో. అనుబంధం క్షయం హింసా । మనవేక్ష్య చ పౌరుషమ్ ।
మోహా దారభ్యతే కర్మ । యత్తత్తామస ముచ్యతే ॥

అర్థము : అనుబంధం = కర్మలు చేయునపుడు కలుగు దుఃఖమును, క్షయం = ధననాశనమును, హింసాం = అందుగావింపబడు ప్రాణిపీడను, పౌరుషం = తన శక్తిని, అనపేక్ష్య = చూడక, మోహాత్ = పరమ పురుషుడే కర్తయని యెఱుంగక, యత్ కర్మ = ఏకర్మ, ఆరభ్యతే = ప్రారంభింపబడుచున్నదో, తత్ = ఆకర్మ, తామసం = తామసముగా, ఉచ్యతే = చెప్పబడుచున్నది.

తా॥ తాను చేయదలంచిన కర్మలను చేయుచుండగా కలుగునట్టి దుఃఖము నుగాని, దానికై అగునట్టి ధనవ్యయమునుగాని, అందుకొఱకై చేయ వలసిన ప్రాణిహింసనుగాని, ఆపనికి కావలసిన తన శక్తిని పాటించకయే, పరమాత్మ శేషియై అతనికి శరీరమువలె పరతంత్రుడగు తనచే చేయించు చున్నాడు గాన నిజమునకు కర్త యాతడే యని యెఱుంగక చేయుకర్మ తమోగుణోద్రేకముచే చేయబడినదని చెప్పబడు చున్నది.

అవ. గుణభేదమును బట్టి కర్త మూడు విధములని చెప్పదలంచి సాత్త్వికకర్త యొక్క స్వరూపము నెఱింగించుచున్నాడు.

26. శ్లో. ముక్తసఙ్గోఽనహంవాదీ । ధృత్యుత్సాహ సమన్వితః ।
సిద్ధ్యసిద్ధ్యో ర్నిర్వికారః । కర్తా సాత్త్విక ఉచ్యతే ॥

అర్థము : ముక్తసఙ్గః = ఫలమునందాశలేనట్టియు, అనహంవాదీ = నేను కర్తననెడు అభిమానములేనట్టియు, ధృత్యుత్సాహసమన్వితః - ధృతి = ఆరంభించినపని పూర్తియగు వరకు తప్పనిసరియగు దుఃఖములను నిర్లక్ష్యముగా భరించుట, ఉత్సాహ = కార్యమును కొనసాగించుటలో మనస్సునకుగల ప్రోత్సాహము (అనునీ రెండింటితో) సమన్వితః=కూడుకొనియుండునట్టియు, సిద్ధ్యసిద్ధ్యోః=ఫలము సిద్ధించుట సిద్ధించకుండుట విషయమై, నిర్వికారః = మార్పు చెందని చిత్తము కలిగియుండు, కర్తా= కర్త, సాత్త్వికః = సత్త్వగుణము ప్రధానముగా కలవాడుగా, ఉచ్యతే = చెప్పబడుచున్నాడు.

తా॥ ఫలమునందాశలేక, తనను కర్తనుగా తలంచక, కర్మలను చేయుచుండగా తటస్థించిన దుఃఖములను సుఖములుగనే తలంచుచు, కార్యదీక్షయందంత కంత కభివృద్ధిని చెందు ఉత్సాహముకలవాడై ఆ కర్మకుగాని తత్సంబంధి ద్రవ్యార్జనాదులకుగాని, ఫలము సిద్ధించినను సిద్ధించకున్నను మార్పు చెందని చిత్తముకలవాడు సాత్త్వికకర్తగా పరిగణించబడుచున్నాడు.

అవ. రాజసకర్తయొక్క స్వరూపమును తెలుపుచున్నాడు.

27. శ్లో. రాగీ కర్మఫల ప్రేప్సు । ర్లుబ్ధో హింసాత్మకోఽ శుచిః ।
హర్ష శోకాన్వితః కర్తా । రాజసః పరికీర్తితః ॥

అర్థము ׃ రాగీ = కీర్తిని కోరువాడును, కర్మఫలప్రేప్సుః = చేసిన పనికి ఫలమునపేక్షించువాడును, లుబ్ధః = కర్మకు కావలసిన ధనమును ఖర్చు చేయనివాడును, హింసాత్మకః = పరులను పీడించి పనిచేయించుకొనువాడును, అశుచిః = ఆ కర్మకవసరమైన శాస్త్రోక్త శుద్ధి లేనివాడును, హర్షశోకాన్వితః = లాభనష్టములకు పొంగు క్రుంగులు కలవాడునునగు, కర్తా = కర్త, రాజసః = రజోగుణ ప్రధానుడుగా, పరికీర్తితః = చెప్పబడుచున్నాడు.

తా॥ కీర్తిని కోరి కర్మల నాచరించునట్టియు, ఫలము నాశించి కర్మలను చేయు నట్టియు, అవసరమగు ధన వ్యయమును చేయుటకు సంకోచించునట్టియు, పరులను బాధించి తన పనిని చేయించుకొను నట్టియు, ఆ కర్మలకు అవసరమైన శాస్త్రోక్త శుద్ధి లేనట్టియు, కర్మల లాభనష్టములకు పొంగు క్రుంగులు గలవాడును రాజస కర్తగా చెప్పబడుచున్నాడు.

అవ. తామస కర్త యొక్క స్వరూపమును జెప్పుచున్నాడు.

28. శ్లో. అయుక్తః ప్రాకృత స్స్తబ్ధః । శఠోనైకృతికోఽలసః ।
విషాదీ దీర్ఘ సూత్రీ చ । కర్తా తామస ఉచ్యతే ॥

అర్థము ׃ అయుక్తః = శాస్త్రోక్తకర్మ కధికారములేనివాడును, ప్రాకృతః = చదువులేనివాడును, స్తబ్ధః = బద్ధకము కలవాడును, శఠః = చేతబడి మొదలగు కర్మలయందభిరుచి కలవాడును, నైకృతికః = మోసగాడును, అలసః = మందముగా పనులను చేయువాడును, విషాదీ = కొద్దినష్టమున కపరిమిత నిరుత్సాహమును చెందువాడును, దీర్ఘసూత్రీ = అభిచారాదులచే పరులకు చాలాకాలముండునట్టి యనర్థములను

సంకల్పించువాడును (అగు) కర్తా = కర్త, తామసః = తామసుడని, ఉచ్యతే = చెప్పబడుచున్నాడు.

తా॥ తనకు తగని శాస్త్రీయ కర్మల నారంభించునట్టియు, దానికి తగిన విద్య లేనట్టియు, మిక్కిలి బద్ధకము కలిగినట్టియు, పరుల కనర్థదాయకములైన చేతబడి మొదలగు కర్మలయందే అభిరుచి కలిగినట్టియు, మోసగాడును, అతి నెమ్మదిగా పనిచేయువాడును, కొద్దిపాటి నష్టమునకే అపరిమిత నిరుత్సాహమును చెందువాడును, పరులకు చాలాకాలముండునట్టి కష్టములకు కారణమైన పనులనే సదా ఆలోచించువాడును నగు కర్త తామసుడుగా జెప్పబడుచున్నాడు.

అవ. సకల తత్త్వములకును, నిఖిల పురుషార్థములకును సంబంధించిన నిశ్చయరూపమగు బుద్ధియొక్కయు, ధృతి యొక్కయు, సత్త్వాది గుణముల వలన కలుగు త్రైవిధ్యమును చెప్పుచున్నాడు.

29.శ్లో. బుద్ధే ర్భేదం ధృతేశ్చైవ । గుణత స్త్రివిధం శృణు ।
ప్రోచ్యమాన మశేషేణ । పృథక్త్వేన ధనఞ్జయ ! ॥

అర్థము : ధనఞ్జయ = అర్జునా ! బుద్ధేః = బుద్ధియొక్కయు, ధృతేః = ధృతియొక్కయు, గుణతః = సత్త్వాదిగుణములవలన కలుగునట్టి, త్రివిధం = మూడువిధములైన, భేదం = భేదమును, పృథక్త్వేన = వేఱువేఱుగా, ప్రోచ్యమానం = చెప్పబడుచున్నదానిని, అశేషేణ = సమగ్రముగా, శృణు = వినుము.

తా॥ బుద్ధియనగా వివేకముతో చేయబడిన నిశ్చయ రూపమైన జ్ఞానము. ధృతి యనగా ఆరంభింపబడిన పనిని యెన్ని ఆటంకములు వచ్చినను విడువని పట్టుదల. ఈ రెండును సత్త్వరజస్తమో గుణములనుబట్టి ఒక్కొక్కటి మూడు మూడు విధములుగా నుండును. వాటిని వేఱు వేఱుగా చెప్పుచున్నాను గాన అర్జునా ! పూర్తిగా వినుము.

అవ. సాత్త్విక బుద్ధియొక్క స్వరూపమును గూర్చి చెప్పుచున్నాడు.

30. శ్లో. ప్రవృత్తించ నివృత్తించ । కార్యా కార్యే భయాభయే ।
బన్ధం మోక్షం చ యా వేత్తి । బుద్ధి స్సా పార్థ! సాత్త్వికీ ॥

అర్థము : పార్థ = అర్జునా! ప్రవృత్తించ = ఇహలోకపరలోకములకు సాధనమైన ధర్మమునున్ను, నివృత్తించ = మోక్షసాధనభూతమైన ధర్మమునున్ను, కార్యాకార్యే = ఈ చోటున

నీవేళ నిది చేయవచ్చును ఇది చేయరాదనిన్నీ, భయాభయే = శాస్త్రమునుల్లంఘించుట భయమనియు, శాస్త్రమును పాటించుట అభయమనిన్నీ, బన్ధం = సంసార నిజ స్థితిని, మోక్షంచ = సంసార విమోచన నిజస్థితినిన్నీ, యా = ఏ బుద్ధి, వేత్తి = తెలుసుకొనుచున్నదో, సా బుద్ధిః = ఆ బుద్ధి, సాత్త్వికీ = సత్త్వగుణ ప్రధానమైనది, (భవతి = అగుచున్నది.)

తా॥ అర్జునా! ఈ ధర్మము ఇహలోక సుఖములకు సాధనము, ఈ ధర్మము మోక్షసాధనము, ఈ చోటున నీవేళ దీనిని చేయవలెను. దీనిని చేయరాదు, శాస్త్రమును లక్ష్యము చేయకున్న భయము. దానిని పాటించిన అభయము, సంసారము యొక్క నిజస్థితి యిది. మోక్షము యొక్క నిజస్థితి యిది యని యిట్లు తెలుసుకొనగల బుద్ధి సాత్త్విక బుద్ధి యనబడును.

అవ. రాజస బుద్ధి యొక్క స్వరూపమును దెలుపుచున్నాడు.

31. శ్లో. యయా ధర్మ మధర్మం చ । కార్యం చాకార్య మేవ చ ।
అయథావ త్ప్రజానాతి । బుద్ధి స్సాపార్థ ! రాజసీ ॥

అర్థము : పార్థ = అర్జునా! ధర్మం = ధర్మమును, అధర్మంచ = అధర్మమును, కార్యంచ చేయదగినదానిని, అకార్యం ఏవచ = చేయరానిదానిని, యయా = ఏ బుద్ధిచే, అయథావత్ = విపరీతముగా, ప్రజానాతి = తెలుసుకొనుచున్నాడో, సా = ఆ బుద్ధి, రాజసీ = రజోగుణము ప్రధానమైనది. (భవతి = అగుచున్నది)

తా॥ అర్జునా! వెనుక శ్లోకమున చెప్పినట్లుగా ఇహలోక పరలోక సుఖసాధనమగు ప్రవృత్తి ధర్మమును గాని, మోక్షసాధనమగు నివృత్తి ధర్మమునుగాని, దేశకాలములను బట్టి జేయదగిన దానినిగాని, చేయరాని దానిని గాని నిజముగా నెరుంగజాలని బుద్ధి రాజసమనబడును.

అవ. తామస బుద్ధియొక్క స్వరూపమును తెలుపుచున్నాడు.

32. శ్లో. అధర్మం ధర్మ మితి యా । మన్యతే తమసాऽఽవృతా ।
సర్వార్థా న్విపరీతాం శ్చ । బుద్ధి స్సా పార్థ ! తామసీ ॥

అర్థము : పార్థ! = అర్జునా! యా = ఏ, బుద్ధిః = బుద్ధి, తమసా = తమోగుణముచే, ఆవృతా= ఆవరింపబడినదై, అధర్మం = అధర్మమును, ధర్మం ఇతి = ధర్మమనిన్నీ, సర్వా

ర్థాన్ = సకల పదార్థములను, విపరీతాన్ చ = తారుమారుగాను, మన్యతే = తలంచుచున్నదో, సా=ఆ బుద్ధి, తామసీ = తమో గుణప్రధానమైనది,(భవతి = అగుచున్నది)

తా॥ అర్జునా! తమోగుణముచే నావరింపబడిన బుద్ధి తామసి యనబడును. అది యధర్మమును ధర్మమనియు, ధర్మమును అధర్మమనియు, ఉన్నదానిని లేదనియు, లేనిదానిని ఉన్నదనియు, పరతత్వమును తక్కువదనియు, నీచతత్వమును పరతత్వమనియు నిట్లు విపరీతముగా తోపింపజేయును.

అవ. సాత్త్వికధృతి యొక్క స్వరూపమును తెలుపుచున్నాడు.

33.శ్లో. ధృత్యా యయా ధారయతే। మనః ప్రాణేన్ద్రియ క్రియాః।
యోగేనా వ్యభిచారిణ్యా। ధృతి స్సా పార్థ ! సాత్త్వికీ ॥

అర్థము : అవ్యభిచారిణ్యా = ఫలాంతరములకు ప్రాకులాడని, యయా ధృత్యా = ఏ ధృతితో, యోగేన = మోక్షసాధనమగు భగవదుపాసన నిమిత్తముగా, మనః ప్రాణేన్ద్రియ క్రియాః = మనస్సు, ప్రాణము, బాహ్యేంద్రియముల యొక్క వ్యాపారములను, (పురుషః = పురుషుడు) ధారయతే నిలబెట్టుచున్నాడో, సా ధృతిః = ఆ ధృతి, సాత్త్వికీ = సత్త్వగుణము ప్రధానమైనది (భవతి = అగుచున్నది)

తా॥ ధృతియనగా ఆరంభించిన దానిని విడువక ముగింపజేయు పట్టుదల. పురుషుడు, ఫలాంతరముల ప్రక్కకు మనస్సును పోనీయని యే పట్టుదలతో భగవదుపాసనకొఱకై మనస్సు ప్రాణము కర్మేంద్రియముల యొక్క పనులను నిశ్చలముగా నిలబెట్టియుంచునో ఆ ధృతి(పట్టుదల) సాత్త్విక ధృతియనబడుచున్నది.

అవ. రాజస ధృతి యొక్క స్వరూపమును దెలుపుచున్నాడు.

34.శ్లో. యయా తు ధర్మకామార్థాన్। ధృత్యా ధారయతేఽర్జున !
ప్రసఙ్గేన ఫలాకాఙ్క్షీ। ధృతి స్సా పార్థ! రాజసీ ॥

అర్థము : పార్థ ! = అర్జునా! ఫలాకాఙ్క్షీ = ఫలమునపేక్షించు పురుషుడు, ప్రసఙ్గేన = మిక్కిలి యాసక్తితో, ధర్మార్థకామాన్ = ధర్మమును, ధనమును, ప్రాకృతభోగములను, యయా ధృత్యా తు = ఏ ధృతితోనైతే, ధారయతే = నిలబెట్టి యుంచుచున్నాడో, సా ధృతిః = ఆ పట్టుదల, రాజసీ = రాజసధృతి (భవతి = అగుచున్నది)

తా॥ అర్జునా! ఫలాశగల పురుషుడు ఆయాశ మిక్కుటమగుటచే ధర్మార్థ కామములనెడు మూడు విధములైన పురుషార్థములను సాధించుట కుపయోగించునట్టి మనఃప్రాణేంద్రియములను ఏ పట్టుదలతో చివర వరకు సాగించ గలుగుచున్నాడో ఆ ధృతి రాజస ధృతియని తెలియబడుచున్నది.

అవ. తామస ధృతియొక్క స్వరూపమును జెప్పుచున్నాడు.

35.శ్లో. యయా స్వప్నం భయం శోకం । విషాదం మదమేవ చ ।
న విముఞ్చతి దుర్మేధాః । ధృతి స్సా పార్థ! తామసీ॥

అర్థము : దుర్మేధాః = దుష్టబుద్ధికల పురుషుడు, స్వప్నం = నిద్రను, భయం = భయమును, శోకం = దుఃఖమును, విషాదం = పశ్చాత్తాపమును, మదం ఏవచ = మత్తతను, (వీటి కొఱకై చేయబడు మనః ప్రాణేన్ద్రియ వ్యాపారములను) యయా = ఏధృతితో, నవిముఞ్చతి = విడువడో, సా ధృతిః = ఆధృతి, తామసీ = తామసధృతి (భవతి= అగుచున్నది)

తా॥ దుర్బుద్ధికలవాడు ఏపట్టుదలతో నిద్ర, భయము, దుఃఖము, పశ్చాత్తాపము, మత్తతలను కలుగజేయునట్టి, మనః ప్రాణేంద్రియముల యొక్క వ్యాపారము లను చివరవరకు విడువక సాధించుచుండునో, ఆధృతి తామస మనబడును.

(నిద్రా = ఇంద్రియవ్యాపారములన్నియు విరమించి యుండుదశ, భయం= అనిష్టసాధనములు, దురభిమానముతో తెచ్చిపెట్టుకొనునట్టి, బలవంతుల తోడి విరోధము మొ. వాటిచే బుట్టును. ఒడలెఱుంగని శోకము–కోపముచే గావించు బంధువధ మొదలగు వాటివలన బుట్టును. మదము = భోగములనను భవించుటచే బుట్టును.)

అవ. సత్త్వాది గుణభేదములచే కలుగు సుఖము యొక్క త్రైవిధ్యమును చెప్పెదనని ప్రతిన గావించుచున్నాడు.

36.శ్లో. సుఖం త్విదానీం త్రివిధం । శృణు మే భరతర్షభ ! ।
అభ్యాసా ద్రమతే యత్ర । దుఃఖాన్తం చ నిగచ్ఛతి॥

అర్థము : యత్ర = ఏ సుఖమునందు, అభ్యాసాత్ = చిరకాలాభ్యాసమువలన, రమతే =

(క్రమముగ) నిరతిశయప్రీతిని బడయుచున్నాడో, దుఃఖాన్తంచ = సమస్త సాంసారిక దుఃఖనాశమును, నిగచ్ఛతి = పొందుచున్నాడో, (తత్=అట్టి) సుఖం తు=సుఖమైతే, త్రివిధం = మూడు విధములగుటను గూర్చి, మే = నా నుండి, శృణు = వినుము.

తా॥ సుఖము, సత్త్వరజస్తమో గుణములచే మూడు విధములుగా నుండును. అందు సాత్త్వికసుఖమువలన నిరంతరాభ్యాసముచే క్రమముగా నిరతియానందమున్ను సమస్త సాంసారిక దుఃఖ వినాశమున్ను కలుగుచున్నది. అట్టి సుఖమునుగూర్చి చెప్పెదను వినుము.

అవ. సాత్త్వికసుఖముయొక్క స్వరూపము నెఱింగించుచున్నాడు.

37.శ్లో. యత్త దగ్రే విషమివ । పరిణామేఽమృతోపమమ్ ।
తత్సుఖం సాత్త్వికం ప్రోక్త । మాత్మబుద్ధి ప్రసాదజమ్ ॥

అర్థము : యత్ = ఏసుఖము, అగ్రే = ముందు, విషం ఇవ =దుఃఖమువలెను, పరిణామే = విపాకదశయందు, అమృతోపమం = అమృతముతో సమానముగను, ఆత్మ బుద్ధి ప్రసాదజం = ఇతర విషయసంపర్క లేశమైనను లేని శుద్ధాత్మానుభవమువలన పుట్టినదియు (అగుచున్నదో) తత్ సుఖం = ఆ సుఖము, సాత్త్వికం = సత్వగుణ ప్రధానమైనదిగా, ప్రోక్తం = చెప్పబడినది.

తా॥ యోగప్రారంభదశలో శుద్ధాత్మ స్వరూప మపరిచిత మగుటచే దాని దర్శనము మిక్కిలి ప్రయాసపడి సాధించదగినది గాన దుఃఖమే యగుచున్నది. కాని కష్టములనోర్చి సాధించినచో చివరకది అమృతమువలె ఆనందప్రదమగు చున్నది. ఆత్మకంటె వేఱైన సమస్త విషయములను గోచరించని నిర్మల బుద్ధివలన జనించునట్టిది సాత్త్విక సుఖమనబడును.

అవ. రాజససుఖస్వరూపము నెఱింగించుచున్నాడు.

38.శ్లో. విషయేన్ద్రియ సంయోగా । ద్యత్తదగ్రేఽమృతోపమమ్ ।
పరిణామే విషమివ । తత్సుఖం రాజసం స్మృతమ్॥

అర్థము : అగ్రే = మునుముందు, విషయేన్ద్రియ సంయోగాత్ = ఇంద్రియములకు విషయములతోగల సంబంధమువలన, యత్ = ఏ సుఖము, అమృతోపమం = అమృతముతో సమానమైన ఆనందప్రదమును, పరిణామే = చివరకు, విషంఇవ =

విషమువలెను (భవతి = అగుచున్నదో) తత్ సుఖం = ఆ సుఖము, రాజసం = రాజససుఖముగా, స్మృతం = తలంచబడుచున్నది.

తా॥ ఆకలి యాశ మొదలగు వికారములచే నత్యాదరముతో పరిగ్రహింపబడిన లౌకిక క్షుద్ర విషయములయొక్క అనుభవమువలన కలిగెడు సుఖము ఆ యాకలి మొదలగునవి తీరినతోడినే యది నరక, నిహీన జన్మాదులకు కారణమగుటచే విషము త్రాగిన చందమున ననర్థదాయకమే యగుచున్నది గాన నది రాజస సుఖమనబడును.

అవ. తామస సుఖస్వరూపమును దెలుపుచున్నాడు.

39.శ్లో. య దగ్రే చానుబన్ధే చ । సుఖం మోహన మాత్మనః ।
నిద్రాలస్య ప్రమాదోత్థం । తత్తామస ముదాహృతమ్ ॥

అర్థము : యత్ సుఖం = ఏ సుఖము, అగ్రే = అనుభవసమయమందును, అనుబన్ధేచ = పరిణామముననను, ఆత్మనః = తనకు, మోహనం = వాస్తవ స్వరూప మెఱుంగనీయని జ్ఞానమాంద్యమును బుట్టించు, నిద్రాలస్య ప్రమాదోత్థం = నిద్ర బద్ధకము ప్రమాదములవలన జనించునో, తత్ = ఆ సుఖము, తామసం = తామససుఖముగా, ఉదాహృతం = చెప్పబడినది.

తా॥ అనుభవించునప్పుడును, విపాకావస్థలోనున్ను, తనకు వస్తువుల నిజరూపము నెఱుంగుట కాటంకమగు జ్ఞానమాంద్యమును బుట్టించు నిద్ర, బద్ధకము, కర్తవ్యము నెఱుంగమి మొదలగువాటి వలన బుట్టునట్టి సుఖము తామస మనబడును.

నిద్ర = ఇంద్రియముల వ్యాపారములుడుగుట - దీనిచే జ్ఞానము మందగించి వస్తు స్వరూప మెఱుంగకుండుట ప్రసిద్ధమే.

ఆలస్యం = ఇంద్రియముల మందప్రవృత్తి - కరణములగు ఇంద్రియ వ్యాపార తారతమ్యమును బట్టియే తత్కార్యమగు జ్ఞాన తారతమ్య ముండును గాన నిదియు నజ్ఞాన వర్ధకమే.

ప్రమాదమనగా తన కర్తవ్యమును నిర్ణయింపజాలమి - దీనిచే జ్ఞానము మందగించును.

జ్ఞానమాంద్యము చివర కత్యంతా జ్ఞానములో పర్యవసించును.

అవ. సంసారి చేతనులకు మోక్షమును బడయువరకును గుణములబారి నుండి నితరాం బయటపడుట దుశ్శకమని చెప్పి సత్త్వాది గుణకార్య ప్రకరణమును ముగించుచున్నాడు.

40.శ్లో. న తదస్తి పృథివ్యాం వా । దివి దేవేషు వా పునః ।
సత్త్వం ప్రకృతిజై ర్ముక్తం । యదేభి స్స్యాత్త్రిభిర్గుణైః ॥

అర్థము : పృథివ్యాం వా = భూమియందున్న మనుష్యాదులలోగాని, దివి= ఊర్ధ్వలోకమందున్న, దేవేషు వా పునః = దేవతలలోగాని, ప్రకృతిజైః = ప్రకృతి నుండి పుట్టిన, ఏభిః= ఈ, త్రిభిః = మూడైన, గుణైః = సత్త్వాదిగుణములచే, యత్ సత్త్వం = ఏ ప్రాణి, ముక్తం = విడువడినదో, తత్ = అట్టిప్రాణి, నాస్తి = లేదు.

తా॥ ఊర్ధ్వలోకములలోగాని అధోలోకములలోగాని ఉండునట్టి బ్రహ్మాది పిపీలికాపర్యంతబద్ధ ప్రాణులలో నీ ప్రాకృత సత్త్వరజస్తమోగుణము లబారిని పడని ప్రాణి యొక్కటియు లేదు.

అవ. ఇక ముందు గ్రంథముచే - మోక్షసాధనబుద్ధితో చేయబడు కర్మ పరమపురుషుని ఆరాధన రూపమైనదనియు, అది క్రమముగ పరమ పురుష సాయుజ్య రూపమగు మోక్షము నొసంగుననియు చెప్పదలంచి ముందుగా బ్రాహ్మణాది నాలుగు వర్ణములవారికి సత్త్వాది గుణములచే సహజముగా వేఱువేఱుగా, నేర్పరచబడిన కర్తవ్య కర్మలను జీవికావిశేషములతో జెప్పుచున్నాడు.

41.శ్లో. బ్రాహ్మణ క్షత్రియ విశాం । శూద్రాణాం చ పరన్తప! ।
కర్మాణి ప్రవిభక్తాని । స్వభావప్రభవై ర్గుణైః ॥

అర్థము : పరన్తప! = అర్జునా ! బ్రాహ్మణ క్షత్రియ విశాం = బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులకును, శూద్రాణాంచ = శూద్రులకును, కర్మాణి = కర్తవ్య కర్మ విశేషములు, స్వభావ ప్రభవైః = ప్రాచీన కర్మచే జనించునట్టి, గుణైః = సత్త్వ రజస్తమో గుణములచేత, ప్రవిభక్తాని = శాస్త్రములచే వేఱు వేఱుగా చెప్పబడినవి.(భవన్తి = అగుచున్నవి)

తా॥ బ్రాహ్మణులకు, క్షత్రియులకు, వైశ్యులకు, శూద్రులకును ఆయా జన్మలకు కారణములైన ప్రాచీన కర్మలచే నభివృద్ధి జెందియున్న సత్త్వరజస్తమోగుణ ములచే వీరి గుణములివి వీరి కర్మలివి వీరి జీవనోపాయము లివియని వేఱు వేఱుగా శాస్త్రములు విభజించి చెప్పుచున్నవి.

పూర్వ జన్మమున మరణసమయమునకు సత్త్వగుణ మభివృద్ధిగా నున్నచో- బ్రాహ్మణ జన్మయు, రజోగుణ మభివృద్ధిగా నున్నచో క్షత్రియ జన్మయు, అల్పముగా నుద్రేకించియున్న తమోగుణముచే వైశ్యజన్మయు, మిక్కిలి యధికముగా నుద్రేకించియున్నతమోగుణముచే - శూద్రజన్మయు లభించునని శాస్త్రములు జెప్పుచున్నవి.

అవ. బ్రాహ్మణుల సహజకర్మల నెఱింగించుచున్నాడు.

42.శ్లో. శమో దమ స్తప శ్శౌచం। క్షాన్తి రార్జవ మేవ చ।
జ్ఞానం విజ్ఞాన మాస్తిక్యం। బ్రాహ్మం కర్మ స్వభావజమ్॥

అర్థము : శమః = బాహ్యేంద్రియ నిగ్రహము, దమః = మనోనిగ్రహము, తపః = శాస్త్రోక్తమైన కర్మలకు అర్హత, క్షాన్తిః= పరులు తనను పీడించినను చిత్తవికారములేకుండుట, ఆర్జవం = తాను తలంచినట్లే చెప్పి తానాచరించుట, జ్ఞానం = పరతత్త్వమును అపరతత్త్వమును నెఱుంగుట, విజ్ఞానం = పరతత్త్వమగు శ్రీమన్నారాయణుని యసాధారణ ధర్మముల నెఱుంగుట, ఆస్తిక్యం = వేదోక్తమగు అర్థములన్నియు నిజమను నిశ్చలనమ్మకము, ఇవియన్నియు బ్రాహ్మణునకు స్వభావసిద్ధమైన ధర్మములు.

తా॥ సుగమము. ఇవియే బ్రాహ్మణునకు జీవనోపాధియును. పరతత్త్వజ్ఞానమనగా శ్రీమన్నారాయణుని మించిన దైవములేదను విశ్వాసము. అపరతత్త్వజ్ఞానమనగా, తక్కిన దేవతలందరు ఆతని కంటె తక్కువ వారే యనెడు నిశ్చయము.

ఆస్తిక్యమనగా - శ్రీమన్నారాయణుడే సర్వోత్తమ దైవము, ఆతడు దోషమొక్కటియును లేక సమస్త కల్యాణ గుణాకరుడై విలసిల్లును, సకల వేదైకవేద్యుడు, నిఖిల జగదేకకారణుడు, నిఖిల జగదాధారుడు, నిఖిల ప్రవర్తకుడు, కర్మలన్నియు నాతని యారాధనలే, వాటిచే నారాధింపబడి ధర్మార్థ కామామోక్షముల నొసంగును - అను నీ యర్థములన్నియు నిజమనెడు నమ్మకము.

అవ. క్షత్రియుల సహజకర్మల నెఱింగించుచున్నాడు.

43.శ్లో. శౌర్యం తేజో ధృతి ర్దాక్ష్యం। యుద్ధే చాప్యపలాయనమ్।
దాన మీశ్వరభావ శ్చ। క్షాత్రం కర్మ స్వభావజమ్॥

అర్థము : శౌర్యం = నిర్భయముగా యుద్ధరంగమున ప్రవేశించు సామర్థ్యము, తేజః =

శత్రువులచే నెదుర్కొన బడతగని శక్తి, ధృతిః = ప్రారంభింపబడిన పనిని ఎన్ని విఘ్నములనైనను సహించి కొనసాగించుట. దాక్ష్యం = అన్ని పనులను నేర్పుగ చేయుశక్తి, యుద్ధే చ అపి = యుద్ధమునందును, అపలాయనం = తాను చనిపోవు స్థితియందైనను పారిపోకుండుట, దానం = తన ధనమును పరుడు తనదేయని నమ్మునట్లర్పించుట, ఈశ్వరభావః చ = జనుల నందఱను నియమించుశక్తి (అనునివి), క్షాత్రం = క్షత్రియుల సంబంధమైన, స్వభావజం = సహజమగు, కర్మ= కర్మ, భవతి = అగుచున్నది.

తా॥ నిర్భయముగా యుద్ధరంగమున ప్రవేశించు సామర్థ్యము, శత్రువులు కన్నెత్తి యైనను చూడశక్యముగాకుండనుండుట. ప్రారంభించిన పనిని యెన్ని విఘ్నములు వచ్చినను విడువక చేసి ముగించుట, అన్ని పనులను నేర్పుగ నిర్వహించుశక్తి, యుద్ధమున తనకు చావు తప్పదని నిశ్చయముగనున్నను వెనుకంజ వేయకుండుట, తన ధనమును తగిన పాత్రలకు వారు యథేష్టముగా నుపయోగించునట్లర్పించివేయుట, జనులనందరను నియమించు శక్తి యను నివి క్షత్రియునకు సహజకర్మలు. ఇవియే యాతనికి జీవనోపాధియును.

అవ. వైశ్యులయొక్కయు, శూద్రులయొక్కయు సహజకర్మల నెఱింగించుచున్నాడు.

44.శ్లో. కృషి గోరక్షవాణిజ్యం । వైశ్యం కర్మ స్వభావజమ్ ।
పరిచర్యాత్మకం కర్మ । శూద్రస్యాపి స్వభావజమ్॥

అర్థము : కృషి = వ్యవసాయము, గోరక్ష = పశుపాలనము, వాణిజ్యం = వర్తకమున్ను, వైశ్యం= వైశ్యునకు సంబంధించిన, స్వభావజం = సహజమైన, కర్మ = కర్మ (భవతి = అగుచున్నది) పరిచర్యాత్మకం కర్మ = బ్రాహ్మణాది మూడు వర్ణములకును పరిచర్యను గావించు పనియే, శూద్రస్య అపి = శూద్రునకున్ను, స్వభావజం = సహజమైన, కర్మ= కర్మ (భవతి = అగుచున్నది.) ఇదియే యాతనికి జీవికయు నగును.

తా॥ వ్యవసాయము, పశుసంరక్షణము, వర్తకమున్ను వైశ్యులకు సహజ కర్మయు జీవనోపాధియు నగుచున్నవి. బ్రాహ్మణాదులకు పరిచర్యను గావించుటయే శూద్రునకు సహజమగు కర్మ యగుచున్నది. ఇదియే యాతనికి జీవికయు నగును.

అవ. ఈ మోక్షశాస్త్రమున నీ వర్ణధర్మ విభాగమునకు ప్రయోజనమును జెప్పుచున్నాడు.

45.శ్లో. స్వేస్వే కర్మణ్యభిరత। స్సంసిద్ధిం లభతే నరః।
స్వకర్మనిరత స్సిద్ధిం। యథా విన్దతి తచ్ఛృణు॥

అర్థము : స్వేస్వే = తమతమ, కర్మణి = పూర్వోక్త కర్మయందు, అభిరతః = ఆసక్తి కలిగియున్న, నరః = మనుష్యుడు, సంసిద్ధిం = పరమపద ప్రాప్తిని, లభతే = పొందుచున్నాడు, స్వకర్మ నిరతః = తన ధర్మమునం దాసక్తితో విడువక నాచరించువాడు, యథా = ఏప్రకారముగా, సిద్ధిం = పరమపదమును, విన్దతి = పొందుచున్నాడో, తత్ = దానిని, శృణు = వినుము.

తా॥ ఇట్లు చెప్పబడిన తమతమ వర్ణధర్మములను విడువక ఆదరముతో నాచరించువాడు నిస్సంశయముగ పరమపదము నధిరోహించును. అది యాతని కే విధముగ సిద్ధించునో చెప్పెదను వినుము.

అవ. పరమాత్మ సర్వకారణభూతుడును సర్వాన్తర్యామియు నగుటచే నన్నిటిని తనకు శరీరముగా కలవాడు గాన నింద్రాదులను తెలిపెడు శబ్దములచే తానే చెప్పబడుచున్నాడు. వర్ణాశ్రమ ధర్మములన్నియు నిట్టి పరమపురుషుని సమారాధన రూపములే గాన నవి పరమపద ప్రాప్తికి నిదానములగుట నిర్వాద మనుచున్నాడు-

46.శ్లో. యతః ప్రవృత్తి ర్భూతానాం। యేన సర్వ మిదం తతమ్।
స్వకర్మణా తమభ్యర్చ్య। సిద్ధిం విన్దతి మానవః॥

అర్థము : భూతానాం = ప్రాణులయొక్క, ప్రవృత్తిః = పుట్టుక మొదలగు వ్యాపారము, యతః = ఏ పరమాత్మ నుండియో, యేన = ఏ పరమాత్మచే, ఇదం సర్వం = కాన్పించునట్టి యీ చేతనాచేతనాత్మకము జగత్తంతయు, తతం = వ్యాపించ బడియున్నదో, తం = ఆ పరమాత్మను, మానవః = శాస్త్రాధికారియగు మనుష్యుడు, స్వకర్మణా = తనకు విధింపబడిన కర్మతో, అభ్యర్చ్య = ఆరాధించి, సిద్ధిం = పరమపదప్రాప్తిని, విన్దతి = లభించుచున్నాడు.

తా॥ సమస్త భూతములు పరమాత్మనుండియే పుట్టుచుండుటచేతను, ఆతనిచే పోషింపబడుటచేతను, లయింప చేయబడుటచేతను, వ్యాపింపబడుట చేతను ఆతడే యంతరాత్మగా కలవగుటవలన నెవరి నారాధించినను ఆతడే యారాధింపబడుచున్నాడని యెఱింగి యారాధించినచో, నాతడనుగ్రహించి స్వప్రాప్తిరూపమగు పరమపదము నంద జేయుచున్నాడు.

అవ. కర్మయోగాంతర్భూతములగు నీ ధర్మములు జ్ఞానయోగాధికారులకుగూడ మిక్కిలి యాదరణీయములేయని వెనుక చెప్పినదానినే తిరిగి జ్ఞాపకము చేయుచున్నాడు.

47.శ్లో. శ్రేయాన్ స్వధర్మో విగుణః । పరధర్మా త్స్వనుష్ఠితాత్ ।
స్వభావనియతం కర్మ । కుర్వ న్నాప్నోతి కిల్బిషమ్ ॥

అర్థము : స్వనుష్ఠితాత్ = ఒకానొకప్పుడు లెస్సగా జేయబడిన, పరధర్మాత్ = జ్ఞానయోగముకంటె, స్వధర్మః = కర్మయోగము, విగుణః (అపి) = విగుణమైనను, శ్రేయాన్ = ఉత్తమమైనది, స్వభావ నియతం = తన ప్రకృతికి తగియున్న , కర్మ= కర్మయోగమును, కుర్వన్ =ఆచరించుచున్నవాడై, కిల్బిషం = సంసారమును, న అప్నోతి = పొందడు.

తా॥ కర్మలు చేయుటకే ఏర్పరచబడిన కర్మేంద్రియములతో గూడిన శరీరముతో నిత్యసంబంధము కలిగియున్నవాడగుటచే మానవునకు కర్మయోగమే స్వధర్మము. జ్ఞానయోగమన్య ధర్మమును నగుచున్నది. అట్టి జ్ఞానయోగము నెంత నేర్పుగ జేసినను సప్రమాదమగుటచే దానికంటె నింద్రియ వ్యాపారరూపమగు కర్మయోగము కొంచెమా లస్యముగ ఫలమునొసంగినను నిష్ప్రమాదమగుటచే నుత్తమమైనది, కర్మ, ప్రకృతి సంబంధముగల జీవునికి పనులు చేయుటయే సహజమగుటచే కర్మయోగము జన్మసిద్ధ ధర్మమ గుచున్నదిగాన దాని నాచరించుటచే సంసారమును సుకరముగ తరిం చగలుగుచున్నాడు.

48.శ్లో. సహజం కర్మ కౌన్తేయ !! సదోష మపి న త్యజేత్ ।
సర్వారమ్భా హి దోషేణ । ధూమే నాగ్ని రివా వృతాః ॥

అర్థము : కౌన్తేయ = అర్జున! సహజం = స్వభావసిద్ధమైన, కర్మ = కర్మ, సదోషం అపి = కాయక్లేశాది దుఃఖములతో కూడినదైనను, న త్యజేత్ = విడువరాదు, హి = ఏ కారణమువలన, సర్వారమ్భాః = కర్మారంభములుగాని జ్ఞానారంభములుగాని, దోషేణ = దుఃఖముతో, ధూమేన = పొగచేత, అగ్నిఃఇవ = నిప్పువలెనే,ఆవృతాః= కప్పబడియున్నవి.

తా॥ అర్జునా! స్వభాసిద్ధమగు కర్మ నాచరించుటలో కొంది కాయక్లేశాది దుఃఖము లనివార్యములైనను దానిని విడువరాదు. ఏలయనగా -

కర్మయోగమేమి, జ్ఞానయోగమేమి ఏది చేయవలెనన్నను కాయక్లేశాది దుఃఖములు తప్పవు. నిప్పుపొగచే నావరింపబడక యుండునా? అయినను కర్మయోగము సుకరమును, అప్రమాదమును నగుచున్నది. జ్ఞానయోగమట్లుగాక దుష్కరమును సప్రమాదమును నగుచున్నది.

49.శ్లో. అసక్త బుద్ధి స్సర్వత్ర । జితాత్మా విగతస్పృహః ।
నైష్కర్మ్యసిద్ధిం పరమాం । సన్న్యాసేనాధిగచ్ఛతి ॥

అర్థము : సర్వత్ర = సకల ఫలాదుల యందును. అసక్తబుద్ధిః = లగ్నముకాని బుద్ధికలవాడును, జితాత్మా = స్వాధీనమందున్న మనస్సుకలవాడున్ను, విగతస్పృహః = కలలోనైనను తనను కర్తగా తలంచని వాడును, సన్న్యాసేన త్యాగముతో (యుక్తః = కూడినవాడై), కర్మకుర్వన్ = కర్మచేయుచు, పరమాం = మిక్కిలి గొప్పదైన, నైష్కర్మ్య సిద్ధిం = జ్ఞానయోగమునకు కూడా ఫలమగు ధ్యాననిష్ఠను, అధిగచ్ఛతి = పొందుచున్నాడు.

తా॥ ఫలాదులయందు ఆశలేని వాడును, స్వాధీనమందున్న మనస్సు కలవాడును, కలలోనైనను తనను కర్తగా తలంచనివాడును, ఫలసంగకర్తృత్వ త్యాగముతో కూడినవాడై కర్మలను చేయుచు జ్ఞాననిష్ఠకు కూడా ఫలమైన సర్వోత్కృష్టమగు ధ్యాననిష్ఠను లభించుచున్నాడు.

50.శ్లో. సిద్ధిం ప్రాప్తో యథా బ్రహ్మ । తథాప్నోతి నిబోధ మే ।
సమాసేనైవ కౌన్తేయ !। నిష్ఠా జ్ఞానస్య యా పరా ॥

అర్థము : కౌన్తేయ = అర్జునా! సిద్ధిం = ధ్యానసిద్ధిని, ప్రాప్తః = పొందినవాడై, యథా = ఏ ప్రకారముగానున్నవాడగుచు. బ్రహ్మ = బ్రహ్మను, అప్నోతి = పొందుచున్నాడో, తథా = ఆ విధానమును, మే = నావలన, సమాసేన = సంగ్రహముగా, నిబోధ = తెలుసుకొనుము. యా = ఏది, జ్ఞానస్య = ధ్యానమునకు, పరానిష్ఠా = పరమప్రాప్యము, (భవతి = అగుచున్నదో)

తా॥ అర్జునా! నిష్కామ కర్మయోగముచే జనించునట్టి ధ్యానమనెడు సిద్ధిని పొందిన పిమ్మట యెట్లు సంచరించిన బ్రహ్మను బడయుచున్నాడో, ఆ రీతిని సంగ్రహముగ జెప్పెద సావధానముగ వినుము. ఆ బ్రహ్మ మేసుమా! ఆ ధ్యానమునకు పరమప్రాప్యము.

అవ. ధ్యాన యోగానంతరము బ్రహ్మను బడయుట కవలబించవలసిన యనుష్ఠాన విశేషమునువివరించుచున్నాడు.

51.శ్లో. బుద్ధ్యా విశుద్ధయా యుక్తో । ధృత్యాఽఽత్మానం నియమ్య చ ।
శబ్దాదీ న్విషయాం స్త్యక్త్వా । రాగద్వేషౌ వ్యుదస్య చ ॥

అర్థము : విశుద్ధయా బుద్ధ్యా = శుద్ధాత్మతత్వమును గూర్చిన బుద్ధితో, (యుక్తః = కూడినవాడై,) ధృత్యా = సాత్త్విక పట్టుదలతో, ఆత్మానం = మనస్సును, నియమ్య చ = విషయములనుండి మరలించి (యోగమునకు తగినస్థితిలోనుంచి) శబ్దాదీన్ = శబ్దము, స్పర్శ, రసము, గంధము మొదలగు, విషయాన్ = సాంసారిక భోగజాతమును, త్యక్త్వా = విడిచి, రాగద్వేషౌ = వాటిని గూర్చిన అనురాగమునుగాని విద్వేషమునుగాని, వ్యుదస్య చ = దూరముచేసి, (ముందు శ్లోకముతో నన్వయము)

తా॥ శుద్ధాత్మ తత్వమును చక్కగ నెఱింగి సాత్త్వికధృతితో మనస్సును విషయములనుండి ; మరల్చి యోగమునకు తగిన స్థితిలో నుంచి, శబ్దాది విషయములను విడిచి, వాటి యందీషత్తైనను రాగద్వేషముల నుదయింపనీయక-

52.శ్లో. వివిక్త సేవీ లఘ్వాసీ । యత వాక్కాయ మానసః ।
ధ్యానయోగ పరో నిత్యం । వైరాగ్యం సముపాశ్రితః ॥

అర్థము : వివిక్తసేవీ = రహస్యప్రదేశమునందున్నవాడై, లఘ్వాసీ = మితముగ భుజించువాడగుచు, యతవాక్కాయమానసః = కరణత్రయమును ధ్యానమున కభిముఖముగా జేసినవాడై, నిత్యం = సదా, ధ్యానయోగపరః = మరణించువరకు నిట్లు ధ్యానమునందాసక్తి కలవాడగుచు, వైరాగ్యం = సాంసారిక భోగములయం దనురాగము బొత్తుగ లేకుండుటను, సముపాశ్రితః = అలవరచుకొనినవాడై.

(దీనికి ముందు శ్లోకముతో సంబంధముకలదు)

తా॥ ధ్యానవిరోధివర్గ మొకింతయులేని ప్రదేశము నాశ్రయించి శరీరధారణ కవసరమగు నాహారమును మాత్రమే తీసుకొనుచు, శరీర వాఙ్మనస్సులను ధ్యానమున కభిముఖముగా జేసి, మరణపర్యంతము నిరంతరము ధ్యానమునందే నిమగ్నుడగుచు, ఆత్మేతరము లన్నింటియందుండు దోషములనే విమర్శించుచు వాటి యందసహ్యమును బుట్టించుకొని

53.శ్లో. అహఙ్కారం బలం దర్పం । కామం క్రోధం పరిగ్రహమ్ ।
విముచ్య నిర్మమ శ్శాన్తో । బ్రహ్మభూయాయ కల్పతే ॥

అర్థము : అహఙ్కారం = దేహాత్మభ్రాంతిని, బలం = దానిని పెంపొందించు వాసనా బలమును, దర్పం = వాటివలన బుట్టునట్టి గర్వమును, కామం = విషయాభిలాషను, క్రోధం = దాని కవరోధము కలిగినచో జనించు ద్వేషమును, పరిగ్రహం = ఇతరులొసంగు ద్రవ్యాదుల నంగీకరించుటను, విముచ్య = విడిచిపెట్టి, నిర్మమః = దేనియందును తనదను బుద్ధిలేనివాడై, శాన్తః = ఆత్మానుభవ మొక్కటియే సుఖమని తలంచువాడగుచు, (ఏవం ధ్యానయోగం కుర్వన్ = ఇట్లుండి ధ్యాన యోగమును గావించుచు) బ్రహ్మభూయాయ = యథావస్థిత ఆత్మానుభవమునకు, కల్పతే = సమర్థుడగుచున్నాడు.

తా॥ దేహాత్మ భ్రాంతిని, దానికి మూలమగు వాసనాబలమును, ఈ రెండింటి వలన బుట్టునట్టి గర్వమును, ఉత్కట విషయానుభవాభిలాషను, దాని కాటంకము కలిగినచో సన్నిహితులపై ద్వేషమును, ఇతరులొసంగు ధనాదుల నామోదించుటను, సంపూర్ణముగా విడిచి దేనియందును నాదియను బుద్ధిలేక ఆత్మానుభవ మొక్కటియే సుఖమని తలంచుచున్నవాడై ధ్యానయోగము నాచరించుచు క్రమముగ సకల బంధముల నుండియు బయటపడి శుద్ధాత్మానుభవ సుఖమును బడయగలుగును.

అవ. నిష్కామ కర్మ యోగాదులచే సాధింపబడునట్టి శుద్ధాత్మానుభవము భక్తికి అధికారినిగా చేయుచున్నదని చెప్పుచున్నాడు.

54. శ్లో. బ్రహ్మభూతః ప్రసన్నాత్మా । న శోచతి న కాఙ్క్షతి ।
సమ స్సర్వేషుభూతేషు । మద్భక్తిం లభతే పరామ్ ॥

అర్థము : బ్రహ్మభూతః = శుద్ధాత్మ స్వరూపావిర్భావము కలవాడును, ప్రసన్నాత్మా = నిర్మల స్వరూపుడును అయి, న శోచతి = దేనిని గూర్చియు దుఃఖించడు, న కాఙ్క్షతి = నాకంటె వేరుగ దేనిని కోరడు, సర్వేషు భూతేషు = సకల భూతములయెడలను, సమః = అనాదరముతో సమదృష్టి కలవాడై, పరాం = గొప్పదైన, మద్భక్తిం = నాయందత్యంత ప్రియానుభవ రూపమైన భక్తిని, లభతే = పొందుచున్నాడు.

తా॥ అపరిచ్ఛిన్న జ్ఞానాకారముకలిగి, భగవంతునకే శేషభూతుడై యుండు స్వభావముగల శుద్ధాత్మస్వరూప మావిర్భవించగనే నిర్మల స్వరూపుడై

భగవంతునికంటె వేఱగు నే ప్రాణిని గురించియు దుఃఖించడు. దేనిని కోరడు; భగవంతునికంటె వేరైన భూతములను వేటినిగాని యాదరించక అన్నిటియందును సమాన అనాదరణయే కలిగియుండును. అంతట పరమపురుషని యందత్యంత ప్రియానుభవరూపముగు గొప్ప భక్తి జనించును.

అవ. అట్టి భక్తి కలిగిన వెంటనే లభించునట్టియు, కాలక్రమమున కలుగునట్టియు, ఫలభేదములను జెప్పుచున్నాడు.

55.శ్లో. **భక్త్యా మా మభిజానాతి । యావా న్య శ్చా స్మి తత్త్వతః ।**
తతో మాం తత్త్వతో జ్ఞాత్వా । విశతే తదనన్తరమ్ ॥

అర్థము : భక్త్యా = ఇట్టిభక్తిచే, మాం = నన్ను, యావాన్ = ఎట్టి గుణములను విభూతులను కలవాడనున్ను, యఃచ అస్మి = ఎట్టి స్వరూప స్వభావములు కలవాడనున్ను అగుచున్నానో, తత్త్వతః = యథార్థముగా, అభిజానాతి = తెలుసుకొనుచున్నాడు, మాం = నన్ను, తత్త్వ తః = యథార్థముగా, జ్ఞాత్వా = తెలుసుకొని, తదనన్తరం = అటుపిమ్మట, తతః = ఆ భక్తివలన, (మాం = నన్ను) విశతే = ప్రవేశించుచున్నాడు.

తా॥ ఇట్టి భక్తిచే నా స్వరూపస్వభావములను, నాగుణవిభూతులను వాస్తవముగా నెఱింగి వెనువెంటనే నిరుపమ భక్తియుక్తుడై ఆ భక్తిచే నన్ను పొందుచున్నాడు.

అవ. ఇట్లు వర్ణాశ్రమోచితములగు నిత్యనైమిత్తిక కర్మలను ఫలాశలేక భగవదారాధన బుద్ధితో నాచరించుటవలన కలుగు ఫలమును జెప్పి యిప్పుడు కామ్య కర్మను కూడా నీ విధముగనే యనుష్ఠించినచో ఆ ఫలమునందే పర్యవసించునని జెప్పుచున్నాడు.

56.శ్లో. **సర్వకర్మాణ్య పి సదా । కుర్వాణో మద్వ్యపాశ్రయః ।**
మత్ప్రసాదా దవాప్నోతి । శాశ్వతం పద మవ్యయమ్॥

అర్థము : సర్వకర్మాణి అపి = కామ్యకర్మలనుకూడ, సదా = ఎల్లప్పుడును, మద్వ్యపాశ్రయః= కర్తృత్వాదులను భగవంతుని యందుంచినవాడై, కుర్వాణః = చేయుచున్నవాడై, మత్ప్రసాదాత్ = నాయనుగ్రహము వలన, శాశ్వతం = స్థిరమైన ఫలమగు, పదం= పొందదగిననన్ను, అవ్యయం = సాకల్యముగా, అవాప్నోతి = పొందుచున్నాడు.

తా॥ ఇట్లే కామ్యకర్మలను కూడా కర్తృత్వాదుల నన్నింటిని భగవంతుని యందుంచి నిరంతర మాచరించినచో భగవదనుగ్రహము వలన స్థిరమైన ఫలస్వరూపుడగు పరమపురుషనే సాకల్యముగా లభించుచున్నాడు.

అవ. కావున నిక నర్జునునకు కర్తవ్యమును విధించుచున్నాడు.

57.శ్లో. చేతసా సర్వకర్మాణి । మయి సన్న్యస్య మత్పరః ।
బుద్ధియోగ ముపాశ్రిత్య । మచ్చిత్త స్సతతం భవ॥

అర్థము : చేతసా = నీవు నావాడవును, నాచే నియమింపబడువాడవను బుద్ధితో, సర్వకర్మాణి= నీ వాచరించు వర్ణాశ్రమ నిత్యనైమిత్తి కాది కర్మలనన్నిటిని, మయి = నా యందు సన్న్యస్య = విడిచిపెట్టి, మత్పరః = నన్నేవాటికి ఫలముగ పొందదగినవానినిగా నమ్మినవాడవై, బుద్ధియోగం = వెనుక చెప్పబడిన పరమాత్మయందు కర్తృత్వానుసంధానాది బుద్ధిని, ఉపాశ్రిత్య = అవలంబించి, సతతం = ఎల్లప్పుడును, మచ్చిత్తః = నాయందే మనస్సు నుంచినవాడవు, భవ = అగుము.

తా॥ ఆత్మలన్నియు పరమాత్మకు పరతంత్రములును, ఆతనిచే నియమింపదగినవియు నని యెరింగి నీవును అట్టివాడవే గాన వర్ణాశ్రమాది ధర్మములను, నిత్యనైమిత్తికాది కర్మలనన్నింటిని కర్తృత్వాదులతోసహా నాయం దర్పించి ఇట్లాచరింపబడిన కర్మలకు ఫలము భగవత్ప్రాప్తి యేయని విశ్వసించి వెనుక చెప్పబడిన ఆ బుద్ధినే యవలంబించి నిరంతరము నన్నే ధ్యానించుచుండుము.

58.శ్లో. మచ్చిత్త స్సర్వదుర్గాణి । మత్ప్రసాదా త్తరిష్యసి ।
అథచే త్త్వ మహఙ్కారా । న్న శ్రోష్యసి వినఙ్క్ష్యసి ॥

అర్థము : మచ్చిత్తః = నాయందు మనస్సు నుంచినవాడవై, సర్వ దుర్గాణి = సకల సాంసారిక ప్రతిబంధకములను, మత్ప్రసాదాత్ = నా యనుగ్రహమువలననే, తరిష్యసి = దాటగలవు, అథ = అట్లుగాక, త్వం = నీవు, అహఙ్కారాత్ = గర్వమువలన, నశ్రోష్యతిచేత్ = వినకుందువేని, వినఙ్క్ష్యసి = చెడిపోయెదవు.

తా॥ ఇట్లు నాయందు మనస్సునుంచి నీ వర్ణాశ్రమాది ధర్మములనెల్ల నాచరిం చుచున్నచో సకల సాంసారిక ప్రతిబంధకములనున్ను నా యనుగ్రహముచేతనే యతిక్రమించగలవు. ఇట్లుగాక నా కృత్యాకృత్యములను నేనే యెఱుంగుదునని గర్వించి నా యుపదేశములను పెడచెవిని బెట్టితివా చెడిపోయెదవు.

అవ. తన మాటలు వినక యుద్ధమును మానినచో ననర్థముల పాలగుదువని చెప్పి యిక యుద్ధమును చేయకుండుటయే నీ తరముకాదనియు 'కర్మయోగమే యనివార్యమగుచో నీ యుద్ధమే చేయనేల? వేఱొక కర్మనాచరించి వినాశమునుండి నన్నేల కాపాడుకొనరాదు?' అను శంకకు సమాధానమును, ముందు శ్లోకములచే జెప్పుచున్నాడు.

59.శ్లో. యద్యహఙ్కార మాశ్రిత్య । న యోత్స్య ఇతి మన్యసే ।
మిథ్యైష వ్యవసాయస్తే । ప్రకృతి స్త్వాం నియోక్ష్యతి ॥

అర్థము : అహఙ్కారం = నా యొప్పును నేనే యెఱుంగుదుననెడు గర్వమును, ఆశ్రిత్య = అవలంబించి, న యోత్స్యే = నేను యుద్ధమును చేయను, ఇతి = అని, మన్యసే యది = తలంతువేని, ఏషః = ఈ, తే = నీయొక్క, వ్యవసాయః = అధ్యవసాయము, మిథ్యా = వ్యర్థమైనది, (భవతి = అగుచున్నది) ప్రకృతిః = (నీ రాజస) స్వభావము, త్వాం = నిన్ను, నియోక్ష్యతి = ప్రవర్తింజేయగలదు.

తా॥ నా మంచిచెడ్డల నేనే యెఱుంగుదుననెడు దురభిమానముతో నా యాజ్ఞ నుల్లంఘించి యుద్ధమును చేయనేని నీ యీ స్వాతంత్ర్యా ధ్యవసాయ మసత్యమే యగును. నీ రాజసక్షత్రియ స్వభావము నీచే తప్పక యుద్ధమును చేయుంచియే తీరును. (నేను చెప్పినట్లు చేసిన నీ భారము నంతను నేనే వహింతును. నీకు తోచినట్లు చేసిన నే నూరకుందును. గాన నీవు ప్రకృతికి వశంవదుడవగుదువు. అది నిన్ను కూడని పనులకే కూర్చి చెరచును.)

60. శ్లో॥ స్వభావజేన కౌన్తేయ! నిబద్ధస్స్వేన కర్మణా ।
కర్తుం నేచ్ఛసి యన్మోహా । త్కరిష్య స్యవశోఽపి తత్ ॥

అర్థము : కౌన్తేయ! = అర్జునా! యత్ = ఏ యుద్ధమును, మోహాత్ = అజ్ఞానము వలన, కర్తుం = చేయుటకు, న ఇచ్ఛసి = కోరవో, తత్ = ఆయుద్ధమును, స్వభావజేన= (క్షత్రియునకు) సహజమగు, స్వేన = స్వకీయమైన, కర్మణా = శౌర్యమనెడుకర్మచే, నిబద్ధః = కట్టబడినవాడవై, అవశః అపి=పరవశుడవయ్యును, కరిష్యసి = చేయగలవు.

తా॥ ఇప్పుడజ్ఞానముచే చేయనొల్లని యీ యుద్ధమునే శత్రువుల తిరస్కారమును సహించలేక నీ క్షత్రియజాతికి సహజమగుశౌర్యముచే ప్రేరేపింపబడి నీవు చేయదలంచకున్నను చేసియే తీరుదువు.

అవ. భగవంతు డుదాసీనుడై యున్నచో జీవు డేపనికైనను ఎట్లు ప్రవర్తించును? అట్లే స్వతంత్రముగా ప్రవర్తించినచో. సర్వేశ్వరునకెట్లు సర్వకారణత్వము ఘటించును.? అను ప్రశ్నకుత్తరువుగా సకల ప్రాణిజాతమున్ను సర్వేశ్వరునిచే తమ పూర్వకర్మా నుసారముగ ప్రకృతి ననుసరించవలసినదిగా నియమింపబడినదని చెప్పుచున్నాడు.

61. శ్లో. ఈశ్వర స్సర్వభూతానాం। హృద్దేశేఽర్జున! తిష్ఠతి।
భ్రామయన్ సర్వభూతాని। యన్త్రారూఢాని మాయయా! ॥

అర్థము : ఈశ్వరః = సర్వనియామకుడగు సర్వేశ్వరుడు, సర్వభూతానాం = ప్రాణులయొక్క, హృద్దేశే = హృదయ స్థానమునందు,యన్త్రారూఢాని= దేహమనెడు యంత్రమునధిష్ఠించియున్న, సర్వభూతాని = ప్రాణులన్నిటిని, మాయయా = (తన) ప్రకృతిచేత, భ్రామయన్ = (గుణానుగుణముగ) నడిపించుచు, తిష్ఠతి = ఉన్నాడు.

తా॥ సర్వనియామకుడగు సర్వేశ్వరుడు తన సంకల్పముచే దేహేంద్రియములుగా పరిణమించిన ప్రకృతియనెడు యంత్రము నధిష్ఠించియున్న ప్రాణులనన్నిటిని తనయధీనమందున్న ప్రకృతిచేత వారివారి గుణముల ననుసరించి నడిపించుచు జ్ఞానముదయించు హృదయ ప్రదేశము నందున్నాడు.

అవ. స్వతంత్రుడైన సర్వేశ్వరుడిట్లు తనయధీనమందున్న ప్రకృతి ద్వారా ప్రేరేపించుచుండిన, పరతంత్రులగు జీవు లెట్లు దాని బారినుండి బయటపడగలరను శంకకుత్తరమొసంగుచున్నాడు.

62. శ్లో. తమేవ శరణం గచ్ఛ। సర్వభావేన భారత!।
తత్ప్రసాదా త్పరాం శాన్తిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్ ।

అర్థము : భారత! = ఓ అర్జునా! తంఏవ = ఆసర్వేశ్వరునే, సర్వభావేన =అన్ని విధములచేతను, శరణం గచ్ఛ = అనువర్తింపుము, తత్ప్రసాదాత్ = ఆసర్వేశ్వరుని అనుగ్రహమువలన, పరాం = ఉత్తమమైన, శాన్తిం = సర్వకర్మ నివృత్తిని, శాశ్వతం = పునరావృత్తిలేని, స్థానం = పరమ పదమునున్ను, ప్రాప్స్యసి = పొందగలవు.

తా॥ అట్టి సర్వేశ్వరుని ఆజ్ఞను శిరసావహించి నడుచుకొనుము. ఇదియే ఇచ్చట శరణాగతి. అట్లు చేసినచో నీయందాతనికి అనుగ్రహము జనించును. దానిచే నీకు బంధకములగు కర్మలన్నియు నశించును, దానిచే శాశ్వతమైన పరమపదమును పొందగలవు.

అవ. ఇట్లర్జునుని యుద్ధమునకు ప్రోత్సహించు నెపమున చెప్పవలసిన వేదాంతార్థముల నన్నిటిని చెప్పి కర్మయోగాది యేనిష్ఠ నవలంబించినను నిత్యకర్మానుష్ఠాన మనివార్యమని తెలుపుటకై చివరకు తిరిగి యుద్ధమునకై ప్రోత్సహించెను. ఇప్పుడిక వినవలసినదేదియు లేదని తెలుపుటకై, కర్మజ్ఞాన భక్తియోగములను గూర్చి చెప్పవలసిన దంతయు విస్తారముగా చెప్పితిని గాన ఎవరియోగ్యతకు తగినట్లువారాచరించవలెనని చెప్పి ముగించుచున్నాడు.

63. శ్లో. ఇతి తే జ్ఞాన మాఖ్యాతం । గుహ్యా ద్గుహ్యతరం మయా ।
విమృశ్యైత దశేషేణ । యథేచ్ఛసి తథా కురు ॥

అర్థము : ఇతి = ఇట్లు, తే = నీకు, మయా = నాచేతను, గుహ్యాత్ = రహస్యము కంటె, గుహ్యతరం = మిక్కిలి రహస్యమైన, జ్ఞానం = కర్మజ్ఞాన భక్తియోగములను గూర్చిన జ్ఞానము, ఆఖ్యాతం = చెప్పబడినది, ఏతత్ = దీనిని, అశేషేణ = పూర్తిగా, విమృశ్య = విమర్శించి, యథా = ఏవిధముగా, ఇచ్ఛసి = కోరుచున్నావో, తథా = ఆ విధముగా, కురు = చేయుము.

తా॥ ఇట్లు నీకు నేను ముముక్షువు లెఱుంగదగిన రహస్యమైన కర్మజ్ఞాన భక్తి యోగములను గూర్చి చెప్పవలసినదంతయును చెప్పితిని. దీనినంతను లెస్సగా సాకల్యముగ విమర్శించి నీ యోగ్యతకు తగినట్లు నీకు తోచిన రీతిగా కర్మయోగమునో జ్ఞానయోగమునో భక్తి యోగమునో అనుష్ఠింపుము.

అవ. అన్నిటికి మిన్నయగు గీతాశాస్త్రసారభూతమగు రహస్యతమార్థము నుపదేశింతునని శ్రీకృష్ణుడర్జునునకు ప్రతిన గావించుచున్నాడు.

64. శ్లో. సర్వగుహ్యతమం భూయః । శృణు మే పరమం వచః ।
ఇష్టోఽసి మే దృఢమితి । తతో వక్ష్యామి తే హితమ్ ॥

అర్థము : సర్వగుహ్యతమం = రహస్యములన్నిటిలోను మిక్కిలి గొప్ప రహస్యమైనట్టియు, పరమం= గొప్పదియునగు, మే = నాయొక్క, వచః = మాటను, భూయః = తిరిగి, శృణు = వినుము, (త్వం = నీవు) మే = నాకు, దృఢం = మిక్కిలి, ఇష్టః = ప్రియుడవు, అసి = అగుచున్నావు, ఇతి తతః = అనుదానివలన, తే = నీకు, హితం= హితమును, వక్ష్యామి = చెప్పగలను.

తా॥ రహస్యము లన్నిటిలోను భక్తియోగమే శ్రేష్ఠమగుటచే గుహ్యతమమని యిదివరకే చెప్పబడెను. తిరిగి దానిని గూర్చియే చెప్పుచున్నాను. ఈ

మాట చాలా గొప్పది. శ్రద్ధగా వినుము. నీవు నాకు మిక్కిలి ఇష్టుడవుగాన నీకీహితము నుపదేశించుచున్నాను.

అవ. ఫలము అనిష్టనివృత్తి, ఇష్టప్రాప్తియని రెండు విధములుగా నుండును. అందు కర్తవ్య పురస్సరముగ ఇష్టప్రాప్తి యీ శ్లోకమున చెప్పబడుచున్నది. అనిష్టనివృత్తి ముందు శ్లోకమున జెప్పబడును.

65. శ్లో. మన్మనా భవ మద్భక్తో । మద్యాజీ మాం నమస్కురు ।
మామే వైష్యసి సత్యం తే । ప్రతిజానే ప్రియోఽసి మే ॥

అర్థము : మద్భక్తః = నాయందత్యంత ప్రీతికలవాడవై, మన్మనాః = నా యందు మనస్సు కలవాడవున్ను, మద్యాజీ = నన్నారాధించువాడవున్ను, భవ = అగుము, మాం = నన్ను గూర్చి, నమస్కురు = అత్యంత ప్రీతితో దండవత్ సాష్టాంగముగా నమస్కరింపుము, మాం ఏవ = నన్నే, ఏష్యసి = పొందగలవు, మే = నాకు, ప్రియః= ఇష్టుడవు, అసి = అగుచున్నావు, సత్యం = సత్యము, తే = నీకు, ప్రతిజానే = ప్రతిజ్ఞ చేయుచున్నాను.

తా॥ నాయందత్యంత ప్రేమకలవాడవై నన్ను గూర్చి మిక్కిలి ప్రీతి రూపమైన ధ్యాన పరంపరను సాగింపుము. అత్యంత ప్రీతితో నాయారాధనను గావింపుము. నాయందలి ప్రీతి పారవశ్యమున వినయమును జూపుచు భక్తి భారముచే నేలకంటిన అష్టాంగములు కలవాడవగుము. ఇట్లు గావించినచో నన్నే బడయగలుగుదువు. నీవు నాకు మిక్కిలి యిష్టుడవగుటచే ఇది నిజమని నీకు శపథము చేసి చెప్పుచున్నాను. (నాయందింత ప్రీతికలవానిని విడిచి నేనుండజాలను గాన వానిని నా చెంతకు తీసుకొందును).

అవ. ఈ శ్లోకమున కర్తవ్య మానసిక విధిపురస్సరముగనే అనిష్ట నివృత్తిని జెప్పుచున్నాడు.

66. శ్లో. సర్వధర్మాన్ పరిత్యజ్య । మా మేకం శరణం వ్రజ ।
అహం త్వా సర్వపాపేభ్యో । మోక్షయిష్యామి మా శుచః ॥

అర్థము : సర్వధర్మాన్ = సకలమోక్షసాధనములను, పరిత్యజ్య = ఫల సంగకర్తృత్వములతో మాత్రము విడిచి, మాం ఏకం = నన్నే, శరణం = ఉపాయముగా, వ్రజ = అనుసంధించుము, అహం = నేను, త్వా = నిన్ను, సర్వపాపేభ్యః = నన్ను పొందుట

కాటంకములుగా నున్న పాపములన్నిటి నుండియు, మోక్షయిష్యామి = విడిపింతును, మాశుచః = దుఃఖింపకుము.

తా॥ మోక్షసాధనములుగా జెప్పబడిన కర్మజ్ఞాన భక్తియోగములను నేను కర్తను ఫలభోక్తను యీ కర్మ నాదియనెడు కర్తృత్వ భోక్తృత్వ మమకారములను విడిచి పరమపురుషుని నియమనమును ఆయన ప్రీతి కొఱకే చేయుచున్నానను విశ్వాసముతో జేయుచు నన్నే ఉపాయముగా నమ్మియుండుము. నేను నిన్ను నన్ను పొందకుండ నాటంకపరచుచున్నట్టి సకల పాపరాశి నుండియు నుద్ధరింతును. ఇక దుఃఖింపకుము. (ఈ శ్లోకము ప్రపత్తిపరమని సంప్రదాయము. శ్రీ వైష్ణవులందరు నీ శ్లోకమును మంత్రముగా నాదరించి గురుముఖతః పంచ సంస్కార పురస్సరముగ నుపదేశపూర్వకముగ బడయుదురు.)

అవ. ఇట్లు తన ఉపదేశముచే తత్వహితజ్ఞానము నెలకొనియున్న యర్జునునకు కర్తవ్యము నుపదేశించు నెపమున (సంప్రదాయవిధి సిద్ధించుటకై) యీ శాస్త్రమున కధికారుల నెఱింగించుచున్నాడు.

67. శ్లో. ఇదం తే నాఽతపస్కాయ । నాఽభక్తాయ కదాచన ।
నచాఽశుశ్రూషవే వాచ్యం । న చ మాం యోఽభ్యసూయతి ॥

అర్థము : ఇదం = ఈ గీతాశాస్త్రము, తే = నీకు, అతపస్కాయ = తపస్సుచేయని వాని కొఱకు, న వాచ్యం = చెప్పదగదు, అభక్తాయ = భక్తిలేనివాని కొఱకు, కదాచన = ఒకప్పుడు కూడా, న (వాచ్యం) = చెప్పతగదు, అశుశ్రూషవే = శుశ్రూషచేయని వాని కొఱకున్ను, న (వాచ్యం = చెప్పతగదు) మాం = నన్నుగూర్చి, యః = ఎవడు, అభ్యసూయతి = అసూయబడుచున్నాడో, (తస్మైచ = వానికిన్నీ), న చ వాచ్యం = చెప్పతగదు.

తా ॥ ఈ గీతాశాస్త్ర రహస్యమును నీవు శాస్త్రోక్తములగు భోగసంకోచమును చేయని వానికిగాని, అది చేసినను ఉపదేశించు నీ యందును, నా యందును భక్తిలేని వానికి గాని, భక్తులైనను శుశ్రూష చేయని వారికి గాని, నా స్వరూపమును నా ఐశ్వర్యమును గుణములను విని దోషములనే యాపాదించు వానికిగాని చెప్పకుము.

అవ : ఈ గీతాశాస్త్రమును తగిన యధికారులకు తప్పక చెప్పవలెననియు దానికి ఫలము మోక్షమేయనియు చెప్పుచున్నాడు.

68. శ్లో. య ఇదం పరమం గుహ్యం । మద్భక్తే ష్వభిధాస్యతి ।
భక్తిం మయి పరాం కృత్వా । మామే వైష్యత్య సంశయః ॥

అర్థము : యః = ఎవడు, ఇదం = ఈ, పరమం గుహ్యం = గొప్ప రహస్యమును, మద్భక్తేషు= నా భక్తులలో, అభిధాస్యతి = వ్యాఖ్యానము చేయునో, (సః=వాడు) మయి = నా యడల, పరాం= గొప్పదైన, భక్తిం = భక్తిని, కృత్వా = చేసి, మాంఏవ = నన్నే, ఏష్యతి = పొందగలడు, అసంశయః = సందేహము లేదు.

తా ॥ ఈ రహస్యమును వినుట కధికారముగల నా భక్తుల గోష్ఠిలో నెవడు అర్థవిశేషములతో నుపన్యసించునో వాడు నాకు పరమభక్తుడగుచున్నాడు. గాన నన్నే తప్పక పొందగలడు.

అవ. ఇంకను ప్రచారమునకే ఫలమును జెప్పుచున్నాడు.

69. శ్లో. న చ తస్మాన్మనుష్యేషు । కశ్చిన్మే ప్రియకృత్తమః ।
భవితా నచ మే తస్మా । దన్యః ప్రియతరో భువి ।

అర్థము : మనుష్యే షు = మనుష్యుల యందు, తస్మాత్ = ఆవిధముగా గీతారహస్యములను భక్తులకుపదేశించు భక్తుని కంటె, మే = నాకు, ప్రియకృత్తమః = ఇంతకు మించిన మిక్కిలి ప్రియమును చేయువాడు, కశ్చిత్ = ఒకానొకడున్ను, నచ = లేనేలేడు, తస్మాత్ = వానికంటె, అన్యః = వేరైన, ప్రియతరః = మిక్కిలి ఇష్టుడు, భువి = భూమియందు, మే = నాకు, న చ భవితా = ఇకముందును ఉండబోడు.

తా ॥ ఈ విధముగ నే గీతారహస్యములను నా భక్త గోష్ఠిలో ప్రచారము చేయువానికంటె ప్రియుడు మనుష్యులలో వేఱొకడు లేడు, ఇక ముందుండబోడు.

అవ. గీతాశాస్త్రోపదేశకునకు ఫలమును జెప్పి ఇక దీనిని గురుముఖతః అర్థయుక్తముగా గాని శబ్దమాత్రముగాని ఉపదేశమును బడయునట్టి భక్తునకు ఫలమును జెప్పుచున్నాడు.

70. శ్లో. అధ్యేష్యతే చ య ఇమం । ధర్మ్యం సంవాద మావయోః ।
జ్ఞానయజ్ఞేన తేనా హ । మిష్ట స్స్యామితి మే మతిః ॥

అర్థము : యః = ఎవడు, ఇమం = ఈ, ధర్మ్యం = ధర్మయుక్తమైన, ఆవయోః = మన

యిద్దరియొక్క, సంవాదం = సంభాషణ రూపమైన గీతాశాస్త్రమును, అధ్యేష్యతే చ= గురుముఖతః అర్థముతో గాని శబ్దమాత్రముగాని వినుచున్నాడో, తేన = వానిచేత, జ్ఞానయజ్ఞేన = జ్ఞానమనెడు యజ్ఞము ద్వారా, ఇష్టః = ఆరాధింపబడిన వాడను, స్యామ్ ఇతి = అగుదునని, మే = నా యొక్క, మతిః = నిశ్చయము.

తా ॥ ధర్మయుక్తమైన యీ మన యిద్దరి సంవాద రూపమగు గీతాశాస్త్రమును గురువుద్వారా అర్థయుక్తముగనో శబ్దమాత్రమునో వినువాడు జ్ఞానయజ్ఞముతో నన్నారాధించినట్లు నేనానందింతును. ఇది నా నిశ్చితాభిప్రాయము.

అవ. తాను చదువజాలకున్నను గురుముఖతః వినజాలకున్నను చదువు వానిని జూచి అసూయ పడకుండుటకును ఫలమును జెప్పుచున్నాడు.

71. శ్లో. శ్రద్ధావా ననసూయు శ్చ । శృణుయా దపి యో నరః ।
సోఽపిముక్త శ్శుభాన్లోకాన్ । ప్రాప్నుయాత్పుణ్యకర్మణామ్ ॥

అర్థము : యః = ఏ, నరః = మనుష్యుడు, శ్రద్ధావాన్ = విశ్వాసము కలవాడును, అనసూయుః చ= అసూయలేనివాడును అయి, శృణుయాత్ అపి = వినినప్పటికిని, సః అపి = వాడున్ను, ముక్తః = పాపముల వలన విడువడినవాడై, పుణ్యకర్మణాం = పుణ్యకర్ములగు నా భక్తుల యొక్క, శుభాన్ = శుభములైన, లోకాన్ = సమూహములను, ప్రాప్నుయాత్ = పొందును.

తా ॥ ఈ గీతాశాస్త్రమును సదాచార్యుని నుండి విశ్వాసము కలవాడై అసూయ లేక వినువాడును భక్తికి ప్రతిబంధకములగు సమస్త పాపముల నుండియు విముక్తుడై పుణ్యకర్ములగు భగవద్భక్తుల సమూహమును బొందును.

(భగవద్గీతా పాఠశ్రవణముచే ప్రసన్నుడగు భగవానుడు వారిని తన భక్తకోటిలో చేర్చును. అట్లు చేర్చుట వీరాభక్తుల నుండి యోగోపదేశాదుల వలన మోక్షమును బడయుటకే. వినుటకే యిట్టి ఫలముండగా నిక స్వయముగ చదువుట, అర్థము నెఱుంగుట, దాని నితరులకు బోధించుటకును ఫలము చెప్పవలెనా ?)

అవ. శ్రీ భగవానుడర్జునుని యాశయము నెఱింగియు ఆదరముతో నీ విషయమును మరవకుండుటకై తన యుపదేశ మెంతవరకు సఫలమైనదో తెలియగోరు వానివలె నర్జునుని ప్రశ్నించుచున్నాడు.

72. శ్లో. కచ్చిదేత చ్ఛ్రుతం పార్థ ! త్వయైకాగ్రేణ చేతసా ।
కచ్చి దజ్ఞాన సమ్మోహః । ప్రణష్ట స్తే ధనఞ్జయ ! ॥

అర్థము : హేపార్థ = ఓ యర్జునా ! ఏతత్ = ఇది, త్వయా = నీచేత, ఏకాగ్రేణ = నిశ్చలమైన, చేతసా = మనస్సుతో, శ్రుతంకచ్చిత్ = వినబడెనా ? ధనఞ్జయ = ఓ యర్జునా! తే = నీయొక్క, అజ్ఞాన సమ్మోహః = అజ్ఞానమువలన కలిగిన భ్రాంతిజ్ఞానము, ప్రణష్టఃకచ్చిత్ = పూర్తిగ నశించినదా ?

తా ॥ నేనుపదేశించిన యీ యర్థమునంతను ఏకాగ్రచిత్తుడవై వింటివా ? ఏ యజ్ఞానముచే మూఢుడవై నీవు యుద్ధమును చేయనంటివో అట్టి యజ్ఞానముచే గలిగిన భ్రాంతి యంతయు సంపూర్ణముగ నశించినదా!

అవ. అర్జునుడది విని భగవదుపదేశము వలన తనకు కలిగిన ఫలసిద్ధిని సూచించుచు కృతజ్ఞతను ప్రకటించుచున్నాడు.

అర్జున ఉవాచ = అర్జునుడు పలికెను.

73. శ్లో. నష్టో మోహ స్స్మృతి ర్లబ్ధా । త్వత్ప్రసాదా న్మయాచ్యుత !।
స్థితోఽస్మి గతసన్దేహః । కరిష్యే వచనం తవ ।

అర్థము : అచ్యుత = శ్రీకృష్ణా ! త్వత్ప్రసాదాత్ = నీ యనుగ్రహము వలన, మోహః = అజ్ఞానము, నష్టః = నశించినది, మయా = నా చేత, స్మృతిః = తత్వజ్ఞానము, లబ్ధా= పొందబడినది, గతసన్దేహః = సంశయములేని వాడనై, స్థితఃఅస్మి = ఉన్నాడను, తవ= నీ యొక్క, వచనం = మాటను, కరిష్యే = చేసెదను.

తా॥ శ్రీకృష్ణా ! నీ యనుగ్రహము వలన నా యజ్ఞానము పోయినది. నిజమైన తత్వజ్ఞానమును నీ దయవలన లభించినది. ప్రారంభమున కలిగిన సందేహములన్నియు దీఱి స్వస్థచిత్తుడనై యున్నాను. నీవేమి చెప్పినను చేయుటకు సిద్ధముగా నున్నాను.

అవ. [illegible] యుద్ధమున [illegible]
ధృతరాష్ట్రునకు సంజయుడిట్లు చెప్పుచున్నాడు.

సఞ్జయ ఉవాచ = సంజయుడు పలికెను.

74. శ్లో. ఇత్యహం వాసుదేవస్య । పార్థస్య చ మహాత్మనః ।
సంవాద మిమ మశ్రౌష । మద్భుతం రోమహర్షణమ్ ॥

అర్థము : ఇతి = ఈవిధముగా, వాసుదేవస్య = శ్రీకృష్ణుని యొక్కయు, మహాత్మనః = గొప్పబుద్ధిమంతుడగు, పార్థస్య చ = అర్జునునియొక్కయు, ఇమం = ఈ, అద్భుతం = ఆశ్చర్యావహమైనట్టియు, రోమహర్షణం = గగుర్పాటొనరించునట్టియు, సంవాదం = సంభాషణను, అహం = నేను, అశ్రౌషమ్ = వింటిని.

తా ॥ ఇట్లు శ్రీకృష్ణునకును బుద్ధిమంతుడగు నర్జునునకు జరిగిన ఆశ్చర్యావహమును గగుర్పాటును బుట్టించునట్టియు ఈ సంవాదమును నేను వింటిని.

అవ. ఈ సంభాషణను వినుటకు తనకు గల యోగ్యతను వివరించుచున్నాడు.

75. శ్లో. వ్యాస ప్రసాదాచ్ఛ్రుతవా । నేత ద్గుహ్య మహం పరమ్ ।
యోగం యోగేశ్వరాత్కృష్ణా । త్సాక్షా త్కథయత స్స్వయమ్ ॥

అర్థము : ఏతత్ = ఈ, పరం = గొప్పదైన, యోగం = యోగమనబడు, గుహ్యం = రహస్యమును, స్వయం = తానే, కథయతః = చెప్పుచున్న, యోగేశ్వరాత్ = కల్యాణగుణాకరుడగు, కృష్ణాత్ = శ్రీకృష్ణునివలన, వ్యాసప్రదాత్ = వ్యాసుని యనుగ్రహమువలన, అహం = నేను, సాక్షాత్ = ప్రత్యక్షముగా, శ్రుతవాన్ అస్మి = విన్నవాడనగుచున్నాను.

తా ॥ పరమ రహస్యమగు నీ యోగశాస్త్రమును కల్యాణ గుణనిధియగు శ్రీకృష్ణుడు స్వయముగ నుపదేశించుచుండగా నేను వ్యాసుడు ప్రసాదించిన దివ్య శ్రోత్రము వలన ప్రత్యక్షముగా వింటిని.

76. శ్లో. రాజన్ సంస్మృత్య సంస్మృత్య । సంవాద మిమ మద్భుతమ్ ।
కేశవార్జునయోః పుణ్యం । హృష్యామి చ ముహుర్ముహుః ॥

అర్థము : రాజన్ = ధృతరాష్ట్ర మహారాజా ! కేశవార్జునయోః = కృష్ణార్జునుల యొక్క, అద్భుతం = ఆశ్చర్యకరమైనట్టియు, పుణ్యం = పవిత్రమైనట్టియు, ఇమం = ఈ, సంవాదం = సంభాషణను, సంస్మృత్య సంస్మృత్య = తలచితలచి, ముహుః ముహుఃచ = మాటిమాటికిన్ని, హృష్యామి = ఆనందించుచున్నాను.

తా ॥ రాజా ! కృష్ణార్జునులకు జరిగిన ఆశ్చర్యావహమును,పవిత్రమునైన యీ సంభాషణను తలచి తలచి మాటిమాటికిన్ని ఆనందించుచున్నాను.

అవ. విశ్వరూపమును దివ్యచక్షుస్సుతో సాక్షాత్తుగా దర్శించిన ఆనందాశ్చర్యములను తెలుపుకొనుచున్నాడు.

77. శ్లో. తచ్చ సంస్మృత్య సంస్మృత్య। రూప మత్యద్భుతం హరేః।
విస్మయో మే మహాన్ రాజన్। హృష్యామి చ పునః పునః॥

అర్థము : హే రాజన్ ! = ఓ రాజా! హరేః = శ్రీకృష్ణుని యొక్క, అత్యద్భుతం = మిక్కిలి ఆశ్చర్యకరమైన, తత్ రూపం చ = ఆ విశ్వరూపమునున్ను, సంస్మృత్య సంస్మృత్య= తలచి తలచి, మే = నాకు, మహాన్ = గొప్పదైన, విస్మయః = ఆశ్చర్యము, (భవతి= కలుగుచున్నది) పునః పునః చ = మాటిమాటికిని, హృష్యామి = ఆనందించుచున్నాము.

తా॥ శ్రీకృష్ణుడర్జునునకు జూపించిన యా విశ్వరూపమును శ్రీవ్యాస మహర్షి ప్రసాదించిన దివ్యచక్షుస్సుతో సాక్షాత్తుగా జూచి దాని నిప్పుడు తలచి తలచి మాటిమాటికిని ఆనందాశ్చర్యములతో నోలలా డుచున్నాను.

అవ. దుర్యోధనుని గెలుపును విను కుతూహలముతో ధృతరాష్ట్రుడడిగిన ప్రశ్నకు సంజయుడు సాక్షాత్తుగ నుత్తరము నీయజాలక కొంతచెప్పిన నంతయు గ్రహించునను ఆశతో శ్రీకృష్ణార్జునుల సంవాదాద్భుత తత్త్వాదులను వర్ణించెను. కాని సర్వాత్మనా అంధుడగు ధృతరాష్ట్రుడా యాశయము నెఱుంగక పోవుటచే యిపుడు సంజయుడు సాక్షాత్తుగనే సమాధాన మొసంగుచున్నాడు. వేయేల రాజా! వినుము.

78. శ్లో. యత్రయోగేశ్వరః కృష్ణో। యత్ర పార్థో ధనుర్ధరః।
తత్ర శ్రీర్విజయో భూతి। ర్ధ్రువా నీతి ర్మతిర్మమ॥

ఇతి శ్రీ భగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే సకల శాస్త్రార్థకథన మోక్షసన్న్యాస యోగోనామ అష్టాదశోఽధ్యాయః.

అర్థము : యత్ర = ఏపక్షమునందు, యోగేశ్వరః = యోగేశ్వరుడగు, కృష్ణః = శ్రీకృష్ణుడును, యత్ర = ఏపక్షమునందు, ధనుర్ధరః = ధనుస్సును ధరించియున్న, పార్థః = అర్జునుడున్ను (కలరో) తత్ర = ఆపక్ష మునందే, శ్రీః = లక్ష్మియు, విజయః = గెలుపున్ను, భూతిః = ఐశ్వర్యమున్ను, నీతిః = నీతియు, ధ్రువా = నిశ్చలముగా (నుండునని) మమ = నాయొక్క, మతిః = అభిప్రాయము.

శ్రీకృష్ణుడును, ధనుర్ధరుడైన అర్జునుడును ఏ పక్షమునందుందురో ఆ పక్షమునందే లక్ష్మియు, జయమును, ఐశ్వర్యమును నీతియు నిశ్చలమై యుండునని నా యభిప్రాయము.

ఇది ఉపనిషదర్థ ప్రతిపాదకమును, బ్రహ్మవిద్యయు, యోగశాస్త్రమును, శ్రీకృష్ణార్జున సంవాదరూపమును అయిన శ్రీ భగవద్గీతయందలి మోక్షసన్న్యాస యోగమనబడు

పదునెనిమిదవ యధ్యాయము

ఈ యధ్యాయమున	అర్జునుని	శ్లోకములు	2
,,	సంజయుని	,,	5
,,	శ్రీకృష్ణుని	,,	71
,,	మొత్తము	,,	78

ఇంతవరకు అయిన మొత్తము గీతా శ్లోకములు 700

భగవద్గీతా ప్రశ్నోత్తరావళి
పదునెనిమిదవ అధ్యాయము

1.ప్ర. ఈయధ్యాయమునకు పేరేమి? ఆ పేరెందులకుంచబడినది?

ఉ. ఈ యధ్యాయమునకు 'మోక్షసన్న్యాసయోగ' మని పేరు.

చివర మూడధ్యాయములును ముముక్షువునకు కర్తవ్యమును నిర్ణయించుటకు ముఖ్యముగా నేర్పడినవి. అందు చివరదియగు నీ యధ్యాయమున నా కర్తవ్యములో ప్రధానమగు కర్మలయొక్క ఫల-సంగ-కర్తృత్వసన్యాసము (త్యాగము) లెస్సగా తెలుపబడుటచే నీ యధ్యాయమున కాపేరుంచబడినది.

ఇట్టి త్రివిధత్యాగమే, గుహ్యతమమైనట్టియు శాస్త్రసారతమైనట్టియు శరణాగతికి అంగముగా నిందు విధింపబడినది. దీనిచే ముముక్షువగు చేతనుడు తన వర్ణాశ్రమ ధర్మము లంగముగాగల మోక్షసాధనములైన కర్మయోగాదు లాచరించవలసిన విధాన మీ యధ్యాయమువలన నెఱుకపరచబడెను

2. ప్ర. ఇందు చెప్పబడిన విషయములెవ్వి?

ఉ. శ్లో॥ ఈశ్వరే కర్తృతాబుద్ధిః సత్త్వోపాదేయతాన్తిమే ।
స్వకర్మ పరిమాణశ్చ శాస్త్రసారార్థ ఉచ్యతే ॥ (గీ.సం.)

1. జీవుడు తానాచరించు సకల కర్మలకును సర్వేశ్వరుడే కర్తయని యనుసంధించుట.

2. సత్వరజస్తమో గుణకార్యముల నుపదేశించి యందు సత్వగుణమే మిక్కిలి పెంపొందించుకొన దగినదని చెప్పుట.

3. వర్ణాశ్రమ ధర్మములను విడువక పరమపురుషుని యారాధన యను బుద్ధితో గావించినచో మోక్షసాధనములు కాగలవని చెప్పుట.

4. గీతాశాస్త్రమునకు సారతమమగు నర్థము 'భక్తియోగమే' యని చెప్పుట. (సంగ్రహముగా నీ నాలుగు విషయములును నీ యధ్యాయమున వివరింపబడినవి).

— : విశేష వివరములు : —

1. సన్న్యాస త్యాగశబ్దములు వేరు వేరర్థములు కలవియా? లేక రెండు శబ్దములకు నర్థమొక్కటియేనా? వేరు వేరర్థములు కలవగుచో వాటి స్వరూపములను వేరువేరుగా నెఱుంగగోరుచున్నాను. ఒకే యర్థము కలవందువా! దాని స్వరూపమెట్టిదో తెలుపుము అని యర్జునుడు శ్రీకృష్ణుని ప్రశ్నించుట. 1 శ్లో.
2. శ్రీ భగవానుడు త్యాగసన్న్యాస శబ్దములు రెండును పర్యాయ శబ్దములని చెప్పుచు దాని స్వరూపమును గూర్చి వాదుల భిన్నాభిప్రాయములను దెలిపి చివరకు తన నిశ్చితాభిప్రాయమును జెప్పుట. 2 నుండి 6 శ్లో. వరకు.
3. ఈ త్యాగము తామసమనియు, రాజసమనియు సాత్త్వికమనియు మూడు విధములుగా నుండునని చెప్పుట. 7, 8, 9 శ్లో
4. శాస్త్ర సిద్ధమగు సాత్త్విక త్యాగియొక్క నిర్వికారత్వ రూపమగు లక్షణము లను జెప్పుట. 10, 11 శ్లో
5. లౌకికములైన ఫలములనిచ్చు కర్మలు ఫలమును కోరకున్నను వాటి శక్తికి తగినట్లు ఫలించియే తీరును. ప్రమాదముచే భూమిపై పడిన గింజ మొలిచి ఫలించకుండునా?

   అట్లే వైదికములగు నిత్యనైమిత్తిక అగ్నిహోత్ర దర్శపూర్ణమాసాది కర్మలున్ను, మహాయజ్ఞాదులున్ను ఫలమును కోరకున్నను ఆచరించబడినచో తప్పక వాటి వాటికి నిర్ణయింపబడిన ఫలముల నొసంగక మానవు. ఆ ఫలానుభవమునకు పుట్టుట యనివార్యముగాన నమృతరసార్థికి విషబీజము నాటినటుల ముముక్షువునకు కర్మలు విరుద్ధఫలముల నొసంగును. గాన తగవను ప్రశ్నకు సమాధాన మొసంగుట. 12 శ్లో.
6. ప్రతి కర్మకును కారణము లైదుకలవని నిరూపించుట.
   13, 14, 15 శ్లో.
7. ఇట్లుండ తనను మాత్రమే కర్తనుగా భావించుటను నిందించుట. 16 శ్లో.
8. పరమ పురుషునే కర్తగా భావించుటను ప్రశంసించుట 17 శ్లో.
9. ఇట్లు తాను కర్త కానను తలంపు సత్త్వగుణాభివృద్ధిచే కలుగును. కావున సత్త్వగుణమును పెంపొందించు కొనవలయును. ఇందులకై కర్మయందలి సత్త్వాదిగుణముచే కలుగు భేదములను సవిస్తరముగా నెఱుంగవలెను. దాని నెఱింగించుటకై ముందుగా కర్మబోధనా విధానము నెఱింగించుట. 18 శ్లో.

10. కర్మబోధనాన్తర్గతమై యెఱుంగదగియున్న కర్మయొక్క ముప్విధములుగా నుండుటను జెప్పుట. 19 శ్లో.

11. అట్లు మూడు విధములైన చేయదగిన కర్మజ్ఞానము, చేయదగిన కర్మ, కర్తలున్ను సత్వరజస్తమోగుణములచే మూడు మూడు విధములుగా నుండుటను క్రమముగా తెలుపుట. 20 నుండి 28 శ్లో. వరకు.

12. తత్వ పురుషార్థ నిశ్చయ రూపమైన బుద్ధియొక్కయు, ఎన్ని విఘ్నములు వచ్చినను ఆరంభించిన కార్యమును విడువకుండుట యనెడు ధృతి యొక్కయు సత్వాది గుణములచే గల భేదమును జెప్పుట. 29 నుండి 35 శ్లో. వరకు

13. సుఖముయొక్క సత్వాదిభేదములను వివరించుట. 36, 37, 38, 39 శ్లో.

14. గుణత్రయ సంబంధము జీవకోటికనివార్యమని చెప్పుట. 40 శ్లో.

15. బ్రాహ్మణాది నాలుగు వర్ణములకును స్వభావసిద్ధమగు కర్తవ్యకర్మల స్వరూపమును నిరూపించుట. 41 నుండి 44 శ్లో.

16. వర్ణాశ్రమ ధర్మ విభాగమునకు ఫలమును జెప్పుట. 45, 46 శ్లో.

17. వర్ణాశ్రమధర్మము లెల్లర కనివార్యమని చెప్పుట. 47 శ్లో.

18. కలలోనైనను తనను కర్తగా తలంచక వర్ణాశ్రమ ధర్మముల నాచరించువానికి కలుగు ఫలక్రమమును వివరించుట 43 నుండి 55 శ్లో.వ.

19. ఫలమును విడిచి పరమపురుషారాధన బుద్ధితో నాచరించిన నిత్యనైమిత్తిక కర్మలకు వలెనే యట్టిబుద్ధితోనే యాచరించిన కామ్యకర్మలకు నదేవిధమగు ఫలమే సిద్ధించునని చెప్పుట. 56 శ్లో.

20. ఇట్లాచరించుటలోను, ఆచరించకపోవుటలోను గల లాభనష్టముల నర్జునునియందు సమన్వయ పరచుచు నాతనిని యుద్ధమునకు ప్రోత్సహించుట. 57 నుండి 60 శ్లో.

21. ప్రాణి సమూహమంతయు తమ పూర్వకర్మానుగుణముగా శరీరమున ప్రవేశపెట్టబడి సర్వేశ్వరునిచే నడిపించబడుచున్నదని చెప్పుట. 61శ్లో.

22. దీనినుండి తప్పించుకొను నుపాయము నుపదేశించుట. 62 శ్లో.

23. కర్మ జ్ఞానభక్తులనెడు మూడు మార్గములలో నేది తనకు తగినదో దాని నాచరించుమని యుపదేశమును ముగించుట. 63 శ్లో.

24. శాస్త్రసారార్థము నుపదేశించుటకు ప్రతిజ్ఞ చేయుట. 64 శ్లో.
25. పరమపురుషార్థ రూపమగు నిష్ఠప్రాప్తిని, అందులకు ప్రతిబంధకమగు పాపముల పరిహారమును జెప్పుచు అందులకై చేతనుడు చేయవలసిన కృత్యములను శాస్త్రసారార్థముగా విధించుట. 65, 66 శ్లో.
26. ఈ శాస్త్రమున కనధికారులను తెలుపుట. 67 శ్లో.
27. అధికారులకీ శాస్త్రము నుపదేశించుటకు ఫలమును చెప్పుచు నట్టి వానిని ప్రశంసించుట. 66 – 69, శ్లో.
28. గురుముఖముగ నీ శాస్త్రమును మూలమునుగాని యర్థమునుగాని చెప్పుకొనువారలకు ఫలమును చెప్పుట. 70 శ్లో.
29. తాను చదువలేకున్నను అసూయను విడిచి శ్రద్ధతో గురుముఖతః విని నందులకు ఫలమును చెప్పుట. 71 శ్లో.
30. తన యుపదేశ ఫలితము నెఱుంగుటకై యర్జునుని ప్రశ్నించుట 72 శ్లో .
31. అర్జునుడు తన కృతజ్ఞతను తెలుపుకొనుచు వినుటవలన కలిగిన ఫలములను జెప్పుట. 73 శ్లో.
32. సంజయుడు ధృతరాష్ట్రుని మొదటిప్రశ్నకు సమాధానమును సాభిప్రాయముగా జెప్పుట.74 నుండి 77 శ్లో. వరకు
33. ఇంకను ధృతరాష్ట్రుడు గ్రహించనట్లు తోచి సుస్పష్టముగా సమాధాన మొసంగుట. 78 శ్లో .

3. ప్ర. **ఈ యధ్యాయమునకు వెనుకటి యధ్యాయములతోను ప్రధాన శాస్త్రార్థములతోను నేమి సంబంధము కలదు?**

ఉ. పదహారవ యధ్యాయము మొదలు మూడధ్యాయములు ముముక్షువుయొక్క కర్తవ్యమును శోధించునవిగా చెప్పబడినవి. అందు పదహారవ యధ్యాయమున ప్రతి మానవుడును తన నడవడికను పరీక్షించుకొని యాసురభావమునడంచి దైవీభావమును పెంపొందించుకొని భగవదనుగ్రహ పాత్రులగుట కారెండు భావములును విస్తారముగా ఫలముతో చెప్పబడినవి. అట్లు దైవీభావమును వృద్ధిచేసుకొనుటకు రజస్తమో గుణముల నడంచునట్టి, సత్వగుణాభివృద్ధికి పాటించవలసిన ఆహార యజ్ఞ తపో దానముల స్వరూపమును పదిహేడవ యధ్యాయముచే వివరించెను.

ఈ పదునెనిమిదవ యధ్యాయమున ప్రధానమైన మోక్షసాధనమగు నంశముయొక్క స్వరూపము శోధింపబడుచున్నది. అది ముముక్షువాచరించ దగిన కర్మలను గూర్చిన విషయము, అనగా - వర్ణాశ్రమ ధర్మములను ఫల, సంగ, కర్తృత్వములను వీడి యాచరింపవలయునని చెప్పబడుచున్నది. కాన నీయధ్యాయము వెనుకటి యధ్యాయములతో సంగతమగుచున్నది. ఇట్టి యనుష్ఠానము భగవదనుగ్రహైక సాధనమగుటచే సత్వవృద్ధిని గావించి ముక్తిసాధనమగు భక్తికి మిక్కిలి తోడ్పడుచున్నది. గాన ప్రధాన శాస్త్రార్థమగు ముక్తికిది ముఖ్యముగా నెఱుంగవలసిన యంశమగుచున్నది.

4.ప్ర. **ఈయధ్యాయారంభమున నర్జునుడేమి ప్రశ్నించెను? అందులకేమి కారణము? దానికి భగవాను డేమి యుత్తరమొసంగెను?**

ఉ. సన్న్యాస - త్యాగశబ్దముల కర్థము వేరు వేరా? ఒక్కటియా? వేరైనచో నారెండింటి స్వరూపమెట్లుండును? ఒక్కటియే యైనచో దాని స్వరూప మెట్లుండును? తెలుపుమని శ్రీకృష్ణుని ప్రశ్నించెను. 1. శ్లో॥
మోక్షసాధనమగు వేదోక్తమైన యజ్ఞాదులయొక్క స్వరూపము తచ్ఛబ్దముతో సంబంధించి యుండుటయేయని క్రిందటి యధ్యాయమున జెప్పబడెను. ఐనను స్వర్గసాధనమగునట్టియు మోక్షసాధనమగునట్టియు యజ్ఞముల స్వరూపములో భేదమేమియు గాన్పించదు. కావున దేనిచే నా యజ్ఞము మోక్షసాధనమగుచున్నదో దాని నిప్పుడు సమగ్రముగా శోధించి యెఱుంగుటకై యర్జునుడు ప్రశ్నించెను.

(మరియు - తైత్తరీయ నారాయణోపనిషత్తులో నొకచోట "న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనై కే అమృతత్వమానసుః" అని యితర సాధనములు నిషేధింపబడి త్యాగ మొక్కటియే మోక్షసాధనముగా విధింపబడెను. అందే మరియొకచోట "వేదాన్త విజ్ఞాన సునిశ్చితార్థా । స్సన్న్యాస యోగా ద్యతయ శ్శుద్ధసత్వాః, తే బ్రహ్మలోకే తు పరాన్తకాలే పరామృతా త్పరిముచ్యన్తి సర్వే" అని సన్న్యాసముచేతనే మోక్షప్రాప్తి చెప్పబడెను. ఇట్లుండుటచే) త్యాగము సన్న్యాసము వేరా? ఒక్కటియా? ఇందేది మోక్షసాధనముగా నాదరింపబడ దగినదని యర్జునుడు ప్రశ్నించెను. ఇంకను ఇంతవరకు జరిగిన నుపన్యాసములో పరమాత్మ త్యాగ సన్న్యాస శబ్దములు పెక్కు మారులు ప్రయోగించెను. వాటి స్వరూపమును లెస్సగ

నెఱింగినగాని ముముక్షువున కనుష్ఠానము దుర్ఘటమగుటచే వాటి స్వరూపమును తెలియగోరి యర్జునుడు ప్రశ్నించుచున్నాడనియు చెప్పవచ్చును.

మరియు, శాస్త్రసారార్థమును దెలుపు "సర్వధర్మాన్" అనెడు శ్లోకమున 'పరిత్యజ్య' యని త్యాగము ప్రసక్తమగుటచేతను దాని యర్థమును నిర్ణయించుటలో పెక్కుమత భేదములుండుటచేతను తన మతము నెఱింగించనిచో నుపదేశమువలన లాభము లేకుండుటయే గాక మిక్కిలి యనర్థము వాటిల్లుననియు నిశ్చయించి పరమాత్మ యర్జునుని ముఖమున నా ప్రశ్న నుదయింపజేసి మతాంతర నిరసన పురస్సరముగా తన మతమును స్థాపించుచున్నాడు.

పరమాత్మ యీ ప్రశ్న కుత్తర మొసంగుటలో త్యాగసన్న్యాస శబ్దములను పర్యాయముగా వాడుటచే రెండును నొకే యర్థమును బోధించు పర్యాయపదములని తెలియజేసెను.

(న్యాయముచే నర్థమును నిర్ణయించు కొనవలెను. సందిగ్ధావస్థయందే న్యాయము ప్రవర్తించును. సందేహము, వాదుల భిన్నాభిప్రాయమువలన కలుగును. కావున నీ సన్న్యాస త్యాగములను గురించిన వాదోపవాదములను జూపుచున్నాడు.)

కొందరు కామ్యకర్మలు బంధహేతువులగుటచే వాటినిమాత్రమే స్వరూపములోనే విడువవలెనందురు. 2 శ్లో.

(వారి యభిప్రాయ మేమనగా – నిత్యనైమిత్తిక కర్మలవలె కామ్యకర్మల నాచరించక పోవుటచే ననర్థముగాని మరియొకకర్మ కనర్హతగాని వాటిల్లదు. ఆ కర్మలు ధర్మార్థకామములనే సాధించదగిన వగుటచే మోక్ష విరుద్ధములు. ఆ కర్మలే మోక్షము నీయగలవందుమా – మోక్షసాధనములుగా విధింపబడిన ఉపాసనాదులు నిష్ప్రయోజనములగును. ఉపాసన కంగములందుమా – అట్టివి నిత్యనైమిత్తి కాద్యాశ్రమ ధర్మములు మాత్రమే యగుచున్నవి. కావున మోక్షకాముకులకు నరకములే యనదగిన స్వర్గాది ఫలముల నొసంగు కర్మలు ముముక్షువులకు స్వరూపముతో విడువదగినవియే యందురు.) మరికొందరు నిత్యములు, నైమిత్తికములు, కామ్యములు అన్నియు ఫలమును మాత్రము విడిచి యాచరించుమని చెప్పుచున్నారు. 2 శ్లో.

(వీరి యభిప్రాయ మేమనగా :- కామ్యకర్మలు మోక్షమునకు విరుద్ధములగు ఫలముల నిచ్చునవి యని గదా! ముముక్షువులు వాటిని విడుచుచున్నారు. కావున ఫలమును విడిచిన చాలును. అట్లగుచో వాటి నాచరించుట నిష్ఫలముగదా! యని శంకించవచ్చును, నిత్యనైమిత్తిక కర్మలవలె కామ్యకర్మలును భగవత్ప్రీతికి మాత్రము సాధనములగును గాన వాటివలె నివియు నాచరించ దగినవియే. "యో వా ఏత దక్షరం గార్గ్య విదిత్వా జుహోతి యజతే తపస్తప్యతే బహూని వర్ష సహస్రాణి అన్తవ దేవాస్య తద్భవతి" యనెడు బృహదారణ్య సూక్తిచే నొకకర్మ పరమపురుషు నెఱుంగుటయు నెఱుంగ కుండుటయు మాత్రముచేతనే నిత్యానిత్య ఫలసాధనమగుచున్నదని చెప్పబడుటచే నిత్యనైమిత్తిక కర్మలవలె కామ్యకర్మలకును ఫలమాత్రత్యాగమేగాని స్వరూపత్యాగ మెంతమాత్రమును కాదందురు)

కపిల సంప్రదాయస్థులును, కొందరు వేదాంతులును రాగాదులు బంధకములగుటచే నెట్లు సర్వసిద్ధాంతములయందును త్యాజ్యములుగా పరిగణింపబడుచున్నవో యట్లే సకల యజ్ఞాది కర్మలును శాస్త్రమున విధింపబడినను మోక్షము నపేక్షించువానికి త్యాజ్యములేయని చెప్పుదురు. ఇతరులకొరకవి కార్యకరములగుటచే వాటిని విధించు శాస్త్రము వ్యర్థముకాదందరు. 3 శ్లో.

పరిత్యజించవలసినవి పరిగ్రహించవలసినవి యని తత్వమును లెస్సగ నెఱుంగు పండితులు యజ్ఞాదులను విడువరాదందురు. 4 శ్లో.

ఇట్లుండ నిక నా సిద్ధాంతమును వినుము – వైదికములగు యజ్ఞదాన తపః ప్రభృతి కర్మలును, నిత్యనైమిత్తిక కర్మలును, భక్తిపుట్టుటకు ప్రతిబంధకములైన ప్రాచీన పాపరాశికి వినాశకరములగుటచేత తత్తద్వర్ణాశ్రమానుగుణముగా యావజ్జీవ మాచరించచుండ వలసినవియే గాని వాని నెన్నడును విడువరాదు. ఇంక విడువవలసిన దేమనగా – ఆ యాచరించుటలో మాత్రము ఫల – కర్మ – కర్తృత్వములను విడిచి యాచరించవలెను. ఇదియే త్యాగము, ఇదియే సన్న్యాసము. 4 శ్లో.

(ఇచ్చట ఫలత్యాగమనగా :- 'ఈ నేను జేయు కర్మవలన గలుగుస్వర్గాది ఫలము నా కొఱకే' యని తలంచక 'భగవంతుడు తన ప్రీతికొఱకు తానే

నాచేత నీ కర్మలు చేయించుకొనుచున్నాడ' ని తలంచుట.

కర్మత్యాగమనగా : ఈ కర్మను తనదిగా భావించకుండుట. అనగా 'ఈ కర్మ నాకు కావలసిన ఫలము నిచ్చుటకు సాధనముగాన నిది నాదే' యని తలంచక యుండుట.

కర్తృత్వత్యాగమనగా : నిజమునకు తానే కర్తయైనను తన కా కర్తృత్వము పరమాత్మ ప్రసాదించినదియే యగుటచేతను తానాపనిలో ప్రవర్తించుట భగవదనుమతి చేతనే యగుటచేతను తనను కర్తనుగా తలంచక ఆ కర్తృత్వమును సర్వేశ్వరునియందే సమర్పించుట.

ఇందులకొక లౌకిక ఉదాహరణము ననుసంధించుటచే నిది సుగమము కాగలదు.

ఒక వ్యాపారి వద్దనుండు గుమాస్తా తాను జేయుచున్న వ్యాపారమువలన కలుగు లాభనష్టములు తనవిగాగాని ఆ వ్యాపారము తనదనిగాని ఆ వ్యాపారమునకు తాను స్వతంత్ర కర్తననిగాని భావించనట్లే యిచ్చటను తనను భగవంతునికి కింకరునిగా భావించుటచే నీ మూడు విధములైన త్యాగములును సుఖముగా సిద్ధించును. ఇట్లే యొక యోధుని దృష్టాంతముగా తీసుకొనచ్చును.)

కాబట్టి వెనుకటి మతములన్నియు నధమములే. నిత్యనైమిత్తిక మహాయజ్ఞాది కర్మలను విడుచుటతగదు. అందులకు పెక్కు కారణములు మూడవ యధ్యాయమునందే చెప్పబడినవి.

యజ్ఞాది కర్మలను విడిచినచో జీవయాత్ర గడచుటయే దుస్సహముగాన వాటినాచరించవలెను. 5 శ్లో.

మనస్సు అన్నమయమగుటచే బ్రహ్మసాక్షాత్కారరూపమగు జ్ఞానము ఆహారాధీనము. అట్టి పవిత్రమైన ఆహారము 'యజ్ఞశిష్టాశినః' అనెడు శ్లోకముచే అన్వయ వ్యతిరేకములుగా యజ్ఞమున శేషించినది సర్వపాపహర మనియు, కానిది సర్వపాపావహమనియు చెప్పబడుటచే యజ్ఞాచరణ మత్యంతావశ్యకము. 6 శ్లో.

ప్ర. సాత్త్విక రాజస తామస త్యాగముల స్వరూప మెట్టిది?

ఉ : నిత్యనైమిత్తిక మహాయజ్ఞాది వర్ణాశ్రమ విహిత కర్మల నన్నింటిని, భగవదారాధన బుద్ధితో నాచరించుటయే ఫలమని తలంచి వెనుక చెప్పినట్లు ఫలసంగ

కర్తృత్వములను వీడి యాచరించినచో నది సాత్త్విక త్యాగమగును. 9 శ్లో. (దీనికి సత్వగుణము కారణము, సత్వగుణముచే వాస్తవిక వస్తుజ్ఞాన ముత్పన్న మగును. దానిచే సంశయము లడుగంటును. సాత్త్వికత్యాగమలవడును. అట్టివాడనిష్ట ఫలముల నొసంగు కర్మలు ప్రమాదవశమున తటస్థించినను ద్వేషింపడు. స్వర్గపుత్ర పశ్వన్నాది ఫలముల నొసంగు కర్మల నాదరించడు. శరీర మున్నంతవర కెవ్వడును బొత్తుగా కర్మలను విడువజాలడు గాన మహాయజ్ఞాదుల నాచరించుచునే యుండవలెను. వాటి ఫలాదులను విడిచి యాచరించువాడే సాత్త్విక త్యాగి). 10, 11 శ్లో.

కర్మ క్రమముగ మోక్షసాధనమైనను మిక్కిలి శ్రమపడి ధనము నార్జించినగాని నెరవేరదుగాన కాయక్లేశకరమును, మనస్సునకు క్షోభను కలిగించునదియునని భయపడి యింతకంటె యోగసిద్ధికై జ్ఞానాభ్యాసమే మేలని మహాయజ్ఞాది యాశ్రమ కర్మలను విడుచుట రజోగుణ మూలముగాన రాజసత్యాగమనబడును. అది మోక్షశాస్త్ర విపరీతాచారమగుటచే త్యాగఫలమగు జ్ఞానమును పుట్టించజాలదు. 8 శ్లో.

(కర్మ లెంత కష్టమైనను త్రివిధత్యాగ మొనరించి భగవదర్పణ బుద్ధితో నాచరించినచో భగవంతుడు ప్రసన్నుడై మనః ప్రసాదమును ప్రసాదించును. కర్మలు దుఃఖాత్మకములగుటచే మనస్సునకు దుఃఖమునేగాని ప్రసన్నతను కలిగించవని భావించుట అజ్ఞానము, అవి మనకంటికి కన్పించని మార్గములతో నుపకరించును. అదియే పైన చెప్పబడినది.)

పాపమును బోగొట్టి జ్ఞానసాధనములగు కర్మలను బంధహేతువులని భ్రమించి విడుచుట తామస త్యాగమనబడును. ఇట్లు పక్రమించి విడుచుట తమోగుణముచే బుట్టు నజ్ఞానమూలమునగాన నా త్యాగము తామసమే. "ప్రమాదమోహౌ తమసో భవతోఽజ్ఞానమేవ చ" యనుటచే నజ్ఞానము వలననే పుట్టును. అజ్ఞానమనగా జ్ఞాన విరోధియగు విపరీతజ్ఞాన మేకదా! 7 శ్లో.

ప్ర. నిత్యనైమిత్తిక కర్మలకును, కామ్య కర్మలకు వలెనే కోరకున్నను ఫలముకల్పదు గాన కర్మలన్నియు మోక్ష విరోధులే యగుటచే వాటిని పూర్తిగా విడుచుటయే మేలను ప్రశ్నకు శ్రీ కృష్ణు డేమి యుత్తర మొసంగెను?

ఉ: కర్మల ననుష్ఠించినపిదప ఇష్టము, అనిష్టము, మిశ్రము అని మూడు విధములుగ ఫలములు లభించును. అంద నిష్టఫలము నరకాదికము.

ఇష్టము స్వర్గాదికము, మిశ్రమనిష్టముతో కూడియుండు పశుపుత్రాన్నాదికము. ఇవి బుభుక్షువు (సంసారికి) నకు మాత్రమే కలుగును. కాని ఫల సంగకర్తృత్వములు త్యజించిన ముముక్షువున కిట్టి మోక్ష విరుద్ధఫలము లెన్నడును గలుగవు. 12 శ్లో.

7. ప్ర. ప్రతికర్మకును గల కారణ పఞ్చక మెట్లు వివరింపబడెను? లేక సకల చేతనా చేతనాన్తర్యామి యగు పరమపురుషుడే కర్తయని తలంచుట కుపాయమేమి?

ఉ : శాస్త్ర సిద్ధమైనను శాస్త్రనిషిద్ధమైనను శారీరక, వాచిక, మానసిక సమస్త కర్మలకును, "శరీరము, మనస్సుతోసహా పంచ కర్మేంద్రియములు, పంచ విధములగు ప్రాణచేష్టలు, జీవాత్మ, పరమాత్మ" యని య్యైదు కారణములుండును. 14, 15 శ్లో.

శరీరమునకు జీవుడెట్లో యట్లే జీవునకు పరమాత్మయు ప్రధాన కారణము గాన మొదటి నాల్గింటిని ఉపకరణములుగా జేసికొని పరమాత్మయే ప్రధాన కర్తయగు చున్నాడు. జీవుడు కర్తయైనను అతని కాకర్తృత్వమును పరమాత్మయే ప్రసాదించెను. ఇట్లు జీవుని కర్తృత్వము పరమాత్మాధీన మైనను పుణ్యాపాప కర్మలకు బాధ్యుడు జీవుడు కాకపోడు.

[ఎట్లనగా - పరమాత్మ జీవునకు కరణ కళేబరాదుల ప్రసాదించి తానంతర్యామిగా నుండి వాటిని ధరించుచున్నాడు. జీవుడు వాటిచే లభించిన శక్తి కలవాడై వాటి కాధారభూతుడగుచు తన యిష్టానుసారముగ కర్మల నాచరించుచున్నాడు. అతని కంతర్యామిగా నున్న పరమపురుషుడా కర్మల కనుమతి నొసంగుచు నాతని నా కర్మలయందు ప్రవర్తింజేయుచున్నాడు. జీవుడు మొదట తన బుద్ధితోనే ప్రవర్తించుచున్నాడు గాన తానే విధినిషేధములకు బాధ్యుడగుచున్నాడు. ఒక పెద్దపనిని చేయుటకు పెక్కుమంది యవసరమైనను యెవడో యొక్కడు మాత్రమే పెద్దగా నుండి సమస్త బాధ్యతలను వహించి విధినిషేధములకును లాభనష్టములకును పాత్రుడగునట్లే పై విధముగ నైదుకారణములున్నను జీవుడు కర్మలకు ముఖ్య కారణమై వాటిలన తటస్థించు సుఖదుఃఖములకు బాధ్యుడగుచున్నాడు.]

[ఇట్లు జీవుడేపనిని చేసినను పరమాత్మ యనుమతి లేనిదే చేయజాలడుగాన తానొక్కడే యాపనిని చేసినట్లు తలంచినచో వేదాంత విజ్ఞాన మతనికి మృగ్యమే యని చెప్పవలెను. ఇట్లు వాస్తవ వస్తుజ్ఞానము

లేకుండుటచే నిజమగు కర్తయెవ్వడో యెరుంగనేరడు] 16 శ్లో ॥
కాని పరమాత్మయే కర్తయని తలంచుటచే తాను కర్తనని యభిమానించని సజ్జనుడా కర్మయు తనదని తలంచడు. దానిచే నా ఫలమును తనదని యాశింపడు. అట్టివాడు భీష్మాదులనే కాదుగదా యుద్ధమున లోకుల నందర జంపినను నది పాపము కానేరదు. 17 శ్లో ॥

8. ప్ర. సత్త్వాది గుణములనుబట్టి మూడు విధములైన జ్ఞాన కర్మ - కర్తల యొక్క స్వరూపమెట్లు నిరూపింపబడెను?

ఉ :- జ్యోతిష్టోమాది కర్మలకు సంబంధించిన వేదవిధి "చేయదగిన కర్మయొక్క జ్ఞానము - చేయదగిన కర్మ - దాని నెటింగి యాచరించు జీవుడు" అని మూడువిధములుగా నుండును. 18 శ్లో.

అందు కర్మ - "సాధనములగు ద్రవ్యాదులు, చేయదగిన యాగము, చేయునట్టి యాత్మ" అని తిరిగి మూడు విధములుగా నుండును. 19 శ్లో.

ఇందొక్కొక్కటి సత్త్వాది గుణములచే మూడు విధములుగానుండును అందు మొదటిది యగు జ్ఞానము యొక్క సాత్త్వికస్వరూప మెట్లుండుననగా- కర్మాధికారులగు ప్రాణులు బ్రాహ్మణులనియు, క్షత్రియులనియు, బ్రహ్మచారులనియు, గృహస్థులనియు, నల్లనివారు, తెల్లనివారు, పొడుగువారు, పొట్టివారు, ఇత్యాదిభేదములచే వేరువేరుగా నుందురు. కాని వారియందరిలో నుండు ఆత్మమాత్రమన్ని యవస్థలలోను జ్ఞానైకాకారమగుటచే విభాగ రహితముగను, శరీరము నశించినను నాశరహితముగను, కర్మఫలానుభవమున కసర్హముగను ఉండునని - తానొక కర్మను చేయవలెనని సంకల్పించినప్పుడే తెలుసుకొనదగు జ్ఞానము సాత్త్వికమనబడును. 20 శ్లో ॥

ఇక రాజసజ్ఞానము - కర్మల నాచరించు తరి బ్రాహ్మణాదులకు గల యాకార భేదమును జూచి ఆత్మలకు గూడ జాతిభేదము, రంగుభేదము, గుణభేదము, స్వరూపభేదము మొదలగునని కలవనియు, ఆయా కర్మఫలముల ననుభవించుట కర్హమైనవనియు, భావింపజేయునట్టి జ్ఞానము 21 శ్లో ॥

భూతప్రేతాది ఆరాధన రూపమైన కర్మ, యత్యల్ప ఫలమును మాత్రమే యొసంగును. అయినను తగిన ప్రమాణము లేకున్నను అదియే తన కభీష్టమైన సకల ఫల సాధనమను భ్రాంతితో దానినే యాచరించు చుండును. పైకి గన్పించు జాతివర్ణ పరిమాణాది భేదములను బట్టి

వాస్తవముగాని యాత్మల యాకార భేదమును భావించు చుండును. అది యతిక్షుద్రమగు భూత ప్రేతముల యారాధన గాన మిక్కిలి నీచమై నది. ఇట్టి పనులలో ప్రేరేపించి యట్లు భావింపజేయు జ్ఞానము తామసమనబడును. 22 శ్లో॥

ఇట్లు గుణభేదముచే జ్ఞానము మూడు విధములగుట చెప్పబడినది. ఇక చేయదగినకర్మ గుణభేదముచే మూడు విధములగుట చెప్పబడుచున్నది.

ఆయా వర్ణాశ్రమములకు తగిన కర్మను - ఫలమును, కర్తృత్వాభిమానమును, మమకారమును వీడి కీర్తియందాశయు, నపకీర్తిపట్ల ద్వేషములేక తన కాకర్మ తప్పక చేయదగినదిగా భగవంతుడు విధించెనని భావించుచు నాచరించినచో నది సాత్త్విక కర్మయగును. 23 శ్లో ॥

నేను సమర్థుడను గాన నెట్టి వ్యయ ప్రయాసలైన నోర్చియీ కార్యమును నిర్వహించగలిగితినను దురభిమానముతో ఫలము నాశించి చేయబడిన కర్మ రాజసమనబడును. 24 శ్లో ॥

[ఈ కర్మకు మూలము రజోగుణము. ఆ గుణము ప్రవృత్తియే ప్రధానముగాగలది. అది వస్తువుయొక్క నిజరూపమును తెలియనీయదు గాన నా కర్మలను గురించి వ్యర్థ ప్రయాసను కలిగించును.]

కర్మను చేయగనే కలుగు దుఃఖమును, చేయుచుండగా కలుగు ధన నాశమును అందలి స్వపరహింసను, ఆ కర్మలకు సంబంధించిన తన శక్తిని, యోగ్యతను, ఆగమములను ఆలోచించక పరమాత్మను కర్తగా భావింపక నారంభింపబడు కర్మ తామసము.25 శ్లో ॥

[ఇట్టి గుణములనుబట్టి కర్మ మూడు విధములగుటను నిరూపించి పిమ్మట గుణములనుబట్టి కర్త త్రివిధమగుటను తెలుపుచున్నాడు.]

ఫలసంగమును విడిచి, తాను కర్తననెడు యభిమానమును ఆ కర్మ తనది యనెడు మమకారమును విడిచి, ప్రారంభించిన కర్మ ముగియువరకు తప్పనిసరిగా తటస్థించునట్టి దుఃఖముల నోర్చుకొని యుత్సాహమును వీడక తన పనికి కావలసిన ధనాది సామగ్రి యంతము సిద్ధించినను సిద్ధించకున్నను నిర్వికారచిత్తుడై కర్మల నాచరించువాడు సాత్త్వికకర్త యనబడును. 26 శ్లో॥

కీర్తిని కోరువాడును, కర్మఫలము నాశించువాడును, ఆ కర్మకై చేయదగిన ధనవ్యయము చేయగలిగియు చేయనివాడును, తనకు లేకున్నను భార్యాబిడ్డలకు లేకున్నను సేవకుని పోషించవలెనని శాస్త్రమున్నను సేవకులను

బాధించి వారిచే నుచితముగ తన పనిని చేయించుకొనువాడును, కర్మలకు తగిన శుద్ధి లేనివాడును, ఫలము సిద్ధించిన పొంగును, సిద్ధించనిచో క్రుంగును, చెందువాడును రాజసకర్త యనబడును. 27 శ్లో ॥

విరుద్ధ కర్మాచరణశీలుడై పతితుడగుటచే వేదోక్త కర్మల నాచరించుట కధికారము లేనివాడును, పెద్దల సేవచేసి విద్యనభ్యసించకపోవుటచే నవివేకియు, పెద్దలు గాన్పించినను త్వరపడి చేయదగిన వందనాదులు చేయక సోమరిగా నుండువాడును, రహస్యముగా చేతబడి మొదలగు నప్రియ మారణ కర్మల నాచరించువాడును, మోసగాడును, రేపు చేయదలచిన ధర్మమును నేడే చేయుమని శాస్త్రమున్నను అరంభించిన పనులను మందముగా చేయువాడును, చిన్న విషయమునకైనను తగని దుఃఖము ననుభవించువాడును, అభిచారిక కర్మలచే పరుల కనర్థములు దీర్ఘకాల ముండవలెనని యాలోచన చేయువాడును తామసకర్త యనబడును. 28 శ్లో ॥

[ఇట్లు గుణభేదముచే కర్త యొక్క త్రైవిధ్యము చెప్పబడినది.]

9. ప్ర. **గుణభేదముచే బుద్ధికిని, ధృతికిని గల త్రైవిధ్య మెట్లు నిరూపించ బడెను?**

ఉ : [బుద్ధి యనగా - బాగుగనాలోచింపబడి, ప్రతిపక్షమును ఖండించి, స్వపక్షమునందు చలించక యుంచదగిన జ్ఞానవిశేషము.
ధృతి యనగా - ఎన్ని యాటంకములు తటస్థించినను ఆరంభించిన పనిని విడువక యాచరించు పట్టుదల]

సాత్త్విక బుద్ధియనగా - ప్రవృత్తి ధర్మమును, నివృత్తి ధర్మమును, కార్యమును, అకార్యమును, భయమును, అభయమును, బంధమును; మోక్షమును తెలుపునది 30 శ్లో ॥

[ప్ర]వృత్తి ధర్మమనగా - ఈలోకమునందున్నప్పుడును, స్వర్గాది లోకముల యందును సుఖము నొసంగు కర్మ.

నివృత్తి ధర్మమనగా - మోక్షసాధనమైన కర్మ. కార్యము అకార్యము - ప్రవృత్తి నివృత్తి ధర్మములలో దేని నవలంబిరచినను ఏదేశమున నేకాలమున నేయవస్థలో నేది చేయదగినదో దానిని కార్యమనియు, ఏది చేయరానిదో దానిని అకార్యమనియు నందురు.

భయము - భగవంతుని ప్రేరణలేక నేదియును బాధించుటకుగాని బాధించకుండుటకుగాని శక్యముకాదు. భగవంతుని యాజ్ఞయగు శాస్త్రము నుల్లంఘించిన బాధింపబడును. ఇదియే భయము.

అభయము - భగవంతుని యాజ్ఞయగు శాస్త్రమును శిరసావహించిన రక్షింప బడును. ఇదియే యభయము.]

ప్రవృత్తి - నివృత్తి రూపమగు ధర్మములకు శత్రువు అధర్మము. ఇట్టి ధర్మాధర్మములనుగాని, పై ప్రవృత్తి నివృత్తి ధర్మముల నవలంబించి వర్తించువారికి ఏదేశములో నేకాలములో నేయవస్థలో నేది చేయదగినది యేది చేయరానిది యనిగాని తెలుపజాలనిబుద్ధి రాజసమనబడును. 31 శ్లో॥

కూడదని శాస్త్రమున నిషేధింపబడిన పనిని చేయుమని చెప్పిన పనినిగాను, అధర్మమును ధర్మముగాను, ఉన్న వస్తువును లేని దానినిగాను, లేనివస్తువు నున్న దానినిగాను, పరదేవత నల్పదేవతనుగాను, అల్పదేవతను పరదేవతనుగాను నిట్లే యన్నిటిని విపరీతముగా దెలియజేయుబుద్ధి తామసము. 32 శ్లో॥

[పూర్తిగా నెఱుంగకుండట, కొంత యెఱింగినను ఒక ధర్మముకల వస్తువును మరియొక ధర్మము కలదిగా నెఱుంగుట రాజసమనబడును. సమస్త వస్తువులను విపరీతముగా నెఱుంగుట తామసమనబడుననియు కొందరందురు.

మరికొందరు వస్తుస్వరూపము నెఱింగించు ప్రధాన ధర్మము నెఱుంగక దాని స్థానమున మరియొక ధర్మమును గాంచుట తామసమందురు. ఉదా- ముత్యపుచిప్ప యొక్క ముఖ్యధర్మమగు శుక్తిత్వము నెఱుంగజాలక నచ్చట రజిత ధర్మమును గాంచుట.

వస్తుస్వరూపము నెఱింగియు దానియందు సహజముగ నందరెఱుంగు నొకానొక ముఖ్యధర్మమును మాత్రము విపరీతముగా గాంచుట రాజసమందురు. ఉదా - తెల్లని శంఖమును శంఖమని యెఱింగియు పచ్చగా నున్నదనుట.

[ఇక ధృతియొక్క మూడు విధములును వివరింపబడుచున్నవి.]

ఇతరఫలాశను వీడి మోక్షసాధనమగు భగవదుపాసనకై ప్రవర్తించి యందులకు సాధనములగు మనస్సు మొదలగువాటి వ్యాపారముల నేధృతితో ధరించియుంచునో ఆ ధృతి సాత్త్వికధృతి యనబడును. 33 శ్లో॥

(ఇచ్చట మనస్సు యొక్క వ్యాపారము సాక్షాత్కరించుట. ప్రాణముయొక్క వ్యాపారము ప్రాణాయామముచే భగవదుపాసనకు విరోధులగు క్లేశము పాపము మొదలగువానిని జయించుట.

బాహ్యేంద్రియముల వ్యాపారము - యోగమునుండి లేచినపుడు దాని కంగమగు స్వాధ్యాయాధ్యయనమును జేయుట (వేదమునుగాని వేదార్థములను

వివరించు పురాణేతిహాసస్తోత్రాదులనుగాని, యర్థయుక్తముగా [illegible]) గాని ప్రత్యాహారమున వాటి నరికట్టుటగాని చేయుట.

ప్రత్యాహారముగా - ఇంద్రియములు విషయములతో సంబంధించక పోవుటచే నిర్వికారమైన చిత్తమునను సరించుట - అనగా - యమ నియమాదులచే సంస్కరింపబడిన చిత్తమెట్లు విషయ సంబంధములేక యుండునో యట్లే యింద్రియములునుండ నుండుట. చిత్త మరికట్టబడినప్పుడు దానికి వశవర్తులగు నింద్రియములను నరికట్టబడుట సహజమే. ఈ ప్రత్యాహారముచే నింద్రియములను విషయముల పైకి వ్యాపించనీయక తాబేలు తన యవయవములను వలెనే లోపల దాచుకొని వాటిని చిత్తమున నెలకొలుపవచ్చును.)

ధర్మార్థకామము లనెడు ఫలములనుకోరి మిక్కిలి సంగముచే వాటిని మాత్రము సాధనముగా మనః ప్రాణేంద్రియ వ్యాపారములే ధృతితో ధరింపబడుచున్నవో యాధృతి రాజసధృతి యనబడును. 34 శ్లో ॥

స్వతః దుర్బుద్ధియగుటవలన నిద్రను, విషయానుభవము (భోగము) వలన బుట్టిన మదమును, భయశోక విషాదములను బుట్టించు విషయములనే సాధనములుగా మనః ప్రాణాది క్రియలను ఏ ధృతితో ధరించియుండునో యాధృతి తామసధృతి యనబడును. 35 శ్లో ॥

(భయము పుట్టుటకు కారణము - దురభిమానముచే బలాఢ్యులతో కలహించుట.

శోకముపుట్టుటకు కారణము - కోపముచే ఒడలెఱుంగక బంధువులను హింసించుట మొదలగునవి. విషాదము పుట్టుటకు కారణము - నిష్ప్రయోజనముగా ధనము ఖర్చగుట మొదలగునవి)

10. ప్ర. సత్త్వాది గుణములచే త్రివిధములైన సుఖముయొక్క స్వరూపమెట్లు నిరూపింపబడెను?

ఉ ః చిరకాలాభ్యాసముచే క్రమముగా నిరతిశయానందమును కలిగించునట్టియు, సకలసాంసారిక దుఃఖములను మరపించునట్టియు, యోగ ప్రారంభావస్థలో విషమువలె దుఃఖముగానుండి పరిపాకావస్థలో నభ్యాసమువలన నాత్మ స్వరూపము గోచరించుటచే నమృతమువలె భోగ్యముగా నుండు సుఖము సాత్త్వికమనబడును. 37 శ్లో ॥

(మొదట మధురమైయుండక పోవుటచే సాత్త్విక సుఖమున కభ్యాసము మిక్కిలి యావశ్యకము.)

విషయానుభవమువలన కలుగు సుఖము వాటిని యనుభవించవలెనను వాంఛ(అగ్నికి చలి, నీటికి దాహము, అన్నమున కాకలి, పరస్త్రీ యనుభవమునకు కామము మొదలగునవి) యున్నంతవరకు నమృతమువలె భోగ్యమైయుండును గాని యదితీరినచో అనారోగ్యమునకును, (పరస్త్రీ విషయము) ఇహలోకమున, దండనకు, పరలోకమున నరకమునకు కారణమగుటచే విషపానమువలె దుఃఖమునకే కారణమగును గాన నది రాజస సుఖమనబడును. 38 శ్లో॥

(నిద్ర, బద్ధకము, ప్రమాద మనునవి యనుభవ వేళయందును, పర్యవసానమందును (విపాకదశయందు) గూడ నిజస్వరూపమును తెలియనీయవు (దీనికే మోహమని పేరు) ఎట్లనగా -

నిద్రించువానికి వస్తుస్వరూపము గోచరించకుండుట స్పష్టమేకదా!

బద్ధకము - అనగా, ఇంద్రియములకు పనులలో చురుకులేకుండుట, దీనిచే జ్ఞానము మందగించుట కేమిలోటు? దానిచే వస్తుస్వరూపమెట్లు తెలియను?

ప్రమాదము - అనగా, పనులలో హెచ్చరిక లేకుండుట. ఇదియును జ్ఞానము మందగించుటకు ముఖ్యకారణమే. దానిచే వస్తుస్వరూపము గోచరించకుండుటయు సహజమే.)

ఇట్లు మోహమునకు కారణములగు నిద్ర - బద్ధకము, ప్రమాదముల వలన బుట్టినట్టి సుఖముకూడా వానివలెనే మోహమునకే కారణమగునుగాన నిది తామససుఖ మనబడును. 39 శ్లో ॥

[కాబట్టి ముముక్షువు రజస్తమస్సులను విడిచి సత్త్వమునే యభివృద్ధి చేసుకొనవలెనని యీ గుణత్రయ విభాగోపన్యాసమునకు ముఖ్యాభిప్రాయము.]

1. ప్ర. **బ్రాహ్మణాది నాలుగు వర్ణములకును భగవంతునిచే విధింపబడిన స్వాభావికములగు కర్తవ్యకర్మలేవి?**

ఉ : బ్రాహ్మణాది. నాలుగు వర్ణములకును జన్మసిద్ధమైన గుణవిభాగ మీక్రింద తెలుపబడుచున్నది. దాని కనుగుణముగనే వారు జన్మింతురు. అందులకు తగినట్లే వారు చేయదగిన కర్మలున్ను విధింపబడినవి.

బ్రాహ్మణునకు రజస్తమోగుణముల నడంచి పుట్టినట్టి సత్వగుణము సహజమైనది. క్షత్రియునకు తమస్సత్వగుణముల నడంచి పుట్టినట్టి రజోగుణము సహజమైనది.

వైశ్యునకు సత్వరజస్సుల నడంచి కొలదిగ నుద్రేకించియుండు తమోగుణము సహజమైనది.

శూద్రునకు సత్వరజస్సుల నడంచి మిక్కిలి యుద్రేకించియుండు తమోగుణము సహజమైనది.

ఈ సహజ గుణములను బట్టియే కర్మలు ఆయా వర్ణమునకు వేరు వేరుగా నేర్పరచబడినవి.

బ్రాహ్మణులిట్టిగుణములు కలవారు. వారి కర్మలివి, వారి వృత్తులివి యని వేరువేరుగా శాస్త్రములు విభజించి తెలుపుచున్నవి. బ్రాహ్మణులకు స్వభావసిద్ధములైన కర్మలేవియనగా -

బాహ్యేంద్రియ నిగ్రహము, మనోనిగ్రహము, శాస్త్రములో చెప్పబడిన రీతిగా భోగములను తగ్గించుకొని శరీరమును కృశింపజేసికొనుట (తపస్సు) శాస్త్రోక్తకర్మలను చేయుటకు తగిన బాహ్యాంతరశుద్ధి, పరులు బాధించినను వారికి ప్రతిక్రియచేయతెనను చిత్తవికారము లేకుండుట. తాను తలచినట్లే చెప్పుట, చెప్పినట్లు చేయుట, పరదేవత అపరదేవతల తత్వములను లెస్సగ నెరుంగట (ఇది జ్ఞానము).పరదైవము యొక్క ముఖ్య విశేష వివరముల నెఱుంగుట. (ఇది విజ్ఞానము), వేదార్థమంతయు యదార్థమనెడి నిశ్చల విశ్వాసమును కలిగియుండుట, ఆస్తిక్యము -అనునవి బ్రాహ్మణుని స్వభావసిద్ధకర్మలు. 42 శ్లో॥

[ఆస్తిక్యమనగా - ఉన్నదనెడు నమ్మకము కలవాని ధర్మము - అనగా - వేదోక్తమగు నర్థములన్నియు సత్యమే యనెడు విశ్వాసము. ఆ విశ్వాస మే కారణములచేతను గూడ చలించక స్థిరముగ నుండవలెను. షడ్గుణ పూర్ణుడును, పురుషోత్తముడును, పరబ్రహ్మయని పిలువబడు వాసుదేవుడు దోషస్పర్శము లేశమైనను లేక సహజమగు నట్టియు, హద్దుమీరిన మహిమ కలిగినట్టియు, జ్ఞానశక్తిబలైశ్వర్య వీర్యతేజః ప్రభృతి సకల కళ్యాణ గుణాకరుడనియు, నిఖిల వేదాంతవేద్యుడనియు సకల జగత్తుల సృష్టించి ధరించి నడుపుచున్నాడనియు, వేదముయొక్క పూర్వభాగమున చెప్పబడిన కర్మలన్నియు నాశ్రియఃపతి

యారాధనా విధానములనియు, అతడాకర్మలచే నారాధింపబడి వారు వారభిలషించు ధర్మార్థకామమోక్షములనెడు చతుర్విధ పురుషార్థములను వారివారి యోగ్యతానుసారముగ ప్రసాదించుననియు నిష్కళంకముగ నమ్మి యుండుటయే యాస్తిక్యము]

యుద్ధరంగమున నిర్భయముగా ప్రవేశించు సామర్థ్యము, శత్రువులచే కన్నెత్తియైనను చూడబడజాలకుండుట, ఎన్నివిఘ్నములు తటస్థించినను ఆరంభించిన పని పూర్తియగువరకు విడువకుండుట. సమస్తకార్యములను నిర్వహించగలనేర్పు, యుద్ధమున తనకు మరణము నిశ్చయమని యెఱింగియు వెనుకంజ వేయకుండుట, తన ద్రవ్యమును పరులకు నిస్సంకోచముగా దానమొసంగివేయు త్యాగము, తనరాష్ట్రమందలి దుష్టులను శిక్షించునట్టియు, శిష్టులను రక్షించునట్టియు, శక్తి, యను నివి క్షత్రియునకు స్వభావసిద్ధమైన కర్మలు. 43 శ్లో ॥

వ్యవసాయమును జేయుట, గోవులను కాచుట, ధనార్జనకు కారణమగు కొనుట, అమ్ముట యనెడు వ్యాపారము అనునవి వైశ్యుల స్వభావ సిద్ధమగు కర్మలు. 44 శ్లో ॥

బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులకు పరిచర్య చేయుటయే శూద్రునకు స్వభావసిద్ధమైన కర్మ 45 శ్లో ॥

[ఇంత మాత్రమేగాక నాలుగు వర్ణములవారును తమతమ వృత్తులలో కూడ నాచరింపవలసిన శాస్త్రోక్తమగు యజ్ఞాదులు పెక్కులు గలవు. యజ్ఞాదులు మొదటి మూడువర్ణములకు నున్నట్లే శమాదులును ముముక్షువులకు నావశ్యకములే. ఐనను నవి బ్రాహ్మణ సహజకర్మలని జెప్పుట వారికి శమదమాదుల కనుకూలమగు సత్వము సహజముగ నుండుటచే వారికవి యాచరించుట సుకరమనియే భావము. ఇతరులకా శమాది గుణములకు విపరీతమైన రజస్తమస్సు లుద్రేకించి యుండుటచే నవి కొంత కష్ట సాధ్యములు, అంతమాత్రమేగాని వారి కవి అవసరము లేదనికాదు.

ఇక వీరికి జీవనోపాధులైన వృత్తులేవియనగా - బ్రాహ్మణులకు యజ్ఞములను చేయించుట, వేదము చెప్పుట, దానమును పట్టుట మొదలైనవి. క్షత్రియునకు - రాష్ట్రము నేలుచు పన్నులు పరిగ్రహించుట. వైశ్యునకు - వ్యవసాయ వ్యాపారాదులు. శూద్రునకు - పై మూడు వర్ణముల

పరిచర్యయే. అనగా తన కలవాటుగల వివిధ శిల్పములచే వారికి సహాయమును జేయుచు దానివలన లభించు ధనముతో తాను జీవించుట.]

12. ప్ర. ఈ వర్ణాశ్రమధర్మములు మోక్షమున కెట్లుపకరించును?

ఉ : తమ తమ వర్ణాశ్రమోచితమగు కర్మలను విడువక నాదరముతో నాచరించు మానవులు పరమపదమును పొందగలరు. ఆ కర్మలెట్లు పరమపదమునకు సాధనము లనగా – 45 శ్లో ॥

భగవంతునివలననే సమస్త భూతములును పుట్టుచున్నవి. అతని వలననే ధరింపబడుచు ప్రవర్తింజేయబడుచున్నవి. అతనివలననే నశింపజేయబడుచున్నవి. అందుల కాత డీ ప్రపంచమునం దంతటను వ్యాపించియున్నాడు. కావుననే వారికి యింద్రాదులకును తానే యంత రాత్మగానుండి వారికి పెట్టబడిన పేరులతో తానే పిలువబడుచు వారికి చేయు నారాధనలచే వాస్తవముగ తానే యారాధింపబడుచున్నాడు. ఇట్లు వర్ణాశ్రమధర్మములు పరంపరగా తన యారాధన రూపములే యగుటచే తాను విధించిన యా ధర్మములను విధితప్పక యనుష్ఠించిన మానవునకు తా ననుగ్రహించి మోక్షమును ప్రసాదించును. 46 శ్లో॥

13. ప్ర. జ్ఞానయోగాధికారులకును, వర్ణాశ్రమధర్మము లవశ్యమనుష్ఠేయములను విషయమును పరమాత్మ యెట్లు నిరూపించెను?

ఉ : కర్తృత్వాదులను విడిచి భగవదారాధన రూపముగ వర్ణాశ్రమ ధర్మముల నాచరించుట యందరకును స్వధర్మము. అనగా – కర్మేంద్రియములు కర్మలను చేయుటకే ప్రసాదింపబడుటచే శరీరసంబంధముకలవాని కాకర్మలా చరించుట మిక్కిలి సుకరము. జ్ఞానయోగ మట్లుగాక సర్వేంద్రియ వ్యాపారముల నరికట్టి యాచరించదగిన దగుటచే ప్రమాదకరమైనది. ఇంద్రియములు తాబేలునకువలె మిక్కిలి స్వాధీనములో నున్న వానికే యది చేయజెల్లును. అట్టివాడే ప్రాయశః ఆ జ్ఞానయోగమును చక్కగ నిర్వహించగలుగును. ఎంత చక్కగ నాచరించినను వానికిని ప్రమాదకరమైనదే యగుటచే దానికంటె కర్మయోగము ముముక్షువునకు ప్రారంభావస్థలో మరియొక గతికి యోగ్యతలేనందున భక్తికి యంగమగుటచే నంత ముఖ్యముగా నంగీకరింపబడక పోయినను స్వధర్మముగాన నదియే మేలు. 47 శ్లో ॥

కర్మయోగము - శరీరాంగములై, కర్మల నాచరించుటకే యేర్పడిన యింద్రియములచే చేయబడినదిగాన దేహసంబంధము కలవానికి సహజమును, కావుననే అప్రమాదమును నగుచున్నది. అందుచే దాని నాచరించువాడు సంసారకూపమునుండి యుత్తీర్ణుడు కాగలడు. ఇక జ్ఞానయోగమన్ననో దీనికి విరుద్ధమైనది. అలవాటు లేని యింద్రియ నిగ్రహముతో సాధింపదగినది గాన సప్రమాదము. కావుననే దాని నవలంబించు వాడు సంసార కూపమున పడుట సంభవము. కావున కర్మనిష్ఠయే శ్రేష్ఠము 48 శ్లో ॥

వేప నిమ్మ చింత మొదలగు చెట్లయందు పుట్టిన ప్రాణులకు వాటికి స్వాభావికమైన చేదు పులుపు మొదలగు నాహారములనే భగవంతుడు విధించునట్లు మానవులకును వారి వారి యోగ్యతగు తగిన మార్గములనే విధించును.

ఒక గ్రామమునకు దగ్గర దారియు దూరపు దారియు రెండుగలవు. దగ్గరదారి భయంకర క్రూరమృగములుగల యపరిచితమగు నడవిదారి. దూరపుదారి నిష్ప్రమాదమైన రాచబాట. బుద్ధిమంతు డే మార్గమును బట్టును? అట్లే కర్మ - జ్ఞానయోగములు రెండును. కర్మయోగము కాయక్లేశాది దుఃఖములతో కూడినది. ఐనను స్వాభావికమగుటచే సుకరమును నప్రమాద మును గాన దానిని విడుపరాదు. కావున జ్ఞానయోగమున కధికారియైనను కర్మయోగమునే యాచరించవలెను.

సామాన్యముగా నివృత్తిమార్గమేదైనను (కర్మయోగముగాని జ్ఞానయోగముగాని) కాయక్లేశము తప్పదు. అయినచో కర్మయోగమే యేల యవలంబించబడవలెనన్నచో రెండింటిలో నేది సుకరమును అప్రమాదమును నగుచున్నదో దానినే బుద్ధిమంతుడు పరిగ్రహించవలెను. అట్టిది కర్మయోగమే. కర్మయోగము కాయక్లేశము మాత్రమే గాని జ్ఞాన యోగమున (ప్రత్యగాత్మాన్వేషణము గాన) నింద్రియ మనోనిగ్రహ ప్రయాస మిక్కిలి దుఃఖాత్మకము.

ఇట్లు ఫలసంగకర్తృత్వములను విడిచి యాభారతమంతయు భగవంతునిపై నిడి కర్మయోగము ననుష్ఠించినచో త్వరలో జ్ఞానయోగమునకు కూడ ఫలమైన ధ్యానయోగ నిష్ఠను పొందును.

14.ప్ర. ఇట్టి ధ్యానయోగనిష్ఠను పొందినవా డెట్టి ఫలమును లభించగలడు?

ఉ. ఆత్మతత్త్వమును లెస్సగ నెఱింగినవాడై వెనుక చెప్పబడిన సాత్త్వికధృతిచే మనస్సును నిగ్రహించుకొని దానినాత్మసాక్షాత్కారమునకు తగినట్లు చేయవలెను. అంతట క్రమముగ రాగద్వేషాదులడుగంటును. 51 శ్లో ॥

ధాన్యమున కాటంకములు లేని నిర్జనస్థలములో నివసించవలెను. మిక్కిలి తినుటగాని బొత్తుగ తినకుండుటగాని తగదు. త్రికరణవృత్తులు నేకీభవించి ధ్యానాభిముఖము కావలెను. ఇట్లుండి ధ్యానమును ప్రతి దినమును విడువక ఆసక్తితో చనిపోవువరకును చేయుచుండవలెను. తనకు ధ్యేయమగు నాత్మకంటె నితరములయందలి దోషములనే తలంచుకొనుచు వాటియందు విరక్తిని వృద్ధిపరచుకొనవలెను. 52 శ్లో ॥

దేహమునందలి యాత్మాభిమానము ఆత్మ వినాశనమునకు ప్రథమ సోపానముగాన దానిని రూపుమాపవలెను. ఆ యభిమానాభివృద్ధికి ముఖ్య కారణములు పూర్వవాసనాబలము, దురాచారము, కామము, క్రోధము మొదలగునవి. వాటిని బహిష్కరించి తనని కాని వాటిని తననిగా భావించక కేవలాత్మానుభవ సుఖమునందే మరిగి యుండవలెను. ఇట్లుండువాడు క్రమముగ సర్వబంధ విముక్తుడై నిజరూపముతో వెలుంగు నాత్మ ననుభవించగలుగును. ఇదియే శుద్ధాత్మ స్వరూపప్రాప్తి. 53 శ్లో॥

ఇట్లు శుద్ధాత్మస్వరూపమును బొందినవాడు క్లేశకర్మాదులచే నెన్నడును కలుషితుడు కాడు. అందుచే నే ప్రాణిని గూర్చియు శోకించడు. భగవంతుని తప్ప నిక దేనిని గాని కోరడు. వాటిని తృణ ప్రాయముగ జూచును. ఇట్లుండగా సర్వేశ్వరునియందు పరభక్తి జనించును. అనగా సర్వేశ్వరునకు నిఖిల జగత్తులను పుట్టించుట, గిట్టించుట, బ్రోచుటయును నాటలవంటివి. దోషము లాతనిదరికే చేరజాలవు. చిత్తాకర్షక మంగళ గుణముల కాతడేకైక నిలయుడు. మనస్సునకు శుభాశ్రయమైన దివ్య శరీరధారి. సర్వాశ్రయియగు లక్ష్మికి నాశ్రయభూతుడు. వికసించిన తామర రేకులవంటి నేత్రములు కలవాడునగు శ్రీ మన్నారాయణుడు తనకు స్వామి యను నానందముతో నాతనియందే యత్యంత ప్రియానుభవము కలవాడగుచున్నాడు. (ఇదియే పరమభక్తి) 54 శ్లో ॥

ఈ యనుభవ ప్రకర్షచే భగవంతుని - స్వరూప స్వభావములతోను, గుణములతోను, విభూతులతోను, అతడెట్టివాడో, యెంతవాడో యధార్థముగా నెఱుంగుచున్నాడు. దానివలన నపారమగు భక్తి యుదయించును. దానిచే

నా భగవంతుని బొందుచున్నాడు. 55 శ్లో ॥

ఇది వర్ణాశ్రమ నియతములగు నిత్యనైమిత్తిక కామ్యకర్మలు ఫలసంగ కర్తృత్వములను విడిచి భగవదర్పణబుద్ధితో నాచరించినందులకు ఫలము.

15. ప్ర. పైన నుదహరించిన విధమున వర్ణాశ్రమ ధర్మముల నాచరించుటవలనను విడుచుటవలనను కలిగెడు లాభ నష్టములను భగవాను డెట్లుపదేశించెను?

ఉ. 'జీవాత్మ యీశ్వరునిసొత్తు, ఆయన యాజ్ఞకు లోనైనవాడు' అనెడు బుద్ధితో తాను జేయు సమస్తకర్మలను, వాటి కర్తృత్వమును, వాటిచే నారాధింపబడు దేవతలతోపాటు భగవంతునియం దర్పణచేసి ఆతడే ముఖ్య ఫలమని నమ్మి యాతని యందు చిత్తమును ఘటించి స్వర్ణ ధర్మముల నాచరించుచుండవలెను. 56, 57 శ్లో ॥

దీనివలన భగవదను గ్రహము గలిగి, దానిచే దుస్తరములైన సమస్త సాంసారిక కష్టములను తరించును. 58 శ్లో ॥

అట్లుగాక "నా కర్తవ్యాకర్తవ్యముల నన్నింటిని నేనే యెఱుంగుదు" నని యహంకరించి భగవదాజ్ఞ నుల్లంఘించినచో నశించును. 58 శ్లో ॥

(ఏలయనగా - సమస్త మానవుల కృత్యాకృత్యముల నెఱింగినవాడును శాసించువాడును భగవంతునికంటె వేరొక్కడులేడు. హితమును చెప్పువారందరును భగవంతుడిచ్చిన శక్తి చేత మాత్రమే యే యల్ప విషయములనో కొలదిగ చెప్పగలరు. భగవంతుడట్లుగాక సకలాధికారులకును తగిన సమస్త హితాహితముల నెఱుంగును. ఏ బుద్ధిమంతు డే శాస్త్రమును జెప్పినను, ఏ వేదమే కర్మను విధించినను నవి యన్నియు భగవదాజ్ఞలే యగుటచేతనే ప్రమాణములగుచున్నవి. కానిచో ననాదరణీ యములే.)

ఇట్లు భగవదుపదేశమును పెడచెవినిబెట్టి యుద్ధమును విడిచినచో నర్జునునకు వినాశమే వాటిల్లునని చెప్పి యికపైన యుద్ధమును విడుచుటయు నాతని తరము కాదని చెప్పుచున్నాడు. ఏలయనగా - నా మంచి చెడుగులు నే నెఱుంగనాయని దురభిమానముతో నజ్ఞానమున స్వాతంత్ర్యము నవలంబించి నా యాజ్ఞనుల్లంఘించి యుద్ధము చేయవేని యది నీ తరముగాదు. నామాట వినకపోవుటచే నేను నిన్నువదలి యుదాసీనుడనై యుందును. గాన ప్రకృతి పరతంత్రుడవగు నిన్ను నీ రాజస ప్రకృతియే పట్టి యీడ్చి నీచే నీకు సహజమైన యుద్ధమునే కాదు కదా కూడని పనుల నన్నిటిని చేయించితీరును. 59, 60 శ్లో॥

అప్పుడు నీవు మొదట పేర్కొనిన యనర్థపరంపరల కన్నిటికి గురియగుదువు. నేను చెప్పినట్లు చేసితివా నీ భారమంతయు సర్వజ్ఞుడను సర్వశక్తిమంతుడ నగు నేనే వహింతునుగాన నీకు శ్రేయము చేకూరును.

సర్వేశ్వరుడు సకల చేతనా చేతనములయొక్క సమస్త ప్రవృత్తి నివృత్తులకు కారణమైన జ్ఞానము పుట్టునట్టి హృదయమునందే యుండి తనచే నిర్మించబడిన దేహ మనెడు రథము నధిరోహించియున్న సమస్త ప్రాణులను తాను క్రీడార్థమై కల్పించిన సత్త్వాది గుణమయమగు మాయచే వారివారి గుణములనుబట్టి ఆ యా పదార్థములను జూపి పూర్వవాసనాజనిత సంగముద్వారా భ్రమింపజేసి నడిపించుచుండును. 61 శ్లో ॥

స్వతంత్రుడగు సర్వేశ్వరు డిట్లు తన మాయచే ప్రేరేపించినచో పరతంత్రులమగు మనమా మాయను దాటుటెట్లనగా దానికి భగవాను డొక యుపాయమును జెప్పుచున్నాడు.

సర్వప్రశాసన సమర్థుడైనను, సర్వస్వతంత్రుడైనను ఆ సర్వేశ్వరుడిట్టి యర్జునుని సారథ్యము నవలంబించి తన యాశ్రిత పారతంత్ర్యమును ప్రకటించుచున్నాడు. గాన నట్టివానిని యన్ని విధముల ననగా అంతర్యామిగను, హిత ప్రవర్తకునిగను, ఫలముగను, సాధనముగ నుండు వాడును అతడొక్కడే యని భావించి అతడే రక్షకుడని యాశ్రయించి యాతనిని ప్రసన్నునిగా చేసుకొనవలెనని యాతడాజ్ఞాపించిన వర్ణాశ్రమ ధర్మములను శ్రద్ధతో చేయవలెను. (ఇదియే శరణాగతి)ఇట్లాచరించినచో సర్వ కర్మ బంధములును తొలగుటచే ననిష్ట నివృత్తియు (ఇదియే పరాశాంతి) శాశ్వతస్థానమగు పరమపద ప్రాప్తియు కలుగుటచే నిష్టప్రాప్తియు చేకూరును. 62 శ్లో ॥

16\. ప్ర. శాస్త్రసారార్థమగు సర్వగుహ్యత మోపదేశమేమి?

ఉ. తొమ్మిదవ యధ్యాయ ప్రారంభమున 'ఇదంతు తే గుహ్యతమం ప్రవక్ష్యామ్యన సూయవే' యని ప్రతిజ్ఞచేసి భక్తియోగ వైభవమును పలువిధముల ప్రశంసించి యధ్యాయసారముగ చివరకు 'మన్మనాభవ' యనెడు శ్లోకముచే భక్తియోగమునే సాంగముగా విధించెను. ఈ యధ్యాయమున "సర్వ గుహ్యతమం భూయః" అని ప్రతిజ్ఞ చేసి కొలది పాఠభేదముతో నా శ్లోకమునే యుపదేశించెను. ఉపదేశించవలగిన గుహ్యతమ మేదో యొక్కటియే

యుండును. కావున నచ్చటియర్థమునే యిచ్చట శాస్త్రసమున సారముగా నుపసంహారరూపముగా నుపదేశించుచున్నాడు. కావునే 'భూయః' (తిరిగి) యను శబ్దమును ప్రయోగించెను. ఆ యర్థమే భక్తియోగము. దానికి ఫలములగు నిష్ట ప్రాప్తిని 'మన్మనాభవ' యనెడు శ్లోకమునందును, అనిష్టనివృత్తిని 'సర్వధర్మాన్' అనెడు శ్లోకమునందును ఉపదేశించుచు చేతనకర్తవ్యమును కూడ నాశ్లోకములలోనే విధించెను. నాకు ప్రియుడవుగాన నీకునేను ప్రతిజ్ఞచేసి చెప్పుచున్నాని యుపదేశించుటచేతను నిదియే ప్రధానతమ శాస్త్రసారార్థమగుట నిస్సంశయము. 64 శ్లో ॥

('మన్మనాభవ' యనెడు శ్లోకమిదివరకే తొమ్మిదవ యధ్యాయాంతమున వివరముగా వ్రాయబడినది.)

ఈ శ్లోకముచే వేదనము, ధ్యానము, ఉపాసన యని చెప్పబడునట్టియు, ధ్యేయవస్తువును కంటితో చూచినంత విశదముగా మనస్సునకు గోచరింపజేయునట్టియు, మిక్కిలి ప్రియతమమగు ధ్యానపరంపర అనగా భక్తి యోగమే విధింపబడుచున్నది. అట్టి ప్రేమతో ధ్యానించు వాడిక యాతని నారాధింపక యుండగలుగునా? నమస్కరించక యుండగలుగునా? త్రికరణముల నా శ్రియఃపతి యధీనమేగావించును. ఏమిసంశయము. ఇట్లా భక్తుడున్నచో "భక్తుడు, సర్వజ్ఞతయు సర్వశక్తియుగల నాకే చెప్పనలవిగానంతయున్నాడ"ని చెప్పిన భగవంతుడాతని వియోగము నెట్లు సహించియుండగలడు. కావున వెంటనే యాతనిని తన సాన్నిధ్యమునకు చేర్చుకొనును. 65 శ్లో॥

అయినచో వీడుచేసిన పుణ్యాపాపము లా భగవంతుని యుద్యమము నడ్డగించవా? అవి యుండగా నీతని కాపరమపదమెట్లు సిద్ధించును? శాస్త్ర విరుద్ధముకాదా? యని సంశయింప బనిలేదు. వాటి బారినుండి తప్పించుకొనుట కీతడు చేయలసిన పనిని సర్వేశ్వరుడే 'సర్వధర్మాన్' అనెడు శ్లోకమున విధించుచున్నాడు.

పూర్వము గ్రంథవిస్తరముగా నుపదేశింపబడిన కర్మజ్ఞాన భక్తి యోగము అనెడు మోక్షసాధనములైన సకలధర్మములను భగవదారాధన బుద్ధితో మిక్కిలి ప్రీతితో తమ యధికారమునకు తగినరీతిగా నాచరించుచు నీ యధ్యాయ ప్రారంభములో తన మతముగా సర్వేశ్వరుడుపదేశించినటుల ఫల, సంగ, కర్తృత్వములను త్యజించి పరమపురుషు నొక్కనే కర్తనుగాను,

ఆరాధ్యునిగాను, ఫలమునుగాను, సాధనమునుగాను విశ్వసించి యున్నచో నా శ్రియఃపతియే తనను పొందుట కాటంకములుగా నున్నట్టియు, యీ ప్రపన్నుడనాది కాలము నుండియు చేయరాని పనులను చేసియు, చేయవలసినవి మానియు నార్జించియుంచిన సమస్త పాపరాశిని రూపుమాపును.

66 శ్లో॥

(ఈ శ్లోకమున సాధ్యోపాయములగు కర్మజ్ఞాన భక్తులను వీడి సిద్ధోపాయమగు పరమాత్మనే నమ్మియున్నచో మోక్షవిరోధము తొలగునటులచే ప్రపత్తియే ప్రధాన శాస్త్రసారముగా నుపన్యసింపబడినట్లు పూర్వాచార్యుల సమ్మతి. ఇదియే స్వరూపాను కూలమైన సాధనము. జీవాత్మ, పరమాత్మకు పరతంత్రుడని యిదివరలో చెప్పినదియేగాక దగ్గరలోనే 'ఈశ్వరస్సర్వభూతానాం ... యద్యహంకార మాశ్రిత్య' ఇత్యాది శ్లోకములలో చెప్పబడినది. ఇట్టి చేతనునకు స్వాతంత్ర్యపాదకములైన కర్మజ్ఞాన భక్తి యోగములు నిజముగ స్వరూప విరుద్ధములే, కావుననే యర్జును డది విని దుఃఖించెను. ఇందువలన ప్రపత్తియే స్వరూపానుకూలము. భక్తి ప్రపత్తులు రెండును మోక్ష సాధనములుగా తెలుపబడినను శ్రీ కృష్ణభగవానునకు ప్రపత్తియే మిక్కిలి యభిమతము. ఏలయన -గీత 10వ అధ్యాయ 10, 11వ శ్లోకములలో "తేషాంసతత... భాస్వతా" అని తనను పొందుటకు సాధనమగు బుద్ధి పుట్టునట్లు కటాక్షింతుననియు దానికి ఆటంకమగు నజ్ఞానాంధకారమును పోగొట్టుదుననియు చెప్పుటచే భక్తికి తాను తోడ్పడుదుననే చెప్పెను. ఇచట ప్రపత్తికన్నచో "సర్వపాపేభ్యః మోక్షయిష్యామి" అనుటచే తనను పొందుట కాటంకములగు పాపముల నన్నింటిని తానే తొలగింతుననుటచే నిదియే అతని కభిమతము. అయినచో శాస్త్రసారార్థము భక్తి యేయని శ్రీ యామునాచార్యులవారు గీతార్థసంగ్రహమున "స్వధర్మ జ్ఞానవైరాగ్య సాధ్యభక్త్యేకగోచరః" యనియు శ్రీరామానుజులవారు 2వ అధ్యాయ 10వ శ్లోకము వ్యాఖ్యానమున 'భక్తి యోగగోచరం' అనియు మొదట అవతారికయందే 'భక్తియోగమవతార యామాస' యనియు చెప్పనేల? అనగా భక్తికి ఉపాయభక్తియనియు ప్రపత్తికి సాధ్యభక్తి యనియు పేరులుండుటచే భక్తి శబ్దముచే ప్రపత్తియే చెప్పబడెనందురు. అట్ల నిగూఢముగా చెప్పనేల? యనిన ప్రపత్తికి అధికారులు దుర్లభమగుటచే సహసా స్పష్టముగా చెప్పరాదని యట్లు చెప్పిరి. అయినచో కర్మజ్ఞానాంగకమై

భక్తి ఉపాయభక్తి యేగదా! అన్నచో, ప్రపత్తిలో వాటికి బుద్ధిత్యాగమేగాని స్వరూపత్యాగము కాదని సిద్ధాంతము గావునను, ప్రపత్తికి ముఖ్యముగా కావలసిన మహావిశ్వాసమునకు ప్రతిబంధకములగు పాపములను పోగొట్టునవి యగుటచేతను అవి యంగములనుట ప్రతికూల మెంతమాత్రము కాదని సమర్థించిరి. ఇంకను దీనిని గూర్చి విపులమైన విమర్శ, "తత్త్వదీప" "రహస్య త్రయ మీమాంసా" "తాత్పర్యదీపకాది" సంప్రదాయ గ్రంథాంతరములలో గాననగును.

[ఉపాయ భక్తిపరమైన యోజనను 'అథవా' యని పక్షాంతరముగా శ్రీ భాష్యకారులు జూపుచున్నారు. అది యీ క్రింద వివరింపబడుచున్నది.]

[ఇప్పుడు సర్వగుహ్యతమమును చెప్పెదనని ప్రతిసయొనరించి వెంటనే సవిస్తరముగా నుపదేశించిన కర్మజ్ఞానాంగకమగు భక్తినే తిరిగి ప్రసాదించుట యుక్తముగాదు. ఈ శ్లోకమేదైనను నవీనార్థమును తెలుపుచున్నదనుటకు వీలులేదు. అట్టి యర్థమేమియు కానగాదు. అదియునుగాక ద్వితీయాధ్యాయమున 'తమువాచ' యను పరమాత్మోపన్యాస ప్రారంభమునకు పూర్వశ్లోక వ్యాఖ్యానమున శ్రీ భాష్యకారులు 'నత్వేవాహం' మొదలు 'సర్వధర్మాన్' అను శ్లోకాంతము వరకు కర్మజ్ఞాన భక్తియోగములే ప్రతిపాదింపబడుచున్నట్లు వ్యాఖ్యానించిరి. మరియు నీ శ్లోకమున 'మాశుచః' యనియోదార్చబడు దుఃఖము పదేశారంభమున నుండునదికాదు. అది నిశ్శేషముగా నిదివరకే నిరసింపబడినది. 'మదనుగ్రహాయ పరమం' అను 11వ అధ్యాయ ప్రథమశ్లోకమున 'మోహోఽయం విగతో మమ' యని యర్జునుడే స్వయముగా జెప్పెనుగదా! ఇక 'మాశుచ స్సంపదం దైవీం' అను శ్లోకమున నోదార్చబడిన శోకమువలె నిదియు నేదో దగ్గర శోకమే కావలెను. అదియేదై యుండునో విమర్శింతము.

ధార్మికాగ్రేసరుడును, సూక్ష్మబుద్ధియు, జితేంద్రియుడును శుద్ధక్షత్రియ వంశసంజాతుడునైన నర్జునునకు సర్వజ్ఞుడగు సర్వేశ్వరు డుపదేశించిన యుపాయములు తనకు తెలియకగాని వాటికి తానసమర్థుడననిగాని సారార్థమును గ్రహించలేకగాని దుఃఖించుచున్నాడనుట సాహసము. పోనిండు. ఫలము సిద్ధించుటలో సంశయముండి దుఃఖించు చున్నాడందుమా; పరమాత్మ శపథపూర్వకముగా 'మామేవైష్యసి' యని నిర్ధారణగా చెప్పియేయున్నాడుగదా. ఇక నీ దుఃఖమునకు నిదానమేమైయుండును? ఉపదేశించిన ఉపాయములు

దీర్ఘకాలము విడువక యాదరముతో నాచరించదగినవగుటచే దుష్కరములనియు, మిక్కిలి యాలస్యముగా ఫలమునిచ్చునవనియు శోకించుచున్నాడనుట యుక్తము. మరియు త్యాగశబ్దమునకు ప్రసిద్ధార్థమును చెప్పినట్లగునని యెంచియు, శ్రీ భాష్యకారులీ శ్లోకమునకు భక్తిపరముగు వేరొక యర్థమును సెలవిచ్చిరి.]

పాపములన్నియు పూర్తిగా నశించి భగవంతుని మిక్కిలి ప్రేమించగల పురుషుడే భక్తియోగమున కర్హుడుగాని ప్రతివాడును కానేరడు. మన పాపములన్నననో లెక్కకు మిక్కుటములు. వాటినన్నిటికిని ప్రాయశ్చిత్తము లాచరించుటకు మన జీవితము చాలదు. ఇక నా పాపపరిహారమునకు తావేది? లేనిచో భక్తి కుదురుటెట్లు? కుదరనిచో ముక్తిలభించుటెట్లు? అని దుఃఖించుచున్న యర్జునుని యీ శ్లోకముతో శ్రీకృష్ణుడోదార్చుచున్నాడు. అర్జునా! భక్తియోగమున కాటంకమగు పాపరాశి నల్పాయుష్కుడనగు నేనెట్లు ప్రాయశ్చిత్తములొనరించి బాపుకొందునని దుఃఖింపకుము. ఆ ప్రాయశ్చిత్తములేవియు నీవు స్వయముగా చేయనవసరములేదు. నీకు భక్తియోగము లభించవలెనన్నచో పరమకారుణికుడను, మానవుల తారతమ్యమును పాటించక యందర కొకేరీతిని శరణ్యుడను భక్తులపట్ల నపార కృపాసాగరుడను నగు నన్నేదిక్కని నమ్మియుండుము. నేను నీ పాపములనన్నిటిని నీవు ప్రాయశ్చిత్తములు చేయకుండగనే పోగొట్టివేయుదును, దుఃఖింపకుమని ఓదార్చెను. 65 శ్లో ॥

17.ప్ర. ఈ గీతాశాస్త్రమును వినదగనివారెవ్వరు? వినదగినవారెవరు? వారికి దీనినుపదేశించుటచే లభించు ఫలమేది? దీని నర్థముతోగాని కేవలమూల శ్లోకములను గాని యాచార్యుల వలన నభ్యసించినవారికి ఫలమేమి? అట్లధ్యయనము చేయలేనివారేమి చేయవలెను? వారికి ఫలమేమి?

ఉ. శ్రీకృష్ణపరమాత్మ అర్జుననకుపదేశించిన నీపరమరహస్యమైన గీతాశాస్త్రమును తపస్సిద్ధిలేనివారికి చెప్పరాదు. (తపస్సనగా – శాస్త్రోక్తపద్ధతులతో భోగములను తగ్గించుకొని కాయమును శుష్కింపచేయుట) (ఉదా: ఏకాదశీ యుపవాసాదులు వ్రతనియమములు మొదలగునవి) ఇట్టి తపస్సును గావించినను ఉపదేశించు నాచార్యులయందును, మూలప్రవక్తయగు భగవంతునియందును భక్తిలేనివాని కసలే చెప్పరాదు. భక్తి యున్నను గురు శుశ్రూషచేయనివానికి చెప్పనేరాదు. ఇంతకంటెను భగవంతుని స్వరూపమును,

ఐశ్వర్యమును, కళ్యాణగుణములను గూర్చి పెద్దలు చెప్పగా విని వాటియందు దోషముల నారోపించు నీచులకు బొత్తుగా చెప్పరాదు. 67 శ్లో ॥

ఈ దోషము లొకింతయు లేక నాయందు భక్తిని కలిగియుండువారి కీ శాస్త్రమును 'తప్పక చెప్పవలెను. ఈ చెప్పుట కర్మయోగములో జేరును. లేదా భక్తియోగమున కంకురమువంటిదై క్రమముగ పరభక్తిని పుట్టించును. అట్టివానికి భగవంతుడు క్షుద్రఫలాశను బుట్టనీయడు. అట్టివాడా భక్తితో పరమపురుషుని సాయుజ్యమును బడయును. నిస్సంశయము 68 శ్లో.

ఇంతవరకు పుట్టిన మానవులలో నీగీతా ప్రచారకుని కంటె భగవంతునకు ప్రియమైన మానవుడు పుట్టనేలేదు. ఇకముందు పుట్టబోడు. 69 శ్లో ॥

ఈ శాస్త్రమును గురువువలన నర్థముతోగాని మూలమును గాని విని నంత మాత్రముననే భగవంతుడు గీతలో చెప్పిన భగవదనుసంధాన విశేష రూపమగు జ్ఞానయజ్ఞముతో తన నారాధించినంత సంతసించునని చెప్పెను. 70 శ్లో ॥

(అనగా -గీతాపారాయణము జ్ఞానయజ్ఞముతో తుల్యమై భగవత్ప్రీతి జనకమగును.)

అట్లధ్యయనము చేయజాలకున్నను వినవలెనని ఆతురతతో వినువాడును, విని దీనియందు దోషారోపణను చేయనివాడు కూడా భక్తియోగమునకు ప్రతిబంధకములగు పాపములనుండి విముక్తుడై క్రమముగ భగవద్భక్తులు పొందెడు లోకములను పొందగలుగును.

71 శ్లో ॥

(వినుటకే యింత ఫలముండగా నిక దీని నర్థముతోను, వ్యాఖ్యానముతోను నధ్యయనము చేయువారి ఫల మేమి చెప్పవలెను)

. ప్ర. **భగవద్గీతోపదేశ మర్జునుని పట్ల యెట్లు ఫలించెను?**

ఉ. ఇట్లు గీతను సాంగోపాంగముగా నుపన్యసించి శ్రీ కృష్ణపరమాత్మ యర్జునుని 'అర్జునా! నేనుపదేశించిన యర్థములన్నియు సమగ్రముగా నవహితచిత్తుడవై వింటివా? అజ్ఞాన మోహితుడవై యుద్ధము చేయనంటివే ఆ యజ్ఞానమువలన కలిగిన సమ్మోహము నశించెనా!" యని ప్రశ్నించెను. 72 శ్లో॥

అందుల కర్జునుడు తనకై యింత విపులముగా సంశయ విపర్యయము లొకింతయు లేకుండునట్లు మిక్కిలి ఓపికతో నుపన్యసించినందులకు తన కృతజ్ఞతను తెలుపుకొనుచు విననందులకు కలిగిన ఫలితమును విన్నవించుచున్నాడు.

"శ్రీకృష్ణా ! నీ యనుగ్రహమువలన నా విపరీత జ్ఞానమంతయు నంత మొందినది. నీ యనుగ్రహమువలన నాకు తత్వమంతయు నున్నది

యున్నట్లు గోచరించినది. దేహమే యాత్మయనెడు మోహమున్ను, చేతనా చేతనములు భగవంతునికి శరీరములగుటచే నాతడంతరాత్మగా కలవియై యుండ స్వతంత్రములనెడు భ్రాంతియు, నిత్యనైమిత్తిక కర్మలు భగవదారాధనమే యగుటచే భగవత్ప్రాప్తికుపాయములై యుండ బంధకములనెడు నజ్ఞానమున్ను నశించినవి. ఆత్మ ప్రకృతికంటె వేరైనదనియు కావుననే ప్రకృతికిగల వికారము లేవియు లేనిదనియు, నన్నిటిని స్వయముగ నెఱుంగు ముఖ్య స్వభావము కలదనియు, పరమపురుషునకు యథేష్ట వినియోగమునకు తగినదనియు, అతనిచే నియమింపబడుట దాని ముఖ్య స్వరూపమనియు, పరమాత్మ సకల ప్రపంచ సృష్టి స్థితి లయములు తనకు క్రీడగా కలవాడనియు దోషదూరుడనియు, కళ్యాణగుణగణ ఖనియనియు అసమాన జ్ఞానశక్తి బలైశ్వర్య వీర్య తేజస్సు లాతని ముఖ్య గుణములనియు, అతడే పరబ్రహ్మ యనబడువాడనియు నెఱింగితిని.

ఇట్లు పరాపర తత్త్వముల నిజరూపు నెరింగి దానిని నిరంతర అభ్యాసముచే బలపరుచుకొనుచు క్రమముగ పరమపురుషుని ప్రీతియే ఫలముగా నిత్యనైమిత్తిక కర్మలాచరించుచు, కూడనివాటిని విడచుచు, శమద మాది యాత్మ గుణముల నలవరచుకొని వాటిచే సిద్ధించు భక్తి యనబడు నుపాసనచే మాత్రమే లభించు వేదాంతవేద్యుడగు పరమపురుడనబడు వాసుదేవుడవు నీవేయనియును తెలుసుకొంటిని. ఇప్పటికి బంధువులపట్ల ప్రేమ, జాలి మొదలగు గుణములచే పెరిగి విపరీత జ్ఞానమునకు మూలమైన సమస్తానర్థముల నుండియు విముక్తుడనై నిస్సందేహముగా సహజ స్వభావముతో నున్నాను. ఇప్పుడు నీ వాదేశించిన యుద్ధము మొదలు భక్తి యోగపర్యంతము నాకర్తవ్యముల నిర్వహించుటకు సంసిద్ధుడనై యున్నాను" అని తనకు కలిగిన బుద్ధివైశద్యము నంతను వెల్లడించెను. 73 శ్లో॥

19. ప్ర. ధృతరాష్ట్రుని మొదటి ప్రశ్నకు సంజయుడెట్లు సాభిప్రాయముగా ప్రత్యుత్తర మొసంగెను?

ఉ : ఈ విధముగా వసుదేవుని పుత్రుడగు శ్రీకృష్ణుడు, తన మేనత్త కుమారుడును, మహాత్ముడును, మహాబుద్ధిశాలియు, తన ప్రియభక్తుడునునగు నర్జునున కుపదేశించగా నేను వింటిని. ఈ యాశ్చర్యావహమగు సంవాదము, నా దేహము నంతను ఒక్కసారి గగుర్పాటొనరించినది. 74 శ్లో॥

ఇది మిక్కిలి రహస్యమై యోగ్యమైనదైనను దీనిని నేను వ్యాసుని యనుగ్రహము వలన లభించిన దివ్యనేత్రములు, దివ్యకర్ణముల మూలమున

దూరమునసున్నను జ్ఞానబలైశ్వర్య వీర్య శక్తియుక్తుడగు శ్రీకృష్ణుడు స్వయముగ చెప్పుచుండగ ప్రత్యక్షముగ వింటిని. 75 శ్లో॥

వినినంతనే జ్ఞానయజ్ఞమువలె పావన మొనరించునట్టియు, శబ్దమూలమునను, అర్థమూలమునను గూడ నాశ్చర్యమును గలిగించునట్టి యీ సంవాదమును తలంచుకొనిన కొలదియు నాకానంద ముప్పొంగి పొరలుచున్నది 76 శ్లో॥

ఇంక ప్రత్యక్షముగా శ్రీకృష్ణుడాయర్జునునకు జూపిన యీ యద్భుత విశ్వరూపమేమని చెప్పుదును? దానిని తలంచుకొనిన కొలదియు నాకు గలుగు నానందాశ్చర్యములకుమేరయే లేదు. 77 శ్లో॥

ఇంతమాత్రము జెప్పుటచే ధృతరాష్ట్రునికి తన పుత్ర విషయమును గూర్చిన సంశయము తీరిపోవునని సంజయుడు తలంచెను గాని సర్వాత్మనా యంధుడగు నా ముదుసలి యిందలి గూఢాభిప్రాయమునెరుంగకుండుటచే "నీకిట్లు సూచన మాత్రముగ జెప్పిన చాలదు. స్పష్టముగ జెప్పుచున్నాను విను" మని చివర శ్లోకములోనాతని మొదటి ప్రశ్నకుత్తర మొసంగెను.

తన సంకల్పము చేతనే సకల వస్తు స్వరూప స్థితి ప్రవృత్తులను నిర్వహించు వసుదేవసూనుడగు శ్రీకృష్ణుడు ఏ పక్షమున నుండునో, అతని మేనత్త కుమారుడును అతని పాదభక్తుడును నగు ధనుర్ధారియైన యర్జునుడే పక్షమునందుండునో ఆ పక్షమునందే శ్రీయు, విజయమును, భూతియు నీతియు నిశ్చయముగా నిలుచునని నాయాశయమని సంజయుడు ధృతరాష్ట్రునితో జెప్పెను.

(శ్రీయనగా -రాజ్యాది భోగ్యవస్తుజాతము, విజయమనగా - శత్రుసంహారము, భూతి యనగా - ఐశ్వర్యమును, దాని నంతకంతకభివృద్ధి చేయుటయును, నీతి యనగా - ధర్మానుగుణమగు ప్రవర్తనము.)

ఇవిపాండవుల పట్ల ధృవములు, (అనగా - కౌరవులు మిక్కిలి ప్రజ్ఞకలవారై సావధానులై యున్నను, చతుర్విధోపాయములచేతను కూడ వారిని నీతినుండి గీటువాసియైనను దాటింపజాలక పోయిరి.)


—: మంగళం మహత్ :—

శ్రీ కృష్ణపరబ్రహ్మణే నమః

శ్రీ మద్భగవద్గీతా

ఆంధ్ర టీకా–తాత్పర్య
ప్రశ్నోత్తరావళీ సమన్వితము

జై శ్రీమన్నారాయణ



పరమహంస పరివ్రాజకాచార్య వర్యులు ఉభయ వేదాంతప్రవర్తకులు
శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ
జీయరు స్వామివారి మంగళాశాసనములతో

రచయిత : ప్రకాశకులు

తె. కం. గోపాలాచార్య

నడిగడ్డపాలెం – 522 318, గుంటూరు జిల్లా.